కథా విభాగం
2475

యి భీమన్న

హైమావతి

వారికి

జీవిత	01		
	జనవరి		
చరిత్ర	1978	22A	2475

బోయి భీమన్న



రచన:

హైమవతి



విషయసూచి

		పేజీలు
రచనోద్దేశం	....	iv–x
1. బాల సర్గ	...	1
2. కోరక సర్గ	...	50
3. వికాస సర్గ	...	88
4. మధుకర సర్గ	...	135
5. ఉద్యోగ సర్గ	...	187
6. సంకీర్ణ సర్గ	...	248
7. నవ నవోదయ సర్గ	...	306
8. నికషోపల సర్గ	...	356
9. సంస్కృతీ విప్లవ సర్గ	...	428
10. రసాద్వైత సర్గ	...	482
11. విద్యా విలాస సర్గ	...	534
12. గ్రంథ సర్గ	...	620
13. ప్రశంసా సర్గ	...	654–688

కథా నిలయం
2475
శ్రీకాకుళం

రచనోద్దేశం

" మీరు మీ ఆత్మకథను ఎందుకు వ్రాయరు ?" అని భీమన్నను ఎవరో మిత్రులు అడిగితే , అందుకు ఈయన ఇచ్చిన సమాధానం " నా ప్రతి రచనా నా ఆత్మకథే . వేరే ఏం వ్రాయను ? " అని .

నిజానికి ఏ రచయితా తన ఆత్మకథను ప్రత్యేకంగా చెప్పుకో నక్కర లేదు . అనుభవం నుంచే రచన పుడుతుంది . అది వాస్తవి కానుభవం కావచ్చు , మానసి కానుభవం కావచ్చు . ఈ రెండు అనుభవాల మిశ్రణమే జీవితం. కనుక ప్రతి రచనా ఆ రచయితయొక్క ఆత్మ కథే !

రచయిత అంటే నా ఉద్దేశం మౌలిక సాహిత్య స్రష్ట అని . కవిత , కథ , నవల , నాటకం , విమర్శ - ప్రక్రియ ఏదైనా కావచ్చు .

ఏ ప్రక్రియ అయినా , రచనలో కవిత ఉన్నప్పుడే అది సాహిత్య మవుతుంది . కవిత అంటే రసాత్మకత .

తన సాహిత్యాన్ని అమలులోవున్న అన్ని ప్రక్రియలలోను కూడ సమాన ప్రతిభతో పరాంకోటికి పెంచుకొన్నవాడు బోయి భీమన్న . సంపూర్ణ సాహిత్యం ఈయనిది . పూర్ణ పురుష డీయన . వేరే ఆత్మకథ అవసరం లేదు.

అయితే —

మానవ స్వభావం జిజ్ఞాసాళువు . ప్రతి కార్యానికీ కారణాన్ని వెతుకు తుంది . బోయి భీమన్న దీపసభ వ్రాశాడు . ఏ వయస్సులో వ్రాశాడు ? ఎందుకు వ్రాశాడు ? ఎలా వ్రాశాడు ? అది వ్రాయడానికి తోడ్పడ్డ పరిస్థితు లేమిటి ? ఈయన ఎక్కడివాడు ? ఎప్పటివాడు ? ఏ కులంవాడు ? అభిరుచు లేమిటి ?

V

ఏ పద్ధతిలో జీవించాడు? ఈ విధమైన లక్షల ప్రశ్నలకు జవాబులు వెతుకుతుంది. ఈ వివరా లన్నీ ఈయన రచనల్లో దొరుకుతాయి వెదికితే. చదివే తీరికే లేని ఈనాడు, వెదికే ఓపిక ఎవరి కుందీ?

"అందువల్ల, స్వామీ! నీ గురించి కొంచెం తెలుసుకోవాలని వుంది. ఉన్న దున్నట్లు చెప్పు!" అంటూ కూర్చుని, ఈయన చెప్పిన విశేషా లన్నిటినీ యథాతథంగా వ్రాసుకొని, నేను సేకరించిన ఆదనపు భోగట్టాను చేర్చి, ఇప్పు డీ రూపంలో సహృదయుల ముం దుంచు తున్నాను దీన్ని.

భీమన్న కవితాతత్వం రసాద్వైతం. ఈయన సాహితి జీవితాని కిని సుషమ్న అనుకొంటే - ప్రేమ, శృంగారం సూర్య చంద్ర నాడు లనవచ్చు. సాంఘిక, రాజకీయ సమస్యల్ని ఇతివృత్తాలుగా తీసుకొన్నా, ఈయన వాటిని సాహితీకరించిన రీతి, స్థాయి తాత్వికోన్నత మైనట్టివి. సాధించిన సాంఘిక, సాంస్కృతిక విప్లవాలు అసదృశ మైనట్టివి.

ఎక్కడో గోదావరి లంకలో, ఒక పల్లెటూరి పేటలో, అట్టడుగున ఒక అణుపుగా పుట్టి, మహాకవిగా విరిసి, కళాప్రపూర్ణుడై, పద్మశ్రీయై, కాశీ విద్యాపీఠం గౌరవ డాక్టరేటు పుచ్చుకొని, ఇంకా ఎన్నెన్నో గౌరవ ప్రతిపత్తులతో బ్రహ్మాండంగా ఎదిగిపోయిన ఈ మాల పిల్లవాడు ఇంత గొప్ప వా డెలా అయాడు? ఈయన జీవిత సరళి ఎలాంటిది?

"ఈయన ఆలస్యంగా వికసించిన కవితా పారిజాతం" అన్నాడొక సహృదయ సూరి. ఆంధ్రప్రదేశ్ రాజధానియైన భాగ్యనగరానికి వచ్చినప్పటి నుంచే ఈయన ప్రతిభ దశదిశలా గుబాళించిం దనేది వా స్తవమే. కాని, వికాసం మాత్రం చాల చిన్నప్పుడే ప్రారంభ మయింది. గు ర్తింపు ఆలస్య మవడానికి కారణం ఈయన మాలవాడుగా పుట్టడం. "ఈ మాలవాడు మహా చెప్పేదే ముంటుంది?" అనే నిరసన భావంతో ఈయన రచనలను ఎక్కువమంది చదవక పోవడం. చదివినా పట్టించుకోక పోవడం. అంతే.

వట్టి "మాల" అంటే ఒప్పుకో డీయన. "మాల మాదిగ" అన మంటాడు. హాజరినులలోని ఈ రెండు ముఖ్య ఉపశాఖలను ఒకే కులంగా

కలిపి వెయ్యాలని ఈయన ఉద్దేశం. "మాల మాదిగ" పేరును క్లుప్తీకరించి "మామా" అంటాడు. మామాలు అంటే మాలమాదిగలు. ఈ జీవిత చరిత్రలో నేను హరిజన, మామా శబ్దాలను పర్యాయపదాలుగా వాడాను.

భీమన్న జీవితం ఈయన రచనల లాగే రసభరితం. చిన్నప్పటి నుంచీ కూడ ఈయన తెలిసి కొంతా, తెలియక కొంతా ప్రేమలో పడుతూనే వచ్చాడు. ఎక్కడి కక్కడ లేచి, ముందుకు పోతూనూ వచ్చాడు. ఏ ప్రేమ శృంగారాలైనా ఈయనను వెతుక్కొంటూ వచ్చినట్టివే కాని, ఈయన కావాలని వాటి జోలి కెప్పుడూ పోలేదు. ఎలాంటి ప్రేమలైనా గుండెల్ని దూసుకుపోయి సాహిత్యంలో స్థిరపడి పోయేవి. ఈ విషయంలో "నా ప్రతి రచనా నా జీవిత చరిత్రే" అన్న ఈయన వాక్యం ప్రత్యక్షర సత్యం. ఈ రంగంలో మాత్రం కులమత వర్గ వైరస్యాలు లేవు.

బహునాయికా సమ్మోహన దృగ్గతా బద్ధుడైన ఒక అమాయక నాయకుని చలనచిత్ర కథలా సాగుతుం దీయన వాస్తవ జీవితం. అందువల్ల ఈయన జీవితంలోని ప్రతి వివరాన్ని పేర్లతోసహా పేర్కొనడం ఇక్కడ సాధ్యంకాదు. జిజ్ఞాసువులు పరిశోధ నాసక్తులు కావాలను కొంటే ఈయన రచనలను, ముఖ్యంగా నవలలను పరిశీలించుకోవచ్చు. నేను మాత్రం సాంఘిక సాహిత్య ప్రయోజనం కల వాటిని మాత్రమే స్పృశించి వదిలేస్తున్నాను.

నేను రచయిత్రిని కాదు. సంభాషణలలో హైమవతీయాలను (అంత్య ప్రాసలను) దొర్లిస్తూ మాట్లాడడం వరకే నా సాహితీ ప్రతిభ. అయితే భీమన్న గురించి నాకు బాగా తెలుసు. వ్యక్తిగా నేను మెచ్చిన భర్త. కవిగా నేను ఆరాధించే కర్త. తన పల్లెటూరి "ప్రణయలహరి" నుంచి, హరద్వారపు "శివాలకలు" దాకా ఈయన ప్రతి రచనా నాకు హృద్గతం. మామిడి కుదురు నుంచి హృషికేశం వరకూ ఈయనతో సహచరిగా యాత్రలు చేశాను. అందుకే రేఖా మాత్రంగా అయినా ఈయన జీవిత చరిత్రను అక్షరబద్ధంచేసి పెట్టా లన్న ఈ నా కౌతుకం.

పొరపా ట్లుండవచ్చు. మరచిన వుండవచ్చు. తెలిసినవారు తెలియజేస్తే ఈ చరిత్ర రెండవ సంపుటిలో చేర్చడానికి సిద్ధంచేసి పెడతాను.

భీమన్నకు ఉపకారం జేసిన వాళ్ళే తప్ప, అపకారం చేసినవాళ్ళు జ్ఞాపకం ఉండరు. నిజానికి ఈయన జీవితంలో చీకటే ఎక్కువ. అయినా ఈయన నుంచి మనకు లభించే దంతా వెన్నెలే, వెలుగే. అందువల్ల ఇందులో ఎక్కువగా మంచే తప్ప, చెడు కనిపించదు.

(ఈ గ్రంధంలో భీమన్న సాహితీ చరిత్రే కాక, ఆ కాలంనాటి సాంఘిక, రాజకీయ చరిత్రలు కూడా రేఖామాత్రంగా వస్తై. అందువల్ల ఈ రచన విలువ త్రిగుణీకృత మై నట్టిది. ఒక సామాన్య కవి చరిత్ర కంటే భిన్న మైనట్టిది. అంటరాని వాడుగా, నిరుపేదగా, ఒక మారుమూల పల్లెటూరిలో పుట్టినవాడు - అన్ని ఇబ్బందులనూ సవ్యసాచిగా ఎదుర్కొంటూ సాహితీరంగంలో అత్యున్నత స్థానం అధిష్టించిన ఉదంతం ఇది. అందుకే ఇది కేవలం జీవిత చరిత్రకాదు. సాంఘిక, రాజకీయ, సాహిత్య రంగాలలో కృషిచేసే అభ్యుదయ గాము లందరికీ ఇది లక్షణ గ్రంధం, లక్ష్యగ్రంధం కూడ.) దీన్ని లోకాని కందివ్వడం నా ఆదృష్టంగా భావిస్తున్నాను.

ఈ చరితను 1977 మే 8వ తేదీతో ఆపుతున్నాను. ఒక వారం పది రోజులపాటు తిరుపతిలో వుండి, ఆ రోజు సాయంత్రం వెంకటాద్రి ఏక్స్‌ప్రెస్‌లో హైదరాబాదుకు బైలుదేరాం. "శాంతి శ్శాంతి..." అనే పద్యాన్ని భీమన్న వ్రాసింది అక్కడే, ఆ రోజునే.

ఈ రచన అసంపూర్ణం, భోగట్టా అసమగ్రం. ఎన్నో వివరాలూ, పేర్లూ భీమన్నకు జ్ఞాపకం లేవు. ఈయనకు డైరీ వ్రాసే అలవాటు లేదు. అనేక విషయాలు తనకు ఎలా జ్ఞాపకంవస్తే అలా డిక్టేటు చేశాడు. వాటిని చాలవరకు అలానే రికార్డు చేశాను. సాహిత్య సాంఘిక సమస్యలకు సంబంధించిన అనేక సంఘటనలు ఇప్పుడిప్పుడే జ్ఞాపకం వస్తున్నై భీమన్నకు. తనతో అనేక విధాల అనుబంధం కల సహృదయులు. మిత్రులు ఎంతోమంది "నన్ను మరిచావు, నన్ను మరిచావు" అంటూ తన స్మృతి దుర్గం మీదికి తోసుకు వస్తున్నారు. ఇప్పు డేమిటి చెయ్యడం? రెండవ సంపుటికి వాయిదా వెయ్యడం తప్ప గత్యంతరం లేదు.

ఈ జీవిత చరిత్రను చదవటం తటస్థించిన వా రెవరైనా సరే-భీమన్నతో తమకు స్వయంగా గాని, తమ ఎరుకలో కాని - ఏవైనా చెప్పదగిన అనుభ

లుండి వుండి, అవి ఇందులో పేర్కొనబడలే దని భావించినట్లైతే - అట్టివారు ఆయా సంఘటనలను గురించీ, అనుభవాలను గురించీ నాకువ్రాసి పంపవచ్చు. రెండవ సంపుటిలో చేర్చగలను.

"గుడిసెలు" కావ్యసంపుటికి జాతీయ అవార్డు వచ్చిన తరువాత - భీమన్నకు కొంచెం ఆర్థిక స్వాస్థ్యం కలిగించవలసి వున్నదనీ, అందుకు ఇదే మంచి అవకాశ మనీ, ఒక సన్మాన సంఘం వేసి ఎంతోకొంత పర్సును బహూకరించడం మంచిదనీ డా. బెజవాడ గోపాలరెడ్డిగారు సలహా చెప్పడంవల్ల-మాల కొండయ్య, బాపురెడ్డి, రామానుజరావు గార్లు 1976లో ఒక సన్మాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. దానికి అప్పటి విద్యామంత్రి మండలివారు అధ్యక్షులు.

ఒక లక్ష రూపాయలు పర్సు బహూకరించి, కవి సన్మానంలో ఒక రికార్డును స్థాపించాలని కూడ కొందరు మిత్రులు సూచన లిచ్చారు. ఆ ప్రణాళిక ఇంకా కాలపు కుందేలుతో పందెం వేసిన తాబేలుగానే వుంది.

ఇప్పుడు ఆ సంఘం తరపున ఈ జీవిత చరిత్ర ప్రకటించబడుతూ వుంది. అందుకు వారికి వందనాలు చెల్లిస్తున్నాను.

సాంఘిక రంగంలో సాంస్కృతిక విప్లవం కులవ్యవస్థ నిర్మూలనతో ప్రారంభం కావా లంటాడు భీమన్న. జన్మతో వర్ణాలు (కులాలు) ఏర్పడడం అవైదికం, అశాస్త్రీయం, అసహజం అంటాడు.

"నాస్తితు పంచమ - పంచమ వర్ణమే లేదు" అని భగవానుడే చెప్పి వుండగా, అష్టాదశ వర్ణా లెలా ఏర్పడ్డాయి?

తల్లి ఎవరైనా బిడ్డలు తండ్రికే చెందుతారు కదా? వాళ్ళు వేరే కులం వాళ్ళెలా అయారు? కొత్త కులా లెందుకు పుట్టు కొచ్చినై? అందుకు కారకులైన వేద ద్రోహు లెవరు? ఇవీ భీమన్న ప్రశ్నలు. వాళ్ళెంత స్మృతి కర్తలైనా సరే, వాళ్ళను నిరాకరించాలనీ, కులవ్యవస్థను నిర్మూలించాలనీ అంటాడు భీమన్న.

తన స్మృతి పథంలో కాలానుగతంగా పెరుగుతూ వచ్చిన మరపు అనే చీకటినీ, దాని నిండా పెరిగిన మసక మసక గుబురు పొదల్నీ, డొంకల్నీ

పాయదీసుకొంటూ, పడద్రొక్కు కొంటూ వెనుకకు పయనించి - బాల్యం నుంచీ తన జీవిత విశేషాలను వివరించడంలో ఒక రెండు సంవత్సరాలుగా నాతో అవస్థ పడుతూ వచ్చిన బోయి భీమన్న గారికి నేను తప్పకుండా, మొట్టమొదటగా కృతజ్ఞతాభివందనాలు చెయ్యవలసి వుంది.

ఈ ముద్రణలో అచ్చుతప్పులు చాలగానే వున్నై. విరామ చిహ్నాలు ఇష్టం వచ్చినట్టు పడ్డై. వాక్యం మధ్యలో ఫుల్‌స్టాపులు, వాక్యం చివరలో కామాలు కనిపిస్తై. కొన్నిచోట్ల స్పేసింగులు విపరీతంగా పడినై.

అక్షరాల తప్పుల కొక ఉదాహరణ: ప్రశంసా సర్గకో, నారాయణరెడ్డి గారి గేయంలో "మాధవ శోభల్" అని ఉండాలి. ధ కు వ పడింది. అదే గేయంలో"మా కందాలు" అని వుండాలి. క కు న పడింది. "మా కందం" అనేది సినారే సృష్టించిన కొత్త వృత్తం. ఇలాంటి దోషాలను గమనించి చూచుకోవలసిందిగా సహృదయులకు నా ప్రార్థన.

ఈ రచన ఈ రూపం ధరించడానికీ, దీని శుద్ధ ప్రతులు తయారు కావడానికీ, దీనిని ప్రెస్‌కు ఇచ్చే ధైర్యం నాకు కలగడానికీ తోడ్పడ్డ అనేకమందికి ముఖ్యంగా జయరామిరెడ్డి, శివ సత్య, మా వదిన లలితా సోమయాజులు, అడపడుచు ద్రౌపది, జ్ఞానేశ్వర్, అంతటి నరసింహం, మండలి బుద్ధ ప్రసాద్, సాహిత్య అకాడమీ పాండురంగయ్య, దేవేంద్ర, నాతి నారాయణ మూర్తి, వారా వేణుగోపాలస్వామి వంటి వారికి నా ప్రత్యేక హార్దిక కృతజ్ఞతలు.

ఈ నా కృషిలో అన్ని విధాలా సహకరించిన బాపురెడ్డి గారికీ, సకాలంలో చక్కగా ముద్రించి ఇచ్చిన ప్రగతి ప్రెస్ వారికి, ముఖ్యంగా పరుచూరి హనుమంతరావు, గుత్తికొండ నీలకంఠేశ్వరరావు, పి. నరేంద్ర గార్లకు, సత్యం ప్రాసెస్ సత్యంగారికి, ముఖ శీర్షికను చిత్రించిన కోటి లింగం గారికి నా నమస్కారాలు.

అంతే గాక —

శ్రీయుతులు డా. బెజవాడ గోపాలరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, కావూరి పట్టాభి రామయ్య, డా. పి. ఈశ్వరరావు, డి. గరుడాచలం, కె.

మాధవరావు, కె. ఎస్. ఆర్. మూర్తి, జె. బి. రాజు, ఎన్. వెంకటస్వామి, డాక్టర్ యశోదారెడ్డి, పి. టి. రెడ్డి, పి. ఆర్. రాజు, వానమామలై వరదాచార్యులు, డా, నాగవర్మ, బొజ్జా తారకం, జనతా స్టూడియో కోటేశ్వరరావు మున్నగు ఎందరెందరో సౌజన్య మూర్తులకు అంజలి ఘటించ వలసివుంది.

ఇది ఒక మహాకవి జీవితం కనుక, సన్మాన దృష్టితో మూల్యం నూట పదహార్లు అన్నాను. ఇదొక కళాత్మక రమ్యోహ.

ఇక, చదవండి!

మనిషి పెరిగే కొలదీ మనసు మొద్దుబారు తున్నది!
జాతి విరిసే కొలదీ నీతి వాడిపోతున్నది!
కనుక, ఓ కవీ! మేధావీ! జ్ఞానీ, విజ్ఞానీ!
విరికితనం వదిలేసి, బైటికి రా!

భాగ్యనగరం
హేమాని

హైమవతి
1-1-1978

కథా నిలయం
2475
శ్రీకాకుళం

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

బాల సర్గ

1. వాగీశ్వరి

ఓ వాసంతిక నంచు, నీ విరహ భా
వోత్తప్త నంచున్, భవత్
జీవో జ్జీవన నంచు, నీ కమృత మి
చ్చే చాంద్రి నంచున్, త్వదో
ద్భవ ఓష్ణంభర నంచు వచ్చి, ఎవెవో
శోభల్ వరించున్ ననున్ ;
నా వౌ ఈ నిరులెల్ల వీవె కదవే
నా తల్లి ! వాగీశ్వరీ ! !

— బొమ్మ పీఠిక

తన సుఖాలకు, సంతోషాలకు, విజయాలకు, విలాసాలకు - సమస్తానికీ మూలం సరస్వతే అంటాడు భీమన్న. తనతో పుట్టి, తనతో పెరిగి, తనతో అభేదం చెంది, నిరంతరం తనతో ఉంటూవున్న వాగీశ్వరికి తన జీవి తాన్నే సమర్పించుకొన్న వాడు భీమన్న.

ఋతుభేదం, మతభేదం లేకుండా సర్వకాల సర్వావస్థలలోనూ ఏవేవో శోభలు తనను వరించి వస్తూనే వుంటై. ఆక్కునచేరి అమృతం అందిస్తూనే వుంటై ఆనందపారవశ్యంలో ముంచెత్తుతూనే వుంటై. ఇదీ భీమన్న జీవిత.

"నాకు పేదరికం లే"దంటూ గర్వంగా చెప్పుకొన్నవాడు, "నేను కానిది సమస్తం నాదే" అంటూ విశ్వాన్నే తన ఆలింగనంలోకి తీసుకొన్న వాడు భీమన్న.

శ్రీ మన్మంగళ గౌతమీ చిదమలా
సీమంత రత్నోదయా ;
ప్రేమా రామ విహార మత్త మధుపా ;
హ్రీమద్రమా సుప్రభా ;
వ్యోమ ప్రాభవ సౌహృద ప్రణవ భా
భోజోమతీ ; సాహితీ
స్వామీ ; పూర్ణ రసైందవీ రుచిర వై
శాఖీ మనోవల్లభా ;

— రాగవైశాఖి

"నాకోసం, నాగురించి నేను వ్రాసుకొని, పాడుకొంటున్న పద్యం ఇది. నా జీవితక్షేత్రంలో శృంగార కళా దేవ్యాలయం ఈ పద్యం. ఇందులోని ప్రతి పదమూ ఒక రాగప్రియే. ప్రతి అక్షరమూ ఒక ప్రణయకళే. ప్రతి స్పందనా శ్రీమ దమలా సముపలాలితమే" అంటున్నా డీయన. ఈ ఒక్క పద్యాన్ని విశ్లేషించి చూడగల్గితే చాలునేమో - రసపరమైన ఈయన జీవితాన్ని సంపూర్ణంగా ఆవిష్కరింపజేసుకోడానికి !

భీమన్న పేదగా పుట్టి పేదగా పెరిగినా, పేదగా బ్రతికినవాడు కాదు. కష్టాలు, బాధలు ఎన్నో అనుభవిస్తూ కూడ నిత్యసంతోషిగా, భోగిగా జీవించినవాడు. అవమానాలను తుడిచేసుకొంటూ, అభిమానాలను పదిలపరచుకొంటూ, సాంప్రదాయిక కులతత్వ కల్లోలానికి ఎదురీది, అగ్రస్థానానికి చేరుకొన్నవాడు.

నా సుఖాలూ, సంతోషాలూ, గౌరవాలూ
సమస్తమూ సరస్వతీ ప్రీత్యర్థం,
నా కష్టాలూ, నష్టాలూ, దురదృష్టాలూ
అన్నీ శివార్పణం.

— గుడిసెలు కాలిపోతున్నై

అంటూ తన సర్వస్వాన్ని శివసరస్వతులకు వదిలేసి, తాను కేవల నిస్సంగిలా నిలిచిపోయిన రసాద్వైతాచార్యుడు భీమన్న.

శివసరస్వతు లొకే విద్యున్మూర్తి ఈయనకు. ఆ మూర్తిలో తననుతాను దర్శించుకొని ధన్యుడైన వా డీయన. బ్రతకడంకోసం ఎక్కడ ఏ వృత్తి

చేసుకొన్నా , నిరంతరం సాహిత్య సృష్టిలో మునిగి ఉన్నవాడు . సాహిత్యమే తానుగా పర్యవసించినవాడు .

గాయకుడు గానమున , కవి కావ్యమందు ,
శిల్పి శిల్పాన వర్యవశించిపోవ
కార్యమున కారణ మ్మిట్లు కరిగిపోవ
పొంగి ప్రవహించు ఆనంద పూర్ణ గంగ .

— మధు గీత

2. భూలోక నందనం

పత్తగో దావరీ సౌభాగ్యమెల్ల రూ
పము గొన్న వరద హస్తమున నిలిచి ,
వికసితాబ్ర లతాగ్ర వేదికపై నుండి
"కో" మను మధుర వాగ్రుచుల బరపి ,
ప్రియమైన బాల నారి కెడంపు పెలవీటి
చలివేంద్ర లందు విశ్రాంతి గూర్చి ,
తీయమామిడి , వేపతేనె , సాగర సుధా
సంపత్తితో రసస్థాయి పెంచి ,
శ్యామలములైన లంకల ఆంకములను
పమిట చెరగున మలయానిలములు వీచి ,
పాంథ జనులకు పారమ్య పదవినొసగు
కోమలారామ సీమ మా కోనసీమ।

— భీమన్న కావ్యకుసుమాలు

తన జన్మసీమ అయిన కోనసీమను గురించి భీమన్న అప్పుడెప్పుడో, తాను పద్యాలు విరివిగా వ్రాసిన రోజుల్లో, వ్రాసుకొన్న పద్యం ఇది. కావ్యకుసుమాలు , దీపసభ , పైరుపాట , పాలేరు , జానపదుని జాబులు - తన రచనలన్నిటా ఈ కోనసీమ పరిమళపారమ్యమే గుబాళిస్తూ వుంటుంది.

కొబ్బరి ఎక్కడ కనిపించినా
నాకు దానిలో కొబ్బరి తోటలు కనిపిస్తై .
కోనసీమ ప్రత్యక్ష మవుతుంది !
అమ్మ ఒడిలో చంటి పాపలా

అవశ మ్నయిపోతా నా క్షణంలో :
ప్రకృతి ధర్మమే అంత !
ఎక్కడ పుట్టిన జీవికి
అక్కడి ప్రకృతే ప్రవృత్తి :
గోదావరి తన సమస్త పుష్ప ఫలాలను,
ధనధాన్యాలను, సౌందర్యాలను
ప్రేమోపాయనంగా సంతరించుకొని
సముజ్వల మూర్తి అయి సాగరుని పాదాల ముందు
సమర్పించుకొన్న పూర్ణ సువర్ణ పల్లెరం కోనసీమ !
అక్కడ పుట్టిన నాకు
అక్కడ పుట్టిన దేది ఎక్కడ కనిపించినా
పరమాత్మీయ పూర్ణ సౌందర్య సాక్షాత్కారమే !

— శివాలకలు

కోనసీమే తాను, తానే కోనసీమగా-రసవత్సారస్వత మహోదధుల్ని సృష్టించిన మధుర సౌందర్య భావావేశపరుడు భీమన్న.

అందుకే ఈయన ఏమిచెప్పినా - వాచ్యం, వ్యంగ్యం, నర్మం, మర్మం ఏ రీతిలో చెప్పినా - పరమార్థంగా ఆ పరమాత్మీయ పూర్ణ సౌందర్యాన్నే సాక్షాత్కరింపజేస్తాడు.

భారత భూమిలో ప్రధాన సౌందర్య కేంద్రాలలో కోనసీమ ఒకటి. అక్కడ హృషికేశం గంగ ఒడిలోవలె, ఇక్కడ కోనసీమ గోదావరి ఒడిలో ముద్దుబిడ్డ అంటా డీయన.

భూలోకనందనంగా భాసించే ఈ సుందర సీమ గర్భాన, వైనతేయ తీరంలో, రాజోలు తాలూకాలోని మామిడికుదురు గ్రామంలో పుట్టాడు భీమన్న 1911, సెప్టెంబరు 19వ తేదీన. తండ్రి బోయి పల్లయ్య, తల్లి నాగమ్మ.

అఖండగోదావరి ధవళేశ్వరం వద్ద వశిష్ఠ, గౌతమి అనే రెండు ప్రధాన శాఖలుగా విడిపోయి - అంతర్వేది, యానాం ల వద్ద సముద్రంలో కలుస్తున్న దనీ, ఆ శాఖల నడుమగల సెంట్రల్ డెల్టాయే కోనసీమ అనీ, ఇది తూర్పు గోదావరిజిల్లాలో వున్నదనీ వేరే చెప్పనక్కరలేదు. గన్నవరం వద్ద వశిష్ఠ నుంచి

విడిపోయిన ఉపఖాఖే వైనతేయం . ఇది బెండమూర్లంక వద్ద సముద్రంతో సంగమిస్తున్నది . వశిష్ఠ వైనతేయాల మధ్యగల ఉప డెల్టాయే రాజోలు తాలూకా . కోనసీమలో వున్న తాలూకాలు ఇప్పుడు నాలుగు - కొత్తపేట, అమలాపురం , ముమ్మిడివరం , రాజోలు .

ఇందులో ప్రధాన మయింది అమలాపురం . అందుకే "శ్రీ మన్మంగళ గౌతమీ సదమలా సీమంత రత్నోదయు" ణ్ణని చెప్పుకొన్నాడు భీమన్న . అమలాదేవి పాదసీమ కోనసీమ .

బోయి అనేది ఇంటిపేరు . కులంపేరు కాదు . బోయి , బోయ అని కూడ అంటారు .

ఈయన కులం ఈయన పుట్టినాటికి మాల . "పంచమ" అనే పేరు మామా (మాల మాదిగ) లకు అప్పటికే ప్రచారంలోకి వచ్చివుంది . "నాస్తితు పంచమ - పంచమ కులం అనేది లేదు" అంటూ సాక్షాత్తు భగవంతుడే సొంత నోటితో ఎలుగెత్తి చాటినా , వినిపించుకోలేదు ఆయనగారి భక్తులు . మామా లతో పంచమ కులాన్ని సృష్టించారు . 1917లో ఈ పంచమ "ఆది ఆంధ్ర" అయింది . 1931లో "హరిజన" అయింది . 1936లో "షెడ్యూల్డు"అయింది . పేరేదైనా – అది వర్ణవ్యవస్థకు వెలుపలవున్న అవర్ణకులం . అమానుషంగా అంటరానితనానికి గురిచేయబడ్డ "నిరుద్ధ", "దళిత" కులం !

తెలుగుదేశంలో అస్పృశ్యకులాలుగా పేర్కొనబడేవి చాల వున్నా , మాల మాదిగలే అందులో ముఖ్యులు . ఈ రెండు కులాల మొదటి అక్షరాలను తీసుకొని , వీరిని "మామా"లు అంటాడు భీమన్న . నేనూ ఇక్కడ మామా లనే పేర్కొంటున్నాను .

భీమన్న పుట్టిన తేదీలు కూడ మూడు వున్నై. సర్టిఫికెట్టులో 1911, అక్టోబరు , 24 . సర్కారు లెక్కలలో అదే సంవత్సరం సెప్టెంబరు , 23 . ఒక మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు పుట్టాడని తన అక్క గొంతమ్మగారు గట్టిగా చెపుతుండడంవల్ల - అదే సంవత్సరం సెప్టెంబరు , 19 .

చివరకు సెప్టెంబరు 19 నే ఖాయం చేశాం . ఎందుకంటే - అక్టోబరు 24 ఊహించి వేసిన తేదీ . ఈయన సెప్టెంబరు 19 న పుట్టినా , సర్కారు లెక్కల

లోకి చేరడానికి నాలుగు రోజులు పట్టి వుండవచ్చు. మరో విశేషం ఏమిటంటే- మంగళవారం పుట్టినవాళ్ళు కాముకు లవుతారనే లోకోక్తి వుండడంవల్ల, నిష్ఠా కఠినుడైన తండ్రి కంగారుపడి, మంగళవారం రాత్రి అంటే బుధవారం ఉదయమేకదా అని చెప్పుకొని, సంతృప్తి పడ్డాడట! ఇదీ గొంతమ్మగారి కథనమే. ఈయన జీవిత గమనంలో 19 తేదీ ప్రభావం కనిపిస్తూనే వుంటుంది కూడ. కనుక, ఈయన పుట్టిన తేదీ 1911, సెప్టెంబరు 19.

హిరణ్య వర్ణేతా, రీతా,
సర్వైశ్వర్య సంప ద్ధ్యుతీ,
కామ ప్రదాయినీ, వాణీ,
మంగళం తే సరస్వతీ:

—భీమన్న చాటువులు

3. మామిడికుదురు

పొలముల నీటి బోదెలను,
పూవుల తోటల మోట బోదెలన్
నిలిచి నవాంకురమ్ములకు
నీరము కట్టెడి వేగువేళ - నీ
చెలువము సస్యదేవతకు
చిన్నెలు పన్నెలు దిద్దు: అన్నపూ
ర్ణలు పదివేలు నీ వడువు
నన్ ప్రేమియింతురు తెన్గు పల్లెలన్:

—భీ. కా. కుసుమాలు

కోనసీమ భూలోక స్వర్గమైతే, మామిడికుదురు ఒక మందారవనం. అందులో గరువుమీది "బోయొళ్ళమెరక" ఒక కల్పతరువుల తోపు.

మామిడికుదురులో మామాలు నివసించే ప్రాంతాలు మూడు. దక్షిణాన పిల్లకాల్వగట్టు, తూర్పున గరువు, ఉత్తరాన ఏటిగట్టు. ఏటిగట్టు అంటే - వైనతేయం దక్షిణ తీరం పొడవునా, గన్నవరం ఆక్విడెక్టు నుంచి బెండమూర్లంక సముద్ర సంగమం వరకు పోసిన ఎత్తైన మట్టిగట్టు. ఆ గట్టును ఆనుకొని ఒక పెద్ద కాల్వ ప్రవహిస్తూ వుంటుంది. ఆ కాలువ దిగువ మామిడికుదురులో ఒక మామాపేట వుంది. అక్కడే ఒక చిన్నపిల్లల బడికూడ వుంది.

పెద్దకాలువ నుంచి చీలి, దక్షిణంగా పోయే ఒక పంటకాల్వ మామిడి కుదురు గ్రామం గుండా పోతుంది. గ్రామం దక్షిణాన ఈ పంటకాల్వ నుంచి ఒక పిల్లకాల్వ చీలి పశ్చిమంగా నగరం దాకా పోతుంది. ఆ పిల్ల కాల్వ పొడు గునా, ఇరువై పులా మామాల ఇళ్ళున్నాయి.

ఇక, గ్రామంలో తూర్పున వున్నది గరువు అది చాల విశాలమైన ప్రాంతం. అడవుల్లాంటి తోటలతో నిండివుంటుంది. ఆ తోట్లల్లో అక్క-డక్కడా విసిరివేయబడినట్టు వుంటై మామాల ఇళ్లు. మహారణ్యంలో ఋష్యా శ్రమాలను గుర్తుకు తెస్తూవుంటై అవి. అలాంటి వాటిలో ఒక ఆశ్రమం బోయోళ్ళమెరక - ముఖ్య గ్రామానికి చేరువగా.

సఖినేటిపల్లి వద్ద వశిష్ఠ రేవు నుంచి, పాశర్ల పూడి వద్ద వైనతేయం రేవుకు పోయే మెయిన్‌రోడ్డు మామిడికుదురు మధ్య నుంచే పోతుంది. ఈ రోడ్డు పంట కాల్వను దాటి వంతెన ప్రాంతం ఒక అందమైన కూడలి. ఈ కూడలి నుంచే మరో రోడ్డు కాల్వగట్టు వెంబడినే దక్షిణానికి పోతుంది.

మామిడికుదురు కూడలి నుంచి – తూర్పున పాశర్లపూడి రేవు మూడు మైళ్ళు. రేవు దాటితే, నాలుగు మైళ్ళలో అమలాపురం. పడమర రాజోలు ఆరుమైళ్ళు. అది వశిష్ఠ ఒడ్డునే వుంది. ఉత్తరాన ఏటిగట్టు రెండు ఫర్లాంగులు. గట్టు అవతల పెదపట్నం, అప్పనపల్లి, దొడ్డవరం వంటి గ్రామాలున్నా, అవన్నీ వైనతేయం ఒడ్డున వరదల్లో మునుగుతూ తేలుతూ వుండే లంకలు. దక్షిణాన ఈదరాడ, ఆదుర్రు, మోరిపొలం, మగటపల్లి, కడలి, పొన్న మండ, గోగన్నమఠం, కాట్రేనిపాడు - నాలుగైదు మైళ్ళ దూరాలలో వుంటై. ఆ పైది సముద్రం.

ఉదయ వేళల్లో, నిశ్శబ్దంగా వున్నప్పుడు, గాలివాలున సముద్రపుహోరు మామిడికుదురుకు చక్కగా వినిపిస్తుంది. వైనతేయపు ఉప్పుటేర్ల ద్వారా సముద్రపు ఆటుపోటుల నీరు మామిడికుదురు నూకాలమ్మ దేవత పాదాలను కడిగిపోతూ వుంటుంది.

కాపులు, సెట్టిబలిజీలు, మాలు, ముస్లింలు - మామిడికుదురులో ప్రధాన కులాలు. కమ్మ, రాజు, రెడ్డి – ఎవరూలేరు. కరణంగా రొక్కరే

బ్రాహ్మణ · రెండు మూడు వైశ్య కుటుంబా లున్నై . శ్రీమంతులు , భూస్వా ములు కాపులలోను , ముస్లింలలోను అధికం . సంఖ్యలో మామూలదే పైచేయి . వారిలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు .

భీమన్న పుట్టేనాటికి , బోయివాళ్ళ మెరక అంటే అయిదు తాటాకు కొంపలు కల ఒక పెద్దతోట . అది తోట కాదు , ఒక చిన్నసైజు అడవి అంటా డీయన . అందులో ఎక్కువ భాగం కొబ్బరిచెట్లే అయినా - గట్లపొడవునా తాళ్ళ కట్టవలు ; ఈత , వెలగ , చింత , పనస , మామిడి , నేరేడు , జీడి , వేప చెట్లు ; మధ్యలో నిమ్మలు , నారింజలు ; మంచినీటి బావుల చుట్టూ అరటి , చెరకు , వంగ , బొప్పాయి వగైరా ; బీర , బెండ , చిక్కుడు , అనాస ; ఆవులు , గేదెలు , కుక్కలు , కోళ్ళు ; కట్టవలనిండా నల్లేరు , ఉస్తి , రేగు ; బలుసు , పాపిడి , డొంకమల్లె , తీకొండ ; చెట్లనిండా చిలకలు , గోరింకలు , కాకులు , గ్రద్దలు , కొంగలు , ఉడుతలు , ఉడుములు ; ఎన్నో , ఎన్నోన్నో !

ప్రకృతిలోని ప్రణయ సౌందర్యమంతా అలంకరించిన అష్టాదశిలా వుంటుందా తోట . అక్కడ పుట్టాడు భీమన్న . పెరిగాడు ఆ శృంగార ప్రకృతి ఒడిలో .

బోయి అనే ఇంటిపేరు ఆ అయిదిళ్ళ వాళ్ళకు తప్ప మరెక్కడాలేదు . దానిని గురించి భీమన్న తన "ఏక పద్యోపాఖ్యానం"లో విపులంగా చర్చించి వున్నాడు . అదొక అపూర్వ వ్యంగ్య రచన .

4. సంగీత వేదాంతాలు

కన్నావయ్య , శరీర మాత్రము గనే
కా , దాత్మ సంవేద వి
ద్య న్న తోడుగ ; కోనసీమ మధురో
ద్యానమ్ములన్ ఆమె - వి
ద్య న్న వ్యోఢ - రసాత్మయై , కవితయై
వర్ధిల్లె నాలోన ; నీ
వన్నింటన్ గురు డయ్య , నీవె శివు డ
య్యా రాజయోగమ్మునన్ !

—శివాలకలు పీఠిక

తండ్రి పల్లయ్యగారిని గురించి భీమన్న చెప్పుకొన్న పద్యాలలో ఇదొకటి! తండ్రిని అయ్య అనడం ఈయన అలవాటు. తనతోపాటు తనకు తోడుగా వేదాంత విద్యను కూడ కన్నాడట తండ్రి! అదే కవితగా తనలో వర్ధిల్లిందట.

తన తండ్రి ఎంతటి వేదాంతో, తల్లి నాగమ్మగారు అంతటి గాయని. ఉయ్యాల పాటలు, తుమ్మెద పాటలు, ఏలపాటలు, కథాగేయాలు శ్రావ్యంగా పాడటంలో ఆమె ఆ చుట్టుప్రక్కల చాల ప్రసిద్ధి పొందింది.

ఏ రామా రమణీయ జానపద గే
యే కా లయప్రాణలై
ఆరామమ్ముల సర్వకాలముల స
స్యశ్రీలు నర్తించు తన్
ధీరన్ తల్లిని నాగమన్ -

తలచుకొని, నతమస్తకు డవుతాడు భీమన్న ఇప్పుడు.

అయితే, తన భార్య నలుగురిలోను పాడడం పల్లయ్యగారికి ఇష్టం వుండేదికాదు. అందువల్ల ఆమె గానం ఇంటికీ, తమ పొలాలకూ పరిమితమై వుండేది. ఊడ్పుల, కోతల సమయాలలో ఆమె గానానికి సస్యశ్రీయే ఆనందంతో నాట్యం చేసేదట! ఆమె కథ చెపుతూవుంటే, కూలీలు వంతపాడుతూ నాట్లు వేస్తుంటే, ఆ దృశ్యాన్ని చూస్తూ, వింటూ, దారేపోయే జనం అలా నిలబడిపోయేవా రట!

పైరు చేల గట్టులలో
పచ్చగడ్డి పువ్వులలో
పల్లెటూరి పడుచులతో
పాట లెన్నో పాడుకొంటు
చల్లగ నా భావలతను
పల్లవింపజేసిన -
ఊడ్పుచేల మునుములలో
ఉయ్యేలా పాటలతో
వరికన్నెల చిరుగుండెల
వరహాలను పండిస్తూ
నా శైశవ హృదయంలో
నందనాలు నాటిన -

కొబ్బరి మామిడి తోటల
కోయిల తీయని పాటల
శ్రమ నెంచక పాటుపడుచు
సంసారం దిద్దుకొనుచు
పెంకెతనపు నా గుండెను
ప్రేమార్ద్ర మొనర్చిన -

అమ్మకు నాగమ్మకు భక్త్యంజలి ఘటిస్తున్నా నన్నాడు భీమన్న - తన "పైరు పాట" గేయనాటకంలో .

పల్లయ్యగారు అద్వైతి . తూర్పు , పశ్చిమ గోదావరులలో ఆయనకు చాలమంది శిష్యు లుండేవారు . నాగమ్మగారి సంగీతంలా కాక , పల్లయ్యగారి వేదాంతం మేరలు దాటి విస్తరించింది .

మామిడికుదురులోను , శిష్యుల గ్రామాలలోను తరచు వేదాంత గోష్ఠులు జరుగుతూ వుండేవి . తల్లికూడా పొలం పనులకు ఎలా వెళ్లేవాడో , చిన్నప్పుడు తండ్రివెంట వేదాంత గోష్ఠులకు కూడ అలాగే వెళ్లేవాడు భీమన్న . ఎవరినుంచీ , ఎలాంటి ఉపదేశాలూ పొందకపోయినా - సహజంగానే భీమన్నకు సాహిత్య కళలో తల్లీ , తత్వజ్ఞానంలో తండ్రి గురువు లయ్యా రనవచ్చు .

నిత్య వికసన శీలమై , సహస్ర దళ పద్మంలాంటి సుందర ప్రకృతి నడుమ , ప్రకృతి పురుషుల్లాంటి తల్లి దండ్రుల సన్నిధిలో , బాల్యం గడిపిన భీమన్న – ఆందుకేనేమో , ఆ రెండు విద్యలను గురించీ ఇలా అంటాడు :

నగ్న సత్యం వేదాంతం ,
అలంకృత సత్యం కవిత్వం .
Truth nacked is Philosophy,
Clothed is poetry .

ఈ నిర్వచనం ద్వారా భీమన్న – పసుపూ , కుంకుమా , నగా నట్రాతో నిత్యం కలకల్లాడుతూ వుండే తల్లినీ , కౌపీన మాత్రధారియై వుండే తండ్రినీ

మాత్రమే కాక , కాశీ క్షేత్రంలోని అన్నపూర్ణ విశ్వనాథుల్ని కూడ క్షేత్రజ్ఞుడైన ఋషిలా స్మరించా డనవచ్చు . అప్పటి కాయన కాశీని గురించి ఎమీ ఎరగడు .

౬ . ఇనాందార్లు

మామాలలో భూస్వాములున్నారు , కాని - ఇనాందార్లు , జాగీరుదార్లు , జమీందార్లు ఎక్క-డైనా వున్నారో లేదో తెలీదు . మామిడికుదురులోని ఈ బోయి వంశం వాళ్ళు మాత్రం ఇనాందార్లు .

వీళ్ళ అసలు ఇంటిపేరు గెడ్డం అనీ , హైదరాబాదులోని బోయిగూడ నుంచి వలస వెళ్ళటం వల్ల బోయి అనే పేరు వచ్చిందనీ చెపుతారు . రాజోలు తాలూకాలోని గెడ్డం వాళ్ళతో వీళ్ళకు నీళ్ళపాళ్ళు (మడి – మైలా) ఉన్నం దువల్ల , అదే నిజం కావచ్చు . ఈ ఇనాందారీతనం కూడ ఈ కథనాన్ని బల పరుస్తుంది . హైదరాబాదునుంచి మామిడికుదురు దాకా ఈ కుటుంబం ఎప్పుడు ఏ అధికారి వెంట వెళ్ళిందో తెలియదు . మామిడికుదురులో తోటలను , పొలాలను మాన్యాలుగా సంపాదించి , ఇనాందారీ కుటుంబంగా స్థిరపడింది .

ఈ కుటుంబానికి గ్రామ నౌకరీ పదవి వుంది . గ్రామ వ్యవస్థను పాలించే అధికారి మున్సబు . లేఖకుడు కరణం . ఈ ఇద్దరికీ సహాయకులుగా నలుగురు గ్రామ నౌకర్లు . వంశ పారంపర్యతగల ఉద్యోగా లివి . అందులో ఒకటి బోయి కుటుంబానిది . కుటుంబంలోని పెద్దవాడికి ఇది చెందుతూ వుంటుంది . పలుకు బడికీ , పరపతికీ ఇది ఆటపట్టు .

పల్లయ్యగారు పుట్టేటప్పటికే ఈ కుటుంబం ఆయి దిళ్ళా ళ్ళయ్యారు . ఆయన తండ్రి , అంటే భీమన్న తాత, నర్సయ్యగారు గ్రామ నౌకరుగా వుండే వారు . నర్సయ్యగారు మహా భోగి . భోజన ప్రియుడు . జీతంతోపాటు వచ్చే దంతా ఖర్చుచేసి , చాలక అప్పుచేసి , భూమిని కూడా తనఖా పెట్టి-కందిపప్పు , ఆవు నెయ్యి , మినపగారెలు వగైరాలతో పంచభక్ష్య పరమాన్నాలు తరగించి , పెత్తనాలు చెయ్యడమంటే ఆయనకు మహా సరదా ఆట .

భోగం అనేది ధనం తోడిది కాదు . మనస్తత్వం తోడిది .

తన తండ్రి మిగిల్చిపోయిన ఏడు వందల రూపాయల అప్పును తీర్చి, భూమిని తనఖానుంచి విడిపించుకోడానికి ఆ తర్వాత పల్లయ్యగారుపడ్డ తిప్పలు ఇన్నీ-అన్నీ కావు ఆనాడు ఏడు వందలంటే - ఈనాడు డెభ్భైవేలు! కొబ్బరి కాయల ధర ఈనాడు రూపాయకి ఒక కాయ కదా? ఆనాడు రూపాయకి వంద కాయలు!

డబ్బు విలువను, పొదుపులోని పరమార్థాన్ని చిన్నప్పుడే స్వానుభవంతో తెలుసుకున్న పల్లయ్యగారు, ఎన్నడూ సుఖ భోగాల దాపుకు పోలేదు. విశ్రాంతిలేని కాయ కష్టంతో, హక్కు-లు లేని బాధ్యతలతో కృషి చేస్తూ జీవితాన్ని పండించుకొన్నారు. అయితే - తన కొడుకు (భీమన్న)లో మళ్ళీ తాత లక్షణాలు గమనించి బాధపడేవారు.

నర్సయ్య గంగమ్మ దంపతులకు నలుగురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు. చివరివాడు పల్లయ్యగారు.

తరాలు గడిచే కొలదీ ఇనాం మాన్యాలు ఎకరాల నుంచి కుంచాల్లోకి దిగాయి. గ్రామ నౌకరీ కూడ పెద్దవాడికి పోతుంది. తక్కిన-వాళ్లు ఏవేవో వృత్తులు చేసుకొని బ్రతుకుతున్నారు. కొందరు బర్మా సబుర్లు చేస్తున్నారు. మరి, తన చిన్న కొడుకు ఎలా బ్రతుకుతా డన్న సమస్య నర్సయ్య గార్ని బాధిస్తూ వుండేది. ఎందుకంటే - చిన్నప్పటి నుంచీ పల్లయ్యగారు ఒక ఉన్మత్తుడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ పొలాల వెంట తిరుగుతూ వుండేవాడు. ఏ పనీ చెయ్యడు, మరెలా బ్రతుకుతాడు?

దారి తప్పిన బాటసారీ
ధైర్యమోయీ బాటసారీ
మింటి చుక్క మిణుగు బుర్గో
కంటికంతా చీకటౌనా?
కంటిలోపలి కాగడాతో
మింటి వరకూ చూడలేవా?
దారి కంటక పూరమైనా
ధైర్యశాలికి భారమౌనా?

— పాలేరు (నాటకం)

6. జడ బాలుడు

ఏదో ఒక దీపపు వెలు
గేదో ఒక మూల మిణుక కేమానవుడున్
నీ దారి తెలియనేరడు,
నాదేవీ! లేచి రమ్మ, నాతో భువికిన్!

—దీపసభ

ఏ పనీ పాటూ లేకుండా, మాటా మంతీ లేకుండా, స్తబ్ధుగా తిరుగుతూ వుండే ఆ కుర్రవాణ్ణి అప్పన సీతారామయ్యగారు చేరదీసి, తనవద్ద పనికి పెట్టుకొన్నారు.

ఆప్పన సీతారామయ్యగారు కాపులు. మామిడికుదురు పెద్దరైతుల్లో ఒకరు. పాలేళ్ళ, జీతగాళ్ళ, కూలీల సహాయంతో తమ భూముల్ని తామే స్వయంగా సాగుచేసుకొనే రైతులే ఎక్కువ ఆ వూళ్ళో. సీతారామయ్యగారివద్ద పల్లయ్యగారి పని - పగలు పశువుల్ని కాయడం, రాత్రి ఆయనతోపాటు పైరుల్ని కాయడం. ఇది పాలేరుతనానికి పూర్వరూపం. అప్రెంటిస్‌షిప్పు అనవచ్చు. ఈ పరీక్షలో నెగ్గినవాడు పాలేరో, జీతగాడో కావచ్చు. లేకపోతే, రోజుకూలీగానే బ్రతకవలసివుంటుంది సాధారణంగా.

సీతారామయ్యగారు పూర్వగ్రంథాలు బాగా చదువుకొన్నవారు. మంచి జ్ఞాని. కులభేదాలు, అంటరానితనమూ పాటించేవారు కారు. నిజానికి ఆ రోజుల్లో కులమత భేదాలూ, అస్పృశ్యతా పేరుకు మాత్రమే తప్ప, వాస్తవంగా వుండేవి కాదు. ఎంత పేదకూలీ అయినా తిండికోసం బాధపడేవాడు కాదు.

పల్లయ్యగారికి భాగవతంలోని పద్యాలు అనేకం నోటికి వచ్చు. అవన్నీ సీతారామయ్యగారి వద్ద నేర్చుకొన్నవే. పొలం కాపలా సందర్భాలలో రాత్రులు చాలవరకు భాగవత పద్యాలను పాడుకొంటూ గడిపేవా రాయన. పల్లయ్యను కూడ పాడుమనే వారు. అర్థాలు చెప్పేవారు. వాటి వెనుకవుండే కథలను చెప్పేవారు. ఆ విధంగా సీతారామయ్యగారే పల్లయ్యకు తొలిగురు వయ్యారు.

పగలంతా పశువుల్ని కాచేవాడు కదా పల్లయ్య? మరే పనిలోను ఆయనకు ఆసక్తి వుండేది కాదు. తోడిపిల్లలంతా ఏవో ఆటలు ఆడుతూ వుండేవాళ్ళు. ముఖ్యంగా గవ్వలాట ఆడేవాళ్ళు. ఆటల్లో మునిగివుండి తమ పశువుల్ని కూడ పల్లయ్యకు అప్పగించేవాళ్ళు. అందుకు ప్రతిఫలంగా గవ్వలు ఇచ్చేవాళ్ళు. ఆ రోజుల్లో గవ్వలు చెల్లేవి. ఆవిధంగా సంపాదించిన గవ్వలను ఎప్పటికప్పుడు పైసా(దమ్మిడీ)లుగా మార్చుకొని, డొక్కబుర్రలలోవేసి దాచుకొంటూ, పల్లయ్య తన పెళ్ళినాటికి డెబ్భై రూపాయలు చేశాడంటే - ఆ పొదుపు న భూతో న భవిష్యతి కదా! తన పెండ్లి ఖర్చును కూడ తానే సంపాదించుకొన్నా డాయన.

"శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం" అనే పాఠాన్ని కూడ సీతారామయ్యగారి వద్దనే నేర్చుకొన్నాడు పల్లయ్య.

పొలం కాపలా సందర్భంలో ఒక రాత్రి కామందుగారికి వట్టి గడ్డి పరచి పక్క వేసి, తాను వట్టినేల మీద పడుకొన్నాడట పల్లయ్య. సీతారామయ్యగారువచ్చి చూచి, "నువుకూడా కాస్త గడ్డి పరచుకోరా" అన్నారట. అక్కరలేదన్నాడు పల్లయ్య - లేవటానికి బద్ధకించి. "పోనీ, నా పక్కమీదకు మరికొంత గడ్డి పట్రా" అన్నారాయన. పల్లయ్య లేచి వెళ్ళి పట్టుకొచ్చాడు. "అది నువ్వు వేసుకొని పడుకో!" అన్నారు నవ్వుతూ.

"చెపితే ఎంత పనైనా చేస్తావు. నీ పని నువ్వు చేసుకోవు. ఈ తత్వం మంచిది కాదు" అన్నారు సీతారామయ్యగారు ఆప్పుడు. ఆ వాక్యాలను చివరి వరకూ మరచిపోలేదు పల్లయగారు.

సీతారామయ్యగారి పరిచర్యలో కొడుకు బాగుపడతా డనుకొన్న నర్సయ్యగారికి మరీ ఆశాభంగ మయింది. పల్లయ్యగారి పరధ్యానం పెరిగింది. పద్యాలు పాడుకొంటూ, నిష్ప్రయోజకంగా ప్రగల్భాలు వెంట తిరగటం ఎక్కువయింది.

"మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు పోవునే మదనములకు?" పల్లయ్య పోవునే పశుల పనికి?

ఆసలే చింతనాపరుడు. సీతారామయ్యగారి బోధలతో చింత ఎక్కువై ఉన్న మతికూడ పోయింది.

తవస్సు చేసుకొంటూ
నాలో నేను జీవించి నప్పుడు
అంకు రించాను మల్లె మొగ్గగా
వికసించాను గులాబి పువ్వుగా
ఫలించాను రసాలినిగా

—అనాది కొన నుంచి అనంతత్వం లోకి

7. ఇహపర విద్యాగురువు

తన పరివాహమున వడ్డ చినుకు ప్రతిది
తానె కాకున్నచో అస్తిత నదికేది?
బ్రహ్మ విద్యాగురువు నట్టివాడు కాదె?
నుడువులను మించి ఆత్మ చెప్పెడిదె విద్య!

— ధర్మవ్యాధుడు (నాటకం)

"మనిషిని చూడకుండానే, త్రికరణ శుద్ధిగా తనను కోరుతున్న ఆత్మను ఆత్మద్వారా గ్రహించి, బోధించి తరింపజేయగలవాడే నిజమైన బ్రహ్మ విద్యా గురువు" అంటూ కౌశికుడి నోట చెప్పిస్తాడు భీమన్న - తన "ధర్మవ్యాధుడు" నాటకంలో. అక్షరాలా పల్లయ్యగారి విషయంలో ఆవిష్కృతమైన సత్యం ఇది.

పల్లయ్య ఎందుకు అలా తిరుగుతాడు - చింతాక్రాంతుడై, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ, పరధ్యానంగా? బాల్యం గడిచి, యౌవనంకూడ ముదురు తున్న వయస్సు కనుక, ఆది మదపిచ్చేమో అన్నారు లోకులు. త్వరగా పెళ్ళి చేసెయ్యమన్నారు కూడ. అయితే, ఆయనిది - పెళ్ళంటే ఏమిటో కూడ తెలి యని జడస్థితి!

అట్టి స్థితిలో పలకరించాడొక వ్యక్తి - ఏదో మనేదగా చేనిగట్టుపై కూర్చుని వున్న పల్లయ్యను.

"ఎందుకురా అలా కూర్చున్నావు ? రా , అలా పోదాం !" అన్నాడా వ్యక్తి . పల్లయ్యలేచి , ఆయనను అనుసరించాడు.

ఆ వ్యక్తే జంగం వెంకన్నగారు . ఆ వూరివారే - జంగం కులస్థులు . ఆ వూళ్ళో పెద్ద రైతుల్లో ఒకరు . ఎంతో కాలంగా పల్లయ్య తీరుతెన్నులు కని పెడుతున్నవారు . పల్లయ్యగారి బ్రహ్మవిద్యా గరువు ఈ వెంకన్నగారే .

ఏదో అంతర్మథనంతో బాహ్య వ్యాపారాలన్నీ కట్టిపెట్టి , జడమైపోతున్న ఒక ఆత్మను ఉద్ధరించి తిరిగి చైతన్యవంతం చెయ్యడానికి గురువే శిష్యుణ్ణి వెతుక్కొంటూ వచ్చిన పరమ సంఘటన ఇది .

గురువును వెతుక్కొంటూ శిష్యుడు వెళ్ళడం లౌకికం . శిష్యుణ్ణి వెతుక్కొంటూ గురువు రావడం పారమార్థికం .

పల్లెటూళ్ళలో వ్యవసాయమో , వృత్తిపనులో చేసుకొంటూ ఎంతటెం తటి జ్ఞానులు నివురు కప్పిన నిప్పుల్లా వుంటూ వుంటారో ఈ ఉదంతం వివ రిస్తుంది .

సీతారామయ్యగారి పరిచర్యలో వికసించిన జిజ్ఞాస వెంకన్నగారి సన్ని ధిలో ఫలించి , పల్లయ్యగారు బ్రహ్మవేత్త అయినాడు . వెంకన్నగారు అద్వైతి . వారి బోధ , ఉపదేశమూ పల్లయ్యగార్ని మనిషిని చేసినై .

సంసారి సన్యాసి కావడానికి కారణం ఏదైనా కావచ్చు . సన్యాసిని సంసారిగా చెయ్యగలిగిందే బ్రహ్మ విద్య .

వెంకన్నగారు పల్లయ్యగారికి బ్రహ్మవిద్యతోపాటు తమ భూములలో కొంతభాగం కౌలుకిచ్చి , చేసుకోమన్నారు . మొదట్లో దుక్కి , దమ్ము మొద లైన ఏర్పాట్లన్నీ వారే చేశారు . ఆ విధంగా ఒక్క గురువు ద్వారా పల్లయ్య గారు అటు బ్రహ్మవిద్యనూ , ఇటు బ్రతుకు తెరువునూ కూడ సంపాదించుకొని , వేదాంతి - వ్యవసాయదారూ కూడ అయారు .

పిచ్చికుదిరింది కనుక , కొద్దికాలానికే పెళ్ళికూడ అయింది . మామిడికుదు రులోనే పిల్లకాలవ గట్టుమీది మామాపేటకు చెందిన ఎల్లమ్మల్ని తమ్మయ్యగారి

అమ్మాయి నాగమ్మగార్ని పల్లయ్యగారు వివాహ మాడారు. తమ్మయ్యగారిది బర్మా సబుర్లు చేస్తుండే ఒక కలిగిన కుటుంబం. నలుగురు అక్క-చెల్లెళ్ళలో నాగమ్మగారు రెండవది. గారాబంగా పెరిగిన పుత్తడి బొమ్మ. అయితే – తండ్రి వద్ద ఎంత సుకుమారంగా పెరిగిందో, భర్తవద్ద అంతకు ఎన్నో రెట్లు కష్టాలు అనుభవించిం దా ఇల్లాలు.

తండ్రితో పేచీపడి అన్నగారు విడిపోవడంతో, కుటుంబభార మంతా పల్లయ్యగారి మీద పడింది. పెళ్ళి తన గవ్వల డబ్బుతోనే చేసు కున్నారు. వ్యవసాయంలో మిగిలేది తండ్రికే చాలదు. ఇక, తండ్రి చేసిన అప్పు ఎలా తీర్చాలి? తిండి, బట్టా మానుకొని తీర్చాలి. ఒక పూట తిండి మానేశారు. తనకో చిన్న అంగవస్త్రం చాలు. భార్యను ముతక చీరలే కట్ట మన్నారు. పుట్టింటి వాళ్ళనుంచి ఏమీ తీసుకోవద్దన్నారు. తానైతే రాటుదేరిన వేదాంతి. ఆయనతో సర్దుకు పోవడానికి నాగమ్మగారే కఠినవ్రతాలు చెయ్య వలసి వచ్చింది.

"మనం పెట్టాలి, తీసుకోగూడదు" అనేది పల్లయ్యగారి తత్వం. చివరి వరకు అలానే గడిచిం దాయన జీవితం.

పరుల సొత్తును ముట్టగూడదు, పరస్త్రీ వంక కన్నెత్తి చూడ గూడదు, ప్రాణం పోయినా అబద్ధం చెప్పగూడదు – ఈ మూడు నియమాలలోను అపర శ్రీరాముడే పల్లయ్యగారు. స్వగృహంలో తప్ప బైట ఎక్కడా భోజనం చేసే వాడుకాదు. కరువు మాసాలలో కేవలం తాటిపళ్ళు, సీతాఫలాలు తిని ఆకలి తీర్చుకొనేవారట! అంత కఠోర నిష్ఠాపరు డాయన!

వివరాలు చెప్పుకొంటూ పోతే – పల్లయ్యగారి జీవితమే ఒకమహా గ్రంథ మవుతుంది. భీమన్న పుట్టేనాటికే ఆయనకు నలభై దగ్గర. అంటే ఆయన 1870 ప్రాంతంలో పుట్టివుండాలి. 1953 లో శివసాయుజ్యం పొందేనాటికి ఆయన సహస్రమాస పూర్ణజీవి.

ఆ కాలంలో, ఒక పల్లెటూళ్ళో, అంటరానితనం ఒక ప్రకృతి ధర్మంగా భావించబడ్డ సమాజంలో, సమాన మానవ హక్కుల స్పృహ లేని మూలపేటలో ఒక సాధారణ వ్యక్తి అసాధారణంగా ఎలా జీవించ గలిగాడో తెలుసుకోవా

లంటే పల్లయ్యగారిని గురించి మరింత లోతుగా పరిశీలించవలసి వుంటుంది. అది ఇక్కడ నా పరిధిలోని విషయం కాదు.

పల్లయ్యగారు రామకృష్ణపరమహంస లాంటివాడు. భీమన్నను ఒక కవిగా లోకానికి అందివ్వడంకోసమే ఆయన పుట్టి, పరమయోగిగా జీవించాడేమో అనిపిస్తుంది నాకు. ఆయన లక్షించిన ఔన్నత్యాలకు ఈయన పెరగలేకపోతే, అందుకు కారణం ఈయనలోని దీక్షాలోపం కావచ్చునే కాని, పల్లయ్యగారి తపోలోపం మాత్రం కాదు.

అన్నగారు పోయాక, ఆయన మైనరుకొడుకు తరపున గ్రామ నౌకరీని పల్లయ్యగారే చేయవలసి వచ్చింది. వ్యవసాయం వుంది. వేదాంతిగా, సత్యవాదిగా, మేధావిగా పేరుప్రఖ్యాతు లున్నాయి. శిష్యు లున్నారు. ఇన్ని విధాలుగా ఆనాడు పల్లయ్యగారు సమాజంలో గౌరవనీయులు. ఈ రకం వాతావరణంలో, ఒక విశిష్టస్థాయిలో వికసించింది భీమన్న బాల్యం. పేదరికమూ, ఆంటరానితనమూ ఈయనను అంతగా బాధించలేదు. వాటిపట్ల ఈయనకుగల అలక్ష్యభావానికి అదే మూల హేతువనవచ్చు.

ఒక పతి, ఒక్క మాట, శర
మొక్కటి, ఇయ్యవి మూడొకట్లు: ఇం
దొకటియె చాలు మానవుని
ఉన్నతు జేయగ; మూడు నొక్కటై
వికసన మందు మానవుడు
విశ్వ సమున్నతు డేల కాడు? అం
దుకె పరిపూర్ణు డై జన మ
నో రము డయ్యెను రాము డెంతయున్.

—ఆశోకవనిలో రాముడు

8. కవితోదయం

నన్ను కన్నె కోకిలము గానమ్ము నేర్పు
కొందువా అవి విల్వ నానంద మొంది,
సోగ కన్నుల నెమ్మి నా జోడు గూడి
ఆడుకొందువు వత్తువా అనగ మురిసి,
ముగ్ధ మందార సుమము నామోవి తేనె
ఊర్వశికి తుల్యమని చెప్ప ఊరి ఊరి,
తొట్ట తొలిగ నా ఊయెల తొట్టినుండి

దూకి పర్వితినాడ వీ లోకమునకు!
గడప దాటించి నను తోట గట్టు చేర్చి
తోట తోటనె చంక కెత్తుకొనినావు!
గట్టు దాటించి నీయాట పట్టు చేర్చి
ఇక ననున్ ఐట్టి ఎదకు హత్తుకొన రావె!

—భీ. కా. కుసుమాలి

ఇది ఊహ తెలిసి, తనచుట్టూ చూచుకొని, ప్రకృతి సౌందర్య మోహితుడై పరవశించిపోయిన బాల భీమన్న తొలి అనుభూతి. బహుముఖమైన విశ్వ సౌందర్యమంతా తన చుట్టూ చేరి, గీత నృత్య మధ్వాదులతో తనను ఈ లోకానికి ఆకర్షించిందని భీమన్న చెప్పుకొన్నదాంట్లో అతిశయోక్తి కనిపించదు— ఈయన జీవిత పుష్టిని, కవితా సృష్టిని పరిశీలించి చూచినప్పుడు.

వైనతేయమే యమున, మామిడికుదురే వ్రేపల్లె, కోనసీమే బృందావనం అనుకొంటే – భీమన్న బాల్య జీవితాన్ని యథార్థంగా ఊహించవచ్చు. దానినే ఒకచోట ఇలా చెప్పుకొన్నాడు.

నైతు విద్ధను నేను; బాల్యమ్ము గడిచె
గౌతమీ తీరమం దాల గాచుకొనుచు,
ఉబుసుపోక పిల్లనగ్రోవి నూదుకొనుచు,
విన్నులన్ నిన్నె కాబోలు వెదకుకొనుచు!

—భీ. కా. కుసుమాలి

భీమన్న కన్ను తెరచినప్పటినుంచీ నిత్య సౌందర్యాన్వేషి. ఎల్లప్పుడూ దేనినో వెతుక్కుంటూనే వుంటాడు – ఈయన చూపులూ, చెవులూ, దొరికిన అందాన్నెల్లా డెందంలో భద్రపరచుకొంటూ, క్రొత్త అందాలకోసం ముందుకు సాగుతూ, ఈయన జీవితం సంతత పురోగామి అయింది.

అన్వేషణలో భీమన్న అన్వేషణకు ఒక విశిష్టత వుంది. ఏదో లభించనిదానికోసం అన్వేషణ కాదిది. తాను ఎదుగుతున్న కొలదీ వికసిస్తున్న సౌందర్య దర్శనం ఇది. తన అనుభూతికే మళ్ళీ మళ్ళీ పదును పెట్టుకోవడం, తన అభిజ్ఞకే అనుభవాలను చేర్చుకొంటూ పరిపూర్ణతను సంతరించుకోవడం ఇది.

"నేను సత్యాన్వేషినికాదు, సత్యమే నేను" అంటూ డీయన ఒక సందర్భంలో. భీమన్న సత్యాన్వేషి కాదు, సత్యమే భీమన్న అన్నమాట. కవికి సత్యమే సౌందర్యం కదా! భీమన్న సాహిత్యాన్ని యదార్థంగా అర్థంచేసుకోడానికి ఈ దృక్పథం అవసరం.

భీమన్న కవిత చెప్పడం ప్రారంభించినప్పటినుంచీ, ఆ చెప్పడంలో ఒక ప్రత్యేకత చోటుచేసుకుంది. అది ఎవరినో ఒకరిని ఉద్దేశించి, సంబోధించి చెప్పడం. ఆ ఒకరు తరచు ప్రేయసే అవుతుంది. ఈ ప్రేయసి తన స్వీయ సౌందర్యాలాలసే.

ఈ పరమరసాద్వైత భావం, ఈ పరమ రాసిక్యం భీమన్నకు పుట్టుకతో వచ్చిన సహజ స్వభావ లక్షణం. పరిసరాలు దాని వికసనకు దోహదం చేసినై.

పల్లయ్యగారు ఎంత నిష్ఠాగరిష్ఠుడైన పరమయోగో, భీమన్న అంత స్వేచ్ఛావరిష్ణువైన విషయభోగి. ఆయనది నివృత్తి, ఈయనది ప్రవృత్తి. ఈ రెండూ ఒకే సత్యానికి రెండు ప్రక్కలు. అందువల్లనే, పల్లయ్యగారి అద్వైతానికి సమస్థాయిలోనే నడవగలిగింది భీమన్న రసాద్వైతం. భీమన్న కవిత అంత లోతులో పుట్టి ఇంత ఎత్తుకో నడవడమే కారణం – ఆకలికి, నిరుద్యోగానికి, పని రద్దీకి కట్టుబడిపోయిన ఆధునిక మానవుడు దీన్ని అందుకోలేక పోవడానికి.

భీమన్న ఏ ఇతివృత్తాన్ని, ఏ సబ్జెక్టును, ఏ ప్రక్రియలో నడిపినా-చుట్టూ చేరి, పేరంటం నడిపేది కోనసీమ సుందర ప్రకృతే. ఈయన రచనల్లో అది విశ్వరూపం ధరించింది.. ఈయన ప్రతి రచనా అందుకు ఉదాహరణే.

రమ్మివి నీ పొలాలు, కడు
రమ్యతరాలు; పరస్తటాల వృ
క్షమ్ములు పుష్ప శాఖల వి
కమ్ములు. శోభన గేయముల్, మనో
జ్ఞమ్ములు: రమ్మ, ప్రేయసీ: ర
స స్వమవై; అనుభూతి నీడలన్
ద్రిమ్మరు నీ పదాల ఋభ
రేఖలు సోకగనిమ్ము నా యెదన్

—బీ. కా. కుసుమాలు

9. వ్రాస్తే భారతం—

"అయ్యగారూ! అబ్బాయి కవిత్వం చెపుతున్నాడు" అన్నారు దాసరి నరసింహంగారు ఒక రోజున పల్లయ్యగారితో.

నరసింహంగారు పల్లయ్యగారి శిష్యులలో ప్రధానులూ, అప్పటికే బాగా వయస్సు మళ్ళినవారూ. ఆయనది పశ్చిమ గోదావరి జిల్లాలో సీరుల్లిపాలెం. గురు దర్శనార్థం అప్పుడప్పుడు మామిడికుదురు వచ్చిపోతుండేవారు. ఆ శిష్యుల వద్ద భీమన్నకు మంచి చనువూ, గారాబమూ వుండేవి. ఈయన తొలి కవితా గానాలకు పాపం ఆదిశ్రోతలు వాళ్ళే.

భీమన్న పుట్టేటప్పటికే పల్లయ్యగారి నివాసం బోయివాళ్ళమెరక నుంచి సాయబుల పల్లం తోటలోకి మారింది. ఈ తోట మెరకకు తూర్పుగా రెండు ఫర్లాంగుల దూరంలో వుంది. అది నానా ఫలవృక్ష సంకీర్ణమైన ఒక పెద్ద కొబ్బరితోట. ఆ తోటతోపాటు ఆ చుట్టుప్రక్కల ఓడ్పు భూములు కూడ ముస్లింలకు చెందినట్టివే. వాటన్నిటిని కౌలుకు తీసుకున్నారు పల్లయ్యగారు. భీమన్న బాల్యం, యౌవనంలో కొంత భాగం ఆ తోట ఇంట్లో గడిచిందే. వైన తేయానికి బాగా వరద వచ్చినప్పుడు, సీరు ప్రక్కనేగల ఉప్పుటేరుద్వారా ఆ తోటను ముంచుతూ వుంటుంది. అందుకే దానికా పేరు.

తోట ఇంటి చుట్టూ మామిడి, నిమ్మ, నారింజ, దానిమ్మ, జామ, వెలగ చెట్లు. కట్టవల నిండా సీతాఫలాలు, తాళ్లు. ప్రక్కనే ఒక పెద్ద బావి. బావి నానుకొని చిన్న చెరువు. ప్రకృతి సౌందర్యానికి గుండెకాయ అది. ఒక ఉదయం ఆక్కడ కూర్చుని కబుర్లాడుకొంటూవున్న సమయంలో అలా అన్నారు నరసింహంగారు. భీమన్న పక్కనే వున్నాడు.

"ఆఁ! ఏం కవిత్వం లెండి! గచ్చకాయా, పుచ్చకాయా కవిత్వ మవు తాయా? వ్రాస్తే మహాభారతం లాంటిది వ్రాయాలి" అన్నారు పల్లయ్యగారు – నరసింహంగారికి జవాబుగా.

పల్లయ్యగారు చదువుకోలేదు. ఆయన పాడుకొనే శ్లోకాలు, తత్వాలు, పద్యాలు అన్నీ సీతారామయ్య, వెంకన్న గార్లవద్ద విని నేర్చుకొన్నవే. ఆయన ఏకసంతగ్రాహి.

"మృత్పిండమేకో బహుబాండరూపా, సువర్ణమేకో బహుభూషణాని, గోక్షీరమేకో బహుధేనురూపా, ఏకఃపరాత్మా బహుజీవరూపా" వంటి బ్రహ్మ గీతలను, "మందార మకరంద మాధుర్యమునదేలు" వంటి భాగవత పద్యాలను, "చింతచెట్టుమీద చేమంతిపూసింది తెలుసుకోండి" వంటి తత్వాలను, "తొర్రలు తొమ్మిదిగల మేల్మర్రికి" వంటి శుద్ధ నిర్గుణతత్వ కందార్థ దరువులను, "కుక్క(ను)దిన్నవాడు గురులింగ జంగంబు, పంది(ని)దిన్నవాడు పరమ యోగి, ఏస్గ(ను)దిన్నవాడు ఎంత సుజ్ఞానిరా" వంటి వేమన పద్యాలను భీమన్న నేర్చుకొన్నది కూడ తండ్రి పాడుకొంటూ వుంటే వినే. అప్పటికి భీమన్న ఆఆలు కూడ ఎరగని ఏడెనిమి దేండ్లవాడు.

బ్రహ్మజ్ఞానం లభించడం, శిష్యులు ఏర్పడడం, వారిలో బాగాచదువు కొన్నవాళ్ళు, ఉపాధ్యాయులు, కవులు కూడ వుండడం చదువులేని పల్లయ్య గార్ని ఎక్కువగా బాధించి - అప్పుడు పలక పట్టారు. బహుశా తండ్రీ, కొడుకూ కలిసే అక్షరాలు దిద్దారనవచ్చు. అయితే - అక్షరాలు వచ్చాక, భీమన్న పట్టింది ఒకటోక్లాసు వాచకమైతే, పల్లయ్యగారు పట్టింది నన్నయ్యగారి మహాభారతం!

"వాస్తే మహాభారతం వ్రాయాలి" అని పల్లయ్యగారన్న నాటికి పరిస్థితి అది.

అప్పటికి ఇంటి నిండా చేటభారతా లుండేవి. చేట లంతేసి వుండే వవి సైజులో. భీమన్న ఒక పెత్తండ్రి కొడుకు వెంకయ్య అనే ఆయన బర్మావెళ్ళి అక్కడి నుంచి తెచ్చాడు కవిత్రయంవారి పద్దెనిమిది పర్వాలూ, పోతన్నగారి భాగవతమూ, మహాభక్త విజయం అనే ఒక పెద్ద వచన గ్రంథమూ - ఆలాంటి వన్నీ. వీటిలో చాల భాగం పల్లయ్యగారింట్లో వుండేవి. భీమన్నకు వీటితో గల తొలి పరిచయం పీటలుగా, తలడిండ్లుగా.

"మరి, భారతంలాంటి దెందుకు వ్రాయలేదు?" అని ఇప్పు డడిగితే, "మా నాన్న సలహాలు నే నెప్పుడు పాటించాను కనుక?" అంటాడు భీమన్న.

"ఎవళ్ళ అనుభవ పరిధి వాళ్ళది. ఆ పరిధికి లోబడి సలహా లిస్తూ వుంటారు. అవి మనకు ఎంతవరకు పనికొస్తాయో చూచుకోవాలి. తల్లిదండ్రుల

సలహాల విషయంలో మరీ మెలకువగా వుండాలి. అక్కడ జనరేషన్ గేప్ కూడ వుంది" అంటాడు భీమన్న.

మహాభారతం వంటి ఉద్గ్రంథాల సృష్టికి అనువైన కాలం కాదిది. ఇది ఖండకావ్యాల యుగం. మినీ కవితల తరం. మహాభారత మంటే ప్రతిభా వ్యుత్పత్తు లనుకొంటే - పల్లయ్యగారి ఆశయం పదింతలుగా నెరవేరిందనే అనుకోవచ్చు.

"భారత రామాయణాలనో, అంతలేసి మహాగ్రంథాలనో వ్రాయా లను కోవడం కాలదోషం పట్టిన ఊహ" అంటాడు భీమన్న.

సరస వాక్యమ్మె కావ్యమై వరలునేని
కవిత నాదొక్క టొక మహా కావ్యమె యగు!
వేల కవితల తల తోటమాలి నేమ,
అవల శూన్యాధ్వమున చల్లని చలివేంద్ర!

—భీమన్న చాటువులు

10. ప్రత్యేక పాఠ్య గ్రంథం

అఖిల విశ్వము విశ్వకళాభిజ్ఞు,
ప్రకృతిదేవి అధ్యాపకురాలు, విపుల
గౌతమీ తీర దేశాలె గ్రంథచయము,
పాఠములు నేర్చుకొందము, పదవి! లెమ్ము!

— మధు గీత

పాడి పశువులు, దుక్కిటెద్దులు, బండ్లు, పాలేళ్ళు, పిలిస్తే పరిగెత్తుకు వచ్చే అనుచర వర్గం, పొలంలో వరి కుప్పలు, దొడ్డిలో గడ్డిమేట్లు, ఆటకల మీద అరటి గెలలు, వాకిట్లో కొబ్బరికాయల రాశి, చావిట్లో కావ్య కట్టిన పళ్ళు నిత్యం వచ్చే పోయే అతిథులు, వేదాంత గోష్ఠులు - ఇదీ భీమన్న బాల్యం.

నొసట పెద్ద తిరునామంతో, కావిరంగు ఆంగీ ధరి ంచివుండడంవల్ల పల్లయ్యగార్ని అందరూ పల్లయ్యదాసు - అనేవారు. ఊరి పెద్ద కాపులు, ముస్లిం పెద్దలు, ముసలు కరణాలు "దాసూ" అని పిల్చేవారు. ఆ రోజుల్లో అదే

ఒక గొప్ప గౌరవం. ఒక మాలవాడు పేరు చివర "గా, గాడు" లేకుండా పిలవబడడం అంటే - ఆ కాలంలో అదొక పెద్ద విప్లవకరమైన మార్పు!

గ్రామంలో ఏదైనా ఒక తెగని సమస్య ఏర్పడినప్పుడు దాసును పిలవ మనేవారు. క్లిష్ట సమస్యల పరిష్కారంకోసం పొరుగూళ్ళకు పిల్చుకపోయే వాళ్లు. పల్లయ్యగారి న్యాయ దృష్టి, పరిష్కార సామర్థ్యం అంత నిశితమైనట్టిది.

ఆయన అలా తీర్పులకూ, గోష్ఠులకూ తిరుగుతూ వుంటే - ఇంటినీ, వ్యవసాయాన్ని నాగమ్మగారే చక్కబెట్టుకోవలసి వచ్చేది. ఏభయ్యో పడిలో అ ఆ లు దిద్దుకొని, మూడు నెలలలో మహా భారతం చదువుకోగల్గిన పల్లయ్య గారికి ప్రతిభతో ఏ విధంగానూ తీసిపోని ఇల్లాలామె. చదువు లేకపోయినా సంస్కారం పుష్కలంగా వున్న గ్రామీణ సరస్వతి. లెక్కలలో దిట్ట. వ్యవహార జ్ఞానం అపారం.

పల్లం తోటకు తూర్పున ఉప్పుటేరు, శ్మశానాలు. ఉత్తరాన ఆర ఫర్లాంగు దూరంలో మెయిన్ రోడ్డు. తక్కిన రెండు ప్రక్కలా దగ్గరలో ఇళ్ళనేవి లేవు. అలాంటి ఒంటరి ఇంట్లో, నలుగురు చిన్న పిల్లలతో, ఒక ముసలి అత్తతో - చీకటి పడితే దొంగల భయం, భూతాల వెలుగులు తప్ప మరో మనిషి అలికిడే వుండని అడవిలో, నిశ్చింతగా, నిర్భయంగా పిల్లలకు కథలు చెప్పుతూ, పాటలు పాడుతూ సంసారం నిర్వహించిందామె.

భీమన్న నాయనమ్మ పక్కనే పడుకొనేవాడు. ఆమె చనిపోయిన రాత్రి పల్లయ్యగారు ఊళ్లో లేరు. నలుగురూ శవం పక్కనే కూర్చుని తెల్ల వార్చారా రాత్రిని. ఉదయం ఎండెక్కినప్పటికిగాని పల్లయ్యగారు రాలేదు.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే - భీమన్నకు కవిత్వ తత్వంలో ప్రాథమిక పాఠాలు నేర్పిన ప్రకృతి ఎలాంటిదో చూపడానికి.

రూపాయి కాసంత కుంకుమ బొట్టుతో కలకల్లాడుతూ, ఎల్లప్పుడూ ఏదో పనిలో మునిగి తేలుతూ వుండే తల్లంటే పిల్లలకు ఎంతో అభిమానం. ఆమెకు ఆ ప్రాంతాలలో పెద్ద బొట్టమ్మ అనే పేరు కూడ వుండేది. ఇంటి పనులు, పొలం పనులు కూడ తానే చేసుకొంటూ పోయే ఆమెలో ఏ చిన్న

లోపం జరిగినా సహించేవాడు కాదు పల్లయ్యగారు. బైటి వాళ్ళలో ఎంత పెద్ద దోషాన్నైనా క్షమించేవాడు. ఆ ఔదార్యం ఇంటివాళ్ళపట్ల వుండేది కాదు. ఈ కారణంగా భార్యా భర్తల మధ్య ఒక్కొక్కసారి వారాల తరబడి మాటలే వుండేవి కావు. అందువల్ల పిల్లల సానుభూతి ఎప్పుడూ తల్లి వైపు మొగ్గివుండేది.

భార్యా భర్తల మధ్య కీచులాటలు పిల్లలలో ఎలాంటి మనో వ్యథలకు కారణ మవుతాయో గొంతమ్మగారు చెపుతూంటే వినాలి. అర్థం చేసుకోలేని లేత మనస్సుల వికాసానికి నిరోధకా లవుతా యవి. అయితే ఈ పోట్లాటల పరి స్థితి భీమన్నకు ఊహ తెలిసేనాటికి చాల వరకు చక్కబడింది.

పల్లయ్యగారు బైట ఎంత శాంతమూర్తో, ఇంట్లో అంత ఉగ్రమూర్తి. భీమన్న స్కూలుకు వెళ్ళడం ప్రారంభించిన నాటికి ఆయన ఉగ్రత భార్య మీద నుంచి పిల్లల మీదకు మళ్ళింది. పిల్లలు చదువుతో పాటు పనులు కూడ నేర్చు కోవాలి కదా. ఏ పనిలో నైనా అవకతవక కనిపిస్తే చిర్రు బుర్రు లాడు తుండేవారు. అందుకని ఆయనంటే పిల్లలకు భక్తికంటె భయమే ఎక్కువగా వుండేది.

భీమన్న మన స్థితిని మలిచిన వాతావరణం ఇది. తండ్రి ఎదురుగా, ఆ సమీపంలో ఉన్నప్పుడు మాత్రమే ఆయనకు భయపడేవాడు భీమన్న. ఆయన అలా వెళ్ళగానే, ఈయన ఇలా స్వేచ్ఛా వాతావరణంలోకి దూకేసే వాడు! ఆవేశాలనూ, ఉద్రేకాలనూ, సహజమైన భయాది ప్రవృత్తులనూ కూడ స్వాధీనంలో ఉంచుకోడానికి ఆ విధంగా అలవాటయ్యాడు భీమన్న బాల్యం నుంచే.

అనుభవమ్మును మించి సత్యమ్మె లేదు
సత్యమును మించి లేదు విజ్ఞాన మెందు
అనుభవము లేదు ప్రేమ కంటెను, అతాంగి!
ప్రేమ హృదయమె విశ్వ జీవామృతమ్మ!

— సుధ గీత

11. భయమూ, ఏడుపూ

పాండవుల తల్లి కుంతీదేవి మామూల ఇలవేల్పు. గోదావరి జిల్లా చాల ప్రాంతాలలో, మాలపేటలలో గొంతెమ్మ గుడులున్నై. అక్కడ దసరా వుత్సవాలంటే గొంతెమ్మ పండగలే మాలల్లో.

గొంతెమ్మ మాలల ఇలవేల్పెలా అయిందో తెలియదు. అందుకు చాలా కథలు ప్రచారంలో వున్నై. భీమన్న చెప్పేది మాత్రం కుంతి హరిజన కాంతేనని. అరుంధతి ద్వారా వ్యాసుడు మామాయే కదా. ఆ విధంగా కౌరవ పాండవులందరూ మామాలే మరి!

పెండ్లయిన చాలకాలం వరకు సంతానం కలగలేదట నాగమ్మగారికి. ఆ ప్రాంతంలోని ఏదో ఒక గొంతెమ్మ గుడికి వెళ్ళి, సంతానంకోసం మొక్కుకున్నదట. పిల్లలకు మీ పేర్లే పెట్టుకుంటామని చెప్పుకొన్నదట. అందుకే - గొంతెమ్మ, భీమన్న, ఆర్జునుడు, ద్రౌపది అనే పేర్లు. గొంతెమ్మ కంటె ముందు ఒక ధర్మరాజు పుట్టిపోయాడట భీమన్న కంటె గొంతమ్మ అయిదేళ్ళు పెద్ద. ఆర్జునుడు అయిదేళ్ళు, ద్రౌపది పదేళ్ళు చిన్న.

చిన్నప్పుడు భీమన్న కున్నంత భయం మరెవరికీ లేదనవచ్చు. ఇరవై నాలుగు గంటలూ నాయనమ్మను అంటిపెట్టుకునే తిరిగేవాడు. మేఘం పడితే చాలు, ఆమె ఒడిలో దూది ముఖం దాచేసుకొనేవాడు. మెరుపంటే భయం, ఉరుమంటే హడల్. వాన చినుకు మీద పడిందా - వాన వెలిసే వరకూ ఏడుస్తూనే కూర్చునేవాడు.

అదొక అడవి, ఒంటరి ఇల్లూ కనుక - పాములూ, తేళ్ళూ, ముంగిసలూ, దెయ్యాలూ లాంటి వేవేవో ఆ చుట్టుప్రక్కల తిరుగుతూనే వుండేవి. ఇవన్నీ అక్కడి వాళ్ళకు నిత్య సహచరులే. భీమన్నకు మాత్రమే అవి భయ హేతువులు! ఎక్కడి నుంచో హఠాత్తుగా అక్కడ ఊడిపడ్డ కొత్తవాడులా కంగారెత్తిపోయేవాడు వాటి మధ్య.

కోనసీమ కదా అది. బావులు, చెరువులు, కాలువలు, ఉప్పుటేళ్ళు, నదులు - ఎటు చూచినా నీళ్ళే! వర్షకాలం అదంతా సముద్రంలా, ఇళ్ళు పడ

ల్లా వుంటై. ఇదంతా చూడ్డం భీమన్నకు సరదాయే. ఒంటికి మాత్రం తడి తగలగూడదు! కాలికి మన్ను అంటగూడదు! దానికి తోడు వల్లమాలిన కోపం. ఏడుపు లంకించుకుంటే - ఓ పట్టాన మానేవాడు కాదు. ఒకసారి తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు ఏకధాటిగా ఏడ్చాడట!

ఒకతూరి ఎందుకో ఈయన ఏడుపు మొదలు పెట్టాడు. వెక్కి-వెక్కి ఏడుస్తున్నాడు. ఏడుపు కారణమైన భయమో, కోరికో ఏదో తీరినా - ఇంకా వెక్కుతూనే వున్నాడు. అక్కడ చేరినవాళ్ళలో ఓ కాంతమ్మగారు ఊరుకోబెట్ట బోగా, "గుక్క- గుక్క-" అన్నాడు. వెంటనే ఆ గుంపులోవాళ్ళు అక్కడున్న కుక్కలన్నిటినీ తరుముకుంటూ పోయారు. దాంతో, అంత ఏడుపులోను కూడ నవ్వేశా డీయన. ఇంతకూ గుక్క అంటే భీమన్న వుద్దేశం వెక్కు అనీ, వెక్కు ఆగటంలేదనీ. కుక్క అనుకొన్నారు వాళ్ళంతా.

అయితే ఈ రెండూ - భయమూ, ఏడుపూ కూడ ఆ తర్వాత ఈయనను పూర్తిగా విడిచిపోయాయి. జీవితం మొత్తానికి సరిపడ్డ ఏడ్పునూ, భయాన్నీ ఈయన చిన్నప్పుడే ఖర్చుపెట్టేశాడు. వాటి స్థానంలో సత్యకాఠిన్యమూ, పరమ మాధుర్యమూ క్రమంగా నిండుతూ వచ్చాయి.

భీమన్న తొమ్మిదేళ్ళు వచ్చేవరకు అక్షరాల జోలికిపోలేదు. అప్పుడే ఆ ఊరికి లేబరు ఎలిమెంటరీ స్కూలు వచ్చింది. అది ప్రత్యేకంగా మామూలపిల్లల కోసం. సవర్ణ పాఠశాలలోకి వీళ్ళ కప్పుడు ప్రవేశం వుండేదికాదు. వాళ్ళక్క గొంతెమ్మ, మేనత్త కూతురు రాముడూ కలిసి చదువుకుంటూ వుండేవాళ్ళు. భీమన్నమాత్రం ఆ చుట్టుప్రక్కల వాళ్ళతో కలసి గాలికి తిరుగుతూ వుండేవాడు. ఆగతాయి తిరుగుళ్ళూ, ఆడపిల్లల స్నేహాలూ ఈయనకు ఆనాటినుంచీ వున్నవే.

ఎన్ని మొగ్గల త్యాగమ్మ లిందు కలవో
ఎన్ని పువ్వుల రాగమ్మ లింకినవియొ
కానిచో ఈ పురాతన కాననమ్మ
ఇంత భోగమ్మ కృతినందు పెట్టు నేడు?

— మధు గీత

12. భారతీదేవి భద్రతా చర్యలు

పునర్జన్మ , కర్మ . కారణ జన్మ వగైరాలలో నమ్మకంలేదు భీమన్నకు . నాకు మాత్రం ఈయన కారణజన్మ డనిపిస్తుంది .

పరబ్రహ్మను ఒక బీజ క్షేత్రం అంటా డీయన . ఒకొక బీజం వికసించి మళ్ళీ అందులోనే లయించి పోతుంటుంది . పరమాత్మను ఒక జీవ సముద్రం అనుకోవచ్చు . ప్రతి జీవి ఒకొక అల . మనం మూల పదార్థానికి ఏ రూప కల్పన చేసుకొన్నా , అది మాత్రం ఒక ఉమ్మడి నిధి . ఏదైనా ఆ నిధి నుంచే వస్తుంది . ఆ నిధిలోకే పోతుంది . ఇందులో కర్మకు స్థానం లేదు .

బంగారాన్ని మసిపాతను చుట్టినా , పట్టు వస్త్రంలో కట్టినా , గాజు పాత్రలో వుంచినా , మట్టికుండలో పడేసినా - బంగారం బంగారమే . ఆది దొంగవాడి వద్ద వుండవచ్చు . ఆత్మ కూడ అంతే . దానిని లౌకిక వాసన లేమీ చెయ్యలేవు . నీరాకరంలో ఉప్పునిళ్ళే కాదు , పంచదార నీళ్ళూ , పటిక నీళ్లూ కూడ కలిసిపోతై . ప్రత్యేక గుణమేదైనా వ్యక్తిత్వం వున్నంతవరకే . ఆ పైని దాని కే అస్తిత్వమూ వుండ దంటాడీయన .

నిజమే కావచ్చు కాని - ఈ సృష్టి రహస్యం ఇంతవరకు సమగ్రంగా ఏ మానవుడికి అర్థమయింది ? భగవంతుడు రసస్వరూపు డైతే , అతడి కడుపులో ఇన్ని వైరస్యా లేమిటి ? ఈ జగన్నాటకానికి వెనక ఎలాంటి కారణమూ , దర్శకత్వమూ లేదా ?

తమములో దాగి కవివించదంతె కాని
లేవి దన్నది విశ్వాన లే దొకింత ,
కాంతి కిరణమ్మునకు వాడి కడుగు కొలది
చీకటుల లోతు లోతులు చీల్చ గలుగు .

— దీప సఖ

మెదడును, ఒక బల్బుతో పోలిస్తే - దాని శక్తినిబట్టి దాని క్రియా పరిధి వుంటుంది. జ్ఞానులు, విజ్ఞానులు, ప్రవక్తలు రకరకాల శక్తులు గల బల్బులు. వేటి పరిధి వాటి కుంది. దేని పరిమితి దాని కుంది. ఏదీ ఆపరిమిత శక్తి కలది కాదు. దేనిదీ సమగ్ర దృష్టికాదు, ఆఖరు మాట కాదు.

భీమన్న జీవిత వికాసాన్ని పరిశీలించి చూస్తే, అందులో ఒక నిర్దిష్టమైన క్రమం కనిపిస్తుంది. ఒక మార్గం కనిపిస్తుంది. ఆ మార్గం పొడుగునా వికాస దోహదాలైన హంగులన్నీ కనిపిస్తాయి. అవి ఆయనకోసం ముందుగానే ఏదో అమర్చి పెట్టిన ట్టుంటై.

అసలు ఈయన హరిజనుడుగా పుట్టడమే ఒక కారణ జన్మ. ఈ యుగం కవుల్లోనే కాదు, ఇంతవరకు పుట్టిన తెలుగు కవుల్లో మరెవరికీ లేనంత అనుభవమూ, అనుభూతీ తన కుండటానికి కారణం తాను మామూగా పుట్టడమే అంటాడీయన. అది అక్షరాలా నిజం.

ఈయన దృక్పథాన్ని సౌందర్యంతోను, హృదయాన్ని శృంగారంతోను నింపినట్టిది కోనసీమ. ఏ కారణమూ లేకుండా అట్టి భూలోకనందనంలో ఈయన పుట్టివుండడు. ఆ పుట్టడం కూడ జ్ఞాన గానాల కడుపున పుట్టడం!

ఊరికి వెలిగా, నాగరిక సమాజ సంస్కృతికి దూరంగా, చదువు సంధ్యలు నిషేధించబడ్డ ఒక మామా పేటలో పుట్టిన పిల్లవాడి జీవితమూ, భవిష్యత్తూ ఏమిటో అందరికీ తెలిసిందే. అయితే, భీమన్న పుట్టుకకు ఒక ప్రయోజనం వుంది కనక, ఈయన పుట్టేనాటికే భారత భాగవతాలు తలదిండ్లుగా అమరివున్నాయని నా ఉద్దేశం. లేకపోతే ఏ మామా ఇంట్లో ఇన్ని ప్రసిద్ధ పూర్వ సాహితీ గ్రంథాలు రాశిగా చేరివుంటాయి!

భీమన్న దాయాది వెంకయ్యగారు బర్మానుంచి తెచ్చిన గ్రంథా లివి. వాటిని తేవడానికే ఆయన బర్మా వెళ్ళాడేమో అనిపిస్తుంది నాకు. ఎందుకంటే ఆయన మళ్ళీ బర్మా వెళ్ళలేదు. మామిడికుదురులోనే ఉపాధ్యాయుడుగా స్థిర పడ్డాడు.

సృష్టి పథకం ఎంత అద్భుతమైంది ! అంటరాని తనం, కులతత్వం, పేదరికం వంటి మూఢ సామాజిక వ్యధల మధ్య ఇరుక్కుపోయిన భీమన్న కోసం ఎన్ని భద్రతా చర్యలు తీసుకొన్నది సనాతన భారత భారతి !

అంతేకాదు . సమాజానికి దూరంగా పుష్కల ప్రకృతి మధ్య ఏకైక పర్ణశాల ! అభీష్ట బాల్య క్రీడలకూ , బహుముఖ మానసిక వికాసానికీ అపార మైన అవకాశం. చుట్టుప్రక్కల ఆడా , మగా అందరి కళ్ళనూ తన మీదనే నిలిపివుంచుకోగల సాహితీ తేజస్వితా ! ఎంత అదృష్టవంతుడు భీమన్న .

మానవ జీవిత మూకా
గానం కంటే చిక్కన
మానవ హృదయం కవితా
గానం కంటే చక్కన।

— పైరు పాట

13. అనుభూతుల కిడ్డీ బేంకు

ఆగతాయి పిల్లల అమాయకపు ఆనందాల నుంచి బైటపడి , బాధ్యత గల అక్షర లోకంలో పడ్డాడు భీమన్న తొమ్మిదేళ్ళ వయస్సునాటికి. బహుశా 1920లో కావచ్చు, ఏటిగట్టు ప్రక్కగల ప్రాథమిక పాఠశాలలో ఒకటో క్లాసులో చేరాడు . పెద పట్నం , అప్పనపల్లి , మామిడి కుదురు వగైరా గ్రామాల మామా పేటల చీకటి పుంతలకు ఆ పాఠశాల ఒక్కటే వెలుగు చుక్క.

ఒక రెండేళ్ళపాటు సాగిన ఈ ప్రాథమిక విద్యాకాలం బాల భీమన్నకు ఒక కిడ్డి బేంకుగా ఉపయోగపడిందనవచ్చు . ఆ తర్వాత దశ దిశలా వ్యాపించిన ఈయన సాహితీ జీవితానికి కావలసిన సమస్తాన్నీ సూత్ర ప్రాయంగా సేకరించుకొని గుప్త పరచుకొన్న దీకాలంలోనే .

ఏటిగట్టును ఆనుకొని తూర్పుగా ప్రవహిస్తున్న పెద్దకాలువ దిగువనే వున్నదీ పాఠశాల . మామిడికుదురు గుండా దక్షిణానికి ప్రవహిస్తున్న పంట కాలువ ఆ పెద్దకాలువ నుంచి విడివడ్డ దీ పాఠశాల దగ్గరనే . భీమన్న ఇంటి నుంచి స్కూలుకు కాలువ గట్టు మీదుగా నాలుగు ఫర్లాంగు లుండవచ్చు . పొలాల గుండా ఆది సుమారు రెండు ఫర్లాంగులు . అయితే , భీమన్నకు

స్కూలు నుంచి ఇంటికి రావడానికి కాలువగట్టు మీదుగా పట్టే త్రైము కంటె పొలాల మీదుగా పట్టే త్రైము రెట్టింపు వుండేది !

ఈ పొలాలన్నీ పంట పొలాలే . వర్షకాలమంతా వరితో , గట్ల నిండా పచ్చికతో పాటు బెండ , బీర పాదులతో , చేల నిండా నీళ్ళతో , చేప పిల్లలతో , బోదెల నిండా రకరకాల పూలతో కలకల్లాడుతూ వుండేది . శరత్కాలం చాపలపై ఆరబోసిన బంగారు రజను లాంటి పంటచేలతో, నడుమ బారులుగా ఎదిగిన కండిచెట్ల వరసలతో లక్ష్మీదేవి నాట్యరంగమే . ఇక హేమంతంలో అక్కడి ప్రకృతి సౌందర్యం అనన్య లభ్యం . వరిచేలు కోసిన తర్వాత ఆ మ్రోళ్ళ నుంచి మొలిచిన నాము , చేల నిండా ఉప సస్యంగా వెసలారే పెసర , మినుము , అనుము , ఉలవ పైరులు , జనపచేలు , గట్ల పొడుగునా గుత్తు గుత్తులుగా కాచిన కండి , పొలాలలో కొంచెం ఎత్తైన చోటనెల్లా వరి కుప్పలు , సంక్రాంతి రోజులు వచ్చేటప్పటికి కుప్ప నూర్పులూ , పైర్లకైళ్ళు , గొబ్బి పువ్వులు , పూరేడు పిట్టలు - చలికి భయపడి స్వర్గ సౌందర్య మంతా భూమికి దిగివచ్చిందా అన్నట్టుంటుందా ప్రాంతమంతా . బెల్లు విరవడం , పెంట తోలడం , పశువుల్ని కాయడం వంటి కార్యక్రమాలతో అక్కడ వేసవి ఆ తప స్నానాలు చేస్తూ వుంటుంది .

ఆయా రుతువుల్లో ఆయా సౌందర్యాలతో ఈ పొలాలు భీమన్నను ముంచెత్తేవి . ఏదో అవ్యక్తమైన మధురానందంతో ఆ బాల హృదయం నిండిపోయేది. తనతోపాటు బడికి పోయే ఆడ, మగ పిల్లలతో ఈయన ఆ పొలాల్లో గడిపిన క్షణాలు అమృత కణాలు . వాళ్ళలో బాల లాంటి చురుకైనవాళ్ళు , వీరేశ లాంటి మొద్దబ్బాయిలు ఇంకా జ్ఞాపకం వున్నా రీయనకు .

బడెగ్గొట్టి జులాయిగా తిరిగే మొద్దబ్బాయిలను ఉపాధ్యాయుల ఆజ్ఞలపై కాళ్ళుచేతులు కట్టి బడికి మోసుకుపోయిన దృశ్యాలు చెరిగిపోలేదు నేటికీ ఈయన మనఃఫలకం నుంచి . అయితే ఆనాటి తన కుర్రనేస్తాలలో మొత్తంమీద మూడో క్లాసుతో బడి మానేసినవాళ్ళే అందరూ .

భీమన్న బాల హృదయంలో నిక్షిప్తమైవున్న ఈ పొలాల , తోటల , ఆనాటి ఈయన ఆటల , పాటల దృశ్యాలను ఊహామాత్రంగానైనా గుర్తిస్తేనే

తప్ప, "పాలేరు", "పైరుపాట" వంటి సుందర కావ్యాలను యదార్థంగా అవగాహన చేసుకోలేం. అందుకే ఈ వివరాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

గొబ్బిపువ్వుల తేనె, కోడె గిత్తల చిలిపితనం, ఏట్రింత పిట్టల అల్లరి, కందికాయల రుచి, లేత ముంజెల సిళ్ళు, గంగాబొండాల మీగడ – ఈయన రచనల్లోని ఇలాంటి వస్తు ఆ పొలాల్లోవే! అందుకే – భీమన్న సాహితీసామ్రాజ్య నిర్మాణానికి ఈయన బాల్యమే ఒక కిడ్డీ బ్యాంకు అయింది అంటున్నాను.

అంకుర మ్మాదిగా బ్రతుకంత విరిసి
అంకుర మ్మగుదాక, అనంతయాత్ర
ప్రతి పదమ్ముల జీవనార్థముల నెన్నో
తవ్వి తల కెత్తుకొని జీవి తరలిపోవు

— మధు గీత

14. ఆడపిల్ల చేతిలో అపజయం

"ఇదిగో, నీకు మాటలు రావా?" అన్నదా పిల్ల, ఎన్నిసార్లు పలకరించినా మాటాడని భీమన్నతో.

"ఎందుకు రావు?" అన్నాడు భీమన్న, అప్పటికి నోరు తెరచి.

"ఓహో వచ్చన్నమాట! వ్రాయడం కూడ వచ్చా?"

చుర చుర చూశాడా ప్రశ్నకు.

"వ్రాయడం కూడ వచ్చన్నమాట! అయితే, ఓ మాట చెపుతాను, వ్రాయి!"

పెన్సిలు తీశాడు భీమన్న.

"దోమ వ్రాయి" అన్నదామె, మ ఆక్షరాన్ని అనునాసికంగా పలుకుతూ.

దోమ అని వ్రాశాడీయన. అలా కాదన్నది. పోని, మామ వ్రాయమన్నది – అదే అనునాసికంగా. అనునాసిక స్వరానికి అక్షరమేముంది? అరసున్న వున్నా – అది వట్టి వ్రాతగుర్తే తప్ప, పలుకుబడికి పనికిరాదు. తెలు

గులో చీమ, దోమ, మామ, కామ వగైరా మాటలలోని మ కారాన్ని మాత్రమే అనునాసికంగా పలకవచ్చు. ఆది స్పష్టంగా మ కారమే కనుక, అనునాసిక స్వరానికి వేరే అక్షరం లేదు.

ఏది ఏమైనా భీమన్న వ్రాయలేకపోయాడు. ఆమెచేత "ఓస్, ఇంతేనా!" అనిపించుకున్నాడు.

ఆమె పేరు హేమ. నగరం మిడిల్ స్కూలులో, ఫోర్తుక్లాసులో భీమన్నకు క్లాస్మేటు. ఒక టీచరుగారి అమ్మాయి.

ఆ తర్వాత కొద్దికాలానికే వాళ్ళు ట్రాన్సఫర్ అయి, ఎక్కడికో వెళ్ళిపోయారు. భీమన్నకు ఆమెతో పరిచయం అంతమాత్రమే. అయినా, ఈనాటికీ ఈయన పరిణత హృదయంలో ఆ బాల సన్నివేశం ఒకమూల సుప్రతిష్ఠితమై వుండనేవుంది!

నగరమూ, మామిడికుదురూ కలిసేవుంటాయి. ఆ రెంటికీ ఏది సరిహద్దో కరణాలకు తప్ప మరెవరికీ తెలియదు. నగరం ప్రధాన గ్రామంనిండా ముస్లిములే. ఇతరులు ఆ చుట్టుప్రక్కల తోటల్లోను, పుంతల్లోను వుంటారు. మామిడికుదురు కొంతభాగం మాత్రమే ముస్లింలు. అధికభాగం కాపులు, సెట్టి బలిజీలు, మామూలు. ఆ ప్రాంతాని కంతకూ ఒకటే మిడిల్‌స్కూలు, నగరంలో వుంది. ఒక్కటే పోలీసు స్టేషను, మామిడికుదురులో వుంది. ఈ రెండూ మెయిన్ రోడ్డుమీదే వున్నాయి. స్కూలుకు ఆనుకొని ప్రతి శుక్రవారమూ పెద్ద సంత జరుగుతుంది.

ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతూ భీమన్న, 1923 లో నగరం మిడిల్ స్కూల్లో చేరాడు. ఫోర్తు, ఫిప్తు క్లాసులు, ఫస్టు, సెకండు, తర్డు ఫారాలు – ఈ అయిదు సంవత్సరాలూ భీమన్నకు భాషా యోగదశ. అనుభవాలతో, విద్యతో పాటు భాషా జ్ఞానం పెరుగుతూ వచ్చిన దశ ఆది.

అంతవరకు మృత్పిండంలో బహుభాండ రూపాలుగా దాగుడుమూతలాడిన బ్రహ్మసూత్రం – పూల పండ్ల తోటల్లో, పైరు పచ్చ పొలాల్లో తన అనంత సౌందర్యాన్ని ఆవిష్కరించి, మౌన భావ పారవశ్యాన్ని సమకూర్చి –

ఏ తత్ రసాస్వాదన సామర్థ్యం కోసం , ఏ తత్ ఆనంద పారమ్య సాధన కోసం ఈయనకు మాటలు , చేతలు నేర్పడానికి అక్షర సరస్వతిగా సాక్షాత్కరించిన దశ అది .

"సంగీత మపి సాహిత్యం సరస్వతీ కుచద్వయం , ఏక మాపాత మధురం అన్య దాలోచ నామృతం" అన్న శ్లోకం ఈయన కంటబడిం దప్పుడే . "సరస్వతీ నమస్తుభ్యం । వరదే కామరూపిణి" అనే ప్రార్థన ఒకటో క్లాసు నుంచే వస్తున్నా , సాహితీరూపంలో ఆమె దర్శన మిచ్చిందా కుచద్వయ శ్లోకంలోనే . దానికి తోడు ఎప్పుడో తండ్రివద్ద విన్న "నమశ్శివాయ" పంచాక్షరి హృదయంతో పాటు స్పందిస్తూనే వుంది . ప్రధాన జీవనాడే అయింది .

ఆ కాలంలోనే ఈయన చేతికి పంచతంత్రం దొరికింది . అంతకు ముందెవరో పేజీల నిండా అర్థాలూ, నోట్సు వ్రాసుకొన్న పాత పుస్తకం అది . అదే సమయంలో సంతలో ఒక బట్టల దుకాణంలో అమరకోశం కొన్నాడు నాలుగణాలకు . శుక్రవారం సంతలో మంచి మంచి పాత పుస్తకాలు బట్టల దుకాణాల్లోను , సాతానుల అంగళ్ళలోనూ పావలాకూ , అర్ధకూ దొరికేవి . టీకా తాత్పర్య సహితమైన మనుచరిత్ర అప్పుడలా దొరికిందే . ఆ విధంగా భాషా సరస్వతి వలచి వచ్చి వశవర్తిని అయింది చిన్నతనంలోనే .

ఇంత సాహిత్యం నేను చదువుకున్నదెందుకు
నీపేరు మృదువుగా పలకడం కోసం
ఇంత సంగీతం నేర్చుకొన్నదెందుకు ?
నిన్ను నోటార పిలవడంకోసం

—అనాది కొస

15 . యస్యజ్ఞాన దయాసింధో

భీమన్న లింగ్విస్టుకాదు . ఏ భాషా పట్టుబడే తత్వంకాదు . పైగా మరపూ , పరధ్యానమూ జాస్తి .

నగరం మామిడి కుదురుల్లో ముస్లింలు ఎక్కువ . ఆ ప్రాంతంలో ఉర్దూ తెలియనివా ళ్ళుండరు . భీమన్నకు మాత్రం ఒక్క ఉర్దూ ముక్కకూడ పట్టు

పడలేదు. కొడుక్కు ఉర్దూ నేర్పించాలని పల్లయ్యగారు ఒక మున్షిని కుదిర్చారు. ఉర్దూ వాచకం కొన్నారు. అయితే అక్షరాలు మాత్రం – అలీఫ్, బె, పె, తె, టె, సె వరకు వచ్చి, ఇక రా మన్నాయి!

ఎవళ్ళయినా ఈయన భాష మాట్లాడాలే గాని, ఈయన మరో భాష మాట్లాడడు. కారణం – రాక! భీమన్న ఏక భాషా ప్రవీణ, తెలుగులోనే మరో ప్రాంతపు యాసనుకూడ అనుకరించలేడు.

ఒకే భాషమీద మనస్సు నిల్పడంవల్ల, తదితర భాషలు అబ్బలే దనవచ్చు. అయితే, తెలుగులోకూడ ఏదీ ఈయనకు కంఠస్థం కాలేదు. మను చరిత్రను మొత్తం బట్టిపట్టాలని "శ్రీ వక్షోజ కురంగ నాభం"తో మొదలు పెట్టాడు. "ఆంకము జేరి శైల తనయాస్తన దుగ్ధము లానడం"తో ఆగిపోయాడు. అమరకోశం మొత్తం కంఠగతం చేసుకోవా లనుకొన్నాడు. "యస్య క్షాన దయా సింధో" తోనే అది సందు మళ్ళింది. ఈ ప్రయత్నాలన్నీ ఈయన ఫస్టు, సెకండు ఫారాలు చదువుతున్నప్పుడు జరిగినవే.

బైటినుంచి ఎట్టి సూచనా, ప్రేరణా లేకుండా ఇవంతా ఈయన కెలా తోచిందంటే – అలా తోచింది. అంతే!

అయితే – ఆయా గ్రంథాలు ఈయనకు కంఠస్థ మైతే కాలేదు కాని, వాటిని పట్టుదలతో ఎన్నోసార్లు చదవడంవల్ల భాషాజ్ఞానం పెరిగింది. విషయం ఒంటబట్టింది. అందమైన మాటలను అర్థాలతో సహా గుర్తుపెట్టుకొనేవాడు. వేరే వ్రాసుకునేవాడు. అవన్నీ ఇప్పుడుంటే ఒక లలిత పదకోశమే అయే దంటాడు.

మా మాల పిల్లలకు ఇంగ్లీషు స్కూళ్ళలో సగం ఫీజు వసూలు చేసే వాళ్ళు. ఫోర్తు, ఫిప్తు క్లాసులకు నెలకు పదణాలు. ఆపైని తర్డుఫారం వరకు రూపాయిపావులా. డిసెంబరు, ఎప్రైల్, మే, జూన్ నెలలకు ఫీజు వుండేది కాదు – అవి సెలవులుగా వుండేవి కనుక. డిసెంబరు, ఏప్రైల్ నెలలలో కొద్ది రోజులపాటు స్కూలు జరిగేది. ఆ అవకాశాన్ని పుర

స్కరించుకొని భీమన్న ఆ రెండు నెలలకూకూడతండ్రివద్ద ఫీజు డబ్బులు తీసుకు నేవాడు. వాటిని ఈ పుస్తకాలు కొనడానికి ఉపయోగించేవాడు.

తోట కట్టవల నిండా సీతాఫలపు చెట్లుండేవి. స్కూలులేని వేళల్లో పశువుల్ని కాసేవాడు భీమన్న. వర్షకాలంలో మరో పను లుండేవికాదు. అప్పుడు, పశువుల్ని రోడ్డుప్రక్క బీడుల్లో వదిలి, రోడ్డుమీద సీతాఫలాలు పెట్టి అమ్మేవాడు. ఆ యా రుతువుల్నిబట్టి తేగలు, నారింజలు, ఈతపళ్ళ వంటి వాటిని కూడ అమ్మేవాడు. రోడ్డువెంట గుర్రపు బళ్ళలో పోయే ప్రయాణికులు ఎక్కువగా వాటిని కొనేవాళ్ళు. అలా పోగుపడ్డ డబ్బుల్ని కూడ ఈ పుస్తకాలకే పెట్టేవాడు. అలా కొన్ని పుస్తకాలలో తెనాలి రామకృష్ణుని కథలు, కాళిదాసు చరిత్ర వంటివి ఎన్నోవున్నై. "కరిభిత్ గిరిభిత్ కరికరి భిత్, గిరిగిరి భిత్", "గంజాయితాగి" వంటి పద్యాలు, "అస్తివత్ బకవచ్చైవ, చల్లవత్ తెల్ల కుక్కవత్", "షడ్జా మాడ్జ ఖరాడ్జ వీడ్జ", "కష్టే కింతవ" వంటి శ్లోకాలూ - ఈయనకు ఈనాటికీ నోటికి వచ్చేవి - ఆ పుస్తకాల్లోవే.

ఈ విధంగా భాషా సాహిత్యాలలో క్షణ క్షణ వికాసం పొందుతూ భీమన్న సెకండు, తర్కపారాలు చదివే ఆ రెండేళ్ళలోనూ భారతం పద్దెనిమిది పర్వాలూ, భాగవతమూ పూర్తిగా చదివేయగలిగాడు.

ఉదయ తారక తోచె నుదయాద్రిమీద
వరళృతమ్ములు లేచి పాడదొడంగె
భువి నవ భారతాభ్యుదయమ్మురీతి
సూర్యోదయమ్మయ్యె, శోభిల్లె జగము!

—మధు బాల

16. అంటరాని బెంచీలు

నగరం మిడిల్ స్కూల్లో చేరేవరకు భీమన్నకు అంటరాని తనమంటే ఏమిటో బాగా తెలియదు. అంతవరకు తన పొలాలు, తోటలు, ఆటపాటలు- అదే తన లోకం. మాష్టార్లూ, నేస్తాలూ కూడ తన కులం వాళ్ళే. అందులో ఒక ముఖ్యమైన మాష్టారు, నేరేడుమల్లి జగన్నాథంగారు, తన తండ్రిగారికి శిష్యుడు కూడ.

భీమన్న అంటరానితనాన్ని తొలిసారిగా చవిచూచింది నగరం స్కూల్లో చేరినప్పుడు. క్లాసులో మామా పిల్లలకు వేరే బెంచీ లుండేవి. అవి కొంత దూరంగా వుండేవి. వీళ్ళు పైకులాల పిల్లల్నిగాని, వాళ్ళ బెంచీలనుగాని ముట్టుకోగూడదు. టీచర్లు కూడ వీళ్ళ సమీపంలోకి వచ్చేవారు కాదు. వీళ్ళ పుస్తకాలను కూడ ముట్టకునేవారు కాదు.

మామా పిల్లలవి గుడిసెల్లో గుడ్డిదీపం చదువులు. తల్లిదండ్రులు పొలం పనులకు పోతే, తామే ఇంటి పనులన్నీ చేసుకొని, తినో తినకో, హడావిడిగా స్కూలుకు పరిగెత్తు కొస్తారు. ఆలాంటివాళ్ళు తక్కిన కులాల పిల్లలతో సమాన స్థాయిలో ఎలా వుండగలరు? సానుభూతే వుండేదికాదు టీచర్లకు. "ఎందుకురా మీకు చదువులు, పోయి పాలేరుతనాలు చేసుకోక?" అంటూ తిట్టేవారు పదేపదే.

మరీ ఘోర మేమిటంటే – పైకులాల పిల్లలు కూర్చునే బెంచీలను ముట్టుకున్నా రన్న కారణంగా రోజూ ఎవడో ఒక మామాపిల్ల వాడు టీచర్ణచేత దెబ్బలు తింటూనే వుండేవాడు.

అయితే, పైకులాల పిల్లలుమాత్రం అంటరానితనం గురించి అంతగా పట్టించుకునేవాళ్ళు కాదు. టీచర్ల భయంవల్ల క్లాసులో వేర్పాటు ధోరణి కనబరచినా, క్లాసు వెలపల కలిసే తిరిగేవాళ్ళు. స్నేహాలు కలుపుకునే వాళ్ళు. కుల భేదం, అస్పృశ్యత పాటించేవాళ్ళు కాదు.

పైకులాల పిల్లల అమాయకపు నవ్వు ముఖాలను చూస్తూ, "అయ్యో, పూర్ణ కుంభాలుగా ఎదగవలసిన ఈ పాల బుగ్గల్ని ఓషకుంభాలుగా మార్చివేస్తున్నారు కదా వీళ్ళ పెద్దవాళ్ళు!" అనుకొంటూ వాపోతాడు భీమన్న ఈ నాటికి. దీనికి మూలం ఆనాటి అనుభవమే.

అంటరానితనాన్ని సెంటిమెంటుగా గాక, వ్యక్తిగత ద్వేషాలను తీర్చుకోడానికే ఎక్కువగా వాడుకునే వాళ్ళు పైకులాలవాళ్ళు. భీమన్నకు తెలుగు, లెక్కలు, సైన్సు—ఈ మూటిలోనూ తప్పకుండా ఫస్టుమార్కులు వచ్చేవి. అది కొందరికి కిట్టేదికాదు. ఒక రోజున ఒక కుర్రవాడు ఏదో అడిగితే భీమన్న

ఇవ్వలేదు. అతడు కోపంతో హెడ్మాష్టారు వద్దకు వెళ్ళి భీమన్న తన బెంచీని ముట్టుకున్నాడని చెప్పాడు. హెడ్మాష్టారు బెత్తంతో దిగివచ్చాడు. భీమన్న చేయి చాపాడు. హెడ్మాష్టారు బెత్తం పైకెత్తి, బాలరసాల పల్లవంలా వున్న ఆ అరచేతినీ, నిరామయంగా వున్న ఆ ముఖాన్నీ చూచి, "ఇంకెప్పుడూ అలా ముట్టుకోకు" అని చెప్పి, తిరిగి వెళ్ళిపోయాడు.

ఆలాంటిదే మరో నేరానికి, ఒక నెల రోజులపాటు రోజంతా బెంచీమీదే నిలబడే శిక్షను విధించారీయనకు. రెండు రోజులు నిలబడే టప్పటికే కాళ్ళు రోకళ్ళులా వాచిపోయాయి. శిక్ష రద్దుకు తండ్రి కలగజేసుకోవలసి వచ్చింది.

ఈ అంటరాని వెనక బెంచీ వ్యవస్థ మామూ పిల్లల అభ్యుదయానికి ఎంతటి దుష్టమైన విషపురుగో వాళ్ళ తదనంతర జీవిత గమనాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. వాళ్ళలో ముందుకుపోయే గుణాన్నీ, ధైర్యాన్నీ ఆది చంపేస్తుంది. పిరికితనం మప్పుతుంది. ప్రతిభను గిడసబరుస్తుంది. ఇతరులకంటే తాము తక్కువ అనే హీన దీన భావాన్ని నరాల్లోకి ఎక్కిస్తుంది. క్రియాశీలతను పెరగనివ్వదు. నోరెత్తనివ్వదు. అశక్తతకు, అసమర్థతకు బానిసను చేసివేస్తుంది. జాతీయ కార్యకలాపాలలో పాల్గొననివ్వదు. వెలిగా వుండడమే ఉత్తమం అనే అనాసక్త తత్వంతో ముంచేస్తుంది.

ఈ ఇబ్బందు లన్నింటికీ భీమన్న గురైనవాడే. ఇప్పటికీ ఈయన ఏ విషయంలోనూ ముందు నిలబడడు. ఎప్పుడూ వెనకే వుంటాడు. పట్టి పిలిస్తే కాని ముందుకు వెళ్ళడు. అడిగితేనే తప్ప ఏదీ చెప్పడు. ఏమి చెపితే, ఏమి చేస్తే ఎవ రేమనుకొంటారో అన్న సంకోచం. ఎన్నో రాగాలు వచ్చు. పాడడానికి భయం. సభాపరికి జాస్తి.

అయితే, ఈ ఇబ్బందు లన్నీ భీమన్నకు మరో విధంగా ఉపకారకాలే అయినై. సాహిత్య సృష్టిపై దృష్టిని కేంద్రీకరించడానికి తోడ్పడినై. అంటరానితనం ఎంత బాధించినా, ఎంత అవమానించినా ఈయన లెక్కచెయ్యలేదు. తప్పుకుపోయేవాడు.

లోకంచేతికి ముద్దున్నాయి
రోడ్డుప్రక్క కంకర్రాళ్ళున్నాయి
పొగమంచు కంట్లో నిప్పులున్నాయి
ఆడాగ్రత్తగా వుండి
ఆదృష్టాన్ని నిందించుకోకు !

—అనాది కొస

17. క్లాసులో తొలి రచన.

అది ఫస్టుఫారం క్లాసు, ఇంగ్లీషు పీరీడు. పాఠం జరుగుతూ వుంది. తన చేతిలోని నోటు బుక్కును ఎవరో హఠాత్తుగా లాగి వెయ్యడంతో, ఉలిక్కిపడి లేచి నుంచున్నాడు భీమన్న. అప్పటికే ఆ పుస్తకం టీచరుదాకా వెళ్ళిపోయింది.

అంతవరకు - వెనుక బెంచీలో ఒక్కడే కూర్చునివున్న భీమన్న, తల వంచుకొని ఏదో వ్రాసుకొంటూ, ఆ వ్రాతలోనే మునిగిపోయి వున్నాడు. పాఠం వినడంలేదు.

నోటు పుస్తకం ఒక పేజీలో, చుట్టూ నల్లసిరాతో నగిషి చెక్కబడి వున్న ఆ పద్యాన్ని, కొంచెంసేపు నిదానించి చూచి, పైకి చదివి వినిపించాడు టీచరు.

కేలన్ గేరి, పయిటన్ బయంట గొని, సం
కీర్ణ ప్రలాపాను హా
స్యా లాపంబుల, ముద్దునవ్వుల, విలా
సార్థంబ యేతెంచుచున్
లీలా మానుష గాన మాధురికి హా
ణిన్ దూలి, మోహార్తులై
బాలల్ వేలుగ గూడి రందు, ధవళం
బై జ్యోత్స్న లాలింపగన్ !

ఒకవైపు పాఠం జరుగుతూ వుంటే, ఆ మూల కూర్చుని పీడుచేస్తున్న పని ఇదా అన్న తిరస్కార వైఖరితో విన్నారు - క్లాసు కుర్రవాళ్ళంతా

ఆ పద్యాన్ని. టీచరు మాత్రం భీమన్న వంక ఒకసారి పరిశీలనగా చూచి "నువ్వు నిజంగానే పద్యాలు వ్రాస్తా వేమిట్రా?" అని అంటూ పుస్తకాన్ని తిరిగి ఇచ్చేశాడు.

టీచరు నుంచి తన్నులు తప్పవనుకొన్న భీమన్నకు మెప్పు లభించడంతో, క్లాసంతా ఆశాభంగం పొందింది.

భీమన్న పద్యాలు వ్రాస్తా డనేది అంతవరకు ఇంటివద్ద మాత్రమే తెలుసు. ఇప్పుడు స్కూల్లో కూడ తెలిసింది.

టీచరు "నిజంగానే" అనడాన్ని బట్టి, ఆయనకు భీమన్న కవిత్వం చెపుతా డన్న విషయం ముందే తెలిసివుండా లనవచ్చు. ఆ టీచరు భీమన్న హృదయంలో నేటికీ కులాసాగా వున్నాడు. ఆయ నొక బ్రాహ్మడు. నొసట విభూతి, గంధం. ఆయన చెప్పే సబ్జక్టులలో భీమన్నవే ఫస్టు మార్కులు. "వాడి బుర్ర కురిడి కాయరా" అంటూ వుండేవాడు క్లాసులో కుర్రవాళ్ళతో. భీమన్న పట్ల మనసారా వాత్సల్యం చూపిన వా డాయన. అయితే - ఆయన పేరు మాత్రం భీమన్నకు జ్ఞాపకం లేదు.

"విశ్వ చైతన్య పథకంలో పేర్లుండవు. మాట లుండవు. అక్కడుండేవన్నీ ఉద్దేశాలు, కార్యాలు" అంటాడు భీమన్న. నిజమే పేర్లు వ్యవహారం కోసం మనం పెట్టుకొన్నట్టివి. సముద్రంలోని ప్రతి అలకూ ఒక పేరుండదు. అది మందిలో సామాన్యుడి లాంటిది. అయితే - అందులో ఏది విజృంభించినా, మహా ప్రళయాన్నే తేగలదు! కనీసం ఉప్పెనగా పొంగి, తీర ప్రాంతపు పల్లపు నేలలనైనా ముంచివేయ గలదు.

ఆ పద్యం తొలిసారిగా అందరికీ వెల్లడైనట్టిదే కాని, అదే తొలిపద్యం కాదు. అప్పటికే అలాంటి వెన్నో వ్రాసి చింపేశా డీయన. వేదాంత స్ఫూర్తితో అప్పటికే ఎంతో కవిత్వం చెప్పేశాడు. అయితే, తన స్వభావానికి వేదాంతం అతకలేదు. భాగవతం, అందులోనూ దశమస్కంధం తనకోసమే సృష్టించబడిందా అన్నంత బాగా అమరింది. భీమన్న జీవలక్షణం శృంగారపరమైనట్టిది.

దాన్ని గోపికృష్ణ శృంగారం ఇట్టే ఆకర్షించింది. కవిత తనదైన మార్గంలో ఆడుగిడింది.

పద్యాలను నల్లసిరాతో వ్రాసేవాడు. ఆ సిరాను కరక్కాయలు, అన్నభేది, తుమ్మజిగురు కలిపి తానే తయారు చేసుకునేవాడు. ప్రతి పద్యం చుట్టూ నగిషి దిద్దేవాడు. పువ్వులు, తీగలు, చెరువులు, చెట్లు, తుమ్మెదలు, పక్షులు, మేఘాలు, చుక్కలు, చంద్రుడు వగైరా ఏవేవో వుండేవి ఆ నగిషీల నిండా.

నెత్తిన పిలక, చెవులకు పోగులు, ముక్కుకుకాడ, చొక్కా, నిక్కరు, నిక్కరు మీద తానే కుట్టుకున్న లేసు పని, జేబీల నిండా తేగ ముక్కలు, కురిడీ చెక్కలు, ఒక చిన్న చాకు - ఇలా ఒక ఆటవిక బాల శిల్పంలా వుండే ఆనాటి భీమన్న వేషానికి సరితూగుతూ వుండేది అప్పటి ఆయన పద్య శిల్పం.

చిత్తంలో ప్రతి దెబ్బా
సుత్తిదెబ్బగా మలచిన
మానవ మూర్తిని మించి
మహిత శిల్ప మేమున్నది?

—పైడి పాట

18. గకారాలు - గండాలు

"రావోయ్, నాయుడు! ఏమిటిలా వచ్చావ్?" అన్నారు తెలుగు మాస్టారు - గుమ్మంవద్ద నిలబడి క్లాసులోకి తొంగిచూస్తున్న ఒక యువకుడితో.

నాయుడు: ఏంలేదు, మాష్టారు! మీ క్లాసుకో పద్యాలు వ్రాసే వాళ్ళున్నా రంటేను-

తెలుగు మాష్టారు: మా క్లాసులోనే? ఎవరూ?

నాయుడు: [ఆశ్చర్యంతో] మీకే తెలియదా!

తెలుగు మాష్టారు : తెలియదే ! [విద్యార్థుల నుద్దేశించి] ఎవర్రా , పద్యాలు వ్రాస్తున్నారట ?

ఎవరూ మాట్లాడలేదు . నాయుడే ఆన్నాడు "భీమన్న" అని . భీమన్న లేచి నిలబడ్డాడు . నాయుడు కోరగా , పద్యాలు చదివి వినిపించాడు . బాగున్న వని మెచ్చుకొని నాయుడు వెళ్ళిపోయాడు.

"నీకు గణాలు వచ్చ్రట్రా ?" అడిగారు తెలుగుమాష్టారు , ఆ తర్వాత భీమన్నను . రావన్నాడు భీమన్న . వాటిపేరే వినలేదన్నాడు . "గణాలు రాకపోతే గండాలు వస్తాయి . జాగ్రత్త" అన్నారు మాష్టారు . క్లాసంతా గొల్లున నవ్వారు . సిగ్గుపడిపోయాడు భీమన్న .

గణాలు అంటే ఏమిటి ?

తనకెవరూ చెప్పరు . తా నెవర్నీ అడగడు . కాగా , స్వయంగా రిసెర్చి ప్రారంభించాడు .

తన క్లాసులోనే ములపర్తి చెంచయ్య అనే ఒక విద్యార్థి వుండేవాడు . అతడు భీమన్నకంటె బాగా పెద్దవాడు . అప్పటికే పెళ్ళయి , సంసారం చేస్తున్నవాడు . సెక్సు సంగతులెన్నో భీమన్నకు చెపుతుండేవాడు . అతడిది పాశర్లపూడి . స్కూలునుంచి వచ్చేటప్పుడు మామిడికుదురు దాకా ఇద్దరూ కలిసే వస్తుండేవారు సాధారణంగా . భీమన్న ప్రారంభించిన గణపరిశోధనలో అతడు కూడ తోడ్పడసాగాడు .

ఆ ఇద్దరూ సాయంసమయంలో చేటభారతాలు ముందుంచుకొని గంటల తరబడి కూర్చునేవారు - భీమన్న ఇంటివద్ద చెట్లక్రింద . భీమన్న వ్రాసిన పద్యాలను భారత పద్యాలతో పోల్చేవాళ్ళు . నడక బాగానే వుండేది . మరి గణాలంటే ఏమిటి ?

ఒకరోజున - అమెరికాతీరం కనిపించిన కొలంబసులా - ఆనందపడిపోయాడు చెంచయ్య . గణ రహస్యం దొరికిపోయిందన్నాడు !

"శా" పేరుగల పద్యంలో ప్రతి పాదానికీ పందొమ్మిది అక్షరాలు! అలానే "చ" పద్యపాదానికి ఇరవై ఒక్కటి. "ఉ"కు ఇరవై. ఈ గణ పరిశోధన ఇంతవరకు సిద్ధించడానికి వాళ్ళకు ఒక సంవత్సరం పట్టిందట! అయితే - కందం, గీతం, సీసం విషయంలో అక్షర సంఖ్య కుదరలేదు. "మ" పద్యానికీ ఇరవై అక్షరాలే కనుక - ఉ, మ లకు తేడా తెలియలేదు!

ఆ రోజుల్లో భీమన్న ప్రాసేవన్నీ వృత్తాలూ, కందాలూ. పాదాక్షర సంఖ్యనుబట్టి వృత్తాలకు పేర్లు పెట్టేవాడు. ఉ, మ ల మధ్య తేడా తెలియడానికి మరో సంవత్సరం పట్టింది. వదలు, వేలు పద్యాలు చదవడం వల్ల ధారాశుద్ధి ఏర్పడింది. ప్రాస లక్షణం కూడ పరిశీలన వల్లనే తెలిసొచ్చింది. యతి దానంతట అదే పడేది.

నిజానికి - గణ యతి ప్రాసల్ని నేర్పడానికీ, నేర్చుకోడానికీ రెండు మూడు గంటలకంటె ఎక్కువకాలం పట్టదు. భీమన్న ఆస్పృశ్యుడు కనుక ప్రతి చిన్న విషయాన్నీ స్వయంగా పరిశీలించి, పరిశోధించి తెలుసుకోవలసి వచ్చింది.

లేదు నాకు వ్యుత్పన్నత: వేదచయము
ఉపనిషత్తులు, వాని శాఖోప శాఖ
లేమి బోధించునో ఇంతయే నెరుంగ;
చదువలే లేని నాకు ప్రాజదువు లేడ!

—భీ. కా. కుసుమాలు

అని ఈయన అన్నప్పుడు, ఈ చివరిపాదం నిజంగా హృదయ విదారకం. విశ్వమార్యంగా వికసించవలసిన ఆర్షజాతి ఎందుకు మురికికంటె మూఢమైపోయిందో ఇది వివరిస్తుంది.

పీరుకట్టి, మళ్ళుకట్టి, నారుకట్టి
కంచెయిను కట్టి నన్ను పోషించ రెవరు;
అడవి మొక్కను నేను, స్వేచ్ఛావకాశ
వీధులం దిష్టమై నట్లు విరియుచుంటి!

—భీ. కా. కుసుమాలు

ఒక ముప్పైయేళ్ళ తర్వాత, ఒక మహాసభలో ఈ పద్యంపై రేగిన చిన్న దుమారం గురించి అక్కడే వివరిస్తాను.

ఎవరూ ఏమీ చెప్పకపోయినా, ఛందో లక్షణాలు తెలియకపోయినా, పద్యరచన మాత్రం అనర్ఘళంగా సాగించాడు భీమన్న. మూర్తీభవించిన స్వయంకృషి ఈయన జీవితం.

19. మనిషా? మురుక్కాలవా?

ఇటుప్రక్క మనిషి, అటుప్రక్క మురుక్కాలవ - ఈ రెంటిలో దేన్ని వరిస్తావని అడిగితే, మురుక్కాలవనే వరిస్తా ననే సంస్కారం మన సనాతన పౌరోహిత్యానిది.

సనాతనత అంటే వేద, ఉపనిషత్ యుగధర్మం కాదు. ఆర్ష ధర్మం హిందూమతంగా మారిన స్మృతుల కాలం నుంచీ ఈ పవిత్ర గంగలో చేరిన కాలుష్యాన్నే ఇక్కడ నేను సనాతనతగా పేర్కొంటున్నాను.

మామిడికుదురు చుట్టూ పెదపట్నం, దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు మొదలైన అగ్రహారా లున్నై. అవన్నీ వైనతేయం ఒడ్డునే వున్నై. పాశర్లపూడి నుంచి కాబోలు ఒక బ్రాహ్మణ యువకుడు ఉదయమే మామిడికుదురు శివాలయానికి వెళ్ళి, పన్నెండు గంటల ప్రాంతానికి తిరిగి పోతుండేవాడు. అతడు ఆ ఆలయంలో పూజారి. మామిడికుదురులో కరణంగారి చిన్న కొంప తప్ప బ్రాహ్మలెవరూ లేరు ఆ పురోహితుడికి అంటరానితనం జాస్తిగా వుండేది. అతణ్ణి ఆచారి అనేవాళ్ళు.

రోడ్డుకు ఇటూ అటూ తోటలూ, పొలాలూ వుండేవి. సాధారణంగా మామూల కుర్రవాళ్ళు పశువుల్ని కాచుకొంటూ ఆ రోడ్డు మీద ఆడుకొంటూ వుండేవాళ్లు. బడితేని వేళల్లోను, సెలవుల్లోను భీమన్న కూడ పశువుల్ని కాస్తూ వాళ్ళతో ఆడుతూ వుండేవాడు. రాను రాను ఆచారి పీడ వాళ్ళకు భరించరానిదిగా తయారైంది.

అతడు ఆ వూరి మొగలో వుంటున్న ఒక ఏనాది పిల్లతో తిరుగుతుంటా డని, పైకి నటించేటంత పవిత్ర బ్రాహ్మడు కాదని, ఆతడికి బుద్ధి చెప్పక తప్పదని కొంతమంది కుర్రవాళ్ళు అనసాగారు. ఒక నిర్ణయానికి వచ్చి, అందుకు ఒక పథకం వేసుకొని, ఒకనాడు రోడ్డుకిరువైపులా ఉప్పుటేరు తూములమీద అటు కొందరూ, ఇటు కొందరూ కూర్చున్నారు. అందరూ పది హేనేళ్ళ లోపువాళ్ళు.

ఆచారి ఎండ గొడుగు వేసుకొని, చేతిలో చెంబుతో, మెల్లగా నడుచు కొంటూ అక్కడికి వచ్చాడు. ఇరువైపులా మామా కుంకలు!

తప్పుకోమన్నట్టు చూశాడు. వాళ్ళు మాట్లాడలేదు. ఆజ్ఞాపించాడు. కదల్లేదు. అరిచాడు. ఫలించలేదు. "అంతా ఒక పక్కకు చేరండి. నేను నేను రెండో పక్కనుంచి పోతా" అన్నాడు. ఎవ్వరూ నోరెత్తలేదు.

రోడ్డు క్రిందనుంచి ఉప్పుటేరు ప్రవహిస్తున్నది. దానిలోకి వైనతేయం ద్వారా సముద్రపుపోటు నీరు వస్తుంటుంది కనుక దానికాపేరు. అది నిజానికి మురికినీటి కాలువ. ఆ కాలువమీద రోడ్డు కిరువైపులా ఎత్తుగా అరుగులవలె కట్ట బడ్డ సిమెంటు తూము లవి.

"రోడ్డు ఖాళీగానే వుందిగా, వెళ్ళు! అన్నాడందులో ఒకడు. ఆచారి బ్రాహ్మణ్యపుపోయాడు. ఆ మాత్రపు ధిక్కారింపును అంతవరకెక్కడా వినివుండ లేదతడు! ఏమిటి, కాలం ఇంత హఠాత్తుగా తలకిందు లయింది! మైల గురిం చేదో చెప్పబోయాడు. "మైలంటే ఏమిటి?" అని ఒకడూ, "మైల నీకా, దేవుడికా?" అని మరొకడూ ప్రశ్నలు ప్రారంభించారు. "మాకు మైలలేదు. మేం పవిత్రులం. నీ అవసరం కనుక, నీవే తప్పుకుపో" అన్నారు చివరకు.

ఎలా తప్పుకుపోవడం? ఎటునుంచి పోవాలన్నా ఏరుదిగి పోవాలి! బ్రతిమాలాడు. ప్రార్థించాడు. వాళ్ళు వినలేదు. చివరకు ధైర్యంచేసి పంచె బాగా ఎగ్గట్టి, గొడుగు ముడిచి, చెంబు దాంట్లోవేసి, చెప్పులు చేతపట్టుకొని, ఏట్లో దిగాడు. నీరు ఎంతోలేదు. రెండడుగులు దబదబా వేశాడు. ఊబిలో కూరుకుపోయాడు.

కాసేపు ఏడ్వనిచ్చి, ముట్టుకొండే మైలపడతా మనేది లే దనిపించుకొని, మామా కుర్రలంతా చేరి ఆచారిని బైటకిలాగి, ఒళ్ళంతా కడిగి రోడ్డుమీద నుంచే పంపించారు. ఆ తర్వాతనుంచి అతడు వీళ్ళతో స్నేహంగా వుండే వాడు.

కాళ్ళబడిపోయేటి గడ్డిపూలారా!
సుందరాంగుల జటా శోభ మీకున్నదా?
లోతు సంద్రాలలో పాతుకున్న మణీ?
భరతమాతను గొల్చి భాగ్యమ్ము కల్గినా?

—పాలేరు

20. గొప్పవాడి వవుతావు

పసితనంలో భీమన్న సరదాలు విపరీతంగా వుండేవి. శీతాకాలంలో తెల్ల వారుజామున లేచి కుంపటి కాగుతూ కూర్చునేవాడు. కుంపట్లోని వెలికచ్చిక లను నలపడం ఒక సరదా. ఎవరెన్ని చెప్పినా, తిట్టినా ఆ పనిమాత్రం మానే వాడు కాదు. అప్పుడప్పుడు ఆ కచ్చికలను ఒకటి అరా నోట్లో కూడా వేసు కొంటూ వుండేవాడు.

ప్రొద్దు పొడవకముందే తోటలో ఆరక కట్టేవాడు. ఎనిమిది తొమ్మిది గంటల ప్రాంతంలో తండ్రివచ్చి మేడి పుచ్చుకొనే వరకు దున్నేవాడు. శీత కాలపు మెట్ట దుక్కి చాలవరకు భీమన్న చేతిమీదగానే సాగేది.

తోటలో ఆ రాత్రి రాలిన కొబ్బరాకుల్ని ఐనిపికి చేర్చి, డొలకలను, పీచును ఇంటికి చేర్చేవాడు. పుచ్చెలు, బొండాలు, పండుకాయలు, ఎలక కొట్లు చాల దొరికేవి. అక్క, తమ్ముడు, చెల్లెలు ఈ కార్యకలాపాలలో తోడ్పడేవాళ్ళు.

తొమ్మిది గంటలకు భోజనంచేసి స్కూలుకు బైలుదేరేవాడు. సాధారణంగా ఆ సమయానికి రోడ్డుతూముల వద్ద చెంచయ్య కనిపించేవాడు. ఇద్దరూ కలిసి వెళ్ళేవాళ్ళు. స్కూలు పదిన్నర నుంచి, సాయంత్రం నాలుగున్నర

వరకు . చివరి పీరీడు డ్రిల్లు వుండేది . దుక్కిపని రద్దీగా వున్నప్పుడు డ్రిల్లు ఎగ్గొట్టి ఇంటికి వచ్చేవాడు . అరక కట్టి ప్రొద్దు గూకేవరకు దున్నేవాడు .

రాత్రి కాసేపు ఇనంజీ బుడ్డి దీపం దగ్గర చదువు . ఇనంజీ అంటే కిరసనాయిలు . దీపం మీదకు వంగి చదవడంలో ఎన్నోసార్లు ఈయన ముంగురులు మాడి ఇంటిల్ల పాదినీ మేలుకొల్పేవి .

దీప సభ కావ్యానికి బీజం పడింది చికిలిస్తున్న ఈ దీపం ముందే .

ఏ రుతువు ప్రత్యేకత దానిది . శీతకాలం మరీ శ్రీమంతమైన రుతువు . పేద కల్లాష్ఠులు , ముగ్గులు , పైర్లు , పంటలు . భోగి పిడకలు చేసి కొల్బరి చెట్లకు వేసేవాళ్ళు . ఆరిన తర్వాత తీసి గుదలాలు గుచ్చి దాచేవాళ్లు . ఆరోజుల్లో భోగి సంబర మంతా భీమన్నదే .

ఏటిగట్టు ప్రక్క ఎలిమెంటరీ స్కూలు దగ్గర్లో , పంటకాలవ గట్టున , " కొర్లగుంట " అనే స్థలం వుంది . అక్కడ ప్రతి సంక్రాంతికీ కనుము రోజున గొప్ప ప్రభల తీర్థం జరుగుతుంది . ఆ చుట్టు ప్రక్కల ఎన్నో గ్రామాల నుంచి రకరకాల , రంగు రంగుల ప్రభలు ఆక్కడికి వస్తాయి . సౌందర్య వైభవానికి ఆ ప్రభలే ఆదర్శం భీమన్నకు ఈనాటికీ . బాల్యానుభవాల బలం సాటిలేనిది . పెద్దప్పటి లేపాక్షి బసవన్న కంటె చిన్నప్పటి గంగిరెద్దే స్ఫూర్తిమంతం .

కానీకి రెండు కొబ్బరికాయల చొప్పున అమ్మి , ఆ డబ్బులతో ప్రభల తీర్థానికి వెళ్ళిన సందర్భం ఒకటి ఇప్పటికీ జ్ఞాపకం వుంది భీమన్నకు . కానీకి రెండంటే , నేటి పది పైసలకు పదిహేను కాయ లన్నమాట ! అయితే , ఆనాడు డబ్బుకు విలువా వుండేది , బజారులో నాణ్యమైన సరకూ దొరికేది .

ఆ రోజుల్లో వారానికి కావలసిన సరుకులన్నీ శుక్రవారం సంతలోనే కొనవలసి వుండేది . కేవలం నాలుగైదు అణాలు (ముప్పై పైసలు) పట్టుకెళ్ళి , మాంసం , కూరగాయలు , పిల్లలకు పకోడీలతో సహా అన్ని సరుకులూ తెచ్చేది నాగమ్మగారు .

నీళ్ళలో పుట్టి, నీళ్ళ మధ్య పెరిగినా భీమన్నకు ఈతరాదు. కొబ్బరి చెట్టెక్కడం రాదు. ఒకసారి ఎక్కి, దిగడం చేతగాక, గుది వదిలేసి, పైనుంచి జారా డట. దానితో బోర కొట్టుకుపోయి నెత్తురు కాల్వలయింది. మళ్ళీ కొబ్బరి చెట్టెక్కే ప్రయత్నం చెయ్యలేదు. బొండాలు, కాయలు కావలిస్తే కంకర రాళ్ళతో రాలగొట్టేవాడు.

చుట్టు ప్రక్కల చేలు, కాలువలు, కయ్యలు చేపలతో నిండి వుండేవి. రామలు, బొమ్మిడాయలు, కొరమీన్లు వంటి బురద చేపల్నితానే పట్టేవాడు బురదలో దిగి కాని, గాలంతోగాని. రొయ్యలు, పరిగెలు, పాల పీతలు వగైరా రకాలను తల్లి పట్టి తెచ్చేది. ఆందుకు కావలసిన తిర్రెలు, చేపల బుట్టలు భీమన్న అల్లేవాడు. చేదలు, చాపలు, బుట్టలు, పుటికెలు, విసనకర్రలు, నీరు గూడలు – ఈటి, కొబ్బరి, ఈత ఆకులతో, ఈనలతో, చువ్వలతో, భీమన్న చేయలేని పను లంటూ వుండేవి కావు.

ఈ పనులన్నీ చేస్తూ, పొలం పనుల్లో తోడ్పడుతూ, గరువు మీది ఆల్లరి పిల్లలతో, పాలేరు కుర్రవాళ్ళతో కలిసి కొంచె పనులు కూడ చేస్తుండే వాడు. వాటికి కార్యక్షేత్రం రోడ్డు. కర్మలు ఆచారి లాంటి సంఘ వ్యతిరేక శక్తులు.

ఒక మధ్యాహ్నం ఎండలో ఈ కుర్ర గుంపంతా రోడ్డుమీద చేరి. కర్రలు విసిరే పోటీ ఆట ఆడుకొంటున్నారు. అల్లంత దూరాన ఒక బ్రాహ్మడు ఒంటరిగా వస్తూ కనిపించాడు. అతడు బృహత్కాయుడు. ఆజాను బాహుడు. ప్రౌఢ వయస్కుడు. విభూతి రేఖలు, నొసట బొట్టు, మెడనిండా రుద్రాక్షలు, చేతిలో చెంబు. నల్లగా వున్నాడు. శివాలయం నుంచే వస్తున్నాడు. బృహద్భారంతో, మెల్లగా నడుస్తున్నాడు.

అతడి చుట్టూచేరి కుర్రవాళ్ళు చప్పట్లు కొడుతూ నవ్వసాగారు. అతడు ఆగాడు. వాళ్ళకేసి కళ్లెర్రజేశాడు. వాళ్ళు బెదిరిపోయారు. వాళ్ళలో భీమన్న కనిపించా డతడికి. దగ్గరగా రమ్మని సైగజేశా డతడు. భీమన్న వెళ్ళాడు. అప్పు డీయనను చురుగ్గా చూచి, ఆ పర్వతోన్నతుడు :–

"ఒరే, నీవు గొప్పవాడి వవుతావురా! ఈ ఆల్లరి పిల్లగాళ్ళతో ఎందు కురా చేరతావు?" అన్నాడు. భీమన్న తల వంచుకున్నాడు. అతడు నడిచి వెళ్ళిపోయాడు.

ఆతణ్ణి అంతకు ముందు కాని, మళ్ళీ ఆ తర్వాత కాని చూచిన జ్ఞాపకం లేదు భీమన్నకు. ఆతడి స్వరూపమూ, ఆ మాటలూ మాత్రం మనస్సులో నిత్యనూతనంగా వుండిపోయినై ఈనాటికీ.

విరులు భూమినుండి, మెరుపు మబ్బులనుండి
కాంతి తమనుండి కల్గినట్లు
నిఖిల జీవళ కి నీనుండి ప్రవహించు
వెడలనిమ్ము దాని వెల్లి విరిసి;

—దీప సభ

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

కోరక సర్గ

21. యతి కోసం.

ఇంతవరకు తనకు తానుగా, తనలో తానుగా చిదానందంతో వినోదిస్తున్న భీమన్న - కొంచెం కొంచెంగా బైటి ప్రపంచంలోకి అడుగులు వేస్తున్న కొలదీ, దానితో ఘర్షణ పడడం తప్పనిసరి అవుతూ వచ్చింది. సత్యనిష్ఠ కల వాడికి ఈ ఘర్షణ అధికంగా వుంటుంది. అది సత్యం చేసుకొన్న పాపం.

లోకం గతాను గతికం. దాన్ని నిలబెట్టి ప్రశ్నించే గుణం పుట్టుక నుంచే వచ్చింది భీమన్నకు.

అందరూ పైకి చూస్తున్నప్పుడు
నేను క్రిందికి చూస్తాను
పచ్చని చేలు, పైరు పంటలు, తోటలు
రైతు బిడ్డలు, వదీ కాంతలు, కళలు
ఆనందం విరుస్తుంది నాలో
ఆకాశానికి పొంగుతుంది అమృతం!
అందరూ క్రిందికి చూస్తున్నప్పుడు
నేను పైకి చూస్తాను
చుక్కలో, చంద్రుడో, సూర్యుడో
మబ్బులో, మెరుపులో, మాయా శూన్యమో
అమృతం కురుస్తుంది నాపై
ఆనందం విరుస్తుంది నాలో!

— గుడిపెలు

అంటూ తన మనస్తత్వాన్ని తానే చెప్పుకొన్నా డొక కవితలో. ఒకే కోణం నుంచి చూడడం పాఠిక దర్శనమే అవుతుంది. మెజారిటీ ప్రజలు ఆట్టి దోషానికి బలై పోతున్నప్పుడు అడ్డుకోవడం తన ధర్మం అంటాడు.

ఒకే వస్తువు తూర్పు నుంచి చూసేవాడికి పడమట వుంటే, పడమర నుంచి చూచేవాడికి తూర్పున వుంటుంది. అది దృక్పథ వైరుధ్యమే కాని వస్తు దోషం కాదు. సమగ్ర దర్శనం ద్వారా తాను చూచిన సత్యాన్ని నిర్మొగమోటంగా చెపుతూ వుండడంవల్ల, ఈయన ఒక కాంట్రోవర్షియల్ ఫిగర్ (వివాదాస్పద వ్యక్తి) గా పేరు తెచ్చుకున్నాడు కూడ.

ఈయన సెకండ్ ఫారమ్ చదివేటప్పుడు ఒక పేచీ జరిగింది తన క్లాసులో పెచ్చెట్టి వీరన్న అనే ఒక మిత్రు డుండేవాడు. అతడు కొంచెం ఆవేశపరుడు. మరి ఈ ఇద్దరికీ ఏ విషయంలో పేచీ వచ్చిందో తెలియదు -

ఆ రోజే తెచ్చెద నని
ఈ రోజుకు కూడ తేవు, ఏమనుకొందున్
ఔరా, ఎంతటి మోసము;
ఈరన్నా, నమ్మగూడ దింకన్ నిన్నున్;

అని పద్యం వ్రాశా డీయన. ఇది వీరన్న కంఖించా రెవరో. అతడు కోపంతో భగ్గుమన్నాడు. క్లాసులో టీచరు లేడు. వీరన్నే ఆ స్థానంలో నిలబడి భీమన్నను తిడుతూ ఉపన్యాసం మొదలు పెట్టాడు.

"నా కమ్మా పద్యాలు రాయడం వచ్చునని, కన్నూ మిన్నూ కనిపించడం లేదీయన గారికి. ఏ దేవుడి మీదో రాసుకోగూడదా, వీళ్ళ నాన్నలాగ? మేమంతా చందా లిస్తాం అచ్చొత్తించుకోడానికి..." ఇలా సాగిం దది.

పల్లయ్యగారి వేదాంత కీర్తనలు అప్పటికి బాగా ప్రచారంలో వున్నాయి.

"ఈరన్నట, ఈరన్న!" అన్నాడతడు కసిగా - వీరన్న అనడం కూడ చేతకా దన్న హేళనను మిళాయించి - ఒక విమర్శక పండితుడిలా!

"మరి, వీరన్న అంటే యతిపోతుంది" అన్నాడు భీమన్న

య తంటే ఏమి టన్నది మళ్ళీ ఒక ప్రశ్న. పాదంలో విరామ స్థానం దగ్గర మొదటి అక్షరం మళ్ళీ రావా లనేది తప్పితే, ఎక్కువేమీ తెలియదు భీమన్నకు కూడ. గణాలు రాకపోతే గండా లొస్తా యనే భయం వుండనే వుంది. యతిపోతే మతే పోతుందేయో!

వెంకి ఎంకి అయినట్టే వీరన్న ఈరన్న అవుతాడని చెప్పగల పాండిత్యం ఈయన కానా డెక్కడిది?

అంతలో తెలుగు మాష్టారు క్లాసులో కొచ్చారు. సంగ తంతా విన్నారు. "భీమన్న కవిత్వమూ, గమళ్ళ గంగమ్మ కవిత్వమూను. కూర్చోండి!" అన్నారాయన.

నగరం మిడిల్‌స్కూలు ఒక ముస్లిం ధనవంతుల మేడలోని మండువాలో వుంది. ఇంటి యజమానుల కుటుంబం వెనక భాగంలో వుంటుంది. ఎదర భాగం రోడ్డు మీదకు వుంది. మేడమీద రెండు గదులున్నాయి. ఒకటి హెడ్మా ష్టారి గది. రెండోది ఆఫీసు గది.

మేడకు పడమట, ప్రహరి గోడ వెలపల ఒక కల్లు దుకాణం వుంది. దాని యజమానురాలు గమళ్ళ గంగమ్మ. తెలుగు మాష్టారు భీమన్న కవిత్వంతో పోలికకు తెచ్చిన "సాక్షి" ఆమే! అప్పటిదాకా ఆమె ఎవరో భీమన్నకు తెలియదు.

అంతలో - హెడ్మాష్టారు రమ్మన్నా రంటూ కబురు వచ్చింది భీమన్నకు. వణికి పోయాడు భయంతో.

భయపడకోయీ, ఆ
భ్యుదయం నీదే నోయీ!
బాల్యం నుంచీ శిక్షణ
భారతీయతకు రక్షణ
ఏక నీతిపై జాతిని
ఈశ్వరతకు నడిపించు!

— భీమన్న ప్రగతి గీతాలు

22. సరస్వతి తెచ్చిన లక్ష్మి

టెలిగ్రాం వచ్చిందంటే, అందులో ఏముందో చూడకుండానే, ఇల్లంతా గొల్లుమనే రోజు లవి. టెలిగ్రాం అంటే చావు కబు రనే!

హెడ్మాష్టారు రమ్మన్నారంటే - కొట్టడానికో, తిట్టడానికో అనేదే రూఢి.

వీరన్నమీద పద్యం వ్రాయడం నేరమే కావచ్చు. లేక, తనవల్ల మరే దైనా తప్పు జరిగిందో! భయపడుతూనే మేడ మెట్లెక్కాడు భీమన్న. వీరన్న ఫిర్యాదు చేసివుండడు. న్యాయ నిర్ణయాన్ని అవసరమైతే తన చేతిలోకే తీసుకునే రాజసం వీరన్నది. మరొకళ్ళకి ఫిర్యాదు చేసే చచ్చు స్వభావంకాదు. అయితే – హెడ్మాష్టారు ఎందుకు రమ్మన్నట్టు?

"ఏరా, బాగా చదువుతున్నావా?" అన్నారు హెడ్మాష్టారు ఆయన ముఖంలో కోపం వున్నట్టులేదు.

భీమన్న కొంచెం తొణికాడు. చేతులు కట్టుకు నిలబడ్డాడు. హెడ్మాష్టారి ఎదురుగా కుర్చీలో కూర్చున్న ఒక అధికారి తనవంకే చూస్తున్నాడు.

"బాగా చదువుకో. నీవు బాగా చదువుతావనే, గవర్నమెంటుకు వ్రాసి స్కాలర్షిప్పు తెప్పించాను. ఇన్స్పెక్టరుగారు అందుకే వచ్చారు" అన్నారాయన.

భయం ఒక్క క్షణంలో ఆనందంగా మారడంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు భీమన్న.

"నీవు పల్లయ్యగారి అబ్బాయివా!" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించాడా ఇన్స్పెక్టరు. రసీదుమీద సంతకం చెయ్యించుకొని, డబ్బు లెక్కపెట్టి అందిచ్చాడు.

భీమన్నకు మెట్టమొదటగా స్కాలర్షిప్పును అందజేసిన ఆ ఇన్స్పెక్టరే జి. జె. సామ్యూలుగారు. ఆయన అప్పటికే సుప్రసిద్ధుడైన కవి. ఆయన పద్యాలు భారతిలో పడుతుండేవి.

తనకంత ఉపకారం చేసిన అ హెడ్మాష్టా రెవరో తిన్నగా జ్ఞాపకం లేదిప్పుడు భీమన్నకు. దువ్వూరి సుబ్బారావుగారా, అంతకు ముందున్నవారా అని సంశయం. దువ్వూరి సుబ్బారావుగారైతే బాగా జ్ఞాపకం వున్నారు. భీమన్నను ఎంతో అభిమానించిన టీచ రాయన. విద్యార్థికి తెలియకుండానే, అతణ్ని టీచరు ఎంతగా ప్రేమించవచ్చో, ఎంతగా సహాయపడవచ్చో నిరూపించి చూపిన ఆదర్శ పురుషుడు దువ్వూరి సుబ్బారావుగారు.

సెకండుఫారంలో వచ్చిన సాలర్షిప్పు బి.ఏ. పూర్తి అయేవరకు కొన సాగింది భీమన్నకు. పల్లయ్యగారి చేతికింద ఎన్నితోటలు, పొలాలు వున్నా, అవన్నీ కౌలుకు తీసుకొన్నట్టివే. వ్యవసాయం ఆడంబరంగా సాగేది. మిగలడం మాత్రం వుండేదికాదు. ఎప్పుడూ డబ్బుకు కటకటగానే వుండేది. అట్టి స్థితిలో నెలకు మూడున్నర రూపాయలు రావడ మంటే చాల గొప్ప. కొడుకు చదువును గురించిన చింత తొలగడంతో, మానసికమైన తృప్తి ఏర్పడి, పల్లయ్యగా రెంతో ఆనందపడ్డారు.

తన పురోభివృద్ధికి ఆటంకం కాగల ఒక ప్రాథమిక సమస్యను ఆ విధంగా పరిష్కరించివేసింది తన ఆరాధ్య దేవత సరస్వతి.

ప్రారబ్ధం పండుటాకులు
వాకిట్లో జల జల రాలినప్పుడు
గాలిదేవర ఇంటి నౌక రెవడో
వాటిని తుడిచి పారబోసినప్పుడు
అప్పుడే అనుకొన్నాను నేను
అతిథు లెవరో వస్తున్నారని !
పొగమంచు బూజును దులిపి
పట్టు తెరలు కడుతున్నప్పుడు
చల్లని కను దమ్ముల కమ్మని కల్లాపులపై
చిటి ముత్యాల ముగ్గులు పెడుతున్నప్పుడు
ఆ వస్తున్న అతిథు లెవరో
అందాల రాసులే అనుకున్నాను !

— అనాది కొస నుంచి

23. అదృష్ట దీపిక

మహాభారత తెలుగు అనువాదానికి నన్నయ పూనుకొన్ననాటి నుంచీ తెలుగు సాహిత్యానికి రాజమండ్రే కేంద్రంగా వుంటూ వస్తున్నది. నానారకాల పుస్తకాలనూ చవగ్గా అచ్చొత్తి అమ్మడంలో ఈ నాటికీ రాజమండిదే పైచేయి. ఒప్పుల కండే అచ్చుతప్పులే ఎక్కువ కావచ్చు. లేని మామకంటె గొడ్డుమామ దొడ్డ కదా.

భీమన్న జీవితంలో పోస్టు ద్వారా తెప్పించుకొన్న మొట్టమొదటి పుస్తకం రాజమండ్రి నుంచే. సెకండు ఫారం చదువుతుండగా తెప్పించుకొన్న ఆ పుస్తకం పేరు "అదృష్ట దీపిక". అప్పుడే మరో పుస్తకం కూడ కొన్నాడు. దాని పేరు "ఇంద్రజాల మహేంద్రజాలం"!

ఒక రెండు మూడేళ్ళపాటు ఆ రెండు పుస్తకాలూ ఈయన ముగ్ధ జీవిత రథాన్ని రెండు చక్రాలై నడిపించినై.

మనిషి అదృష్టాన్ని, భవిష్యత్తును చెప్పడానికి కావలసిన భోగట్టా అంతా వుండే ఒక సర్వసమగ్ర గ్రంథం అదృష్ట దీపిక. రాశులు, చక్రాలు, గళ్ళు, అంకెలు, గవ్వజోస్యం, పువ్వు జోస్యం, ప్రశ్నలు, శకునాలు, స్వప్నాలు, పుట్టుమచ్చలు, హస్తసాముద్రికం, సంఖ్యాశాస్త్రం - ఒకటేమిటి - ఏ విధంగా కావలసివస్తే ఆ విధంగా - భూత భవిష్యత్తులు ఇట్టే చెప్పేస్తూ వుండేవాడు - అడిగిన వాళ్ళకీ, అడగని వాళ్ళకూ కూడ!

ఒకసారి ఒక వదినగారు ఈయనను పిల్చి, ఫలహారంపెట్టి, ప్రశ్న అడిగింది. ఆ ప్రశ్నకు జవాబు "బ్రహ్మ పెండ్లి" అని వచ్చింది. బ్రహ్మ పెండ్లి అంటే ఏమిటి? బ్రహ్మయొక్క పెండ్లి! చాల గొప్పదన్న మాట! కోరిక గొప్పగా ఫలిస్తుందని చెప్పాడు భీమన్న. ఆమె ఆలోచనలో పడింది.

ఆ సమీపంలో వున్న ఆమె తమ్ముడు కల్పించుకొని "బ్రహ్మ పెండ్లి అంటే అసాధ్యం అని అర్థం" అన్నాడు. "వీరాస్వామి చెప్పిందే నిజం కావచ్చు" అన్నదామె. ఈ ఎల్లమల్లి వీరాస్వామి అప్పటికే టీచరు. భీమన్నకు

చాల మిత్రుడు. అప్పు డర్థమయింది భీమన్నకు - వాచ్యార్థానికి. ధ్వ్యర్థానికీ వుండే తేడా. చరాచర వర్గాలకే కాదు, భాషకు కూడ శరీరం కంటె ఆత్మే ముఖ్యమని ఆనాడే అవగాహనలోకి వచ్చిం దనుకోవాలి.

అదృష్ట దీపిక కంటె ఇంద్రజాల మహేంద్రజాలమే ఈయనను ఎక్కువ ప్రేపులు పెట్టింది. గారడీ, కనికట్టు, హస్తలాఘవం మొదలైన విద్యలకు సంబంధించిన యోగాలూ, ప్రయోగాలూ వందలకొలది వున్నై ఆ గ్రంథంలో. వాటి సాధనకోసం, సిద్ధికోసం ఈయన పడని అవస్థలంటూ లేవు.

గుడ్లగూబ కనుగ్రుడ్డుతో చేసిన కాటుక పెట్టుకొంటే చీకట్లో స్పష్టంగా చూడవచ్చునట! గుడ్లగూబను పట్టుకోవడానికి ఈయన ఎన్నో ప్రేపులుపడ్డాడు. నల్లురు కుర్ర నేస్తాలను వెంటవేసుకొని, ఎన్నో రాత్రులు తోటల వెంట తిరిగి, చివరకు ఒక గుడ్లగూబను పట్టుకొని, కాటుక తయారుచేసి, ఒక రాత్రి దీపం ఆర్పివేసి దాన్ని కండ్లకు పెట్టుకొన్నాడట. అంతే, ఆ తరువాత నాల్గు రోజుల దాకా పగలు కూడ తిన్నగా కళ్ళు తెరవలేకపోయాడు.

ఇలాగే – ఆదృశ్యకరణి కోసం గ్రద్దగుడ్లలో పాదరసం పోయడం, మనోవేగంకోసం వెయ్యేళ్ళు నిండి రెక్కలు వచ్చిన సర్పాలకోసం గాలించడం, సంజీవి మూలికకోసం చెముడు కాకిపిల్లని దాని గూట్లోనే కట్టివేయడం వగైరా సాధ్యం కాకపోయినా - హస్త లాఘవ విద్యలు, పేకముక్కల గారడీలు నేర్చి తోటివాళ్ళను అలరిస్తూ వుండేవాడు. సర్కస్ చూచివచ్చి ఆ ఫీట్లన్నీ చేసే వాడు. తోలుబొమ్మలాట చూచిన తరువాత అట్టలతో బొమ్మలు కత్తిరించి తానే ప్రదర్శన లిచ్చేవాడు. ఇలా ఎన్నెన్నో.

అదే సమయంలో ఒక కుంటివాడు మామిడికుదురు వచ్చాడు. కొంచెం చదువుకున్నవాడు. అభిమానవంతుడుగా కన్పించాడు. గౌరవంగా బ్రతికేదారి ఏదయినా చూపమని పల్లయ్యగారిని ఆశ్రయించాడు. గరువు మీద పిల్లలకు స్కూలేదీ లేకపోవడంవల్ల, అతణ్ని టీచరుగా పెట్టి ఒక పాఠశాలను స్థాపించారు పల్లయ్యగారు. దానికి సర్కారు గుర్తింపు కూడ లభించింది. గ్రాంటూ వచ్చింది.

ఆ కుంటి పంతులు నడవలేడు. బహుశా పోలియో వల్ల కావచ్చు, రెండు కాళ్లూ చిన్న ఊచల్లా వంకరతిరిగి వుండేవి. శరీరమూ, తలా మాత్రం చాల గంభీరంగా వుండేవి. కొద్ది దూరమయితే అతడు పాకి వెళ్ళేవాడు. దూరం ఎక్కువయితే యిద్దరు మనుషులు చేతుల మీద మోయవలసి వచ్చేది. ఈ మోత తరచు భీమన్న మీద పడేది. ఒక సంవత్సరం పాటు మోశాడు, ఎన్నో సేవలు చేశాడు అతనికి భీమన్న. తీరిక దొరికితే చాలు, పోయి అతడితోనే కూర్చొనేవాడు. కారణం - అతడికి రకరకాల గారడీ విద్యలు రావడం.

కాగితం మడిచి చెవిలో పెట్టుకొని అందులో ఏమి వ్రాసి వున్నదో చెప్పడం ఎంత అద్భుతం! ఆ విద్యను సాధించడం కోసం ఎన్నో మూలికల్ని, ఆకుల్ని తినిపించా డా పంతులు భీమన్నచేత. చివరకు భీమన్నే కనిపెట్టేశా డా కిటుకు. ఆ తర్వాత ఈయనే ప్రదర్శించేవా డా విద్యను గొప్పగా. ఆ కుంటి పంతులు గొప్ప రసికుడూ, భూత వైద్యుడూ కూడా. ఆ చుట్టు ప్రక్కల ఎంతో మంది అనాధలతో సంబంధాలు పెట్టుకొని, భూగర్భ నిధుల్ని పైకి తీస్తా నని ఎంతో మందిని నమ్మించి మోసం చేసి, చివరకు ఒక స్త్రీని లేవదీసుకొని పరారయ్యా డతడు.

అప్పటికే ఆ పంతులు వయస్సు నలభై వరకూ వుండేది. అత డెక్కడయినా కనిపిస్తాడేమోనని ఇప్పటికీ వెతుకుతూ వుంటాడు భీమన్న - రోడ్ల మీద కుంటివాళ్ళల్లో. అతడి పట్ల ఈయనకు కుదిరిన భక్తి అంత గాఢమయించి.

కోరుకో, కోరుకో
కోరుకొని - గమ్యం చేరుకో!

వెదురు పొదల జనించినా
వేణువుగా మోరయా లని
ముల కంపే లతించినా
గులాబివై విరియా లని
పల్లెకోన మొగ్గవైన
వాణి వేణి కెదగా లని
చీకటిలో చితుకువైన
జీవాగ్నిగ మండా లని

— భీ. ప్ర. గీతాలు

24. కవిజనాశ్రయం

"అప్పనా తనా మనా, మారోరి బైరన్నా! మారోరి బైరన్నా"! వంటి పల్లె పాటలు -

"పార్వతీ పతి తెల్పు, పాల సముద్రము తెల్పు, ఐరావతము తెల్పు, హంస తెల్పు" వంటి రంగుల పద్యాలు -

"బుకు మల్లు రైకలో బొంచుండి....." వంటి కామ శృంగార ప్రకోపకాలు -

ఇలాంటి వెన్నో చిన్న చిన్న పుస్తకాలుగా నగరం సంతలో అమ్ముతూ వుండేవాళ్ళు. వాళ్ళు ఆయా పుస్తకాల్లోని పాటల్నీ, పద్యాల్నీ గొంతెత్తి శ్రావ్యంగా పాడుతూ మరీ అమ్మేవాళ్ళు. పుస్తకాలు వందలూ, వేలూ ఖర్చై పోతూ వుండేవి. ఈ రకం పుస్తకాలన్నిటినీ ఒకటీ విడిచి పెట్టకుండా కొనేవాడు భీమన్న.

అయితే -

"పాలిండ్లపై నున్న పయ్యెద జారించు", "గోవులవెంట ద్రిమ్మరుచు... సంభావితమైన నీ చరణ పద్మము చన్నుల మీద మోపి..." వంటి భాగవత గోపికా గీతలలో నిత్యం మునిగివుండే భీమన్నకు, నేటి సినీ శృంగారంలాగే నాటి సంత శృంగారం కూడా రుచించేది కాదు.

భీమన్న పద్య శిల్పానికి పోతన్నగారి దశమస్కంధం ఆదర్శంగావున్నా, భావ ప్రేరణ మాత్రం తన చుట్టూవుండే పల్లెపడుచుల నుంచే లభించేది. సౌంద ర్యారాధకుడు కనుక, ఆదెక్కడున్నా ఆకర్షించేది. ప్రకృతినే ఒక స్త్రీ మూర్తిగా చూచే ఈయనకు, స్త్రీని రసదేవతగా దర్శించడం అలవాటైపోయింది. అందులో దర్శనీయలైన షోడశులు, అష్టాదశులు ఈయనను ఎక్కువగా ఆకట్టు కొనే వాళ్ళు. గరువు మీది అలాంటి శృంగారవతులు కొందరు పిల్లవాడైన ఈయనను మచ్చిక చేసుకొని, తమ మీద పాటలు కట్టించుకొని ఆనందించే వాళ్ళు కూడ.

పన్నెండేళ్ళ లోపు ప్రతి బాలకుడూ బాలకృష్ణుడే అంటా డీయన . స్వభావతా అంతే . అలాగే , పాతికేళ్ళ ప్రతి రమణీ రాధే .

ప్రతి పురుషుడు బ్రహ్మయె , ప్రతి
సతియు సరస్వతియె.....

అంటూ దీప సభలో ఈయన వ్రాసిన పద్యానికి ఆధార భావం అదే .

భీమన్న బాల్యం ఒక ప్రణయార్ణవం . దాన్ని మధించే కొలదీ ఎంతో రమణీయార్థం పుట్టుకొస్తూ వుంటుంది

ఈ విధంగా నగరం మిడిల్ స్కూల్లో థర్డు ఫారం పూర్తయింది . పెద్ద పరీక్ష లైపోయినై . ఆ మర్నాటినుంచి వేసవి శెలవులు . ఆ రోజు శుక్రవారం. సంతరోజు . ఉపాధ్యాయులు , విద్యార్థులు కూడా ఎక్కువ భాగం సంతలోనే తిరుగుతున్నారు.

భీమన్న భుజం మీద ఎవరిదో చెయి పడింది . ఆయ నొక అపరిచిత వ్యక్తి . పొడుగ్గా వున్నాడు . యువకుడు .

" మీరే కదా బోయి భీమన్న "? అన్నా డాయన .

" అవు నండీ "

" మీరు పద్యాలు ప్రాస్తారని కొందరు మిత్రులు చెప్పారు . నా వద్ద ఒక లక్షణ గ్రంథం వుంది . మీ కిస్తాను . చదవండి . "

ఒక చక్కని గ్రంథాన్ని భీమన్నకు అందజేశా డాయన . అది వేములవాడ భీమకవిది . కవి జనాశ్రయం ! ఏం అదృష్టం ! ఎంత ఆనందం !

ఆయనే తానువ్రాసిన పుస్తకం అని చెపుతూ మరో చిన్న గ్రంథాన్ని అందజేశాడు . ఆది శ్రీపతి శతకం . రచయిత గుబ్బల వీరాస్వామి !

ఓహో , గుబ్బల వీరాస్వామి అంటే ఈయ నన్నమాట ! ఎంత గొప్ప వాడు . వెతుక్కుంటూ వచ్చి , ఎంత అదృష్టాన్ని తన కందజేశాడు !

ఆయన పేరు అంతకు ముందే భీమన్న విని వున్నాడు. నగరం స్కూలు పాత విద్యార్థులలో పద్యాలు బాగా వ్రాసేవాడు అయన ఒక్కడే అని చాలమంది చెప్పుకొనేవారు. అయనను ఇంతటి ఉదార వరద హస్తుడుగా చూచి, భీమన్న పట్టలేని సంతోషంతో చేతులు మోడ్చి నిలబడిపోయాడు.

దేనికోసం ఇంతకాలంగా ఆరాటపడుతున్నాడో, ఆది అయాచితంగా లభించిం దానాడు భీమన్నకు.

భీమన్నకు ఏది లభించినా – అనుకోని రీతిలో అయాచితంగా లభించి నట్టిదే జీవితం పొడుగునా!

ఇవటనే పగుటినో
అచటనే పిగుటినో
ఎట నేమి జరుగునో
ఈ బుడగ మనుగడను!
చనిన దూరపు చింత వీడు - ప్రియతమా
అనుభవమ్ములె లెక్కచూడు!

— రాఖీలు

25. గడిచిన గండం

"అబ్బాయిని ట్రైనింగుకు పంపి, టీచరుగా స్థిరపరచడం మంచిది. మీకు కాస్త అక్కరకు వస్తాడు" అంటూ, పల్లయ్యగారికి సలహా ఇచ్చారు నేరేడుమల్లి జగన్నాథంగారు.

జగన్నాథంగారు పల్లయ్యగారి ముఖ్య శిష్యులలో ఒకరు. మామిడికుదురులో ప్రాథమికోపాధ్యాయులు. తన కొడుకు చదువు మానిపించి, ఆ ముందు సంవత్సరమే ట్రైనింగ్‌లో చేర్పించారు. ఆయన మాటంటే పల్లయ్యగారికి బాగా గురి!

భీమన్న మంచి మార్కులతో థర్డుఫారం పాసైనాడు ఈ సంగతి సెలవుల్లోనే తెలిసింది. జగన్నాథంగారి సలహా తన గుండెల్లో రాయిలా పడింది.

కథా నిలయం
2475
61

"రేపు రాజోలు వెళ్ళి, చంద్రయ్యగారి చేత ట్రైనింగు దరఖాస్తు రాయించి ఆ తర్వాత ఏం చెయ్యాలో ఆ పనంతా ఆయన్నే చూడమను. వెళ్ళి, చీకటి పడకుండా వచ్చెయ్ !" ఆజ్ఞాపించాడు పల్లయ్యగారు !

ఏమిటి చెయ్యడం ? తనకు ట్రైనింగు ఇష్టంలేదు . ఇంకా పైకి చదవాలి. ఆ మాటే తండ్రితో చెప్పాడు . ఆయన వినిపించుకోలేదు . తల్లి వద్ద ఏడిస్తే, ఆమె మాత్రం ఏం చెయ్యగలదు ?

మర్నాడు రాజోలు వెళ్ళాడు .

రాజోలు మామిడికుదురుకు అరు మైళ్లు . సరాసరి రోడ్డు . సఖినేటిపల్లి వశిష్ఠ రేవు నుంచి , పాశర్లపూడి వైనతేయం రేవుకు వెళ్ళే హైరోడ్డది . రాజోలు కూడ వశిష్ఠ ఒడ్డునే వుంది . తాలూకా కేంద్రం . పాశర్లపూడి , మామిడికుదురు, నగరం , జగ్గన్నపేట , తాటిపాక , పొదలాడ , రాజోలు - రోడ్డువెంట ఈ గ్రామాలన్నీ సాధారణంగా కలిసే వుంటాయి . రోడ్డు ప్రక్కల రకరకాల చెట్లు వుంటాయి . నడక ఆహ్లాదకరంగా వుంటుంది . ఆడుతూ , పాడుతూ నడిచినా రెండు గంటల ప్రయాణం .

భీమన్న వెళ్లేటప్పటికి చంద్రయ్యగారు ఇంటివద్ద లేరు . మండువా ఇల్లు అది . చాలా పెద్దది . చుట్టూ చెట్లు . వాకిట్లోఒక బావి . ఎంతో హాయిగా వుంది .

బావి నుంచి నీళ్ళు చేది , కాళ్ళు కడుక్కుని , ఇంట్లోకి వెళ్ళిపోయిందొక అమ్మాయి . ఒక చిన్న దేవకన్యలా వున్నదనుకొన్నాడు భీమన్న . తానుకూడ బావివద్ద ఎండనూ , అలసటనూ కడిగేసుకొని , అరుగెక్కి , అక్కడున్న ఒక కుర్చీలో కూర్చున్నాడు .

చంద్రయ్యగారు టీచరే కాక , ఆ తాలూకా మామా లందరికీ నాయకుడు . కొంచెం డబ్బున్నవాడు . పరువు మర్యాదలలో తక్కిన కులాల నాయకు లెవరికీ తీసిపోనివాడు . ఆయన వచ్చేవరకు కూర్చున్నాడు భీమన్న . వేచి వుండడం విసుగనిపించలేదు !

చంద్రయ్యగారు వచ్చారు. ఆయన కూడ పల్లయ్యగారి శిష్యుడే. గురువు గారి ఆజ్ఞ విన్నారు. కాగితమూ, కలమూ తెచ్చి, భీమన్న చేతి కిస్తూ, "సరే, దరఖాస్తు వ్రాయి, చెపుతాను" అన్నారు.

ఆ అరుగు మీదే కొంచెంసేపు ఇటూఅటూ పచారుచేసి, మంచినీళ్ళు తాగావా అని అడిగి, ముఖంలోకి ఒకసారి మళ్ళీ చూచి, "నీ వయ స్సెంత?" అన్నారు.

పదహారో యేడు, ట్రైనింగుకు వయస్సు చాలదు!

"నీ కిప్పుడే ట్రైనింగు ఎందుకు? చదువంటే ఇష్టంలేదా?" అన్నారు.

"అయ్యో, ఎందుకిష్టం లేదు? ట్రైనింగే ఇష్టంలేదు. మా అయ్య బలవంతం మీద వచ్చాను" అన్నాడు భీమన్న.

"మీ అయ్యకు నేను చెపుతానులే. స్కాలర్‌షిప్ కూడ వుందిగా? ఇక్కడ ఫోర్తుఫారంలో చేరు!" అన్నా రాయన!

అబ్బ, ఎంత రిలీఫ్! ఎంతటి గండం గడిచింది!

ఆ విధంగా ట్రైనింగుకోసం దరఖాస్తు ఫోర్తుఫారంలో సీటుకోసం దరఖాస్తుగా మారింది. జరిగిం దంతా విని – పల్లయ్యగారు మరి మాట్లాడలేదు.

భూతకాంపు లోతు లోతుల నెంత
పంక మున్నను పైని పద్మాలె పూచు,
ప్రత్యూష ముదయించు రజని గర్భమున
ఆనందమునకు పునాది దుఃఖ మొకో!

—మధు బాల

26. ఒరే, బెం చెక్కు

"ఒరే బెం చెక్కరా!" అన్నారు శేషగిరిరావు మాష్టారు, క్లాసులోకి వచ్చి కూర్చుని, క్లా సందర్శి పరికించి, భీమన్నను వేలుతో చూపుతూ.

భీమన్న బెదిరి, తాను కాకుండా వుండాలని కోరుకొంటూ, ఇటూ అటూ చూశాడు.

"నిన్నేరా, బెం చెక్కు!"

బెం చెక్కాడు భీమన్న - ఇంతలో ఏం మునిగిందా అనుకొంటూ.

"అందరూ వాడికేసి చూడండ్రా!" అన్నారు మాష్టారు. కుర్రవాళ్ళం దరి కళ్ళూ, సుమారు ఎనభై కళ్ళు, ఒక్కసారిగా భీమన్న ముఖంమీద వాలాయి!

ఆది రాజోలు హైస్కూలులో ఫోర్తు ఫారం క్లాసు. ఆయన సైన్సు మాష్టారు. తిమ్మరాజు శేషగిరిరావుగారు. ట్రాన్సులేషనుకు కూడా ఆయనే. అది ట్రాన్సులేషను పిరీడు.

ఆ రోజుల్లో భీమన్న వేషం - నెత్తిన పిలక, నొసట నల్లని సిలాయి బొట్టు, బిళ్ళ గోచీ పంచె కట్టూ! తెల్లటి జామ పండులా, వేదకాలంనాటి వటువులా వుండేవాడు. వాళ్ళ నాన్నగారికి ఇష్టమైన వేషం అది. చిన్నప్పటి చెవుల పోగులూ, ముక్కు కూడా మిడిల్ స్కూలులోనే తీసేశాడు.

"అందరూ బాగా చూశార్రా వాణ్ణి?" అని, మాష్టారు నవ్వుతూ అన్నారు – "వాడురా నిజమైన బ్రాహ్మడు!"

ఆయన అలా ఎందుకన్నారో! తన వేషం పట్ల ఆక్షేప ణేమో!

అంతలోనే, కూర్చోమని చెపుతూ, తనతో తెచ్చిన ట్రాన్సులేషన్ పేపర్ల కట్ట విప్పి, మొదటిదాన్ని భీమన్నకే ఇస్తూ, మార్కులు ప్రకటించా రాయన. ఫస్టు మార్కు! ఇరవైకి ఇరవై!

భవిష్యత్తులో ప్రభుత్వ అనువాదశాఖకు ఈయన డైరెక్టరవుతా డనడా నికి ఇది సూచనేమో!

భీమన్నకు చదివింది బాగా ఒంటపడుతుందేగాని, ఏదీ కంఠస్థం కాదు కదా. ఎన్నోసార్లు చూస్తేనేతప్ప వ్యక్తులు కూడ జ్ఞాపకం వుండ రీయనకు. ఇది ఈయనను రాజకీయాలకు దూరం చేసింది. పద్యాలు, తేదీలు జ్ఞాపకం వుండవు. ఇది వక్తృత్వానికి దూరం చేసింది. థీరమ్ను ఫార్ములాలు జ్ఞాపకం వుండవు ఇది లెక్కలకు, సైన్సుకు దూరం చేసింది. వచ్చిన ఉత్తరాలు, కార్యక్రమాలు జ్ఞాపకం వుండవు. ఇది మిత్రులకు, బంధువులకు దూరం చేసింది.

అయితే - తెలుగు మాష్టారు చిల్లరిగె యోగానందయ్యగారు మాత్రం ఈయనను వదిలిపెట్టలేదు. పోతన్నగారి గజేంద్రమోక్షాన్ని చావగొట్టి కంఠస్థం చెయ్యించా డాయన ఈయనచేత. "ఆది మరియు మాతులుంగ లవంగ లుంగ చూత కేతకి" వచనాన్ని సైతం వదిలిపెట్టలేదు.

గజేంద్రమోక్షం ఫోర్తుఫారం తెలుగు టెక్ట్సు. యోగానందయ్యగారు యోగానంద రామాయణాన్ని వ్రాసిన పండిత కవి. గొప్ప టీచరు. పద్యాన్ని శ్రావ్యంగా శంకరాభరణంలో చదువుతూ, పాఠాన్ని హరికథలా చెప్పేవాడు. ఏదో కారణంగా స్కూలుకు సెలవు పెట్టిన విద్యార్థులు కూడ తెలుగు క్లాసుకు మాత్రం వచ్చి పోతుండేవారు. అంత ఉత్తేజికంగా వుండే దాయన క్లాసు.

ఫిఫ్తు ఫారంలో భీమన్న గ్రూపు మేథమెటిక్సు, ఫిజిక్సు. మేథమెటిక్సులో ఆల్జిబ్రా, జామట్రీ అని రెండు భాగాలుండేవి. అందులో మూలసూత్రాలు కంఠస్థం కావాలి. భీమన్నకు కావు. అందువల్ల ఒకసారి ప్రాణం విసిగి, ఆ మాష్టారు గార్లంక వీరవేంకట సత్యనారాయణగారు జామట్రీ థీరమ్ను ఆన్నిటిని ఏభయ్యేసి సార్లు ఇంపోజిషన్ వ్రాయించా రట!

గార్లంకవారు గొప్ప సంస్కారమూ. ఉన్నతాదర్శాలూ కల టీచరు. స్వచ్ఛమైన తెల్లటి ఇస్త్రీ దుస్తులతో కడిగిన ముత్యంలా వుండేవా రెప్పుడూ. ఆయన కవి కూడ. మాతృపూజ అనే చిన్న గీత కావ్యాన్ని ప్రకటించా రప్పుడే.

హెడ్మాష్టారు సీతారామయ్యగారు చండశాసనుడు. ఆయనను చూస్తే విద్యార్థులకే కాదు, టీచర్లకూ హడలే! ఆయన స్కూలు ఫైనలు క్లాసుకు ఇంగ్లీషు పొయిట్రీ చెప్పేవారు.

ఒకసారి, గ్రే కవి వ్రాసిన "కంట్రీ గ్రేవ్‌యార్డ్" కవితను పాఠం చెపుతూ, ఆ పద్యాలు కంఠస్థం చెయ్యలేదని భీమన్నను క్లాసునుంచి పొమ్మన్నారాయన. చచ్చినట్టు పద్యాలు అప్పగించి, క్లాసుకు వెళ్ళవలసి వచ్చిందీయన!

ఏది ఏమైనా - ఈయన సరదాగా పాడుకోవాలంటే, నోటికి వచ్చిన పద్యాలు ఆ నాటివే, ఆనాడు బాధపడ్డా, ఈయన ఆయా టీచర్లకు కృతజ్ఞత చెప్పుకుంటూ వుంటా డీనాడు జ్ఞాపకం వచ్చినప్పు డెల్లా.

ఈ వనము, ఈ లతాళులు, ఈ సుమాలు
పరిమళమ్ము, లన్యము లింతవరకు నాకు;
కాని-పి మైత్రి దొరికిన క్షణము నుండి
ప్రకృతి యెల్లను నాకు ఆత్మకథ అయ్యె!

— రాగ వాశిష్ఠం

27. రచనకు తొలి అవార్డు

భీమన్న హైస్కూలు చారంలో వుండగా, విద్యార్థులకోసం ఒక వ్యాస రచన పోటీ జరిగింది. దానిని ప్రభుత్వపు పెంపరెన్సు శాఖవారు నిర్వహించారు. "నిషా వస్తువుల్ని నిషేధించాలి" అనేది వ్యాసాని కివ్వబడ్డ శీర్షిక.

ఆ రోజుల్లో భీమన్న చదివిన నానా రకాల పుస్తకాలలో కల్లు, చుట్ట, బీడిలను గురించినవి కూడా వున్నై. ఏది కనిపిస్తే దాన్ని చదివి పారేస్తూ వుండేవాడు. ప్రయత్నం చేద్దా మనుకొని, ఆ శీర్షికతో ఒక పెద్ద వ్యాసం తయారు చేశాడు. ధైర్యం చేసి, టీచరు కిచ్చేశాడు. ఈ పోటీని నడిపిన టీచరు గార్లంకవారు.

వ్యాసాల స్వీకరణ గడువు ముగిసిన మర్నాడు గార్లంకవారు క్లాసులోకి వచ్చి, పోటీకి ఒకటే వ్యాసం వచ్చిందని, అది భీమన్నదని, ప్రైజు అతడికే ఇవ్వబడుతుందని ప్రకటించారు. ఇతర విద్యార్థు లెవరూ ఈ పోటీలో పాల్గొనక పోవడం శోచనీయ మన్నారు.

అంతలో నలుగు రైదుగురు విద్యార్థులు లేచి – తన వ్యాసం ఇంకా ముగియలేదని ఒకడు, ఒక గంటలో ముగించి ఇచ్చేస్తానని ఒకడు, రెండు రోజులు వ్యవధి కావాలని ఒకడు అన్నారు. ఒకడు తన వ్యాసాన్ని తీసుకెళ్ళి టీచరు బల్లమీద పెట్టాడు కూడ.

ఆయితే – మాష్టారు అంగీకరించలేదు. గడువు అయిపోయింది. ప్రైజు ప్రకటించబడింది. ఇప్పుడీ వ్యాసాలను తీసుకోవడం న్యాయం కాదన్నా రాయన.

భీమన్నకు ఎప్పుడేది లభించినా, అది అప్పుడు ప్రత్యేకంగా తన కొక్కడికే లభిస్తుంది. ఈయన జీవితంలో ఇదొక విశేషం.

ఇంగ్లీషు, హిస్టరీ మాష్టారు కోట పాలయ్య గారు. ఆక్స్ ఫర్డ్ నిమంటువూ, టౌట్ హిస్టరీ ఆయనకు పూర్తిగా కంఠస్థమట. గొప్ప ఆచారపరుడు. నైష్ఠికుడు. అయనది కఠోర క్రమ శిక్షణ. దాన్ని తాను పాటిస్తూ, విద్యార్థుల చేత పాటింపజేసేవాడు.

బెల్లు కొట్టగానే క్లాసులో ప్రవేశించేవాడు. ప్రవేశిస్తూనే పాఠాన్ని అందు కొనేవాడు. బెల్లు అయిపోగానే, వాక్యం సగంలో వున్నా సరే ఆపేసి, వెళ్ళి పోయేవాడు. సరిగ్గా ఆ ఆపేసిన చోటి నుంచే మర్నాడు పాఠాన్ని ప్రారంభించేవాడు.

ఆయన కళ్ళు ఎర్రగా వుండేవి. కోపం వస్తే ముఖం అంతా కంద గడ్డలా అయేది. "వెధవ్వేషం" అంటూ తిట్టేవాడు. మార్కులు విషయంలో కూడ పిసినారి. ఆరలు, పావులు కూడ వేసేవాడు. ఫస్టుమార్కు నూటికి ముప్ఫైకి మించేది కాదు.

భీమన్న అయిదవ ఫారంలో వుండగా పాలయ్యగారికి ట్రాన్సఫరు అయింది. స్కూలు వాళ్ళంతా కలిసి గొప్ప పేర్కొలు ఇచ్చారు. భీమన్న పద్యాలు వ్రాశాడు. యోగానందయ్యగారు వాటిని దిద్దారు.

"ఈ అయిదు పద్యాలు దిద్దడానికి పట్టిన టైంలో ఏభై పద్యాలు వ్రాసుకొనేవాణ్ణి" అన్నారాయన, ఆ పద్యాలను దిద్దుతూ.

పాలయ్యగారి స్థానంలోకి నగరం హెడ్మాష్టారు దువ్వూరి సుబ్బారావుగారు వచ్చారు. అర్ధ సాంవత్సరిక పరీక్షలు అప్పటికే ముగిశాయి. ఇంగ్లీషు మొదటి పార్టు ఆన్సరు పేపర్లను మాత్రం సుబ్బారావుగారు దిద్దారు. భీమన్నకు అరవైకి నలభై ఆరు మార్కులు వేసి, గుడ్ అని కూడ వ్రాశారు.

ఈ లోగా పాలయ్యగారు ట్రాన్సఫరు కేన్సిలు చెయ్యించుకొన్నారో యేమో - మళ్ళీ వచ్చేశారు. భీమన్న మార్కులు చూచి గుండె బాదుకొన్నారు.

"నాశనం చేశాడ్రా నిన్ను, ఆ సుబ్బారావు" అన్నారు. రెండవ పార్టు పేపరు నలభైకి సున్నా ఇచ్చినా, భీమన్నదే ఫస్టు మార్కు! పాలయ్యగారి బాధ ఫస్టు మార్కు ఎవరి దనేది కాదు. తానిచ్చే ముష్టైని దాటి పోయిందే అని! బాగా శాస్తి అయిందనుకొన్నారు కసిగా విద్యార్థి లంతా!

ఆలాంటి కఠినుడు, లోభి అయిన పాలయ్యగారు – ఆ మరు సంవత్సరం భీమన్న స్కూలు ఫైనల్ పబ్లిక్ పరీక్షలు వ్రాయడానికి వెళుతున్నప్పుడు మొదటి రోజున, పరీక్ష హాలు మేడ మెట్లవద్ద వేచి వుండి, భీమన్న చేతిలో పటిక బెల్లం ముక్క ఒకటి వేసి, అన్నారు – "మామూలు క్లాసు పరీక్షలు వ్రాసినట్టే వ్రాయరా, పబ్లిక్ పరీక్ష కదా అని కంగారు పడకు. నీవు పాసవుతావు" అని! "నిండు మనంబు నవ్య నవనీతము" అన్న నన్నయ్యగారి పద్యానికి పాలయ్యగారు లక్ష్యం అంటాడు భీమన్న.

చీకటి మాయపొర చిట్లి
ఎర్రబారిన నెత్తురు మడుగులో
కేర మన్న బాల సూర్యుని కేకకు
ఉలిక్కిపడి తలెత్తింది మొగ్గ
ఆద్భుతపడి చూచింది వెలుగును
పూదోట పురిటి గదిలో
ఎర్రటి సూర్యదీపం వెలిగును!

— అనాది కొస

28. హోటలు భోజనం - మఠం చదువు

భీమన్న రాజోలులో చదివిన మూడేళ్ళూ భోజనం హోటల్లో చేసేవాడు. అది ఒక కమ్మవారి హోటలు. హోటలు యజమానురాలు పేరు ఆదెమ్మగారు.

పల్లయ్యగారి మామిడితోట పండ్లకాయలకేకాక, ఆవగాయ కాయకు కూడ ప్రసిద్ధి. ఎన్నోరకాల మామిళ్ళు వుండేవి ఆ తోటలో. ఆదెమ్మగారు మామిడి కుదురు వెళ్ళి, తనకు కావలసిన కాయను దగ్గరుండి కోయించి తెచ్చుకొనేది. ఆ పరిచయాన్ని పురస్కరించుకొని పల్లయ్యగారు ఆమెవద్ద పెట్టారు కొడుకును.

భోజనం రేటు పూటకు రెండణాలు. అంటే, ఇప్పటి పన్నెండు పైస లన్నమాట. శనివారం, ఆదివారం సెలవులు కనుక - సోమవారం ఉదయం ఇంటివద్ద భోజనంచేసి, తిరిగి శుక్రవారం రాత్రికి ఇంటికి చేరేవాడు భీమన్న. అందువల్ల హోటలు ఖర్చు రోజుకు పావలా చొప్పున నాలుగు రోజు లకు ఒక్క రూపాయి అయ్యేది. వారానికి ఒక్క రూపాయి! అది 1930 ప్రాంతం రోజులు!

భీమన్న జన్మతహా సర్వాహారి. పల్లయ్యగారి వేదాంత వాతావరణంలో కేవల శాకాహారి అయ్యాడు. ఇప్పుడు ఆదెమ్మగారి హోటలు వాతావరణంలో మళ్ళీ సర్వాహారిగా మారక తప్పలేదు.

నగరంలో రెండవ ఫారం చదువుతున్నప్పుడు ఈయన చేపలు, మాంసం మానడం జరిగింది. తండ్రీ కొడుకులకు వేరే కూరచేసిపెట్టడం నాగమ్మగారికి మహా ఇబ్బందిగా వుండేది. ఈయన మాంసాహారం మానడానికి కారణం ఆది మెదడును మొద్దుబార చేస్తుందన్న నమ్మకమే. అట్టి నమ్మకం ప్రజల్లో కూడా వుండేది. భారత, భాగవతాలను బాగా అర్థంచేసుకొన్న తరువాత, పూర్వ ఋషు లంతా మాంసాహారులే అన్న సత్యం అవగాహనకు వచ్చిన తర్వాత ఈయ నకు మాంసాహారంపై వుండే దురభిప్రాయం తొలగిపోయింది. అగస్త్యుల వారి "వాతాపి జీర్ణం" ఉదంతంలోని రాజకీయాలు అర్థమైనై. అదే కాలంలో ధర్మ వ్యాధుడి గురించి కూడా పరిశోధన చేస్తున్నా డీయన.

"సలిలము, లుర్వి, ఆకసము, సర్వము జంతుమయంబు కావునన్, కలుగు నవశ్యమున్ సకల కర్మల యందును హింస....." ఆవును కదా! "మును తనుచేసిన కర్మంబున సూవె నశించు భూతములు, చంపెడివాడు నిమిత్త మాత్రు డంతియె....." అవును, అంతే!

జీవి బ్రతకడానికి ఆధారం జీవపదార్థమే. అది చెట్లనుంచి రావచ్చు, జంతువుల నుంచి రావచ్చు. చరమా, అచరమా అనేది స్థితిభేదం మాత్రం.

ఆదెమ్మగారి హోటలు కూడ భీమన్న ఊహాధోరణికి తోడ్పడింది. ఆ హోటల్లో ముఖ్యాహారం చేపలు, మాంసం, గ్రుడ్లు. అందరూ రెండణాలకు అంతంత మంచి పదార్థాలు తినిపోతుంటే, భీమన్న వట్టి పప్పుచారుతో, వంకాయ పులుసుతో గడపపలసి వచ్చేది. అక్కడచేరిన వారం పది రోజుల లోనే భీమన్న మళ్ళీ సర్వాహారిగా మారిపోయాడు. అందుకు ఆదెమ్మగా రెంత సంతోషించారో, నాగమ్మగారు అంత ఆనందపడ్డారు - ప్రత్యేక వంట బెడద తప్పినందుకు.

అది కమ్మవారి హోటలు కదా. తానేమో అస్పృశ్యుడాయె. అందుకని ఆ హోటలు అరుగు మీద తనకోసం వెదురు తడకలతో ప్రత్యేకంగా ఒక గది తయారు చేయబడింది. గది చక్కగావుండేది. ఆదరణ బాగుండేది. ఆదెమ్మ గారు ఎంతో వాత్సల్యంతో చూచేది. ఎంత గొప్ప వాత్సల్యం అంటే - ఆమె స్వంత కొడుకులే భీమన్న మీద అసూయతో తల్లిపై చిరబొర లాడుతూ వుండే వాళ్ళప్పు డప్పుడు.

తన తల్లిని కాక, భీమన్న జీవితంలో అమ్మా అని పిలచినవాళ్ళు మరొక ఇద్ద రున్నారు. అందులో ఆదెమ్మగా రొకరు.

హోటల్లో భోజనంచేస్తూ, హైస్కూలుకు దగ్గరలోనే గల బుడితివారి పేటలో ఒక చిన్న ఇంట్లో వుండి చదువుకునేవాడు భీమన్న. అది మాలపేటే. ఆ ఇల్లు కూడ తెలిసినవాళ్ళదే.

భీమన్నతో పాటు మరో ఇద్దరు ముగ్గురు ఇతర క్లాసుల విద్యార్థులు కూడ వుండేవా రా ఇంట్లో. ఆ ఇల్లు రెండు భాగాలుగా వుండేది. ఒక భాగంలో విద్యా

ర్థులు ఉండేవారు. రెండవ భాగంలో పాలస్‌గారు అనే ఒక పబ్లిక్ వర్క్స్ శాఖకు చెందిన టెలిఫోన్ ఆపరేటరు వుండేవాడు. సాధారణంగా ఆయన వుండే గది రాత్రులు పేకాట క్లబ్బుగా మారుతూ వుండేది. భీమన్న పేకాట నేర్చుకొన్నది అక్కడే.

భీమన్న విద్యార్థి మిత్రులలో - అంటే అక్కడ ఆ ఇంట్లో కలిసివున్న వారిలో ముఖ్యులు బళ్ళ పురుషోత్తం, బళ్ళ జగన్నాథరావు, బళ్ళ నరసింహారావు, కొంబత్తుల వెంకటరెడ్డి. జగన్నాథరావు చాల క్రింది క్లాసువాడు. తక్కినవాళ్ళు పైక్లాసుల వాళ్ళు. వెంకటరెడ్డి మంచి రసికుడు. కసరత్తుచేస్తూ వస్తాదులాగ వుండేవాడు. అతడితో పాటు భీమన్న కూడ కసరత్తు చేసేవాడు. ఆ అలవాటు ఈయనకు చిన్నప్పటి నుంచీ వుంది.

ఈ మిత్రులలో అతి సన్నిహితులు జగన్నాథరావు, పురుషోత్తమూ. జగన్నాథరావు చక్కగా పాడేవాడు. సన్నంగా, నాజూకుగా, ఆడపిల్లలా వుండేవాడు. పురుషోత్తం ప్రజ్ఞావంతుడు. మంచి వక్త. గొప్ప ఆర్గనైజరు. వీళ్ళ స్వగ్రామం మోరిపొలం. మామిడికుదురుకు దక్షిణంగా రెండు మైళ్ళలో వున్నదది. వీళ్ళు బందరు హరిజన హాస్టల్లో చదువుతూ రాజోలు హైస్కూలుకు వచ్చి, ఒకి సంవత్సరం తర్వాత మళ్ళీ బందరు హాస్టలుకు వెళ్ళిపోయారు. ఆ ఒక్క సంవత్సరంలోను భీమన్నకు వాళ్ళంత ఆత్మీయు లయ్యారో తర్వాత వివరిస్తాను.

స్కూలు రోజుల్లో పగలు క్లాసులతోనూ, రాత్రి పేకాటతోను గడిచేది భీమన్న కాలం. శని ఆదివారాల్లో మామిడికుదురు పొలాల్లోను, తోటల్లోను గడిచేది. ఇదంతా ఆ నాటి ఈయన దైనందిన కార్యక్రమాల్లో ఒక భాగం మాత్రం. చదువు, సరదా, శ్రమ - ఈ మూడూ విధ్యుక్త ధర్మాలుగా సాగిం దీయన విద్యార్థి జీవితం.

ఈ విశ్వమ్మును విప్పిచూచి, ఇట మా
కే మున్న దం చేద్వగా
పూవుల్ చూపి, భూకమ్మ చూపి, మధు భూ
ముల్ చూపి - ఏవేవో లీ

లా పర్ణములు, అర్ణవమ్ములు, కళా
లాలిత్యముల్ చూపి, మా
త్రోవన్ మళ్ళితీ, వేది నీ కరుణ సిం
ధు ఖ్యాతి? పర్షింపుమా!

— దీప సభ

29. ఎవరిని అనుసరించాలి

ఆర్ష సంప్రదాయంలో పుట్టి పెరుగుతున్న భీమన్నకు తత్సంబంధమైన గ్రంథాలతో పరిచయ మేర్పడుతున్న కొలదీ, చిత్ర విచిత్రమైన అభిప్రాయాలు కలుగుతూ వచ్చాయి. తన చుట్టూ ఎన్నో ప్రశ్నలు చెలరేగుతూ వచ్చాయి. రాముడూ అవతార పురుషుడే, కృష్ణుడూ అవతార పురుషుడే. అయినప్పుడు హిందూ మతస్థుడు ఆ ఇద్దరిలో ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలి? వంటి ప్రశ్నలు.

ఈ రకమైన జిజ్ఞాస భీమన్నలో పుట్టి పెరగడానికి తోడ్పడ్డ వివిధ శక్తులలో ఇద్దరు టీచర్లు కూడా వున్నారు. ఒకరు లెక్కల మాష్టారు గార్లంకవారు. రెండవ వారు సైన్సు మాష్టారు శేషగిరిరావుగారు.

గార్లంకవారు క్లాసులోకి వచ్చినప్పుడెల్లా చెబుతుండేవారు - "పెందలకడే నిద్రపోయి, పెందలకడే లేవాలి. రాత్రి పది గంటలయ్యేటప్పటికి చదువు ఆపెయ్యాలి. లెక్క సగంలో వున్నాసరే పుస్తకం మూసెయ్యాలి. అలారమ్ పెట్టుకుని సిసలుగా ఉదయం నాలుగున్నరకు లేవాలి. రాత్రి పది గంటలకు మూసేసిన పుస్తకాన్ని తెరిచి, ఆపేసిన దగ్గర్నుంచి ప్రారంభించాలి. పది దాటి మేలుకో కూడదు. నాలుగున్నర దాటి నిద్రపోకూడదు" అంటూ. ఆయన చెప్పినదంతా విని, ఇక అదే పద్ధతిని అనుసరించా లనుకొనే వారు విద్యార్థులు. అప్పటితో ఆ పిరీడు అయిపోయేది.

ఆ తర్వాత సైన్సు పిరీడుకు శేషగిరిరావుగారు వచ్చేవారు. "ఒరే, మీ చదువంతా, హోమ్ వర్క్ అంతా రాత్రి పండుకొనే ముందే ముగించేసుకొండి.

ఎంత రాత్రయినా సరే . పన్నెండు , ఒంటి గంటయినా సరే . ఆ తర్వాత పండుకొంటే - ఇంకా వర్క్ మిగిలివున్నదే అనే బెంగ లేకుండా నిద్రపో వచ్చు" అని . అది కూడా నిజమే అనిపించేది విద్యార్థులకు .

ఆ టీచర్లిద్దరూ మంచివాళ్ళే . ఆదర్శ పురుషులే . అయితే ఇద్దరూ రెండు విరుద్ధ మార్గాలను చూపుతున్నారు . అందులో ఎవరిని అనుసరించాలి?

ఇక్కడ ఒక అద్భుతమైన సృష్టి తత్త్వ రహస్యం ఇమిడి వున్నట్టు కన్పిస్తుంది . రాముడి యొక్కా , కృష్ణుడి యొక్కా జీవిత విధానాలు - పైని పేర్కొనబడ్డ ఇద్దరు టీచర్ల చదువు పద్ధతులు - పరస్పర విరుద్ధంగా కన్పిస్తున్నా , లక్ష్యం మాత్రం ఒక్కటే . బ్రహ్మాండంలాగే దానిలోని ప్రతి లవమూ గుండ్రంగానే వుంటుంది . తూర్పుకు వెళ్ళినా , పడమటికి వెళ్ళినా , చేరే లక్ష్యం ఒక్కటే . మనిషికి సంబంధించిన ఏ విషయంలోనైనా కూడ అంతే . ఎవరి మనస్తత్వానికి , అవసరానికి తగ్గ పద్ధతిని వారు అనుసరిస్తారు .

భీమన్న శేషగిరిరావుగారు చెప్పే పద్ధతిని అనుసరించాడు . ఎంత రాత్రయినా సరే జరిగిన పాఠాలూ , మర్నాడు జరగబోయే పాఠాలూ మొత్తం ముగించేసుకొని పడుకొనేవాడు . తెల్లవారిన తర్వాత ఇష్టం వచ్చినప్పుడు లేచే వాడు . రాత్రులు బాగా పొద్దు పోయేవరకూ , ఒక్కొక్కసారి తెల్లవార్లూ మేల్కొవడం , ఉదయం ఎనిమిది తొమ్మిది గంటలకు గాని లేవక పోవడం అప్పుడే అలవాటయింది ఈయనకు . ఇప్పటికీ అదే అలవాటు .

తనతోపాటు తన గదిలో వుండే ఒక రిద్దరు గార్లంకవారి పద్ధతిని అనుసరించేవారు . నాలుగున్నరకు అలారమ్ పెట్టుకొని , దానిని తల దగ్గర చేతికి అందుబాటులో పెట్టుకుని , పది గంటలకే పడుకొనేవారు . భీమన్న ఏ ఒంటి గంట రెండు గంటలకో పడుకొనేవాడు . ఈ అందరూ చాపల మీద ఒకే వరసలో పడుకొనేవారు . తల దగ్గరి క్రైమ్‌పీస్ అందరి చేతులకూ అందుబాటులో వుండేది .

తరచు జరిగే దేమిటంటే - పది గంటలకు పడుకొన్న పురుషోత్తం , రెండు గంటలకు పడుకొన్న భీమన్న ఉదయం ఒకేసారి లేచేవాళ్ళు - ఏడు

గంటలకో ఎనిమిది గంటలకో ! పురుషోత్తం కంగారు పడిపోయేవాడు - హోమ్ వర్క్- ముగియక. మరి అలారమ్ ఏమైపోయింది? ఎందుకు మోగలేదు? చూస్తే దాని నోరు నొక్కేసి వుండేది. నొక్కేసిన వారు ఎవరు? ఏమో ఎవరో! ఆది మోగడానికి టింగ్ మనగానే నిద్ర పోతున్న ఎవరి చేయి వెళ్ళి దాని మీద పడేదో, ఎవరికి గుర్తుండేది కాదు!

ఉన్న దన్న నుండు, లే దన్న లేకుండు,
జగము దెల్ల శక్తి శాలి ముష్టి:
కలిమి, లేమి నరుని కనుకట్టె కాదొకో:
విశ్వ భోగధామ: వినుర భీమ।

— భీమ శతకం

30. దొంగ చదువులు

ఏ క్లాసులో అయినా ఫస్టుమార్క్-ల కోసం పోటిపడేవాళ్ళు ఏ నల్గు రయి దుగుకో వుంటారు. అందరూ శ్రద్ధగా కష్టపడి పోటీగా చదువుతారు కనుక, అందరికీ మార్క్-లు సమానంగానే వస్తూవుంటాయి. పెద్ద తేడా లుండవు. తన కొక్కడికే ఫస్టు మార్క్- రావాలని అందరికీ వుంటుంది. అలాంటివాళ్ళలో దురూహలు కలిగేవాళ్ళు కూడ వుంటారు. అందులో కొందరు తక్కువవాళ్ళ చదువును చెడగొట్టడానికి కూడా పూనుకొంటారు.

భీమన్న ఆ రకమైన పోటి జోలికి వెళ్ళేవాడు కాదు. పాడుకొంటూ, ఆడుకొంటూ చదివినా ఫస్టు మార్క్-లు వస్తూనేవుండేవి. అది గిట్టని ఒకరిద్దరు ఈయన సంగతేమిటో తేల్చుకోవాలని నడుంకట్టారు.

అందులో ఒకానొక నారాయణ ఒక రాత్రి తొమ్మిది గంటలకు హరికేన్ లాంతరు పుచ్చుకొని భీమన్న గదికి వచ్చాడు. భీమన్న అంతవరకూ చదువే మొదలు పెట్టలేదు. హోటల్లో తిండి తిని వచ్చి, మిత్రులతో కబుర్లు చెప్పు కుంటున్నాడు. ఆ ప్రక్క గదిలో పాలస్‌గారు డబుల్ పేక కలుపుతూ చప్పుడు చేస్తూ డూరిస్తున్నాడు. అట్టి స్థితిలో వచ్చాడు నారాయణ. ఆవులించి, ఒళ్ళు

విరచుకొంటూ అన్నాడు "ఏమీ తోచడం లేదురా. చదవడానికి మూడ్ రావడం లేదు. పోసీ నాలుగు పట్లు వేద్దామంటే ఎవరూ దొరకడం లేదు."

ప్రక్క గదిలోని పాలస్‌గారికి ప్రాణం లేచివచ్చింది - ఆ మాట విసగానే. నాలుగు పట్లు కదు కదా - ఎనమండ్రు ఆటగాళ్ళతో ఆసుపై ఆసు, జాకీపై జాకీ అనుకొంటూ - రాత్రి రెండు గంటలదాకా సాగిం దాట. నిద్ర ముంచు కొచ్చేస్తున్నదంటూ నారాయణ వెళ్ళిపోయాడు. భీమన్న నిద్రపోయాడు.

మర్నాడు క్లాసులో నారాయణ అన్నింటిలోను మొదటివాడుగా నిలబడ్డాడు. భీమన్న తెల్లమొహం వేశాడు. ఆలా ఎందుకయింది? అయిం దేమిటో స్పష్టంగా తెలుస్తూనే వుంది. రాత్రి రెండు గంటల వరకు భీమన్న చదువును చెడగొట్టి వెళ్ళిన నారాయణ ఆ తర్వాత ప్రొద్దు పొడిచేదాకా చదువుకొన్నా డన్నమాట. ఈ రహస్యం గుర్తించిన భీమన్న ఆ తర్వాత ఇక మోసపోలేదు.

పేకాడక తప్పకపోతే, సంతోషంగా ఆడేవాడు. కాని పూర్తి ప్రిపరేషన్‌తోనే క్లాసుకు వెళ్ళేవాడు. తోడి విద్యార్థులతోను, ఉరుగుపొరుగుతోను ఎంతో కలిసిమెలిసి వుంటూ, వాళ్ళ ఆటపాటలలో కలిసిపోయి మెలగుతూ కూడ, తన బాధ్యత పట్ల సావధానతతో వుండేవాడు. పేకాట అయితే అబ్బలేదు కాని, దాని కారణంగా అబ్బిన కొన్ని మంచి లక్షణాలు ఈయనను అనుసరించే వున్నాయి.

కూటికి, గుడ్డకున్, గుడిసె
కున్, గతి గల్గియు వెఱులై నరుల్
చేపెడు నేల కోసమయి
చేతురు యుద్ధము లెన్నో! ఎందుకీ
పాటి ప్రపంచ, మేమి సుఖ
వంతము? రమ్మ వరాంగి; పోటి పో
రాటము లేని నా హృదయ
రాజ్యము పంచుము విశ్వమంతకున్!

— భీ.కా. కుసుమాలు

31. శాస్త్రాల లక్ష్యం

ఏ శాస్త్రమైనా ఎందుకు? దాని ప్రయోజనం ఏమిటి? ఈ ప్రశ్నలకు కూడ ఒక నిర్దిష్టమైన జవాబు ఆనాడే లభించింది భీమన్నకు.

తనకు గుబ్బల వీరాస్వామిగారు బహూకరించిన కవి జనాశ్రయం తన కూడానే వుంది. దానిని ఎన్నోసార్లు చదివాడు. తీరిక దొరికినప్పుడెల్లా దానినే చదువుతుండేవాడు. కవి జనాశ్రయం చేతికి వచ్చిన చాల కాలం వరకు కవిత్వం జోలికే పోలేదు భీమన్న.

పద్యం వ్రాయా లంటే ఇంత గంద్రగోళం పడాలన్నమాట! గణాలట. వాటిలో మళ్ళీ సూర్య, చంద్ర, ఇంద్ర జాతు లట. గురు, లఘువు లట. యతి ప్రాస లట! వాటిలోనూ అనేక భేదాలు! వందలు, వేలు వృత్త గీత భేదాలు! పైగా దేశీ, విదేశీ విభేదాలు! అబ్బ, ఎంత గ్రంథం! ఎంత క్లిష్టం!

ఒక పొడుగక్షరం తర్వాత రెండు పొట్టక్షరాలు, మళ్ళీ ఒక పొడు గక్షరం, ఒక పొట్టక్షరం - ఇలా అక్షరాలు అమర్చుకొంటూ పద్యం వ్రాయడ మెలా? చచ్చి చెడి వ్రాసినా, దాని కొక అర్థం ఏర్పడడం ఎలా?

అందమైన అర్థవంతమైన పద్యాలు వ్రాయడానికి ఈ ఛందో నియమాలు గుగ్గిళ్ళలో గులకరాళ్ళవలె తోచా యీయనకు. అంతా సాంకేతిక శ్రమ తప్ప ఫలితం శూన్యం అనిపించింది.

అయితే - భాగవతం, భారతం, ప్రబంధాలు అన్నీ పద్యాలేగా! వాళ్ళెలా వ్రాశారు? అక్షరాలు, గణాలు, యతి ప్రాసలు లెక్క-పెట్టుకొంటూ వ్రాస్తే అంతలేసి మహా గ్రంథాలు తయారయ్యేవా? ఈ ఊహ రావడంతో - అంతవరకు తాను వ్రాసిన పద్యాలను తీసి, ఛందస్సుకు అవి ఏమైనా దగ్గరగా వున్నాయేమోనని పరిశీలించ సాగాడు భీమన్న. ఆశ్చర్యపోయాడు. ఆనంద పడిపోయాడు. ఎందుకంటే-అవన్నీ ఛందోబద్ధంగా వున్నాయి. ఉత్పలానికి, మత్తేభానికి అప్పటివరకు తనకు తెలియని తేడా కూడ తెలిసిపోయింది. ఛందో రహస్యం విడిపోయింది.

భీమన్న నగరంనుంచి రాజోలుకు తీసుకెళ్ళిన పద్యాలు సుమారు రెండు వందలు. అందులో సగానికి పైగా పూర్తి ఛందోబద్ధాలు. తక్కిన వాటిలో ఒకటి రెండక్షరాలు ఎక్కువ తక్కువ లున్నాయి. అపశబ్దాలు, సమాస దోషాలు సకృత్తు.

సహజమైన నాదానికి ఒక లయ, ఒక శ్రుతి ఏర్పడ్డాయి. నాదం స్వేచ్ఛాగామిని. దాని లీలా విలాస విన్యాసాలను అనుసరించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టిదే ఛందశ్శాస్త్రం.

అంటే - ఏదో ఒక లయను అనుసరిస్తే ఏదో ఒక వృత్తం పుడుతుం దన్నమాట. శాస్త్రోక్తంగా లయ గమనం వేల లక్షల రీతుల్లో వుండవచ్చు. అన్ని రీతుల్లోను అన్ని రకాల వృత్తాలూ వుండవచ్చు. లయ జ్ఞానం వుండే, వృత్త సృజన శక్తి వున్నట్టే. శాస్త్రానికి ఇంకా అందని క్రొత్త క్రొత్త ఎత్తులకు, లోతులకు కూడా పోవచ్చు - ప్రతిభా నైశిత్యాన్ని బట్టి.

శాస్త్రానికుండే నియమ నిబంధన లన్నీ గతాన్ని గుర్తించడానికి, వర్త మానాన్ని అనుసరించడానికి మాత్రమే. భవిష్యత్తును ఊహించడానికి అవి తోడ్పడవచ్చు - కాని నియంత్రిచలేవు. నియంత్రించడానికి శాస్త్రం ప్రయత్నిస్తే మనిషి పెరుగుదలే ఆగిపోతుంది. ప్రవాహశీలత పోయి పేరుకు పోతుంది. వెర్రితలలు వేస్తుంది. అసలు, శాస్త్రమే చచ్చిపోతుంది. ఏ శాస్త్ర విషయంలో అయినా ఇది సత్యమే.

ఛందస్సు పట్ల ఏర్పడ్డ భయం ఆ విధంగా తొలగి పోగా, ఇతోధిక ోత్సాహంతో మళ్ళీ పద్య రచనలో పడ్డాడు భీమన్న.

గతానుభవమే శాస్త్రం
అది ముందుకు దారి చూపే వెలుగు,
కట్టి పడవేసే శృంఖల కాదు.

— శ్రీపదలు

32. ప్రణవం నుంచి ప్రణయానికి

మెట్ట వేదాంతముల చాల మెలగి యున్న
ఉల్ల మాశా ప్రవీచుల కున్కి అయ్యో,
తవిలి హరి గొల్చు భక్తి గీతమ్ము లెల్ల
ప్రణయ గీతిక లయ్యో స్వభావ పరళి!

—ప్రణయ లహరి.

వందల కొలది పద్యాలతో రాజోలు వెళ్ళిన భీమన్న అక్కడి విశాలతర వాతావరణంలో బాగా పెరిగాడు. అంతవరకు ఈయన ప్రాసిన వన్నీ విడివిడి పద్యాలే. మామిడి చెట్లకు, పైరు చేలకు, గోపీకృష్ణ లీలలకు, ఎక్కువగా వేదాంత తత్వానికీ సంబంధించి నట్టివి.

మామిడికుదురుతో పోలిస్తే రాజోలును పట్నమే అనాలి. చదువు, పరిసరాలు, ప్రజలు మారడంతోపాటు వయస్సులో వస్తున్న మార్పు కూడ సహకరించి, భీమన్నలోని వేదాంతతత్వానికి ప్రేమ చిగుళ్ళు తొడిగింది. అంతవరకు ప్రాసిన పద్యాలలో గోపీకృష్ణ ప్రేమతత్వం వున్నా అది వేదాంతానికి ప్రేమ ముసుగే. "చూడ చక్కని చిన్నది, కడ మేడ గదిలో నున్నది" వంటి బ్రహ్మం గారి తత్వాలలో వుండే శృంగారం వంటిదే. రాజోలులో ప్రవేశం ఆ దశకు స్వస్తిచెప్పి, వాస్తవ ప్రణయ కవితా రచనకు ముహూర్తం పెట్టింది. ప్రణవం ప్రణయంగా మోసులెత్తింది.

అందానికి అవలీలగా లొంగిపోయే మనస్తత్వం భీమన్నది. అంద మనేది వయస్సుతోపాటు మనస్సులో వికసించే భావం. అందం మానసికమైనట్టిది. బాహ్య వస్తువును మనస్సు ఏ దృష్టితో చూస్తే, అది ఆ రూపంలో కనిపిస్తుంది. సరసంగా చూస్తే అది సుందరం. అరసంగా చూస్తే అసహ్యం. విరసంగా చూస్తే విరుద్ధం.

"ఏకం పరాత్మా బహు జీవరూపం" అనే అద్వైత తత్వానికి రూపకల్పనగా పుట్టిన భీమన్న మనస్సు ఒక బాల రసాలం వంటిది. మధు సుందరంగా, రాగ మధురంగా వికసించడం దాని లక్షణం. అప్పుడు దానికేసి ఆకర్షించబడే వన్నీ అందాలే - కోకిలలు, తుమ్మెదలు, పరిమళాలు, పక్వ మాధురులు.

రాజోలులో, భీమన్నతో కలివిడిగా తిరిగేవాళ్ళలో మగవాళ్ళేకాదు, ఆడవాళ్ళు కూడ వుండేవాళ్ళు. అందులో చాల చనువుగా, స్నేహంగా వుండే వాళ్ళూ వున్నారు. ట్యూషను కోసమని వచ్చి గంటల కొలదీ కదలని వాళ్ళూ వున్నారు. వాళ్ళతో స్నేహాలు చమత్కారాలతోనే నిలిచిపోయాయి—అప్పటి కప్పుడు హర్షధ్వానాలను రేపి చల్లారిపోయే అంత్యప్రాసల వచన కవితలలా. ఎప్పుడో ఒక్కసారి తన వంక అరమోడ్పుగా చూచిన రెండు కాటుక కళ్ళు మాత్రం గుండెల్లో గుచ్చుకపోయి, మధుకోశం నుంచి తేనెలా, కవితా ధారను స్రవింపజేశాయి. ఆ ధారే భీమన్న తొలికావ్యం "ప్రణయ లహరి!"

ఆ కాలంలో వ్రాసిన అనేక పద్యాలను తర్వాత తర్వాత సవరించి – కావ్య కుసుమాలు, దీప సభ, మధు గీత మొదలైన కావ్యాలలో కలిపేశాడు భీమన్న. ఇంకా ఎన్నిటినో చింపి పారేశాడు కూడ. ఈ ప్రణయ లహరినే ఏమీ చెయ్యలేక వదిలేశాడు. చింపివెయ్యడానికి మనసు రాదట, ప్రకటించడానికి పనికి రాదట!

తన రచనలలో ప్రకటించబడ్డవాటి కంటె, చిన్నప్పుడు చించిపారేసినవే అధిక మంటాడు భీమన్న. నిఘంటువులు దగ్గర పెట్టుకొని, మంచిమంచి మాటలు వేసి వ్రాసిన పద్యా లెన్నో, ఆ తర్వాత తనకే అర్థంకాక, చించి వేశా డట!

భీమన్న జీవితం ప్రణయ ప్రధాన మైనట్టిది. వేదాంతంలో పుట్టి, ప్రేమలో పెరిగి, శృంగార సాహిత్యాన్ని సృష్టించాడు. ఈయన ప్రణయం విలక్షణమైనట్టిది. శృంగారం విశ్వజనీన మైనట్టిది. రాళ్ళకు రాగాన్నీ, మ్రోళ్ళకు మోహాన్నీ సమకూర్చినవాడు భీమన్న. అందుకు బీజావాపం జరిగిం దీ యీవ నాంకుర కాలంలోనే.

గాన రసమ్ముతో వెదురు। కర్రకు ప్రాణము పోసినావు, నీ
వేణు రవమ్ముతో మొరటు। ప్రేతను రాధను చేసినావు, నీ
యాన రయమ్ముతో జడ మహస్సుకె కళ్లెము వేసినావు, నా
మానస మంతకంటె ఖిలమా? ఖిలమా? ఏను గోరు టభ్రమా?

—మణి మానసం

33. పరిచయాల పరిధి

భీమన్నకు పరిచయులే కాని, మిత్రులు లేరనవచ్చు - బహుశా ఒక్క బళ్ళ పురుషోత్తం తప్ప. అతడైనా ఈయనతో కలిసి వున్న దొక్క సంవత్సరమే. తర్వాత సెలవుల్లో మాత్రమే కలుసు కొంటూ వుండేవాళ్ళు. పురుషోత్తం అన్న వెంకటరత్నంగారు భీమన్నను చాల వాత్సల్యంతో చూచేవాడు. వాళ్ళతో భీమన్నది బావమరుదుల వరుస. ఆయన అప్పటికే ఉద్యోగి.

రాజోలులో గొల్ల చంద్రయ్య, గొల్లపల్లి సామ్యాలు, పాలసుగార్లు ఈయనను గార్డియనుల వలె కనిపెట్టి ఉండేవాళ్ళు. మొదటి ఇద్దరూ ఆ ప్రాంతం మామాలకు నాయకులు కూడ. సామ్యాలుగారు కలుసుకొన్నప్పుడెల్లా ఛందస్సా హిత్యాలను గురించి చర్చిస్తూ వుండేవారు.

భీమన్న అక్క గొంతెమ్మ ఆ త్తవారు నగరంలోని బయ్యా వారు. ఆది మేనరికం, పల్లయ్యగారి అక్క కొడుకే ఇచ్చారామెను. పెండ్లి సమయంలో ఏదో పేచీ వచ్చి, "బ్రతికుండగా వాళ్ళింటికి వెళ్ళ"నని పల్లయ్యగారు శపథం చెయ్యడంవల్ల, అక్కగారింటికి వెళ్ళివచ్చే పని తరచు భీమన్న మీదే పడుతుండేది. బావగారి పేరు నాగయ్య, వడ్రం పని చేసేవాడు - వ్యవసాయానికి తోడు.

భీమన్నకు నగరం నుంచే క్లాసుమేట్లు బయ్యా వెంకన్న, బయ్యా స్వామి. స్వామి అన్నగారు పుల్లయ్యగారు. మాలల్లో ఆ కుటుంబాల వాళ్ళు మొత్తం మీద అందరూ విద్యావంతులే. సాంస్కృతికంగా కూడ ఆ ప్రాంతపు ఇతర కులాలవారి కంటె అగ్రగాములు. వాళ్ళు తరచుగా వేసే సారంగధర నాటకంలో నాగయ్యగారు సారంగధరుడి పాత్ర ధరించేవాడు.

ఒకసారి భీమన్న పేచీ పెట్టి, బావగారి వద్ద పావలా వసూలు చేసి, వాళ్ళిద్దరితో కలిసి అంతర్వేది తీర్థం వెళ్ళాడు. సుమారు పాతిక మైళ్ళ దూరం నడిచే వెళ్ళాలి. కాసేపు అక్క, కాసేపు బావ ఎత్తుకొని మోసి ఎలాగో తీసుకు వెళ్ళారు.

తీర్థంలో తిరుగుతూ , దేన్నో చూచి ఆగి , భీమన్న అడిగా డట . "అదే మిటి ?" అని . 'ఆదే రంకులురాటం' అన్నాడట నాగయ్యగారు . భీమన్న మరి మాటాడలేదు . ఇక దేన్ని గురించీ అడగలేదు .

తీర్థంలో ఏం చూశావని ఇంటివద్ద తల్లి అడిగినప్పుడు , "వీళ్ళు నాకేమీ చూపలేదు . ఏదో అడిగితే చెప్పలేదు . పైగా తిట్టారు" అని ఫిర్యాదు చేశాడు . అక్కా , బావా ఆశ్చర్యపోయారు . "రంకులురాటం" అంటే "రంకులు వస్తాయి , పేచీలు వస్తాయి" అని భీమన్న అర్థం చేసుకొన్నాడని గుర్తించిన తర్వాత వాళ్ళకు నవ్వాగలేదు . భీమన్న ఇంకా ఆఆలలో వున్న రోజు లవి .

"ప్రతివాది భయంకర , బాలకవి , భయ్యా సూర్యనారాయణమూర్తి , భియ్యే" అంటూ అన్నీ వత్తులలో పిలుపబడుతూ వుండే బి. ఎస్. మూర్తిగారు బర్మానుంచి వచ్చి , రాజమండ్రిలో బి. ఏ. చదువుతుండే వాడు . ఆయనకు గర్వమూ , అహంకారమూ అని లోకం చెప్పుకొనేది . మామాలలోని కొద్దిమంది తొలి పట్టభద్రులలో ఒకడు కనుకనూ , మంచి తెలివైనవాడు కనుకనూ ఆయనకు ఆపాటి హుందాతనం వుండడం న్యాయమే అనేవాడు భీమన్న .

ఏదో సుస్తీచేసి , సెలవు పెట్టి , నగరంలో విశ్రాంతి తీసుకొంటున్న మూర్తిగార్ని చూడడానికి ఒక రోజున భీమన్న వగైరా మిత్రులు వెళ్ళారు . భీమన్న తన చేతిలోని మామిడిపండును ఆయన కిచ్చాడు . చాకు కూడ అందిచ్చాడు . అప్పుడు మూర్తిగారు పండును కోసి తలకొక ముక్కా అందిస్తూ , "మీరు తెచ్చిన పండునే మీకు నిత్తు" అన్నాడు . "కొంచెమైనను మిగులుచుకొండి మీరు" అన్నాడు భీమన్న . ఫర్వాలేదే అని మెచ్చుకొన్నారు మూర్తి గారు . భీమన్న నగరంలో చదువుతున్న రోజు లవి .

ఉండ్రు సుబ్బారావుగారివి పొన్నమండ . ఉండ్రు తాతయ్య , గంగయ్య , బులిస్వామి అనే అన్నదమ్ములు బర్మావెళ్ళి , గొప్ప ఆస్తులు సంపాదించుకొచ్చిన వాళ్ళు . ఆ ముగ్గురూ పల్లయ్యగారి శిష్యులే . తాతయ్యగారి కుమారుడు సుబ్బారావు . వేదాంతం ఒంట బట్టినవాడు . పద్యాలు వ్రాయనేర్చినవాడు . గొప్ప వక్త . భీమన్న నగరంలో చదువుతున్నప్పుడే ఆయన రాజోలులో చదువుతూ , "గురుస్తోత్రం" అని ఒక గీత పద్యాల పుస్తకం వ్రాసి అచ్చొత్తించా డట .

భీమన్న రాజోలు వెళ్ళేవరకు ఆ సంగతి ఎరగడు. అప్పటికి సుబ్బారావుగారు చదువు మానేసి పొన్నమండకు వెళ్ళిపోయాడు కూడ.

"గురుస్తోత్రం" నిండా తప్పులున్నాయని బి. యస్. మూర్తి విమర్శించాడనీ, 'వేదాంతం వెధవ ముండలది' అని కూడ అన్నాడనీ ఒక వార్త పొక్కింది. సుబ్బారావు, పురుషోత్తం, భీమన్న – వీళ్ళందర్నీ ఉడుకెత్తించే సిందీ వార్త, రచనలో తప్పు లుండవచ్చు. అసలు వేదాంతాన్నే నిందించడం! సహించలేక పోయాడు భీమన్న. వెంటనే పెద్ద పెద్ద సమాసాలతో ఒక సుదీర్ఘమైన ఆక్షేపణ లేఖ వ్రాసాడు మూర్తి గారికి. భీమన్న నాలుగవ ఫారం చదువుతున్న రోజులవి.

ఆ లేఖ నిండా కూడ తప్పులున్నా యంటూ మూర్తిగారు విమర్శించారని మరో వార్త!

అల్లరి చేసే వారున్నా రని
ఆత్మ బలము చంపుకొందు రటే?

గుచ్చుకొనే ముళ్ళెన్నో కలవని
గులాబీనె వీడుకొందు రటే?
మెచ్చుకొనే రసజ్ఞులే లేరని
కచ్చపినే పారవైతురటే?

— రాబీఐ

34. గాంధీగార్ని చూడాలి

ఆది 1930-31 సంవత్సరాలలో ఏదో ఒక మే నెల కావచ్చు. నిప్పులు చెరిగే మిట్ట మధ్యాహ్నం. భీమన్న నగరం వెళ్ళి స్వామి, వెంకన్నలతో కలిసి రాజోలుకు బయలుదేరాడు-అక్కడికి గాంధీగారు వస్తున్నారన్న వార్తవిని.

ఎండలకు కొండలకు, వానలకు వరదలకు, భయపడడం మానేశాడు భీమన్న. ఆ భయా లన్నీ చిన్నతనంలోనే పోయినై. శ్మశానంలో అంధకారం, పల్లె తోటలో వసంత చంద్రిక, ఇసకపర్రలో వైశాఖ మధ్యాహ్నం, గోదావరి

లంకల్లో సెప్టెంబరు వరద - సమాన సుందర మూర్తులే భీమన్నకు. అలాంటి వయస్సది.

గాంధీగార్ని చూడాలి.

గాంధీగార్ని గురించి వినడమే కాని అంతవరకు చూడలేదు. ఆయన ఆ ప్రాంతాలకు వస్తున్నది అదే మొదటిసారేమో కూడ. భారత స్వాతంత్రోద్యమానికి నాయకత్వం వహించిన గాంధీ గారంటే భీమన్నకు ఎనలేని భక్తి. అప్పుడు లండను నగరంలో జరుగుతున్న రౌండ్ టేబులు సమావేశాలను గురించి క్లాసుల్లో టీచర్లు ఎంతో చక్కగా వర్ణించి చెపుతుండేవారు. పత్రికలను క్లాసుల్లోకి తెచ్చి నాయకుల ఉపన్యాసాలను చదివి వినిపించేవారు. వాటిపై ఉద్రేకపూరిత మైన వ్యాఖ్యానాలు చేసేవారు. జాతీయోద్యమం గురించి, దాని నాయకుల గురించి అంతవరకు భీమన్నకు ప్రత్యక్షంగా ఏమీ తెలీదు. ఉద్యమ వార్తలను కన్నులకు కట్టినట్లు వర్ణించి చెప్పే టీచర్లే భీమన్నకు ఆరాధ్య నాయకులైనారు. అందుకే ఆనాటి కోట పాలయ్య, తిమ్మరాజు శేషగిరిరావు, గార్లంక వీర వెంకట సత్యనారాయణ, చిల్లరిగె యోగానందకవి గార్లు నేటికీ భీమన్న స్మృతి పథంలో నిలిచి వున్నారు.

"తిరిగి నేను ఆ బానిస దేశంలో కాలు పెట్టలేను. ఇస్తే నా దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వండి. లేకపోతే నా సమాధికోసం ఆరడుగుల నేల ఇవ్వండి" అంటూ లండను సమావేశంలో మహమ్మదాలీ బ్రిటిషువారికి చేసిన విజ్ఞప్తిలోగల దహించివేసే వేడి భీమన్న రక్తంలోని ప్రతి అణువును ఆవిరిగా మార్చివేసిన రోజులవి. కాళ్ళకు చెప్పులు, నెత్తిన గొడుగు ఏమీలేని ఆ మండుటెండలో చెమట్లు క్రక్కుకొంటూ భీమన్న రాజోలు వెళ్ళేసరికే గాంధీగారు వచ్చి వెళ్ళిపోయినట్లు తెలిసింది. ఇక ఆ నిరాశను ఊహించుకోవలసిందే. అంత చిన్నప్పుడే భీమన్నకు దేశంపట్ల, దేశనాయకుల పట్ల ఎంతటి భక్తి ప్రపత్తులుండేవో తెలుసుకోవడానికి ఈ సంఘటన ఒక చిన్న ఉదాహరణ మాత్రం.

సవర్ణ హిందువుల క్రింద మామూలు బానిసలు. బానిసత్వమంటే ఏమిటో భీమన్నకు ప్రత్యక్షంగా తెలుసు. దారిద్ర్యం, వెలి, సంఘంలో గౌరవ రాహిత్యం, హైన్యం – ఇవన్నీ కూడ భీమన్న స్వయంగా అనుభవిస్తున్నవే. ఈ వేటినీ తాను లెక్క చేయికపోయినా తన కులం వాళ్ళు ప్రతి నిత్యం అనుభ

విస్తున్న ఈ దాస్య దురంతాలను చూసి ఆత్మగతంగా దుఃఖపడుతున్నవాడే. ఒక్క కులం అనుభవిస్తున్న దాస్యమే ఇంత ఘోరంగా వుంటే, ఇక మొత్తం దేశమే అనుభవించే దాస్యం ఎంత క్రూరంగా వుంటుందో భీమన్న ఊహించుకోగలిగాడు. ముందుగా దేశ దాస్యం తొలగిపోతే, కుల దాస్య నిర్మూలనకు పోరాటం సులభతర మవుతుం దన్న నిర్ధారణకు వచ్చాడు.

అందుకే భీమన్న దృష్టి ఆనాటి నుంచీ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించడమే ప్రధాన కర్తవ్యం అన్న లక్ష్యంపై కేంద్రీకృతమైంది.

దేశ దాస్యము తుడిచి జాతికి
తేజ మొసగిన దెవరు తండ్రీ?
పతిత జనముల పేద జగముల
గతులు మార్చిన దెవరు తండ్రీ?

—రాబీలు.

బానిస తనమును బాపురా
భారత భూమికి భాగ్యము తేరా!

—పాలేరు.

35. మితిమీరిన ఆత్మవిశ్వాసం

హైస్కూలు చదువు పూర్తి అయింది. స్కూలు ఫైనల్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైనై ధైర్యంచెప్పి ఆశీర్వదిస్తూ పాలయ్య మాష్టారు ఇచ్చిన పటిక బెల్లం ముక్కను నోట్లోవేసుకొని పరీక్షలు వ్రాయడం మొదలు పెట్టాడు భీమన్న.

లెక్కల పరీక్ష రోజున - ఒక గంటన్నర లోపలే మొత్తం లెక్కలన్నీ చేసేశాడు, ఒక్క బిట్టు తప్ప. ఆ బిట్టు గ్రాఫుకు సంబంధించింది. గ్రాఫు కాగితం మీద బొమ్మ గీసి ఫలితం కనుక్కోవాలి. ఆది చాల చిన్న లెక్క. దానికి నాలుగు మార్కులు. పైమ్ గంటకు పైగావుంది. చేసిన లెక్క లన్నిటినీ మరోసారి చూసుకొని, గ్రాఫులెక్కకు వూనుకొన్నాడు భీమన్న.

తన ఆలవాటు చొప్పున ముందుగా ఆ లెక్కను ఒక చిన్న చిత్తుకాగితం మీద రెండు మూడు స్టెప్పులు వేసుకొని ఫలితం తేల్చుకొన్నాడు. ఆ లెక్కకు

ఫలితం ఒకటిన్నర. ఆ తరువాత గ్రాఫు గీశాడు. అది ఫలితాన్ని పదిన్నరగా చూపింది. కాగితం మీద వచ్చిన ఫలితానికి, గ్రాఫుద్వారా వచ్చిన ఫలితానికి సంబంధమే లేకపోయింది. తికమక పడ్డాడు.

అసలు ఆది గ్రాఫు లెక్క. గ్రాఫు గీసి ఫలితం చెప్పాలి. అందుకు పది నిమిషాలు కూడ పట్టదు. ఆలానే చేశాడు. ఫలితం పదిన్నర వచ్చింది. దాన్ని అలా వుంచేస్తే సరిపోయేది. తాను స్పెషల్ మేథమెటిక్సువాడు కనుక, స్పెషల్, జనరల్ - రెండురకాల లెక్కలలోనూ తనకు ఫస్టు మార్కులే వస్తాయి కనుక, కొంత అతి తెలివిని ప్రదర్శించా డిక్కడ. చిత్తుకాగితంపై లెక్క చేసుకొన్నాడు. ఒకటిన్నరకు పదిన్నరకు పొత్తుకుదరక, ఏమీ తోచక, పదిన్నర చూపుతున్న గ్రాఫుకు ఒకటిన్నరకు మార్చాలని తంటాలుపడి, లెక్క పాడుచేసి వదిలేసి, వచ్చేశాడు. బైటికి వచ్చి చూసుకుంటే పదిన్నర ఫలితమే కరెక్టు. మరి ఒకటిన్నర ఎలా వచ్చినట్టు? లెక్క చేసినప్పుడు ఒకటి తర్వాత సున్న దించుకోలేదు. ఏడ్చి ఏం లాభం? తాను గీసిన గ్రాఫే కరెక్టు. ఆతి తెలివికి పోవడం కొంపముంచింది!

ఫిజిక్సు థీరీ పేపరు అద్భుతంగా వ్రాశాడు. ఆందులో అరవైకి నలభై పైనే రావాలి. పరీక్షలు చివరిరోజున ఫిజిక్సు ప్రాక్టికల్సు. ఒక మైనపు కణికను ఇచ్చి, దాని మెల్టింగు పాయింటును కనుక్కోమన్నారు. భీమన్నకు ఈ ఎక్స్‌పరిమెంటు కొట్టిన పిండి. అది పేరఫిన్ వేక్సు అని తెలుసు. దాని మెల్టింగుపాయింటూ తెలుసు. చెయ్యవలసిందల్లా - వేడిని డిగ్రీల క్రమంలో గుర్తులుపెట్టి గ్రాఫు గీయడం, చాల సుళువైన ప్రయోగం. నలభైకి నలభై మార్కులు రావలసినట్టిది.

మంచి ఉత్సాహంతో అన్నీ అమర్చుకొని, స్టౌ వెలిగించి, టెస్ట్‌ట్యూబ్ పెట్టి - ఆ ప్రక్క విద్యార్థికి సహాయం వెళ్ళాడు. భీమన్న తిరిగివచ్చి చూచుకొనేటప్పటికి తన ప్రయోగం సర్వనాశన మయింది! వేక్సు మొత్తం కరిగిపోయి వేడి తారాస్థాయిలో వుంది!

ఇక - ఏం చెయ్యాలి? ఎక్స్‌పరిమెంటు మళ్ళీ చెయ్యడానికి కావలసిన ట్రైం వుంది. మైనపుకణిక ఏది? అది క్లాసుకాదు. పబ్లిక్ పరీక్ష.

భీమన్న ఏడుపు చూచి, జరిగింది తెలుసుకొని, అక్కడి ఇన్విజిలేటరు ఎంతో సానుభూతిని ప్రకటించాడు. తనకుమాలిన ధర్మం ఫలితం ఇలానే వుంటుంది అన్నాడు. ఎంతటి ఆత్మవిశ్వాసానికైనా ఒక మితి వుండాలన్నాడు. అంతకంటే అతడు మాత్రం ఏం చెయ్యగలడు? పోసి, ఏదో పాతప్రయోగాన్ని గుర్తుకు తెచ్చుకొని గ్రాపు గీయవచ్చు ననుకుంటే, ఈ ప్రయోగాని కిచ్చిన వేళ్ళు ఎలాంటిదో! ఒక్కసారి పాడైన తర్వాత, సరిచిద్దడానికి ఎంతో శ్రమ, ఎన్నో అనుమానాలు, మనోవ్యథలు.

పబ్లిక్ పరీక్షలలో జరిగిన ఈ విధమైన అవకతవకల వల్ల, ఆ వేసవి సెలవు లన్నీ వట్టి మానసిక చింతతో గడిచిపోయినై భీమన్నకు. లెక్కలు, సైన్సు మాష్టార్ల చివాట్లకు లెక్కలేదు.

రిజల్టు వచ్చాయి. ఫిజిక్సులో 46. ప్రాక్టికల్స్ పూర్తిగా పోగా, ఒక్క థీరీలోనే 60 కి 46 వచ్చాయి. పోసిలే, పాసయ్యాం అనుకొన్నాడు. లెక్కల్లో 96. ఆ తగలేసిన బిట్టు నాలుగు మార్కులూ పోయాయి. స్పెషల్ మాథ్స్‌లో 83, ఫస్టు మార్కు. తెలుగు 88, ఫస్టు మార్కు. మొత్తం మీద సరాసరి 68 శాతం, స్కూలుకు ఫస్టు మార్కు.

ప్రతి అక్షరం బీజాక్షరమే
ప్రతీ మాటా మంత్రమే మనిషికి
తెలిసి తెలివిగా వాడు కొంటే
అక్షరాలే అక్షర లక్షలు పండుతై
మాటలే మాణిక్యవీణ లవుతై
బెడిస్తే - కస్సున లేస్తై మిన్నాగులై

—అనాది కొస

36. అడుగడుక్కి అవిఘ్నమస్తు

భీమన్న స్కూలు ఫైనలు ప్యాసయ్యేనాటికి తమ ఆర్థిక పరిస్థితి తిరోగమనంలో వుంది. కౌలు భూముల్లో కొద్దిగా మాత్రమే ఉంచుకొని, తక్కిన వాటిని వదిలేశారు పల్లయ్యగారు. గరువుమీద నాలుగెకరాల కొబ్బరితోటను కొన్నారు అప్పుచేసి. తోటకట్టవలలోని చెట్లను అమ్మేసి కొంత తీర్చేసినా,

అప్పు ఇంకా మోపుగానే వుంది. తోటలో కొత్తచెట్లను నాటవలసి వుంది. పని చాలా వుంది.

చదువును అంతటితో ఆపేసి, ఉద్యోగ ప్రయత్నం చెయ్యమన్నారు భీమన్నను. లెక్కల్లో మార్కల్నిబట్టి, సూపర్‌వైజర్ ట్రైనింగుకు వెళ్ళమన్నారు కొందరు. ఎక్కడెక్కడికో దరఖాస్తులు పంపాడు ఇష్టంలేకపోయినా. అలానే—కాకినాడలోని పిఠాపురం రాజావారి కాలేజీకి కూడ ఒకటి పడేశాడు. మరెక్కడినుంచీ జవాబులు రాలేదుకాని, పి.ఆర్. కాలేజీ నుంచి మాత్రం ఇంటర్ మీడియట్‌కు సీటు వచ్చింది.

స్కాలర్‌షిప్పు వుందికనుక, ఆర్థికమైన బెంగలేదు. తెలివైనవాడు కనుక పైకి చదవ వలసిందే. పల్లయ్యగారి చింత ఒక్కటే, కొడుకును అంతదూరంలో వదిలేసి ఎలా వుండడం అని. పైగా, కుటుంబస్థితి బాగాలేదు. అన్నివిధాలా అండవస్తున్నవాడు భీమన్న. ఏదో ఉద్యోగంలో చేరి, కుటుంబ బాధ్యతను మీదవేసుకొంటే, తాను ఏ హరద్వారమో పోవచ్చునని అయన ఆశ. ఈ హరద్వారం గురించి ఆయన శిష్యులతో ముచ్చటిస్తున్నప్పుడు చాలాసార్లు వినివున్నాడీయన.

నగరం స్కూల్లో ఉండగా ఒకసారి—ఏదో ఊరు వెళుతూ పల్లయ్యగారు తోట మకాంలోని కొబ్బరికాయల రాశిని భీమన్నకు అప్పజెప్పి వెళ్ళారు. రాశిపై కొబ్బరాకులు కప్పి, రాత్రంతా అక్కడే పడుకున్నాడు భీమన్న—తన మిత్రులతో. మిత్రులంటే ఆ పేటలోని తన ఈడు కుర్రవాళ్ళు—గడ్డం వెంకన్న, బయ్యా పాపుడు, జల్లి వీరన్న వగైరాలు. ఈ ముఠా అంతా రాత్రులు పొడుగుపాటి వెదురు కర్రలు చేతబట్టి, రోడ్డువెంట, తోట గట్లవెంట తిరుగుతూ వుండేవారు. ఆ రోజుల్లో భీమన్నవద్ద బర్మానుంచి ఎవరో తెచ్చి ఇచ్చిన టార్చి లైటు కూడ వుండేది.

రాత్రంతా కాపలా కాసి ఎప్పుడు నిద్రపోయాడో ఏమో, పల్లయ్యగారు వచ్చి లేపేటప్పటికి తెల్లవారుతూ వుంది. రాశిలో ఒక ప్రక్క తరిగివుంది. దొంగతనం జరిగిపోయింది!

"చదువువల్ల లాభంలేదు. నిన్ను పాలేరుతనం పెట్టేస్తాను" అని తిట్టారు పల్లయ్యగారు. చద్దన్నం తిని సిద్ధంగా వుండమనీ, ఎవరో భామందు వద్దకు తీసుకెళతాననీ చెప్పి వెళ్ళిపోయారు దొంగల వేటకు.

మామిడికుదురు దొంగలు మహా పేరుమోసినవాళ్ళు. ఇంటి యజమానికి ముందుగానే తెలియపరచి మరీ దోచుకునేవాళ్ళు. లక్షాధికార్ణ ఇండ్లమీదికే వెళ్ళేవాళ్ళు. ఆది పాత తరం. కొత్తతరం కుర్రకారు అంత సమర్థులు కాదు. చిల్లర దొంగతనాలతో పొట్ట నింపుకుంటున్నారు.

ఆరాత్రి ఆదొంగ గాడిదలెవరో భీమన్న ప్రాణం మీదికి తెచ్చారు. తల్లితో చెప్పుకొని ఏడ్చాడు. బడి మానిపిస్తే చెట్టెక్కి దూకి చస్తా నన్నాడు. శ్మశానాల సమీపంలో రోడ్డుమీద ఒక మర్రిచెట్టుంది. దాని కొమ్మల్లోకెక్కి కూర్చున్నాడు. సాయంకాలం తండ్రివచ్చి ప్రతిమాలేదాకా చెట్టు దిగలేదు. ఆ రోజంతా ఆ చెట్టుకు వాలేరు తనం చేశాడు భీమన్న!

ఈ విధంగా మొదటినుంచి కూడ భీమన్న చదువుకు ఏవో విఘ్నాలేర్పడుతూనే వచ్చాయి. వేసే ప్రతి అడుగునూ అవిఘ్నమస్తు అనుకుంటూనే వెయ్యవలసి వచ్చింది. ఏమైనాసరే కాలేజీకి వెళ్ళాలనే అనుకొన్నాడు భీమన్న. ఏ స్కాలర్‌షిప్పూ లేని బయ్యా వెంకన్న, బడుగు వెంకటరెడ్డి వంటి వాళ్ళే కాలేజీకి వెళుతున్నప్పుడు, తానెందుకు మానాలి? తండ్రిని ఒప్పించి కాకినాడకు ప్రయాణమైనాడు.

కలేజీలో చేరుతున్న ఉత్సాహం, ఆనందం ఉరకలు వేస్తున్నా, పల్లెలోని తనవాళ్ళను, నేస్తాలను వదిలి ఉండవలసి వస్తున్నదన్న చింతతోనే అందరివద్ద వీడ్కోలు తీసుకున్నాడు. ఆ వయస్సులో నలభైమైళ్ళ దూరంలో వుండే కాకినాడ కూడ మామిడికుదురుకు ఎంతో దూరం!

పూవు లెన్నియున్న గాని
నీవు లేక వసంతమా?
నీ మోహపలోని మోహి
నికి నాకింత దూరమా?
దవ్వులలో నీ రుచులు
కవ్వించును క్షణము క్షణము,
క్షణమే యుగ మయ్యె, నిరీ
క్షణమే ప్రతికాయ్యె గదే!

—రాభీలు.

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

వికాస సర్గ

38. కవుల తొలి పరిచయం

"ఎలిమెంటరీ స్కూలు, మిడిల్ స్కూలు, హైస్కూలు - దశలు చీకట్లో, చిన్న పెద్ద దీపాలు. కాలేజీలో కాలుపెట్టడం చీకటిని ఏడిచి నూర్యోదయంలో ప్రవేశించడమే." అంటాడు భీమన్న తన కాలేజీ తొలి రోజుల్ని స్మరిస్తూ.

ఆ వాతావరణమే వేరు, ఆ లోకమే వేరు. హైస్కూలు ఒక చెట్టునీడ అనుకొంటే, కాలేజీ ఒక విశాలోద్యానం. ఎంతో అదృష్టవంతులకు తప్ప కాలేజీలో చదివే మహాభాగ్యం లభించదు అంటాడు.

అందరు విద్యార్థులూ క్రొత్తవారే. అన్ని ముఖాలూ విజయోత్సాహంతో జిగేలు మనేవే. ఆ కళ్ళల్లోని ఉదయ రవిచంద్రికలకు ఆవధు ల్లేవు.

అక్కడ ఎవరి దే కులమో తెలియదు. అడిగేవా ళ్ళుండరు. అంటరాని తనమా? దాని ధ్యాసే లేదు. అది పల్లెటూళ్ళకు మాత్రమే పరిమితమైన ఒక పీడకల. అలవాటు చొప్పున భీమన్న క్లాసు గాలరీలో చివరి వరుసను వరిందాడే తప్ప, ఎవరిష్ట మొచ్చిన చోట వారు కూర్చోవచ్చు. లెక్చరరుకు ముఖాముఖిగా ముందువరుసలోనే కూర్చోవచ్చు. అంటరాని వెనకబడినతనం నుంచి ఎంత శుభంకరమైన విముక్తి! కాలేజీలో చేరకుండావుంటే ఇంతటి అపూర్వమైన అభ్యుదయ లోకాన్ని తాను చూచి వుండేవాడు కాదుకదా. కాలేజీలో చేరిన తొలి రోజులు భీమన్నకిచ్చిన సంభ్రమానంద సమనుభూతి అనంతమూ, అనిర్వచనీయమూ.

అక్కడ టీచర్లు లేరు, అంతా లెక్చరర్లు, వక్తలు! పాఠాలు చెప్పరు, ఉపన్యాసాలిస్తారు. కాలేజీ లెక్చరర్లు స్కూలుటీచర్లవలె సంసార భారంతో వంగిపోయి, నీరసంగా, నిస్తేజంగా వుండరు. విద్యార్థులకంటె కుర్రవాళ్ళలా, హుషారుగా వుంటారు. ఎక్కువమంది ఇంకా పెళ్ళికానివాళ్ళే. విద్యార్థులతో ఫన్ను, విట్టు, జోకు, హ్యూమరు పంచుకొంటూ చనువుగా, స్నేహంగా వుంటూ – ఏ విద్యార్థికి ఏ రంగంలో ప్రతిభవుందో ఆ రంగంలో అతణ్ణి ప్రోత్స హిస్తూ మెలుగుతాడు. ఎంత గొప్ప విషయం!

ఆట్టి ఉజ్జ్వల వాతావరణంలో భీమన్న తొలిసారిగా దర్శనం చేసుకొన్న కవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.

అంతవరకూ భీమన్నకు పరిచయమైన కవులు కుసుమ ధర్మన్న, గుబ్బల వీరాస్వామి, గొల్లపల్లి శామ్యూలు, చిల్లరిగె యోగానందయ్య మున్నగువారు. వారంతా ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి పద్యాలూ పాటలూ వ్రాసినవారు. భక్తికూడ తాను తరించాలన్న ఒక ప్రయోజనమే. బహుశా ఆట్టివారిని కమిటెడ్ రచయిత లనవచ్చు. స్వచ్ఛమైన కవిత్వాన్ని చెప్పే కవిని ప్రత్యక్షంగా తొలిసారి భీమన్న చూసింది కృష్ణశాస్త్రి లోనే!

ఎంతోమంది కవుల్ని చూచిన తర్వాత, ఈ నాటికీ కూడ భీమన్న దృష్టిలో ఆదర్శప్రాయమైన కవిరూపం కృష్ణశాస్త్రిదే. కవి అన్నవాడు కృష్ణ శాస్త్రిలా వుండాలంటాడీయన. సౌమ్యుడూ, ప్రసన్నుడూ అయివుండాలి. అపారమైన ఆశ్వాసనాన్ని, విశ్వాసాన్ని అందజేసి, ఆనందానికి ఆదర్శంగా నిలవగలగాలి. తాను వ్రాసే ప్రతి వాక్యానికీ తాను లక్ష్యప్రాయుడు కావాలి.

"నేను హిమాలయ శృంగాన్ని" అని బడాయి వ్రాతలు వ్రాస్తూ, తాను ఒక కుంటి పిల్లలా బ్రతికేవాడు – అతనికెన్ని ప్రచార సాధనాలు పగటి దివిటీలు పట్టినా – కవి కాలేడు. ఉత్తర కుమారుడు వీరుడు కాలేడు. అలాగే, తానే రోగాలతో తీసుకునే డాక్టరు రోగులకు విశ్వాసాన్ని కలిగించ లేడు. ఎన్ని కష్టాలు, నష్టాలు, బాధలు, బెంగలు చుట్టుముట్టినా సరే శాంతుడై, స్థిరుడై వుండేవాడే కవి. కవి ఋషి అయివుండాలనడం అందుకే.

ఇక్కడ ఒక ప్రశ్నకు జవాబు చెప్పవలసివుంది. ఆనందంకూడ ఒక ప్రయోజనమే కదా అని. ప్రయోజన మంటే సర్వ జనీనం కాని ఒక పాక్షిక

లాభం. భక్తి, మతం, సంఘం, రాజకీయం - ఇవన్నీ పాక్షిక మైనట్టివే. అనందం సర్వజనీనం. ఇండియాలో ఒక మతస్థుడికీ, ఇంగ్లాండులో మరొక మతస్థుడికీ, జపానులో ఒక శ్రామికుడికీ, అమెరికాలో ఒక పారిశ్రామికుడికీ, కెన్యా విద్యార్థికీ, రష్యా విజ్ఞానికీ కూడ ఆనందం కలిగించేది కవిత.

కవి కృష్ణశాస్త్రిలా, తాత్త్వికుడు శ్రీకృష్ణుడిలా వుండా లంటాడు భీమన్న. సన్యాసులూ, పీఠాధిపతులూ బ్రహ్మవిద్యా గురువులుగా పనికిరా రంటాడు. కవిగాని, వేదాంతిగాని ప్రజల కుపయోగ పడా లంటే, ప్రజల మనో వికాసానికి తోడ్పడాలంటే - ప్రజల కష్టసుఖాలను పంచుకొంటూ, ప్రజల ఆహార విహారాలలో పాల్గొంటూ, ప్రజల మధ్య జీవించాలి. ఎక్కడో ఉన్నతాసనాలలో కూర్చుని క్రిందివాళ్ళకు ఉపన్యాసాలు దంచగూడదు. నివేదన కుపయోగపడే పదార్థం తినడానికికూడ పనికిరావాలి.

కృష్ణశాస్త్రిగారి తొలి దర్శనం భీమన్నకు ఒక త్రిల్లు. ఆయన కవితా, పర్సనాలిటీ మాత్రమేకాక - ఆయన కంఠంలోని శ్రావ్యతా, పద్యం చదివే రాగరీతి కూడ ఈయనను బాగా ఆకర్షించినై. ఆయన మిత్ర పరిధిలోనే భీమన్నకు ఆనాడు పరిచయమైన ఇతర కవులు తల్లావఝుల శివశంకరశాస్త్రి, శ్రీరంగం నారాయణబాబు, అడవి బాపిరాజు.

హృదయ మున్నవుడే జీవి కడల గలడు
కష్ట సుఖములు చూచి, దుఃఖములు పీచి:
ఎండకును వానకును భేద మెంచ లేని
బొమ్మరాతికి నవ్వు లేడ్పులను కలవె?

—మధు గీత

39. కళా కల్పవృక్షం

కాకినాడ పి. ఆర్. కాలేజీలోని 1931-35 మధ్య, ఇంటరు రెండేళ్ళు, బి. ఏ. రెండేళ్ళు భీమన్న జీవితంలో అమృతవర్షా లైనై.

"పి. ఆర్. కాలేజీ ఒక కళాకల్పవృక్షం" అంటాడు భీమన్న. ఎక్కడా సీటుదొరకని వాళ్లంతా ఆ కాలేజీలో చేరేవాళ్ళు. మొత్తం రాష్ట్రం నలుమూలల

నుంచీ వచ్చేవాళ్ళు. సీటులేదనే మాటే వుండేదికాదు - ఎంత తక్కువ మార్కులు వచ్చినా.

మా మా విద్యార్థులకూ, మహిళా విద్యార్థులకూ ఏ ఫీజులూ వుండేవి కాదు. ఉచిత విద్యేకాక, ధనసహాయమూ, మర్యాదాకూడ లభించేవి.

కాలేజీ పిఠాపురం మహారాజా వారిది. ఆయన బ్రహ్మధర్మాన్ని అనుసరించిన వదాన్యుడు, దాత, సాహిత్య కళాపోషకుడు. భోజరాజు, కృష్ణదేవరాయలు ఒక శరీరంలో చేరిన సరస్వతీమూర్తి. అంతేకాక, దీన జనోద్ధారకుడు. కాలేజీ కాక కాకినాడలో ఒక అనాథశరణాలయం, బ్రహ్మమందిరం వుండేవి. పిఠాపురంలో హైస్కూళ్లు, మా మా బాలురకు, బాలికలకు వేరు వేరు హాస్టళ్లు వుండేవి. వాటిలో ఉచిత భోజనవసతి సౌకర్యాలుండేవి. మొత్తం ఈ సంస్థలన్నిటినీ రాజావారే పోషించేవారు. శరణాలయవాసులూ, హాస్టలు పిల్లలూ రాజావార్ని నాన్నగారనే పిల్చేవారు. ఏ ప్రభుత్వంకాని, ఏ పార్టీకాని అప్పటికింకా ఊహించనైనా లేని హరిజనోద్ధరణ కార్యక్రమాలను వాస్తవంగా ఆమలులోకి తెచ్చిన మహామనీషి నవసమాజ నిర్మాణ ఆయన. యుగకర్త పిఠాపురం రాజావారు.

రాజావారికి తలలో నాలుక సర్. ఆర్. వెంకటరత్నం నాయుడుగారు. నాయుడుగారంటే మనీషకు, మహనీయతకు, మానవతకు గుణవాచకం. స్వయంగా ఒక హరిజన బాలిక సగుణను పెంచుకొని బ్రాహ్మణ యువకుడైన "తారకం"గారికిచ్చి వివాహం జరిపించిన నిష్కల సమాజ నిర్మాణ వైతాళికుడు ఆయన భక్తుడు, పవిత్రుడు, బ్రహ్మర్షి.

కాలేజీ ప్రిన్సిపాలు వేమూరి రామకృష్ణరావుగారు. ఆ రోజులలో బందరు హరిజన హాస్టలును నడుపుతున్న రాంజీరావుగారి అన్నగారాయన. ఆంగ్లంలో గొప్ప పండితుడు. భీమన్న కాలేజీలో చేరిన నాలుగైదు నెలలకే రిటైరయ్యాడు. ఆ తర్వాత ప్రిన్సిపాలు పెద్దాడ రామస్వామిగారు. కాలేజీకి ఆయన చక్కగా, సుకుమారంగా తయారై వచ్చేవాడు. ఆంగ్లభాషలో అందమైన పదజాలంతో ఉపన్యసించేవాడు. ఆరేషనుకు సాకార రూపం ఆయన. సెలవుపెట్టిన విద్యార్థులుకూడా ఆయన ఇంగ్లీషు క్లాసుకు హాజరయ్యేవారు. తెలుగులో చిల్లరిగె

యోగానందయ్య, ఇంగ్లీషులో పెద్దాడ రామస్వామి. తా నెరిగిన టీచర్లలో విద్యార్థులను అంతగా ఆకర్షించినవారు మరిలే రంటాడు భీమన్న.

ఇంటరులో చదవవలసిన విషయాలు మూడు. ఇంగ్లీషు, తెలుగు, గ్రూప్. గ్రూపులో మూడు భాగాలుండేవి. ఆ మూడు రకరకాల కాంబినేషన్లుగా వుండేవి. భీమన్న హైస్కూల్లో మేథమెటిక్స్, ఫిజిక్సువాడు. అది గ్రూప్ ఒన్. కాలేజీలో వాటికి కెమిస్ట్రీ కలపవలసి వుంది. అంతా అలానే చేస్తారు. భీమన్నమాత్రం తెలుగు కలిపాడు. అదొక చిత్రమైన కాంబినేషను.

తనతోపాటు రాజోలునుంచి వచ్చిన బయ్యా స్వామి, బయ్యా వెంకన్న, కాకినాడ రేచపేటకు చెందిన బొడ్డుపల్లి రంగనాయకులు, పిఠాపురం హాస్టలు నుంచి వచ్చిన కాశి ఆదినారాయణ ఈ నలుగురే ఆ సంవత్సరం పి. ఆర్. కాలేజీలో చేరిన మా మా విద్యార్థులు.

అది మర్రో, మామిడో, పొన్నో, పొగడో
ఏ చెట్టయినా ఒకటే - ముఖ్యం అది ఇచ్చే నీడ
ముందు ఈ మందు పెండల నుంచి బైట పడితే
ఆ పైది పుష్పఫల మధు రసా స్వాద ప్రసక్తి!

—గుడిపెలు

40. కచేరిపేట అమ్మ

ఆ రోజుల్లో కాలేజీలోని మామా విద్యార్థులకు వేరే హాస్టలు లేదు. జనరల్ హాస్టలులో మామాలకు ప్రవేశం వుండేదో లేదో తెలియదు. అందుకు ఎవరూ ప్రయత్నించిన వాళ్ళూ లేరు. అందువల్ల వెంకన్న, స్వామి, తాను కలిసి కచేరి పేటలో ఒక ఇంట్లో మకాం కుదిరాడు భీమన్న. స్వామి అన్న గారు పుల్లయ్య. ఆయన ఆంతకు ముందు ఇంటర్ చదివిన రోజుల్లో ఆ ఇంట్లోనే వుండేవాడు. అసలు ఈ ముగ్గుర్నీ మొదటిసారిగా కాకినాడ తీసుక వెళ్ళినవాడు ఆ పుల్లయ్యగారే. ఆ ఇంట్లో మకాం పెట్టించింది కూడా ఆయనే. మంచి కసరత్తు చేసి గొప్ప వస్తాదులా వుండేవా డాయన. ఇంటర్‌తో చదువు ఆపేసి పోలీస్ అధికారి అయ్యాడు తరువాత.

ఆ ఇల్లు హరిజనులదే – దుండి మంగమ్మ గారిది. సొంత ఇల్లే. చాల పెద్దది. రెండు పెద్ద గదులు, రెండు వసారాలు, ఒక విశాలమైన దొడ్డి, వాకిలి. ఇంటి ముంగిట వాకిలి ఆవతలి ప్రక్క ఒక ప్రత్యేక వంట గది. వంట గది ప్రక్క ఒక మంచినీళ్ళ బావి. ఆ ఇంట్లో తన ముసలి తల్లి, తాను మాత్రమే వుండేది మంగమ్మగారు. కొడుకు ఐర్మాలో వున్నాడట. ఇంట్లోని ఒక గదిని, వసారాను విద్యార్థులకు అద్దెకిచ్చి వాళ్ళకు తానే వంటచేసి పెడుతుండే దామె. అంతకుముందు పుల్లయ్యగారూ, ఆయన మిత్రులూ అక్కడ ఆ విధంగా వున్నవాళ్ళే.

అద్దెకు, భోజనానికి కలిపి ఒక్కొక్కరు నెలకు ఎనిమిదేసి రూపాయలు ఇచ్చేవాళ్ళు. ఉదయం ఆపాలు, కాఫీ ఇచ్చేది. కాఫీలో పాలుండే వుండేవి, లేకపోతే లేదు. కాఫీ ఎంత నల్లగా వుంటే అంత ఆరోగ్యకరం అనేది మంగమ్మగారు. భోజనంలో గ్రుడ్లు, మాంసం, చేపలు విధిగా వుండేవి. కాకినాడలో దొరికే అన్ని రకాల చేపలు తెచ్చి వండి పెట్టేది. సొంత బిడ్డలుగా చూచుకొనేది. వీళ్ళ సుఖం కోసమే పాటు పడేది. భీమన్నపట్ల ఎక్కువ ఆప్యాయత చూపుతూ "భీమరాజూ" అని నోటార పిలుస్తూ వుండేది. భీమన్న జీవితంలో అమ్మా అని పిలిచిన ముగ్గురిలో ఈ మంగమ్మగారు మూడవది. ఈనాడు ఇంతదూరంనుంచి వెనక్కి చూస్తూ ఆంటాడు భీమన్న-ఈ ముగ్గురూ తనకు ఒకే రూపం అని!

ఆది కోటలాంటి ఇల్లు. తూర్పు, ఉత్తరం, పడమర ప్రహరీలాంటి చెట్ల కట్టవలు, ఇళ్ళు. దక్షిణం వైపున మాత్రమే బైటికి దారి. ఆ బైట ఉప్పు బేరు. ఆ ఏటి గట్టే కాల్దారి. ఆ ఏరు పడమటగల కాలువ లాకునుంచి తూర్పుకు ప్రవహించి జగన్నాథపురం వంతెన క్రిందగాపోయి సముద్రంలో కలుస్తుంది. రక రకాల నావలతో పడవలతో నిండి వుంటుంది. ఆ ఏటికి ఎగువ పడమట ఒక ఫర్లాంగు దూరంలో లాకు వుంది. ధవళేశ్వరం-కాకినాడ పడవల కాలువ ఆ లాకు ద్వారానే ఉప్పుటేరును చేరుతుంది.

భీమన్న కాలేజీ జీవితంలో, సాహితీ జీవితంలో, నిజ జీవితంలో కూడ ఆ పేటకు, ఆ ఇంటికి, ఆ ప్రాంతానికి ఒక ప్రత్యేక స్థానం వుంది. అందుకే ఈ విపుల వర్ణన.

కచేరీ పేట ప్రధానంగా మాలపేట అయినా, అది సిటీలో మంచి కీలక స్థానంలో వుండడం వల్ల ఆక్కడ అన్ని కులాల వాళ్ళు ఆద్దెలకుంటూ వుంటారు. ఇతర కులాల వాళ్ళు మామాలను చేరనివ్వరేకాని మామాలు మాత్రం అన్ని కులాల వాళ్ళనూ చేరనిస్తారు, చేరదీస్తారు. మానవత్వమే మామాల మహత్తత్వం. కులాలవారీగా ఆంచనా వేస్తే స్వచ్ఛమైన మానవత్వం ఇంకా మిగిలివున్న దొక్క- మా మాల లోనే నేమో.

పేటకు దక్షిణాన ఉప్పుటేరూ, పొలాలు వుండే - తూర్పున రకరకాల కచేరీలు వున్నై. ఉత్తరాన బస్సు రోడ్డు, రోడ్డు కవతలి ప్రక్కన కలెక్టర్ ఆఫీసు, జిల్లాబోర్డు ఆఫీసు. వాటికి తూర్పున పి. ఆర్. కాలేజీ గ్రౌండ్స్. అసలు కాలేజి పేటకు తూర్పున ఫర్లాంగు దూరంలో వుంది. ఆ మధ్యకో జనరల్ ఆసుపత్రి. కాలేజీకి ఎదురుగా బ్రహ్మసమాజ మందిరం.

కాలేజీ, బ్రహ్మమందిరం, కాలేజీ గ్రౌండ్స్, కచేరీపేట, ఏటిగట్టు, పొలాలూ, లాకూ, అక్కడి తోటలు - ఇవీ ఆ రోజుల్లో భీమన్న నిత్యవిహార కేంద్రాలు. రకరకాల ఆకర్షణల మధ్య, రాగానురాగాల మధ్య ఆయన సాహిత్యం ఒక రూపం తీసుకొని వికసించింది ఇక్కడే.

చదువు కంటే ముందు భీమన్నకు కావలసింది సుందర ప్రకృతీ, సురభిళ వాతావరణమూ.

రంగనాయకులు స్థానికుడే కనుక సమస్యలేదు. ఆదినారాయణది అమలాపురం తాలూకాలోని పాత ఇంజరం. ఆయన ఇంటర్‌లోనే యానాంకు చెందిన రెడ్డమ్మ అనే ఒక భాగ్యవంతుల ఇంటి ఆడపడుచును పెళ్ళిచేసుకొని వేరే కాపురం వుంటూ చదివేవాడు. ఆ దంపతులు ఎంతో ఆదర్శప్రాయులు. ఆప్యాయతకూ, అతిథి మర్యాదకూ లక్ష్యలక్షణంగా సమకాలీనులలో మంచి ప్రసిద్ధిపొందిన పుణ్యదంపతులు.

కొత్తగా కాకినాడచేరి, ఎక్కడ వుండాలనే సమస్యను ఆ విధంగా పరిష్కరించుకొన్నవాళ్ళు ఈ ముగ్గురు మాత్రమే - స్వామి, వెంకన్న, భీమన్న. అమ్మతో తనకూ, తనతో అమ్మకూ అవినాభావత లభించినవాడు భీమన్న!

చంటి బిడ్డకు పాలిచ్చు చానలెల్ల
తల్లులై యుండగా, సొంత తల్లె యేల?
తల్లి పాలిండ్లు జీవామృతమున నింపు
తల్లులకు తల్లి వీవుండ తక్కువేమి?

— దీప సభ

41. గోరాగారి స్నేహం

"దేవుడు-నీ వున్నా డను కొంటే వున్నాడు, లేడనుకొంటే లేడు. ఇది మా నాన్న ఉవాచ. ఆయన ఒక ఆద్వైతి. ఆద్వైతం గోడమీద పిల్లిలాంటిది. ఇటు దూకితే ఆస్తికత్వం, అటు దూకితే నాస్తికత్వం. అందుచేత మీ నాస్తికత్వంతో నాకేమీ పేచీలేదు" అన్నాడు భీమన్న - గోపరాజు రామచంద్రరావు గారి నాస్తిక వాదం అంతా విని. అప్పటినుంచి తన వర్గంలో చేర్చేసుకొన్నాడు భీమన్నను గోరా.

గోరా పి. ఆర్. కాలేజీలో బోటనీ లెక్చరరు. భీమన్నకు ట్యూటరు. ఆ కాలంలో ట్యూటరు పద్ధతి వుండేది. కాలేజీ విద్యార్థులంతా - ఒక్కొక్క ప్రాంతంలో నివసించే వాళ్ళు ఒక్కొక్క లెక్చరరు ఆజమాయిషీలో ఉంచబడే వాళ్లు. ఆ పద్ధతి క్రింద గోరాగారి ఆజమాయిషీ క్రిందకు వచ్చాడు భీమన్న. తమకు అలాటు చేయబడ్డ విద్యార్థులను వివిధ వేళలలో వారివారి ఇండ్లవద్ద కలుసుకొని వాళ్ళ మంచి చెడ్డలను కనిపెడుతూ వుండడం, తెలియని విషయాలు చెప్పుతుండడం, ఇబ్బందులుంటే తొలగిస్తుండడం మొదలైనవి ట్యూటర్ల పనులు. ఈ బాధ్యతలను నెరవేరుస్తూ కూడ గోరాగారు మకోపని చేసేవాడు. అనేక విషయాలపై విద్యార్థులతో చర్చలు జరిపేవాడు. వాళ్ళకు హేతుబద్ధమైన ఆలోచనాపద్ధతి నేర్పేవాడు. మూఢవిశ్వాసాలను, దైవభ్రాంతిని సహేతుకంగా ఖండించి చూపేవాడు. ఆ విధంగా వందల కొలది విద్యార్థులతోపాటు భీమన్నను కూడా ఆకర్షించాడు గోరా.

ఇతరుల ఇష్టానిష్టాలు, రాగద్వేషాలు, రాజకీయాలు అర్థంకావు భీమన్నకు. అర్థం చేసుకోడానికి ప్రయత్నమైనా చేసేవాడుకాదు. నాటికి నేటికి అంతే. పోని అమాయకుడని సరిపెట్టుకోలేం. అది ఉపేక్షా భావం

అహంకార లక్షణం. ఆది గొప్పవాళ్ళకు రాణింపునూ, పేడలకు ముప్పునూ తెచ్చిపెట్టే ఒక అమూల్య రత్నం. ఆది భీమన్నవద్ద వుంది. ఆది ఈయనను పెద్దల ఆగ్రహానికి గురిచేసి, చిక్కులపాలు చేసిన సందర్భాలెన్నోవున్నై.

గోరా గారితో చర్చించడం ఉత్తేజకంగా వుండేది. ఆయనతో కలిసి తిరిగేవాడు భీమన్న. నాస్తికుడితో స్నేహం ఆస్తికుడితో విరోధమెలా అవుతుంది? రెండు వాదాలకూ అతీతంగా వుంటూ, ఇర్వురకూ స్నేహంగా వుండడం సాధ్యంకాదా? భీమన్నకు సాధ్యమే. ఈ ఆతీత మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడమే పైవాళ్ళకు సాధ్యం కాలేదు.

వేదయుగాల నాటి గురుకుల కులపతులను జ్ఞప్తికితెచ్చే పెద్ద లిద్ద రానాడు. ఒకరు గోరా. రెండోవాడు బ్రహ్మర్షి నాయుడుగారు. గోరా తన విద్యార్థులకు నాస్తికత్వాన్ని బోధిస్తే, నాయుడుగారు ఆస్తికతను నూరిపోసేవారు. ఇద్దరూ మనుషులే. మానవత మూర్తీభవించిన వారే. ఎవరి ధోరణిలో వారు తీవ్రవాదులు. ఇద్దరిపట్లా భీమన్నకు గౌరవభావాలున్నై. అయితే ఈయన రసావిష్కర్త అయిన కవి కనుక గోరాకు, గోరా మిత్రకోటిలో వాడు గనుక నాయుడి గారికీ కూడ దూరంకాక తప్పలేదు చివరకు!

పి.ఆర్. కాలేజీలో మామాలకు, మహిళలకు విద్య ఉచితం కనుక—

"మీరు ఆడవాళ్ళతో సమానం" అంటూ అప్పుడప్పుడు హేళనచేస్తూ వుండేవారట పైకులాల మిత్రులు.

"ఫర్వాలేదు. ఏనాటి కైనా రాజ్యం మాదే" అంటూ వుండేవాడు భీమన్న.

"కాలము మారిపోయె, కల
కాలకు దాస్యము నిల్వనేర, దీ
మాలలు రాజు లౌదురు సు
మా ....."

"మాలను నేను, విక్రమ కు
మారుడ నేను, స్వతంత్ర విప్లవ
జ్వాలను నేను....."

మొదలైన పద్యాలన్నీ ఈయన భావంలో ఆ కాలంలో అంకురించి నట్టివే.

అయితే—కులం, అంటరానితనం, పేదరికం, ఆర్థికబాధ వంటి సామాజిక విషయాలు భీమన్నను ఎక్కువగా తమవైపుకు లాక్కోలేక పోయాయి. ప్రణయం, సౌందర్యం, చిరునవ్వులు, చిలిపిచూపులు, ఆర్ద్ర హృదయాలు, అనురాగ భాషణలు వంటి సౌహార్ద శోభిలే భీమన్న హృదయంలో చోటుచేసుకున్నాయి.

ఆ రోజుల్లో కాకినాడ పట్టణ ప్రజాజీవితం ఎక్కువగా బ్రహ్మర్షి నాయుడుగారి చుట్టూ తిరుగుతూవుండేది. ఆయన బ్రహ్మసమాజ కులగురువు. రాజావారికి సాక్షాత్తు పరబ్రహ్మ. అట్టి మహామనీషికి భీమన్నను దూరం చేసింది—గోరాగారి నాస్తికవాద మొక్కటే కాదు, ఆయనతోబాటు జాతీయోద్యమ కార్యక్రమాలలో భీమన్న పాల్గొంటూవుండటం కూడ అందుకు దోహదం చేసింది.

రాముడో, కృష్ణుడో, బుద్ధుడో, క్రైస్తో
మార్క్సో, మహాత్ముడో, అంబేడ్కరో,
ఒకొక్క మహాపురుషుడి జీవితం
ఒకొక్క కురుక్షేత్రం!

—గుడిసెలు

42. కర్రలు - మరతుపాకులు

జాతీయోద్యమ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్న రోజు లవి. కాకినాడలో బాంబుప్రేలుడూ, భయంకరాచారి వీరవిక్రమం - యువజనులలో ఆపాదమస్తకం ఉత్తేజాన్ని ఉరకలెత్తించిన ఉదంతాలు.

భీమన్నకు స్కాలర్షిప్పు వస్తూవుంది. నెలకు పాతిక రూపాయలు. ఎంత ఖర్చయినా పది, పదిహేను రూపాయలకు మించదు. పుస్తకాలకూ, బట్టలకూ మహారాజావారిచ్చేవారు. స్కాలర్షిప్పు వచ్చేవాళ్ళకు రాజావారి సహాయం ఆ తర్వాత మానేశారు. కాలేజీ ఫీజు మాత్రం ఎవరికీ లేదు. మొత్తంమీద భీమన్నకు ఆర్థికమైన చిక్కులేవీ లేవు. ఇతరులకు సహాయపడే స్థోమతుకూడ వుండేది.

కాకినాడ వాతావరణం ఈయన సాహితీలతకు క్రొత్త చిగుర్లు తొడగగా, జాతీయోద్యమ విస్తరణ ఈయన రక్తంలో తుఫానులు లేపింది. బ్రహ్మ సమాజ క్రమ శిక్షణ ఈయనను కాలేజీ ఆవరణలో అట్టేపెట్టి వుంచగా, గోరా గారి ప్రభావం చుట్టుప్రక్కల పల్లె ప్రజల జీవితాలలోకి నెట్టింది. పర్యవసానం భీమన్నకు చదువు మీద ధ్యాస తగ్గడం. కేలు కవిత్వం కేసి, కాలు ఉద్యమం కేసి మళ్ళడం. కేలుకూ కాలుకూ పడేది కాదు. క్లాసులో లెక్చర్లను శ్రద్ధగా వినేవాడు కాదు. పరీక్షల రోజులలో తెల్లవార్లూ తేళ్ళతో గడిపి పేపర్లు వ్రాసేవాడు.

అదే సమయంలో దివ్యజ్ఞాన సమాజం నాయకుడూ, కాంగ్రెసు కార్య కర్త అయిన తాడిమేటి కుటుంబ శాస్త్రిగారితో పరిచయ మయింది భీమన్నకు. హరిజన సేవక సంఘానికి చెందిన కడలి అప్పారావు దంపతులు, శరగోపా చారి, హరిజన నాయకులు పచ్చిపాల రామస్వామి, ఈలి వాడపల్లి, రెడ్డి కామయ్య, గంటి కామయ్య, పాము రామూర్తి, భాగ్యరెడ్డి వర్మ, చెన్నా ధర్మారావు, వేముల కూర్మయ్య, కాంగ్రెసు నాయకులు బులుసు సాంబ మూర్తి, మల్లెహూడి పళ్ళం రాజు, కళా వెంకట్రావు, మాగంటి బాపినీడు, గరిమెళ్ళ వీరభద్రరావు వంటి పెద్దల పరిచయం కూడ ఆ రోజుల్లో ఏర్పడిందే.

కాలేజీ రోజులలో గోరా గారితోనూ, ఇతర స్థానిక నాయకులతోనూ కలిసి కాకినాడ పరిసర గ్రామాలలోనూ - దసరా, సంక్రాంతి, వేసవి సెలవు దినాలలో ఇళ్ళ పురుషోత్తం, నర్సింహారావు, జొన్నల మోహనరావు, ఉండ్రు సుబ్బారావు, చిన వెంకటరెడ్డి, ఎల్లమల్లి వీరాస్వామి, భూపతి తిరుపతి, నారాయణమూర్తి, బాబూరావు మున్నగు యువకులతో కలిసి కోనసీమ గ్రామా లలోనూ - జాతీయోద్యమ ప్రచారం, హరిజనాభ్యుదయ కార్యక్రమం విరివిగా సాగించేవాడు భీమన్న. చదువుకంటే సాంఘికాభ్యుదయ కార్యక్రమాలే ఎక్కువగా వుండే వీయనకు.

ఒక రోజున కాకినాడ పరిసరాలలోని ఒక గ్రామంలో ఒక మామాపేటలో ఒక చిన్న సమావేశం ఏర్పాటయింది - గోరా గారి నాయకత్వంలో. ఆది రాత్రి సమయం. సమావేశాలూ, ప్రచారాలూ రాత్రి వేళల్లోనే జరిగేవి.

ప్రసంగాలు ఉద్రేక పూరితంగా వుండేవి . అప్పట్లో గాంధీజీకి వుండే ప్రఖ్యాతి ఆంబేద్కర్‌కు లేదు . మూర్తి, కూర్మయ్య, కుసుమ ధర్మన్న, రాయుడు గంగయ్య వంటి అగ్ర హరిజన నాయకులు కూడ గాంధీజీని అనుసరించే వుండే వారు .

సమావేశం మధ్యలో ఒక వ్యక్తి లేచి నిలబడి చేతి కర్రను నేలకేసి కొట్టి-

"అయ్యగారూ , మనందరం అన్ని కులాలవాళ్ళం కలిసి , కలిసికట్టుగా ఒక్కమాటమీద నిలబడి , కర్రలు తీసుకొని ఎగబడితే , తెల్లోడు తోక ముడి చెయ్యడా ? మన వేలకొలది కర్రల ముందు వాడి కొద్దిపాటి తుపాకులు ఏమి చేస్తాయ్" అన్నాడు .

"శభాష్" అన్నా రందరూ .

"అన్ని కులాల నాయాళ్ళూ కలవాలిగా ?" అన్నాడు మరొక పెద్ద.

"నిజమే , అయితే అలా అలా కలవనివ్వకుండ తంపులు పెడుతున్నది కూడ తెల్లవాడేగా . అందుకే స్వరాజ్యం కావాలంటున్నాం . స్వరాజ్యం రాగానే కాంగ్రెసు చేసే మొదటి పని కుల భేదాలను తొలగించడం , అంటరాని తనాన్ని నిర్మూలించడం , పేదరికాన్ని రూపు మాపడం " అన్నాడొక నాయకుడు .

"అయినా - ఇది కర్రలతో జరిగే పనికాదు . తెల్లోడికి పోలీసు తుపాకులే కాదు , మర ఫిరంగులూ , సైన్యాలూ చాలా వున్నై . దౌర్జన్యం ద్వారా మన లక్ష్యం సాధ్యం కాదు . అందుకే సత్యాగ్రహాన్ని ఆవలంబించవలసి వచ్చింది ," అంటూ వివరించాడు గోరా.

స్వరాజ్యం రాగానే పేదరికం , అంటరానితనం , కుల మత భేదాలూ తుడిచిపెట్టుకు పోతాయనీ, భారతీయులంతా ఒకే జాతిగా రామరాజ్య సౌభాగ్యాన్ని పుష్కలంగా అనుభవిస్తారనీ - జాతీయోద్యమ కార్యకర్తలంతా ఊహిస్తూ ఉవ్విళ్ళూరిన రోజులవి .

సత్యం , అహింస , ఖద్దరు ధారణ , మద్య నిషేధం వంటి గాంధేయ సాధనాలను గాంధీజీ చేబట్టింది కేవల విదేశీ పాలనను తుద ముట్టించే వరకేనని ,

ఆతరువాత, స్వరాజ్యం సిద్ధించిన వెంటనే జాతీయ పునరుజ్జీవంకోసం, నవభారత నిర్మాణం కోసం కొత్త ఆలోచనలతో కొత్త ప్రణాళికలు అమలు జరపబడ తాయని విశ్వసించే వా రానాడు.

ఆ రోజుల్లో ప్రజల్లో ప్రచారాలూ, ఉద్బోధలూ ఈ రకంగా వుండేవి. మధుబాల కావ్యం, కావ్య కుసుమాలలోని కొన్ని కొన్ని కవితలూ, అసూయ నాటికా పుట్టుకొచ్చింది ఆ రోజుల్లోనే.

చల్లుము విత్తనమ్ములు, భు
జమ్మున నాగలి నుంప వేల; వి
ద్యుల్లత లేని మబ్బులకు
తోచదొ బుద్ధి; బెడంగు చుంటివో
కల్లగ మారునో ఖిదియు
గాలి దుమారమొ అంచు; కాదు కా
దల్లరి కాదు, కాల మిక
ఆగదు, లెమ్మిక, ఏరు గట్టుమా!

— బీ. కా. కుసుమాలు

43. ఊరి మధ్యలో హరిజనులు

పిఠాపురంలో హరిజన బాల బాలికల వసతి గృహాలు అందమైన బిల్డింగు లలో ఊరి మధ్యలో వుండేవి. హరిజనాభ్యుదయం ఒక ఉద్యమ రూపం తాల్చని రోజు లవి. ప్రభుత్వ బలం కాని, రాజకీయ పక్షాల దన్నుకాని ఏదీ వుండేది కాదు.

మాల మాదిగ పిల్లలు కడుపు నిండా తింటూ, క్రమంగా చదువు కొంటూ, తెల్లని బట్టలు వేసుకొని, పుస్తకాలు తీసుకొని హైస్కూళ్ళకు వెళుతూ, వస్తూ వుండే - మొదట్లో ఆ చుట్టు ప్రక్కల సిరి జను లంతా ఏడ్చి చచ్చే వాళ్ళట! ఆ హాస్టళ్ళు తమ మధ్యలో వుండటం వాళ్ళకు మరీ మంటగా వుండే దట.

కాగా– మామా పిల్లల్ని బెదరగొట్టి తరిమి వెయ్యడానికి పథకం వేసు కొన్న కొందరు దుండగులు, హాస్టళ్ళలోకి రాళ్ళు, పులి విస్తరాకులు, చెత్త విసరడం సాగించారట. అప్పటి దివాను కోకా వెంకట సుబ్బారావుగారు కలుగ జేసుకొని, దుండగాలకు పాల్పడుతున్న కొందరిని పిలిపించి సంజాయిషీ అడి గితే, మాల మాదిగ పిల్లల్ని ఊరి మధ్య పెట్టడంలోని ఔచిత్యాన్నే ప్రశ్నించా రట వాళ్ళు. అప్పుడు దివానుగారు ఉగ్రులై, తుపాకి తీసుకొని, "ఇకముందు ఈ రకమైన కులతత్వపు దుష్ట చర్య ఒక్కటి జరిగినా సరే, ఆ చుట్టు ప్రక్కల వాళ్ళ నందర్నీ కాల్చి పారేస్తాను, జాగ్రత్త!" అని హెచ్చరించి పౌష్మానాన్ని రట! ఆ తర్వాత హరిజన బాల బాలికలపై ఎట్టి అఘాయిత్యమూ జరగలేదు.

అప్పుడా హాస్టలులో వుండి, స్వయంగా ఈ సంఘటనను చూచిన విద్యార్థి – ఆ తర్వాత శాసన సభ్యుడైన నాయకుడు–బొజ్జా అప్పల స్వామి గారు ఆ సంఘటనను గుర్తు చేస్తూ అంటుంటారు–

సిరిజనుల దుండగాలను భరించలేక పోతున్నామని ఏదో గ్రామంలోని హరిజనులు గాంధీజీకి మొరపెట్టు కొన్నప్పుడు – పిఠాపురం దివానుగారు ప్రద ర్శించిన పాటి ధైర్యాన్నైనా గాంధీజీ ప్రదర్శించి వుంటే, దేశం ఆనాడే ఒక శక్తిమంతమైన సమైక్య జాతిగా రూపొంది వుండేది కదా" అని!

నిజమే, నీతులతో, ప్రవచనాలతో ఈ దేశంలో కుల తత్వాన్ని, అస్పృశ్యతనూ నిర్మూలించడం సాధ్యం కాదు. కులతత్వమూ, అస్పృశ్యతా కేవలం ఆర్థిక సమస్యలు. మతం అనేది వాటికి స్వార్థపరులు కప్పిన పులితోలు మాత్రమే. బలమైన నాయకత్వం క్రింద, తీవ్రమైన చర్యల ద్వారా మాత్రమే అవి పరిష్కారం కాగలవు.

హరిజనులకు ఇళ్ళ స్థలాలను ఊరి మధ్యగాని, ఊరికి చేర్చి కాని ఇవ్వా లనీ – వీధులు గాని, పేటలుగాని కులాల పేర్లతో వుండ గూడదనీ భీమన్న ఉద్బోధ. అది అమలు జరగాలంటే, ధర్మం కోసం పోరాటం విజయవంతం కావాలి. ఆనాడు దివానుగారు చూపిన ఆస్త్ర హస్తమే అభయ హస్తం అంటాడు భీమన్న.

పిఠాపురం రాజావారు ఒక మహా వట వృక్షం. ఆ నీడను ప్రారంభమైన హరిజనాభ్యున్నతి కార్యక్రమాలు అనేకం. కాకినాడలో ప్రహ్లోత్సవాలు, ఆస్తిక మహాసభలు, బ్రహ్మమందిరంలో నిరంతరంగా జరిగే ప్రార్థన సమావేశాలు, నాయుడుగారి ఆంగ్లోపన్యాసాలు - ఇవన్నీ ఆ కాలంలో భీమన్నను ముంచెత్తిన మహోల్బణాలు.

చిత్ర మేమిటంటే - చదువు రీత్యాను, సాన్నిహిత్యం రీత్యాను భీమన్నకు పీటన్నిటితోనూ నిత్య సంపర్కం వున్నా, ఇవేవీ కూడ ఈయన మీద తమ ప్రభావాన్ని వెయ్యలేక పోయినై. గాంధీజీ జాతీయోద్యమం, గుంట్ర బల్ల సమావేశాలు, అంబేడ్కరు పట్టుదల, హరిజనుల కేది అభ్యుదయకరం వంటి చర్చలు - అప్పుడప్పుడే మేల్కొంటున్న భీమన్న చేతనకు సోకసాగినై. వాటి అనుభూతికి ఆస్కారం బ్రహ్మసమాజ పరిధిలో కాక కాంగ్రెస్ శరధిలో లభించేది భీమన్నకు.

పిఠాపురం వసతి గృహాలలో తరచు పండగలు, విందులు జరుగుతుండేవి. అట్టి విందులకు కాకినాడ కాలేజీ హరిజన విద్యార్థులకు కూడ ఆహ్వానాలు వచ్చేవి. పన్నెండు మైళ్ళు సరదాగా నడిచి వెళ్ళి వస్తూ వుండేవాళ్ళు. రోడ్డు పొడుగునా చెట్లు. నిత్యమూ ఏదో ఒక రకం చెట్లు పూస్తూ, ఫలిస్తూనే వుంటాయి. కనక, పిఠాపురం రాకపోకలు మనోరంజకంగా వుండేవి భీమన్నకు. పలావులు, పాయసాలు, పరమాన్నాలతో గుమగుమలాడే దివాను గారి ప్రత్యేక విందుల పసందులు ఇక చెప్పనక్కరలేదు. వాటి వెనక నన్నెత్తుతూ వుండే రసకవితల రాగోదయాలకు అంతే లేదు.

పగటి సూర్యుని వోలె భాసిల్ల గలిగి
రాత్రి చంద్రుని వోలె రంజింప గలిగి
పౌరుష వంతుడు, ప్రణయవంతుడును
నై వెలుగొందెడు నరుడు నూ నరుడు.

— మధు బాల

44. మిత్ర వియోగం

భీమన్న ఇంటర్ సీనియర్‌లోకి వచ్చేటప్పటికి జూనియర్‌లోకి వచ్చిన మామా విద్యార్థుల సంఖ్య కొంచెం పెరిగింది. బళ్ళ పురుషోత్తం, జొన్నల మోహనరావులు కూడ బందరు హాస్టలు నుంచి వచ్చారు. అక్కడ ఇంటర్ పోయి సెప్టెంబరు పరీక్షలకు కాకినాడలో వుండి చదువుకోవడం కోసం వచ్చారా ఇద్దరు. బళ్ళ జగన్నాథరావు, గోవాడ నిరీక్షణరావు హైస్కూల్లు క్లాసుల్లో చేరడం కోసం వచ్చారు. పిఠాపురం హాస్టలు నుంచి భూపతి రామ్మోహనరావు, బడుగు వెంకటరెడ్డి వగైరాలు వచ్చారు. సీనియర్ క్లాసులోకి వచ్చిన వెంకన్న, స్వామి, భీమన్న ఉండనే వున్నారు. ఆ విధంగా సంఖ్య ఎక్కువ కావడంతో హరిజన విద్యార్థులంతా ఒకచోట వుంటే బాగుంటుందనే ఆలోచన వచ్చి, ఎల్విన్‌పేటలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని హాస్టలు ప్రారంభించారు. నెలకు అయ్యే ఖర్చును అందరూ సమానంగా పంచుకునే ఏర్పాటు. ఈ ఏర్పాట్లలో పురుషోత్తం అన్న వెంకటరత్నంగారు చాల తోడ్పడ్డారు.

హాస్టలు ఎంతో చక్కగా, సక్రమంగా సాగింది. విద్యార్థులకు స్వేచ్ఛగా, ప్రశాంతంగా మరొక బెంగలేకుండా చదువుకొనే అవకాశం లభించింది. భీమన్న మాత్రం మంగమ్మగారిని మరచిపోకుండా అప్పుడప్పుడు కచేరీపేటకు వెళ్ళి చూచి వస్తుండేవాడు.

అంతటి సుప్రశాంతమైన వాతావరణంలో ఏమబ్బు లేకుండానే పిడుగు మొత్తినంత విషాద సంఘటన జరిగిపోయింది హాస్టల్లో.

ఆది 1932, సెప్టెంబరు ఒకటవ తేదీ ఉదయం. ఆ తెల్లవారుఝాము నుంచే విరేచనాలు పట్టుకొన్న జగన్నాథరావు ఉదయం అందరూ లేచేటప్పటికి నీరసించిపోయాడు. భీమన్న, జగన్నాథం ఒకే చాపమీద, ఒకే దుప్పటి క్రింద పడుకొనే వారు. ఒకళ్ళపై ఒకళ్ళకు పిచ్చిప్రేమ. అలాంటి జగన్నాథం అంతలో అలా అయిపోయాడంటే ఆ కుటుంబం వాళ్ళకు ఎలావున్నా భీమన్నకు పిడుగుపాటే అయింది. జబ్బేమిటో డాక్టరుకు కూడ అంతుచిక్కలేదు. విపరీతమైన దాహం, విరామంలేని విరేచనాలు. మందులు పనిచెయ్యలేదు. ఎక్కువగా నీళ్ళు ఇవ్వవద్దు అన్నాడు డాక్టరు. తట్టుకోలేక పోతున్నాడు జగన్నాథం. పురుషోత్తం,

నరసింహారావు, మోహనరావు, రామమోహనరావు - అంతా జగన్నాథంకుటుం బానికి చెందినవాళ్ళే. తల్లడిల్లి పోవటం తప్ప ఎవ్వరూ ఏమీ చెయ్యలేక పోయారు.

"గొంతుక ఎండిపోతూంది, నువ్వాయినా గుక్కెడు నీళ్ళియ్యి బావా!" అంటూ జగన్నాథం ప్రాధేయపడ్డప్పుడు, ప్రక్క గదిలోకిపోయి ఏడ్చాడు భీమన్న. నీళ్ళివ్వ వద్దన్నాడు డాక్టరు. ఏం చెయ్యాలి? తోకమిరియాలు వేసి కాచిన నీళ్ళు దాహం కడతాయని ఎవరోచెపితే, అలాంటి నీళ్ళు కొంచెం కొంచెంగా ఇవ్వసాగాడు. దాహం కట్టలేదు. అక్కడకు వచ్చివున్న కాలేజీ, బ్రహ్మ సమాజం పెద్దలలో ఎవరో తులసిరసం పోశారు. మిత్రుడి తలను ఒడిలో పెట్టు కొని కూర్చున్నాడు భీమన్న. తనకు అత్యంత ఆత్మీయుడైన బాల మిత్రుడు అంత ఆకస్మికంగా తన చేతులలోనే కన్నుమూయగా - ఏం చెయ్యగలడు? అంతా గొల్లుమన్నారు. మిత్రుడి బాధను తాను భరించలేక అంతకుముందు ఎంతో ఏడ్చిన భీమన్నకు అతడు మరణించినపుడు కన్నీరు కూడ రాలేదు. ఆ రోజంతా ముసురు పట్టిందట. తన ఏడుపు కూడ ప్రకృతే ఏడుస్తున్నదిలే అను కొన్నాడట.

ఈ విషాద సంఘటన ఆ నాటి ఉదయం రెండు మూడు గంటల్లోనే జరిగి పోయింది. ఆ మధ్యాహ్నమే సమాధిచేశారు. పెద్దవాళ్ళు ఎవరూలేరు. మృత దేహాన్ని మోసిన భీమన్న భుజం పుండై చాల కాలంవరకు గుండె గాయానికి బాహ్య చిహ్నంగా మానకుండా వుండిపోయింది. ఆ తర్వాత తరచు ఆ శ్మశా నానికి పోయి ఏవో పద్యాలు వ్రాసుకొంటూ కూర్చునేవాడు భీమన్న.

సెప్టెంబరు పరీక్షలు వ్రాసేసి పురుషోత్తం, మోహనరావు వగైరా సన్ని మెంటరీ విద్యార్థులు ఇండ్లకు వెళ్ళిపోయారు. దసరా సెలవులకు మామిడికుదురు వెళ్ళిన భీమన్నకు మరో విషాదవార్త ఎదురయింది. తనను ఎంతగానో ప్రాణం కంటే మిన్నగా ప్రేమించిన ఒకానొక లక్ష్మి హఠాత్తుగా చనిపోయింది. కావ్య కుసుమాలలోని "శ్మశాన లక్ష్మి" అనే విషాద కవిత ఆవిర్భవించింది అప్పుడే. ఈయన ఎంత దుఃఖ పడ్డాడో ఆ కవితే చెపుతుంది. ఇలా బాధమీద బాధ పడుతూ భీమన్న మోరిపొలం వెళ్ళి జగన్నాథం తల్లి దండ్రుల్నీ, బంధువుల్నీ

ఓదార్చి వచ్చాడు. ఆ శలవులలో ఎక్కువ భాగం పురుషోత్తంతోనే గడిపి వచ్చాడు.

కాకినాడలో ఆ మరునాడు దీపావళి - అనగా హాస్టలు మిద్దె మీది నుంచి శూన్యంలోకి చూస్తూ నిలబడివున్న భీమన్నకు మరొక ఘోరవార్త తెలిసింది - పురుషోత్తం చనిపోయాడట! ఏమిటి ఇదంతా? నిజమా? నిజమే! టపాకాయల మందు వర్షాల మూలంగా ఆరకపోతే, పెనంలో పోసి వేపుతుండగా, అది అంటుకొని శరీరం కాలిపోయిందట. ఆ మరణ వేదన చెప్పశక్యం కాదట.

భీమన్న దుఃఖానికి పరాకాష్ఠ అది. ఆ పైని దానికి విలువలేదు. తదాదిగా భీమన్నను దుఃఖమనేది శాశ్వతంగా విడిచిపోయింది. ఎంతటి విషాద సంఘటన కూడ ఈయనకు కన్నీరు తెప్పించ లేదిప్పుడు.

"మామూల దాస్య విమోచన కోసం పురుషోత్తం రూపంలో పుట్టిన ఒక మహానాయకుడు ఆ విధంగా బాల్యంలోనే పోయాడు. మళ్ళీ ఒకడు హరి రూపంలో పుట్టి వికసిస్తున్న దశలో సూళూరుపేట రైలు ప్రమాదంలోపోయాడు. మరి మళ్ళీ మరొక నాయకుడు ఇంత వరకూ పుట్టనేలేదు" అంటాడు భీమన్న ఈ ప్రమాదాలను తలచుకొంటూ.

రాజకీయ, సాంఘిక ప్రబోధాలలోనూ, ఉద్యమాలలోనూ స్వయంగా పాల్గొంటూ వున్నా, భీమన్న సాహితీ కృషికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవాడు. ఈయన మనస్తత్వం, అభిరుచి, వ్యాపకం ఆన్నీ సాహిత్యానికి అనుకూలమైనట్టివే. సాంఘిక, రాజకీయ ఉద్యమాలకు నాయకత్వం పురుషోత్తానిది. అనర్గళమైన ఉపన్యాస ధోరణిలో ప్రజలను ఉర్రూతలూగించే మహావక్త, మేధావి పురుషోత్తం. ఒక ప్రాణమిత్రుణ్ణే కాదు, ఒక ప్రజానాయకుణ్ణి కోల్పోయా మన్న మనోవ్యధ నేటికి పీడిస్తూనే వున్నది భీమన్నను పురుషోత్తం విషయంలో. కావ్యకుసుమాలలోని "పురుషోత్తముడు" అనే స్మృతి కవితను పరిశీలిస్తే, ఆ నాటి భీమన్న మనస్థితి గోచరించ గలదు.

మామిడికుదురు పంటకాల్వ గట్టుమీద నూకాలమ్మ గుడి దగ్గరలో ఒక పెద్ద మామిడిచెట్టు వుంది. పురుషోత్తం తమ ఇంటికి వచ్చి వెళ్ళినప్పుడెల్లా

అతణ్ని ఆ చెట్టు వరకూ సాగనంపేవాడు భీమన్న. మోరిపొలం వెళ్ళే దారి అదే. ఆటువంటి ప్రతిసారీ ఆ చెట్టు క్రింద నిలబడి చాలసేపు పిడోక్కలు చెప్పుకొనేవాళ్ళు ఇద్దరూ. ఆ చెట్టు క్రిందే ఒంటరిగా నిలబడి ఈ స్మృతి కవితను పాడుకొంటూ కన్నులొత్తు కొనేవాడు భీమన్న. ఈ కవితలోని పద్యాలు తొమ్మిది. తొమ్మిదీ తొమ్మిది దుఃఖసాగరాలు —

ఎన్నో భావి సుఖాలు బుడ్బుదములై
ఎన్నో సుఖ స్వప్నములో
సున్నాలై చితికెన్ ; వసంత సుమన
శ్రీభావ కాశంబులున్
కన్నీరై ప్రవహించె .....

—భీ. కా. కుసుమాలు

అమృతమే పొంగినా . ఆగ్ని కుమ్మర్లినా
ఈ స్వల్ప హృదయమే , ఈ అల్ప జీవితమే
క్షీరసాగరమోయి ! శివుని కంఠమ్మోయి !

—రాభీలా

45. హాస్టల్లో రాజకీయాలు

ఆ మరుసంవత్సరం , అంటే భీమన్న బి. ఏ. జూనియరుకోకి వచ్చే టప్పటికి కాకినాడలోని మామా విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది .

వివిధ ప్రాంతాలనుంచి గుంటూరు బాపనయ్య , గంజి రామారావు , కోనాడ సూర్యప్రకాశరావు , భూపతి తిరుపతి , దాసు రామస్వామి , ఓగిరాల వెంకటచలం , గుత్తాల రామమూర్తి , కాశి విశ్వనాథం మొదలైన వాళ్ళందరో కాకినాడ వచ్చారు . గాంధీనగరం సెంటరులో ఒక పెద్ద బిల్డింగులోకి హాస్టలును మార్చవలసి వచ్చింది . ముందూ , వెనకా పెద్ద ఆవరణలతో , ఒక పెద్ద బావితో , నాలుగుకోడ్ల కూడలిలో ఎంతో సౌకర్యంగావున్న బిల్డింగది .

హాస్టలుకు భీమన్నే ప్రెసిడెంటుగా ఎన్నుకోబడ్డాడు . కాకినాడ విద్యా రంగంలో ఆ రెండేళ్ళపాటూ ప్రెసిడెంటు అంటే భీమన్నే . అంతటి ప్రసిద్ధిని సంతరించుకొన్న దా పదవి భీమన్నలో .

కాకినాడలో మామా విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూనే వుంటుంది కనుక ఆ హాస్టలును ఒక శాశ్వత ప్రాతిపదికమీద నిర్మాణం చెయ్యాలనే ఉద్దేశం కలిగి ముఖ్యమైన విద్యార్థులతో సంప్రదించి దానికొక ప్రణాళికను రూపొందించాడు భీమన్న. దాని ప్రకారం హాస్టలుకు ఒక ప్రెసిడెంటు వుండాలి. ఒక చిన్న కార్యవర్గం వుండాలి. ప్రెసిడెంటు బి. ఏ. జూనియర్ విద్యార్థుల నుంచే ఎన్నుకోబడాలి. సామగ్రి కొనడానికి, వంట మొదలైన వ్యవహారాలపై అజమాయిషీ చేయడానికి ఆయా విషయాలలో ఆసక్తివున్న విద్యార్థులు ఎన్నుకోబడాలి. ప్రతి నెలాఖరున ఖర్చుమొత్తం తేల్చి హాస్టలు విద్యార్థులందరూ సమానంగా భరించాలి. స్కాలర్షిప్పు లేని విద్యార్థులకు వారి వారి పేదరికాన్ని బట్టి మినహాయింపు ఇవ్వాలి. ఆర్థాతనుబట్టి పూర్తి మినహాయింపునుకూడ ఇవ్వవచ్చు.

ఈ విధమైన ప్రణాళికతో హాస్టలును నడపసాగాడు భీమన్న. వంటవాడూ, పనిమనిషి నెల జీతాలపై నియమించబడ్డారు.

ఉన్నట్టుండి ఒక రోజున ఈ హాస్టలు ప్రాధాన్యాన్ని కాలేజీ అధికారులు గుర్తించినట్టున్నారు, వచ్చి చూశారు. కాలేజీ హాస్టలుకు హరిజనానుబంధంగా దీన్ని నడిపిస్తాం అన్నారు. అందుకు అడ్డుచెప్పే స్థితిలో లేరు విద్యార్థులు. కాలేజీ అధికారులన్నా, బ్రహ్మ సమాజం పెద్దలన్నా, మహారాజా వారన్నా ఒక్కటే. వారి దయా ధర్మాల మీదే ఆధారపడివుంది మామా విద్యార్థుల చదువు. అయితే అధికారులు పెట్టిన షరతులు స్కాలర్షిప్పులు వస్తున్న విద్యార్థులకు మాత్రమే తప్ప, తదితర పేద విద్యార్థులకు అనుకూలంగా లేవు. స్కాలర్షిప్పు డబ్బు తీసుకొని అది వచ్చే విద్యార్థులకు మాత్రమే దాన్ని ఖర్చు పెడతారట అధికారులు.

"డబ్బు మాదీ, పెత్తనం మీదీనా? పైగా ఏ సహాయమూ లేని విద్యార్థులను ఎక్కడికి పొమ్మంటాం? మమ్మల్ని ఇలాగే బ్రతకనివ్వండి" అన్నాడు భీమన్న.

ఈ మాట అధికారులకు పెడసరంగా విన్పించింది. అయినా, సత్యాన్ని గుర్తించక తప్పలేదు. ఒక ఒప్పందానికి వచ్చారు. హాస్టలు యథావిధిగానే నడుస్తుంది. దాని నిర్వహణలో మార్పేమీ వుండదు. పేరుకు మాత్రం కాలేజీ

హాస్టలుగా వుంటుంది. అందుకు ప్రతిఫలంగా బిల్డింగు ఆద్దెను కాలేజీవారు పెట్టు కొంటారు. హాస్టలు పనులు చూడటానికి ఒక సెక్రటరీని నియమిస్తారు. అతని జీతం వారే పెట్టుకొంటారు, భోజనం మాత్రం హాస్టలు భరిస్తుంది.

ఈ ఒప్పందం ప్రకింద హాస్టలుకు రామమోహనలాడ్జి అనే పేరు పెట్ట బడింది. గెద్దాడ బ్రహ్మయ్యగారు కార్యదర్శిగా నియమించబడ్డారు. ఆయన పిఠాపురం హాస్టలు పూర్వ విద్యార్థి. అమలాపురం తాలూకా వాడు. కాలేజీ విద్యతో ఏ సంబంధమూ లేనివాడు. నాయుడుగారికి, ప్రిన్సిపాలు రామస్వామి గారికి, కృష్ణశాస్త్రిగారికి బాగా విశ్వాస పాత్రుడు. మంచివక్త. కార్య నిర్వ హణా దక్షుడు. విద్యార్థులు చదువులలో మునిగి వుంటారు కనుక హాస్టలు నిర్వ హణను చక్కగా చూచుకొంటాడని ఆయనను నియమించారు. భీమన్న ఆజమా యిషీకి లోబడి ఆయన పనిచేస్తాడు.

హాస్టలును కాలేజీకి ఇచ్చి వెయ్యడానికి మొదట్లో ఇష్టపడని భీమన్నమీద అధికారులకు కోపంగానే వుంది. భీమన్న నాస్తికులతోనూ, కాంగ్రెసు వారి తోనూ తిరుగుతూ వుంటాడన్న ఆగ్రహం కూడా అంతకు ముందునుంచే వుంది. భీమన్నపట్ల అధికారుల కుండే ఈ వైముఖ్యాన్ని చతురుడైన బ్రహ్మయ్యగారు చక్కగా ఉపయోగించుకోసాగాడు. బ్రహ్మసమాజంపట్ల, ప్రార్థనల పట్ల అధిక విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ, భీమన్నను గురించి లేనిపోనివన్నీ అధికారులకు చెపుతూ, హాస్టలుపై తన పెత్తనాన్ని అధికం చేసుకోవడానికి ప్రయత్నించ సాగాడు. హాస్టలు ప్రెసిడెంటుని నామ మాత్రంచేసి హాస్టలుకు తానే సర్వాధి కారి కావాలను కొన్నాడు. బ్రహ్మయ్యగారి ఈ ప్రయత్నం ఆయన ప్రతి పని లోనూ స్పష్టం కాసాగింది. దానితో హాస్టలు విద్యార్థులలో అశాంతి చెలరేగింది. ముఠా రాజకీయాలు ప్రారంభ మయ్యాయి.

రాజకీయము కాదెల్ల బ్రతుకు మనకు,
ఎట్లో జీవించుటకె కాదు ఇంత శ్రమము;
మకుటములా రాలె, రాజ్యాలు మంట గలిసె
ప్రేమ కన్నెర్ర జేసిన హోమ మందు!

— మధు గీత

46. పద్యాని కొక గారె

భీమన్న సహజంగా భోజన ప్రియుడు. రసా లెరిగిన వాడు. రుచులు మరిగినవాడు. పేదగా పుట్టినా, పొలాల్లో బ్రతికినా ప్రవృత్తిలో ఈయన భోగి. ఇతరులపై ఆధారపడకుండా, ఇతరులతో నిమిత్తం లేకుండా తనకు ఇష్టమైన మార్గంలో, తనకు నచ్చిన సుఖాన్ని తానే సంపాదించుకొనే స్వభావం భీమన్నది. రాజకీయాలను, వాటివల్ల కలిగే చీకాకులను గాలికి వదిలేసి. హాస్టల్లో స్నేహితులతో సరదాగా, హాయిగా కాలం గడిపేసేవాడు. రచనల్లో మునిగిపోయేవాడు.

బడుగు వెంకటరెడ్డి గారి తమ్ముడైన స్వామిని రప్పించి హాస్టలులో వంట వాడుగా నియమించాడు భీమన్న. వాళ్ళది జగ్గన్నపేట వద్దగల మొగలికుదురు. స్వామికి చదువు అంటకపోయినా వంటలోమాత్రం మంచి నైపుణ్యం కుదిరింది. కాంగ్రెసు మహిళలో, బ్రహ్మ సమాజం మహిళలో అప్పుడప్పుడు హాస్టలుకు వచ్చి స్వామికి క్రొత్త క్రొత్త వంటలు నేర్పి పోతుండేవారు. కుటుంబాలతోవచ్చి హాస్టలు కుర్రవాళ్ళతో కలిసి భోజనాలు కూడ చేస్తుండేవారు. అందువల్ల స్వామి నల పాకమూ, భీమ పాకమూ రెండూ కలిపి నభీ పాకం చేసేవాడు. హాస్టలు భోజనాలు నిత్యవిందులుగా వుండేవి. ప్రతి సెలవు రోజున ఆదనంగా గారెలూ, పకోడీలూ, జిలేబి మొదలైన పిండి వంటలు వుంటూ వుండేవి.

భీమన్నకు సర్కారు స్కాలర్షిప్పు నెలకు ఇరవై ఐదు రూపాయలు. హాస్టలు ఖర్చు మొత్తం అంతా కలిసి ఏడెనిమిది రూపాయలకు మించేది కాదు. డబ్బుకు అప్పుడున్న విలువ అలాంటిది. మంచి బియ్యం ఖరీదు బస్తా ఆరు రూపాయలు మాత్రం. రెండణాలు (ఇప్పుడు పది పైసలు) పెడితే ఒక పెద్ద పొలస చేపే వచ్చేది. అణాకు అరసోలెడు ఆవు నెయ్యి, ఐదు కోడి గ్రుడ్లు - అలా వుండేవి ఆనాటి ధరలు.

హాస్టలులో మామూలు భోజనంతో పాటు భీమన్న నెయ్యి, పెరుగు ఆదనంగా కొనుక్కొనేవాడు. ఆ పరిసరాల పేటలనుంచి ప్రతి ఉదయమూ ఆవి అమ్మకానికి వచ్చేవి. ఆ అమ్మేవాళ్ళు చాలమంది భీమన్నకు పరిచయులై పుండేవాళ్ళు. అందులో ఒకామె ప్రతి ఉదయమూ విడవకుండా ఒక ఆరసోలెడు

నేయి, ఒక ముంత పెరుగూ భీమన్నకు ఇచ్చి పోతుండేది. ఆ కాలంలో భీమన్న నేతిని చారులా వాడే వాడట! దానికి సరిపడ్డ కసరత్తు కూడ చేసే వాడు. ఎంతగా ఖర్చు పెట్టుకొన్నా నెలకు పదిహేను రూపాయలకు మించేది కాదు. మిగిలే పది రూపాయలు సేవింగ్సు బ్యాంకులో వేసుకొనేవాడు.

ఒకసారి ఎందుకో అవసరమై డబ్బు తీసుకోవడానికి పోస్టాఫీసుకు వెళితే సంతకం నీది కాదు పొమ్మన్నారట! తానే భీమన్ననని సంతకం తిన్నగా చేసి డబ్బు తెచ్చుకోవడానికి నానా తంటాలు పడవలసి వచ్చింది. ఈయన వ్రాత ఈనాటికీ అలానే వుంది.

ఆ రోజుల్లో భీమన్న ఆశు కవిత్వం చెప్పేవాడు. ఎదర ఏదుంటే దానిపై, ఎవరుంటే వారిపై అనర్ఘళంగా పద్యాలు చెప్పేసేవాడు. ఒక ఆదివారం వంట స్వామి, మరో ఇద్దరు ముగ్గురు విద్యార్థులూ కలిసి గారెలు దేవుతుండగా, భీమన్న అక్కడకు వచ్చి కూర్చున్నాడు. తక్కిన చాలమంది విద్యార్థులు కూడ వంట గదిలోకి చేరారు. ప్రతి పాదన ఎవరిదో తెలియదు కాని - ఆ గారెల మీద ఆశువుగా పద్యాలు చెపితే, పద్యానికొక గారె చొప్పున ఇస్తా మన్నా రట.

గారెలు బాగున్నాయే
కారం కలిపినటు ఎర్రగా ఉన్నాయే
మీరంద రొప్పుకుంటే
గారెకు ఒక పద్యమిత్తు కాయుడు పందెం!

అంటూ మొదలు పెట్టి ఆ గారెల్ని, వండుతున్న వాళ్ళని, వంట గదిని వర్ణిస్తూ వరసగా కంద పద్యాలు విసర సాగాడు. పది పదిహేను పద్యాలు కానిచ్చి, ఇక చాలు పొమ్మన్నారట. లేకపోతే వండిన గారెలన్నీ భీమన్నే తినేసి వుండే వాడా వేళ. భీమన్నకు కంద పద్యం కంది పచ్చడి లాంటిది. ఆశువుగా చెప్పడానికి కందం ఎంతో సులువైంది, సుఖమైందీ నట. అయితే ఈ ఆశు కళను ఆనాడే వదిలేశా డీయన. తమాషా కోసం తప్పితే ఆశువు రసా విష్కారా నికి పనికిరా దంటాడు.

తీపి ఎక్కువ ఇష్టం ఈయనకు. కవిత విషయంలో కూడ అంతే. మాధుర్యం కావాలి. రసం కావాలి. జీవితానందానికి మధుర రస ప్రసాదమే కవిత అంటా డీయన.

కసరత్తు చేసి వస్తాదులా వుండే వాడే కాని ప్లే గ్రౌండుకు మాత్రం వెళ్ళేవాడు కాదు. బలి గుడి, వాలీబాల్, దగ్ ఆఫ్ వార్ వంటి కొద్ది క్రీడలలో మాత్రమే పాల్గొనేవాడు. కాలేజీ బయట ఎక్కువ కాలాన్ని మామిడి తోటల్లోనూ, పొలం గట్లలోనూ గడిపేవాడు-ప్రకృతి సౌందర్యాన్ని పరిశీలిస్తూ, పద్యాలు వ్రాసుకుంటూ.

నిన్ను ముఖాముఖి దర్శించిన భాగ్యవంతులకు
కోటి సూర్య ప్రభవు నీవు
నిన్ను వెనుక నుంచి చూచిన సన్యాసులకు
నిర్వికల్ప సమాధివి నీవు

— అ. నాదికొస

47. దేవు డెందుకు?

ఒకసారి భీమన్నకు ఒళ్ళంతా దురద పట్టుకొన్నది. భరించలేని దురద. నిళ్ళలో చింతాకువేసి కాచి, స్నానం చెయ్యమన్నా రెవరో. తల గుండు చేసేస్తే- అన్నాడు భీమన్న. రేజరు తీసాడు కోనాడ. ఐదు నిమిషాలలో గుండు కోన సీమ కురిడీలా తయారైంది. వేడివేడి చింతాకు నీళ్ళతో దురద కొంత ఉపశమించింది.

ఆ రోజు ఆదివారం. బ్రహ్మ మందిరంలో ప్రార్థనకు హాజరు కావాలి. అది కంపల్సరీ. భీమన్న బోడి గుండుకు ఒక తువాలు చుట్టుకొని వెళ్ళి ప్రార్థనలో కూర్చున్నాడు. ఈయన వేషం చూచి చనువైన వాళ్ళు నవ్వారట. నవ్వే వుంటారు. అయితే—

"ప్రార్థన చెడగొట్టడం కోసం భీమన్న ఆ వేషం వేసుకొచ్చాడు" అనే మాట కాలేజీ నిండా గుప్పు మన్నది ఆ మర్నాడు. ఆ మాట కృష్ణశాస్త్రి గారన్నారని బ్రహ్మయ్యగారు ప్రచారం చేశారు. ప్రార్థన సమయంలో భీమన్న కళ్ళు మూసుకోడు, చూస్తూనే వుంటాడు అనేది మరో యాగీ. ఈ యాగీ దన్నీటిని ఒత్తుకునే టంత బాహ్యస్మృతి కూడ లేకుండా ప్రార్థన చేసే ఒక

ఆచార్యుడిది ! "భీమన్న కళ్ళు మూసుకోడని ఆ కళ్ళు తెరవని పరమ భక్తుడి కెలా తెలుసు ?" అని భీమన్న ప్రశ్న .

భీమన్న ప్రార్థన సమావేశాలకు క్రమంగా వస్తున్నాడా లేదా ? ప్రార్థన సమయంలో ఏం చేస్తున్నాడు ? కళ్ళు మూసుకొంటున్నాడా ? మధ్య మధ్య తెరిచి చూస్తున్నాడా ? బృంద గానంలో పాల్గొంటున్నాడా ? ఎవరితో సన్నిహితంగా తిరుగుతున్నాడు ? ఇవీ ఆనాటి ప్రశ్నలు . జవాబుల కోసం పరిశోధనలు . బ్రహ్మసమాజ పరిధిలో , నిర్గుణ బ్రహ్మ స్థానంలో ఆ రెండు సంవత్సరాలూ భీమన్న ప్రతిష్ఠితుడై పాలించా డంటే నిజంగా అతిశయోక్తి కాదు .

భీమన్న నాస్తికుడు కాదు. కృత్రిమ భక్తి వాతావరణం ఈయనను మొండివాణ్ణి చేసింది .

అధికారులు మాటాడితే భక్తితో ఊగిపోతారు . క్షణంలో కన్నీరు కారుస్తారు . ఎవరి మీదా దయమాత్రం చూపరు . ఎంత క్రూరంగా అయినా ప్రవర్తించ డానికి వెనుదీయరు . ఇదంతా నటన అనీ , కేవలం రాజా వారినీ , నాయుడుగారినీ తృప్తి పరచడం కోసమే ఈ ప్రదర్శన అనీ అర్థమై పోయిన తర్వాత , భీమన్న మరీ ఉపేక్షా వైఖరిని అవలంబించాడు .

ఉదయం స్నానాల వేళ బావివద్ద చాల రద్దీగా వుండేది . ఒక రోజున భీమన్న బట్టలు తీసి , ఒకచోట పెట్టి , కేలు మోడ్చి , కళ్ళు మూసుకొని , బిగ్గరగా - "ప్రభూ , ఈ గాలి నా బట్టలను ఎగర గొట్టేసేలా వుంది . నేను వచ్చేవరకు వీటిని కనిపెట్టి వుండు !" అంటూ ప్రార్థన చేసి , బావి వద్దకు వెళ్ళాడు . గాలి జోరుగా వీస్తూ వుంది . స్నానంచేసి వచ్చేటప్పటికి బట్టలు చెదిరి పోయి వున్నాయి . భీమన్నకు కోపం వచ్చేసింది —

"ప్రభూ ! ఎందుకురా నీవుండి ? అంత భక్తితో చెప్పి వెళ్ళానే ? ఈ మాత్రం బట్టలనే కనిపెట్ట లేని వాడవు , బ్రతుకుల నెలా కనిపెడతావు ?" అంటూ , తిట్టుకొంటూ తన గదిలోకి పోయాడు . ఆ సంఘటన అగ్గిమీద గుగ్గిలం అయింది !

హాస్టలులో రెండు పార్టీ లుండేవి. భీమన్న పక్షం బాగా మెజారిటీయే. కాని, ప్రిన్సిపాలుగారికి భయపడతారు. ప్రిన్సిపాలుగారి ప్రతినిధి బ్రహ్మయ్య గారు. ఆయన పార్టీ వాళ్ళు ముగ్గురు మాత్రం. తటస్థులు కూడ కొందరుండే వాళ్ళు. భీమన్న పక్షంవాళ్ళు బహిరంగంగా భీమన్న పేరిత్తే వాళ్ళు కాదు. బ్రహ్మయ్యగారి పక్షంవాళ్ళు భీమన్నకు వ్యతిరేకంగా నిత్యం ఏవో ప్రచారాలు చేస్తూనే వుండేవాళ్ళు. అందుకే, వాళ్ళను ఏడ్పించాలని ఆలాంటి పనులు చేస్తుండే వాడు భీమన్న.

"నీ బుట్టలు కనిపెట్టు క్కూర్చోడానికా ఉన్నాడు దేవుడు?"

"మరెందు కున్నాడు? రాంబ్రహ్మంగారి కూతురికి సంబంధం కుదర్చడానికా? కృష్ణబ్రహ్మంగారి అవ్వకు నల్లమందు ఇవ్వడానికా? సదాశివ బ్రహ్మంగారి కొడుక్కు మార్కు లెయ్యించడానికా?"

అంతకు ముందు జరిగిన కొన్ని ప్రార్థన సమావేశాలలోనే ఆలాంటి కోరికలు కొన్ని భగవంతుణ్ణి కోరబడి వున్నాయి.

"ఒక బ్రహ్మ సమాజమే కాదు. ఏ మతమైనా అంతే. భక్తులు కోరే కోరికల్ని పరిశీలిస్తే - వాళ్ళు దేవుడి కిచ్చేది సేవకుడి స్టేటసు కంటె పైదిగా కనిపించదు. ఈ విషయంలో బ్రహ్మసమాజం పద్ధతి మరీ ఘోరం. నిర్గుణ బ్రహ్మకు ప్రార్థన ఏమిటి?" అనేవాడు భీమన్న.

నాయుడుగారు దయాళువు. బ్రహ్మర్షి అంటే నిజంగా ఆయనే.

మొత్తంమీద భీమన్న బ్రహ్మసమాజం వారి దృష్టిలో పరమ నాస్తికుడుగా స్థిర పడ్డాడు. అందుకు ముఖ్య కారణాలు గోరాగారి స్నేహం, కాంగ్రెసు నాయకులతో సంబంధం, బ్రహ్మ సమాజ పెద్దలను తరచు చూడక పోవడం, బ్రహ్మయ్యగారి హాస్టలు పాలిటిక్సు.

ఏడుపు ప్రార్థనలను అపహాస్యంచేస్తూ భీమన్న వ్రాసిన పద్యాలలో ఇదొకటి.

ఆది నుండియు ఏడ్చిన అబల కులమె
పి కపృకు పాత్రు లైనారు, నీరజాక్ష!

ఎన్ననేల , విభీషణు లెంత మందొ :
సుగుణ మనులయ్యు బలవంతు లగుట జేసి
పగకు గురియైరి బలివంటి వారు , దేవ :
అందుకే నేమొ నేడు మా ఆంధ్ర భక్తు
లేడ్పునే స్వీకరించిరి ఏడుగడగ
ఏడుపే నీకు ముఖ్యమౌ నేని , తండ్రి :
వెక్కి-వెక్కి ఎంతో ఏడ్చి వేయగలను :
కాని , మగటిమి చచ్చి , నీ కాళ్ళను బడి
సేవ చేయు మటన్న నే చేయలేను

—భీమన్న చాటువులు .

48. మంచు బిందువులు

భీమన్న రాజోలులో చదువుతున్నప్పుడే అక్కడొక రిద్దరు అమ్మాయిలు ఆకర్షించడం , అది ప్రేరణగా ఈయన వందల కొలది పద్యాలు వ్రాయడం ఇదివరకే తెలుసుకున్నాం . ఆ తర్వాత ఎన్నో ప్రేరణలు ఎన్నో కవితలను వ్రాయించినా , భీమన్నకు ఆ తొలి ప్రేరణల మధుర స్మృతి అలానే వుండి పోయింది . 1933 వేసవిలో - అంటే భీమన్న ఇంటర్ సీనియర్ మగించిన తరువాత సెలవులలో అందులో ఒక అమ్మాయికి వివాహం ఏర్పాట్లు జరుగు తున్నాయని విని , తనకోసం అడగడానికి తండ్రిని పంపించా డీయన . పల్లయ్య గారు వెళ్ళి అడిగారు . వరనిశ్చయం అంతకు ముందే జరిగి వుండడం వల్ల పిల్ల తరపు వాళ్ళు పల్లయ్యగారికి క్షమాపణ చెప్పుకొన్నారు . భీమన్న మరో నాలుగు విషాద గీతాలను పాడుకొని ఊరుకున్నాడు .

ఆ తర్వాత సెలవు లనంతరం కాకినాడ వెళ్ళడం , బి . ఏ . జూని యరులో చేరడం , రామమోహన లాడ్జికి ప్రెసిడెంటు కావడం-ఇవన్నీ జరిగాయి . ఆలా రెండు , మూడు నెలలు జరిగిన తర్వాత హఠాత్తుగా ఒక ఘోర మైన వార్త తెలిసింది . ఆ అమ్మాయి భర్త చనిపోయాడట ! ఆ వార్త భీమన్న మనసును ఎంతో విషాదంతో కలచి వేసినా , జీవిత సత్యం ఎంత అగమ్య గోచరమో దానివల్ల భీమన్నకు తెలిసి వచ్చింది . ఋషులు , ప్రవక్తలు ,

తత్త్వ వేత్తలు ఎవరూ కూడ జీవిత ప్రణాళికను గురించి ఏదీ నిర్ణయంగా చెప్పలేకపోవటానికి కారణం ఇదేనని తెలుసుకున్నాడు. ఎవరికీ ఏమీ తెలియదు. ఎవరి మనస్థితిని బట్టి వారు ఊహిస్తారు. ఎవరి ఊహకూ జీవిత రహస్యం అందదు. భవిష్యత్తు తెలియదు. ఈ సత్యాన్ని భీమన్న ఆనాడే గుర్తించాడు.

రవీంద్రుని "గీతాంజలి," "నెలవంక" మొదలైన ఆంగ్ల కవితలను అప్పుడప్పుడే చదువుతున్నాడు భీమన్న. ఆ ధోరణిలో తన రచనలను కొన సాగించాడు. విషాదంతో వేదాంతాన్ని కలిపి కవితతో నింపిన వచనంలో తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ చాలా రచనలు చేశాడు.

ఈనాడు వచన కవితగా ప్రసిద్ధికెక్కిన ప్రక్రియ ఆలాడు భీమన్న చేబట్టి వదిలేసిందే. ఆనాటి భీమన్న చేసిన కవితా వచన రచనలే కొంచెం రూపం మార్చుకొని 1936లో "జనవాణి" పత్రికలో "పల్లెటూరి లేఖలు" అనే శీర్షిక క్రింద వరసగా వెలువడి, పుస్తక రూపంలో "జానపదుని జాబులు" గా ప్రకటిత మైనై.

ఒక రోజున అర్ధరాత్రివేళ సచ్చిదానందం పిళ్లేగారు రామమోహన లాడ్జికి వచ్చి భీమన్న గదిలో ప్రవేశించారు. పిళ్లేగారు కాలేజీలో ఇంగ్లీషు లక్చరరు, అప్పటి కింకా బ్రహ్మచారి. పెద్ద తోక తలపాగా చుట్టుకొని లాంగు కోటు వేసుకొని హుందాగా, ఒక రాజకుమారుడులా వుండేవాడు. ఇంగ్లీషుకో గొప్ప పండితుడు. ఆడపిల్లలంటే మోజు.

అప్పటి కింకా భీమన్న ఏదో వ్రాసుకొంటూనే వున్నాడు. అయనను చూసి హడలి పోయాడు. కలం క్రిందపడి సిరా కక్కుకొంది. ఊరికే అలా పోతూ కిటికీలో నుంచి చూసి వచ్చాననీ, మరి విశేషమేమీ లేదనీ పిళ్లేగా రన్నారు. భీమన్న వ్రాస్తున్నదేమిటో చూశారు. "ఇంగ్లీషు కవిత్వమా!" అని ఆశ్చర్య పోయారు.

"DeW drops" అనే శీర్షిక క్రింద భీమన్న ఇంగ్లీషులో వ్రాస్తున్న కవిత లవి. ఒక పెద్ద నోటు పుస్తకం నిండా వున్నై.

"ఇంగ్లీషులో ఇంత చక్కగా వ్రాసే వాడివి, క్లాసులో ఎప్పుడూ బేక్ బెంచర్‌గా వుంటావేం?" అన్నారు పిళ్ళేగారు, అందులో కొన్ని పేజీలు చదివి. భీమన్న మాట్లాడలేదు.

"ఇలాంటి కవితలు తెలుగులో వ్రాయకూడదా?"

"నేను తెలుగులోనే వ్రాస్తాను. ఆప్పుడప్పుడు సరదాకు ఇంగ్లీషులో"

అప్పుడు భీమన్నకు ఒక సలహా ఇచ్చారు పిళ్లేగారు-

"టాగూరు లాంటి వాడికే ఇంగ్లీషు రాదన్నారు ఇంగ్లీషు వాళ్ళు. మనం ఎంత బాగా వ్రాసినా, అది పరభాషే. ఈ మాత్రం కృషి మాతృ భాషలో చేస్తే, పరాకాష్ఠ నందవచ్చు కదా?" అని.

సలహా మంచిదైనా, చెడ్డదైనా- ఆ మాత్రం కూడ తెలుగు లెక్చరర్ణ నుంచి లభించలేదు భీమన్నకు. ఆందుకే పిళ్లేగారి సలహాను అక్షరాలా పాటించాడు.

ముద్దుగ, వెన్నెల ముద్దగ
మిద్దె పయిన్ చేరి నీవు మిల మిల లాడన్
గుద్దుకొని యేడ్చు తుక్కులా!
హద్దులు మీరిన అసూయ లమ్మా, పిల్లీ!

— పిల్లి శతకం

49. ఉపజ్ఞా కోకిల

"ఉపజ్ఞా కోకిల మిరేనా?" అంటూ స్వాగతం చెప్పారు జల సూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారు, భీమన్న తొలిసారి ఆయనను మద్రాసులో కలుసుకొన్నప్పుడు.

"ఉపజ్ఞా కోకిల ఏమిటి?"

జరుక్ శాస్త్రిగారు కృష్ణా పత్రికలోవున్న రోజులలో, ఆ పత్రికలో ప్రతి వారమూ ఒక పేజీ ఆధునిక కవితలు ప్రకటిస్తూ వుండేవారు. ఒకవారం

ప్రకటించడానికి ఒక కవితా దొరక లేదట. ప్రకటనార్థం వచ్చినట్టివి వందల కొలదీ వున్నై. ప్రకటనార్హ మైనట్టివే లేవు.

"ఏదో ఒకటి చూడు" అన్నారట, పత్రికాధిపతులు ముట్నూరివారు. జరుక్ శాస్త్రి మళ్ళీ అన్నీ పరిశీలించి, ఒక గేయాన్ని ఎంచి, దానితోపాటు మొత్తం కవితల ఫైలు కూడ వారి ముందు పెట్టారట. వారుకూడ అన్నీ తిరగ వేసి చూచి, ఆ గేయాన్నే అప్రూవు చేస్తూ, "విద్యార్థి ప్రాసిందే అయినా, పేరు బాగుంది. ధ్వని ప్రధానంగా వుంది. మంచి దేశభక్తి లిరుక్కు" అన్నా రట. ఆ గేయం పేరే ఉపజ్ఞా కోకిల. భీమన్న ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రాసి, కృష్ణా పత్రిక ప్రకటించిన గేయం అది.

(భారతీ యార్షోపజ్ఞను కోకిలతో పోల్చి, విదేశీ దాస్య హేమంతంలో మూగ వోయిన దాని గొంతు స్వాతంత్ర్య మధూదయం కోసం ఎంతగా తల్లడిల్లి పోతున్నదో చెప్పుతున్న చిన్న పాట అది.) గేయ మైతే ఇప్పుడు మాకు లభించడం లేదు కాని, ఆ శీర్షిక భీమన్నకు బిరుద నామ మైంది. కాకినాడ రాజకీయ వర్గాలలో ప్రశంసలు పొందింది.

ఆ గేయం మూట్నూరి వారి దృష్టిని అంతగా ఆకర్షించిందని జరుక్ శాస్త్రి నుంచి తెలిసికొన్న తర్వాత, భీమన్న తన పేరును "ఉపజ్ఞాకంద"గా మార్చుకోవా లనుకొన్నాడట. అ దింత వరకు మాత్రం జరగలేదు.

కాలేజీ చదువు రోజుల్లో భీమన్న కవితలు తరచు కృష్ణా పత్రికలో పడుతూ వుండేవి. బాలాంత్రపు రజనీ కాంతరావు, నలినీ కాంతరావు, హను మంతరావు, దామెర రాజగోపాలరావు, రెండుచింతల లక్ష్మీనరసింహా స్త్రి మున్నగు వా రప్పటి విద్యార్థులే. వాళ్ళంతా కృష్ణాశాస్త్రి గారికీ, సమకాలీన భావకవితోద్యమానికీ సన్నిహితులు. ఎవరికీ సన్నిహితుడు కానివాడు, ఎవరూ అందుబాటులో లేనివాడు భీమన్న ఒక్కడే.

ఈ విద్యార్థి కవు లందరి గేయాలూ కృష్ణా పత్రికలో పడుతుండేవి. భీమన్న గేయాలూ పడుతుండేవి. భీమన్నను చివరగా బ్రహ్మసమాజ పెద్దలకు దూరం చేసిన గేయం "పంజరంలో చిలుక".

విదేశీ దాస్యమే పంజరం. భారతదేశం చిలుక. గతాన్ని తలచుకొని విచారిస్తుందది. గేయం చాల పెద్దది. మంజరీ ద్విపదలో చాల అందంగా నడిచింది. దాని చివరది ఒక గీతం. అది ఇది —

ఎప్పుడీ పంజరము తెగి త్రుప్పు వడునో!
ఎన్న డాకాళ వీధుల కెగిరి పోదు
నో, మదిచ్ఛ కొలంది నవోత్సవమున!
ఎన్ని నాళ్ళో, ఈ దాస్య మింకెన్ని నాళ్లో!

—భీ. కా. కుసుమాలు.

ఇందులో అర్థకిష్టత ఏమి వుంది? అయితే - పంజరం అంటే బ్రహ్మ సమాజ మనీ, చిలుక అంటే భీమన్న అనీ అర్థంతీసి నాయుడు గారి వరకు మోసారు భీమన్న ప్రతి కవులు.

కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్షం, అబ్బూరి రామకృష్ణరావుగారి మల్లికాంబ, దువ్వూరి రామిరెడ్డిగారి వనకుమారి, నండూరి సుబ్బారావు గారి ఎంకిపాటలు, కొడాలి వెంకటసుబ్బారావుగారి హంపీక్షేత్రం, రవీంద్రుడి క్రిసెంట్ మూన్, జాషువా గారి ఫిరదౌసి వంటి గ్రంథాల ద్వారా సమకాలీన సాహితీ ధోరణులతో సంబంధం పెట్టుకొని వున్నా - భీమన్న ఆనందంతో చదువుకొనే వన్నీ పూర్వ గ్రంథాలే. భాగవతం, మేఘదూతం (సటీక), భగవద్గీత, పురాణాలు, హోమరు, కాళిదాస్, ఒమర్ ఖయాం వగైరా. మొత్తం ఆ నాలుగు సంవత్సరాలలోను, గంటకు నాలుగు గ్రంథాల చొప్పున కాలేజీ లైబ్రరీ, బ్రహ్మ మందిరం లైబ్రరీ అంతా తిరగ వేశా డీయన. చదివింది జ్ఞాపకం వుండక పోయినా, కొంతైనా ఒంటపడుతుంది కదా!

అందువల్లనే భీమన్నకు తన సొంతపంథా, సొంత వేదాంతం, సొంత శైలీ ఆ నాడే రూపం దిద్దుకున్నై. భీమన్న ప్రధాన రచనలన్నీ ఆ నాడే మూన ముహూర్తం చేసుకొన్నై.

ధ్రువ సముద్రము గడ్డ వారెడును, ఉష్ణ
జలధి కల్లోలితమ్మగు, పరసి కులము
శాంతమై యుండు; ఇట్లె విశ్వమ్ములోన
జీవనపు గతులవి పరిస్థితుల కొలది!

— మధు గీత

50 . ఆకస్మిక విచారణ

ఒకనాటి సాయంకాలం అనుకోని రీతిగా ప్రిన్సిపాల్ రామస్వామి గారి బండి (ఒంటెద్దు బండి) రాంమోహన్ లాడ్జి ముందు ఆగడంతో – "పంజరం లోని చిలుక" కవిత పతాక స్థాయి నందుకొంది .

ఆవేళ ప్రిన్సిపాల్ గారు వస్తారనే సంగతి భీమన్నకూ , ఈయన సన్నిహితులకూ తెలియదు . తక్కిన అందరూ , ముఖ్యంగా బ్రహ్మయ్యగారి వర్గం , అందుకు సర్వసన్నద్ధంగా వున్నారు . అది ప్రార్థన సమయం . లాడ్జర్లందరూ నీటుగా తయారై , బ్రహ్మగీత గ్రంథాలతో సమావేశమై , ఏదో గీతం ఎత్తుకున్నారు . అట్టి తరుణంలో బండి దిగారు ప్రిన్సిపాల్‌గారు . దిగి , సరాసరి సమావేశంలోకి వెళ్ళి కూర్చుని , కళ్ళు మూసుకున్నారు . అంతవరకు తన గదిలోనే వున్న భీమన్న , సంగతి గుర్తించి , మెల్లగా వెళ్ళి ఒకమూల కూర్చున్నాడు .

ప్రార్థన ముగిసింది . ప్రిన్సిపాల్‌గారు హితోపదేశ ప్రసంగం చేశారు . విద్యార్థులకు సత్యం , ధర్మం , భక్తి , క్రమశిక్షణ వగైరా గురించి ఎంతో చెప్పారు . నాయుడుగారి తర్వాత – అంత మృదుమధురంగా , జన రంజకంగా మాట్లాడ గలిగినవారు పెద్దాడ రామస్వామిగారొక్కరే . చెప్పడు మాటలు విని , తనపట్ల వైముఖ్యాన్ని పెంచుకొన్నా రన్న చింత తప్ప , వా రిద్దరిపట్లా , భక్తి గౌరవాలు అపారం భీమన్నకు .

తమ ప్రసంగాన్ని ముగిస్తూ , ప్రిన్సిపాల్ గారన్నారు –

"మీరందరూ సత్ప్రవర్తన , దైవభక్తి కల బిడ్డలే . నాకు తెలుసు . అయితే – ఒక ళిద్దరు నాస్తికు లుండి , వాతావరణం కలుషితం చేస్తున్నారని విన్నాను . అట్టి వాళ్ళ కిక్కడ చోటులేదు . వాళ్లు క్షమాపణ చెప్పుకొని , ప్రవర్తన మార్చుకొని లాడ్జిలో వుంటారో , లేక బైటికి పోతారో తేల్చండి ! వాళ్ళెవర్నో ముందులేచి నిలబడండి !"

ఎవర్నూ నిలబడ లేదు .

"ఏం? ధైర్యం లేదా?"

ఎవళ్ళూ మాట్లాడ లేదు.

"గంజి రామారా వెవరు?"

రామారావు లేచాడు. కత్తిలాంటి కుర్రవాడు. భీమన్నకు కుడిభుజం. జూనియర్ క్లాసులో వున్నాడు. తాను చెడ్డవాణ్ణేమీ కాదనీ, తాను చాలదూరం (కృష్ణా జిల్లా) నుంచి వచ్చిన వాణ్ణనీ, కాకినాడలో తనకు తెలిసిన వాళ్ళెవరూ లేరు కనుక, లాడ్జిలోనే వుంటూ ననీ అన్నాడు. ప్రిన్సిపాల్‌గారు సంతోషించారు.

"భీమన్న ఎవరు?"

భీమన్న లేచి నిలబడ్డాడు. "ఈ సంకుచిత వాతావరణంలో నే నుండ లేను. బైటికి పోతాను" అన్నాడు. ప్రిన్సిపాల్‌గారి ముఖం ఎర్రబడిపోయింది.

"నీవు నాస్తికుడివా?"

"కాదు."

అనుకోని జవాబు విన్నారు ప్రిన్సిపాల్‌గారు. ఆశ్చర్యపోయారు. తలెత్తి చూశారు!

"మరి, ప్రార్థన కెందుకు రావు?"

"నాకు ప్రార్థనలో నమ్మకం లేదు."

ఆలోచించారు.

"సరే. కాని – డిసిప్లిన్ కోసమైనా సమావేశంలో కూర్చోవచ్చుగా?"

"ఆది క్రైం వేస్టు కాదా? ఆ క్రైంలో నేను ఏ ప్రాబ్లమో చేసుకోవచ్చుగా?"

"ఆ ఏదో ప్రాబ్లమ్ గురించే ఆలోచిస్తూ కూర్చోవచ్చుగా?"

"ఆది ఆత్మవంచన కాదా?"

ఉగ్రులై పోయారు ప్రిన్సిపాల్ గారు. చివాలున లేచి నిలబడ్డారు. "అయితే, వెళ్ళు! ఒక్కటి మాత్రం జ్ఞాపకం పెట్టుకో! నిన్ను మార్చాలని వచ్చాను. నాకు ఆశాభంగం కలిగించావు. నీ వెక్కడికి వెళ్ళినా, నీ మీద ఒక

కన్ను వేసే వుంచుతాను. జాగ్రత్త!'' అన్నారు కఠినంగా. ఈ చివరి మాటలు ఇంగ్లీషులో అన్నారు. ఆయన కంఠం బొంగురు పోయింది.

"నేను కోరేది కూడ అదే నండి. నన్ను ప్రశాంతంగా చదువుకో నివ్వడం లేదీ లాడ్జి. మీరు బ్రహ్మ ధర్మానికి ప్రతినిధులు. మీ చేతిలో నా కెలాంటి అన్యాయమూ జరగదు. నన్ను మీ రెల్లప్పుడూ కనిపెట్టి చూస్తూ వుండటమే నేను కోరుకునేది" అన్నాడు చేతులు జోడించి విధేయతతో భీమన్న.

మనిషికి మార్గదర్శకుడు
తన కంటె ముందున్న పెద్ద మనిషి,
భగవంతుడు కాదు.

—గుడిసెలు

51. లోకం సువిశాలం

ప్రిన్సిపాల్‌గారి విచారణ ఆ విధమైన మలుపు తీసుకొంటుందని ఎవరూ ఊహించలేదు. భీమన్న మిత్రులు విచారంలో మునిగిపోతే, ప్రతికక్షులు నిరాశలో పడిపోయారు. వాళ్ళ లక్ష్యం భీమన్నకు బాగా చివాట్లు పెట్టించా లనేదే. ఆలోచించేకొలదీ విజయం భీమన్నది లాగానే భాసించి, జేవురించిన ముఖాలతో ఎవళ్ళ గదుల్లోకి వాళ్ళు పోయారు. భీమన్న మిత్రులు మాత్రం ఏదో పీడకలలో వలె ఖాధపడసాగారు.

ప్రిన్సిపాల్‌గారు ముందే నిన్ను అడిగివుంటే, నేను నీతోపాటే బైటికి వచ్చేసి వుందును" అన్నాడు రామారావు.

ఏదో జరిగిపోయింది. ఇకముందు చేయవలసిం దేమిటి? ఆ మరునాటి నుంచి దసరా సెలవులు. సెలవుల అనంతరం సెలక్షన్ పరీక్షలు. అందులో పాసు మార్కులు వస్తేనే యూనివర్సిటీ పరీక్షలకు పంపుతారు. ఆ కాలంలో అట్టి పద్ధతి వుండేది. భీమన్న బి.ఏ. సీనియరు. బైటికిపోయి ఎక్క డుంటాడు? చదువెలా సాగుతుంది? ప్రిన్సిపాలుగారితో విరోధం సర్వనాశకం కాదా? ఇక భవిష్యత్తు పోయినట్టేనా?

జొన్నల మోహనరావు, గంజి రామారావు, గుత్తాల రామమూర్తి, దాసరి బుల్లబ్బాయి, బయ్యా సుబ్బారావు వగైరా మిత్రులంతా చేరి, గాంధీనగరం ఇసక బైలులో (ఇప్పుడు పార్క్-వున్నచోట) కూర్చుని, తెల్లవార్లూ ఆలోచించారు. ఆలోచించే కొలదీ అంధకారం మరింత దట్టం కాజొచ్చింది.

చివరికి ఒక నిర్ణయానికి వచ్చారు. ఉదయమే వెళ్ళి భీమన్న ప్రిన్సిపాలుగారికి క్షమాపణ చెప్పుకోవాలి. కనీసం ఆ సెలవులలో అయినా, లాడ్జిలో వుండడానికి పర్మిషను పొందాలి.

ఉదయం ఏడుగంటలకే భీమన్న ప్రిన్సిపాల్‌గారింటికి వెళ్ళాడు. బైట మామిడిచెట్టు క్రింద కూర్చున్నాడు. హ్యానుచూచి వెళ్ళాడు. మరెవరో వచ్చి వెళ్ళారు. తర్వాత ఓ గంటకు ప్రిన్సిపాలుగారే వరండాలోకివచ్చి (చూచి) వెళ్ళారు. ఎనిమిదయింది. తొమ్మిదయింది. పదయింది. ఆకాశంనిండా మబ్బుపట్టింది. చినుకులు ప్రారంభమయాయి పదకొండయింది. వర్షం మొదలయింది. తడుస్తూనే కూర్చున్నాడు భీమన్న ఆలా ఆ చెట్టు కిందే!

ఆప్పుడు మళ్ళీ వరండాలోకి వచ్చారు ప్రిన్సిపాలుగారు. భీమన్న ఒక్క పరుగున ఆయన వద్దకు వెళ్ళి నిలబడ్డాడు.

"ఏం?"

"క్షమాపణ కోరుకుందా మని వచ్చాను. నన్ను క్షమించండి!"

నవ్వా రాయన. "ఇంతేనా భీమ న్నంచే? గట్టివాడ నుకొన్నానే!" అన్నారు. అప్రతిభుడే ఆయాడు భీమన్న!

"నీవేదో ఒక నిర్ణయానికి వచ్చావు. మంచి చెడ్డ లన్నీ ముందే ఆలోచించుకోవాలి. నిర్ణయం తీసుకొన్నాక, చచ్చినా సరే మార్చుకోగూడదు. నిజానికి నిన్న మీ పేచీలను సర్దుబాటు చెయ్యడాని కని నేను వస్తే, అది నెర వేరలేదు. మనస్సు బాధపడింది. అయినా, నీ మీద నాకు కోపంలేదు. పైగా, మెప్పు వుంది. లాడ్జినుంచి బైటికి పోతానన్నది నీవు. నేను పొమ్మన లేదు. నీ నిర్ణయం మంచిది. భయపడి మార్చుకోకు. మనస్సును చెదరి పోనివ్వకు. చదువు నీ కెక్కడున్నా సాగుద్ది. ఇక వసతా? లోకం

సువిశాలం. ది వరల్డు ఈజ్ సో వైడ్. ఇక వెళ్ళు "అన్నారాయన. అనేసి, లోనికి వెళ్ళిపోయారు.

స్థాణువే అయాడు భీమన్న.

జిగేలున ఒక మెరుపు. ఎక్కడో ఒక పిడుగు. వర్షం జోరు పెరిగింది. రోడ్డు పట్టాడు భీమన్న. ఎక్కడి కనే దేం లేదు మొదట్లో. నడిచే కొలదీ గమ్యం గోచరించసాగింది. వర్షం తుఫానులా మారింది. రోడ్లు సెలయేళ్ళయినై. ఎక్కడా ఆగలేదు. వర్షిస్తున్న మేఘశకలం రోడ్డుపై కదిలిపోతున్నట్టు సాగిపోయి-

"అమ్మా, మళ్ళీ నీ దగ్గర కొచ్చేశా" అన్నాడొక గుమ్మంలో జొరబడి.

"భీమరాజూ! అని ఆరిచిం దామె. వెంటనే పొడి తువా లందించింది. ఆమె మూడేళ్ళ క్రిందటి మంగమ్మ. అది కచేరీపేట.

దారి తెన్నులు లేని ఘోర కర్వరిని
దుర్భ చిత్తు డేదో యొక వెల్గు
నమ్మి ముందుకు సాగు; నది సాదరంపు
సదనమో గాక, శ్మశానమో గాక :

—మధు బాల

52. పల్లయ్యగారి దండయాత్ర

కచేరీ పేటలో మంగమ్మగా రింట మకాంపెట్టి, సరాసరి చదువులో పడ్డాడు భీమన్న. రోజులు బాగులేవు. బాగా చదవక తప్పదు. రోజూ ఏదో సమయంలో లాడ్జి మిత్రులు వచ్చిపోతూ వుండేవారు.

రాత్రికి వచ్చి బయ్యా సుబ్బారావు జత పడుకునేవాడు - కర్ర ఒకటి పక్కన పెట్టుకొని! ఏమో, ఎవళ్ళని నమ్మడానికి లేదనేవాడు. కుర్రవాడు, రాబోలువాడు. సంస్కృతం ప్రత్యేక భాషగా ఇంటరు చదువుతున్నాడు. శ్లోకాలు అందంగా చదివేవాడు. భీమన్నకు బావమరిది వరసవాడు. సెలవులైనా ఇంటికిపోకుండా, భీమన్నకు బాడీగార్డుగా కాకినాడలోనే వుండిపో

యాడు. పగలంతా బలాదూరు తిరిగి, వార్తలూ విశేషాలూ మోసుకొస్తూ వుండేవాడు.

అలా - ఒక వారం రోజులు గడిచాయో లేదో, ఒక సాయంత్రం హఠాత్తుగా పల్లయ్యగారు ప్రత్యక్షమయ్యారు వాకిట్లో!

"నీవు వ్రాయకుండానే నాకంతా తెలిసింది. నడు, ఆ ప్రిన్సిపాలు దగ్గరికెళదాం. బ్రహ్మమంచే ఏమిటో తేల్చేస్తాను" అన్నారు, అలా నిలబడి వుండే.

గుండె గుబేలుమంది భీమన్నకు. ఉన్న సమస్యలతోటే చస్తుంటే - ఇదొక పులిమీదపుట్ర! తండ్రిపట్ల ఎంతటి భక్తి ప్రపత్తులున్నా, ఆ పరిస్థితులలో ఆయన హఠాద్ధర్శనం పిడుగుపాటే! పైగా, ప్రిన్సిపాలుగారితో వాదనట!

"ముందు లోపలికిరా! తక్కిన విషయాలు రేపు ఆలోచించవచ్చు" అన్నాడు భీమన్న.

"రేపటి దాకా నా? నేను వెంటనే వెళ్ళిపోవాలి" అంటూనే పల్లయ్యగారు లోపలికి వచ్చారు.

పల్లయ్యగారు మహా కఠినుడు. నిరంకుశ ప్రభువు. అనుకొన్న పని జరిగితీరవలసిందే. ఎలా ఈ ప్రళయం ఆపడం! పైగా, ఆయన బండెక్కడు. బస్సెక్కడు. మామిడి కుదురునుంచి నడిచే వచ్చాడు! అదీగాక - బ్రహ్మ స్వరూపం తెలియనివాళ్ళు, వాళ్ళెంత గొప్ప అధికారులైనా సరే, అది తెలిసిన తన కొడుకును, వీ డెంత విద్యార్థి అయితే మాత్రం, నాస్తికుడంటారా? లాడ్జినుంచి తప్పిస్తారా? అన్న కోపంలో ఉన్నాడు.

"వాళ్ళు తప్పించలేదు. నేనే వచ్చేశాను" అన్నాడు భీమన్న.

"బ్రహ్మయ్య అట, ఎవరతడు? పోనీ అతని దగ్గరకైనా వెళదాం" చద్దాం పో అనుకున్నాడు భీమన్న.

"ఎక్కడికీ వద్దు. బ్రహ్మం, ఆత్మ ఇవి కాదిప్పటి సమస్యలు. నీవు ఎవరినీ చూడవద్దు" అన్నాడు మెల్లగా.

"ఏం? ఎందు కని?"

"నేను నీకు ద్రోహానా?"

"లేదు."

"ఇప్పుడు వీళ్ళంతా అనుకుంటారు - భీమన్న బెదిరిపోయి, తండ్రిని రప్పించుకొన్నాడు, వట్టి పిరికి వెధవ అని. అది నాకు చాల అవమానకరం."

పల్లయ్యగారు గంభీరుడై పోయారు. మర్నాడు తెల్లవారుఝామునే బయలుదేరి వెళ్ళిపోయారు!

చక్రధారి యైన వాడె
సారథి కాగలడు,
చేత విల్లు కలవాడే
గీత నందుకో గలడు!

—రాధీలా

53. ధర్మమేవ జయతి

భీమన్న కాలేజీలో మొదటిశ్రేణి విద్యార్థి. విధేయతకు పెట్టింది పేరు. తెల్లటి పైజమా, తెల్లటి లాల్చీతో స్వచ్ఛతకు రూపకల్పనలా వుండేవాడు. జనరల్ ప్రొఫిసెన్సీ ప్రైజు ఈయనకే వచ్చింది. ప్రవర్తనలో ఏ లోపమూ లేదు. పైగా మంచి కవి. అలాంటి వాడి మీద ఈ గోలంతా దేనికి? ప్రార్థనపై నమ్మకం లేనంతమాత్రాన పరిస్థితి ఇంత తీవ్రతకు పోవలసిన అవసరం లేదే!

ఎక్కడో ఏదో లోపం జరిగిందనీ, అది తమలోనే వున్నదేమో అనీ ప్రిన్సిపాలుగారు అనుమానించడంతో ప్రతిపక్షానికి (బ్రహ్మయ్యగారి పక్షానికి) సంకటస్థితి ఏర్పడింది. డిసిప్లిను కప్పల తక్కెడ అయింది. వాళ్ళలో వాళ్ళే పేచీలుపడి, ప్రిన్సిపాలుగారికి, నాయుడుగారికీ ఫిర్యాదులు చేసుకోవడం సాగించారు. దానితో విసిగిపోయిన కాలేజీ అధికారులు స్కాలర్‌షిప్పులను చెల్లించడం ఆపు చేశారు. లాడ్జి రాజకీయాలు పూర్తిగా పరిష్కారమైతే తప్ప, ఒక్క పైసా కూడ ఇవ్వం అన్నారు!

అప్పటినుంచి ప్రారంభ మైనై - రాంమోహన్ లాడ్జి హరిజన విద్యార్థుల నిజమైన తిప్పలు. అప్పటివరకు తటస్థులుగా వుంటున్న ఐయ్యా వెంకన్న, గొల్లపల్లి గనిరాజు, కాశి ఆదినారాయణ, భూపతి రామ్మోహనరావు మొదలైన విద్యార్థులంతా వీధిన పడ్డారు. ఈ తటస్థుల నాయకత్వంలో విద్యార్థులంతా ప్రతిరోజూ ఉదయమూ, సాయంత్రమూ ప్రిన్సిపాల్‌గా రింటిముందు మామిడి చెట్టుకిందే మకాం పెట్టసాగారు. భీమన్ననుకూడ తమతో కలవ మన్నారు కాని- ఏడ్చేదాని మొగుడు సామెత గుర్తుచేశాడు భీమన్న.

ఆలోగా-బ్రహ్మసమాజ సన్నిహితులలో ప్రముఖుడైన ఒకవ్యక్తి వచ్చి భీమన్నకు ఒకసలహా ఇచ్చాడు. అది-ప్రిన్సిపాల్‌గార్ని మళ్ళీ ఒకసారి క్షమాపణ వేడుకోమని.

"గొప్పవాళ్ళూ, అధికారులూ కోపం వస్తే పగపడతారు. న్యాయం, ధర్మం నీతి వాళ్ళదగ్గర పనికిరావు. వాళ్ళకు అనుకూలమయిందే ధర్మం. లాభకరమయిందే న్యాయం. సుఖకరమయిందే నీతి. నీ భవిష్యత్తంతా ప్రిన్సిపాలుగారి చేతిలోవుంది. ఆయనకు నీవు కోపం తెప్పించావు. దాన్ని తగ్గించక పోతే-రేపు సెంషన్ పరీక్షలో నీకు మార్కులు పడవు. నిన్ను పరీక్షకు పంపరు. దానితో ఇంతవరకు చదివిన చదువంతా పోయినట్టేకదా? పైగా, సర్టిఫికెట్లో ప్రవర్తన మంచిది కాదని వ్రాస్తారు. దానితో జీవితమే సర్వనాశనమై పోదా?" అన్నా డాయన.

నిజమే. అలా జరిగే ప్రమాదం వుంది. పదవి, అధికారమూ పెరిగే కొలదీ మనిషి మహా సర్పంగా మారిపోతాడు. కాని-

తన కాలేజీ విద్యార్థి జీవితం నాలుగేళ్ళూ తన కిచ్చిన అనుభవంవేరు విధంగా వుంది. తానే కుప్రతనంగా, పెంకిగా, మూర్ఖంగా ప్రవర్తించా డెన్నోసార్లు. తనపట్ల ఏ ఒక్కరైనా నిర్దయగా ప్రవర్తించిన సందర్భమే కనిపించదు!

తలచుకొంటే ఏమైనా చెయ్యగల ఉన్నత స్థానాలలో ఉన్నవారు ఇంత, కాలమూ తనపట్ల ప్రదర్శించుకొంటూ వస్తున్నదేమిటి? చేతకానితనమా

సహనమా ? పరమాత్మీయమైన వాత్సల్యం కాదా ? కన్న లొత్తుకొని భీమన్న ఇలా అన్నాడా పెద్దమనిషితో-

"మీరు చెప్పిందంతా నిజమే. అయితే-నేనేం చెయ్యను ? కవిత్వం వ్రాసుకోవడం తప్ప, నా కిం కేమీ చేతకాదు. అందుకే నేను ధ్రైంకుగా, త్రికరణశుద్ధిగా వుంటాను. తప్పనుకొన్న పని చెయ్యను. చేసినపని తప్పనుకోను. ప్రిన్సిపాలుగారు కూడ నాకిదే బోధించారు. ఆయన నాకు అన్యాయం చేస్తా రనే భయం నాకు కలగడంలేదు. మార్కులు వస్తే పరీక్షకు పంపుతారు, లేకపోతే లేదు. పైగా వెయ్యిమంది విద్యార్థులలో నేనొకణ్ణి. ప్రిన్సిపాల్ గారికి రోజూ వెయ్యి తలనొప్పులు. నన్నే ప్రత్యేంగా జ్ఞాపకం పెట్టుకోవలసిన అవసరం ఆయనకేం లేదు. అదీగాక, నేను పాడై పోతున్నా నని కదా ఆయన బాధ ? ఆయనే పట్టి నన్నెందుకు పాడుచేస్తారు ?"

దసరా సెలవులు ముగిసాయి. పరీక్షలు జరిగాయి. ప్రోగ్రెస్ చూపే అవసరం లేకుండా, పూర్తి పరీక్షకు పంపబడ్డ కొద్దిమంది విద్యార్థులలో భీమన్న ఒకడు.

ఆతర్వాత కొద్ది కాలానికే-బ్రహ్మయ్యగారు బ్రహ్మసమాజం పెద్దల విశ్వాసాన్ని పోగొట్టుకొని, వారి కోపానికి కూడ గురైన సంఘటన ఒకటిజరగటంతో ? విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇచ్చేశారు. అందరూ తీసుకొన్న తర్వాతే భీమన్న వెళ్ళి తీసుకొన్నాడు.

అక్షర జ్ఞానం లేని కోటీశ్వరుడికి
అపర సరస్వతి కార్యదర్శిని !
రత్నగర్భ, వసుంధర, ధాత్రి !
అయినా-ప్రతి వందీ తొక్కకు పోతుంది దాన్ని !

—శివాలకలు

54. ప్రేమ-ప్రణయం

భీమన్న జీవితంలో అధిక భాగం ప్రణయమయం. చిన్న కథలు, పెద్ద గాథలు, నవలలు, నాటకాలు కూడ ఈయన జీవితంలో చెప్పలేనన్ని వున్నై.

అయితే-వాటన్నిటినీ నేనిక్కడ చెప్పబోవటంలేదు, చెప్పడానికి వీలులేదు కూడ.

ఎవరికైనా సరే, ఎంతటి గొప్పవారికైనా సరే, ప్రణయజీవితం వుండి తీరుతుంది. తరువాత జీవితంలో మహామంత్రే కావచ్చు, మహాయోగే కావచ్చు. ఎంతటి ఔన్నత్య శిఖరాలను అందుకొన్న వాడైనా, గతంలో బాలుడుగా, యువకుడుగా ఆయా దశల మంచి చెడ్డల్ని అనుభవించి వుండక తప్పదు.

నిజానికి కింద ఎంత మురికీ, బురదా వుంటే చెట్టు అంత బలంగా ఎదుగుతుంది. అంతమంచి పుష్పాన్నో, ఫలాన్నో ఇస్తుంది. అనుభవ నానాత్వ సంపుటీకరణమే సంపూర్ణ జీవిత పరమార్థం. రత్నవేదికలు, చంద్రశిలా భిత్తికలూ ఎంత పరిశుభ్రంగా అయినా వుండవచ్చు. వాటినుంచి రసవంతమైన దేదీ పుట్టదు. ఈ సత్యం అందరికీ అనుభవంలోదేవయినా, పబ్లికుగా చెప్పుకోరు - దాచేసుకుంటారు.

శాకాహార కుటుంబంలో పుట్టి మహానాయకుడైన ఒకవ్యక్తి ఫలానా విందులో చేపలు తిన్నాడంటే ప్రమాదం లేదు. ఫలానా స్త్రీతో సినిమాకు వెళ్ళాడంటే కొంప లంటుకు పోతై! ముఖ్యంగా ఆ స్త్రీకి సంబంధించిన కొంపలు! ప్రకృతి సహజమైన స్నేహానికి పరమ గోపన విధి!

రహస్యం అందరికీ తెలిసిందే. అయినా, తమకు మాత్రమే తెలుసు ననుకొంటూ బ్రతుకుతారు తృప్తిగా ఎవరి మట్టుకు వారు.

భీమన్న జీవితం ఈ విషయంలో ఒక ఆద్దాల బీరువా. ఈయన హృదయం ఒక పంచిన దానిమ్మపండు. ఎన్నో రహస్యాలు, రసాలు. అయితే, ఏవీ నిగూఢ గుప్తాలు కావు. వాటిలో సంఘ వ్యతిరేకాలూ, ధర్మ విరుద్ధాలూ ఏమీ లేవు. అన్నీ రసాద్వైత మూలకాలైన ప్రణయ సన్నివేశాలు.

ప్రణయం అంటే భీమన్న అర్థంలో ఇటు అమలిన శృంగారమూ కాదు, అటు సెక్సూ కాదు. ప్రణయంలో శృంగారం వుంది. సెక్సు వుండవచ్చు, లేకపోవచ్చు. ప్రేమించడం కేవలం పెళ్ళాడడం కోసమే, సెక్సుకోసమే అనే వైఖరి ఈయనకు కిట్టదు. ప్రేమించిన వాళ్ళను పెళ్ళాడడం ఉత్తమం.

కాని , పెళ్ళాడకుండా వుండడం ఉత్తమోత్తమం . ప్రేమకు సాఫల్యం పిల్లల్ని కనడం కాదు . ఆత్మైక్యం .

ప్రియురాలు ఉద్యానవనం లాంటిది . భార్య ఇల్లు లాంటిది . ఎంతగొప్ప ప్రియురాలైనా భార్యగా వుండటానికి పనికిరాక పోవచ్చు . ప్రియురాలు భార్య అయితే ఆ మరుక్షణమే ఆమె ప్రియురాలితనం రద్దయి పోతుంది. బాధ్యత మీదపడుతుంది . ఎంతటి ప్రేమ వృత్తాంతమైనా సరే వివాహంతో ఆగిపోవడం అందుకే .

అందుకే భీమన్న తన ప్రేమను ప్రణయం (romance) అంటాడు . ప్రేమించడమే పరమ పరమార్థమైన ప్రేమ , ప్రేమించడమే ఆదిమధ్యాంతాలు మూడూ అయిన ప్రేమ - రసానంద సంలీనమైన ప్రణయం . మరే భౌతిక బాధ్యతా దాన్ని స్పృశించలేదు .

ఈయన ప్రణయ గాథలన్నీ ఇలాంటివే . కొన్ని ఆకులే పరమార్థమైన మరువం , దమనం వంటివి . కొన్ని పూవులే ప్రధానమైన మల్లి , గులాబి వంటివి . కొన్ని ఫలాల నిచ్చే పనస , మామిడి వంటివి . అన్నీ ఈయన జీవిత క్షేత్రం నిండా కవితా సస్యాన్ని అపారంగా పండించి నట్టివే . ఆనందంలో ముంచెత్తి నట్టివే .

"మీ ఆత్మకథను వ్రాయగూడదా ?" అని ఎవరైనా ప్రశ్నిస్తే , "నా ప్రతి రచనా నా ఆత్మ కథే" అంటాడు భీమన్న . అది సత్యమే . కేవలం సాంకేతిక జిజ్ఞాసతో ఈయన రచనల్ని పరిశోధించి చూస్తే , బాల్యంనుంచీ కూడ ఈయన జీవితం పరమ శృంగార రసైకంగానే కనిపించవచ్చు . అయితే లోకానికి కావలసింది ఈయన రచనలలోని విశ్వజనీనత . వాటి సృష్టికి దోహదం చేసిన వాస్తవ సంఘటనలు కాదు . భోక్తకు కావలసింది రస పుష్టికల అన్నం . దానిని పండిన పొలాలూ కాదు , వండిన పాత్రలూ కాదు .

ప్రేమిస్తే పెళ్ళాడ వద్దు,
పెళ్ళాడ దలిస్తే ప్రేమించ వద్దు,
రెండు కత్తు లొక ఒరలో ఇమడవు .

ప్రేమ ఆత్మానుభూతి, పెళ్ళి విద్యుక్త ధర్మం
రెండూ రెండు నేత్రాలు జీవితానికి
రెంటినీ కలిపి ఏకాక్షివి కాకు!

—త్రిపదలు

55. మణులూ - మాణిక్యాలూ

వెంట ఐదు కొలది ప
ర్వెత్తు తత్వము నాది,
కవ్వించి ననే గాని
కన్నెత్త వీవు—

—బొమ్మ

భీమన్న ప్రణయ జీవిత తత్వం అంతా ఈ నాలుగు పంక్తులలోను వున్న దనవచ్చు. తనను ఆరాధించి అనుసరించే వాళ్ళ నుంచి తప్పుకు పోతూ వుండడం, తాను ఆరాధించే ప్రియురాలి ప్రసన్నత కోసం కవితా కుసుమాలు పూయించు కోవడం— ఇదీ స్థూలంగా ఈయన జీవితం!

ఒక ప్రక్క కష్టలతో, పరీక్షలతో సతమత మవుతున్న సమయంలో మరో ప్రక్క ఒక ప్రణయ వ్యవహారం వెంటాడ సాగింది భీమన్నను. కచేరీ పేటలో ఒక మాణిక్యం - కచేరీలో మునిగి వున్న మాణిక్య వీణ నుంచి జారి పడ్డట్టు - ఈయన ముందు పడి, వెంటపడ్డది.

చూచుకోడాలు, నవ్వుకోడాలు, చూచుకోకుండా వుండలేక పోవడాలు, వేళాకోళాలు, వెక్కిరింతలు, పరస్పర సహాయ సహకారాలు - అంత వరకు పర్వాలేదు. ఏ ప్రణయాని కైనా ఉదయ రవి చంద్రికలు ఉత్సాహకరంగానే వుంటై. అయితే గదిలోకి చేరి పుస్తకాలూ అవీ సదరడం, ఏదో ఇరుకున పడి వొళ్ళు తగల్చడం వరకు వస్తే మాత్రం అది ప్రమాద సూచకమే. ఒక్కసారి సెక్సు వరకు పోతే ఇక ఆ స్త్రీని న్యాయంగా వదిలించు కోవడం సాధ్యం కాదు. అన్యాయం చెయ్యడం భీమన్న స్వభావం కాదు.

ఒకసారి తాకితే చాలని, కాళ్ళు కావలించుకొని బ్రతిమాలింది మాణిక్యం. ఆడపిల్లలను అంత ఏడ్పించ గూడదని మంగమ్మ కూడ అన్నది. మాణిక్యం తనకు తానై పెదవుల దాకా వచ్చిన మధు కలశం. పరిస్థితులు, పర్యవసానాల, పరువు ప్రతిష్ఠల ఆలోచనలు కుక్కల్లా మొరిగి, బెదరగొట్టి తరుముకు పోయాయి భీమన్నను ఆ పరిసరాల నుంచి.

కచేరీ పేట నుంచి ఎల్విన్ పేటకు మకాం మార్చేశా డీయన. అయినా, ఆమె వదల్లేదు. దారి కాచి, ఎక్కడో అక్కడ కలుసుకొని, ఏడ్చిపోతూనే వుండేది. నీళ్ళతో నిండిన ఆమె జాలి కళ్ళు తడిసిన ప్రతి పువ్వులోను కనిపిస్తూ వుంట్రై నేటికీ ఈయనకు.

ఈ రకమైన ఘట్టాలకు ఇదొక మచ్చుతునక. ఎల్విన్ పేటలో కూడ అటువంటివే! సెలవలకు మామిడికుదురు వెళ్ళితే అక్కడా అవే! వాటన్నిటి నుంచి కూడ ఈయన బ్రతికి బైట పడ్డాడు. అయితే, ఈ గందర గోళాలలో చదువు మాత్రం కొంత దెబ్బ తిన్నది.

మిత్రులు కోరినా, ఈయన తిరిగి లాడ్జికి వెళ్ళలేదు. ఆ మిగిలిన నాలుగు నెలలూ ప్రైవేటు గదుల లోనే గడిపివేశాడు. ఈ చింతల మూలకంగా ఆరోగ్యం దెబ్బ తిన్నది. సరిగ్గా పరీక్షల సమయంలో పంటి పోటు మొదలై నరకం చూపెట్టింది.

కాలేజీ పిడ్కాలు ఉత్సవంలో సీనియరు విద్యార్థుల కవితలు ఒక హై లైటు. నలుగు రైదుగుర కవితలను కలిపి "పిడ్కాలు" అనే శీర్షిక కింద ఒక చిన్న పుస్తకంగా ప్రకటించారు. కార్యక్రమంలో ఈ భాగాన్ని కృష్ణశాస్త్రిగారు నిర్వహించారు. అందులో భీమన్న పద్యాలు అందరు విద్యార్థుల లెక్చరర్ల ప్రశంసలనూ అందుకొన్నై. పి. ఎల్. ఎన్. శర్మ ప్రసంగం చేశాడు. ఆయన ఆ నాలుగు వత్సరాలూ వక్తృత్వంలో ఛాంపియను. భీమన్నకు ముఖ్య మిత్రుడు.

బి. ఏ. అయిపోయిందన్న సంతోషం వున్నా - జీవితంలో కాలేజీ ఘట్టం ముగిసింది, ఇక అది తిరిగిరాదు అన్న భావం మనస్సును వేధించగా,

కంఠం అశ్రు రుద్ధమై, సభావేదిక మీద పద్యాలు సరిగా చదవలేక పోయాడు భీమన్న. చదువుతున్న పుస్తకాన్ని బల్ల మీదే పడిలేసి, కళ్ళు తుడుచు కొంటూ దిగి వచ్చేశాడు. ఆర్ద్రమై పోయింది సభంతా.

నీ యురమోడ్పు కందొవల
నీరిమ కాంతులు కల్ప భూరుహ
చ్ఛాయలు నాకు; ఆ అమృత
సైకత శయ్యల విశ్రమించి, నా
ఆయము నెల్ల నీ వలపు
ప్రాయములో సుభగించుకొందు; సాం
ధ్యాయవ హారుషాది పురు
షా! ఒక సారిటు కన్నుమల్పవే:

—మణి మానసం

56. తండ్రితో ఘర్షణలు

తనకు జీవితంలో ఏది నిషేధమో తన కుమారుని కది వరణీయ మౌతున్నట్టు రూఢి కాగానే-పల్లయ్యగారు భీమన్న విషయంలో జాగ్రత్త పడసాగారు. పల్లయ్యగారు వేదాంతి. పరస్త్రీలవంక కన్నెత్తి చూచే వారు కాదు. భీమన్న కవిగా తయారవుతున్నాడు. అందులో ప్రేమ, శృంగారం ఎక్కువగా వుంటున్నై. అందాలకు, అందగత్తెలకు ఎక్కువ ఆకర్షితు డవుతున్నాడు. అందువల్ల పదేళ్ళ ప్రాయంనుంచే భీమన్న ప్రవర్తనపై నిఘా వుంచా రాయన.

ఆడ వాళ్ళ పట్ల అసహ్యం పుట్టించే మాటలను, కథలను భీమన్న వినే టట్టు శిష్యులకు చెపుతుండేవారు. నాగమ్మగారినే సిఐడిగా నియమించారు. అయినా సరే, తన సరదాలు తీరిపోతూనే వుండేవి భీమన్నకు.

కాలేజీ సెలవుల్లో ఇంటికి వచ్చి నప్పు డెల్లా ఈ నిర్బంధాలు ఎక్కువ య్యేవి. మిత్రులతో కలిసి సభల కనో, ఉత్సవాల కనో ఇతర గ్రామాలకు

పెళ్ళి వుండడమే ఎక్కువగా జరిగేది. భీమన్నకు ఇంటివద్ద వున్నప్పుడే ఈ నిఘాలు. దానికి కారణం ఆ చుట్టు పట్ల నలుగు రైదుగురు పడుచులకు తనయనపై కన్నుండడం. ఈయన నుంచి ప్రతిఘటన లేక పోవడం! పండ్లూ, మిఠాయిలూ అందుతూనే వుండే వెంతో మంది నుంచి.

"కన్నుదోయికి అన్యకాంత లడ్డం బైన మాతృభావన చేసి మరలు వాడు" అనే భాగవత పద్యాన్ని ఉదహరించి, ప్రహ్లాదుడే యువకులకు ఆదర్శప్రాయు డన్నారు పల్లయ్య గారు.

"పంచా బ్దంబుల వాడికి ఏ కాంత అయినా తల్లిలా కాక మరెలా కనిపి స్తుంది?" అన్నాడు భీమన్న. "నీ కాలేజీ చదు విదా?" అంటూ ఉగ్రుడై పోయారు పల్లయ్యగారు! భాగవతానికే వంక పెడతావా అన్నారు.

"వంక వుంటే వంకే - భాగవతం కానీ, భగవంతుడు కానీ."

ఈ రకమైన ఘర్షణలు తండ్రీ కొడుకుల మధ్య తరచు జరుగుతూనే వుండేవి.

భీమన్న ప్రాసి చింపేసిన కవితా కాగితాలతో, ఇంటి చుట్టూ తోటంతా కొంగలు వాలిన ట్టుండే దట!

అక్క గొంతమ్మకు ఏనాడో పెళ్ళయిపోయింది. ఇక ఇంటి వద్ద తమ్ముడు, చెల్లి, తల్లి. తాను వాళ్ళతో కలిసి వుండే రోజులు వాళ్ళకు పండగలు. ఆ వూళ్ళోనే వుండే తటవర్తి శేషమ్మ గారికి డబ్బు లిచ్చి తరచు గారెలు చెయ్యించుకొనే వాళ్ళు. పావులాకు ఏభై గారెలు వచ్చేవట.

భీమన్న వద్ద స్కాలర్షిప్పు తాలూకు డబ్బులు కొన్ని వుండేవి. తన విద్యల సంపాదనను తాను ముట్టగూడదనే నియమం పెట్టుకొన్నారు పల్లయ్య గారు. అందువల్ల భీమన్న స్కాలర్షిప్పు డబ్బు భీమన్న వద్దనే వుండి పోయేది. కాకినాడలో స్కాలర్షిప్పులు లేని పేద విద్యార్థులకు తరచు పుస్తకాల కనీ, పరీక్ష ఫీజుల కనీ తానే పెట్టుకొంటూ వుండేవాడు భీమన్న. ఇంకా మిగిలితే ఇంటిపద్ద పండగలు చేసుకునే వారు.

కాలేజీ అనగానే రకరకాల ఖర్చు లుంటాయి. తగిన దుస్తులు కావాలి. తరచు ప్రయాణాలు చేస్తూ వుండే వాడు. ఎప్పుడూ జేబులో డబ్బు లుంటూ వుండాలి. దేనికీ కూడ తండ్రి నడిగే వాడుకాదు.

భీమన్న అనుమానించినట్టే బి.ఏ. పరీక్షలో ఇంగ్లీషు పార్టు పోయింది. పంటిపోటు తెచ్చిన అపజయ మది. ఆ తర్వాత ఆ దంతాన్ని లాగించేసి, సెప్టెంబరు పరీక్షలలో ఆ పార్టు పాసైనాడు. ఆ తర్వాత ఏం చెయ్యాలో తోచక, మామిడికుదురు మధుర వాతావరణం మత్తునుంచి కొంచెం తేరుకోవాలని, వాడపల్లి గారి ఆహ్వానంపై రామచంద్రపురం వెళ్ళాడు.

కరుణతో వాత్సల్య మధువును
శరిసి దాహము తీర్చినావు
నెరయతీసిన నరువి గుండెల
చెరకు తోటలు పెంచినావు
తండ్రివో ఈ ధరణి కంతకు?
తల్లివో ఈ చల్ల దనముకు?
ఎవరవో నీ వెవరవో!
ఎంత మంగళ మూర్తివో?

—బాల యోగి (నాటకం)

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

మధుకర సర్గ

57. వాల్మీకాశ్రమం

రామచంద్రపురం పడవల కాలువకు దేరువగా, హైరోడ్డు ప్రక్క పుంతలో చిన్నచిన్న గుడిసెలు వేసి, అందులో మామా బాల బాలికలకు ఉచిత భోజన వసతులను కల్పిస్తున్న ఆశ్రమం వాల్మీకాశ్రమం. దాని వ్యవస్థాపకుడు ఈలి వాడపల్లిగారు. పల్లయ్య గారి శిష్య కోటిలో వాడే ఆయన కూడా.

తెల్లటి ముఖానికి ఇరు చెంపల నుంచీ పెరిగి వచ్చిన మూరెడు నల్లటి గెడ్డంతో, చెరగని చిరు నవ్వుతో, ఐహు మృదువైన మందస్వరంతో, మూసి పోయిన తెల్లటి లాల్చీతో, సాక్షాత్తు యువ వాల్మీకిలా వుండేవాడు వాడపల్లి గారు. కఠిన బ్రహ్మచారి. కటిక నేలనే పండుకొనేవాడు. పాత సైకిలు ఒకటి వేసుకొని, దానికి ఇటూ అటూ చేలిసంచీలు తగిలించుకొని, ఎక్కడ మానెడు వడ్లు దొరుకుతా యంటే అక్కడి కెల్లా, రా త్రనక పగ లనక తిరుగుతూనే వుండే వాడు-మధుకరంలా!

ఉదారు లైన రైతుల నుంచీ, వర్తకులనుంచీ ధాన్యం, బియ్యం, పప్పు, ఉప్పు, డబ్బు వసూలుచేస్తూ, ఆశ్రమం నడిపే వాడాయన. ఆశ్రమ వాసులైన పిల్లలకే కాక, భోజన సమయానికి ఎవళ్ళువస్తే వాళ్ళ కెల్లా లేదనకుండా పెడుతూ వుండేవాడు. వాడపల్లి గార్ని ఎరగని వాళ్ళెవళ్ళూ లేరు. రామచంద్రపురం తాలూకా సెంటరు కూడ. కోర్టు, కచేరీ పనుల మీద వచ్చే ఆ చుట్టు ప్రక్కల గ్రామాల మామా లంతా ఆశ్రమంలోనే తినిపోతూ వుండేవాళ్ళు. ఫలితంగా ఆశ్రమ బాల బాలికలు తరచు తిండిలేక మాడుతూ వుండేవాళ్ళు.

ఆశ్రమం అట్టిస్థితిలో వుండగా వెళ్ళాడు భీమన్న అక్కడికి. వాడపల్లి గారు రకరకాల పనుల మీదా, ప్రచారాల మీదా గ్రామాలకు వెళ్ళి, రోజులకు రోజులే వుండిపోయేవాడు. ఆశ్రమంలోని కుర్రవాళ్ళను తీసుకొని, సమీప గ్రామాలకు వెళ్ళి, భీమన్నే ధాన్యసేకరణ చేసి, ఆశ్రమం మరీ పస్తులు పడకుండా చూచే వాడు. నెల్లి తాతయ్య, దండంగి అప్పారావు మున్నగు కుర్ర వాళ్ళు ఈ విషయంలో ఆశ్రమం కోసం చాల శ్రమ పడేవాళ్ళు.

"మానవుని మరొక మజిలీ" గేయ నాటకాన్ని భీమన్న వ్రాసింది ఆ కాలంలోనే.

పిఠాపురం నుంచి ద్రోణంరాజు రామమూర్తి గారు వచ్చి, ఆశ్రమంలో కొన్ని రోజు లున్నారు. ఆయన పరమ భక్తుడు. కీర్తనలను పరవశుడై పాడుతూ శ్రోతలకు పారవశ్యం కూర్చడంలో ప్రసిద్ధుడు. భీమన్న గేయాలను వింటూ ప్రశంసిస్తూ వుండేవా డాయన. కొన్ని నెల లక్కడలా గడిచాయి. తర్వాత పెండ్లి ప్రయత్నాలకోసం భీమన్నను ఇంటికి పిలిపించుకున్నారు పల్లయ్యగారు.

వాడపల్లి గారి ఆశ్రమంలో వున్న కాలంలోనే కావూరి మీరా సాహెబు, కావూరి పట్టాభి రామయ్య మున్నగు కార్మిక నాయకులతోను, అక్కడి కార్మిక కోద్యమంతోను భీమన్నకు పరిచయా లేర్పడినై.

రొక్కం నరసింహం, రూబెన్ గార్ల వంటి ఎంతో మంది హరిజన, క్రైస్తవ నాయకుల పరిచయాలు కూడ అప్పటివే. కాశీ విశ్వనాథం గారి చెల్లెలు కస్తూరి అద్భుతంగా వీణ వాయించేది. ద్రోణంరాజు వారమ్మాయి కృప కూడ గొప్ప వైణికురాలు. రొక్కం వారి కుమార్తె జానకీబాయి వాయులీనంలో నైపుణ్యం కలది. శ్రావ్యంగా పాడేది.

తమ సంస్థ తరపున అచ్చు వేయిస్తామని వంద పేజీలకు సరిపడ్డ కవితలను భీమన్న వద్దనుంచి శివశంకరశాస్త్రిగారు తీసు కొన్న దా రోజుల్లోనే. కాకినాడలో కృష్ణశాస్త్రిగారింట్లో కూర్చుని వాటిని సెలెక్టు చేశారు. అవేమైపోయాయో ఈనాటికీ తెలియదు.

ఈయన కాలేజీలోచేరిన నాటి నుంచీ కూడ ఎన్నో పెళ్ళిసంబంధాలు వస్తూ వుండేవి. తాను పెళ్ళే చేసుకోనని చెపుతూ వుండే వా డందరితోను. ప్రేమ లకూ, ప్రణయాలకూ ఏమీ లోటులేదు. ప్రకృతిలోని ప్రతి అందమూ ఒక ప్రియురాలై పలకరిస్తూనేవుంది. కవితా నందన భావనా దేవతల ఒడుల్లో పరవ శిస్తూనే వున్నాడు. పెళ్ళంటే బాధ్యతతో కూడిన వ్యవహారం. ఏదో క్రమా దాయం కల స్థిరోద్యోగం లభిస్తేతప్ప పెళ్ళిమాటే తలపెట్టగూడ దనుకొన్నాడు.

కాంగ్రెసులో యువజన విభాగానికి చెందివుండే వాడు భీమన్న ఆ కాలంలో. అది సోషలిజం లక్ష్యంగా కలది. కాంగ్రెసు హైకోర్డు దిగి వచ్చేది కాదు. ఈ యువజనం మాత్రం జనంలోకి వెళ్ళి, పల్లెల్లోను, పేటల్లోను పని చేసేది.

ఒకసారి నగరంలో జరిగిన ఒక మహా సభలో శ్రీ శ్రీ గారి "మరో ప్రపంచం" గేయాన్ని మహోద్రేకంతో పాడాడు భీమన్న. దాన్ని విని సంతోష పడ్డ కాంగ్రేగుల నర్సయ్య గారు భీమన్నను ఆశీర్వదించారు. ఆయన గొప్ప కార్మిక నాయకుడు. మామిడికుదురు వాడే. పల్లయ్యగారికి మిత్రుడు.

"నీకు గొప్ప రాజకీయ భవిష్యత్తు వుంది. తొందరపడి పెళ్ళి చేసుకోకు" అని సలహా ఇచ్చా డాయన భీమన్నకు. పల్లయ్యగారు మాత్రం ప్రయత్నాలు మానలేదు.

"నీకు నచ్చిన పిల్ల పేరు చెప్పు. తీసుకు వచ్చి పెళ్ళి చేస్తాను," అన్నా రాయన.

"పెళ్ళి కంటె సాంఘిక సేవకూ, జాతీయోద్యమానికి అంకితం కావడం నా కెక్కువ ఇష్టం" అన్నాడు భీమన్న.

"సేవలకూ, ఉద్యమాలకూ మేమంతా వున్నాం. ముందుగా నీవు జీవితంలో స్థిరపడు" అన్నారు సన్నిహిత శ్రేయోభిలాషులు.

"విద్య ఎంత గొప్పదైనా లక్ష్మికి విధేయురాలే. ధనం లేకుండా నాయకత్వం లభించదు. నీకు ఇప్పు డప్పుడే ఉద్యోగం వచ్చేటట్టు లేదు. పెళ్ళైనా చేసుకొని మా కోరిక తీర్చు" అన్నారు పల్లయ్య గారు. తల్లి కోరిక కూడ అదే. అక్క, బావ, తమ్ముడు, చెల్లెలు అందరిదీ అదే కోరిక.

"సరే , మీ ఇష్టం " అన్నాడు భీమన్న . తన మనసులో వున్న పేరేదో చెప్పేశాడు . వెంటనే రాజోలుకు బైలు దేరారు పల్లయ్య గారు .

చిన్న పైసా యైన
చేత లేకుండినను
లక్ష మందికీ మహా
లక్ష్మీ రూపము నీవు
బాల బాలికలె నీ
బంగారు పంట
అమృత విజ్ఞానమే
ఆతిథి నీ యింట

—బాల యోగి (అంకితం)

58. ఎర్రటోపీ క్రింద పచ్చటి హృదయం

భీమన్నకు పెళ్ళిచేసి మద్రాసుకు పంపించే ముందు , మామిడికుదురుకు చెందినవే ఒకటి రెండు విశేషాలు :

" ఇన్స్పెక్టరు గారు రమ్మంటున్నారు " వెనకనుంచి ఒక అధికార స్వరం , పక్కనే వచ్చి ఆగిన పోలీసు సైకిలు! గతుక్కు మన్నది గుండె . తనపై పోలీసు దృష్టి పడిందేమా అనుకున్నాడు - భయం భయంగా .

మామిడికుదురులో పోలీసు స్టేషను రోడ్డుమీదే వుంది . కొత్తగా కుట్టించు కొన్న సూటు వేసుకొని , నాడాలు బిగించిన బూట్లు రోడ్డును జల తరంగిణి లా మ్రోయిస్తుండగా , నగరంలో ఒక పెళ్ళి నుంచి తిరిగి వస్తున్నా డీయన . సమయం సాయంకాలం . పోలీసు స్టేషను దాటి కొంచెం దూరం వెళ్ళే టప్పటికి పట్టు కొన్నాడు పోలీసు కానిస్టేబులు .

వెళ్ళి స్టేషను గుమ్మం ముందు నిలబడ్డాడు చేతులు కట్టుకొని . ఇన్స్పెక్టరు లోపలి నుంచి వచ్చి , పైకి రమ్మని ఆహ్వానించాడు ఇంగ్లీషులో . ఆరుగుమీద రెండు కుర్చీలున్నై . కూర్చోమన్నాడు , తాను కూర్చుంటూ . ఆయన చూపు

తున్న మర్యాదకు భీమన్నలోని బెదురు కొంత వరకు తగ్గింది. పేరు, చదువు వగైరాలకు చెందిన కుశల ప్రశ్నలు కూడ త్వరలోనే అయిపోయినై.

నగరం కంటే మామిడికుదురు బాగుంటుందనీ, ఇక్కడ ప్రకృతి సౌందర్యంలో వైవిధ్యం ఎక్కువనీ, తాను కొత్తగా వచ్చినా, ఇక్కడి వాడుగానే ఫీలవుతున్నాననీ అన్నాడు ఇన్స్పెక్టర్.

"అదంతా మీ సౌహార్దానిదీ, సౌజన్యానిదీ. సమర్థుడైన మంచి వాడెక్కడుండే అక్కడంతా చక్కగానే వుంటుంది" అన్నాడు భీమన్న.

"ఇక్కడ క్రైం కూడ తక్కువే" అంటూ, "ఏవో చిల్లర దొంగతనాలు తప్ప," అన్నాడు ఇన్స్పెక్టరు.

మొత్తం రాష్ట్రాన్నే గజ గజ లాడించిన గజ దొంగలకు, రౌడీలకు ప్రసిద్ధి పొందిన తన మామిడికుదురు అంత దిగజారి పోయిందా అనుకున్నాడు భీమన్న. కొబ్బరి చెట్టును ముంజేతితో చరిచి కాయలు జల జల రాల్చిన గంటి వస్తాదులు, షావుకార్లకు ముందుగానే నోటీసు లిచ్చి లక్షలకు లక్షలు దోచుకొచ్చిన కుసుమ వీరులు పుట్టిన వూరిది! అదే చెప్పాడాయనకు.

"అవంతా గత చరిత్ర" అన్నాడు ఇన్స్పెక్టరు, "ఆ సింహాలిప్పుడు ముసలివై పోయినై. వాటి కడుపున పుట్టిన వన్నీ సాధు గిత్తలు"

నిజమే. కుసుమ మహాలక్ష్మి, వెంకటప్ప వృద్ధులై పోయారు. సుబ్బారాయుడు పల్లయ్య గారికి శిష్యుడై హరిజన సేవ చేస్తున్నాడు. వాళ్ళ వాళ్ళంతా వ్యవసాయం చేసుకొంటున్నారు. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి మామా లంటే - సింహాలు! నిజంగా, అదంతా గతం!

ఈలోగా పశ్చిమ దిక్కు ఎర్ర బడింది. కొబ్బరి చెట్ల తలలకు మందార పువ్వులు రుద్దుతున్నాడు వృద్ధ భానుడు.

"చూశావా, సూర్యాస్తమయం ఎంత బాగుందో!" అన్నాడు ఇన్స్పెక్టరు.

"అవును"

"ఆలాంటి దృశ్యాలు చూచి నప్పుడు నీ కేవైనా ఊహలు కలుగు తాయా ?"

" కలుగుతాయి "

"వాటిని వ్రాసి పెట్టుకొంటూ వుండు - తోచే పోలికలు, తెచ్చే జ్ఞాప కాలు వగైరా " అన్నా డాయన.

భీమన్న కవి అని తెలుసుకొని, ఇన్స్పెక్టరు చాల సంతోషించాడు. కొన్ని పద్యాలు విన్నాడు. కవితను వదలి పెట్ట వద్దని చెపుతూ—

" బయ్యా పుల్లయ్యకు పట్టుకు పోయినట్టే, పోలీసుశాఖ నిన్ను కూడ పట్టుకు పోవచ్చు. నీ శరీర దార్ఢ్యమూ, పర్సనాలిటీ అలాంటిది. ఏది ఏమైనా పోలీసు శాఖకు మాత్రం వెళ్ళకు. అక్కడ కలలకూ, కళలకూ తావుండదు " అన్నా డా మనీషి !

భీమన్న ఇంటరు చదువుతున్న రోజులవి. తనకు ఎవరూ చెప్పని కవితా లక్షణాన్ని అయాచితంగా, అంత తేలికగా చెప్ప గలిగిన ఆ పోలీసు అధికారి పేరు కూడ జ్ఞాపకం లేదు భీమన్న కిప్పుడు.

ఈ విషయం వివరిస్తూ, తన మిత్రుడికి ఒక లేఖ వ్రాశాడు భీమన్న. ఇలాంటి ఎన్నో అనుభవాల మీద లేఖలు వ్రాస్తూ వుండేవాడు మిత్రులకు. ఆ లేఖలే - తర్వాత "జనవాణి", "ప్రజామిత్ర" పత్రికలలో ధారావాహి కంగా ప్రకటించ బడి, "జానపదుని జాబులు" పేరుతో గ్రంథ రూపంలో వెలు వడి నట్టివి. అందులో ఈ పచ్చని హృదయం కూడ వుంది.

పువ్వుల కంటే లెక్కకు ముళ్ళే ఎక్కువ
ఈ నా గులాబీ తోటలో
అందు కని—
ముళ్ళ తోట అననా దీన్ని ;

59. కలలూ - కళలూ

భీమన్న కలలను గురించి ప్రత్యేకంగా చెప్ప వలసిం దొక టుంది. ఊహ తెలిసిన తర్వాత ఈయన నిజమైన సుషుప్తినే ఎరగడట! నిద్రావస్థ అంటే స్వప్నావస్థే భీమన్నకు. స్వప్నాలలో అధిక భాగం అసహ్యకర మైనట్టివీ, భయంకర మైనట్టివీ! జాగ్రదావస్థలో ఎంత అందమైన ఊహలు చేస్తాడో, నిద్రావస్థలో అంత వికారమైన స్వప్నాలు కలుగుతై ఆట!

అయితే ఈయన రచనలలోని కొన్ని కొన్ని మంచి వాటికి ఇతి వృత్తాలు కలలలో స్ఫురించినట్టివే. చాల కవితలు కలలలో అల్లుకొన్నట్టివే.

వాస్తవ జీవితం అనే—
పాలకు పంచాదార కల
అన్నానికి ఆకు కూర కల
ఆకాంక్షకు అమృత ధార కల

—ట్రుమీలు

ఇక పగటి కలల - అంటే ఊహల, భావనల - విషయంలో ఈయన పూర్తిగా వాస్తవతా వాది. తన ఊహలన్నీ తనకు వాస్తవాలే అంటాడు భీమన్న. తన మెదడు అనే బల్బు వెలు గిచ్చినంత దూరం తాను చూడ గల్గు తాడు. చూచిం దంతా నిజ జీవితంలో అనుభవిస్తాడు. సాహిత్యంగా మార్చు కొని నిలువ చేసు కొంటాడు. తన రచనలన్నీ ఛందస్సులనే జాడీలలో నిలువ చేసుకొన్న తన దైనందిన జీవి తానుభవాలే!

"నా సాహిత్యమే నా జీవిత చరిత్ర" అని భీమన్న అనే దానిలోని సత్యం ఇదే.

భీమన్న చేతి వ్రాతను నాగేటి చాలుకు పోల్చారెవరో. ఈయన వ్రాసిన కాగితం తొలిసాలు తోలిన మెట్ట పొలంలా వుంటుం దన్నా డట తిరుమల రామచంద్ర కాబోలు. ప్రతి అక్షరమూ ఏదో ఒక వృక్ష జంతు స్వరూపమే. ఈయన చిన్నప్పటి వ్రాత ప్రతులు చూస్తే – వాటినిండా రకరకాల చిత్రాలు కనిపిస్తాయి కరక్కాయ సిరాలో.

నలుగురితో కలిసి ధాన్యంలో పోటువేస్తూ, మరొకరి రోకలిని కుమ్మడం, గూడను నీళ్ళతో పైకిలాగి తన చేతిలోని తాళ్ళను జార్చి వెయ్యడం, బెల్లు తట్టను మరొకరితో కలిసి ఎత్తుతూ మధ్యలో వదిలెయ్యడం వగైరా కొంటె పనులు కూడ చేస్తుండేవాడు.

తల్లికి తెలియకుండా వెన్న, పాలమీగడ, కోడి గుడ్లు కాజేస్తుండేవాడు. కొబ్బరి, బెల్లం - తెలగ పిండి, బెల్లం - సెనగపప్పు, బెల్లం - ఇలా వుండేది భీమన్న ఉపాహారం.

ఒకసారి ఆటుకులు కోడుతూ, తల్లి చేతి వేలు చితకగొట్టాడు. కిరసనాయిలు బుడ్డి దీపం ముందు వంగి వ్రాసుకొంటూ జుట్టు కాల్చు కొన్న సందర్భాలనేకం. దీపావళికి చిటికల పొట్లాలు తిప్పుతూ వొళ్ళు కాల్చు కొన్నాడు. చాకలి ఇంటి నుంచి బట్టల మూటను మోసు కొస్తూ, వంతెన మధ్యనుంచి కాలువలోకి జారి పడి, జలగండాన్ని దాటాడు.

తండ్రి మీద కోపాన్ని నాగలి మీద చూపించి, కాలి బొటన వ్రేలు చితగ్గొట్టు కున్నాడు. మరీ చిన్నప్పుడు కోపం వచ్చిన తమ్ముడి చేతి దెబ్బకు ముందు పన్నొకటి పోగొట్టు కున్నాడు. ఇంద్రజాల విద్యలూ, అతీత శక్తులూ సాధించడం కోసమని పుస్తకాలు చాలా కొన్నాడు. గచ్చకూ, పుచ్చకూ చాలా తిన్నాడు. ఇలాంటి గాథలు అనంతంగా వున్నై - భీమన్న బాల్య చరిత్రలో.

కావ్యకుసుమాలలోని "దొంగల జంట" వంటివన్నీ అప్పటివే. ఆ కావ్యకుసుమా లన్నీ ఆనాటి తన స్వానుభవాలే.

కోయిలా, పాడవే, కువలయ మ్మెల్ల సి
గన ప్రపంతిలో కరగి పార!
రండిటు, చిఱుక గోర్వంక లారా; మావి
సీడ కొమ్మల జేరి యాడుకొనుడు!
లెమ్ము, తుమ్మెదల పూల రెమ్మల రాగ సా
వరము తీసి యిమ్ము లోకమున కెల్ల;
వ్రద్రంగి పిట్ట! నీ పని మీదపొమ్ము, గో
ర్వంక పిట్టకు కోటరమ్ము వలయు

వాయసము , లెమ్ము ! ఎవరో తెర్వరులు బిడలి
చేరి వెడతుచు నుండి రా చెట్ల క్రింద !
కోకిలము , కాకమును ఒక్క కొమ్మ మీద
చెలగి విహరింప , చూడ వచ్చితిని నేను :

— బీ. కా. కుసుమాలు

ఆనే వసంత సామ్యవాదం ఆరోజుల్లో ఈయన అనుభూతినుంచి వెలువడిందే .

60. మలచిన మలుపులు

పాలు ఎంత చిక్కగా కనిపించినా దానిలో పంచదార కరగడానికి ఖాళీ లుంటై. చదువు , పొలంపని ఎంత రద్దీగా వున్నా , ఆ మధ్యలో ఆట పాట లకు అవసర మైన తీరిక దొరికేది భీమన్నకు .

నత్త గుల్లలను , బెందులను పోగుచేసి , వాటితో పందెం ఆటలు ఆడడం ఈయనకు ఎక్కువ సరదాగా వుండేది . పెద్దగుల్ల దొరికి నప్పుడు - దానికి చిల్లి పొడిచి , సాలిగూడులోని పై పొరను చిల్లికి అతికి , ఊదితే అది కిన్నెరలా పలుకుతుంది . అందరు పిల్లలూ తీర్థాలలో కిన్నెరలు కొనుక్కుంటే , తాను నత్త కిన్నెరలు తయారు చేసుకునే వాడు .

ఏటి గట్టున దొరికే రెల్లు కాడల నుంచి సన్నాయి పీకలూ , సొరకాయ బుర్రలతో నాగస్వరాలూ చేసుకునే వాడు .

సంగీతంలో వెంకటస్వామిగారు సహచరు డైతే , సాహిత్యంలో ఈలి స్వామినాయుడుగారు సహచరుడు . ఆయన కూడ పద్యాలు వ్రాసే వాడు . ముఖ్యంగా సెలవు రోజుల్లో , సాయం సంధ్యల్లో పైరు చేల గట్లలో కూర్చుని ఈ యిద్దరూ సాహిత్య చర్చలు జరుపు కొంటూ వుండేవారు . భీమన్నకు ఆ బాల్య మిత్రులలో అత్యంత ఆప్తు లు నాయుడు గారు .

తన చిన్ననాటి ఆటల్లో తమ్ముడు అర్జున్న , అతడి నేస్తం పెదపూడి స్వామి , గెడ్డం వెంకన్న వగైరాలు పాల్గొంటూ వుండే వాళ్ళు .

ఈ పెదపూడి స్వామి చిన్నప్పుడు తమ ఇంట్లో ఎంతకాలంగానో వుంటున్న ఒక సంగీత శాస్త్ర గ్రంథం వ్రాత ప్రతిని తెచ్చి భీమన్న కిచ్చాడు. ఎన్నో కృతులు స్వర సహితంగా వున్నా యందులో. అయితే, అది సన్నాయి పాటకు చెందిన గ్రంథం. డోలు, సన్నాయి, దప్పు వంటి నాద కళలను ఆరాధించే వంశం వాళ్ళది.

భీమన్నకు రెండో క్లాసులోనే భాష్యకార్లు అనే మిత్రుడు చనిపోయాడు. పల్లయ్యగారి అగ్రశ్రేణి శిష్యవర్గంలో ఒకరైన గంటా తిరుమల దాసు గారి కుటుంబం వాడ తడు. మరొక మిత్రుడు బళ్ళ వెంకటరత్నం బర్మాలో మరణించాడు. అతడు మామిడికుదురు వాడే. నగరంస్కూలులో తన సహాధ్యాయి.

భీమన్న మిత్రకోటిలో స్త్రీలకు తక్కువేం లేదు. కాని, అందులో ఎక్కువ మంది తన కంటె వయోధికలు. హాస్య వినోద భాషణలతో అలరిస్తూ వుండేవాళ్ళు. మిఠాయిలు, పిండి వంటలు మేపుతూ వుండే వాళ్లు.

మామిడికుదురూ, ఆ చుట్టు ప్రక్కలంతా నాడీ పరిజ్ఞానం లోను, రోగ నిదానంలోను, చికిత్సలోను అంతటి వాళ్ళు మరి లేరనిపించుకున్న వయోవృద్ధులిద్దరూ భీమన్నకు సన్నిహితులే. అందులో ఒకరు గెడ్డం రామతాత. భీమన్నకు తాత వరస వాడు. ప్రధానంగా రైతు. ఉప వృత్తి కొబ్బరి దింపు. నాడిలో నిపుణుడు. బైరాగి చిట్కాలతో ఎలాంటి రోగాలనైనా నయంచేసేవాడు.

అలాంటి వాడే నైనాల పాపయ్య కాపు గారు కూడ. ఆయన వైద్యం చేస్తే - రోగి మాత్రమే కాదు, రోగికి పాలిచ్చే ఆవు, మూలిక లిచ్చే మొక్కలు కూడ పత్యం చెయ్యవలసి వచ్చేది. ఒకసారి భీమన్నకు మందిస్తూ, పిళ్ళ ఆవుకు ఎండుగడ్డి, వేడి నీళ్ళు పత్యం పెట్టా డాయన.

కొబ్బరి తోటల్లో ఎలకలు విస్తారంగా చేరినప్పు డొకసారి, వాటిని పట్టడం కోసం ఎలకల వాళ్ళను రప్పించారు పల్లయ్యగారు. వాళ్ళు రాత్రులు చెట్లపై బోను లొగ్గే వాళ్ళు. ఉదయానికి పాతిక ముప్పై యెలకలు ఆ బోనుల్లో పడి వుండేవి. అవి వాళ్లకు ఆహారంగా కూడ పనికి వచ్చేవి. వాటిని పట్టినందుకు ఎలక్కు పావులా చొప్పున పుచ్చుకునేవాళ్ళు, భోజనం కాక.

ఉడతలు కూడ కొబ్బరికాయలు కొడతాయి కాని - అవి బోనుల్లో పడేవి కావు. బోనుపై కెక్కి, మిటించి, తర్వాత ఎర తినిపోయే వవి. తెలివైనవి

ఒక్కసారి చూస్తే ఏ పనైనా చేసెయ్యగల భీమన్న, వెదురుతో బోనుల్ని తయారు చేసి. ఆ తర్వాత ఎలకల వాళ్ళ అవసరం లేకుండా చేశాడు.

తన చిన్నతనం గురించి తలంచు కొన్నప్పుడు భీమన్న మనస్సును కరిగించే వాళ్ళలో తన ఒక పెద తండ్రి భార్య మంగమ్మ ఒకరు. తనను కన్న తల్లి నాగమ్మ అయినా, పెంచిన తల్లి మంగమ్మే అంటా డీయన. ఆమెకు పిల్లలు లేరు. యౌవనంలోనే వైధవ్యం ప్రాప్తించింది. అయినా, ఏమాత్రమూ తొణక కుండా, స్వయం కృషి మీద ఆధారపడి బ్రతికిం దామె చివరి దాకా. ధైర్య స్థైర్యాలు, ఆత్మ గౌరవం, కాయ కష్టం, దయ, వాత్సల్యం అన్నీ కలిసి మూర్తీభ వించిన ఒక గొప్ప వ్యక్తి ఆమె.

గంగేశు మరో పెత్తండ్రి. తీదొండ పళ్ళు, నారింజలు వగైరా భద్రంగా దాచి భార్యకు తెలియకుండా అందిస్తుండే వాడీయకు. వెంకయ్య కాక నూకయ్య అనే మరో దాయాది వుండేవాడు. ఆయన కూడ రంగం సబుర్లు చేసేవాడు. రాత్రులు కథలు చెప్పేవాడు. ఒకళ్ళు కాక పోతే మరొకళ్ళు ఊ కొడుతూ వుండే, మధ్య మధ్య శ్రోతలు రసా వేశాలు ప్రకటిస్తూ వుండే, ఒక్కొక్క సారి తెల్ల వార్లూ కొనసాగుతుండే ఆ కథా కాలక్షేపాలు ఉత్సాహంలో నేటి ఉర్దూ ముషైరాలను పోలి వుండే వట!

చీకట్లో చీకటి ప్రోపు ఆ మైదురాయి :
అది కాలాన్ని దూరమానంలో కొలుస్తూ
శతాబ్దాలుగా నిలబడివున్న దక్కడ ।
ఏమిటి వెతుకుతున్నావు దాని నుదుట :
ఎంత దూరం వచ్చావో
గమ్యం ఇంకెంత దూరమో
తెలుస్తుందా అక్కడ ?
అక్క డుండేది
దాని నుదుటి వ్రాత,
నీ నుదుటి వ్రాత కాదు :

—అనాది కొస

61. సరికొత్త పద్ధతి పెళ్ళి

"ఫలానా అమ్మాయి అయితేనే" అనే షరతుపెట్టి, పెళ్ళికి ఒప్పుకున్నాడు భీమన్న. ఆ అమ్మాయి గొల్ల చంద్రయ్య గారి రెండో కుమార్తె నాగరత్నమ్మ. పెళ్ళిపెద్ద బి. ఎస్. మూర్తి గారు.

ఆచార్యుడుగా మాగంటి బాపినీడు గార్ని పిలిస్తే, ఆయన ఎందుకో రాలేకపోయారు. వేముల కూర్మయ్య గారు అందుకు నిర్ణయించబడ్డారు.

1938, మే ఒకటవ తేదీ, సాయంకాలం నాలుగున్నర గంటలకు వివాహం. ఆ సంవత్సరం మే దినోత్సవం భీమన్న పెండ్లిగా జరిగిందన్న మాట.

మొత్తం రాష్ట్రం అంతటి నుంచీ విద్యార్థులు, మిత్రులు, నాయకులు వందలమీద వచ్చారు. అంత మందిని వూహించని చంద్రయ్య గారు వడ్డనల వద్ద తికమక పడి, పల్లయ్య గారి కోప తాపాలకు గురయ్యారు.

హిందూ పద్ధతీ కాదు, బ్రహ్మసమాజ పద్ధతీకాదు. ఏ పద్ధతి పెళ్ళీ కాదది. ఆచార్యత్వం వహించిన కూర్మయ్యగారికి ఏం చెయ్యాలో తెలియ లేదు. పెళ్ళికొడుకు తానే "ఉంగరాలు మార్పించండి, దండలు మార్పించండి" అంటూ ప్రాంప్టింగ్ మొదలుపెట్టేటప్పటికి మూర్తిగారు కలుగజేసుకొని, 'పెళ్ళి కొడుకు మాట్లాడ గూడదు, నేను చెపుతానులే" అంటూ కూర్మయ్య గారి ప్రక్కన కూర్చుని, తన ఇష్టం వచ్చినట్టు గైడు చేశారు.

కూర్మయ్య గారు బెనారసు హిందూ యూనివర్సిటిలో ఎక్. ఎల్. బి. పాసైన వారు. పండిత మాలవ్యా గారి శిష్యులు. కాంగ్రెస్ నాయకులు. ఆయన కా మాత్రం తెలియదా అనుకున్నా రందరూ. మూర్తిగారికి తెలియదు. అయితే కొంత సాహసం, స్ఫూర్తి ఎక్కువ ఆయనకు. ఇంతకూ, అక్కడ ఎవరికి మాత్రం తెలుసు? పాత పద్ధతి మార్చాలనే ఉత్సాహం తప్ప, కొత్త పద్ధతి ఎలా ఉండాలనే ఊహ ఎవరూ చెయ్యలేదు - నాయకులతో సహా.

యువతరంలో సంప్రదాయాన్ని త్రోసి రాజని, ముహూర్తాన్ని నిరాకరించి, ఒక మిత్రుడి ఆచార్యత్వంలో వివాహం జేసుకొన్న మొట్ట మొదటి

యువకుడు భీమన్నే . ఆ తర్వాత ఈ పద్ధతి ననుసరించిన వారు కమ్యూనిస్టులూ , అంబేడ్కరిస్టులూ .

పెండ్లి లో కురిసిన ఆశీః కుసుమాలలో గొల్లపల్లి సామ్యూలుగారి —

"బోయ వంశాబ్ధి తెలివొంద పుట్టి నీవు
గొల్ల వంశాబ్ధి రత్నము గొన్న కతన
గొల్ల బోయడ వైతివి తెల్లము గను
మాన్యత గడింపు ముభయ వంశాలు తనియ !"

అనే పద్యం సర్వ జనామోదం పొంది హర్ష ధ్వానాలతో మిన్నుంటింది . ఈయనను ఆటు వాల్మీకికీ , ఇటు కృష్ణుడికీ సన్నిహితుణ్ణి చేసింది బహుశా శామ్యూలు గారి ఆశీర్వాదమే నేమో !

వచ్చిన పెండ్లిబహుమతులలో ఒకటి యోగానంద కవి గారి యోగానంద రామాయణం యుద్ధకాండ . దానిని యోగానందయ్యగారే స్వయంగ బహూకరిస్తూ —

"భీమన్న జీవితంలో బాల , విద్యా కాండలు చక్కగా ముగిశాయి . ఇప్పుడు సంసార కాండ నిజానికి యుద్ధ కాండే . ఇందులో కూడ సంపూర్ణ విజయం కలగాలని ఆశీర్వదిస్తున్నాను" అనే టప్పటికి , వివాహ సదస్సు రసానంద పరవశ మయిపోయింది .

కాలేజీ మిత్రులంతా పెండ్లికి వచ్చారు . పెండ్లి మర్నాడు మామిడి కుదురు వెళ్ళారు . మామిడి , పనస పళ్ళకాలం . కొబ్బరి బోండాలకు , తాటి ముంజెలకు పండుగే పండుగ . రస మధురా లైన క్షణా లవి.

మూడో రోజు సాయంకాలం రాజోలుకు బయలు దేరిన పెండ్లి వారికి , ఊళ్ళో ఒక్కళ్ళూ బండి కట్ట లేదు . ఆరు మైళ్ళూ నడిచి వచ్చేశారు !

యోగానందకవిగారి ఆశీర్వాదం అక్కడనుంచే ఫలించసాగింది భీమన్న జీవితంలో . తేడా ఒక్కటే . ఆయన కాండ అంటే , నేను సర్గ అన్నాను.

62. కాశీ ప్రయాణం మద్రాసు చేరిక

పెళ్ళినాటికి ఫోర్తు ఫారం చదువుతున్న నాగరత్నమ్మ భీమన్నకు ఎంతో అనురూపవతీ, అనుకూలవతీ అయిన భార్య కావడంతో, ఈయన దాంపత్య జీవితం ఒక ఇరవయ్యేళ్ళ పాటు - ఎన్నో ఒడి దుడుకులకు తట్టుకొని-హాయిగా గడిచి పోయింది. భీమన్న జీవితంలోని ఈ సాంసారిక భాగం సర్వ జన సాధారణమే కనుక, నే నెక్కువగా ఇక్కడ వివరించడం లేదు.

విశేషాంశ మేమి టంటే - భీమన్న వ్రాసే కవితలకు, కావ్యాలకు ఈమె ఎప్పటి కప్పుడు కాపీలు తీసి పెడుతూ వుండేది. ఈయనపై ఎక్కువ భారం పడకుండా కుటుంబ బాధ్యతలను తానే వహించి నిర్వహించు కొనేది.

బి. ఏ. అయిపోయింది. పెళ్ళి కూడ అయిపోయింది. కుటుంబం లేమిలో వుంది. ఇప్పుడేం చెయ్యాలి అనే సమస్య రాక్షస సాకారం తాల్చి ఎదట నిలబడింది భీమన్నకు.

మద్రాసు పబ్లిక్ సర్వీస్ కమిషను ప్రకటన ఒకటి కనిపిస్తే - డిప్యూటీ కలక్టరు పోస్టుకు ఒక అప్లికేషను పోస్టుచేశాడు, చంద్రయ్య గారి బలవంతం మీద.

కాశీ హిందూ యూనివర్శిటీలో ఎం. ఏ ; ఎల్. ఎల్. బి. సీటు కోసం అప్లయి చేశాడు, కూర్మయ్యగారి సలహా మీద.

మద్రాసు లా కాలేజీకి కూడ అప్లయి చేశాడు, మూర్తి గారి సూచనమీద. ఎక్కడా ఏదీ దొరక్క పోతే, లా కాలేజీలో సీటు గ్యారంటీగా ఇస్తామని ఆ కాలేజీలో ప్రొఫెసరూ, నిమ్న జాతుల నాయకుడూ అయిన శివరాజ్ గారు వాగ్దానం చేశారు.

కాశీ నుంచి సీటు వచ్చింది.

తన భార్య స్కూలు ఫైనలైనా పాసై వుండా లనేది భీమన్న కోరిక. ఈ లోపల తాను కాశీ విద్యను పూర్తి చేసుకోవచ్చు. గవర్నమెంటు ఉద్యోగం మీద

మనసు లేదు . తన ఇష్టాయిష్టా లన్ని భార్యకు చెప్పి , తాను కాశీకి ప్రయాణ మయ్యాడు .

ఆ ముందు రోజునే మోరి పొలం వెళ్ళి , వైనతేయ తీరంలోని పురు షోత్తం సమాధిపై కన్నీరు తుడుచుకొని , మిత్రులవద్ద వీడ్కోలు పుచ్చుకొని , తాడి నాగమ్మగా రిచ్చిన కానుకను కళ్ళ కద్దుకొని వచ్చాడు . మోరి పొలం రాజోలు , నగరం , మామిడికుదురు - ఆత్మీయతలో సమానమే ఇవన్ని . ఆర్ద్ర హృదయాలతో వీడ్కోలు చెప్పా రీయనకు .

ఎచటి కేగు చుంటి నేను
ఎందుకు కన్నీరు ?
కంట కుంకుమము పడె నను
కల్ల లెపరు నమ్మేరు ?
ఈ వియోగ మెన్నాళ్లని
ఈ వెదవుల అదురు ?
సున్న మెక్కు వైన దన్న
సూచన లెవ రడిగేరు ?
ఎంత తడవు చేతునో అని
ఎందు కంత కంగారు ?
ఉక్కు పోత నఖిన యించు
ఊర్పుల నెవ రెరుగరు ?

—రాబీంద్ర

తల్లి నాగమ్మ గారు ట్రంకు పెట్టెను తీసుకొని , కొడుకుతో రోడ్డు వరకు వచ్చింది . బళ్ళేమి దొరక లేదు . మామిడికుదురు బళ్ళ స్టాండు వరకు వచ్చారు . ఎవళ్ళూ బండి కట్ట డానికి ఒప్పుకో లేదు !

తన పెళ్ళి సందర్భంలో కూడ ఎవళ్ళూ బండి కట్టక పోతే , పెళ్ళి కూతురూ , పేరంటాళ్ళతో కలిసి రాజోలు వరకు నడిచి వెళ్ళాడు భీమన్న .

ప్రయాణీకులు దొరక నప్పుడు మాటాడకుండా బండి కట్టడం , ప్రయా ణీకు లున్నప్పుడు ఆస్పృశ్యతను పాటించడం ఆనాటి గ్రామ బళ్ళ వాళ్ళకు పరిపాటి . ఆటువంటి వేమీ లక్ష్య పెట్టే వాడు కాదు భీమన్న . కాని, ఈనాడు ?

ట్రంకు పెట్టెను మోసుకొని రాజోలు వరకు నడిచిపోవలసిందేనా ?

తాను కొంత సేపు, తల్లి కొంత సేపు ఆ ట్రంకుతో తిప్పలు పడుతూ ఒక ఫర్లాంగు దూరం నడిచే టప్పటికి - చెరువు, ఆ ప్రక్క కటకం శెట్టి వీరాస్వామి గారి ఇల్లూ వచ్చినై. అరుగు మీద వీరాస్వామి గారు కూర్చుని వున్నారు. ఆయన టీచరు, ఊరి పెద్దలలో ఒకరు. భీమన్నకు శ్రేయోభిలాషి. ఈలి స్వామి నాయుడి గారి మేనమామ. స్వామి నాయుడుగా రుండేది కూడ అ ఇంట్లోనే.

పరిస్థితి గుర్తించిన వీరాస్వామి గారు, తమ బండిని కట్టించి రాజోలు వరకు పంపించారు.

ఆక్కడ బండి కట్టడానికి నిరాకరించిందీ కాపులే! ఇక్కడ తమ సొంత బండిని ఇచ్చిందీ కాపులే. తేడా సంస్కారంలో వుంది.

అప్పటికి రెండు మూడు రోజుల నుంచీ భీమన్న ఆరోగ్యం బాగు లేదు. విరేచనాలతో బాధ పడు తున్నాడు. అయినా బైలుదేరక తప్పదు. నర్సాపురం రైలు స్టేషనుకు వెళ్లే టప్పటికి విరేచనాలు జాస్తి అయినై. దిక్కు తోచక ఆ రాత్రి అక్కడే వుండి పోయాడు. స్టేషను సమీపం లోని చినమామిడిపల్లి తనకు తెలిసిందే. మిత్రుడు ఆడిదం జగన్నాయకులు గారింటికి వెళ్ళగా, ఆయన లేక పోయినా, ఆయన చెల్లెలు సావిత్రి ఏవేవో కషాయాలతో, మందు లతో ఆ రాత్రంతా సేవ చేసి తనను బ్రతికించిం దంటాడు భీమన్న.

ఆ మర్నాడు బైలు దేరి బెజవాడ వెళ్ళాడు. కూర్మయ్య గారింట్లో దిగాడు. మూర్తి గారు కూడ అప్పటి కక్కడే వున్నారు. తన అనారోగ్యాన్ని దృష్టిలో వుంచుకొని, వారందరి తోనూ ఆలోచించి, కాశీ ప్రయాణం మానుకొని, మూర్తి గారితో కలిసి మద్రాసు మెయిలు ఎక్కాడు భీమన్న. మద్రాసులో, పెరియమెట్‌లో మూర్తి గారింట దిగాడు.

ఒరిజనల్ సర్టిఫికెట్లన్నీ సర్వీసు కమిషన్‌లో వుండి పోవడంవల్ల, లా కాలేజీలో చేరలేక పోయాడు. డిప్యూటీ కలెక్టర్ పోస్టును ఒకానొక వ్యక్తికి

ఇవ్వాలన్న నిర్ణయముఁదే జేసుకొని అప్లికేషనులను కొరడం జరిగిందట. కనుక, తనకా ఉద్యోగమూ రాలేదు. ఆ విధంగా, వస్తా యను కొన్న మూడింటిలో ఒకటి రాలేదు!

సర్వీసు కమిషనులో ఇంటర్వ్యూకు వెళ్ళినప్పుడు, వాళ్ళు "మీరు ఏ కవుల రచనలు ఎక్కువగా చదువుతారు?" అని ప్రశ్నించారట. దానికి భీమన్న జవాబు "నే నే కవుల రచనలూ ఎక్కువగా చదవను. నేనే కవిత్వం వ్రాస్తాను" అని!

"సరే, పోయి కవిత్వం వ్రాసుకో" అన్నా రట వాళ్ళు.

ఇంటర్వ్యూ రోజున భీమన్నను తయారు చేసి, కూడా తోడుగా వెళ్ళిన మూర్తి గారు భీమన్నను గురించి చెప్పే కథల్లో ఇదొకటి! ఆ రకంగా జవాబులు చెపితే ఉద్యోగం ఎవరిస్తారంటా డాయన. సత్యం తప్ప మరొకటి చెప్పనంటా డీయన.

తను దాన గుర్తించు కొనుటె స్వాతంత్ర్య,
మాత్మ విశ్వాసమే అభ్యుదయమ్ము

—మధుదాల

63. అందిన ఆశా శకుంతం

పై చదువు, ఉద్యోగం ఆశ లన్నీ పోయాయి. తెచ్చుకొన్న పైసలు కూడ అయిపోయాయి. ఇక ఏం చెయ్యాలి? వట్టి చేతులతో తిరిగి పోవడం కంటే చావడం మేలు కాదా? ఆ రోజుల్లో, మద్రాసులో బ్రతికి వుండా లంటే, నెలకు కనిసం పదిహేను రూపాయలు కావాలి. ఎలా వస్తాయి?

అదే సమయంలో పిఠాపురం రాజా వారు మద్రాసులో మూడు దినపత్రి కలు నెలకొల్పి నడపడం ప్రారంభించారు. అందులో తెలుగు పత్రిక పేరు "జనవాణి". దానికి తాపీ ధర్మారావుగారు ఎడిటరు. అక్కడికి వెళ్ళాడు భీమన్న. రాజా వారి కాలేజీలో చదివిన హరిజన విద్యార్థి అనే దొక్కటే తన

ఆర్ద్రత. తా నెవర్నీ ఎరగడు. చురుకుగా తిరగ లేడు. చకచకా మాట్లాడ లేడు కూడ.

భీమన్న చెప్పిం దంతా విని ఆ ఆఫీసు మేనేజరు ఒక చిన్న ఖాళీలో క్లార్కు-గా అపాయింటు చేశాడు. జీతం నెలకు ఇరవై అయిదు రూపాయలు! ఉద్యోగం దొరికింది. స్వతంత్రు డైనాడు! ఆనాడు తాను పొందిన ఆనందం అనిర్వచనీయ మంటాడు భీమన్న. అది కన్నె వలపు తొలిరాత్రిలా అపూర్వం కూడా నట.

ఆయితే - తను చేయవలసిన ప నేమిటి? చందాదారుల జాబితాలను వ్రాయడం! వందలకొలది ఉత్తరాలు చదివి, వాటిలో వెతికి-పేర్లు, అడ్రసులు వ్రాయాలి. వాటిని పైపు కివ్వాలి. తనకు నచ్చిన పని కాదు. ఉత్సాహకర మైనదీ కాదు.

భీమన్న సీటు ఆఫీసు హాలులో ఒక మూలది. అక్కడే "సంపాదక వర్గం" అనే బోర్డు వుంది. తనకూ, సంపాదక వర్గానికి మధ్య అడ్డం రెండంగు ళాల దళసరి చెక్కగోడ మాత్రమే. దూరం అయిదా రడు గులు మాత్రమే. అయితే-ఈ సీటు నుంచి ఆ సీటుకు వెళ్ళడ మనేది సాధ్యమా? జీవితంలో ఏనాటి కైనా తనకు అంతటి అదృష్టం పడుతుందా!

ఈయన చేతిలో ఎప్పుడూ ఒక అందమైన నోటు బుక్కు వుంటుంది. అందులో-ఎక్కడ ఏ భావం తోస్తే, అక్కడి కక్కడ, దాన్ని పద్యం గానో, పాట గానో వ్రాసేసుకుంటూ వుంటాడు. ఉద్యోగంలో చేరిన మూడో రోజున ఆఫీసు పని వదిలేసి, తన పుస్తకంలో ఏదో వ్రాసుకొంటూ పుండగా-హఠాత్తుగా మేనేజరు వచ్చి పట్టు కున్నాడు. వెంటనే వెళ్ళి ఎడిటరుగారికి రిపోర్టు చేశాడు.

"ఏమిటి బ్రదర్, ఏమిటి చేస్తున్నావు?" అంటూ వచ్చి, ధర్మారావు గారు భీమన్న చేతిలోని పుస్తకం తీసు కొని చూశారు. "పద్యాలు వ్రాస్తావా ఏమిటి?" అన్నారు, ఆశ్చర్యపడుతూ! "అన్నీ పద్యాలేనే!" అన్నారు, పేజీ లన్నీ తిప్పి. "వచనం వ్రాయ గలవా?" అన్నారు, ఎంతో ఆసక్తితో.

"వ్రాయగలను" అనాడ్ను భీమన్న. ఏదో విషయం ఇచ్చి, దాని మీద రెండు పేజీలు వ్యాసం వ్రాసుకు రమ్మన్నా రాయన. మర్నాడు ఉదయం ఆఫీసుకు వచ్చి, భీమన్న సీటువద్ద ఆగి, వ్రాశావా అని అడిగి, ఈయన అందిచ్చిన కాగితాలు తీసుకొని, తమ గదికి వెళ్ళి పోయారు ధర్మారావు గారు.

తాను ఎప్పు డైనా ఏ గుడి కైనా వెళ్ళి, విగ్రహం ముందు నిలబడితే-ఆప్పుడెలా వుంటుందో, ఆలా వున్నదట ఆ క్షణంలో ఈయన మనస్సు. ఏమీ లేదు, వట్టి శూన్యం!

ఎలా గడిచిందో, ఒక అరగంట గడిచింది. ధర్మారావు గారు మళ్ళీ వచ్చారు. "ఈ ఫిష్ మార్కెట్లో నీ వుండలేవు, బ్రదర్! నాతో వచ్చెయ్!" అన్నారు. తీసుకు వెళ్ళి తమ గదిలోనే, తమ టేబులు వద్దనే, మరో కుర్చీ వెయ్యించి కూర్చో బెట్టుకున్నారు!

క్లార్కుగా చేరిన నాలుగు రోజులకే, జనవాణి దినపత్రికకు సబెడిట రయ్యాడు భీమన్న! తన జీవితంలో ఒక ప్రధాన మైన మలుపే కాదు, భవిష్యత్తుకు మార్గదర్శకమైన మెరుపు ఈ సంఘటన!

సహజ సిద్ధమైన రేడియో సెట్టు ఈ మెదడు
ఆను చేసి ట్యూనుచేసి వుంచు ఏల్లప్పుడూ:
లభిస్తుంది వాణి వాద్యమో, లక్ష్మి గాత్రమో!

—త్రిపదలు

64. మరుపు తెచ్చిన చెరుపు

స్టేటసు పెరిగిందే కాని, భీమన్నకు జీతం పెరగ లేదు. నెలకు ఆ పాతిక రూపాయలే!

ఎడిటరు ధర్మారావు గారికి నెలకు 75 రూపాయలు. అసిస్టెంటు ఎడిటరు నార్ల వెంకటేశ్వరరావు గారికి 60, పండితారాధ్యుల నాగేశ్వరరావు గారికి 50, తక్కిన సబెడిట ర్లందరికీ 40 చొప్పున. కప్పగంతుల సత్యనారా

యణ గారికి ఇరవై అయిదు . భీమన్నకు ఆ ఇరవై అయిదే. తర్వాత సత్య నారాయణ గారికి కూడ 40 చేశారు .

అనువాద కళలోను , సృజనాత్మక రచనలోను భీమన్న రోజు రోజుకు పెరగ సాగాడు . గ్రాంధికం ఎంత నిర్దుష్టంగా వ్రాయగలడో వ్యావహారికం అంత స్వచ్ఛంగా వ్రాయగలడు కనుక , తాపీ వారికి బాగా నచ్చాడు . రచనా వేగంలో అందరినీ మించడంవల్ల అర్జంటు అనువాదాలు తరచు భీమన్నకే ఇవ్వబడుతుండేవి . అందరూ ఈయనను "గాండ్ హేండ్" అని పిలువ సాగారు . ఆ స్పీడు నభూతో నభవిష్యతిగా వుండేది .

"పల్లెటూరి లేఖలు " జానపదుడు అనే కలం పేరుతో జన వాణిలో సీరియల్‌గా ప్రకటించ బడింది కాలంలోనే . శీర్షిక పేరు ఈయనదే కలం పేరును సూచించింది మాత్రం తాపీ వారు . వారాని కొక లేఖగా ప్రకటించ బడేవవి . ఇందులో చాల లేఖలు అంతకు పూర్వం భీమన్న ఆయా మిత్రులకు వ్రాసినట్టివే . తాజాగా పరిష్కరించి . ప్రెస్‌కు ఇస్తుండేవాడు . లింకు (సమ రసత) కోసం మధ్య మధ్య కొన్ని కొత్తగా వ్రాయవలసి వచ్చేది . లేఖలు ప్రజామోదం పొందాయి . యువ రాజా వారు కూడ మెచ్చుకొంటున్నా రని తాపీ వారే చెపుతుండేవారు .

"ఈ లేఖలు నేను వ్రాస్తున్నా ననుకొంటున్నా రండీ జనం ! మీ కీర్తి నా కెందుకని , మీ పేరు చెప్పేస్తూ వచ్చాను "అన్నా రొక సారి నార్ల వారు- పది రోజులనాటు సెలవుపై కోస్తా జిల్లాలకేసి వెళ్ళి వచ్చి .

అయినా , భీమన్న జీతం ఆ పాతికే !

జీతం పెంచమని మేనేజరును ఆడిగాడు , వ్రాశాడు . ఫలితం కలగ లేదు . తాపీవారి సలహాపై వెంకటరత్నంనాయుడుగార్ని చూశాడు . తా నేమీ చేయలే నన్నా రాయన . చివరగా యువరాజా వారిని చూడడకోసం "గులాబీ" భవనానికి వెళ్ళాడు . ఈ పత్రికల నిర్వహణపై పెత్తన మంతా యువరాజా వారిదే .

చాలా సేపటికి లోపలినుంచి ఎవరో ఒక పెద్దమనిషి వెలువడి, భీమన్నను చూచి, దగ్గరకు వచ్చి, "ఎవరికోస మమ్మా?" అన్నాడు.

"యువరాజావారి కోసం"

"యువరాజావారు ఏదో పనిలో వున్నారు. ప నేమిటో నాతో చెప్పగూడదా?"

"చెప్పగూడదు. యువరాజావారితోనే చెప్పాలి."

"సరే. అలానేకానీ" అంటూ ఆ పెద్దమనిషి లోనికి వెళ్ళిపోయాడు.

మరి కొంతసేపటికి యువరాజావారు వచ్చారు. వారితో తన విషయమంతా చెప్పుకొన్నాడు భీమన్న.

భీమన్న మనసులో అప్పటికి ఏదో అనుమానం రేకెత్తింది. ఆ మొదట వచ్చిపోయిన పెద్దమనిషి ఎవరు? కొంపతీసి మహారాజావారు కాదుకదా! ఎప్పుడో చూశాడు. తిన్నగా గుర్తులేదు! ఆవును మహారాజావారే! ఎంత పొరపాటు జరిగిపోయింది! సాక్షాత్తు లక్ష్మి ఎదుట సాక్షాత్కరిస్తే-పెద్దమ్మ తన కళ్ళు మూసేసిందే!

ఆ మర్నాడు ఆఫీసంతా గోలైపోయింది - మహారాజావారిపట్ల భీమన్న అమర్యాదగా ప్రవర్తించా డట అసి! తాపీవారుకూడ నొచ్చుకున్నారు జరిగిన దానికి.

మరచితి వేమొ గోవ నుకు
మానుని? మారుని గవ్వ తండ్రి? నీ
విరులకు మోహపున్ బదును
పెట్టిన ప్రేయసు? నీ ప్రియాళికిన్
వర మురళీ రవాను నట
నమ్మలు నేర్పిన విశ్వకాముకున్?
మరచితి వేమొ లోక విభు?
మా విభు? గో విభు? గోపికా విభున్?

—భీ. కా. తుమ్మాలు

65. విపరీత ధ్రువాలు

మద్రాసులో భీమన్నకు జిట్టా రామానుజయ్య అనే ఒక యువకుడు మూర్తిగారి వద్ద పరిచయమయ్యాడు. అతడు ఇంజనీరింగు విద్యార్థి. గుంటూరు జిల్లావాడు. కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారికి దూరపు బంధువట. ఎంత దూరమో తెలియదు. కూర్మావారు మాత్రం దగ్గరలోనే వుండేవారు మద్రాసు రాష్ట్ర గవర్నరుగా.

పెరియ మెట్టులోనే మూర్తి గారింట్లో ఒక ప్రక్కరూములో అద్దెకు వుంటుండేవాడు జిట్టా. భీమన్న కూడా ఆదే రూంలో వుండేవాడు. ఇద్దరికీ స్వభావంలో, ప్రవర్తనలో, లక్ష్యాలలో, వృత్తిలో ఏ విధమైన ఏకభావతా లేదు. అయితే స్నేహశీలత, సహనగుణం, సత్యసంధత, నిజాయితీ – ఇవి మాత్రం ఇద్దరికీ సమానం. అందుకే ఇద్దరూ గాఢ మిత్రులు కాగలిగారు.

భీమన్న జనవాణిలో ప్రవేశించిన తొలి రోజులలోనే, వీళ్లు పెరియమెట్టు మకాం ఎత్తేసి పార్క్ టౌనుకు పోయారు. అక్కడినుంచి చింతాద్రి పేటకు వెళ్లారు. అక్కడే చాల ఇళ్లు మారారు. తర్వాత మౌంటు రోడ్డుకు చేరారు. ఆ కాలంలో మద్రాసు వీధి వీధినా వుండేవి టులెట్ బోర్డులు. అయిదారు రూపాయలలో గది దొరికేది. భీమన్న భావుకుడు. అంతర్ముఖుడు. జిట్టా రుచి వైవిధ్యం కోరే వాస్తవానందవాది. ఈ ఇద్దరు మిత్రులూ తరచు ఇళ్లూ, పేటలూ మార వలసి వచ్చిన కారణాలు జిట్టా ఆనందాన్వేషణకు సంబంధించి వుండేవి. ఒకొక్క కారణం ఒకొక్క అభిసారిక! ఒకొక్కనవలిక!

ఈ లోగా 1935 చట్టం క్రింద సాధారణ ఎన్నికలు జరగడం, రాజా వారి పీపుల్స్ పార్టీ పూర్తిగా ఓడిపోవడం, కాంగ్రెస్‌కు అఖండ విజయం లభించడం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడానికి కాంగ్రెసు నిరాకరించగా కూర్మా వారి నాయకత్వం క్రింద మధ్యంతర మంత్రివర్గం ఏర్పడడం—ఈ చరిత్ర అంతా నడుస్తూనే వుంది.

మౌంట్ రోడ్డులో వుండగా, ఒక రోజున ఒక విశేషం జరిగింది.

ఆ వారంలో ఆ మర్నాడే పల్లెటూరి లేఖల సీరియల్‌లో లేఖ ప్రకటించ బడాలి. ఆ రాత్రి పన్నెండు గంటల వరకు మిత్రులతో సరిపోయింది. వాళ్ళను రోడ్డు వరకు సాగనంపి, ఏం వ్రాయాలా అని ఆలోచించు కొంటూ, ఒక ఇరానీ హోటల్‌లో దూరి, టీ తాగాడు భీమన్న.

ఏదో ఒక ఐడియా స్ఫురిస్తే చాలు. దాని చుట్టూ ఎంత సాహిత్యమైనా నిమిషాల్లో అల్లివేయ గలడు. అంతకు పూర్వమే ఒక రోజున, తనను బాగా ఎరిగిన ఒక గొప్ప వాణ్ని చూడడానికి వెళ్ళి, దర్శనం దొరక్క, రోజంతా వ్యర్థం చేసుకోవలసి వచ్చింది.

ఎంత గొప్ప వాడైనా ఆతడు మనిషే!
ఆతడి కాళ్ల వద్ద పడివున్నాడు కాను రోజంతా!
తన లాంటి మనిషి యొక్క
తన కాళ్లలాంటి కాళ్ల వద్ద!
మానవు డెంత పతనమై పోయాడు!
ఎంత కాలం ఈ దుస్థితిని సహించడం?

ఇదీ ఐడియా – టీ తాగుతూ వుండే మనస్సులో ప్రవేశించిన ఐడియా. హుషారుగా లేచాడు భీమన్న. దిన పత్రికలోని ఒక పేజీ మేటరును ఒక అర గంటలో వ్రాసెయ్యగల స్పీడు తనది.

హోటలు బయట ఒక కిళ్ళీ తీసుకొని, నోట్లో వేసుకొని, రూం కు వచ్చాడు. తల తిరిగి గుమ్మంలో పడిపోయాడు. ఎలాగో నీళ్ళ పైపు వరకూ వెళ్ళి వాంతి చేసుకున్నాడు. అది కారా కిళ్ళీ అట, భీమన్నకు అలవాటులేనిది!

మరి, లేఖ ఎప్పుడు ఎలా వ్రాశాడో తెలియదు. తాపీ వారు ఐహుగా ప్రశంసించిన సాహితీ కళాఖండ మయిం దది.

ఆ తర్వాత కొద్ది రోజులకే, మేనేజిమెంటుతో ఏదో పేచీ వచ్చి, సంపాదక వర్గంలో ఎక్కువ మంది సమ్మెచేశారు. భీమన్న కూడ సమ్మెలో చేరాడు. సమ్మెలో చేరవద్దని తాపీ వారు ఎంతగానో చెప్పారు భీమన్నకు.

"ఈ సమ్మె చేస్తున్న వాళ్ళు బైటికి పోగానే, తలొక పత్రికలోను చేరతారు. వాళ్ళ కట్టి అవకాశా లున్నై, నీకే మున్నై? నీ జీతం బాగా

పెరిగే టట్టు నేను చూస్తాను. నీవు వెళ్ళిపోవద్దు బ్రదర్!" అన్నా రాయన. భీమన్న వినలేదు. రాజోలు వచ్చేశాడు.

ఆ మర్నాడు రాజోలు బైలుదేరుతా డనగా, ఆ సాయంత్రం జొన్నల మోహనరావూ తానూ కలిసి అడయారులో వినోదించి, అక్కడి నుంచి బీచ్ వెంబడినే బైలు దేరా రిద్దరూ. అడయారు నది సముద్రంలో కలిసే చోట, దానిని కాలినడకన దాటుతూ - రెండు మూడు చోట్ల కొట్టుకు పోవలసిన వాళ్ళే - ఎలాగో బ్రతికి ఒడ్డెక్కారు.

1937 జూలైలో రాజమండ్రి వెళ్ళి, బి. ఇడి. కాలేజీలో చేరాడు భీమన్న.

66. సౌహార్ద చికిత్స

పత్రిక లెప్పుడూ ప్రైవేటు మేనేజిమెంటులో వుంటాయి. ప్రైవేటు మేనేజి మెంట్లు ఎప్పుడూ కుల పరిధిలోనూ, కుటుంబ పరిధి లోనూ వుంటై. ఏదైనా పోస్టుకు అవసరాన్ని బట్టి కులాంతరుణ్ణి చేరనిచ్చినా, స్వకులం వాడు దొరకగానే తీసి పారేస్తారు. అక్కడ హరిజనులకు మరీ దిక్కూమొక్కూ వుండదు. అందుకే బియిడీని ఆశ్రయించాడు భీమన్న.

ప్రభుత్వ శాఖలూ, స్థానిక సంస్థలూ స్వజన పక్షపాతానికి అతీతా లని కాదు. కాని, కొంతైనా భద్రత వుంటుంది.

బియిడీలో చేరా డన్న మాటేకాని, భీమన్న మనస్సును చదువు మీద నిలపలేక పోయాడు. అందుకు కారణం భార్య హిస్టీరియా వ్యాధి.

నవ్వితే గంటల కొలదీ నవ్వుతూనే వుండడం, ఏడిస్తే ఏడుస్తూనే వుండడం - కన్నుమూస్తే భయంకరమైన కల ఏదో వచ్చి, కెవ్వున అరవడం - ఏ కొంచెం ఉద్రేకాన్ని భరించ లేక పోవడం - ఇదీ వ్యాధి లక్షణం. ఎన్నో మందులు వాడారు, భూత వైద్యాలు కూడ చెయ్యించారు. భీమన్న మద్రాసు నుంచి వచ్చిన తర్వాత, వ్యాధికి కారణం దీర్ఘ వియోగ చింతగా గుర్తించి, ఆలనతో పాలనతో వ్యాధి తీవ్రతను కొంత తగ్గించ గలిగాడు.

తరచు కాలేజీకి ఆబ్సెంటు కావడం, పాఠాలు నిర్లక్ష్యం చెయ్యడం, ఎప్పుడూ పరధ్యానంగా వుండడం గమనించిన ప్రిన్సిపాల్ విస్సా అప్పారావు గారు - భీమన్నను పిలిచి, సంగతి కనుక్కుని, సానుభూతిని ప్రకటించారు. వెంటనే ప్యూనుచేత ఒక ఎలిగ్జిర్ బాటిలు తెప్పించి, దానితోపాటు ఖర్చుకు అయిదు రూపాయలు కూడ ఇచ్చి, ఇంటికి పంపించారు భీమన్నను. ఆ ఎలిగ్జిరు ఏదో ఇప్పు డీయనకు జ్ఞాపకం లేదు కాని, విస్సా అప్పారావు గారి ఔదార్యం మాత్రం అమృత ముద్ర వేసింది భీమన్న మనస్సుపై.

హార్దిక మైన లాలన ద్వారా శార్య హిస్టీరియా వ్యాధికి స్వయంగా చికిత్స చేసిన గొప్పతనం భీమన్నది. ఈ సందర్భంలో చెప్పాలంటే ఎన్నో కథలున్నై. "అతికిన ముక్కలు" కావ్య రచనకు ప్రేరకం అందులో ఒకటి.

రాజమండ్రి - రాజోలు మధ్య పడవల కాల్వపై, రహదారి పడవలలో ఈయన తిరిగినన్ని సార్లు ఆ కాలంలో ఆక్కడి కొబ్బరి వర్తకులు కూడ తిరిగి వుండరనవచ్చు.

బహుశా ఈ కాలంలోనే కావచ్చు, రాజోలు తాలూకా ఆది ఆంధ్ర మహాసభ జరిగింది - కాంగ్రెసు నాయకుడు మల్లిపూడి పళ్ళంరాజుగారి అధ్యక్షతక్రింద. ఆనాడు తాలూకాకు మకుటంలేని చక్రవర్తులుగా చెలామణి అవుతున్న జస్టిస్ పార్టీ భూస్వాములు కొందరు ఆ సభను జరుపుకోడానికి స్థలమే దొరకకుండా చేశారు. అప్పుడు దాన్ని కశలిగో పాములవారి కొబ్బరి తోటలో జరుపుకోవలసి వచ్చింది.

ఈ సభల సందర్భంలో భీమన్న పాత్రను గుర్తించిన ఆ భూస్వాములు చంద్రయ్య గార్ని పిలిపించుకొని "మీ అల్లుణ్ణి జాగ్రత్త పెట్టుకో" అన్నారట!

ఆ రాత్రి భీమన్న రాజోలు వచ్చే టప్పటికి, ఇల్లంతా ఏడుపులతో నిండి వుంది! ఎందుకంటే - ఆ భూస్వాములు ఏ వ్యక్తి గురించైనా ఆలాంటి మాట అన్నారంటే, ఆ వ్యక్తి ఆ మర్నాటి కిక వుండడు. శవం కూడ కనిపించదు!

కళ్ళొత్తు కొంటూ ఈ మాట చెప్పి, జాతీయోద్యమం కేసి వెళ్లవద్దంటూ ప్రాదేయపడ్డ చంద్రయ్య గారితో భీమన్న అన్నాడు – "మన కులంలో మారు మనువు తప్పు కాదుకదా! మీ అమ్మాయి కేమీ ఫర్వాలేదు లెండి" అని!

చంద్రయ్య గారూ హరిజన నాయకుడే. అయితే, ఆయన జస్టిసు పార్టీని అనుసరించి వుండేవాడు - ఆది ప్రభుత్వ పక్షం కనుక.

ఓహో, కృషీవల! ఓ కష్టజీవి!
వడ దున్ని వేయుమా పల్లేరు పొదలు
పరికించి తీయుమా మెరక పల్లములు
పండించి పోయుమా గుండె పండువుగ?

—బి. కా. కుసుమాలు

67. ధర్మన్న గారి జయభేరీ

రాజమండ్రికో భీమన్న మకాం కుసుమ ధర్మన్న గారి జయభేరీ పత్రిక ఆఫీసు గదిలో. ఆ సంవత్సర మంతా మొత్తం మీద ఆ పత్రికను నడిపించింది యనే. ధర్మన్న గారు తరచు తిరుగుతూ వుండేవారు. ఆ కాలంలో ఆయన అగ్ర హరిజన నాయకులలో ఒకరు.

మొట్ట మొదట ధర్మన్న గార్ని భీమన్న చూచింది - చాల సంవత్సరాల క్రితం, మామిడికుదురులోనే, పల్లయ్యగారి వద్ద. "మా కొద్దూ నల్ల దొర తనమూ" అనే పాటనూ, "దండా లండోయి బాబు" అనే పాటనూ ధర్మన్న గారు స్వయంగా పాడి వినిపించారా రోజున. ఆ పాటలు ఆయన వ్రాసినవే. నల్ల దొర తనం పాట కాంగ్రెసువారి తెల్ల దొరతనం పాటకు వ్యతిరేకంగా వ్రాయబడినట్టిది. ఆ రోజుల్లో ధర్మన్న గారొక్కరే హరిజనులలో కవి. ఆయన పాటలకు, పద్యాలకు విశేష ప్రచారం వుండేది. ఆనాటి నుంచీ ఆయన పట్ల భీమన్నకు భక్తి గౌరవా లేర్పడినై.

ధర్మన్న గారు ఆరడుగుల పైని ఎత్తుండే ఆజానుబాహువు, భీమకాయుడు, ప్రసన్న వదనంతో, చిరునవ్వుతో కైన విగ్రహంలా వుండేవాడు.

కంచు కంఠంతో నిప్పులు చెరుగుతూ ఉపన్యసించేవాడు. ప్రాణంగా గొంతెత్తి పాడేవాడు. ఏ కవికి తీసిపోని సాహితీ స్థాయిలో ప్రాసేవాడు. ఆలాంటి ధర్మన్నకు ఈ భీమన్న తోడై, జయభేరీ మ్రోగించింది హరిజన భారతం అనాడు.

హరిజనులలో అప్పుడప్పుడే ఆత్మ చైతన్యం కలుగుతున్న రోజు లవి. ఒక ప్రక్క మామూల లోని ప్రాగుడు, అపరిశుభ్రత, పిల్ల ల్ని బడికి పంపక పోవడం, జూదం వంటి వాటిని తొలగించ డానికి ప్రచారాలు జరుగుతుంటే - మరో ప్రక్క కనీస మానవ హక్కుల కోసం సవర్ణులతో పోరాటాలు జరప వలసి వచ్చేది.

వీధిలో నడిచే హక్కు, చెప్పులు తొడుక్కునే హక్కు, గొడుగు వేసుకొనే హక్కు, పెళ్ళి ఊరేగింపును వీధి గుండా తీసుకు వెళ్ళే హక్కు - వీటి కోసమే ఎన్ని పోరాటాలు జరిగినా. ఒకొక్కసారి సాయుధ పోరాటాలకు కూడ సిద్ధ పడవలసి వచ్చేది. వీటిని నడిపించడంలో, ఒప్పందాలు కుదర్చ డంలో ఆనాటి సమర్థులైన నాయకులలో ధర్మన్న గా రొకరు. అనేక సమ స్యల పరిష్కారార్థం ఆయన తరచు దేశాలు తిరుగు తున్నప్పుడు - చదు వును, కుటుంబ సమస్యను ఒక ప్రక్కకు నెట్టి, జయభేరిని నడిపించాడు భీమన్న.

నాలుగు వర్ణా లన్నది హిందూ యిజం
రెండు వర్గా లన్నది కమ్యూనిజం
మూడు వర్గా లంటున్నాను నేను
నాది—పులీ, నక్కా, గొర్రే యిజం
వేద యుగం మనిషికీ, నేటి మనిషికీ
స్వభావంలో తేడా ఏముంది?
నాడెంతో, నేడూ అంతే—
ఆదే పులీ, ఆదే నక్కా, ఆవే గొర్రెలూ!

—టుమ్రీలు

"పిపాసి" అనే కలం పేరుతో జయభేరిలో భీమన్న ప్రాసిన కథలు ఇంటూ బైటా కూడ ఒక పెద్ద సంచలనాన్ని కలిగించాయి. ప్రేమ శృంగా

రాలు సాధనాలుగా కులతత్వ నిర్మూలనను, వర్ణాంతర వివాహాలను ప్రోత్స హించే కథలవి. అంటరానితనం అనేది కేవలం బాహ్యాచారమే కాని, నిజంగా అమల్లో వున్న దంతా వర్ణ సాంకర్యమే అని ఘోషించే కథలవి.

ఆ కథలు వ్రాస్తున్న పిపాసి ఎవడో తెలుసు కోడానికి కొందరు కుల తత్వ వాదులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదట గాని, "గొళ్ళెం" అన్న కథ ద్వారా ఇంట్లో వాళ్ళకు మాత్రం ఆ రహస్యం తెలిసి పోయిందట. రాత్రి భార్య ఎంతకూ గదిలోకి రాకపోవడంతో, కోపం వచ్చి లోపల గొళ్ళెం పెట్టుకొని పడుకున్న శృంగార నాయకుడి కథ అది.

మరొక కథలోని వృత్తాంతం తమ కుటుంబ రహస్యమే నని తమ పొరుగు వాళ్ళు భీమన్న ఇంటిపై దండెత్తి నందువల్ల, కథలు వ్రాయవ ద్దని పల్లయ్య గారు కొడుకును కాసించడం జరిగింది. ఆ తర్వాత ఈయన మళ్ళీ కథలు వ్రాయలేదు.

డాక్టర్ అంబేద్కరు గారు తాను హిందువుగా చావ నని శపథం చేసిన రోజు లవి. హరిజనులను తమ తమ మతాలలో చేర్చుకోడానికి ఆయా మతాధి పతులు తీవ్ర కృషి మొదలు పెట్టారు. ఆ సందర్భంలో ధర్మన్న గారు తరచు హైదరాబాదు వచ్చి బి. ఎస్. వెంకటరావు గార్ని కలుసుకొంటూ వుండే వారు. వెంకటరావు గారు నిజాం మంత్రి వర్గంలోనే కాకి, నైజాం రాష్ట్రం లోనే గొప్ప పలుకుబడి కల హరిజన నాయకుడు. రజాకార్ల టైంలో రజ్వీని ఎదిరించి, హిందువులను కాపాడిన యోధుడు.

ఒక రోజున నిజాం మంత్రి వర్గ రహస్య సమావేశం జరిగిందట. దానికి రజ్వీ కూడ హాజరయాడు. మంత్రి వర్గంలో రజ్వీ సభ్యుడు కాడు. ఒక రాత్రికి రాత్రి నగరంలో వుండే హిందువు లందర్నీ అంతం చేసెయ్యా లంటూ ఒక పథకాన్ని రజ్వీ ప్రతిపాదించాడు. దాన్ని వెంకటరావు ఎదిరించాడు. మంత్రి వర్గంలో ఆయ నొక్కడే ముస్లిం మేతరుడు. హరిజనుడు కనుక, హిందువులకు వ్యతిరేకంగా వుంటా డనుకొన్నారు వాళ్ళు.

"అసలు రజ్వీ ఇక్కడి కెందు కొచ్చాడు?" అన్నాడు వెంకటరావు. రజ్వీ ఉగ్రుడై పోయాడు. "ఈ మాల మాదిగ వాడా నన్ను ప్రశ్నిస్తాడు?" అంటూ రజ్వీ అవమాన కరమైన భాషలో, ధేడ్ శబ్ద ప్రయోగంతో ఏదో అన్నాడట. దానితో వెంకటరావు లేచి—

"ఆరే, అబ్బాయ్! వొళ్ళు తెలిసి మాట్లాడు! ఈ మాల మాదిగలు లక్ష లున్నారు. మీరేకాదు, వీళ్ళు కూడా బాగా మాంసం తినే వాళ్ళే. పిచ్చి వేషాలు వెయ్యకు, జాగ్రత్త!" అంటూ ఉరిమాడట.

ఈ వార్త హరిజనుల్ని ఉద్రిక్తుల్ని చేసింది. ఆర్య సమాజ కేంద్రా లకు అందింది. ఒక ఘోర విపత్తు తప్పింది.

హరిజనుల్ని ఇస్లాం లోకి ఆకర్షించడానికి ఆ రోజుల్లో హైదరాబాదులో జరిగిన ప్రయత్నాలను విఫలం చెయ్యడంతో జయభేరీ వాస్తవ సంపాదక స్థానంలో వున్న భీమన్న నిర్వహించిన పాత్ర అద్వితీయ మైనట్టిది.

"తరతరాలుగా, యుగ యుగాలుగా ఈ భారత దేశాన్ని, ఆర్ష మతాన్ని సృష్టించిన వాళ్ళూ, రక్షించు కొంటూ వస్తున్న వాళ్ళూ హరిజనులే. హిందువులకే కృతజ్ఞత లేదు" అంటాడు భీమన్న. ఈ యుగంలో కూడ హిందూ మతాన్ని రక్షించిన వాడు అంబేద్కరే కదా అంటాడు. అంబేద్కరు ఇచ్చిన కుల నిర్మూలన ప్రణాళికను అమలు జరపకుండా భారత ప్రజ ఏక జాతి కాజాలదు అంటాడు.

శక్తి రూపిణీ భారత జాతి మెడకు
కుటిల తరమైన ఉరిత్రాళ్లు కులమతాలు
నిష్కర్షము నిర్మతము చేయనేర్చి జాతి
నుద్ధరింపగ లెండింక యువకులార!

— కూలిరాజు (నాటకం)

68. అస్పృశ్యతా కీలకం

భీమన్న కాకినాడ కాలేజీలో చదువుతున్నప్పుడే మాల మాదిగ లెవరు, అస్పృశ్యత ఎలా ఏర్పడింది అనే విషయం మీద ఒక గ్రంథం వ్రాశాడు. దానికి కాకులూరు ఉదంతాన్ని నిదర్శనంగా తీసుకున్నాడు.

కాజులూరు కాకినాడ తాలూకాలోని ఒక గ్రామం. అక్కడ మాల పేటలో ఎప్పుడో ఒక బ్రేయసీ ప్రియుల జంట, పెద్దల అనుమతి లేకుండా కలుసుకున్నందుకు వెలివేయబడ్డారట. ఆ జంట తప్పు చెల్లించడానికి నిరాకరించినందువల్ల ఆ వెలి అలానే వుండిపోయింది. పేటకు దూరంగా గుడిసె వేసుకొని వాళ్ళు సంసారం సాగించారు.

కాల క్రమంలో ఆ జంటకు ఏడుగురు కొడుకులు పుట్టారు. వాళ్ళ వంశం అలా అలా తామర తంపరగా విస్తరించడం వల్లా, వెలివేయ బడే ప్రతి వాళ్ళూ వీళ్ళతో చేరుతూ వుండడ వల్లా—వెలి వేసిన వాళ్ళ సంఖ్య కంటె వెలివేయ బడ్డ వాళ్ళ సంఖ్య చాల ఎక్కువై, పరిస్థితి తారుమారయింది.

హరిజనుల వెలి, బైస్యం, దాస్యం—ఇలా పరిస్థితి తారు మారైనందు వల్ల ఏర్పడి నట్టివే అనీ, ఆదిలో హరిజనులే తదితర కులాల వారిని వెలిబెట్టి నట్టి వారనీ భీమన్న సిద్ధాంతం.

అక్కడ కాజులూరులో ఉభయ పక్షాలకు తరచు ఏవో సమస్యలపై కొట్లాటలు జరుగుతూ వుండేవి. వాటిని తీర్చడానికి జిల్లా నాయకులను, రాష్ట్ర నాయకులను కూడా సమావేశపరచవలసి వచ్చేది. అటువంటిదే ఒకటి భీమన్న బియిడి చదువు తున్నప్పు డేర్పడింది.

హైదరాబాదుకు చెందిన భాగ్యరెడ్డి వర్మగారి అధ్యక్షత క్రింద తాళ్ళరేవు గ్రామంలో 1938లో జరిగిన రాష్ట్ర ఆది ఆంధ్ర మహాసభలో, ఒక దశలో ఆ ఉభయ పక్షాలు పంచె లెగిగట్టి, కర్రలు టకా టకా మనిపించి నప్పుడు-భీమన్నా, హరిచంద్రుడూ వాళ్ళ మధ్యకు జొరబడి ఎత్తిన కర్రలను ఎత్తి నట్టే పట్టుకొనకపోతే ఎన్ని బుర్రలు పుచ్చకాయల్లా పగిలి పోయేవో చెప్పలేం.

బహుశా ఆది పంద్రెండవ రాష్ట్ర ఆది ఆంధ్ర మహాసభ. ఆ పేరుతో జరిగిన మహా సభలలో అదే చివరిది కూడ. అప్పుడే జిల్లా సభా, యువజన సభా కూడ జరిగినై. ఆ నాటి సభలలో భీమన్నది చాల ప్రముఖ పాత్ర. నందనారు హరిశ్చంద్రుడు, భూపతి తిరుపతి, మోకా మీరయ్య, ఉంద్రు

సుబ్బారావు, ఈలి వాడపల్లి, గుడే విప్లవం, నంబూరి శ్రీనివాసరావు మున్నగు మామా యువకులు మంచి వక్తలుగా భాసించింది కూడ ఈ సభలలోనే. ఈ అందరూ భీమన్నకు మిత్రులు, సాహితీ పరులు, రచయితలు, భాగ్యరెడ్డి వర్మగారి ఆశీస్సులకు పాత్రులైన వాళ్ళు.

హరి ఇంటి పేరు నల్లి. నందనారుగా మార్చుకున్నాడు. ఆ రోజుల్లోని సంస్కరణోద్యమ ప్రభావం అంతటిది. గుడే విప్లవం అసలు పేరేమిటో కాని, ఆయన ఉపన్యాసాల ఘాటు ఆ పేరును స్థిర పరిచింది. నంబూరి ఆ తర్వాత శాసన సభ్యుడైన వాడు.

పాము రామమూర్తి గారి ఆధ్యక్షతలో జరిగిన జిల్లా సభలో చీలిక ఏర్పడింది. బహుశా మూడు భాగాలుగా చీలిందంటాడు భీమన్న. ఒకటి అంబేడ్కరిస్టులు, రెండు ప్రభుత్వ పక్షీయులు, మూడు జాతీయ వాదులు. నేరేడు మల్లి జగన్నాథం, దున్నా కమలనాభం, గొల్ల చంద్రయ్య వంటి ఉద్యమ నాయకులకు పల్లయ్య గారు సలహాదారుగా వుండి నడిపించే వారు.

నేరేడుమల్లి జగన్నాథం గారు ఆర్య సమాజ పద్ధతిని అనుసరించి జందెం వేసుకొని, మామాలలో వివాహాది పుణ్యకార్యాలకు ఆచార్యత్వం వహించే వారు. ఆయన భాషా సంగీత వేదాంత విద్యా సంపన్నుడు కనుక, హరికథల ద్వారా సాంఘికాభ్యుదయ కార్యక్రమాన్ని నడిపేవారు. ఉంద్రు సుబ్బారావు, నంబూరి శ్రీనివాసరావు గార్లు కూడ హరికథలు, సిరి కథలు చెప్పేవారు. మూర్తి, కూర్మయ్యలు కాంగ్రెసు వాళ్ళే. భీమన్న ఈ అందరికీ మిత్రుడుగా వుండేవాడు.

జరగ వలసిన పని – సిరి జనులను అజ్ఞానం నుంచీ, హరిజనులను దారిద్ర్యం నుంచీ ఉద్ధరించి, ఉభయ వర్గాలను ఏక జాతిగా మలచడం. ఈ పనిని ఎవరికి వారు తమ తమ శక్తిని, ఇష్టాన్ని అనుసరించి చెయ్యవచ్చు. ప్రజలలో చైతన్యం కలిగించే లక్ష్యంతో జరిగే ప్రతి పనినీ సమర్థిస్తాడు భీమన్న – అది పరస్పర విరుద్ధ మార్గాలలో జరుగుతున్న పనైనా సరే. ఏ దారి వెంట నడిచినా ఫర్వాలేదు. నడవడం ముఖ్యం. అన్ని దారులూ చేరే దొకే

లక్ష్యాన్ని అంటాడు. నడవడం అంటే తన ఇంటి చుట్టూ తిరగడమో, తన చుట్టూ తాను తిరగడేమో కాదు. సర్వజన శ్రేయో మార్గంలో నిరంతర పథో గమనం, కృషి.

నిజానికి భీమన్న జాతీయ వాది అయినా, వాస్తవంలో కాంగ్రెసును అనుసరించి వున్నా, ఎక్కడ మంచి కనిపించినా మెచ్చుకునే గుణం వుండడం వల్ల ఈయనలో వైరుద్ధ్యాలు కనిపిస్తాయి. ఏదో ఒక పార్టీకి, ముఠాకు, ఇజానికి కట్టుబడి వుండలేక పోయా డందు వల్లనే. అందరికీ మిత్రుడైన వాడు ఎవ్వరికీ ప్రాణ మిత్రుడు కాలేడు కదా.

తాళ్ళరేవు సభల తర్వాత కాజులూరు వ్యవహారం వదిలేశాడు భీమన్న. అయితే, వెలివేయబడ్డ వాళ్ళు మెజారిటీ అయి, సిరిజనులై, తమను ఆదిలో వెలివేసిన హరిజనులపై కక్ష సాధించ సాగా రన్న ఈయన సిద్ధాంతానికి ఆ ఉదంతం దోహదకారి అయింది.

అ సీరియనులకు, సిరియనులకు
చారిత్రకంగా జరిగిన యుద్ధాలే
మన పురాణాలలోని దేవాసుర యుద్ధాలు
అ సీరియనులే అసురలు
సిరియనులే సురలు
సురలు, అసురలు ఒకే తండ్రి యొక్క
సవతి తల్లుల బిడ్డలు
భారత దేశంలో ద్రావిడులు, ఆర్యులు
అంతా ఒకే జాతి వాళ్ళు

—రాగవాక్షం (పీఠిక)

69. మిత్రులు-అమిత్రులు

మంచిని ఎక్కడున్నా మెచ్చుకోవడం, చెడ్డను స్నేహితులలో కూడ సహించకి పోవడం భీమన్న సహజగుణం. ఈ గుణం ఈయనను అనేక విపత్తు లకు లోనుచేసింది. శత్రువుల్ని ఎంత మెచ్చుకున్నా మిత్రులు కారు. మిత్రుల్ని ఏ కొంచెం విమర్శించినా శత్రువు లైపోతారు.

మనస్సులోది చెప్పడం , చెప్పింది చెయ్యడం - ఈ గుణం గొప్ప వాళ్ళలో గొప్పగా రాణిస్తుంది , తక్కువ వాళ్ళను కసిగా అణగ దొక్కేస్తుంది . ఇందుకు ఉదాహరణలు భీమన్న జీవితంలో అనేకం . ఆయితే - భీమన్న ఈ రెండు వర్గాలకూ చెందక పోవడం వల్ల తాను తానుగా బ్రతక గలిగా డనవచ్చు .

నందనారు హరి , పంతగడ బాలకృష్ణ ఈ ఇద్దరూ కాకినాడ ఆర్ట్స్ కాలేజీలో వుండి చదువు తుండే వాళ్లు . మంచి తెలివైన కుర్రవాళ్ళు కనుక , అందరి వాత్సల్యానికి పాత్రు లయ్యారు . ఈ ఇద్దరినీ భీమన్న ప్రాణంగా చూచుకునే వాడు . ఆ రోజుల్లో వాళ్ళు హైస్కూలు విద్యార్థులు . భీమన్న రాజమండ్రిలో బి ఇడి చదువుతుండే నాటికి ఆ ఇద్దరూ కాకినాడలో కాలేజీని ఆందుకొన్నారు .

హరి మేధావి . రాజకీయ ప్రవృత్తి కలవాడు . తీవ్రవాది . సాహసి . మామూల భవిష్యత్తుకు వెలుగు చూపగల ప్రజ్ఞను ఆయనలో గుర్తించాడు భీమన్న . బాలకృష్ణ మెత్తని వాడు . భావుకుడు . కవి . ఎంతో ఉజ్జ్వలమైన భవిష్యత్తు కల దనుకొంటున్న ఈ యువ విద్యార్థి ద్దరూ చెరొక వ్యామోహంలోనూ పడి చదువు పాడుచేసుకొంటున్నా రన్న వార్త విని , భీమన్న కాకినాడ వెళ్ళి , నిష్ఠురాలను భరించి , హరిని ఒక విషమ వాతావరణం నుంచి తప్పించాడు . బాల కృష్ణకు ఒక కర్తవ్య నిర్వహణ లో తోడ్పడ్డాడు . ఈ ప్రయత్నంలో కడలి అప్పారావు , దాసరి బుల్లబ్బాయి వంటి మిత్రు లెందరో ఈయనకు ఒలం చేకూర్చారు .

ఇది జరిగిన కొద్ది రోజుల తర్వాత , ఒక సాయంకాలం , భీమన్న గోదావరి ఒడ్డున కూర్చుని పరీక్షలకు చదువు కొంటూ వుండగా , ఒక పది మంది యువకులు ఈయనను వెతుక్కుంటూ వచ్చారు . అందులో నలుగు రైదు గురు తనకు బాగా తెలిసిన చిరకాల మిత్రులే . ఒక రిద్దరు బంధువులు కూడ .

"మిమ్మల్ని సన్మానించడం కోసం మన వాళ్ళంతా సమావేశ మవుతున్నారు . మీ రింకా ఇక్కడే వున్నారేమిటి ? పదండి !" అన్నాడొక మిత్రుడు .

"నాకు ముందు చెప్పకుండా నేనా ?" అన్నాడు భీమన్న ఆశ్చర్యంతో .

"జాలా రంగస్వామి గారు చెపుతా మన్నారే!"

జాలా రంగస్వామి గారు మంచి కవి, రచయిత. ఆయన సతీమణి మంగమ్మ గారు కూడ రచయిత్రే. మామూల సాంఘికాభ్యుదయం కోసం సభల ద్వారాను, రచనల ద్వారాను కృషిచేస్తూ వుండే వారా దంపతులు. ఆ రోజుల్లో సాహితీ కృషి చేస్తుండే మామా మహిళ లిద్దరు. జాలా మంగమ్మ గారు, తాడి నాగమ్మ గారు. నాగమ్మ గారిది మోరిపొలం, మిత్రుడు బళ్ళ పురుషోత్తం అక్క గారు. రచనా ప్రక్రియలో జొన్నల మోహన రావుగారి శిష్యురా లామె.

అంత క్రితమే రంగస్వామి గారు కనిపించారు భీమన్నకు. ఇదేమీ చెప్పలేదు. అనుమానం వచ్చింది. హరి, బాలకృష్ణ వ్యవహారాలలో బాధితులైన వాళ్ళిద్దరు ముగ్గురున్నారా గుంపులో. అనుమానం స్థిర పడింది.

"నేను రాను" అన్నాడీయన.

"బలవంతంగా తీసుకెళతాం" అన్నారు వాళ్ళు. సన్మానం బలమైందే అన్నమాట!

తమ ఎత్తు పారదని గుర్తించిన తర్వాత వాళ్ళు మాటలు మిగిలి, కజ్జా పెంచి, చేతుల వరకూ రెచ్చారు. వాళ్ళు రెచ్చేకొలదీ భీమన్న శాంతం పెంచుకొంటూ వచ్చాడు. వాళ్ళ ఆరోపణ లన్నిటికీ స్పష్టంగా సమాధాన లిచ్చాడు. ఆవేశంతోకాక, సహేతుకంగా ఆలోచించ మన్నాడు.

"నే నొంటరిగా బ్బనుకోవద్దు. ఈ చుట్టుప్రక్కల నా క్లాసుమేట్లు చాలమంది వున్నారు. అంతవర కెందుకు? మీరు మరీ మూర్ఖంగా మీదకువస్తే మిమ్మ ల్నందర్నీ కొట్టి గోదావర్లో తోసెయ్యడం నాకు చేతనవును" అన్నాడు కటువుగా.

భీమన్న సరసనే నిలబడి ఈ కురుక్షేత్ర మంతా గమనిస్తున్న పాముల రామారావు అవసరమైతే తానుకూడ నలుగుర్ని తన్ని తోసెయ్యడానికి సిద్ధంగా వున్నంత తీవ్రంగా చూస్తున్నాడు. రామారావు అప్పటికి హైస్కూలు విద్యార్థి.

అన్నగారైన రంగనాయకులుగారి వద్ద వుండి చదువుకొంటున్నాడు. రంగ నాయకులుగారు పల్లయ్యగారి శిష్యుడు. భీమన్నను పద్మవ్యూహంలో బంధిస్తా మనుకొన్న వాళ్ళంతా ఆ విధంగా తామే చెల్లాచెద రైపోగా, భీమన్నకు తోడుగా హాస్టలువరకు వచ్చి రామారావు వెళ్ళిపోయాడు. ఆయనే ఇప్పుడు గాంధీ ఆస్పత్రిలో చీఫ్ ఎనెస్తీషియను డాక్టర్ రామారావు. సుప్రసిద్ధ గైనికాలజిస్టు డాక్టర్ సీత ఆయన సతీమణే. ఆవిడ బ్రాహ్మణ మహిళ.

భీమన్న రాజమండ్రి చదువంతా జయభేరీతోను, ఈ రకమైన సన్నివేశాలతోను నిండివుంది. ధర్మన్నగారు బర్మాకూడా వెళ్ళివచ్చారు. ప్రెస్సు పెడదా మనుకొన్నారు. జయభేరీకి స్థిరత్వం కల్పించా లనుకొన్నారు. ఏదీ కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకే ఆకస్మికంగా ధర్మన్నగారు పోవడం, వారి గృహం కాలిపోవడం వల్ల ధర్మన్నగారి రచనలు జయభేరి ఫైళ్ళు మాత్రమే కాక పిపాసి కథలుకూడ రూపుమాసి పోయినై. పోలుకొండ భద్రయ్యగారి వంటి హరిజన విప్లవ కవు లెందరి రచనలో భవిష్యత్తుకు లేకుండా పోయినై.

అంటరానితనం గురించి, హరిజనుల ఆదిమూలం గురించి, తన చిన్నప్పటినుంచీ భీమన్న చేస్తూవస్తున్న ఊహలు, పరిశోధనలు ఒక సహేతుక రూపం గైకొని, "హరిజనులు ఆర్యులే" అన్న వ్యాసంగా ఆ తర్వాత రాగ వాశిష్ఠ నాటకానికి పీఠిక అయింది.

కమ్యూనిష్టు నాయకుడు సి. వి. కే. రావు, కాంగ్రెసు నాయకులైన మళ్ళిపూడి పళ్ళంరాజు, క్రొవ్విడి లింగరాజు గార్లతో ప్రధాన పరిచయాలు భీమన్నకు ఆరోజుల్లోనే ఏర్పడినై. మద్రాసులో "ఆంధ్రప్రభ" అనే దిన పత్రిక పెడుతున్నారనీ, తనను సంపాదకుడుగా రమ్మన్నారనీ, కాని తను వెళ్ళడంలేదనీ భీమన్నతో చెపుతూ "సంపాదకవర్గంలోకి నిన్ను తీసుకోవల సిందిగా వ్రాశాను. నీవు మద్రాసు వెళ్ళు" అన్నారు లింగరాజుగారు. ఆయన అప్పుడు రాజమండ్రి మునిసిపాలిటి ఛైర్మన్. లింగరాజుగారి "అమ్మ" నవల ఆ రోజుల్లో దేశభక్తికి, యువరచయితలకూ ఆరాధ్య తెలుగు సరస్వతి.

వచన రచనలో భీమన్నకు ఆదర్శప్రాయుడైన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి స్నేహంకూడ ఈయనకు ఈ కాలంలోనే కలిగింది. ఆయన

"ప్రబుద్ధ భారతి" పత్రికలో ఈయన "లికూ" అనే నాటికను ప్రారంభించాడట. అదిప్పుడు దొరకడం లేదు.

ఉండ్రు సుబ్బారావుగారి "హరిజన" పత్రికలో ఈయన వ్రాసిన "ఇల్లాలు" అనే జానపద గేయకథ - అదొక సమకాలిక వ్యవసాయ కూలీ చరిత్రకూడ - ఇప్పుడు లభ్యపడడం లేదు.

తెలుసుకో
మనిషికి అర్థం తెలుసుకో!
మనిషిగ జీవించుటకు
మంచితనమె చాలదనీ
ఆత్మబలము లేని బ్రతుకు
అంధకార మయ మనీ—

—రాధేయ

70. ప్రజామిత్ర ఉప సంపాదకత్వం

క్రొవ్విడి లింగరాజుగారి సూచననూ, బి. ఎస్. మూర్తిగారి పిలుపునూ పురస్కరించుకొని భీమన్న మద్రాసు వెళ్ళాడు కాని, కొంత ఆలస్యంగా వెళ్ళాడు. ఈయన కోసం ఎదురు చూసి, ఆంధ్రప్రభ వాళ్ళు శ్రీ శ్రీ ని వేసేసుకొన్నారట ఆ స్థానంలో.

ఆ రోజుల్లో భీమన్న మెచ్చుకొంటూ వుండే ఆధునిక కవుల రచనల్లో శ్రీ శ్రీ "మరో ప్రపంచం" ఒకటి. నండూరి సుబ్బారావుగారి ఎంకి పాటలు, విశ్వనాథ సత్యనారాయణగారి కిన్నెరసాని, కొడాలి వెంకట సుబ్బారావుగారి హంపిక్షేత్రం, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి "తెగ్రద్రెంచండయ్యా" అనే పాట భీమన్న తరచు పాడుకొంటూ వుండే వాటిలో కొన్ని.

"ఆంధ్రప్రభ" ఆకారంగం కలిగించగా, మూర్తిగారి పలుకుబడితో "ప్రజామిత్ర" తన పంచను చోటిచ్చింది.

ప్రజామిత్ర గూడవల్లి రామబ్రహ్మంగారి సొంత పత్రిక. రామబ్రహ్మంగారు "మాలపిల్ల" పిక్చరు ముగించి, విడుదల చెయ్యడానికి సిద్ధంగా

వున్న రోజులవి. పిక్చరులో కథ హరిజనులకు అవమానకరంగా వున్నదని, తాను కోర్టులో కేసు వేస్తానని కూర్మయ్యగారు బెదిరిస్తున్నారు.

"మా మాల పిల్లను ఒక బ్రాహ్మడు లేవదీసుకు పోవడానికి వీల్లేదు" అన్నారు కూర్మయ్యగారు.

"ఒక బ్రహ్మణ పిల్లను మీ మాలవాడు లేవదీసుకు పోయినట్టు మీ రొక పిక్చరు తీయండి" అన్నాడు భీమన్న. అవు నన్నారు మూర్తిగారు. మూర్తిగారు మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గంలో పార్లమెంటరీ సెక్రటరీ. వా రింట్లో జరిగిన సమావేశం అది. కూర్మయ్యగారు ఎలాగో సమాధాన పడ్డారు. పిక్చరు విడుదల అయింది.

బహుశా, భీమన్నకు ఉద్యోగం దొరకడానికీ, అప్పటి పరిస్థితులకూ సంబంధం వుండవచ్చు. ఏదో ఒక ఒత్తిడో, స్వార్థమో లేకుండా పేదలకు, అందులోనూ హరిజనులకు తోడ్పడే వా రెందరున్నారు.

ప్రజామిత్ర ఎడిటరు రామబ్రహ్మం గారే అయినా - వాస్తవంగా దాన్ని ఎడిట్ చేస్తున్నవారు ఆంధ్ర శేషగిరిరావుగారు. ఆయన మూర్తి గొన్న సౌజన్యం, వికసించిన ప్రతిభ, పక్వమైన విజ్ఞానం. ఆయన ప్రక్కనే సబెడిటరుగా వున్న మరో సౌమ్యమూర్తి ముద్దా విశ్వనాధం గారు. సినీ మహాకవి సముద్రాల రాఘవాచార్యులు గారు భీమన్నకు పరిచయ మయిం దక్కడే.

"మాలపిల్ల" చిత్రం విడుదల అయినప్పుడు, దానిపై భీమన్న వ్రాసిన చిత్రసమీక్ష అపూర్వమూ, అద్వితీయమూ అని సర్వే సర్వత్రా ప్రశంసల నందు కొన్నట్టిది.

పల్లెటూరి లేఖలను "జానపదుని జాబులు" అనే శీర్షిక కింద ప్రజామిత్రలో కొనసాగించాడు భీమన్న. అక్కడ ఈయన ఉప సంపాదకుడుగా పనిచేసింది ఒక సంవత్సరం లోపు మాత్రం. ఈ సంవత్సర కాలంలో ఒక్కసారి కూడ ఈయన తన యజమాని రామబ్రహ్మంగారిని దర్శించుకోలేదు! ఇలాంటి మనస్తత్వం కలవాడికి ఎక్కడైనా, ఏ ఉద్యోగమైనా ఎంతకాలం నిలుస్తుంది? అ మాట మూర్తి గారే అన్నారు.

ఆ కాలంలో మద్రాసులో భీమన్న సతీ సమేతంగానే వుండేవాడు. ఇల్లు దొరక్క పెరియమెట్టులోని కాశి ఆదినారాయణగారి వంట గదిలో వున్నా రొక వారం రోజులు. ఆదినారాయణ కాకినాడలో భీమన్న సహాధ్యాయి. మద్రాసులో అప్పుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. భూపతి రామమోహనరావు రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగి. గొట్టుముక్కల రామస్వామి ఒక విద్యార్థి. వీరందరూ భీమన్నకు సన్నిహిత మిత్రులూ, బంధువులూ.

ఆదినారాయణ దంపతులు, రామమోహనరావు దంపతులు, మూర్తిగారి కుటుంబం, ఆ చుట్టు ప్రక్కల ఓ పద్మ, ఓ రజియా, ఓలూసీ, అతిథిగా వచ్చి కొద్ది రోజులుండి వెళ్ళిన దాసరి బుల్లబ్బాయి, గొల్లపల్లి గనిరాజు, బళ్ళ వెంకటరత్నం, శాస్త్రి ఆనబడే వెంకటేశ్వర్లు, వి. వి. రెడ్డి - ఈ పరిధిలో భీమన్న ఆ సంవత్సరం పాటు సంసారాన్ని ఒక రసవత్తరమైన కథల సంకలనంగా వర్ణించవచ్చు.

భీమన్న ఎక్కడుంటే ఆ చుట్టూ ఒక కథ, ఒక కావ్యం.

"సంక్రాంతి పండగనా డైనా కల్లాపు చల్లి, ముగ్గులు వేసి, గొబ్బిళ్ళు పెట్టుకోడానికి కాస్త వాకిలీ, ఆవు పేడా కూడ లేని ఈ మద్రాసు కాపురం ఏడవనా?" అంటూ తాను ఏడ్చి, ఈయనను ఏడ్పించిన ముగ్ధ మనస్వినీ ఆనాటి నాగరత్నమ్మ.

ఒక సాయంత్రం మిద్దె మీద ఒంటరిగా కూర్చుని ఏదో వ్రాసుకొంటున్నాడట భీమన్న. ఆ ఎదర మిద్దెమీద చేరిన కొంద రమ్మాయిలు భీమన్న తమ వంకే చూస్తున్నా డనుకోవడం, వాళ్ళ ముసలమ్మలు తగవు పెట్టడం జరిగింది. వా ళ్ళేమంటున్నారో ఈయనకు అర్థం కాలేదు. ఠీయన వెంటనే భార్యను పైకి పిల్చాడట. ఆమె వంట గదిలో చపాతీలు ఒత్తుతూ, ఆ కర్ర తోనే మిద్దె మీదకు వచ్చింది. ఇంకే ముంది? ఆవతల మిద్దె వాళ్ళు క్షణంలో అదృశ్యమై పోయారు.

ఇలాంటి సంఘటనలు, సన్ని వేశాలు భీమన్న జీవితంలో అసంఖ్యాకంగా వున్నై.

ప్రజామిత్రలో ఉద్యోగం అయిపోవడంతో భీమన్న మద్రాసు కాపురం ఎత్తేసి, ధార్యనురాజోలులో వదిలేసి, తిరిగి మద్రాసు వచ్చేశాడు - మూర్తి గారి "నవ జీవన" పత్రికకు సంపాదకుడుగా. బహుశా, అది 1939 ఫిబ్రవరో, మార్చో.

లత లన్నీ ఒక తోటలోవే
పూ లన్నీ అంద మైనవే
రుచు లన్నీ తృప్తి నిచ్చేవే
ప్రతి తృప్తి సత్ఫలితాన్ని చేకూర్చేదే
ఆనంద మంతా ఒక్కటే
ఒక జాతిదే.

—అనాది కొస

71. దేవ కన్యలు

మూర్తి గారు అధికారంలో వున్న కాంగ్రెసు నాయకుడు. స్వయంగా కవి. "ఏడు కోట్ల తిరుగుబాటు," "ఆంధ్ర వీరకుమార శతకం" వ్రాసిన వాడు. ఆయన ఆధిపత్యంలో "నవ జీవన" అనే మాసపత్రికను నడపాలనీ, దాని సంపాదకత్వ బాధ్యతను పూర్తిగా భీమన్నే వహించాలనీ అంతకు ముందే ఒక నిర్ణయం జరిగింది. అందుకే భీమన్న మద్రాసుకు మళ్ళీ వచ్చాడు. మూర్తి గారి తమ్ముడు సుబ్బారావు కూడ రచయితే.

నవజీవన ప్రారంభ సంచిక బ్రహ్మాండంగా తయారయింది. సమస్తమూ భీమన్నే చూచుకోవలసి వచ్చింది. రెండో సంచిక మేటరు కూడ ప్రెస్‌కు ఇచ్చే శాడు. హఠాత్తుగా జ్వరం వచ్చేసింది. పెరియమెట్టులో ఒక గదిలో వుంటున్నాడు. చేతిలో డబ్బులేదు. హోటలులో ఒక పూటే తినే వాడు. అదైనా చవుకబారు మిలిటరీ హోటళ్ళలో. దానితో ఆరోగ్యం దెబ్బతింది.

మూడు రోజులపాటు తీవ్ర జ్వరంతో మూసిన కన్ను తెరవ లేదు. అంతకు ముం దెన్నడూ ఎరగని తలపోటది. భయంకరమైన ఆ బాధలో, అపస్మార స్థితిలో, హఠాత్తుగా స్థలనమై పోయి, మెలకువ వచ్చేసిందట. జ్వరం

తగ్గిపోయింది. మృత్యువుతో పోరాడి గెల్చి కొచ్చేశాడు. అయితే - ముఖం నిండా బొబ్బలు తేలాయి! మరో అరగంటలో అంబులెన్సు వచ్చేసింది.

మొత్తం మద్రాసు నగరాన్నే మశూచి ఒక ఊపు వూపేసిన రోజులవి. అంతకు ఒక వారం ముందే భీమన్న టీకాలు వెయ్యించుకొన్నాడు. అవి పొక్కడమూ, మశూచి పొయ్యడమూ ఒకేసారి జరిగింది.

తెల్లటి ఖద్దరు పంచె అడ్డ కట్టూ, ఖద్దరు లాల్చీ, బసవరాజు అప్పారావు కవితల పుస్తకమూ, ఒక పెన్సిలూ - వీటితో అంబులెన్సు ఎక్కాడు భీమన్న. నాగరిక వేషాన్ని, విద్యాధిక్యాన్ని గుర్తించిన ఆరోగ్య శాఖాధికారి మరెవర్నీ అందులో ఎక్కించకుండా, ఈయన ఒక్కడినే తీసుకువెళ్ళి, తొండయార్పేటలోని అంటు వ్యాధుల ఆస్పత్రిలో చేర్చారు.

ఆ ఆస్పత్రి సూపర్నెంటు డాక్టర్ స్వామినాధన్. ఆయన భీమన్నకు చూపిన గౌరవం అపూర్వమైనట్టిది. వందల కొలదీ కలరా, మసూచి రోగులు క్షణ క్షణమూ ఆస్పత్రికి చేరవేయ బడుతున్నారు. వాళ్ళు ఆస్పత్రి వరండాల్లోను, ఆవరణలోని చెట్ల నీడల్లోనూ కుప్పలుగా పడి వున్నారు. రోదనల వేదనల మధ్య మృత్యువు విలయ తాండవం చేస్తున్నది. మృత్యువు యొక్క భీకర స్వరూపాన్ని చూడాలంటే - ఆ రోజుల్లో ఆ ఆస్పత్రి ఆవరణలోకి ఒక్క క్షణమైనా తొంగి చూడవలసిందే. అట్టి ఘోర పరిస్థితిలో ఆ డాక్టరు భీమన్న ముఖంలోకి క్షణం చూచి—

"నీవు చూస్తే కాలేజీ నుంచి కొత్తగా బైటికి వచ్చిన విద్యావంతుడివి. కవివి. ఇది నరకం కంటె భయంకరమైన మానవ యాతనా కేంద్రం. నీ వ్యాధిలోని ప్రమాద దశ సుళువుగానే దాటి పోయింది. ఇప్పుడు నీకే భయమూలేదు. అయితే-కొద్ది రోజులు నీవీ నరకం మధ్య వుండవలసి వచ్చింది. ఫర్వాలేదు. కాని, ప్రత్యేక గదులన్నీ నిండిపోయి వున్నై. ఖాళీ దొరకగానే నీ కిస్తాను. అంత వరకు జనరల్ వార్డులో ఒక ప్రక్క నీకు స్క్రీనులతో ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేయిస్తున్నాను. తాత్కాలికంగా అక్కడ వుండు" అన్నాడు ఇంగ్లీసులో, ఎంతో మృదువుగా.

వార్డులో ప్రవేశ ద్వారం వద్ద - వీధి వైపున కిటికీ, ఒక ప్రక్కగోడ, తక్కిన రెండు వైపులా స్క్రీనులతో - ఒక ప్రత్యేక గది తయారయింది. కృతజ్ఞతతో నిండిపోయింది భీమన్న హృదయం. ముక్కూ, మొగమూ తెలియని ఒక దూర ప్రాంతంలో ఎంత ఆదరణ! ఎంత ఆప్యాయత!

టీకాలు వేసినా, వ్యాధి ఎందుకు సోకింది? పరిశోధనలు ప్రారంభమయాయి. అప్పటికే సోకి వున్న దన్న మాట! టీకాలవల్ల తీవ్రత తగ్గింది. అదట సంగతి!

ప్రవేశ ద్వారం గుండా స్ట్రెచర్ల మీద రోగుల్ని తీసుకు వస్తూనే వున్నారు. నిష్క్రమణ ద్వారం గుండా శవాలను తీసుకు పోతూనే వున్నారు. ఇది నిర్విరామంగా భీమన్న మంచం చుట్టూ జరుగుతున్న స్థితి లయాల కార్యక్రమం. ఆ స్థితిని -

వచ్చే పోయే ప్రజలకిన చప్పిన
వైశాచిక వికృతంపు పీనుగలు
రాత్రింబవళ్లు నా మృతిశయ్యకు
ప్రదక్షిణమ్ములు సల్పుచుండినవి;
నరక కూపముల మృత్యు వేదనల
నా ప్రాణము లడుగంటి పోయినవి;
తెలియదు చచ్చితినో, బ్రతి కుంటినొ -
దేవ కన్యలో, నర్సులొ వీరు!

అంటూ వర్ణించాడు. ఈ కవితను ఇంగ్లీషులో విన్న నర్సులు ఆనందంతో కళ్ళు తుడుచు కొన్నారట. తాము ఎంత సేవ చేసినా రోగులకు తృప్తి వుండదనీ, ఎప్పుడూ ఏదో సణుగు కొంటూ పిర్యాదులు చేస్తూనే వుంటారనీ, తమను గురించి ఇంత మంచి మాటను ఏ రోగినుంచీ తామింత వరకు వినలేదనీ అంటూ ఆ కవితను ప్రాసుకు వెళ్ళేవారట! ఆ విధంగా ఆ ఆస్పత్రిలోని నర్సులంతా తనకు సన్నిహితులై, శ్రద్ధగా చూస్తుండే వాళ్ళు.

తనది మంచం ప్రక్క స్క్రీను వెలుపల మంచం కూడ ఒక ప్రమాదం గడిచిన రోగిది. ఆయన పేరు రాజు. ఆయనను చూడడానికి రోజూ తల్లీ,

భార్యా పస్తుండే వారు. ప్రతి రోగికి ఎవరో విజిటర్లు వస్తూ పోతూ వుండే వాళ్ళు. ఎవరూ లేనిది తనకే!

ఇది దుర్భర మానవ హృదయము, స్నే
హితుల కోసమై చూచున్

అంటూ రోగి మనస్తత్వాన్ని ప్రకటిస్తూ, ఆ వార్డులో తనలాంటి వాళ్ళింకా ఎంతమంది వున్నారో కదా అనే భావం కలగగా -

ఈ దుస్సహ మృత్యు కూపములలో
ఎన్ని తీయ గుండెయి కలవో

అని వాపోయాడు భీమన్న. "హృదయ మొసంగిన చెలు" లెందరో వున్నారు తనకు లోకం నిండా. అయినా, అసహాయుడై పడివున్నా డిప్పుడు తాను! అభిమన్యుడు మరణించింది వెన కెవరూ లేకనా?

ఒకనాటి అర్ధరాత్రి భీమన్న ఏదో నీరసం పట్టుకొని వణికి పోసాగాడు. గంగవెర్రు లెత్తిన రోగుల ఆరుపులతో, మూల్గులతో వార్డంతా నరకంలా వుంది. తన కేమో కాళ్ళు నిలబడడంలేదు. ఊపి రందడం లేదు. ఇక అవే అంత్యఘడియ లనుకున్నాడు. నర్సు వచ్చి చూచి, డాక్టరును తీసుకు వచ్చింది.

"రక్తహీనత వల్ల నరాల బలహీనత ఏర్పడింది. మసూచి బొబ్బల వల్ల రక్తం పోయింది కదా? అదీ సంగతి. రేపు ఉదయం నుంచి ఒక కోర్సు ఇంజక్షనులు ఇస్తాను. ఆరు కాప్సుల్సు పెట్టె మూడు రూపాయ లుంటుంది. బైట కొనుక్కోవలసిందే. ఆస్పత్రిలో లేవు. నీవు తెప్పించుకొన్నా సరే. నన్ను తెమ్మన్నా తెస్తాను. మరేం భయంలేదు" అన్నాడు డాక్టరు, పరీక్ష జేసి చూచి.

"నీకు సిటీలో ఎవరూ లేరా?" అన్నాడు డాక్టరు, భీమన్న మన స్థితిని గుర్తించిన వాడిలా. "ఎవరికైనా ఫోను చెయ్యమన్నా చేస్తాను. నేను ఉదయం ఏనిమిది గంటలకు సిటీకి వెళతాను. ఈ లోపల నాకు చెప్పు" అంటూ డాక్టరు తన గదికి వెళ్ళిపోయాడు. ఎదో ఒక డోసు మందిచ్చి నిద్ర పొమ్మంది నర్సు.

విరులు భూమి నుండి , మెరుపు మబ్బుల నుండి
కాంతి తమము నుండి కల్గినట్లు
విభిల జీవశక్తి నీనుండి ప్రవహించు
వెడలనిమ్ము దాని వెల్లివిరిసి

—దీప సభ

72. అన్నీ రొయ్యమీసాలే నా ?

" ఇయ్యను ఇప్పించను గల అయ్యలకే " నా మీసం వుండవలసింది కవి చౌడప్ప ఎంత పిచ్చివాడు ? నిద్రపట్టడంలేదు . తనకుకూడ డెలీరియం వస్తుందో ఏమిటో అనుకున్నాడు భీమన్న . అయినా, జ్వర తీవ్రతలో కదా? వస్తుం దది . తనకు జ్వరంలేదు , కాని—మసూచి గడిచిపోగా , తత్కారణంగా వచ్చిన నీరసంతో చచ్చిపోయే విపత్తు ఏర్పడిందిప్పుడు . మహాయుద్ధంలో గెలిచి వస్తా , రిషా కిందపడి మరణించి నట్టవుతుందో యేమో !

తనకు మూడు రూపాయలే మద్రాసు నగరంలో దొరకవా ? ఎందుకు దొరకవు ? ఎలా దొరుకుతై ? తనకు తెలిసిన ఒక్కొక్క వ్యక్తిగురించీ ఆలోచించసాగాడు భీమన్న . చివరి కన్నీ రొయ్య మీసాలుగానే తేలినై !

పరిచయులు , మిత్రులు , శ్రేయోభిలాషులు , ఉద్యోగాలలో , పదవులలో వున్న ఎందరో వున్నారు భీమన్నకు . తనకు దబ్బివ్వ వలసిన వాళ్లుకూడ వున్నారు . కాని , ఏం లాభం ? ఇవ్వాలిగా ?

సడన్‌గా ఒక ఆశాకిరణం పడింది భీమన్న మనస్సు మీద . అది ఆంధ్ర శేషగిరిరావుగారి రూపం . మూడు రూపాయలు కావాలని ఆయనకు ఫోను చేయిస్తే , ఆయిదు రూపాయలు పంపించా డాయన వెంటనే ఫ్యూను చేత .

మూడు రూపాయలు ఇంజెక్షనులకు ఫోను , రెండు రూపాయలు మిగిలాయి చేతిలో . చేతిలో రెండు రూపాయలు , శరీరంలో రెండు ఏనుగుల బలం !

ప్రక్క మంచంమీది రాజు గారి బంధువులే తనకూ బంధువు లయ్యారు భీమన్నకు. వాళ్ళచేత నేయి, పథ్యం పదార్థాలూ తెప్పించుకునేవాడు. ఒక నర్సు పోస్టుకవర్లూ, తెల్లకాగితాలూ తెచ్చిపెట్టింది. మరో నర్సు తన పెన్ను ఇచ్చింది. ఇంకొకామె సూదీ, దారమూ తేగా, రెండు తెల్లకాగితాల పుస్తకాలు కుట్టుకున్నాడు. ఒకదానిలో ఒక కావ్యమూ, ఒకదానిలో విడి విడి గేయాలూ వ్రాయడం సాగించాడు.

భీమన్న కవిత ఎప్పుడు ఏ రూపంలో చెప్పినా ప్రియుణ్ణో, ప్రియురాలినో సంబోధించి చెపుతాడు. ఈ పద్ధతి ఒక రసధారా సూత్రం అయి, ఈయన చెప్పే రకరకాల పద్యాలూ, గేయాలు అన్నీ కావ్యమాలిక లవుతూ ఉంటై. ఈ సుఆపత్రి గేయాలుకూడా ప్రియురాలితో చెపుతున్నట్లుగానే వుంటై.

చెలియ! నా రోగ శయ్యకు చుట్టూ
సీక్రి నొక టుంచిరి కరుణన్,
ఇవతల తోటలు, స్వర్గ సీమములు,
అవతల నరకము కలవు;
నరకమ్ము వకును నాకును కలదొక
తెర మాత్రమె నడుమను, చెలియా!
స్వర్గ సీమము లనంత దూరముల
వ్యాపించి యున్న, పందవు నాకు!

భీమన్నను విశ్వకవిని చెయ్యడానికి ఈ చివరి నాలుగు పంక్తులు చాలవా అనిపిస్తున్నది కదూ?

బైట తుల్లముగి పూచిన వేపలా
ప్రాణేశుని గొప్పల పొగడన్,
లోని మశూచీ పిశాచి చాటున్
లోకము నాతవి శూన్యతను!

ఇలా వ్రాసుకు పోతూ వుంటే హఠాత్తుగ లైటు ఆరిపోయింది. నర్సును కేకవేశాడు. లైటు వెయ్యమన్నాడు. టైం చూడమన్న దామె. రాత్రి పదకొండు గంటలు.

"అయితే యేం ? నేను వ్రాసుకోవాలి" అన్నాడు . వీలు లేదన్న దామె . రూలుప్రకారం పది గంటల తర్వాత లైటుండ గూడదు .

భీమన్నే లేచి వెళ్ళి , లైటువేసి వచ్చి కూర్చున్నాడు . నర్సు వెళ్ళి ఆవు చేసింది . భీమన్న మళ్ళీ వేశాడు . ఆమె మళ్ళీ తీసేసింది . పేచీ డాక్టరుదాకా వెళ్ళింది .

" ఇదిగో నర్స్ ! ఈ యువకుడు కవి . ఏదో వ్రాసుకుంటూ వుంటాడు . వ్రాసుకోనీ ! డిస్టర్బ చెయ్యకు " అన్నాడు డాక్టరు వచ్చి . భీమన్న వ్రాస్తున్న పుస్తకాల పేజీలు త్రిప్పిచూసి , ప్రశంసా పూర్వకంగా భుజం తట్టి అన్నాడు :

"ఇక్కడ నీ వ్రాత కెవరూ అడ్డంరారు . అయితే ఈ వ్యాధి స్వభావం నీకు తెలుసుకదా ? శరీరంమీదా , అరచేతుల్లోనూ , అరకాళ్ళలోనూ వున్న నల్లటి నెత్తురు పక్కలే శరీరం లోపల ముఖ్యంగా మెదడు మీద కూడ ఉండవచ్చు. ఇప్పుడు నీవు రెస్టు తీసుకోక పోతే ఆ తర్వాత బలహీనమై పోతావు . మెదడు అసలు పనిచెయ్యకుండా పోయే ప్రమాదం వుంది . నీవే ఆలోచించుకో !"

నర్సు ఏమైపోయిందో లేదు . భీమన్నే లైటు ఆపుజేసి పడుకున్నాడు .

1989 మే ఒకటవ తేదీనాడు మే దినోత్సవం, వివాహదినోత్సవం కలిపి ఆస్పత్రిలోనే జరుపుకున్నాడు భీమన్న . పూలతో అలంకరించిన స్రిక్కును చూచి డాక్టరన్నాడు " ఈ సరకాన్ని స్వర్గం చేసుకొన్న వాడివి నీ వొక్కడవే" అని !

బాధామయ మానవ పాథోనిధి
పారము లంటగ చూచి వచ్చితిని :
అమృత వరము లొక రెండే యున్నవి
అసహాయులైన మనుజులకు—
ప్రేయని ప్రేమాశ్లేషము మొదటిది
మృత్యు పరీరంభము రెండోది ;
రెండింటికి దూరమైన బ్రతుకిది ,
లేదు దీనికొక ఉపమానం ।

ఈ పద్యాలుకూడ నేడు దొరకడంలేదు. కొన్ని మాత్రం రాగోదయం చివర ప్రకటించబడ్డాయి. కావ్యం పూర్తిగానే పోయిండి.

73. పాతిక రూపాయలకు కాపీరైటు

"పునర్జన్మ ఎత్తి వచ్చావు. పథ్యం బాగా చెయ్యి" న్నారు ర్తి గారు, అమూనెలా పదిహేను రోజులు ఆస్పత్రిలో వుండి వచ్చిన భీమన్నను చూచి.

ఇంటికి పోతా నంటే సరే-అన్నారు.

తర్వాత ఆంధ్ర శేషగిరిరావు గార్ని కలిశాడు భీమన్న. "మీ కోసం నమ్మాళ్వార్ను ఎదురు చూస్తున్నాడు. కలవండి" అన్నా రాయన.

"జానపదుని జాబులు మా సిరీసులో వేస్తాం. అందరి కిచ్చేటట్టే మీకూ ఇస్తాను" అన్నారు నమ్మాళ్వార్ను.

జమిలి నమ్మాళ్వార్ను ప్రచురణలు అప్పటికి మంచి ప్రచారంలో ఉన్నాయి. ఒకే సైజులో, ఆ రణాల వెలతో అందంగా, గువ్వల్లా వుంటాయా గ్రంథాలు. ఆ వరుసలో తనదికూడ వస్తుందంటే ఎంత సంతోషం! అంత వరకు అచ్చులో వచ్చిన పుస్తకం ఏదీ లేదు భీమన్నకు. అయితే రచయితలకు చాల తక్కువ ఇస్తాడు నమ్మళ్వార్ను. కాపీరైటు తీసుకొని, పాతిక రూపాయ లిస్తాడట!

"అంత కంటె గత్యంతర మేముంది?" అన్నారు శేషగిరిరావుగారు. భీమన్నకు కూడా అలానే అనిపించింది. తాపీ వారితో ఆలోచించాడు. "అది చాల విలువైన సాహిత్యం, బ్రదర్! అంత చవగ్గా ఇచ్చేస్తావా!" అన్నా రాయన సానుభూతితో. రెండు వంద లైనా వస్తే ఇచ్చెయ్యొచ్చు."

నిజమేకాని, ఎవ రిస్తారు? పోని, మానివేస్తామా అంటే ఇంటికిపోవడం ఎలా? రైలు చార్జీ లైనా కావాలిగా? పుస్తకం ప్రమరణ హక్కును నమ్మాళ్వార్కు ఇచ్చేసాడు భీమన్న. స్టాంపు, రెజిస్ట్రేషను వగైరా ఖర్చులకని

రూపాయి మిగుల్చుకొని మిగిలిన ఇరవై నాలుగు రూపాయలు ఇచ్చాడాయన. అవి తీసుకొని, మళ్ళీ శేషగిరిరావుగార్ని కలిశాడీయన.

"మూడు రూపాయలు కావా లంటే ఆయిదు పంపించారు. నేను బ్రతికి ఆరోగ్యంగా బైటికి వచ్చానంటే, ఆది పూర్తిగా మీ చేతి చలువ" అన్నాడు భీమన్న-తాను బల్లపై వుంచిన ఆయిదు రూపాయల నోటును తీసుకోడానికి నిరాకరించిన ఆంధ్రవారితో. దానిని తీసి తిరిగి భీమన్న చేతిలో పెడుతూ, "సుఖంగా వెళ్ళిరండి" అన్నా రాయన చిరునవ్వుతో.

ఆదీ ఆంధ్ర శేషగిరిరావు గారి వ్యక్తిత్వం. పరమ వదాన్యమూర్తి ఆయన. భీమన్నకు నిర్నిమిత్తంగా - నిర్వ్యాజంగా తోడ్పడ్డ కొద్ది మంది మహనీయులలో ఆయన ఒకరు.

వేలు, లక్షలు ఏలువ చేసే సర్వీసును తన నుంచి పొంది, తనకు ఆ పత్యాలంలో అణు మాత్రం సహాయం కూడా చెయ్యనివా ళ్ళున్నారు భీమన్న జీవితంలో. ఆయిదు రూపాయలు కాదు ప్రధానం. వాటి వెనుక వున్న ఆత్మ, అమృతం!

భీమన్న తొలి సంతానం విజయ భారతి. అచ్చైన తొలి గ్రంథం జాన పదుని జాబులు. అభ్యుదయ దృక్పథం వున్న ప్రతి వారినీ ఆకర్షించిన గ్రంథం ఇది. లేఖా సాహిత్యాన్ని ప్రణయ పథం నుంచి పల్లెటూళ్ళకు గంగా వతరణం చేయించిన భగీరథుడు భీమన్న.

ప్రేమ ఆనునది లేనిచో పృథ్విలోన
బిరుదు లుద్యోగములును నిల్వెడునె బ్రతుకు?
ఆలపు వాపుట కొక కొమ్మ కలిగునవుడె
అల నభోరేఖ పక్షి కాహ్వాన లేఖ

— మధు గీత

74. స్థానిక రాజకీయాలు

భీమన్న సాహితీ జీవితం వలెనే సాంసారిక జీవితం కూడ సరసమూ, సదా నూతనమూను. అర్థం మీదా, ఆర్జన మీదా ధ్యాస లేక పోవడం వల్ల, ఈయ

నకు పేదరికం నిత్యం కూడానే వుండేది. అయితే, అది కాలిలో ముల్లులా కాక, సానరాయిలా పని చెయ్యడంవల్ల, రెండు జీవితాలూ కూడ సమంగా వికసించ గలిగినై.

మద్రాసు యాత్రలూ, పత్రికలూ ఇవేవీ పల్లయ్య గారికి నచ్చలేదు. ఇదంతా కాలయాపన తప్ప, కానీ కలిసి వచ్చిం దింతవరకు ఏమీ లేదు. భీమన్న బి. ఏ. పాసై అప్పుడే అయిదే ళ్ళయింది. ఈయనతో చదివిన వాళ్ళంతా పర్మనెంటు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సంపాదనపరు లయ్యారు. అందరికంటె తెలివైనవా డనుకొన్న తన కొడుకు ఎందుకూ పనికి రానివాడుగా తయారయ్యే టప్పటికి, పల్లయ్యగారికి ఒక విధమైన బెంగ పట్టుకొన్నది.

అదీగాక, చేసేవాళ్ళు లేక కౌలు వ్యవసాయం వదిలేశా డాయన. చిన్న కొడుకూ, చిన్న కూతురూ ఇంకా చిన్న క్లాసుల్లోనే వున్నారు. కౌలు తోట పోగానే, అందులోని ఇల్లు కూడా పోయింది. పాత ఇల్లు ఎప్పుడో పడి పోయింది. కొత్త ఇల్లు లేదు. నాలుగైదు ఎకరాల సొంతపొలం వుంది కాని, అది వట్టి ఇసక గరువు. అందున్న చెట్లు ముసలివి. కొత్త తోట పెంచాలి. అందుకు పెట్టుబడి కావాలి. ప్రస్తుత ఆదాయం తిండికి చాలదు. ఆ గరువు మీదే తండ్రీ కొడుకులు కలిసి మట్టి గోడలు పెట్టి ఒక రెండు గదుల ఇల్లు కట్టారు. అందులో వుంటున్నారు. 1989 ప్రాంతంలో పరిస్థితి అది. భీమన్నకు తెలిసినంతవరకు, తమ కుటుంబ ఆర్థిక స్థితి అతి హీన స్థితిలో వున్న రోజు లవి.

ఆ రోజుల్లోనే జిల్లా బోర్డు ఎన్నికలు వచ్చాయి. నగరం ఫిర్కాకు ఆరుమిల్లి వెంకటరత్నం గారు కాంగ్రెసు అభ్యర్థి. జాతీయోద్యమంలో లాటి దెబ్బలూ, జైలు శిక్షలూ కూడ అనుభవించిన దేశభక్తు డాయన. అయితే, ఆయన కమ్మ కులస్థుడు. కమ్మవారు చాల మైనారిటీ కులం అక్కడ. జస్టిస్ పార్టీ అభ్యర్థిది కాపు కులం. ఇక ఎన్నికల ప్రచారం ఏ స్థాయిలో, ఎంత పచ్చిగా జరిగి వుంటుందో వూహించుకోవచ్చు.

ఈదరాడకు చెందిన ఆకుల బులిస్వామి గారు ఒక ప్రముఖ కాంగ్రెసు యువ నాయకుడు. భీమన్నకు మిత్రుడు. తీరికగా వున్న భీమన్నను ఎన్నికల రంగం లోకి దింపా డాయన.

మామిడికుదురు మొత్తం మీద కాంగ్రెసు వర్కర్లు నలుగురే నలుగురు- నైనాల సాంబశివరావు, కాండ్రేగుల శ్రీరామశెట్టి, బోయి భీమన్న, మహమ్మద్ హనీఫ్‌గార్లు. నగరంలో కరతలపు కృష్ణమూర్తి, కొమగిరిర చిరంజీవి, సాంబ శివరావు గార్లు. ఈ కొద్ది మందీ కలిసి అక్కడ కాంగ్రెసు అభ్యర్థిని గెలిపించా రంటే – జాతీయోద్యమం ఎంతగా ప్రజల హృదయాలలో నాటుకు పోయిందో తెలుస్తుంది.

నిజానికి అక్కడ ప్రజలంతా కాంగ్రెసును బలపరిచిన వారే. కులానికి ఈనా డున్నంత ప్రాబల్యం ఆనాడు లేదు.

రాజోలు ఫిర్కాలో కాంగ్రెసు అభ్యర్థి కస్తూరి వెంకటేశ్వర్లుగారు. అక్కడ జస్టిసు పార్టీ దౌర్జన్యాలకు దిగింది. ఒక రాత్రి శివకోడులో ప్రచారం చేస్తున్న భీమన్న బృందాన్ని ఆ ప్రాంతపు ప్రతిపక్ష రౌడీలు తరిమితే – వీళ్ళు పరుగు పుచ్చుకొని, నగరంలో తిరిగి చూశారు. ఆ బృందంలో శ్రీరామశెట్టి, ఎర్రాప్రగడ గోపాలకృష్ణమూర్తి, మండెల విశ్వనాథం, కొమరగిరి సాంబం వగైరా వున్నారట.

ఆప్పుడు రాత్రి ఒంటి గంట. అమలాపురం వైపు నుంచి వస్తున్న ఒక కారు వీళ్ళవద్ద ఆగింది. విషయం తెలుసుకొన్నది. అందులో కళా వెంకటరావు, బిక్కిన వీరస్వామి గార్లున్నారు. ఆ ఇద్దరూ రాష్ట్ర కాంగ్రెసు నాయకులే. ఆ ఇద్దరి అభిమానానికీ, ప్రత్యేకంగా కళావారి వాత్సల్యానికి భీమన్న ఎక్కువగా పాత్రు డయిం దానాటి నుంచే.

ఆ ఎన్నికల రోజుల్లో కాంగ్రెసు వర్కర్లకు ఆశ్రయం నగరంలో కరణం చిరంజీవి గారిల్లు, ఆ ప్రక్కనే వున్న కరతలపు కృష్ణమూర్తి గారిల్లు. కరతలపువారిల్లు పెద్ద మండువా. దేశభక్తి, సౌజన్యం మూర్తీభవించిన వారు వారి కుటుంబమంతా. భారతీయ ఆతిథ్య స్వరూపం అక్కడ కనిపించింది భీమన్నకు. ఎవరు, ఏ కులం అనే దృష్టి లే దక్కడ. కరణం గార్ని మినహా యిస్తే, నగరం గ్రామంలో కరతలపు వారి దొక్కటే బ్రాహ్మణ గృహం. మామిడికుదురులో బ్రాహ్మలే లేరు.

మామిడికుదురు కాపుల్లో ఎక్కువ భాగం కాంగ్రెసు వారే అయినా, బహిరంగంగా నిలబడింది నైనాల సాంబశివరావుగా రొక్కరే. "తన్నుతాం, చంపుతాం" అనే ప్రతి పక్షపు బెదరింపులకు అయనతో పాటు భీమన్న కూడ గురైనాడు. అందువల్ల తరచు రాత్రి వేళల్లో ఆ ఇద్దరూ కృష్ణమూర్తి గారింటనే వుండిపోవలసి వచ్చేది.

కృష్ణమూర్తి గారు భాగవతం చదువుతూ వుండేవారు. పద్యాలు శ్రావ్యంగా పాడేవారు. ఇప్పటికీ భీమన్న బిలహరి రాగం గుర్తుకు తెచ్చుకోవాలంటే కృష్ణమూర్తి గారి గొంతును స్మృతి పథంలో వినవలసిందే. అంతటిది భీమన్న పై కృష్ణమూర్తి గారి పద్య పఠనా ప్రభావం.

బలవంతుడే రాజు, బలవంతుడే భగవంతుడు
ఏ యుగంలో అయినా, ఏ పేరుతో పిలువబడినా!
ఆధిక్యత కావలిస్తే, బలం సంపాదించుకో

— త్రిపదలు

75. మామూలూ - మహీసురులూ

ఒకసారి కొంతమంది కాంగ్రెసు కార్యకర్తలతో కలిసి భీమన్న ఏదో వూరు వెళుతూ వున్నాడు. అక్కడేదో సభో, తగవు పరిష్కారమో! నిర్మాణ కార్యక్రమాలను అమలు పరచడమో, ప్రజలను సంఘటిత పరచడమో జరపడానికి ముందు, తరచు గ్రామ కక్షలను పరిష్కరించవలసి వుండేది.

భీమన్న ప్రక్కనే ఒక వృద్ధ కాంగ్రెసు నాయకుడు నడుస్తున్నాడు. ఆయన పేరు జగన్నాథం గారు. ఆయనే ఆ జట్టుకు నాయకుడు. అందరికీ మాన్యుడు. కడలి గ్రామ వాస్తవ్యుడు. మామిడికుదురుకు నైర్ఋతిగా మూడు మైళ్ళలో వున్న పెద్ద గ్రామం కడలి. అక్కడి మామాలలో పాముల వారి కుటుంబం పెద్దది, పలుకుబడి కలది, ధనవంత మైనది. ప్రముఖ మామా నాయకుడు మట్టా స్వామి గారు ఆ వూరి వాడే.

అంతకు కొద్దికాలం ముందు—

మే దినోత్సవం బ్రహ్మాండంగా జరిపారా సంవత్సరం తాలూకా యువకులంతా. ఆ ఉత్సవ యువ నాయకులలో పాముల రామారా వొకడు. ఉదయం రాత్రోలులో బైలు దేరిన ఊరేగింపు, కడలి చేరే టప్పటికి మిట్ట మధ్యాహ్నమయింది. ఎండ మండి పోతున్నది. గొంతు ఆర్చుకు పోతున్నది. ఊరేగింపు బ్రాహ్మణ వీధిని పోతున్నది. ఒక ఇంటి దగ్గర ఆపాడు రామారావు భీమన్నను. ఆరుగు మీద కూర్చున్నాడు భీమన్న. ఇంట్లో నుంచి వచ్చిన గృహస్థు కాంగ్రెసు నాయకుడు జగన్నాథం గారు!

ఆయన లోనికి వెళ్ళి చెంబుతో నీళ్ళు తెచ్చారు. గ్లాసు ఆరుగు మీద పెట్టారు. భీమన్న గ్లాసు తీసుకుని, నీళ్ళు త్రాగి, గ్లాసు అందిచ్చాడు. జగన్నాథం గారు అందు కోకుండా, ఆరుగు మీద పెట్ట మన్నారు. భీమన్న పెట్టాడు. బోర్లించ మన్నారు, బోర్లించాడు. దాని మీద నీళ్ళు చల్లారు. ఏవో కొద్ది కబుర్ల తర్వాత అక్కడి నుంచి కదిలి భీమన్న ఊరేగింపులో కలిసి పోయాడు.

ఆ సంఘటన భీమన్న మనస్సులో వుంది. ఆ జగన్నాథం గారే యీ జగన్నాథం గారు. తాము ఆ ఏదో వూరు వెళుతున్నప్పుడు, దారిలో దాని ప్రస్తావన వచ్చింది.

జగన్నాథం గారు కొంచెం ఉద్రేకం తెచ్చుకొని "మా బ్రాహ్మలే గనక ఈ ఆచారాలూ, కట్టుబాట్లూ అన్నీ సడలించుకొని, ముందుకు పోవడమే మొదలు పెడితే - అప్పుడు మీ మామా లంతా ఎక్కడ దుంటారు? మా పరుగు పట్టుకోగలరా? మీ చదు వెంత? సంస్కార మెంత?" అన్నారు.

"అంతే అంటారా?" నసిగాడు భీమన్న.

"అంతే" అన్నా డాయన.

"మామాల కంటె బ్రాహ్మలే ముందున్నా రంటారా? ఏ విషయంలో?"

"అన్ని విషయాల లోను."

"అలా కాదు. ఒక్కొక్క విషయమే తీసుకుందాం. చెప్పండి!" అన్నాడు భీమన్న —

జనాభాలో ? మామాలే అధిక సంఖ్యాలు .

రాజ కీయాలలో ? భూ స్వాముల , ధనికుల పలుకు బడిని తొలగిస్తే - మామాలదే రాజ్యం . కడలి పంచాయతీ ప్రెసిడెంట్ ఎవరు ? మట్టా స్వామి . భూస్వామి . ఆయన హరిజనుడు ! హరిజనులు ఆర్థికంగా స్వతంత్రులైతే , రాజ్యం వాళ్ళదే అన డానికి ఈ ఒక్క- నిదర్శనం చాలదా?

ఇక – సాంఘికంగా ?

మామాలలో బాల్య వివాహాలు లేవు . బాల్య వివాహాలు ఆవైదిక మైన టివి . ఈ బాల్య వివాహ దురాచారాన్ని తొలగించి , బ్రాహ్మలను మామాల స్థాయికి పెంచడానికి ఒక శారదా చట్టమే కావలసి రాలేదా ?

బాల్య వివాహాలు లేవు కనుక మామాలలో వితంతువు లుండరు . ఎవ ళ్ళైనా విధంతువు లైతే , పునర్వివాహ పద్ధతి వుంది . మరి బ్రాహ్మలలో ? ఆ మాత్రపు మానవత్వాన్ని కలిగించి , మామాల సరసకు బ్రాహ్మల్ని తేవడానికి ఒక వీరేశలింగమే కావలసి వచ్చె !

సాహిత్యం , సంస్కృతి , వేదాంతం వీటన్నిటినీ భారతీయ సమాజానికి ప్రసాదించిన వ్యాసుడు , వాల్మీకి హరిజనులే కదా ? ఋషుల పుట్టు పూర్వోత్త రాలను పరిశీలిస్తే - అందులో బ్రాహ్మణు డొక్కడైనా వున్నాడా ?

పేదరికం , విద్యలేమి - ఈ రెండే కదా మామాలకు గల బలహీనతలు ? ఇవి కేవలం లౌకిక మైన బలహీనతలు . సాంస్కృతికంగా , సాంస్కారికంగా భారత సమాజంలో మామాలే సనాతనులు , మామాలదే అగ్రస్థానం . మామాలే తలచుకొంటే ప్రస్తుత బలహీనతలు రెండూ చిటికలో మాయమై పోతై . అప్పుడు ముందుండే దెవరో , ఎవరి పరుగును ఎవరు పట్టుకోవలసి వస్తుందో ఆలోచించండి !

ఏముంది ఆలోచించడానికి ? మళ్ళీ మట్టాడలేదు జగన్నాధంగారు !

నీతికీ అవినీతికీ తేడా యేం లేదు
తనకు దక్కిన సుఖం నీతి
మరొకడికి దక్కిన సుఖం అవినీతి

—త్రిపదలు

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

ఉద్యోగ సర్గ

76. ముమ్మిడివరంలో శ్రీరాగం

1940 సెప్టెంబరు నెలలో భీమన్నకు తొలిసారిగా ఉద్యోగం వచ్చింది. ఆరోజుల్లో బి. ఇడి. వాళ్ళను మొదట సెకండరీగ్రేడు స్కూలులోనే నియమించే వారు. ముమ్మిడివరం బోర్డు మిడిల్‌స్కూల్లో టీజరు అయా డీయన ఎట్టకేలకు.

అక్కడ హెడ్మాస్టారు విభీషణరావుగారు, పరమ సౌమ్యుడు. ఆయన కాపు కులస్థుడు. తక్కినటీచర్లందరూ బ్రాహ్మలే. అందరూకూడ భీమన్నను ఎంతో గౌరవంగా చూచేవారు.

ఆ కాలంలోనే 'మాలలు రాజులౌదురు' అనే ఈయన పద్యాలు నవజీవనలో వచ్చాయి. హెడ్మాస్టారు ఆదిచూచి ఆనందపడిపోయి, టీచర్లందర్నీ సమావేశ పరచి, భీమన్న చేత ఆ పద్యాలను కావ్యగానం చేయించారు. ఈయన పద్యాలు చదివే తీరు నచ్చక, ఇలపకుర్తి గవర్రాజుగా రనే టీచరు పద్యాలను అందుకొని, అద్భుతంగా గానం చేశారు. బంగారు బద్దలా వుండేవాడాయన. కంఠం కంచువీణ. సంగీత నిధి. భీమన్నకు శ్రీరాగం, కాంభోజి, ధన్యాసి రాగ స్వరూపాలు పట్టుపడిందా గవర్రాజు గారి వద్దనే.

పండితారాధ్యుల నాగభూషణంగా రనే టీచరు 'ఆకాండ తాండవం కావ్యా' నికాపేరు పెట్టిందక్కడే.

ఇప్పుడు బాలయోగి ఆశ్రమం ఉన్న ప్రాంతం అనాడు భీమన్న కవితా విహార భూమి. అందుకే ఈయన స్వయంగా బాలయోగిని చూడకపోయినా "బాలయోగి" నాటకం అంత రమణీయంగా రూపొందగలిగింది.

స్కూలు చాల పెద్దది. విద్యార్థులలో ఎనభై శాతం మామూల పిల్లలే ఉండేవారు. ఆ చుట్టు పక్కల నాలుగైదు మైళ్ళ దూరం గ్రామాల నుంచి కూడ ఆ స్కూలుకే వచ్చే వారు. ఒక కోజున నాధరామస్వామి అనే మామూ విద్యార్థి క్లైం మించిపోయిందనే తొందరలో స్కూలు లోపలికి పరిగెడుతూ, గేటు మలుపులో ఎదురుగా వస్తున్న ఒక టీచరుకు తగిలాడు. ఆ కారణంగా అతణ్ని ఆ టీచరు చెంపలు వాయ గొట్టాడు.

"ఈ స్కూల్లో అస్పృశ్యత కారణంగా ఎవరికి ఎట్టి అవమానం జరిగినా, అది నాకు జరిగినట్టే", అని ఒక చీటీ వ్రాసి ఆ టీచరుకు పంపిం చాడు భీమన్న. వెంటనే ఆయన నుంచి జవాబు వచ్చింది. ఏదో అలవాటు చొప్పున అలా జరిగింది. పొరపాటే. క్షమించండి" అంటూ! ఆ టీచరే జయంతి స్వామి నాయనగారు. తర్వాత బాలయోగి భక్తుడైన కవి, రచయిత, వేదాంతి. ఆనాటి నుంచీ ఆయన భీమన్నతో ఎంతో కలసి మెలసి వుండేవాడు,

భీమన్నకు మాల, మాదిగ పదాలు సమానార్థకాలు, పర్యాయ పదాలు. మాల అన్నప్పుడు మాదిగ అని కూడ అర్థం, అయితే-

"మాలలు రాజు లౌదురు" అన్న పద్యంలో "ఒక్క మాలలనే పేర్కొన్నాడు, మాదిగలను వదిలేశాడు" అనే విమర్శ వచ్చిందట!

"బ్రాహ్మణుడు మొదల్ మాదిగ వాని వరకు
కష్టపడు వాడు పతివాడు కార్మికుండె"

అనే పద్యం (కూలిరాజు) కూడ విమర్శకు గురయిందట.

అందువల్లనే ఈ యిర్వురినీ కలిపి "మామా"లన్నాడు భీమన్న తర్వాత. ఆ పద్యంకూడ ఇలా మారింది.

కాలము మారిపోయె , కల
కాలము దాస్యము నిల్వబోదు , మా
మా లిక రాజులౌదురు సు
మా , ఇది నా ఋషి వాక్కు ; విప్లవ
జ్వాలలు రేగి జాతి నిజ
సత్వము కాల్పక ముందె-వేద భూ
హారికు లార ; పర్వ సము
లై నెలకొల్పుడు సామ్య ధర్మమున్ ;

మాలలో మాదిగ , మాదిగలో మాల ఇమిడి వున్నాయనే జ్ఞానం ఈ కూలాల యువకులకు రానంత కాలం వీళ్ళ గతి ఇంతే అంటాడు భీమన్న . రాజకీయ ఆర్థిక అభివృద్ధి ప్రధానం కాదనీ , సాంస్కృతిక చైతన్యం లేకుండా అభ్యుదయం లేదనీ అంటాడు .

77. అపోహలూ - అనారోగ్యాలూ

స్కూలుకు తూర్పుగా , రోడ్డు పై ఒక ఫర్లాంగు దూరంలోని పల్లె పాలెంలో వుండేవాడు భీమన్న - నక్కా చినరెడ్డిగా రనే ఒక ప్రాథమికోపాధ్యాయుడి యింట్లోని ఒక పోర్షనులో . ఆది కొబ్బరి తోటల ముసుగులో ఉండే ఒక మాలపేట . డాక్టర్ విజయ భారతి నడక నేర్చుకొన్నదా కొబ్బరి తోట ల్లోనే . మద్రాసు నుంచి నమ్మాళ్వార్ను పంపిన 'జానపదుని జాబులు' అప్పుడే అందాయి . వాటిని మిత్రులందరికీ పంచి పెట్టేవాడు భీమన్న .

ఆ కాలంలో భీమన్న మిత్రులు ఎక్కువగా కాంగ్రెసు సోషలిస్టులు . అందరు గ్రౌండులో ఉండేవారు . రకరకాల మారువేషాలతో తిరుగుతూ , వార్తలకు , భోజనాలకు నమ్మకమైన మిత్రుల యిండ్లకు వచ్చి పోతుండేవారు . అలాంటి వాళ్ళకు భీమన్న ఎక్కడుంటే అదొక స్థావరంగా వుండేది . భీమన్న స్వాతంత్రోద్యమంలో ప్రత్యక్షంగా చేరకుండా వున్న ముఖ్య కారణం ఇదే . పరోక్షంగా ప్రత్యక్ష వీరులకు తోడ్పడే బాధ్యతను స్వీకరించడం .

ముమ్మిడివరంలో ఈ రకం మిత్రులలో ముహీధర రామమోహనరావుగారు . ఆయనది ముంగండ అగ్రహారం . మార్క్స్ సిద్ధాంతాలను తెలుగు దేశానికి తొలిసారిగా అందజేసిన కుటుంబం అది . ఆయన అండరు గ్రౌండులో

వుంటూ , ఆ ప్రాంతాలలో తిరుగుతున్నప్పుడు , ఏదో ప్రైములో వచ్చి భీమన్న ఇంట భోజనం చేసి వెళుతుండేవాడు .

"మీ ఇళ్ళలో మాంసాదులే తప్ప , కాయగూరలు బాగా వండరేమో అనుకునేవాడిని . ఇప్పుడు మీ ఇంట్లో చేసినంత రుచిగా వంకాయ కూరను మా బ్రాహ్మలు కూడ చెయ్యలేరు" అన్నాడాయన ఒకరోజున భోజనం చేస్తూ . వాళ్ళు మెప్పుకోసం మాట్లాడే రకం కాదు . నిజంగానే వంట వార్పుల్లో , పెట్టు పోతల్లో నాగరత్నమ్మది అమృత హస్తం .

అక్కడ చేపలు చాల చవుక . అక్కడికి ప్రెంచి యానాం దగ్గర కనుక , విదేశీ సారాలు తేలికగా దొరికేవి . ఆదీ గాక తాను మఖాచికం పడి ఎంతో కాలం కాలే దనే సంగతే మరిచిపోయాడు భీమన్న . విశ్రాంతి లేదు . పత్యం లేదు . దానా దీనా ఆరోగ్యం చెడింది . అగ్నిమాంద్యం , అజీర్ణం , విరేచనాలు . ఫలితంగా బలహీనత , గుండె దడ , నిద్రలేమి . ఇంక ఎంతోకాలం ప్రతకడన్నంత నీరస మైపోయాడు కొద్ది రోజుల వ్యవధిలోనే . ఎన్నో మందులు - ఏదీ పని చెయ్యలేదు !

ఆదే సమయంలో జిల్లా విద్యాధికారి సలహా మేరకు , రాజమండ్రి వెళ్ళి ప్రభుత్వ ట్రైనింగు స్కూల్లో టీచరుగా చేరాడు . ప్రభుత్వోద్యోగంలో స్థిర పడవచ్చు ననేది వుద్దేశం . రాజమండ్రిలో వుండగా ధర్మన్న గారింట్లో ఉన్నాడు సకుటుంబంగా . తల్లి నాగమ్మగారుకూడ ముమ్మిడివరం నుంచీ కూడానే వుంది .

ధర్మన్నగారు వైద్యుడుకూడ . ఆయన వైద్యానికిగాని , రాజమండ్రిలోని ఏ డాక్టరుకు గాని భీమన్న వ్యాధి ఏమిటో అంతుచిక్కలేదు . మిషను ఆసుపత్రి దొరగా రొకాయన పరీక్షచేసి చూచి "బహుశా క్రానిక్ అపెండిసైటిస్ కావచ్చు. రక్తపరీక్ష చేస్తేగాని చెప్పలేను . అందుకు మూడు రూపాయ లవుతుంది" అన్నాడట . మూడు రూపాయలు లేక ఆ పరీక్ష చేయించుకోలే దీయన .

'ఆ దొర అందరికీ అలానే చెప్పుతాడు . అపెండిసైటిస్‌కి క్రానిక్కేమిటి? నీ కేజబ్బా లేదు . ఉప్పూ, కారం మాత్రం మానెయ్' అన్నారు మరికొందరు

డాక్టర్లు . ఉప్పూ, కారం మానెయ్యడంతో ఉన్న శక్తికూడ పోయి , మంచాన పడ్డాడు భీమన్న . గొల్లు మన్నా రంతా చుట్టూ చేరి .

అలాంటి స్థితిలో ఒకరాత్రి భీమన్నకొక కల వచ్చిందట . " ఈ నెల 23వ తేదీన భీమన్న మట్టయిపోతాడు " అని ఎవరో చెప్పిన ధ్వని వినిపించిం దట ఆ కలలో . కంగారు పడిపోయి వెంటనే బైలుదేరి కాకినాడ వెళ్ళిపోయాడు.

బహుశా అది 1941 , ఏప్రిల్ 21వ తేదీ . 22 , 23 , 24 తేదీలు కాకినాడ జగన్నాయకపురంలో తిరుపతి గారింట గడిపా డీయను . తిరుపతిగారు అప్పటి కకినాడ పోర్టు ఆఫీసులో ఉద్యోగి . ఆయనపట్ల ఈయన కెంత విశ్వాస మంటే ఆయన పక్కనవుంటే తనకేసి మృత్యువుకూడ కన్నెత్తి చూడజాల దన్నంత !

23వ తేదీని తిరుపతిగారు 24 గంటలూ ఈయనను అంటిపెట్టుకొనే వున్నారు . 24 రాత్రికి ఈయన తిరిగి రాజమండ్రి వచ్చేశాడు .

ఈయనవ్యాధి " న్యూరెస్తిటిక్ డిస్పెప్సియా "ఆట . నరాల బలహీనతవల్ల వచ్చిన అగ్నిమాంద్యం . విపరీతమైన భయాందోళనలు దాని లక్షణం .

వెలు గెక్కడి నుంచి వస్తున్నది?
ఆరి , ఎక్కడికి పోతున్నది?
అది ఎక్కడ నుంచీ రాదు
ఎక్కడికీ పోదు
అది అక్కడే వుంది!

—గుడిసెలు

78. ఆయు స్సిచ్చిన ఆయుర్వేదం

"నే నొకచోటికి తీసుకు వెళతాను, రండి" అన్నారు గెద్దాడ బ్రహ్మయ్య గారు-ఎందుకో రాజోలువచ్చి భీమన్న స్థితి చూచి. కాకినాడ రాంమోహన్ లాడ్జి చరిత్రలోని బ్రహ్మయ్యే ఈ బ్రహ్మయ్య . ఒకనాటి శత్రువే మరొకనాడు ప్రాణ రక్షకుడు కావచ్చు ననడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం .

ఇద్దరూ కలిసి కాకినాడ వెళ్ళారు. గాంధీనగరంలోని మునిసిపల్ ఆయుర్వేద వైద్యశాల అది. డాక్టరు చూశాడు. మాట్లాడలేదు. తన రోగుల్ని కొందర్ని చూసేసిన ఓ పదిహేను నిముషాలకు భీమన్న వద్దకువచ్చి, నాడిచూచి "ఫర్వాలేదు, బ్రతుకుతావు" అన్నాడు.

"మూడు రోజులలో గుణం కనుపిస్తుంది. ఆరు మాసాలలో తగ్గుతుంది" అన్నాడు. ఏవో పొట్లాలూ, కషాయాలూ ఇచ్చి, "పథ్యం ఖచ్చితంగా చెయ్యాలి. కంచం, మంచం విషయాలలో శతశాతం నిగ్రహం చూపాలి." అంటూ హెచ్చరించాడు.

మూడు రోజులలో గుణం కనుపించింది కాని, ఆరు మాసాలలో తగ్గలేదు. అందుకు కారణం నిగ్రహం తక్కువ కావడం కావచ్చు. పూర్తి ఆరోగ్యం చేకూరడానికి నాలుగు సంవత్సరాలు పట్టింది. మరి కొంత కాలంపాటు అశ్వగంధి లేహ్యం తిన మన్నాడు డాక్టరు. ఈయన ఆలక్ష్యం చేశాడు. ఏ రోగి లక్షణమైనా ఇంతే. రోగ తీవ్రతనా డుండే శ్రద్ధ ఆ తర్వాత వుండదు.

ఆ డాక్టరుగారి పేరు భళ్ళమూడి సూర్యప్రకాశ శాస్త్రి గారు. ఆ తర్వాత చాలకాలం వరకుకూడ ఈయనకు ఆయన సలహా లిస్తూనే వుండేవారు.

అక్కడ నెలా, ఇక్కడ రెండు నెలలు గా, సెలవు ఖాళీలలో పనిచేస్తూ చివరకు రాజోలు హైస్కూలుకు వచ్చాడు భీమన్న. ఆక్కడ కోట పాలయ్య గారు హెడ్మాస్టరు. భీమన్న విద్యార్థిగా వున్నప్పుడు టీచరుగా వున్న పాలయ్య గారే.

"భీమన్నగారూ" అని పిలిచా డట పాలయ్యగారు మొదటి రోజున.

'మీరు ఆలా పిలిస్తే నేను పలకను' అన్నాడు భీమన్న. అదేం అన్నట్టు చూశా డాయన. "మీరు పూర్వంలాగే ఒరే అని పిలిస్తే నాకు ఆనందంగా వుంటుంది" అన్నాడీయన. ఆయన ఒప్పుకోలేదు. "అప్పుడు విద్యార్థివి. ఇప్పుడు నాతో సమానుడివి" అన్నాడాయన. పాలయ్యగారు నిష్ఠానిధి అయిన సనాతన బ్రాహ్మడు. ఆర్య ధర్మసూక్ష్మం తెలిసినవాడు.

డాక్టరు పరిశీలనకోసం, మందులకోసం తరచు భీమన్న కాకినాడ వెళ్ళవలసి వచ్చేది. సెలవులు పెట్టవలసి వచ్చేది. పాలయ్యగారి వాత్సల్యమే తనయను కాపాడుకొంటూ వచ్చిందా గడ్డు రోజులలో.

79. మిఠాయి గంప

రాజోలు హైస్కూలులో భీమన్న ఉపాధ్యాయ వృత్తి నాలుగేళ్ళూ చాల ఉజ్జ్వలమైన ఘట్టం.

పాలయ్యగారి ప్రత్యేకాభిమానం అలా వుంచితే-తక్కిన సహోపాధ్యాయులంతా ఎంతో స్నేహంగా వుండేవారు భీమన్నతో. హెడ్మాష్టారి తర్వాత అంతటివాడూ, ఫస్టు అసిస్టెంటూ అయిన అగస్త్యరాజుగారు గొప్ప జ్ఞాని, సమర్థుడు – స్కూలు కార్యక్రమాలన్నీ ఆయనే చూసేవాడు. మరో సీనియరు అసిస్టెంటు లక్ష్మణరావుగారు ఏమీ పట్టించుకొనేవాడు కాదు. తెలుగు టీచరు సుందయ్యగారు గొప్ప పండితుడు. మరో తెలుగు టీచరు రాజగోపాలరాజు మంచి వాలీబాల్ ఆటగాడు. స్పోర్ట్సు పేరు చెపితే భీమన్నకు వచ్చిం దొక్కటే ఆట.

కొత్తలో కొంతమంది స్థానికులైన వాళ్ళు ఎడ మొఖంగా వుండేవాళ్ళట. ఆట్టివాళ్ళను దగ్గరచేసుకోవడం కోసం భీమన్న ఒక కిటుకు కనిపెట్టాడు. నశ్యం అలవాటు చేసుకున్నాడు. దానికోసం అందమైన ఒక డబ్బీ పెట్టాడు. నన్ను ముట్టుకోకు అనుకొంటూ దూరదూరంగా తిరిగే వాళ్ళంతా చేరువై పోయారు. ఈ కిటుకులో అస్పృశ్యత వదిలిపోయింది కాని, చాలా కాలంవరకు నశ్యం వదల్లే దంటా డీయన.

ఒకనాడు భీమన్న ఒక క్లాసులోకి వెళ్ళాడు. అదే కొత్తగా ఆ క్లాసుకి వెళ్ళడం. పాఠం ప్రారంభించాడు. ఒక కుర్రవాడు పదేపదే వెనక వాడితో మాట్లాడటం గమనించి భీమన్న ఉగ్రుడైపోయి, అతడివద్దకు వెళ్ళి పటపటా కొట్టాడు. క్లాసంతా చకితమై పోయింది. ఆ కుర్రవాడు కూడ కిక్కురుమన లేదు. పీరీ డైపోయింది. తనకు అసలు కోపం రాదనీ, పాఠం చెపుతున్నప్పుడు మాత్రం ఎవరైనా అల్లరి చేస్తే ఓర్చుకోలే ననీ ఆన్నాడు భీమన్న.

అప్పుడు చెప్పా రా క్లాసు కుర్రాళ్ళు - ఆ దెబ్బలు తిన్న రామారావు క్లాసుకు ఫస్టు అనీ, ఎన్నడూ అల్లరిచేసి ఎరగడనీ, ఇతణ్ణి పదేపదే డిస్టర్బు చేసిన వాడు ఆ వెనక బెంచీవా డనీ! అంతేకాదు - ఆ రామారావు రాజోలు సర్కిల్ పోలీస్ ఇన్స్పెక్టరు శోభనాద్రినాయుడుగారి కుమారు డట! ఏదైనా రభస అవు తుందేమో అనుకొన్నాడు భీమన్న. ఏమీ కాలేదు. అసలు ఆ విషయాన్ని రామారావు మరెవరితోనూ చెప్పినట్టుకూడ లేదు!

ఆ తర్వాత భీమన్న మరెవరినీ కొట్టకపోయినా, ఈయన క్లాసులు మాత్రం భయభక్తులతో మెలిగేవి. భయభక్తులతోపాటు, చనువు, గౌరవం కూడా వుండే వీయనపట్ల విద్యార్థులకు. అందుకు కారణం పాఠాలనుకూడా వినోదకరంగా చెప్పడం; పాఠం వద్దని క్లాసంతా కోరితే, పురాణ కాలక్షేపం చెయ్యడం.

ఒకరోజున భీమన్న క్లాసుకు వెళ్ళగానే ఆలవాటుప్రకారం క్లాసంతా లేచి కూర్చున్నారు. ఒక క్రొత్తమ్మాయి మాత్రం తలవంచుకొని నిలబడేవుంది. ఎంతచెప్పినా కూర్చోలేదు. తర్వాత తెలిసిం దేమిటంటే ఆ అమ్మాయి ఆ వూరికి కొత్తగా కాపురానికి వచ్చి, ఆ క్లాసులో ఆ రోజునే చేరిం దనీ, భీమన్నకు మరదలు అవుతుం దనీ! మరదలు బావగారిఎదుట ఎలా కూర్చుంటుందీ!

ఆ మరునాడుకూడ ఆ అమ్మాయి అలానే చేసింది. ఎంతచెప్పినా కూర్చో లేదు. అప్పుడు భీమన్న వెళ్ళి రెండు మొట్టి కూర్చో పెట్టాడు. అప్పటినుంచీ భీమన్నకు మొట్టికాయల మేష్టారు అనే బిరుదనామం ఏర్పడింది. ఇప్పటికీ ఈయనకు మొట్టే అలవాటు పోలేదు.

ఒకసారి స్కూలు ఫైనలు ట్రాన్స్లేషను పేపర్లు భీమన్న కిచ్చి దిద్ద మన్నారు పాలయ్యగారు. మార్కులివ్వడంలో పాలయ్యగా రెంత లోభో, భీమన్న అంత ఉదారుడు. ఆ సంగతి తెలిసే చాల కఠినంగా దిద్దమని చెప్పా డాయన. తదనుగుణంగానే దిద్దా డీయన. ఒక్కడికీ పేసుమార్కులు రాలేదు. "అమ్మ బాబోయ్, ఇంత కఠినంగా కాదు. మళ్ళా ఒకసారి చూడు" అన్నాడు పాలయ్య గారు. భీమన్న మరోసారి దిద్దాడు. ఒక్కడూ ఫెయిలు కాలేదు.

సాంస్కృతి కోత్సవాలు బాగా జరిగేవి స్కూల్లో. ఆ రోజుల్లో భీమన్నా, అగస్త్యరాజుగారూ వాటిని నిర్వహించేవారు. భీమన్న వ్రాసిన "మిఠాయిగంప"

అనే నాటికను విద్యార్థులు చక్కగా ప్రదర్శించారు. ఔరంగజేబు ఖైదునుంచి శివాజీ పారిపోయిన కథ అది. రచన, డైరెక్షను, ప్రొడక్షను కూడ భీమన్నే. ఆ నాటిక యిప్పుడు లభించడం లేదు.

ఆ నాలుగు సంవత్సరాలూ రాజోలు హైస్కూల్‌లో భీమన్న విద్యార్థులుగా వున్నవా రంతాకూడ జీవితంలో ఉన్నత స్థానాలను అందుకొన్నవారే. ఎంతో మంది డాక్టరేట్లు పొందారు. విదేశాలు వెళ్ళారు.

నిజానికి—
క్రిందనుంచి విరిసే దంతా
పైనుంచి కురిపిదే,
పైనుంచి కురిసే దంతా
క్రిందనుంచి విరిసేదే

—గుడిసెలు

80. పాలేరు ప్రథమ ప్రదర్శన

పల్లెటూళ్ళందే ఎక్కువగా రైతులకు, రైతు కూలీలకు సంబంధించి నట్టివి. రైతు కూలీలలో మెజారిటీ హరిజనులు. ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా, ఎన్ని లేబరు స్కూళ్ళు పెట్టినా, వీళ్ళలో విద్యాభివృద్ధి జరగడంలేదు. పల్లెటూళ్లు బాగుపడా లంటే, హరిజనులు బాగుపడాలి. హరిజనులు బాగుపడా లంటే విద్యావంతులు కావాలి. ఈ దృష్టితోనే ఈయన పాలేరు నాటకం వ్రాశాడు.

మొదట్లో వ్రాసినప్పుడు రైతులు, కూలీలు మాట్లాడే భాషను స్వేచ్ఛగా వాడేశాడు. బూతులు, బూతు సామెతలు కొల్లలుగా దొర్లాయి సంభాషణలలో. దానిని విన్న కొందరు యువకులు నాటకంగా ప్రదర్శించడానికి సిద్ధపడే టప్పటికి భీమన్న భయపడిపోయి, బూతుల్ని తొలగిస్తూ నాటకాన్ని మళ్ళీ వ్రాశాడు.

మోరిగ్రామంలో వినోద నాట్యమండలి అనే సంస్థను స్థాపించి, పాలేరు ప్రదర్శనకు పూనుకొన్నారు యువకులు. దానికి ఇంజేటి భీమయ్యగారు ప్రొడక్షన్ మేనేజరు. నల్లి మనోహరం హీరో వెంకన్న, నల్లి కుటుంబరావు హీరోయిన్ బాల, సంపదరావు టీచరు ఉపకారి. తక్కిన పాత్రధారుల పేరు

తిన్నగా జ్ఞాపకంలేవు భీమన్నకు. అందరూ ఆయా పాత్రలకోసమే పుట్టారా అన్నంత చక్కగా ఆతుకుపోయా రచ వాటికి. ఒక్క డైరెక్టరు వెంకటరత్నం గారు తప్ప, అందరూ హరిజనులే. వెంకటరత్నంగారు మాత్రం ఆ వూరివాడే, దేవాంగి కులస్థుడు.

రాజోలునుంచి మోరి రిహార్సలుకు గుర్రపుబండిలో వెళ్ళి వస్తుండేవాడు భీమన్న. ఆదివారాలు పూర్తిగా అక్కడే వుండిపోవలసి వచ్చేది.

తొలి ప్రదర్శనను మోరి గ్రామంలోనే వెయ్యా లనుకొన్నారు. గ్రామం మధ్యలో ఒక ఓపెన్ థియేటర్ వుంది. అక్కడ టిక్కెట్టు డ్రామా!

ఒక మాలవాడు, మాలవాళ్ళ ఇతివృత్తంతో వ్రాసిన నాటకాన్ని మాల వాళ్ళు అగ్రకులాల గ్రామం మధ్యలో టికెట్టు డ్రామా వేస్తారా? ఎన్ని గుండెలు వీళ్ళకి! వీళ్ళ అంతేమిటో తేల్చెయ్యా లనుకున్నారు సవర్ణులలో సనాతన రౌడీ వర్గం. ఇదొక పెద్ద దూమరం రేపింది ఆ చుట్టుప్రక్కల.

సాయంత్ర మయింది. అందరికీ భయంభయంగానే వుంది. చెరపడానికి చేటపెయ్య చాలు. ఏ ఒక్కడు అల్లరికి దిగినా, ఆ తర్వాత జరిగే కొట్లాటలో ఎవ రేమైపోయినా, నాటకం మాత్రం చెడిపోతుందికదా!

అయితే ఆ వూళ్ళోని కుందెం సత్యనారాయణగారి వంటి బలమైన యువకులు, డైరక్టరు వెంకటరత్నంగారి వర్గం, కమ్యూనిస్టులు, నాటకానికి అనుకూలంగా ఉన్నారు. కొందరి చేతుల్లో కర్ర లన్నై, బొడ్డున కఠా ర్లన్నై, జేబుల్లో కంకర రా ళ్ళున్నై. టికెట్లు విశేషంగా అమ్ముడుపోయాయి.

నాటకం ప్రారంభమైంది. తెర లేచింది. వెంకన్న పాత్రధారి 'బానిస తనమును బాపుమురా, భారతభూమికీ భాగ్యము తేరా—" అని పాట పాడుతూ ప్రవేశించాలి. ప్రవేశించాడు కాని, పాట అందుకోలేక పోయాడు. గొంతు పెగల్లేదు. చెమట్లు క్రక్కుకొంటూ తెరలోకి పారిపోయాడు. కిటకి ట్లాడుతున్న హాలు ఒక్కసారి గొల్లుమంది.

"కామందుల్ని చూచి భయపడ్డాడు, ఎంతైనా పాలేరు కదా, క్షమించాలి. ఇప్పుడే వచ్చేస్తాడు." అంటూ మేనేజరు క్షమాపణ చెప్పుకొన్నాడు. ఈలోగా వెంకన్నకు వేడి వేడి కాఫీ యిచ్చి, ధైర్యం చెప్పి, తిట్టి, స్టేజిమీదకు తోశారు. ఆ వేదిలో అతడు అద్భుతంగా పాడుతూ ఏక్టుచేశాడు. మొదటిపాటకే ఒన్స్ మోర్ వచ్చింది.

అప్పటినుంచి నాటకం మూడుగంటలసేపూ అద్భుతంగా జరిగిపోయింది. ఆనందంతో వూగిపోయారు ఆడియన్సు. జేబుల్లోని కంకరరాళ్ళను ఎక్కడి వక్కడే జారవిడిచేశారు. ఆ తర్వాత వారంలోపలే ఏదో పండుగ ఉండగా, అప్పు డీ నాటకాన్ని, అక్కడే, కోరి ప్రదర్శింపజేసుకొన్నారు అదే జనం!

ఇప్పటికీ భీమన్నని వదలకుండా వున్న ఉంగరం అప్పుడు ఆ వినోద నాట్యమండలివారు బహూకరించి నట్టిదే.

ఆ తర్వాత ఆ నాటకం అనేకచోట్ల, అనేకసార్లు ప్రదర్శింపబడింది. ప్రతి వూళ్ళోనూ ఈ నాటకాన్ని వెయ్యడంకోసం రెండేసి, మూడేసి సమాజాలేర్పడి, పోటాపోటీగా ప్రదర్శన లిచ్చేవారు. హరిజనులలో, ముఖ్యంగా వ్యవసాయ కూలీవర్గంలో అపూర్వమైన చైతన్యాన్ని, విప్లవాన్ని తెచ్చిందీ పాలేరు - తెలుగు దేశమంతా.

అప్పటికే 'జానపదుని జాబులు' కమ్యూనిస్టు వర్గాలలో మంచి ప్రచారంలో వుంది. పాలేరును తమ ప్రచురణగా వెలువరించడానికి ప్రజాశక్తివారు ప్రయత్నించారు. భీమన్నను అడిగారు. ఈయన ఒప్పుకున్నాడు. ప్రాతప్రతి యిచ్చాడు కూడ. తర్వాత కంభంపాటి సత్యనారాయణగారు చేసిన కొన్ని సూచనలకు ఈయన అంగీకరించనందున ఆ ప్రయత్నం ఫలించలేదు.

నాటకంలో హీరో వెంకన్న పాలేరుగా ఎన్నో కష్టాలుపడి, పోరిపోయి, విద్యావంతుడై, ప్రభుత్వంలో ఒక ఆఫీసరు అవుతాడు. అలాకాక ఒక ప్రజానాయకుడైనట్టు చూపమని కంభంపాటివారి సూచన. హరిజన సమస్య కేవలం వర్గసమస్యే కాదనీ, భారతీయ సమాజంలో గౌరవంగా బ్రతకడానికి తక్కిన కూలీలకున్న అవకాశం హరిజనులకు లేదనీ, విలక్షణమైన ఈ దుస్థితి తొలగా

లంటే హరిజన విద్యార్థికులు ప్రభుత్వంలో ఉన్నతాధికారులు కాకతప్ప దనీ భీమన్న వాదన. ఈయన కమ్యూనిస్టులతో భేదించడానికి ముఖ్య హేతు విదే. కమ్యూనిస్టుపార్టీ విఫల మయిండికూడ ఈ హేతువు వల్లనే - హరిజన సమస్యను అర్థం చేసుకోనందువల్ల.

ఒక రోజున ప్రజాశక్తి ఆఫీసునుంచి పాలేరు ప్రాతప్రతిని తీసుకుని, అప్పుడు బెజవాడకు వచ్చివున్న మూర్తిగారి వద్దకు వెళ్ళాడు భీమన్న. అక్కడే దేశ కవితా మండలి అధినేత బొందలపాటి శివరామకృష్ణయ్య కలిశాడు. తాను ప్రకటిస్తానని భీమన్న నుంచి ఆ ప్రాతప్రతిని తీసుకొన్నాడు. అది అక్కడే ఎన్నో ముద్రణలు పొంది, అయనకు ధనాన్ని, ఈయనకు కీర్తినీ ఆర్జించి పెట్టింది.

ఆకటి బాధకు అల్లాడెదవా?
బానిసవై బ్రతికెదవా?
ఈ విశాల విశ్వంలో మరియొక
త్రోవయె కనబడదా?
పగల గొట్టు నీ భిక్షా పాత్రను
తెగద్రెంపుము నీ శృంఖలము,
అభ్యుదయముతో, ఆశాగతిలో
అడుగిడి సాగుము, వీరా!

—పాలేరు

81. అగ్రహారంలో హరిజన టీచరు

చెల్లెలు ద్రౌపది రాజమండ్రిలో హయ్యర్ గ్రేడ్ ట్రైనింగు పాసై, జిల్లా బోర్డు స్కూలులో టీచరుగా చేరింది - రామచంద్రపురం తాలూకాలోని వూలపల్లి గ్రామంలో. దూరమూ, తెలియని స్థలమూ కనుకు, కూతురుకు తోడుగా నాగమ్మ గారు వెళ్ళారు. వెళ్ళిన కొద్ది రోజులకే అక్కడ ఆమెకు కలరా సోకింది.

టెలిగ్రాం అందుకుని, పల్లయ్య గారు అక్కడికి వెళ్ళేటప్పటికే ఆమె చనిపోయింది. తర్వాత ద్రౌపదిని అక్కడి నుంచి టాన్స్ఫరు చేయించి,

మామిడికుదురు ప్రక్క గ్రామానికి తీసుక వచ్చేశారు. ఆ ప్రక్క గ్రామం పెద పట్నం. అది బ్రాహ్మణాగ్రహారం.

ఒక మాల పిల్ల టీచరుగా వచ్చిం దనే టప్పటికి అగ్రహార మంతా గగ్గో లెత్తి పోయారు. బ్రాహ్మణ పిల్లల్ని బడికి పంపడం మానేశారు. ద్రౌపది మాత్రం క్లైంకు బడికి వెళ్ళి ఏదో చదువుకొంటూ కూర్చుని, క్లైం అయిపోగానే ఇంటికి వచ్చేసేది. ఇల్లు ఆ సమీపంలోనే - దాకే వెంకన్న గారిది. స్థానిక హరిజనులలో ఆయన అగ్రశ్రేణిలోవాడు.

ఆ గ్రామం బ్రాహ్మణ కుర్రవాళ్ళు చాలమంది రాజోలు హైస్కూలుతో చదువుతుండే వాళ్ళు. భీమన్నను బాగా ఎరుగుదురు.

'అక్కడ భీమన్న వద్ద మేం చదవడం లేదా? ఇక్కడ భీమన్న చెల్లెలు దగ్గర మన పిల్లలు చదివితే ఏం పోతుంది?" అని వాదించే వారు వాళ్ళు. అయినా వినకుండా, అక్కడి పెద్దలు కొందరు ఆమెను బదిలీ చేసి వెయ్యమని కోరడానికి కాకినాడ వెళితే, వాళ్ళకు అక్కడి అధికారులు నీతి బోధ చేసి పంపించారు. అందుకో అప్పుడు జిల్లా విద్యాధికారిగా ఉన్న తారకంగారు అక్కడి బ్రాహ్మడే. కుల వ్యవస్థపై ఎదురు తిరిగి, బ్రహ్మ సమాజంకో చేరి, తల్లితో కూడ విరోధ పడి, వెంకటరత్నం నాయుడిగారి పెంపుడు బిడ్డయైన సగుణమ్మ అనే హరిజన బాలికను పెండ్లాడిన వీరయోధు డాయన. ద్రౌపదిని కన్న కుమార్తెలా చూచుకొనే వారా దంపతు లిద్దరూ.

పెద్దల పరిస్థితి ఆలా వుండగా, ద్రౌపది వేష భాషలను. వినయ వినమ్రతలను గమనించిన బడి పిల్లలే ఒక రొకరుగా స్కూలుకు హాజరు కాసాగారు. ఆ తర్వాత ఆమె అక్కడి వారందరికీ ఎంతో ప్రేమ పాత్రురా లయింది. ఆమె కెప్పుడైనా ట్రాన్స్ఫరు వస్తే, అక్కడి పెద్దలే వెళ్ళి కాన్సిలు చేయించుకు వస్తుండేవారు. పరస్పరావ గాహనే అన్ని విభేదాలకూ పరమౌషధం అని నిరూపించిన ఉదంతం అది.

తల్లిగారికి కర్మ చెయ్యలేదు భీమన్న. పల్లయ్యగారు మౌనంగా వుండి పోయారు.

తన తల్లి గంగమ్మగారి అంత్యక్రియలు, దిన వారాలు ఎంతో గొప్పగా జరిపించి వున్నారు పల్లయ్యగారు. ఆ ఊరేగింపులు, భజనలు, పలావులు, పంక్తి భోజనాలు, హరికథలు - అన్నీ జ్ఞాపకం వున్నాయి భీమన్నకు. ఆ పెద్ద కార్యం అక్షరాలా పెద్ద కార్యమే. అప్పటి పల్లయ్య గారి ఆర్థిక స్థితి కూడ మంచి ఉచ్ఛలో వుంది. భీమన్న తన తల్లి నాగమ్మగారికి కనీసం దినం కూడ చెయ్యలే దంటే - మరణానంతర జీవితంలో ఈయనకు కించిత్తు కూడ నమ్మకం లేకపోవడమే అందుకు కారణం.

"జీవించి ఉండగానే ఏ సుఖాలైనా, మరణించిన తర్వాత మరేమీ ఉండదు. ఏదైనా వున్నా. ఆది ఈ పిండం మెతుకులకు ఆశించేదై ఉండదు. అంత్యక్రియలూ, శ్రాద్ధ కర్మలూ అన్నీ వట్టి సాంఘిక క్రియలు" అంటా డీయన. వట్టి అంధ యుగపు మూఢా చారాలు అంటాడు.

మానవ సంఘ నిర్మాణమ్ము లోన
ప్రథమ సోపానమ్ము పశు లోకమందు
తుది మెట్టు విపుల విద్యుల్లోకమందు
కలవు, ఈ మధ్యలో కలవెన్నో మెట్లు.
పశులోక మందుండి పరమాత్మ వరకు
అన్ని మెట్టుల మీద నున్నారు ప్రజలు.
మౌఢ్యాంధ కారాబ్ధి మగ్నమై యున్న
పామర లోకపు ప్రజలకు నెల్ల
అరుణోదయపు కాంతి నావంత బరపి
అవధూత్మ! చూపింపు మయ్య పై మెట్టు!

— మధు కాల

82. కాళ్లు గుంజిం దెవరు?

తల్లి చనిపోయిన కొద్ది నెలల తర్వాత రామచంద్రపురం వెళ్ళవలసి వచ్చింది భీమన్న-స్కూలు ఫైనలు పబ్లికు పరీక్షలలో ఇన్విజిలేటరుగా. అక్కడ వాడపల్లి గారి ఆశ్రమం ఈయనకు స్వగృహం లాంటిదే. అక్కడ స్థానికులైన రొక్కం నరసింహం గారు, గొల్లపల్లి సామ్యాలుగారు ఈయన బంధుమిత్ర

కోటిలోని వారు. వారి అమ్మాయి జానకీబాయి శాస్త్రీయ సంగీతంలో నిధి. వారు కాక భీమన్నకు చిన్నప్పటినుంచీ సహాధ్యాయి అయిన బడుగు వెంకట రెడ్డిగారికి అప్పటి కక్కడే ఉద్యోగం. ఈ అందరకూ అతిథి భీమన్న.

ఒక సాయంత్రం-వూల పల్లికి చెందిన ఒక విద్యార్థితో కలసి, అద్దె సైకిలు తీసుకొని, ఆ వూరికి బైలుదేరాడు భీమన్న-తల్లి తనువు చాలించిన గ్రామం ఎలా ఉంటుందో చూడా లనిపించి. వూలపల్లి చేరేటప్పటికి చీకటి పడింది. ఆ వూళ్ళో ఉపాధ్యాయులైన తూడి వెంకన్నగా రింటికి వెళ్ళాడు సరాసరి. ఆయన ఉపాధ్యాయుడే కాక, ఆ ప్రాంతాలలో ప్రఖ్యాతి గాంచిన హరిజన నాయకుడు. వాళింట్లోనే ద్రౌపది ఉండేది. వారి అమ్మాయి లక్ష్మీదేవికీ, ద్రౌపదికీ మంచి స్నేహం.

భీమన్న మాటలు విని, కంఠ స్వరాన్ని బట్టి, ద్రౌపదే వచ్చిందను కొన్నారట అక్కడి వారంతా! ఎంతో సంబర పడ్డారు భీమన్నను చూచి.

మర్నాడు ఉదయం ఆరు గంటలకే తిరిగి రామచంద్రపురం బయలుదేరాలి కనక, అప్పుడే తల్లి సమాధిని చూడా లన్నాడు భీమన్న. వెంకన్నగారూ, మరో పదిమందీ హరికేన్ లాంతర్లు పట్టుకొని బైలుదేరారు తుల్యభాగకు.

తుల్యభాగ! అవును - సప్త గోదావరులలో అత్యంత పవిత్రమైన నదీమ తల్లి! వైనతేయం గర్భాన పుట్టి, తుల్యభాగ గర్భంలో కలిసి పోయింది తన తల్లి!

"ఎంతో పుణ్యంచేసుకుంటే తప్ప తుల్యభాగలో తనువు చాలించడం జరగదు." అన్నాడు వెంకన్నగారు. అందుకోసమే ఆవిడ యిక్కడకు వచ్చిం దన్నారందరూ.

అప్పటికే తుల్యభాగ నదీ గర్భంలో వెలుకుతున్నారు వాళ్ళు. ఎక్కడో గాని సీళ్ళు లేవు. ఆ మధ్యలో వరదలు కూడ వచ్చి పోయాయి నదికి. అంతా చీకటి. లాంతర్లే గాని మనుషులు కనుపించడం లేదు!

చాలసేపు తిరిగిన తర్వాత-భీమన్న ఒకచోట నిలబడి పోయి, చేతికోని లాంతరు క్రింద పెట్టి, ఆక్కడే కూర్చుండి పోయాడు. కాళ్ళు భూమికి ఆనుక్కు పోయిన ట్లైపోయాయి. చాల నీరసమై పోయింది.

అటూ, ఇటూ పోయిన లాంతర్లన్నీ ఈ చీకట్లో గుర్తించడం కష్టం అనుకుంటూ, భీమన్న దగ్గరకు వస్తూనే - ఒక్కసారిగా అన్నారందరూ "మీరు కూర్చున్నదే మీ తల్లిగారి సమాధి" అని !

83. మూడు రోజుల హెడ్మాస్టరీ

రాజోలులో ఒక రోజున సాయంకాలం, హెడ్మాష్టారు రమ్మంటున్నా రంటే, వెళ్ళాడు భీమన్న ఆయన గదికి.

"నీకు ప్రమోషను ఇస్తూ నగరం హెడ్మాష్టరుగా వేశారు. రిలీవింగు ఆర్డరు ఇప్పుడే ఇస్తాను, రేపు ఉదయం వెళ్ళు" అన్నాడు పాలయ్య గారు సంతోషపడుతూ. "నెల రోజుల ఖాళీ అయినా, యిక మూడు రోజులే ఉంది. పర్వాలేదు, వెళ్ళి వచ్చేయ్. మూడు రోజుల తర్వాత ఇక్కడే జాయిను అవు" అన్నా రాయన, తలెత్తగల కొన్ని సందేహాలను ముందే తీర్చేస్తూ.

మర్నాడు ఉదయం సైకి లెక్కి భీమన్న మామిడికుదురు వెళ్ళాడు. విషయం తండ్రి విని, "ఎంతో మంచి మాట చెప్పావు. ఇంట్లో ఏమీలేదు. కల్లు తీయించి పెట్టాను. ఆది మన సారాతాడిది. కొంచెం తాగివెళ్ళు" అన్నా డట, పొంగుతున్న కల్లు కుండ మీది నుంచి తాటాకు మూతతీస్తూ, పల్లయ్య గారు.

ఒక్కొక్క తాడికల్లు సారా అంత నిషాగా ఉంటుందట. పశువులకు, పెంపుడు జంతువులకు వలెనే చెట్లకు కూడ రూపగుణాలను బట్టి పేర్లుంటాయి. తమ పాతింటి మెరకనే ఒక చిన్న కుటీరం వేసుకొని, ఒక్కడూ వుంటున్నాడు పల్లయ్య గారు. బుద్ధి పుడితే స్వయంపాకం చేసుకొంటాడు. లేకపోతే వట్టి కల్లుతాగి పడివుంటాడు. మొదట్లో ఆహార నియమం ఉండేది. విధి నిషేధా లుండేవి. భార్యపోయిన తర్వాత - కొంత సాగకా, కొంత అనాసక్తతవల్లా, అన్నీ వదిలేసి కేవల నిర్లిప్తుడుగా ఉంటున్నారు.

అప్పటికి అర్జునుడు కూడ ఒక ప్రైవేటు స్కూలులో టీచరుగా స్థిర పడ్డాడు. పల్లయ్య గారి సంతానం నలుగురూ వేదాంతం బాగా ఒంట బట్టిన

వాళ్ళే . ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతుకు తున్నారు . ఆయన మరెక్కడికీ వెళ్ళడు. ఎక్కడా వుండడు . స్వగ్రామంలోనే వుంటున్న చిన్న కొడుకు ఇంట్లో కూడ తినడు . అంతా వైరాగ్యం , తురీయాశ్రమం . కల్లే తేలికైన ఆహారంగా కను పించిం దాయనకు . అతిథులకు కూడ అదే .

"వద్దులే" అన్నాడు భీమన్న , "ఇప్పటికే మాలాడు హెడ్మాష్టరుగా వచ్చాడని ఏడుస్తూ వుంటారు . ఇక - కల్లుతాగి వెళితే "

"ఏ మవుతుంది ?" అన్నారు పల్లయ్య గారు . "కొచెం హుషారుగా వుంటుంది ; కొద్దిగా వుచ్చుకో . వాసన కొట్ట కుండా జామి ఆకు నములు !" అన్నారు – భీమన్న ముఖంలోకి చూస్తూ .

భీమన్న నవ్వేసి , సైకిలెక్కేసి , ఊళ్ళోకి వెళ్ళాడు . ఊళ్ళోని మిత్రులు , పెద్దలు , కొంతమంది టీచర్లు ఈయనను ఎంతో అభినందిస్తూ - స్కూలు ఎంత అధ్వాన్న స్థితిలో ఉన్నదో వివరించి , కాస్త బాగు పరిచి వెళ్ళమని కోరారు .

తాను చదివిన స్కూలుకే తాను హెడ్మాస్టరు కావడం , తనకు చదువు చెప్పిన టీచర్లే (కొందరు) తనకు అసిస్టెంట్లు అవడం ఒక అవ్యక్త మధురానుభూతి . అట్టి పాత టీచర్లకు వినయ విధేయతలతో ప్రొక్కాడు భీమన్న . క్రొత్త హెడ్మాస్టరు వచ్చాడన్న సంగతి అంత వరకు ఎవరికీ తెలియదు . ఆర్డరు ఆ ఉదయమే అందింది నగరానికి . అందువల్ల స్కూలులో ఈయన ప్రవేశం ఆశ్చర్య జనకమయింది అందరికీ , ముఖ్యంగా టీచర్లకు .

స్కూలు ఉదయం పదిన్నరకు ప్రారంభం కావాలి . ఆ టైంకు పచ్చిన టీచర్లు ఆయిదారుగురు మాత్రం . మరో పదిహేను నిమిషాల వరకు చూచి టీచర్ల అటెండెన్సు రిజిష్టరు తీసికొని , మేడమీద తన గదికిపోయి కూర్చున్నాడు భీమన్న . స్కూలు ఎంత ఘోర స్థితి లోఉందో ఏవరించా డొక టీచరు . ఆయన పళ్ళావరుల మృత్యుంజయ శర్మగారు .

టీచర్లతో రెండు మూడు పార్టీలట . నిత్యం కొట్టుకు చస్తూ వుంటారట . చదువు చెప్పరట . వేళకు రారట . కొందరు వారాని కొక రోజు వచ్చి మొత్తం అన్నిరోజుల సంతకాలూ చేసేసి పోతారట . హెడ్మాస్టారును లెక్క-

చెయ్యరట. కొందరు కొందరు టీచర్లు తమకు పై అధికారుల అండదండ లున్నా యని చెప్పుకొంటూ, దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ ఉంటారట! తన జీతం, తన పదవి భద్రంగా వుంటే చాలను కుంటాడట హెడ్మాస్టరు!

"మీ రాక గురించి ముందే తెలియక పోవడం మంచి దయింది. గమనించి చూడండి. మీకే తెలుస్తుంది" అన్నారు శర్మగారు. ఈలి స్వామినాయుడు, కటకంశెట్టి వీరాస్వామి గార్లకు మిత్రుడు శర్మ. నిజాయితీ గల టీచరు, పాపం!

ఒక్కో మనిషికి ఒక్కో కోరిక ఆత్మ
అది తీరడమే ఆతడి ఆనందం
కోరికను చంపుకొన్న వాడు మహాత్ముడు
కోరికను తీర్చు కొన్న వాడు మహాశ్వుడు:

—టుమ్రీలు

84. మాలోడు కాదు, హెడ్మాస్టరు

పదకొండు గంటలకు ప్యూను వచ్చి, అటెండెన్సు రిజిస్టరును క్రిందికి తెమ్మంటున్నా రన్నాడు. వాళ్ళనే పైకి రమ్మను అన్నాడు భీమన్న. వినయంగా వచ్చి ఒక్కొక్క టీచరూ సంతకాలు చేసి పోతుంటే, క్లైం నోటు చెయ్యమన్నాడు. పన్నెండు గంటలకు క్రింద కేకలు వినిపించాయి. కాసేపటికి ఒక వ్యక్తి సరసరా పైకి వచ్చి, భీమన్న వంక చూడకుండానే రిజిస్టరు లాక్కొని, పేజీలు తిప్పసాగాడు.

"అయ్యా! కొంచం ఆగండి. మీ రెవరో నాకు తెలియదు. కూర్చోండి" అన్నాడు భీమన్న, రిజిస్టరును తన చేతిలోకి తీసుకొంటూ.

"నువ్వెవరో నాకూ తెలియదు" అన్నాడాయన దురుసుగా.

పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటుందని వూహించలేదు భీమన్న. దిగ్భ్రాంతుడై పోయాడు. వెంటనే ప్యూనును పిలిచి "శర్మగార్ని" పిలు అన్నాడు.

శర్మ అన్న పేరు వినగానే ఆగంతకుడు కొంత తికమకపడి "ఆ చండాలు దప్పుడే నీ దగ్గర చేరాడూ" అన్నాడు. ఆని "ఇలాంటి పద్ధతి మాకు లేదు" అన్నాడు. ఏ పద్ధతో తెలీదు. "ఇది వరకు లేకపోవచ్చు. ఇప్పుడు వచ్చింది" అన్నాడు భీమన్న. "నీ వెవడవు తేవడానికి?" అన్నా డాయన.

ఇక భీమన్న సహించ లేక పోయాడు.

"అయ్యా! రామయ్యగారూ! నేను మీరు అంటుంటే, మీరు నివు అంటూనే వున్నారు. హెడ్మాస్టర్ని గౌరవించా లన్న జ్ఞానం కూడ లేని మీకు ఉపాధ్యాయుడుగా వుండే అర్హత వున్న దంటారా? మాలవాణ్ని గౌర వించక్కర లే దను కొంటున్నారేమో! ఇప్పుడు మీ ఎదరున్నది హెడ్మాస్ట రండీ! హెడ్మాస్టరు!" అన్నాడు.

"నేను తలుచు కొంటే హెడ్మాస్టరీయే కాదు, ఉద్యోగమే ఊడ పీకిం చేస్తా" అన్నాడు రామయ్యగారు కళ్ళెర్ర జేసి.

"నా ఉద్యోగం మీ చేతుల్లోనే ఉంటే-అది వుంటే ఎంత, వూడితే ఎంత? ఏ మనిషి భవిష్యత్తూ మరో మనిషి చేతిలో వుండదండీ, మాస్టారూ! కావలిస్తే భగవద్గీత చదవండి తెలుస్తుంది. ఇంతకూ, మీరు సంతకం చేస్తారా? వెళ్ళి పోతారా?"

'రిజిస్టరు కిందకు తీసుకెళ్ళి చేస్తాను'

"అంటే నిన్నటి, మొన్నటి సంతకాలు కూడ చేసేస్తా రన్నమాట. అదేం కుదరదు. నేను కోట పాలయ్య గారి శిష్యుణ్ని. అక్రమాన్ని సహించను. ఆ రెండు ఖాళీలలోను చుక్కలు పెట్టాను. ఇవాళ కాలంలోనే క్రైం వేసి సంతకం పెట్టండి"

ఏం చెయ్యాలో తెలియ లేదు రామయ్య గారికి. తన వురుము లన్నీ ఒక్క చినుకై నా కురవలేక పోయాయి. ఉడుకు బోతు తనంతో వూగి పోతూ, కలం తీసి, రిజిస్టరు లాగుకోబోయాడు.

ప్రమాదం గుర్తించిన వెంటనే భీమన్న రిజిస్టరు అదిమి పట్టుకొని, తెరిచి, రామయ్య గారి పేరు ఎదర సంతకం చెయ్యకుండా వున్న ఆ ముందు రెండు గళ్ళలోనూ "ఫౌండ్ అన్ సైండ్" అని ఎర్ర సిరాతో వ్రాసి, దాన్ని ముందుకు తోశాడు. ఆయన దబ దబా కిందకు వెళ్ళిపోయాడు. అంతే, మళ్ళీ కనుపించ లేదు.

కింద టీచర్లు, విద్యార్థులు ఒకటే ఉత్సాహంగా వున్నారు. శర్మగారు మెల్లగా పైకి వచ్చి "ఇంత కాలానికి అతగాడి పాపం పండింది. ఈ స్కూలు దుస్థితి కంతకూ ఆతడే మూల కారణం" అన్నారు. అసలు దొంగే దొరికే శాడు. ఇక పర్వాలే దన్నారు ఆ తర్వాత స్వామి నాయుడు వంటి మిత్రు లందరూ.

ఆ సాయంత్రం భీమన్న రాజోలు వెళ్ళి, పాలయ్య గారికి కనుపించగానే నా శిష్యుడ వనిపించావు. నాకు చాల సంతోషంగా వుంది అన్నాడాయన. అదేదో ధర్మవ్యాధుడి కథలా అగుపించింది భీమన్నకు. నగరం ఉదంతం ముందుగా పాలయ్యగారి కెలా తెలిసి పోయింది?

జరిగిం దేమి టంటే —

భీమన్న వద్ద మతి పోగొట్టుకొన్న రామయ్య, నగరంలో బండెక్కి సరాసరి పాలయ్యగారి కాళ్ళపై పడ్డాడట. జరిగిం దంతా చెప్పాడట. "మీ శిష్యు ణ్ణంటున్నాడు. మీరే నన్ను రక్షించాలి" అంటూ వాపోయాడట. రామయ్య ఎలాంటి దుష్టుడో పాలయ్య గారికి తెలుసు.

"చివరికి అతడి చేతిలో పడ్డావన్న మాట!" అంటూ పాలయ్య గారు నవ్వి, "నా వద్దకు రావడం మంచి దయింది. నేను చెప్పినట్టు చెయ్యి. నీకేం పర్వాలేదు" అని వెంటనే ఒక డాక్టరు సర్టిఫికెట్టు ఇప్పించి, అంతకు రెండు రోజుల ముందు డేటు నుంచి మెడికల్ లీవు పెట్టించారు. ఇక ముందై నా బుద్ధిగా మసలు కోమని హెచ్చరించి పంపారు.

పాలయ్య గారు ఈ వివరాలు భీమన్నకు చెప్పి, "ఈ పరిస్థితిని బాగానే హాండిల్ చేశావు. ఆ బ్రాహ్మణ్ని ఇక వదిలెయ్. శర్మను కూడ పూర్తిగా

నమ్మకు . ప్రతివాడి ప్రవర్తన వెనకా ఏదో ఒక స్వార్థం వుంటూనే వుంటుంది " అంటూ ఉపదేశం చేశారు .

ఆ మర్నాడు ఉదయం భీమన్న పది గంటలకు నగరం వెళ్ళేటప్పటికి , టీచర్లందరూ అప్పటికే హాజరై వున్నారు . క్లాసులు వరద గోదావరిలా నడిచినై . విద్యార్థులు ఆనంద భరితులయ్యారు . గ్రామ పెద్దలు ప్రశంసలు కురిపించారు . తమ సెలవును పొడిగించుకొని , భీమన్న మరికొంత కాలం అక్కడ కానసాగే అవకాశం కల్పించ వలసిందిగా సెలవు పెట్టి వున్న హెడ్మాస్టార్ని అంతా వెళ్ళి కోరారు , కాని- ఆయన వినలేదు .

మూడో రోజు సాయంత్రమే చార్జి ఇచ్చేసి , భీమన్న తిరిగి రాజోలులో జాయిన్ అయాడు .

స్వార్థము నణంప , మరు విమిషమ్మ్లోన
జీవి వశియించు , సృష్టి నశించి పోవు ;
కొమ్మ ! నీ కొర , కాత్మ దేశమ్ము కొరకు ,
ఆఖిల విశ్వమ్ము కొరకు పోరాడ లెమ్ము !

— మధు గీత

85 . ఆంధ్రయూనివర్సిటీ సెనేటు

"ఆంధ్రయూనివర్సిటీ సెనేటుకు మిమ్ము నామినేటు చేస్తున్నాం . అంగీకారం తెలియజెయ్యండి" అంటూ మద్రాసు గవర్నరుగారి నుంచి ఒక లేఖ అందుకొని , విభ్రాంతు డయ్యాడు. భీమన్న . అది 1941 .

కొమ్మూల సత్యనారాయణగారు రాజోలులో ఒక ప్రసిద్ధుడైన లాయరు . ఆయన చంద్రయ్యగారికి , తద్వారా భీమన్నకు చాలా మిత్రుడు . సాహిత్య ప్రియుడు , పండితుడు . ఎవరికి ఏ సమస్య ఏర్పడినా ఆయన సలహా చెప్ప వలసిందే . తరచు భీమన్న కావ్యగానాలు వారింట్లోనే జరుగుతుడేంవి . ఆ పూళ్ళో అదొక భువన విజయం అనవచ్చు .

తన 'మధుబాల' కావ్యాన్ని భీమన్న మొట్టమొదట పండిత గోష్ఠిలో చదివి వినిపించిందక్కడే.

గవర్నరు గారి లేఖకు జవా బెలా ప్రాయాలో తెలియక భీమన్న సత్య నారాయణ గారి వద్దకు, అక్కడి నుంచి పాలయ్య గారి వద్దకు తిరిగి, వారి సలహాపై ఏదో ప్రాసే శాడు. తన పేరు అంత దూరం ఎలా వెళ్ళిందో చాల సంవత్సరాల వరకు భీమన్నకు తెలియలేదు.

వ్యష్టి సత్యాగ్రహ సమయంలో పళ్ళంరాజు గారు అరెస్టు కాగా, ఆ స్థానంలో ఆరుమిల్లి వెంకటరత్నం గారు జిల్లాబోర్డు ప్రెసిడెంటు అయినప్పుడు, ఆయన సూచించాడట భీమన్న పేరు. అంతటి ఉత్తముడు వెంకటరత్నం గారు.

అదే సమయంలో కుసుమ ధర్మన్న గారు కూడ సెనేటు మెంబరైనారు. మొదటి సమావేశంలోనే రిజిస్ట్రారు పదవికి ఎన్నిక జరిగింది. డాక్టర్ సి.ఆర్. రెడ్డిగారు వైస్ చాన్సలరు. ఆయన కబుర్ల సందర్భంలో "మీ వోటు మాదే కదా" అవి ధర్మన్న గారితో అని, భీమన్న కేసి ఒక చిరు నవ్వు మాత్రం పారేశారట. ఈయన ముతక ఖద్దరు బహుశ ఆయనకు గిట్టి ఉండదు.

ఆ కాలంలో యూనివర్సిటీ రిజిస్ట్రారు పదవికి కూడ ఎన్నిక జరిగేది. ఆనాటి అభ్యర్థులిద్దరు. సి. నరసింహం గారు కాంగ్రెసు అభ్యర్థి. సెనేటులో కాంగ్రెసు పార్టీ నాయకుడు పళ్ళంరాజు గారు. కూర్మా వేణుగోపాలస్వామి గారు వైస్ చాన్సలరు రెడ్డిగారి అభ్యర్థి. అంటే జస్టిస్ పార్టీ అభ్యర్థి అన్నమాట. సెనేటులోని ఇద్దరు హరిజన సభ్యులలోను ధర్మన్న రెడ్డిగారి పక్షం, భీమన్న రాజు గారి పక్షం! నాలుగు వోట్ల మెజారిటీతో గెల్చారు రెడ్డిగారు. గోపాల స్వామి గారు రిజిస్ట్రారు అయ్యారు. నరసింహంగారు ఆ తర్వాత ఆంధ్ర ప్రభుత్వంలో సెక్రటరీ అయ్యారు.

"హరిజనులలో ఇద్దరు సెనేటర్లే కలిసి వోట్లివ్వలేక పోయారు కదా? ఏ పార్టీలకు చెందిన హరిజన శాసన సభ్యులైనా సరే అంతా కలిసి ఒక ప్రాటిపై నడవా లంటూ ఉపన్యాసా లిస్తా రెందుకు?" అని అడిగితే భీమన్న ఇలా అంటాడు –

"సాధారణ సమస్యల విషయంలో మొత్తం జాతి అభ్యుదయమే లక్ష్యం కనుక, ఎవరి పార్టీ సిద్ధాంతాలను బట్టి వారు నడుచుకోవచ్చు. హరిజన సమస్య వచ్చినప్పుడు మాత్రం హరిజన సభ్యులంతా ఏక విధాన బద్ధులై పనిచెయ్యాలి. అంటరాని తనం వాస్తవంగా రూపు మాసిపోయే వరకు, ప్రధాన గ్రామాలతో హరిజన పేటలు కలిసి పోయే వరకు, ఈ ద్విముఖ పాత్ర హరిజన ప్రతి నిధులకు తప్పదు."

హరిజన సమస్యను ఒక ప్రత్యేక ఆత్యయిక పరిస్థితిగా ప్రకటించి పరిష్కరించాలంటా డీయన.

చీకటిని పట్టుకొనగల్గు సిద్ధి యున్న
వెల్గునకు శాశ్వతత్వమ్ము నెలయు దాన

—దీప సభ

86. కష్ట జీవి కష్టాలు

ఆగస్టు విప్లవం అగ్ని బాణాలు విసుతుతున్న రోజు లవి. మానసికంగా భీమన్న జాతీయోద్యమంతో ఐక్యమయే వున్నాడు. దైహికంగా కూడా ఆ మహా యజ్ఞంలో పాలు పంచు కోవా లన్న ఉబలాటం బాగా హెచ్చి పోయిన సమయం అది. మిత్రుల, నాయకుల ఆదేశం వెనకవుండి ఆర్గనైజు చెయ్యా మని. జీవిత పరిస్థితులు కూడ కళ్లెం వేసి వెనక్కి వుంచుతున్నై. డోలాయ మాన స్థితిలో వున్న భీమన్నకు రెండు సంఘటనలు జరిగి కర్తవ్య నిర్దేశకా లైనై.

అందులో ఒకటి భార్య ప్రసవించి త్రిమూర్తులను కనడం. ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు! ఆ ప్రాంతంలో ఇది అపూర్వ సంఘటన. చూచి పోయే వాళ్ళతో ఇల్లు తిరు నా ళ్ళయింది.

"చిన్నవాణ్ని నీవు చూచుకో. తక్కిన ఇద్దరికీ ఇద్దరు తల్లుల్ని సంపాదిస్తాం. భయపడకు" అంటూ సముదాయించాడు, తత్తర పడుతున్న భార్యను. సంసార సాగరంలో నిండా ముంచిన సంఘటన అది.

రెండోది - ఆ ప్రక్క గ్రామంలో జరిగిన ఒక అమానుషమైన గృహ దహనం. ఆర్ధరాత్రి ఒక యింటి బయట గొళ్ళెం పెట్టి, కిరోసిను డబ్బాలు కుమ్మరించి నిప్పు పెట్టారు. లోపలి వాళ్ళు తలుపులు విరగ్గొట్టుకుని బైటకు వస్తే, గుమ్మం దగ్గరే బళ్ళాలతో పొడిచి చంపారు. చస్తూ కూడ ఆ యింటి యజమాని హంతకులలో ముఖ్యుల్ని కొందరిని పొడవ గలిగాడు. రాజోలు ఆస్పత్రి అంతా శవాలతో, చస్తున్న వాళ్ళ మూలుగులతో మహా బీభత్సంగా వుంది. అదంతా భీమన్న కళ్ళార చూశాడు. ఇదా మానవ సమాజం!

ఆ తర్వాత అరెస్టులు ప్రారంభ మయినై. ఆ ప్రాంతపు భూస్వాములు కొందరు తమకు వ్యతిరేకులైన వాళ్ళను ఆ కేసులో ఇరికించ సాగారు. ఆ అమానుష కృత్యానికి పాల్పడిన వారెవరో స్పష్టంగానే తెలుస్తున్నది. వాళ్ళే ఒప్పుకొన్నారు. గృహ యజమాని మరణ వాజ్మూలం కూడ అదే అయినా, అమాయకులు కూడ అందులో ఇరుక్కోవడం తప్పలేదు.

ఆ ప్రాంతంలో బహుజనుల మానాభిమానాలకు రక్షగా వుంటున్న కొందరు బలవంతులైన మామా యువకులు కూడ ఈ కేసులో దూర్చ బడ్డారు. అందుకు భీమన్న చింతించి, అందులో చిన్నపులి అనే అతణ్ని కలుసుకొని ప్రశ్నించగా——

"ఇలాంటి పిరికిపంద పనికి నే నొప్పు కుంటానా, కవి గారూ? ఒక్కొక్క కంకరరాయితో ఒకొక్కణ్ని బహిరంగంగా నేల కూల్చగలను కదా? నిద్ర పోతున్న వాళ్ళను ఆలా చంపడం మగతనమా?" అంటూ కళ్ళెత్తు కున్నాడట అతడు. కేసు కంటే అరెస్టుల తంతే మరీ అమానుషంగా తయా రయింది.

ఈ దుస్థితి చూచి గుండె కరిగిన భీమన్న - శ్రమజీవిని శక్తి మంతుణ్ని చెయ్యా లన్న దీక్షతో "కష్ట జీవి" నాటకం వ్రాశాడు. ఆ ప్రక్క పొదలాడ గ్రామానికి చెందిన చిట్టూరి తులసీరావు గారి నాయకత్వంలో ఒక సమాజం ఏర్పడి, దానిని రాజోలు టౌను హాలులో ప్రదర్శించారు.

ప్రదర్శనకు కొన్ని గంటల ముందు నుంచే ఆ ప్రాంతం పోలీసులతో నిండిపోయింది. వివిధ జిల్లాల నుంచి అనేక మంది నాటకం చూడ్డానికి వచ్చారు.

దాని కంతటి ప్రాశస్త్యం వస్తుందని కాని, అందరి కళ్ళు దాని వైపే వున్నాయని కాని భీమన్న అనుకోలేదు. ప్రదర్శన మధ్యలో ఆటూ, ఇటూ కొన్ని గడబిడలు జరిగినా గుర్తించ లేదు. ప్రదర్శన అత్యద్భుతంగా నడిచింది. ఆడియన్సు ఊగిపోయారు. ప్రశంసల వర్షంలో రచయితను, నటులను ముంచెత్తేశారు.

మర్నాడు ఉదయం నిద్ర లేచే సరికి, ఇంటి చుట్టూ పోలీసులు!

ఆ రాత్రే నాటకాన్ని మధ్యలో ఆపించేసి, రచయితనూ, ప్రదర్శకులనూ, కస్టడీలోకి తీసుకోవా లనుకున్నారట. ఎందుకో అప్పటి కాపని మానుకున్నారు! తర్వాత అరెస్టు లేమీ జరగలేదు కాని, భీమన్న మాత్రం కొంత కాలం పాటు నిఘా క్రింద వుండక తప్పలేదు.

అదే నాటకాన్ని "ధన్యజీవి" అనే పేరుతో ఆ తర్వాత చాలచోట్ల ఆడారు. ఆ తర్వాత సినీరంగంలో కీర్తి గడించిన జోగారావు, పోలిసెట్టి రంగనాయకులు, ఆరవ కృష్ణమూర్తి, గోలి కస్తూరిబాయి మున్నగువారు అందులో ముఖ్యులు. నాటకంలోని సమ్మెను తొలగించి, ఆ స్థానంలో సత్యాగ్రహం పెట్టి "కూలి రాజు" అనే పేరుతో తర్వాత ప్రింటు చేశారు దాన్ని.

ఆదే రోజుల్లో భీమన్న వ్రాసి, ప్రదర్శింప జేసిన నాటకం "అరుంధతీ కళ్యాణం". ఆదే తర్వాత "రాగ వాసిష్ఠం" పేరుతో అచ్చయింది. ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ తరగతులకు పాఠ్య గ్రంథం కూడ అయింది.

రగులు చున్నది అగ్ని పర్వత మొ కొక్క
శ్రామికుని గుండెలో, అది రగిలి రగిలి
భళ్ళు మని బ్రద్దలై అగ్ని బరపు నేని
అపుడు చింతించి లాభ మేమైన కలదె?

—కూలిరాజు (నాటకం)

87. సాగితే అందరూ రాడిలే

"లేవ బోకండి భీమన్న గారు, కూర్చోండి అక్కడే!" అన్నాడావ్యక్తి-బస్సు ఎదర సీట్లో నుంచి దిగిపోవడానికి లేచిన భీమన్నతో.

ఆ కంఠస్వరంలో ధ్వనించిన ఆజ్ఞకు బద్ధుడై పోయాడు భీమన్న.

అది 1942 ప్రాంతం. ఎదర డ్రైవరు ప్రక్క రెండు ప్యాసింజరు సీట్లుండే నమూనా బస్సది. సంఘటన నర్సాపురం బస్‌స్టాండులో.

ధనవంతులు, భూస్వాములు, స్థానికనాయకులు, అధికారులు, నవ నాగరక యువకులు - అలాంటి వారు మాత్రమే ఆ ఎదర సీట్లలో ఆసీను లయ్యే వారు. అధికారులకోసం రిజర్వు చెయ్య బడితే తప్ప - అటువంటి అగ్రశ్రేణి ప్రయాణీకులలో ఎవరు ముందు వస్తే వారు ఆ సీట్లలో కూర్చుంటారు. అది ఆచారం. "కష్టజీవి"ని "ధన్యజీవి"ని చేసి నాటక ప్రదర్శన లిస్తున్న రోజు లవి - పోలిసెట్టి రంగనాయకులు గారి అధ్వర్యంలో. అలాంటి ఏదో ఒక ప్రదర్శనకు వెళుతున్నారు వీళ్ళంతా - ఆ బస్సెక్కి కూర్చున్నారు. కవి గారిని గౌరవం కొద్దీ ఎదరసీట్లో కూర్చోబెట్టారు. లేకపోతే - అంత ధైర్యంగా ఎదర సీట్లో కూర్చోడు భీమన్న.

ఆ తర్వాత కొద్ది సేపటికే ఒక ఆజానుబాహుడు వచ్చి భీమన్న ప్రక్క కూర్చున్నాడు. బస్సులో కలవరం రేగింది. ఆ వ్యక్తిని ఎక్కడో చూచిన జ్ఞాపకం తప్పితే, ఆయన ఎవరో తిన్నగా తెలియదు భీమన్నకు.

బస్సు కదల బోతూ వుండగా - ఎవరో వచ్చి, బస్సును ఆగమన్నారు.

డ్రైవరూ, కండక్టరూ ముఖ ముఖాలు చూచు కొన్నారు. ఇంజను ఆగి పోయింది.

కండక్టరు బస్సు దిగి, ముందు సీట్ల వద్దకు వచ్చి - పులిగారు వస్తు న్నారనీ, ప్రంటు సీటు కావాలనీ, అందువల్ల ఆ రెండు సీట్లలో కూర్చున్న ప్యాసెంజర్లలో ఎవరో ఒకరు దిగాలనీ ప్రకటించాడు.

తన ప్రక్క కూర్చున్న వ్యక్తి నిశ్చలంగా వుండిపోవడం వల్ల, మృదు మనస్కుడైన (సెన్సిటివ్) భీమన్న తాను దిగి పోవడానికి లేచాడు. అదీ అప్పటి పరిస్థితి. దిగవద్ద న్నాడా వ్యక్తి భీమన్నను! ఆయన ఆజ్ఞను పాలిం చాడు భీమన్న.

బస్సు కలవర పడింది .

" ఆ వస్తున్నది పులిగారు" అన్నాడు కండక్టరు .

అయితే ఏం చెయ్య మంటావ్ అన్నట్లు చూశా డా ఆజానుబాహుడు .
"వెనక సీట్లు కాళీగా లేవా ? ఉంటే ఎక్కించుకో . లేకపోతే , నీవు పద . అతడు మరో బస్సులో వస్తాడు . "

"ఆయన పులి అంటే , నిజంగా పులే . పెద్ద రౌడీ !" కండక్టరు కంగారు పడిపోయాడు .

"పులి మీద పుట్ర వుండొచ్చురా , అబ్బాయ్ ! పోనివ్వు బస్సు . మా కవతల పను లున్నై" అన్నా డాయన .

భీమన్న పిరికి వాడే . సందేహం లేదు . అయితే - రమారమి వచ్చి నప్పుడు "ఇవాళ చస్తే , రేపటికి రెండు" అనే తెగింపు కలవాడు . ఈ వివాదం పెద్ద కొట్లాటగా పరిణమిస్తే ఏమవుతుంది అనే ఆలోచన రాగానే - అది గొట్టుముక్కల వెంకన్నగారి స్వస్థాన మనీ , తన పేరును బిగ్గరగా ఆరచిన క్షణంలో వందలు వేలు యువకులు తనకు రక్షణగా రాగలరనీ స్ఫురించి – దృఢ చిత్తుడై కూర్చున్నాడు స్థిరంగా .

ఒక పది పదిహేను నిమిషాల గందరగోళం తర్వాత - బస్సు కదిలింది .

"పులులూ , రౌడీలు ! సాగితే అందరూ పులులే , రౌడీలే" అన్నాడా యన బస్సులో అందరూ వినేటట్టు .

ఇంతకూ - ఆయన ఎవరో కాదు . రంగూన్ రౌడీ నాటక నాయకుడైన మేటి రౌడీ , దొమ్మేటి రౌడీ - దొమ్మేటి సూర్యనారాయణగారు ! అంజలి ఘటిం చాడాయనకు భీమన్న .

ఒకసారి భీమన్న రామచంద్రపురం నుంచి కాకినాడకు బస్సులో వెళు తున్నాడు . ఆ మధ్యలో ఒక గ్రామంలో బస్సును ఆపి , ఐస్సెక్కా డొక

అయ్యవారు. ఆ విభూతి రేఖలూ అవీ - ఆయన ఒక సనాతన సాచారపరుడని చెపుతూనే వున్నై.

బస్సు కదిలింది. ఆయన తూలి పడబోయాడు. కూర్చో మన్నాడు కండక్టరు. కళ్ళెర్రజేశా డాయన కండక్టరు మీద.

"ఎక్కడ కూర్చో మంటావ్?"

"అది సీటు కాదా?"

"ఆ పక్క అత డెవరు?"

"పేసెంజరు."

"ఏ కుల మని?"

"నేను కనుక్కోలేదు. బస్సులో కుల భేదాలు పాటించకూడదు."

"బస్సాపు; దిగిపోతాను."

కండక్టరు బస్సాప బోయాడు. గట్టి వాడే. అయితే, ఇదంతా చూస్తున్న భీమన్న కలగజేసుకొని, ఆ సీట్లోని మామావలె కనిపిస్తున్న పేద వాణ్ణి తన సీట్లోకి రమ్మని, తాను అక్కడికి మారి, అయ్యవార్ని ఆహ్వానించాడు తన ప్రక్కకు. ఎంతో సంతోషించారు అయ్యవారు! అంతలోవుంది కుల తత్వ రహస్యమూ, అస్పృశ్యత ఔచిత్యమూ, మేధావి రౌడీ తనమూ!

రామచంద్రపురంలో వాడపల్లి గారి ఆధ్వర్యంలో హరిజన సభలు జరుగుతున్న రోజులవి. జిల్లా అంతటి నుంచీ మామా విద్యార్థులూ, యువకులూ, నాయకులూ చేరి వున్నారు ఆశ్రమం నిండా.

ఒక రోజు ఉదయం కొంతమంది యువకులతో కలిసి భీమన్న కాలువకు వెళ్ళాడు స్నానానికి. వంతెన వద్ద రేవులో దిగి ఈత కొట్టి సాగారు కుర్ర వాళ్ళంతా.

ప్రతి రోజూ అక్కడ స్నానాలు చేసే హరిజనేతర పెద్దలలో ఒక వ్యక్తి ఈ కుర్రవాళ్ళను దూరంగా పొమ్మని ఆజ్ఞాపించాడు. వీళ్ళు కదల్లేదు. అతడు

భీమన్న వద్దకు వెళ్ళి - వాడపల్లి గార్ని, మామాలనూ దూషిస్తూ, దూరంగా పొమ్మన్నాడు. ఏమిటి చెయ్యడం? తమ కక్కడ స్థాన బలం లేదు.

ఇదంతా దూరం నుంచి గమనిస్తున్న ఒక మామా విద్యార్థి సరాలున అక్కడికి వచ్చి, భీమన్న పై చేయి చేసుకోబోతున్న ఆ వ్యక్తి జుట్టు పట్టుకొని, బద్మాష్ అంటూ, నాలుగు ముంచులు ముంచాడు. "మా నాయకుల్ని అవమానిస్తావురా? వొళ్ళి చేస్తాం, జాగ్రత్త" అన్నాడు.

భీమన్న హడలిపోయాడు. కాలువ ఇరుగట్ల నుంచీ ఈ రభసను గమనిస్తున్న స్థానికజనం ఒక్కుమ్మడి తమ మీదికి దాడి చేస్తే?

అయితే - అలాంటి దేమీ జరగ లేదు. ఎవళ్ళూ కలుగ జేసుకో లేదు. భీమన్న జట్టు వాళ్ళంతా విజయోత్సాహంతో స్నానాలు ముగించుకొన్నారు. ఆ నాడంత సాహసం చూపిన ఆ మామా విద్యార్థి మరెవరో కాదు - నీతిపూడి గణపతిరావు! ఆ తర్వాత నగరం పంచాయతీ అధ్యక్షుడై, ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ విధాన సభ సభ్యుడు కూడ అయిన వీర యోధుడు.

రాదీదే రాజ్యం
రాజ్యం కలవాడే రాజు
రాజే భగవంతుడు —
ఏ ఇజంలో ఆయినా సరే!

—భీమన్న చాటువులు.

88. అంబేద్కరుపై ఆంగ్లకవిత

డాక్టరు బి. ఆర్. అంబేద్కరు గారు 1944లో ఆంధ్రదేశ పర్యటనకు వచ్చి నప్పుడు, రామచంద్రపురంలో ఒక బ్రహ్మాండమైన సభ జరిగింది. సభలో అంబేద్కరు గారి ఉపన్యాసం జాతి యావత్తును ఉత్తేజ పరచి, ఉన్నత భవిష్యత్తుకు చేర్చేదిగా వుంది.

అంబేద్కరు గారిని భీమన్న అదే మొదటిసారి చూడడం. రౌండు టేబిలు సమావేశాల నుంచి, హరిజనులకు ప్రత్యేక రాజ్యం ప్రతిపాదన నుంచి,

పూనా ఒడంబడిక వరకు ఆయన ఉద్బోధలను, కార్య సరళిని ఈయన ఆసక్తితో గమనిస్తూనే ఉన్నాడు. అంతటి ప్రతిభావంతుణ్ని, పండితుణ్ని, ప్రవక్తను, దళిత కులోద్ధారకుణ్ని స్వయంగా దర్శించ గలిగి నందుకు ఎంతో సంతోషించాడు.

భీమన్న రాజకీయంగా కాంగ్రెసు వాడైనా – గాఢంగా ఏ పార్టీకీ చెందడు. తాను పార్టీలకు, కులమతాలకు అతీతుడైన కవి. మంచి, మానవత, మాధుర్యం ఎక్కడున్నా తనవే. హరిజనులకు ప్రత్యేక సౌకర్యాలు – వాళ్ళు తదితర అగ్రకులాల వాళ్ళతో సమాన స్థాయిని అందుకొనేటంత వరకే. ఆ తరువాత ఎవరికీ ఏ ప్రత్యేకతా అక్కర లేదు. అందరూ కలిసి నువ్వా నేనా అంటూ, పోటా పోటీగా, భుజం భుజం కలిపి ప్రగతి మార్గంలో ముందుకు పోవలసిందే. కాగా హరిజనులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించే స్వరాజ్యం భీమన్న ధ్యేయం. అందుకే జాతీయోద్యమానికీ, దాన్ని నడిపిస్తున్న కాంగ్రెసుకూ సన్నిహితుడుగా ఉంటున్నాడు. ఎంతో పోరాటం జరిపి, అట్టి సౌకర్యాలను హరిజనులకు సంపాదించడంలో కృతార్థుడైన అంబేద్కరు పట్ల భక్తి గౌరవాలు పెంచుకొన్నాడు.

హరిజనులు ఆర్యులే. ద్రావిడులు కూడ ఆర్యులే అనేది మొదటి నుంచీ భీమన్న సిద్ధాంతం. జాతి వేరు, కుల మతాలు వేరు. ఏ జాతిలోనైనా అనేక కులాలు, అనేక మతాలు వుండ వచ్చును. వృత్తులు పెరిగే కొలదీ కులాలు, ప్రవక్తలు పెరిగే కొలదీ మతాలు!

జిన్నా ద్విజాతి సిద్ధాంతం తోడి పాకిస్తాన్ వాదం భీమన్నకు ఎంత బాధ కలిగించిందో – అంబేద్కరు గారి ప్రత్యేక హరిజనస్థాన్ ప్రతిపాదన అంత ఆందోళన కలిగించింది. మొత్తం దేశమే తనదై నప్పుడు, ఏవో కొన్ని పుంతలు కోరుకోవడ మేమిటి? భవనమే తనదైనప్పుడు పంచ కోసమా ప్రాకులాడడం? తికమక పడుతున్న భీమన్నకు చప్పున జ్ఞాపకం వచ్చింది – అయిదూళ్ళు మాత్రమే అడిగిన ధర్మరాజు రాజనీతి! జోహారు లర్పించాడు అంబేద్కరు గారి రాజనైతిక మహా మహితాత్మకు.

అంబేద్కరు గారి పర్యటనను నడుపుకున్న వారు ఈలి వాజపల్లి, నందనారు హరి, జొన్నల మోహనరావు, పాము రామమూర్తి, మోకా మీరయ్య

మున్నగు వారు. వాడపల్లి గారి ఆశ్రమంలో కూర్చుని, ఆప్పటి కప్పుడు అంబేద్కరును ప్రశంసిస్తూ ఇంగ్లీషులో పద్యాలు వ్రాసి, రామచంద్రపురంలోనే ప్రింటుచేసి, ఫ్రేము కట్టించి, కాకినాడ తీసుకు వెళ్ళాడు భీమన్న. ఆ సాయంత్రం కాకినాడలో బహిరంగ సభ.

ఖద్దరు పంచె, లాల్చీ, శాలువా వల్లెవాటు - ఇదీ అప్పటి భీమన్న వేషం.

అధ్యక్ష స్థానంలో వున్న పాము రామమూర్తి గారు "ఇపుడు భీమన్న పద్యాలు చదువుతాడు" అని ప్రకటించారు. భీమన్న వేదిక మీదకు వెళ్ళాడు. భీమన్నను ఓరకంట తిలకించిన అంబేద్కరు వెంటనే రామమూర్తిగారి కేసి వంగి "ఎవ రితడు? ఎవ రితడు?" అంటూ ఆంగ్లంలో తొందర తొందరగా అడిగారు. "మనవాడే మనవాడే" అంటూ జవాబు చెప్పారు రామమూర్తి గారు.

"ఒక్క నిమిషంలో ముగించాలి" అనేసి, పుస్తకం చదువుకోవడంలో నిమగ్నులయారు అంబేద్కరు. భీమన్న ఖద్దరువేషం ఆయనకు అపార్థకమైనట్టుంది!

"అరనిమిషంలో ముగిస్తాను, పద్యాలు నాలుగు మాత్రమే" అన్నాడు భీమన్న. చదవడం మొదలు పెట్టాడు. మొదటి పద్యానికి కొంచెం కదిలారు అంబేద్కరు. రెండవ పద్యానికి తలెత్తి చూశారు. మూడవ పద్యానికి తన ముందున్న పుస్తకం మూసేశారు. నాలుగో పద్యానికి చేయి చాపి భీమన్న చేతి నుంచి ఫ్రేము కట్టిన పద్య పత్రాన్ని అందుకొని, కరచాలనం చేశారు.

అయిదు నిమిషాల పాటిదే అయినా, తన జీవితంలో ఒక గొప్ప సన్ని వేశంగా భావిస్తాడు భీమన్న దాన్ని.

ఈ యనంత విశ్వంలో తృణ మాత్రం వరుని ప్రతుకు
ఏదో ఒక రోజు కొరకు ఏళ్ళ కొలది జీవి స్తది.

—పైరు పాట.

89. రాజకీయ రంగం

భీమన్న అంబేద్కరుపై వ్రాసిన ఆ పద్యాలను గురించిన సంఘటనలు ఆ తర్వాత రెండు జరిగినై.

ఒకటోది - కలకత్తా నుంచి వెలువడుతున్న పీపుల్స్ హెరాల్డ్ పత్రికలో సంపాదకీయంగా ప్రకటించ బడినై ఆ పద్యాలు ! భీమన్నను ఆశ్చర్యానందా లలో ముంచిన సంఘటన అది .

రెండోది మహా మోరమైనట్టిది . అప్పటికి అమలాపురం నుంచి కాంగ్రెసు హరిజన శాసన సభ్యుడుగా వుంటున్న వ్యక్తి - ఎప్పటికైనా భీమన్న తనకు పోటీ అవుతాడని భయపడుతున్న వాడు - ఆ సదవకాశాన్ని సద్వినియోగం చేసి కొన్నాడు . ఆ పద్యాల ప్రతిని జతపరచి "భీమన్న కాంగ్రెసు వాడు కాదు , అంబేద్కరు భక్తుడు , ఇదిగో నిదర్శనం" అంటూ , కాంగ్రెసు ఆధిష్ఠాన వర్గానికి వ్రాసేశాడు !

ఆ పద్యాలను చూచి , రాజోలులో పాలయ్య గారు చాల మెచ్చు కొన్నారు . తర్వాత ఇలా అన్నారు—

"హరిజనుల్లో చదువు కొన్న వాళ్ళే తక్కువ . అందులోను నీ వంటి వాళ్ళు మరీ తక్కువ , మరి నీవు ఇలా టీచరుగా వుండి పోవడం మంచిదేనా ? ఇక్కడ నీ భవిష్యత్తు ఏమిటి ? ఒక హైస్కూలు హెడ్మాస్టరుగా రిటైరు కాగలవు , అంతేగదా ! ఇప్పుడు రాజకీయాలు చక చకా మారి పోతున్నాయి . నాయకులంతా నీకు తెలిసిన వాళ్లు . ఎన్నో పదవులకు హరిజన విద్యావంతులు కావలసి వస్తారు . నీవు నీ భవిష్యత్తును గురించి ఒక నిర్ణయానికి రావాలంటే ఇదే మంచి సమయం . ఆలోచించుకో !"

పాలయ్య గారి ఈ ఆలోచన బాగానే వుంది కాని , భీమన్న భయపడ్డాడు . సహజంగా తాను భావుకుడు కనుక , కార్య కుశలుడు కాదు . ప్రకృతిని ఆరాధిస్తూ , ప్రణయ గీతాలు వ్రాసుకొంటూ , ఏకాంతంగా కాలం గడపడం తనకు ఇష్టం . రాజకీయ గందరగోళం తన తత్వానికి పడదు . దండోపాయ సమర్థ డికే సామదాన భేదాలు స్వాధీన మవుతాయి . హృదయం కలవాణ్ని ప్రజలు ప్రేమిస్తారే కాని , అనుసరించరు . కలాన్ని పక్కకు పెట్టి కత్తినైతె దాల్చడం తనకు సరిపడని పని .

పైగా - తాను పేదవాడు . పేదవాడి రాజకీయం పైవాడికి పాలేరు తనమే . చూస్తున్నాడుగా ఆ నాటి హరిజన నాయకుల్ని , శాసన సభ్యుల్ని ?

లోకం ధన మూలకం. రాజకీయాలలో ధనం లేనివాడు న్యాయ సత్య ధర్మాలకు కట్టుపడి బ్రతకలేడు.

భీమన్న వాదం అంతా విన్నారు పాలయ్య గారు.

"ఒక ప్రయత్నం చేసి చూడు. నీవు మంచి రచయితవి. సిటీ నీకు తగిన చోటు. కాలం కలసి రాకపోతే, తిరిగి వచ్చే సెయ్యి. ఇక్కడ నీ లీను ఇలానే వుంటుంది" అన్నారు.

జీతం నష్టంపై ఆరు నెలల పాటు సెలవు పెట్టి, విశాల ప్రపంచంలో పడ్డాడు భీమన్న — ఒక అమావాస్య నాడు.

ఆ మానస మధ్యం గత
హే మాంబుజ ధామములో
చూచి, చూచి, చూచి - కేలా
చాచి, చాచి, చాచి - లేచి

ఉరికి నిన్ను కలుసుకోన?
ఒడ్డుపైనె నిలిచి పోన?

—రాళీలు

90. కాంగ్రెసు ఆర్గనైజరు

"రావయ్యా! రా! మంచి సమయానికి వచ్చావు." అన్నారు కళా వెంకటరావుగారు - రాష్ట్ర కాంగ్రెసు ఆఫీసులో అడుగు పెట్టిన భీమన్నను చూచి ఉత్సాహంగా.

అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు రాష్ట్ర కాంగ్రెసు ఆర్గనైజరుగా వుండుమనీ, రాష్ట్రంలో ఇష్టం వచ్చినట్టు సంచారం చెయ్యమనీ, ఖర్చులు అడిగి తీసుకోడానికి తట పటాయించ వద్దనీ చెప్పారాయన — భీమన్న పరిస్థితిని తలసికొన్న మీదట.

రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు ప్రకాశంగారు, ఆయనిది ఆవేశ పూరిత నాయకత్వం. కార్యదర్శి కళావారు. ఆయనిది రాజనైతిక నాయకత్వం.

పట్టాభి సీతారామయ్యగారు అభిలభారత స్థాయి అగ్రనాయకుడు, మేధావి. ప్రజాబలం మస్తుగా వున్న ప్రకాశం వర్గానికి, జాతీయ మేధా విశిష్టమైన కళా పట్టాభి వర్గానికీ ఆ రోజుల్లో నడచిన స్పర్ధ ఒక ధ్వని కావ్యం వంటిది. ఈ ధ్వని కొంత అర్థ మయ్యేది, కొంత అర్థమయ్యేది కాదు భీమన్నకు. కళా వారికి సన్నిహితుడుగా ఉండడమే ఈయన ఆ క్లిష్ట సమయంలో అనుసరించిన రాజమార్గం.

ఆ కాలంలో జరిగిన సంఘటనలు, భీమన్న గడించిన అనుభవాలు అసంఖ్యాకం. వాటన్నిటినీ జాబితాగా ఇచ్చినా, చాల పేజీలు అవుతుంది. అందుకని ఈ ప్రకరణాన్ని క్లుప్తంగా తాకి వదిలేస్తున్నాను.

యుద్ధం జోరుగా సాగిపోతున్న రోజులవి. జపాను విజయ పరంపర లను అందుకొంటూ ముందుకు వచ్చేస్తున్నది. బర్మా కాందిశీకుల దయనీయ గాధలతో భారతదేశం కన్నీరు మున్నీరై ప్రవహిస్తున్నది. నేతాజీ హింద్ ఫౌజు విజయ గాధలతో, చలో ఢిల్లీ నినాదాలతో వాతావరణం వీరగంధ సంభరితమై వుంది. కాంగ్రెసు నాయకులు జైళ్ళలో మ్రగ్గుతుండగా, కమ్యూ నిస్టు నాయకులు స్వేచ్ఛగా యుద్ధానుకూల ప్రచారాలు చేస్తున్న విపరీత పరి స్థితి అది. జాషువా, ధర్మన్న, హరి వంటి ప్రముఖులు కూడ ప్రజల్ని యుద్ధోన్ముఖుల్ని చేస్తూ ప్రజలలో ప్రచారం చేసిన రోజులవి.

తెలుగు దేశం నుంచి బర్మాకు వెళ్ళి వున్న ప్రజలలో అత్యధిక సంఖ్యా కులు హరిజనులు, సెట్టిబలిజలు. అందులోను కాకినాడ, విశాఖపట్నం రేవు పట్టణాలకు దగ్గరలో వుండే కోస్తా వాసులు. కాందిశీకులైన వాళ్ళూ ఎక్కువ మంది వాళ్ళే. అందులో రాపాక వెంకటరెడ్డి గా రొకరు. ఆయన బర్మాలో సుప్రసిద్ధ ఆంధ్ర నాయకుడు. గొప్ప వక్త. వ్యవహర్త. అనారోగ్యం పాలై వచ్చినా, ఇక్కడ స్థానికంగా భీమన్నతో కలసి ఎన్నో ప్రజోద్యమ కార్య క్రమాలలో పాల్గొన గలిగాడు.

కమ్యూనిస్టుల విధానం కారణంగా కొంచెం పాటారి పోతున్న కాంగ్రెసు బలాన్ని పునరుద్ధరించటానికి ఆ రోజుల్లో సాగిన యువజన కార్యక్రమాలలో భీమన్న పాత్ర చిన్నదేం కాదు. అగ్ర నాయకు లొక్కరొక్కరే జైళ్ళ నుంచి

విడుదలై వచ్చి జాతీయోద్యమ చుక్కానిని చేబట్టే వరకు, దానిని మునిగి పోకుండా పట్టి వుంచిన వారు యువకులే. ముఖ్యంగా అల్లూరి సత్యనారాయణ రాజు గారి నాయకత్వంలోని యువజన కాంగ్రెసు నాయకులు. అన్నే శ్రీరాజ్యం, భూపతి కోటేశ్వరరావు, ఎన్. వి. ఎస్. ప్రసాదరావు, నంబూరి శ్రీనివాస రావు, మైనేని రామకోటయ్య, ఎర్రాప్రెగడ గోపాల కృష్ణమూర్తి, మండెల విశ్వనాధం, రామకుమార వర్మ మున్నగు యువకులు ఆ కాలంలో చేసిన జాతీయోద్యమ కృషి అద్వితీయమూ, అనంతమూ. అందులో అల్లూరి (సత్యనారాయణరాజు గారి) వర్గానికి చెందినవాడు భీమన్న.

ప్రజలంద రక్కర పడి కోరరేని
ఆయుధమ్ములు తెచ్చునా స్వరాజ్యమ్ము?
ప్రజలెల్ల స్వాతంత్ర్య పథమున తాక
విశ్వ శుభోదయ విప్లవ మొట్లు!

— మధు దాల

91. గాంధీజీ సభలో దొంగలు

1946 అసెంబ్లీ ఎన్నికలలో - అమలాపురం ద్వి సభ్య నియోజక వర్గంలోని రిజర్వు స్థానానికి కాంగ్రెసు టికెట్టు కోసం అప్లయి చేశాడు భీమన్న. ఇంటర్వ్యూలు మద్రాసులో ఏర్పాటయినై. అప్పటికి గాంధీజీ మద్రాసు పర్యటనలో ఉన్నారు.

కాంగ్రెసు టికెట్టు కోసం అప్లయి చేసిన అభ్యర్థులు చాల మందే వున్నారు. కాంగ్రెసుతో సంబంధం లేని వాళ్ళు, ఖద్దరును ఆసహ్యించు కొనే వాళ్లు, ఎన్నో రకాల వాళ్ళు! గెలిచే పార్టీ కదా! మరి ఆ సీటు పాత సభ్యుడికే వస్తుంది. పోతే, భీమన్నకు వస్తుంది. అది అందరికీ తెలుసు. అయినా తమ తమ అదృష్టాలను పరీక్షించు కోడానికి కొందరు, గాంధీజీని చూడ్డానికి కొందరు మద్రాసు చేరుకొన్నారు.

ఇంటర్వ్యూలై పోయినై. తన కెలాగూ రాదని భీమన్నకు తెలిసి పోయింది. గాంధీజీని చూద్దామని బైలు దేరాడు. వెంట కూర్మయ్యగారున్నారు. అంతులేని జనం. తొడ తొక్కిడి. ఎలాగో మందిలోకి జొరబడి

ముందుకి పోయారు. అంతలో కూర్మయ్య గారికి ఎందుకు అనుమానం వచ్చిందో మరి, భీమన్నతో అన్నారు - "పర్సు జాగ్రత్త. జేబులు జాగ్రత్తగా చూసుకో" అని.

ఒక్క భీమన్నే కాదు. ప్రక్క జేబుల లాల్చీ నాయకు లంతా జాగ్రత్తగా వుండవలసిన సమయం ఆది. జేబీ చూచు కొన్నాడు భీమన్న. సమయం మించి పోయింది.

గాంధీజీ ఎదుట కూర్చున్నారు వెళ్ళి. ఆయన రాట్నం తిప్పుతున్నారు, కార్యదర్శులతో మాట్లాడు తున్నారు, సంతకాలు చేస్తున్నారు, విజిటర్లను పలక రిస్తున్నాసు! ఒక పలకరింపూ, ఓ చిరునవ్వు చిలకరింపూ భుజాన వేసుకొని కూర్మయ్య గారూ, భీమన్నా బైట పడ్డారు. పర్సుపోయిన సంగతి కూర్మయ్య గారికి చెప్పలేదు. మిత్రులు వెంకటాచలం గారి వద్ద ఆయిదు రూపాయలు అప్పు తీసుకొని, ఆ సాయంత్రమే బెజవాడ రై లెక్కేశాడు భీమన్న.

ఆ ఆయిదు రూపాయల అప్పుది మరో చరిత్ర.

దొంగ లెక్కడా వుంటారు, గాంధీజీ సభలో కూడ వున్నారు. అందులో చిత్ర మేముంది? దేవాలయాల చుట్టూ లేరా? దొంగలూ, బిచ్చ గాళ్ళు లేక పోతే - రాజులకూ, దేవుళ్ళకూ ఉనికే లేదంటాడు భీమన్న.

దొంగలున్నారు కాబట్టి దొరలు కలరు
చుష్టి వాళ్ళుండ్రి కనుక దేవుళ్ళు కలరు
మురికి లేకుంద దోమలు పెరుగు పెట్లు?

—భీమన్న దాటువులు

92. మూర్తి - కూర్మయ్య

ఉన్నత విద్యావంతులైన ఆంధ్ర హరిజనులలో కాంగ్రెస్‌లో ఉన్న వాళ్ళి ద్దరు. బి. యస్. మూర్తి, వేముల కూర్మయ్య. ఆనాటి సాధారణ ఎన్ని కలలో కాకినాడలో మూర్తి గారికి షెడ్యూల్డు కులాల ఫెడరేషనూ, కృష్ణాలో

కూర్మయ్య గారికి కమ్యూనిస్టు పార్టీ తీవ్రమైన పోటీగా ఏర్పడ్డాయి. ప్రతి పక్షాలు తమ యావచ్ఛక్తి నీ ఈ యిద్దరి మీదా కేంద్రీకరించారు.

కాంగ్రెసు ఎలాగూ గెలుస్తుంది, పదవిలోకి వస్తుంది. అలాంటప్పుడు ఏ దొరగారి పాలేరో మంత్రి కావడం కంటే – కూర్మయ్యో, మూర్తో మంత్రి కావడం మంచిది కదా! ఈ దృష్టితో తన కార్యక్రమాన్ని కూడ ఈ ఇద్దరి చుట్టూ కేంద్రీక రించాడు భీమన్న.

మూర్తి గారి కార్యస్థానం కాకినాడ. మకాం హరిజన సేవక సంఘ కార్యాలయం. హరిజన సేవక సంఘం ఆంధ్ర విభాగానికి మూర్తి గారే అధ్యక్షులు. ఆయన మంచి ధీశాలి. వక్త. ప్రకాశం గారి అనుయాయి. కాంగ్రెసు వాడు కావడం వల్లను, కేవలం స్వప్రయోజకుడనే అపోహకు గురై వుండటం వల్లనూ ఆయన పట్ల ఫెడరేషనిష్టులకు తీవ్రమైన నిరసన వుండేది. అదీ ఆయనను ఓడించాలనే పట్టుదలకు కారణం. అవకాశం దొరికితే అవమానించడానికి కూడ సిద్ధంగా వుండే వారు వాళ్లు.

ఎలాంటి కష్ట నిష్ఠురాల నైనా సరే ఎదుర్కొవ డానికి సిద్ధంగా వుండే వాడు భీమన్న. బాణాకర్ర ఒకటి చేత బట్టి, రాత్రంతా నిద్ర మేల్కొని కాపలా కాస్తుండే వాడు. ప్రతి పక్షంలో అగ్గి బరాటా లుండేవారు. హరిజన పేటలన్నీ ఎక్కువగా వాళ్ళ పక్షాన్నే వుండేవి. ఎప్పు డెవరేం చేస్తారో యేమో. ఆ రోజుల్లో భీమన్నకు అన్ని విధాలా తోడుగా వుండిన కాంగ్రెసు యువకులు మర్ల ఫణి శాస్త్రి, దయానందరాజు మున్నగు వారు.

ఆగస్టు విప్లవంలో అరెస్టయిన మూర్తి గారు, జైలు నుంచి వచ్చిన తర్వాత ఆంధ్రప్రభలో అసిస్టెంటు ఎడిటరుగా కొంత కాలం వున్నారు. ఆ సమయంలో మద్రాసులో వుద్యోగాలు చేస్తున్న తిరుపతి, రామమోహనరావు, ఆదినారాయణ, వెంకటచలం, గనిరాజు, మహీపతి మున్నగు పెద్ద వారంతా కలిసి షెడ్యూల్డు కులాల ఉద్యోగుల సంఘాన్ని స్థాపించి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించే వారు. జైభీం అనే పత్రికను కూడ నడిపే వారు. ఈ అన్నిటికీ తిరుపతి గారిల్లు కేంద్రంగా వుండేది.

ఒక రోజు భీమన్న తిరుపతి గారింటికి వెళ్ళగా , అక్కడ హరి వున్నాడు . ఫెడరేషను కుర్ర వాళ్ళకు భీమన్న పట్ల ద్వేషం లేదు . కాని కాంగ్రెసులో వుంటాడన్న కోపం వుంది . మూర్తిగారి పట్ల ద్వేషం వుంది .

'నీవు కాంగ్రెసుకూ , మూర్తికీ ప్రచారం చేస్తే - కాళ్ళు విరగ్గొట్టి ఆస్పత్రితో పారేస్తాం" అన్నాడు హరి - నవ్వుతూ . "నిన్ను మేం వదులు కోవేం" అన్నాడు .

"నాకు పార్టీ అంటే పార్టీయే . వ్యక్తులు ముఖ్యం కాదు . కాంగ్రెసు నాకు తెలిసిన పార్టీ . నాకు తెలిసిన విషయాన్నే నేను ఎలా కావ్య వస్తువుగా తీసుకుంటానో , అలానే పార్టీని కూడ తెలిసినదాన్నే బలపరుస్తాను" అన్నాడు భీమన్న .

పోని మూర్తిగా రిందికేసి వెళ్ళ వద్దన్నారు . భీమన్న లెక్కచెయ్యలేదు . ఆ సమయంలో తీవ్రమైన మలేరియాతో బాధ పడుతున్నాడు మూర్తి . ఒకటే చలి , వణుకు , వాంతులు . వాంతులు పట్టి పారబోస్తూ , దుప్పటిపై దుప్పటి కప్పి అణచి పెట్టి ఉంచుతూ-ఇలా వారం పది రోజుల పాటు నిరంతర సేవ కూడ చేయవలసి వచ్చిం దాయనకు భీమన్న .

దీక్ష పరుడౌ సచివుడు
దక్షత గల కార్యదర్శి దగ్గర నుండన్
లక్ష సమస్యలు తీర్చును ,
నిక్షేపము చేయగల్గు నిఖిల జగమ్మున్

— దీవన శ

93. ప్రశమశక్తి - ధీశక్తి

భీమన్నకు సంబంధించిన ఒకటి రెండు ముఖ్యమైన ప్రశ్నలకు ఇక్కడ సమాధానం చెప్పవలసి వుంది . ఈయన కాంగ్రెసుకే ఎందుకు అంటి పెట్టుకొని వున్నాడు . పోనీ అందులోనైనా ముందుకు వచ్చి అగ్రనాయకుల వరసలో ఎందుకు నిలబడ లేదు ?

షెడ్యూల్డు కులాల ఫెడరేషను, కమ్యూనిస్టు పార్టీ-ఈ రెండు రాజకీయ పక్షాలూ భారత స్వరాజ్య లక్ష్మి చూపు మేర దూరంలో వుండగా ఎర్పడినట్టివే, బ్రిటిష ప్రభుత్వాన్ని బెదరగొట్టి, స్వాంతంత్ర్య రథ పురోగమనాన్ని వేగీకరించిన సంస్థ కాంగ్రెసే. శ్రమ శక్తి మొదలు ధీ శక్తి వరకు ప్రజాశక్తి యావత్తూ కాంగ్రెసులో నిక్షిప్తమై వున్న రోజు లవి. స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని లోక రంజకంగా నడిపించగల సమర్థులు ఒక్క కాంగ్రెసులోనే వున్నా రానాడు.

పుట్టుకతోనే భీమన్న షెడ్యూల్డు కులంవాడు. షెడ్యూల్డు కులాల వారి కున్న ఇబ్బందు లన్నీ ఈయనకూ వున్నై. ఫెడరేషనుకు ఈయన ఎప్పుడూ వ్యతిరేకంగా వుండలేదు. అట్టి వ్యతిరేకత సాధ్యమూ కాదు. సహజమూ కాదు.

కమ్యూనిస్టు పార్టీ కూడ అలాటిదే. అది పేదల, శ్రమ జీవుల పార్టీ. నిజానికి అది హరిజనుల, గిరిజనుల, బహుజనుల, పార్టీ. దాని సిద్ధాంతాలకు గాని లక్ష్యాలకు గాని భీమన్న వ్యతిరేకి కాదు. నిజానికి ఈయన ప్రతి రచన లోనూ ఈ లక్ష్యా లున్నై.

అయితే ఈ రెండు పార్టీలనూ వదిలేసి ఈయన కాంగ్రెసు వాడెందు కయాడు?

'మంత్రాలకు చింతకాయలు రాలవు. చెట్టెక్కి దులపాలి లేక కొయ్యాలి' అనే నిత్య జీవిత సత్యాన్ని గుర్తించినవాడు కనుక భీమన్న కాంగ్రెసువా డయాడు.

ఈనాటి రాజకీయ మత గ్రంథాలలోనే కాదు-వేదాల నిండా కూడ నినాదా లున్నాయి, నీతులున్నాయి. వందలు వేలున్నాయి. ఒక్కటి కూడ అమలు జరుగలేదు. ఫెడరేషను కుల పక్షం. ఇతర కులాలకు అందులో స్థానంలేదు. కమ్యూనిస్టు పార్టి కేవలం భూస్వాముల పార్టీగా తయారైన రోజు లవి. నంబూరి శ్రీనివాసరావు లాంటి తీవ్రవాదులు కూడ ఆ పార్టీని వదిలెయ్య డానికి కారణం ఆ పార్టీ నాయకులు కుల తత్వాన్ని, అంటరాని తనాన్ని పాటిం

చడమే. దేశంలో కమ్యూనిస్టు వ్యవస్థ ఏర్పడకుండా కులతత్వ ధనికుల కొడుకులు ఆ పార్టీకి నాయకులై దాన్ని సేబటేజ్ చేశా రంటాడు భీమన్న. కమ్యూనిస్టు పార్టీ కారణంగా కాంగ్రెసు ప్రభుత్వానికి దూరమై, పోలీసుల చేతుల్లో మామా పేటలు ధన మాన ప్రాణాలను కోల్పోతున్న రోజుల్లో, ఆ పార్టీ నాయకులు కాంగ్రెసు పెద్దల అటకల మీదనే సురక్షితంగా దాగి వున్న ఉదంతాలు ఆనాటి ప్రజలందరికీ తెలుసంటాడు.

మామా పేటల్ని లేబరు పేట లనేవాళ్ళు కమ్యూనిస్టులు. అది భీమన్నకు కిట్టలేదు. పూర్వ కాలంలో బ్రాహ్మణ మతం శూద్రుల్ని అణచిపెట్టి వుంచినట్టే, ఈనాడు కమ్యూనిస్టు మతం మామాలను లేబరుగా ముద్రవేస్తున్నదని అనుమానించాడు. మామా లంతా లేబరేనా అని ప్రశ్నించాడు. అయితే మామాల లోనే మెజారిటీ ఈయన మాట వినలేదు. గొర్రెలు కదా! అనుభవం నుంచి కూడ నేర్చుకోవు.

ఇన్ని విధాలుగా, ఇంత నిశితంగా ఆలోచించి - హరిజనులకు కాంగ్రెసు ఒక్కటే గుడ్డిలో మెల్ల అని నిశ్చయించు కొన్నాడు భీమన్న. మరి దానిలో మూర్తి కూర్మయ్యల వలె ముందు కెందుకు రాలేదంటే - భీమన్న కవి కదా! రచయితగా తనకు కావలసిన సమగ్రానుభవం కోసమే రాజకీయాలలో తిరిగాడంతే! రాజకీయ రంగం ఒక 'జూ' లాంటిది కదా?

పురుష వ్యాఘ్రుం డనుచున్,
పురుష సింహుడనుచు, పురుష పుంగవు డనుచున్।
నరుడు మృగము కాదలచును
నరు డందుకె శివుడు కాడు, నమ్మము పిల్లీ!

—పిల్లీ శతకము

94. వోట్లు-పాట్లు

ఏ ఎన్నికల ప్రచారంకోస మైనా మామాల వాడల్లోకి వెళ్ళాలంటే సాయంత్రం ఎనిమిదీ తొమ్మిది గంటలకు వెళ్ళాలి. వాళ్ళంతా వ్యవసాయ

కూలీలు. పగలంతా పనిచేసి, వాళ్ళు తిరిగి ఇళ్ళకు వచ్చేటప్పటికి రాత్రి ఆవేళ అవు తుంది. అప్పుడుగాని వాళ్ళు దొరకరు.

అలసి, సొలసి అంత ప్రొద్దుపోయి ఇళ్ళకు వచ్చిన వాళ్ళను పట్టుకొని విశ్రాంతి అయినా తీసుకోనివ్వకుండా, ఏ పనీ లేనివాళ్ళు వోట్లకోసం సతాయించడం చాలా క్రూరం అనిపించేది భీమన్నకు. ఈ వోట్ల వల్ల వాళ్ళ పాట్లు ఏమైనా మారేది వున్నది గనకనా?

కృష్ణా జిల్లాలో, కూర్మయ్యగారి నియోజక వర్గంలో భీమన్న తిరుగు తున్న రోజులవి. జిల్లా కాలగ్రెసు అధ్యక్షులు దుక్కిపాటి నాగేశ్వరరావు గారు, ఉపన్యాస కేసరి చెరకువాడ నరసింహంగారు, భీమన్న-ఈ ముగ్గురూ కలిసి ఒక కారు తీసుకొని, క్లిష్ట కేంద్రాలనుకొన్న గ్రామాలన్నీ చుట్టి వస్తున్నారు.

ఆ కాలంలో ఒక సాయంత్రం - "ఓయ్, మా అమ్మోరు, మా అమ్మోరు, అయ్యయ్యో మా అమ్మోరయ్యోయ్, మా అమ్మోరు" అంటూ అప్పుడే పనులనుంచి ఇంటికి వస్తున్న కూలీలు చుట్టుముట్టారు భీమన్న కారును.

అదొక మాలపేట. పేరు జ్ఞాపకం లేదు. పేటలో కారుపట్టే స్థలం వున్న ఒకచోట దాన్ని నిలిపారు. నరసింహంగారు కారులోనే కూర్చున్నారు. పనులకు వెళ్ళలేని ముసలివా రెవరైనా ఇళ్ళవద్ద వున్నారేమో అని వాకబు చేస్తున్నారు నాగేశ్వరరావుగారు. భీమన్న కారుపక్కనే నిలబడి, అక్కడున్న ఒక సర్వే రాయిమీద కాలు ఆనించి చుట్టూ చూస్తున్నాడు. గూడెంలో అక్కడక్కడ చిన్న చిన్న గుడ్డిదీపాలు తప్ప మరే వెలుగూ లేదు.

పనులనుంచి ఇళ్ళకు వస్తున్న ఆ శ్రమజీవులంతా అలా ఒక్కసారి ఉద్రిక్తు లెందు కయ్యారో, అమ్మో రేమిటో భీమన్నకు ఆర్థంకాలేదు.

"ముం దా కాలు తియ్యి వయ్యా! మా అమ్మోర్ని తొక్కేస్తున్నావ్!" అన్నా రేక కంఠంతో.

ఉలిక్కిపడి వెనక్కి గెంతాడు భీమన్న.

చీకట్లో కనుపించ లేదనీ, క్షమించమనీ నాగేశ్వరరావుగారు వేడుకొన్న తర్వాత, వాళ్ళు సమాధానపడి, వీళ్ళు చెప్పేదేదో వినడానికి సమ్మతించారు. ఆ గ్రామం కమ్యూనిస్టుల ఉక్కుకోట అట! కమ్యూనిస్టుల కోటలు కూడ అంతటి మూర్ఖత్వంలో మునిగి వున్నాయన్నమాట!

మరో మామా వాడలో భీమన్నను హరిజనుడని నమ్మడానికి నిరాకరించారు వాళ్ళు. మరొకచోట ఒక వైశ్యుల ఇంట భోజనాలు చెయ్యవలసి వచ్చి, ఆ కాసేపు భీమన్నను కులం చెప్పవద్దన్నారు. భీమన్న ఒప్పుకోక, కులం చెప్పేసి భోజనమే మానివేశాడు.

ఇలాంటి అనుభవాలు కొత్తకాదు భీమన్నకు. ఈ ఎన్నికల పర్యటనలో ఈయన కొత్తగా గుర్తించిన సత్యం ఒకే ఒకటి – హరిజన పేటల్లో కమ్యూనిస్టుల ప్రభావంకంటె వున్నవాటి కంటె, అంబేద్కర్-రైట్ల ప్రభావంకింద వున్నట్టివి ఎక్కువ చైతన్యవంతంగా వున్నై. అందుకు కారణం కమ్యూనిస్టుల లక్ష్యం రాజకీయం. అంబేద్కర్-రైట్ల లక్ష్యం జాత్యభ్యుదయం. కాంగ్రెసువారి ప్రభావం క్రింద హరిజన పేట లేం లేవు. ఉన్నవన్నీ భూస్వాముల ప్రభావం క్రింద వున్నవే. భూస్వాముల ప్రభావం అంటే ఆర్థిక దాస్యమూ, మత మూఢత్వమూ.

పదవీ రాజకీయాలు
పచ్చికలో పసిరి పాములు;
కవి పాములవాడు కావచ్చు
తానే ఒక పాము కారాదు!

— టుమ్మీలు.

95. రాజావారి షష్టి పూర్తి

పిఠాపురం రాజావారి షష్టిపూర్తి తలపెట్టబడింది. కాంగ్రెసు నాయకులు కొందరు దానికి ఆధ్వర్యం వహించారు. అందులో అతి ముఖ్యులు దుర్గాబాయమ్మ గారు. ఎన్నో కార్యక్రమాలు రూపొందించారు. అందులో కవి పండితులకు సత్కారం, హరిజన నాయకులకు సన్మానం కూడ వున్నాయి.

కవి పండితుల జాబితాలో భీమన్న పేరు కూడ చేర్చవలసిందిగా మూర్తి గారు సూచిస్తే, నిర్వాహకులు మాట్లాడలేదు. గట్టిగా అడిగితే "పిఠాపురం రమ్మనండి, ఆలోచిద్దాం" అన్నారట.

పిఠాపురం వచ్చిన అగ్ర హరిజన నాయకులలో కొందరు మూర్తి, కూర్మయ్య, మునిసామి పిళ్లైగార్లు. పిళ్లైగారు మొదటి కాంగ్రెసు మంత్రివర్గంలో హరిజన సభ్యుడు. వచ్చే మంత్రివర్గంలో ఆ పదవి కోసం ఈ ముగ్గురూ అభ్యర్థులే. అందుకు ఎవరిమట్టుకు వారు తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నవారే. ఒకరిమీద ఒకరి కుండే దుగ్గను భిమన్న వద్ద వెళ్ళబోసుకునేవారు. ఈయన వినేసి మరచిపోతూ వుండేవాడు.

షష్టిపూర్తి మహోత్సవం మహావైభవంగా ప్రారంభమైంది. వివిధరంగాలలో కార్యసిద్ధులైన మహామహులతో, నాయకులతో, కవులతో, పండితులతో మహాసభ దేవసభలా వుంది.

"జాబితాలో భీమన్న పేరు చేర్చేరా?" అని వాకబు చేశారు మూర్తి గారు. చేర్చలేదు. చేర్చే అవకాశం కూడ లేదని తేలింది. దుర్గాబాయిగారితో మాట్లాడబోతే ఆవిడ ముఖం తిప్పింది, మూర్తిగారికి అందకుండా కూర్చుంది. ఆయన కోపంతో రుస రుస లాడుతున్నాడు. ఈ రకమైన పైరవీలు భీమన్నకట్టవు. వద్దు లెమ్మంటూనే వున్నాడు మొదటినుంచీ. అయినా మూర్తిగారు రాజకీయ నాయకుడు కదా! ఓటమి నెలా ఒప్పుకుంటాడు.

అంతలో తారకంగారు ఎందుకో అటుగా వచ్చి మూర్తిగార్ని పలకరించారు. "భీమన్న రాజావారి మీద పద్యాలు వ్రాశాడు. కొంచెం చదవ నివ్వగూడదా?" అన్నారు మూర్తిగారు. "దానికేం? అలాగే" అన్నారు తారకంగారు. వెళ్ళి ప్రోగ్రాం కాగితంలో భీమన్న పేరు వ్రాశారు.

రాజా వారు వచ్చి కూర్చోగానే, కార్యక్రమం ప్రారంభం అయింది. భీమన్న పద్యాలు చదువుతాడని సభాధ్యక్షుడు అనౌన్సు చేశాడు. దుర్గాబాయమ్మ గారు అదిరి పడింది "ఆ పేరు ఎవరిచ్చారు? ఆ పేరక్కడి కెలా వెళ్ళింది?" పక్కనున్న నాయకుల్ని అడగసాగింది. ఎవరికి మాత్రం తెలుసు?

భీమన్నతో పాటే , ఈ గడ బిడ కూడ వేదిక మీద కెళ్ళింది . రెండు పద్యాలు మాత్రం చదవ మని అధ్యక్షుడు కోరాడు. ఒకే పద్యంతో ముగిస్తా నన్నాడు భీమన్న . అర పద్యం చదివేటప్పటికి మళ్లీ చదమన్నారెవరో !

ఈ విధంగా పద్యం రెండు సార్లు చొప్పున , ప్రతి పద్యానికీ సభాసదులు హర్షధ్వానాలు చేస్తుండగా , వ్రాసిన పద్యాలన్నీ చదివాడు భీమన్న . ఆ పద్యాల ప్రతిని రాజా వారి పాదాల మీద వుంచి వచ్చి కూర్చున్నాడు .

రాజా వారి చెక్కిళ్ళపై అశ్రు ధారలు ప్రవహిస్తున్నై . సభ యావత్తూ ఒక దివ్యమైన నిశ్శబ్దంలో ముసిగివుంది. అశ్రువు లొత్తు కొంటూ రాజా వారు లేచి "భీమన్న గారి పద్యాలు నన్ను కలచి వేశాయి . ఈ ఆనందావేశంలో ఇక ఇక్కడ కూర్చోలేను . తర్వాత కార్యక్రమాన్ని జరిపించెయ్యండి" అని చెప్పి లోపలికి వెళ్ళి పోయారు !

మూర్తిగారు లేచి , దుర్గాబాయమ్మ గారి కేసి తిరిగి "దిస్ ఈజ్ అవర్ మెటల్ . ఇదీ మా ధాతు శక్తి. మీ సన్మానా లెవరిక్కావాలి ?" అని కసిగా అనేసి , భీమన్న చేయి పట్టుకొని బైటికి వెళ్ళి పోయారు .

ఆ తరువాత యువ రాజా వారు , కుమార రాజా వారు , రాజ బంధువు లనేకులు , నిడదవోలు వెంకటరావు గారి వంటి పండితులు భీమన్నపై కురిపించిన ప్రశంసలు ఇన్నీ , అన్నీ కాదు . భీమన్నకు ప్రత్యేక సన్మానం జరపాలను కొన్నారట కూడ . అలానే మిగిలి పోయిందది . హరిజన నాయకుల సన్మా నంలో మాత్రం భీమన్న పేరు చేర్చారు - ఈయన నాయకుడు కాకపోయినా !

ఇలాంటి ఎన్నో అనుభవాల తర్వాత , ఎన్నికలు ముగిసిన అనంతరం , మూర్తి గారి సలహాపై రాష్ట్ర హరిజన సేవక సంఘానికి అసిస్టెంటు సెక్రటరీ అయాడు భీమన్న . కొద్ది రోజులలోనే నార్ల వారి సలహాపై ఆంధ్ర ప్రభలో చేరాడు . అక్కడి నుంచి కూర్మయ్య గారి సలహాపై మద్రాసు ప్రభుత్వ సమా చార శాఖలో అసిస్టెంటు పబ్లిసిటీ అఫీసరుగా ప్రవేశించాడు . హరిజన సంక్షేమ శాఖతో పాటు సమాచార శాఖకు కూడ అప్పుడు మంత్రి కూర్మయ్య గారే !

96. వ్యవసాయ కూలీ పత్రిక

భీమన్న ఏ ఉద్యోగంలో చేరినా అది సమర్థవంతంగా సాగిపోతుంది. మూడు పూవులు, ఆరు కాయలుగా వికసిస్తూ పోతుంది. అయితే, ఈయన కది ఉద్యోగ ధర్మం. ఒక రొటీను, ఒక వృత్తి, ఒక జీవిక.

ఉద్యోగ ధర్మం వెలుపల ఒక ఆత్మ ధర్మం కల విశిష్ట జీవితం భీమన్నది. పగలంతా తిండికోసం పనిచేస్తూ, రాత్రింతా ఆత్మకోసం తపస్సు చేసే జీవలక్షణం అది. శరీర పోషణకోసం అన్నం, హృదయ పోషణకోసం సౌందర్యం, ఆత్మపోషణకోసం జ్ఞానం అవసర మంటా డీయన. ఈ తత్త్వాన్ని అనుసరించే తన జీవితాన్ని నడుపుకొంటూ వచ్చాడు. ఈ మూడు శక్తుల్నీ సమానంగా ఆరాధించి పరిపూర్ణ దయ్యాడు.

ప్రకాశంగారి మంత్రివర్గం, రామస్వామిరెడ్డియార్ మంత్రివర్గం, కుమారస్వామి రాజా మంత్రివర్గం-ఇలా ఆ ఆయిదేళ్ళలోను మూడు మంత్రి వర్గాలు మారాయి మద్రాసులో. అందులో మొదటి రెండు మంత్రి వర్గాలలోను కూర్మయ్యగారు మంత్రిగా ఉన్నారు. మూర్తిగారు పార్లమెంటరీ సెక్రటరీ. ఈ ఇద్దరికీ ఎప్పుడూ పడేది కాదు రాజకీయంగా.

భారత సంవిధానంలో హరిజనులకు ఇవ్వబడ్డ ప్రత్యేక సౌకర్యా లన్నిటికీ అంబేద్కరు గారు మూలకారకు లైనట్టే, రాష్ట్రంలో మామూల కోసం ప్రభుత్వం ఈనాటికి నిర్వహిస్తున్న ప్రధాన కార్యక్రమా లన్నిటికీ కూర్మయ్యగారే మూల కర్త. ఈ విషయంలో ఆయనకు నిత్య సన్నిహితుడుగా వున్న భీమన్న పాత్ర అతి ప్రధాన మైనట్టిది.

"ఇప్పుడున్న పరిస్థితిలో హరిజనాభ్యున్నతి కోసం మనం చేయగలిగిం దేమిటి? ఆర్థిక రంగంలో విప్లవకరమైన మార్పును వెంటనే తేగలమా? అట్టి మార్పును అచిర భవిష్యత్తులోనే సాధించగల పథకాలను వేటిని ఇప్పుడు అమలు పరచాలి? అవి ప్రశ్నలు. వ్యవసాయ కూలీలందరికీ వెంటనే భూములు పంచలేం, ఇళ్ళు కట్టలేం. అయితే అది ఎప్పటికైనా జరగక తప్పదు. విశ్వకు విస్తారంగా హాస్టళ్ళను పెట్టి, విద్యావంతులను తయారు చేసుకుంటూ

పోతే , తమకు కావలసిన హక్కు-లను వాళ్ళే సాధించుకుంటారు . అనేది అనాటి కూర్మయ్యగారి కార్యక్రమానికి మూల సూత్రం .

ఏ నిర్ణయం తీసుకోవలసి వచ్చినా , ఏ పని చెయ్యవలసి వచ్చినా భీమన్నతో ఆలోచించేవాడు కూర్మయ్యగారు.

జిల్లాలలో , తాలూకాలలో , ఆయా కేంద్రాలలో చిరకాలంగా హరిజన సేవచేస్తున్న చిన్న పెద్ద నాయకులను పిలిచి , హాస్టళ్ళను నెలకొల్పడానికి ప్రోత్సహించారు . అప్పటికే వున్న హాస్టళ్ళకు ఎక్కు-వ గ్రాంట్లను మంజూరు చేసి సమీకరించారు . ప్రతి విద్యార్థికీ స్కా-లర్షిప్పు అందేలా చర్యలు గైకొన్నారు . పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుకు కూడ స్కా-లర్షిప్పును ప్రవేశపెట్టారు . అట్టి స్కా-లర్షిప్పును తమ లా డిగ్రీ చదువుకోసం తొలిసారిగా అందుకొన్నవారు దామోదరం సంజీవయ్యగారు . ఆయనతో భీమన్నకు మొదటిసారిగా పరిచయ మయింది మంత్రి కూర్మయ్యగారి ఆఫీసుగది వరండాలోనే .

హరిజనాభ్యుదయ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా కొనసాగించవలసి వుంది . అందుకు ఒక ప్రెస్సు , ఒక పేపరు వుండాలి . మంచి వర్క-ర్లను తయారు చెయ్యాలి . సాహిత్యాన్ని సృష్టించాలి . ఇది భీమన్న స్కీము . కూర్మయ్యగారు పూర్తిగా ఏకీభవించారు . కార్యరంగంలోకి దూకారు . " వ్యవసాయ కూలీ " పత్రిక స్థాపనతో కార్యక్రమం ప్రారంభమయింది .

ఒకప్రక్క మూర్తిగారి 'నవజీవన' నడుస్తూనే వుంది . దానికొక సొంత ప్రెస్సుకూడ వు ది . ఆయన తమ్ముడు సుబ్బారావు మంచి రచయిత . మేనల్లుడు కృష్ణమూర్తి మంచి వ్యవహర్త . భీమన్న తోడ్పాటు ఎప్పుడూవుంది. ప్రోత్సహిస్తే ఎంతటి పనినైనా చేయగల యువకులున్నారు . చేతిలో అధికారం వుంది . ఇన్ని వుండికూడ మూర్తిగారు ఏమీ చెయ్యలేకపోయారు . కూర్మయ్యగారు ఏమైనా చెయ్యగలరేమో చూద్దాం అనుకొన్నాడు భీమన్న.

కమతం షణ్ముఖంగారనే హరిజన శాసనసభ్యుని పేరును ఎడిటరుగా ఉపయోగించుకొన్నా , 'వ్యవసాయకూలీ' పత్రికను పూర్తిగా నిర్వహించిన వాడు భీమన్న ఒక్కడే . కొంతకాలంపాటు వడ్డి వెంకటశివరావు సహాయ

సంపాదకుడుగా వున్నాడు. ఆయన ఆప్పట్లో బాగా వ్రాసేవాడు. ఆయన వ్రాసిన కొన్ని పాటలనూ, భీమన్న వ్రాసిన కొన్ని పాటలనూ కలపి "వ్యవసాయకూలీ ప్రబోధగేయాలు" అనే పేరుతో ఒక చిన్న గ్రంథాన్ని ప్రకటించారు. కాంగ్రెసుకు అనుబంధంగా "వ్యవసాయకూలీ కాంగ్రెసు" అనే పేరుతో ఒక రాజకీయ సంస్థను నెలకొల్పారు. దానికి జిల్లా, తాలూకా శాఖలను ప్రారంభించారు.

వ్యవసాయ కూలీ కాంగ్రెసును పటిష్ఠం చెయ్యడానికి గాను అంతవరకు కష్టజీవి, ధన్యజీవి పేర్లతో ప్రచారంలో వున్న నాటకాన్ని కొంచెం సవరించి "కూలిరాజు"ను చేశారు. "వ్యవసాయ కూలీ ప్రచురణ"లకు శంకుస్థాపన చేశారు.

"ఈ వూపులోనే ప్రెస్సు కూడా కొనేస్తాం. ఇదిగో డబ్బు రెడీగా ఉంది. మంచి ప్రెస్సు చూచి, బేరం కుదుర్చుకొని వచ్చెయ్!" అన్నారు కూర్మయ్య గారు ఒక రోజున భీమన్నతో.

అంతకు ముందే యిద్దరూ కలిసి చాలా ప్రెస్సులను చూచి వున్నారు. భీమన్న వెళ్ళి అందులో ఒక మంచి ప్రెస్సును చూచి, బేరం కుదుర్చుకొని, కూర్మయ్య గారి గదికి వెళ్ళేటప్పటికి, ఆయన వద్ద చల్లపల్లి దివాను గారట ఎవరో కూర్చొని వున్నారు.

"బెజవాడలో రాజావారి ప్రెస్ ఒకటి వుంది కదా. అది వారి కెందుకూ పనికి రావడం లేదట. దాన్ని మనం తీసుకుందాం. ఇప్పుడు వేరే కొనడ మెందు కంటున్నారు దివాను గారు. ఏం చేద్దాం?" అన్నారు కూర్మయ్య గారు, భీమన్నను చూడగానే! దివాను గారి మాటకు తిరుగే ముంది?

అదే ఆ వుద్యమానికి గోటివేటు అయింది!

మంచి ధర కర్గియుండియు,
అంచితముగ లక్ష్మి సొంత అలే యయ్యున్,
చెంచెతను కోరదే హరి?
చంచలమే పురుష మనసు; జగమున పిల్లీ!

—పిల్లీ శతకము

97. కూలిరాజు ప్రదర్శన

వ్యవసాయ కూలీ పత్రికను ముద్రిస్తున్న ప్రెస్సులోనే కూలి రాజు ప్రింట యింది. దానిని కూర్మయ్య గారికి అంకిత మిచ్చాడు భీమన్న.

కూర్మయ్య గారి వద్ద జనార్ధనరావు నాయుడు పర్సనల్ సెక్రటరీగా వున్నాడు. ఆయన కూలి రాజు నాటకం చదివి దిమ్మెర పోయాడు.

"ఇది చాల గొప్ప నాటకం సార్! దీనిని మా సెక్రటేరియేట్ తెలుగు అసోసియేషను వాళ్ళం ప్రదర్శిస్తాం. పర్మిషను ఇవ్వండి". అంటూ కూర్మయ్య గారిని కోరి, రిహార్సల్సు ప్రారంభించా రాయన.

జనార్ధనరావు నాయుడు ప్రదర్శనకు సర్వ సంచాలకుడు, విలన్ పాత్ర ధారి కూడ. వి. కె. రామారావు దర్శకుడు. ఆ యిద్దరికి దర్శకత్వ ప్రతిభతో పాటు అద్భుతమైన సంగీత జ్ఞానం వుంది. నాయకుడు పెచ్చేట్టి చెల్లారావు, ప్రౌఢత్వంగా పాడతాడు. పాత్రధారులంతా సెక్రటేరియట్ ఉద్యోగులే. అందరూ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉన్నతాధికారులైన వారే, స్త్రీ పాత్రలను మాత్రం సినీ రంగం నుంచి తెచ్చారు.

భీమన్న నాటకా లన్నిటి వలెనే, కూలిరాజు కూడ గద్య పద్యాత్మక నాటకం. నాయకుడు, సహనాయకుడు, నాయిక, సహ నాయిక, ప్రబోధకుడు ఈ అయిదు పాత్రలకు పాటలు, పద్యాలు వుంట్రై. ఈ నాటకంలో మరీ ఎక్కువగా వున్నై. అందువల్ల సంగీత దర్శకత్వం కోసం ప్రఖ్యాత సినీ మ్యూజిక్ డైరక్టర్ టి. వి. రాజు గారిని తీసుకు వచ్చారు.

పాత్రధారు లందరూ గొప్ప నటులు. పాడవలసి వున్న వారు గొప్ప గాయనీ గాయకులు. రిహార్సల్సు జరిగిన ఆ రోజులలో సెక్రటేరియట్‌లో ప్రతి సాయంత్రమూ ఒక ఇంద్ర సభ దిగి వచ్చి నట్లుండే దంటాడు భీమన్న.

ప్రదర్శన మ్యూజియం థియేటర్‌లో ప్రధాన న్యాయమూర్తి పాకాల రాజ మన్నారు గారి అధ్యక్షతలో జరిగింది. మంత్రులు, న్యాయమూర్తులతో

సభా మద్రాసులోని తెలుగు ప్రముఖులంతా హాజరై ఆశ్చర్యానందాలతో వూగి పోయిన ప్రదర్శన అది.

"కాంగ్రెస్ ప్రభుత్వం ధైర్యంచేసి ఈ నాటకాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్ళి నట్లైతే, ఈనాడు అలముకొంటున్న కమ్యూనిస్టు ప్రమాదం సడలిపోయి, శాంతియుతంగా సోషలిస్టు సమాజం ఏర్పడడానికి మార్గం సులువు కాగలదు. సాహితీ హృదయంతో నేను హోం మంత్రి మీనన్‌గారికి ఈ సలహా ఇస్తున్నాను" అన్నారు రాజమన్నారు గారు - తమ అధ్యక్షోపన్యాసంలో. రచయితను, నటులను ఎంతగానో ప్రశంసించారు. ఆయనతో భీమన్నకు సాన్నిహిత్యం ఏర్పడిందప్పటి నుంచే.

వి. కె. రామారావు గారి చెల్లెలు వింజమూరి లక్ష్మి, ప్రసిద్ధ గాయకుడు ఏ. ఎమ్. రాజా కలిసి కూలిరాజులోని కొన్ని పాటలు గ్రామఫోను రికార్డు ఇచ్చారా సమయంలో. సినిమాలకు కూడా భీమన్న పాటలను రికమండుచేస్తూ వున్నారు టి. వి. రాజుగారు. అదొక ఊపు.

హరిజనులకు దేవాలయ ప్రవేశమైనా జరిగింది కాని, సినీరంగ ప్రవేశం ఇంతవరకు జరిగినట్టు లేదు.

కూటి కోసము ప్రతి రోజు కూలి కేగు
కులము లన్నియు ఒక్కటే కులము కాదె?
బ్రాహ్మణుండు మొదలీ మాదిగ వాని వరకు
కష్ట పడువాడు ప్రతివాడు కార్మికుండె!

—కూలిరాజు (నాటకం)

98. బాహ్యాభ్యంతర శుచి

"భీమన్న నా మనిషి, నీవు చల్లగా నీ వైపుకు లాక్కున్నావు" అన్నారట మూరిగారు కూర్మయ్యగారితో ఒకసారి.

"భీమన్న నీ మనిషికాదు, నా మనిషికాదు, ఎవరి మనిషికాదు. ఆయన కవి. మనందరం ఆయన "మనుషులం" అని జవాబిచ్చారట కూర్మయ్య గారు.

ఈ విషయం ఒక రోజున భీమన్నతో చెపుతూ, "నీ వంటే మూర్తికి కొంచెం కోపంగానే వున్నట్టుంది" అన్నారు కూర్మయ్యగారు.

"నీవు పైకి కనిపించేటంత అమాయకుడివి కాదు. నీలో కనుపించని ధూర్తత్వం చాలా వుంది. లేకపోతే ఇద్దరు రాజకీయ శత్రువులకి విశ్వాస పాత్రుడి వెలా అవుతావు?" అన్నాడొకసారి జొన్నల మోహనరావు, అదయారు మర్రిచెట్టుక్రింద కబుర్ల సందర్భంలో.

భీమన్న ఆటు మూర్తిగారి 'నవజీవన'ను, ఇటు కూర్మయ్యగారి వ్యవసాయ కూలీని సమానంగా నడిపించిన రోజులవి. "మిరియం" అనే కలంపేరుతో 'నవజీవన'లో రాజకీయ వ్యాఖ్యలు వ్రాస్తూవుండేవాడు. "కూలీశతకాన్ని" ప్రింటుచేయిస్తానని అంతకు చాలరోజులముందే కమతం షణ్ముఖంగారు తీసుకుపోయారు. అదేమైపోయిందో తెలియదు. బహుశ అందులోని విపవభావాలకు బెదరిపోయి వుంటాడాయన. ఆ తర్వాతనే 'పిల్లీశతకం' వ్రాశాడు భీమన్న.

ఆ కాలంలోనే సూర్యభగవాన్లు అనే ఒక మిత్రుని ప్రోత్సాహంద్వారా 'తోటమాలి' అనే గేయనాటకం 'జమీన్ రైతు' పత్రికలో సీరియల్‌గా ప్రకటింపబడింది. అదికూడ ఇప్పుడు దొరకడంలేదు.

కూర్మయ్యగారి అధికార నివాసం కాంథోంలో. ఆయనకు నిత్య సన్నిహితుడుగా వుండడంకోసం భీమన్న కుటుంబాన్ని రాజోలు పంపించేసి, ఒంటరిగా వుంటూవుండేవాడు. ఆ కాలంలో ఈయన ప్రైవేటు జీవితం బీచీ విహార ప్రభలతో, ఉద్యానవల్లి వినోదాలతో, సుహ్యన్మణీ మధుర సన్నివేశాలతో పరమానందంగా గడిచింది. వాటన్నిటినీ ఈయన రచనలలో వెతికి పట్టుకోవచ్చు.

"ఏమండీ మీరు కూర్మయ్య గారి వద్ద ఉన్నప్పుడు ఒక్క మాటైనా మాట్లాడే వారుకాదు! మీకు మాటలు రావనుకునే వాళ్ళం!" అని అంటూ ఆశ్చర్యపడు తుండేవాళ్ళు - ఆ తర్వాత ఎక్కడైనా కలుసు కొన్నప్పుడు, భీమన్న మాటలు వింటూ ఎంతో మంది మహిళలు.

"మీరు ఆయన కోసం వచ్చే వాళ్ళు, నాకోసం వచ్చిన వాళ్ళతో తప్ప నేను మాట్లాడను" అనేది ఈయన జవాబు. ఇతరుల స్నేహ వ్యవహారాలలో, ముఖ్యంగా తన మిత్రుల ప్రేమ వ్యవహారాలలో భీమన్న ఎన్నడూ కలుగ జేసి కోలేదు.

తనను వెతుక్కుంటూ వచ్చిన సౌందర్యాన్ని ఆరాధించడం తప్ప, తానుగా ఏ సౌందర్యం వెంటా పడలేదు. తానెంతగా ఆరాధించి, కవితా వేశం పొందిన వాళ్లైనా సరే, పరకీయ లైనప్పుడు - వాళ్ళ మాట కూడ ఇక ఎత్త డీయన. ఎదురు పడ్డా తెలియనట్టే తప్పుకు పోతాడు. అది కేవలం సాంఘిక మర్యాదకు కట్టు పడ్డ బాహ్య ప్రవర్తన మాత్రమే. తనను లేక తాను ప్రేమిం చిన ఎవరికి గాని తన మూలకంగా బాధ కలగ కూడ దనేదే ఈయన లక్ష్యం. చిన్నప్పటి నుంచీ కూడ ఇదే ఈయన ప్రవర్తనకు మార్గదర్శక సూత్రం.

అయితే – ఈయన స్నేహ పరిధిలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ కూడ ఈయన కవితానందంలో అమృతాక్షర మూర్తులుగా స్థిరపడి పోతారు, ప్రేమకు పరమార్థమైన రసాద్వైతంలో సంలీన మవుతారు.

భీమన్న జీవితం వేల కొలది ఉపాఖ్యానాలతో కూడిన ఒక శృంగార మహా కావ్యం అనవచ్చు. అంత మాత్రం చేత ఈయన స్వైర విహారి కాదు. క్రమశిక్షణతో, బాధ్యతతో, మానవతతో జీవించే బాహ్యాభ్యంతర శుచి మంతు డీయన. చంచల మనస్కులైన మిత్రులను సన్మార్గానికి మళ్ళించిన ఉదంతాలు ఎన్నో వున్నై ఈయన జీవితంలో.

పంకజ మని చెప్పినచో
పార్వతువె పద్మమును ?
నీవు కోరునది నిస్తుల
నిర్మల పుష్పమె కాదా ?

—పైరు పాట

99. ఒక విచిత్ర ఉదంతం

అవి కూలిరాజు రిహార్సల్సు జరుగుతున్న రోజులు.

స్త్రీ పాత్రలు సినీరంగం నుంచి రావడంవల్ల , గంటలు క్షణాల్లా గడిచి పోతున్న సాయం సంధ్యలు .

భీమన్నకు అతి సన్నిహితుడు , స్నేహితుడు అయిన ఒక వసంతుడు ఒకామె పట్ల మోహవశుడై కొట్టుమిట్టాడ సాగాడు . ఆమె సినీ ఆకాశంలో ఒక ఎగస్ట్రా తార . వసంతుడు అంతవరకు పరస్త్రీ మొగం చూడని పవిత్ర శీలి .

ఏం చెయ్యాలో తోచలేదు భీమన్నకు . మిత్రుడు చెడి పోవడం ఈయన కెంత మాత్రం ఇష్టం లేదు . సినీ రంగంలోని ఎగస్ట్రాలను నమ్మడానికి వీలు లేదు . పైగా , ఆమె ముఖంలోని నిగనిగ వెనుక ఏదో భుగ భుగ కనుపిస్తున్న దీయనకు . వసంతుడి కలాంటివేమీ కనిపించడం లేదు .

"మీరింత కఠినంగా వుంటా రనుకోలేదు . అనుకొంటె ఆసలు మీతో చెప్ప కుండానే పోదును . ఆమె ఎప్పుడు ఫోను చేస్తే అప్పుడే వస్తా నన్నది . ఇక మీరు ఊ అనక తప్పదు" అన్నాడాయన చివరగా . ఇక ఆగలే నన్నాడు . అందువల్ల ఎన్ని బాధలు వచ్చినా పడగల నన్నాడు . భీమన్న అంగీకరించక తప్పలేదు . తామిద్దరూ కలిసి , ముందుగా చెప్ప కుండా ఆమె యింటికి వెళ్ళ డానికి నిశ్చయించుకున్నారు . ఆమె నాలుగు రోజులుగా అటుకేసి రావడం లేదు .

ఆ మరునాడు ఉదయం ఆయిదు గంటలకే బైలు దేరి , తేనాం పేటలోని ఆమె యింటికి వెళ్ళారు . ఇంకా ప్రొద్దు పొడవ లేదు . ఎవరూ లేవ లేదు .

కొంచెం సేపటికి దొడ్డి తలుపు తీసుకొని ఒక వ్యక్తి బైటికి బైలు దేరాడు . ఆతడి చేతిలో ఒక సత్తు చెంబు వుంది . వయసు మళ్ళిన వాడు , కుష్ఠు రోగి !

మరి కొంత సేపటికి బైటి నుంచి ఒక ముసలామె అదే దొడ్డి గుమ్మం ద్వారా లోపలికి పోతున్నది . ఆమెను ఆపి , ఫలానా తార ఇల్లు ఇదే కదా అని ప్రశ్నించారు మిత్రులు . అవు నన్న దామె . ఆమె చెప్పిన దానిని బట్టి - ఆమె పని మనిషి , ఆ బైటికి పోయినతడు తార భర్త !

నిలువునా కంపించి పోయాడు సంతుడు ! తిరిగి పోదాం పదమన్నాడు .

"ఇంత దూరం పని గట్టుకు వచ్చాం . ఆమెను చూచే పోదాం" అన్నాడు భీమన్న .

పనిమనిషి వెళ్ళి వీధి గుమ్మం తెరిచింది . మిత్రు లిద్దరూ లోనికి ప్రవేశించారు . అది మనుషులుండే కొంపేనా ?

కాళ్ళు , చేతులు గసిగిపోయిన రెండో , మూడో కుర్చీలు . వాటి నిండా మాసిపోయిన బట్టలు . మురికి , చీకటి తప్ప ఆ గదిలో మరేం లేదు .

కొద్ది నిముషాలలో ఆ ప్రక్క- తడికల గదిలోనుంచి పాలిపోయిన జబ్బు ముఖంతో తార తల్లి వచ్చింది - కాదు . తారే వచ్చింది !

ఆ వీధి మొగలోనే వున్న ఒక మంత్రిగారి దర్శనార్థం వెళ్ళామనీ ఆయన ఖయటికి రావడానికి వ్యవధి వుండడం వల్ల , ఇలా వచ్చామనీ చెప్పారు మిత్రులు . ఇప్పుడే వస్తా అంటూ ఆమె లోపలికి వెళ్ళిపోయి , పది నిముషాలలో మేకప్పై , రెండు కప్పుల కాఫీతో ప్రవేశించింది . ఆవి చూడగానే మిత్రులు అదిరి పడ్డారు . ఆ ఇంట్లో , ఆ కప్పులతోకాఫీ తాగడమా ? కాని-తాగక ఏం చేస్తారు ?

ఎంతటి ప్రమాదం నుంచి భీమన్న తనను తప్పించాడో అప్పటికి అర్థ మయింది వసంతుడికి వాస్తవానికీ , మేకప్పుకూ నడుమ ఎంతటి నరకజ్వాలం వుంటుందో స్పష్టంగా చూడగలిగా డతడు .

ఆ రోజులలోనే తిరుమలపై హరిజన దేవాలయ ప్రవేశం జరిగింది . పార్లమెంటరీ సెక్రటరీ మూర్తిగారితో కాలినడకన కొండెక్కి , మంత్రి కూర్మయ్యగారితో కారులో క్రిందికి వచ్చాడు భీమన్న . అదొక చరిత్రాత్మక సన్నివేశం . అదే భీమన్న తిరుమలకు మొదటిసారి వెళ్ళడం . రామస్వామి రెడ్డియార్ ముఖ్యమంత్రిగా వున్న రోజులవి .

పచ్చగడ్డి కొయ్యడమూ
పరిపాలన చెయ్యడమూ
దారులు వేరే అయినా
దూరం ఒకటే శివుడికి

—పైరుపాట .

100. ఎవరు కమ్యూనిస్టు

దేశంలో కమ్యూనిస్టు ప్రాబల్యం శిఖర స్థాయిలో వుంది. కాంగ్రెసు అప్పుడే అధికారంలోకి వచ్చింది కనక, దాన్ని సులువుగా పడగొట్ట వచ్చునని కమ్యూనిస్టు లను కొన్నాగట.

కమ్యూనిజం పట్ల భీమన్నకు వై ముఖ్యం లేదు. ఉపనిషత్ పరిజ్ఞానం ఉన్న ప్రతి మనిషి కమ్యూనిస్టే అంటాడు భీమన్న.

ఆది భిక్షువే ఆది కమ్యూనిష్టు.

ఆయితే - విదేశీ మార్క్ భారతీయ కమ్యూనిస్టు లంటేనే భీమన్నకు గౌరవం లేదు. దేశీయ పరిస్థితు లర్థం చేసుకోరు వీళ్ళు. నాయకత్వ మంతా అగ్రకుల భూస్వాముల కొడుకుల చేతుల్లో వుంది. వాళ్ళు కేవలం క్రింది వర్గాల ప్రజలను స్వార్థాని కుపయోగించుకొని, కమ్యూనిజానికే ద్రోహం చేశారని భీమన్న ఆంచనా.

రాజోలు తాలూకాలో ఆ(1948)నాటి పరిస్థితి మరీ ఘోరంగా వుంది. మామూలపై పోలీసు దౌర్జన్యాలను రెచ్చగొట్టి, కాంగ్రెసు ప్రభుత్వం పట్ల వాళ్ళకు ఏహ్యభావం కలిగించాలని కమ్యూనిస్టు నాయకులు ఎత్తు వేశారు. ఆ నాయకు లంతా అగ్రకుల యువ భూస్వాములే. వాళ్ళంతా అండర్ గ్రౌండ్ లోనికి పోయినప్పుడు, వాళ్ళకోసం గాలిస్తూ పోలీసులు మామూపేటల్లో చేసిన ఘోరాలు ఇన్నీ, అన్నీ కావు. అదే అదనుగా, పోలీసుల వెంట భూస్వాములు వెళ్ళి, తమ పాత పగలన్నీ తీర్చుకొన్నారు విశృంఖలంగా.

అన్న కాంగ్రెసు నాయకుడైతే, తమ్ముడు కమ్యూనిస్టు నాయకుడు. అలా పంచుకొన్నారు భూస్వాములు రాజకీయాలను. తమ్ముడికి అండర్ గ్రౌండ్ అన్నగారి భవనమే. నాళన మయ్యేది మాత్రం అమాయకులైన మామూలు, వాళ్ళ కుటుంబాలు, పేటలు:

కమ్యూనిస్టులకు ఆశ్రయ మిస్తున్నారన్న కారణంగా మామూలపై పోలీసు లే కాదు, ప్రభుత్వ రెవిన్యూ శాఖ కూడ చర్య తీసుకోసాగింది. ఫీల్డు లేబర్

కో ఆపరేటివ్ సొసైటీల కిచ్చిన లంకలను చాలచోట్ల ఊడబెరికేసింది. మొత్తం తాలూకా గగ్గో లెత్తే సింది.

పరిస్థితిని మంత్రి కూర్మయ్య గారికి వివరించి, రాజోలు తాలూకా పర్యటనకు తీసుకెళ్ళాడు భీమన్న. మంత్రిగారి పర్యటన కార్యక్రమాన్ని తమ చేతుల్లోకి తీసుకోడానికి అక్కడి భూస్వాములు చేసిన ప్రయత్నాలు కొనసాగలేదు. తన కార్యక్రమం యావత్తూ భీమన్న చేతిలో వున్నదని ఖచ్చితంగా చెప్పేశాడు కూర్మయ్యగారు.

నర్సాపురంవద్ద వసిష్ఠా గోదావరిని దాటి, రాజోలు తాలూకాలో అడుగు పెట్టింది మొదలు ఆ జనం, ఆ ఊరేగింపులు, ఆ సభలు, ఆ ఉత్సాహోద్రేకాలు, ఆ ఉపన్యాసాలు చెప్ప నలవికాదు.

అక్కడి మామూల పరిస్థితిని స్వయంగా పరిశీలించి కూర్మయ్యగారు మంత్రి హోదాలోను, వ్యవసాయకూలీ సంఘ అధ్యక్ష హోదాలోను ఆయా సభలలో మామూలకు చేసిన ఉద్బోధలు, భూస్వాములకు చేసిన హెచ్చరికలు అపూర్వమైనట్టివి. ఆ రోజు వర్షం కురుస్తున్నా, కట్టుకొన్న ఖద్దరు బట్టలు తడిసి మట్టిగొట్టుకుపోయినా, లెక్క చెయ్యకుండా సఫలీకృత మనోరథుడైన భీమన్న ఆనందానికికూడ అవధి లేక పోయింది.

అయితే- ఈ విజయోత్సాహం ఎంతోకాలం నిలవవేదు. కమ్యూనిస్టుల్ని అణచివెయ్యగలరేకాని, కూర్మయ్యగారి వ్యవసాయ కూలీకాంగ్రెసు బలపడితే దాన్ని ఎవరూ ఏమీ చేయలేరు. ఈ సత్యాన్ని గ్రహించిన రాజకీయ పెద్దలు కొందరు ఆలోచనచేసి, ఆ తర్వాత ఏర్పడ్డ మూడో మంత్రివర్గంలో కూర్మయ్యగారికి స్థానం లేకుండా చేశారు.

భీమన్ననుకూడ ఏదో చెయ్యాలనుకొని, కొందరు మామూ శాసన సభ్యుల చేతనే ప్రభుత్వానికి ఒక పిటీషను పెట్టించారు –

"మనం అక్కడక్కడ వున్న కమ్యూనిస్టుల్ని ఏరివేస్తున్నాం. ఇక్కడే ఈ సెక్రటేరియట్‌లోనే మహా ప్రమాదకరుడైన ఒక కమ్యూనిస్టు వున్నాడు.

వాడు వ్రాసిన పాలేరు కమ్యూనిస్టు నాటకం. అది రాష్ట్రమంతటా నిషేధించ బడ్డది. వాడి అంతేదో తేల్చెయ్యండి" అంటూ.

కందికట్ల నాగభూషణం వంటి హరిజన యువనాయకులెందరో కమ్యూనిజం పేరిట నాశనమైపోయిన భయంకర రోజులవి.

ఆ పిటీషను అంతు తేలడానికి కొన్ని నెలలు పట్టింది. అంతవరకు అది పరమరహస్యంగానే వుంది. భీమన్నకేమీ తెలియదు.

మంత్రివర్గం నుంచి కూర్మయ్యగారు పోయినట్టుగానే ఆయన నియమించిన చావలి హనుమంతరావుగారుకూడ సమాచారశాఖ డైరెక్టరు పదవినుంచి తొలగి పోయారు. అప్పటికి ద్రవ్యం అనే యువకుడు డైరక్టరుగా వచ్చాడు. ద్రవ్యం కాంగ్రెసువాడు. ఆగసు విప్లవాగ్నిలో దుమికిన సాహసిక విద్యార్థి. మంత్రి భక్తవత్సలం గారికి కుడిభుజం. గొప్ప ప్రతిభావంతుడు, రచయిత. భీమన్నపట్ల గౌరవాభిమానాలు కలవాడు.

ఒకరోజున ద్రవ్యం గారు భీమన్నను పిలిపించుకొని "ఒక మహా విపత్తు నుంచి, ఒక అమాయకురాలైన కవిని రక్షించ గలిగి నందుకు నన్ను నేను అభినందించు కొని, తర్వాత మిమ్మల్ని అభినందిస్తున్నాను. మీరు గొప్ప అదృష్టవంతులు" అన్నాడు. అర్థంకాలేదు భీమన్నకు. అంతవరకు ఆ పిటీషను గురించే తెలియదు.

శాసన సభ్యులు పెట్టిన పిటీషను అర్జంటు రిమార్క్‌లతో సత్వర చర్య కోసం డిపార్టు మెంటుకు వచ్చిందట. భీమన్న తత్త్వమూ, మామా శాసన సభ్యుల తత్త్వమూ తెలిసిన వాడు కనుక, డైరక్టరు ద్రవ్యం ఒక సమగ్ర దర్యాప్తుకు పూను కొన్నాడట.

పాలేరు నాటక ప్రతుల్ని తెప్పించారు. ఒక ప్రతిని గవర్నమెంటు ట్రాన్సలేటరుకు పంపించి, అది కమ్యూనిస్టు నాటక మవునో కాదో చెప్ప మన్నారు. పాలేరు నాటకాన్ని నిషేధించారేమో తెలుప వలసిందిగా పోలీసు శాఖను, అన్ని జిల్లాల కలెక్టర్లను ఆడిగారు.

పోలీసు శాఖ నుంచి జవాబు వచ్చింది – దానిపై నిషేధమేమీ లేదంటూ. ఏ జిల్లాలోనూ కూడ అది నిషేధించ బడలేదు. కొందరు కలెక్టర్లు దాని పేరే వినలేదు. అయితే—గవర్నమెంటు ట్రాన్సలేటరు మాత్రం. అది కమ్యూనిస్టు నాటకమే అన్నాడు!

ఎందుకు అని అడిగితే – అందులోని ఒక పాత్ర భగవంతుని ఉనికినే అనుమానించి మాట్లాడాడు కనుక – అని జవాబు. నాస్తికుడు కమ్యూనిస్టా? ఒక పాత్ర మాట్లాడింది మొత్తం నాటకోద్దేశం అవుతుందా?

డైరక్టరు స్థానంలో ద్రవ్యంగారే లేకుంటే – ఈ ప్రశ్నలన్ని పుట్టేవో లేదో తెలీదు. ఇది పనికాదని–మొత్తం నాటకాన్ని మక్కికి మక్కిగా ఇంగ్లీషులోకి అనువదించి పంపమన్నారు. దాన్ని డైరక్టరూ, హోం సెక్రటరీ, చీఫ్ సెక్రటరీ – ముగ్గురూ కూర్చుని, నిశితంగా పరిశీలించి, అది కమ్యూనిస్టు నాటకం కాదు అనే నిర్ణయానికి వచ్చారు.

"నాటకం శక్తిమంతంగా వుంది, భాష నిశితంగా వుంది, సామాజిక విమర్శ కటువుగా వుంది. అయితే – ఆ కులంలో పుట్టి, ఆ నరకమంతా అనుభవిస్తున్న రచయిత ఆ మాత్రం తీవ్రత కనబరచడం విపరీతమేం కాదు" అని ఒక మంచి సర్టిఫికెట్టు కూడ నోట్ చేశారు.

ఇదంతా ప్రభుత్వానికి వెళ్ళి, ఆమోదం పొంది వచ్చిందట అప్పుడే. పిటీషను పెట్టిన శాసన సభ్యులు పెద్దలచే చివాట్లు కూడ తిన్నారట. అందులో ముఖ్యుడైన ఒక శాసన సభ్యుడు లోగడ భీమన్న అంబేద్కరు భక్తుడంటూ అగ్రనాయకులకు ఉత్తరాలు వ్రాసిన వాడే!

ఆ విధంగా వ్రతికి బయట పడ్డ భీమన్న 1949 చివరలో పార్లమెంటు సీటు కోసం ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆది సంజీవయ్య గార్ని వరించడంతో, తిరిగి ఆంధ్ర ప్రభ సంపాదక వర్గంలో చేరాడు. మిత్రుడు ద్రవ్యం గారు ఆ తర్వాత ఐ. ఏ. ఎస్. పాసై, మద్రాసు ప్రభుత్వంలో విద్యా శాఖ కార్యదర్శి అయారు.

బ్రతుకుతూ, బ్రతుకును నిందించకు
చస్తూ, చావుకు భయపడకు

— అనాధి కొస

101. ఎవడికి వాడే గొప్పవాడు

ఎవడికి వాడే - అహంబ్రహ్మాస్మి !

సృష్టిలో ప్రతిలవమూ బ్రహ్మే. ప్రతి జీవీ తాను బ్రహ్మే అనుకొంటుంది. అలానే ప్రవర్తిస్తుంది. ఒక్కమానవుడే కాదు, ప్రతి అణువు విషయంలోనూ ఇది సత్యమే. లేకపోతే, దానికి ఉనికి లేదు.

అక్షర జ్ఞానం కూడ లేని ఒక వ్యక్తి విద్యాధికుల్ని, విజ్ఞాన ఖనుల్ని ఆలించి పాలించ గిలగడంలోని రహస్యం ఇదే.

ఈ రహస్యం భీమన్నకు బాగా తెలుసు. కనుకనే ఏ విప్రతిపత్తికీ, ఏ వైరస్యానికీ, ఏ వైరుధ్యానికీ కూడ బెదిరిపోకుండా ధైర్యంగా, స్థైర్యగాంనిలబడగలిగాడు.

భారత సంవిధాన నిర్మాణం పూర్తికాగానే, ఆ సభ 1950లో పార్లమెంటుగా మారింది. అప్పటివరకూ రాష్ట్రీకాసన సభలోనూ, సంవిధాన సభలోను కూడ సభ్యులుగా వున్నవాళ్లు-సంవిధాన సభ లోక్‌సభగా మారగానే, ఏదో ఒక సభలో సభ్యత్వాన్ని వదలుకోవలసి వచ్చింది. అందువల్ల రాష్ట్రీకాసనసభలోని ఇద్దరు హరిజన సభ్యులు లోక్‌సభ సభ్యత్వాన్ని వదలుకొన్నారు. ఆ రెండు స్థానాలకు కాసన సభ్యులు కాని ఇద్దర్ని కాసనసభ ఎన్నుకోవలసి వుంది. ఆ ఎన్నికే 1949 చివరలో జరిగింది.

ఏ దృక్కోణం నుంచి, ఏ న్యాయ సూత్రాన్ని అనుసరించి చూచినా-ఆ రెండు స్థానాలలో ఒకటి భీమన్నకు రావలసి వుంది. అయితే, పదవీ రాజకీయాలకు ఒక దృక్పథమూ, ఒక న్యాయ సూత్రమూ వుండవు.

ఆ రెండు ఖాళీలూ రాయలసీమ నుంచే ఏర్పడ్డాయి. కనుక ఆ స్థానాలు తమకే రావా లన్నారు రాయలసీమ వాళ్ళు. అయితే-మొట్టమొదట రెండేళ్ళక్రితం ఎన్నిక జరిగినపుడు కోస్తా, రాయలసీమ అనే భేదం చూపబడలేదు కదా? ఆలోచించే దెవరు? నోరున్నవాడిది రాజ్యం!

"నేను గట్టిగా ప్రయత్నిస్తాను. కోస్తాకు ఒక సీటు వస్తే మాత్రం అది సిదే" అన్నారు కళా వెంకటరావుగారు భీమన్నతో.

"వస్తే రావచ్చు అనేది తప్ప, వచ్చి తీరుతుందనే రూఢిరేఖ లేదు" అన్నారు కల్లూరి సుబ్బారావుగారు భీమన్న చేయి చూచి. ఆ నాటికి ఆంధ్ర కాంగ్రెసులో మూడు గ్రూపులున్నై. వెంకటరావుగారు, కూర్మయ్యగారు పళ్ళంరాజుగారు ఎంత ప్రయత్నించినా ఫలితం లేక పోయింది.

ప్రకాశం గ్రూపు మాట చెల్లి, సీతారామరెడ్డి గారి అనుయాయికి పార్టీ సీటు లభించింది. ఆ ఎంపికను వ్యతిరేకించిన రంగా - సంజీవరెడ్డి - గ్రూపు అసెంబ్లీలో సంజీవయ్య గారి పేరును ప్రతి పాదించి నెగ్గించు కొన్నారు! సంజీవయ్య గారి కోసం అహర్నిశలు కృషి చేసి, ఈ ఫలితానికి హేతువైన వాడు సర్దారు నాగప్ప. ఆ స్థానం కూడ ఆయన ఖాళీ చేసినట్టిదే. మరో సీటు గంగాధర శివ గారికి ముందే ఇచ్చి వేయ బడింది.

రాజీనామాను ఉపసంహరించుకొని, తిరిగి ఉద్యోగంలో చేరమని కళా వారు సలహా ఇచ్చారు గాని, భీమన్న అందుకు ఇష్ట పడలేదు. ఆతర్వాత రెండేళ్ళలోనే సార్వత్రిక ఎన్నికలు వస్తున్నాయి. అప్పుడెలాగూ తనకు సీటు రాక తప్పదు. అందువల్ల, ప్రభుత్వానికి వెలుపల వుండటమే మంచిదనుకొని, నార్ల వారి సలహా తీసుకొని, ఆంధ్ర ప్రభలో తిరిగి చేరాడు.

అప్పటికే భీమన్న స్వీయ కవితలు, ప్రసంగాలు ఆకాశవాణిలో ప్రసారం అవుతూ వున్నై. భీమన్నకు మొట్ట మొదట స్వీయ కవిత ప్రోగ్రాం ఇచ్చిన వాడు ఆచంట జానకిరాం గారు. శ్రీ వాత్సవ, అయ్యగారి వీర భద్ర రావు, రజనీకాంతరావు గార్లు ఆ తొలి ప్రోత్సాహకులలో ముఖ్యులు.

తాను సమాచార శాఖలో వున్నప్పుడే, వాణి పత్రిక యొక్క సహాయ సంపాదక పదవి కోసం అప్లయి చేసి, ఇంటర్వ్యూకి ఢిల్లీ వెళ్ళాడు భీమన్న,

అప్పటికే ఆ పదవిలో జానకి రాం గారు ఏక్టు చేస్తున్నారు. ఆయనను కన్ఫర్మ్ చెయ్యడానికే ఆ ఇంటర్వ్యూ తంతు జరుగ తున్నట్టు భీమన్నకు మద్రాసులోనే తెలుసు. అయినా, ప్రభుత్వ ఖర్చుతో ఢిల్లీ చూచి రావచ్చు కదా?

"బోయి భీమన్న అంటే ఇంత చిన్న వాడా!" అంటూ ఆశ్చర్య పోయారట రంగాగారు, ఢిల్లీలో భీమన్నను చూచి. "ఏప్పటి నుంచో ఈయన పేరు వింటున్నాను, పత్రికలలో చదువు తున్నాను. బోయి భీమన్నంటే ఇంతింత మీసాలతో - ఏ డెబ్భై ఎనభై ఏళ్ళ వాడో అయి వుంటా డనుకున్నాను," ఆన్నారాయన.

అప్పటికి ఆఖిల భారత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కళావారు ఢిల్లీ లోనే వున్నారు. సంవిధాన నిర్మాణ సభ సమావేశాలు జరుగుతున్నాయి. ఆ సభ సభ్యులైన నాగప్ప, కేశవరావులకు భీమన్న అతిథి. వారితో కలిసి వెళ్ళి, సంవిధాన నిర్మాణ సంఘాధ్యక్షులైన అంబేద్కరు గార్ని దర్శించి, తన భక్తిని నివేదించు కున్నాడు భీమన్న.

వాణి ఇంటర్వ్యూ మామూలుగానే జరిగిపోయింది. తన కెలాగూ రాదు కాబట్టి, కొంటి ప్రశ్నలకు పెంకె జవాబులు చెప్పి, ఒక వారం రోజుల పాటు ఢిల్లీ అంతా చూసేసి వచ్చేశాడు. "నన్నేం చెయ్య మంటావు"? అని కళావారు అడిగినప్పుడు ఏమీ చెయ్యక్కర్లే దన్నాడు.

కూర్మయ్య గారి మంత్రి పదవి పోయింది. వ్యవసాయ కూలీని బెజవాడకు మార్చి, ప్రెస్సును నడప వచ్చు. వ్యవసాయ కూలీ కాంగ్రెసును పటిష్ఠం చెయ్యవచ్చు. ఈ ఉద్దేశంతో భీమన్న ఒకసారి బెజవాడ వెళ్ళి చూస్తే - అక్కడ ప్రెస్సు పేరుతో వున్నదొక పెద్ద ఇనప చక్రమూ, ఒక బండెడు రేకు ముక్కలూ!

"పోనిలే, ఆగ్రకుల భూస్వాములు ఇలానే మోసం చేస్తూ వుంటారు. కూర్మయ్య గారి నుంచి ఎన్నెన్నో సహాయాలు, ఉపకారాలు పొందిన హరిజనులున్నారు కదా, వాళ్ళతో కార్యక్రమాన్ని కొనసాగించవచ్చు" అనుకొన్నాడట భీమన్న. కూర్మయ్య గారు కూడ అదే అభిప్రాయపడి, తన అనుచరుల కోసం

చూస్తే - వాళ్ళెక్కడున్నారు ? క్రొత్త హరిజన మంత్రి గారి ఐంగళాలో మూగి వున్నారు !

ఎవడు అధికారంలో వుంటే వాడి చుట్టూ చేరుతారు జనం . అది మానవ నైజం . హరిజనులు కూడ మానవులే కదా ?

దేశంలో హరిజనులకు బలమైన నాయకులుగా రూపొందుతా రనుకొన్న మూర్తి , కూర్మయ్య ఆ విధంగా ఒకరు త్యాగ శీలి కాక , మరొకరు దూర దృష్టిలేకా గిడస బారి పోయారు . అందరి వలెనే కేవలం పైరవీ నాయకులై పోయారు అంటాడు భీమన్న :

ఒద్దిక నుండుట , వేసిన
ముద్దను మాత్రమ్మో తినుచు మురియుట - ఇవియే
పెద్దల దయ సాధించెడి
విద్దెలు : ఇవి వద్దు సీత , వినవే , విల్లీ !
— విల్లీ శతకం .

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

సంకీర్ణ సర్గ

102. కొన్ని కుటుంబ విషయాలు

ఆంధ్రప్రభలో భీమన్న ఉప సంపాదకుడుగా వున్న 1950-55 మధ్యకాల మయిదేళ్ళూ ఈయన జీవితంలో ఒక విచిత్రమైన ఘట్టం అనవచ్చు, ఆర్థికంగా ఎంత అవస్థ పడ్డాడో, సాహిత్యకంగా అంత ఉన్నత స్థితికి పెరిగా దక్కడ.

ప్రతి రంగంలోనూ ఒకో వూహించని తుపాను వూపి వదిలేసే దీయనను. జీవిత నౌక ఎన్నో దక్కా మొక్కీలు తిని, ఒడ్డెక్కి పోయే దొకొక చోట. ఈ విషయా లన్నిటినీ ఇక్కడ క్లుప్తంగా కూడ చెప్పు కోడానికి స్థలం చాలదు.

ముమ్మిడి వరంలో భీమన్న చిచరుగా చేరినప్పటి నుంచీ తమ వద్దే వుండి చదువు కొంటూ, ఎంతో సహాయంగా వుంటూ వచ్చిన చిన్న మరదలు కృష్ణ వేణి, పెండ్లి నాటి నుంచీ భీమన్నను ఎంతో వాత్సల్యంతో చూచు కొంటూ వచ్చిన అవ్వ (అత్తగారి తల్లి) గోగు లచ్చమ్మ, సొంత చెల్లెలు కంటె ఎక్కువ ఆప్యాయతతో ఆదరించిన చెల్లె (బావమరది ప్రకాశరావు భార్య) సీతాలక్ష్మి ఇంచు మించు ఒకే కాల పరిధీలో దివంగతు లయ్యారు. అవి చూన సికంగా భీమన్నను బాగా క్రుంగదీసిన విషాద సంఘటనలు.

నిత్యానంద ప్రమత్తుడుగా వుండే భీమన్నకు సుఖ సంతోష సౌందర్యా లెంతగా ప్రణయ కవితా ప్రేరకా లవుతాయో - దానికి సమతూకంగా విషాద

పవనాలు వీచి జీవిత నగ్న సత్యాలను ఆ విష్కరిస్తూ వుంటాయి. అందుకే వీటన్నిటినీ ఇక్కడ పేర్కొనడం.

1946 లో భీమన్న ప్రభుత్వ సమాచార శాఖలో చేరగానే ఆయన కుటుంబం మద్రాసు వచ్చింది. పదేళ్ళ క్రితం ఎక్కడ చూచినా 'టు లెట్' బోర్డులే కనుపించే మద్రాసులో, ఒక్క చిన్న పోర్షను కూడ దొరకని స్థితి ఏర్పడి వుంది. అందువల్ల రాయపేటలో భూషి రామదాసు గారి ఇంట్లో కొంత కాలం వుండ వలసి వచ్చింది. రామదాసు, అన్నపూర్ణ దంపతులిద్దరూ ఎంప్లాయ్‌మెంటు ఆఫీసరులే, భీమన్నకు సన్నిహితులు. రామదాసుగారు ఆ కాలంలోమంచి కథలు వ్రాసేవారు. కళా హృదయులు. కవితా వేత్త.

ఆ తర్వాత విల్లివాకంలో బయ్యా సూరయ్య గారింట్లోను, పురుషవాకంలో మరో మిత్రుడు యాళ్ళ ముసలయ్య గారింట్లోను వుండి, చివరకు కొసపేటలో ఇల్లు దొరికితే అక్కడికి మారారు. నాగరత్నమ్మ 1948లో పిల్లలతో రాజోలు వెళ్ళిపోయి, తిరిగి 1950లో ఈయన ఆంధ్రప్రభలో చేరగానే మద్రాసు వచ్చింది. అప్పటికి చివరి సంతానం విజయలక్ష్మి చంటిపాప.

మొదట ముగ్గుర్ని - విజయ భారతి, దత్తాత్రేయ శర్మ, నాగవర్మలను చదువుకోసం రాజోలులోనే వదిలేసి చంటి పాపను మాత్రం తీసుకొచ్చింది నాగ రత్నమ్మ. పెరియమెట్టులోనే చిరకాలంగా తెలిసిన వాళ్ళ ఇంట్లో ఒక పోర్షనులో ఉండేవాళ్ళు. నాగరత్నమ్మ ఆరోగ్యం పాడవటం వల్ల, పొరుగువాళ్ళే ఎంతో సహాయం చేస్తూ వుండేవాళ్ళు - ముఖ్యంగా ఆ యింటి ఆవ్వ.

ఆ రోజుల్లోనే పల్లయ్య గార్ని మద్రాసు రప్పించారు తమతో వుండి పోవడం కోసం. ఆయన రెండు రోజులుండి, సిటీ పద్ధతులు తమకు పడవనీ, ఏదో ఖైదులో వున్నట్టుగా వున్నదనీ, తన మనస్సంతా తన తోట మీదే వున్నదనీ చెప్పి మూడో రోజున మామిడికుదురు వెళ్ళిపోయారు.

రత్నమ్మ ఆరోగ్యం మరీ పాడవటం వల్ల ఎగ్మూరు ఆస్పత్రిలో చేరింది. ఇంటి వద్ద చంటి పాప. తాను ఆఫీసు మానడానికి లేదు. వేరే తోడెవరూ లేరు. చాలా అవస్థ పడ్డాడు భీమన్న. అప్పటికి ఆమె ఏడోనెల గర్భిణి. రక్త హీనత. మళ్ళా రాజోలు పంపించేశాడు.

తర్వాత ఒక రోజున "రత్నమ్మను ఆస్పత్రిలో చేర్చాం. వెంటనే బయలుదేరు" అనే టెలిగ్రాంను అందుకొని రాజోలు వెళ్ళాడు. ఆమె అక్కడ లేదు. అక్కడ నుంచి రాజమండ్రి వెళ్ళాడు.

భీమన్న జీవితంలో కంటిన్యూటీకోసం ఈ కుటుంబ విషయాలను క్లుప్తంగా చెప్పాను. వివరంగా చెప్పాలంటే రసవత్తర విశేషాలు చాల వున్నై. కల్పనకు, ఊహకు కూడ అందని అద్భుత సంఘటనలు భీమన్న వాస్తవ జీవితంలో కోకొల్లలు. వాటిలో అనేకం ఈయన గ్రంథాల పరిశీలనలో దొరుకుతై.

ఇంతటిదా
నీ స్నేహ సహాను భూతి!
ఎంత వేడి వడపోసి
ఈ వెన్నెల కాసెదవో!
ఈ విరహ నిశీధి కూడ
ఇంత చల్లగా ఉన్నది!

— రాభీ

103. హరిజను లెలా వుంటారు?

అది మద్రాసులో ఇంకా ట్రాంబళ్ళు నడుస్తున్న రోజులు. భీమన్న ఒక ఆదివారం సాయంత్రం సకుటుంబంగా బీచికివెళ్ళి, అలా అలా సరదాగా తిరిగి చీకటిపడ్డ తర్వాత, పేరిస్ కార్నర్‌కివచ్చి, ట్రాం ఎక్కి కూర్చున్నారు. అది పెర్మినస్ కనుక ఒకప్రక్క విశాలంగా కూర్చున్నారంతా. మరొక పది నిమిషాలలో ట్రాం క్రిక్కిరిసి పోయింది, బైలుదేరింది.

ఆది కొంచెం దూరం వెళ్ళినతర్వాత అందులోకి ఒక వ్యక్తి ఎక్కి నిలబడ్డాడు. పైని హేంగర్ పట్టుకొని, ట్రాం వేగానికి అటూ, ఇటూ వూగి పోతున్నాడు. పైగా ఆయన బాగా వృద్ధుడుకూడా.

"శాస్త్రిగారూ కూర్చోండి"! అన్నాడు భీమన్న లేచి ఆయనకు చోటిస్తూ.
"ఎవరు నాయనా మీరు?" అన్నారు శాస్త్రిగారు కూర్చుంటూ.

" మేం ఎవరమో మీకు తెలియదు లెండి . నన్ను భీమన్న అంటారు . మీ పక్కనున్నది మా పెద్దమ్మాయి , ఆ ప్రక్కనున్నది మా ఆవిడ , వాళ్లు మా కుర్రాళ్ళు . మీరు నాకు బాగా తెలుసు . నేను కొంచెం పద్యాలుకూడా వ్రాస్తాను ."

" ఆహా ! ఏదీ ఒక పద్యం చదువు !"

మరచితివేమో గోప సుకు
మారుని ; మారుని గన్నతండ్రి ;

అంటూ కృష్ణాన్వేషణ అనే తన లఘుకావ్యంలోని ఒక పద్యం చదివాడు భీమన్న . తన పద్యాలలో తనకు బాగా కంఠతావచ్చిన పద్యం అదొక్కటే .

"చాల బాగుంది నాయనా ! ఇంత బాగా పద్యాలు వ్రాసేవాడిని నే నెర గక పోవడ మేమిటి ? మీ ఇంటి పేరు ?" అన్నారు శాస్త్రిగారు .

"బోయి" అన్నాడు భీమన్న .

"బోయి !" ఆలోచనలో పడ్డారు శాస్త్రిగారు .

"మీరు ఇంటి పేరు ఎందు కడిగారో నాకు తెలుసు . మా యింటిపేరు బోయి . మేం హరిజనులం ." అన్నాడీయన .

ఆశ్చర్యపోయారు శాస్త్రిగారు . ప్రక్కకు పిల్లల కేసి ఒకసారి చూశారు . "మీరు హరిజనులులా లేరే !" అన్నారు .

"హరిజను లంటే ఎలా వుంటారు ?"

బహుశ ఆ విధమైన ప్రశ్న శాస్త్రిగారికి అంతవరకు ఎదురై వుండదు . నిజమే . హరిజను లంటే ఎలా వుంటారు ? శాస్త్రి గారి నుంచి జవాబు లేదు .

"మీ రెప్పుడైనా హరిజనుల్ని చూశారా ? లేదు . పుస్తకాలలో చది వారు అంతే . హరిశ్చంద్ర నాటకంలో వీరబాహుడి వర్ణన చదివి , వేషం చూచి , హరిజను లంటే అలా వుంటారని మీ రూహించారు . వాస్తవంగా మీ రెన్నడూ హరి జనుల్ని చూడలేదు . ఇప్పుడు చూడండి . హరిజనులు మాకు లాగే వుంటారు ."

ఆ మర్నాడు ఆయన ఆంధ్రప్రభ ఆఫీసుకు వచ్చారు. నార్లవారు తమ సిబ్బందిని పరిచయంచేస్తూ, భీమన్న సీటు వద్దకు రాగానే - శాస్త్రిగారు మొగం అటు తిప్పేసుకుని ముందుకు సాగారు. అంతా ఆశ్చర్యపోయారు.

"హరిజనులు మాకులాగే వుంటారు." అని భీమన్న అన్నప్పుడు మరొక వాక్యం తన మనసులో చిగురించిందట. అదీ యిది. "మకో పాతికేళ్ళు పోయిన తర్వాత మీకులాగే వుంటారు" అనేది.

వాడా? వీడు?
వాడు చచ్చినా మారడు!
మనిషి మారినా
సమాజం మారినా
లోకమే మారినా
వాడు మాత్రం మారడు!

—గుడిసెలు

104. ఆస్పత్రిలో మధు గీత

భీమన్న రాజమండ్రి వెళ్ళి, ధవళేశ్వరం నివన్ ఆస్పత్రిలో అడుగు పెట్టేటప్పటికి, నాగరత్నమ్మకు ఇంకా తెలివి రాలేదు. మూడు రోజులుగా ఆపస్మారంలోనే పడి వుంది.

"మనిషిలో రక్తం లేదు. కడుపులో పిండం చనిపోయింది. అంతా అయిపోయినట్టే. తీసుకు పొండి" అని రాజోలు డాక్టరు చెప్పేసి, "రెండు మూడు గంటల్లో రాజమండ్రి తీసుకెళ్ళ గలిగితే, వాళ్ళు వెంటనే ఆపరేషను చెయ్యగలిగితే, ఏమో—" అన్నాడు తుది మాటగా.

వెంటనే టాక్సీలో బైలు దేరారు. పదిహేను మైళ్ళు వెళ్ళిన తర్వాత, విపరీతంగా రక్తస్రావం అయి, చనిపోయిం దనుకున్నా రట. డ్రైవరు ఇక ముందుకు సాగనంటే ఆతనికి రెట్టింపు చార్జీ యిస్తామని చెప్పి ముందుకు సాగించారట.

"బొబ్బర్లంక చేరేటప్పటికి, అప్పుడే ఆనకట్టమీద కార్లు రాకపోకలను బంధు చేశారు. పరిస్థితి గుర్తించి ఆ ఒక్క కారునూ వదిలారు. ఆ సీజనులో ఆనకట్ట దాటిన కారు అదే చివరి దట!

సరాసరి మిషన్ ఆస్పత్రికి తీసుకు వెళ్ళారు. డాక్టర్లు పరీక్ష చేసి లాభం లేదన్నారు. వెంటనే ఆమె తండ్రి చంద్రయ్య గారు పెద్ద డాక్టరు కాళ్ళమీద పడిపోయాడు.

"అమ్మా ఇంతదూరం వచ్చాం. ఆపరేషను చేయ్యించాం అనే తృప్తి మాకు దక్కించండి" అంటూ ఏడ్చాడు. డాక్టరు హృదయం కరిగింది.

రక్తం ఎక్కించిచూస్తా మను కొన్నారు. ఎవరి రక్తమూ మాచ్ కాలేదు. పట్నం నాలుగు మూలలకు నలుగురూ పరిగెత్తారు. సమయం మించి పోతున్నది. ఆపరేషన్ థియేటరుకు చేర్చారు. మొత్తం నర్సులు, డాక్టర్లు, ఇతర సిబ్బంది అంతా మోకాళ్ళపై వాలి ప్రార్థన చేస్తూ ఉండగా - పెద్ద డాక్టరు ఆపరేషను చేసింది. మధ్యలో కరెంటు పోగా, పెట్రొమాక్సు లైట్లు పెట్టి చేశారు. మగ శిశువు కడుపులోనే పోయింది. ఆడ శిశువు బ్రతికే వున్నది. ఆది జరిగి మూడు రోజులైనా తల్లి ప్రమాదం నుంచి బయట పడలే దింకా.

అదీ-అక్కడికి భీమన్న వెళ్ళేటప్పటికి వున్న పరిస్థితి. ఆ తర్వాత మెల్లి గా స్పృహ వచ్చిం దామెకు. కొద్దిగా కోలుకుని ఆస్పత్రి నుంచి బైటపడడానికి దగ్గరగా మూడు నెలలు పట్టింది. ఆ మూడు నెలలూ భీమన్న ఆమె సేవలోనే ఉండి పోవలసి వచ్చింది.

పూర్వం ధర్మన్నగా రుంటూ వుండే లక్ష్మీవారప్పేటలో, తమ దగ్గర బంధువులైన ఇంజేటి సామ్యాలు జానకమ్మ దంపతుల ఇంట, వుంటూ- భీమన తాను భోజనం చేసి, భార్యకు భోజనం తీసుకొని వెళ్ళేవాడు. పగలంతా అక్కడే వుండే వాడు. అన్యోన్యం, అనురక్తి, అనుకూలమూ కల దంపతులు కనుక, కాలక్షేపం బాగానే ఉండేది. పైగా ప్రణయ కవి కనుక, తానెక్కడుంటే అక్కడే ఒక బృందావనాన్ని పెంచుకోగల స్నేహశీలి కనుక, అది ఆస్పత్రి అయినా, ఆనందంగానే గడిచి పోయింది భీమన్నకు.

తాను అప్పుడప్పుడు వ్రాస్తుండే గీతాలను ఒకచోట చేర్చి, ప్రకటించా లను కొంటున్నా డప్పటికి. ముఖ్యంగా చిన్నప్పుడు కొబ్బరి తోటల్లో తిరుగు తున్నప్పుడూ, ఊడ్పుచేల గట్ల వెంట ప్రయాణం చేస్తున్నప్పుడూ అనేక భావాలు వస్తూ వుండేవి. నిజానికి ఈయనకు భావాలు రాని క్షైమంటూ వుండదు. నిరం తరంగా విశ్వ విహారాలు చేస్తుండే రకరకాల భావాలలో మధురమైన ప్రతిభావమూ ఈయన మనస్సును స్పృశించి పోతూనే వుంటుంది.

విశ్వప్రణయానికి శ్రుతి చేసి పెట్టిన వీణ ఈయన మనస్సు. ప్రణయం, శృంగారం వంటి మధుర భావాలు తప్ప మరేవీ దీన్ని కదిలించలేదు. అందుకే ఆకలి, బాధ, దుఃఖం వంటి వాటిని గురించి చెప్పవలసి వచ్చినా, ప్రియు డాలిని సంబోధించే చెపుతూ వుంటాడు. దీనివల్ల ఒక సౌలభ్యం కూడ ఏర్ప డింది. విడివిడి పద్యా లన్నిటిని చక్కగా ఒకచోట చేర్చవచ్చు. అలా చేర్చిన గ్రంథమే 'మధుగీత'. దానికి తుది మెరుగులు దిద్దడం ఈ కాలంలోనే జరిగింది.

ఈ మధుగీత వ్రాత ప్రతి భీమన్నకు బాలా మంది స్నేహితురాండ్రను సంపాదించి పెట్టింది. అవన్నీ అందమైన కథల్లా వుంటాయి. కల్పిత కథలి కంటె బాగుంటాయి.

సుబ్బరాజు అనే యువ మిత్రుడితో కలిసి, భీమన్న ఒక రోజున గోదా వరి ఆవతల ఏదో ఒక వూళ్లో పాలేరు నాటకం జరుగుతున్నదని విని, అక్క డికి వెళ్ళాడు. తానెవరో అక్కడ ఎవరికీ తెలియదు. ఆ రాత్రి నాటకం చూసేసి, మర్నాడు ఆ నాటక సమాజం వాళ్ళకు కొన్ని సలహాలిచ్చి వచ్చేశాడు.

మూడో రోజున ఆస్పత్రికి వెళ్ళేటప్పటికి, అది రక రకాల పుకార్లతో నిండి వుంది. భీమన్న కనపడ కుండా పోయిన సాయంత్రమే అక్కడి ఒక నర్సు కూడ కనపడ కుండా పోయిందట! మధు గీతలో పద్యాలు చదువుతూ ఆమె భీమన్నతో చనువుగా సరసాలాడుతూ తిరిగేది. అది పుకార్లకు దోహదం చేసింది. "అలా కన పడకుండా పోవడం ఆమెకు ఇదే మొదటి సారి కాదటలే" అన్నది నాగరత్నమ్మ!

సూర్యకాంత పుష్పంలా వుండే ఆమె ఒక రోజున ఆస్పత్రిలోకి వస్తూ, భీమన్న మీదకు ఏదో విసిరేసిందట. అప్పుడీయన "తేనె లూరెడి దగు నీ సువర్ణ

సుశరీరములో ఒక రమ్య భాగమున్ పుడికి గిరాటు వేసితివిపో !" అంటూ దానిని పట్టుకొన్నాడు . అదొక అనాస పండు బద్ద !

ఇలాంటి ఉదంతాలు చూసిన వాళ్ళు అనుమానించడంలో గాని , పుకార్లు పుట్టించడంలో గాని తప్పేముంది ?

హృదయ మిద మిత్ధ మని లేని వృషి తతులె
పూలో , వండ్లో ఒసంగు నీ పూజ లోవ:
ఏ మొసంగుదు నేను: నీ ప్రేమ బెరిగి
హృదయ మున్నది , నేవ చేయించు కొమ్మ:

—మధు గీత

105. కలరాతో చెలికారం

అది మంచి వర్షాకాలం . ముసుళ్ళు . గోదావరి గట్లొరిసి పారుతోంది . రాజమండ్రి , ధవళేశ్వరం పల్లపు ప్రాంతాలు వరదనీటిలో మునిగి పోయాయి . పట్టణం నిండా కళ్మలమూ , కంపూ . దానితో కలరా చెలరేగింది .

లక్ష్మీవారపేటలో తానున్న ఇంట్లోనే ఆ ప్రక్కవాటాలో, ఒక అర్ధరాత్రి ఓకిలింతలు వినబడసాగినై . గందరగోళం , మూల్గులు మొదలైనై . బైట హోరున వర్షం . ఏం చెయ్యడం ? ఆ రాత్రి ఎలా గడిచిందో తెలియదు . ఉదయం కాకముందే అక్కడినుంచి పారిపోయాడు భీమన్న .

ఆస్పత్రికి దగ్గరలోనే వుండే ఒక మిత్రుడు ఆహ్వానించగా వాళ్ళ యింట్లోనే , అరుగుమీద తడికలు కట్టించి , అందులో మకాం పెట్టాడు భీమన్న . ఆ ఇంట్లో భార్యాభర్తలు , వాళ్ళ చంటిపాప మాత్రం వుండేవారు . ఒకరోజు ఇంట్లోవుంటే , రెండురోజులు క్యాంపులో వుండే ఉద్యోగం ఆయనది . ఆస్పత్రిలోని నాగరత్నమ్మకు పత్యం వంటల దగ్గరనుంచి సమకూర్చి పెడుతూ భీమన్నకు ఎంతో సహాయం చేశారా దంపతులు .

వర్షం ఎడాపెడా కొడుతున్నది . కొన్నిరోజులుగా ముసురు పట్టివున్నది . వరద నీరు ఇంటి గడపను తాకి ప్రవహిస్తున్నది . తడికలు వానగాలికి చిల్లులు

పడిపోతున్నై . వాటిలోపల తడుస్తూ సగం ముడుచుకు కూర్చున్నాడు భీమన్న. మిత్రుడు క్యాంపులో వున్నాడు. అట్టిస్థితిలో ఆవిడకు వికోచనాలు, వాంతులు మొదలైనై ! కలరా !

లక్ష్మీవారపేట నుంచి పారిపోయి రాగలిగిన భీమన్న ఇప్పుడిక్కడి నుంచి ఎక్కడికి పారిపోగలడు ? ఎలా పోగలడు ?

తనదగ్గర బలమైన కలరా మందులున్నై . వాటిని క్రమంగా వాడటం మొదలుపెట్టాడు . కాళ్ళకు పసుపురుద్ది , వేడినీళ్ళుపెట్టి , వాంతులను పట్టి పారబోస్తూ . ఫినాల్‌తో శుభ్రపరుస్తూ , ఆ రాత్రంతా సేవచేసి - ప్రమాదం నుంచి గట్టెక్కించా డామెను .

తనతల్లి కలరావల్ల చనిపోయింది . ఇప్పుడొక చెల్లిని కలరానుంచి రక్షించగలిగాడు . ఎవరికైనా నిజమైన సహాయం చేసినప్పుడు కలిగే ఆనందం కంటె దివ్యమియింది మరొకటి లేదంటా డీయన .

మనిషి పిరికితనంతో దేనినుంచి పారిపోతుంటాడో , అది అతన్ని నిత్యం వెన్నంటి తరుముతూనే వుంటుంది . అలా తరుమబడి ఎదురుతిరిగినవాడు భీమన్న అనేక ఘట్టాలలో .

"ఏ ఆవిడ బ్రతుకు తుందను కోలేదు . ఆ ప్రభువే రక్షించాడు" అన్నది పెద్ద డాక్టరు , ఒక రోజున భీమన్నతో .

"ప్రభువు ప్రమేయ మేం వుంది ? డాక్టరు రక్షించింది ." అన్నాడు భీమన్న . దానిపై కొంచెం చర్చ సాగింది .

"డాక్టరుతో ఏమన్నావు ?" అన్నది ఆ మర్నాడు వుదయం నాగరత్నమ్మ. చెప్పాడు భీమన్న . అపు డామె ఇలా అన్నది -

"ఆ మాట చాలదా వాళ్ళను బాధ పెట్టడానికి ? దేవుడున్నాడా ? లేడా ? అన్నది కాదిక్కడ ముఖ్యం . అంతా దేవుడి మీద భారం వేసి , వాళ్ళు పని చేస్తారు . ఇదే గవర్నమెంటు ఆస్పత్రి అయితే , నేను బ్రతికే దాన్నేనా ?"

నిజమే . మానవుడికి భగవద్విశ్వాసమే తప్పక పోతే , అట్టి విశ్వాసం పూర్తిగా కలవాళ్ళు - మానవ సేవే మాధవ సేవగా భావించి , అందుకు తమ జీవితాలను అంకితం చేస్తున్నవాళ్ళూ ఒక్క క్రైస్తవ మిషనరీలే అంటా డీయన .

అప్పటికే మూడు నెలలై పోయింది . నడిచే ఓపిక రాలే దింకా . భార్యను భుజం మీద వేసుకొచ్చి , రాజోలులో దింపేసి , ఎన్నికల గొడవల్లో దూకాడు వెనువెంటనే ,

మృత్యువు నుంచి జీవం కురిసింది
అమా వాస్య నుంచి నెలవంక మొలిచింది
షడ్వర్గ యాతన నుంచి షడ్రస సోపేతంగా
మళ్ళీ ఒక ఉగాది విరిసింది

— గుడిసెలు

106. ఎన్నికల భాగవతం

1952 సార్వత్రిక ఎన్నికలు చరిత్రాత్మక మైనట్టివి . ఆ కాలంలో ద్విసభ్య నియోజక వర్గా లుండేవి . ఒక విశాలమైన నియోజక వర్గంలో రెండు స్థానాలు-ఒకటి జనరల్ , ఒకటి రిజర్వుడు . ఓటరుకు రెండు ఓట్లు . వాటిని ఏ ఇద్ద రభ్యర్థుల కైనా ఇవ్వవచ్చు . మొత్తం ఓట్లలో అత్యధిక సంఖ్య వచ్చిన వాడు జనరల్ సీటుకు ఎన్నికవుతాడు . అత డేకులంవా డైనా సరే . రెండో వాడు మాత్రం షెడ్యూల్డు కులం వాడే అయి వుండాలి . అది అప్పటి పద్ధతి . రెండు స్థానాలకూ హరిజనులే ఎన్నిక కాగిల అవకాశం వుంది ఆ పద్ధతిలో . అంతకు ముందొక చోట అలాజరిగింది కూడ .

ఆ ఎన్నికలలో భీమన్నకు కాంగ్రెసు టికెట్టు లభించింది . రాజోలు ద్విసభ్య నియోజక వర్గంలో భీమన్నది రిజర్వుడు స్థానం . ముప్పర్తి వెంకట రత్నం గారిది జనరల్ స్థానం . ముప్పర్తి ఒక వృద్ధ కాంగ్రెసు నాయకుడు . కాపు కులస్థుడు . ఆ నియోజక వర్గంలో కులాల వారీగా చూచుకుంటే మానూలు, కాపులు మెజారిటీ కులాలు .

అమలాపురం కూడ ద్విసభ్య నియోజక వర్గమే . అక్కడ కళా వెంకట రావు , పండు లక్ష్మణస్వామి గార్లు కాంగ్రెసు అభ్యర్థులు . అమలాపురంలో

వుండే డిప్యూటీ కలెక్టరే ఈ నలుగురికీ రిటర్నింగ్ ఆఫీసరు. ఆ రోజుల్లో అక్కడ డిప్యూటీ కలక్టరు లింగం మాలకొండయ్యగారు.

కోనసీమ ప్రాంతంనుంచి పార్లమెంటుకు పోటీ చేసిన కాంగ్రెసు అభ్యర్థులు-జనరల్ దుర్గాబాయమ్మగారు, రిజర్వుడు పెనుమాల గోపాలకృష్ణగారు. ఈయన కళా వారి సలహాపై తన జిల్లా మున్సిబు ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికలకు నిలిచిన వాడు.

కళా వారు పెట్టిన ముహూర్తంలో, మాలకొండయ్య గారి వద్ద నామినేషను చేసి ప్రచారంలో పడ్డాడు భీమన్న.

త్యాగాలు చెయ్యవలసి వచ్చినప్పుడు పోరాటం జరుపుతున్నప్పుడు ఎలాంటి పొరపొచ్చాలూ, పోటీలూ లేవు కాంగ్రెసుకో. అధికార పదవులు రంభల్లా కనుపించగానే సుందోప సుందులై పోయారు. అగ్రనాయకులు కూడా.

కమ్యూనిస్టు ఉపద్రవాన్ని అరికట్టడానికి ప్రభుత్వం తీసుకున్న కొన్ని తీవ్ర చర్యల వల్ల మామూలు, కార్మికులు కూడా కాంగ్రెసుకు వ్యతిరేకమైపోయి వున్న సమయ మది.

ప్రకాశంగార్ని అధికారం నుంచి దింపినందు వల్ల బ్రాహ్మలూ, ఆదర్శ వాదులైన మరికొందరు కాంగ్రెసు కార్యకర్తలూ పళ్ళు కత్తుల్లా నూరుతున్నారు. ప్రకాశం, రంగా, విశ్వనాథం వర్గాలు కాంగ్రెసు నుంచి విడిపోయి, ప్రజా పార్టీ, కృషిక్ లోక్ పార్టీ వంటి వాటిని నెలకొల్పు కొన్నారు.

ఇక మిగిలిన అధికార కాంగ్రెసులోని ధనబలం కల ఒకవర్గం, ఏవో కొన్ని అసంతృప్తుల కారణంగా, సేబటేజ్ చెయ్యడానికి నిర్ణయించు కొన్నారు. పగలంతా బహిరంగ సభల్లో కాంగ్రెసు ప్రచారం చేసే వారు. రాత్రులు రహస్య సమావేశాలు జరిపి, కాంగ్రెసులోని జనరల్ అభ్యర్థిని ఓడించడానికి తమ శక్తినంతా ప్రయోగించేవారు.

భీమన్న పట్ల ఎవరికీ ప్రత్యేక వ్యతిరేకత లేదు. అయితే ప్రత్యేకాభిమానమూ లేదు. జనరల్‌ను ఓడించా లనేది ఒక వర్గం పట్టుదల. జనరల్ ఓడిపోతే రిజర్వు గెలుస్తుందా అనేది భీమన్న ప్రశ్న.

తాను గెలుస్తా ననే ధీమా పోలేదు భీమన్నకు . ఎవరు ఏం చేసినా , ఏం చెయ్యకపోయినా తన వ్యక్తిగతమైన పలుకుబడి తనకుంది . కాంగ్రెసు పార్టీ ఇచ్చిన వెయ్యిరూపాయలతో ఒక కారు అద్దెకు తీసుకుని , ఒక్కడే బైలు దేరాడు ప్రచారానికి .

మొత్తం పదహారు మంది కాబోలు పోటీకి నిలబడ్డా రక్కడ . అందులో కాంగ్రెసు ఇద్దరూ కాక-కమ్యూనిస్టు లిద్దరు , ప్రజాపార్టీ ఇద్దరూ ముఖ్యులు . ఫెడరేషన్ అభ్యర్థి వున్నా , ఎవరి వోట్లైనా చీల్చడానికి తప్ప , గెలవడానికి కాదు .

తనకు ముఖ్యులైన పాత కాంగ్రెసు వాదులు ఆరుమిల్లి వెంకటరత్నం , ఆకుల బులిస్వామి వగైరా లంతా ప్రజాపార్టీకి చేస్తున్నారు . కాంగ్రెస్‌లో వున్న కొత్త వారతా సేబటేజ్ చేస్తున్నారు . కాంగ్రెస్ టికెట్టు కోసం భీమన్నతో పోటీ పడి , అది రాని వారంతా కూడా వ్యతిరేకంగానే చేస్తున్నారు . అదేం ప్రజాస్వామికమో ! అదేం క్రమ శిక్షణో ! అదేం ఎలక్షనో !

ద్వి సభ్య నియోజక వర్గాలలో అప్పటి ఆనవాయితీ ఏమిటంటే - మొత్తం ఎలక్షనంతా జనరల్ అభ్యర్థే నడుపుతాడు . హరిజనాభ్యర్థి నామినేషను వేసి కూర్చుంటే చాలు . ఈ ఎన్నికలలో మాత్రం ఆలా జరుగలేదు . అందుకే భీమన్న ప్రత్యేకంగా తిరగ సాగాడు .

పల్లయ్య గారి అనాసక్త యోగం దూరం చేసిన బంధు వర్గాన్ని జ్ఞాపకం తెచ్చుకుని , పాత మిత్రుల్ని కలుసుకొంటూ ముందుకు సాగాడు . గెడ్డం వాళ్ళంతా తమ జ్ఞాతులే . దేశంలో వాళ్ళు తక్కువేం కాదు .

వడ్డి , ఉండ్రు , బళ్ళ , బయ్యా , ఎల్ల మల్లి , ఊట్ల , దాకే , మోకా కుసుమ , దాసరి , నల్లి , జిల్లెళ్ళ , గంజి , సరెళ్ల , భూపతి , నేతల , కంది కట్ల , బత్తుల , తాడి , సీతి పూడి , గోగు , ఇంజేటి , జాలెం వగైరా అనేక ఇంటి పేర్ల వాళ్ళు భీమన్నకు అమ్మ , నాన్న తరఫు బంధువులే . వీలై నంత వరకు ఆందర్నీ చూశాడు భీమన్న ఎన్నికల సందర్భంలో . రెండు ఓట్లూ కాంగ్రెస్ అభ్యర్థు లిద్దరికే వెయ్యమని ఉద్బోధించాడు .

ఈ ఎన్నికలో భీమన్నకు మనస్ఫూర్తిగా సహాయం చేసిన కాంగ్రెసు నాయకులిద్దరు - కొత్తపేట వైపుకు మంతెన సుబ్బరాజు గారు, నగరంవైపున నైనాల గణేశ్వరరావు గారు.

చివరి వరకు అంతా బాగానే జరిగింది. ఒక్క సారిగా వాతావరణం తారుమారై పోయింది. అది మూడు విధాలుగా జరిగింది.

1. కమ్యూనిస్టు తరఫున జరిగిన విపరీత ప్రచారం. తాము గెలవడం తథ్యమనీ, ప్రభుత్వం తమ చేతిలోకి వస్తుందనీ, అప్పుడు తమకు వోట్లిచ్చిన వారందరికీ ఐదెకరాల భూమి, కాడెద్దూ చొప్పున ఇస్తామనీ ప్రచారం చేశారు.

2. జనరల్ అభ్యర్థికి పట్టుకొన్న భయం. కాంగ్రెసులోనే ఒక బలమైన వర్గం తమకు వ్యతిరేకంగా పనిచేస్తుందని తెలియగానే ముప్పర్తి వర్గం భయపడి పోయారు. ముప్పర్తి ఓడిపోయి, భీమన్న గెలిచే ప్రమాదం వుంది. రెండు స్థానాలూ హరిజనులకే పోవచ్చు. అందుకని ఒక్కటోటు ముప్పర్తికి వేసి, రెండోటు మరెవరికైనా వేసుకోమనీ, భీమన్నకుమాత్రం వెయ్యవద్దనీ, తమ వర్గాలలో రహస్య ప్రచారం చేశారు. దానితో ఆ మిగిలిన కాంగ్రెసువోట్లు కూడ భీమన్నకు పడలేదు.

3. ఎన్నికల రోజు తెల్లవారేటప్పటికి ప్రతి బూతు వద్దా మైళ్ళ పొడవున వోటర్ల క్యూలు నిలబడివున్నై. అవన్నీ కమ్యూనిస్టులవే! ఆ క్యూలు తరిగేటప్పటికే పుణ్యకాలం కాస్తా అయిపోయింది. తిని తీరికగా వచ్చే కాంగ్రెస్ వోటర్లు చాలమందికి వోటుచేసే అవకాశమే దొరకలేదు.

ఊహించని ఈ మూడు కారణాలవల్లా - ఒక్క భీమన్నేకాదు, మొత్తం కోస్తా జిల్లాలలోనే కాంగ్రెసు ఓడిపోవడం జరిగింది.

"నీకు 27 వేలు, ముప్పర్తికి 23 వేలు వచ్చాయి. అంటే, నీకు మీ హరిజనులు ప్రత్యేకంగా వేసినవి నాలుగు వేలే కదా?" అన్నారు ఆ తర్వాత కళావారు ఎన్నికల ఫలితాలను సమీక్షిస్తూ.

"నాకు వచ్చిన 27 వేలూ హరిజనులు వేసినట్టివే. కాంగ్రెసు వోట్లు ఆ 28 వేలూ కూడ వస్తే, 50 వేల వోట్లతో నేనే జనరల్ అభ్యర్థిగా గెలిచేవాణ్ణి కదా"? అన్నాడు భీమన్న. ఆ తగవు అలానే వుండి పోయింది.

"మన వూరి పెద్దలే మనల్ని మోసం చేశారయ్యా! గణేశ్వరరావు గారొక్కరే నీ కోసం మనసారా శ్రమపడ్డారు." అన్నారు పల్లయ్యగారు, ఓడి పోయిన కొడుకు ముఖంలోకి చూచి. నవ్వేశాడు భీమన్న.

మామిడికుదురు వాడే నైనాల గణేశ్వరరావు గారు. పార్టీ పట్ల పరమ భక్తి, ప్రజల పట్ల సేవానురక్తి గల కాంగ్రెసు యువ నాయకు డాయన. భీమన్న పట్ల ప్రత్యేక స్నేహ భావం కలవాడు.

ఆంధ్రప్రభలో ఇంత కాలమూ సెలవే. భీమన్న పట్ల నార్ల వారి వాత్సల్యం అట్టిది. ఎన్నికలు ముగియగానే మద్రాసు వెళ్ళి, ఆంధ్రప్రభలో తిరిగి జాయి నయాడు భీమన్న.

పాపం-ప్రజలు
ఎన్నటికి ఎదగని ప్రజలు
నిన్నటికీ, రేపటికీ తేడా లేని ప్రజలు
తమ ఒక్కొక్క వోటును
ఒక్కొక్క లక్షరూపాయల నోటుగా
తమ ప్రతినిధుని మార్చుకొని
సౌభాగ్యపు కోటలు కట్టు కొంటుంటే
కళ్ళార చూస్తూ కూడ
కన్ను మూసుకు పోయిన
కల్లు కాంపౌండు ప్రజలు!

107. నిడదవోలు వారి దర్బారు

చెల్లారావుగారి మిత్రులు కొందరు మద్రాసు పార్క్-టౌన్ లో ఒక ఇల్లు ఆద్దెకు తీకుసుని, నేతి వ్యాపారం మొదలు పెట్టారు. ఆ యింట్లో ఒక గది ఇచ్చారు భీమన్నకు. ఆ గదిలో కరెంటు లేదు. కొవ్వొత్తులు వెలిగించుకొని, రాత్రులూ, పగళ్ళూ ఏక ధాటిగా కూర్చుని 'దీపసభ' కావ్యానికి తుది మెరుగులు దిద్దా డీయన. ఆ తర్వాత రాయపేటకు మారాడు - చెల్లపిళ్ళయ్యార్ కోయిల్ వీధిలో, మేడమీద ఒక చిన్న పోర్షను లోకి.

ఒక రోజున మిత్రుడు యాళ్ళ ముసలయ్య గారు వచ్చి, "నిడదవోలు వెంకటరావుగారు మీ గురించి తరుచు అడుగుతూ వుంటారు. ఒకసారి వెళ్ళి చూద్దామా?," అన్నాడు. ముసలయ్య గారు నిడదవోలు వారి శిష్యుడు, చక్కగా పాడేవాడు, సాహితీ పరుడు. కేంద్ర ప్రభుత్వ కార్మిక శాఖలో ఉద్యోగి.

భీమన్నను చూడగానే నిడదవోలు వారు చాల సంబర పడ్డారు.

"అసలు మిమ్మల్ని పిఠాపురం రాజావారి షష్టి పూర్తిలో చూశాను. ఆ పద్యాలు చాల బాగున్నై. మీరు పద్యాలు అంత బాగ వ్రాస్తారు కదా! అసలు కావ్యాలు ఎందుకు వ్రాయ గూడదు"? అన్నారు. భీమన్న తన కావ్య నిర్మాణ కృషిని గురించి వివరించాడు. ఆయన కోరికపై ఆ మర్నాడు "మధు బాల" కావ్యాన్ని వినిపించాడు.

ఆ వినిపించే కార్యక్రమం నిడదవోలు వారి గృహంలో ఒక సాహితీ దర్బారులా జరిగింది. వారి అబ్బాయిలు సుందరేశ్వరరావు, సర్వేశ్వరరావు, కుమార్తెలు జోగాబాయి, లక్ష్మి, శిష్ట్లరాంద్రు ఆదిలక్ష్మి, మైథిలీ మున్నగు వారు సభాసదులుగా తాంబూలం సేవిస్తూ కావ్యాన్ని విన్నారు నిడదవోలు వారు. నిజంగా భీమన్న జీవితంలో అదొక గొప్పరోజు. అంతకు ముందు తనకు తెలియని దది!

అస లింత మంచి రచనలు ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎక్కడున్నై? మోడర్న్ పొయిట్రీకి మంచి గ్రంథాలు దొరకక్ బాధపడుతున్నాం. దీన్ని వెంటనే ప్రింటు చెయ్యండి" అన్నారు నిడదవోలు వారు, కావ్యాన్ని సాంతం విని. ఆనాటి నుంచీ ఆ కుటుంబంలో ఒకడైపోయాడు భీమన్న.

మధుబాలను వెంటనే ప్రింటుచేసి ఇస్తా నన్నాడు బొందలపాటి శివరామ కృష్ణ. ఆయన పాలేరును వరుసగా ముద్రిస్తూనే వున్నాడు. తాము ఆ మధ్య

ఆర్థికంగా బాగా దెబ్బతిన్నప్పుడు, పాలేరు ఒక్కడే తమను కాపాడిందని ఆయన వుత్తరాలలో వ్రాసేవాడు. కృతజ్ఞతగా మధుబాల కావ్యాన్ని, రాగోదయం గేయాలను ముద్రించి ఇస్తా నన్నాడు. కవిత్వం అమ్ముడు పోదు కనుక పీటిని తమ ప్రచురణలుగా భావించ ననీ, ఊరికే వేసి పెడతా ననీ చెప్పాడు. అయితే – ఆ తర్వాత మాట తప్పా దనుకోండి. అది వేరే కథ.

కాదు మబ్బులా, శీత గాలులా, చిమ్మ చీకట్లు
చుట్టు ముట్టడించవీ, భయం లేమ నా కిప్పుడు:
నా వెలుగు బైటిది కాదు, లోనిది:

—త్రిపదలు

108. మధు బాల

ముందుగా 'మధు బాల' ప్రింటయింది. దానిని అప్పుడే క్రొత్తగా మంత్రిఅయిన దామోదరం సంజీవయ్యగారికి అంకిత మిచ్చాడు భీమన్న.

ఒకరోజున ప్రభ మిత్రులతో కలిసి మంత్రి సంజీవయ్యగారింటికి వెళ్లాడు భీమన్న. మధు బాలను అంకిత మిస్తున్నా నన్నాడు.

"నా కెందుకు? ప్రకాశం, పట్టాభి వంటి వారి కిస్తే మంచిది కదా? బాగా ఆలోచించండి" అన్నాడాయన.

"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. వాళ్ళ కంకితా లిచ్చేవాళ్లు చాలమందే వుంటారు. పైగా నాకు చనువైనవాళ్ళకే, సన్నిహితులకే నేనిస్తాను" అన్నాడీయన. హరిజనులలో కావ్యకర్తలే కాదు, కావ్యభర్తలు కూడ ఉద్భవించాలి అన్నాడు. సంజీవయ్యగారు కూడ సాంస్కృతిక వికాసానికి ప్రాధాన్యం ఇచ్చే మనస్తత్వం కలవాడే కదా! సరే అన్నారు.

సుప్రసిద్ధ విమర్శకుడు, బహుభాషా పండితుడు, రచయిత అయిన తిరుమల రామచంద్ర ఆంధ్రప్రభలో ఒక పేజీపేజే మధుబాలపై సమీక్ష వ్రాశాడు. అక్కడ పనిచేసే వాళ్ళ పుస్తకాలపై అంతటి పెద్దరివ్యూ ప్రకటించడం అదే మొదలూ, చివరా కూడా నేమో!

రామచంద్రే తిరువళ్ళికేణిలోని తమ ఇంటి డాబాపై మధుబాల అంకితోత్సవ సభ ఏర్పాటు చేశాడు. నార్ల అధ్యక్షుడు, నిడదవోలు బ్రహ్మ, సంజీవయ్య వరుడు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆదిలక్ష్మి, ఇంకా ఎందరో పెద్దలు ఉత్సవంలో పాల్గొన్నారు.

"భీమన్న నా తమ్ముడు" అని డిక్లేరు చేశారు నార్లవారు ఆ సభలో.

"మధుబాలకు ప్రచారం తక్కువయిందనా బ్రదర్, కావ్యానికి మధుబాల పేరు పెట్టావ్?" అంటూ హాస్యమాడారు తాపీవారు. (ఆ రోజుల్లో వెండితెర మధుబాల భీమన్నకు అభిమాన తార).

సంజీవయ్య అప్పటికి అవివాహితుడు. ఆ తర్వాత రెండేళ్ళకు ఆయనకు సికింద్రాబాదులో కుమారి కృష్ణవేణితో వివాహ మయింది. ఆ నవదంపతులకు బెజవాడలో కూర్మయ్యగారింట విందు జరిగినప్పుడు "ఇది నాకు రెండవపెళ్ళి" అన్నాడట సంజీవయ్యగారు. అతిథులు ఆశ్చర్యచకితులై పోయారు. "నా మొదటి భార్యపేరు మధుబాల" అని పేరుకూడాచెప్పి, మద్రాసులో వున్నదని అడ్రసు కూడా చెప్పి, "పాత్యగ్రంథంగా" అన్నాడట చివరకు మెల్లగా.

హమ్మయ్య అనుకొన్నారు అంతవరకు ఊపిరి బిగబట్టుకొని వింటున్న వారంతా, సంజీవయ్య గాయకుడేకాదు. గొప్ప నటుడుకూడ. నాటకాలలో వేషాలు వేసేవాడు చిన్నప్పుడు.

హిందీ నటి 'మధుబాల' అంటే పిచ్చిమోహం భీమన్నకు. ఆమె నటించిన చిత్రాలన్నీ ఎన్నోసార్లు చూసేవాడు. అయితే తన కావ్యంపేరు ఆ పేరు కాదంటాడు. తన కావ్యనాయిక వసంతబాల, మానవ ముగ్ధ సౌందర్యానికి నిధి.

మధుబాల అచ్చు కాగానే, దానిని మద్రాసు యూనివర్సిటీలో ఇంటర్‌కు మోడర్న్ పొయిట్రీగా నిర్ణయించారు నిడదవోలు వారు. స్టెల్లామేరిస్ కాలేజీలో లెక్చరర్‌గా ఉంటున్న ఆది లక్ష్మి దానిని పాఠం చెప్పింది. కిన్నెర పత్రికలో దానిపై ఒక పెద్ద వ్యాఖ్యానం కూడ ప్రకటించిందామె. కిన్నెర పందిరి మల్లికార్జున రావు గారి పత్రిక. మల్లికార్జునరావు గారు ఆ కాలంలో మద్రాసులో సాహితీ

విహంగాలతు ఒక చల్లని వట వృక్షం. ఒక తియ్యని సహకారం, చలువ పందిరి.

మధుబాల ఆంధ్రా యూనివర్సిటీలో కూడ ప్రాచ్య భాషా పరీక్షలకు ఆధునిక కవితలో పాఠ్య గ్రంథ మయింది.

తన మొత్తం రచనలలోనే తన కత్యంత ప్రియ మయింది మధు బాలే నంటాడు భీమన్న.

నీవు కోనెడి పులుగా విరబూయ
నెందరు తప మాచరించిరో మున్న
నీ పాదములు మోసి నీ పూజ చేయ
భూదేవి యెట్టి నోములు నోచుకొనెనో!

— మధు బాల

109. ప్రణయ వాతావరణం

"ఆలా చూస్తా వెవరికోసం"! అన్నాడు భీమన్న-తన ఎదటి సీట్లో కూర్చుని, తనవంకే తదేకంగా చూస్తున్న రామచంద్రతో కొంచెం రాగయుక్తంగా.

"మీకు లోకమంతా ప్రియురాలు లాగే కనిపిస్తున్న ట్టున్నదే!" అన్నాడు రామచంద్ర. భీమన్న ఆ రోజుల్లో ప్రగాఢమైన ప్రణయ వాతావరణంలో పడి, ఉక్కిరి బిక్కిరై పోతున్న రహస్యం రామచంద్రకు తెలుసు.

ఆ వాతావరణంలోనే "రాగోదయం" గేయాల సృష్టి జరిగింది. "బొమ్మ" కావ్యం రూపం దిద్దుకొన్నది. తన ప్రతి రచన వెనకా ఒక చరిత్ర వుంటుంది భీమన్నకు. "ఆలా చూస్తా వెవరికోసం" అన్న పలకరింపు కూడ ఒక గేయ మయింది. ఏదైనా ఒక అవ్యక్త మధుర భావావేశం ఆవహించినప్పుడు రోజులే కాదు, నెలల తరబడి కూడ ఆప్రభావంలో మునిగి వుండిపోతా డీయన. ఆ సమయంలో ఈయనకు ప్రతి వ్యక్తి, ప్రతి శబ్దమూ, ప్రతి లవమూ కూడ రాగ రమణీయంగానే కన్పిస్తుంది. పలికే ప్రతి మాటా కవితా రసరామ గానే ఆవిర్భవిస్తుంది.

ఆ రోజుల్లో ఈయన రాయపేటలో ఒంటరిగానే వుంటూ వుండేవాడు. ఆంధ్ర ప్రభలో ఆర్టిస్టు మైలవరపు సూర్యనారాయణమూర్తి కూడ ఒంటరిగానే వుంటుండేవాడు. ఈ ఇద్దరూ భీమన్న గదిలో చేరి, రాగోదయానికి చిత్రాలు సృష్టించారు. గేయానికి ఒకటి రెండు చిత్రాల చొప్పున అలంకరించుకొని "ప్రభ"కు అంకితంగా, రామచంద్ర పీఠికతో, గ్రంథరూపంలో వెలువడిందది.

"ప్రభ అంటే ఆంధ్రప్రభేనా?" అన్నారు నార్ల వారు గ్రంథాన్ని చూచి. అయివుండదులే అన్నట్లు చతుర హాసం చేశారు. ఆ చిరునవ్వు ఆయన ప్రత్యేకత.

"ఇంత మంచి గ్రంథాన్ని తెలుగు భాషా సమితి ప్రైజుకోసం ఎందుకు పంపలేదు?" అన్నారు నార్ల. ఈసారి నవ్వేయ్యడం భీమన్న వంతయింది.

ప్రైజులూ, గుర్తింపులూ ఎలా వస్తాయో భీమన్నకు తెలుసు. తాను అంతర్ముఖుడు. దేనికోసమూ ప్రయత్నం చెయ్యడు, చెయ్యలేడు. ఏదైనా వాటంతట అవి రావాలి. అవి రావాలంటే అప్పటికింకా తన చుట్టూ వున్న ఎన్నో అడ్డుగోడలు భేదించ బడవలసి వుంది. ఆ సత్యం నార్లవారికి మాత్రం తెలియదా?

సారాహార సమార్జన వేళ్ళది,
సన్మానము పువ్వు లది;
మధు సంపాదన మధుప శ్రేణిది;
మాధుర్యా స్వాదన మనది;
వృత్యగాన సౌందర్యము నీయది,
నిత్యానందము నాది;
కష్ట మొక్కరిది, సుఖ మింకొకరిది;
కాంతా, నైజమొ సృష్టి కిది;

—రాగోదయం

మధు బాలను వలెనే "దీప సభ"ను కూడ విన్నారు నిడదవోలు వారు. అద్భుతం అన్నారు. ఈ రకమైన భావనా, రచనా ప్రపంచంలో మరే భాషలోనూ లేదన్నారు. ఆయనతో పాటు కూర్చుని వున్న ఒక విభాషీయ పండితుడు కూడ అదే అన్నాడు. ఇంగ్లీషులోకి అనువదించ మన్నాడు.

నిజానికి భీమన్న రచనలన్నీ సృజనాత్మక మైనట్టివే, మౌలిక మైనట్టివే. రస పుష్ట మైనట్టివే. ఇతర భాషల్లోకి వెళ్ళవలసినట్టివే. అయితే, ఆ పని చేసే దెవరు? కనీసం సహృదయతతో చదివే వాళ్ళెనా ఎంత మంది? కొద్ది మంది బ్రహ్మ జ్ఞానులూ, రసజ్ఞులూ అయిన అగ్రశ్రేణి పండితులూ, నాయకులూ తప్ప-అధిక సంఖ్యాకులైన విద్యావంతులు ఇంకా భీమన్నను కుల సంబంధమైన సంకుచిత దృష్టితోనే చూస్తారు కద!

ఆ కాలంలో నిడదవోలు వారి గృహం ఒక సాహితీ రాజ దర్బారు. ఒక సహృదయ భువన విజయం. అందులో భీమన్న పెద్దన్న. సాహితీ సదస్సులోకి భీమన్న వాస్తవంగా అడుగు పెట్టింది నిడదవోలు వారి నిండు గుండె గుండానే-1952లో.

శ్రీకారమ్మున మోహనమ్మగ నినున్
చిత్రించి, నీ చుట్టు బ
హ్వాకారమ్ముల రమ్య నృత్తముల శో
భల్ దిద్దుచున్, తద్ర సో
ల్వేకమ్మందున నిన్ను ముంచు కవి నం
దే ముంచి లాలించు నీ
సాకూత స్మిత రోచి రేఖకు నమ
స్కారమ్ము కావించెదన్!

— దీప సభ

110. అన్నయ్యగా దత్తత

"మిమ్మల్ని పేరుతో పిలవడం మాకిష్టంలేదు. అతి సన్నిహితంగా బావ అనిగాని, అన్న అనిగాని పిలవా లనుకొంటున్నాం. ఏమని పిలవ మంటారు?" అన్నది ఆదిలక్ష్మి భీమన్నతో – ఒకరోజున తమ ఇంట్లో కాఫీ అందిస్తూ. ఎంతో ఆనంద మయింది భీమన్నకు. ఆమె అప్పటికి నిడదవోలు వారి వద్ద రిసెర్చి చేస్తున్నది.

"మీ రెలా పిలిచినా నా కిష్టమే. మీ ఆప్యాయత నాకు లభించింది. అంతకంటె ఏం కావాలి?" అన్నాడు భీమన్న.

"మేం ఏడుగురు అక్క చెల్లెళ్ళడం. అన్నలు కాని, తమ్ముళ్ళు కానిలేరు. అందువల్ల మిమ్మల్ని అన్నయ్యగా దత్తత చేసుకుంటున్నాం. అందుకు అమ్మ కూడ ఒప్పుకొన్నది." అన్నదామె, ఆ మరునాడు భీమన్న వాళ్ళింటికి వెళ్ళినప్పుడు. అప్పటి నుంచీ అన్నయ్యా అనే పిల్చే వాళ్ళు ఆ కుటుంబం అక్క చెల్లెళ్ళంతా. వాళ్ళ దసలు నెల్లూరు జిల్లా. అమ్మాయిల చదువు కోసమే మద్రాసులో వుంటున్నారు. ఇల్లు సొంతం. ఆ యింట్లోనే ఒక భాగంలో నిడదవోలు వారు అద్దెకుంటున్నారు. ఆయన అప్పుడు మద్రాసు యూనివర్సిటి తెలుగు శాఖ ఆధ్యక్షులు.

దీప సభను వెంటనే ప్రింటు చెయ్యమనీ, అక్కడక్కడ కొంచం అరసున్నలూ, బండిరాలూ పెట్టమనీ సలహా యిచ్చారు నిడదవోలు వారు. దానికి ఒక చక్కని పీఠికను కూడ వ్రాసి యిచ్చారు. దీప సభలోని చాల పద్యాలు ఆయనకు కంఠస్థంగా వచ్చు. దానిని ఆ తర్వాత మద్రాసు యూనివర్సిటిలో బి. ఏ.కు మోడర్న్ పొయిట్రీగా నిర్ణయించడమే కాక, దానిలో నుంచి చాల పదాలను శబ్ద రత్నాకరం నిఘంటువులోకి తీసుకొన్నారు కూడ.

ఆంధ్రప్రభలో సంపాద వర్గం కూర్చునే సీట్ల ఆకృతి ఒక ఆబోతు నడి నెత్తిలా వుంటుంది. గదిలో రెండు ప్రక్కలా రెండు నిడుపాటి కొమ్ముల్లా టేబుల్స్, నడినెత్తి స్థానంలో న్యూస్ ఎడిటర్ సీటు, ప్రక్క చెవుల్లా టెలి ప్రింటర్లు. అప్పుడు న్యూస్ ఎడిటర్ ఎమ్. ఎస్. శాస్త్రి. గొప్ప సహృదయుడు, సరసుడు, కార్యదక్షుడు, భీమన్న పట్ల ప్రసన్నుడు.

ఉప సంపాదకులలో తిరుమల రామచంద్ర, వి. వి. నరసింహారావు, వడ్లమూడి సత్యనారాయణ, వేమరాజు భానుమూర్తి, వి. వై. ఎల్. నరసింహారావు, రామబ్రహ్మం, అకుండి రామకృష్ణ, జొన్నలగడ్డ రాధాకృష్ణ, నాగరాజు, బొమ్మకంటి సుబ్బారావు, పి. వీరభద్రరావు, కె. సభా, విద్వాన్ విశ్వం మున్నగు వారంతా ఏదో ఒక రంగంలో పరిపూర్ణ పాండిత్యాన్ని సాధించుకొన్నవారే. తర్వాత తమ తమ రంగాలలో విశిష్ట స్థానాలకు చేరుకొన్న వారే.

వారంతా కూడ భీమన్నతో సరసాలాడుతూ, సరదాగా కాలం గడిపేస్తూ వుండేవారు. వారి నడుమ దొర్లుతుండే సరసాలు, సల్లాపాలు, గోష్ఠులు,

విమర్శలు ప్రత్యేకంగా సేకరించ వలసి నట్టివి. అదొక సాహిత్యోద్యాన వసంతకాలం. వారంతా విరబూసిన సహకార వృక్షాలు. వారితో ఒక్కొక్క రితో భీమన్నకు గల స్నేహ సంబంధాల సంఘటనలు, సన్నివేశాలు అసంఖ్యాకం. ప్రాస్తే - అదే మరో ఇంత గ్రంథ మవుతుంది.

బీద తనమ్మ చేత కడు
బీడయి యున్నది; చాలా తోలి యే
పాదిడినన్ ఫలించు విధి
పాటి పొలమ్మ; భవత్ కృపామృత
శ్రీ దయచేసి నా యెడద
నేదక్షము చేయుము రైతు బిడ్డవై
ఓ దరహాస పూర్ణముఖి!
ఓ శరదిందు కళా సరస్వతీ!

—భీ కా. కుసుమాలు

111. బ్రహ్మ రథం – గండ పెండేరం

గుంటూరు జిల్లాలో మంగళగిరి పరవస్తు దాసు గారు భీమన్నకు చిర కాల మిత్రుడు. ప్రతిభా సాహసాలు కల మామా యువ నాయకుడు. ఆయనకు సంబంధించిన కొన్ని కొన్ని నాటక సమాజాలు ఆ జిల్లా అంతటా "పాలేరు" ప్రదర్శనల్ని యిస్తూ వచ్చారట. అట్టి ప్రదర్శనలు నూటికి మించిన సందర్భాన్ని పురస్కరించుకొని భీమన్నకు సన్మానం చెయ్యాలను కొన్నారు. ఆది చాల పెద్ద ఎత్తున సాగింది.

గుంటూరు జిల్లా, చెరుకు పల్లిలో సన్మానం. 1953 మార్చి 7వ తేదీ మధ్యాహ్నం. సన్మాన సభకు మంత్రి సంజీవయ్య గారు అధ్యక్షులు.

ఆకాశమంత పందిరి వేశా రంటే - ఆ రోజున అది అతిశయోక్తి కాదు. పది పదిహేను వేలమంది జనం. అందులో నూటికి తొంభై మంది మామాలే. మామాలలో ఎన్ని కళలైతే ఉన్నాయో - దప్పులు, గారడీలు, కర్రసాము, దిందు, కోలాటం, మాస్టిడి విద్యలు - అన్ని ప్రదర్శిస్తూ ఊరేగింపు!

హంస ఆకారంలో అలంకరించబడ్డ రథం . రథం మీద భీమన్న , సంజీవయ్య , పరవస్తు దాసు . రథాన్ని జనం లాగుతున్నారు . రథానికి పగటి దివిటీలు పట్టారు . మండు టెండ . మధ్య మధ్య రథం ఆపి , కొబ్బరి బొండాలు అందిస్తున్నారు . ఆ ఉత్సాహం , ఆ కోలాహలం , ఆ వైభవం చూడవలసిందే .

"భగవంతుడికీ , చచ్చిన వాడికీ తప్ప బ్రహ్మ రథం , పగటి దివిటీలు పట్ట గూడదు . మామూలు మనుషులకు అలా చేస్తే వాళ్లు నాశనమై పోతారు . తెలుసా ?" అన్నారట ఆ వూరి పండితులు పరవస్తు దాసుతో . "మా వాళ్ళు మామూలు మనుషులు కాదు " అన్నాడట అయన .

అంతటి శోభాయమానమైన వాతావరణంలో , అంతటి గొప్ప ప్రజా సదస్సులో భీమన్న కాలికి బంగారు గండ పెండేరం అలంకరించ బడింది . తెనాలిలో ఒక సుప్రసిద్ధ శిల్పిచే తయారు చేయించారు దాన్ని .

చేబ్రోలు ఏసుపాదం , కన్నెగంటి బ్రహ్మయ్య , నూతల పాటి కనక రత్నం మున్నగు యువ కార్యకర్తలతో కూడి మూడు రోజుల పాటు – చెరుకు పల్లి , ఆరేపల్లి సమీప గ్రామాల మామాల వాడల్లో విందు లారగిస్తూ తిరిగాడు భీమన్న .

"ఎక్కడ పుట్టాడో , ఏ తల్లి కన్నదో , ఇక్కడింత పూజ లందు కొంటున్నాడు" అనే ప్రశంసా వ్యాకాలు ఆశీర్వాదాలుగా అందుకొన్నాడు ఆ మూడు రోజులు ముత్తైదువుల నుంచి .

ఆ గండ పెండేరాన్ని కొన్నాళ్ళు ధరించి ఆ తర్వాత కొంత కాలానికి దాని కొక స్థిరమైన రక్షణ కల్పించ దలచి , బంగారు తాడుగా మార్చి , భార్య మెడలో వేశాడు .

ఎక్కడి వాడో , ఏమి కదో
ఏసతి కన్నదో , ఏల వచ్చెనో
ఇక్కడి కీర్తి - సూర్య డుదయించును రోజును కాని - ఇంతగా

చక్కని వాడు చిక్కడెదో
నా హృదయ ముండిన తవ్వ , ఇప్పుడే
మ్రొక్కెద మంచు రామ పద
ముల్ స్పృశియించు తమిన్ తృణాదులన్ !
— ఆశోకవనిలో రాముడు

112. గ్రంథ సమీక్షలు

ఆంధ్రప్రభలో ఎక్కువగా గ్రంథ సమీక్షలు భీమన్నే చేస్తుండేవాడు . దానివల్ల కొంతమంది మిత్రులూ , శత్రులూ కూడా అవుతూ వుండేవారు . అందువల్ల కలిగే ఉద్రేక భావాలుకూడ ఈయన సాహిత్య సృష్టికి తోడ్పడుతూ వుండేవి . ఆ విధంగా వేర్పడిన రచనే "ఏక పద్యో పాఖ్యానం" ఆ వివరా లన్నీ ఆ గ్రంథ పీఠికలోనే ఇచ్చాడీయన .

ఒక రోజున నార్లవారు ప్రత్యేకంగా పిలిచి , ఒక లావుపాటి పద్య గ్రంథాన్ని ఇచ్చారు భీమన్నకు . ఎంతో సంతోషంతో తీసుకు వెళ్ళి చదివా డీయన . నిరుత్సాహం ఎదురైంది . అదొక జీవిత చరిత్ర . పద్యాల్లో వ్రాశాడు రచయిత .

పూర్వం ముద్రణ పద్ధతి లేని కాలంలో , కంఠస్థం అయిందే విద్యగా వుండే రోజుల్లో , గురువు చెప్పిన దానిని యథాతథంగా జ్ఞాపకం పెట్టుకోవలసి వుండేది . అందుకే వేదాలను ఇటునుంచి అటూ , అటునుంచి ఇటూ కూడ కంఠస్థం చేసేవారు . జ్ఞాపకం పెట్టుకోడానికి వీలుగా శాస్త్ర గ్రంథా లన్నిటినీ శ్లోకాలలోను , పద్యాలలోను వ్రాసేవారు . అది ఆనాటి అవసరం .

శాస్త్రాలను , చరిత్రలను వ్యర్థ పదాలువేసి ఛందోబద్ధం చెయ్యగూడదు . అట్టి పద్ధతి ఈనాడు తప్పనిసరి కాదు . ఖచ్చితమైన , నిర్దుష్టమైన, అసందిగ్ధమైన వచనంలో వాటిని వ్రాయాలి .

పద్యమే కవిత్వమని పూర్వులుకూడ అనుకోలేదు. ఈనాటి రచయితలకూ, ప్రజలకూ కూడా ఆ అపోహ ఎందుకు ఏర్పడిందో మరి !

జీవిత చరిత్రలను కావ్యాలుగా వ్రాయగూడదా అంటే వ్రాయవచ్చు. అవి కాంతా సమ్మితం అయివుండాలి. శ్రీనాథుడు, వేమన, జాషువా, విశ్వనాథ, కృష్ణశాస్త్రి జీవితాలను కావ్యాలుగా వ్రాయవచ్చు. వాళ్ళ జీవితాలను యథాతథంగా, సెన్సారు లేకుండా చిత్రించగల గుండెధైర్యం వుంటే! రామాయణం రాముడి జీవిత చరిత్రేగదా? వట్టి సీతలు మాత్రం బోధించే సన్యాసుల, మతాధిపతుల జీవితాలకు కావ్యత్వ మెక్కడిది? రాజకీయ నాయకుల జీవితాలు, ఉద్యమ చరిత్రలు గొప్ప వచన గ్రంథా లవుతాయి కాని కావ్యా లెలా అవుతాయి?

రసభరిత మయిందే కావ్యం, ఆనంద ప్రద మయిందే కవిత అనే దృష్టి చిన్నప్పటి నుంచీ వున్న భీమన్న-ఆ సదరు గ్రంథం ఒక జీవిత చరిత్ర అనీ, వచనంలో వ్రాస్తే బాగుండే దనీ కాబోలు వ్రాశా డట సమీక్షలో. అది అచ్చయి పోయింది ప్రభలో.

ఆ తర్వాత జరిగిన రభస ఇంతా అంతా కాదు. ఆ రచయిత, ఆయన శిష్యకోటి నార్ల వారిపై దండెత్తారు. నార్ల వారు భీమన్నపై కన్నెర్ర జేశారు. అప్పుడిక ఎవరు మాత్రం ఏం చేస్తారు? జరగగల డామేజీ జరిగే పోయింది!

మళ్ళీ ఒక రోజున నార్ల వారు భీమన్నను పిలిచి, చేతిలో ఒక పెద్ద ముద్రిత పత్ర సముదాయాన్ని వుంచి, చూడమన్నారు. అదంతా-దేశంలో వుండే పెద్ద పండితులంతా ఇచ్చిన అభిప్రాయాలు! ఆ సదరు గ్రంథం గొప్ప కావ్యమని వారంతా సోదాహరణంగా వ్రాశారు. వాటన్నిటిని సేకరించి రచయిత ప్రింటుచేసి, నార్లవారికి పంపించాడు. "మీ పత్రికలో ఎవడో ఏదో వ్రాస్తే అయిందా? చూడు నా గొప్పదనం" అన్నట్టుగా ఒక లేఖ కూడ నార్ల వారికి వ్రాసి వుండవచ్చు.

పత్రికల వాళ్ళు సర్వజ్ఞులు కారు. అందరి లాంటివాళ్ళే. రివ్యూల కోసం ఎన్నో గ్రంథాలు వస్తూవుంటాయి. వాటి గురించి ఎవళ్ళెవళ్ళో, ఏదేదో వ్రాసేస్తూ వుంటారు. పత్రికా సమీక్షలు యథార్థ విమర్శలు ఎన్నటికీ కావు. ఈ సత్యం కొంతమంది రచయితలకు తెలియక ఉద్రేకాలకు లోనవుతూ వుంటారు పాపం!

"ఆ గ్రంథం గురించి అలా వ్రాసి , నాకు తలనొప్పి కలిగించారు మీరు చూడండి , మహా పండితు లంతా దాన్ని మహాకావ్య మంటూ ఎంతెంత వ్రాశారో !" అంటూ దాన్నంతా భీమన్న చేతి కిచ్చారు నార్ల .

ఆ మర్నాడు "అంతా చదివారా ? పోనీ , క్షమాపణ ప్రకటిస్తామా ?" అనడిగిన నార్ల వారితో "అక్కరలేదు . వ్యాఖ్యాత ప్రతిభను బట్టి , పచ్చి చెత్త నైనా పరబ్రహ్మగానే చూపించవచ్చు" అన్నాడు భీమన్న . సరే అన్నారు నార్లవారు .

ఆ వెంటనే - అక్కడే చేతికి వచ్చిన ట్టెల్లా ఒక పద్యం వ్రాసేశాడు భీమన్న . తన గదికి పోయి , ఆ రాత్రంతా కూర్చుని , ఆ పద్యం ఒక మహా కావ్యమని నిరూపిస్తూ ఒక వంద పేజీల వ్యాఖ్యానం సృష్టించాడు ! అదే "ఏక పద్యీ పాఖ్యానం – సవ్యాఖ్యానం" గ్రంథం !

* * *

'"ప్రసూతి' పుస్తకం ఒకసారి ఇస్తారా ? చదివి ఇచ్చేస్తాను ." అన్నా డొక మిత్రుడు ఒక రోజున భీమన్న గదికి వచ్చి . ఇచ్చాడు భీమన్న . ఆ పుస్తకం మీద తానే రివ్యూ వ్రాశాడు – అందరూ చదివి తీర వలసిన గ్రంథం అంటూ . అందుకే ఆ మిత్రుడు దాన్ని తీసు కెళ్ళాడు .

ఆ మర్నాడే ఆ పుస్తకాన్ని తీసుకొచ్చేశా డతడు . కబుర్ల సందర్భంలో "మీ రివ్యూ బాగుంది . అది చూసే పుస్తకం తీసికెళ్ళాను . పుస్తకం నిజంగా అందరూ చదవవలసి నట్టిది . ఆయితే - ఇంతింత పెద్ద గ్రంథాలను చదివి రివ్యూలు వ్రాయడం మీలాంటి వారికి తప్ప సాధ్యం కాదు . మీరు క్షుణ్ణంగా చదివే వ్రాస్తారు కదూ ?" అన్నాడు .

"ఓ ! ప్రతిపేజీ , ప్రతివాక్యం చదివి వ్రాస్తాం" అన్నాడు భీమన్న . ఏ గ్రంథాన్నైనా ఎంత నిశితంగా పరిశీలించి రివ్యూ వ్రాయవలసి వుంటుందో వివరించాడు .

అప్పుడా మిత్రుడు ఆ పుస్తకాన్ని భీమన్నకు అందజేసి , "పేజీలు తెరవండి" – అన్నాడు .

ఆ పుస్తకం పేజీలు అసలు కట్ చేసి లేవు !

* * *

ఒక రోజున ఒక అందమైన ఉద్గ్రింథం భీమన్న టేబిల్ మీద వుంది. గ్రంథలోకానికి అది రంభలా వున్నదట !" అది మీకోసమే. రివ్యూ రెండు రోజులలో కావాలి" అన్నాడు శాస్త్రిగారు.

రివ్యూకోసం ఆఫీసుకు పుస్తకాలు రాగానే, మంచిమంచి పుస్తకాలన్నీ ముందే వెళ్ళిపోతాయి - ముందుగా వచ్చిన ఉప సంపాదకుల చేతుల లోకి. భీమన్న ఎప్పుడూ లేట్ లటీఫే. లావుపాటివీ, అందమైనవీ సాధారణంగా ఏదో ప్రత్యేక ప్రయోజనం వుంటే తప్ప ఈయనదాకా రావు.

ఆనందంతో ఇంటికి తీసికెళ్ళాడు భీమన్న ఆ గ్రంథాన్ని. చదివాడు. మతి పోగొట్టుకొన్నాడు. రచయిత తనకు బాగా తెలిసిన వాడు. తనకే కాదు ప్రభ ఆఫీసులో అందరికీ తెలిసినవాడు. కొందరికి మిత్రుడు. కొందరికి బంధువు. తనకు కూడ అంతే. అయితే - గ్రంథం బాగున్నదంటూ చెప్పి, ఉదాహరించడానికి మంచి పంక్తులు రెండు కూడ అందులో లేవు. బాగు లేదని వ్రాయడానికి వీలులేదు ! పై అందానికీ, లోని గుణానికీ ఎంత తేడా !

మర్నాడు గ్రంథాన్ని తీసుకు వెళ్ళి, శాస్త్రిగారి ముందుపెట్టి, ఓ నమస్కారం చేశాడు. శాస్త్రి ఊరుకోలేదు. మీరు చెయ్యక తప్పదు" అన్నాడాయన.

"రామచంద్ర కివ్వండి"

"ఆయన వద్ద వారం రోజు లుండే వచ్చింది"

"విశ్వంగారి కివ్వండి"

"ఆయన వద్ద పది రోజు లుంది"

"అయితే రెండు చేతులు మారి -"

నవ్వేశాడు శాస్త్రి. "రెండేకాదు. చాల చేతులు మారే మీ వద్దకు చేరింది. ఇక మీకు తప్పదు" అన్నాడు, ఒక వింత వినయాదేశ స్వరంతో.

"మరి నేను బాగులే దని వ్రాస్తే?"

"ఆ ధైర్యం లేకనే తక్కిన వాళ్ళంతా తప్పుకున్నారు. మీ ఇష్టం వచ్చినట్టు వ్రాయండి"

వ్రాశాడు భీమన్న. పెద్ద రివ్యూయే వ్రాశాడు. సాహిత్యం, శైలి, రసం, భావం వంటి పదాలేవీ వాడకుండా, రచయితను అద్భుతంగా పొగిడి పారేశాడు. అందరూ ఆశ్చర్యంతో సంతోషించేశారు.

దారి నలిగిన దారి నిస్సార, మందు
తృణము కూడ జనింపదు: మునుపెవండు
పోని నవమార్గముం బడి పోవవలయు
సాధు జీవన మధు రసాస్వాద రతులు

—మధు గీత

113. నరికి న ట్టుండాలి

ఆ కాలంలోనే రెండవ తడవ ఆంధ్ర యూనివర్సిటీ సెనేటుకు నామినేటు చేయబడ్డాడు భీమన్న. అప్పటి నుంచి 1971 వరకు కూడ వరసగా నామినేటు చెయ్యబడుతూనే వచ్చాడు.

అంతకుముందు కూర్మయ్యగారు మంత్రిగా వున్నప్పుడు ఆయనతో కలిసి ఒక్కడూ మధుర, పళని మొదలైన క్షేత్రాలు తిరిగాడు. తర్వాత ప్రభలో వుంటూ చెల్లెలు ద్రౌపది, భార్య, పిల్లలు అంతా కలిసి కంచి, పక్షి తీర్థం, మహాబలిపురం వగైరా ప్రాంతాలు చూచి వచ్చాడు.

1953లో ఆంధ్రరాష్ట్రం విడిపోవడం, మిత్రులలో అనేకమంది కర్నూలుకు తరలిపోవడం జరిగింది. అంతకుపూర్వం సెక్రటేరియట్ అసోసియేషన్ వారికి "అనార్కలీ" నాటకం వ్రాసి ఇచ్చాడు. ఆ నాటకాన్ని వారు అనేక ప్రాంతాలలో ప్రదర్శించి, అక్కడక్కడి కాలేజీలకు లక్షలు వసూలుచేసి చ్చారు. భీమన్నకూడ సరదా గా వాటితోపాటు తిరిగేవాడు.

శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ ఏర్పడినప్పుడు భీమన్న తిరుపతి వెళ్లాడు. కూడా దీపసభ ప్రాత ప్రతి వుంది. అక్కడ దానిని చూచిన అనేకులు దాని ప్రచురణకోసం పాతికా, వందా విరాళాలు. వాగ్దానంచేశారు. ఆ ధీమాతో దానిని ప్రెస్‌కు ఇచ్చాడు. అచ్చయింది. విరాళాలు మాత్రం చేరలేదు.

ప్రభలో ఉపసంపాదకుడుగా వుండే వాడప్పటికి సుప్రసిద్ధ రచయిత సభా. ఆయన చిత్తూరు వాడు. ఒకసారి ఆయన ఆహ్వానంపై చిత్తూరువెళ్ళి అక్కడ సాహితీ సభలలో పాల్గొన్నాడు భీమన్న.

*　　*　　*　　*　　*

జాస్తి వెంకట నర్సయ్యగారికి భీమన్న అంటే ప్రాణం. ఆయన రచనలలో ఈయన గురించిన దొకటి కూడ వుంది. ఒకసారి చిలకలూరిపేటలో జరిగిన సాహిత్య సభలకు ఆహ్వానించబడి, అక్కడ కవిసమ్మేళనకు అధ్యక్షత వహించిన కొండవీటి వెంకటకవి గారితో పేచీ పడ్డాడు భీమన్న.

"భీమన్న బ్రాహ్మణ కవిత్వం వ్రాస్తాడు" అన్నాడు కొండవీటి.

"కవిత్వానికి బ్రాహ్మణ, అబ్రాహ్మణ అనే దేం లేదు" అన్నాడు భీమన్న.

"ఆ కులం నుంచి వచ్చిన వాడు వ్రాస్తే, కత్తులతో నరికిన ట్టుండాలె" అన్నాడాయన.

"ఎవర్ని?" ప్రశ్నించా డీయన.

నిజమే! ఎవర్ని నరకడం? ఎవరి మీదికి ఎవర్ని రెచ్చగొట్టడం? అందరూ మన వాళ్లే కాదా? హృదయాలను, దృక్పథాలను మార్చాలి. ఆ పని భీమన్న చేస్తూనే ఉన్నాడాయే.

ఆ యాత్రలోనే, అప్పటి కక్కడ వుంటున్న బీర్నిది మోషే కవిగారింటికి వెళ్ళి, వారి పరిచయం కలిగించు కొన్నాడు భీమన్న-వారి సాహిత్యాన్ని ఆతిథ్యాన్ని తలచుకొని ఆనందిస్తా దిప్పటికీ.

నరికి నట్టుండా లన్న దాని విషయంలో నార్లవారితో కూడ పేచీపడ్డ సంద ర్భా లున్నై ఎ భీమన్నకు. సంస్కృతాన్ని నిర్బంధ భాషగా చదవాలని గోపాల రెడ్డిగారు శాసించి నప్పుడు, దాన్ని వ్యతిరేకిస్తూ నార్ల వారు ప్రభలో వరసగా సంపాదకీయాలు వ్రాశారు. ప్రతిభా వ్యుత్పన్నతలు పరాకాష్ఠ నందు కొన్న సంపాదకీయా లవి. దేశంలో ఒక పెద్ద సంచలనాన్ని కలిగించిన రచన లవి.

"ఏమండీ! సంపాదకీయాలు బాగుంటున్నాయా?" అంటూ వచ్చారు నార్లవారు సిబ్బంది హాలులోకి. ప్రత్యేకంగా భీమన్నను అడిగారు. తాను సంస్కృతానికి అనుకూ లుణ్ణన్నా డీయన - దానితో నార్లవారికి కోపం వచ్చింది.

"నేను సంస్కృతాన్ని వద్దంటున్నది మీ కోసమే" అన్నారాయన.

"నేను సంస్కృతం కావాలంటున్నది కూడా మాకోసమే నండీ! ఇప్పటికీ బ్రాహ్మలకున్న అహంకార కారణం సంస్కృతమే. అది మాకు కూడా కాస్త వస్తే, వాళ్ళ ప్రత్యేకత పోతుంది. అప్పుడు సాంఘిక న్యాయం మా దాకా కూడ వస్తుంది" అన్నాడీయన. ఇది భీమన్న ఆలోచనా సరళికి మచ్చు తునక.

* * *

"ఆర్యులు, ద్రావిడులు ఒకే జాతికి చెందినవారు, రక్త సంబంధీకులు అనే భీమన్న సిద్ధాంతం కూడ నార్లవారికి నచ్చలే దా కాలంలో. "రాగవాశిష్ఠ.' నాటకం ఈ సిద్ధాంతం మీద వ్రాయబడి నట్టిదే.

"నరికినట్టు వ్రాయడం, తిరుగుబాట్లను రెచ్చగొట్టడం రాజకీయ మవు తుంది. సాహిత్యాన్ని రాజకీయానికి వాడుకొనేవాడు ఎంతగొప్ప రచయిత అయినా రాజకీయుడే. రాజకీయాన్ని సాహిత్యానికి వాడుకోవచ్చు" అంటాడు భీమన్న. మహాభారతం అలాంటి దంటాడు. నిజాన్ని నిక్కచ్చిగా చెప్పడం, మన్నసును మాధుర్యం కేసి మరల్చడం, సహజ విప్లవ ప్రగతిని వేగీకరించడం భీమన్న కవితా లక్షణం.

ఇక్కడ మరొక సత్యాన్ని గుర్తించ వలసి వుంది.

ఎంతటి ప్రతిభా పాండిత్యాలను చిందించినా - లక్ష్యం అసంగతమయిందో, వస్తువు అనుచిత మయిందో అయినప్పుడు -ఆ కృషి బూడిదలో పోసిన పన్నీరే అవుతుం దంటాడు భీమన్న . సృష్టికి వలెనే సాహిత్య సృష్టికి కూడ పనికిరాని వస్తువంటూ లేదు . రచయితకు మాత్రం ఉచితజ్ఞత వుండాలి . ఉల్లీ పచ్చడికే మళ్లీ పచ్చడికే కారాదు . ఏ సాహిత్యానికైనా సరే-రసం ఆత్మ అయితే, ఔచిత్యం ప్రాణం . ప్రాణం పోతే ఆత్మా పోతుంది " అంటాడు భీమన్న .

భావం ఎంత స్పష్టంగా వుంటే
భాష అంత సూటిగా వుంటుంది,
భావం తన సొంతం అయినప్పుడే
భాష తనకు స్వాంతం ఆర్పిస్తుంది .

—టుమ్రీలు

114. బ్రహ్మరంధ్ర భేదనం

ఆ రోజు భీమన్నకు ఆఫు . ఇంటి వద్దనే వున్నాడు . అంతలో ప్రభ ఆఫీసు నుంచి ఫ్యూను వచ్చి భీమన్నకు ఒక కాగితం ఇచ్చాడు . అది టెలిగ్రాం . కవరు చించేసి వుంది . శాస్త్రిగారే చించి చదివా రట .

పల్లయ్యగారు మరణించా రన్న వార్తను మోసు కొచ్చిన తంతి అది .

మర్నాడు మామూలుగా ఆఫీసుకు వెళ్ళిన భీమన్నను చూచి, మొత్తం సిబ్బంది అవాక్కులై పోయారు . దయ్యాన్ని చూచినట్టు చూశారు భీమన్నను !

"నిన్న మీ కొక టెలిగ్రాం —" అన్నారు శాస్త్రిగారు అనుమానంగా .
"అందింది"
"అందులోని వార"
"మీకు తెలిసిందే"
"మరి వెళ్ళలేదేం ?"

టెలిగ్రాం చూచుకొని భీమన్న వెంటనే మామిడికుదురు వెళ్ళి పోతా డను కున్నారట అందరూ . "భీమన్నకు పితృ వియోగం" అంటూ ఒక వార్తను

కూడా వ్రాసి పెట్టారు — ఆ రోజు ప్రభకు. నిర్వికారంగా, నిర్వికారంగా ఏమి జరగనట్టే, రోజూలాగే, మామూలు ప్రైముకు ఆఫీసుకు వచ్చిన భీమన్నను చూచి ఆశ్చర్య చకితు లయిం దందుకే.

తర్వాత నాలుగైదు రోజులకు తమ్ముడు అర్జున్న వద్ద నుంచి లేఖ వచ్చింది. అందులో పల్లయ్యగారి అంత్య ఘడియలకు సంబంధించిన వివరా లున్నై.

పల్లయ్య గారి జీవితం నిష్ఠా గరిష్ఠంగానే సాగింది తుది దాకా. ఏ ఫలం కోసమూ ఆయన వ్రతం చెడలేదు. స్త్రీలు, డబ్బు, గౌరవాలు – రక రకాల వ్యామోహాలు అయనను లోగొనడానికి ప్రయత్నించిన సందర్భాలనేకం ఉన్నాయి. వేటికీ లోబడ లేదాయన. కడకు – కొడుకుల, కూతుళ్ళ సంపాదనను కూడ ముట్టుకోలేదు. బిడ్డలను పెంచి పెద్ద చేసే బాధ్యతేగాని, వాళ్ళ సంపాదనను ఆశించే హక్కు తలిదండ్రులకు లే దనే వా డాయన.

1943లో భార్య నాగమ్మగారు పోయిన తర్వాత. స్వయంపాకం చేసు కుంటూ ఏకాంత జీవితం గడిపారు పల్లయ్య గారు. 1953లో శివైక్యం పొందే ముందు ఆరు మాసాల పాటు అపస్మారక స్థితిలో వున్నారు. బాహ్య ప్రపంచ స్పృహ వుండేది కాదు. ఆ స్థితిలో కూడ తోటంతా తిరిగి వస్తూండే వారు అప్పుడప్పుడు.

ఆరోజు సోమవారం ఆకస్మాత్తుగా స్పృహవచ్చి చిన్నకొడుకు అర్జునుణ్ణి పిలిచారు. వచ్చిన అందరివంకా చూశారు. చుట్టూపరికించి "అన్నలేడా?" అన్నారు.

"మద్రాసులో కదా వున్నాడు"

క్షణం మౌనం తర్వాత, ఆయన నిట్టూర్చి ఇలా అన్నారు –

"నేను రేపు వచ్చే శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు పోతున్నాను. నా కేలోపమూ లేదు కాని, ఒక చిన్న కోరికవుంది. అది తీరదు"

ఆ కోరికేదో చెప్పమన్నాడు అర్జునుడు. అన్నను చూడాలని వున్న దన్నారు పల్లయ్యగారు.

"ఇవాళ సోమవార మే కదా . అన్నకు వైరు ఇస్తాను . రేపు బయలుదేరినా ఎల్లుండికి వచ్చేస్తాడు"

"లాభంలేదు" అన్నారు పల్లయ్యగారు . "నాకు స్పృహ వుండేది మరికొన్ని నిమిషాలు మాత్రమే . ఆ తర్వాత నాకిక తెలివుండదు . అన్న వచ్చినా నన్నతడు చూడ గలడేగాని , నే నతణ్ని చూడలేను . తెలివిలో లేనప్పుడూ , చనిపోయిన తర్వాతా చూచే దేమిటి ? అన్నకు వ్రాయవద్దు . అనవసర మైన అవస్థ" అన్నారు.

ఆ మీద తాను చనిపోయే టప్పుడు ఏం జరుగుతుందో చెప్పారు—

"నన్ను ఇప్పుడే ఒక గదిలోవుంచి తలుపులు వెయ్యండి . ఎవరూ ఆ సమీపానికి రావద్దు . గురువారం రాత్రి , అంటే శుక్రవారం తెల్లవారుజామున ఒక పెద్ద శబ్దం వినిపిస్తుంది . దుర్వాసన వస్తుంది . తర్వాత మరీ పెద్దధ్వని వినిపిస్తుంది . సువాసన వస్తుంది . అప్పుడు కొంచెం తాళి , దగ్గరకు రండి !"

ఆ తరువాత కొద్ది క్షణాలపాటు భీమన్నను గురించిన కొన్ని భవిష్య ద్వీషయాలేవో చెప్పారట ఆయన . పిదప అపస్మారంలోకి జారిపోయారు . శుక్రవారం తెల్లవారుజామున అంతా పల్లయ్యగారు చెప్పినట్లే జరిగిపోయింది . అది 1959 నవంబరు 18 కావచ్చు .

శిష్యులలో చాలమంది ఆ రాత్రికే అక్కడికి చేరారు . అంతా వింతగా వుంది . ఎవరికీ ఏమీ అర్థంకాలేదు . ఆ ఉదయం పెద్దకూతురు గొంతమ్మ తండ్రి మృతదేహానికి తలంటుతూ , ఆయన నడినెత్తి రంధ్రం పడివుండడాన్ని గుర్తించేవరకూ అంతా అయోమయంగానే వుంది .

దిగ్భ్రాంతు లయ్యారు శిష్యులూ , బంధు జనులూ . అప్ప డర్థ మయింది అంతవరకు జరిగిందీ , ఆయన చెప్పిందీ ! అప్పుడు గుర్తించారు – అన్ని నెలలుగా ఆయన గడిపింది సమాధి స్థితి అనీ , బ్రహ్మరంధ్ర భేదనం ద్వారా ఆయన ప్రాణోత్సర్గం కావించు కొన్నారనీ !

ఏది బ్రహ్మ రంధ్రమో - అదే హరద్వారం ,
ద్వారం మూస్తే మ నిద్దరం
తెరిస్తే నే నొక్కణ్నే !

—త్రిపదలు

అంతకు కొద్ది నెలలు ముందే భీమన్న తండ్రిని చూచి వచ్చాడు. ఆయన ఏ క్షణంలో అయినా పోవచ్చు కనుక, తాను రాలేననీ, డబ్బు పంపిస్తా ననీ, అంత్యక్రియలు చేసెయ్యమనీ తమ్ముడికి చెప్పి వచ్చాడు. అందుకే డబ్బు పంపించేసి వూరుకున్నాడు,

కర్మలో నమ్మకం లేని వాడు కనుక - మడీ, మైలా ప్రస క్తే లేదు.

ఆ తరువాత ఎప్పుడో ఈయన మామిడికుదురు వెళ్ళినపుడు - తల్లీ, తండ్రీ లేని తమ తోటను చూచి ఎంతగానో దుఃఖపడ్డాడు. ఆ దుఃఖమే "మా తోట" అనే లఘుకావ్యం. అందులోని ప్రతి అక్షరమూ ఒక కన్నీటి బొట్టు.

ఊరూరు తిరిగి నచ్చిన
నారున్ గొని తెచ్చి తోట నాటిన తండ్రిన్.
తీరుగ పెంచిన తల్లిన్
ఏ రీతిగ మరువ గాలె నీ వన లక్ష్మిన్ !
ప్రతికిన యన్ని నాళ్ళు పని
పాటుల నుక్కిరి బిక్కిరై, భవి
ష్యతు సరిహద్దు గోడకు ర
యమ్మున డీకొని, భగ్న మైన మా
పితరుల హృన్మధూళి వన
వీధుల నెల్ల పరిభ్రమించుచున్
గత మను వడ్డుతోసి - వను
కన్నుల కద్దు కొనెన్ శటాలినన్ !

—భీ. కా. కుసుమాలు

115. కాలంతో మార్పు

ఆ కాలంలో ఎక్కడ అష్టావధానాలు జరిగినా, భీమన్న హాజరై ఒక సమస్య ఇస్తూ వుండే వాడు.

"శ్రీ ల వనాంధ్ర మందు, భళి
రే, మెలివెట్టిరి గండు మీ సముల్"

ఈ సమస్యను తాను అనుకొన్న విధంగా, కనీసం సభాస్థారులు మెచ్చుకొనే విధంగా, పూరించిన అవధాని ఒక్కరూ తటస్థ పడలేదు.

ఈ కాలంలో స్త్రీలు మరీ బరి తెగించి పురుషుల మీదనే మీసాలు మెలి పెడుతున్నారు అనే సామాన్య ధోరణిలోనే పద్యాలు చెపుతూ వచ్చా రందరూ. అందులో సమస్య ఏముంది? చమత్కార మేముంది?

భాషా విజ్ఞానాలు ఎంత ముందుకు పోతున్నాయో అంత వెనకబడిపోతున్నారు పండితులు. తెలుగు సాహితీ రంగంలో పరువం ఏం లేదు. అంతా పాత పచ్చడి అంటాడు భీమన్న. 'మేస్త్రీలు' అనే మామూలు వాడుక పదం కూడ పండితులకి తెలీదు కదా - కొత్త రాజధాని కర్నూలులో హుటా హుటిగా నిర్మాణాలు జరిగి పోతున్న సమకాలిక విషయాల పరిజ్ఞానం కూడ వీరికి లేదు కదా - అంటూ వా పోతాడు.

పండిత సభలూ, అవధానాలూ ఈ నాటికీ అంతే - పాత ఉపమానాలు, పాత వర్ణనలూ - పాడిందే పాట!

* * *

జర్మను రచయిత్రి కాబోలు ఒకామె భారత పర్యటన చేసుకుంటూ మద్రాసు వచ్చినప్పుడు, ఒక రోజున నార్ల వారు ఆమెకు తమ యింట ఒక చిన్న పార్టీ ఏర్పాటు చేశారు. చాల మంది కవులు హాజరై ఎవరి రచనలను వారే వినిపించారు.

భీమన్నకు శ్రావ్యంగా పద్యం చదవడం రాదు. సభా పీఠికి కూడ జాస్తే. అందుకే అటు వంటి సన్నివేశాలను ఏదో వంక పెట్టి తప్పించు కొంటూ వుంటాడు. తన రచన లేవీ తనకు జ్ఞాపకంలో వుండవు. నిజమే, అది అంద రికీ తెలిసిందే. పుస్తకం చేతిలో లేకపోతే, అదొక మంచి వంక. అది గమనించిన నార్ల తన లైబ్రరీలో నుంచి ఒక్క చక్కని బొండు బుక్కు తెచ్చి భీమన్న కిచ్చారు. అది "రాగోదయం".

నార్లవారి సొంత లైబ్రరీ చాల పెద్దది. చాల గొప్పది. అసలు సొంత లైబ్రరీ లుండే వ్యక్తులే అరుదు. అటువంటి వారిలో నార్ల వారిది

ాగ్రస్థానం . లక్షలు విలువచేసే అపూర్వ గ్రంథాలెన్నో అందులో వున్నై. సంపాదనంతా గ్రంథ సేకరణకే వినియోగిస్తూ వచ్చారాయన . తెలుగులో ఆధునిక కవుల చిన్న చిన్న పుస్తకాలను సైతం అందంగా బైండు చేయించి తన లైబ్రరీలో భద్రపరిచి వుంచారు .

రాగోదయం తెరిచి "గోదావరి గుండియతో" అన్న చిన్న గేయాన్ని మంద్ర స్వరంలో చిన్నగా పాడాడు భీమన్న .

కార్యక్రమం చివర కృతజ్ఞత చెపుతూ ఆ రచయిత్రి ఒక్క భీమన్న పేరును మాత్రం ప్రత్యేకంగా నుడివి, "తెలుగు అర్థం కాకపోయినా, దాని మాధుర్యాన్ని భీమన్న గేయంలో ఆస్వాదించ గలిగాను" అని ప్రశంసించింది .

* * • *

బెజవాడ గోపాలరెడ్డిగారితో భీమన్నకు ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడ్డ రోజులవి . ఉత్పల సత్యనారాయణాచార్యగారి పరిచయం భీమన్నకు గోపాల రెడ్డిగారి పేరోలగంలోనే కలిగింది . తులాబందుల నాగేశ్వరరావు, పి . వి . రత్నంగార్లు కూడఅప్పుడు తగిలిన మిత్రులే . రత్నం భీమన్నపై ఒక పెద్ద వ్యాసమే వ్రాశాడు..

రాజకీయ బాధితులకు సహాయం చెయ్యాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకొన్న 1946 ప్రాంతంలోనే, ఆ జాబితాలో భీమన్నను చేర్చినవారు రుద్ర రాజు రామలింగరాజుగారు . జాతీయ పోరాటంలో పాల్గొనడం ఒక ధర్మం . ప్రతిఫలం ఆశించి ఆ పని చెయ్యలేదు . అందువల్ల తనకేమీ ఒక్కరలేదన్నాడు భీమన్న . కనీసం జాబితాలో అయినా మన పేర్లుండాలి కదా అని నచ్చచెప్పారు రాజుగారు .

ఆదిభట్ల నారాయణదాసుగారి హరికథను ఒకేసారి విన్నాడు భీమన్న . అది చెన్నపురి ఆంధ్ర మహాసభవారి హాలులో .

అదే హాలులో కొన్ని సంవత్సరాలకు పూర్వం - ఏదో ఒక తెలుగు కవుల సమ్మేళనంలో భీమన్న రాజోలు నుంచి ప్రత్యేకంగా పిలువబడి వచ్చి పాల్గొన్నాడు . అప్పుడే 'ఆకాంద తాండవం, విని బుచ్చి సుందరరామశాస్త్రి, తెలికిచర్ల వెంకటరత్నం మున్నగువారు ఎంతో మెచ్చుకున్నారు .

గడియారం శేషశాస్త్రిగారికి సన్మానం జరిగిం దక్కడే. కార్యకర్తలలో భీమన్న ఒకడు. వక్తలను పిలుచుకురావడం ఈయన పని. అందులో చాల మందికి 'శివ భారతం' అంటే ఏమిటో తెలియదు. భీమన్నకూ తెలియదు. బహుశ శివుని లీల లన్నిటినీ చేర్చి కావ్యంగా వ్రాసివుండవచ్చు అనుకొన్నారట. అయినా స్పష్టంగా తెలియదు కదా! ఏం మాట్లాడాలి? అందుకని కృష్ణశాస్త్రి గారి వంటికొంత మంది ముఖ్య వక్తలే రాలేదు.

ఇలాంటి చమత్కారాలు, సరదాలు వేల కొలది వున్నై వ్రాస్తే. విద్యార్థి నాయకుడు ఎన్. వి. ఎస్. ప్రసాదరావు గారితో అప్పటి ఈయన స్నేహం మొత్తం ఒక స్టంటు పిక్చరు. ఒక డిటెక్టివ్ నవల. మలయ పవనాలను పంచుకోవడంలోనే కాదు, ఝుంఝూమారుతాలకు తట్టుకోవడంలో కూడ వీరి మైత్రి గోవర్ధన ఛత్రి గానే నిలిచి వున్నదట నేటికీ!

శత్రుడు వది మింగి బిడ్డ గంతులు వేసెన్ :

* * *

ముగ్గురు పంచ పాండవులు

మూడు జగమ్ముల ఖ్యాతి గాంచరే :

* * *

రావా, పోవకు మటంచు భార్యను వేడెన్!

* * *

—భీమన్న సమస్యలు

116. తన్నక పోవడమే సన్మానించడం

కర్నూలులో ప్రకాశం మంత్రివర్గం పడిపోయి, 1954 ఎన్నికల సంరంభం ప్రారంభ మయింది. 1952లో చేసిన పొరపాట్లను దిద్దుకొని, ఎన్నికలకు సిద్ధమయింది కాంగ్రెసు. ప్రజా పార్టీతో పొత్తు కుదిరింది కూడ.

ఆనాడు ఓడిపోయిన కాంగ్రెసు అభ్యర్థు లంతా తిరిగి అభ్యర్థు లయ్యే అవకాశం వున్నందువల్ల, ఆంధ్రప్రభలో పది రోజులు సెలవు పెట్టి, కర్నూలు

మీదుగా రాజోలు వెళ్ళాడు భీమన్న . అయితే ప్రజాపార్టీకి ఇవ్వవలసిన వాటా సీట్లలో రెండూ రాజోలు సీట్లే అయినందువల్ల , భీమన్నకు ఛాన్సు లేకపోయింది .

"ఏలాగూ వచ్చావు కనుక , నా నియోజక వర్గంలో ఒకసారి తిరిగి వెళ్ళు" అన్నారు కళావారు భీమన్నతో . వెంటనే కారు ఏర్పాటు చేసి , మంతెన సుబ్బరాజు గారిని తోడిచ్చి , వదిలేశారు .

ఆవన్నీ 1952లో కమ్యూనిస్టులు గెలిచి వున్న నియోజక వర్గాలు . ఆ రెండేళ్ళలోను కమ్యూనిస్టుల బలం సడలినా , పట్టు సడల లేదు . కొత్తపేట నియోజక వర్గంలో ఆ వారం రోజుల అనుభవం మరవ లేనిది భీమన్నకు .

అల్లూరి సత్యనారాయణ రాజు , చదలవాడ పిచ్చయ్య మున్నగు యువ నాయకుల ఉపన్యాస ఝరీ వేగంలో నియోజక వర్గం అంతా చిందర వందర అయిపోయినా , చెక్కు చెదరని మామా వాడలలో చాలా శ్రమ పడవలసి వచ్చింది భీమన్న . సుబ్బరాజు గారి పట్ల మాలలకు కొంత విశ్వాసం వుంది . అది చాల వరకు ఉపయోగ పడింది . ఆత్రేయ పురం వంటి గ్రామాలలో ప్రాణ గండాలనే ఎదుర్కొవలసి వచ్చిం దీయన . ఏది ఏమైనా , చాల ఫల ప్రదమైన కృషి అది .

అట్టి స్థితిలో ఎస్. బి. పి. పట్టాభి రామారావు గారు భీమన్నను కలిసి , తన నియోజక వర్గంలో కూడ ఒక వారం రోజులు తిరిగి వెళ్ళమన్నారు . నార్ల వారికి ఫోను చేసి , అనుమతి సంపాదించారు . ఒక కారిచ్చి , ముగ్గురు యువకులను తోడిచ్చారు . అందులో యిద్దరు హరిజన , ఒకడు బ్రాహ్మణ . ఆయా వూళ్ళ , ఆక్కడి నాయకుల పేర్లను జేబులో వేసుకుని బైలు దేరాడు భీమన్న . ఆది రామచంద్రాపురం తాలూకాలోని కపిలేశ్వరపురం నియోజకవర్గం .

నియోజక వర్గం వివరాలను చెపుతూ , నాలుగు మామా వాడలను పేర్కొని , ఆక్కడికిమాత్రం ఎట్టి పరిస్థితులలోను వెళ్ళవద్దని హెచ్చరిక చేశారు పట్టాభిరామారావుగారు ముందుగానే .

ఒకరోజున ఎక్కడెక్కడో తిరిగి , రాత్రి పొద్దుపోయి వాపసువస్తూ , రోడ్డుకు అరఫర్లాంగు దూరంలో ఒక పెద్ద పేటను చూశాడు భీమన్న . పట్టాభి రామారావుగారు వెళ్ళవద్దన్న పేటలలో అదొకటి .

ఏం, ఎందుకు వెళ్ళకూడదు ?

అది కరడుకట్టిన కమ్యూనిస్టు కంచు కోట అనీ, ప్రైం వ్యధాతప్తితే ఫలితం వుండదనీ కారులోని మిత్రులు చెప్పారు.

అయితే - ఎన్ని కంచు కోటలు బ్రద్దలు కొట్టలేదు తను ? ఇదొక లెక్కా ? అప్పుడు రాత్రి పదిగంటలు.

మామూల పేటల్లో ఎన్నికల ప్రచారాలకు సమయం రాత్రులే కదా ! కారును రోడ్డుప్రక్క నిలిపి, నలుగురూ పేటలోకి నడిచారు. కొంచెం పెద్దదిగా కనిపిస్తున్న కొంపముందు నిలబడి పిలిచారు. నలుగురూ నాలు గిళ్ళముందూ సందడి చేశారు.

కొంతసేపటికి ఒకచేత లాంతరు, ఒకచేత కర్ర తీసుకొని ఒకవ్యక్తి బైటికి వచ్చాడు. అలానే పేట నలుమూలల నుంచీ లాంతర్లు, కర్రలు వచ్చి అక్కడ గుమిగూడాయి.

"ఎవరు మీరు?" ఒక కఠిన స్వరం.

"కాంగ్రెసు వాళ్ళం" భీమన్న.

"ఆఁ!" ఒక హుంకారం.

"అవు నండీ! కాంగ్రెసు వాళ్ళమే" వినయంగా అన్నాడు భీమన్న.

"ఇక్కడ కాంగ్రెసు పేరెత్తి, బతికి పోదా మనే వచ్చారా?" గుంపులో నుంచి మరో కంఠం. "ఎన్నిగుండెలు!" మరో గొంతు !

పరిస్థితి ఇంత భయంకర మనుకోలేదు భీమన్న. "మేం క్రొత్తవాళ్ళం మాకు తెలియదు" అన్నాడు మెల్లగా.

"ఏ వూరు?"

"మాది రాజోలు ప్రాంతం. ఉండేది మద్రాసులో. నాది మీ కులమే. అందుకే ధైర్యం చేసి వచ్చాను. ఇంతవర కెప్పుడూ ఈ ప్రాంతాలకు రాలేదు. ఇక్కడ కాంగ్రెసు పేరెత్త కూడ దని నాకు తెలియదు."

"మా కులం వాడివా ! ఏమిటి పేరు ?''

"బోయి భీమన్న"

మౌనం , క్షణం నిశ్శబ్దం . తర్వాత గుసగుసలు-

"పాలేరు నాటకం వ్రాసిన—"

"అవును''

''రుజు వేమిటి? "

నిజమే , రుజు వేమిటి ?

''నేను చెపుతా నుండండ్రా !'' అన్నాడొక క్రూరవాడు . అక్కడున్న ఒక హరికెను లాంతరు వత్తిని బాగా ఎగదోసి , లైటును భీమన్న ముఖం మీద పెట్టి , పరిశీలించి చూచి , "బోయి భీమన్నేరా !'' అన్నాడు .

'' ఎలా తెలుసు కున్నావు ?" భీమన్న ప్రశ్న .

''పాలేరు పుస్తకం మీద ఫోటోను బట్టి''

ప్రతికాం ఆనుకున్నాడు భీమన్న . వ ద్దంటుండగా ఆ ఫోటోను ముద్రిం చిన బొందలపాటి వారికి మనసులోనే మొక్కు కున్నాడు .

"పాలేరు నాటకం ఇక్కడ మేం చాలసార్లు ఆడాం . ఆ నాటకం రాసిన భీమన్న ఒక జమీందారుకు వోటివ్వమని వచ్చాడంటే - మేం నమ్మం !" అన్నారు వాళ్ళు .

"మరి వచ్చాడు కదా?"

"అదే ఎందుకు ?"

"ఎందుకో నన్ను మీరు చెప్పనిస్తే కదా?"

''అయితే , చెప్ప" కూర్చున్న రంతా ,

క్లుప్తంగా రెండు నిమిషాలలో చెప్పేశాడు భీమన్న . ఆక్కడి జమీందార్ల కుటుంబాన్నే ఉదాహరణగా తీసుకున్నాడు . జస్టిసు పార్టీ అధికారంలో వున్న ప్పుడు తండ్రి పదవిలో వుండి పరిపాలించాడు . కాంగ్రెసు పార్టీ

అధికారంలోకి రాగానే కొడుకు పదవిలోకి వచ్చి పాలిస్తున్నాడు. కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి వస్తే, మనుమడు పదవిని చేబట్టి పరిపాలిస్తాడు. పార్టీ ఏదైనా, పాలించేది వాళ్ళేనా? మన గతి ఎప్పుడూ ఇంతేనా?" ఆగాడు కొంచెం.

"ప్రశ్నలు వద్దులే, చెప్పుకుపో" అన్నారు వాళ్ళు.

తర తరాలుగా మాల మాదిగలు ఈ స్థితి లోనే వుండి పోవడానికి గల కారణాలను వివరిస్తూ, "ఎప్పుడు ఏ పార్టీ అధికారంలో వుంటే అప్పుడు ఆ పార్టీని వ్యతిరేకించే జబ్బు మనలో వుంది. అగ్రకులాల వాళ్ళు కుట్రచేసి, మనలో కల్పించే జబ్బే అది. రేపు కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి వచ్చినా, దానికి వ్యతిరేకమై పోతాం మనం. ఎందుకంటే మనల్ని ఉద్ధరించడం దానికి కూడ సాధ్యం కాదు కనుక. దాని నాయకత్వం కూడ జమిందారీ కులాల చేతిలోనే వుంది కనుక, మనలో విప్లవ చైతన్యం కలగకుండా, ప్రపంచజ్ఞానం పుట్టకుండా ఎవళ్ళూ మనల్ని ఉద్ధరించలేరు. మనం శవాల్లా పడి వుంటూ ఎవళ్ళో లేవనెత్తడం లేదనుకోవడం వ్యర్థం. ఊరివాళ్ళను చూసైనా జ్ఞానం తెచ్చుకోవాలి మన పేటలు. ఇది చెప్పడానికే వచ్చాను నేను. నిద్రపాడుచేసి నందుకు క్షమించండి. ఇక మేం పోతాం" అంటూ లేచాడు భీమన్న.

"ఫర్వాలేదు. కూర్చోండి. మాకు ఇదెప్పుడూ వుండే బాగోతమే. మేం చెప్పేది కూడా విని వెళ్ళండి" అన్నాడు అందులో ఒక పెద్ద.

కూర్చున్నాడు భీమన్న.

"వీళ్ళంతా మన వాళ్లేనా?"

"అవును."

"సరే వినండి. మీరు చెప్పిదంతా నిజమే. కాదనడాని కేముంది? మా పరిస్థితి వేరు. మేం కమ్యూనిస్టు పార్టీకి కట్టుబడి పోయాం. జమిందారుల్ని బలపరచే ఏ పార్టీని కూడ మేం మా దనుకోలేం. ఈ పార్టీ కూడ అలానే తయారైతే-అది మా కర్మ. ఇప్పుడు కొంత అలాగే జరిగింది. కమ్యూనిస్టు పార్టీని కొందరు దుర్మార్గులు చీల్చేసి, కమ్యూనిస్టు సెంటరు అని వేరే పార్టీ పెట్టారు. ఇప్పుడు ఆ సెంటరు వాళ్ళు వచ్చారేమో నరికి పారేద్దా మనుకున్నాం.

మా నాయకులు ఇంత క్రితమే వచ్చి వెళ్ళారు. కాంగ్రెసు వాళ్ళు రారు. ఇక ఎవరొస్తారు? సెంటరు వాళ్లే అనుకున్నాం. మా కసి అంతా తీర్చు కుందామనుకున్నాం. మా పార్టీకి వెన్ను పోటు పడింది. మీ పార్టీ గెలుస్తుంది. ఆ సంగతి మాకు తెలుసు. అయినా మేం కమ్యూనిస్టు పార్టీని వదులుకోలేం." ఆగాడతడు.

"మీ ఇష్టం. కాలాను గుణంగా మారడం జీవ లక్షణం. అట్టి లక్షణం లేని దేదైనా సరే, చైతన్యం కోల్పోయి, మురికి పేటలుగా పేరుకు పోయి, నశించి పోతుండి. కదలక పోతే ప్రగతి లేదు. ఇప్పుడు మీరు మాకు వోట్లి వ్వకపోవడం లేదు. నేను చెప్పింది మాత్రం ఆలోచించండి." అన్నాడు భీమన్న లేస్తూ.

"మరొక్క మాట విని పొండి" అన్నారు వాళ్ళు

అగారు వీళ్ళు మళ్ళీ.

"పాలేరు నాటకం వ్రాసిన బోయి భీమన్న మాకు దేవుడి లాంటి వాడు. ఆయనను మేమెప్పుడైనా చూస్తా మనుకోలేదు. అట్టి వాడు తనంతట మా మధ్యకు వచ్చినప్పుడు, మే మెంతో సంబర పడవలసిన వాళ్ళం. ఎంతో పూజించవలసిన వాళ్ళం, కాని కాలంలో, కాని పని కోసం వచ్చావు నీవు. దురదృష్ట వంతులం. ఈ రోజు జ్ఞాపకం వచ్చినప్పుడెల్లా ఏడుస్తా మనేది మరిచి పోకండి. ఈ పేటలోకి వచ్చి, కాంగ్రెసు పేరెత్తి, దెబ్బలు తినకుండా వెళ్ళిన వాళ్లలేరు. ఇప్పుడు మీరు వెళుతున్నారు." పై పంచెతో కళ్ళాత్తు కన్నాడతడు అలా ఆంటూ. అందరి పరిస్థితీ అంతే. ఏదో కారుణ్యంలో మునిగివుంది.

భీమన్న మిత్రులతో కారు వద్దకు వచ్చే టప్పటికి ఒంటిగంట దాటింది. అంత దూరంలో మరో కారు నిలబడివుంది. ఈ లోగా ఇక్కడ జరిగిందే మిటంటే -

కాంగ్రెసు అధ్యక్షులు గోపాలరెడ్డి గారు ఆ రోజున ఆ నియోజక వర్గంలోనే వున్నారు. ఆయనతో పట్టాభి రామారావు గారూ తిరుగుతున్నారు. వాళ్ళ కార్లు ఆ లోడ్డున పోతూ, అక్కడ భీమన్న కారును గుర్తించి ఆగారట. సంగతి

చెప్పాడు డ్రైవరు. "ఇంత రాత్రి కడ అక్కడి కెందుకు వెళ్ళనిచ్చావు ?" అంటూ డ్రైవరును కోప్పడి, తమ వెంట వున్న కార్లలో ఒక దానిని ఎస్కార్టుగా అక్కడ వుంచేసి వెళ్ళారట వాళ్ళు !

ఆ రాత్రి జరిగిన ఆ సంఘటన గుర్తుకు వచ్చినప్పు డెల్లా భీమన్న కళ్ళు కూడ చెమర్చుతూనే వుంటై.

"హరిజన వాడలు అచేతనాలు కావు. అజ్ఞానంలో లేవు. అభ్యుదయం కోసం పోరాడుతూనే వున్నై. భయం లేదు" అంటాడు భీమన్న.

ఆడిగితే కాని అమ్మైనా పెట్టదు
ఏడ్చే వాడికే పాలు పడుతుంది,
ఆందోళన చేస్తేనే గాని
అపసరాలు గుర్తించ బడవు,
అందుకే – మేల్కొనండి
ప్రజలను మేల్కొలపండి!
ఏకం కండి!
ఎలుగెత్తి అరవండి!

—ధర్మం కోసం పోరాటం

117. పేద – ఉద్యోగి

"పత్రికలలో ఏదో ప్రకటన వచ్చింది, చూశారా ? మీకు తగిన పోస్టది" అన్నారు మంత్రి సంజీవయ్యగారు భీమన్నతో-ఆయన ఒకసారి కర్నూలు నుంచి మద్రాసు రాగా ఈయన చూడవెళ్ళి నప్పుడు.

ఎన్నికలలో కాంగ్రెసుకు మెజారిటీ వచ్చి, గోపాలరెడ్డిగారు ముఖ్యమంత్రి అయ్యారు. సంజీవయ్య, కళా వెంకటరావు, సంజీవరెడ్డి మున్నగువా రంతా మంత్రివర్గంలో వున్నారు.

ఆ ప్రకటన ఏమిటో భీమన్న చూడలేదు. సంజీవయ్యగారే చెప్పారు. ప్రభుత్వ అనువాదశాఖ అధిపతి స్థానం ఖాళీ అవుతున్నది. పబ్లిక్ సర్వీసు

కమీషనువారు ఆ స్థానాన్ని డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయదలిచారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరబడినై.

"మీరు అప్లై చేయకూడదా?" అన్నారు సంజీవయ్యగారు.

"ఇచ్చేవా రెవరు?" అన్నాడు భీమన్న.

ఆక్కడున్న పెద్ద లంతా ఆశ్చర్యపోయారు భీమన్న వైఖరికి.

"అప్లయి చెయ్యమని మంత్రిగారే చెపుతుంటే, అదేమిటండీ ఆలా అంటారు?" అన్నాడు ఆందులో ఒక పెద్ద.

"మంత్రిగా రెనై్నా చెపుతా రండీ! పని జరగాలికదా! పైగా, ఇది వారి చేతిలో శాఖ కాదు. స్థానం రిజర్వుడు కాదు" అన్నాడు భీమన్న. సంజీవయ్య గారు చిరునవ్వు నవ్వేశారు. ఆదీగాక, అభ్యర్థి 40 సంవత్సరాలలోపువాడై వుండాలి. భీమన్నకు అప్పటికి 43.

ఆయినా, ప్రయత్నం చెయ్యవచ్చుకదా? చెయ్యవచ్చు! అది వస్తే మంచిదే. రాకపోతే? ఓటమికి తట్టుకోలేడు భీమన్న. కవిగా, రచయితగా, జర్నలిస్టుగా ఆగ్రశ్రేణిలో వున్నా ననుకొంటున్నవాడు. ఇంతో అంతో ఆహంకారం కలవాడు-ప్రయత్నించి విఫలుడైతే, ఆ అవమానం భరించ గలడా? చచ్చినా భరించలేడు. కనుక, అప్లయి చెయ్యడు.

"మరి ఈ పేదరికం భరించడం ఎలాగ?" అడిగింది భార్య.

పేదరిక మంటే-సామాన్యమైన పేదరికం కాదు. ఆంధ్రప్రభలో ఈయ నకు వచ్చే జీతంలో సగం ఇంటి అద్దెకు, సగం బియ్యానికీ సరిపోతుంది. అదైనా తమ ఇద్దరి వరకు మాత్రమే. మరి పిల్లల మాట! చిన్న పిల్లను కాకినాడలో ఆమె అక్క జానకమ్మ గారి వద్ద, కుర్రాళ్ళిద్దరినీ రాజోలులో ఆమె పుట్టింట చంద్రయ్యగారి వద్ద వదిలేశారు. పెద్ద పిల్ల కాకినాడ కాలేజీలో ఇంటరు చదువుతున్నది.

ఇలా ఎంత కాలం?

రాగోదయం గేయాలు వ్రాస్తున్నప్పుడే భీమన్నకు ఒక ఉపాయం తట్టింది. ఆది "కూలి రాజు" లోని నిష్కుల పిర్ పాత్రను వాస్తవ జీవితంలో తానే నిర్వహించడం! అందుకు ఒక ఏక తారను కూడ సంపాదించాడు. అయితే, ఆట్టిది తనకు సాధ్యమా? నాటకంలో ఆ పాత్రను నిర్వహించిన జె. వీరస్వామి గారిలా కూడ తాను పాడలేడే!

శివు డంతటి సోషలిస్టువా?
వామను డంతటి పొలిటీషియనువా?
బుద్ధు డంతటి సోషల్ వర్కరువా?
అయితే, బిక్షమెత్తే అర్హత నీకుంది:

— టుమ్రీలు

"అది సాధ్యం కాదు కనుకనే, ఈ ఉద్యోగానికి అప్లయి చెయ్యండి" అన్న దామె. ఈయనకు నచ్చజెప్పడంలో ఆదిలక్ష్మి సహాయ పడింది.

భీమన్నకు తెలియ కుండానే అప్లికేషను ఫారాలు తెప్పించి, ఆదిలక్ష్మి శ్రీకారం చుట్టి, భీమన్న ముందు పెట్టి, పూర్తి చేయించి, ఆ యిద్దరూ స్వయంగా తీసుకెళ్ళి, కర్నూలుకు రిజిష్టరు చేశారు. ఈ రహస్యం ఈ ముగ్గురికి, రెవిన్యూ శాఖలో పని చేస్తున్న మిత్రుడు అబ్రహాం గారికీ తప్ప మరెవరికీ తెలియదు. భీమన్నకు అబ్రహాం గారు చాల ఆత్మీయుడైన మిత్రుడు. అదే ఇంట్లో మరో పోర్షనులో అద్దె కుంటున్న వాడు.

ఊరికే అప్లయి చేసి ఊరుకుంటే కాదు కనుక, వయో పరిమితి ఎగ్జంప్షను వగైరా లెన్నో చూసుకోవలసి వుంది కనుక, తాను చేసిన పని గురించి తెలియ బరుస్తూ, కళా వారికి ఒక లేఖ వ్రాశాడు భీమన్న.

భీమన్న అమాయకుడనీ, తన పని తాను చేసుకో లేడనీ కళా వారికి తెలుసు. అందువల్ల - ఎగ్జంప్షనుకోసం ఎవరికి వ్రాయాలో దగ్గరి నుంచి, ఇంటర్వ్యూ వచ్చే వరకు కూడ, ఆయన ఈయనను గైడు చేస్తూనే వచ్చారు.

ఆ కాలంలో ముఖ్యమంత్రి గోపాలరెడ్డి గారు ఎవరికీ ఏగ్జంప్షనులు ఇవ్వడం లేదు. ఆయన పెట్టుకొన్న నియమం అది. ఆ నియమానికి భీమన్న కే సొకచే ఎగ్జంప్షన యింది.

జైలుకు వెళ్ళలేదే తప్ప, రాజకీయ బాధితులలో భీమన్న అగ్ర శ్రేణికి చెందిన వాడే. ఆ జైలుకు వెళ్ళక పోవడం కూడ కాంగ్రెసు అగ్ర నాయకుల ఆదేశం వల్లనే. ఆ స్థాయి వర్కర్లలో ముఖ్యులంతా ఏదో ఒక పదవిలో కుదురు కొన్నారు. భీమన్న ఒక్కడే మిగిలి పోయాడు. ఇది ఇతడి కనుకూలమైన ఉద్యోగం. ఇదే ఇక ఆఖరు ఛాన్సు. దీనికి వయస్సు ఆటంక మయిందే అన్న సానుభూతి ఆ నాయకులలో కలిగి, దానిని తొలగించా రనుకోవచ్చు.

ఎప్పుడైనా గాని, ఏ ఉద్యోగ పదవులైనా గాని, రాజకీయ ప్రభావా లకు లోబడి నట్టివే. కళావారు భీమన్నకు చేసిన మరో ఉపకారం ఏమిటంటే రాజకీయాల పోటీ ఒత్తిడిని తొలగించడం. జీతం తక్కువైనా, ఉద్యోగం పెద్దది. శాఖాధిపత్యం. బహిరంగ పోటీ. రాజకీయాల ప్రభావానికి వదిలేస్తే అది ఒక హరిజనుడికి లభించే అవకాశమే లేదు. ఈ విషయంలో కళావారు జాగ్రత్త పడి, భీమన్న ఇంటర్వ్యూను కేవలం మెరిట్‌కి పరిమితం చేసి వది లేశారు. మెరిట్‌లో భీమన్నదే పైచేయి, ముఖ్యంగా అనువాద కళలో.

ఈ సంగతు లన్ని భీమన్నకు అప్పట్లో తెలియవు. కళావారు కీర్తికాయు లైన తర్వాత, వారి సన్నిహితుల ద్వారా తెలిసి నట్టివి. ఆనాటి ఉదార మూర్తు లవి గుప్త సహాయాలు, దైవీయ లక్ష్యాలు.

ఇంటర్వ్యూకు కర్నూలు వెళ్ళాడు భీమన్న. అదొక పెద్ద చరిత్ర. అభ్యర్థులు చాల మంది వచ్చారు. అందరూ ఈయనను ఎరిగిన వాళ్ళే. "మీరు కూడ ఒక అభ్యర్థి అని తెలిస్తే, మేం రాకనే పోదుము" అన్నారు చాలమంది. ఇంటర్వ్యూలో అడుగుతా రనుకొంటున్న మాటలకు, వాక్యాలకు అనువాదాలు చెప్పించు కున్నా రీయన చేత. తన ఇంటర్వ్యూ మాత్రం అనుకోనంత బాగా జరిగింది.

"ఈ ఉద్యోగం మీకు రాకపోతే, అంతకంటె ఎక్కువ జీతం కల ఉద్యోగం నే నిస్తాను. సంతోషంగా వెళ్లిరండి" అన్నారు త్రిపురనేని గోపీచందు గారు భీమన్నతో, ఇంటర్వ్యూ ఫలితం ఎలా ఉంటుందో అని ఈయన అన్న ప్పుడు. గోపీచందు గా రప్పటికి రాష్ట్ర సమాచార శాఖ డైరెక్టరు.

ఇంటర్వ్యూ అంటే సమానుల మధ్య పోటీ. జయాపజయాలు దైవాధీనాలు. ఒక విధమైన ఆందోళనలో వున్న మనస్సుకు గోపీచందుగారి ప్రోత్సాహక వాక్యం వేసవిలో చలివేంద్రే అయింది. తేలిక పడిన హృదయంతో కథా వారిని, గోపాలరెడ్డిగారిని, సంజీవయ్యగారిని మరోసారి చూసేసి వచ్చేశాడు మద్రాసుకు.

ఆకటి బాధకు అల్లాడెదవా?
బానిసపై ద్రితికెదవా?
ఈ విశాల విశ్వములో మరియొక
త్రోవయె కనసడదా?
పగలగొట్టు నీ భిక్షా పాత్రము
తెగ త్రెంపుము నీ శృంఖలము
అభ్యుదయముతో, ఆగతి లో
అడుగిడి సాగుము, వీరా!

— పాలేరు

118. పాలేరు సినిమా

గోపీచందు గారు సినిమాలు డైరెక్టు చేస్తున్న రోజులలో పాలేరు చిత్ర నిర్మాణానికి ప్రారంభోత్సవం జరిగింది. ఆ ఉత్సవంలో పంచిపెట్ట బడ్డ కరపత్రం ప్రతి ఒకటి భీమన్న చేతికి వచ్చింది. అందులో కథ, సంభాషణలు, డైరక్షను కూడ గోపీచంద్ గారే అని పేర్కొనబడింది. అందులో ఇవ్వబడిన ఇతివృత్తం సినాప్సెసు మాత్రం భీమన్న పాలేరుదే!

నాటక, సాహిత్య రంగాలలో పాలేరు అంటే భీమన్న వ్రాసిన పాలేరు నాటకం అనే రూఢి. ఆ నాటకానికి అంత ప్రసిద్ధి వుంది.

పాలేరు సినిమా తీస్తున్నారన్న వార్త పత్రికలలో పడగానే భీమన్నకు అనేకంగా అభినందన లేఖలు రాసాగినై. అభినందిస్తున్న వాళ్ళకు ఏం చెప్పాలో తెలియక భీమన్నకు మతిపోయింది. గోపీచంద్ గారికి లేఖ వ్రాస్తే జవాబు లేదు.

ఒక రోజున కూర్మయ్య గారిని తీసికొని, గోపీచందు గారిని కలిశాడు భీమన్న. తెనాలి నుంచి కాబోలు ఎవర్లో ఒక కథా సంగ్రహాన్ని తీసికొనివచ్చి తనకిచ్చి ప్రాయమన్నారనీ, అదేమిటో తానింకా చూడలేదనీ గోపీచందు గారన్నారు. ఆ తర్వాత ఆ ప్రొడ్యూసర్ పేరు కనుక్కొని, ఘాటుగా ఒక రిజిస్టరు లేఖ వ్రాశాడు భీమన్న. ఫలితం కనిపించక పోవడంతో, తనకు తెలిసిన అడ్వకేటు భాగవతుల లక్ష్మీనారాయణ గారిని కలిసి సలహా చేశాడు. మెదలకుండా ఊరుకుని, సినిమా విడుదల ఆయిన వెంటనే కోర్టుకు వెళ్ళడం మంచిదని సలహా ఇచ్చాడు ఆయన.

అయితే - జరగవలసిన నష్టం భీమన్న రిజిస్టరు లేఖతోనే జరిగింది. భీమన్నకు దొరక్కుండా వుండడం కోసం వాళ్ళు సినిమా కథను పూర్తిగా మార్చివేసుకున్నారు. హీరోను ఒక ఫ్యాక్టరీ కార్మికునిగా తయారుచేశారట. కథ అసహజమూ, అతుకుల బొంతా కావడం వల్ల కాబోలు, ఆ కథ అంత డిత్తో వెలుగు చూడకుండానే అంతమై పోయింది.

సిగరెట్ పొగాకు తెచ్చిన లాభ మరలక్ష
పంట్లాము జేబులో పదిల పరచి
పెండ్లి కంటెను వేరు పెద్ద కోరిక లేవి
పొరుగింటి పదతిని మోహపెట్టి
కష్టించి పాప మే కవియొ సృష్టించిన
బంగారు కథ నొండు దొంగిలించి
మాటలు, పాటలు మక్కికి మక్కిగా
నే పాత ఫిల్మునో కాపి కొట్టి

ప్రముఖ మంత్రి ఎవరో ప్రారంభ శుభ మహో
త్సవము చేసి తనను చాల పొగడ,
కోట్లి కొలది పచ్చ నోట్లకై వర మేదొ
కోర నతడు నిన్ను జేరినాడు;'

— దీప శత

ఆనే దీప సత లోని పద్యానికి ప్రేరకం ఈ ఉదంతమే. ఈయన రచన లన్నిటి వెనక ఏవో సజీవ ప్రేరణ లుంటా యనడానికి ఇదొక చక్కని ఉదాహరణ.

పాలేరు నాటకం ఆధారంగా చిత్రాలు తీయడానికి ఆ రంగంలోని చాల మంది పెద్దలు భీమన్నతో సంప్రదించారు. అయితే, ఏ ప్రయత్నమూ సఫలం కాలేదు. ఆదొక ఊపు, ఉప్పెన. అంతే.

ఇక్కడ గమనించ వలసిం దేమిటంటే - పది రూపాయలు చేతిలో పెడితే పరమ సంతృప్తితో పర్మిషను ఇచ్చే భీమన్నను ఉపేక్షించి, ప్రసిద్ధమైన ఈయన ఇతి వృత్తాన్ని దొంగలించడానికి ప్రయత్నించడం. ముఖ్యంగా సినిమా రంగంలోని పెద్దలు లక్షలు నష్టమైనా భరించ గలరు కాని, ఒక హరిజనుడి పేరును తెర మీదికి ఎక్కించడానికి అంగీకరించరు.

ఆ తర్వాత గోపీచంద్ గారు కూడ సినిమా రంగాన్ని వదిలేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రచార శాఖకు డైరక్టరుగా కర్నూలు వెళ్ళిపోయారు. భీమన్న మళ్ళీ ఆయనను కలిసింది అక్కడే.

మోజు గంతారతో ఆ
రోజుకె రాజైన యట్టి ప్రొడ్యూసరు నీ
బూజు గుడికి వచ్చుటతో
పూజారుల పూర్వ పుణ్యములు తెగ వండెన్ :

— దీప సభ

119. మా దగ్గరా వుంది లక్ష్మి

కొద్ది రోజులలోనే భీమన్న సెలెక్టు అయినట్టు కర్నూలు నుంచి కాగితం వచ్చింది. సర్టిఫికెట్లు, దర్యాప్తులు, అన్నీ ముగిసి నియామకం ఆర్డరు చేతికి రావడానికి నెలలు పట్టింది. ఈలోగా ఈయన వుంటున్న ఇల్లు మరొకళ్లు కొనడం వల్ల ఖాళీ చెయ్యవలసి వచ్చింది. ఎక్కడా మరొక పోర్షను దొరక లేదు. జీవితం మరొకసారి వీధిని పడింది.

జీవితంలో ఏదైనా ఒక పెద్ద మార్పు వచ్చేటప్పుడు రక రకాల ఇబ్బందులూ, చికాకులూ కలగడం సహజమని ఈయనను ఓదార్చసాగారు మిత్రులు. అందులో చాలామంది తమ తమ ప్రాంతాలలో పోర్షనుల కోసం వెదకసాగారు.

ప్రభలో క్రొత్తగా చేరిన పొట్లూరి వీరభద్రరావుగారు తిరువళ్ళిక్కేణిలో ఒక పోర్షను చూశారు. అదొక చెట్టియార్ల ఇల్లు. భార్య, తానూ వెళ్ళి పోర్షను చూచుకొని, అడ్వాన్సు ఇచ్చి వచ్చాడు భీమన్న. చెట్టియారు, ఆయన భార్య ఎంతో మర్యాద చూపారు. ఆ మర్నాడు పదిగంటలకు వచ్చి ప్రవేశించమని చెట్టియారే ముహూర్తం పెట్టాడు.

ఇల్లు దొరికిన సంతోషంతో ఆ రాత్రి గడిపేసి, ఆ మర్నాడు ఉదయం మొత్తం సామానంతా రిక్షాలలో వేసికొని, పిల్లలతో సహా క్రొత్త ఇంటికి వెళితే-ఇల్లు ఇచ్చేది లేదు పొమ్మన్నాడు చెట్టియారు! ముందు రోజున ఇచ్చిన అడ్వాన్సు డబ్బు తెచ్చి ముందు పడేశాడు. ముఖంలో ఆ ముందటి ప్రసన్నత లేదు. మర్యాద లేదు. రుస రుసలాడుతున్నారు వాళ్ళ వాళ్ళంతా.

ఏమి టిదంతా? ఏమయింది వాళ్ళకి?

"మీరు క్రిరస్తానీలని తెలిసింది. మేము లక్ష్మీపూజ జేసుకునే వాళ్ళం. ఇల్లు ఇవ్వడానికి వీల్లేదు" అన్నాడు చెట్టియారు.

"మేమూ హిందువులమే. మాకూ వున్నది లక్ష్మి" అన్నాడు భీమన్న. చిన్నపాప చేతిలోవున్న లక్ష్మి పటాన్ని అందుకొని చెట్టియారు ముందు పెట్టాడు.

"క్రిరస్తానీలు కాకపోతే హరిజనులు. ఇక్కడ మీకు స్థానం లేదు పొండి" అంటూ తలుపులు మూసేసుకున్నాడు చెట్టియారు.

చేతిలోని లక్ష్మిపటం నవ్వుతున్నదో, ఏడుస్తున్నదో తెలియదు. దాన్ని అక్కడే విసిరికొట్టి వచ్చెయ్యా లనుకున్నాడు భీమన్న. అంత కోపం వచ్చింది. కాని-తాను సరస్వతి, లక్ష్మి తనది. ఎవడో ఒక దౌర్భాగ్యుడు అవమానించి నంత మాత్రాన ఏమవుతుంది? తమాయించుకున్నాడు.

సరే-ఇక కర్తవ్యమేమిటి? అందరికీ తెలిసిన పేరు భీమన్నది. కులం దాచుకోవడానికి వీలుకాదు. మద్రాసు నగరంలో ఉద్యోగరీత్యా కాపురాలుం టున్న హరిజన విద్యాధికు లంతా "నాయుళ్ళు"గా వుంటున్న వాళ్ళే. కులం చెబితే

ఇళ్ళు దొరకవు. మామా మురికిపేటల్లో వుండాలి. చదువుకొన్న వాళ్లు అక్కడ వుండలేరు. కులం దాచుకోవడ మొక్కటే గత్యంతరం. మూర్ఖత్వానికి మోసమే జవాబు. ఏ కులం వాడయినా "నాయుణ్ని" అని చెప్పుకుని సమాజంలో చలామణి కావచ్చు.

"హరిజన నాయుళ్ళు" అనే శీర్షిక క్రింద 'నవజీవనలో' ఒక విమర్శ కూడ వ్రాసి వున్నాడు భీమన్న. హరిజన యువకులు కులం దాచుకోవడాన్ని తీవ్రంగా ఆధిక్షేపించా డా వ్యాసంలో. ఇప్పుడు ప్రత్యక్షంగా తనమీదికే తిరగ బడి ఈ కుల పిశాచి పంజా విప్పి నడిరోడ్డుపై నిలబెట్టింది. ఇప్పుడేమిటి చేయడం? పాత ఇల్లు వదిలేశారు. క్రొత్త యింట్లో ప్రవేశం లభించలేదు. వాస్తవంగా బ్రతుకు రోడ్డున పడింది!

ఆఫీసులో, భీమన్న సీట్లో లేని సమయంలో ఎవరైనా వచ్చి, ఈయన అడ్రసు గురించి అడిగితే "కేర్ ఆఫ్ పేవ్‌మెంట్స్, ఓల్డు బుక్ స్టాల్స్" అని చెపుతుండేవారు శాస్త్రిగారు. అది అక్షరాలా నిజమయింది ఆనాడు.

ఎంతోమంది మిత్రులు, మిత్రుల ఇళ్ళు స్మృతితెరమీద సినిమాఆడాయి భీమన్నకు. ఎవరింటికి వెళ్ళడం?

అక్కడికి మైలు దూరంలో మౌంటురోడ్డు సెంటరుకు దగ్గరగా భూపతి తిరుపతిగా రిల్లు వుంది. అక్కడికి పట్టించారు రిక్షాలను. ఆయ నుంటున్నది కూడా చిన్న పోర్షనే. వారిదీ పెద్ద కుటుంబమే. అయినా మరేమిటి చేయడం? సామానును వరండాలో పేర్చిపెట్టి, వారి సామానుగదిలోను, వంటగది పక్కసందులోను సర్దుకున్నారు - భీమన్న కుటుంబం మొత్తం అయిదుగురూ.

తిరుపతిగారి తల్లి లక్ష్మీదేవిగారు కూడ అప్పు డక్కడే వుంది. తన సొంత కొడుకుకంటె ఎక్కువ వాత్సల్యంతో చూచే దావిడ భీమన్నను. తిరుపతి గారు మొదటినుంచీ ఆర్తత్రాణ పరాయణుడే.

అన్ని కష్టాల మధ్య వచ్చింది భీమన్నకు ఉద్యోగ నియామక ఆర్డరు. 1955, ఆక్టోబరు 27 న ఈయన ప్రభుత్వ అనువాద శాఖ అధిపతి గాను, పుస్తకాల రిజిస్ట్రారుగాను ఉద్యోగ స్వీకారం చేశాడు.

ఉద్యోగంలో జాయిను అయినతర్వాత మొదటి అయిదు నెలలూ ఆఫీసు పనిలో ట్రైనింగు పొందవలసి వుంది. అయితే ఈయన కిచ్చిన ట్రైనింగు ఏమీలేదు. ఒక రూం ఇచ్చి కూర్చోమన్నారు. మరేపనీ లేదు. కాగా భీమన్న ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకొని, తన రచనలలోని కొన్నింటిని ఇంగ్లీషు లోకి అనువదించుకొన్నాడు. ఆదే ఆ తర్వాత ప్రకటితమైన "సెవెంత్ సీజను."

ఆఫీసు సిబ్బందిలో వై. శ్రీనివాసరావు, గోవిందరాజు రామకృష్ణారావు, ఎస్. వి. రమణారావు, కృపాకరం మున్నగువారు నాటినుంచీకూడ భీమన్నకు సహృదయ సహచరులుగా విఖ్యాతులైన ప్రజ్ఞావంతులు.

పేరు చెప్పకుండా ఏంపెట్టినా తినేస్తాం
కులం తెలియకుండా ఎపరితోనైనా చెలిమిచేస్తాం
విధి నిషేధాలకూ, స్వపరభేదాలకూ అర్థం ఏమిటి?
అయ్యో, మానవు డెంత ఆత్మవంచకుడు!

—టుక్రమీలు

120. తిరుపతి కొండలకు

శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ వ్యవస్థాపనోత్సవానికి తిరుపతి వెళ్ళిన భీమన్న, అక్కడ లభించిన మిత్రుల ప్రోత్సాహక వాక్యాలతో తిరిగి వచ్చి, దీపసభను అచ్చు కిచ్చేసే నాటి కింకా తాను ఆంధ్రప్రభలో అర్ధాకలి సబెడిటరే.

పుస్తకం అచ్చయి పోయింది. ప్రోత్సహించిన మిత్రులలో ఒక్క కూర్మయ్య గారు తప్ప, మరెవరూ ఏమీ ఇవ్వలేదు. కూర్మయ్య గారైనా వాగ్దానం చేసిన పాతిక రూపాయలే ఇచ్చారు. అచ్చుకు ఏడు వంద లయింది. ఎలా? ఏమిటీ చెయ్యడం?

పోనీ ఎవరికైనా అంకిత మిద్దామా అంటే - అంతకు ముందే తిరుపతి కొండలకు ఇచ్చేసి వున్నాడు. అంకితం తీసుకున్న మనుషులే కవికి ఏమీ ఇవ్వని కాలం. కొండ లేమిస్తాయి?

అట్టి స్థితిలో వచ్చింది ఆంధ్ర ప్రభుత్వ అనువాద శాఖ ఉద్యోగం భీమన్నకు. ఎవర్నీ యాచించే అవసరం లేకుండానే, ఒక నాలుగు నెలలలో ప్రెస్ బిల్లు చెల్లించెయ్య గలిగాడు.

నల్లని టింటు మీద తెల్లని గీతలతో దీపకన్యను చిత్రించి ముఖచిత్రంగా ముద్రించాడు దీపసభకు. కారు చీకటి నుంచి కాంతి ప్రభవించడానికి అది సంకేత మట. కావచ్చు. భావం అద్భుతమైనదే కావచ్చు కాని – తారు పూసి నట్టుగా తయారై న కవరు పేజీ చాల అసహ్యంగా ఉండేది. "A good Picture, but a bad cover page" అని వ్రాశారు రామలక్ష్మి గారు ఇంగ్లీషు స్వతంత్రలో దీప సభపై రివ్యూ వ్రాస్తూ. ఆమెగారు అప్పుడప్పుడే శ్రీమతి ఆరుద్ర కాబోకున్న రోజులవి.

ఆ తర్వాత సకుటుంబంగా తిరుపతి వెళ్ళి దీపసభను హుండీలో వేసి వచ్చాడు భీమన్న. అప్పుడు జరిగిన అనేక సంఘటనలలో ఒకటి – ఈయనకు దేవుడి పట్ల గల నిర్లక్ష్య భావాన్ని చాటేదిగా ఉంది.

యాత్రల సమయాలలో తరచుగా స్త్రీలకు కలిగే ఇబ్బందే-ఆ సమయంలో తన భార్యకూ కలిగిందట. "వెంకటేశ్వరస్వామికి ఇద్దరు (బీబీ అమ్మ వారితో ముగ్గురు) భార్యలు కదా? ఇలాంటి ఇబ్బందులు ఆయనకుమాత్రం తెలియనివా? ఏమీ అనుకోడులే. పద" అంటూ గుడికి తీసుకు పోయా డామెను. పాపం ఆమె వద్దంటున్నా విన లేదు.

తిరుపతి నుంచి కాళహస్తికి బస్సెక్కారు. కిటికీ వద్ద సీటు కోసం నాగవర్మా, విజయలక్ష్మి పేచీ పడ్డారు. జేబులో నుంచి ఒక పావలా కాసు తీసి-కిటికీ సీటును ఎవరు వదులుకుంటే వారి కిస్తా నన్నాడు భీమన్న. తనకు కిటికీ సీటే కావా లన్నది విజయ లక్ష్మి. చేసేది లేక, పావలా తీసికొని మరో చోటికి పోయాడు వర్మ. బాల మనస్తత్వాలను పరిశీలిస్తూ ఆనందించడం భీమన్న కుండే వినోదాలలో ఒకటి.

అంతకు కొద్ది కాలం ముందే-భార్యా, తానూ, ద్రౌపదీ, చిన్నపాప విజయలక్ష్మి కలిసి కంచి, పక్షితీర్థం, మహాబలిపురం యాత్ర చేసి వచ్చాడు భీమన్న. అదొక ఆందమైన కావ్యం లాంటి అమృత స్మృతి!

ప్రతి కుటుంబ చరిత్రా ఒక నవల ,
ప్రతి వ్యక్తి జీవితమూ ఒక నాటకం ,
దేనినీ పీరియసుగా తీసుకోకు ,
నీ పాత్రను నీవు ఔచితితో నిర్వహించుకో !

— దిగువెలు

121. జాతి సమైక్యానికి నమూనా

నిడదవోలు వెంకటరావు గారికి అయిదుగురు కుమారులు , ఇద్దరు కుమార్తెలు . కుమార్తెలలో పెద్దది జోగాబాయి . చక్కగా పాడేది . నాట్యంచేసేది . ఆ అమ్మాయి ఒక బ్రాహ్మణేతర యువకుణ్ని ప్రేమించడంతో , సాంఘికమైన ఒక చిన్న తుఫాను చెలరేగిందా కుటుంబాలలో .

వెంకటరావు గారికి కుల భేదం లేదు . సమాజానికి జంకే వ్యక్తి కూడ కాదు . అయినా —

ఈ 'అయినా' అనే దొక విచిత్ర పదం . దాని అర్థం ఆందిన వాళ్లెవరూ లేరు లోకంలో .

ఒక్క అమ్మాయి వైపు నుంచే కాదు , అబ్బాయి వైపు నుంచి కూడ ప్రతి ఘటన చెలరేగిం దీ కులాంతర వివాహానికి . లక్షల ఆస్తి కలిసి వచ్చే సంబంధాలెన్నో వస్తున్నాయట అబ్బాయి కోసం . అబ్బాయి తల్లి స్వయంగా వచ్చి బతిమాలింది వెంకటరావు గార్ని , తన కొడకును వదిలెయ్యమని . పాపం వెంకటరావు గా రేమి చేస్తారు ? తర్వాత అమ్మాయిని అడిగిందామె అదే మాట .

"నీ భర్తను నీవు వదిలేస్తావా ?" అమ్మాయి ప్రశ్నించింది - కాబోయే ఆత్తగార్ని . దిమ్మెర పోయా రక్కడ చేరిన జన మంతా - భీమన్నతో సహా !

వివాహం నిశ్చయ మయింది . ముహూర్తం పెట్టుకొన్నారు .

రేపు పెళ్ళనగా , ఆ ఉదయం వెంకటరావు గారింటికి వెళ్ళాడు భీమన్న . పెళ్ళి జరిగేది పెళ్ళి కొడుకు ఇంటి వద్దనే అయినా , ఆడ పెళ్ళివా రిల్లు కూడ వేడుకగానే వుండాలి కదా ? ఆ చిహ్నలేమీ లేక , ఆశ్చర్యపోయాడు భీమన్న .

వెంకటరావు గారు విచారంగా కూర్చుని వున్నారు. ఏమీ మాట్లాడలేదు. జోగాబాయి ఏదీ అని ఆడిగితే, గదిలోకి చూపారు.

గదిలో ఒక చికటి మూలలో తల విరబోసుకుని, కన్నీళ్ళనా తుడుచుకోకుండా, పరధ్యానంగా కూర్చుని వుంది పెళ్ళి కూతురు.

"ఇ దెక్కడి పెళ్ళి కూతురు వేషం?"

"ఈ కాలం పెళ్ళి కూతుళ్ళకి వేషం చాలు."

"ఏమో నాకు తేలీదు కాని, మా యింటికి పోదాం పద" అన్నాడు భీమన్న. ఆమె గది బైటకి వచ్చింది. వెంకటరావుగారు మౌనంగా వుండిపోయారు.

రెండు రోజులుగా ఆ గదిలో అలానే వుంచారట ఆమెను. బైటకి రావ ద్దన్నారట. ఎవరు అంటే సమాజం! ఎక్కడైనా అంతే. వ్యక్తులు మంచి వాళ్ళే. సమాజమే పిచ్చిది.

ఇంటివద్ద నాగరత్నమ్మ, ద్రౌపది, తిరుపతి గారి తల్లి లక్ష్మీదేవి, భార్య వెంకాయమ్మ వగైరాలు జోగాబాయిని చూచి ఎంతో ఆనందపడ్డారు. అభ్యంగన స్నానం, నూతన వస్త్రాలు, పసుపు, పారాణి ఇత్యాదులతో కొత్త పెళ్ళికూతుర్ని చేశారు.

ఆ సుమనోజ్ఞ రూపంలో సాక్షాత్తు లక్ష్మిలా తన ఎదుట నిల్చిన కుమార్తను చూచుకొని, ఆనంద బాష్పాలు రాల్చారు వెంకటరావుగారు.

"నా కుమార్తెను పెళ్ళికుమార్తెగా చూచే భాగ్యం నా కళ్ళకు కలిగించావమ్మా! నీ ఋణం ఎలా తీర్చుకోగలను?" అన్నారు ఆమెను వెంటబెట్టుకు వెళ్ళిన నాగరత్నమ్మతో.

భీమన్న పట్ల వెంకటరావుగారిది పితృవాత్సల్యం. నేటికీ అదే వాత్సల్యం. భీమన్న ఆ తర్వాత మళ్ళీ జోగాబాయిని చూడనేలేదు. అయితే ఇరవై ఏళ్ళ తర్వాత ఈ మధ్య, ఆమె కుమార్తె అయిన జయసుధను వెండితెరమీద చూచి, ఈ మధురస్మృతిలో లీనమైనాడు.

ఈ గాధను ఇక్కడ స్మరించడానికి ప్రధానమైన కారణం - ఇది జాతి సమైక్యతకు ఒక చక్కని నమూనాగా వుండటమే. ఒక బ్రాహ్మణ బాలిక ఒక నాయుళ్ళ కుర్రవాడిని పెళ్ళాడుతుంటే, ఒక హరిజన కుటుంబం ఆమెను పెళ్ళికుమార్తెను చెయ్యడం! ఎంత గొప్ప ఆర్షధర్మ ఆదర్శ దర్శనం!

నెలయేటి చెలిగూడి చెంగల్వలను వేడి
చింతలను బాపుకొమ్మ
తీవలను పెంచి క్రొంబూపులను మించి నీ
జీవితము దిద్దుకొమ్మ
కలకంఠముల కంఠముల కంఠమును చేర్చి
కమ్మగా పాడుకొమ్మ
వ్యర్థంపు బెంగలవ్వల ద్రోచి ప్రేమ దే
వతవై సుఖించిపొమ్మ

—భీ. కా. కుసుమాలు

122. మద్రాసుకు వీడ్కోలు

ఆ తర్వాత మద్రాసులో మరి ఇల్లే దొరకలేదు భీమన్నకు. రెండుమూడు నెలల పాటు తిరుపతి గారింట్లోనే కాలక్షేపం చేసి, తర్వాత పుల్లయ్య గారింట్లోకి మారారు.

వడ్లమూడి సత్యనారాయణ గారి రెండో అల్లుడు పుల్లయ్యగా రంటే. ఒక రెండు నెలల పాటు - ఇల్లు దొరికే వరకు అని చెప్పి, తాము మామ గారింట్లో సర్దుకొని, తమ అద్దె పోర్షనును భీమన్న కిచ్చి రాయన. అయితే - శాశ్వతంగా మద్రాసును విడిచి పెట్టేవరకు అక్కడే వుండిపోక తప్పలేదు భీమన్నకు.

చిత్ర శిల్పి పి. ఆర్. రాజు గారి చిత్ర సంకలనానికి పరిచయం వ్రాశాడు భీమన్న. ఆందమైన సంకలన మది. భీమన్నకు మిత్రులుగా స్థిరపడి పోయిన చిత్ర కళాస్రష్టలలో రాజుగారు అతి ముఖ్యులు. కె. ఎల్. ధర్, కుసుమ విశ్వనాథం మున్నగు చిత్ర శిల్పుల పరిచయం భీమన్నకు ఆనాటిదే. విశ్వనాథం

భీమన్నకు బంధువు కూడ. రావి రామనాథరెడ్డి చక్కగా పాడి ఆనంద పరిస్తే, నాతి నారాయణమూర్తి నిత్య సంభాషిగా ఆహ్లాద పరిచేవాడు ఆ రోజుల్లో.

మద్రాసు నగరం భీమన్న కిచ్చిన జీవనిధుల్లో ముఖ్యులైన నార్ల వారు, నిడదవోలు వారు, తాపీ వారు కాక - ఆలపాటి సూర్యనారాయణగా రొక ప్రత్యేక నిధి.

"అత డొక భయంకర సింహం. ఆ సింహాన్ని నీ వెలా మచ్చికచేసుకో గలిగావు! నీ పేరు చెప్పితేనే ఆనందంతో ఊగిపోతున్నాడు!" అన్నారు మంగళగిరి పరవస్తు దాసు గా రొక సారి, ఆలపాటి సూర్యనారాయణ గారితో భీమన్నకు లభించిన స్నేహాన్ని గురించి ప్రస్తావించి.

నిజానికి ఆలపాటి వారు ఒక్క స్వభావంలోనే కాదు, స్వరూపంలో కూడ సింహమే. భీమన్న జీవితాన్ని మామిడికుదురు నుంచీ వరుసగా పరిశీలించు కొంటూ వస్తే - ఈయనకు స్నేహితులూ, సన్నిహితులూ అయిన పెద్ద లంతా సింహప్రాభవులే అన్న సత్యం మబ్బు విడిచిన మార్తాండ బింబంలా ప్రభాసి స్తుంది. అసలు పల్లయ్యగారే ఒక సింహం. మామిడికుదురు మామాలంతా సింహ కార్డూలాలే. భీమన్న స్నేహ పరిధిలోకి ఆల్పత్వ మన్నదే ఎన్నడూ చొరబడ లేదు.

మద్రాసులో, 1958 లో ఒక కవి సమ్మేళనంలో కలిసి, తనను తాను పరిచయం చేసుకుని, అలానే బీచికి తీసుకు పోయారట ఆలపాటి వారు భీమన్నను. అర్ధరాత్రి వరకు బీచిలో కూర్చుని సాహిత్య చర్చ చేశారట. నాటి నుంచి ఆయన 1967 ప్రాంతంలో కీర్తి శేషు డయ్యే వరకు భీమన్నకు ప్రాణ మిత్రుడు గానే వుండిపోయారు. తెనాలిలో చనిపోయే ముందు ఆయన "రాగవైఖరి" కావ్యం చదువుతూ దాని ప్రత్యేకత గురించి తనతో చర్చిస్తూ వుండినట్టు సోదరుడు మోదుకూరి జాన్సన్ భీమన్నకు చెప్పి కళ్ళొత్తు కున్నాడు.

ఆ రోజుల్లోనే ఆదిలక్ష్మిగారితో సుప్రసిద్ధ పత్రికా రచయిత డి. ఆంజనేయులుగారికి పరిచయమై ప్రేమగా పరిణమించింది. ఆదీ కులాంతర వ్యవహారమే. భీమన్న సలహాపై వివాహానికి అంగీకరించింది ఆదిలక్ష్మి. ఆమె తల్లిగారికీ, అక్క చెల్లెండ్రకూ భీమన్నే నచ్చ జెప్పాడు. వారింట్లో భోజనమే మద్రాసులో చివరి విందు అయింది.

వడ్లమూడి వారు భీమన్నకు చాల సన్నిహిత మిత్రులు. ఉభయ కుటుంబాలు ఒకే ప్రాణంగా మెలిగేవి. భీమన్న హైదరాబాదుకు బైలు దేరే సాయంత్రం తమ యింట విందు చేసి పంపాలను కొన్నారు వారు. అయితే - అంతకు పూర్వం కొన్ని నెలల నుంచి గుండె జబ్బుతో బాధ పడుతున్న సత్య నారాయణగారు ఆ ఉదయమే హఠాత్తుగా కాలం చేశారు.

ఆ విధంగా, మిత్ర వియోగంతో కన్నీరు తుడుచుకుంటూ మద్రాసును వదలవలసి వచ్చింది భీమన్న.

మరో విషాద మేఘ శకలం కూడ మద్రాసు నుంచే వెన్నంటి వచ్చింది భీమన్నను. జీవిత పరిస్థితి ఆర్థికంగా మెరుగుపడుతున్న కొలదీ, భార్య నాగరత్నమ్మ మనసులో గూడు కట్టుకొంటూవున్న ఏదో తెలియని అసహనం అది. భర్త పట్ల అంతకుముందె న్నడూ లేని వైరస్య ధోరణి అది.

"వేష భాషలను గురించి పట్టించుకోని నీవు, వేష భాషలే సర్వస్వంగా భావించే హైదరాబాదుకు వెళ్ళుతున్నావు. జాగ్రత్తగా మసులు కోవాలి" అంటూ హెచ్చరించారు తిరుమల రామచంద్రగారు మద్రాసుకు వీడ్కోలు చెబుతున్న భీమన్నను. అవసరమైతే కప్ప గంతుల లక్ష్మణ శాస్త్రి గారి సహాయం తీసుకో మన్నారు. హైదరాబాదులో శాస్త్రి గారి ప్రేమాను రాగాలు పుష్కలంగానే లభించాయి కాని, హైదరాబాదు వేష భాష లేవీ మాత్రం భీమన్నను బాధించ లేదు.

నింగికి చుక్క బొట్టునిడి
నేలకు దీవము పెట్టి, ధక్కపై
అంగున కొట్టి, విశ్వ కథ
కాగ్రణి వీథికి మాకు దారి చూ
పం గల నీకునున్ భయము
బాధయు కల్గునె? నమ్మకెట్లు? ది
వ్యాంగన కన్ను మూయ గల
దా? పరమాత్మకు మృత్యు వున్నదా?

— దీప సభ

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

నవ నవోదయ సర్గ

123. భాగ్యనగర ప్రవేశం

ఒక యాత్రికుడు ఎంతో దూరం ప్రయాణం చేసి, ఎన్నో మలుపులు తిరిగి, ఎన్నో అవరోధాలను అధిగమించి, ఏ కష్ట నష్టాలను లెక్క చెయ్యక, ఎంతలేసి వ్యామోహాలకూ లోనుగాక, చివరికి తన గమ్యాన్ని చేరుకొన్నా డంటే - అత డెంతో స్థిత ప్రజ్ఞుడై వుండాలి.

ఆంధ్రప్రదేశ్ అవతరణతో భాగ్యనగరం చేరుకొన్న భీమన్న అంతటి స్థిత ప్రజ్ఞుడు అయిన యాత్రికు డనవచ్చు - నిజ జీవిత పరంగాను, సాహితీ కృషి పరంగాను కూడ.

వాణియె తీర వాటిక, భ
వాణియె రాయలసీమ, శ్రీ తెలం
గాణము; పూర్ణరాజ్య రమ
గా మగురమ్మల మూర్తి దాల్చి, గీ
ర్వాణ పథమ్ములన్ గదలి
వచ్చితి; వేయి కొనంగదే ఇకన్ -
ప్రాణము లొచ్చు మా తెలుగు
ప్రాయి జగమ్మున నోమ, రాణివై!

అంటూ ఒక్క పద్యంతో పూర్ణాంధ్ర రాజ్య రమకు స్వాగతం చెప్పిన భీమన్నకు - సంపూర్ణ హృద్య హృదయంతో స్వాగతం ఇచ్చింది భాగ్య నగరేందిర.

అంతవరకు పల్లవిత కోరకిత నికుంజ మాత్రంగా వున్న భీమన్న సాహితీ లత బహుముఖంగా విస్తరించి, అనాతిరేకంగా పరిమళించింది - రాగ మధురంగా సలించింది - సరస రసానంద మధువై పరవశించింది - ఏతత్ భాగ్య సౌభాగ్య స్పర్శతో !

1953 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు మొత్తం ఆఫీసులన్నీ కర్నూలుకు వెళ్ళలేదు. కొన్ని మద్రాసు లోనే వుండి పోయాయి. అలా వుండిపోయిన వాటిలో ట్రాన్స్‌లేషన్ డిపార్టుమెంటు ఒకటి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడటంతో 1956 నవంబరు ఒకటవ తేదీ నాటికి ముందు రోజునే, నేరుగా మద్రాసు నుంచి హైదరాబాదుకే వచ్చేసిం దది - ప్రత్యేక రైలులో, తక్కిన ఆఫీసు లన్నిటితో పాటు.

భీమన్న సకుటుంబంగా సికింద్రాబాద్ స్టేషనులో దిగే టప్పటికి జల్లుగా వర్షం కురుస్తూ వుంది. దాన్ని ముసురు అనవచ్చు. జనం, సామానులు, బస్సులు - స్టేషను ప్రాంతం బహు రద్దీగా వుంది. భీమన్నకు అలాటు చేసిన భవనం చిరాగాలీ లేన్‌లో వుంది. ఆ దెక్కడో ఎవరికీ తెలియదు. తెలియలేదు ! చివరికి ఎలాగో అడ్రసు తెలిసిన ఒక టాక్సీవాలా దొరకగా, అతణ్ణి పట్టు కొని, ఆ భవనం చేరేటప్పటికి సాయంకాలం అయింది.

భవనం తాళం తీసి చూసే సరికి - వర్షం బైట కంటే లోపలే ఎక్కువగా కురుస్తూ వుంది ! స్వాగత నాట్యం ప్రారంభించాయి గబ్బిలాలు.

శాఖాధిపతులకూ, పెద్ద ఆఫీసర్లకూ ప్రైవేటు భవనాలు అలాటు చేశారట !

"మీది చాల గొప్ప బిల్డింగు. నేను చూశాను. అయితే, లోపల చూడ లేదను కోండి. మరి, ఇప్పుడెలా ?" అన్నాడు, ఇళ్ళ అలాటుమెంటుకు అధికారిగా వున్న కె. రామమూర్తి గారు.

అతి కష్టం మీద మర్నాడు సాయంత్రానికి అమీరుపేటలో ఒక క్వార్టరు దొరికింది. అంతవరకు ఎవరికీ నిద్రాహారాలు లేవని వేరే చెప్పాలా ?

మర్నాడు రాత్రికి, మిత్రులు భూపతి రామమోహన రావు గారి సహాయంతో, వర్షంలో సామానును మళ్ళీ టాక్సీలకు ఎత్తించి, ఆమీరుపేట చేరారు! ఆది నాలుగు గదుల ఒకటోక్లాసు క్వార్టరు. బాల బాగుంది.

ఏ కుల మంచు నన్ను వివ
రింపుల గూడిన కుంటి ప్రశ్నలన్
వ్యాకుల పెట్టి బోకు డది
వ్యర్థము; లోకపు మంచిచెడ్డలన్
దూకియు మ్రుగ్గకుండ నిటు
దూరములన్ బడి వచ్చినాడ; ఈ
యాకృతి నేమి కల్గు; హృద
యాకృతి నెంచి సమాదరింపరే;

—భీ. కా. కుసుమాలు

124. చివరి కొమ్మను పూచినావే

"ఉండండీ, బిల్డింగుకు తొందరేం వచ్చిందీ?" అన్నారు సమాచార శాఖ డైరెక్టరు కపిల కాశీపతిగారు, తమ ఆఫీసు గదిలోకి ఆడుగు పెట్టిన భీమన్నను చూచి, కళ్ళు మూసికొని.

ఆయన పక్కన టేబిలు మీద నుంచి ఒక పెద్ద రేడియో చిన్నగా పాడుతూ వుంది –

చివరి కొమ్మను పూచినావే
చేతి కందక నిల్చినావే —

ఆశ్చర్య పడుతూ కూర్చుని, ఆనందంతో కళ్ళు మూసుకున్నాడు భీమన్న తాను కూడ.

"హైదరాబాదులో అయినా అది చేతి కందుతుం దేమో చూద్దాం" అన్నారు కాశీపతి గారు. అది రాగోదయం లోని పాట. పాడిన వారు షేక్ మహబూబ్.

అంతకు కొద్ది వారాల ముందే, ఆఫీసు పని మీద కర్నూలు వెళ్ళిన భీమన్న – రేడియోలో తన "హృదయమా" అన్న పాటను షేక్ మహబూబే

పాడగా విన్నాడు – మంత్రి సంజీవయ్య గారింటిలో. అంత స్పష్టంగా, శాస్త్రీయంగా తన పాటలు పాడే ఆ పేరును అంత వరకు వినలేదు భీమన్న.

అనువాద శాఖకు బిల్డింగు చూపే బాధ్యత సమాచార శాఖది. ఆ ప్రక్క-నే ఒక బిల్డింగు దొరికింది. దానిలోకి మారే వరకు భీమన్న గారి ఆఫీసు కాశీపతి గారి బిల్డింగులోనే ఉంది.

ఆంధ్ర - తెలంగాణా ప్రాంత ఆఫీసుల, ఉద్యోగుల సంలీన వ్యవహారాల సందర్భంలో కొద్ది నెలల పూర్వం ఒకసారి వచ్చి వెళ్ళాడు భీమన్న హైదరాబాదుకు. అప్పుడే పరిచయమైనా రీయనకు - డాక్టర్ దివాకర్ల వేంకటావధాని, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, సి. నారాయణరెడ్డి, దాశరథి, దేవులపల్లి రామానుజరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి మున్నగు వారు. డా. రామరాజుగారి పరిచయం అంతకు చాల సంవత్సరాల క్రితమే కలిగింది, మద్రాసులో, నిడదవోలు వారింట.

దీపసభ రచయితగా స్వాగతం చెప్పారందరూ భీమన్నకు.

ఆ తొలి రోజుల్లోని మిత్రులే చివరి వరకు మిత్రులుగా వుండి పోయారు భీమన్నకు. హైదరాబాదుకు వచ్చిన క్షణం నుండీ ఇక్కడి కవి పండితుల తోను, సహృదయులతోను, స్థానిక ప్రజలతోను పూర్తిగా లీనమై పోయాడు భీమన్న.

ఇక్కడికి వచ్చిన తొలి రోజులలోనే ఆంధ్ర నుంచి వచ్చిన రచయితలకు స్వాగతం చెప్పటానికి ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు శాఖాధిపతి లక్ష్మీరంజనం గారి అధ్యక్షతను ఒక సభ జరిగింది. కాళోజీ మున్నగు వారంతా పరిచయమైనా రా సభలో. దీప సభ నుంచి ఒక ఘట్టం వినిపించా డీయన. తీయనదే ఆనాటి ప్రధాన కార్యక్రమం.

ఆ సభ జరిగిన మర్నాడు ఒక పండితుడు అమీరు పేటలోని భీమన్న ఇల్లు వెదుక్కొంటూ వచ్చాడు.

"నిన్న మీ సభకు నేనూ వచ్చాను. నన్నెవరూ మీకు పరిచయం చెయ్యలేదు. నేనే పరిచయం చేసుకొందామని బైలు దేరాను. నా పేరు కురుగంటి సీతారామయ్య" అన్నా రాయన.

భీమన్న ఆనందానికి మేర లేక పోయింది. అప్పటికి కురుగంటి వారు నవ్య సాహితీ సమితి అధ్యక్షులు కూడా. అంతటి అగ్రశ్రేణి పండితుడు తనను వెతుక్కొంటూ రావడం!

ఆ తర్వాత పోతుకూచి సాంబశివరావు గారితో విచిత్రంగా పరిచయం కలగడం, భీమన్న నవ్య సాహితీ సమితికి ఉపాధ్యక్షుడు కావడం జరిగింది. సాంబశివరావు గారు ప్రధాన కార్యదర్శి ఆ సమితికి. వేమరాజు నరసింహారావు, తల్లా ప్రగడ భద్రిరాజు, ఆక్కిరాజు జనార్దనరావు, హరి, భాస్కరభట్ల కృష్ణారావు, సి. ఎస్. ఆర్. ఆంజనేయ శాస్త్రి, ఇసుకపల్లి దక్షిణామూర్తి వగైరా అంతా కార్యవర్గం. మొదట్లో ఈ సమితి సమావేశాలు వేమనాంధ్ర భాషా నిలయంలో జరిగేవి. అక్కడే సుప్రసిద్ధ చారిత్రక పండితుడు ఆసిరాజు వీరభద్రరావు గారి పరిచయం కూడ లభించింది భీమన్నకు.

ఋషి ప్రతికి యున్న భాష్యకారుని విధమ్ము
వగలె వెల్గించ బడిన దీపమ్ము ప్రతుకు.
ప్రతికి యే రీతినో బ్రౌట పడిన నాకు
స్వాగత మ్మిచ్చె నెల్ల జనారు వీధి:

— దీప పథ

125. సన్యాసులకూ అంటురాని తనమే?

ఒకరోజున ఉదయం ఏడు గంటలకే ఎవరో పిడిపలుపులు కొడితే, భీమన్న లేచివెళ్ళి తలుపులు తెరిచాడు. ఆయన కాషాయ వస్త్రాలు ధరించిన ఒక సన్యాసి, స్వాములవారు!

"మీకోసమే వచ్చాను ఒక ముఖ్యమైన సహాయం కోరి" అన్నాడాయన. భీమన్న ఆశ్చర్యపోయాడు స్వాములవారికి తనతో పనేమిటా అని!

లోనికి వెళ్ళి కూర్చున్న తర్వాత, స్వాములవారు తనను తాను పరిచయం చేసుకొని, వచ్చినపని చెప్పారు. భీమన్న పుస్తకాల రజిష్టారుకదా! ఆ హోదాలో ఈయన వద్దనుంచి ఒక సర్టిఫికెట్టు కావలసి వచ్చిం దాయనకు. అదీ పని.

అంత చిన్న పనికోసం స్వాములవారే స్వయంగా ఇంటికి ఎందుకు రావలసి వచ్చింది? అందులో ఏదో లిటిగేషను వున్నదన్నమాట! అంత పెద్ద వారు ఇంటికి వచ్చారుకదా అనే మర్యాదతో, ఆయన మాటను యథార్థంగా స్వీకరించి, ఆ సర్టిఫికెట్టు ఇవ్వాలి! రూల్సుప్రకారమైతే వీ లుండదు.

ఎవరికీ ఏ నష్టమూ కలగని ఒక పనివల్ల, మరొకరికి లాభం కలుగు తుందంటే ఆ పని ఎలాంటిదైనా సరే చేసెయ్యడానికి వెనుదీయని స్వభావం భీమన్నది. "దానికేం, ఇస్తాను. ఆఫీసుకి రండి" అన్నాటీయన.

సరిగ్గా ఆ సమయానికి, రెండు కప్పులతో కాఫీ తీసుకువచ్చి టేబిలుపై పెట్టింది భీమన్న సతీమణి. స్వాములవారు ఇబ్బందిలో పడ్డారు.

"స్వాములవారు కాఫీ తాగరేమో, పాలు తీసుకురా!" అన్నాడు భీమన్న.

"వద్దు, వద్దు అమ్మా, ఏమివద్దు, నే నేమీ తీసుకోను" అన్నారు వెంటనే ఆయన.

"ఆదేమిటీ? మరేమి తీసుకుంటారు?" అడిగాడు భీమన్న. స్వాముల వారు తట పటాయించారు.

"నిజానికి నాకు కాఫీ కూడ నిషేధం కాదు. నాకు కాస్త మధి, మైలా వున్నై. అందుకని—"

"అయ్యో, పాపం! అవి ఇంకా మిమ్మల్ని పీడిస్తూనే వున్నాయా? ఆశ్రమం మారినా ఆ శ్రమ వదల్లేదన్న మాట! కాషాయ వస్త్రాల జోలికి కామ క్రోధాదులు రావనుకొన్నాను" అన్నాడు భీమన్న జాలిగా. దానితో స్వాముల వారికి కోపం వచ్చింది.

ఎంత సన్యాసి నైతే మాత్రం, నేను బ్రాహ్మణ్ని. శుచీ, శుభ్రతా గణించ కుండా ఎక్కడబడితేఅక్కడ తింటానా?'' అన్నాడు.

"క్షమించండి. నాది పొరపాటే కావచ్చు. ఈ మడీ, మైలా అనేవి మీకే వుంటై. మా కుందవు కదా! అందుకని, అవి మాకు అర్థం కావు. అపవిత్రః పవిత్రోవా, సర్వావస్థాంగతోపి వా, య స్మరేత్ పుండరీకాక్షం, స బాహ్యా భ్యంతర శుచిః - అనేది మా మతం. అందుకే మా వాళ్ళంతా నిత్య శుచులుగా ఉంటారు. ఈ మడీ మైలా బాదర బండీ మాకేం లేదు." అన్నాడు భీమన్న.

స్వాముల వారు క్షణం మాట్లాడ లేదు. "మీరే నన్ను క్షమించాలి. మీ రేదో మామూలు హరిజను లను కున్నాను" అన్నారు కించిత్ చింతతో.

నవ్వాడు భీమన్న. కొంత కాలం క్రితం మద్రాసు ట్రాంబండిలో కృష్ణమూర్తి శాస్త్రి గారి ఉదంతం జ్ఞాపకం వచ్చింది. హరిజనులు ఆహార, విహార, ఆచారా లన్నింటి లోనూ ఇంకా స్వచ్ఛమైన ఆర్యులు గానే వున్నారన్న సత్యాన్ని స్వాముల వారికి బోధ పరిచే టప్పటికి ఆఫీసు ప్రైం అయింది.

"కూర్చోండి. భోజనం చేసి వస్తాను. కలిసే వెళదాం" అంటూ లేచాడు భీమన్న.

"ఇప్పుడు మీతో కలిసి భోజనం చేయడానికి నాకే అభ్యంతరమూ లేదు" అన్నారు స్వాముల వారు. "వద్దు లెండి'' అన్నాడు భీమన్న వినయంగా.

రామకృష్ణ మిషనుకు చెందిన స్వాముల వా రాయన. కుల మత వర్గ భేదాలను పాటించకుండా ఆర్ష మతోద్ధారణ చెయ్యడం కోసం వివేకానందుడు నెలకొల్పిన పవిత్ర సంస్థ అది. దాని నిండా చేరిన వాళ్ళు చాల మంది ఇలాంటి వాళ్ళే నట!

ఏ మిషనైనా ఇంతే. ఏ మతమైనా ఇంతే. ఏ సంస్థ అయినా ఇంతే. దాని లక్ష్యాలు దాని వ్యవస్థాపకుడి తోనే పోతై. వాటి స్థానాలను స్వార్థాలు ఆక్రమిస్తై. మళ్ళీ మామూలే. అందుకే ఈ మిషన్లనూ, మతాలనూ నిరసిస్తాడు భీమన్న.

స్వాములవారి పని సఫల మయింది. ఆయన కృతజ్ఞతగా ఒక లేఖ వ్రాస్తూ అన్నారు - "హరిజనులలో కొంతమందైనా సాంస్కృతికంగా మీ స్థాయికి రావాలని కోరుకొంటున్నాను. అప్పుడు కాని ఈ కులభేదాలు పోవు" అని.

నిజమే కాని, హరిజన విద్యాధికులు ఈ సత్యాన్ని ఇంకా గుర్తించడం లేదు. ఎప్పటికి గుర్తిస్తారో తెలియదు.

ఎక్కడో ఎవరో పదిమంది ఆర్థికంగా బాగుపడడం,
ఉద్యోగాలు చెయ్యడం, పదవులు అలంకరించడం
నిజమైన అభివృద్ధి కాదు.
సాంస్కృతిక అభివృద్ధే స్థిరమైన అభివృద్ధి
చదువులేని వ్యక్తికి ఉద్యోగం రాదు
సంస్కృతి లేని జాతికి అభ్యుదయం లేదు
సంగీతం, సాహిత్యం వగైరా కళలలో
అభినివేశం గల ఎవరూ బానిసలు కారు
ఆదిలేవి ఎవరూ
స్వతంత్రులుగా మనలేరు
నిజమైన, స్థిరమైన అభివృద్ధి కోసం
మీ రెందుకు కృషి చెయ్యరు?

—ధర్మంకోసం పోరాటం

126. గ్లాసరీ నిర్మాణం

తెలుగును అధికార భాష చెయ్యాలన్న ఉద్యమానికి మూల కర్తలలో ఆయ్యదేవర కాళేశ్వరరావు గారు ఒకరు. విధాన సభకు అధ్యక్షులు కాగానే, తన ఆశయాన్ని అమలులోకి తెచ్చే కృషిని ప్రారంభించా రాయన.

రాజ్య పాలనకు మూల భూతమైన విధాన సభకు అధ్యక్షులు ఆయ్యదేవర వారు. పరిపాలనకు సంబంధించిన ప్రతి తెలుగు మాటకూ అధికార హోదాను ఇచ్చే అనువాద శాఖకు అధిపతి భీమన్న. తెలుగు అధికార భాష కావడానికి మునాదిగా ఒక పారిభాషిక పదకోశాన్ని తయారు చెయ్యడం అవసరమన్న నిర్ణయానికి వచ్చా రిద్దరూ.

న్యాయ, పరిపాలన, భాషా, సాహిత్య రంగాలలో అగ్రశ్రేణి పండితులైన సుమారు ముప్పై మంది సభ్యులతో, అయ్యదేవర వారి అధ్యక్షత క్రింద అసెంబ్లీ కార్యదర్శి కన్వీనరుగా 1957 అక్టోబరులో గ్లాసరీ కమిటీ ఏర్పడింది.

దేశంలోని ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ నిఘంటువు లన్నీ తెప్పించారు. అంతకు ముందే హిందీలో ఏర్పడివున్న గ్లాసరీలను తెప్పించారు. న్యాయ, పరిపాలన శాఖలకు చెందిన ఆంగ్ల పదాలను వర్ణక్రమంతో సిద్ధపరిచారు. ఒక్కొక్క పదానికి తెలుగు పదాన్ని నిర్ణయించుకొంటూ ముందుకు సాగారు.

ఈ ముందుకు సాగడం అనేదాన్ని కురుక్షేత్రంతో పోలుస్తాడు భీమన్న. కాళోజీ నారాయణరావు, దిగవల్లి శివరావు, విశ్వనాథ సత్యనారాయణ, కురుగంటి సీతారామయ్య, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, ఖండవల్లి లక్ష్మీరంజనం, రావి నారాయణరెడ్డి వంటి కురువృద్ధుల్, గురు వృద్ధ బాంధవులనేకులు కల శబ్ద క్షేత్ర మిది. ఒక్కొక్క ఆంగ్లపదం మీద గంటల కొలది యుద్ధం జరిగేది. వందలకొలది తెలుగు పద బంధాలు రంగంలోకి దూకి నేలకూలేవి. ఒక్కపదం మీదే రోజు రోజంతా చర్చ జరిగిన సందర్భాలు కూడ వున్నై.

"ప్రెసిడెంటును అధ్యక్షుడంటాం. మరి ఛైర్మనును, స్పీకరును ఏమనాలి?"

"స్పీకరును సభాపతి అందాం" అన్నారొకరు.
"సభలో ఆడవాళ్ళుంటేనో?"
"స్పీకరు స్త్రీ అయితేనో?"

ఈ భాషారణ రంగంలో, శబ్దాస్త్ర శస్త్ర పరంపరల మధ్య మునిగి తేలుతూ వుండిపోయేవారు అయ్యదేవరవారు. తుదినిర్ణయాలు ఆయనే చేసేవారు. తుది సలహా భీమన్నదిగా వుండేది.

వాడుకలోకి వచ్చిన పార్సీ, అరబ్బీ పదాలను ఎలా తెలుగులో కలిపేసుకున్నామో, ఆంగ్ల పదాలనుకూడ అలానే కలిపేసుకోవా లనేది భీమన్న పద్ధతి.

స్పీకర్ అండే అధ్యక్షుడే. కాని, ప్రతి అధ్యక్షుడూ స్పీకరు కాడు. స్పీకరు, చైర్మను పదాలనుకూడ ఆయా ప్రత్యేకార్థాలతో అధ్యక్షపదానికి పర్యాయాలుగా వుంచుకోవాలి.

దారి, తెరువు, బాట, మార్గం, పథం, అధ్వం ఈ ఏ పదమూ కూడ నేటి రోడ్డును స్ఫురింపజేయ్యదు. మట్టిరోడ్డు, కంకరరోడ్డు, తారురోడ్డు, సిమెంటురోడ్డు అనే వాడేస్తున్నాం. అలానే శకటం, వాహనం, బండి ఇవేవీ కారు, లారీ, బస్సు, రైలు వంటి వాటిని స్ఫురింప జెయ్యలేవు.

మనకు కొత్తవైన వస్తువులు, ఆచారాలు, భావాలు విదేశాలనుంచి వచ్చినప్పుడు, అవి వాటి పేర్లతో సహా వస్తై. వస్తువును వలెనే దాని పేరును కూడ మనం సొంతం చేసుకోవాలి. అప్పుడే భాష వికసిస్తుంది. పిలక ను వాళ్ళు పిగ్‌టెయిల్ అనడం ఎంత హాస్యాస్పదమో, బ్రైని మనం కంతలంగోటి అనడం అంతే హాస్యాస్పదం.

అంత మంది ఉద్దండ పండితులతో కమిటీ సమావేశాలు వినోదకరంగా వుంటున్నాయే తప్ప, పని మాత్రం చురుకుగా సాగడం లేదన్న విషయం స్పష్టంకాగానే, అయ్యదేవరవారు ఆ కమిటీని రద్దుచేసి, 1958 డిశంబరులో మరొక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో సభ్యులు పదునల్గురు మాత్రం. ఈ కమిటీ చురుకుగా పనిచేసి గ్లాసరీని పూర్తిచేసింది. చివరకు దాని సంపూర్ణ బాధ్యత భీమన్నకు అప్పగించబడింది. ఆ విధంగా తెలుగులో తొలి పదకోశం నిర్మాణానికి అయ్యదేవరవారి పట్టుదలకు భీమన్న కృషి తోడయింది.

ఈ గ్లాసరీ కమిటీ సమావేశాలను గురించి భీమన్నచెప్పే అనేకమైన రసవత్తర సన్నివేశాలలో కాఫీ సమయం ఒకటి. తనూ, కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారూ ఒక మూల చేరేవారు. రెండేసి ప్లేట్లు టిఫిను, మూడేసి కప్పుల కాఫీ సేవించేవారు.

వీరి ఈ కాంబినేషను నాటికీ నేటికీ ఒకేలా వుంది. మధ్య మధ్య శాస్త్రిగారి శృంగార శ్లోకాలకు, పెద్దింటిరామస్వామి నాయుడుగారి భాగవత పద్యాలు మరో మూల నుంచి శ్రుతి కలుపుతూ వుండేవి.

చక్కగా మాట్లాడా లంటే
సాహిత్యం చదువుకోవాలి.
బంగారం లా బ్రతకా లంటే
భాష బాగా రావాలి.

—టుక్రమీలు

127. సాహిత్య అకాడమీ

"గవర్నమెంటు ఒక సాహిత్య సంస్థను ఏర్పాటు చేస్తున్నారట. దాని కేదో అకాడమీ అని పేరు పెడుతున్నారట. మీకు తెలుసా ?" అన్నారు కురుగంటి సీతారామయ్య గారు, ఒక సాయంత్రం భీమన్నను కలిసి.

ఆ వార్తకు భీమన్న ఆశ్చర్య పడితే, అది భీమన్నకు తెలియ నందుకు కురుగంటి వారు ఆశ్చర్య పడ్డారు.

ముఖ్యమంత్రి సంజీవరెడ్డి, విద్యామంత్రి పట్టాభి రామారావు గార్లిద్దరూ భీమన్నకు సన్నిహితులే. తనను ఎల్లప్పుడూ కంటికి రెప్పలా చూచుకునే కళా వెంకట్రావు, గోపాలరెడ్డి, సంజీవయ్య గార్లు ఉండనే ఉన్నారు. మరి, ఇంత ముఖ్యమైన విషయమే భీమన్నకు తెలియదా ?

నిజంగానే తెలియదు. తన కెంత సన్నిహితులైన వారు ఎంత గొప్ప పదవులలో వున్నా సరే, భీమన్నకు ఏ ముఖ్య విషయమూ తెలియదు. ఈయన పదవులలో వున్న ఎవరినీ కలవడు. ఏమీ అడగడు. తెలుసుకోడు.

తానూ, తన కవిత్వమూ, తన సరదాలూ – అంతే. ఎవరైనా తన సహాయాన్ని కోరితే చేస్తాడు. తాను మరొకరి సహాయాన్ని కోరడు. ఇది ఈయన మనస్తత్వం.

తెలుగుదేశం మొత్తానికి ఒక కేంద్ర సాహిత్య సంస్థ ఏర్పడాలన్న ఉద్యమం అంతకు ముందునుంచే వున్నా, అది ఆంధ్రప్రదేశ్ అవతరణ నుంచి తీవ్రతరం అయింది. అఖిలాంధ్ర సాహిత్య పరిషత్తు నిర్మాణం కోసం హైదరా

బాదులో చాల సభలు జరిగాయి . స్టీరింగు కమిటీ ఏర్పడింది . దానిలో భీమన్న కూడా ఒక కార్యకర్త . నియమావళి రూపొందింది . అట్టి స్థితిలో ఇది !

''అకాడమీలో సభ్యులుగా వుండవలసిందిగా కోరే లేఖలు చాలా మందికి అందాయి" అన్నారు కురుగంటివారు . సభ్యుల్ని విద్యాశాఖే నామినేటు చేస్తున్న దట .

ప్రభుత్వం నీడలో సాహిత్యం వికసించదని భీమన్న నమ్మకం . సాహిత్యం వ్యక్తి నిష్ఠం అంటా డియన . తానొక్కడూ ఒంటరిగా కూర్చుని చేసుకోవలసిన కళా సృష్టి అది . అందువల్ల అకాడమీ సభ్యత్వం పట్ల తనకు ఆసక్తి లేదు . కురుగంటి వారి కుంది . కాగా ఇద్దరూ కలిసి బయలు దేరారు . శాసన సభ్యుల వసతి గృహాలలో ఒకరిద్దర్ని కలిసి మాట్లాడి , భీమన్న రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి తన సభ్యత్వపు లేఖ వచ్చి వుంది . అలానే కురుగంటి వారికి కూడ వచ్చి వుంటుం దను కున్నాడు . కాని , రాలేదు . ప్రయత్నాలు కూడ ఫలించ లేదు . అప్పటికే నిర్ణయాలన్నీ జరిగిపోయా యట .

బెజవాడ గోపాలరెడ్డిగా రధ్యక్షులుగా , దేవులపల్లి రామానుజరావు గారు కార్యదర్శిగా , పదహారుగురు అగ్రశ్రేణి సాహితీ పరులు కార్యవర్గంగా , అరవై మంది సభ్యులతో సాహిత్య అకాడమీ ఏర్పడింది . దీనికి రూప కల్పన చెయ్యడంలో ప్రధాన పాత్ర నార్ల వారి దట !

మొదట్లో సాధారణ సభ్యుడు గాను , కొంత కాలం ఆర్థికోపసంఘంలోను వుండి , తర్వాత కార్య వర్గంలో ప్రవేశించాడు భీమన్న . ప్రస్తుతం అంటే 1978 నాటికి , ఈయన అకాడమీ సంయుక్త కార్యదర్శి . ఈ హోదాలో ఈయన ప్రధాన విధి-అకాడమీ సభలలో వందన సమర్పణ చెయ్యడం .

"వందన సమర్పణ" అనే ఎండు కట్టెకు కూడ తన సరస సాహిత్య ధోరణితో ఒక వసంతాన్ని కల్పించిన ఉపజ్ఞా కోకిల భీమన్న .

సాహిత్య అకాడమీ ప్రతినిధిగా , సంగీత నాటక అకాడమీలో కూడ భీమన్న సభ్యుడైనాడు . అయితే ఆ రంగం పట్ల ఎక్కువ శ్రద్ధను కనబరచలేదీయన .

1959 జనవరిలో సాహిత్య అకాడమీ తొలి సమావేశాలు సారస్వత పరిషత్తు ఆవరణలో జరిగాయి. అప్పుడు జరిగిన కవి సమ్మేళనలో ఈయన పాల్గొన్నాడు. చెప్పులు కింద వదలి, వేదిక మీదకు వెళ్ళి, కవిత చదివి, మర్యాదకోసం అక్కడే కాసేపు కూర్చుని, కిందికి వచ్చి చూచుకొనే సరికి - అక్కడ చెప్పులు లేవు! ఆబిడ్సులో షాపులు మూసేశారు. ఆ రాత్రి వేళ సరా సరి ఎగ్జిబిషనుకు వెళ్ళి కొత్త చెప్పులు కొనుక్కొని, ఇంటికి వెళ్ళవలసి వచ్చింది.

ఆనాడు ఆ చెప్పులే పోకపోతే, ఈనాటి దాకా ఆ కవి సమ్మేళనం జ్ఞాపకం వుండేదే కాదంటా దీయన.

కవిత ఒక ప్రక్రియకు ప్రేయసి కాదు
ఒక భాషకు బందీ కాదు
ఒక స్వేచ్ఛా సుందర మధుర భావన అది.
కవిత వ్రాసేదీ, చదివేదీ కాదు
ఆస్వాదించి ఆనందించేది.

—గుడిసెలు

128. మాడపాటి వారి మానవత

ఆది మందు వేసవి. మిట్ట మధ్యాహ్నం. నాంపల్లి ప్రాంతంలో రోడ్డు మీద నిలబడి వున్నాడు భీమన్న ఎటో చూస్తూ. హఠాత్తుగా ఒక కారు వచ్చి ముందు ఆగింది. ఉలిక్కిపడి వెనక్కు గెంతాడు.

"భీమన్నగారూ! ఏమి టిక్కడ, ఈ యెండలో?" అన్నాడు కారులోంచి ఒకవ్యక్తి. ఆయన మాడపాటి హనుమంతరావుగారు!

"ఈ వేళ హీట్‌వేవ్ వస్తుందని పత్రికలో వేశారు, చూడలేదా?" అన్నారాయన.

హనుమంతరావుగారు కౌన్సిల్ చైర్మను అయిన తొలిరోజులవి. గ్లాసరీ కమిటీ సమావేశాల సందర్భంలో భీమన్న చాల సన్నిహితు డయా డాయనకు. ఎంత సన్నిహితు డయా డంటే ఆయన చైర్మను కావడానికి ముందు ఒకరోజున-

"భీమన్నగారూ , నిన్న సంజీవరెడ్డిగారు ఇలా అన్నారు . దాని అర్థం ఏమి టంటారు ?" అన్నారు హనుమంతరావుగారు .

"మిమ్ము ప్రప్రథమంగా అభినందించే అవకాశం కలిగిన నేను ధన్యుణ్ని." అన్నాడు భీమన్న కేలుమోడ్చి .

"ఇ దేదైనా రాజకీయ మేమో ?"

"మీపట్ల రాజకీయమా ? ఎన్నటికీకాదు . సంజీవరెడ్డి అంత తేలిక మనిషి కాదు . మా టంటే చేతే "

హనుమంతరావుగారు భీమన్నను ఎంత ఆత్మీయంగా చూచేవారో చెప్పడానికే ఈ ఉదంతాన్ని పేర్కొన్నాను .

ఆంతరంగికమైన తమ కష్టసుఖాలను భీమన్నతో చెప్పుకొనే వారిలో పెద్దలూ , చిన్నలూ కూడ వున్నారు . వాక్‌గుంభనను భేదించడం , స్పష్టమైన సలహా ఇవ్వడం , ధైర్యం చెప్పడం భీమన్న ప్రత్యేక లక్షణం .

ఎంతటి గాఢాంధకారంలో అయినా వెతికితే వెలుగు దొరక్కపోదు . కొన్ని కళ్ళ కది ఇట్టే కనిపిస్తుంది . ఎక్కడబడితే అక్కడే కనిపిస్తుంది . కొన్ని కళ్ళు శ్రమపడి వెతకవలసి వుంటుంది . దృష్టి భేదమే కాని , వెలుగు కోపం కాదు .

భీమన్న పట్ల అంతటి ఆత్మీయతను పెంచుకొని , వాత్సల్యంతో చూచే హనుమంతరావుగారి పట్ల భక్తినే గాని , చనువును పెంచుకోలేదు భీమన్న . అయన ధైర్మను ఆయిన తర్వాత , ఆ సమీపాలకే వెళ్ళలే దీయన . పదవులలోకి వెళ్ళిన మిత్రులకు , బంధువులకు కూడ దూరంగా వుండి పోవడం ఈయన స్వభావం .

"పత్రికల ప్రాతలు నేను నమ్మను . అయినా , హిట్‌వేవ్ కనిపిస్తూనే వుంది కదా !" అన్నాడు భీమన్న . హనుమంతరావుగారికి కోపం వచ్చింది .

"కారులోకి రండి" , అన్నారాయన .

అదొక చిన్న పాతకారు. ఆంత మిట్ట మధ్యాహ్నం కారును వెనక్కు తిప్పి, భీమన్నను పంజగుట్టలో ఇంటివద్ద దింపి, ఎండల్లో బైట తిరగ వద్దని హితవు చెప్పి, తిరిగి వెళ్ళా రాయన. అంతటి గొప్ప వ్యక్తి, అమృత హృదయుడు హనుమంతరావుగారు. మూర్తీభవించిన మానవతా మూర్తి ఆంధ్ర పితామహుడు.

అమీరుపేట నుంచి పంజగుట్ట ఆఫీసర్సు క్వార్టర్సులోకి మారి వున్నాడప్పటికి భీమన్న. 1957 నుంచి 1961 వరకు ఒక నాలుగేళ్ళ పాటు సాహితీ మందిరంగా భాసించిం దీయన గృహం - పి. జె. 62.

మావవు లెక్కడున్నా మా వాళ్ళే
మా వాళ్ళున్న భూమి అన్నీ మా భూములే

—గుడిసెలు

129. ఉడికీ ఉడకని మెతుకులు

భీమన్న హైదరాబాదుకు వచ్చి నప్పటి నుంచీ ఈయన కార్యక్షేత్రం బాగా పెరిగింది. కృషి విస్తరించింది. మిత్రుల సంఖ్య అధిక మయింది. సాహిత్య సృజన కోసం, వాస్తవానుభవం కోసం ఈయన చేసే ప్రయోగాలు బహుముఖ మైనై. అందుకు ఎందరో మిత్రులు ఎన్నో విధాలుగా ఈయనకు తోడ్పడేవారు.

"నా కొత్త నవల పూర్తయింది సార్! అచ్చు కి చ్చేద్దా మను కొంటున్నాను. పేరే కుదరడం లేదు." అన్నారు భాస్కరభట్ల కృష్ణారావుగారు, బీరు మొదటి గ్లాసు పూర్తిచేసి.

భాస్కరభట్ల గొప్ప పేరున్న మంచి రచయిత. స్నేహశీలి. భాగ్య నగర సాహితీ రంగం మీద ప్రధాన పాత్ర ధారుల్లో, సాహితీ సంస్థల పునాది రాళ్ళల్లో ఆయన ఒకరు. సాహితీ నిర్మాణం, సంస్థా నిర్మాణం - ఈ రెండింటా ఆయన సవ్యసాచి. భీమన్నకు ప్రత్యేకంగా సన్నిహితుడు, మధు మిత్రుడు. ఆకాశవాణి ఆధికార్లలో ఒకడు.

1959లో ఒక సాయంత్రం , ఈ ఇద్దరూ ప్రజోద్యానంలో కలుసుకుని , ఆ సమీపంలోనే వున్న స్టారులో దూరి , బీరు తాగుతూ కూర్చున్నారు .

"ఒక మంచి పేరు చెప్పండి , సార్ !" అన్నాడాయన . ఈ సార్ అనేది గురూ లాంటిది . ఒక ఋత పదం . వయస్సులో చిన్నవాడైన వాడు పెద్ద వాడైన మిత్రుణ్ని ఆప్యాయతతో పలకరించే మాట అది .

ఇతి వృత్తం ఏమిటి ?

"ఆదొక ఎక్స్పరిమెంట్, సార్ ! ఎగ్జిస్టెన్షియలీజం ఆధారంగా వ్రాశాను."

ఎగ్జిస్టెన్షియలిజం అనే మాటను భీమన్న అంత వరకు విన లేదు . సాహిత్యంలో పాశ్చాత్య ధోరణులతోను , ఇజాలతోను ఈయనకు అంతగా పరిచయం లేదు . సర్రియలిజం లాంటి వాటిని గురించి విన్నాడు కాని , అవన్నీ ఉడికీ ఉడకని మెతుకులుగా గ్రహించి వదిలేశాడు . అజ్ఞానులూ , అర్ధ జ్ఞానులూ అయిన ఔత్సాహికులు చేసే ప్రాథమిక ప్రయోగాలే పాశ్చాత్య ఇజాలన్నీ అనీ, అవి కూడ అక్కడ పాత బడిన తర్వాతే మన దాకా వస్తున్నాయనీ ఈయన అభిప్రాయం .

రచన సృష్టికి భాష్యంగా వుండాలి . మరీ అయోమయం చేసేది కళగాని కవితగాని కాజాలదు . కోకిల ఏమని పాడుతున్నదో , గులాబి ఎందుకు నవ్వుతున్నదో చెప్పాలి . మనస్సును అలరించాలి . కోకిల కంటె అధ్యాన్నంగా కూసే వాడు , గులాబికంటె గూఢంగా నవ్వేవాడు కవికాడు అంటాడు భీమన్న .

అవ్యక్తం నుంచి వ్యక్తమయ్యేది సృజన . వ్యక్తం నుంచి అవ్యక్తంలోకి పోయేది మృత్యువు . జీవిత ప్రయోజనం గురించి తెలియని వాళ్ళు , ఏ తదన్వేషణలో చేసే ప్రయోగాలే ఆధునిక ఇజాలు . తెలిసిన వాళ్ళను అవి ఆకర్షించ లే వంటా డీయన .

ఎగ్జిస్టెన్షియలిజం అంటె ఏమిటో వివరించాడు భాస్కర భట్ల . మానవు డెంత కృషి చేసినా-దాని ప్రమేయం లేకుండానే , జరగవలసింది జరిగే తీరు తుందనే తత్వం అది . చైతన్యం ఒక మహా ప్రవంతి , దాని వెల్లువలో ఈ మానవ జీవితా లన్నీ కేవలం పూచిక పుల్లలు .

"దీనికీ, మన కర్మ సిద్ధాంతానికీ తేడా ఏమిటీ?" అన్నాడు భీమన్న.

"కర్మ సిద్ధాంత మంటే ఏమిటి, సార్?"

పూర్వ జన్మలో చేసిన పాప పుణ్య కర్మల ఫలితాలను ఈ జన్మలో అనుభవించక తప్పదనీ, మానవు డెంత ప్రయత్నించినా ప్రారబ్ధం నుంచి తప్పు కోలేడనీ నమ్మని వా డెవడూ లేడీ దేశంలో. పాశ్చాత్యుల దిక్కు-తోచని, నిరాశా పూరిత, ఎగ్జిస్టెన్షియలిజం కంటె-ఒక హేతువును ఊహించి, దాని నివారణో పాయాన్ని కూడ సూచించే మన కర్మ సిద్ధాంతం ఉత్తమమైంది కాదా!

వేదాంతరంగంలో మన భారత ఋషులు వెళ్ళినంతటి లోతులకు, ఔన్న త్యాలకు ఇతర దేశాల మేధావులు వెళ్ళలే దనేది ప్రపంచమంతా గుర్తించిన సత్యం. తాత్త్విక జ్ఞానానికి మన అద్వైతం పరాకాష్ఠ. అటువం టప్పుడు-మన దేదో తెలుసుకోకుండా, పాశ్చాత్య ఇజాలను అధ్యయనం చేయడం-మన పరమా న్నాన్ని చూచుకోకుండా ఇతరుల రొట్టెముక్క-ల కోసం చేయి చాపడమే అవు తుం దనేది భీమన్న వాదం.

బీరు పార్టీ సాహితీ సిద్ధాంత చర్చా వేదికగా మారింది. రాత్రి పదకొండో పన్నెండో అయింది. ఇంత నిశితంగా ఆలోచిస్తున్నవాళ్ళు మన రచయితల్లో ఎవరూ లేరనీ, వారాని కొక్క-సారైనా ఈ విధమైన గోష్ఠులు జరగడం అవసర మనీ అన్నాడు భాస్కర భట్ల.

"వెల్లువలో పూచిక పుల్లలు" అనే పేరు పెట్టండి- అన్నాడు భీమన్న.

భీమన్నకు బైటి ఖర్చు పెరగడం, రాత్రులు ఆలస్యంగా ఇంటికి వెళ్ళడం వంటివి ఈయనను కూడ ఒక పూచిక పుల్లను చేసి వేశాయి- తన సంసారపు వెల్లువలో. మద్రాసులోనే భార్యా భర్తల మధ్య మొలకెత్తిన వైమనస్యం ఈ విధమైన సంఘటనలతో పెరిగి పెద్దది కాసాగింది.

ఆ మర్నాడు భీమన్నకు భాస్కర భట్ల ఫోను చేసి—

"నవలకు మీరు సూచించిన పేరే పెడుతున్నాను, సార్! దానిని మీకే అంకితం కూడ ఇస్తున్నాను," అన్నారు. అంకిత వచనంలో భీమన్నను మార్గదర్శకమైన ఒక జ్యోతిగా చిత్రించా రాయన!

చెలువ, నీ హృదయమే
క్షీర సాగరమే!
ఒడ్డు పై కూర్చుండి
ఊహింతు నమృతమ్ము,
దాని కది మధన మగునా?
వచ్చి
త్రావుమని పెదవి నిడునా?

—బొమ్మ

130. హరిజనులు—వక్రభాష్యాలు

అది 1957 లేక 58. నెల్లూరులో రాష్ట్ర హరిజన సేవా సంఘం వారి మహాసభలు జరిగినై. అందులో హరిజన కవులకు సన్మానాలు ఒకఅంశం. దానికి భీమన్న ఆహ్వానించ బడ్డాడు. మంత్రి సంజీవయ్యగారు తమ కారులో కలిసి వెళదాం అన్నారు. బైలు దేరా రిద్దరూ - ఆ ముందు రోజు సాయంకాలం ఇక్కడ.

రాత్రి భోజనం విజయవాడలో చేసి, రాజకీయాలు చూచుకొని, రాత్రికి రాత్రే అక్కడి నుంచి మళ్ళి బైలు దేరారు. అక్కడ నంబూరి శ్రీనివాసరావు కారులోకి వచ్చాడు. అంత వరకు ప్రసన్న కథా కవి తార్థ యుక్తులతో సాగిన కారు, అంతటితో ఉద్యోగ విజయాలుగా మారిపోయింది!

శ్రీనివాసరావు, సంజీవయ్య గార్నిద్దరూ సంగీత, సాహిత్య, నాట్య కళా కుశలురే. అభ్యాసం లేక ప్రతిభ వికసించలే దంతే. వారి ప్రతిభ రాజకీయాలలోకి మళ్ళిపోయింది.

భీమన్న శ్రోతగా, ప్రేక్షకుడుగా - ఆ ఇద్దరూ "అదిగో ద్వారక" వద్దనుంచి "చెల్లియె, చెల్లకో" మీదుగా "చచ్చిరి సోదరుల్" వరకు పోటిపడి పాడారు ఎన్నో పద్యాలు - ఎన్నో రాగాలలో. ఆ ఇద్దరికీ అది మహా భారతం. భీమన్నకు మాత్రం కర్ణ పర్వం, ఆనంద స్వర్గా రోహణం!

వీధి నాటకం వలె తెల్లవారి పోయింది - నెల్లూరు వచ్చేసింది.

ముఖ్యమంత్రి సంజీవరెడ్డి గారి ప్రారంభోత్సవంతో ప్రారంభమైన హరిజన సభలు కోలాహలంగా సాగసాగినై.

ఆ రోజు సాయంత్రం సభకు అధ్యక్షత వహించిన ఒక వ్యక్తి చేసిన ఉపన్యాసం విని, భీమన్న చాల బాధ పడ్డాడు. ఆయన చేసిన ఉపన్యాస సారాంశం ఇది -

"హరిజనులకు అంటరాని తనం దాపురించడానికి రెండు విషయాలు కారణమై వుండవచ్చు. హరిజనులు ఈ దేశంలో ఆదిమ వాసులు కావచ్చు. ఆర్యులు జయించిన తర్వాత వాళ్ళు బానిసలుగా పరిగణించబడి వుండవచ్చు. రెండో కారణం - చచ్చిన గొడ్డును తినడం. తత్కారణంగా వీళ్ళు వెలి వేయ బడి వుండవచ్చు. కారణమేదైనా — ఈనాడు మనందరం ఒకటి. అస్పృశ్యతను నిర్మూలించ వలసిన బాధ్యత మనందరి మీదా వుంది".

ఈ ఉపన్యాసం విన్న భీమన్నకు ఒళ్ళు మండి పోయింది. ఆ రెండు కారణాలు అసంబద్ధమైనట్టివే. అయితే, తానేం చేయగలడు?

వర్ణ వ్యవస్థ మూల భూతంగా కలది హిందూ సంఘం. వర్ణ వ్యవస్థలోని కులాలు నాలుగు. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. అయిదో కులం లేదు. ఆ తర్వాత ఏర్పడ్డ పంచమ కులం, అంటే నేటి హరిజనులు, ఎవరు? నేటి వర్ణ వ్యవస్థకు వెలుపలివారు. అందువలననే వర్ణవ్యవస్థలో లోపలివారిని సవర్ణులనీ, వెలుపలి వారిని అవర్ణులనీ పేర్కొనడం పరిపాటి అయిందా నాటి నుంచీ.

"అస్పృశ్యత ఎలా ఏర్పడింది? హరిజను లెవరు?" అనే విషయాలలో ఎవరికి తోచిన ఊహలు వారు చేస్తున్నారు. అందులో తెలిసీ తెలియని హరిజన నాయకులు చేసే ఊహలు మరీ ఆధ్వాన్నంగా వుంటున్నై. చారిత్రిక పౌరాణిక సత్యాలకు గాని, హేతు వాదానికి గాని అందనట్టి వవి. ఇక—సవర్ణులు వట్టి అపోహలను ప్రచారం చేస్తున్నారంటే, వింత ఏముంది?

తనకు తెలిసినంత వరకు, హరిజను లెవరన్న ప్రశ్నకు డాక్టర్ అంబేద్కర్ చెప్పిన సమాధాన మొక్కటే సత్యానికి దగ్గరగా వున్నదని భీమన్న

అభిప్రాయం. హరిజనులు అక్షరాలా వెనకబడ్డ వాళ్ళు, దళిత జనులు, అంబేద్కర్ మాటలలో "బ్రోకెన్ పీపుల్" (Broken People).

ఆ మరునాడు కవి సన్మాన సభలో తన వంతు వచ్చినప్పుడు. ఈ తన భావాలను బహిరంగంగా ప్రకటించాలను కొన్నాడు భీమన్న. అందుకు సిద్ధ పడి సన్మాన సభకు వెళ్ళాడు.

తెయని పామరుడి కంటే
తెలిసీ తెలియని మూర్ఖుడు ప్రమాదకరుడు,
వ్యాఘ్రం కంటే గోముఖ వ్యాఘ్రం ప్రాణాంతకం!

—త్రిపదలు

131 హరిజను లెవరు?

హరిజన సేవక సంఘం (రాష్ట్రశాఖ) అధ్యక్షులు కూర్మయ్యగారు, ఊటుకూరి నరసింహారావు గారు, చెరుకువాడ నరసింహం గారు, మంత్రి సంజివయ్యగారు మొదలైన ఎంతోమంది ప్రముఖులతో శోభాయమానంగా వున్న వేదిక మీద కవి సన్మాన కార్యక్రమం ప్రారంభ మయిందా నాడు.

సన్మానితులలో పాల వెంకట సుబ్బయ్య, నంబూరి శ్రీనివాస రావు, ఆళ్ళ చలమయ్య, అత్తోటి రత్నం మున్నగు వారు చాల మందే వున్నారు. అందరూ తమ తమ కవితలను చదివి వినిపించారు. భీమన్న మాత్రం కవిత చదవకుండా, ఉపన్యాసం ప్రారంభించాడు. దాని సారాంశం ఇది -

1. హరిజనులు ఆదిమ వాసులు కాదు. ఈనాడు ఆర్య ద్రావిడ జాతులుగా పేర్కొనబడుతున్న మూల భారత జాతికి చెందిన వాళ్ళే వీళ్ళూను. రక్త పరీక్ష ద్వారా, జీవ లక్షణ పరిశీలన ద్వారా నిరూపితమైన సత్యమిది. హరిజనులు బ్రోకెన్ పీపుల్ అన్న అంబేద్కరు సిద్ధాంతమే సరయిందనవచ్చు.

2. చచ్చిన గొడ్డును తింటారు కనుక, హరిజనులు వెలివేయబడి వుంటా రనడం మరీ పొరపాటు. తాము పూజించే గోమాతలను చంపి తినే విజాతీయ ప్రభువులకు పాదాలొత్తే సవర్ణులు - చచ్చిన గొడ్డును తినే సాధుజనాన్ని వెలి

వేశా రంచే నమ్మశక్యం కాదు. అట్టి వాడం హిందువులకు గౌరవ ప్రదమైనది కూడ కాదు.

పూర్వం మామూలు చచ్చిన గొడ్డును తినే వారన్న మాట నిజమే. అయితే అది ఎలా జరిగింది?

దేశంలోకి కొత్తగా ఏమతం వచ్చినా, ముందుగా అందులో చేరేవాళ్ళు పీడిత వర్గాల ప్రజలే. పాత వ్యవస్థలో విముక్తి మార్గం గోచరించక, స్వేచ్ఛ కోసం కొత్త వ్యవస్థలో చేరి పోతుంటారు. ఈనాటి ఇస్లాం, క్రైస్తవ మతాలే అందుకు నిదర్శనం.

బౌద్ధ మతం అవతరించిన కొత్తలో, దానిలో చేరిన జనమంతా పీడిత వర్గాల వారే, ముఖ్యంగా మాల మాదిగలే.

ఆనాడు దేశంలోని అన్ని వర్ణాలకూ ప్రధానాహారం మాంసమే. ఇన్ని ప్రాజెక్టులు పనిచేస్తున్న ఈనాడే తిండి గింజలకు ఇంత కట కటగా వుంటే, ఆ నాడేం దొరికేది? పచ్చిక బీళ్ళూ, పశుల మందలూ మాత్రమే నాటి ప్రజల ఆహారం. ఆనాడు తిండి కరువు ఎక్కువగా వుండేది కనుకనే, రాజులు యజ్ఞ యాగాలు చేసి ప్రజల్ని ఆదుకొంటూ వుండేవారు. ప్రతి రోజూ లక్షల కొలది పశువులు తెగేవి. రంతి దేవుని చరిత్ర, చెంబల్ నది ఉదంతం అందుకు నిదర్శనాలు.

ఆట్టి స్థితిలో బౌద్ధమతం వచ్చింది.

బౌద్ధ మత సిద్ధాంతం ఏమిటి? ప్రధాన మయింది "అహింస." మాంసం తప్ప మరో ఆహారం లేని రోజుల్లో అహింస ఎలా సాధ్యం? గౌతమ బుద్ధుడు లాంటి రాజులకూ, అయిన చుట్టూ చేరిన రాజకుమారులకూ తిండి గింజలు లభించవచ్చు. క్రింది తరగతుల పేదల గతి ఏమిటి? పైగా—బుద్ధుడు నిషేధించింది హింసనే, మాంస భక్షణను కాదు.

తమ ఇరుగు పొరుగు హిందువులంతా బ్రతికిన గొడ్డును తింటున్న రోజులలో, బౌద్ధ మతంలో చేరిన ఈ దళిత జనం—ఆటు మత ధర్మాన్ని, ఇటు

ప్రాణాలనూ నిలుపుకోవడం కోసం-చచ్చిన గొడ్లను తిన సాగారు. విశ్వామిత్ర అగస్త్యాది మహర్షులే కుక్కలను, మనుషులను కూడ తిన్న రోజు లవి! వాళ్ళకు లేని వెలి వీళ్ళ కెలా వచ్చింది?

సభలో మాటి మాటికి హర్ష ధ్వానాలు రేగాయి-భీమన్న ఈ ఉపన్యాసానికి. కూర్మయ్య, సంజీవయ్య, తదితర పెద్దలు ప్రశంసా వర్షం కురిపించారు. ఈ ప్రసంగ విషయాన్ని పుస్తకరూపంలో ప్రకటించమని కోరారు. వారి కోరిక ప్రకారం రూపొందినదే "హరిజనులు ఆర్యులే" అన్న వ్యాసం. రాగ వాశిష్ఠానికి పీఠికగా ముద్రించ బడి, తన చిరకాల మిత్రుడైన సాక వేములు గారికి అంకిత మయిందది.

వేద కాలం నాటి ఆర్యులు మాంసాహారులే. ఆనాడు అన్ని జాతులూ అంతే. వ్యక్తి ప్రతిభా ప్రాభవాలకు, బల దర్పాలకు, గౌరవ ప్రతిష్ఠలకు ఆ వ్యక్తి యొక్క ఆహార, విహార, విశ్వాసాలతో సంబంధం లేదంటాడు భీమన్న. అది ఆనాడూ లేదు, ఈనాడూ లేదు.

ఆ రోజుల్లోనే "పడిపోతున్న ఆడ్డుగోడలు" నాటిక ప్రింటయింది. దాన్ని ఊటుకూరు నరసింహారావుగారు హరిజన సేవక సంఘం తరపున ప్రకటించారు. అది అసలు రేడియో నాటిక. ధర్మజ్ఞాన్ని, బుచ్చిబాబు గార్ల బాధ పడలేక భీమన్న నిర్మించిన అద్భుత కులనిర్మూలన నాటిక అది.

హరిజను లెవరు?
ప్వచ్ఛమైన ఆర్యులు
ఆది కవులు, వేదవ్యాసులు,
ఆరుంధతులు, అన్న స్వరూపులు.
—ట్రూమీలు

132 అఖిల భారతమా, సర్వ ప్రపంచమా?

నవ్య సాహితీ సమితి ఆధ్వర్యంలో తెలుగు రచయితల మహాసభలు జరపాలనే నిర్ణయం తీసుకొన్న తర్వాత, వాటికి ఏం పేరు పెట్టా లనే దగ్గర

కొంత పేచీ ఏర్పడింది. అప్పటికి నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు భీమన్న, ప్రధాన కార్యదర్శి పోతుకూచి సాంబశివరావు.

వెనకవుండి నడిపించడంలో భీమన్న అద్వితీయుడు. సాంబశివరావు కార్యనిర్వహణ దక్షుడు. అగ్నీ, వాయువూ కలయికలాంటి ఈ ఇద్దరి కాంబినేషన్‌తో నవ్య సాహితీ సమితి సాహితీ రంగంలో అపూర్వమైన కార్యక్రమాలను నిర్వహిస్తూన్న రోజులవి.

ఏందరో ఎన్నో పేర్లు సూచించారు. "అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు" అంటే ఉచితంగా వుంటుం దనేది భీమన్న సూచన.

విశాలాంధ్ర, అఖిలాంధ్ర, బృహదాంధ్ర వంటి పదాలేవీ ఆంధ్ర ప్రదేశ్ ఎల్లలుదాటి వెళ్ళవు. దేశమంతా వున్నారు తెలుగు వాళ్ళు. ఆలిండియా, అఖిల భారత అంటేనే సభల కొక హోదా కలుగుతుం దనేది ఈయన వాదన.

పేరు గురించిన తర్జన భర్జన కొద్ది రోజులపాటు జరిగిన తర్వాత ఒక సాయంత్రం భీమన్న వద్దకు వచ్చి పోతుకూచి "అఖిల భారత" అనడానికి కొందరు పెద్దలు ఒప్పుకొనడం లేదన్న వార్తను అందించాడు. ఆ కొందరు సాహిత్య రంగంలో పేరు ప్రతిష్ఠ లున్న వారు.

"మరేం చేద్దాం?"

"అదే, ఏం చేద్దాం?"

"అఖిల భారత అంటేనే సభలకూ, రచయితలకూ కూడ ఒక ఉన్నత జాతీయ స్థాయి ఏర్పడుతుం దనే భావం నాలో గాఢంగా నాటుకుపోయింది. పైగా సభల నిర్వహణకు మనం కేంద్ర ప్రభుత్వాన్ని కూడ సహాయం అడగవచ్చు. ఇంతకూ మీ ఉద్దేశం ఏమిటి?" అన్నాడు భీమన్న.

"అఖిల భారత అంటేనే బాగుంటుంది."

"అయితే-అదే పేరును ఖాయం చేసెయ్యండి."

అలానే చేశారు. కాని, పేరదే అయితే, తాము ఆ సభలతో సహకరించ బోమని ఖచ్చితంగా చెప్పేశారట ఆ పెద్దలు. ఆ మర్నాడు మళ్ళీ ఈ వార్త తెచ్చారు పోతుకూచి. భీమన్నకు పట్టుదల పెచ్చింది.

"ఎవరూ సహకరించక పోతే, మ నిద్దరమే అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు జరిపేసి, తీర్మానాలను పత్రికలకు విడుదల చేసేద్దాం." అన్నాడు కొంచెం తీవ్రంగా.

"అందుకు నేను సిద్ధమే" అన్నాడు పోతుకూచి ఉత్సాహంగా.

ఆ క్షణం నుంచీ అందుకు కృషి ప్రారంభమయింది. పనిచేసే వాళ్ళంతా నవ్య సాహితీ సమితి సభ్యులే. సహాయ నిరాకరణ చేస్తామన్న పెద్దలు పై నుంచి కబుర్లు చేప్పే వాళ్ళే కాని, కార్యకర్తలు కాదు. కనుక ఈ కృష్ణార్జునుల రథానికి అడ్డు లేక పోయింది.

అఖిల భారత అనే పేరే భాయం చేశారనీ, కార్యక్రమంతో ముందుకు సాగుతున్నారనీ తెలిసిన తర్వాత ఆ పెద్దలలో ఒకాయన కసి ఆపుకో లేక అన్నాడు "అఖిల భారత తెలుగేమిటి? ప్రపంచ తెలుగే అనండి" అని.

"ఆరోజు వచ్చినప్పుడు, అలాగే అందాం" అన్నాడు భీమన్న.

ఆ తర్వాత పదిహేనేళ్ళకు ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు అసలు బీజం పడ్డది ఆనాడే. ఆనాటి నుంచీ ప్రపంచ సభల ఏర్పాటు కోసం సాహిత్య అకాడమీ అధ్యక్షులు గోపాలరెడ్డి గారి ఆశీస్సు లతో భీమన్న, సాంబశివరావు, రామానుజరావు గార్లు చేసిన కృషి, పడ్డ శ్రమ ప్రత్యేకంగా రికార్డు చేయవలసి నట్టిది.

అఖిలాంధ్రం అదిలాబాదు దాటదు
అఖిల భారతం అస్సాము దాటదు,
అఖిల ప్రపంచమే అందాం మనం
అశాపకాశాలు గెలుద్దాం మనం

—టుమ్మీలు

133 ఆహ్వాన సంఘాధ్యక్ష వరణం

అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు తలపెట్టారు. పెద్దయెత్తున చేదాం అనుకున్నారు. మరి అందుకు తగిన ఆహ్వాన సంఘాధ్యక్షుడు కావాలిగా? ఎవరు?

నవ్య సాహితి సమితే ఆహ్వాన సంఘంగా వుండాలన్న సూచన వచ్చింది. అప్పుడు భీమన్నే ఆహ్వాన సంఘాధ్యక్షు డవుతాడు. అది సరైన పద్ధతి అన్నారు సభ్యులు. కాని, భీమన్న అందుకు ఒప్పుకోలేదు. ముఖ్యం పని, పదవులు కాదు. విద్యా మంత్రి ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా వుంటే సభలకు ఒక స్థాయి ఏర్పడుతుం దనే దీయన ప్రతిపాదన.

భీమన్న, పోతుకూచి, మరి కొందరు సభ్యులు విద్యా మంత్రిని దర్శించారు. మంత్రి పట్టాభి రామారావు గారు వీరందర్నీ ఎంతో ఆదరణతో కూర్చో బెట్టి, ఇటువంటి ఏ సభలతోను తాను ప్రమేయం పెట్టుకోనని చిరు నవ్వుతో చెప్పేశారు.

చెమట్లు తుడుచుకొంటూ బైట పడ్డ రాయబార వర్గం - దిక్కు తోచక రోడ్డున పడ్డారు. తొలి ప్రయత్నానికే పిల్లి ఎదురయింది!

విద్యా మంత్రి అయితేనే ఉచితంగా ఉంటుంది. ఆయన కాదన్నప్పుడు మరో మంత్రిని వెదుక్కోవాలి. మంత్రి వర్గంలో సరసుడూ, సాహితీపరుడూ ఎవరున్నారు? ఒక్కొక్కరిని గురించి చర్చించుకొన్న తర్వాత, సంజీవయ్య అయితే బాగుంటుంది అనుకున్నారు. ఆయన వద్ద భీమన్నకు మంచి చను వుంది కనుక, ఆయనను ఒప్పించే బాధ్యత భీమన్నే తీసుకోవా లన్నారు.

చనువు పట్టాభి రామారావుగారి వద్ద లేదా? పదవులలో వున్న వారి ముందు చనువులూ, స్నేహాలూ పని చెయ్యవు. ఈ రెండో యత్నానికి కూడ పిల్లి ఎదురు రాకూడదు. తమ చుట్టూ పిల్లులు చాల వున్నై అనేది అర్థమవు తున్నది భీమన్నకు. కాగా -

"మన కుర్ర వాళ్ళేవో రచయితల సభలు చేసుకుంటారట. మీ వద్దకు వస్తున్నారు. నిరుత్సాహ పరచకండి. కాస్త ప్రోత్సహించండి" అనే మాటను ముందుగా కల్లూరి సుబ్బారావు, వేముల కూర్మయ్య గార్లచే విడివిడిగా సంజీవయ్యగారికి చెప్పించారు.

"బోయి భీమన్నకు మధ్యలో మీ రాయబార మేమిటి? రమ్మనండి" అన్నారట సంజీవయ్య గారు. ఆ విధంగా సంజీవయ్యగారు ఆహ్వాన సంఘాధ్యక్షులైనారు.

మరీ అదృష్ట మేమిటంటే - తాను ఆహ్వాన సంఘాధ్యక్షుడైన కొద్ది రోజుల లోనే రాష్ట్ర రాజకియాలలో అనుకోని మార్పులు వచ్చి, సంజీవయ్య గారు ముఖ్యమంత్రి అయారు. మహాసభల విజయానికి స్వయంగా శ్రద్ధ తీసుకున్నారు. ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

మహా సభల ఏర్పాట్లకు రక రకాల ఉప సంఘాలను, శాఖలను నియమించి, ప్రత్యేక కార్యాలయాన్ని నడుపుతూనే-భీమన్నా, పోతుకూచీ ఇద్దరూ కలిసి విశాఖల కోసం భాగ్య నగరంలో ఇయ్యను ఇప్పించను గల ప్రతి అయ్యా గుమ్మమూ ఎక్కి దిగారు. చిత్రాతి చిత్రమైన అనుభవాలను చవి చూశారు.

నిమ్న కనుగొన్న కాంతిగల
నేత్రమె నీ సదనమ్ము, సీవె జీ
వన రసధార, వేర సవి
పాసువు నివ్వతని వార గ్రోలి నా
తని కరమందు స్వర్గము స
దా జగమంతయు, నిమ్నగొల్చి నీ
ప్రణయము గెల్చి మావవుడె
బ్రహ్మ వినూతన విశ్వ సృష్టికిన్।

— దీప సభ

134. పురుషు లందు పుణ్య పురుషులా

ఒక ఉదయం భీమన్నా, సాంబశివరావూ పంజగుట్ట నుంచి బైలుదేరిపోతూ, "చిన్నప్పరెడ్డి, అడ్వకేట్" అనే పేరు పలక చూశారు. కారును లోపలికి

పోనిచ్చారు . ఆయ నెవరో వీళ్ళకి తెలీదు . వీళ్లెవరో ఆయనకూ తెలియదు . పేర్లు విని , కరపత్రాలు చూచి - ఆయన లోనికి వెళ్ళివచ్చి , నూట పదహార్లు విరాళం ఇచ్చారు !

ఆయనే ఆ తర్వాత హైకోర్టు జడ్జీ తర్వాత సుప్రీంకోర్టు జడ్జీ అయిన చిన్నప రెడ్డి గారు . పురుషులందు పుణ్య పురుషులు ఇలానే వుంటా రనుకొంటూ , అక్కడి నుంచి కదిలాకీ జంట .

బైలు దేరిన వేళ బాగున్నదనుకుంటూ , ఆబిడ్సులోని మిఠాయి పుల్లారెడ్డి గారి వద్దకు వెళ్లారు . "భీమన్నగారు ఎంత ఇవ్వమంటే అంతా ఇస్తా" నన్నాడు ఆయన . ఈ ఇద్దరూ ముఖ మఖాలు చూసుకున్నారు . చందా లెత్తడం ఈ ఇద్దరికీ కొత్తే . 'నూట పదహా ర్లివ్వండి' అన్నాడు భీమన్న .' అంతేనా ? అంటూ వెంటనే పైకం తీసి ఇచ్చేశారు పుల్లారెడ్డి గారు . వెయ్యినూట పదహార్లు అన్నా ఇచ్చేవారే ఆయన . అంత ఎత్తుకు ఈయన ఊహ ఎగర లేక పోయింది !

ఎన్నో సార్లు ఇంటి చుట్టూ తిప్పుకొని ఏమీ ఇవ్వని వాళ్ళూ , తుదకు నాలుగేసి , అయిదేసి ఇచ్చి పీడ వదిలించు కున్న వాళ్ళూ చాల మందే ఉన్నారు . జేబులలో ఎంతుంటే అంత అప్పటి కప్పుడు ఇచ్చేసి దండం పెట్టిన వాళ్ళూ చాల మంది .

డబ్బు గడించడ మనేది ఒక విద్య . అది గారడీ విద్య లాంటిది . అందరికీ అబ్బదు . కళా రాధకులకు అసలే అబ్బదు . అందువల్ల ధన సంపాదకులైన వాళ్ళు దాన్ని ఉదారంగా తదితరులకు అందజేస్తూ వుండా లంటాడు భీమన్న . ఏ పని చేతనైన వాడు ఆ పనిలో నిమగ్నుడు కావాలి . ఆ పని ఫలితాన్ని సమాజానికి అందివ్వా లంటాడు . ఇది కొంత కమ్యూనిస్టు సిద్ధాంతానికీ , కొంత ధర్మ కర్తృత్వ సిద్ధాంతానికీ చెంది వున్నట్టు కనిపిస్తుంది . అయితే వ్యక్తి సంపాదన సమాజ పరం అవుతూ వుండా లనేది ఇందులో ప్రత్యేకత .

సభల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని విరాళ మడిగారు . ఐదు వేలు కావా లన్నారు . ప్రభుత్వం ఒక వెయ్యి మంజూరు చేసినట్టు తెలిసింది . ఇదేం అన్యాయ మంటూ భీమన్న వెళ్ళి సంజీవయ్య గార్ని దర్శించాడు .

"మీ ఫై లేదీ నా వద్దకు రాలేదే ?" ఆన్నారు సంజీవయ్యగారు . "నా పేరుండదు . కార్యదర్శి పోతుకూచి సాంబశివరావు గారి పేరుతో వుంటుంది" అన్నాడు భీమన్న .

"అది సంతకమై వెళ్ళిపోయింది , సార్ !" అన్నాడు ఆయన కార్యదర్శి . ఆ ఫైలును వెంటనే తిరిగి తెప్పించుకొని , అడిగిన మొత్త మంతా మంజూరు చేశారు సంజీవయ్యగారు .

ఈ విధంగా - సభల కోసం ధనం సేకరించడంలో రేబవళ్ళు కష్ట పడ్డాడు భీమన్న . ఆయితే అందులో ఒక్క రూపాయిని కూడ తాను చేత ముట్టలేదు . డబ్బు విషయంలో బాధ్యత భరించే తత్వం కాదీయనది . వసూలు , ఖర్చు , అకౌంటు అంతా నమ్మకమైన ఇతరుల చేతిలోనే వదిలేస్తాడు . వదిలే శాడు .

నేను బియ్యం తెస్తాను , నీవు పొయ్యిరాజెయ్యి ,
అబ్బాయి కూరలు తెస్తాడు , అమ్మాయి ప్లేట్లు పెడుతుంది ,
ఎక్కువ తక్కువ లేం లే విందులో—
కనులు వేరు వేరు , ఫలితం అందరిదీ

—టుమ్రీలు

135. సరస్వతీ పతాక

"మీ రింతవరకు చేసిన పనుల్లో నాకు నచ్చనివి చాల వున్నాయి . బహుశ భీమన్నగారికి ఇక్కడి రాజకీయాలు తెలియ వనుకుంటాను . సరే . మీరింతగా అడుగుతున్నారు కాబట్టి , నా పూర్తి సహకారం మీ కిస్తాను" అన్నారు దేవులపల్లి రామానుజరావు గారు , రచయితల సభలతో సహక రించ వలసిందిగా వారిని భీమన్నా , పోతుకూచీ స్వయంగా వెళ్ళి కోరినప్పుడు .

భీమన్న రాజకీయాలు తెలిసినా తెలియనట్టే వుంటాడు . అన్ని పనులు తెలిసే చేస్తాడు . అమాయకత్వం కనబరుస్తాడు . స్వయంగా వెళితే పని జరగ దనుకొన్నప్పుడు లేఖ వ్రాస్తాడు . ముందుగా చెపితే చెడిపోతుందను

కొన్న పనిని, చేసేసి చెపుతాడు. కార్య సాధనకు ఈయన ఆవలంబించే పద్ధతు లలా ఉంటాయి. జరగ దనుకొన్న పని జోలికి పోడు. ప్రయత్నం కూడ చెయ్యడు.

రామానుజరావుగారి సహకారంతో సభల కార్యక్రమాలు వేగాన్ని పుంజు కున్నాయి. జాతీయోద్యమ స్థాయిలో సాగిన సారస్వత మహోత్సవాలు అవి.

జెండా వందనం కోసం సరస్వతీ పతాక నొకదాన్ని రూపొందించాడు భీమన్న. ఎక్కడెక్కడో వెతికి, ఏ రసానికి ఏ రంగో నిర్ణయించి, చిత్ర శిల్పి పి.ఆర్. రాజుగారిచే సరస్వతీ పతాకను నిర్మింప చేశాడు. నవ్య సాహితీ సమితి కార్యవర్గమూ, సభల ఆహ్వాన సంఘమూ ఆ పతాకను ఆమో దించాయి.

సభల నిర్వహణలో అడుగడుగునా భీమన్న సలహా వుంది. బూర్గుల రామకృష్ణారావుగారి సభాధ్యక్షత, సర్వేపల్లి రాధాకృష్ణ (అప్పటి ఉప రాష్ట్ర పతి) గారి ప్రారంభకత, బెజవాడ గోపాలరెడ్డిగారి సన్మాన కర్తృత్వత, రైల్వేశాఖ వారి కన్సెషను మంజూరు వగైరాలన్నీ ఈయన పలుకుబడి వల్లనే సాధ్యమైనై. ముఖ్యమంత్రి సంజీవయ్యగారు సభలతో పూర్తిగా త్యమేవాహం కావడం కూడ ఈయన ద్వారానే.

సభల సందర్భంలో కొందరు అగ్రశ్రేణి కవి పండితులకు సన్మానాలు జరుపుదా మనుకున్నారు. కార్యక్రమాలను ఫైన లైజు చేసే ఉప సంఘం - ముఖ్యంగా భీమన్న, పోతుకూచి సాంబశివరావుగార్లు - దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారింట్లో కలుసుకునే వారు.

ఒక పది పన్నెండుగురి కంటె ఎక్కువ మందిని సన్మానించ లేమనీ, ఆందుకు తగిన పేర్లను సూచించమనీ కృష్ణశాస్త్రి గార్ని అడిగారు. ఆయన సుమారు నలభై పేర్ల జాబితాను ఇచ్చారు. అందులో ఎవర్నీ ఉపేక్షించడానికి వీలుపడ దనీ అన్నారు.

జాబితాను తీసుకొని భీమన్న, పోతుకూచి కలిసి ఆఫీసులో కూర్చొని దాన్ని పరిశీలించారు.

"ఏం చేద్దాం ? "

"ఇందులో చాల పేర్లు నాకు తెలియవు" అన్నారు సాంబశివరావు గారు.

"నాకూ తెలియవు" అన్నాడు భీమన్న.

'భీమన్న పేరు చాల మంది కవి పండితుల కెలా తెలియదో, చాల మంది కవి పండితుల పేర్లు భీమన్నకు కూడ అలానే తెలియ దనుకోవచ్చు. పోతుకూచి వారికి కూడ తెలియకపోతే?

తా మిద్దరికీ తెలియని పేర్లు కొట్టేశారు. ఇంకా సగం జాబితా మిగిలింది. మిగిలిన జాబితాను మళ్ళీ పరిశీలించారు. అందులో బ్రాహ్మణేతరు డొక్కడూ లేడు!

"ఈ ఊహ నాకు కూడ తట్టలేదు, అంతా బ్రాహ్మలే అయితే ఎలా? మీరు లేకపోతే పెద్ద ప్రమాదమే జరిగి వుండేది. ఆ జాబితాను బుట్టలో పారేసి ఒక పది పేర్లు చెప్పండి." అన్నాడు పోతుకూచి, కలం తీసికొని.

ఒక డజను పేర్లను ఖరారు చేశారు. అందులో జాషువా, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, పూతలపట్టు శ్రీరాములురెడ్డి గార్లు మాత్రం బ్రాహ్మణేతరులు.

బ్రాహ్మణేతరులలోను, హరిజనులలోను సమస్థాయికి వచ్చిన వాళ్ళున్నప్పుడు - అట్టి వాళ్ళను ప్రధాన పంక్తికి చేర్చుకొంటూ వుండా లనేది భీమన్న విధానం. జాతి సమైక్యానికి ఇది ప్రధాన విధానం కావా లంటా డీయన. ఇద్దరు సమానులైన సమర్థులున్నప్పుడు, అందులో క్రింది కులం వాడికి అధికతర ప్రోత్సాహ మివ్వాలి. కుల విభేదాలు తొలిగే వరకు, కుల నిర్మూలన జరిగే వరకు ఈ విధానం కొనసాగాలి.

ఈ ఇద్దరూ తయారు చేసిన జాబితాను చూచి పెద్ద లెవరూ మాట్లాడలేదు. కృష్ణశాస్త్రి గారు మాత్రం తనకు సన్మానం అక్కరలే దన్నారు. తన పేరుకు బదులు కాటూరి వారి పేరు చేర్చమన్నారు. ఆ మార్పుకు భీమన్న ఒప్పుకోలేదు.

సన్మానితులను గురించిన సైటేషనులను వ్రాసే బాధ్యత కూడ భీమన్న మీదే పడింది. ఒక్కొక్కరిని గురించి ఒకొక్క మహా గ్రంథమే వ్రాయతగిన మహా రచయితలు వారంతా. ఒకొక్క చిన్న పేజీలో ఇరికించడం ఏలా? ఆలోచిస్తూ కూర్చున్న భీమన్న వద్దకు ఆదృష్టం కొద్దీ రామకోటి శాస్త్రిగారు వచ్చారు చూడ్డాని కని. ఇద్దరూ కలిసి పన్నెండు మందిని గురించీ పన్నెండు పేజీల మేటరు వ్రాసి పారేశా రొక గంట సేపటిలో. చాల క్లుప్తంలో ఎంతో అందంగా వచ్చాయా సైటేషనులు. సభలో భీమన్నే చదివాడు వాటిని - గోపాలరెడ్డి గారు తొందర పెట్టే కొలదీ కంఠ స్వరాన్నీ, వేగాన్నీ పెంచిస్తూ.

కప్పలు కొన్ని నూతి యొర
కట్టున కూర్చొని, "నేను గొప్ప, నే
గొప్ప" యిటంచు చెప్పుకొని,
గ్రుడ్డులకున దిగునట్లు భారత
మ్మిప్పుడు చిట్లియున్నది; ఇ
దే ఘన మంచు తలంచు చున్న; దీ
మువ్వను బావి, జాతికి స
ముజ్వల భావికి త్రోప చూవుమా!

—ఆగస్టు విప్లవము
(ప్రకృతిలో మానవ ప్రకృతి)

136. మిత్రుల, పత్రికల పాత్ర

"పనంతా చేస్తున్నది మీరు. కార్యక్రమాన్ని నడుపుతున్నది మీరు. మీ పేరెక్కడాలేదు. ఇదేం బాగులేదు సార్!" అన్నారు భాస్కర భట్ల కృష్ణారావుగారు-సభలకు మరో వారం వుందనగా.

"ముఖ్యమంత్రిగారి సహకార మంతా మీవల్ల వచ్చిందే. మీ రెందుకు ఈ అవకాశాన్ని వుపయోగించుకోరు? మీరే ఎందుకు ముందుండరు? పైగా మీ పేరు వూరు కూడ ఇందులో లేకపోయి!" అన్నారు తురగా కృష్ణమోహనరావుగారు కృష్ణశాస్త్రిగారి వుద్దేశం కూడ ఇదే నన్నారు వారు. కార్యవర్గంలో మార్పులు తేవా లన్నారు. ఆకాశవాణి వెనుక వున్న కొండల్లో జరిగా యా సంప్రతింపులు ఒక సాయంత్రం.

వారి సూచనలను భీమన్న అంగీకరించలేదు. ఆ సూచనలకు వెనుక వున్న భావం పోతుకూచికి వ్యతిరేకమై నట్టిది. అది భీమన్నకు ఇష్టం కానిది.

"ఈ రోజున నా ఇష్టం వేదంలా చలామణీ అవుతున్నమాట నిజమే. ఇదొక అపూర్వమైన పరిస్థితి నా జీవితంలో. దీన్ని నా సొంతానికి ఉపయోగించు కోలేను. అది నాకు చేతకాదు కూడ. నా కేదో ఒక అవకాశం వచ్చింది. దాన్ని పూర్తిగా సాహిత్యలోకం కోసమే ఉపయోగిస్తాను. ఈ కర్తవ్య నిర్వహణలో నాకు అన్ని విధాలా తోడ్పడుతున్నవాడు, సాహితీవేత్త, కార్యసాధకుడు ఒక్క-సాంబశివరావే. నాకు పేరూ అక్కర్లేదు, పైసా అక్కర్లేదు. నాకు కావలసింది పని. నా భావం, నావిధానం ఒక్క పోతుకూచికి తప్ప మరొకళ్ళకి అవగాహనకాదు" అన్నాడు భీమన్న.

ఆ విధంగా ఒక బలమైన మిత్రవర్గం శత్రువర్గంగా చీలిపోయింది భీమన్న నుంచి.

తరిపిరాల విశ్వం, జె. బాపురెడ్డి, ఎన్. యాదగిరరెడ్డి, వేమరాజు నరసింహారావు, భద్రిరాజు వంటి నవయువకు లంతా ఆ నాడు భీమన్న కూడా వుండి కార్యక్రమాలను నిర్వహించారు.

సభలు జరుగుతుండగా "వెల్లువలో పూచిక పుల్లలు" నవల ప్రతులను సభలో పెద్దలకు భాస్కరభట్ల స్వయంగా ఇస్తుండటం చూశాడు భీమన్న. తనకు అంతప్రేమతో అంకితమిచ్చిన నవల ప్రతిని స్వయంగా ఇవ్వలేక పోయాడాయన! ఆ క్షణంలో ఉభయుల మనస్సులూ ఎంతగా కొట్టుకు లాడాయో!

ఆ తర్వాత చాలా కాలానికి భాస్కరభట్ల తిరిగి భీమన్నకు చేరువ అయాడు. స్నేహం పునరుజ్జీవిత మయింది. తురగా మాత్రం సమాధాన పడలేక పోయాడు. ఎంత ముఖ్య కార్యక్రమాలైనా కానీ, తన వార్తా ప్రసారాలలో భీమన్న పేరెక్కడా వినపడకుండా జాగ్రత్త పడేవాడు. ఈ ద్వేషానికి వెనక గల భగ్న స్నేహాన్నే తలచుకొంటూ వుంటాడు భీమన్న ఈనాటికి.

సభల విషయంలో కూడా భీమన్న పేరు కనిపించకుండా జాగ్రత్త పడ్డారు పత్రికలవాళ్ళు. మొత్తంమీద సభలకే పత్రికలు వ్యతిరేకంగా వున్నై. ఏదీ పట్టించుకోలేదు భీమన్న. పదవిలో వున్న వారి ప్రక్కన నిలబడడ మంటేనే ఎలర్జీ ఈయనకు. చివరకు సంజీవయ్యగారితో కూడా లే డీయన ఆ సభల ఏ ఫొటోలోనూ. పదవికీ, ప్రచారానికీ అంత దూరంలో వుండిపోయాడు - అంతా తానే నడుపుతూ కూడ!

సభల తుది సమావేశం కృష్ణశాస్త్రిగారి అధ్యక్షతన జరిగింది. ఆయన సభలను దుయ్యబడుతూ మాట్లాడారు. అంత వైభవంగా జరిగిన సభలతో అదొక్కటే అపశృతి. ఆ సభలోనే చివరి ఉపన్యాసకులు తాపీ ధర్మారావుగారు. "సాహిత్య రంగంలో పులుల్నీ, మేకల్నీ ఒక చెరువు నీరు తాగించారు భీమన్నగారు" అంటూ ముగించా రాయన తన ప్రసంగాన్ని. ఈ మాటను మాత్రం ప్రకటించాయి కొన్ని మిత్ర పత్రికలు.

"అఖిల భారత తెలుగు రచయితల మహాసభ" అనే పేరుతో ఒక శాశ్వత సంస్థను ఏర్పాటు చేశాము. దానికి అధ్యక్షులుగా సంజీవయ్యగారు, ఉపాధ్యక్షుడుగా భీమన్న, ప్రధాన కార్యదర్శిగా పోతుకూచి ఎన్నుకోబడ్డారు. రెండేండ్ల కొకసారి జరిగే ఈ సభ సమావేశాలకో నేబిదాకా భీమన్న ప్రముఖ పాత్ర వహిస్తూనే వున్నాడు.

"నా బహు శాస్త్రేషణమ్మున నాకు
చిక్కిన రత్నాలు చేకొమ్ము రెండు,
ప్రయరీతి జగమును ప్రేమింపు మెపుడు
మాత్యాణమును దీర్చి మరి చచ్చిపొమ్ము!"

—ప్రణయ పారమ్యం (ప్రకృతిలో మానవ ప్రకృతి)

137. ఆంధ్ర నలంద

1954 - 55 ప్రాంతం నుంచే కోగంటి దుర్గామల్లికార్జునరావు గారు తమ భారతీ సమితి, భారతీ సన్మాన సంఘం సంస్థల తరపున భీమన్నకు సన్మానం చేయడానికి తలపెట్టి, తేదీ కోసం లేఖలు వ్రాస్తూ వుండేవారు.

జాస్తి వెంకటనరసయ్యగారికి భీమన్న పట్ల విశేషమైన వాత్సల్యం. జాస్తివారూ, కోగంటివారూ ఆనాటి సాహిత్య రంగంలో వర్ధమాన కవులకు కల్పతరువూ, పారిజాతమూ. భీమన్నకు మధురకవి బిరుదమూ, నూటపదార్లూ ఇచ్చి సన్మానం జరపాలని వారి ఉద్దేశం. అయితే భీమన్న అక్కడకు వెళ్ళడం పడనేలేదు.

ఎంతోకాలంగా కోరుతున్న వారి వద్దకు వెళ్ళడానికి తీరికలేని భీమన్న 1959లో అనుకోని రీతిగా సత్తెనపల్లి వెళ్ళి అక్కడ శ్రీ వీరయార్య సాహితీ సంస్థవారి సన్మానాన్ని అందుకున్నాడు. ఆ సంస్థ నిర్వాహకులు బోడేపూడి వెంకటరావుగారు. ప్రోత్సాహకురాలు సాధువమ్మగారు. తన సర్వస్వాన్ని సమాజసేవకు, ముఖ్యంగా హరిజన సేవకు అంకితం చేసిన త్యాగశీల, మహాశక్తి ఆమె. అప్పటికి సత్తెనపల్లిలో ఒక హరిజన బాలికల హాస్టలును, వృత్తి విద్యా కేంద్రాన్ని నడుపుతూ వుంది. భీమన్న సత్తెనపల్లి వెళ్ళడానికి ప్రధాన ప్రోత్సాహం సాధువమ్మగారే.

భీమన్న ముందుగా గుంటూరు వెళ్ళి అక్కడనుంచి కొలకలూరి ఈనాక్ గారిని తోడుతీసికొని, సత్తెనపల్లి వెళ్ళాడు.

అచలసిద్ధులైన వీరయార్యుల పేర స్థాపితమైన ఆ సంస్థవారు ప్రతి సంవత్సరమూ ఒక్కొక్క ప్రసిద్ధ కవిని పిల్చి సన్మానిస్తూ వుంటారు-స్వర్ణాంగుళీయంతో. ఆ సంవత్సరం భీమన్నను పిల్చారు. సన్మాన సభకు అధ్యక్షులు డాక్టర్ ఆదుసుమిల్లి నారాయణరావుగారు. వారు గుడివాడలోని ఆంధ్ర నలంద పీఠాధిపతులు.

భీమన్నతో కాని, భీమన్న సాహిత్యంతోకాని అంతవరకు పరిచయం లేని నారాయణరావు గారు మధు గీత, దీపసభ, కావ్యకుసుమాలు చూచి ముగ్ధులైపోయి, భీమన్నను ఆంధ్ర నలందకు ఆహ్వానించారు.

ఆంధ్ర నలంద సన్మానమంటే చాల గొప్ప వాళ్ళకు లభించే సన్మానం. నారాయణరావు గారి ఆహ్వానం భీమన్నను ఉక్కిరి బిక్కిరి చేసింది. సాధువమ్మ గారి సౌహార్ద్ర శక్తికి అంజలి ఘటించాడు.

1960 జనవరి 17న ఆంధ్ర నలంద సన్మానించింది భీమన్నను. రజత ఫలకంపై, సువర్ణాక్షరాలతో, పద్యాలలో లిఖించబడ్డ సన్మాన పత్రాన్ని అందు కొంటున్నప్పటి భీమన్న మనఃస్థితి అదొక ఆనంద బ్రహ్మ స్థితి. సన్మానించిన నారాయణరావు గారు కాని, కవి ప్రశంస చేసిన నిడదవోలు వెంకట రావు, నరసింహారావు వంటి ప్రముఖ సాహితీ వేత్తలు కాని భీమన్నకు కనిపించనే లేదు. అంతా ఒక దేమూర్తి - ఏకైక బ్రాహ్మీ మూర్తి!

సన్మానానికి కృతజ్ఞత చెప్పటానికి కూడ భీమన్నకు మాటలు దొరక లేదు. మౌనమే మహా ప్రసంగ మయింది.

వ్రాసి, ముగించి, తృప్తి పడి,
భద్రముగా నొక సంపుటమ్మునన్
మూసిన కావ్యమేను; క్షణ
మొక్క పుటమ్మగ నన్ను త్రిప్పుచున్
ఈ సుకుమార కాల రమ
ణీమణి మెల్లన పాడ సాగె నన్
వ్రాసిన దేమొ? ఎంతొ? ఎది
రాగమొ? భోగ మి దెంత కాలమో!

— భీ. కా. కుసుమాలు

138. భారతీయ రచయితలు

భీమన్న మద్రాసులో ఆంధ్రప్రభకు ఉప సంపాదకుడుగా వుంటున్న రోజులలోనే భారతీయ రచయితల సంఘంతో పరిచయం ఏర్పడింది. బహుశః 1954 చివరలో కావచ్చు, ఆంధ్ర యూనివర్సిటీ కాన్వొకేషను కోసం ఈయన భార్యతోను, వదిన జానకమ్మ గారితోను వాల్తేరు వెళ్ళినప్పుడు, అక్కడ పీరికి భండారు సదాశివరావు గారి ఆతిథ్యం లభించింది. సదాశివరావు గారు భారతీయ రచయితల సంఘానికి ఆత్మ స్థానీయులు.

అక్కడ సెనెటూ, కాన్వొకేషనూ చూచుకొని—బీచినీ, కొండలనూ, దర్శించి, సింహాచలం వెళ్ళి వచ్చి — సదాశివరావు గారింట భోజనాలు చేసి, రైలుకు బైలు దేరారు పిళ్ళు ఒక రోజున. సదాశివరావు గారూ, వారి

మిత్రులూ స్టేషనుకు వచ్చారు సాగనంప డానికి . వారి మర్యాదలు , గౌరవాలు భారతీయమైన ఆత్యున్నత స్థాయికి చెంది వుండి , అపూర్వాను భూతిని చేకూర్చాయి భీమన్నకు .

రైలు ఇక కదలబోతున్నదనగా , ఆ పక్క పెట్టె నుంచి ఉరుకు తున్న ఒక యువకుణ్ని ఒడిసి పట్టుకొని పెదేలున కొట్టారు సదాశివరావు గారు . వాడు బొక్క బోర్లా పడ్డాడు ప్లాటు ఫారం మీద . వాడి చేతిలోని పర్సు అల్లంత దూరంలో పడింది . ఆ పెట్టెలోని ఒక లాల్చీ పెద్ద మనిషి జేబులు తడుము కుంటూ క్రిందికి దూకి పర్సు తీసుకున్నాడు . జనం మూగారు , పోలీసులు వచ్చారు . అదంతా మామూలు తంతే . అదేమీ పట్టలేదు సదాశివరావు గారికి . ఆ సంఘటనతో తమ కేమీ సంబంధలేనంత అనాసక్తంగా , ప్రశాంతంగా , నవ్వుతూ వీడ్కోలు చెప్పారు భీమన్నకు .

"ధీర శాంతం , ధర్మవీరం అనే మాటల అర్థాన్ని మానవ రూపంలో ఆప్పుడు చూశాన"ంటాడు భీమన్న . దొంగను కనిపెట్టడంలోనే కాదు , వాణ్ణి పట్టుకోవడంలో కూడ సదాశివరావు గారు ప్రదర్శించిన నైశిత్యం , నైపుణ్యం , వేగం , సాహసం , ఎంత ప్రచండమైనవో - అందులో లగ్నంకాని ఆయన అనాసక్త మనస్తత్వం , నిర్వికారత అంత ఆధ్యాత్మిక మైనట్టివి . ఎంతటి ధార్మిక వీర సామాజిక స్పృహ ! అన్యాయాన్ని , అధర్మాన్ని సహించలేని ఈ లక్షణం మన వీర యువకులలో కొంత మందికైనా వుంటే !

ఈ సంఘటన నేటికి ఇప్పుడే జరిగినంత స్పష్టంగా జ్ఞాపకం వున్నది భీమన్నకు .

భాగ్యనగరం వచ్చిన తర్వాత భారతీయ రచయితల సంఘంతో భీమన్న సాహిత్యాను బంధం బాగా బలపడింది . సికిందరాబాదులో అప్పటికి "శారద" పత్రికను నడుపుతున్న చంద్రమౌళి వెంకటకృష్ణ , గుంటూరు హిందూ కాలేజి లెక్చరరు మన్నవ గిరిధరరావు గార్లతోను , ఇంకా వరంగల్లు , సిద్ధిపేటలకు చెందిన అనేక మంది యువరచయితలతోను స్నేహాలు కలిసినై .

1958లో భారతీయ రచయితల సంఘం భాగ్యనగర శాఖ భీమన్న అధ్యక్షత క్రిందనే ప్రారంభించ బడింది. వరంగల్లులోను, సిద్ధిపేటలోను జరిగిన రాష్ట్ర సభలలో కవి సమ్మేళనలకు భీమన్నే అధ్యక్షత వహించాడు.

1959 చివరలో జరిగిన సిద్ధిపేట సభలకు కారులో బైలుదేరిన భీమన్న నగరం పొలిమేరల అవతల, ఒక రోడ్డు వెంట చాలదూరం పోవడం – అది సిద్ధిపేట రోడ్డు కాదని తెలిసికొని, తిరిగి వచ్చే ట్రైం లేక, ఒక బండి దారిని అడవులకు అడ్డపడి, మధ్యలో చిక్కు పడటం ఎంతో ఆద్భుతావహంగా వుంటుంది. ఆది పుట్టపర్తి శ్రీనివాసాచార్యుల వారి పాతకారు. దానిలో వున్న వారు వీరిద్దరే!

"మన సరస్వతి మన దేశంలో లేదురా. ఆమె ఏ నాడో అమెరికా రష్యా లకు వలసపోయింది. మనం మన ఆర్షత్వాన్ని పోగొట్టుకొన్నాం. సామాజిక సంకుచిత తత్వాలతో, కాలదోషం పట్టిన ఆచార విశ్వాసాలతో ప్రతిభను, ప్రగతి శీలతనూ నాశనం చేసుకున్నాం. ధార్మిక పునరుజ్జీవన కృషికి దీక్షా బద్ధులమైతే తప్ప, మన సరస్వతి మన దగ్గరకు తిరిగి రాదురా" అంటూ, సింహ గర్జా స్వరంతో పుట్టపర్తి వారు సిద్ధిపేట సభావేదిక నుంచి ఆనాడు చేసిన ప్రసంగం కూడ భీమన్నకు నేటికీ కర్ణ పుటాలలో గింగురు మంటూనే వుంది.

ఎవరు వింటారు? పూర్వం ఎవరు విన్నారు? ఇప్పుడు మాత్రం ఎవరు వింటున్నారు?

ఆ సభల సందర్భంలో ఏర్పాటు చేయబడిన పుస్తక ప్రదర్శనలో భీమన్న రచనలు చాలానే అమ్ముడు పోయినై. రాజయ్యగారి చిత్రకళా ప్రద ర్శన నుంచి, వారి నడిగి భీమన్న తెచ్చుకొన్న అజంతా చిత్రప్రతే తర్వాత "పైరు పాట"కు ముఖచిత్ర మయింది.

శ్రుతి హితముల్, హిత ప్రణయ
సుందరముల్, సుహృదేక చింత నాం
చిత శివముల్, సమష్టి రస
సింధు ప్రియేందు కళేద్ధ కామ మో

హితములు - తద్వనిన్ వెలయు
హ్రీలును, శ్రీలును; కాని - తాను ని
ర్జిత సకలేంద్రియుండు; జన
జీవన శీలుడు! లోక మెట్లగున్?

—అశోక వనిలో రాముడు

139. వేదాలకేసి మళ్ళుదాం

"బేక్‌టు వేదాస్" అనే నినాదాన్ని భీమన్న ఇచ్చిం దా రోజుల్లోనే. బహుళా భారతీయ రచయితల వరంగల్ మహాసభల (1982) సందర్భంలో అనుకోవచ్చు.

పాండిత్య ప్రకర్షకాలైన పెద్ద పెద్ద ఉపన్యాసా లివ్వడం భీమన్నకు చేతకాదు. చిన్న చిన్న నినాదాలతో, చమత్కార ప్రసంగాలతో, చనువుతో, స్నేహంతో, సత్యాన్ని సూటిగా వాచ్యంచేసి చెప్పే ధోరణితో సభను రంజిస్తూ వుండేవాడు.

ఆ సభ లప్పుడో - ఆ తర్వాత 1965లో జరిగిన రాష్ట్ర ఉపాధ్యాయ మహాసభల కవిసమ్మేళనలో పాల్గొనడానికి వెళ్ళినప్పుడో - బాగా జ్ఞాపకం లేక పోయినా, వరంగల్లులో మహాకవి కాళోజీ నారాయణరావు గారింట ఆతిథ్యం మాత్రం చక్కగా జ్ఞాపక ముంది భీమన్నకు. నారాయణరావుగారి అన్నగారు రామేశ్వరరావుగారు. ఆయన గొప్ప వ్యక్తి. తమ్ముడుగా లక్ష్మణు డెంత ఆదర్శ ప్రాయుడో, అన్నగా రామేశ్వరరావు గారంత ఆదర్శప్రాయు లట. కాళోజీ అంతటి గొప్పకవి మాత్రమే కాక, పరుషకవి కూడా కావడానికి కారణం అన్నగారి అతి గారాబమే అంటాడీయన.

తన చిన్నప్పుడు, తండ్రి పల్లయ్యగారు చెప్పిన ఒక మాట భీమన్నకు తరచు అనుభవంలోకి వస్తూనేవుంది. ఆయన పొడవైన ఒక లేత పురుగుడు జువ్వను తీసికొని దాని రెండు చివరల మధ్య దూరమెంత అని అడిగారు. దూరం చాలానే వుంది. ఆ జువ్వను గుండ్రంగా వంచారు. రెండు చివరలూ కలిశాయి!

సృష్టి కాని, జీవితం కాని ఏదీ సరళరేఖ కాదు. ఏదీ దేనికీ విరుద్ధం కాదు. ప్రతి విషయమూ ఒక వలయం. ప్రతి బిందువూ రెండు వైరుద్ధ్యాల కలయిక.

బ్రాహ్మలూ, హరిజనులూ కలిసినంత అన్యోన్యంగా మరే రెండు కులాలూ కలవ్వు. ఇది భీమన్న అనుభవమే కాదు. ప్రస్తుత సామాజిక వ్యవస్థలో కనిపిస్తున్న మార్పులుకూడ ఇందుకు నిదర్శనమే. "వేదాలకేసి మళ్ళుదాం" అనే భీమన్న నినాదానికి మూలం ఈ ప్రకృతి సత్యమే.

ఉపజ్ఞకు, ప్రతిభకు మూలాధారమైన భారతజాతి ఎందుకిలా నిష్క్రియకు లోనై నిశ్చేతనమై పోయింది? ఏ శాపం దీని కిలాంటి జడత్వం తెచ్చిపెట్టింది? ప్రపంచాన్ని ఆర్యం చెయ్యమన్న ఋగ్వేదం అమల్లో ఎందుకు విఫలమయింది? ప్రపంచమాట దేవు డెరుగు. ఈ దేశంలోకూడ ఆర్షధర్మం నిలవలేక పోతున్నదే? పైగా అన్యమతాల ప్రాబల్యం ఎక్కువై పోతున్నదే! వేదద్రోహానికి కూడ ఈ హిందూ సమాజం ఎందుకు ఒడిగడుతున్నది?

ఆర్ష సంస్కారం నరనరానా జీర్ణించుకున్న భీమన్నను ఈ ప్రశ్నలన్నీ కందిరీగల్లా చుట్టు ముట్టి వేధిస్తూనే వుండేవి చిన్నప్పటి నుంచీ.

చిన్నప్పు డొకిసారి కొబ్బరి సూద తోటలో పని చేస్తుండగా, ఆ మొక్కల ఆకుల గుబురులో గూడు కట్టుకొన్న కందిరీగలు బెదరి తరిమి కుట్టిన అనుభవం భీమన్న కుంది. అది శారీరకం. ఇది మానసికం.

ఈనాడు హిందూ సమాజం అనుసరిస్తున్న ప్రతి ఆచారమూ అవైదికం గానే కనిపిస్తుంది భీమన్నకు. అసలు హిందూ పదమే మ్లేచ్ఛ మంటూ దీయన. ఉపనిషత్కాలపు సమానత్వ వ్యవస్థ నుంచి దిగజారిపోయి, తాము ఆర్ష సంప్రదాయానికి చెందిన వార మన్న జ్ఞానమే మాసిపోయి, కేవల బాహ్యాలైన కులాలను కుల తత్త్వాలనూ పెంచుకుంటూ ఛిన్నా భిన్నమైపోయి, వట్టి బానిస జాతిగా మారిపోయిం దీ సనాతన జాతి. ఎవరూ ఆలోచించడం లేదు. పీఠాధిపతులూ, బాబాలు ఇంకా పెంచుతున్నారు ప్రజల మూర్ఖత్వాన్ని. దీని కేమిటి పరిష్కారం? ఈ ప్రజల అజ్ఞానాన్ని ఆసరాగా తీసికొని తాము సుఖంగా బ్రతుకుతున్నారు అంటాడు.

భారతీయ రచయితల సంఘంతో భీమన్నకు గల అనుబంధం క్రమంగా సడలి పోతూ వచ్చింది. భీమన్న తన ఉద్బోధతో, బాధతో ముందుకు సాగి పోయాడు. అఖిల భారత తెలుగు రచయితల మహా సభ కార్యక్రమాలలో నిమగ్నమై పోయాడు.

కృష్ణాంతో విశ్వమార్యం అన్నది ఆర్యమతం,
మనం మన ప్రక్క ఆర్యుణ్ణే అస్పృశ్యు డంటూ
పర మతాల లోకి తరిమేస్తున్నాం।
మత పిచ్చిని సహించవచ్చు మూర్ఖత్వంగా,
కుల పిచ్చిని క్షమించడం వేద ద్రోహం!

— టుమ్రీలు

140. ఒకొక దీపం

సంగీత నాటక అకాడమీ ప్రారంభ సమావేశాల సందర్భంలో కాబోలు, 1959 మార్చిలో అనుకుంటాను, భాగ్యనగరంలో సంపత్కుమార్ బృందం నృత్య ప్రదర్శన లిచ్చారు. అందులో వారి ప్రారంభనృత్యం "ఒకొక దీపం".

భీమన్న అంతకు పూర్వం ఎప్పుడో ప్రాసి, ఆంధ్రప్రభ దీపావళి ప్రత్యేక సంచికలో ప్రకటించిన గేయం అది.

"ఒకో దీపం" అని భీమన్న ప్రాస్తే, "ఒకొక" అనమని నార్లవా రనడం, అక్కడేవున్న తిరుమల రామచంద్ర నార్లవారిని సమర్థించడంకూడ భీమన్నకు జ్ఞాపకం వుంది. అయితే దాని విషయం అప్పుడే మరచిపోయిన భీమన్న ఆ గేయం ఒక ప్రసిద్ధ నాట్య బృందంవారి నృత్య భారతికి పూజాపీఠం కావడం తొలిసారిగా చూచి, ఆశ్చర్య ముగ్ధుడై పోయాడు.

వివిధ రంగాలలో తెలుగు ప్రతిభకు తరతరాలుగా దీపం పెడుతూవచ్చిన మహనీయులకు కృతజ్ఞతతో ఒకొక దీపాన్ని అర్పిస్తున్న గేయం అది. దానికి సందర్భోచితమైన నృత్యాన్ని సమకూర్చిన సంపత్కుమార్‌గారి ప్రతిభకు జోహారులర్పించాడు భీమన్న. ఒకొక్క దీపం పైనుంచి దిగివచ్చే ఆ దృశ్యం పరమ రమణీయం.

ఆ కాలంలోనే భీమన్న సంస్కృతీ సంవర్ధక సమితి(1959)ని స్థాపించడం జరిగింది. మిత్రుడూ, కాంగ్రెసు హరిజన శాసన సభ్యుడూ అయిన నంబూరి శ్రీనివాసరావు మంచి కవీ, గాయకుడూ, నర్తకుడూను. ఆయన ప్రతిభను సమాజ శ్రేయస్సువైపు మళ్ళించే ఉద్దేశంతో సంస్కృతీ సంవర్ధక సమితిని, మెర్క్యూరీ ఫిలింసు అనే సినీ సంస్థను భీమన్నే నెలకొల్పి పెట్టాడు. వాటికి శ్రీనివాసరావే అధ్యక్షుడూ, అధిపతీ. డాక్టర్ ఎమ్. ఏ ఖాను కార్యదర్శి. తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, భూషి రామదాసు, ఆడబాల వీరాస్వామి రాజా వంటి ప్రముఖులు కార్యవర్గం.

సంవర్ధక సమితి తరఫున సాహిత్య అకాడమీ సభ్యుడుకూడా అయాడు శ్రీనివాసరావు. అయితే దీక్ష, త్యాగం లోపించడంవల్ల అందులో ఏ ఒక్క సంస్థనూ పెంచుకోలేక పోయా డాయన.

కళా సాంస్కృతిక రంగాలలో కార్యకలాపాల కోసం హరిజన యువకులకు ఎట్టి సంస్థలూ లేవు. ఇతర సంస్థలలో చేరే ధైర్యసాహసాలు వీళ్ళ కింకా సమకూరలేదు. అందుకోసం "జగజ్జీవన కళాపరిషత్తు" అనే మరో సంస్థనుకూడ నెలకొల్పాడు భీమన్న. దానికి రెవిన్యూ అధికారి కె. చంద్రయ్యగారు కార్యదర్శి.

1961 ఫిబ్రవరి 5, 6 తేదీలలో — సంజీవయ్యగారు ముఖ్యమంత్రిగా వుండగా — అఖిల భారత హరిజన శాసన, పార్లమెంటు సభ్యుల మహాసభలు జరిగినై. ఆ సభలలో ప్రధాని నెహ్రూ, కేంద్ర మంత్రి జగజ్జీవన్‌రాం పాల్గొన్నారు. ఆ సభల సందర్భంలో రెండు రోజుల పాటు సుమారు నలభై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాడు భీమన్న. జానపద సంగీత, నృత్య, నాటక ప్రక్రియలకు చెందిన ఆ కార్యక్రమా లన్నింటిలోను పాల్గొన్న వాళ్ళంతా హరిజన గిరిజన కళాకారులే. నల్గొండ కాంగ్రెసు అధినేతలలో ప్రముఖులైన రాజరత్నం దంపతులు కూడ ఆ కళా కారులలో వున్నారు.

మిత్రుడు మోదుకూరి జాన్సన్ సహకారంతో ఈ కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాడు భీమన్న. హరిజనులలో సాంస్కృతి

కోజ్జీవనాన్ని ఒక ఉద్యమంగా నిర్వహించడం కోసం జగజ్జీవన కళా పరిషత్తును నెలకొల్పాడు. హరిజనులలో ఉన్నతోద్యోగు లంతా దాని కార్యవర్గమే. దాన్ని ఆ సభలో జగజ్జీవనరాం గారి చేతనే ఇనాగరేట్ చేయించాడు. మామా పేట లలో, యువకులలో కళా సంస్కృతులను ప్రోత్సహించడానికి సాంఘిక సంక్షేమ శాఖలో ఒక కల్చరల్ ఆఫీసరు ఉద్యోగాన్ని సృష్టింప జేశాడు. అయితే–ఆ తర్వాత సంజీవయ్య గారు ముఖ్యమంత్రిగా కొనసాగకపోవడం వల్ల ఆ రంగంలో భీమన్న కృషి తిన్నగా ఫలించ లేదు.

"ఈ మామా విద్యావంతుల మీద నేను పెట్టుకొన్న ఆశలు అడియాస లైనై" అంటూ తన అవసాన దశలో డాక్టర్ అంబేద్కర్ వెలిబుచ్చిన ఆవేద నలోని కఠోరాగ్నే భీమన్న హృదయాన్ని కూడ వేల్చి పారేసింది. అయినా నిరుత్సాహ పడ లేదు. తన నిరంతర విప్లవోద్బోధతో ముందుకు సాగిపో సాగాడు.

సాహిత్య, సంఘ నిర్మాణ రంగాలలోనే గాక - వాస్తవ జీవితాలలో కూడ భీమన్న వెలిగించిన దీపా లనేకం. ఎందరో నిరాశా పూరితులకు ధైర్యో త్సాహాలు కలిగించాడు. తెగిపోయిన అనుబంధాలను కలిపాడు. నిరుద్యోగు లకు ఉద్యోగా లిచ్చాడు, ఇప్పించాడు. మంత్రుల రికమండేషను లున్న అభ్యర్థులకు నచ్చచెప్పి, ఏ దిక్కూ లేని వారికే ప్రిఫరెన్సు ఇచ్చేవాడు. సహాయం కోరి భీమన్న వద్దకు వచ్చిన వారిలో దిగులుగా తిరిగిపోయిన వా రెవరూ లేరంటే అది నిండు నిజం. ఈ విషయంలో కుల మత వర్గ భేదం ఏ మాత్రమూ చూపలే దీయన.

వేడి, వెలుతురూ కల ఈయన దీపాలు స్వయం శక్తి కలవి. స్థిరత్వం కలిగి నట్టివి. అమృతాత్మకాలు.

తీరని కోర్కెలే ప్రగతి
తీర్థములై శమ వెంట భావనో
త్తీరము లందు మానవుని
త్రిప్పుకొనున్ : ఫల మిచ్చు నిత్య దీ

క్షీరధి గొల్చి చువ్వ నొకొ
కప్పు దొకొక్కటి : ప్రాణ గాధమొ
కోరిక లేక వెల్గుపెటు
గుండియలో అమృతప్రదీపముల్ ?
— ఆశోకవనికొ రాముడు

141. పైరుపాట ప్రదర్శన

అఖిలభారత తెలుగు రచయితల మహాసభలకు మూలబ్రహ్మ భీమన్నే అయినా - ఆ సభల సందర్భంలో ఈయన పేరూ, వూరూ ఎక్కడా కనిపించక పోవడం, కనీసం అప్పటి సాంస్కృతిక కార్యక్రమాలలో ఈయన ఒక పాటకు గాని, నాటికకు గాని స్థానం లేకపోవడం కనిపెట్టిన ఈయన మిత్రులు కొందరు తిరుగుబాటు తత్వం ప్రదర్శించి, వేరే ఒక సమాజాన్ని నెలకొల్పు కున్నారు. అదే సుఖేలా నికేతన్.

ఈ సుఖేలా నికేతన్ వ్యవస్థాపకులలో ముఖ్యులు మోదుకూరి జాన్సన్, భూషి రామదాసు, బొజ్జా తారకం, బి. విజయభారతి, ఎస్. వి. రమణారావు, శ్యామారావు, జి. రామకృష్ణారావు మున్నగువారు. మహిళా సంక్షేమశాఖ డైరెక్టరు బి. శకుంతలగారు అధ్యక్షురాలు.

భీమన్న సెనేటు మీటింగుకోసం విశాఖపట్నం వెళ్ళినప్పుడెల్లా అక్కడి రాజమహల్‌లోనే బస చేసేవాడు. విశాఖమండల యువరచయితలలో ముఖ్యంగా జి. అచ్యుతరామరాజు, రాచకొండ విశ్వనాధశాస్త్రి మున్నగువారితో కలిసి తిరుగుతూ వుండేవాడు. అటువంటి సందర్భాలలోనే ఎప్పుడో ఒకసారి మోదుకూరి జాన్సన్‌ను కలవడం తటస్థించింది. మోదుకూరి మంచి గాయకుడు, నటకుడు. అప్పటికక్కడ యూనివర్సిటీలో తాత్కాలిక ఉద్యోగంలో ఉన్నాడు.

ఆ విధంగా పరిచయమైన మోదుకూరి ఒకసారెప్పుడో హైదరాబాదు రాగా, ఆయనకు తన ఆఫీసులో ఉద్యోగం ఇచ్చాడు భీమన్న. కొద్దికాలం లోనే ఆయన, తన గానంద్వారా, స్నేహశీలత ద్వారా ఒక్క భీమన్నకూ, ఈయన

మిత్రులకే కాక మొత్తం భాగ్యనగర సహృదయ లోకానికే ప్రీతి పాత్రుడు కాగలిగాడు.

ఏదైనా ఒక సంస్థద్వారా మోదుకూరి ప్రతిభను ప్రజల కందించే ఉద్దేశం కూడా వుంది మిత్రులకు. సుఖేలా నికేతన్ అందుకు దోహదపడింది. భీమన్న గేయనాటిక పైరుపాటను సంగీత నృత్య నాటికగా ప్రదర్శించాలని తీర్మానించారు. అంతకు పూర్వమే మెర్క్యూరీ ఫిలిమ్స్ ఆవరణలో దేవులపల్లి రామానుజ రావుగారి అధ్యక్షతలో, పైరుపాట ముఖ్యమంత్రి సంజీవయ్యగారికి అంకితం ఇవ్వబడి వుంది. ఆయన సమక్షంలోనే దీనిని ప్రదర్శించా లనుకున్నారు. 1960 సెప్టెంబరులో ఆంధ్ర యువతీమండలి హాలులో, స్పీకరు కాశేశ్వరరావుగారి అధ్యక్షతలో ప్రదర్శన జరిగింది.

ఆ సందర్భంలో ప్రసంగిస్తూ డాక్టర్ దివాకర్ల వేంకటావధాని గారు "ఈయన పేరుకు భీముడే అయినా, సాహిత్య తత్వ రీత్యా కాముడు" అంటూ అభివర్ణించారు. ఈ వివరా లన్నీ ఆ సందర్భంలో ప్రకటించ బడ్డ భీమన్న సన్మాన సంచికలో చూడవచ్చు.

గిడుగు సీతాపతి, శ్రీవాత్సవ, విశ్వనాథ సత్యనారాయణ, యస్వీ జోగారావు, కంభంపాటి రామశాస్త్రి (తారకం), ఎన్. సి. ఎస్. వెంకటా చారి, గుర్రం జాషువా, బి. కృష్ణశాస్త్రి, జి. జె. సామ్యూల్, కోట సీతా రామశర్మ, అడుసుమిల్లి నారాయణరావు, జి. జోసపుకవి, బూర్గుల రామ కృష్ణారావు. నూతక్కి అబ్రహం, బి. ఎన్. మూర్తి, దాశరథి, గంటి జోగి సోమయాజి, నిడదవోలు వెంకటరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, ఆంధ్ర నలందా వార్ణ గద్య పద్య ప్రశంసలను కూడ చూడవచ్చు అందులో.

పైరుపాట సంగీత నృత్య ప్రదర్శనానికి మోదుకూరి సంగీతాన్ని, నరసింహం నృత్యాన్ని సమకూర్చగా - శారదా (శ్రీనివాసన్) అహల్య, మోదుకూరి పాడగా – నాయికగా పద్మరాణి, చెలికత్తెగా జయశ్రీ, నాయ కుడుగా లక్ష్మి నటించి ప్రదర్శనను రమణీయం చేశారు. ఈ అపూర్వ

ప్రయోగం నగరంలో అద్భుతమైన సంచలనాన్ని రేకెత్తించింది. తర్వాత ఎన్నోసార్లు ప్రదర్శించ బడింది. ఆకాశవాణిలో కూడ ప్రచారం చెయ్య బడిం దది.

అమృత మేదొ కావాలని
ఆర్రు చాచు ప్రతి మనిషీ
అమరుడు కాగల గుణ మొక
టైనా కలిగుం డొద్దా ?

గొంగళి వురుగును బోలి
కుటిల సీతి వదలి కొని
బంగరు రెక్కల తుమ్మెద
వైరమ్మ హూదోటకు ;

— వైరు పాట

142. లేపాక్షి దర్శనం

గొట్టిపాటి సుబ్బరాయలుగారు తాము వ్రాసిన " వికాస భారతా " న్ని ముఖ్యమంత్రి సంజీవయ్యగారికి అంకిత మిచ్చారు. అంకిత సభ 1960 నవంబరు 14న అనంతపురంలో జరిగింది. భీమన్న సభాధ్యక్షుడు.

అనంతపురం, రాయలసీమ నాయకులేకాక, హైదరాబాదునుంచి కూడ అనేకమంది ప్రముఖులు ఆనాటి సభలో పాల్గొన్నారు. కల్లూరి సుబ్బారావు, నండూరి రామకృష్ణమాచార్య, పి. వి. చౌదరి, పోతుకూచి సాంబశివరావు, అరిపిరాల విశ్వం మున్నగువారు కావ్య ప్రశంస చేశారు. రాయల భువన విజయాన్ని తలపింపజేసిన రాయలసీమ సహితీ సభ స్సది.

ఆ మరునాడు అనంతపురం జిల్లా కాంగ్రెసువారి పెద్ద కారును తీసికొని, మిత్రులతో లేపాక్షికి బయలుదేరాడు భీమన్న. దారిలో మామిళ్ళపల్లివద్ద కారు వైరు పగిలిపోగా, అది మామిడి (కుదురు)కి తనపైగల అనురాగ ప్రదర్శక మనిచెప్పి మిత్రుల్ని వుల్లాసపరిచాడు.

ఆ తర్వాత చరిత్ర ప్రసిద్ధమూ, వసుచరిత్రద్వారా సాహిత్య సిద్ధమూ అయిన పెనుగొండను దర్శించారు. అక్కడ హైస్కూల్లులో ఆప్పటి కప్పుడు తమకోసం ఏర్పాటైన సభలో భీమన్న "బొమ్మ" నుంచి కావ్యగానం చేశాడు. ఆది టేపురికార్డు కూడా చేయబడిం దప్పుడు.

హిందూపురంలో కల్లూరివా రింట కాఫీలు తాగి, లేపాక్షికి బయలుదేరారు. శిల్పచిత్ర సుందర కళాస్వర్గం లేపాక్షి. ఆంధ్ర కళాసరస్వతి సమ్యక్ సాక్షాత్కారం ఆది. ఆనందముగ్ధుడై పోయాడు భీమన్న.

ఆ తర్వాత అనంతపురం ఇంజనీరింగ్ కాలేజీ సాహితీ సమావేశంలో కావ్యగానం.

భీమన్న జీవితంలో ఎన్నో రసవత్తర ఘట్టాలకు స్పష్టా స్పష్ట స్మృతులే తప్ప వివరాలు లేవు.

1960 లోనే అనకాపల్లిలోని విజ్ఞాన సమితివారి సన్మానాన్ని అందు కున్నాడు భీమన్న. అక్కడ డాక్టర్ సుబ్బరాజుగారి ఆదరాన్నీ, ఔదార్యాన్నీ అమూల్య రత్నాలుగా హృదయంలో భద్రపరచుకున్నాడు.

అంతకుముందే శారదా గ్రంథాలయంవారి సన్మానం లభించి వుంది. ఆ సందర్భంలోనే అనకాపల్లి తనకు బహూకరించిన బెల్లపచ్చులతీపి ఇంకా ఈయన నాలుకపై నర్తిస్తూనే వుంది - శివశంకరస్వామి, డాక్టర్ జి. శ్రీరామమూర్తి మున్నగువారి ప్రశంసలతో లయ కలిపి.

పైరుచేలో పసిడి వువ్వుల పావలారా
కొలని గట్టున గుబురుమేనే గోవులారా
బాల మామిడిపూల తుమ్మెద బాలలారా
ప్రేమదేవత పెదవి కొరికే పికము లారా
సుఖములారా ! సుందరోష !
శోభలారా ! శుభ్రతారా

గేస్తులారా, దివ్యమైన స
మస్త మాధురి మమ్మిలారా
రండు రండిటు, రాగకాలపు
రామణీయక మెల్ల తెండు!

—పైరు పాట

143. ప్రతిభ - వ్యుత్పత్తి - అభ్యాసం

బీజ గతమైన మూలశక్తే ప్రతిభ అంటాడు భీమన్న.

పరిసరాలను బట్టి, పరిస్థితులను బట్టి, పోషణను బట్టి అది ఎదుగు తుంది, బలపడుతుంది, వికసిస్తుంది.

వ్యుత్పత్తి అంటే పాండిత్యం. అది గతాన్ని గురించి తెలుసుకోవడం. తాను లోకంలో అడుగు పెట్టే నాటికి లోకం పరిస్థితి ఏమిటి? అంత వరకు ఏం జరిగింది? అందులోని మంచి చెడ్డ లేమిటి? గతాన్ని పూర్తిగా అవగాహన చేసు కోవడమే పాండిత్యం.

ఇక - మూడోది అభ్యాసం. అభ్యాసమే జీవితం అంటాడు భీమన్న.

ప్రతిభలేని వాళ్ళెవళ్ళూ వుండరు. విత్తనం మొల కెత్తిం దంటే, దానిలో జీవశక్తి వున్న దన్నమాట. జీవశక్తి ఎప్పుడూ సృజనాత్మక మైనట్టిదే. అది అనేక రీతులలో వుండవచ్చు. బహుముఖంగానూ వికసించవచ్చు. మర్రీ కావచ్చు, తాడీ కావచ్చు. దేగా కావచ్చు, ఈగా కావచ్చు.

రామాయణం వ్రాసిన కవి ఎంతటి ప్రతిభావంతుడో, రాకెట్టును కని పెట్టిన విజ్ఞానీ అంతే ప్రతిభావంతుడు. ఒకే బెండకాయతో కూటు, పొరి యల్, పులుసు, సాంబారు కూడ చెయ్యగల హోటలు ఆయ్యరు కూడ ప్రతి భలో ఎవరికీ తీసిపోడు.

అంటే - ప్రతిభలేని మనిషే వుండడు. సృజనాత్మకమైన జీవశక్తే ప్రతిభ. అయితే - దాని ప్రవృత్తిని బట్టి దాని వృత్తి వుండాలి. స్వభావాన్ని బట్టి వికసించే వీలుండాలి.

చెట్టుకు ఎరువు, శరీరానికి తిండి వలెనే - ప్రతిభకు వ్యుత్పన్నత అవసరం. వ్యుత్పన్నత, అంటే విషయ విజ్ఞానం లేకుండా ప్రతిభ వికసించదు. అందుకు పాత గ్రంథాలు చదవాలి. సమకాలీను లేమి వ్రాస్తున్నారో గమనించాలి, పరిశీలించాలి. ప్రత్యక్షానుభవం గడించాలి. ఇదంతా ప్రతిభ పెరగడానికి, బలపడ డానికి, వికసించ డానికి ఎరువు లాంటి దన్నమాట.

అంత మాత్రం చేత చాలదు. విత్తనం మంచిదే. ఎరువు కూడ బాగానే వేశాం. అంతటితో వూరుకుంటే లాభం లేదు. మొక్కకు పురుగుపట్టవచ్చు. మేకలు మేసి పోవచ్చు. కిట్టని వాళ్ళు చివుళ్ళను పుడికి వెయ్యవచ్చు. అనేక ప్రమాదాల నుంచి దానిని రక్షించుకొంటూ రావాలి. అంటే - దానికి నిత్య పోషణ జరగాలి, నిత్య జాగరూకత కావాలి. అదే అభ్యాసం.

ఆరీతిగా గతాన్ని లోబరచుకొనడం, వర్తమానంమీద అజమాయిషిని చేబట్టడం జరుగుతుంది. మానవుడు విజయవంతంగా తన జీవనయాత్రను సాగించుకోడానికి ఈ మూడూ అవసరమే ఏ రంగంలోనైనా సరే. కాల గమనంలో తన గమనాన్ని జోడించి, కాలం ఎటు మారితే తానూ అటు మారుతూ, ఒక్క ఆడుగైనా వెనక బడకుండా కదిలిపోయే వాళ్ళే విజయ జీవన యాత్రికులు. వాళ్ళే ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాస సంపన్నులు.

ఇదంతా కాలాన్ని అనుసరించి జీవించే ప్రముఖుల కథ. ఆ మూటిలో ఏది లోపించినా జీవితం సంపూర్ణం కాదు, సుఖవంతమూ కాదు. జన్మలో అందరూ ప్రతిభావంతులే కనుక, తన ప్రతిభకు ఎట్టి పోషణ, ఎట్టి రక్షణ, ఎట్టి అజమాయిషీ, ఎట్టి అభ్యాసం అవసరమో ప్రతివ్యక్తీ గుర్తించుకొని తదనుగుణంగా వర్తించాలి. కవి వ్యాపారంచేసో, వర్తకుడు జూదమాడో, పండితుడు వ్యవసాయంచేసో నష్టపోయి ఏడ్వటంవల్ల లాభం వుండదు. ప్రతిభను గుర్తించుకొని జీవితం గుర్తించుకొన్నా, దాన్ని పోషించుకొని జీవితం పోషించుకొన్నా, దాన్ని నిత్య సమీక్షణద్వారా సంరక్షించుకోకపోతే-అట్టి జీవితం వ్యర్థమే అవుతుంది.

ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాలు మూడూ జయప్రద జీవితానికి ప్రధానావసరాలు. అయితే-ఈ మూటిని పునాదిగా చేసుకొని, వాటికతీతుడై పురోగమించే

మహామనీషి ప్రవక్తే అవుతాడు. అట్టివాడు కాలానికి ముందుంటాడు. కాలాన్ని తన దారికి మళ్లించు కొంటాడు. దేశకాల పాత్రలను తనవెంట నడిపించుకు పోతాడు.

సాహిత్యానికి సంబంధించినంత వరకు అట్టివాడే మహాకవి, మహాఋషి అంటాడు భీమన్న.

ప్రతిభ విత్తనం, వ్యుత్పత్తి వేళ్లు, అభ్యాసం ఎదుగుదల
ఏ చెట్టుకైనా, ఏ జీవికైనా, ఏ మనిషికైనా!
వస్తు తత్వాన్ని బట్టి పోషించు కోవాలి
ఎందులో ఏ లోపం జరిగినా జీవితం అసమగ్రమే.

—శ్రీశ్రీ

తన విషయంలో ఈ సత్యాన్ని చిన్నప్పుడే గుర్తించాడు భీమన్న.

1987లో కావచ్చు, పశ్చిమగోదావరి రెడ్డిసీమలో జరిపారు - మే దినోత్సవాన్ని బ్రహ్మాండంగా. ఎస్. ఆర్. దాస్, రాయని శ్రీరామమూర్తి, కావూరి మీరా సాహేబు, పట్టాభిరామయ్య మున్నగు కార్మిక నాయకుల ఆధిపత్యంలో జరిగిన ఉత్సవమది. అప్పుడు పతాక వందనోత్సవం భీమన్న జరిపాడు.

కార్మికుల శ్రమశక్తే జాతి జీవరసంగా, ఉడుకు రక్తంగా మారుతున్నదనీ, దాని చిహ్నమే ఎర్రజెండా అనీ, ఈ సత్యాన్ని జాతి గుర్తించనంతకాలం పారతంత్ర్య దుఃఖం తప్పదనీ ఉద్ఘాటించా డానాడు.

చివరకు ఏ ఉద్యమమూ ఫలప్రదం కాలేదు. ఏ జెండా పేదలకు నీడ నివ్వలేదు. శత్రు రాక్షస మూకను ముష్టామష్టి ఎదిరించి పోరిన త్యాగధనులే అధికార పదవీ భూతాలకు దాసాను దాసులై పోయారు. భారతీయ జనాత్మకు పూర్ణ ప్రతినిధిగా నిల్చిన నాయకు డొక్కడూ లేకపోయాడు.

1942లో తణుకులో జరిగిన అఖిల నిమ్నజాతి విద్యార్థుల మహాసభలకు భీమన్నే అధ్యక్షత వహించాడు. ఇర్లపాటి వెంకన్న, హరి, మోహనరావు,

మీరయ్య , భద్రయ్య మున్నగు ప్రముఖ లనేకులు పాల్గొన్న సభలవి . మామా యువలోకం మేల్కొంటున్నదన్న ప్రభాత భేరిని మ్రోగించా డీయన అ వేదిక నుంచి .

అప్పటికే ఆ ప్రాంత మంతా రాయుడు గంగయ్య , గొట్టుముక్కల వెంకన్న , నక్కా దినవెంకయ్య , దానియేల్ స్మిత్ , గోడే వెంకటరెడ్డి , మత్తే నరసింహం , పులపర్తి సరస్వతి , సీలం వెంకయ్య , కృపలానీ , కాసె నాగేశ్వరరావు , నంబూరి , దాసరి వందనం , గోవాడ నిరీక్షణరావువంటి ప్రముఖ మామా కార్యకర్తల కార్యక్రమాలతో బహు రద్దీగా వుంది . శాసన సభ్యుడు గొట్టుముక్కల వెంకన్నగారు ఏతత్కార్య సరళికి కేంద్రంగా వుండేవారు .

ఈ అన్ని రంగాలలోను సన్నిహితత్వం కలిగి వున్నా , భీమన్న తన ప్రతిభను పోషించు కొంటూనే వచ్చాడు . దానిని కొండ మీద కురిసిన వర్షంలా నలు మూలలకూ పారి పోనివ్వ లేదు .

వల్లె పొలమున పాత గుడిసెను
ప్రమిదలో చిరు వత్తి నేనే ,
నగరమున మణిదీప మేనే
జగతి కంతకు రవిని నేనే !
దశ్మ ఒక్కొ యైన , ఆధా
రమును బట్టి ప్రకాశ ముండును !
విశ్వ పరిణామమున జరిగే
విప్లవమ్ముల నేది ముందుకు
పోవునో , అదె నాకు నిలయము !

—మానవుని మరొక మజిలీ

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

నికషోపల సర్గ

144. రాగ ద్వేషాలు

ఒక్క సాహిత్య క్షేత్రంలోనే కాక, సాంఘిక రంగంలో కూడ భీమన్న పలుకుబడి, ప్రాబల్యమూ అధికాధికం కావడంతో - మిత్ర పరిధి విశాలతరమై, ఈయనకు అసలు తీరికే లేకుండా పోయింది. ఆహార నిద్రాదులలో కాల నియమాలూ, రేబవళ్ళ తేడాలూ కూడ లేకుండా పోయాయి. దానితో - అప్పటికే అంటుకొని రాజు కొంటున్న అసహనం ఆసూయగా, ద్వేషంగా మారిపోయింది - అంతవరకు కల్ప వృక్షంగా వున్న భార్య నాగరత్నమ్మలో

భీమన్న పుష్పంలా ఎంత మెత్తని వాడో వజ్రంలా అంత కఠినుడు. తన పరమ లక్ష్యం సాహితీ సృష్టి. దానికోసం ఎంతటి ప్రమాదకరమైన ప్రయోగాల నైనా చేస్తాడు. ఎంతటి ప్రాణాంతకమైన త్యాగాలనైనా చేస్తాడు. తన కృషిలో, కార్య సరళిలో, ప్రవర్తన ధోరణిలో ఇతరుల జోక్యాన్ని మాత్రం సహించలేడు.

పూర్వ గ్రంథాల నుంచి కాక ప్రకృతి నుంచి సత్యాలను గ్రహించే వాడూ, వాస్తవ జీవితం నుంచి ఇతి వృత్తాన్ని తీసుకునే వాడూ, రసా విష్కారం కోసం, సంసార సాగరాన్ని స్వయంగా మధించడానికి వెనుదీయని

వాడూ, సౌందర్యోపాసకుడూ, శృంగార ప్రియుడూ అయిన కవిని భర్తగా పొందడం జరిగినప్పుడు - అట్టిదాన్ని అదృష్టంగా భావించి, అతడికి సంపూర్ణ స్వేచ్ఛను ఇవ్వడమే విజ్ఞత. అతడి నుంచి పిల్లైనంత తక్కువను ఆశిస్తూ, తనకున్నదంతా అతడికి నివేదించు కొంటూ మెలగగల భార్యే అతన్ని తన అదుపులో ఉంచుకో గలుగుతుంది. అతడి ద్వారా లోకహితం సమకూర్చ గలుగుతుంది.

సూర్య చంద్రాదులు, మహాపర్వత సముద్రాదుల వలెనే మొత్తం జాతికి, లోకానికి చెందిన మహావ్యక్తులు కొందరుంటారు. అట్టివాళ్ళు ఏ ఒక్క వ్యక్తికో, వర్గానికో, ఇజానికో సొంత ఆస్తిగా వుండలేరు. అలా వుంచు కోవా లనుకునేవాళ్ళు ఆశా భంగం పొందక తప్పదు.

భీమన్న పెరిగే కొలదీ తాను కుంచించుకుపోసాగింది నాగరత్నమ్మ. ఇతణ్ని ఇంట్లోనే కట్టి పడేసుకోవాలన్న పట్టుదలను పెంచుకొని, అది సాధ్యం కాకపోయేసరికి, కసి పెంచుకొని, వశీకరణ మంత్రాలనుకూడ ప్రయోగింపించి, ఫలితం లేక - అధికారులకు, మంత్రులకు, రాజకీయ పార్టీలకు కూడ పిటీషనులు పెట్టి, విఫలురాలై-చివరకు ఈయన వాస్తవంగా ఇంట్లో నుంచి పారిపోయేవరకు తన పంతం వదల లేదామె. 1960-66 మధ్య భీమన్న సాహితీ చరిత్రవలెనే దాంపత్య చరిత్రకూడ చాల ఆసక్తిదాయక మైనట్టిది. మొదటిది ఎంత ప్లస్సో, రెండోది అంత మైనస్సు!

ఒకరోజున ఏనాటిదో ఒక పాతచీరను తీసి కట్టుకొని, ముఖ్యమంత్రి సంజీవయ్యగారిని చూడబోయిందామె. ముందుగా ఆయన సతీమణి కృష్ణవేణి గారిని దర్శించి, వచ్చిన పని చెప్పి, భీమన్నను ఉద్యోగం నుంచి తీసివెయ్యించ మని కోరిందట. కృష్ణవేణిగారు ఆమెకు కొన్ని సాంసారిక ధర్మాలను బోధించి పంపే కారట. ముఖ్యమంత్రి గారి దర్శనార్థం వెళ్ళి ఆ సమయంలో అక్కడున్న రామదాసు దంపతులు ఆ తర్వాత భీమన్నను హెచ్చరించారు- సంసారం వీధిపాలు కాకుండా జాగ్రత్త పడమని.

జాగ్రత్త పడటమంటే ఏం చెయ్యాలి? రచనలు మానెయ్యాలి! అది సాధ్యం కాని దీయనకు.

అప్పటి కీయన 'రాగవైశాఖి' వ్రాస్తున్నాడు.

రాత్రంతా వ్రాసి, దాని నలాగే టేబులు మీద వదిలేసి, పగలు ఆఫీసుకు పోతుండేవాడు. నాగరత్నమ్మ ఎప్పటి కప్పుడు దాన్ని చదువుతూ వుండేది. ఒక కోజున చదువుతూ, చదువుతూ దాన్ని చింపి పారేసింది. అందుకు కారణం ఆ కావ్య నాయిక తనలా లేకపోవడ మట! ఆ నాయికలో తాను అనుమానిస్తున్న కొందరి స్త్రీల ఆకారాలు కనిపించడ మట!

మళ్ళీ మొదలుపెట్టి వ్రాసుకొన్నాడంతా భీమన్న. ఈసారి ఇంట్లో వ్రాయలేదు. పౌరోద్యానాలలో, మ్యూజియంలలో, రాత్రులు ఆఫీసులో—ఎక్కడ వీలైతే అక్కడ కూర్చుని వ్రాసుకునేవాడు. వ్రాసిన దానికి ఎప్పటి కప్పుడు కాపీ తీయించేవాడు. అలా వ్రాసి పూర్తిచేసిన వ్రాతప్రతిని, దాని కాపీని ఆఫీసులోనే భద్రపరచుకొన్నాడు. అయితే, ఒక శుభ ముహూర్తాన దాన్ని మొత్తం ఎత్తుకుపోయింది నాగరత్నమ్మ. ఏం చేశావని అడిగితే, బాయిలర్లో వేసేశానంది.

తర్వాత భీమన్నకు మతిపోయినట్లనిపించి, ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు—1961 జూన్ నెలలో.

తిరుపతిలో ఏర్పాటు చేయబడ్డ సాహిత్య అకాడమి సభల కోసమనే బైలుదేరాడు. ఆ తర్వాత తన అడ్రసు ఆఫీసులో తన తర్వాతి అధికారికి తప్ప మరెవ్వరికీ తెలియలేదు. తిరుపతి కొండలమీద కొంతకాలం వుండి, బెంగుళూరు వెళ్ళి, ఒక నెల రోజులపాటు లాల్‌బాగ్‌లో కూర్చుని, రాగవైశాఖిని మళ్ళీ వ్రాసుకున్నాడు.

మవం కలిసే వున్నాం పాదాల దగ్గర
పాలకడలి లోతుల్లో!
లక్ష్మీ సరస్వతులు నాకు నీ పాదాలు
వాటికి నేనా మందిరాలు నా హస్త కమలాలు
నా హస్త కమలాలలో లక్ష్మీ సరస్వతులు
నా గుండెలపై తాండవించాలి ఈ జంట!

— రాగ వైశాఖి

145. రసాలిని

"అన్నీ వుండి ఏమీ లేనివాణ్ని నేను" అంటాడు భీమన్న . ఇది ఒక్క భగవంతుడు మాత్రమే చెప్పదగిన మాట .

మామిడికుదురులో పిత్రార్జితంగా తన వాటాకు వచ్చిన తోటను నైనాల గణేశ్వరరావు గారి సలహాపై , తండ్రి పల్లయ్యిగారి అనుమతితో అక్కడి హైస్కూల్‌కు ఇచ్చేశాడు భీమన్న—నామ మాత్రపు మూల్యం తీసికొని . అలాగే బోయోళ్ళ మెరకపై తన వాటాను పక్క వాటా వాళ్ళకు ఇచ్చేశాడు . తనక్రింద వున్నప్పుడు ఏ సంస్కారమూ లేక వెల వెలబోతూ వుండే ఆ భూములు - ఇప్పుడు ఒకటి విద్యార్థులతోను , మరొకటి వివిధ ఫల వృక్షాలతోను కల కల లాడుతూ వున్నై . ఆ వైభవం చూచి ఎంతో ఆనంద పడతా డీయన .

భూమి చిన్నదా , పెద్దదా అనేది ముఖ్యం కాదు . సొంతంగా సేద్యం చేసినప్పుడే దాని శోభ . దేశ దౌర్భాగ్యానికి కారణం ఆబ్సంటీ భూస్వామిక పద్ధతే అంటాడు భీమన్న . ఆబ్సంటీ భూస్వాములు వందలు వేలు అందగత్తెలతో ఆంతఃపురాలు నింపి పెట్టుకునే పూర్వ రాజులవంటి వా ళ్ళంటాడు .

ఈనాడే కాదు . పూర్వం నుంచీ కూడ దేశంలో భూస్వాములే ఉన్నతో ద్యోగులు గానూ వుంటున్నారు . భూములు , అధికార పదవులు , పరిశ్రమలు - అధికాదాయం తెచ్చే ఆధారాలు ఇవి మూడే . ఇవి మూడూ ఒకే వ్యక్తి చేతిలో వుంటున్న వ్యవస్థ నేటిది . ఇది మారకుండా దేశానికి ప్రగతి లేదంటాడు .

మామిడికుదురులో భీమన్నకు ఏడు కుంచాల ఇళ్ళ స్థలం తప్ప మరేమీ లేదిప్పుడు . అదైనా చెల్లెలు ద్రౌపది అధీనంలో వుంది . అక్కడ తండ్రి పేర ఒక ఆశ్రమం లాంటిది నెలకొల్పాలని భీమన్న ఉద్దేశం .

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచీ హైదరాబాదులో గృహ వసతి ఒక తీవ్ర సమస్య అయింది . "ఎడ మిల్లె" దిగ్గరనుంచి "జాగానై" వద్దకు వెళు తున్నామని మద్రాసు మిత్రులకు చెప్పేవచ్చాడు భీమన్న . ఆటు అరవం , ఇటు హిందీ తప్ప తెలుగుకు సొంతం అనే దేం లేదనే నిర్వేదం వుంది ఆ మాటలో .

ఉద్యోగులకోసం ప్రభుత్వమే కొన్ని కాలనీల నిర్మాణానికి పూనుకోగా, ఉద్యోగులే కొందరు సహకార సంఘాలుగా ఏర్పడి కొన్ని సొంత కాలనీలు కట్టుకొన్నారు. అశోకనగర్ అలాంటి సొంత కాలనీలలో ఒకటి. అక్కడ భీమన్న ఇరవై వేలు అప్పు చేసి ఇల్లు కట్టుకొన్నాడు. ఆ అప్పును పాతిక సంవత్సరాలలో తీర్చవలసి ఉంది.

భార్య నాగరత్నమ్మతో పేచీలు తారాస్థాయిలో వున్న దశలో ఈ గృహ నిర్మాణం జరిగింది. అందువల్ల ఆమె నుంచి ఎట్టి సలహా, సహకారమూ లభించలేదు. డబ్బు ఒక్కసారిగా చేతి కంద లేదు. అందినప్పుడెల్లా ఒకొక్కగది కట్టించేవాడు. పునాది వేసిన తర్వాత బెంగుళూరుకు పారిపోయాడు. తిరిగి వచ్చినాక బ్రైపాయిడుకు గురైనాడు. ఆ నీరసంలోనే అధికార హోదాలో రవీంద్రుని "విశ్వమానవుడు" గ్రంథాన్ని ఆర్జంటుగా అనువదించవలసి వచ్చింది. ఇన్ని కష్టాలలో, అనేక నష్టాలకు గురవుతూ కూడా, ఇల్లుపూర్తిచేసి, 1961 డిశంబరు 16వ తేదీన గృహ ప్రవేశం చేశాడు.

ఇంటికి "రసాలిని" అని పేరు పెట్టాడు భీమన్న. ఈ పేరుపై సాహిత్య అకాడమి సమావేశంలో చర్చ జరిగింది. గృహప్రవేశ ఆహ్వాన పత్రికలను ఆ ముందురోజున ఆ సమావేశంలో భీమన్న అందజేసినప్పుడు, "రసాలిని"అంటే ఏమిటి? ఈ శబ్దం సాధువేనా" అంటూ ఒక ప్రశ్నను విసిరారు గోపాలరెడ్డిగారు సభలోకి. "కమలిని, శైవలిని" వంటి వాటివలెనే "రసాలిని" అన్నారు రామానుజరావుగారు. "మీ టాగూరు ఇలాంటి పదాలను లక్షవాడాడు." అన్నారు విశ్వనాథవారు. "అయ్యా! అజండాలో ఇప్పుడు చర్చిస్తున్న అంశం ఎన్నోదో చెవుతారా?" అంటూ డాక్టర్ రామరాజుగారు అనేసరికి, నవ్వులు విరిసి అందులో మునిగి పోయింది రసాలిని.

గృహ ప్రవేశము 15వ తేదీ అనుకుని, ఒకరోజు ముందే వచ్చారు మాదపాటి హనుమంతరావుగారు సతీసుత సమేతులై-ఇల్లంతా సిమెంటు, సున్నం, నీళ్ళతోనిండి వున్న దప్పటి కింకా. కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయి, మర్నాడు మళ్ళి వచ్చారు. భీమన్న పట్ల వారి వాత్సల్యం అట్టిది.

ఆర్ధరాత్రి గడిచి, ముహూర్తం సమీపించగానే చేతి గడియారం చూచుకుంటూ—ఉపక్రమణ శ్లోకాన్ని ముందే ఎత్తుకున్నా-సదస్సులో ముందు కూర్చుని వున్న కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు. అదే సమయంలో శ్లోకాన్ని ఎత్తుకున్నారు పౌరోహిత్యం నెరపుతున్న గోదావరిశాస్త్రిగారు. ఆ కాలనీలోనే కాదు, మొత్తం భాగ్యనగరంలోనే శంకుస్థాపన, గృహప్రవేశం, వివాహం, వ్రతం, యజ్ఞం వగైరా హిందూ శుభకార్యాలన్నీ గోదావరి శాస్త్రిగారి చేతి మీదుగానే జరుగుతూ వుండేవి. ఆయన సర్వ సమర్థులు. "అయినా-లక్ష్మణశాస్త్రిగారి వంటి పండితులు అతిథులలో వున్నప్పుడు, ముందుగానే ఆ విషయం నాకు మీరు చెప్పి వుండవలసింది" అన్నారాయన ఆ తర్వాత భీమన్నతో.

ఒకటో రెండో మేకలతో, పదో పరకో కోళ్ళతో రెండు రోజులపాటు యజ్ఞం చేసినంత వైభవంగా గృహప్రవేశ మహోత్సవం నెరవేర్చాడు భీమన్న. ఆ సందర్భంలో ఎలాగో వచ్చి పీటలమీద కూర్చున్న నాగరత్నమ్మ, ఆ మర్నాడే యథాశక్తు స్థానంలోకి వెళ్ళిపోయింది.

పంజగుట్ట క్వార్టర్స్ నుంచి అశోక్‌నగర్ ఇంటికి మారడంలో ప్రొఫెసర్ యాదగిరిరెడ్డి తన కారును రెండు రోజులపాటు భీమన్న అధీనంలోనే వుంచేశాడు. ఇంకా-బాపురెడ్డి, హరిప్రసాద్, మాచిరాజు సత్యనారాయణ, మోదుకూరి, రమణరావు, రామకృష్ణరావు, కృపాకరం, శ్రీనివాసరావు, గరుడాచలం వంటి మిత్రులూ, దాకే చంద్రన్న, షాబుద్దీన్, రోషనలీ, నాగయ్యవంటి అనేకమంది అనుచరులూ ఈ విషయంలో భీమన్నకు తోడ్పడ్డారు అనేక విధాలుగా.

నూతన గృహప్రవేశమూ, దాంపత్య బంధ నిష్క్రమణమూ సుమారుగా ఒకే ముహూర్తాన జరిగింది భీమన్నకు. ఈయన జీవితంలో ఇదొక విచిత్ర సంఘటన.

వట్టాభిషేక ముహూర్తంలోనే అరణ్యవాసం,
గృహ ప్రవేశంలోనే దాంపత్య ధర్మాభి నిష్క్రమణ;
జన్మ బీజంలోనే మృత్యుదేవాలయ ప్రతిష్ఠ,
ఓహో, నీ కుడి ఎడమల వైవిధ్య శోభ!

— ఊర్మిళ

146. ఎడతెగని సేద్యం

తెలుగు దేశం మొత్తం మీద భీమన్న పాల్గొన్న కవి సమ్మేళనలు అనేకం. వందలు వేలు వుండవచ్చు.

యూనివర్సిటీల నుంచి, కాలేజీల నుంచి, ఇతర సంస్థల నుంచి సాహిత్య, సాంస్కృతిక సమావేశాలలో పాల్గొనడం కోసం వచ్చే ఆహ్వానాలకు లెక్కలేదు. సావనీర్లకు, ప్రత్యేక సంచికలకు, సంకలనాలకు ఏదైనా వ్రాసి పంపమని ఎందరి నుంచో ఎన్నో లేఖలు వస్తూ వుండేవి. అందులో నూటికి తొంభై వాటికి జవాబు లిచ్చేవాడు కాదు. మిగిలిన వాటికి రిగ్రెట్ జవాబు లిచ్చేవాడు. సాహిత్యో పన్యాసాలకు అంగీకరించే వాడు కాదు. తాను పండితుణ్ని కాదని స్పష్టంగా చెప్పేసేవాడు. ఎంతో తప్పని సరి అయినప్పుడే కవి సమ్మేళనలలో అయినా పాల్గొనే వాడు.

తాను సాహితీ క్షేత్రంలో ఒక నిరంతర కృషీవలుడు. కష్టించి సృష్టించడం తన విధి. గట్టుపై కూర్చుని కబుర్లు చెప్పే తీరిక తనకు లేదు.

తప్పని సరి అయి పాల్గొన్న కవి సమ్మేళనలే వందల సంఖ్యను మించాయి. పాల్గొన్న ప్రతి సమ్మేళనలోనూ మనస్ఫూర్తిగా పాల్గొనేవాడు. ప్రతి సారి కొత్త రచనే చదివే వాడు.

కవితలు, గేయాలు, నాటకాలు, ప్రదర్శనాలు, ఉత్సవాలలో చేబ్లోలు వక్తృత్వాలు ఈ విధమైన వివిధ శాఖల, సంస్థల కార్యక్రమాలలోని పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన సందర్భాలు లెక్కకు మించే వున్నై. అధ్యక్షత వహించి నిర్వహించిన ఏతత్కార్యక్రమాలను కూడ ఈ క్లుప్త చరిత్రలో లెక్క పెట్టడం సాధ్యంకాదు. కవి సమ్మేళనలో, కావ్యగానాలలో పెట్టుకోవాలను కొన్న వాళ్ళకు వెంటనే స్ఫురించే నాలుగైదు పేర్లలో భీమన్న పేరే మొదటిది.

కర్నూలు జిల్లా హరిజన నాయకులు సర్దార్ నాగప్ప, ఎస్. కె. లింగం గార్లు 1961లో ఆ జిల్లాలో పలుచోట్ల ముఖ్యమంత్రి సంజీవయ్య గారికి

స్వాగత సన్మాన సభలను ఏర్పాటు చేసినప్పుడు. భీమన్నను కూడ ఆహ్వానించి ప్రతి సభలోను నూటపదహార్లిచ్చి సన్మానించారు. ఆ సభలలో సంజీవయ్య గారి ఉపన్యాసాలు, భీమన్న కవితాగానాలు హంపీ, తుంగభద్రా, కృష్ణాతీరాలలో ఇప్పటికీ పిలిస్తే పలుకుతాయి.

తాపీ చాణక్య, స్థానం నరసింహారావు, నటరాజ రామకృష్ణ - ఈ ముగ్గురు ప్రముఖులూ పాల్గొన్న రాఘవ కళా సమితి వారి ఉత్సవాలకు 1961లో భీమన్న అధ్యక్షత వహించాడు. సరోజినీదేవి హాలులో జరిగిన ఆ వుత్సవాలు, భీమన్న అధ్యక్షత ఆనాడు సార్వ జనిక ప్రశంసలకు పాత్రమైనాయి. అదే సంవత్సరం గౌడ హాస్టలులో జరిగిన సారస్వతోత్సవాలకు భీమన్న అధ్యక్షత వహించగా, గోరాశాస్త్రిగారు ప్రారంభోపన్యాసం చేశారు.

"అనుభవమ్మును మించి సత్యమ్ములేదు" అనేది భీమన్న సిద్ధాంతం. అనుభవ సేకరణకు దేశం తిరగాలి, ప్రజల్ని చూడాలి. పేదలైన కవులకు ఆది సాధ్యంకాదు. నేటి కవులలో చాలమంది పాత పురాణాలను తిరగ రాయడంలోను, మార్క్సు ఆర్థిక సిద్ధాంతాలను ఏకరువు పెట్టడంలోను తృప్తి పడుతుండటానికి మూలకారణం వాస్తవానుభవ దారిద్ర్యమే. అందువల్ల అభివృద్ధి జరుగుతున్న, ప్రాజెక్టులు నిర్మించబడుతున్న స్థలాలకు, ప్రాంతాలకు అప్పుడప్పుడు రచయితలను తీసుకువెళ్తూ వుండాలని ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన చేసి వున్నాడు భీమన్న. కాని ప్రభుత్వం పట్టించుకో లేదు.

తాను తన సొంత పనుల మీద ఎప్పుడైనా ఎక్కడికైనా వెళ్ళినప్పుడు ఆయా ప్రాంతాలలో జరుగుతున్న ప్రజాకార్యక్రమాలను చూడడానికి అక్కడి అధికారుల సహాయ సహకారాలు తనకు లభింపచెయ్య వలసిందిగా కోరి – సమాచార పౌర సంబంధాల శాఖ నుంచి అట్టి అధికార పత్రాన్ని జారీచేయించుకున్నాడు. అయితే – దానిని తాను ఒక్కసారి మాత్రమే వాడుకొన్నాడు. అది 1962 ఎన్నికల సమయంలో.

ఎన్నిక లప్పుడు దేశం కలకల లాడుతుంది. 1952 ఎన్నికలలో తానే అభ్యర్థి. ఆ నాటి ఎన్నికలకు, పదేళ్ళ తర్వాత ఎన్నికలకు తేడా చూడాలనుకొన్నాడు. చూశాడు. "మన దేశంలోనివి ఎన్నికలు కావు. అదొక గాలి.

సిద్ధాంత ప్రచారం కాదు. సంత. అయిదేళ్ళ కొకసారి ఐదు పది రూపాయలు ధర పలికే వస్తువు వోటంటే" అనే అభిప్రాయానికి వచ్చాడు.

ప్రభుత్వంలోని ఒక ఉన్నతోద్యోగి సెలవు పెట్టి కాంగ్రెస్ తరఫున ఎన్ని కల ప్రచారం చేశాడనే ఆరోపణ వచ్చింది దీనిమీద కొన్ని పత్రికలలో. దాన్ని ఎవరూ అంతగా పట్టించుకోలేదు. భీమన్న కవిగా, కాంగ్రెసు వాదిగా ప్రసిద్ధుడే తప్ప, ప్రభుత్వోద్యోగిగా కాదు. ప్రజలకు ఏమీ సంబంధం లేని శాఖ ఈయనది.

నీ ప్రగతి నీ బీజగతం
నీ ప్రాభవం నీ కృషి స్థితం
పరబ్రహ్మ అని మన మంటున్నదంతా
ఒక పరమానంద బీజక్షేత్రం
బీజం భువనేశ్వరం
భావం బ్రహ్మ బిందురం

చీకటి పొలం
వెలుగు పైరు
విత్తనం చెట్టవడం వెలుగు
చెట్టు విత్తనం కావడం చీకటి.

—గుడిసెలు

147. కుల ద్వేష స్వరూపం

సహజంగా ద్వేష స్వరూపం ఎలా ఉంటుందో, ప్రత్యేకంగా భీమన్నపై వచ్చే విమర్శలు ఎలా ఉంటాయో, విశదీకరించడానికి ఇక్కడొక సంఘటనను ఉదహరిస్తాను.

బహుశ: 1980లో అనుకుంటాను - స్కూలు ఫైనలు పరీక్షకు పాఠ్య భాగంగా భీమన్న నమోవాకం పద్యాలను వేశారు. వాటిని కావ్య కుసుమాలు పద్య సంకలనం నుంచి తీసుకున్నారు. అందులో ఒక పద్యం ఇలా ముద్రించ బడింది.

రసపూర్ణమ్మ. వసంతధామము , కళా
ధామమ్మ , కల్యాణకా
వ్య సుమా రాధ్యము , భావనా కుహూ కుహూ
నాదమ్మ , వాగ్గేయ సా
ర సమా రంజిత శింజినీ ఝణఝణా
రమ్యమ్మ మా ఆంధ్ర , మీ
వసుధా భాగ్య సుధా ప్రవంతికి నమో
వాకమ్మ లర్పించెదన్ ;

ఈ పద్యం రెండవ పాదంలో "వ్య"కు యతి స్థానంలో "నా"పడింది . అంటే యతి తప్పిందన్నమాట ! ఇంకేం ? పత్రికల ద్వారా ఒక్క-సారిగా విరుచుకు పడ్డారు - భీమన్నమీద పండితు లంతా ! వారం వెంబడీ వారం నిప్పులు చెరగడం ప్రారంభించారు .

ఆంధ్ర భూ లక్ష్మి యొక్క సమస్త సౌభాగ్యాన్ని నిక్షేపించిన రసగుళిక ఆ పద్యం . దాని అంద చందా లేవీ కన్పించ లేదా పండితులకు ! యతి ప్రాసల నడుములు విరగ్గొట్టడానికి బడితెలు పుచ్చుకొని యువ కవులు దండు వెడలిన అభ్యుదయ యుగంలో బ్రతుకుతున్న పండితులకు !

"యతి ప్రాసలే తెలియనివాడు కవిత్వం రాస్తున్నాడ్రోయ్" అన్న ధోరణిలో సాగింది ఆ దుమారం . ఎంత ద్వేషం ! ఎంత విషం !

ఒక్కొక్క వారమూ వచ్చే విమర్శను పత్రికనుంచి కత్తిరించి పెట్టుకొనే వాడు భీమన్న . జవాబు వ్రాస్తామని వచ్చే మిత్రుల్ని వారించేవాడు . ఎంతకాలం అదలా సాగుతుందో సాగనిమ్మనే వాడు . భీమన్నకు తెలియకుండానే జ్ఞానానంద కవి లాంటి మిత్రులు జవాబులు వ్రాసారట కాని, అవి ప్రకటితం కాలేదు .

అలా కొన్ని వారాలు గడిచిన తర్వాత , ఆ పత్రికలోనే ఒక చిన్న లేఖ పడింది . పేరును బట్టి దానిని వ్రాసిన వారు ఒక బ్రాహ్మణ పండితుడే అనుకోవాలి. ఆ లేఖ సారాంశం ఇది .—

"లబ్ధ ప్రతిష్ఠులైన కవుల మీదకు కలం దూసే ముందు, ఒకటి రెండు సార్లు ఆలోచించాలి. పాఠ్య పుస్తకం చివర తప్పొప్పుల పట్టిక వుంది. అందులో "నా" తప్పు "వా" ఒప్పు అని ఇచ్చారు. తప్పొప్పుల పట్టికను కూడ చూడ కుండా తొందరపడి కవిపై దండెత్తడం ఘోరం."

కుహు కుహూ వాదమ్ము అనేది అసలు పాఠం. వాదం ఏమిటి అనేది మళ్ళీ ఒక ప్రశ్న. మామిడి చిగురు గుబురుల్లో దాగుకొని, కో అంటే కో అంటూ వివాద పడుతూ వుంటై కోయిలలు. అసలు వాస్తవంగా కోయిలమొగ మే చూచి ఎరుగని పండితులకు నాదం తప్ప వాదం ఎలా అర్థ మవుతుంది?

తెలియని వన్నీ తప్పులనే తెంపరి తనం మాత్రమే కాదిది. ఎంత ఉపే క్షించినా, ఆడ్డంకులు కల్పించినా, అధిగమించు కొంటూ వస్తున్న భీమన్న పట్లగల విద్వేషమే ఈ దుమారంలో ఎక్కువగా వ్యక్తమైంది. పరిశోధకులు పరిశీలించవచ్చు.

ఈ భారత దేశంలో ఆర్య లెంత మంది:
ఈ ఆర్యులలో ఋషి సాంప్రదాయకు లెంత మంది:
ఆర్ష సంప్రదాయం నిత్యాధునికం
ఆదునిక ధర్మ ప్రవర్తకులే హరిజనులు!

— టుమ్రీలు

148. ప్రక్రియలో మార్పు

1962 జనవరిలో గురజాడ శతజయింతి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. దేవులపల్లి రామానుజరావు, అబ్బూరి రామకృష్ణారావు మున్నగువారు అందులో సభ్యులు. ముఖ్యమంత్రి ఛైర్మను. భీమన్న కార్యదర్శి, ట్రజరరు కూడ. అప్పటి ముఖ్యమంత్రి సంజీవయ్యగారు. ఉత్సవ నిర్వహణ కోసం పన్నెండున్నరవేలు మంజూరు చేసింది ప్రభుత్వం.

ఎన్నికల తర్వాత సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రి అయినారు.

"ముఖ్యమంత్రి ఛైర్మను అంటే, అది కేవలం సాంప్రదాయిక హోదా మాత్రమే. నేను చేసే దేమి లేదు. అంతా నువ్వే నీ యిష్టం వచ్చినట్లు నడిపించు.

నా సంతకాలు అవసర మైనప్పుడు మాత్రమే నా వద్దకు పట్రా!" అన్నారు సంజీవ రెడ్డిగారు.

"నీ సాహిత్య ప్రగతిని గమనిస్తూనే వున్నాను. సంజీవయ్యకు ఒక గ్రంథాన్ని అంకితం ఇచ్చావు కదా! పత్రికలలో చూశాను" అన్నా రాయన.

"ఒక కొత్త కవితా సంపుటి ప్రెస్‌లో వుంది. దాన్ని మీకు అంకిత మివ్వాలను కొంటున్నాను. అనుమతి తీసుకోవడం కోసమే ఇప్పుడు వచ్చాను" అన్నాడు భీమన్న.

"అంకితాల కేం లే. వ్రాయడం ముఖ్యం. నువు వ్రాస్తూనే వుండు" అన్నారు సహజ సౌహార్దంతో.

ఆ విధంగా అనుమతి తీసికొని, సంజీవరెడ్డి గారికి అంకిత మిచ్చాడు భీమన్న "అనాది కొస నుంచి అనంతత్వంలోకి" అన్న తన కొత్త కవితా సంపుటిని.

పద్య, గేయ ప్రక్రియల నుంచి, వచన కవితా ప్రక్రియకు భీమన్న మారింది ఈ అనాది కొస నుంచే. తెలుగు సాహితీ రంగంలో ఒక పెద్ద సంచలనం కలిగించిందీ గ్రంథం.

సాంఘిక, రాజకీయ విమర్శాత్మకమూ, నినాదాత్మకమూ అయిన రచనలకు మాత్రమే పనికి వస్తుం దనుకొన్న వచన కవితా ప్రక్రియ - ప్రేమ శృంగార సంబంధమైన లలిత సుందర భావాల వ్యక్తీకరణకు కూడ చక్కగా పనికి వస్తుందని నిరూపించిందీ సంపుటిలోని ప్రతి కవితా. వచన కవితా ప్రక్రియను ఏకవర్గ నిందా నినాద స్థాయి నుంచి సర్వ జనీన రసానంద స్థాయికి పెంచిన గౌరవం భీమన్నదనీ, ఈ పరిణామ యుగానికి భీమన్నే యుగకర్త అనీ సర్వత్రా గుర్తించబడ్డ సత్యం స్పష్టంగా కనిపిస్తుంది - ఆ కావ్య సంపుటిపై వచ్చిన సమీక్షలను పరిశీలించే నిష్కాల నిష్పాక్షిక పండిత శ్రేష్ఠులకు. ఈ కవితలలోని రస భావ రాగ సౌందర్యాలకు ముగ్ధులైన బాపురెడ్డి, హరి ప్రసాద్, భూదగిరిరెడ్డి వంటి యువకులు చందాలు వేసుకొని ప్రకటించారీ

గ్రంథాన్ని . ఇట్టి కవితల ప్రకటన కోసం "సాహితీ లత" అనే సంస్థను కూడ నెలకొల్పా రానాడు .

ఈ గ్రంథాన్ని సంజీవరెడ్డిగారి టేబులుపై చూచి , తీసికొని చదివిన టి. లక్ష్మీకాంతమ్మగారు దానిని ఇంగ్లీషులోకి అనువదించాలని కూడ అనుకొన్నది . ఆమె అప్పటికే శాసన సభ్యురాలు . సాహితీ తత్వ శాస్త్రాలలో ఎంతో పాండిత్యం కల ఆమె ఆ పనిని నిర్వహించి వుంటే ఎంతో బాగుండేది . తెలుగు దేశపు ఎల్లలు దాటే అదృష్టం తెలుగు ప్రతిభకు ఇంకా పట్టినట్టు లేదు .

"పొగడటంలో కూడ నిన్ను మించినవాడు లే డనిపించావు" అంటూ చదలవాడ పిచ్చయ్యగారి వంటి మిత్రులు సైతం ముక్కు-పై వ్రేలు వేసుకొనే టంత గొప్పగా వ్రాశాడు అంకితం కవితను .

ఆచ్చైన గ్రథాన్ని వెండి పళ్ళెంలో పెట్టుకొని డా. యాదగిరిరెడ్డి , డా, నారాయణకరణ్ రెడ్డి , హరిప్రసాద్ వంటి మిత్రులతో కలిసి గ్రీన్ లాండ్సుకు వెళ్ళి , సంజీవరెడ్డిగారికి సమర్పించాడు భీమన్న . ఎంతో ఆనంద వైభవంగా జరిగిన అంకితోత్సవం అది .

భీమన్న శాను ప్రక్రియ నుంచి ప్రక్రియకు మారడం మాత్రమే కాదు . ప్రక్రియనే ఒక విరస ధోరణినుంచి సరస ధోరణికి మార్చాడు . ఈ కావ్య సంపుటితో దీనిపై వచ్చిన పండిత ప్రశంసలలో ప్రధానమైనట్టివి స్ఫూర్తి శ్రీ గారిదీ , డా॥ దివాకర్ల వారిదీ . స్రవంతి లో ఒక పాతిక పేజీలు వచ్చిన సుదీర్ఘ వ్యాఖ్యా స్ఫూర్తి శ్రీ గారిది . "రసభావ బంధురమైన" రచన అంటూ ఆంధ్రప్రదేశ్ పత్రికలో మూడు పెద్ద పేజీల ప్రశస్త వ్యాఖ్యానం అవధాని గారిది . ఇదికాక , ఈ సాహితీ శతాబ్దంలో ఏకైక సమీక్షా శరత్ చాంద్ర మనుడైన శ్రీ వాత్సవలాంటి వారు కూడా ఈ కావ్య సంపుటి గురించి బృహత్ సమీక్షలు ప్రకటించారు . వ్యక్తిగత ప్రశంసలను అందించిన బి. ఎస్. మూర్తి , విశ్వనాథ వంటివారు ఇంకా ఎంద రెందరో !

సరస్సు నుంచి తొలగిస్తే
పరోరుహం లేదు.
చంద్రిక నుంచి తొలగిస్తే
చంద్రుడు లేడు.
పాట నుంచి తొలగిస్తే
కోకిల లేదు.
ప్రేమ నుంచి తొలగిస్తే
నీవు లేవు.
నీ నుంచి తొలగిస్తే
నేను లేను:
నా పూజా జ్యోతివి నీవు:
నా జ్యోతి స్నేహ రసం నీవు:
నా రస కవితా వసంతవు నీవు:
నా వసంతోత్సవ శ్రీ వైశాఖివి నీవు:

—అనాది కోస

149. ఋషి యొక్క సంసారం

"ఎవరా అడ్వకేటు? చాల గట్టిది! నిశితమైన భాషలో, పగడ్బందీగా వ్రాసింది పిటీషను" అన్నారు, విద్యాశాఖ కార్యదర్శి, ఎల్. ఎన్. గుప్తా గారు.

అడ్వకేటు తనకు తెలిసిన వ్యక్తే. పిటిషను చీఫ్ సెక్రటరీగారి వద్ద చూశాడు భీమన్న అద్భుతంగా వుంది రచన. విషయం తనకు వ్యతిరేకమైందే కావచ్చు కాక, రచనలోని కాల్పనికతను, శిల్పాన్ని మెచ్చుకోకుండా ఎలా వుండగలడు?

అది తన భార్య నాగరత్నమ్మ ప్రభుత్వానికి పెట్టిన పిటీషను. తనపై తీవ్రమైన ఆరోపణలున్నై దాని నిండా. అవన్నీ వట్టి ఆబద్ధాలని నిరూపించుకొన్నాడు తను. అందులో ఆమె ఒక కోరిక కోరింది. అది - భీమన్నకు వచ్చే జీతాన్ని ప్రభుత్వం నేరుగా ఆమెకే అందజేయా లనేది.

"ఆమె కోరిన ఏర్పాటుకు నా ఆభ్యంతరం ఏమీ లేదు. అయితే, చాల కాలంగా ఇంట్లో భోజనం పెట్టడంలే దామె. హోటల్లో తింటూ,

గుట్టుగా నా గదిలో పడుకొంటున్నాను. నా తిండికీ, ఖర్చుకీ ఎంతవుతుందో లెక్కగట్టి నా కిప్పించి, తక్కింది వాళ్ళకి నేరుగా చెల్లించండి'' అన్నా డీయన చేతులు కట్టుకొని.

''అయితే సరే. మీ వ్యక్తిగత జీవితంతో మా కంతగా ప్రమేయం లేదు. ఉద్యోగ నియమాలను అతిక్రమించ కుండా వుంటే చాలు '' అన్నారు ప్రధాన కార్యదర్శి.

"అయ్యా, నేను కవిని. రచయితను. ఇతర్లకు చెప్పగలవాడే కాని, ఇతర్ల చేత చెప్పించుకునే వాడు కవి కాలేడు. నేను ప్రజల మనిషిని. ప్రజల నుంచి దాచుకోవలసిం దేదీ నా జీవితంలో లేదు. నేను అబద్ధం చెప్పను. అబద్ధం చెప్పేవాడు కవి కా ఁడనేది నా సిద్ధాంతం. ఉద్యోగ నియమాల కంటె కవిగా నా నియమాలు ఎక్కువ కఠినమైనట్టివి. ఈ విషయంలో విచారణ జరిపించండి. మా పిల్లలను, ఆమె తరపు బంధువులను, ఈ నగరంలోని కవి పండితులను విచారించిన మీదటనే ఒక నిర్ణయానికి రండి. ముఖ్యంగా, ఆమె తండ్రి గొల్ల చంద్రయ్య గారు ప్రసిద్ధ నాయకుడు. ఆయనను కనుక్కోండి" అన్నాడు భీమన్న ఆవేధనతో.

"ఏదో, ఇలాంటి బాధలు వస్తూవుంటై. సర్దుకు పోవాలి" అన్నా రాయన సానుభూతితో.

ఆ పిటిషనుపై ప్రధాన కార్యదర్శి చర్య ఏమీ తీసుకోలేదు. గుప్తా గారు కూడా దాన్ని అలా పడేసి వుంచారు. అయితే – ముఖ్యమంత్రి గారు మాత్రం అలా వదిలి పెట్టలేదు. ఏమి చర్య తీసికొన్నదీ వెంటనే తమకు తెలుప వలసిందిగా క్రింది వారిని కోరారు. గుప్తాగారి ముందు భీమన్న హాజరయిం దీ దశలో.

కేసు వివరాలన్నీ అవగాహన చేసుకొన్న గుప్తాగారు, ఏం చర్య తీసికోవాలో తెలియని స్థితిలో, కొంత ఊపిరి పీల్చుకునే వ్యవధానం కోసం, అద్వకేటుప్రజ్ఞను గురించి ప్రస్తావించారు.

అద్వకేటు గురించి చెప్పాడు భీమన్న.

ఒక రోజున భీమన్న వద్దకు ఒక మిత్రుడి వద్ద నుంచి పరిచయ లేఖ తీసికొని ఒక యువతి వచ్చింది. ఆమె బంధు వొకాయన - బహుకుటుంబీకుడు - ఒక పెద్ద ప్రమాదంలో చిక్కు కున్నాడు. దేవుడి కున్నంత మానవతా దృష్టి, సానుభూతి, శక్తి వున్నవాడు తప్ప అతడ్ని రక్షించలేడు. ఎంతో ప్రమపడి భీమన్న ఆ పని చెయ్యగలిగాడు. అదీ ఆమెతో భీమన్నకు గల పరిచయం. అప్పటి నుంచీ ఆమె ఈయన ఇంటికీ, ఆఫీసుకూ వస్తూపోతూ వుండేది. చనువుగా, సరదాగా మెలిగేది.

భీమన్న ఎవరితోనూ చనువును పెంచుకోడు. సరదా కబుర్లతో కాలం వ్యర్థపుచ్చలేడు కూడ. అది ఆమెకు ఆశాభంగం కలిగించి వుండవచ్చు.

"చేసిన ఉపకారానికి ఈ విధంగా కృతజ్ఞత చూపిందన్న మాట!" అన్నారు గుప్తాగారు.

అలా కూడా అనుకోడు భీమన్న. ఎందు కంటే —

పూర్వ పరిచయాన్ని బట్టి నాగరత్నమ్మ ఆమె సహాయం కోరి వుండవచ్చు. ఆమె కాకపోతే మరొకరు ఆడ్వకేట్లకు. కొరతలేదు కదా! ఇక, కృతజ్ఞత అంటే-ఈ రకంగా కృతజ్ఞత చూపిన వాళ్ళు భీమన్న జీవితంలో చాల మందే వున్నారు.

ఆపకారం చెయ్యగలవాడు ఉపకారం పొందిన మిత్రుడే
ప్రక్కలో బళ్ళెం కాగలది నమ్మిన భార్యే
స్వార్థం వున్నప్పుడు, దాని తోక త్రొక్కబడినప్పుడు
—త్రిపదలు

ఋషి కాక కవి కాలేడు. ఋషి తపస్వి. తపస్సు భావ తన్మయత. తనను తాను మరచి, జీవితంలో అధిక భాగం సమాధిలో వుండేవాడికి సంసారంలో పొరపాట్లు దొర్లవచ్చు. సానుభూతి లేని లోకం శిక్షిస్తే—అనుభవించక చేసే నేముంది?

150. సంధి యత్నాలు

"నీవు చేస్తున్న పని మంచిది కాదమ్మా" అన్నారు కూతురుతో గొల్ల చంద్రయ్య గారు. అంతటితో ఆయనను వెలివేసి పెట్టిందామె. ఆ తర్వాత చాలకాలం పిళ్ళింటికే రాలే దాయన. ఎప్పుడైనా పనిమీద హైదరాబాదు వస్తే హోటలులో వుండి, ఆఫీసులో భీమన్నను చూచేసి పోతూవుండే వా రాయన.

తమ్ముడు ప్రకాశరావు, బావ మోకా మీరయ్య వగైరా తన పుట్టింటి తరపు పెద్ద లందర్నీ అదే కారణంగా దూరం చేసుకొన్నదామె.

పంతగడ బాలకృష్ణ, కాశీ విశ్వనాథం, వై. ముసలయ్య మున్నగు సన్నిహితు లెందరో ఆమె పగను చల్లార్చడానికి ప్రయత్నించి విఫలు లయ్యారు.

ఒక రోజు ఉదయం డాక్టరు బి. రామరాజుగారు సతీ సమేతంగా భీమన్న ఇంటికి వచ్చారు.

"మీ యిద్దరికీ మాటలు కలిపి, మన నలుగురమూ కలిసి భోజనం చేసి వెళదామని వచ్చాం." అన్నారు ఆమెతో. అప్పుడామె అన్నమాటలు, ప్రయోగించిన పదజాలం ముందు రామరాజు గారి జానపద సాహిత్య పాండిత్యం ఎందుకూ పనికి రాలేదు. దిమ్మెర పోయిన రామరాజు దంపతులు ఆ రభస నుంచి ఎలాగో బయట పడి, భీమన్నను తమ ఇంటికి తీసుకు వెళ్ళి, భోజనం పెట్టి పంపించారు.

"అటువంటి వాళ్ళతో సంసారం శత్రువులకు కూడ వద్దు" అన్నారు రామరాజు గారు. "కళ్ళారా చూశాను కాబట్టి కాని, అంతటి ఆడవాళ్ళుంటారంటే నమ్మేదాన్ని కాదు." అన్నారు వారి సతీమణి.

ఇలాంటి మాటలే నిత్యం వినవచ్చేవి భీమన్నకు మిత్రుల నుంచి. అవి మరీ వ్యధ కలిగించే వీయనకు. ఎందుకంటె—నాగరత్నమ్మ మొదటి నుంచీ యిటువంటిది కాదు. ఆమె ఎంతో మంచిది.

"బాగా మీరబెట్టావు. అనుభవిస్తున్నావు". అన్న తన అక్క మాట లలో ఎంతో అర్థం కనిపించింది భీమన్నకు. ఇప్పుడు చేసే దేముంది?

"నాన్నా ! నా ఒక మాటకు జవాబు చెపుతావా ? అన్నది చిన్నపిల్ల విజయలక్ష్మి ఒక రోజున , మెల్లగా భీమన్న గదిలోకి వచ్చి ,

"ఏమిటి ?"

"ఇంటి పెత్తనం అమ్మకెందు కిస్తావు ? స్వయంగా నీవే ఎందుకు చెయ్యవు ?"

"నన్నే చెయ్యమంటావా ?"

"ఆవును" .

"ఇది ని ఒక్కతె వుద్దేశమా ? మీ అందరిదీనా ?

"మా అందరిదీని" .

తన మీద తనకే జాలివేసింది భీమన్నకు . తమ గొడవల్లో పిల్లలు ఎలా నలిగి పోతున్నారో చూస్తూనే ఉన్నాడు . ఏం చెయ్యగలడు ? సాహిత్యమా ? సంసారమా ? ఏదో ఒకదాన్ని వదులు కోవలసి వచ్చిన ఘడియ అది .

తనంటే గిట్టనివాళ్ళు , తనచేత సాహిత్య సృష్టిని మాన్పించడానికి ఆమెను వాడుకొంటున్నారనీ, రెచ్చగొడుతున్నారనీ అనుమానించడానికి కారణాలు చాలా వున్నై భీమన్నకు . ఆ కుట్రకు బలై పోవలసిందేనా ?

" అది జరిగే పనికాదు "

" ఎందుకని ?

" పోనీ మీరు చేసుకోగూడదా ?"

" ఎలా కుదురుతుంది ?"

" అలానే నాకూ కుదరదు . పెత్తనం నా చేతికి తీసుకుంటే ఆమె మరీ రెచ్చిపోతుంది . నేను స్వయంగా చెయ్యలేను కనుక అందుకు ఒక మేనేజరును , వంటమనిషిని నియమించవలసి వస్తుంది . నావంటి పేదవాడికి సాధ్యమయే పనికా దిది . మీరు ఏమైనా ఆమె పెత్తనంకింద వుండవలసిందే ."

" ఆమె మమ్మల్ని నితో మాట్లాడ వద్దంటున్నది ."

" మానివెయ్యండి . నేనేమీ అనుకోను . మీకు మీ అమ్మ అవసరం . ఆమె చెప్పినట్లు నడుచుకోండి . మీ కెవరికైనా ప్రత్యేకంగా డబ్బు అవసరమైతే నన్నడిగి తీసుకోండి ."

మెల్లిగా వెళ్ళిపోయింది విజయలక్ష్మి . ఆ తర్వాత ఎన్నడూ ఆమె తండ్రితో మాట్లాడలేదు .

పూర్తి చనువు , స్వేచ్ఛ , ఇంటిపెత్తనం అంతా మొదటినుంచీ భార్యకు ఇచ్చేశాడు భీమన్న . అది తన అశక్తిగా , అసమర్థతగా భావించబడితే - చేసేదేం లేదు .

భీమన్నకు వ్యతిరేకంగా భార్య పిటిషను పెట్టిందనీ , అది ప్రభుత్వంలో తీవ్ర సమస్య అయిందనీ , భీమన్న ఉద్యోగం రేపో మాపో వూడిపోతుందనీ సిటీ నిండా పుకార్లు రేగాయి . భీమన్న మిత్రులు , శ్రేయోభిలాషులు ఎంతో ఆందోళన పడ్డారు .

ఆమె పిటిషనును ఉపసంహరించు కుంటే కొంత మేలు జరగవచ్చు నను కొన్న పెద్దలు , అందుకోసం ఎంతో ప్రయత్నించారు . డాక్టర్ వెంకటావధాని గారు , రామానుజరావు గారు , అశోక్‌నగర్ కాలనీ అధ్యక్షులు రామమూర్తి గారు , రాజరత్నం శ్రీనివాసరావు దంపతులు , రామదాసు దంపతులు - ఇలా ఎంతో మంది ఎంతగానో చెప్పిచూశారు . ఆమె వినలేదు .

మేఘాలు సముద్రం నుంచే పుడుతున్నై
అవి సముద్రాన్నే పిడుగులతో మొత్తేస్తున్నాయంటే
తప్పు సముద్రానిదా ?
పాపం , మేఘాలు !

—టుమ్రీలు

151. బీరువాలో ప్రియురాలు

" ఏమండీ ! కవిగారూ ! ఉద్యోగాన్ని , సంసారాన్ని , జీవితాన్నికూడ లెక్కచెయ్యనంత మైకంలో మిమ్ము ముంచేసిన ఆ ప్రియురాలు ఎవరు ?

ఎక్కడుంది ? ఆమెతో మాట్లాడాలి !" అన్నారు రామస్వామిగారు భీమన్న ఆఫీసుకువచ్చి , ఒక సాయంకాలం .

రామస్వామిగారు ఒక ఇంజనీరు . భీమన్నకు కుటుంబ మిత్రుడు . నిరంతరం గీతా పారాయణం చేసే తత్త్వవేత్త . ఆయన చేతిలో ఎప్పుడూ ఆ గ్రంథం వుంటుంది .

"మీ భార్యకు ఎంత చెప్పినా వినడం లేదు . పోనీ ఈమెకైనా చెబుదామని వచ్చాను ." అన్నా డాయన .

"ఏమని ?"
"మావాణ్ని వదిలిపెట్టి పుణ్యం కట్టుకో తల్లీ అని !"
"అయితే చూస్తారా ?"
"అందుకే కదా వచ్చింది ?"

"సరే , చూడండి !" అంటూ భీమన్న లేచి , టేబిలు మీద తాళాలు తీసి కొని , బీరువా వద్దకు వెళ్ళాడు .

"బీరువాలో దాచారా ఎమిటి ?"
"అవును ."

బీరువాలో నుంచి ఒక పెద్ద నోటు పుస్తకాల కట్టను తెచ్చి , టేబిలు మీద పెట్టాడు భీమన్న .

"చూడండి ?"
"ఏమిటిది !"
"అదే , మీరు చూస్తామన్న ప్రియురాలు"
తెల్లపోయాడు రామస్వామిగారు . అది రాగ వైఖరి వ్రాతప్రతి .

"చాలమంది లాగే మీరూ ఏదో తప్పుదారిని పడ్డారనుకొన్నాను . మీ స్నేహాలు ఇంత ఆధ్యాత్మిక మైనవని ఊహించలేదు . మీరు గొప్ప సాధకులు" అంటూ లేచి , నమస్కారం చేసి వెళ్ళిపోయా రాయన .

భీమన్నకు జీవితంలో ప్రియురాలు ఒక్కతే. అది తన సాహితీ సృష్టి పట్ల తనకు గల ఏకాగ్రత. దానికి చెలికత్తె ల్లాంటివి ప్రేరణలు. వాటిలో స్త్రీలు, పురుషులు, గుడులు, గుడిసెలు, పువ్వులు, పాటలు, చీకటి, వెన్నెల - ఎన్నైనా వుండవచ్చు.

అశోక్ నగర్‌లో రసాలిని వీధిలోనే డాక్టర్ ముకుందగా రున్నారు. అయనెంతో స్నేహశీలి, సాహితీ మనస్వి, ఆధ్యాత్మిక పథగామి. భీమన్న పట్ల అత్యంత స్నిగ్ధతగల సహృదయుడు.

ఒకసారి మహాయోగిని కోన అమ్మ హైదరాబాదుకు వచ్చినపుడు, ముకుంద దంపతులు నాగరత్నమ్మను అమ్మ దర్శనానికి పిలుచుకు వెళ్ళారట. సంగతంతా విని, అమ్మ పూజ చేసి, ప్రసాదం పెట్టి, నాగరత్నమ్మతో "మీ భార్యా భర్తలు త్వరలోనే కలుసుకోవాలని దీవిస్తున్నాను -" అంటూ ఏదో ఇంకా చెప్ప బోయిందట. దానితో నాగరత్నమ్మ ఉగ్రురాలై, "నేను భార్యనూకాను, వాడు భర్తకాడు. వాణ్ణెప్పుడో వదిలేశాను. నీ చెత్త దీవన నా కక్కర లేదు. నీ మాత్రం పూజలు నేనూ చెయ్యగలను" అనేసి లేచిపోయిందట!"

అంతటి స్త్రీకి ఇంతకాలం భర్తగా వున్నవాడు ఎలా వుంటాడో చూడాలన్న కుతూహలం అమ్మకు కలిగి పిలవమనగా, ముకుందగారి పిలుపుపై వెళ్ళాడు భీమన్న. అమ్మ ఒక మహాయోగిని. నమస్కారం చేసి కూర్చున్నాడు.

"స్త్రీ ఒక మహాశక్తి కదా, నాయనా! ఎప్పుడు ప్రసన్నత వహిస్తుందో, ఎప్పుడు ఉగ్రరూపం ధరిస్తుందో చెప్పలేం. ఆమెను అన్ని కళలలోనూ ఏలుకోగల శక్తి పురుషుడి కుండాలి" అన్నది అమ్మ.

భీమన్న మాట్లాడలేదు. ప్రసాదం పెట్టి, అమ్మ అన్నది, "నీ భార్యను చూశాను. ఆమెపై ఎట్టి ఆశా పెట్టుకోకు. ఆమెకోసం నీ దారి మార్చుకోకు. నీ లక్ష్యంతో నీవు సాగిపో!" అని.

యోగులు, భక్తులు, బాబాలు, గుడుల్లోని దేవుళ్లు అంటే లక్ష్యం లేదు భీమన్నకు. అయితే, ఇతర పెద్దలను లాగే వాళ్ళను కూడ గౌరవిస్తాడు.

భీమన్న ప్రకృతిలో ఇదొక వైచిత్రి. కొన్ని సంవత్సరాల నిరంతర వేధతో తాను గుర్తించిన ఒక సత్యాన్ని, ఒక్కసారి చూచి కనిపెట్టగలిగిన అమ్మ మనోదీప్తికి క్రైమోడ్పు లర్పించాడు.

ఉన్నది విలువుకొంటూ
లేనిది గెలుచుకోవాలి మనిషి,
బలవంతుడే భగవంతుడు
బలహీనుడు బానిస.

—టుక్రమీత

152. రెండు విధాల నష్టం

పిటీషను ఉపసంహరించు కోడానికి నాగరత్నమ్మ నిరాకరించడం, వీడి అంతు తేలుస్తా నని బాహాటంగా ప్రకటించడంతో, ఇక భీమన్న చేసేది లేక, అనాసక్త యోగంలో పడ్డాడు.

ముఖ్యమంత్రిగారు పట్టుదలగా వున్నారు. ప్రధాన కార్యదర్శిగారికి చికాకు కలగజొచ్చింది. విద్యాశాఖ కార్యదర్శి గుప్తాగారు ఏం చేస్తారు? భీమన్నకు కబురు చేస్తారు. ఈయన వెళ్ళి చేతులు కట్టుకు నిలబడతాడు. రోజూ ఇదే తంతు.

"ఇలాంటి పెళ్ళాంతో పాతిక సంవత్సరాలు ఎలా కాపురం చేశావయ్యా?" అన్నా రాయన ఏసుగ్గా. "ఇప్పుడు చేసేదేం లేదు. నీ జీతంలో ఒక భాగం ఆమెకు చెల్లించ మంటున్నారు పై అధికారులు. ఒప్పుకో" అన్నారు చివరకు.

ఉద్యోగమే పోతుందనుకొన్న కేసును అంతవరకు తీసుకువచ్చిన గుప్తా గారి సహృదయతకు, సానుభూతికి జోహారు లర్పించాడు భీమన్న.

ఈయన జీతాన్ని ఖర్చు దృష్ట్యా రెండుగా విభజించారు. ఈయన హోటలులో తింటున్నాడు కదా? అందువల్ల భీమన్న తిండిఖర్చు, ఇంటి అప్పు వాయిదాలు, పన్నులు, పిల్లల జీతాలు భీమన్న వాటాకు చేర్చగా-జీతంలో ఒక పందరూపాయలు మిగిలాయి. ఐదువందలు కావా లన్నదామె. ఎలా?

భీమన్న తిండి ఖర్చును మాత్రం భీమన్నకు ఇవ్వమనీ, తక్కిన జీతం మొత్తం తనకు చెల్లించమని మరో ప్రతిపాదన చేసిం దామె. అందుకు ఒప్పేసుకొని, ఈ తలనొప్పిని ఇంతటితో తప్పించుకో మన్నారు గుప్తాగారు. సరే నన్నాడు భీమన్న. ఆయితే అట్టి ఏర్పాటు, ప్రభుత్వం ద్వారానే జరగా లన్న దామె.

చివరకు ఇంటి ఖర్చుకు మాత్రం భీమన్న నెలకు మూడువంద లివ్వాలని, ఆ మొత్తం ఆంధ్రా బ్యాంకులో కట్టాలని నిర్ణయం జరిగింది. అందుకు సంబం ధించిన పత్రాలు సిద్ధమైనాయి. నెలకు మూడువందలు చొప్పున తన పెద్ద కుమారుడైన దత్తాత్రేయశర్మ పేర ఆంధ్రబ్యాంకులో జమకట్టే ఒప్పందంపై విద్యాశాఖ కార్యదర్శి ముందు సంతకం చేశాడు భీమన్న.

పెద్ద భారం దిగిపోయిం దనుకున్నారు అంతా ఆ క్షణంలో. అయితే నిజమైన తలపోటు అక్కడినుంచే ప్రారంభ మయింది. ఆ ఒప్పందానికి ఆమె ఒప్పుకోలేదు. ఆ సొమ్మును కొడుకుపేర కాక, తనపేర జమకట్టా లన్నది!

భర్త జీతాన్ని భార్యకు చెల్లించే రూలు ఎక్కడుందో ఎవరికీ తెలియ లేదు!

"ఈ గోలంతా ఏమిటి? విడాకు లిచ్చెయ్యి" అన్నా రంతా.

"ఇది విడాకులు కాక మరేమిటి?" అన్నాడు భీమన్న. విడాకులు భారతీయ సంప్రదాయం కాదు భీమన్న దృష్టిలో. ఎంతమంది నైనా చేబట్ట వచ్చునేగాని, వదిలెయ్యి గూడదు. సాంఘికంగా రామావతారం విఫలమైన తర్వాతనే కృష్ణావతారం వచ్చిం దంటా డీయన.

ఆ తర్వాత ఆ కేసేమయిందో, మోపెడుగా పెరిగిన ఆ ఫైలేమయిందో తెలియదు. భీమన్నకూడ పట్టించుకో లేదు.

ఉన్నట్టుండి ఒక రోజున, పుస్తకాల రెజిష్ట్రారుగా భీమన్నకుండే స్పెషల్ పే రద్దయింద! ఎంతో కాలంగావున్న-పెన్షన్‌కు కూడ కలిసే-ఆ స్పెషల్ పే పోవడం భీమన్నకు ఒక నిరంతర శాశ్వత నష్టం.

రెండో నష్ఠం భీమన్న ప్రతిష్ఠకు సంబంధించి నట్టిది . గురజాడ సెంటినరీ కమిటీకి ముఖ్యమంత్రిగారు ఛైర్మెను . వారి దర్శనం ఆ తర్వాత భీమన్నకు దుర్లభ మయింది . స్పెషల్ పే పోయినందుకు చింతించలేదు కాని , సెంటినరీ ఉత్సవాల విషయంలో అధైర్యపడ్డాడు భీమన్న . దేవులపల్లి రామానుజరావుగారే కనుక సమయానికి ఆదుకొనకపోతే , సామర్థ్య పరంగా భీమన్న బాగా దెబ్బతిని పోయేవాడు .

లోకం లోని పచ్చదనాన్నంతా నేకరించి వసంతం
పంచి ఇస్తుంది చెట్లకూ , తీగలకూ , ప్రతి లవానికీ ।
ఒక్క దెబ్బతో హరించివేస్తుంది దాన్నంతా గ్రీష్మం ।
అదంతే ! ఎవరేం చెయ్యగలరు ?

—టుమ్రీలు

153. గురజాడ జాడ

గురజాడ శత జయంతి ఉత్సవాలను , అప్పటికి ఆన్ని విధాలా దెబ్బతిని ఉన్న భీమన్న , ఒక సంవత్సరం పాటు అంత వైభవోపేతంగా జరిపించ గలిగా దంటే – అందుకు కారణం ప్రధానంగా దేవులపల్లి రామానుజరావు గారి అండదండలే అని చెప్పాలి.

రామానుజరావు గారు ఎంత పండితుడో అంత కార్యవాది. సాహిత్య రాజకీయ రంగాలు రెండిటా సవ్యసాచి . సిటిలో ఆయన కున్న పలుకుబడి , పరపతి అనన్యం . ఏదైనా ఒక కార్యక్రమాన్ని మీద వేసుకొంటే , దాన్ని విజయవంతంగా సాధించేవరకు నిద్రపోడు . ఉన్నతస్థాయి నైతికత , మానవత , కార్యదక్షత , స్నేహశీలత – వీటన్నిటికీ ఒకే ఒక పేరు రామానుజరావు . అలాంటి ఒకమనీషి స్నేహ సహకారాలు లభించడం భీమన్న అదృష్టం. దానికి అబ్బూరి రామకృష్ణరావుగారి సహృదయతకూడ తోడై , ఈయన ముందుకు పోగలిగాడు .

రామానుజరావుగారు ముందూ , రామకృష్ణరావుగారు వెనకా ఉండగా కొంత ధైర్యాన్ని కూడగట్టుకొని , వెళ్ళి – విద్యామంత్రి పి. వి. జి రాజుగార్ని దర్శించాడు భీమన్న .

" విజయనగర రాజాస్థానం పర్యంచానికి బహూకరించిన ఒక అమూల్య రత్నం గురజాడ అప్పారావుగారు . అట్టి మహామహుని శతజయంతి కనీస స్థాయిలో అయినా జరగాలంటే , రాజావారి పూర్తి సహకారం అవసరం " అన్నారు వారితో . సరే నన్నారు పి. వి. జి. ఆ క్షణంనుంచి చిట్టచివరవరకు తమ సహాయ సహకారాలను అందజేస్తూనే వచ్చా రాయన .

1962 జూన్ ప్రారంభంలో విజయనగరం వెళ్ళాడు భీమన్న . అక్కడ దివాన్ రామమూర్తిగారి సంపూర్ణ సహకారంతో రాజభవనం గెస్టుహౌసులో మకాంపెట్టి , ఒక వారం రోజులపాటు గురజాడ ప్రతి అడుగుజాడను పరిశీలించి చూశాడు .

రాజప్రాసాదంలోని ఆ గ్రంథాలయం , ఆ చిత్ర కుడ్యాలు , ఆ తోటలు, ఆ చెరువుగట్లు , ఆ వీధులు , ఆ మధుర మంజుల వాణీ విలాస వసతులు గురజాడను నవయుగ సాహితి ప్రవక్తగా తీర్చిదిద్దిన ఆ పరిసర మంతా ఒక పుణ్యక్షేత్రంగా దర్శన మిచ్చింది భీమన్నకు .

మహాకవి పుత్రులు గురజాడ రామదాసు గారిల్లు చాల చిన్నది. అక్కడ అనేక విషయాలను తెలుసుకున్నాడు భీమన్న . మహాకవికీ , ఆయన రచనలకూ జరిగిన కొన్ని కొన్ని అన్యాయాలను గురించి విని కన్నీటి పర్యంతమైనాడు . స్వార్థమే సహజ ప్రవృత్తిగాగల సమాజంలో మహాకవులూ , వారి రచనలూ కూడ దోపిడికి గురికాక తప్పవు మరి !

శతజయంతి ఉత్సవాల కోసం , ప్రత్యేక సంచిక కోసం - రాజభవనం నుంచి , రామదాసుగారింటి నుంచి ఎన్నో ఫోటోలు , చారిత్రక వివరాలు సేకరించాడు . గురజాడ వాడిన వివిధ వస్తువులు , పరికరాలు ఒక పెద్ద మందసంలో భద్రపరచబడి వున్నాయి . వాటి ఫోటోలను కూడ తీసుకున్నాడు .

విజయనగరం ఒక కళా పుణ్య క్షేత్రం . సంగీత సాహిత్య నృత్య రాజ్యలక్ష్మి నివాసం . చిత్ర శిల్ప కళాలయం . పైడిరాజుగారి చిత్రశాలను , సంపత్కుమార్ గారి నృత్య కేంద్రాన్ని దర్శించాడు . అప్పట్లో అబ్బూరివారి పర్యవేక్షణలో ప్రదర్శించబడుతున్న కన్యాశుల్కంలో మధురవాణి పాత్రధారిణి ఇంటికి వెళ్ళి . ఆమె ఆతిథ్యాన్ని స్వీకరించాడు .

ఆ రోజుల్లో బాపురెడ్డి గారు విశాఖపట్టణంలో డిప్యూటీ కలక్టరు . ఆయన మిత్రుడు ఎమ్. వి. రత్నం గారు విజయనగరంలో సబ్ కలెక్టరు . రత్నంగారు రామమూర్తి గారు భీమన్నను అరకులోయకు తీసుకుపోయారు . రాష్ట్రం మొత్తం మీద అత్యున్నతమైన ఆ రత్నగిరి కొండల సానువులపై ఆ ప్రమాదకరమైన మాట్ రోడ్డులో ప్రయాణం-అనాది కొన కావ్యం నుంచి భీమన్న కవితాగానం చేస్తుంటే , ఆ యిద్దరూ తన్మయులై వినడం-ఏ క్షణంలో కారు ఎటు జారి ఏ అగాధంలోకి పడిపోతుందోనని భీమన్న బెదురు-మధ్య మధ్య దండకారణ్య ప్రాజెక్టుకోసం కొండలను పేలుస్తున్న ధ్వనులు , సొరంగాలను తొలుస్తున్న దృశ్యాలు-భీమన్న రస హృదయంలో ఒక అపూర్వమైన కాల్పనిక ముద్ర వేసిన సుందర యాత్ర అది !

తెలుగు తల్లి సౌందర్య సంపత్సమాహారంలో నాయకమణి అరకులోయ !
"పదవీ దాహం , ప్రాంతీయ పక్షపాతం తప్ప-సౌందర్య దృష్టి , సామూహిక శ్రేయో కాంక్షలేని అధికారతత్త్వానికి బలైపోయిన కరుణకథ అరకులోయది" అంటాడు భీమన్న .

అధికారం ఏ కులం వాడి , ఏ ప్రాంతం వాడి , ఏ మతం వాడి , ఏ దేశం వాడి చేతిలోనైనా వుండవచ్చు . అట్టివాడు సర్వహితైక సహిత మూర్తిగా వుంటేనే మానవజాతికి ప్రగతి అంటాడు. భూలోక స్వర్గంగా , టూరిస్టు నందనంగా ప్రపంచాన్నే సమ్మోహ పరచవలసిన అరకులోయ అశోక వనంలో సీతలా పడి వున్నదంటాడు భీమన్న .

నిప్పును బోలు నీతి , పని
నేర్పు , నిజాయితి కల్గు భూమిలో
చెప్పులు కూడ రాజ్యమును
చేయగ జాలును ; రాజ దర్పమే
గొప్పయు కాదు ; సార్వజని
కోన్నతికై కృషి సల్పినప్పుడే
చిప్పిలు మాన వాత్మ కల
శిన్ మధుపుల్, మధురోప భోగముల్

—అశోకవనిలో రాముడు

154. అపూర్వ సన్మానం

అరకులోయ నుంచి రకరకాల అపూర్వ ఫలాలను, మధుర భావాలను, సౌందర్య ముద్రలను సేకరించుకొని కిందకు చేరుకొన్న భీమన్నకు ఆ సాయంత్రం విజయనగర పండితలోకం సన్మానం చేసింది. ఎమ్. వి. రత్నం గారు అధ్యక్షత వహించారు. మల్లె మొగ్గలు, సంపెంగపూలు, మామిడిపండ్లు, పనసతొనలు వెండి పళ్ళెరాలలో రాశులు పోసి పెట్టిన ఆ సన్మాన సభ సాక్షాత్తు సరస్వతీ వసంత సదస్సు.

భీమన్న కవితా గానం చెయ్యడం, అందులోని ఆధ్యాత్మిక సౌందర్యాలను ఆవిష్కరిస్తూ రత్నంగారు ప్రసంగించడం, పండితలోకం తలలూచటం! అదీ ఆ నాటి సాహితీ వైశాఖోత్సవ వైభవం! అది 1962 జూన్ పదకొండవ తేదీ.

"విజయనగర చరిత్రలో ఒక బ్రాహ్మణేతరుణ్ని, ఒక హరిజనుణ్ని పండితులు సన్మానించడం ఇదే మొదటిసారి" అన్నారు రత్నం గారు భీమన్నతో ఏకాంతంగా. పండితులు, అందులోను కాశీ విద్యాపీఠం వారి సన్మానాలను పొంది వచ్చిన వారు, మనస్ఫూర్తిగా, ఆనందంతో అభినందించారు భీమన్న కవితా సరస్వతిని.

ఆ తర్వాత తమ యింట విందిచ్చారు రత్నం గారు భీమన్నకు. రత్నం గారి ఆధ్యాత్మిక శక్తి, తాత్త్వికానుభూతి ఆశ్చర్యం గొలిపాయి భీమన్నకు. వారి ఆప్యాయత, ఆదరణ అమృత మధురంగా నిలిచి వున్నై భీమన్న స్మృతి కోశంలో.

1962 సెప్టెంబరు నుంచి, 63 సెప్టెంబరు వరకు, ఒక సంవత్సరం పాటు గురజాడ ఉత్సవాలను నడిపించాడు భీమన్న. పగలంతా ఆఫీసులో ఉద్యోగ బాధ్యతలను నిర్వహించుకొంటూ, ఉదయ సాయం సమయాలలోను, రాత్రులంతా అదనపు శక్తితో చేసే పనులు ఈ కార్యక్రమాలు. ఆఫీసు పని, అదనపు పని - ఈ రెండూ ఇద్దరు అసూయా పరులైన భార్యల్లా - భీమన్నను ఇరవై నాలుగు గంటలూ వేధిస్తూనే వుండేవి

గురజాడ సెంటినరీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది $12\frac{1}{2}$ వేలు. ఉత్సవాల విశిష్టతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం మరో $12\frac{1}{2}$ వేలు ఇచ్చింది. ఉత్సవ ప్రారంభం నాటికి తపాల శాఖ వారిచే గురజాడ స్టాంపును జారీ చెయ్యించ డానికి ఎంతో ప్రయత్నం చేశాడు భీమన్న. ఉత్సవాలలో పాల్గొన డానికి చాలా పెద్ద వాళ్ళను రప్పించాలను కొన్నాడు. కారణాంతరాల వల్ల ఈ రెండూ జరగ లేదు. అయినా - పి. వి. జి. గారి వ్యక్తి గత సహకారం, మిత్రుల సౌహార్దం, ప్రజల మహదౌదార్యం వల్ల ఉత్సవాలు అత్యంత విజయ ప్రదమైనాయి.

ఈ సందర్భంలో పత్రికల, ప్రజాసంస్థల సహకారాన్ని చాల మెచ్చు కోవలసి ఉంది. అయితే ఎక్కడోతప్ప భీమన్నపేరు కనిపించేదికాదు. ఆకాశవాణిలోకూడ వినిపించేది కాదు. పబ్లిక్ సంస్థలలో పనిచేసేవారి కర్తవ్య ధర్మంలోకి వైయక్తిక రాగద్వేషాలు ప్రవేశించ కూడదు. భీమన్న విషయంలో ప్రవేశిస్తే. ఏమిటి చెయ్యడం? పట్టించుకోకుండా వదిలెయ్యడమే.

కార్యక్రమా లన్నీ ముగిసేటప్పటికి మిగిలివున్న మొత్తాన్ని కమిటీవారి తీర్మానంద్వారా, గురజాడపేర ఒక అండౌమెంటును నెలకొల్పడం కోసం ఉస్మానియా యూనివర్సిటీకి ఇచ్చివెయ్యడం జరిగింది.

ప్రాథమిక మానవుడికి ఆత్మ తెలియదు
హృదయం ఆర్ద్రంకాదు
మనస్సు నిలవదు
శరీర మొక్కటే అతని సర్వస్వం
ప్రాథమిక మానవుడంటే—
అప్పుడే తొలిసారిగా జంతుస్థితి నుంచి
మానవ స్థితికి ప్రమోషను పొందినవాడు

—రాగ వైశాఖి

155. అదృష్టంలేని హరికథ

ఆ తర్వాత, కొంతకాలం తర్వాత, ఒక రోజున విద్యాశాఖామాత్యులు పి. వి. జి. రాజుగారు రవీంద్రభారతిలో ఏదో ఉత్సవంలో పాల్గొంటూ, భీమన్నను

పక్కకు పిలిచి "మీరు గురజాడ సెంటినరీ బాగా నడిపించారు. ఇప్పుడు ఆదిభట్ల నారాయణదాసుగారి సెంటినరీ కమిటీ వేశాను. ఆర్డరుపై ఇప్పుడే సంతకం పెట్టి వచ్చాను. దానికి మీరే కన్వీనరు. బాగా చెయ్యండి" అన్నారు.

ఆనందంతో అవశుడై పోయాడు భీమన్న. తన శ్రమకు ఇంతకంటె గుర్తింపు మరేం కావాలి!

భీమన్న వస్తుతః అల్పసంతోషి కాడు. అయితే-ప్రతి చిన్న పరిమళానికీ పరవశుడై పోతుంటాడు.

సాంస్కృతిక ప్రక్రియ లన్నింటిలోను భీమన్నకు ఎక్కువ ఇష్టమయింది హరికథ. చిన్నప్పుడు ఈయన నాలుగైదు హరికథలను కంఠస్థం చేశాడు. ముఖ్యంగా బాలాజీదాసుగారి "జయప్రద"ను మిత్రుల ముందు ప్రదర్శించే వాడు.

పందు ఇటుకలకు నామం దిద్ది, సీతారామ లక్ష్మణ హనుమలను నిలిపి, కొబ్బరాకులతో గుడులుకట్టి, రాంభజనలు చెయ్యటం ఈయన చిన్ననాటి వినోదాలలో ఒకటి. కనుక అందుకు కావలసిన చిరతలు, గజ్జెలు, తాళాలు, కోలాటం కర్రలు ఈయన స్వార్జితంలో ఉండేవి.

తనకు అంతగా ప్రియమైన హరికథను పునరుజ్జీవింపజేసే అవకాశం ఆవిధంగా లభించినందుకు భీమన్న పడ్డ ఆనందం ఇంతా అంతా కాదు.

అప్పటికి ప్రభుత్వంలోకూడ మార్పులు వచ్చాయి. బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రి అయినారు. విద్యామంత్రిగారు స్వయంగా చెప్పారు. ఎంతో ఉత్సాహంతో ప్రణాళిక వేసుకొని భీమన్న కార్యరంగంలోకి దూకాడు. మంచి హరికథలతో రవీంద్రభారతిలో వైభవంగా ప్రారంభోత్సవం జరిపించాడు.

ఉత్సవంకోసం కమిటీ సభ్యులంతా ఎలాగూ వచ్చివున్నారు కదా అని ఆ మర్నాడు ఉదయం కమిటీ మీటింగు ఏర్పాటు చేశాడు భీమన్న. అయితే చేయవలసిన పనుల, కార్యక్రమాల గురించి చర్చించుకోడం మాని – ఆ రాత్రి

జరిగిన ఉత్సవానికి ఎంత ఖర్చయిందో ఆ లెక్కలు కావా లన్నారు ట్రెజరరు గారు.

ఆ కమిటీకి ట్రెజరరు వేరొక రన్న వాస్తవం అప్పటికిగాని గుర్తుకురాలేదు భీమన్నకు. అధ్యక్షులు మరొకరు.

రాత్రి జరిగిన ఉత్సవాల ఖర్చు లెక్కలను ఉదయమే సమర్పించడం సాధ్యమా? రకరకాల ఖర్చులు చేసిన కార్యకర్తలు అప్పటి కింకా నిద్రలేవనే లేదు. వాళ్ళందరి వద్దనుంచీ బిల్లులు, వోచర్లు సేకరించ వలసి వుంది. అందుకు ఒకటి రెండు రోజులైనా వ్యవధి అవసరం కాదా?

ట్రెజరరు గారి వైఖరి, అధ్యక్షుల అసహాయస్థితి, కొంత మంది సభ్యుల ధోరణి విషమంగా కనుపించింది భీమన్నకు. తాను ముందుకు పోవడం అందులో ముఖ్యులకు ఇష్టంలేదని తేలిపోగా – అక్కడి కక్కడ తన కార్యదర్శిత్వానికి రాజీనామా సమర్పించాడు భీమన్న. దాన్ని కమిటీ ఆమోదించలేదు. సహకరిస్తా మని వాగ్దానం చేశారు చివరకు.

ఈ సెంటినరీ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ఆరువేలు మంజూరు చేసింది. అది ఖర్చయినట్టు సర్టిఫికెట్టు ఇస్తే మరొక ఆరు వేలు ఇస్తామన్నది. మొదటి ఆరువేలే ఖర్చు కాలేదు. ఏ పనీ జరగలేదు. ప్రభుత్వం ఎన్నిసార్లు ఆడిగినా యుటిలైజేషన్ సర్టిఫికెట్టును పంపించలేదు ట్రెజరరుగారు. విద్యా మంత్రి పి.వి.జి. గారు పంజాబులో కారాక్సిడెంటుకు గురై పడి వున్నారు. ఇక చేసేది లేక, కన్నీరు తుడుచు కొంటూ, తన వద్ద వున్న ఫైలంతా ట్రెజరరు గారికి పంపించేసి, చేతులు కడుక్కున్నాడు భీమన్న. ఆ తర్వాత ఆ కమిటీ వ్యవహారం ఏమయిందో పట్టించు కొన్న వాళ్ళే లేక పోయారు.

పురాణాలలోను, జానపద కథల్లోనూ సర్పాలు, సింహాలు, భూతాలు నిధుల్ని ఆశ్రయించుకొని వుండడం పరిపాటి. ప్రజాస్వామిక యుగంలో కూడ అట్టి కీలక స్థానాలలో ఆయా జీవుల నరావతారాలు పీఠం వేసుకోవడం విచిత్రం అంటాడు భీమన్న!

పునర్జన్మలలోను, పాప శాపాలలోను నమ్మకం లేదు భీమన్నకు. అయినా కొందరిని చూస్తున్నప్పుడు "పాపం! శాపగ్రస్తులు" అనుకోవడం తప్పడం లేదంటాడు. ఏ మంచి పనినీ చెయ్యలేరు, చెయ్య నివ్వరు వాళ్లు. అంతేకాదు. ఎక్క డెక్కడి ధనాన్ని, ధాన్యాన్ని తామే పోగు చేసుకొని తింటారు, మిగిలింది తగల బెడతారు తప్ప – ప్రజల దాకా రానివ్వరు, ప్రజలకు దొరక నివ్వరు!

ఏది ఏమైనా, హరికథకు అదృష్టం లేకుండా పోయిం దంటాడు భీమన్న. హరిజనుల స్థితీ, హరికథల స్థితీ ఒకేలా వున్న దంటాడు.

వాలి జంపె నొకడు మూలను పొంచుండి
భీష్మ జంపె నొకడు బేరమాడి
రాజకీయ మెపుడు రావణ కాష్ఠమ్మె
విశ్వభోగ ధామ విసుర భీమ,

—భీమ శతకం

156. చంద్రుడికి నూలు పోగులు

క్రమంగా వికసించి ఫలించిన సత్యం, సుందరం, శివం అయిన జీవితానికి భీమన్న ఒక మోదలు. ఇందులో ప్రతిక్షణమూ సత్య మయిందే. ప్రతి అణువూ సుందరమైందే. ప్రతి భావమూ శివమైందే.

అయితే ప్రతి సంఘటనను, ప్రతి పనినీ వివరించుకొంటూపోతే, వేల పేజీలు అవుద్ది. భీమన్న జీవితం నుంచీ, రచనలనుంచీ ఒకే దృష్టితో ఒకో ఉద్గ్రింధం చొప్పున, ఎన్ని గ్రంధాలనైనా సృష్టించవచ్చు. అందుకే ఈ మహాసముద్రంలో కొన్ని అలలను మాత్రం స్పృశించి వదిలేస్తున్నాను.

1963లో "అనాది కోస" కావ్యంపై ప్రవంతి పత్రికలో ఒక విపులమైన సమీక్ష పడింది. ఆంతవరకు తనకు పరిచయంలేని "స్మార్తశ్రీ" ఆ సమీక్షను వ్రాశారు. భీమన్న ప్రతిభకూ, స్మార్తశ్రీగారి వ్యుత్పన్నతకూ ఆ సమీక్ష దర్పణం. బహుశ ఆ కాలంలోనే త్రిపదలు ప్రకటించాడు భీమన్న.

ఆధునిక వేదంగా ప్లాను చేయబడిం దది . అందులో 149 మాత్రం కాంపిల్‌గా ప్రకటించాడు . గౌతు లచ్చన్నగారి బహుజన ప్రెస్‌లో , నర్రావుల సుబ్బారావు గారు అచ్చువేయించారు దాన్ని .

" మానవుని మరొక మజిలీ " అనే గేయనాటకం అదేకాలంలో ప్రవంతిలో సిరియల్‌గా ప్రకటించబడింది . అది పుస్తకరూపంలో వచ్చినప్పుడు సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ గోపాలరెడ్డిగారికి అంకితమియ్యబడింది . భాగవతుల రామకోటయ్యగారి పర్యవేక్షణలో , వారి నృత్యకళాశాల బాలబాలికలచే అంకిత గేయం నృత్యం చేయబడిం దా సమయంలో . అంకితాల చరిత్రలో అట్టి నృత్యాంకితం అపూర్వమన్నారు పండితులు . భీమన్న కవితా తత్వాన్ని ప్రశంసిస్తూ ఆ సభలో మాట్లాడిన వారిలో విశ్వనాథ ఒకరు .

తన కత్యంత ప్రేమాస్పదురాలైన సోదరి ఆదిలక్ష్మి రష్యాలో మరణించిందన్న వార్త శోకసముద్రంలో ముంచేసింది భీమన్నను . ఆమె ప్రసవవేదనను భరించలేక ఒక ఆడ శిశువును కని , కన్నుమూసిందట . ప్రకృతి వైరస్యానికి వైజ్ఞానిక దేశాలలో సైతం ప్రతిక్రియలేదా అని దుఃఖించాడు భీమన్న . అప్పటికి ప్రెస్‌లోవున్న " చిత్రకళా ప్రదర్శన " నాటికా సంపుటిని ఆమెకు అంకితం చేశాడు .

ఈ గ్రంథాలు దక్షిణభారత హిందీ ప్రచార సభవారి ప్రెస్‌లో ముద్రించబడ్డాయి . మిత్రులు గిడుగు రామమూర్తిగారు అప్పుడు ఆ ప్రెస్ మేనేజర్‌గా వుండేవారు . వారి తండ్రిగారు సీతాపతిగారు కూడ అక్కడే వుంటుండేవారు . వారితో సాహిత్య గోష్ఠిలో వినోదిస్తూ , ఆ ప్రెస్‌లో పుస్తకాలు ముద్రించుకొంటూ వుండేవాడు భీమన్న . ఆ సందర్భంలో కంపోజిటర్లు చేసిన ఒక పొరపాటు వల్ల " ప్రకృతిలో మానవ ప్రకృతి " అనే గ్రంథం వెలుగులోకి వచ్చింది .

పూజ్యపాదులు నిడదవోలు వెంకటరావు గారి షష్టిపూర్తి సభను చేస్తే బాగుంటుందని హఠాత్తుగా తట్టింది పోతుకూచి వంటి కొందరు మిత్రులకు . రామానుజరావు గారి అధ్యక్షతన వై. ఎం . సి . ఎ లో 1963 మే 26 ఆదివారం

జరిగిన ఆ సభలో "ప్రకృతిలో మానవ ప్రకృతి"ని నిడదవోలు వారికి అంకిత మిచ్చాడు భీమన్న.

ది సెవెంత్ సీజన్ (ఏడవ ఋతువు) అనే ఆంగ్లకవితల పైపు ప్రతిని భీమన్న టేబులు మీద చూచి, అక్కడక్కడ చదివి, "దీనిని తీసుకు పోతున్నాను" అన్నాడు బాపురెడ్డి ఒక రోజున. ఆయన అప్పటికి విశాఖపట్టణంలోనే వున్నాడు - డిప్యూటీ కలెక్టరుగా. ఆదే హోదా వుద్యోగంలో వున్న ఆయన మిత్రులు గిర్ఖానీ గారు కూడ విశాఖలోనే వున్నారా సమయంలో. ఆ ఇద్దరూ చేసిన ప్రయత్నం ఫలించి, అక్కడ ఆంధ్రా స్టీల్సు యజమాని, వర్ధమాన పారిశ్రామికుడూ అయిన యింద్రసేన మిత్తల్ గారు సెవెంత్ సీజన్‌ను అచ్చు వేయించడానికి అంగీకరించారు. ఆ కవితా సంపుటి ఇంద్రసేన మిత్తల్ గారికే ఆంకిత మీయ బడింది.

తెలుగు వాళ్ళలో ఇంగ్లీషు వచ్చిన వాళ్ళు చాల తక్కువ. రచయితలు లేరనే చెప్పాలి. తమిళం, మళయాళం, కన్నడం వారిలో ఇంగ్లీషులో చక్కని రచనలు చేయగల వా రెందరో వున్నారు. అందుకే ఆయా భాషలలోని రచనలు ఎన్నో ఇంగ్లీషులోకి వెళ్ళగలిగాయి.

ఇంగ్లీషులో వ్రాయలేక పోవడమే కాదు. ఎవరైనా వ్రాయడానికి సాహసిస్తే, తెలుగు వాళ్ళు సహించను కూడ లేరనే సత్యం వెల్లడయింది - సెవెంత్ సీజన్‌పై వచ్చిన పత్రికా సమీక్షలలో. అసూయో, కులతత్వమో ఆర్థంకాని సమీక్ష లవి. ఆయితే - ఆంగ్ల సాహిత్య నిష్ణాతులూ, బ్రిటిష్ యూనివర్సిటీలలో చదివిన వాళ్ళూ అయిన క్రైస్తవ లెక్చరర్ల అభినందనలను అందుకొని భీమన్న తృప్తి పడ్డాడు.

"ఆంగ్ల సమాజం మధ్య మెలగలేదు. పదిమంది ఆంగ్లేయులతో అయినా మాట్లాడి యెరగడు. ఆంగ్లంలో అంత సుందరమైన కవితా భాష ఎలా వ్రాయగలిగాడు? భాషా హృదయం తెలిసిన వాడు ఒక భాషలో ఎంత అందంగా వ్రాయగలడో, మరే భాషలో అయినా అంతే అందంగా వ్రాయగలడు అనడానికి

భీమన్న ఒక ఉదాహరణ," అది గుంటూరు క్రైస్తవ కళాశాల ప్రిన్సిపాలు డాక్టర్ పాలస్ గారి ఉవాచ.

నల్ల చీమలు, తెల్ల చీమలు, ఎర్ర చీమలు
చలి చీమలు, పులి చీమలు, కండ చీమలు
అబ్బో! ఎన్నెన్ని రకాల రంగుల చీమలు:
ఒకో రంగు చీమలకు ఒకో పుట్ట
ఏ రకం చీమలకైనా వుండే దొకే పొట్ట
ఏ పొట్ట నిండ డావి కైనా
కావలసింది ఇన్ని గింజలు!
గింజల కోసం గింజుకు చస్తున్నై...!
తెలివి తక్కువ చీమలు
గింజల కోసం గింజుకు చస్తుంటే
అవి పెట్టిన పుట్టలు
పాముల కిరవవు తుంటై!

—గుడిసెలు

157. చిత్రమైన మిత్రులు

ఒక సాయంత్రం అబిడ్సులో క్వాలిటీ బార్‌లో కూర్చుని ఏదో వ్రాసుకొంటున్నాడు భీమన్న. ఈయన జీవితంలో క్వాలిటీకి ప్రత్యేక స్థానం ఉంది. దాని యజమాని వాసుదేవ్ ఒక సింధీ. భీమన్నకు క్రమంగా మిత్రుడైనాడు. తన ఇంట్లో జరిగే అన్ని శుభకార్యాలకూ ఈయనను పిలుస్తూ వుండేవాడు.

1962 నుంచి ఒక నాలుగేళ్ళపాటు భీమన్న వ్రాసిన అనేక కవితలకు పుట్టిల్లు క్వాలిటీయే.

ఇంటి ఖర్చుకు, పిల్లల చదువుకు, జేబు ఖర్చుకు ఇచ్చేయ్యగా మిగిలిన జీతం అంతా కూడానే వుండేది భీమన్నకు. ఉదయంపూట ఇంట్లో వంటగదిలో ఎదురుగా ఏమివుంటే అది. తానే కంచంలో పెట్టుకొనేవాడు: సాధారణంగా సాంబారు, మజ్జిగ వుండేది. కూరలున్నా, కనపడనిచ్చేవాళ్ళు కాదు. ఈయన

పట్టించుకొనేవాడు కాదు. ఏదో, బిఫిన్‌లా తినేసి, కంచం కడిగిపెట్టేసి, ఆఫీసుకు వెళ్ళిపోయేవాడు. రాత్రి ఏ హోటలులోనో, బారులోనో తిని వచ్చేవాడు. తన గడి తాళం తనవద్దనే వుండేది. అద్దెగదిలో వున్నట్టే ఫీలయ్యేవాడు. తన పనులన్నీ తానే స్వయంగా చేసుకొనేవాడు. తనవల్ల తక్కిన వాళ్ళకు ఏ ఇబ్బందీ కలగనిచ్చేవాడు కాదు.

క్వాలిటీ జనరల్ హాలులోనే కూర్చునేవాడు భీమన్న - వీధివైపుకు కాక, కౌంటరు వైపుకు ముఖంపెట్టి. ఒకో టేబిలువద్ద ఇటొకటి, అటొకటి రెండు సోఫా లుండేవి. ఒకో సోఫాలో ఇద్దరేసి కూర్చోవచ్చు. సాధారణంగా భీమన్న కూర్చున్న టేబులువద్దకు మరెవర్నూ వచ్చేవాళ్ళు కాదు. ఇరుకూ, ఇబ్బందీ లేకుండా వ్రాసుకోడానికి అవకాశం ఇచ్చేవాళ్ళు - బారుకు వచ్చే జనం. అంతటి సహృదయులు వాళ్ళు.

కౌంటరుకు దగ్గరలో ఒక ఫోను, రేడియో వుండేవి. ఆ ఫోను నెంబరు భీమన్న మిత్రు లందరికీ తెలుసు. రాత్రి పన్నెండు గంటలకుకూడ ఆ నంబరుకు ఫోనుచేసే, లేక ఎదురుచూసే సన్నిహితు లుండేవారు ఈయన మిత్ర కోటిలో.

రాత్రి పన్నెండు, ఒంటిగంటవరకు ఏ రవీంద్రభారతిలోనో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే ఆర్టిస్టులకు, కార్యకర్తలకు తాగడానికో, తినడానికో పెట్టగలిగిన హిందూ హోటలు ఒక్క క్వాలిటీయే ఆ రోజుల్లో. ఎంత రాత్రయినా తలుపుకొడితే భోజనం దొరికే దక్కడ. అట్టి కార్యకర్తలలో ఎక్కువమంది ఈయన మిత్రులే.

అటువంటి క్వాలిటీతో భీమన్నకు సంబంధించి నంతవరకు ఏదో ఒక విశేషం జరుగుతూనే వుండేది. రెండు మూడు మాత్రమే ఇక్కడ స్పృశిస్తాను.

ఆ రోజున అలా వ్రాసుకొంటూ వుండగా — వెనక నుంచి ఒక చేయి భీమన్న భుజం మీద పడింది. "ఇక్కడ దొరికావా, మహా కవీ!" అంటూ ఎదర సోఫాలోకి ఒరిగా డొక స్ఫటిక శిల్పం లాంటి వ్యక్తి. ఆయ నెవరో భీమన్నకు గుర్తులేదు.

ఆయన అప్పటికే చాల తాగి వున్నాడు. భీమన్న ముందున్న గ్లాసులు తీయించేశాడు. కొత్తగా ఎక్కువ ఖరీదుగల వన్నీ తెప్పించాడు. బలవంతం చేసి తాగించాడు. సర్వారును పిలిచి, మొత్తం బిల్లు తెమ్మన్నాడు. సర్వారు కౌంటరు దాకా వెళ్ళి, తిరిగి వచ్చి "పాత బాకీ కూడ చేర్చ మంటారా?" అన్నాడు మెల్లగా భీమన్నతో. "వద్దు" అన్నాడు భీమన్న.

'ఏమిటీ?' ఉరి మాడా వ్యక్తి. "మా మహాకవికి బాకీయా? ఈయ నెవరో తెలుసట్రా, అబ్బాయ్! ఈయన ఎప్పుడూ ఎవరికీ బాకీ పడగూడదు. పాత బాకీ కూడ కలిపి బిల్లు పట్రా!" అన్నాడు.

పాత బాకీ ఏభయ్యో, అరవయ్యో!

ఎంత దివ్యమైన వదాన్య గుణం! ఎవరీ మహనీయ మూర్తి! చౌదరి! సినీరంగంలో - భీమన్నకు ఎలాంటి సంబంధమూ లేని సినీరంగంలో - అగ్రశ్రేణి అలంకారికుడు, చౌదరి!

"ఎప్పుడూ ఎవ్వరికీ బాకీ పడగూడదు. అప్పు చెయ్య గూడదు. ఆరువు, ఎరువు తే గూడదు. ఉంటే తినాలి. లేకపోతే పస్తుండాలి," అనేది భీమన్న జీవిత విధానం. ఈ నాటికీ అక్షరాలా అదే నియమం. ఇల్లు కట్టడానికి చేసిన అప్పు తప్ప, మరే అప్పు లేదు.

డబ్బు గడించడం అనేది ఒక కళ. తిండికి సరిపడా గడించే వాడు సామాన్యుడు. అంతకు మించి గడించే వాడు ధనవంతుడు. ఎంత ధనవంతు డైనా దాబడికి అనుగుణంగా ఖర్చు పెడుతూ వుండాలి. చివరకు ఏమీ మిగల కూడదు. పుట్టే టప్పటి స్థితిలోనే గిట్టే టప్పుడూ వుండాలి. ఆటువంటి వాడే శ్రేయో మానవుడు. సోషలిష్టు" అంటా డీయన.

సృష్టి ఒక తులాశీలి. ఒక ప్రక్క బరువెక్కితే, మరో ప్రక్క తేలి పోతుంది. గిట్టే నాటికి మనిషి దేనిలో ఎంత నిలవలో వుండే. మరో ప్రక్క మరో దానిలో అంత లోటులో వున్నాడన్న మాట. ఆదాయ వ్యయాల సమా నత్వమే జీవిత పరిపూర్ణత్వం భీమన్న దృష్టిలో.

ఈ సత్యాన్ని అనుసరించే భీమన్న మరి, బార్‌లో ఎందుకు బాకీపడ్డాడు? అంతకు ముందొక రోజున, తమ ఆతిధిగా భీమన్నను ఆ బారుకు పిలుచుకు వచ్చిన కొందరు మిత్రులు - జల్సాగా తాగి, తిని - బిల్లు చెల్లించకుండా వెళ్ళిపోయారు! అదీ ఆ బాకీ!

ఎంతో మంది అగ్రశ్రేణి కవుల, సినీ తారల, సంగీత దర్శకుల ప్రధమ దర్శనం, స్నేహం ఈ క్యాలిటీలోనే లభించింది భీమన్నకు. అందులో ఒకాయన "రాఖీ"లకు స్వర కల్పన చేసి పెడతా నని గ్లాసు సాక్షిగా వాగ్దానం కూడ చేశాడు. సినీరంగం వ్యాపార రంగం కదా! వాగ్దానాలకు విలువ లుండవు.

భోగ వనిత, రేసు, తాగుడు, పేకాట
హాయి గూర్చు మానవాత్మ కెపుడు!
అణచి వేయ కొలది ఆకాశ మంటురా!
విశ్వ భోగ ధామ విషమ భీమ!
—భీమ శతకం

158. అద్భుత శక్తులు

"ఇక్కడ కూర్చోవచ్చునా?"

భీమన్న తలెత్తి చూశాడు. ఈయన జవాబుకోసం ఆగకుండానే ఆ ప్రశ్నించిన వ్యక్తి ఎదుటి సోఫాలో కూర్చున్నాడు.

అది క్యాలిటీలో ఒక చివరి టేబులు. తక్కిన చాల టేబుల్సు వద్ద ఖాళీలున్నై. ఆ వ్యక్తి తన వద్దనే ఎందుకు కూర్చోవాలి? పోనీ లెమ్మనుకొని, మళ్ళీ ప్రాతలో మునిగిపోయాడు భీమన్న.

ఆ వ్యక్తి అది కావా లనీ, ఇది వద్దనీ చెప్పుతూ సర్వరుతో పేచీ పెట్టు కొన్నాడు. అంతకు ముందు ఒకటి రెండు సార్లు అక్కడ చూశా డతణ్ని భీమన్న. అవును, అతడు పేచీకోరే!

"మిమ్మల్ని డిస్టర్బు చేస్తున్నానా?" అతడి మరో ప్రశ్న.

'యస్' అన్నాడు భీమన్న కటువుగా .

'సారీ' !

ఈ ప్రశ్నలూ జవాబులూ అన్నీ ఇంగ్లీషులోనే . అతడి ఇంగ్లీషు యాస మృదువుగా , వైదుష్యంగా వుంది .

కొన్ని నిమిషాలు గడిచినై .

'మీరు కవా?' అతడి ఇంకో ప్రశ్న .

'కాదు'

మళ్ళీ కొన్ని నిమిషాలు మౌనం .

'మరి మీరు ప్రాస్తున్నదేమిటి?'

'ఆఫీసు ఫైలు'

మరి కొన్ని నిమిషాలు దొర్లినై .

'నేను వట్టి ఫూల్ (అవివేకి) నని మీ వుద్దేశమా ?'

" ఆవును " అన్నాడు భీమన్న – ఇక భరించ లేక నోటు పుస్తకం మూసేసి . పెన్ను జేబులో పెట్టుకొంటూ .

ఈ లోగా అత డొక గ్లాసూ , ఈయన ఒక అర గ్లాసూ పూర్తి చేశారు . తీక్షణంగా చూశా డతడు భీమన్న వంక .

"మీ కుడి తొడలో ఒక పెద్ద పుట్టు మచ్చ వుండాలి . ఉన్నదా ?" ఉలిక్కి పడ్డాడు భీమన్న ఈ ప్రశ్నకు . తాను పాంటూ , బుష్ షర్టు వేసుకుని ఉన్నాడు . ఆ మచ్చను గురించి తనకు తప్ప మరొకరికి తెలిసే అవకాశంలేదు. ఎంత ఆశ్చర్యకర విషయం !

"ఇంకా నన్ను ఫూలనే అనుకొంటున్నారా? "

ప్రశ్నతో పాటు వెలువడిన అతడి చిరునవ్వు ముందు అప్రతిభుడే అయాడు , ఆంజలి ఘటించాడు భీమన్న .

'మీరు ప్రాస్తున్నప్పుడు మీ చేయి న న్నాకర్షించింది . మీ బొటన ప్రేలు ఆశ్చర్య పరిచింది . మీరు సామాన్య వ్యక్తి కాదు . సంగ తేమిటో తేలుద్దామని

వచ్చి కూర్చున్నాను. ఏదో ఒక కళలో పరాంకోటి నందుకొనే సాముద్రికం మీది. మీరు గొప్ప కవి అయి వుండాలని వూహిస్తున్నాను. ఇప్పుడైనా చెప్పండి మీ రెవరో' అన్నా డాయన.

"మీ ఊహ సరైందే. నేను కవినే కాని, మీ అద్భుత శక్తి ముందు నే నేమీ కాను. నా అసంబద్ధ ప్రవర్తనను మన్నించండి" అంటూ క్షమాపణ కోరుకున్నాడు భీమన్న. ఆనాటి నుంచీ ఆ యిద్దరూ ఎంతో సన్నిహితు లయారు.

ఎంతగా సన్నిహితులైనా రంటే - ఒకసారి క్యాలిటిలో ఇద్దరూ కలిసి తాగి, పైసలై పోయి. ఇంకా తాగా లనిపించి నప్పుడు, ఆయన ఆ పక్క దుర్గా విలాస్‌కు వెళ్ళి, దాని ప్రొప్రయిటరు రాఘవయ్య గారి వద్ద నుంచి అప్పుతెచ్చి, భీమన్నకు తాగించాడు. ఆ రాఘవయ్య భీమన్నకు అత్యంత ప్రేమాస్పదుడైన మిత్రుడు ఆ రోజుల్లో.

భీమన్నకు అంతగా సన్నిహితుడైన ఆ అద్భుత శక్తి యుక్తు డెవరు? పాంటు, షర్టు ధరించి, తలకు తైలం కూడ లేకుండా, బికారిలా కనిపించే ఒక సామాన్యుడు. గోదావరి వాడే. తెలుగు వాడే. వేదాంతం సుబ్బారావు! హైదరాబాదులో ఒక టెక్నీషియనుగా వుంటున్నాడు. షిర్డి సాయిబాబా భక్తుడు.

ఒకసారి "అకాండ తాండవం" కావ్య ముఖచిత్రం కోసం పి. ఆర్. రాజు గీసిన చిత్రాన్ని పరిశీలిస్తూ కూర్చున్నాడు భీమన్న క్యాలిటీలో. 'చాల బాగుంది అన్నదొక పరిచిత కంఠం వెనుక నుంచి. అది సుబ్బారావుగారే! ఎన్నో దృక్కోణాల నుంచి చూచి మెచ్చుకొన్నారా చిత్రాన్ని.

తర్వాత ఒక జోస్యం చెప్పా డాయన భీమన్నకు - జాతీయ స్థాయిలో, ప్రభుత్వ పరంగా ఒక గొప్ప సన్మానం జరుగుతుం దని.

"దానికి మిమ్మల్నే ముఖ్య అతిథిగా పిలుస్తాను" అన్నాడు భీమన్న నవ్వుతూ.

"నేను మీకు దొరకను"

"ఎక్కడున్నా సరే పట్టుకొస్తాను"
"అది మీకు సాధ్యం కాదు"

అలా సాగింది ఆనాటి వారి ముచ్చట. తనకున్న ఆ అద్భుత శక్తులను స్వార్థాని కుపయోగించుకుంటే సుబ్బారావు గారొక గొప్ప బాబా అయివుండే వాడు కదా అనుకొన్నాడు భీమన్న. ఆ బారుకు వచ్చి, తాగి తన్మయుడై పోతున్న ప్రతివాడూ ఒక బాబా లాగే కనిపించా డీయన కానాడు!

బారు కొచ్చే ప్రతి మనిషీ
బారీ మనిషే

అని వ్రాసు కొన్నా డీయన తన పుస్తకంలో.

ఇలా వ్రాసు కొంటూ పోతే క్వాలిటీ కథలే బోలె డవుతై. జంటనగరా లలో ఈయన కావ్యరసాన్ని రుచి చూడని బారు లేదు. సౌహార్దాన్ని చవి గొనని హోటలు లేదు. విశాఖ, కాకినాడ, విజయవాడ, కర్నూలు వంటి పట్టణాలు కూడ ఈయన సాహితీ హృదయాన్ని ఆస్వాదించి నట్టివే. ఆ కథ లన్నీ చెప్పడం ఇక్కడ సాధ్యం కాదు.

ఇక్క డొక విషయం స్పష్టం చెయ్యాలి. బార్లకు వెళ్లే వాళ్ళంతా తాగ డానికే వెళ్ళరు. చాల మంది తినడానికి వెళతారు. బార్లలోని భోజన పదా ర్థాలు ఎక్కువ ప్రశస్తమైనవిగా వుండడమే అందుకు కారణం. భీమన్న మిత్రు లలో అలాంటి తాగని సాహితీ సహచరులే ఎక్కువ మంది.

బార్లకు వెళ్ళే వాళ్ళంతా తాగుబోతులు కారు
బిచ్చ మెత్తుకొనే వాళ్ళంతా దరిద్రులు కారు
డిగ్రీ లున్న వాళ్ళంతా విద్యావంతులు కారు
ఎన్నుకోబడ్డ వాళ్ళంతా ప్రజా ప్రతినిధులు కారు.

—టుమ్రీలు

159. ఒక నమూనా కథ

మహాత్ముల జీవిత చరిత్రలలో అంతా మంచే వుంటుంది. అలాంటి వాళ్ళు నూటికి కోటికి ఒక్కొక్కళ్లుంటారు. వాళ్ళు లోకాతీతులు. తిండి కోసం

చెమటోడ్చి వలసిన జన సమూహానికి అట్టి మహాత్ముల జీవితాలు ఆదర్శ ప్రాయాలే కావచ్చు కాని, అనుసరణీయాలు కావు. అందు బాటులో వుండవు.

సామాన్య మానవుడి జీవితంలో మంచి చెడ్డలు కలగా పులగంగా వుంటై. అట్టి మానవుల మధ్య బ్రతుకుతూ, వారి మంచి చెడ్డలలో భాగం పంచుకొంటూ, చెడ్డకు కారణా లవుతున్న పరిస్థితులను తొలగిస్తూ, సమాజాన్ని మంచి వైపుకు మలుపుతూ ముందుకు సాగే ప్రజ్ఞావంతుడే నిజమైన నరనాయకుడు.

అట్టి నాయకులు సమాజంలో చాల మంది వుంటారు. నిజానికి సమాజాన్ని నడిపించే వాళ్ళు వాళ్ళే.

భీమన్న మహాత్ముడూ కాదు, నాయకుడూ కాదు, కనీసం సంఘ సేవకుడు కూడ కాదు. సౌందర్య దృష్టితో సాహిత్య సృష్టి చేసుకుంటూ పోతున్న ఒక కళా కార్మికుడు. ఒక నిత్య సాధకుడు. అందువల్ల ఒక సామాన్యుని ఆశ్రయించుకుని వుండే వెలుగు నీడ లన్నీ ఈయన చుట్టూ కూడ వుంటై.

అన్ని వర్గాల లోను, మట్టాల లోను భీమన్నకు మిత్రు లున్నారు. అందులో రిక్షా వాలాలు కూడ వున్నారు. వారిలో ఒకడు రిక్షారెడ్డి. అతడి మకాం అశోక నగర ప్రాంతం. సొంత రిక్షా. రోజంతా ఎక్కడెక్కడ తిరిగినా - రాత్రి పదకొండు ప్రాంతానికి ఆబిడ్సుకు చేరి, క్వాలిటీ ప్రాంతంలో భీమన్న కోసం ఎదురు చూస్తూ కూర్చునే వాడు.

ఒక రోజున అర్ధ రాత్రివేళ భీమన్న రిక్షా ఎక్కి ఇంటికి పోతున్నాడు. రిక్షా కింగ్ కోఠి రోడ్డుకు మళ్ళి వేగం అందు కొంది. అంతలో - తాజ్ హోటల్ సమీపంలో నిలబడి వున్న ఒక రిక్షా నుంచి ఎవరో చేయెత్తి పిలిచి నట్లయి, తన రిక్షాను ఆ పించాడు భీమన్న.

"ఆ రిక్షాలో ఎవరో వున్నారు. మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు ఆ రెండో రిక్షా వాలా వచ్చి, ఎవరో తెలిసిన వా ళ్ళనుకొని, భీమన్న రిక్షా వెనక్కు వెళ్ళింది. ఆ రిక్షాలో వున్నది ఒక అందమైన యువతి!

"ఎవరు మీరు?" అన్నాడు భీమన్న.

"చెప్పుతాను . రిక్షాలోకి రండి !" అన్న దామె .

ఒళ్ళు ఝల్లు మంది భీమన్నకు . అమ్మబాబోయ్ అనుకున్నాడు . చీకటి ! చీక టన్నా , చీకటి విషయా లన్నా ఈయనకు పరమభయం . మిత్రులు స్నానుభవాలని చెప్పే ఎన్నిటినో కథలుగా వినడమే గాని , ఇలాంటి విషయాలలో ప్రత్యక్షానుభవం లేదు భీమన్నకు . తనకు సహజమైన పరిశోధన ప్రవృత్తి ఒక మెరుపులా మెరిసి , ఇదేదో చూద్దా మనిపించింది .

"ఎక్కడికి ? " అన్నాడు .
''మా యింటికి'' అన్నదామె .
''ఎక్కడ ?''
"ఈ సందులోనే !"
"నా రిక్షా ఎక్కు . మా ఇంటికి పోదాం ."

ఆనుమానంగా చూచిం దామె . పర్వాలేదన్నాడు . రేటు చెప్పింది . ఇంటి దాకా వస్తే పది రూపాయలు . మధ్యలో దిగిపోతే అయిదు రూపాయలు !

తన రిక్షా వాడితో ఏదో చెప్పి , భీమన్న రిక్షాలోకి ఎక్కిందామె . భీమన్న జేబు తడుము కున్నాడు . అది ఖాళీ !

"నువు దొంగవు కూడానా" అన్నాడు , ఆమె చేయి గట్టిగా పట్టుకొని , చేతిలోని కాగితాలు మెల్లిగా తీసికొంటూ .

రిక్షా నడుస్తూ వుంది . ఆ వెనుక ఆమె రిక్షా కూడా వస్తూవుంది . తన పేరు చెప్పింది . అది తెలుగు పేరే కాని , ఆమె తెలుగుది కాదు . రిక్షా నడుస్తూనే వుంది .

"రిక్షా ఆపు , నేను దిగిపోతాను" అంది హఠాత్తుగా . "ఆప వద్దు . పోనివ్వు" అన్నాడు భీమన్న . రిక్షా వేగం పుంజుకుంది .

"ఇది నీ రిక్షా కాదు" అన్నాడు భీమన్న . ఆమె రిక్షా కూడ వెనక వస్తూవుంది . పోలీసు స్టేషను ఎంతో దూరంలో లేదు . ఆ విషయం ఆమె

గుర్తించి వుండవచ్చు. దూకేసింది రిక్షాలో నుంచి. తన రిక్షా కేసి పోతూవుంది. భీమన్న జేబు తడుము కున్నాడు. ఇప్పుడు రెండోజేబు ఖాళీ!

రిక్షా రెడ్డి పరుగెత్తాడు ఆమె వెంట. ఆ రిక్షావాలాతో ఏదో ఘర్షణ పడ్డ తర్వాత, కొన్ని కాగితాలతో తిరిగి వచ్చాడు. ఆ మర్నాడు కవి సమ్మేళన కోసం అంతకు ముందే వ్రాసుకొన్న గేయం కూడా అందులో ఒకటి.

ఆ ప్రాంతంలో ఎంతో మందిని మోసం చేస్తున్న ఒకామెను గురించి విని వున్నాడు భీమన్న. తన మిత్రులలో కూడ పర్సులు పోగొట్టుకున్న వాళ్ళున్నారు. ఆ రోజుతో ఇక ఆమె ఆట కట్టిందను కొన్నాడు. ఒక అమాయక కవికి పట్టు పడే టంతటి సామాన్యులా వాళ్లు?

ఆమె గురించి తనకు తెలుసు ననీ, వాళ్ళను ఎవరూ మార్చలే రనీ అన్నాడు రిక్షారెడ్డి.

ఎవరూ మార్చలే రనే మాటతో భీమన్న ఏకీభవించడు. "ఎవరైనా మారతారు. వాళ్ళ సమస్యలకు పరిష్కారం దొరికితే" అంటాడు. పరిష్కారం వ్యక్తుల చేతిలో లేదు. సమాజమూ, ప్రభుత్వమూ అందుకు పూనుకోవాలి. అవి ఆ పని చెయ్యవు అంటాడు.

మతమూ, ఆచారమూ, భక్తీ, భగవంతుడూ -
స్వార్థం సృష్టించు కొన్న బురకా లివన్నీ!
గొర్రెల్ని ఆకర్షించడం కోసం పులులూ, నక్కలూ
అవసరాన్ని బట్టి ధరిస్తూ వుంటై పీటిని!

—టుక్రమీలు

160. మెహిందీ

ఆ రోజుల్లో గానా బజానాలకు, అంటే ఆట పాటలకు కేంద్రం మెహిందీ. హైకోర్టు సమీపంలో, రెండు మూడు వీధుల్లో, ఒక పది పదిహేను భవనాలలో ఈ కార్యక్రమాలు జరుగు తుండేవి.

ఒక్కొక్క భవనంలో - అందమైన తివాసీలతో, పరుపులతో, దిండ్లతో అలంకరించబడిన హాలులో - ఒకళ్ళిద్దరు అందమైన అమ్మాయిలు చక్కగా

ఆడుతూ పాడుతూ వుంటే - చుట్టూ సుఖాసీనులైన రసజ్ఞులు తమ కిష్టమైన పాటలు పాడించు కొంటూ, ఆనందిస్తూ వుంటారు. ఆట అభినయం, లాస్యం స్థాయిని మించేది కాదు. పాట మాత్రం త్రిస్థాయి నందుకొంటూ వుండేది.

అక్కడ అమీరులు, గరీబులు అనే తేడా ఏం లేదు. అందరకూ ప్రవేశం ఉచితమే. ఎవరైనా కాసేపు కూర్చుని ఆనందించి పోవచ్చు. అయితే ఆక్కడకు వచ్చిన వాళ్లెవరూ తాహతును బట్టి ఎంతో కొంత చెల్లించు కోకుండా వెళ్ళరు. కేవల కళాదృష్టి, కళానందం తప్ప - మరే వుద్రేకాలకూ అక్కడ స్థానంలేదు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి ఒక పవిత్ర కళా దేవస్థానంలా వుండిన మెహిందీ - ఆ తర్వాత నడమంత్రపు సిరి మొద్దబ్బాయిల కాళ్ళకిందపడి నలిగి పోయిం దంటాడు భీమన్న.

ఏమి తోచనప్పుడు మెహిందీకి పోయేవాడు భీమన్న. అప్పటికి నచ్చిన చోట కాసేపు కూర్చుని వచ్చేసేవాడు. నచ్చడ మనేది ఎప్పటి కప్పుడు ఆప్పటి మానసిక స్థితిని బట్టి వుంటుంది.

ఒక రోజున తనకు గురుస్థానీయులైన మిత్రులలో ఒకరు, గుంటూరు ప్రాంతానికి చెందిన వాడు, భాగ్యనగరం వచ్చాడు. ఆయన వచ్చినప్పుడెల్లా ఈయనకు ఆయన తోడిదే లోకం. ఆయన సౌందర్యోపాసకుడు, తత్త్వవేత్త. సత్య పరిశోధనలో వివిధ ప్రయోగాలు చేస్తూ వుండేవాడు. మెహిందీ చూడా లన్నాడు.

ఆప్పటికి తమతో వున్న రామదాసు గారిని కూడ తీసికొని, టాక్సీ ఎక్కి మెహిందీకి వెళ్ళారు. పదేసి విడిరూపాయ నోట్లను ముందుగానే వీళ్ళ జేబుల్లో వుంచా డాయన. తన కోరిక మీదనే వెళుతున్నారు కాబట్టి, ఖర్చంతా తానే పెట్టుకోవా లనే మర్యాద అది.

మొత్తం అన్ని చోట్లా తిరిగి, ఒక చోటికి చేరి కూర్చున్నారు. అక్కడ ఇద్ద రమ్మాయిలు మధురంగా పాడుతున్నారు. అందులో ఒకామె చాల అందంగా

ఉంది. వచ్చిన వాళ్ళంతా ఆమె చేతికే ఒకటో, రెండో అందిచ్చి, చెంపలు కొట్టించుకొని పోతున్నారు.

అన్నిటా ఆ యిద్దరూ సమానులే. సౌందర్యంలో ఒకామె మిన్న అయితే సంగీతంలో రెండో ఆమె పై చేయి. అయితే - సౌందర్యాన్నే ఆరాధించి పోతున్నారంతా. సంగీతం చిన్నబోతోంది. అది భరించ లేని భీమన్న సంగీత చేతిలో రూపాయి పెట్టాడు. ఆమె కళ్ళు జిగేలు మన్నై. తెలుగు పాట పాడమన్నాడు.

మెహిందీలో ఎక్కువ తెలుగు పాటలు పాడించిన గౌరవం భీమన్నకే దక్కుతుం దనవచ్చు.

"గోదారీ గట్టుంది" అంటూ ఎత్తుకొన్న దామె. వాద్య బృందం భీమన్నకు తెలిసినవాళ్ళే, హుషారు సంతరించు కున్నారు. అద్భుత స్థాయి నందు కొన్నది కార్యక్రమం. మళ్ళీ ఒక రూపాయి అందించా డామెకు. మరో రూపాయి. మరో రూపాయి.

భీమన్న సంగీతను అభిమానించడంతో సౌందర్యలోని అహం దెబ్బ తిన్నది. అసూయ మేల్కొన్నది, రెచ్చిపోయింది. భీమన్న దగ్గరకు వచ్చి పాదాల వద్ద నేలను తాకి, కళ్ళ కద్దుకొని పాటెత్తు కొన్నది. ఆ సమయంలో అ సౌందర్యమంతా బంగారంలా కరిగి సంగీతంగా విన్యసించి గుబాళించిం దంటాడు భీమన్న. సదస్సు యావత్తూ మత్తెక్కి పోయిం దంటాడు.

ఈ లోగా, మిత్రుడి జేబులో ఖర్చు కాకుండా పడివున్న నోట్లను కూడ అందుకొని తన జేబులో పెట్టుకొని వున్నాడు భీమన్న. సౌందర్య పాట ముగించగానే ఆ నోట్లన్నిటినీ తీసి, ఆమె దోసెట్లో పోసేశాడు.

గోళ్లకు గోరింత, పెదవులకు తమ్మ, కళ్ళకు కాటుక -
ఇవేనా సత్యం, శివం, సుందరం మనిషికి?
శిల్పం, సంగీతం, సాహిత్యం - ఈ మూడే!
ఈ మూడూ కలిసిన ముక్కంటివి నేను!

—ట్రాన్స్‌లేషన్

161. ప్రేమ లోయ

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు మనిషికి శత్రువులు కాదంటాడు భీమన్న. పదార్థం, గుణం, భావం - సృష్టిలో ఏదీకూడ వ్యర్థ మయింది కాదు. ప్రతి దానికీ ఒక ప్రత్యేక ప్రయోజనం వుంది. పిల్లవాడు, డాక్టరు, దొంగ, సైనికుడు - కత్తిని ఎవరైనా పట్టవచ్చు. శత్రువు కత్తి కాదు. మానవ శ్రేయ స్సాధనకు సమయోచితంగా వాడుకోవలసిన శక్తులు కామ క్రోధాదులు. త్రిధాతువుల వంటి వవి. ప్రకోపిస్తేనే దోషాలవుతాయి.

అసూయకు, స్పర్ధకు జీవిత పురోగమనంలో ప్రముఖ స్థానమే వుంది. ఆవి వ్యక్తించి ద్వేషంగా మారడం, ఆహారం వికటించి విషంగా మారడం - రెండూ ఒక్కటే.

సంసార బంధాన్ని నాగరత్నమ్మ తెగే వరకు లాగి త్రెంచి వేసి కోవ దంతో, భీమన్న దారం తెగిన గాలి పటమైనాడు. ఆ దారం మళ్ళీ ఎవరి చేతిలో చిక్కుకొంటుందో తెలియని దశ అది. ఆకర్షణ లెన్ని వున్నా, ఆకాశం ఎంత విశాలమైన దైనా-ఎక్కడో ఒక చెట్టు మీద, వీదో ఒక గూడంటూ లేక పోతే - స్వేచ్ఛా విహారానికి విలువంటూ వుండదు. చిత్త స్వాస్థ్యం లేకపోతే, అసలు స్వేచ్ఛే వుండదంటా డీయన. పైగా - సృష్టికి, ఏ కళా సృష్టి కైనా, ప్రధానంగా కావలసింది స్వాస్థ్యమే. ప్రశాంత సుభగమైన మనస్సు, తృప్తితో పూర్ణకుంభమే అయిన హృదయం.

భీమన్న జీవిత సాగరంలో ఎన్ని తుఫానులు రేగి, ఎంత కల్లోలం జరి గినా - ఆదంతా కేవలం పైమట్టం మీదనే. అంతరంగం ఒక అచంచల సమాధి!

పర్వతాలు, నదులు, పొలాలు, ఉద్యానాలు - అందచందా అన్నీ భూ తలం మీదనే. ఎంతటి పిడుగులైనా, ప్రకంపాలైనా పెకల్చేది ఉపరి తలాన్నే. అంత స్థితిని కాదు.

అనుభవ యోగ్యంకాని దేదీ సృష్టిలో లే దంటాడు భీమన్న. మట్టి మొదలు మధువు వరకు అన్నీ తినదగినవే. జీర్ణ శక్తిని, శరీర స్థితిని, చెయ్యవలసిన

పనిని బట్టి పదార్థాలను ఎంచుకోవలసి వుంటుంది. సర్వోదయ నాయకుడికి మేక పాలు చాలు. రాళ్ళు పగలగొట్టే కార్మికుడు మేకనే తినవలసి వుంది.

అంతరంగం ఎంతటి పూర్ణకుంభ మైనా, బాహిరమైన ప్రతి ఆలకూ తల వొగ్గే బాల పల్లవం భీమన్న మనస్సు. లోకంలో తనను కోరి వచ్చే ఏ అందాన్నీ వద్దన లేడు ఏ అనుభవాన్నీ కాదనలేడు. ప్రతి లవలేశంలోనూ తాదాత్మ్యం చెంది పోతాడు. పుట్టినప్పటి నుంచీ ఇదే తత్వం. ఈ తత్వం ఈయన బొటన వ్రేలిలో వున్న దంటారు సాముద్రికులు.

1963 మార్చిలో ఒక సాయంకాలం వసంతారంభ శోభతో పరమ దర్శనీయంగా వుంది ప్రేమ లోయ–లో వ్యాలీ.

విశాఖపట్నం హార్బరుకు ఆవలి ప్రక్క లైట్ హౌస్ వుండే డాల్ఫిన్ కొండకు వెనుక భాగంలో, విష్ణుదేవుని నాభికమలంలా, సమస్త ప్రకృతి సౌందర్యాన్ని పణికి పుచ్చుకొన్న లోయ అది. ఎంతమంది జంటలు ఆ లోయను దర్శించి ప్రేమికు లైనారో! ఎంత మంది ప్రేమికుల పాద ముద్రలతో రంజితమై అది ప్రేమ లోయ అయిందో!

చుట్టూ ఎత్తైన కొండలు, జలధారలు, వాపికలు, వృక్ష లతాగుల్మాదులతో చిక్కని అడవులు. లోయ నిండా రకరకాల తోపులు, పక్షులు – ఆ నడుమ ఒక చిన్నగుట్టపై భీమన్న, ఆ ప్రక్కన ఒక యువ. ...

బాపురెడ్డి "విశాఖ లేఖ" కవితలో పేర్కొన్న సౌందర్య కేంద్రా లన్నిటినీ చూచేసి, ఆప్పటి కక్కడికి చేరారు వాళ్ళు.

భీమన్న విశ్వ సౌందర్య పిపాసు లైతే, ఈ యువ భీమన్న కవితా రస పిపాసువు. ఈయన ప్రతి రచనకూ వెనుక వుంటూవుండే అసంఖ్యాకమైన ప్రేరక శక్తులలో ఈ యువ ఒకతె. భీమన్న రచనలచే ఉత్తేజితుగాలై ఈయన స్నేహ పరిధికి చేరిన ఈమె, ఈయన కవితా లత మహా వృక్షమై వికసించ డానికి హేతుభూత మయిందా తర్వాత.

ఆది మధు మాసం. సాయంసమయం. ఆసందమే పరమార్థమైన ప్రేమైక జీవులకు అక్కడ, ఆ సమయంలో లభించని పదార్థమంటూ ఏమీ వుండదు.

అప్పుడే చెట్టు నుంచి దింపిన లొట్టెను చేత బట్టుకొని, తన గుడిసెకు పోతున్న ఒక గీత కార్మికుడు, ఇటు వచ్చి ఆగాడు భీమన్న వద్ద. ఆదేమి మూగ భాషో! లొట్టె నక్కడపెట్టి, గ్లాసు తెచ్చాడు. ఆ వెనక అతని భార్య చేప ముక్కలు తెచ్చి పెట్టింది. దానితో అక్కడ ఆడా మగా అంతా భీమన్న చుట్టూ చేరారు. ఎంతలో ఎంత సన్నిహితుడై పోయా డీయన వాళ్ళకు!

ఈ వ్యవహారం కిట్టని యువ – చేసేది లేక, చకితురాలై చూస్తూ కూర్చుండి పోయింది! గీత కార్మికులే గీతామృత ధార్మికులు భీమన్న దృష్టిలో ఆ క్షణం!

ఎవరీ కార్మికుడు?
గీత కార్మికుడా? గీతాశ్రమ కార్మికుడా?
అరే, బాబా! పీఠాధిపా! భూపా!
రండయ్యా, ఇదిగో - శ్రమ సారం!

-- టుమ్రీలు

162. ఆప్యాయతే అమృతం

ఆ రాత్రి భోజనం బయ్యా పుల్లయ్య గారింట్లో. అప్పటి కాయన పోలీసు శాఖలో అందరి మన్ననలను అందుకొంటున్న ఒక ఉన్నతాధి కారి. భీమన్న వెళ్ళే టప్పటికి రాత్రి పదకొండు గంటలు. కాలాతిక్రమణ మర్యాదాతి క్రమణే. పైగా-పుల్లయ్యగారికి కోపం వస్తే పచ్చి సంస్కృతం ప్రయోగించేస్తాడు. భయపడుతూనే వెళ్ళాడు భీమన్న.

ఇంతకూ ఆలస్యానికి కారణం యువ. తాను సెనేటు మీటింగు కోసం వాల్తేరుకు బైలుదేరి నప్పుడు, వెంటబడి వచ్చింది. విశాఖ మండలంలో ఆమె అన్నగారు ఉద్యోగంలో ఉన్నాడు. అక్కడికి పోతా నంది. ఈ వారం రోజులు తనతోనే తిరుగుతూ ఉంది.

వచ్చిన మర్నాడే సింహాచలం వెళ్ళారు. అంతకు ముందు చాలసార్లు వెళ్ళా దక్కడికి తాను. ఎప్పుడూ అంత రాగ రమణీయంగా కనిపించ లేదా దృశ్యాలు తనకు. తనకు పులిహోర గిట్టదు. అమృతంలా వున్నదది ఆనాడు. ఆ తరువాత రోజున కృష్ణార్జున యుద్ధం మేటినీ చూచి, బీచికి పోయారు. రాత్రి పదకొండు గంటల వరకు అలలతో ఆటలు, ప్రదీపాలతో పాటలు.

ఈ రోజున, రాత్రి ఎనిమిది వరకు ప్రేమ లోయలో గడిపి, మెడికల్ హాస్టల్‌లో ఆమె మిత్రురాండ్రు నిర్మల, ఇందిర, మైథిలి, ఆదిలక్ష్మి మున్నగు వారి వద్ద ఆమెను వదిలేసి, బైట పడే టప్పటికి అంత రాత్రయింది.

పుల్లయ్య గారింటి వద్ద బైట ఎవరూ లేకపోతే తిరిగి వచ్చేద్దా మనుకొన్నాడు భీమన్న. మరిచిపోయా నని క్షమాపణ చెప్పుకోవచ్చు తర్వాత. అయినా తన కోసం అంత రాత్రి దాకా ఎవరు కనిపెట్టుకు కూర్చుంటారులే అనుకొంటూ రిక్షా దిగాడు. గేటు వద్దనే నిలబడి వున్నాడు జవాను!

తప్పు చేసిన బెదురు గుండెతో గడప దాటాడు భీమన్న. "అంతా క్షేమమే కదా, అన్నయ్యా" అంటూ ఎదురుగా వచ్చింది పుల్లయ్యగారి భార్య. గృహ లక్ష్మి, అన్నపూర్ణ అనే మాటలకు లక్ష్య ప్రాయంగా సృష్టించబడ్డ ఒక దేవత ఆమె.

"ఎప్పటి క్షేమం? ఇల్లు బైలుదేరి ఎన్నాళ్ళయిందో?" అంటూ బైటికి వచ్చారు, పుల్లయ్యగారు నవ్వుతూ. ఏవో కబుర్లతో ముగ్గురు భోజనం బల్ల వద్దకు చేరారు.

"నీ కీ పట్నం నిండా స్నేహితులే. కవులూ, కవితా గోష్ఠులూ. అయినా వస్తా వనుకొన్నాంలే. ఎంత రాత్రికి వస్తావో తెలియక, మేం తినేశాం" అంటూ బల్లమీద గిన్నెలపై మూతలు తీయ సాగా రిద్దరూ. హమ్మయ్య అనుకొన్నాడు భీమన్న. తన ఆలస్యం మరీ ఎక్కువగా బాధించ లేదు. అయినా అంత రాత్రి వరకూ వారు మేలొక్కని వుండడానికి కారణమైనా నన్న బాధ కూర్చునే వున్న దింకా బరువుగా. ఆది తటాలున దిగిపోయి, కళ్ళు తళ తళ మెరిశాయి-ఆ ప్లేట్లలోని పదార్థాలు చూచే టప్పటికి!

అందులో ఒక పెద్ద ప్లేటు నిండా—దిబ్బ రొట్టెలా, స్పెషల్ వడలా? రొయ్యలు! అంత పెద్ద రొయ్యలు అంత వరకు చూడ లేదు భీమన్న! ఇంకా చేపలు! గుడ్లు, వాటి అమ్మలు!

"బావ గారు! ఈ చుట్టు పక్కల మీకు కూడా అలవిగాని బకాసురు డెవ డైనా వున్నాడా ఏమిటి?" అన్నాడు భీమన్న, అన్నీ కొద్ది కొద్దిగా రుచి చూస్తూ.

భీమన్న భోజన ప్రియుడే కాని, కన్ను నిండితే కడుపు నిండిపోయే రకం. ఇక ఆ అక్క బావల ఆప్యాయత అన్నిటిని మించిన అమృతం. ఆ రకమైన అమృతం జీవితంలో ఒక్క దఫా లభించినా, ఆ జీవి ధన్యుడే అంటాడు భీమన్న.

1963 మార్చి 7,13 తేదీల మధ్య చరిత్ర ఇది. ఆ ఒక్క సంవత్సరం లోనే విశాఖలో కె. యస్. దత్తు, అచ్యుత రామరాజు, రావి శాస్త్రి, బాపురెడ్డి, సుదర్శనం, రాజమహల్ రమణ, ఆర్యా, ప్రసాద్, మున్నగు వారి రక రకాల విందులను గురించి కూడ ఇలాంటి చరిత్రలే ఉన్నై. కె. యస్. దత్తుగారిని వరించిన బాపు రెడ్డి 'రాకెట్టు రాయబారం" కావ్యానికి భీమన్న పీఠిక వ్రాసిన సంవత్సర మది. కావ్యంతోపాటు పీఠిక కూడ ఎంతో దుమారం రేపింది సాహితీ క్షేత్రంలో

నన్నయాదులు అసలు కవులే కాదనీ, ఒక్క వేమన్న తప్ప తెలుగులో కవులే లేరనీ భీమన్న ఎలుగెత్తి చెప్పిన పీఠిక అది. భీమన్న విపులంగా పీఠికలు వ్రాయడానికి మొదలు పెట్టింది కూడ దీనితోనే.

అవి తెలుగు సాహితీ నవ సౌధాలా?
విభాషీయ సమాధుల నమూనా లవి!
ఎవడయ్యా కవీ బుషీ ఈ కాలంలో?
అంతా వ్యాస వాల్మీకుల అవశేషాలు:

— టుమ్రీలు

163. జీవిత రామాయణం

1963 మార్చి 30వ తేదీన శ్రీరామ నవమి ఉత్సవాలకోసం వనపర్తి వెళ్ళాడు భీమన్న - నవ్య నాటక సమాజం వారితో కలిసి.

అక్కడికి వెళ్ళే టప్పటికి ,ఆ పట్టణాన్ని ఆనుకొని పారుతున్న ఏరు పరవళ్ళు తొక్కుతూ స్వాగత మిస్తున్నది. అంత ఉత్సాహంగా వున్న ఏటి బోటి కొగిలిలో చిక్కుకునే ధైర్యంలేక, పిళ్ళ వ్యాను ఏటిఒడ్డునే ఆగిపోయింది. అంతలో అక్కడికి రాణీ కుముదినీదేవి గారి కారు వచ్చి సరాసరి ఏరులో చొర బడింది. శుభ్రంగా మునిగిపోయింది.

ఒడ్డు మీదినుంచి తమాషా చూస్తున్నవాళ్ళు-తమ యేరే తమ రాణీవారి కారునే ముంచెత్తడం భరించలేక, ఏట్లో దూకి, ఎలాగో గట్టు చేర్చారు. ఆ తర్వాత పిళ్ళ వ్యాను కూడా ఆ ఒడ్డుకు చేరింది.

ఆ రాత్రి సభలో భీమన్న చదివిన పద్యాలే "జీవిత రామాయణం".

మానవ జీవితానికి రామాయణం ఒక అందమైన ఆద్దం. ప్రతి మనిషి జీవితమూ ఒక రామాయణమే. రామాయణంలోని ఏదో ఒక ఘట్టం ఎవరో ఒకరి జీవితంలో నిత్యమూ జరుగుతూనే వుంటుంది. రాముడు ఒక నమూనా మానవుడు మాత్రమే. ఆతణ్ణి దేవుణ్ణి చేసి రామాయణ కావ్య ప్రయోజనాన్ని నాశనం చేశా రంటాడు భీమన్న.

పద్యాలు బాగున్నాయని పండితులంతా మెచ్చుకున్నారు. ఉషశ్రీ ఆనందపడ్డాడు. ఆ మర్నాడే రేడియోలో ప్రసారం కోసం వాటిని రికార్డు చేసుకున్నాడు. ఆంధ్ర జనతలో ప్రచురణార్థం దాని సంపాదకులు కూచిమంచి సుబ్రహ్మణ్యంగారు ఫోనుచేసి రప్పించుకున్నారు. వసంత స్వయంవరం అనే గేయ నాటిక ఆ ఉగాదికే ఆంధ్ర జనతలో ప్రకటితమయింది. సుబ్రహ్మణ్యం గారు ప్రతిభావంతులైన అగ్రశ్రేణి పత్రికా సంపాదకులు. రాగ ద్వేషాల కతీతులు. భీమన్నపట్ల ప్రత్యేకాభిమానం గలవారు.

అనువాద శాఖ, పుస్తకాల రిజిష్ట్రారు కార్యాలయం బిల్డింగు అంతవరకు గాధీం భవనం ఎదురు సందులో వుండేది. 1963 డిసెంబరులో మాసాబ్‌టాంకు ఎగువలోగల హుమాయూన్ నగర్‌కు మారింది.

కందుకూరి-గురజాడ-వెంకటరత్నం నాయుడు గార్ల సెంటినరీని సెక్రటేరియట్ సంఘంవారు జరిపారు. దానికి భీమన్నే అధ్యక్షత వహించాడు.

అది 1968 జనవరి 29 . అదే రోజున కేంద్ర సాహిత్య అకాడమినుంచి టెలిగ్రాం వచ్చింది. నాలుగు ప్రతులు 'రాగ వాశిష్ఠం' పంప మని.

కేంద్ర జాతీయ అవార్డు కోసం భీమన్న రచన ఢిల్లీవరకు వెళ్ళటానికి అదే మొదలు. అప్పటినుంచి ప్రతి సంవత్సరమూ ఏదో ఒక రచన వెళు తూనే ఉండేది.

"ఇది శివుడి హృదయం. శివుడున్నంత కాలం ఇది ఉంటుంది" అంటూ బహిరంగ సభలో విశ్వనాథ ప్రశంసించిన కావ్యం-దివాకర్ల, దేవులపల్లి, బెజవాడ వారల మెప్పుకు పాత్రమైన కావ్యం "అనాది కొస" - ఆతర్వాత సంవత్సరం నూటికి 90 మార్కులు తెచ్చుకొని కూడ ఫెయిలయింది. సరైన కారణం వూహకు కూడ అందలేదు. సాహిత్య రంగంలో పాత పురాణాలకే తప్ప, కొత్త నెత్తురుకు గుర్తింపు లేదని తెలుసుకొన్న భీమన్న ఆటు పిమ్మట అవార్డులను తానే గుర్తించడం మానేశాడు. అనుకోకుండా "గుడిసెలు"కు వచ్చిందది ఒక పుష్కరం తర్వాత.

"నూరు ప్రకరణాల కావ్యం" అంటూ వచన కవితలో భీమన్న ప్రారంభించిందీ 1963 లోనే. తన ఆరాధ్య దేవత సాక్షాత్కారం కోసం భాగ్య నగరంలోని సౌందర్య కేంద్రా లన్నిటా అన్వేషణ సాగించే కావ్య మది. అది ఇంకా అన్వేషణలోనే వుంది.

తర్వాత చాలాకాలానికి "శివాలకలు" పేరుతో ప్రకటితమైన "ట్రఫీవెర్సులో ప్రేమలేఖలు" రచన కూడా ప్రారంభమయిం దీ కాలంలోనే.

ఏక కాలంలో అనేక ప్రక్రియలను ప్రారంభించడం, ఎప్పుడు దేని మీదకు మనసు మళ్ళితే దాన్ని వ్రాసుకొంటూ పోవడం అలవాటు భీమన్నకు. ఈనాటికీ ఇంకా పూర్తికాని ఏన్నో రచనలు ఆసాడా విధంగా ప్రారంభించ బడినవే.

నా ప్రియురాలు ఒక వ్యక్తి కాదు
అదొక రాగ సౌందర్యం:
నా రసం చారో, టీరో కాదు
ఆది వరమానంద పారవశ్యం.

— టుమ్రీలు

164. కాహళి ప్రోగ్రాంలు

మనదేశం ఈశాన్య సరిహద్దుపై చైనా హఠాత్తుగా దురాక్రమణ జరిపి, అనుకోని నష్టం కలిగించి నప్పుడు కోపోద్రిక్తుడైన భీమన్న పద్యాలు, పాటలు, గేయ నాటికలు చాలానే వ్రాశాడు. అవన్నీ ఆకాశవాణిలో ప్రసారమైనట్టివే.

ఆది గదిగో కాహళి
ఆ హవ జయ కాహళి,
ఖడ్గధారి కమ్మన్నది
కదన కుతూహలి!

* * * *

వేదాల పుట్టిల్లు
విశ్వనాథుని గద్దె
మన హిమాలయ భూమి
మర్యాద నిల్పరా

చైనాను నిర్జించరా, తమ్ముడా!
సరిహద్దు రక్షించరా!

మొదలైన పాటలు శ్రోతలలో వీర రక్తాన్ని పొంగులెత్తించిన సందర్భాలవి. ఈ పాట లన్నిటికీ అద్భుతమైన స్వరకల్పన చేసినవారు షేక్ మహబూబు, బండారు విన్సెంటు గార్లు. పాడినవారు-మహబూబు, విన్సెంటు, వై. రాఘవులు, డి. రామ లక్ష్మి, వీరమణి, అహల్యా, విమలా పద్మనాభం మొదలైనవారు. ఈ ప్రోగ్రాం లన్నీ సుఖేలానికేతన్ తరఫున జి. రామకృష్ణారావు, ఎస్ వి. రమణారావు, బొజ్జా తారకం, బొజ్జా కృష్ణశాస్త్రి వగైరాల పర్యవేక్షణలో జరిగాయి. వీటి నిర్వహణ అన్ని దశలలో నాకూ సంబంధం వుంది.

మోదుకూరి జాన్సన్ వెళ్ళిపోయిన తర్వాత, వాల్తేరు నుంచే విన్సెంటును పట్టుకొచ్చాడు భీమన్న. మృదంగం, తబలా వాద్యాలలో మంచి నిపుణుడైన కోటిలింగం కూడ తర్వాత ఈ బృందంలో చేరాడు. ఆ రోజులలో అనువాద శాఖ కార్యాలయ ఆవరణ సంగీత వాద్య కార్యక్రమాలతో, రిహార్సల్సుతో

కలకల్లాడుతూ వుండేది. అయితే-సుఖేలా నికేతన్‌కు ప్రత్యేకంగా, పర్మనెంటుగా సంగీత, నాట్య, వాద్య బృందాలను ఏర్పాటు చేసుకోవా అన్న భీమన్న ఆశయం నెరవేరలేదు.

చైనాను నరకాసురుడితో పోల్చి భీమన్న ప్రాసిన "అంధకారంపై దండయాత్ర" గేయ నాటిక ఒక క్లాసిక్. భీమన్న మిత్రుడు, వెనక బడిన వర్గాల నాయకుడు అయిన తులా బందుల నాగేశ్వరరావుగారి కుమారుడు అచ్యుతరాయలు ఆ చైనా యుద్ధంలోనే వీర మరణం పొందాడు. ఆయువ వీరుని ప్రస్తావన కూడ ఆ నాటికలో వుంది.

బహుశా ఆ రోజులలోనే కావచ్చు—

ఎవరి తల్లి ఎవరికౌను
ఎదలోపల నిలుపుకో?
ధీరుడివై నిలిచి, ధర్మ
వీరముతో కొలుచుకో!

అనే పాట ఆకాశవాణిలో "ఈ మాసపు పాట" అయింది. ఈ పాటను ఆకాశవాణి ఆప్పటి లలిత సంగీత విభాగాధి పతి అయిన మంచాల జగన్నాధరావుగారు ఫోను ద్వారా చెప్పించు కొన్నారు భీమన్నచే. ఆ తర్వాత ఆయనతో పేచీ పడ్డా డీయన ట్యూను విషయంలో.

మిత్రులతో పేచీ పెట్టుకొనే లక్షణం భీమన్నలో ఆదినుంచీవుంది. ఆధునిక కవుల గేయాలలో కొన్నిటిని ఎంచుకొని, లలిత సంగీత బాణీలో స్వరకల్పన చేసి, కొన్ని సంపుటాలను ప్రకటించారు మంచాల వారు. భీమన్న గేయాలందు లయ్యలో. సుప్రసిద్ధ వైణికుడూ, సంగీత శాస్త్రజ్ఞుడూ, లలిత వాగ్గేయ కారుడూ ఆయిన మిత్రుడితో పేచీ! ఆ తర్వాత ఆ విభాగానికి అధిపతిగా వచ్చిన పాలగుమ్మి విశ్వనాధం గారు భీమన్నకు మరీ సన్నిహితులు. ఆయనతోనూ పేచీ యే! ఆయితే-పేచీకి కారణా లుంటాయనుకోండి. అది వేరే సంగతి.

మరో సంగతి. ఫోనులో సాహిత్యాన్ని వినిపించి, సంగీతాన్ని వినడం భీమన్న హాబీలలో ఒకటి. ఫోను ఆవతలి కొసనుంచి శ్రావ్య సుంద

రంగా వినవచ్చే కొన్ని కొన్ని అశరీర స్వరాలకు సాహిత్య సృష్టి చేసిన మధుర ఘట్టాలు ఈయన జీవితంలో చాల వున్నై. ఎప్పుడు ఎక్కడ ఏ చిన్న సందులో నుంచి ఏచిన్న చిరుగాలి వీచినా - చిరు కిరణం సోకినా-ఈయన హృదయం చలిస్తుంది. భావం జ్వలిస్తుంది, సాహిత్యం ఫలిస్తుంది!

165. అన్నదాన మనస్తత్వం

1964 లో భీమన్నకు జ్ఞాపకంవున్న సంఘటనల్లో ఆనకాపల్లిలోని శారదా గ్రంధాలయం వారి సన్మానం ఒకటి. తన హృదయాన్ని శారదా సుభగం చేసిన సన్మానం అది.

అనకాపల్లి పట్టణాన్ని ఒరుసుకొంటూ శారదా నది ప్రవహిస్తూ వుంది. గంగా జలం తెచ్చుకుంటా రెవరైనా, భీమన్న శారదా జలం తెచ్చుకొన్నాడు హైదరాబాదుకు.

ఈయన తెచ్చుకొన్న మరో వస్తువు డాక్టర్ సుబ్బరాజుగారు బహూకరించిన బెల్లపచ్చు. అనకాపల్లిలో చాలమంది తెలుసు ఈయనకు. అక్కడ మామా యువకుల్ని కూడ చూశాడు. ఒకసారి బాపురెడ్డిగారితో కలిసి విశాఖ నుంచి జీపులో వచ్చి, మార్గమధ్యలో దాటి వదలని ఒక లారీపై చర్య తీసికొని, అనకాపల్లిలో రైలెక్కాడు. అయినా సుబ్బరాజుగారు తప్ప మరెవరు గుర్తులేరు భీమన్నకు.

"పూర్ ఫీడింగ్ (పేదలకు అన్నదానం) అనేది మానవ జాతి తనకు తాను తవ్వుకున్న ఒక పాప కూపం" అంటాడు భీమన్న. ప్రాథమిక జీవితావసరమైన అన్నాన్ని మరొకడికి దానం చేసే హక్కు ఎవడికీ లేదంటాడు. కొందరు అన్నాన్ని అన్యాయంగా, దౌర్జన్యంగా, బల ప్రయోగంతో స్వాధీనం చేసుకొని, బలహీన జనానికి దానం చేస్తూ, వాళ్ళను తన అదు పాజ్ఞలలో వుంచుకొంటూ, వాళ్ళచేత దాస్యం చేయించుకొంటూ, వాళ్ళమీద అధికార చెలాయిస్తారు. ఈ పాప కార్యానికి పవిత్రతను ఆపాదించడం కోసం అన్నదానం మహా పుణ్యం అనే నినాదాన్ని లేవ దీశారు.

అన్నం అందరిదీ. ఏ ఒక్కడికీ దానిపిద గుత్తాధికారం లేదు. కొందరు బలం కలవాళ్ళు, ముఠాకట్టి, అట్టి గుత్తాధికారాన్ని హస్తగతం చేసు కొన్న నాటినుంచే మానవజాతి పతనం ప్రారంభమయిం దంటాడు భీమన్న. అట్టి దుష్ట ముఠాకు పురోహిత వర్గం తోడ్పడిం దంటాడు. గొర్రెల్ని దోచుకు తినడం కోసం పులీ, నక్కా ముఠా కట్టా యంటాడు. మనుస్మృతి లాంటి ఆర్డినెన్సులు, చట్టాలు అలా పుట్టినట్టివే అంటాడు.

అన్నదానం మహాపాపం అనే ఈ భావం ఆనకాపల్లిలో, ఒక సంఘట నలో కలిగిం దీయనకు. దానిని గురించి రాగవైశాఖిలో చర్చించా ఆ తర్వాత.

అదే సంవత్సరం నల్లగొండలో జరిగిన అంబేద్కరు గారి ఎనిమిదవ వర్ధంతి సభకు అధ్యక్షత వహించాను భీమన్న. అది చాల రసవంతంగా సాగిన సభ. రాగవాశిష్ఠం నాటకం పీఠికలో తాను వ్రాసిన అనేక అంశాలపై వివ రణ కోరిన ప్రేక్షక యువతకు జవాబు చెప్పుకోవలసి వచ్చింది. మాలమాది గలు ఆదిలో ఒకే కులమని, ఈ కులా లన్నీ వృత్తి భేదం వల్ల ఏర్పడినవే నని సోదాహరణంగా నిరూపించ వలసి వచ్చింది.

భీమన్న ప్రసంగిస్తూ వుండగా, ఒక అధికారి గారు వచ్చారు. ఆయన సందేశం కోసం భీమన్న తన ప్రసంగాన్ని తప్పని సరిగా మధ్యలో ఆపి కూర్చో వలసి వచ్చింది. ఆయన నాలుగు మాటలు చెప్పేసి, కారెక్కి వెళ్ళి పోయాడు. కారు దాకా వెళ్ళి ఆయనను సాగనంపి వచ్చిన జనం భీమన్నను ప్రసంగం కొనసాగించమన్నారు. భీమన్న అందుకు అంగీకరించ లేదు. పైగా, జనాన్ని చెడామడా తిట్టి పారేశాడు!

"అధికారులు, పదవీ ప్రభువులు ప్రజల సేవకులు కారా? ప్రజల కంటె ప్రజాసేవకులు గొప్ప వారెలా అవుతారు? సభకు వచ్చిన వాళ్ళు కనీసం సభలోపల్గానే ప్రముఖుల ప్రసంగాల నైనా వినాలి కదా? వారి అభిప్రాయా లను తెలుసుకోవాలి గదా? కొంతమంది ప్రజా ప్రతినిధులు కూడ ఇదే తంతు. సభలకు వచ్చి, తాము ముక్కున పట్టుకు వచ్చిన నాలుగు ముక్కలూ అక్కడ కక్కేసి, సభా మర్యాదలు కూడ పాటించకుండా లేచి

పోతారు – మరెక్కడో కొంప మునిగే పను లున్నట్టు! ఎక్కడా ఏ పనులూ వుండ వని సభలో వాళ్ళకు తెలుసు నని తెలిసి కూడ "రాజు వెడలె" అంటూ బైలుదేరే వాళ్ళకు "రవి తేజము లలరగ" అంటూ వంత పలికే వందిమాగధు లున్నంత కాలం ఈ సమాజం ఇలానే తగలడుతుంది. తప్పనిసరి అయితే - మీ ప్రజలంతా రాజులు కండి! వంది మాగధులు కాకండి. పులులో, నక్కలో కండి! గొర్రెలూ, గంగి రెద్దులూ కాకండి!"

ఈ ధోరణిలో సాగిం దప్పుడు ఈయన ప్రసంగం సూదిపాటు నిశ్శబ్దంలో. చకిత మనస్కులై విన్నారంతా ఈయన ఆ వొళ్ళు తెలియని వాగ్ధోరణిని! రెచ్చగొడితే తప్ప భీమన్నలోని నిద్రాణ శక్తి బుసకొట్టదన్న సత్యం ఆ నాడా విధంగా అక్కడ ఆవిష్కృత మయింది!

భీమన్న సాహితీ సృష్టి విషయంలో కూడ ఇదే సత్యం. ఎవరో రెచ్చ గొట్టాలి!

ఈ 1964 లోనే, అక్టోబరు 4న పాలకొల్లులో మహాత్మా మైత్రీ బృందం వారు భీమన్నను సన్మానించారు. వారిలో ప్రముఖ పాత్ర అదపా వీరాస్వామి రాజా గారిది. ఆయన భీమన్న సాహిత్యాభిమానులలో ఒకరు భీమన్నకు జరిగిన అద్భుత సన్మానాలలో అది ఒకటి.

భీమన్నకు తోడుగా మోదుకూరి మోహనరావు వెళ్ళాడా టూరులో. మోహనరావు జాన్సన్ తమ్ముడు. భీమన్నకు భక్తుడు. ప్రాణం ఇచ్చే సాహసి. ఆరోగ్యం, పరిస్థితి, కార్యక్రమం దృష్ట్యా అతడు ఎస్కార్టుగా వెళ్ళా డీయనకు.

తాడేపల్లిగూడెంలో రైలు దిగి, పెంటపాడులో మిత్రులు తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తిగారి ఆతిథ్యం స్వీకరించి, వారి కారులో సాయంత్రానికి పాలకొల్లు వెళ్ళి, సన్మానం అందుకోవడం అద్భుతమైన ఒక అనుభవం!

ఆక్కడికి వచ్చివున్న గొల్ల సూర్యప్రకాశరావు, గంజి నాగరాజు మున్నగు వారితో ఆ మర్నాడు రాజోలు వెళ్ళి, మామిడికుదురు, నగరం;

రామచంద్రపురం, కాకినాడ చూచుకొని, తిరిగి వచ్చేటప్పటికి చాలా రోజులు పట్టింది. ఆది మరొక సుందర చరిత్ర.

ఆదే సంవత్సరం గోలకొండ పత్రికలో, డిసెంబరు ఇరవై ఆదివారం సంచికలో బాసాని సుదర్శనరెడ్డి గారు భీమన్నను గురించి ఒక సుదీర్ఘమైన వ్యాసం ప్రకటించారు. అంత వరకు ఆయనెవరో ఈయనకు తెలియదు. భీమన్నను గురించిన అనేక వివరాలున్నై ఆ వ్యాసంలో.

దానము చేయుటే ఒక ఆ
ధర్మము; అద్ది గ్రహీత ఆత్మనే
మ్లానము చేయు; జీవి తన
మట్టుకు తాను స్వకాంక్ష తీర్చుకో
లేని జడమ్మె? కృష్ణ! సక
లేశ్వర ధర్మివి నీకు తప్ప - ఎ
వ్వానికి శక్తి కల్గు పెర
వానికి దానము చేయ? చేకొనన్?

—మణిమానసం

166. బాలయోగి తో పేచీ

ఇంత వరకు బాలయోగిని చూడలేదు భీమన్న – ఆ ప్రాంతం వాడైనా. "బాలయోగి సవికల్ప సమాధి. టాజ్‌మహల్ సర్వికల్ప సమాధి. ఏ ముందక్కడ చూడటానికి?" అంటాడు. టాజ్‌మహల్‌ను కూడ చూడలేదీయన. బాలయోగీ, టాజ్‌మహలూ ప్రపం చామ్భతాలే.

భీమన్న తొలి ఉద్యోగం ముమ్మిడి వరంలోనే. ఇప్పుడు బాలయోగి కూర్చున్న స్థలంలో కూర్చుని, అంతకు ఆయిదేళ్ల ముందే, ఈయన ఆకాండ తాండవం వ్రాశాడు. ఆ ప్రాంతాలు, ప్రజలు ఈయనకు అత్యంత ఆత్మీయులు.

ఏమీ తినకుండా, తాగకుండా, కనీసం కదల కుండా – ఒక పన్నేండేళ్ళ హరిజన కుర్రవాడు సమాధిలో కూర్చున్నాడనీ, అతణ్ని బాలయోగి

అంటున్నారని లోకానికి తెలిసి నప్పుడే భీమన్నకూ తెలిసింది. జిల్లా కలెక్టరు, స్థానిక నాయకులు, పండితులు, పోలీసు శాఖవారు ఏన్నో విధాల పరిశోధించి, ఆతడు నిజమైన యోగే అని తేల్చిన తర్వాత అదొక దేవస్థాన మయింది. ప్రజలు ఆకర్షితులైనారు. ఉత్సవాలు ప్రారంభ మైనాయి.

"బాలయోగిని గురించి మీ రేమను కొంటున్నారు?" అని భీమన్న అడిగి నప్పుడు "హి ఈజ్ నాట్ ఎ హోక్స్, అతడు మోసకారి కాదు" అన్నారు కళా వెంకటరావుగారు. ఆవులించ కుండానే ప్రేవులు లెక్క పెట్టే కళావారే ఆ మాట అన్నప్పుడు, బాలయోగి మహాయోగే అనే భావం భీమన్నలో నాటు కొన్నది. అప్పుడే, మద్రాసులో ఉండగానే బాలయోగిని గురించి ఏదో వ్రాయాలనే సంకల్పం ఈయనకు కలిగింది. బాలయోగిపై ఒక చలన చిత్రం తీస్తున్నామనీ, స్క్రిప్టు వ్రాసి పెట్టమనీ కొందరు పెద్దలు అడిగి నప్పుడు ఆయనను గురించిన వివరాలు సేకరించాడు. ఆ తర్వాత వాటిని నాటకంగా వ్రాసు కొన్నాడు.

బాలయోగిని గురించి మొదటి నుంచీ శ్రద్ధ తీసుకొంటూ వచ్చిన ఈలి వాడపల్లి గారికి ఆ నాటకాన్ని అంకిత మిచ్చాడు. అంకిత సభ 1964, డిసెంబరులో కాకినాడలో జరిగింది. భీమన్నకు బాల్య మిత్రుడూ, హరిజన ఉన్న తోద్యోగీ, గొప్ప మేధావీ అయిన జొన్నల మోహనరావు గారు నూతన గృహ ప్రవేశమూ, అమ్మాయి వివాహమూ జరుపు కొంటూ — ఆ సందర్భంలోనే, ఆ పండిట్లోనే ఈ అంకిత సభను కూడ ఏర్పాటు చేశారు. సభకు మహాకవి జాషువా అధ్యక్షత వహించారు. ఆయన చేతనే వాడపల్లి గారికి "మహర్షి" బిరుదం ఇప్పించి, ఆ పైని బాలయోగిని అంకితం ఇచ్చాడు భీమన్న. తారకం గారు, పాత్రుడు, పత్తిపాటి సుబ్రహ్మణ్యం, మోకా మీరయ్య, బి. వి. రమణయ్య మున్నగు వారెందరో ప్రసంగించిన సభ అది.

ఆ తర్వాత సుమారు రెండు నెలలకు — హఠాత్తుగా ఒక రోజున ముమ్మిడివరం బాలయోగి కమిటి ఉపాధ్యక్షుడి నుంచి ఒక రిజిష్టరు ఉత్తరం వచ్చింది భీమన్నకు.

"బాలయోగి" నాటకంలో సత్యదూరమైన విషయా లున్నా యంటూ బాలయోగి చెప్పారనీ, అందువల్ల ఆ నాటకం ప్రతులను ప్రచారంలో పెట్ట వద్దనీ, పెడితే కోర్టు ద్వారా చర్య జరపగల మనీ ఉంది ఆ ఉత్తరంలో!

విస్తుపోయాడు భీమన్న. బాలయోగి కమిటీ అధ్యక్షుడు వాడపల్లిగారే. ఈ నాటకాన్ని ప్రదర్శించడం కోసం, వచ్చే శివరాత్రి ఉత్సవంలో ప్రతులను విరివిగా పంచడం కోసం ఏర్పాట్లు కూడ చేస్తున్నారు. ఈ మధ్యలో ఈ ఏడు గేమిటి?

ఆ ఉపాధ్యక్షుడు ఒక హరిజనేతరుడు. ఆ ప్రాంతపు భూస్వాముల వర్గా నికి చెందిన వాడు. బాలయోగిపై ఎందరో ఎన్నో రకాల పుస్తకాలు ప్రాసి వ్యాపారం సాగిస్తున్నా రప్పటికే.

ఎవ రెంత ప్రాసినా, బాలయోగికి రెండు, మూడు పేజీలకు మించిన చరిత్ర లేదు. దానికి ఏ భగవద్గీతనో చేర్చి ఉద్గ్రంథం చేసి, భక్తులకు అమ్ము కొంటున్నారు. కేవల వాయు భక్షకుడై, మౌనియై, సమాధి గతుడై, ఏకాంతం కోరి వున్న మహా తపస్వినిని తరచు డిస్టర్బు చేస్తూ, తాము తరించే మార్గం చెప్పమని వేధిస్తున్నారు. పీళ్ళ పీడ పడలేక గీతను ప్రక్క నుంచు కొని ఏదో పేజీ చూపి చదువుకో మంటూ డుట బాలయోగి. అడిగే ప్రశ్నలకు సైగలతో జవాబు లిస్తాడట. అవి ఒక్కొక్కళ్ళకు ఒక్కొక్క విధంగా అర్థ మవుతై. ఎవడి నోరు పెద్దదైతే వాడు చెప్పే అర్థం బాయ మవుతూ వుంటుంది.

ఉర్యాప్తు ద్వారా భీమన్నకు తెలిసిన వివరా లివి. బాలయోగిని ఒక వ్యాపార కేంద్రంగా చేసుకొన్న స్వార్థ శక్తులు, బాలయోగి సుబ్బారావు గా వున్న రోజులలో అతడి చేత పాలేరు తనం చేయించుకుని అవస్థ పెట్టిన ఖామందులు, భీమన్న వంటి వాడు రంగంలో దిగడం ఇష్టం లేక, ఉత్తరం రాయించా రని తెలిసింది భీమన్నకు-వాడపల్లిగారి ద్వారా.

"బాలయోగి చేత పేడ తీయించామా? బాలయోగి మీదకు చీపురు కట్ట ఎత్తామా?" అంటూ కోపతాపాలు ప్రదర్శించా రట ఆయన మాజీ ఖామందులు.

"మరేం చేశారు? ముద్దు పెట్టుకొన్నారా?" అనడిగాడు భీమన్న. పాలేరు సుబ్బారావు పన్నెండేళ్ళనాటికే నలుగురు భామందులను మార్చవలసి వచ్చింది, ఎందువల్ల?

వ్యక్తి గొప్పవాడైన తర్వాత-అంతవరకు అతణ్ని హింసించిన వాళ్ళే పెద్ద పెద్ద పూలదండలు పుచ్చుకొని పూజించడానికి ముందుకు దూకుతారు.

ఆ ఉత్తరానికి భీమన్న వ్రాసిన జవాబిలా వుంది.

"బాలయోగితో నాకు ప్రత్యేక దర్శనం ఇప్పించండి. నా నాటకంలో ఆయన ఏ మార్పులు చెయ్యమన్నా చేస్తాను. ప్రత్యేక దర్శనం వీలుకాక పోతే, నాకు స్వప్నంలో కనిపించి చెప్ప మనండి. ప్రతి ఉదయమూ కాశీలో గంగా స్నానం చేసి వచ్చే ఆ మహాయోగికి సాధ్యం కాని దేముంది?"

ఆ లేఖను భీమన్న ఆలా ముగించేసి ఉంటే బాగుండును. కాని ఈయన మాత్రం సామాన్యుడా? పైకి ఎంత సాధువో, లోపల అంత అహంకారి.

"బాలయోగిని బాలశివు డన్నాను. శివస్థానంలో కూర్చోబెట్టాను. బహుశా ఇది మీ బాలయోగికి అర్థం కాలేదేమో! అయ్యా, ఉపాధ్యక్షుల వారూ! మీ బాలయోగికంటె నేను గొప్పవాణ్ని. కొంచం ఒళ్ళు దగ్గర పెట్టుకొని మసులుకోండి" అంటూ ఒక హెచ్చరిక విసిరాడు. అంతే. దానికి మళ్ళీ జవాబు రాలేదు.

జీవించి వున్న వ్యక్తులను గురించి సత్యం చెప్పడం ఎంత ప్రమాదమో ఈ ఉదంతం స్పష్టం చేస్తుంది. "సత్యం వద" అన్న మన వేద ఋషుల సుభాషితం ఒక నినాదం గానే మిగిలి పోయింది. సత్యాన్ని ఎంత జయప్రదంగా అణచి వుంచగలిగితే - సాంఘికంగా అంత గౌరవం పొందుతున్నాడు, అంత ఉన్నత పదవికి చేరుతున్నాడు మనిషి.

అసత్యాన్ని, అన్యాయాన్ని, అధర్మాన్ని ఎదిరించే ధైర్యం సామాన్య మానవుడికి రాకుండా మానవజాతి మరో మెట్టెక్క జాల దంటాడు భీమన్న.

మానవు నభివృద్ధి మందగించినది
నిల్వ నీడికి బోలె తెల్విదప్పినది
సంభవించుట ఇంక సాధ్యమ్ము కాదొ
నేటి మానవునుండి మేటి మానవుడు ?

— ప్రకృతిలో మానవ ప్రకృతి

167. తిక్కవరపు వారి సన్మానం

మానవునిలో సహజ వికాసానికి భీమన్న జీవితం ఒక చక్కని ఉదాహరణ. ఈయన జీవితం వసంతంలో రసాలం, వర్షంలో సెలయేరు, శరత్తులో వరిపొలం, హేమంతంలో హిమాలయం. హిమాలయం అనడం ఇష్టం లేనివాళ్లు వట్టి హిమం అనుకోవచ్చు. అంత సహజం అని చెప్పడమే నా ఉద్దేశం.

శరత్తులో కూర్చుని రసాలంలా వికసించాలనీ, వరదలా ముంచెత్తాలనీ అనుకోడు భీమన్న. వరి పొలంగానే ఉండి పోతాడు. కోరిక అనే దేవ్రైనా వుంటే – అప్పటి ఈయన కోరిక – రైతు కన్నులలో ఆనంద బాష్పాలుగా అతని బుగ్గల మీద తరడా లని.

తాను ఎన్నడూ ఆశించని, ఊహించని సన్మానాలు, గౌరవాలు, కీర్తి ప్రతిష్ఠలు కూడ ఈయనను వెతుక్కుంటూ వచ్చాయి, వరించి వచ్చాయి. అందులో – నెల్లూరులో తిక్కవరపు రామిరెడ్డి గారు చేసిన సన్మానం ఒకటి.

రామిరెడ్డి గారి పట్ల భీమన్నకు భక్తి వుండడంలో విశేష మేమీ లేదు. భగవంతుడికి అందరూ భక్తులే. భగవంతుడి వదాన్యతలో, కోటీశ్వరతలో ఒక్క పైసా వంతైనా తన మీదకు ప్రసరిస్తే, ఆ భక్తుడు ఎంత ధన్యుడు!

కవిత్రయ సంస్మరణ మహోత్సవాలు వీండ్ల తరబడిగా జరుపుతున్న రామిరెడ్డిగారు, తెలుగు దేశంలోని కవి పండిత ప్రతిభా వ్యుత్పత్తుల పారం చూచిన వారయ్యే వుంటారు గదా? అంతటి ఉన్నత శిఖరంనుంచి చూచినప్పుడు ఆయన దృష్టికి భీమన్న ఎలా కనిపించాడు? అంటే–ఆయన అంతటి పరమోన్నతుడూ, దివ్య ద్రష్టా అన్న మాటే కదా!

1965 ఏప్రిల్ 23వ తేదీన రామిరెడ్డిగారిచే సన్మానితుడై, 'అనాది కాస' కావ్యం నుంచి కవితాగానంచేసి, రెడ్డిగారి ఆనందాన్ని చవిచూచి, అవధుడై పోయిన భీమన్న తాను ధన్యుడ ననుకోవడంలో విశేష మేముంది?

అట్టి సన్మాన కార్యక్రమాలలో అనవాయితీగా వచ్చే రొటీను భీమన్న విషయంలో సడలించ బడింది. భీమన్న పొరుగూరు వెళ్ళినప్పుడు మిత్రుల, బంధువుల ఇండ్లలోకాని, కార్యకర్తల, నాయకుల విడుదులలోగాని దిగడు. తనకు నచ్చిన లాడ్జింగులో దిగుతాడు. నెల్లూరుతో కూడ అలానే చేశాడు. లాడ్జింగు ఖర్చుకూడ రామిరెడ్డిగారే భరించారు. భీమన్నకు దారి ఖర్చుకూడా ఇచ్చారు. ఇవి రెండూ అంతకు ముందు ఆమలులో లేనివి.

ఈ సందర్భంలోనే - అదే లాడ్జింగులో దిగివున్న శాసనసభ్యుడు అల్లం కృష్ణయ్య, అక్కడ అదనపు జిల్లా జడ్జిగావున్న మాజీ శాసనసభ్యుడు కొత్తపల్లి పున్నయ్య గార్ల ఆతిథ్యాలను గురించికూడ చెప్పవలసింది చాలానే వుంది. స్పృశించి వదిలేస్తున్నాను.

మరో విశేష మేమి టంటే-తిరుపతికి వెళుతూ, నెల్లూరులో ఆగి, ఈ సన్మానాన్ని అందుకొన్నాడు భీమన్న.

తిరుపతిలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు డైరెక్టరుగా, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలుగుభాషా వర్క్-షాపును ఏర్పాటు చేసింది. అందులో భీమన్న ఒక ప్రముఖ సభ్యుడు. ఆ వర్క్-షాపు ఆక్కడ ఎంతో చర్చ తర్వాత తెలుగు అధికార భాషగా శిష్టవ్యావహారికాన్ని వాడా లనే తీర్మానం చేసింది. తీర్మానాన్ని రూపొందించినవాడు భీమన్నే. అది మరొక ప్రత్యేక చరిత్ర.

తిరుపతి నుంచి రైలులో తిరిగివస్తూ, నెల్లూరు స్టేషనులో మల్లెమొగ్గలు కొన్నాడు భీమన్న-ఆ పెట్టెలోని మహిళ లంతా కొనుక్కొంటుంటే. ఈయన ఈ మొగ్గల్ని ఏంచేస్తాడా అని చూడసాగా రంతా. ఏంచెయ్యాలి?

మనసులోని కోరికలకు
మచ్చుతునక లీ మల్లెలు

అనే పాట మనస్సులో అప్పుడే మొదలయిం దని ఆ చూచే వాళ్ళకేం తెలుసు ? రాఖీలలోని పాట లన్నీ ఇలా అనుభవంనుంచి పుట్టినట్టివే . అయినా తనకు పూలుకట్టడం బాగానే వచ్చు .

168 . కర్తవ్యం – నేరం

1965 మే మాసాంతంలో , అఖిల భారత తెలుగు మహాసభ మూడవ సమావేశం మూడు రోజుల పాటు తిరుపతిలో జరిగింది . అప్పుడు జరిగిన కవి సమ్మేళనకు భీమన్నే అధ్యక్షత వహించాడు . ఆ సమావేశానికి భీమన్నను అనుసరించి వెళ్ళిన పరివారంలో ఈయన చెల్లెలు ద్రౌపదీ , నేనూ కూడా వున్నాం .

చిట్టిమల్లి శంకరయ్యగారు జనగాం నుంచి మా పరివారంతో కలిశాడు . ఆయన కవి మాత్రమే కాక , మంచి ఆయుర్వేద వైద్యుడు కూడ . ఈ రెండు విధాలుగాను భీమన్నకు ఎంతో సహాయకారిగా వుండే వాడా రోజులలో . ఆ ప్రయాణంలో మరిన్ని .

రాగ వైశాఖి వాత ప్రతిని కూడా తెచ్చుకున్నాడు భీమన్న – తుది మెరుగులు దిద్దడం కోసం . దానిని శంకరయ్యగారు తీసుకొని , ప్రయాణం పొడుగునా చదువుతూనే వున్నాడు ! అది అద్భుతమైన రచన అనీ , వెంటనే ప్రింటు చెయ్యమనీ చెప్పిన మొదటి వ్యక్తి శంకరయ్య గారే !

సపరివారంగా తిరుపతితో పాటు కాళహస్తిని కూడా చూశాం ఆ యాత్రలో .

సుప్రసిద్ధ రచయిత్రి లత గారితో భీమన్నకు తొలి పరిచయ మయిందా సందర్భంలోనే . పరస్పరం తెలిసివున్నా , కలిసి మాట్లాడుకోలే దంతవరకు . ప్రసిద్ధ గాయని జయలక్ష్మి కూడ ఈయన పాటలను కొన్నిటిని తీసికొన్న దప్పుడు .

ఎన్నో అభినందనలతో, అసూయలతో, సరదాలతో, చికాకులతో, అద్భుత సన్నివేశాలకూ, అనుభవ వైభవాలకూ ఆలవాలమైన యాత్ర అది. భీమన్న జీవితంలో ప్రతి ఘట్టమూ ఒక సంపూర్ణ నాటకమే.

అదే సంవత్సరం నవంబరు 14న వర్కింగ్ జర్నలిస్టుల సంఘం వారు ప్రెస్ క్లబ్బులో ఒక కవి సమ్మేళన ఏర్పాటు చేశారు. 'హేమవంతుని హితోక్తి' పద్యాలను చదివాడు భీమన్న. ఇదీ, వరంగల్లులో టీచర్సు యూనియన్ వారు ఏర్పాటు చేసి నట్టిదీ – ఈ రెండూ కూడ ఈయనకు ఎంతో తృప్తి నిచ్చిన కవి సమ్మేళనలు.

అదే సంవత్సరంలో "తుపాకి రవ్వలు" అనే పేరుతో ఒక విరగేయ సంకలనాన్ని ప్రకటించాడు నదీరా. నదీరా మంచి కవి, గాయకుడు. భీమన్నకు మంచి మిత్రుడు. తుపాకి రవ్వలలో భీమన్న గుండ్లు కూడ వున్నై. అయితే – అప్పటికి యుద్ధం నిలిచి పోవడం వల్ల ఆ రవ్వలు కనీసం ఆవిష్కరణకు కూడ నోచుకోలేదు! ఒక క్షణంలో విధ్యుక్త ధర్మమైనట్టిదే, మరో క్షణంలో నిషిద్ధమైన నేరం అవుతూ వుంటుంది రాజకీయాలలో.

"మనిషి గతం నుంచి నేర్చుకోడు, మనిషికి ఆదర్శం అనే దేదీ లేదు. ఇది భీమన్న సిద్ధాంతం. గాలి ఎటు వీస్తే అటు వాలే మొక్కలాంటి వాడు మనిషి. ప్రతి మనిషికీ తాను బ్రతకడమే ప్రధాన లక్ష్యం. తనకు అనుకూలమైతే దయ్యాన్నైనా చేరదీస్తాడు. ప్రతికూల మైతే దేవుడినైనా పారద్రోలుతాడు. ఋషులు, ప్రవక్తలు, మహాత్ములు చెప్పిన నీతులు, న్యాయాలు, ధర్మాలు పనిచెయ్యకుండా, పనికి రాకుండా పోయిన దందుకే. "బలవంతుడైన వాడికి పాదసేవ చేసే మనస్తత్వం కల దేశంలో ఈ కర్తవ్య నిషేధాల మధ్య వ్యవధానం మరీ తక్కువ" అంటాడు భీమన్న.

నేరము చేయు చుండ్రు మహా
నీయ గుణాఢ్యులు కూడ; కాక – అ
క్రూరుడు క్రూరుడా? కలహ
కుక్షి అవజ్ఞుడ? బోయ శత్రుడా?

కారణ మేదొ ప్రేరణము
గా ప్రవహించు మనస్సిపంతి : ఏ
దారియు నిన్నె చేరును క
దా ? గుణ కర్మల లెక్క- లేటికిన్ ?

—మణి మానసం

169. ఉదార చరితులు

" వెయ్యో , పదిహేను వందలో ఖర్చుకాగల కావ్యం ఏదైనాసరే ప్రెస్‌లో ఇచ్చెయ్యండి " ఇదీ ఒక రోజున ఒక లేఖ తెచ్చిన శుభవార్త , బాపురెడ్డిగారి నుంచి . అప్పటికి ఆయన విశాఖలోనే డిప్యూటీ కలెక్టరు .

భీమన్న ఆనందం పరాకాష్ఠకు చేరింది . బహుశ-ఈయన సాహితీ చరిత్రకుకూడ అదే క్లైమాక్సు అనవచ్చు .

అప్పటికి తన వద్దవున్న పెద్ద రచన రాగవైశాఖి . అది పదిహేను వందలలో కాదు . అది ప్రింటయ్యే మరో దారికూడ లేదు . అందుకని సాహసించి , దానినే ప్రెస్‌లో ఇచ్చేశాడు . సాహితీపరులు , ఉత్తమ సంస్కారులు అయిన పచ్చా శంకరయ్యగారు ప్రింటింగు దశలో భీమన్నచేసే దిద్దుబాట్లకు , సర్దుబాట్లకు , పెట్టే అన్ని పాట్లకు తట్టుకొని-ముద్దులొలికేటట్లు తమ ప్రెసులో ముద్రించి ఇచ్చారు .

చిన్న చిన్న పేరాలతో , కంటికి హాయినిచ్చే స్పేసింగులతో , అర్థం తెలిపే విరుపులతో , పరమ సుందరంగా తయారయింది రాగవైశాఖి !

తెలుగులో అంతటి రమణీయమైన వచనశైలి గాని , ముగ్ధసుందరమైన ముద్రణ గాని అంతకు ముందెక్కడా లేదన్నారు నిష్పాక్షికులైన సహృదయులంతా .

మహాకవిగా ఎదుగుతున్న యువకుడు బాపురెడ్డి . ఆయన రచనలే ఎన్నో ప్రింటుకావలసి వున్నై . తనతో మాటాడే ప్రతి వ్యక్తినీ తనకు సన్నిహితం చేసుకునే ప్రతిభా ప్రాభవా లాయనివి . భిషాధికారులనుంచి లక్షాధికారుల

వరకు అందరూ ఆయనకు ప్రాణ మిచ్చేవాళ్ళే. అంత ఉపజ్ఞావంతుడైన కవి, ప్రజ్ఞావంతుడైన ఆఫీసరు మరి లే డన్నంత ఖ్యాతిని గడించినవాడు. తన మిత్రుడు పట్టాభిరామరెడ్డి తన కావ్యం ఒకటి ప్రింటుచేసి పెడతా నన్నప్పుడు "నాకు వద్దు, భీమన్న కివ్వు" అని చెప్పగలిగిన ఉదార చరితుడు బాపురెడ్డి.

కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ సిరికొండ చిన్నవాణ్ణి గురించి, ఆయన కవితను గురించి అవకాశం వచ్చినప్పుడెల్లా ప్రశంసిస్తూ ఉంటాడు భీమన్న. సాహిత్య ఆర్థిక రంగాలలో అశేషమైన సహాయ సహకారాలను అందజేస్తూ, ముఖ్యంగా నన్ను అమ్మా అని నోరార పిలుస్తూ, ఒక భీమన్నకు పెద్దకొడుకుగా అంకితమై పోయిన కవి బాపురెడ్డి. ఆయన ద్వారానే రాగవైశాఖి ప్రింటయింది. కోటు పట్టాభిరామరెడ్డిగారికి అంకితి మీయబడింది.

"ఎక్సైజు మంత్రిగారి వద్దనుంచి టెలిఫోనండి" అంటూ కనెక్ష నిచ్చారు. ఆఫీసులో భీమన్నకు ఒక రోజున. గుండె జల్లుమన్నది భీమన్నకు. "ఏదో కొంప మునిగింది మళ్ళీ" అనుకొన్నాడు. మంత్రో, ఉన్నతాధికారో ఫోను చేశా డంటే, లేక కబురు పెట్టాడంటే ఏదో భయపడవలసిన విషయమే సాధారణంగా.

"భీమన్నగారు! అభినందనలు! మీ రాగవైశాఖి చదివాను! చాల బాగుంది! ఎంతబాగుందో చెప్పలేను. ఓ సారిటుకేసి రండి" ఫోను పెట్టేశారు మంత్రిగారు—భీమన్నచెప్పే థాంక్సు మాటకూడ వినకుండానే.

ఆ మంత్రి ఎమ్. ఆర్. అప్పారావుగారు. మితభాషి, మృదుహాసి, సహృదయుడు, సాహితీవేత్త. మామూలు మంత్రికి భయపడ్డట్టే ఆయనకు కూడ భయపడ్డందుకు సిగ్గుపడ్డాడు భీమన్న. సమస్త భాషా సాహితీ విమర్శక అప్పారావుగారికి అంతగా నచ్చిన రాగవైశాఖిని తలంచుకొని ఎంతో గర్వపడ్డాడు.

1966 మార్చి 25న రాగవైశాఖి ఆవిష్కరణ అంకిత మహాసభ జరిగింది. అప్పటి విద్యామంత్రి టి. వి. రాఘవులుగారు అధ్యక్షత వహించగా, ఎక్సైజు మంత్రి అప్పారావుగారు కావ్యావిష్కరణ చేశారు. ఆనాటికి నగరంలో వున్న ప్రముఖులంతా, ముఖ్యంగా డాక్టర్ దివాకర్ణ, డాక్టర్ సినారె,

డాక్టర్ అరిపిరాల, డాక్టర్ గిడుగు సీతాపతి, డాక్టర్ ఎమ్. ఏ. ఖాన్, దేవులపల్లి రామానుజరావు, కల్లూరు సుబ్బారావు, శ్రీ వాత్సవ గార్లు రాగవైశాఖి కావ్యసౌందర్యాన్ని, ఔచిత్యాన్ని ఎంతగానో శ్లాఘిస్తూ మాట్లాడారు. బాపురెడ్డి స్వాగతం చెప్పగా, నేను వందనసమర్పణ చేశాను.

"ఈ గ్రంథం ముద్రణకు ఎంత అయింది?" అనడిగా రట పట్టాభి రామరెడ్డిగారు బాపురెడ్డిని. బాపురెడ్డి ఎమీ చెప్పలేదు. పదిహేను వందలకు మించదని ముందు చెప్పి, రెట్టిం పయిం దని ఇప్పుడెలా చెప్పడం? మర్యాద కాదనిభయపడ్డాడు.

"మీరు చెప్పకపోయినా, ఇది పదిహేనువందలలో కాదు. ఎక్కువే వుంటుంది. సత్యం చెప్పడానికేం?" అన్నారట ఆయన. చెప్పాడు బాపురెడ్డి మూడువే లయిందని. విశాఖలోనే జరిగిన సంగ తది.

అంకితం సభకోసం హైదరాబాదు వచ్చిన పట్టాభిరామరెడ్డి భీమన్నను ఒంటరిగా కలుసుకొని, ఒక కవరు జేబులోపెట్టి, వుంచండి అన్నారు. అంతకు ముందే కాగితం కొనే దశలో పదిహేను వందలు పంపివున్నారు. ఈ కవరులో మరో పదిహేను వంద లున్నై.

ఆ రాత్రి పట్టాభిరామరెడ్డి గౌరవార్థం భీమన్న తరపున ఉమా హోటలులో ఆ హోటలు ప్రొప్రయిటరు సత్యనారాయణగారు విందుచేశారు. పట్టాభిరామరెడ్డి మద్యం ముట్టరు. నియమ నిష్ఠలు కల జీవిత పద్ధతి ఆయనది. అయితే అతిథులకు మాత్రం మద్య మధురమైన విందు లెన్నైనారు చెయ్యగల.

భీమన్న కావ్యాంకితాల దొక ప్రత్యేక చరిత్ర. పరిశీలిస్తే వింత వింత మానవ మనస్తత్వా లెన్నో ఆవిష్కృత మవుతై.

రాజ గుణశేఖరుడు, లోక రంజకుండు
ప్రేమవిధి కోటు పట్టాభిరామిరెడ్డి,
వనజ భవుడౌత ఈ కావ్యవాణి గూడి
మాధవుడె యౌత ఈ కావ్యమథువు గ్రోలి:

—రాగవైశాఖి (అంకితం)

170. అదే మరొక రైతే

భగవద్గీత, బైబిలు, ఖురాను మహా సంహితల పంక్తిలో నిలవదగ్గ గ్రంధంగా రాగవైశాఖిని ప్రముఖులంతా ప్రశంసిస్తూ వుంటే-ఆ పలుకులు చెవులకు ములుకులై సోకిన ఒకరిద్దరు శ్రోతలు సహించలేక కావచ్చు-రాగవైశాఖి అసభ్య గంధ మంటూ పత్రికల కెక్కారు. దాన్ని వెంటనే నిషేధించా లంటూ గోల మొదలు పెట్టారు.

"రామునితో కపివరుం డిట్టనియె" అన్న వాక్యం ఉన్నదనుకోండి. దాని రచయితను ఆల్లరి పెట్టాలనుకొన్న విమర్శకుడు ఆ వాక్యంలోని "రాముని తోక" వరకు మాత్రం తీసికొని, విమర్శ మొదలు పెడతాడు.

"రాముడికి తోక ఉన్నదట విన్నారా?" అని అరుస్తాడు. తోకలు మాత్రమే తక్కువైన వాళ్ళంతా చుట్టూ చేరతారు. రాముడికి తోక ఉన్నదనడం ఎంత దుర్మార్గమో తేలుస్తారు.

ఒకవేళ ఆ ఒక్క ఉదాహరణా కోరిన ఫలితం ఇవ్వకపోతే, ఆ విమర్శకుడు మరో వాక్యాన్ని ఉదహరిస్తాడు. "అతడికి ఎనమండుగురు భార్యలట" అని. 'రాముడికి తోకేకాదు, ఎనమండుగురు పెళ్ళాలనుకూడ అంటగట్టిన ఈ శివలీలా రచయితను ఏం చెయ్యాలి?' అనగానే-"అరెస్టుచేసి జైల్లో పారెయ్యా"లంటూ ఆరిచేస్తారు ఆడియన్సు.

విమర్శ వ్రాసేది శివలీల కావ్యంమీద. ఉదహరించే వాక్యాలు ఒకటి రామలీల నుంచి, మరొకటి కృష్ణలీల నుంచి, ఆవికూడ ప్రకరణ భంగంచేసి!

భీమన్న రచనలమీద కొన్ని ప్రసిద్ధ పత్రికలలో వచ్చిన కొన్ని కొన్ని విమర్శలు, సమీక్షలు ఏ ధోరణిలో వుండేవో చూపడానికే ఈ విషయం ఇక్కడ ఉటంకించాను. ఈయన ఆయా పత్రికాధిపతులకు నిరసన తెలుపుతూ లేఖలుకూడా వ్రాశాడు. జవాబులు మాత్రం లేవు. తెలిసిచేసే నేరాలకు పశ్చాత్తాప మెందుకుంటుంది?

అయితే ఈ ధోరణి కొన్ని రకాల పత్రికలకు, కొన్ని మనస్తత్వాల విమర్శకులకు మాత్రమే పరిమితమై వుండేది. రాగవైశాఖిపై చెలరేగిన దుమారం

ధోరణికూడ ఇదే. ప్రకరణ భంగంచేసి, అపార్థాలిచ్చే విధంగా వాక్యాలను ఉదాహరించి, పాఠకులను రెచ్చగొట్టే ధోరణి.

పత్రికలలో, పోలీసు శాఖలో, సెక్రటేరియట్‌లో, శాసనమండలిలో పెద్ద పెద్ద శీర్షికలతో వ్యాసాలు, దర్యాప్తులు, ప్రైళ్ళు, తీవ్రోపన్యాసాలు సాహిత్య లోకాన్ని ఊపివేసిన మహా ఝుం ఝుద అది. ఈ గందరగోళంలో రాగవైశాఖిని నిషేధిస్తున్నారన్న వార్త పుట్టి దాని ప్రతులు ఎక్కడివక్కడ మాయమై పోయాయి. ఎవళ్ళకు దొరికిన వాటిని వాళ్ళు బ్లేకులో పెచ్చురేట్లకు ఆమ్మేసుకున్నారు! ఆ తర్వాత భీమన్నే పేవ్‌మెంట్లపై వెతికి తన కో ప్రతిని కొనుక్కోవలసి వచ్చింది.

ఇంతటి ఉత్తమ సాహిత్య సృష్టిపై ఈ విధమైన చౌకబారు వ్యతిరేక ప్రచారం ఎందుకు జరుగుతున్నదో తమకు అర్థం కావడంలేదనీ, ఇది మరీ ప్రమాదిస్తే తాము రంగంలోకి దిగగలమనీ మిత్రులైన అగ్రశ్రేణి కవిపండితులు కొందరు భీమన్నకు హామీ ఇచ్చారు, లేఖలు వ్రాశారు. భీమన్న మాత్రం ఈ తుఫానుకు తలవాల్చి కూర్చున్నాడు. కిక్కురు మనలేదు, కలం పట్టలేదు.

ఒక సంవత్సరం దుమారం తర్వాత, 1967 మార్చిలో శాసన సభలో ప్రశ్నలకూ, ప్రసంగాలకూ కాబోలు జవాబు చెపుతూ, ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి గారొక ప్రకటన చేశారు. రాగ వైశాఖిని గురించి కొందరు పండితుల అభిప్రాయాలు తెలుసు కొన్నామనీ - అందులో కొంత శృంగార తత్వం వున్నప్పటికీ, ఆది సాంఘిక, ధార్మిక విషయ విమర్శ అధికంగా కల గ్రంథంగా వారంతా అభిప్రాయ పడ్డారనీ - కాగా దానిని నిషేధించే ప్రసక్తి లేదనీ - ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ ప్రకటన చేసినందుకు ముఖ్యమంత్రిని కూడ విమర్శించాయి ఆ మర్నాడు కొన్ని పత్రికలు.

ఆ సందర్భంలోనే రాగ వైశాఖిని స్వయంగా కొనుక్కొని చదివిన శాసన సభ్యుడు పాలవెల్లి గారు ఆ తర్వాత భీమన్నకు మంచి మిత్రు లైనారు. రాగ వైశాఖికో చాల ప్రకరణాలు కంఠస్థం ఆయనకు.

అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన కూడ దుమారాన్ని ఆపలేక పోయింది. సెక్రటేరియట్‌లో ఆ గ్రంథం ఎన్నో కథలను, కాల్పనిక సన్ని

వేశాలనూ సృష్టించింది. దాన్ని అసభ్యమని నిందిస్తూ, తాను అసభ్యంగా ప్రవర్తించిన ఒక అధికారి సస్పెండు కూడ అయినాడు.

"ఇంత మంచి రచనపై అంత వ్యతిరేక ప్రచారం ఎందుకు చెలరేగింది?" అని అడిగితే, "ఆ వ్రాసిన వాడు బోయి భీమన్న కాబట్టి" అంటాడు భీమన్న.

"అయ్యో! ఇంత కాలానికి ఇంత గొప్ప రచన వచ్చిందే! దీన్ని రాసిన గొప్పతనం ఒక మాలవాడికి పోయిందే!" అన్న అసూయ కొందరిచే ఈ దుర్మార్గం చేయించిం దంటారు కొందరు. "దీన్ని మేమే ఎందుకు వ్రాయలేదు? కనీసం మా మిత్రులైనా, గురువులైనా వ్రాసి వుంటే - జ్ఞానపీఠ్‌కో, నోబెల్ ప్రైజుకో రికమెండు చేసి ఉండే వాళ్ళం కదా!" అనుకొంటారు మరికొందరు.

అయితే - ఆలాంటి అసూయా ద్వేష దగ్ధులు చాల కొద్దిమంది మాత్రమే. అగ్రశ్రేణి కవి పండితులు, పత్రికాధిపతులు, రచయితలు అనేకులు విమర్శలను ఖండించి భీమన్నకు బాసటగా నిల్చారు.

ఏది ఏమైనప్పటికీ - ఈ రభస అంతా సెక్రటేరియట్‌లో ఒక పెద్ద ఫైలై రావణుడికి మైరావణుడు తోడై నట్టు—అంతకు ముందు విద్యా శాఖలో భీమన్నకు వ్యతిరేకంగా తయారై వున్న పైలుకు తోడయ్యింది.

భీమన్న సర్వీసు పదేళ్ళు మాత్రం. నలభై మూడేళ్ళ దాకా రాజకీయాలలో గడిపేసి, నలభై నాలుగో ఏట బహిరంగ పోటీలో, డైరక్టు రిక్రూమెంట్ ద్వారా, శాఖాధిపతిగా నియమితుడైనవాడు భీమన్న. సర్టిఫికెటులోని జన్మ తేదీ ప్రకారం 1966 అక్టోబరు 24కు ఏభై అయిదు నిండుతాయి. ఎక్స్‌టెన్షను కోసం అడిగాడు భీమన్న. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు కూడ భీమన్న తరపున స్వయంగా కొంత శ్రద్ధ తీసుకున్నారు. మామూలు ఉద్యోగులకు కూడ ఎక్స్‌టెన్షను ఇస్తున్నారు. సాంకేతిక పారిభాషిక ప్రజ్ఞ అవసరమైన పదవి కదా ఇది! తనకు ఎక్స్‌టెన్షను తప్పక ఇస్తారనే ఆశించాడు భీమన్న.

అక్టోబరు 24 అయిపోయింది. 27 వరకు స్థానం వదలకుండా కూర్చున్నాడు. అప్పుడు వచ్చింది ఫోనువార్త - ఎక్స్‌టెన్షను ఇవ్వడం లేదని!

ఆఫీసులోని తన సొంత సామానును, గ్రంధాలను - ఆ ప్రక్క హుమాయూన్ నగర్‌లోనే తాను ఆద్దెకు కుదుర్చుకొని వున్న గదికి చేర్పించేసి, తన డిప్యూటీ డైరెక్టరైన వై. శ్రీనివాసరావు గారికి చార్జీ అప్పగించేసి, బైటపడ్డాడు భీమన్న.

అప్పటికి సాయంత్రం అయి దయింది. అక్కడి నుంచి సరాసరి కృష్ణదేవరాయ భాషా నిలయానికి వెళ్ళాడు. అక్కడ జరుగు తున్నది - భాస్కర భట్ల కృష్ణారావు గారి అకాల మరణానికి సంతాపం వెలిబుచ్చే సభ. ప్రియ మిత్రుడు, కావ్య కన్యాదాత భాస్కరభట్ల! దుఃఖంతో స్నిగ్ధమైన స్మృతులే పూజా పుష్పాలుగా అంజలి బద్ధుడైనా డా సంతాప వేదిక మీద!

ఇల్లు లేదు. ఉద్యోగం లేదు. ఆయన అతనుడైన ఆత్మ జ్యోతి. ఈయన తనువుండీ నిరాధారుడైన ఉదాసీన మూర్తి! అంతటి నిర్వేదంలో ఇంతటి నిర్వికారత అద్భుత మన్నారు మిత్రులంతా. డాక్టర్ సినారే సభలోనే ప్రకటించాడీ భావాన్ని.

మానవుడి మెదడు ఏ మాత్రం?
ఒక గుప్పెడు!
ఆది సాధించగల విజ్ఞానం ఎంతమాత్రం?
ఎందుకు మరి ఈ అహంకారం మనిషికి?
చీకటి కణానికి సూర్యుణ్ని చూపడం ఎలా?
తలలోని పేనుకు
తలోదరి పూర్ణదర్శనం సాధ్యమా?

—రాగవైఖి

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

సంస్కృతీ విప్లవ సర్గ

171. సెంటీ మెంటు

భీమన్న ఎన్నో ఉద్యోగాలు చేశాడు, వదిలేశాడు. అలానే పదేళ్ళపాటు చేసిన ఈ అధికార పదవిని కూడ వదిలేశాడు. ఈ రిట్రైర్మెంటును గురించి భీమన్న ఫీలయిం దంతే. రిట్రైర్మెంటుతో మరో కొత్త ఘట్టం ప్రారంభ మయిం దీయన జీవితంలో. అన్నిటి కంటె ఉన్నతమూ, ఉజ్జ్వలమూ అయిన ఘట్టం ఇది.

ఈ ఘట్టాన్ని ప్రారంభించే ముందు - జీవితం, సమాజం, సృష్టి గురించి ఈయనకు కల భావాలను కొన్నిటిని ఇక్కడ స్పృశిస్తాను. ఇంత కాలమూ, ఇక ముందూ కూడా ఈయన సాహిత్యాన్ని, జీవితాన్ని నడిపించిన మార్గదర్శక సూత్రాలు కొన్ని ఇందులో కనిపిస్తాయి.

మానవు డే అభ్యుదయాన్ని సాధించా లన్నా, ముందుగా సాంస్కృతిక దృక్పథంలో మార్పు రావా లంటాడు భీమన్న.

సెంటిమెంటును పూర్తిగా వదులు కోవా లంటాడు. "సెంటుమెంటు అనేది మానవ మేధస్సుపై పెరుగుతూ వస్తున్న ఒక కేన్సరు" అంటాడు.

భారత దేశంలో ఎన్నో రంగాలలో విప్లవాలు వచ్చాయి. ఆ రంగాలు సస్యశ్యామల మైనాయి. ఎలాంటి మార్పు లేకుండా, ఇంకా చవిటి ప్రదేశంగా పడి

వున్నట్టి దొక్క సాంస్కృతిక రంగమే. భ్రాంతిని తొలగించుకొని, స్వచ్ఛమైన సత్య స్వరూపాన్ని గుర్తించి, త దభిముఖంగా యువకులు పురోగమించినప్పుడే సాంస్కృతిక విప్లవం సాధ్య మవుతుం దంటా డీయన.

సెంటిమెంటు అంటే గతం నుంచి తప్పు కోలేని ఒక బలహీన మనస్తత్వం. ఒక ఆచారం. ఒక సంప్రదాయం. ఒక జింధం.

దేశ కాలాల ఆవసరాలను బట్టి ఏ సమాజంలో నైనా, ఏ ధర్మ శాసనమైనా అమలు లోకి తే బడవచ్చు. కాలం మార్పుతో ఆట్టి శాసనం కూడ మార వలసి వుంటుంది. ప్రయోజనం పోయి కాలదోషం పట్టిన ఏ శాసనమైనా, ఇంకా ఈజిప్టు మమ్మీవలె నిలిచి వుంటే, అట్టిదాన్ని ఆచారం, సంప్రదాయం అంటాం. ఈనాడు మన సమాజంలో నిలిచి వున్న ఆచార సంప్రదాయా లన్నీ ఆలాంటి మమ్మీలే అంటాడు భీమన్న.

జండెం వేసుకోవడం ఎందుకు?

ఒకానొక ఆదిమ కాలంలో, ఒకానొక సందర్భంలో గుర్తుకోసం కట్టుకొన్న తోలు పేలిక ఆది. యజ్ఞాలు పోయిన తర్వాత, యజ్ఞకాలోచిత చిహ్నలకు ప్రయోజన మేమిటి? ప్రయోజనం పోయి, తోలుపేలిక నూలుపోగు అయి, ఇప్పటి దాకా మమ్మీగా నిలిచివుంది. దీన్ని కొందరి నుంచి తొలగించ డానికి బ్రహ్మ సమాజం వాళ్ళు, అందరి చేతా ధరింప జెయ్యడానికి ఆర్య సమాజం వాళ్ళు పడ్డపాట్లు అందరికీ తెలిసినవే కదా?

"అహం బ్రహ్మస్మి"

"తత్త్వ మసి"

"సోహం"

"త్వమే వాహం"

"ఆత్మవత్ సర్వభూతాని"

"ఆత్మ పరమాత్మ యొక్క లపం" అని కదా హిందూ వేదాంతం చెపుతున్నది?

ప్రతి ఆత్మా బ్రహ్మలవమే అయితే, ఈ విభేదా లేమిటి?

హిందువులు వట్టి శరీరారాధకు లంటాడు భీమన్న.

"మాకు శరీరం ప్రధానం. జందెం వున్న శరీరాన్ని కాక, మేం మరో శరీరాన్ని ముట్టుకోం" అంటారు అగ్ర జన్మ నామకులు.

మరి, ఆత్మ?

"ఆత్మ మా కక్కర లేదు. మాకు కావలసింది శరీరం, జందెం"

భౌతిక ఆచారాలు, యజ్ఞాలు, పూజలు, అభిషేకాలు, ఉత్సవాలు వగైరా పట్ల పట్టింపు కలవాళ్లు -

పూసలు, నూలుపోగులు, నిలువుబొట్లు, అడ్డపట్టీలు, అంగీలు, తాళ్లు, జుట్లు, గడ్డాలు వగైరా చిహ్నాలు ధరించేవాళ్ళు -

తూర్పుకో, పడమటికో తిరిగి మొక్కితేనే తప్ప దేవుడికి అందదని నమ్మేవాళ్ళు -

ఏదో ఒక నిర్దిష్ట స్థలానికో, గుడికో, క్షేత్రానికో వెళ్ళి ప్రార్థిస్తేనే తప్ప దేవుడికి వినపడ దనుకునే వాళ్ళు -

వాళ్ళంతా వట్టి షోగ్గాళ్ళు, భౌతికారాధకులు, షోతో, ప్రదర్శనతో ప్రజల్ని భ్రమపెట్టి బ్రతికేవాళ్లు.

ఏ మతంలో చూచినా అంతా వాళ్లేకదా-అంటాడు భీమన్న.

వాళ్ళకు ఆత్మతో, దాని పారిశుద్ధ్యంతో పనిలేదు.

మతాధిపతులకు, మతావేశపరులకు, వాళ్ళ వెంటతిరిగే గొర్రెలకు, "అహంబ్రహ్మాస్మి" కాదు. అది నిషిద్ధం. వాళ్ళ సిద్ధాంతం "అహం శరీరాస్మి"

అందుకే ఈ భ్రమలన్నీ వదిలేసి, వాస్తవ దృక్పథంతో, విజ్ఞాన మార్గంలో పయనించడం ఇకనైనా మొదలుపెట్టాలి యువకులు అంటా డీయన.

"పిలకలు, బిళ్ళగోచీలు పోయి-క్రాపులు, ప్యాంటులు రాలేదా? అలానే ఈ మిగిలివున్న శవపేటికలను కూడ పూడ్చిపెట్టాలి" అంటాడు.

ప్రవక్తలు పుట్టారు, భగవంతు డవతరించాడు పదే పదే
కాని నరుడు నరపీడకుడే ఈ నాటికీ:
నరుడు నారా యణుడు కావాలను కొంటున్నావా?
పీడక పీడిత భేదాన్ని నిర్మూలించు!

—టుమ్రీలా

172. దేవుడు - పురాణ కథలు

సమస్తానికీ మూలమైన ఒక శక్తి ఉన్నదని, అది అనంతమైనట్టిదని అంటాడేగాని—సర్వ శక్తి వంతుడైన దేవు డనబడేవా డొకడున్నా డని భీమన్న విశ్వసించడు. సాకారమైన దేదీ సర్వశక్తిమంతం కా దంటాడు.

లోకంలోని వివిధ జాతుల, మతాల ఇతిహాస పురాణాలలో చెప్పబడ్డ ఏ దేవుణ్ణి, ఏ దేవతను పరిశీలించి చూచినా - ఈ సత్యం స్పష్టంగా కనిపిస్తుం దంటాడు. కనీసం మన త్రిమూర్తుల, ఇంద్రాది దేవతల వ్యక్తిత్వాలను పరి కించి చూడమంటాడు.

ఈ విషయంపై లారీల కొలదీ పేజీలు వ్రాసెయ్యవచ్చు. ప్రతి దేవత గుణవర్తనలనూ ఖండించెయ్యవచ్చు. ప్రతి దేవుడూ, ప్రతి దేవతా, ప్రతి పురాణ పురుషుడూ "శరీర మాద్యం" అనే సూత్రాన్ని, "తనకు మాలిన ధర్మం లే"దనే నీతిని అనుసరించి బ్రతికిన వాళ్ళనని రుజువు చెయ్యవచ్చు. రాగద్వేషాలు, స్వపర భేదాలు, ఆశ్రిత పక్షపాతం, తనకు దాసులై పడి వుండే వాళ్ళపై దయ, తనతో ఏకీభవించని వాళ్ళపై పగ, స్వప్రయోజనం కోసం ఎన్ని మోసాలైనా, హత్యలైనా చెయ్యడం - ఇవేకదా మనకు పురాణాల నిండా కనిపించేవి అంటాడు.

తమ మానవగుణ వర్తనలకే తమ ఊహను జోడించి, అతిశయంచేసి, పురాణ కర్తలు వాటన్నిటినీ వ్రాశా రంటాడు భీమన్న. పురాణ పురుషుల,

అవతార మూర్తుల విషయంలో ఈయన వ్యాఖ్యాన ధోరణి ఎలా వుండేదీ చూపడానికి సూత్రప్రాయంగా కొద్ది ఉదాహరణలను మాత్రం ఇక్కడ ఇస్తాను.

మూర్ఖుడూ, దురహంకారీ, నిరంతర శత్రుభయావహుడూ, భోగ లాలసుడూ అయిన ఒక నక్కజిత్తుల ఆశబోతు ప్రభువుకు ప్రతిరూపంగా కల్పించబడిన వాడే ఇంద్రుడు. అతడి చరిత్ర అంతా దురంతమైనట్టిదే, అందరూ ఎరిగినట్టిదే.

త్రిమూర్తుల గుణగణాలలో కూడ మానవ డాలాధించ దగిన వేపీ లేవు. ఒక రాక్షసుడికి చావులేకుండా వరమివ్వగల దేవుడు ఆ రాక్షసుడు లోకకంటకుడుగా తయారైనప్పుడు తన వరాన్ని ఉపసంహరించుకోలేడా? భస్మాసుర గాథ, జలంధర వధ ఉదంతాలు శివకేశవులకు గౌరవప్రద మైనట్టివేనా?

తన ఆయుధాన్ని ఎదుటివాడి కిచ్చేస్తే, తాను నిరాయుధు డయ్యేవాడు మానవుడు. మానవుడే అంత తెలివితక్కువగా ప్రవర్తించడు కదా! వరం ఆయుధం వంటి దనుకొన్నా, దేవుడు సర్వశక్తిమంతుడై వుండాలి కదా! పైగా దేవుడికంటె భక్తుడు గొప్పవా డనడం పచ్చి మోసం. సంకల్పమాత్రం చేతనే ఏమైనా చేసెయ్యగల దేవుడు - అవతారా లెత్తడం, భిక్ష మెత్తడం, నానా యాతనలూ పడడం జరగని పని. మానవ స్వభావాన్ని దైవానికి అంటగట్టి చేసిన కల్పనలే అవన్నీ.

రామాయణ భారతాదుల్ని పరిశీలించినా బలాధికులే తప్ప గుణాధికులు కనిపించరు. కావ్యాలుగా సాహిత్యానికి అవి రెండూ రెండు కర్ణకుండలాలే. రత్నభూషణాలే. సాక్షాత్తు సాహిత్యమంటే ఆ రెండు కావ్యాలే. అయితే, వాటిలోని వ్యక్తులు మాత్రం కేవలం మానవులు. స్వప్రయోజనంకోసం, స్వార్థి కయంకోసం ఎంతటి పాడుపనినైనా చెయ్యడానికి వెనుకాడని మనుషులు. రాముడు, దశరథుడు, రావణుడు, విభీషణుడు మొదలైనవాళ్ళు, కుంతి, ధర్మరాజు, భీష్ముడు, కర్ణుడు, కృష్ణుడు వగైరాలు-అంతా అంతే.

ఇంద్రుడి ద్రోహానికి, భర్త ద్రోహానికి గురై రాయిలా పడివున్న ఒక అసహాయురాల్ని లేవనెత్తడం కంటె రాముడు చేసిం దేమిటి? రాతిని నాతిని

చేశాడన్న ప్రచారం గొప్ప మోసం కాదా ? ఏ పండు తినవచ్చో ఏది తిన గూడదో తెలియని అడవిలో , ఆక్కడ పుట్టి పెరిగిన శబరి రాముడికి ఒక డాక్టరులా ఉపయోగపడింది . అందులో రాముడి గొప్పేమిటి ? విభీషణ శరణాగతి పచ్చి రాజకీయం . రాముడు మరొకరిని రక్షించిం దెక్కడ ? అసలు దశరధుడు భరతాదులకు తెలుపకుండా , ఆకస్మికంగా రామపట్టాభిషేకం తల పెట్టడంలోనే గొప్ప రాజకీయ కుట్ర లేదా ?

ఇక భారతంలోకి వెళితే - భీష్మ్ణుణ్ణి , కర్ణుణ్ణి మిందిన స్వామి ద్రోహులు ప్రపంచ చరిత్రలో మరెక్కడైనా కనిపిస్తారా ? కర్ణుడు మహావీరుడుగా రుజువు చేసుకొన్న దెక్కడ ? గంధర్వుల చేతిలో , ఉత్తర గోగ్రహణంలో భంగపడినప్పుడైనా దుర్యోధనుడికి కర్ణుడు తోడ్పడ గలిగాడా ?

కర్ణుడికి వ్యక్తిత్వం ఇచ్చినవాడు దుర్యోధనుడు . కవచకుండలాలను దానం చెయ్యడం , కుంతికి వరా లివ్వడం స్వామిద్రోహం కాదా ? తాను సేనాధిపతియై వుండి , తనను ఓడించే రహస్యం శత్రువుకు చెప్పిన భీష్ముడు విశ్వాస ఘాతకుడు కాదా ? జరాసంధుడు మొదలు దుర్యోధనుడు వరకు జరిగిన మరణాలన్నీ నిజానికి హత్యలేకావా ? కురుక్షేత్రం ధర్మక్షేత్రం ఎలా అయింది? కర్ణుడివద్ద కుంతి కార్చినవి మొసలి కన్నీళ్ళే కావా ?

ఆజామిళుడి కధల్లాంటివి పాపాలను ప్రోత్సహించేవే కావా ? అతడు పిల్చిన "నారాయణ" అతడి కొడుకే కాని , తమ దేవుడు కాదన్న సత్యం గుర్తించలేని వాళ్ళు విష్ణుదూత లెలా అయినా రన్న ప్రశ్నకు జవా బేమిటి ?

ఇలా విమర్శనా దృష్టితో పరిశీలించుకొంటూపోతే , పురాణ సాహిత్య మంతా పాత గొంగళిగానే కనిపిస్తుం దంటాడు భీమన్న . తన గుణాలతో అతీత శక్తుల్ని రూపొందించు కోవటం మానవ స్వభావం కనుక , తదనుగుణంగా అట్టి సాహిత్యం పుట్టిం దంటాడు .

ఒకనాటి అవసరాలు విలువలు మారినతర్వాత కూడ ఆచారాలుగా, సంప్రదాయాలుగా మిగిలి వుంటా యనీ , అట్టి వాటిని వదుల్చుకొంటూ ముందుకు పోవడమే అభ్యుదయ మనీ భీమన్న వుద్దేశం . పురాణ వీరులకు దైవత్వాన్ని

ఆపాదించడంకూడ అలా మిగిలిపోయిన సంప్రదాయమే. దాన్ని ఇంకా కొన సాగించడం మూర్ఖత్వం అంటాడు. పామరులలోని అవిద్యా, పండితులలోని స్వార్థమూ పౌరాణిక దేవతల దైనందిన భజనలకు హేతువు లంటాడు. అట్టి దేవతలకు ఉనికీ, శక్తీ రెండూ లే వంటాడు.

పరమ నిరంకుశ నియంతృత్వంలోని
ప్రజల దాస్యానికి రూపకల్పనే
సంపూర్ణ శరణాగతి సిద్ధాంతం!
నియంతలకు నియంత కదా దేవుడు?

—టుమ్రీలు

173. మతాభిమానం

"ప్రజల మత భావాలు (feelings) గాయ పడుతున్నవి".

"ప్రజల మత పిచ్చి (Sentiment) రెచ్చ గొట్ట బడుతున్నది".

"ప్రజల మతాభిమానం దెబ్బతిన్న దంటే, అది పడగలు విప్పి విరుచుకు పడుతుంది! కాబట్టి - ఓ, మతాతీత రాజ్యాధి నేతా! జాగ్రత్త!"

ఇలాంటి హెచ్చరికలు తరచు పత్రికలలో చదువుతూ వుంటాం! నిరసన ప్రదర్శకుల చేతి కర్రట్టలపై చూస్తూ వుంటాం! ప్రజలు వేల సంఖ్యలో మందలు మందలుగా హాజరైన సభల పచ్చని వేదికలపై నుంచి, ఎర్రటి నాలు కలు చాపి, నాయకులు చేసే ఉపన్యాసాలలో వింటూ వుంటాం!

వీ టన్నిటినీ చదువుతూ, చూస్తూ, వింటూ వుండే అసంఖ్యాకులైన ప్రజలలో — ఇదంతా ఏమిటి అని ఏ ఒక్కరైనా ఆలోచిస్తున్నారా?

జ్ఞానేంద్రియాలు స్పర్శనం, దర్శనం, శ్రవణం, ఆస్వాదనం, ఘ్రాణం ఈ అయిదూ. ఇవి ప్రతి జీవికీ వుంటై. మరి, మనిషి ప్రత్యేకత ఏమిటి? ఈ జ్ఞానేంద్రియాల ద్వారా సేకరించిన సామగ్రిని ముందుంచుకొని వివేచించడం కాదా మనిషి ప్రత్యేకత?

వివేచనకు మూలాధారం మనసం - ఆలోచన. ఈ ఆలోచన మనస్సం బంధి. ఈ మనస్సు మనిషికి వచ్చిన ప్రత్యేక సౌకర్యం. ఈ సౌకర్యం ఆది బీజాణువు నుంచి సరాసరిగా మనిషికి వచ్చింది. మరే ఇతర జీవ జాతికి రాలేదు.

ఈ ప్రత్యేక నిధిని, ఈ మహత్తర శక్తిని మనిషి ఏ విధంగా ఉపయోగించు కొంటున్నాడు?

తన కొక గొప్ప బలమైన మనస్సు వున్న దనీ, దాని శక్తి అణు శక్తిని మించి నట్టి దనీ, అది రంగంలోకి దిగి కార్యాచరణకు పూనుకొంటే దాని పరాక్రమానికి తిరుగు వుండ దనీ, గుర్తించిన వాళ్ళు ఈ మనుషులలో ఎందరు?

గుర్తించని వాళ్లు మనుషు లెలా అవుతారు? ఇదీ భీమన్న ప్రశ్న.

మతం అంటే ఏమిటి?
ఒక మంద!
మతాలు అనేకం
మందలూ అనేకం

ఈ మానవ లోకంలో ఎన్ని వందల వేల రకాల, రంగుల, వేషాల, రోషాల, ద్వైవాల, దెయ్యాల, పూజల, ప్రార్థనల మతా లున్నాయో అందరికీ తెలిసిందే!

మందకు ఒక పశుపాలకుడు
మతాని కొక పీఠాధిపతి!
పశుపాలకుడి చేతిలో దుడ్డుకర్ర
పీఠాధిపతి చేతిలో మత గ్రంథం!

ఈ రెంటికి తేడా వుంది. పశుపాలకుడి ఆయుధం ఎప్పటి కప్పుడు కొత్తది! పీఠాధిపతి ఆయుధం వందల వేల యేండ్ల నాటి పాతది!

పశువుల మంద కంటె మనుషుల మంద ఎంత హీన మైనట్టిదో, ఈ పరిస్థితి స్పష్టం చెయ్యడం లేదా - అంటాడు భీమన్న?

పశువుల మంద పితాధిపతి పరజాతి వాడు. మనుషుల మంద పితాధిపతి స్వజాతి వాడే!

అంటే ఏమిటి?

పశువుల్ని తద్భిన్న జాతీయుడైన మనిషి పాలిస్తుంటే – మనుషుల్నితత్ స్వజాతీయు డైన మనిషే పాలిస్తున్నా డన్న మాట!

దీని అర్థం - పశువులకంటె, సాధారణమానవులే హీన ప్రతిభు లనికాదా?

పశువులు సహజంగానే మనిషి కంటె తక్కువ జాతివి. మనుషులు మరో మనిషి కంటె ఎలా తక్కువ?

ఆలోచిస్తున్నారా ప్రజలు?

ఆలోచించ లేని వాళ్ళు మనుషు లెలా అవుతారు?

అందుకే —

ఆలోచించడం మానవుని జన్మహక్కు అని గుర్తించి, ఆలోచించడం అభివృద్ధి చేసుకొన్న అగ్రజన్ములు – ముందుగానే జాగ్రత్తపడి, తమ స్థాయికి ఇంకా పెరగని అనుజన్ములను గుప్పిట్లో ఇముడ్చుకొని, వాళ్ళ పెరుగుదలను అరి కట్టా రంటాడు భీమన్న.

వాళ్ళ మనసులు వికసించకుండా మూఢ విశ్వాసాల ముసుగల్లో బిగించి వేశారు! వాళ్ళ కళ్ళకు రంగు రంగుల గంతలు కట్టి, వాళ్ళ చెవుల్లో రకరకాల సీసపు గుళ్ళు కుక్కి, వాళ్ళ నోటికి జీళ్ళపాకం కళ్ళాలను తగిలించి, ఆ కొద్ది మంది ప్రబుద్ధులు ఈ అసంఖ్యాక నిర్బుద్ధులను తను కూడా తిప్పుకొన సాగారు! దాని సహజ సాంప్రదాయక పారంపర్యమే నేటి జాతి మత వర్గ సామాజిక వ్యవస్థ అంటా డీయన.

జీవ పరిణామ మార్గంలో, ఒకే జాతి జీవరాశిలో, ముందున్న వాడు తనకు అందుతున్న సమస్త సంపదనూ తానే జేబులో వేసుకుంటూ, అనుచ రుల్ని ఆకటి చావులకు వదిలేస్తున్నా డన్నమాట!

అనాది నుంచీ సాగుతున్న అన్యాయం ఇది. ఇదే న్యాయమనీ, ధర్మమనీ, తరణోపాయమనీ, మోక్ష మార్గమనీ రక రకాల మిథ్యా సిద్ధాంతాలను సృష్టించి, అనుచర జనానీకాన్ని మోసగిస్తూ, తమ అగ్రే సరత్వాన్నీ, గురుత్వాన్నీ, నాయకత్వాన్నీ ఆ సోదర ద్రోహులు ఇంకా నిలుపు కొంటూనే వస్తున్నారు! అధికారాన్ని చెలాయిస్తూనే వస్తున్నారు. తమ తమ్ము గొర్రెల్ని విశ్వాస పాత్రులుగా వుంచు కొంటూనే వస్తున్నారు! ఎంత చిత్రం!

ఏ మతానికైనా సరే, పునాది విశ్వాసం.

విశ్వాసం అంటే నమ్మకం.

నమ్మకం అంటే-దేనినో, ఎవరినో నిర్హేతుకంగా నమ్మడం;

మతం విషయంలో నమ్మేది దేనిని? మత గ్రంధాన్ని. ఎవరిని? మతాధిపతిని.

ఈ మతగ్రంధం ఎలాంటిది? ఎప్పటిది?

ఎవరో మనలాంటి వాళ్లే-మనకంటె తెలివైన వాళ్ళు కావచ్చు-వ్రాసినట్టిది. లేక, వ్రాయించి నట్టిది. ఇది ఏ నాటిది? మన తాతల, ముత్తాతల నాటి కంటె అనేక తరాల, శతాబ్దాల పూర్వపుది!

మన దృష్టిలో మన తాతే పాతకాలపు మనిషిగా కనిపిస్తున్నపుడు-వందల వేల ఏళ్ళనాటి మనిషి ఆరాధ్యుడా? అతడు ఆనాటి పరిస్థితిలో చెప్పిన మాట ఈనాడు, ఈ పరిస్థితిలో కూడ వేదమా? అంటాడు భీమన్న.

ఆలోచించే శక్తిని ఈ మత రాజకీయ పీఠాధిపతులు స్వార్థంతో అణచి వేశారు. ఈ యోచనాత్మక నిరోధం-తదితర శారీరక వ్యాధుల వలెనే-ఆనువంశికంగా మనకు సంక్రమించిన మానసిక వ్యాధి!

ఈ వ్యాధి నుంచి బైట పడ్డప్పుడే మనం నిజమైన మానవ జాతిగా పురోగమించగలం అంటా డీయన.

మానవుడంటే ఒక జంతువు
మతం అంటే ఒక రకం పిచ్చి
ఒకొక జంతువుకు ఒకొక పిచ్చి
మానవుడికి మత పిచ్చి!
హిందువుడికి అదనంగా
ఒక విశ్వ సమన్వయ పిచ్చి!

—గుడిసెలు

174. భర్త అంటే —

"పెండ్లి చేసుకోవా అనుకున్నప్పుడు ఏం చెయ్యాలి? కొంచెం సలహా చెప్పండి, కవిగారు!" అన్నదొక వసుంధర, ఒకసారి మా ఇంటికి వచ్చి.

"నీవు ఎవరినైనా ప్రేమిస్తున్నావా?" అడిగాడు భీమన్న.

"ఛ ఛ. అలాంటిదేం లేదు. ఊరికే సలహా అడుగుతున్నాను."

"ప్రేమించడంలో తప్పేం లేదు. ప్రేమించిన వాళ్ళను పెండ్లి చేసుకోవా అనుకోవడమే తప్పు" అన్నాడీయన. దానితో పెద్ద చర్చ చెలరేగింది.

పదహారు, పదిహేడేళ్ళ ఆడ పిల్లకు ప్రేమ, పెండ్లి, సెక్సు, సంసారం విషయాలలో ఎంతటి అద్భుతమైన ఊహలు, అపోహలు, ఆశలు, అనుమానాలు ఉంటాయో ఈ చర్చలో వెల్లడయింది.

ప్రేమకూ పెండ్లికీ సంబంధం లేదనేది భీమన్న వాదం. ప్రేమ హార్దికం. పెండ్లి సాంఘికం. ప్రేమ సహజం. పెండ్లి చట్ట బద్ధం. ప్రేమ ఆనందమయం. పెండ్లి కర్తవ్య నిష్ఠం. ప్రేమ-పెండ్లి రెండూ రెండు విరుద్ధ ధ్రువా లంటాడీయన. ప్రేమకు జాతి, మత, వర్ణ, వర్గ, వయోభేదా లుండవు. పెండ్లికి వయో రూప గుణాలలో ఈడూ, జోడూ అవసరం.

"ప్రేమిస్తే పెళ్ళి చేసుకోగూడదా?"

"చేసుకో గూడదు. ప్రేమ అనేది జీవితాంతం ఆత్మకు ఆనందాన్ని సమ్మతి చేసే ఒక అమృత భాండం. దాన్ని అతి రహస్యంగా కాపాడుకోవాలి.

ఒక వేళ ప్రేమించిన వ్యక్తిని పెళ్ళాడక తప్పక పోతే, ఆ ప్రేమను హృదయాంతర పేటికలో దాచేసి, తాళం వేసేసుకోవాలి. పెళ్ళితో వచ్చే కర్తవ్యాలు, బాధ్యతలు, వాటి నుంచి వుండే కష్ట నిష్ఠూరాలు, కోప తాపాలు, అసూయా ద్వేషాలు దాన్ని కలుషితం చెయ్యకుండా జాగ్రత్తపడాలి.

జనవాణి తర్వాత తాపీ ధర్మారావు గారు నడిపిన "కాగడా" పత్రికలో ఈ విషయం పై ఎంతో చర్చ నడిచింది. అందులో భీమన్న కూడా పాల్గొన్నాడు. నాడు, నేడు కూడ ఈయన సిద్ధాంతం ఇదే.

"ప్రేమను ఆనందాను భూతిగాను, పెండ్లిని విధ్యుక్త ధర్మంగాను వేరు వేరుగా వుంచుకొంటే, రెండూ దక్కుతాయి. రెండింటినీ కలిపి వేస్తే, ఒక్కటీ దక్కదు" అన్నాడు భీమన్న ముక్తాయింపుగా.

"ప్రేమించిన వాణ్ని పెళ్ళాడ గూడదు, సరే. మరి, ఎలాంటి వాణ్ని భర్తగా ఎంచుకోవాలి?"

కన్య రూపాన్ని, తండ్రి వంశాన్ని, తల్లి ధనాన్ని కోరతా రని మన పెద్దలంతా చెప్పే వున్నారుగా? ఈ ముగ్గురికీ నచ్చిన వాణ్ని పెళ్ళాడవచ్చు.

"నా భర్త మగవాడై వుండాలి" అన్నది వసుంధర. అదిరి పోయాం మేం ఈ భావప్రకటనకు.

"ఆటువంటి అనుమానాలు వద్దు. ఎక్కడో కోటికి ఒక్కడు తప్ప, మగవాళ్ళందరూ మగవాళ్ళే" అన్నాడు భీమన్న. ఒక స్త్రీకి పనికి రాని వాడు మరొక స్త్రీకి మంచి మగడే కాగల్గుతాడు. అది వాళ్ళ వాళ్ళ అభిరుచుల అవగాహనను బట్టి వుంటుంది. సంసార విజయానికి సహానుభూతి ప్రధానం.

ఉద్యోగ ఆర్థిక రంగాలలో స్త్రీలకు సమానావకాశాలు ఏర్పడి వున్న ఈ నాడు స్త్రీ కూడ భర్త కావచ్చు నంటాడు భీమన్న. భర్త అంటే భరించేవాడు కదా? ఉద్యోగాలు చేసి, వ్యాపారాలు చేసి అనేక మంది స్త్రీలు ఈనాడు తమ తమ సంసారాలను పోషించుకొంటున్నారు కదా? వాళ్ళు భర్తలు కాక మరెవరు? భర్త శబ్దాన్ని "భర్తా" అని స్త్రీ లింగ శబ్దంగా కూడ వాడుకొంటే సరిపోతుంది

భార్య యెవ్వతె : భర్తయెవ్వండు నేడు :
ఇర్వురును భర్తలే గృహ నిర్వహణకు :
ఉన్నతోద్యోగ పదవుల నుండి దేశ
పాలనముచేయు మహిళ భూభర్త కాడె ?

—టుమ్మీలా

తర్వాత చర్చ తదనుబంధ విషయాల మీదకు మళ్ళింది. కట్నాలు, కానుకలు ఇవ్వడం, పుచ్చుకోవడం తప్పేం కా దన్నాడు భీమన్న. స్నేహ వాత్సల్యాలకు ప్రతీక లవి. పిత్రార్జితంలో కొడుకుతో పాటు కూతురికి సమాన వాటా ఇవ్వకుండా, వరకట్న పద్ధతి పోవా లనడం అర్థ రహితం అన్నాడు.

"వరకట్నం ఇవ్వమని ఎవరూ ఎవర్నీ బలవంతం చెయ్యడం లేదు కదా ? బజారులో వస్తా లుంటై. ఎవరు కొనమన్నారు ?" ఇది భీమన్న ప్రశ్న.

జీవితంలోని అనేక సమస్యలపై భీమన్న భావాలు ఇలానే నిర్దిష్టంగా వుంటై. నగ్న సత్యాలుగా వుంటై. కవిత్వం గురించి కూడా ఇంతే. అనంద దాయకమైన శుద్ధ కవిత నీ కక్కరలేక పోవచ్చు. కాని, దాన్ని బజారు నుంచి నిషేధిస్తా మంటే ఎలా ? అంటాడీయన.

జనానికి కావలసింది
చవుక బియ్యం దుకాణం,
తత్నాల షాపు కాదు;
ప్రజాభ్యుదయానికి కావలసినవాడు
రాజకీయ విప్లవవీరుడు
కవి కాదు;

—గుడిసెలు

175. హరిజనులు ఆర్యులే

"హరిజనులు ఆర్యులే" అనే శీర్షికతో భీమన్న వ్రాసిన పరిశోధక వ్యాసం "రాగవాశిష్ఠ" నాటక గ్రంధానికి పీఠికగా ముద్రించబడి వుంది. దాన్ని ఇక్కడ మళ్ళి నేను ఏ కరువు పెట్టబోవడంలేదు. కాని తప్పక ఇక్కడ కొన్ని ప్రశ్నలు మాత్రం అడుగుతున్నాను.

ఈ వ్యాసాన్ని ఎంతమంది చదివారు? ఎంతమంది సవ్యంగా అర్థం చేసుకున్నారు? అందులో ఈయన ప్రతిపాదించిన సిద్ధాంతం నచ్చినవాళ్ళు దానికి ప్రచారం ఇచ్చారా? నచ్చనివాళ్ళు బహిరంగంగా ఖండించారా?

ఉస్మానియా యూనివర్శిటీలో కొన్ని సంవత్సరాలపాటు ఆ గ్రంథం డిగ్రీ తరగతులకు మోడర్న్ డ్రామాగా పాఠం చెప్పబడింది. కనుక ఎవరూ చదవలే దనడానికి అవకాశం లేదు. విద్యార్థుల సంగతి అలావుంచి, కనీసం పాఠాలు చెప్పిన పండితులైనా చదివి వుంటారుగా? క్లాసు రూమ్‌ల్లో సణుగు కోవడం తప్ప బహిరంగంగా విమర్శించిన వా ళ్ళొకరైనా వున్నారా?

చారిత్రక, సాంఘిక, పౌరాణిక సాక్ష్యాధారాలతో భీమన్న ప్రతిపాదించిన సిద్ధాంత మది. పరమ సత్యం అది. సత్యానికీ, ఆచారానికీ ఘర్షణ వచ్చేసరికి సత్యాన్ని ఖూనీచేసి, ఆచారాన్నే పట్టుకుని వేలాడుతారు పండితులు. ఆచార పరు లంతా శవారాధకు లంటాడు భీమన్న అందుకే.

"ఒక్క హరిజనులే కాదు, ద్రావిడులుకూడ ఆర్యులే. ఆర్యో ద్రావిడులు మధ్య ప్రాచ్యంలోని సరిస్తాద్దు రాజ్యాల దాయాదులు. ఈ దేశానికి వచ్చికూడ మూలవైరాన్ని వెంట తెచ్చుకొన్న వాళ్ళు. హరిజనులు విడిపోయిన లేక తప్పిపోయిన లేక వెనకబడిపోయిన (broken people) ప్రజ లన్న డాక్టర్ అంబేద్కరుగారి అభిప్రాయంకూడ నా సిద్ధాంతాన్ని బలపరిచేదే" అంటాడు భీమన్న. జాతి సమైక్యానికి ఇంతకంటె బలమైన సూత్రం మరొక టేముంది? మరి మన జాతి సమైక్యవాదులు ఈ సిద్ధాంతానికి ప్రచారం ఎందు కివ్వలేదు? ఒక హరిజనుడికి కీర్తి ప్రతిష్ఠలు రావడం ఇష్టంలేకనా? తమ ప్రాబల్యం దెబ్బతింటుందన్న భయంవల్లనా?

"మీ సిద్ధాంతాన్ని కాదనడాని కేం లేదు. వ్యాసుడు హరిజనుడే అనుకుందాం. మరి ఈ వర్ణాశ్రమ ధర్మాలను సృష్టించిన వా డతడేకదా? తానే తనకు వ్యతిరేకంగా ఎందుకు వ్రాసుకున్నాడు?" కొందరు మిత్రులైన పండితులు భీమన్నకు వేసే ప్రశ్న ఇది.

గొప్ప పండితుడూ, ఆర్షసాహిత్య ప్రచార గ్రంథకర్తా, జ్ఞానీ, లలితా ప్రెస్ యజమానీ అయిన చర్ల గణపతిశాస్త్రిగారు కూడ అడిగిన ప్రశ్న ఇది.

భారతం తెలుగు అనువాదంలో వున్నంత బ్రాహ్మణభక్తి ప్రచారం సంస్కృత భారతంలో లేదు. అందులోకూడ వ్యాసుడి తర్వాత ఎన్ని ప్రక్షిప్తాలు చేరాయో! డాక్టర్ అంబేడ్కరు నిర్మించిన రాజ్యాంగం యొక్కనాటి స్వరూపానికి, నేటి స్వరూపానికీ ఎంత తేడా! ఎన్ని సవరణలు!

మరొక విశేష మేమిటంటే - ఆ కాలంలో వాస్తవంగా అమల్లో వుండిన వర్ణాశ్రమాలకూ, ఈ నాడు పండితుల నోట్లో చిలుక పలుకులుగా తయారైన వర్ణాశ్రమాలకూ జీవ శవ సంబంధం కూడ లేదు. ఆ నాటి వాటికి ఈ నాటివి శవాలు కూడ కాదు. అవి వేరు, ఇవి వేరు. ఆ నాటి ఏ రుషి పుట్టుకతో బ్రాహ్మణుడు కాదు. అందులో అధిక సంఖ్యాకులు ఏ కులమో తెలియని వాళ్ళు, నానా కులాల వాళ్ళు.

"విశ్వనాథ వారు వర్ణాశ్రమ ధర్మాలను పునరుద్ధరించ దలిస్తే, వారితో నేను కూడ సహకరిస్తాను. వారి కిష్టమైన మను ధర్మ శాస్త్రాన్నే తీసుకుని, నలుగురు జడ్జీలతో సహా పల్లెపల్లెకు వెళ్ళి, జనాన్ని వరసగా నిలబెట్టి, ఆయా గుణ కర్మలను బట్టి వర్ణాలను విడిగొట్టేస్తాం. మరునాటి తిండికోసం బిచ్చ మెత్తుకునే వాళ్ళను బ్రాహ్మణులు గాను, ఆస్తులు కల వాళ్ళను వైశ్యులు గాను నిర్ణయించ వలసి వస్తుందప్పుడు. నలభై దాటిన వాళ్ళను ఆడవులలోకి, అరవై దాటిన వాళ్ళను మఠాలలోకి పంపివేయ వలసి వస్తుంది. అందుకు సిద్ధమేనా?" అంటూ సవాలు చేశాడు భీమన్న ఒకప్పుడు.

"ఈ పండితులు స్వార్థ పరులు. ఈ ఆచార పరులు అజ్ఞానులు. ఆర్ష ధర్మం తెలిసిన వాళ్ళు బహు తక్కువ" అంటాడు భీమన్న. ప్రపంచాన్ని ఏల వలసిన, విశ్వాన్నే ఆర్యం చెయ్య వలసిన భారతీయుడు శతాబ్దాల తరబడి విదేశీయులకు దాస్యం చెయ్యవలసి రావడానికి కారణం ఈ పండితులే, ఈ ఆచార పరులే అంటాడు.

బుద్ధ, శంకర, రామానుజ, దయానంద, రామకృష్ణ, వివేకానంద, వేమన, వీరబ్రహ్మం, వీరేశలింగం, రామ్‌మోహన్‌రాయ్, గాంధీ, అంబేడ్కరు — ఈ విధమైన మహాపురుషుల కంటె ఈ ఆచార పరులు గొప్పవాళ్ళా?

ఆ మహనీయులు చెప్పినట్టు ఈ ప్రజలు ఎందుకు నడచుకోరు ? కాపరుల పాత బోధలను గొర్రెల దాకా రానీయవు – తోడేళ్ళూ, పులులూ !

ఋగ్వేద కాలంలో వుండింది సోషలిజమే. ఆర్ష ధర్మం సోషలిజమే. ఈ సత్యాన్ని నిరాకరించి, స్వార్థాన్ని అవలంబించి, జాతిని నాశనం చేశారు మత పెద్దలు.

"ఇక్కడ నేను నిలబడి, నా వంశ మూల పురుషుడి కోసం వెనక్కు చూచి నప్పుడు వ్యాసుడు కనిపిస్తాడు. ఈ నాడు నేను హరిజనుణ్ణి కావచ్చు. ఆ నా డతడు బ్రాహ్మణుడు. బ్రాహ్మణత్వ మనేది ఒక డిగ్రీ, ఒక అర్హత. బ్రహ్మజ్ఞానం సాధించిన వాడికి "బ్రాహ్మణ" పట్టా ఇచ్చే వా రా నాడు. బ్రాహ్మణుణ్ణి పూజించ మంటే, అటువంటి బ్రహ్మజ్ఞాని అయిన వ్యక్తిని పూజించ మని" అంటాడు భీమన్న.

తరగతి నిభజనకు గుణ కర్మల అర్హత పోయింది,
జన్మే ఆర్హతగా నిర్ణయించ బడింది!
వుట్టుకతోనే గ్రాడ్యుయేట్ కొడుకు గ్రాడ్యుయేట్!
పద్మశ్రీ కొడుకు పద్మశ్రీ!

—టుమ్రీలు

జయ జగజ్జననీ!
జయ జగజ్జననీ!
కాయకష్టము చేయు కార్మికుని మీద
సోమరిని తెచ్చి రాజును చేసి తేల?
ధార్మికుండైన క్షేత్రస్వామి బట్టీ
సకుటుంబముగ బానిసను చేసి తేల?
యాజమాన్య మ్మంచు, ఆస్తి హక్కనుచు
క్రొత్త పీడలు కొన్ని సృష్టించి తేల?

—మానవుని మరొక మజిలీ

176. మాయా సీత

సీతాపహరణం తర్వాత ఆమెను వెతుక్కొంటూ రాముడు అడవుల్లో తిరుగుతున్న కాలంలో ఒకనాడు అతడికి హఠాత్తుగా సీత కనిపించింది!

ఆమెను చూచి, చిరునవ్వునవ్వుతూ "ఏమమ్మా ఉమా ఇలా వచ్చావు?" అన్నాడట రాముడు.

ఉమాదేవి సిగ్గుపడి, స్వస్వరూపం ధరించి అన్నదట " నీవు శ్రీమన్నా రాయణుడవే నని దేవలోకంలో చెప్పుకొంటుంటే, నిజమో కాదో తేల్చుకోవాలని ఇలా సీత రూపంతో వచ్చాను. నీవు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవే సందేహం లేదు " అని.

ఈ సంఘటన కారణంగా ఆ తర్వాత ఉమాశంకరుల మధ్య నడిచిన పేచీ పూచీలు అది మరొక కథ. ఈ కథలన్నీ తరతరాలుగా చెప్పుతున్నారు. ప్రజలు నమ్ముతున్నారు. వాటిలోని ఉచితానుచితాలను గురించి ప్రశ్నిస్తున్న వాళ్ళు మాత్రం లేరు.

కొంచెం ఈ కథ ఒక్కదాన్ని గురించీ విమర్శన దృష్టితో ఆలోచించి చూడ మంటాడు భీమన్న.

మాయసీతను ఉమగా గుర్తించిన రాముడు మాయలేడిని మారీచుడిగా ఎందుకు తెలుసుకోలేక పోయాడు? రాముడు శ్రీమన్నారాయణుడే అయితే, సర్వజ్ఞుడే అయితే, సీత కనిపించక అత డేడ్చిన దంతా దొంగ ఏడుపేనా? ఎవర్ని మోసగించడానికి? అది దొంగ ఏడుపే అయితే, దానిపట్ల ఎవరికి ఎందుకు సానుభూతి కలగాలి?

రావణ సంహారమే ముఖ్యమైతే అందుకు ఈ తంతంతా అక్కరలేదు కదా? సంకల్ప మాత్రం చేతనే శ్రీమన్నారాయణుడు క్షణంలో ఆ పని చేసెయ్యగలడు.

రావణు డెత్తికెళ్ళింది అసలు సీతను కాదనీ, మాయాసీత ననీ మరొక కథ వుంది. అప్పుడు లంకలో సీత అనుభవించిన కష్టాలపట్ల కూడ సానుభూతి కలగదు. అసలు సీతకు ప్రమాదం లేనప్పుడు, మాయసీత ఏమైతేనేం?

రాముడు భగవంతు డనీ, సీత జగచ్ఛక్తి అనీ నమ్మితే రామాయణ గాథ ఒక తమాషాయే, ఒక ఫార్సే అవుతుంది. కాంతా సమ్మితమైన కావ్య

ప్రక్రియద్వారా మానవుణ్ని దివ్యత్వాని కెత్తా లన్న వాల్మీకి లక్ష్యం వ్యర్థమే అవుతుంది. వాల్మీకి లక్ష్యం, రామాయణ ప్రయోజనం నెరవేరేది సీతారాములు కేవలం మానవు లనుకొన్నప్పుడే.

సీతారాములు కేవలం మానవులు. అలానే కృష్ణార్జునులున్ను. ఎదురైన కష్టా లన్నిటినీ ధైర్యసాహసాలతో అధిగమించి, సమయానుకూలంగా రాజనీతిని ప్రదర్శించి తుది విజయాలను పొంది, మానవో త్తములుగా నిలిచినవాళ్ళు. ప్రతి మానవుడికీ ఆదర్శప్రాయులైన వాళ్ళు.

ప్రతి ఉత్తమ పురుషుణ్ని ఒక భగవంతుణ్ని చేసేసి, మన మత పెద్దలు మానవజాతి పురోభివృద్ధికే ఎక్కడి కక్కడ సమాధులు కట్టేశా రంటాడు భీమన్న.

ఏదో ఒక మూఢ భక్తి, మూఢ విశ్వాసం లేకపోతే-మరింకేం చెయ్యాలి? కాలం ఎలా గడుస్తుంది? అని ప్రశ్నించే వా ళ్లుండవచ్చు. మానవ జీవితం అనేక కష్ట నష్టాల మయం. ఏదో ఒక అతీత శక్తి మనల్ని రక్షించ గల దనుకుంటే-దాన్ని ప్రార్థించడంలో కొంత ఉప శమనం పొందవచ్చు కదా? అనీ అనవచ్చు. అయితే-మనం కల్పించుకొన్న ఒక ఊహా మూ ర్తిని మన కష్టాల నివారణ కోసం ప్రార్థించడం పిచ్చితనం కాదా అంటాడు భీమన్న. పరమాత్మ వున్నది, అదొక శూన్యశ క్తి. మన మంచి చెడ్డలతో దానికి ప్రమేయం లేదు. ఎందుకోసం కానీ దానిని ప్రార్థించడం వ్యర్థం అంటాడు. కాగా-ఒక మూఢ విశ్వాసంలో, భ్రాంతిలో కాలం గడిపే కంటె-సమగ్ర శక్తి వంతమైన మానవ జీవితాన్ని అభ్యుదయ కార్య నిర్వహణలో గడపవచ్చు నంటాడు.

మతమూ, భ క్తి, దైవభీతి - ఈ మూడూ ఒక భ్రాంతి. అద్వైతంలోని మాయ. ఈ మాయ తొలగకుండా మానవుడూ సత్యదర్శి కాలే డంటాడు.

మానవుడై పుట్టి, మహాత్ముడుగా బ్రతికి
మనుగడ చాలించిన ఏ గొప్పవాణ్ని
దేవుణ్ని చేసి దూరం చేసుకోను నేను.
ప్రతిభవంతుడైన ప్రతివాణ్ని

పరమేశ్వరుణ్ని చేనేస్తూ
ప్రజల మధ్యనుంచి తీనేస్తూ వుంటే
ఇక సామాన్యుడు పెరిగే దెలా ?
సంపూర్ణోదయం జరిగే దెలా ?

— గుడెనెల

177. మోహ భావన

భీమన్న సాహిత్యంలో లాగే, జీవితంలో కూడ అనేక వైరుధ్యాలు కని పిస్తాయి.

తన సాహిత్యంలోని వైరుధ్యాలకు సమాధానం తానే చెప్పుకున్నా డనేక సందర్భాలలో. తన సాహిత్యాన్ని వేదంతోను, అరణ్యంతోను, సృష్టితోను పోల్చి-అందులోని నానాత్వా భాసకు ఒక ఏకత్వాన్ని నిరూపించి చూపి వున్నాడు.

ఒక పేదవాణ్ణో, ముష్టివాణ్ణో చూస్తాం. మానవ సమాజంలో ఎంత దైన్య ముంది అనిపిస్తుంది. హృదయం కరుగుతుంది. ఆత్మ ఆవేశపడుతుంది. ఒక రచన వెలువడుతుంది. ఐశ్వర్యాన్ని చూచినప్పుడు కూడ అంతే. ఓహో అనిపిస్తుంది. భావం మాత్రం వేరు. నవరసాలు ఒకదాని కొకటి విరుద్ధమైనట్టివే అయినా, వాటన్నిటి పర్యవసానమూ ఒకే ఆనందం.

భూమి నీడకు అందని అవకాశంలోకి పోయి నిలిస్తే, అక్కడ మనకు ఉదయాస్తమయాలు లేని సూర్యుడు కనిపిస్తాడు. అక్కడ చీకటి వుండదు. దేశకాల పాత్రాది భేదాలు, వైరుధ్యాలు అన్నీ భూమి నీడ పరిధితోవే. ఆ పైన లేవు. తన కావ్య సృష్టి కూడ ఆలాంటిదే అంటాడు భీమన్న.

ప్రతి జీవి మెదడూ ఒక సూర్యుడు. చిన్న, పెద్ద, చిక్కన, పలచన మొరటు, మృదువు తారతమ్యాలెన్నో వున్నై. వాటి శక్తుల మీదనే ఆయా జీవుల మనుగడ ఆధారపడి వుంది.

కాయలు, మొక్కలు, దుంపలు, గింజలు, చేపలు, మేకలు, పిట్టలు - అన్నీ జీవరాశులే. జీవికి జీవే ఆహారమౌతున్నది. జీవిని తినకుండా

జీవి జీవించలేదు . తనకు ఒక జీవి ఆహారం . తాను మరొక జీవి కాహారం . ఒక ప్రక్క తాను అహారం సంపాదించుకోవాలి . మరో ప్రక్క మరో జీవికి ఆహారం కాకుండా తనను తాను కాపాడు కొవాలి . పర హింస , ఆత్మ రక్షణ - ఈ రెండూ ప్రాధమి కావసరాలైనై - ప్రతి జీవికీ . ఇక్కడ పాప పుణ్యాల ప్రసక్తె లేదు . సప్త మహా ఋషులు శవాన్ని తినడం , విశ్వామిత్రుడు కుక్కను ఆరగించడం , అగస్త్యుడు వాతాపిని జీర్ణం చేసుకోవడం , వశిష్ఠుడు కళ్యాణి ఆవు పెయ్యను భోం చెయ్యడం - అన్నీ ఈ సత్యంలోని భాగాలే .

పర హింస , ఆత్మ రక్షణ ప్రతి జీవికీ ఆవసరం కావడంలోనే జీవిత సమరం వుంది . సృష్టిలోని వైరుధ్యాలకు , వైరాలకు ఆదే మూలం .

మానవుడి ప్రాజ్ఞానగరిక యుగాన్ని వదిలేసి , వేద యుగం నుంచి విమర్శించి చూచినా - నేటి దాకా ఇదే అతడి చరిత్ర . పర హింస – ఆత్మరక్షణ ! వేదాలు , పురాణాలు - లోకంలో ఏ జాతివైనా సరే - వెల్లడించే దంతా ఇదే సత్యాన్ని . దేవతలు , దేవుళ్ళు , వాళ్ళ ఆగ్రహా నుగ్రాహాలు , ఆశ్రిత పక్షపాతాలు వగైరాల కధలన్నీ జీవిత సమరంలో విజయం కోసం మానవుడు కల్పించుకొన్న పేరాసలే .

పాప పుణ్యా లనేవి క్రింది వాళ్ళను తమ కాళ్ళ క్రింద అణచి పెట్టి వుంచ కోడానికి పై వాళ్ళు కల్పించిన రెండు బూచు లంటాడు భీమన్న . వాటికి పై వాళ్ళే నాడూ భయపడలేదు . క్రింది వాళ్ళు కూడ అవి వట్టి బూచులని గుర్తించిన నాడు మానవ సమాజం నిజంగా మాననీయ మవుతుం దంటా డీయన .

చిన్నప్పుడు ఇటుకలకు నామాలు పెట్టి , రాంభజనలు చేసిన భీమన్న - నిజమైన ఆర్షేయుడు (హిందువుడు) గా ధర్మ అర్ధ కామ యోగాలను అనుభవిస్తూ వచ్చి , క్రమంగా మోక్షయోగాన్ని అందుకొన్నా డనవచ్చు .

" హిందూ " అనేది భారతీయులను అవమానించే మ్లేచ్ఛ పదమని దానిని సాధారణంగా వాడడు భీమన్న . ఆర్ష పదాన్నే వాడతాడు . ఆర్షమతం మానవ జీవిత ప్రగతికి నాలుగు దశలను ప్రతిపాదిస్తుంది . నాలుగు వర్ణాలు , నాలుగు ఉపాయాలు , నాలుగు ఆశ్రమాలు , నాలుగు పురుషార్థాలు . ఈ దశలు నాలుగూ ఒకే వ్యక్తి అనుభవించి , అధిగమించవలసి నట్టివి .

ప్రతి వ్యక్తి పుట్టుకతో శూద్రుడు. బ్రహ్మచారి. ప్రకృతి ధర్మాన్ని అనుసరించే వాడు. రెండో దశలో విద్య, ధనం ఆర్జించే వైశ్యుడు. వాటిని పుష్కలంగా గడించిన తర్వాత, కామోప భోగా లనుభవించడానికి యోగ్యు డవుతాడు. ఆప్పు డతడు క్షత్రియుడు. ఈ మూడు దశలను సంపూర్ణం గా అనుభవించినవాడే మోక్షార్హు డవుతాడు. ఇవన్నీ ఒకే వ్యక్తికి ప్రతిపాదించ బడి నట్టి వనేది ముఖ్యాంశం. శూద్రుడు, వైశ్యుడు క్షత్రియుడు', బ్రాహ్మడు - ఈ నలుగురూ ఒకే వ్యక్తి. జన్మనా శూద్రుడు, బ్రహ్మ జ్ఞానేన బ్రాహ్మడు.

రాగ వాశిష్ఠం పీఠికలో ఈ సిద్ధాంత ప్రతి పాదన చేశాడు భీమన్న.

పుట్టుకతో ప్రతి వ్యక్తి శూద్రుడే, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణగా ఆతడు వికసించాలి. ఎవడూ పుట్టుకతోనే వైశ్యుడో, క్షత్రియుడో, బ్రాహ్మడో కాదు. ఎంత గొప్ప పండైనా, అది పుట్టినప్పుడు పిందే.

నేడు అమలులో వున్న నాలుగు వర్ణాల సిద్ధాంతం సహజమైంది కాదంటాడు భీమన్న.

శూద్రులుగా పుట్టి, క్షత్రియ బ్రాహ్మణ దశల వరకు వికసించినవాళ్ళలో కొందరు స్వార్థ పరులు, తమ సుఖ భోగాలను తమ వంశం వాళ్లకు స్థిర పరచ డం కోసం "పుట్టుకులం" సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టి జాతి ప్రగతిని ఆపి వేశా రంటాడు. అంటే శూద్రుడి కొడుకును శూద్రుడుగానే వుంచేశారు. మరి పెరగ కుండా శాసనాలు చేసేశారు. బ్రాహ్మడి కొడుకు, సహజ వికాసం అక్కర లేకుండా పుట్టుకతోనే బ్రాహ్మ డవుతాడని ప్రకటించేశారు. ఈ పుట్టు కులం సిద్ధాంతం ధర్మవిరుద్ధ మైనట్టి దంటాడు భీమన్న. ఈ సిద్ధాంతమే ఆర్షమతాన్ని జీవచ్ఛవం చేసి, భరత జాతిని బానిసను చేసిం దంటాడు.

ఈ విధంగా పుట్టుకతో వచ్చిన అంధకారాన్ని, అజ్ఞానాన్ని, భయాన్ని క్రమంగా ఖండించుకొంటూ - వెలుగునూ, విజ్ఞానాన్ని, ధైర్యాన్ని సమ కూర్చుకొంటూ - ఒం సంపూర్ణ మోక్షమూ ర్తిగా వికసించిన వాడు భీమన్న.

మోక్ష మంటే ఏమిటి ?

గర్భం నుంచి విముక్తి జననం . శరీరం నుంచి విముక్తి మరణం . జనన మరణ విషవలయం నుంచి విముక్తే మోక్షం . ఇది సంప్రదాయం . సంప్రదాయం నుంచి విముక్తే మోక్షం భీమన్న దృష్టిలో .

"సంప్రదాయం ఒక దీర్ఘ వ్యాధి . ముందు దీని నుంచి విముక్తులు కండి" అంటాడు భీమన్న . భూమి నీడ పరిధిని దాటి నిలిచిన వాడికి వెలుగే తప్ప చీకటి ఎలా లేదో , శరీర పరిధిని దాటి పోయిన వాడికి జీవమే తప్ప మృత్యువు లేదు అంటాడు . జన్మను , శరీరాన్ని ఒక బంధనగా భావించే వాళ్ళకు మృత్యువే మోక్షం అంటాడు .

తనకు మాత్రం శరీరమే శివుడు . శరీర సంరక్షణమే శివపూజ . సగుణ సాకార మూర్తిని త్యజించి నప్పుడు జరిగేది సాక్షాత్ బ్రహ్మైక్యమే .

సకల సృష్టియు నాకు సంతానమే కదా :
అందరిని సమముగా ఆదరింతును నేను
శక్తి ననుసరించి సహకరింతును నేను
శక్తిహీనుని జూచి జాలి పొందుదు గాని -
బలిమి గని గర్వ పడ కుండ నెట్లుందు ?
బ్రతుక నేర్చిన వాని పక్షమే నేను
గెల్చెది శక్తికే తేలిత్తు నేను
ప్రగతియే నా స్వభావము , విధానమ్మ ,
వెమకబడున దెల్ల వీగి నశించు :

—మానవుని మరొక మజిలీ

178 . సోషలిజం

తాను విద్యార్థిగా ఉన్న రోజులలోనే సర్వోదయం అన్నమాట విన్నాడు భీమన్న. సామ్యవాదం , సమాజవాదం , సమసమాజ వ్యవస్థ మొదలైన పేర్లకంటె తాను వూహిస్తున్న సర్వమానవ సమగ్ర సౌభాగ్య సమసమాజ వ్యవస్థకు సర్వోదయం అనే పేరే బాగున్న దనుకొన్నాడు . సాయుధ విప్లవం కంటె శాంతియుత సర్వోదయ పరివర్తనమే మంచిదని తన మధుశాల కావ్యంలో ప్రతిపాదించాడు .

సర్వోదయం వృద్ధ నైతికవాదుల వణికే చేతుల్లో ముష్టిమూకుడుగా మారే దాకా, తన కావ్యంలో సోషలిజానికి పర్యాయపదంగా సర్వోదయాన్ని వాడుతూనే వచ్చాడు భీమన్న.

గాంధీజీ ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్నికూడ సోషలిజంగానే అర్థం చేసుకున్నాడీయన.

కవిత అందరూ వ్రాయలేరు. అందరూ గానం చెయ్యలేరు. ఒక్కొక్క కళ ఒక్కొక్కళ్ళకు అబ్బుతుంది. వ్యవసాయం, వ్యాపారం, చేతివృత్తులు, పరిశ్రమలు అన్నీకూడ కళలే. అన్నీ ప్రజలందరకూ కావలసినవే. ఆనందానికి కావ్య సంగీతాల వలెనే ఆహారానికి అన్నాదులూ, అలంకారానికి వస్త్ర భూషణాదులూ కావాలి. సంగీతం వలెనే ధనసంపాదనకూడ ఒక కళ. గాయకుడు ధనం సంపాదించలేడు. ధనికుడు గానం చెయ్యలేడు. గాయకుడి గానం సర్వ ప్రజలను ఎలా ఆనందపరుస్తున్నదో, అలానే ధనికుడి ధనం సర్వజనులనూ పోషించవలసి వుంది.

అతడు గానమూ మానరాదు. ఇతడు ధనార్జనా మానరాదు. అవి వారికి సహజంగా అబ్బిన కళలు. అందుకే వారి సొంతం కావు. వాటిపై హక్కు మొత్తం ప్రజలందరికీ వుంది. కాగా, ఏ కళలో నిపుణులైన వాళ్ళు ఆ కళలో తాము ప్రజలకు, సమాజానికి ధర్మ కర్తలు. ఇదీ ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్ని భీమన్న అవగాహన చేసుకొన్న విధం. సర్వోదయమన్నా, ధర్మ కర్తృత్వమన్నా సోషలిజమే భీమన్న దృష్టిలో.

అయితే-సర్వోదయం వృద్ధ నైతిక వాదుల చేతులలో వలెనే, ధర్మ కర్తృత్వం ప్రౌఢ స్వప్రయోజకుల కోరలలో చిక్కుకొని, ప్రజలకు పనికి రాకుండా పోయింది. గోవుల మందకు రక్షణగా కుందేళ్ళు పనికిరావు, పెద్ద పులులూ పనికిరావు.

అందుకే ఇటీవలనుంచి సమాజం గురించి చెప్పవలసి వచ్చినప్పుడు "సోషలిజం" పదాన్నే వాడసాగాడు భీమన్న. ఆది దేవుడూ, ఆది భిక్షువూ అయిన శివుడే ఆది సోషలిస్టుకూడా అంటాడీయన. శివపారమ్యాన్ని శివ సోషలిజం అన్నాడు తన "శివాలకలు" కావ్యంలో.

తానే శివుడు, శివుడే తనువు అని చెపుతూ తనువును భద్రంగా కాపాడు కోవడం, సర్వతోముఖ వికాస ప్రధానంగా జీవించడం ప్రతి మనిషికీ లక్ష్యం కావాలనీ, అట్టి లక్ష్యం లభ్యంకావా లనీ అంటాడు భీమన్న. అట్టి సర్వ సమగ్ర సంపూర్ణ జీవిత ఫలానుభవమే రసాద్వైతం అంటాడు.

వేదకాలం నుంచీ నేటివరకూ ఎందరో మహర్షులు, ప్రవక్తలు ప్రతిపాదించుకొంటూ వచ్చిన మతాలు, ధర్మాలు, నీతులు ఏవీ సమగ్ర సత్యదర్శకాలు కావని తోసివేస్తాడు భీమన్న. అందుకే ఇంకా సత్యాన్వేషణ సాగుతూనే వున్నదంటాడు. అన్వేషణ ఫలప్రదం కావడంలేదు. అందుకు కారణం అది మాయామయమైన మత ధర్మంపై ఆధారపడి సాగుతుండడమే. ప్రతివాడూ తన దారే సరైనదనుకొంటూ, తలకొక దారినీ పోతూ, చీకటి చిక్కల్లోపడి గిరికీలు కొడుతున్నారు. గతాన్ని వదలకుండా వర్తమానమే అందదు. భవిష్యత్తెలా భాసిస్తుంది అంటాడు.

గతాన్నంతా త్రోసివేసి, సంపూర్ణ జీవితమే మానవాదర్శంగా పేర్కొంటూ, అందుకు సాధనంగా సోషలిజాన్ని పేర్కొంటాడు భీమన్న. ఈ సోషలిజం సమస్త వైరుధ్యాల సమన్వయ రూపం. సర్వరసాల సమైక్య దీపం. ప్రతి మనిషి తృప్తిగా, నిండుగా బ్రతకడమే దీని తత్వం. ఇదే భీమన్న రసాద్వైతం.

ఆది మార్క్సిస్టు ప్లానుకానీ, గాంధేయ ప్లానుకానీ ఆమలు జరిపేవాళ్ళు నక్కలూ, పులులే అయినంతకాలం ఏదీ ఫలప్రదం కాదంటాడు భీమన్న.

సీత శాస్త్రీల కుప్పపై నిల్చి, ధర్మ
నిర్ణయము గోరుచున్నాడు నేడు వరుడు,
రేపు తిండి యెట్లను చింత బాపకుండ
దేవి! సంఘమ్ము నెటు చక్కదిద్దలేము

—దీప సభ

పులులకూ, నక్కలకూ దొరుకుతున్న ఆహారం
గొర్రెలదాకా రావడం లేదంటే, అది ఆర్థిక సమస్య
బ్రతకడానికి పరిపడే గడ్డి మాత్రం

గొర్రెలకు దొరుకుతున్న దంటే, అది రాజకీయ సమస్య
ఈ సమస్య జోడు గుర్రాల రథానికి
రథికులు పులులు, సారథులు నక్కలు,
చతురంగ బలాలు మతాలు, ప్రవక్తలు!

—శివాలకలు

179. ప్రతిభకు సమాధి

రిటైరయిన తర్వాత పెన్షను మంజూరు కావడానికి చాలా కాలం పట్టింది. భీమన్న సర్వీసులో క్లిష్టత ఏమీ లేదు. లోన్సు కూడ తీసుకోలేదు. రిటైరయ్యే నాటికి ఎర్న్డ్ లీవు పరిమితికి మించి వుంది. మరొక ఆఫీస రైతే, దానికి కూడ జీతంలెక్క కట్టి ఇచ్చేవారేమో. అది కూడ ఈయన కోరలేదు. పెన్షను లెక్క తేల్చ డానికి రెండు నిమిషాలు చాలు. మరి అన్ని నెల లెందుకు పట్టిందో తెలియక, కొంత చిరాకు పడ్డాడు భీమన్న.

జీతం రాదు కాబట్టి భరణం ముట్టదు. కనుక, పెన్షన్ నుంచి భాగం కావాలని బహుశా నాగరత్నమ్మ ప్రభుత్వానికి పిటీషను పెట్టిందేమో అన్న అనుమానం కల్గిన తర్వాత - ఆ విషయం మరి పట్టించుకో లేదీయన. వచ్చి నప్పుడే వస్తుంచిలే ఆని వదిలేశాడు. ఇంతకూ పెన్ష నెంత? నెలకు నూట పదిహేను రూపాయల నలభై పైసలు! సర్వీసు పదేళ్లే కదా? అందు కంత తక్కువ. ఈయన కది జేబు పైసలుగా కూడ సరిపోదు. ఇక, బ్రతకడం ఎలాగ?

"ఆది నుంచీ కాంగ్రెసు వాదిగా, జాతీయోద్యమ కార్యకర్తగా, ప్రముఖ జర్నలిస్టుగా, ప్రసిద్ధ కవిగా, రచయితగా, నాటక కర్తగా వుండి - ప్రభుత్వ అనువాద శాఖను అతి సమర్థంగా నిర్వర్తించి, గ్లాసరీలు కూడ నిర్మించి, రిటైరైన ఈ స్టేట్ ఆఫీసరు హరిజనుడు కాకుండా - మరో కులం వాడై వుంటే? లీవు సేలరీ ఇచ్చేవారు, రిటైరయిన వెంటనే మరో పద వేదో చూపే వారు. ఏదీ ఖాళీగా లేకపోతే, కొత్తదాన్ని సృష్టించే వారు. ట్రాన్సు లేషన్‌కు, అధికార భాషకు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యక్రమాలు ఎన్నో వున్నై. వాటిని సక్రమంగా నిర్వహించా లంటే, భీమన్నే అందుకు తగిన వాడు. మరి? నడి వీధిలో దిక్కులేని వాడుగా ఎందుకు వదలి వేయ బడ్డాడు? హరి జనుడు కనుకనే కదా?" ఇది ఒక్క భీమన్న భావ వేదనే కాదు-

మొత్తం హరిజన విద్యావంతుల మౌన వేదనా, కులాతీత ప్రగతి భావుకులైన సమస్త యువలోకంలోనూ వ్యక్తమైన ఆదర్శ భగ్న వేదనా కూడ.

వేగం, ఆశ, పోటీ - ఈ మూడూ ప్రాధాన్యం వహించిన ఈ యుగంలో, వేదవాళ్ళూ, ఉదాసీనులూ బాధలకూ, బెంగలకూ గురి కాక తప్పదు. వాటిని మించి భీమన్న అదనంగా గురైన బాధలకూ, బెంగలకూ కారణం కులం.

కులం కారణంగా ఈ కులం వాళ్ళు పడుతున్న హింస, ముఖ్యంగా మానసిక హింస ఇంతిం తన రానిది. అయితే, విషాన్ని ప్రమింగి అమృతాన్ని పంచి యిచ్చే ఉదారుడు కనుక, తనకు జరిగిన అన్యాయాలను లెక్కచెయ్యకుండా, సర్వజన శ్రేయస్సునే లక్ష్యంగా తీసుకొని, సాహితీ సృష్టిపై దృష్టిని కేంద్రీకరించు కొన్నాడు భీమ్నుడు.

1966 లోనే "మానవుని మరొక మజిలీ" కావ్యం ఆంధ్ర యూనివర్సిటీలో ఎమ్. ఏ. కు స్పెషల్ తెలుగు పాఠ్య గ్రంథంగా నిర్ణయించబడిం దట. ఆ సంగతి భీమన్నకు తెలియదు - ఆ మధ్య ఎవరో ఆ ప్రసక్తి తెచ్చేదాకా. పుస్తకాల కోసం ఎవరూ అడగ లేదు కూడ." "ఆకాంద తాండవం" అంతకు ముందే ముద్రించ బడినా, అంకిత సభ మాత్రం సారస్వత పరిషత్తు హాలులో భీమన్న రిటైరైన తర్వాతనే జరిగింది. అంకితం అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి గారికి.

ప్రతి సంవత్సరమూ కార్తిక పూర్ణిమనాడు శ్రీధరబాబు కౌముదీ ఉత్సవాలు చేస్తుండేవాడు. గౌశీగూడలో ఆయన అద్దె ఇంటి విశాలమైన మిద్దెమీద వెన్నెలలో జరిగేవి ఆ ఉత్సవాలు. అందుకోసం ప్రత్యేకంగా బందరు నుంచి తెప్పించే వా డాయన పిండివంటలూ, పులిహోరా. సంగీతం, సాహిత్యం, స్వీయకవితలు, నృత్యం, చర్చలు రాత్రి ప్రొద్దుపోయేవరకూ సాగేవి. శేషేంద్రశర్మ, ఆరిపిరాల విశ్వం, ఓగిరాల నరసింహామూర్తి, భూషి రామదాసు, దాశరథి, నారాయణరెడ్డి మొదలైన విజ్ఞు లెందరో పాల్గొంటూ వుండే వారు. భీమన్న పాత్రమాత్రం చాల ప్రధానంగానే వుండే దా ఉత్సవాలలో.

రిటైరు కాగానే శాసనసభ ఎన్నికలలో కాంగెసు సీటుకోసం అప్లయి చేశాడుభీమన్న. అప్పుడు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు తిమ్మారెడ్డిగారు. కొంచెం

ముందుగా చెప్పివుంటే సీటు తప్పకుండా ఇచ్చివుండేవా ణ్ణన్నా డాయన. అంతకుముందు ఆ ఫూహే లే దీయనకు.

కేంద్ర పరిశ్రమల మంత్రిగా వున్న సంజీవయ్యగారు ఎన్నికల ప్రచారం కోసం హైదరాబాదునుంచి కారులో బెజవాడకు వెళుతూ, మధ్యలో ప్రమాదానికి గురి అయినారు. ఆ ప్రమాదాన్ని వర్ణిస్తూ సంజీవయ్యగారికి సత్వరారోగ్యాన్ని కోరుతూ, "అమృతాభిషేకం" అనే శీర్షికతో 27 పద్యాల లఘుకావ్యం వ్రాశాడు భీమన్న. గాంధీ ఆసుపత్రి ప్రత్యేక గదిలోవున్న సంజీవయ్యగారు ఆ పద్యాలను భీమన్నచేతనే మరీ మరీ చదివించుకొని ఆనందించేవారు. ఆయా సందర్భాలలో నేను భీమన్నకూడా ఉండేదాన్ని. రిక్షాకయిన దగ్గరనుంచీ భీమన్నకు నేనే చేదోడు వాదోడు కావలసి వచ్చింది.

ప్రమాదానికి గురై వెంట్రుక వాసిలో మృత్యువును తప్పించుకొని, ఆస్పత్రిలో పడివున్న సంజీవయ్యగార్ని చూచినప్పుడు ఎంతో దుఃఖం కలిగేది. ఎంతో ఉత్తముడు, ఇంకా ఎంతో ఉన్నతుడు కావలసిన వాడు! ఎంతలో ఎంత జరిగింది! అదెలాంటి ప్రమాదమో! ఏది ఏమైనా, ఆ దెబ్బతో తెలుగుదేశం, ముఖ్యంగా దళిత వర్గం, అనాథమై పోయింది. ఆ నొగులు నుండి మళ్ళీ సంజీవయ్యగారు పూర్తిగా కోలుకోలేదు. పూర్ణారోగ్యం సంతరించుకో లేదు.

ప్రతిభా కాదు, పాండిత్యమూ కాదు, సమర్థతా కాదు,
మనిషికి కావలసింది తాను సురక్షితంగా బ్రతకడం!
ఆత్మరక్షణ, పరహింస - ఇదే మానవ చరిత్ర!
నీతికథలు ఇతర్లకు, నేతి గారెలు తనకు

— టుమ్రీలు

180 · పల్లెల్లో కామందులు

"నేను కూడా రానా?" అన్నాడు బొజ్జా కృష్ణశాస్త్రి.

"ఎక్కడికి?"

"కర్నూలుకు"

భీమన్నను ప్రేమిస్తూ అవస్థ పెట్టే చిన్న పెద్ద మిత్ర బృందంలో — ఈ శాస్త్రి ఒకడు.

అమలాపురం తాలూకాలోని కంచి కుప్పకు చెందిన బొజ్జా అప్పలస్వామి గారు ఒక దిట్టమైన హరిజన నాయకుడు. చాలకాలం శాసన సభ్యుడుగా కూడ వున్నాడు. ఆయన పిఠాపురం హాస్టలు విద్యార్థి. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి, కంభంపాటి రామ శాస్త్రి (తారకం) గారికీ ఎంతో ప్రేమ పాత్రుడు. ఆ ఇద్దరి పట్ల తనకు గల భక్తికి చిహ్నంగా తన ఇద్దరి కొడుకులకు కృష్ణ శాస్త్రి, తారకం అని పేర్లు పెట్టుకున్నాడు. భీమన్నపట్ల ఆ ఇద్దరికీ ఎంత వాత్సల్యమో, ఈ ఇద్దరికీ అంత మమకారం.

ఈ ఇద్దరూ వయస్సులో భీమన్నకు పుత్ర స్థానీయులే. అయినా-ప్రతి భలో సమానులై-ఆట పాటలతో, విందు వినోదాలతో, సాహిత్య చర్చలతో భీమన్నను పోటిపడి ఆనందింప జేస్తూ, ఆనందిస్తుండే వాళ్ళు. 1967 నాటికి శాస్త్రి ఆకాశవాణిలో ఉద్యోగిగా హైదరాబాదులో వుంటున్నాడు, తారకం ఆడ్వకేటై హైదరాబాదును వదిలేసి, కాకినాడలో వుంటున్నాడు. ఏ విషయాని కైనా-భీమన్న కోసం తాను ఖర్చు పెట్టడం తారకానికి తృప్తి. తన దగ్గర ఎంత డబ్బున్నా లేదని చెపుతూ, భీమన్నచేత ఖర్చు పెట్టించడం శాస్త్రికి సరదా.

కర్నూలులో ఒక లాడ్జింగులో దిగా రిద్దరూ. 1967 ఎన్నికలలో పార్ల మెంటుకు అక్కడి నుంచి పోటీ చేస్తున్నారు సంజీవయ్య గారు. ఆయన ఆక్కడ ఆస్పత్రితో పడి వున్నారు. భీమన్న లక్ష్యం సంజీవయ్య గారికి తోడ్పడడం. శాస్త్రిది వినోద యాత్ర.

"మీ రాకకు సంజీవయ్యగారెంతో ఆనంద పడ్డారు. నియోజక వర్గ మంతా ఒకసారి తిరిగి రండి. ఖర్చుకు ఇది వుంచండి, "అంటూ, ఆయన బంధు వొక వ్యక్తి భీమన్న చేతిలో ఆయిదు వందలు పెట్టబోయాడు. భీమన్న తీసుకో లేదు. ఆ మాత్రం తన జేబులో కూడ వున్నదనీ, తన కొక వాహనం ఇస్తే చాలనీ అన్నాడు. సంజీవయ్యగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని. విశ్వ ప్రయత్నమే చేశారు. కాని, ఒక డొక్కు కారు కూడ దొరక లేదు-ఆ కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖా మంత్రికి!

కార్లు, జీపులు, నోట్ల కట్టలు-మనకు ఎన్నిక లంటే ఇదే కదా? మరి ఆ వస్త్రి ఏమైపోయాయి? ఎవరి సూటుకేసుల్లో దాక్కొన్నాయి? ఎవరి సౌధాల

దొడ్లలో పడుకున్నాయి? అనుపత్రి నుంచి కదలడానికి వీలులేని స్థితిలో వున్న నాయకుడి పట్ల నమ్మిన మిత్రులు, పార్టీ కార్యకర్తలు అనుసరించ వలసిన ధర్మం ఇదేనా? చాల బాధ పడ్డాడు భీమన్న. తా నేం చెయ్యగలడు?

కుల తత్వం, ముఠా ద్వేషం తప్ప-పార్టీ విధేయత, నీతి నిజాయితీ ఏ, జాతి శ్రేయస్సు ఎక్కడా కనిపించ లేదు భీమన్నకు. హరిజన పేటల్లో కూడ సంజీవయ్య పేరును బహిరంగంగా చెప్పడానికి భయపడుతున్న ఘోర స్థితి!

"బాబూ! మేం ఆయనకే వేస్తాం లెండి. ఆయన పేరు మాత్రం గట్టిగా అనకండి. ఖామందులు బ్రతక నివ్వరు" అన్నాడు దీనంగా ఒక హరిజన వృద్ధుడు-ఒక పేటకు వెళ్ళి భీమన్న ఏదో చెప్పబోతే.

సంజీవయ్యగారి నియోజక వర్గం క్రింద వున్న అ్ని అసెంబ్లీ నియోజక వర్గాలకూ బస్సులో వెళ్ళాడు భీమన్న. ఆలూరులో గోవింద దాసు గారింట ఒక రాత్రి భోజనం చేశాడు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసన సభలో కూడ గోవింద దాసు సభ్యుడు. మంచి ఉత్తమ సంస్కారం కల వ్యవసాయదారులు వారు. వారి ఆతిథి మర్యాదలు, ఆదరణ మరువరాని వంటా డీయన.

భీమన్న ఒక బస్సులో ప్రయాణం చేస్తుండగా-ఒక ప్రయాణీకుడు మరో ప్రయాణీకుడితో బిగ్గరగా ఇలా అన్నాడు -'సంజీవయ్య ప్రతక డట్రా; అతడికి వోట్లివ్వడం దండగ!'

ఆ మరొక డన్నాడు, 'ఓ కన్ను పూర్తిగా పోయింది. మహా అయితే, నెలో రెండు నెలలో.' ఇంకొక డన్నాడు, 'మనుషుల్ని గుర్తు పట్టడం లేదట.'

ఇక భరించ లేక పోయాడు భీమన్న. 'మీలో ఎవరైనా సంజీవయ్యను చూశారా?' అన్నాడు.

'ఆ, చూసే దేంటి?' అన్నా డొకడు. "మొన్న చూశాను" అన్నాడు మరొకడు.

"నేన ఈ ఉదయమే ఆయనతో మాట్లాడాను. మీరు చెప్పేదేదీ నిజంకాదు. ఆయన బాగా ఆరోగ్యంగా వున్నాడు. మరో నాలుగైదు రోజుల దాకా బైట

ఉపన్యాసా లివ్వవద్దన్నారు డాక్టర్లు" అన్నాడు భీమన్న. అందరూ ఈయన కేసి తిరిగి చూశారు. ఎవరూ మళ్ళీ మాట్లాడ లేదు.

పరిస్థితి ఎంత క్లిష్టంగా వున్నదో, తనకు అత్యంత సన్నిహితులుగా వుంటున్న వాళ్ళే ఎలాంటి ద్రోహాలు చేస్తున్నారో సంజీవయ్య గారికి చెప్పాడు భీమన్న. సర్దార్ నాగప్ప, మునిస్వామి వంటి అసెంబ్లీ అభ్యర్థులు ఖర్చులకు కూడ ఎంత ఇబ్బంది పడుతున్నారో వివరించాడు. అప్పటికి తన కొక వాహనం దొరకక్క పోవడం వల్ల, సంజీవయ్య వద్ద సెలవు తీసుకొని, శ్రీశైలం బస్సెక్కాడు.

ప్రస్తుత సాంఘిక వ్యవస్థ మారాలి,
ఉపనిషత్ పరమ పదానికి
సూటి మార్గం ఏర్పడాలి
అట్టి మార్గంలో శతాబ్దాల తరబడి
పెరుగుతూ వస్తున్న ముళ్ళ దొంకల్ని
పెరికి పారెయ్య లేక పోతే —
వరికైనా పారెయ్యాలి

— శివాలంకలు

181. తీర్థ యాత్రలు

"విగ్రహాలు, పూజలు, ప్రార్థనలు అన్నీ అబద్దాలూ, మోసాలూ, వ్యర్థాలూ అంటావు కదా? మరి, గుడికి వెళ్ళి కొబ్బరికాయ కొడతా వెందుకు?" ఇది భీమన్నను చాల మంది అడిగే ప్రశ్న.

అ ప్రశ్న కీయన నవ్వుతూ చెప్పే జవాబు "నేను గుడికి వెళ్ళి కొబ్బరి కాయ కొట్టడం ఆ మోసాలలో ఒకటి" అని.

గోచీల స్వాములు, కాషాయ గుడ్డల వాళ్ళు, భిక్షాం దేహులు, గంటల కొలది జపమాల తిప్పుతూ కూర్చునే వాళ్ళు, మేక పాలు మాత్రం తాగి ఊత కర్రలు పుచ్చుకు తిరిగేవాళ్ళు, కనకాసనాలపై కుదురుగా కూర్చుని మట్టి విలువ గురించి బోధించే వాళ్ళు, జనానికి నల్లమందు మేపే ఆస్తికులు, చెవిటి

చెవుల్లో శంఖా లూదే నా స్తికులు - ఇలాంటి పెద్దలు ప్రజలకు ఆదర్శ పురుష లెలా అవుతారు?

అందులో ఒక్క పెద్ద నైనా, సమాజంలోని ఒక్క మనిషైనా అను సరించి బ్రతక గలడా?

మరి, ఆ పెద్దలు చెప్పే వన్నీ అబద్దాలూ, చేసే వన్నీ మోసాలూ, ప్రజల కవన్నీ వ్యర్థాలూ కావా?

తాను ప్రజలలో ఒకడు కనుక, ప్రజలకు దారి చూపవలసిన కవి కనుక, ప్రజల మధ్య బ్రతకవలసిన అవసరం తన కున్న దంటాడు భీమన్న. తాను మరీ ముందుకు పోగూడదు. అనేక సార్లు వెనక్కు వచ్చి, వెనకబడ్డ వాళ్ళను ముందుకు నడిపించవలసి వుంటుంది. అలా వెనక్కి రావడాలే గుడు లకు వెళ్ళడాలు - అంటా డీయన.

మత సాంఘిక ఆర్థిక రాజకీయ పెత్తందారులైన గురువు లందరికీ దైవ రహస్యం తెలుసు. జీవ రహస్యమూ తెలుసు. అందుకే వాళ్ళు తమ స్వప్రయోజ నాల కోసం ఎలాంటి దుర్మార్గాలకైనా వెను దీయరు. నీతి నియమాల, ఆచార సంప్రదాయాల, పాప పుణ్యాల బెడద గొర్రెల వరకే. సామాన్య ప్రజలు, వోటర్లు అందరూ గొర్రెలే అంటాడు భీమన్న.

నియంతృత్వ రాజ్య ప్రభువులు తమ ప్రజల మెదళ్ళను బాగా కడిగి వేస్తా (బ్రెయిన్ వాష్ చేస్తా) రనే సంగతి అందరికీ తెలిసిందే. అలా కడిగి వేయ బడ్డ మెదళ్ళు మళ్ళీ ఎప్పటికైనా చిగురించవచ్చు. కాని, ఈ మత పెద్దలు, ముఖ్యంగా ఈ దేశంలో కుల తత్వ గురువులు, ఏనాడో కడిగివేసిన ప్రజల మెదిళ్ళలో ఈ నాటికీ గడ్డి పరకైనా మొలవక పోవడం ఆశ్చర్యకర మంటాడు భీమన్న. ఈ మెదళ్ళిప్పుడు ఇసుక దిబ్బలు, మంచు గడ్డలు, పాతకాలపు చాదస్తాల బూజు బంతులు. వీటికి పునశ్చైతన్యం కలిగించడం ఎలా? ముందుకూ, వెనక్కూ తన ఉరుకులూ, పరుగులూ అందు కోసమే అంటాడు భీమన్న.

పుణ్య క్షేత్రా లనబడే ప్రాంతాలకు భీమన్న వెళ్ళినప్పుడు - అక్కడి గుడి గోపురాలను దర్శించడం , మర్యాదలను పాటించడం భక్తి కారణంగా కాదు . అక్కడ దైవ దర్శనం కోసం క్యూలలో నిలబడే వాళ్ళను ప్రశ్నిస్తే , నూటికి తొంభైమంది భీమన్న లాంటి వాళ్ళే . ఆ గుడిలో దేవుడు ఏదో ఒరగ బెడతా డన్న విశ్వాసంతో వచ్చే వాళ్ళు బహు తక్కువ . మరెందుకు వస్తున్నారు ? మెదళ్ళు పని చెయ్యక ! అచార యంత్ర బంధంలో చిక్కుతున్న అసహాయత వల్ల ! అట్టి వాళ్ళ దర్శనం కోసం వస్తా డక్కడికి భీమన్న .

బ్రహ్మాండమైన ప్రచారంతో , అట్ట హాసంతో విమానంలో వచ్చి , క్షణంలో దైవ దర్శనం చేసుకొని పోయే గొప్పవాడికి నిజంగా దైవభక్తి వున్న దనేనా ? దైవమే అబద్ధం అతడికి . మ రెందుకు వస్తాడు ? ప్రజలలోని మూఢ భక్తి సడలకుండా చూడ్డానికి !

ఆయా క్షేత్రాలలోని సుందర ప్రకృతి , శిల్ప రామణీయకత ఎక్కువగా ఆకర్షిస్తాయి భీమన్నను . కర్నూలు మండలంలోని ఏ ప్రాంతాన్ని అంతకు ముందు అంతగా చూడని భీమన్నను శ్రీశైల క్షేత్రం బాగా ఆకర్షించి అనంద పరిచింది . నల్ల మల అడవుల శోభ , ఉత్తర ముఖంగా వంగి శివార్చన చేస్తున్న కృష్ణ గంగ మహానుభూతిముద్దుణ్ణే చేశా యీయనను . కుల తత్వమూ, అంటలాని తనమూ లేని మల్లికార్జునుడి సోషలిస్టు సంప్రదాయం విశ్వ శ్రేయస్స మాహారమే కదా !

కృష్ణశాస్త్రి కంచి కుప్పకు పోతా నంటూ , గుంటూరు బస్సెక్కేశాడు . భీమన్న కర్నూలుకు మరలి , అక్కడ ప్రచార శాఖాధికారిగా వున్న నర్రావుల సుబ్బారావు గారికి అతిధిగా వుండి , అయనతో పాటు మహానందినీ , అహో బిలాన్ని దర్శించి , ఒక సౌందర్య రస భాండమే అయినాడు . పరా తత్వ పారమ్యమే అందుకొన్నాడు .

అహోబిలం నుంచి తిరిగి వస్తూ , దారిలో ఆళ్ళ గడ్డ వద్ద మకాం వేసి వున్న కంచి కామకోటి పీఠాధిపతుల శిబిరంలో ఆగి , వారి పూజా క్రమాన్ని ఆద్యంతమూ తిలకించాడు . ఎంతటి గొప్ప హేతు వాదుల దృఢ చిత్తాల నైనా సమ్మోహపరచగల మహా మాయా సమ్మైశ్వర్యం అది !

నా కోసం తపస్సు చేసుకొంటూ నీపు
నీ కోసం ప్రసాదాలు నేరిస్తూ నేను
మనిద్దరం తప్ప మరేముందీ లోకంలో?
విన్ను విడిచి యాత్రేమిటి నా మొగం?
ఈ క్షేత్రాలలో ఇంత మందీ వెదికే దెవర్నో తెలిసా?
నేను పదిలేసి పచ్చిన నిన్నే!
నీ నుంచి బైటి దేరి, నీ కోసం వెతుకుతూ
ఎంత కాలం సేవిస్తాం ఈ నీ ప్రతిమలను?
నా యాత్రకు ఆది పలెనే అంతమూ నీవే

— శివాలకటి

182. భీమసేన

గెలిస్తే మళ్ళీ ముఖ్యమంత్రి అవుతాడేమో ననే భయంతో 1962 ఎన్నికల లోనే సంజీవయ్యను ఓడించడానికి గట్టిగా ప్రయత్నించా రక్కడి పెద్దలు. అందుకు విభీషణులను, శల్యారను కూడ ప్రయోగించినా సంజీవయ్య విజయుడే అయినాడు. కాని 1967లో మాత్రం ప్రమాద దష్టుడై వుండటంవల్ల ఓడిపోక తప్పలేదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇరవై ఏళ్ళ తర్వాతకూడ హైందవ సంఘం ఇంతటి ఊబిలో కూరుకుపోయిఉంటే, ఇక ఉద్ధరించే వా డెవడు? బలం కలవాడిదే రాజ్యం కినుక ప్రతివాడూ బలం సంపాదించుకోవలసిందే అన్న నిర్ణయానికి వచ్చిన భీమన్న కొంతమంది దేశభక్తులైన హరిజన యువకుల కోరికమీద "భీమసేన" అనే సేవాసంస్థను నెలికొల్పాడు.

ఈ లోగా తెలుగు అకాడమీ ఏర్పాటుకోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది. అందులో భీమన్న ప్రధాన వ్యక్తి అయ్యే సూచనలు కని పించాయి. అగ్రాధికారులే చెప్పా రా విషయం భీమన్నకు. అయితే ఈయనకు తెలియకుండానే, ఈయన పేరు లేకుండానే తెలుగు అకాడమీ ఏర్పడిపోయింది. సెనేటు మీటింగు కోసం వా త్తేరు వెళ్ళిన భీమన్న అక్కడ చూశా డా వా ర్తను పత్రికలలో.

ఆ తర్వాత కొన్ని కొన్ని ప్రాంతాలలో ఆగుతూ, మిత్రులను కలుసు కొంటూ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో చాల దినాలపాటు పర్య టించి, మామాల దుస్థితికి కన్నీరు కార్చుకొంటూ హైదరాబాదు చేరుకొన్నాడు భీమన్న. ఆ వెంటనే కలంపట్టి, రాత్రీ పగలూ అని లేకుండా ఏకబిగిని "ధర్మంకోసం పోరాటం" వ్రాశాడు. మొదలుపెట్టిన పదిహేను రోజులలోనే రచన పూర్తి ఆయింది.

ఈ గ్రంధం బహుజన ప్రెస్సులో ముద్రణ జరుగుతుండగా భూపతి తిరుపతి, ఎమ్. వి. సూర్యనారాయణ, ఎస్. సిద్ధార్థకుమార్ మున్నగు మిత్రులు చూచి ముగ్ధులై దాన్ని తమ అంబేడ్కరు మెమోరియల్ సొసైటీపేర ప్రకటించమని కోరగా - అలానే చేశాడు భీమన్న. ఇది డాక్టర్ అంబేడ్కరుకు అంకిత మీయ బడింది. అంకితగేయం ఆ తర్వాత అంబేడ్కర్ సభలలో ప్రార్థన గేయ మయింది.

భీమసేనకు లాగే, ఈ గ్రంధానికి విపరీతమైన ప్రచారం వచ్చింది. 1968 ఏప్రిల్‌లో సంజీవయ్యగారి అధ్యక్షతన జరిగిన గ్రంధావిష్కరణ సభలో ప్రధాన వక్తగా మాట్లాడుతూ డాక్టర్ దివాకర్ల వెంకటావధానిగారు ఈ రచనపై అద్భుతమైన ప్రశంసలను కురిపించారు.

పుస్తకాన్ని తెరిచినప్పుడు ఇదేదో మాలమాదిగ గొడవలా గున్నదే అను కొన్నాననీ, చదివేకొలదీ అద్భుత మనిపించిందనీ, తానే హరిజనుడిగా పుట్టి వుంటే తప్పకుండా ఒక విప్లవకారుడిగా తయారై ఉండే వాణ్ణనీ అవధాని గారన్నప్పుడు మామా యువకులతో నిండివున్న సభ యావత్తూ హర్షధ్వాన పులకిత మయింది.

ఆ తర్వాత ఎప్పుడో నన్నపనేని వెంకటరావుగారి కార్యక ర్తృత్వం క్రింద తెనాలి కాలేజీ ఆవరణలో జరిగిన సాంఘిక సంక్షేమగోష్ఠి సందర్భంలో బహిరంగసభలో మాట్లాడుతూ-తాను ధర్మంకోసం పోరాటం గ్రంధాన్ని నాలుగు సార్లు చదివానని, ఆయిదోసారి చదువుతున్నానని, ప్రతిఒక్కరూ దీన్ని చదవాలని అంటూ సంజీవయ్య గారింకా ఇలా అన్నారు -

"ఇతడు హరి జనుడు కనుక నిత్యం హరి జనుల గురించే ఆలోచిస్తా డని ఇతరు లనుకొంటారేమో ననే భయం వుండేది నాకు పూర్వం. ఈ గ్రంథాన్ని చదివిన తర్వాత ఆ భయం పోయింది. నేను కాకపోతే ఈ దీనుల గురించి మరెవ రాలోచిస్తారు అనే దృక్పథం ఏర్పడింది."

పాలేరు తర్వాత మామా లలో ఇంతటి భావ విప్లవం సాధించిన గ్రంథం తెలుగులో మరొకటి లేదు.

"ఆర్థిక దారిద్ర్యం అన్ని కులాల వారినీ ఏడ్పిస్తుంది. సాంఘిక దారిద్ర్యం అంటే అస్పృశ్యత ఒక హరి జనులనే పీడిస్తుంది. ఈ పీడ తొలిగే వరకు హరిజనులకు ప్రత్యేక సదుపాయా లుండితీరవలసిందే" అంటూ ఆ గోష్ఠితో వాదించి, ఆ విధంగా తీర్మానింప జేశాడు భీమన్న. మోదుకూరి జాన్సన్‌తో పాటు, ఆ సెమినారులో పాల్గొన్న యువతీ యువకు లంతా భీమన్న మకాంలోనే వుండే వారా వారం రోజులూ. సాంఘిక సమస్యలతో పాటు, సంగీత సాహిత్యాలూ వెల్లి విరిసా యా చుట్టూ.

అదే సంవత్సరం సెప్టెంబరులో అనులాపురం నుంచి కుసుమ కృష్ణ మూర్తి గారు భీమన్నకు ఒక లేఖ వ్రాస్తూ ధర్మం కోసం పోరాటం జాతి కొక మేని ఫెస్టో అన్నారు. ఆ తర్వాత ఆయన పార్లమెంటు మెంబరు కూడ అయినారు.

ధర్మపురిలో, కేంద్రమంత్రి ఎమ్. ఆర్. కృష్ణ గారి అధ్యక్షతను జరి గిన అంబేడ్కరు సభలో, భీమన్న చేసిన ఉపన్యాసంపై ప్రచురించ బడ్డ వక్ర వార్త, రేగిన దుష్ట వివాదం - నాటి జ్యోతి వారపత్రిక చదివిన వా రందరికీ తెలిసిందే.

శాంతి కోసం యుద్ధం చెయ్యవలసిన దుస్థితి మానవుడిది.
శాంతి కోసం యుద్ధం తప్పదు
యుద్ధానికి భయపడే వాళ్ళకు శాంతి వుండదు.
మనకు న్యాయం జరగా లంటే
ఇతరుల న్యాయ బుద్ధి మీద కాక

మన స్వశక్తి మీదనే మనం ఆధార పడాలి.
త్యాగ శక్తి, ఆత్మ రక్షణ శక్తి, పరాక్రమ శక్తి
ఈ మూడు శక్తులూ కలిసిందే స్వశక్తి

— ధర్మ కోసం పోరాటం

183. డాక్టరు ఖాను చరిత్ర

1961 లోనే భీమన్న చేసిన మరో పని తన మిత్రుడైన డాక్టర్ ఎమ్. ఏ. ఖాను గారి జీవిత చరిత్రను వ్రాయడం.

తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో డాక్టర్ల కుటుంబంలో పుట్టిన మహబూబ్ ఆలీ ఖాను తానూ డాక్టరై ప్రజా సేవ చేస్తూ, జాతీయోద్యమంలో పాల్గొని, దేశ భక్తుడై ప్రఖ్యాతి గొన్న అచ్చమైన తెలుగు ముస్లిం. తెలుగు భాషలో ప్రవేశ మున్నవాడు. ఆంధ్ర రాష్ట్రం గురించి కలలు గని, తన కలలను ఒక గ్రంథంగా వ్రాసిన వాడు.

డాక్టర్ ఖాను భీమన్నకు పరిచయమయింది హైదరాబాదులోనే. అయినా తొలి చూపులోనే ఆత్మీయులై పోయా రిద్దరూ. కలిసి తిరగడం, తినడం. తాగడం, సాహిత్య చర్చలు జరపడం-అలా గడిచేవి వారి సాయం సమయాలు,

భీమన్నను డాక్టర్ ఖానులో ఆకర్షించిన ప్రధాన విషయం ఆయన తెలుగు తనం. ఆయన కిద్దరు భార్యలు, రెండిళ్ళు. అందులో ఒకటి సూర్య భవనం. ఒకటి చంద్ర భవనం. బిడ్డలకు కూడ మేఘ రంజనీ బేగం, మయూరీ బేగం వంటి పేర్లు పెట్టాడు. క్రైస్తవుల వలెనే ముస్లింలు కూడ భారత దేశంలో భారతీయులుగానే వుండాలనే వాస్తవ దృక్పథం కల ఆదర్శ జాతీయ ముస్లిం డాక్టరు ఖాను. అందుకే ఆయన జీవిత చరిత్రను వ్రాశా డీయన.

విషయ సేకరణ, చిత్తు ప్రతి రచన, ప్రెస్ కాపీ తయారీ-ఈ కార్యక్రమం ఆరు మాసాలు పట్టింది. అందుకు ఒక మంచి లేఖకుడు కూడ దొరికాడు. ఆయన వైద్యుల శ్రీనివాసరావు. డాక్టరు ఖానుకు మిత్రుడు. నటుడు కూడ. జీతం గురించి కంటె, సరదా కోసమే ఎక్కువగా పని చేశా డాయన.

స్వయంగా ప్రాసుకోవడమే కాని, చెప్పి ప్రాయించుకోవడం అలవాటు లేని భీమన్న ఈ రచన విషయంలో కొంత అవస్థ పడవలసి వచ్చింది. జీవిత చరిత్ర రచన కూడ ఈయనకు క్రొత్తే. అందుకే అదొక అపూర్వ రచనగా రూపొందింది. మంచి నవల అన్న పేరు గడించింది. ప్రజాదరణ పొందింది. డాక్టర్ ఖానుకు అమందానందం కూర్చింది. ఆ గ్రంథంపై వచ్చిన సమీక్ష లన్నిటినీ మరో గ్రంథంగా ప్రకటించుకొన్నాడు ఖాను.

ఆ రోజుల్లోనే ఒక బ్రహ్మాండమైన ప్రజా సంస్థకు వ్యవస్థాపకు లైనారు సంజీవయ్యగారు. అదే-హరిజన, గిరిజన, వెనుకబడ్డ తరగతుల, మైనారిటీల, బలహీన వర్గాల ఫెడరేషను. సర్దార్ నాగప్ప, నానాదాసు, గోకా రామస్వామి, సంగీతరావు మున్నగు ప్రముఖు లెందరో ఆ సంస్థలో వున్నారు.

"ఫెడరేషను తరపున ఒక పేపరు నడపా లనుకొంటున్నాం. మీకు పెన్షను తక్కువేగా. మేం నెలకు ఐదు వంద లిస్తాం. ఎడిటరుగా వుండండి. సహాయకు లుంటారు. పెద్దగా శ్రమ పడవలసిం దేమీ వుండదు. నేను ఎక్సుకు చెపుతాను. ఆఫీసుకు వెళ్ళండి" అన్నారు సంజీవయ్య గారొక రోజున భీమన్నతో.

"ఆలోచించి చెపుతాను" అన్నాడు భీమన్న. సంజీవయ్య గారి ముఖం గంభీరమై పోయింది! ఎంతో సంతోషంతో అంగీకరిస్తా డనుకొన్న భీమన్న నుంచి ఆ విధమైన జవాబు వస్తుం దనుకో లే దాయన. సరే అన్నారు ముభావంగా.

అంతటి తక్కువ పెన్షనుతో ఇంతటి మక్కువ మనిషి ఎలా బ్రతుకు తున్నా డనే ఆలోచన వచ్చిన వారు ముగ్గురు మాత్రం. అందులో మరొకరు గోపాల రెడ్డిగారు, మూడో వారు డాక్టరు ఖాను. ఖాను గారు ఆ మర్నాడు భీమన్న ఇంటికి వచ్చి, 'ఎక్స్ గారు వస్తా మన్నారు. వద్దు, మేమే వస్తాం' ఆని చెప్పి వచ్చాను. అయన గారు ఒక గొప్ప నవాబు. వాళ్ళు చూచేది ప్రతిభను కాదు, దర్జాను. మన పేద ఇండ్లకు వాళ్ళెందుకు? మనమే వెళదాం" అన్నారు. ఇద్దరూ కలిసి ఎక్సుగారి భవనానికి వెళ్ళారు.

అదొక ఖరీదైన ఆధునిక వినోద వస్తుసాధన సంపత్తితో అలంకృతమై వున్న మహాభవనం. ఫెడరేషను కార్యాలయం అందులోనే ఒక భాగంలో వుంది. కార్య కర్త లంతా వస్తూ పోతూ వున్నారు. సరాసరి ఎక్స్ గారి వద్దకు వెళ్లా రీ ఇద్దరూ. వారెంతో మర్యాద చేశారు వీరిని.

"ఈయన ఒక ప్రతిభా వంతుడు, ఉదారుడు, రచయిత అయిన తెలుగు ముస్లిం" అన్నాడు భీమన్న, మాటల సందర్భంలో, డాక్టరు ఖాను గురించి చెపుతూ.

"నో, నో! అలా అనడం సరికాదు. ముస్లింలలో తెలుగు ముస్లిం, హిందీ ముస్లిం అని వుండరు. లోకం లోని ముస్లిం లంతా ఒకటే జాతి" అన్నారు ఎక్స్ గారు.

"ముస్లిం అనేది మతాన్ని సూచించే పదం. హిందూ వంటిది. తెలుగు అనేది ఒక భాషా జాతి. ఒకే భాషా జాతికి చెందిన వాళ్ళలో ఎన్ని మతాల వాళ్లైనా ఉండవచ్చుకదా. మతం మార్చుకో గలిగినట్టిది. జాతి సహజ మైనట్టిది. మారనిది. ఈయన తెలుగు జాతి వాడు" అన్నాడు భీమన్న.

"మా ముస్లింల విషయంలో అలా కాదు" అన్నారు ఎక్స్‌గారు. ఈ సంభాషణంతా ఇంగ్లీషులోనే. భీమన్నకు ఉర్దూ రాదు, ఎక్స్ గారికి తెలుగు రాదు.

ఇంతకాలం తెలుగుతల్లి ఒడిలో పాలు తాగుతున్నా, ఆ తల్లిని తల్లిభాషలో పలకరించాలన్న విజ్ఞత లేని విజాతీయులింకా చాలమందే వున్నారు తెలుగునేలలో.

"మాకు మతం ప్రధానం. జాతి కాదు" అన్నారు ఎక్స్ గారు.

"మాకు జాతి ప్రధానం. మతం కాదు" అన్నాడు భీమన్న. "మా జాతి ఏ మతంవాళ్ళనైనా భరిస్తుంది, ఏ మతమూ లేనివాళ్ళను, నాస్తికులను కూడ ఆదరిస్తుంది. మా జాతికి మానవీయత హృదయం. భావస్వేచ్ఛ ఆత్మ" ఆన్నాడు కొంచెం గట్టిగా.

వెళ్ళినపనికి విరుద్ధమైన ధోరణిలో సంభాషణ పడటంచూసి , డాక్టరు ఖాను మధ్యలో కలగజేసుకొనడంవల్ల , మరోసారి కలుసుకుందా మని చెప్పి వచ్చే శా రిద్దరూ ఆక్కడినుంచి . సర్దార్ నాగప్ప మున్నగు కొందరుకూడ ఈ సంభాషణ సందర్భంలో కొంతసేపుండి , ఏమీ తోచక తప్పుకొన్నారు .

ఆ రకమైన జాతీయ వ్యతిరేక ధోరణిగల నాయకత్వంతో తాను సహకరించలే ననీ , అట్టి నాయకుల సాంగత్యం తమకు కూడా మంచిదికా దనీ సంజీవయ్య గారికి కబురు చేశాడు భీమన్న - నానాదాసుగారి ద్వారా .

భీమన్న వైఖరి సంజీవయ్యగారికి చాల కోపం తెప్పించింది . అయితే , అచిరకాలంలోనే ఆయనకూడ ఫెడరేషనుతో తెగతెంపులు చేసుకోక తప్పలేదు .

ప్రపంచ మానవు లంతా సిద్ధాంతరీత్యా ఒక్కటే . అయితే - అనేకమైన భూఖండాలలో ఈ మానవులు జాతులు జాతులుగా నివసిస్తున్నారు . ప్రతి జాతికీ ఒక విశిష్ట భౌతిక లక్షణం వుంది . లక్ష్యం వుంది . ఒక ఇంట్లో ఒక తల్లి బిడ్డలు నలుగురు నాలుగు మతాలను అవలంభించి వుండవచ్చు . నాలుగు జాతులకు సంబంధించి వుండడం సాధ్యంకాదు . జాతి అంటే భౌగోళిక రక్త జాతి కులమో, వర్గమో కాదు .

తన జాతి ప్రాబల్యంకోసం ఇతర జాతులను నాశనం చెయ్యాలనే గుణం ప్రతి జాతికీ వుంటుంది . అందుకోసమే యుద్ధాలూ, దురాక్రమణలూ . ఆత్మ రక్షణ అయినా చేసుకోలేని జాతి మనజాల దంటాడు భీమన్న . జాతిలోని వ్యక్తుల సమిష్టిబలమే జాతి బలం . ఇది లేకనే మన ఆర్షజాతి ఇంతకాలమూ బానిసగా పడివున్న దంటాడు . ఈ నాటికీ తగు జ్ఞానం రాలే దంటాడు . అన్నిటా తనతో ఏకీభవించినవాడు డాక్టర్ ఖాను .

కొందరు తమ కష్టానికి ప్రతి ఫలం కోరుతారు ,
పని చేసినంత తీవ్రంగానే ప్రతి ఫలం కోసం పోరాడతారు .
కొందరు ఉదాసీనంగా వుంటారు .
ప్రతి ఫలం లభిస్తే వద్దనరు కాని ,
తమంతట తాము చేయి చాచి అడగరు.

కొందరు ఏదైనా ఇస్తామన్నా పుచ్చుకోరు
చిరు నవ్వుతో నిరాకరిస్తారు.
ఆసలా ఏ పనీ చెయ్యకుండానే
అంతా తమకే కావాలనే వారు కూడ వుంటారు.
రాజకీయాలలో నే కాదు,
ఏ రంగంలో అయి
నా సరే, అధికార పదవుల కోసం
తాపత్రయ పడే వారంతా మొత్తం
మీద ఈ బాపతే.
ఇన్ని రకాల ప్రజలలో ఎవరు ఎటు వం
టి వారో గుర్తించి, వారి వారి ఆప
సరాలను గమనించి, అందరినీ
తృప్తి పరచవలసిన బాధ్యత నాయ
కత్వానికి వుండవలసి వుంది. డాక్టరు
భాను విషయంలో అటువంటి
దేమీ జరిగినట్టు లేదు.

— రాజకీయ వీరుడు డాక్టర్ భాను

184 . విచిత్ర సాంగత్యం

"చివరికి మంచి బెర్తే దొరికింది లెండి. ఇక బెంగ లేదు." వాల్తేరు ప్లాట్ ఫారం మీద ఆగిన హైదరాబాదు-హౌరా ఎక్స్‌ప్రెస్ యొక్క త్రీ టైర్ స్లీపర్ కిటికీ వెలుపల నుంచి!

"ఏదో మంచి వాళ్ళ కన్నీ అలానే కలి సొస్తై," కిటికీ లోపలి నుంచి!

కిటికీ లోపలి వ్యక్తి ప్రయాణీకుడు. రైలు ఆగగానే హడావుడిగా ఎక్కేసి, బెర్తు నంబరు చూచుకుని, ఆ కిటికీవద్ద కూర్చున్నాడు. కిటికి వెల పలి వాళ్ళు ఆయనను సాగనంపడానికి వచ్చిన వాళ్ళు, ఏవేవో కిటికీలో నుంచి అందిస్తూ, వీడ్కోలు చెపుతున్నారు.

"అయ్యా, మీరు మంచి వాళ్ళే కావచ్చు కాని, ఆ బెర్తు మాత్రం నాది" అన్నాడు భీమన్న.

"ఎవరి దైతే యేం లెండి, తర్వాత సర్దుకుందాం" అన్నాడా వ్యక్తి నిర్లక్ష్యంగా.

బండి కదిలింది. బెర్తు మీది సామాన్లను తీసి క్రింద పెట్టు కొన్నాడాయన. కిటికీ వద్ద హడావుడి వల్ల లేచిపోయి, అంతవరకు నిలబడి చూస్తూవున్న భీమన్న కూర్చున్నాడా బెర్తుమీద, రెండో ప్రక్క. అది కిటికీ వద్ద లోయరు బెర్తు. పగలు ఇద్దరు కూర్చోవచ్చు, రాత్రి ఒకరు నిద్ర పోవచ్చు దాని మీద

హైదరాబాదులో భీమన్నకు అలాటైంది ఈ క్రింది బెర్తే. అయితే—ఆ మీది బెర్తు అలాటైన ఒకామె క్రింది బెర్తును ఆక్రమించుకొని, అక్కడి నుంచి లేవనన్నది. కండక్టరు కూడ ఆమె నేమీ చెయ్యలేక పోయాడు. ఆమె ప్రయాణం వాల్తేరు వరకే. అక్కడ ఆమె దిగి పోగానే, ఇక తన బెర్తు తనకు దొరికిందనుకొంటున్న భీమన్నకు ఇదొక కొత్త పేచీ వచ్చి పడ్డది.

ఇంతకూ, ఆ రెండు బెర్తులలో మీది దైనా, క్రింది దైనా, పెద్ద తేడా ఏమీ వుండదు. మీదిదే ఎక్కువ అనుకూలం. కావలసి నప్పు డెక్కి పడుకోవచ్చు. అయితే, ఆ రోజుల్లో భీమన్న అతిసారం వల్ల బాధ పడుతూవున్నాడు. అది 1969 ప్రాంతం. కలకత్తాలో ఏర్పాటైన అఖిల భారత అనువాద మహా సభలకు సాహిత్య అకాడమీ ప్రతినిధిగా ఈయన బైలుదేరక తప్పలేదు. అందుకని లోయరు బెర్తు కావాలని కోరుకోవడం.

"వీటిని తెలుగులో తేగ లంటారు. రుచి చూస్తారా?" అన్నాడా వ్యక్తి ఒక తేగల కట్టను విప్పి, భీమన్నకు ఒక టందిస్తూ. భీమన్నను ఎవరో తెలుగే తరు దనుకొంటున్నా డన్న మాట ఆయన.

"ఈ పదార్థాన్ని ఎలా వండుతారు?" అడిగాడు భీమన్న – తేగను ఎగాదిగా చూస్తూ. సంభాషణ అంతా ఇంగ్లీషులోనే.

ఆ వ్యక్తి స్థూల కాయం చూచి నప్పుడే తన క్రింది బెర్తుకు నీళ్ళు వదులుకున్న భీమన్న – సరదా సంభాషణతో నైనా కాలక్షేపం చేద్దామనుకొన్నాడు. ఆ వ్యక్తి కూడ సరదా మనిషిలాగే కనిపించాడు. తేగ అంటే ఏమిటో భీమ

న్నకు అర్థమయే టట్టు చెప్పడానికి, రైలు దారికిరు ప్రక్కలా పరుగెత్తు తున్న తాటి చెట్లను గురించి, వాటి వంశ వృక్షాన్ని గురించీ వివరించ వలసి వచ్చిం దాయన.

"తేగ అంటే ఒక పిల్ల తాటి చెట్టన్న మాట!"

"కాదు, తాటి చెట్టు గుడ్డు!"

తనకు లాగే భీమన్న కూడ తేగల మధ్య పుట్టి, బుర్ర గుంజు తిని, కొబ్బరి నీళ్ళు తాగి పెరిగిన కోన సీమ వాడన్న సత్యం బైట పడేటప్పటికి ఆశ్చర్యానందాలతో ధగ ధగ లాడిం దాయన ముఖం. భీమన్న పేరు ఆంతకు ముందే ఆయనకు తెలుసు. ఆయన పేరు జంధ్యాల వెంకట రామనరసింహం, జె. వి. ఆర్. నరసింహం, అందరూ ప్రేమతో పిలిచే పేరు జె. వి. ఆర్. తూర్పు రైల్వే విభాగంలో ఒక పెద్ద అధికారిగా రిటైరయి, కలకత్తాకో స్థిరపడ్డ ఒక సుప్రసిద్ధ ప్రవాసాంధ్ర నాయకు డాయన!

తేగలే కాదు, రక రకాల తిను బండారాలున్నై జె. వి. ఆర్. వద్ద. కలకత్తా వెళ్ళె వరకు అయనకు భీమన్న అతిథి!

కలకత్తా సభలకు బైలుదేరిన మరో ముగ్గురు తెలుగు ప్రతినిధులు ఉస్మా నియా యూనివర్శిటీ నుంచి డాక్టర్ అడపా రామకృష్ణారావు, తెలుగు అకా డమీ నుంచి డాక్టర్ పి. యస్. ఆర్. అప్పారావు, డాక్టర్ కొత్తపల్లి వీర భద్రరావు గార్లు. ఈ ముగ్గురూ ఫస్టుకాస్లులో ప్రయాణం చేశారు. కలకత్తాలో దిగగనే వారికి జె. వి. ఆర్. ను పరిచయం చేశాడు భీమన్న.

ఈ ప్రతినిధుల్ని రిసీవు చేసుకోడానికి అక్కడ స్టేషనులో ఎవరూ కని పించ లేదు. బాడ్జీలు పెట్టుకొన్న వాళ్ళ కోసం ఆంతా వెతికారు. జె. వి. ఆర్ కూడ విళ్ళతోనే వున్నాడు చివరదాకా. ఆయనకు తెలిసిన ఎవరో కనిపిస్తే, అమన ద్వారా సభా కార్యకర్తలను పట్టుకొని, ఎలాగో హోటల్ కంటర్నేష నలీకు చేరారు. కలకత్తా ఈ నలుగురికీ కొత్తే. జె. వి. ఆర్. కనుక భీమన్నకు రైల్లో దొరక్కపోతే, ఈ ప్రతినిధుల అవస్థ మరోలా వుండేది.

సభల కార్యక్రమాలు మామూలే. అక్కడ భీమన్నకు జ్ఞాపకం వున్న దొక్కటే- ప్రశస్తమైన అంతర్జాతీయ భోజనం.

కలకత్తాలో వున్న వారం రోజూ భీమన్నకు పండుగలా గడిచింది. రామకృష్ణారావు, వీరభద్రరావు, అప్పారావు గార్లతో కలిసి మొత్తం కలకత్తా అంతా తిరిగాడు. వీరికి జె. వి. ఆర్. సహకారం పెన్నిధిలా లభించింది. తన గృహంలో ఒక రోజు ఆతిధ్యం ఇవ్వడమే కాక, కలకత్తాలోని ఆంధ్ర ప్రముఖుల పరిచయాలను, ఆతిధ్యాలను లభింపజేశా డాయన. అక్కడి ఆంధ్ర సంఘాల వారి సభలు, ఉత్సవాలు, ఉపన్యాసాలు ఎంతో ఆనందంగా గడిచింది కాలం.

ఒక ఉత్సవంలో పాల్గొంటూ, హరికథ చెప్పిన మహిళకు తన "ఆశోక వనిలో రాముడు" కావ్యప్రతిని, కొంత రొక్కాన్ని బహుకరించి, కథా కథన ప్రశంసా ప్రసంగం చేశాడు భీమన్న. అనుకోని ఆ సంఘటన అక్కడి ఆంధ్ర మహాజనుల కెంతో ఆనందం సమకూర్చింది.

మధురమైన అనుభవాలు లేకుండా
మహితమైన అనుభూతులు వుండవు:
క్యాంకులోని నిల్వల వంటివి అనుభవాలు
రాబడి పోయినపుడు వ్రతుక్కు ఆసరా అవే!

— శివాలంకరి

185. కలకత్తా దర్శనం

మాసిపోతున్న మహానగరం అని కలకత్తాను ఎంత కన్నారో స్వయంగా చూడ గలిగాడు భీమన్న.

ప్రాణులకు, కట్టడాలకు వలెనే నగరాలకు, మతాలకు, సంప్రదాయాలకు కూడ ఆయుఃపరిమితులుంటాయి. తన ఆయుస్సుకు మించి ఏదీ వ్రతకదు. కాల దోషం పట్టిన దాని స్థానే కొత్తని నిర్మాణ మవుతూ వుండాలి. కొత్త నిర్మాణాలు సహజంగా జరుగుతూనే వుంటాయి. కాని, మానవుడు పాత వాటిని కూడ సమ్మిళను చేసి దాచుకొంటూ వుండడం వల్ల, గత భారం పెరుగుతూ, త్వరితంగా ముందుకు సాగలేక పోతున్నాడు.

భీమన్నా , మిత్రులూ జె . వి . ఆర్ . గారింటికి భోజనానికి వెళ్లేటప్పటికి , ఆ ప్రక్క మైదానంలో మార్క్సిస్టుల బహిరంగ సభ జరుగుతూ వుంది . ఆ ఆల్లరీ , గోలా చూచి భీతావహులే అయినా ఠీ అతిథులు . కొంచెం దూరంలోనే బాంబులు పేల సాగినై . జనంలో ఎవరి దగ్గర ఏముందో తెలియదు . ఎక్కడెవరు గాయపడుతున్నారో , చస్తున్నారో తెలియదు . మరో రోజు రాత్రి మిత్రులు ఎన్ . వి . రామారావు గారింట భోజనం చేస్తుండగా , ముద్ద ముద్దకూ ఉలిక్కి పడవలసి వచ్చింది . ఇంటి నలు ప్రక్కలా సంధుల్లో , వీధుల్లో క్షణ క్షణమూ బాంబులో , తుపాకులో పేలుతూనే వున్నై , ఈ అరాజకం అక్కడి వారికి అలవాటై పోయిందట .

రామారావు గారు కారివ్వగా , దక్షిణేశ్వరం వెళ్ళారీ నలుగురూ . కలకత్తా పొలి మేరల్లో , గంగానది దక్షిణ తీరంలో , రాణీ రాసమణీ దేవి నిర్మించిన దేవీక్షేత్రం అది . రామకృష్ణ పరమ హంస పరమ హంస అయిందా దేవి సన్నిధి లోనే .

ముందుగా గంగాదేవిని సేవించి , రాసమణీదేవికి నమస్కరించి , దేవి ఆలయంలో ప్రవేశించిన మిత్రులు ఆ రోజంతా అక్కడే గడిపారు . అక్కడి నుంచి తిరిగి రావా లనిపించ లేదట భీమన్నకు . దేవి యొక్క ప్రాకృతిక తత్త్వం అంత సమగ్ర సుందరంగా వున్న దంటా డీయన .

కలకత్తాలో జె . వి . ఆర్ . మార్గ దర్శకత్వంలో దర్శించిన స్థలాలు చాలానే వున్నై . ఈయన మొట్ట మొదటి సారిగా హంసలను చూచిం దక్కడే . ప్లైనెటోరియం (గ్రహశాల) మరొకటి . తన ఖగోళ శాస్త్ర పరిజ్ఞానానికి పదును పెట్టుకొన్నా డక్కడ భీమన్న . అక్కడి నేషనలు లైబ్రరీని చూచి తీరవలసిందే అంటాడు .

"రైటర్సు బిల్డింగ్సు" అని పెద్ద పెద్ద అక్షరాలలో వ్రాసివున్న మహా భవనాలను చూచి - ఓహో బెంగాలీ రచయిత లెంత అదృష్టవంతులు అనుకొన్న భీమన్న , రైటర్లంటే గుమస్తాలనీ , అవి సచివాలయ భవనాలనీ తెలుసుకొని నిరుత్సాహ పడ్డా డెంతగానో !

ఆగ్ని మాపక దళం వారి పుణ్యమా అని, సగం సగం కాలి పొగ చూరిపోయి, దగ్ధావశేషాల వలె వున్నై అక్కడి బస్సులూ, ట్రాం బండ్లూ. ప్రతి రోజూ ఏదో ఒక ప్రక్క వాటిని తగల బెడుతూనే వున్నారు. అవి అలానే పరిగెడుతూ వున్నై. ఒకసారి ట్రాం ఎక్కాలను కొన్నాడు భీమన్న. "ముందు వీలునామా వ్రాసి, పోస్టులో వేసి, తర్వాత ఆ ప్రయత్నం చెయ్యండి" అన్నాడు జె. వి. ఆర్. కాలేజీ కుర్రవాళ్ళలో రౌడీ వర్గానికి తప్ప ఇతర్లకు సాధ్యం కాదు వాటిలో ఎక్కడం.

కలకత్తా నగర నాగరికతకు కేంద్రం అక్కడి కాళికాలయం. ఆ మహా తల్లిని ఒక్కసారి చూస్తే తెలుస్తుంది - మహా శివుడు శ్మశానాల వెంట ఎందుకు తిరుగుతాడో అంటాడు భీమన్న. అది పురాతనాలయం. జనం తండోప తండాలు. అంతటి జన సమ్మర్ధం గుండా దూరి వెళ్ళే పని అంతకు మెందెన్నడూ చెయ్యలేదు భీమన్న. ఆ సాయంత్రం చేసి సాధించాడు.

"నీకు నమ్మకం లేని ఒక పనికోసం అంత కష్ట మెందుకు పడాలి?" అని అడిగితే-"అది నా రక్తంలో జీర్ణించి పోయిన సంస్కృతి" అంటాడు - సంస్కృతి పోకుండా అభ్యుదయం రాదనే భీమన్న!

"నర బలుల నుంచి జంతు బలుల దాకా మారాం. నేను జంతు బలుల మధ్య పుట్టాను. కొబ్బరి కాయల దాకా వచ్చాను. ముందుకు పోవడానికి గతం తెలియాలి. నా తల్లి మాంసం తినే దైనా, నాకు పాలే ఇచ్చింది" అంటాడు.

నెత్తురోడే నాలుక సాచి వున్న దేవి పటం ఒకటి తెచ్చాడు భీమన్న అక్కడి నుంచి. దాన్ని ఏదో కవరులో మూసేసి వుంచాం. పాత కాగితాల ఫైళ్ళలో ఎక్కడో వుండే వుంటుం దది.

వెర్రి మొర్రి విశ్వాసాలతో, ఆచారాలతో
వికారంగా పెరిగిన విషకన్య ఈ సమాజం!
విషం విరగడానికి ఎంతకాలం పడుతుందో!
ఇప్పుడే ప్రారంభించు నీ చికిత్సను!

— టుమ్మీలా

186 . వదిలెయ్యండి

"వదిలెయ్యండిరా !" ఎవరో కేక వేశారా జనం మధ్య నుంచి , "పోనివ్వండి !"

ఆ కేకే ఒక మహా ప్రభంజన మైనట్టు-ఖంతకు ముందు నుంచీ భీమన్న రిక్షా చుట్టూ ఘెరావో చేసి వున్న శరన్మేఘం శకలాలై విడిపోయింది- జై తెలంగాణా నినాదాలతో .

అది ఖైరతాబాదు మార్కెట్టు ప్రాంతం . భీమన్న రిక్షా సాగిపోయింది- కళా భవనం వైపుగా .

1969లో ప్రత్యేక తెలంగాణా ఆందోళన మహోద్ధృతంగా సాగుతున్న రోజు లవి . ఆందోళన యువకులు చందా డబ్బాలు పుచ్చుకొని కనిపించిన వాడినెల్లా చుట్టు ముట్టి వేధిస్తున్న సందర్భాలు అసంఖ్యాకం . అందులో ఒక పూపు భీమన్న మీద కూడ పడిందా రోజున.

"నేను పైసా కూడ ఇవ్వను" అన్నాడు భీమన్న-చందా డబ్బాలతో తన రిక్షాను చుట్టుముట్టిన ఒక జుట్టు కుర్ర వాళ్ళతో .

'ఎలా ఇవ్వవో చూస్తాం' అన్నారు వాళ్ళు . తోచిందేదో ఇచ్చేసి పోయే వాళ్ళనే తప్ప , అంతవరకు ఇవ్వనన్న వాళ్ళ నెరగరు వాళ్ళు .

వాగ్వాదం ఏర్పడడంతో , అక్కడున్న గుంపంతా రిక్షా చుట్టూ చేరింది .

"మాడపాటి హనుమంతరావు గారు , అయ్యదేవర కాళేశ్వరావుర గారు వంటి తెలుగు పెద్దలు ఎంతో కష్టపడి సంపాదించిన విశాలాంధ్ర మిది . పొట్టి శ్రీరాములు గారి పూర్ణాహుతితో వచ్చిన భాషా రాష్ట్రమే రెండు ముక్కలు . మూడో ముక్కను కూడ ఎలాగో అతికి పూర్ణాకృతి చేకూర్చుకొన్నాం . ఇప్పుడు మళ్ళీ ఇది ముక్కలు కావడానికి నేను పూర్తిగా వ్యతిరేకిని . నా ఆదర్శాన్ని ముక్కలు చేసే పనికి నే నెలా సహకరిస్తాను? అనే ధోరణి భీమన్నది .

"అదంతా మాకు తెలీదు. చందా ఇచ్చి తీర వలసిందే" అన్నా రేక కంఠంతో.

"ఏదో పారెయ్యండి, పోదాం" అన్నాడు రిక్షావాలా బెదిరిపోతూ.

"ఇవ్వనంటే ఇవ్వను" అన్నాడు భీమన్న.

ఉద్రేకాలు మొలకెత్తినై. చినుకులు గాలి వానైనై. అసలు ఆ ఆందోళన మొల కెత్తిందీ, గాలి వానయిందీ ఇలానే - పెద్ద పెద్ద పదవుల్లోవున్న వారి చిన్న చిన్న బుద్ధుల వల్ల.

ఒక రూపాయి విసిరేసి పోతే పోయే సన్నివేశం ఎంత రభసలో పడింది. ఆదర్శాలు! పట్టు దలలు! చివరకు భీమన్నను రిక్షాలో నుంచి క్రింద కీడ్చి, జేబులో వున్న దంతా తీసేసుకునే ప్రమాదం ఏర్పడిన క్షణంలో, ఆ కేక వినిపించింది - వదిలెయ్యండిరా అన్న కేక!

ఎవరి దా కేక! ఎంతటి గొప్ప ఆజ్ఞ! ఎంత సునిశిత నాయకత్వం! ఎంత క్రమ శిక్షణ! ఎంతటి నిగ్రహం! పోరాటం జరుపుతున్న యువకులు ఆంతంత ఉద్రేకాలలో కూడా తెలుగు వా ళ్ళందరం ఒకటే నన్న స్పృహనూ, నిగ్రహాన్ని కోల్పోలే దంటే - నిజంగా వాళ్ళెంత ఉత్తములు!

భాగ్య నగర మహా నగరంలో భీమన్నకు తెలిసిన వాళ్లు కొద్ది మందే కావచ్చు కాని, భీమన్నను ఎరిగిన వాళ్ళు, ముఖ్యంగా యువకులు, విద్యార్థులు అత్యధిక సంఖ్యలో వుంటా రన్నది వాస్తవం. బహుశా అందుకే నేమో, ఆ తర్వాత ఈయన జోలి కెవరూ రాలేదు.

అంతకు ముందొక రోజున బహుశా 1969 జనవరిలో కావచ్చు, డాక్టర్ త్రిపురనేని వెంకటేశ్వరరావు గారి ఆహ్వానంపై గుడివాడ వెళ్ళి, అక్కడొక సాహిత్య సమారోహంలో పాల్గొని, హైదరాబాదుకు తిరిగి వస్తున్నాడు భీమన్న. ఈయనతో డాక్టర్ సుప్రసన్న కూడ వున్నాడు. ఆయన ప్రయాణం ఖమ్మం వరకే.

రైలు మధిర స్టేషను దాటిన కొద్ది నిమిషాలకే బండి ఆగింది. వెనక్కి రెండు పెట్టెల ఆవతల ఏదో గొడవ జరిగింది. మళ్ళీ కదిలింది. మరో కొద్ది నిమిషాలకే అక్కడ ఒక పెట్టెలో నుంచి భగ్గు భగ్గున మంటలు చెలరేగాయి! ఇక ఈ రైల్లో పుట్టిన గగ్గోలును ఎలా వర్ణించడం!

భీమన్న వున్న పెట్టెకు, నిప్పంటు కొన్న పెట్టెకు మధ్య ఒక పెట్టె వుంది. మంటలు ఆ పెట్టెకు వ్యాపిస్తున్నాయి. నిప్పు రవ్వల పొగతో వాతావరణం నిండి పోయింది. బండి ఆగసాగింది. అది ఇంకా ఆగకుండానే బైటికి దుమికేస్తున్నారు ప్రయాణీకులు. బండి ఆగే టప్పటికే పెట్టెలన్నీ ఖాళీ అయి పోయాయి. అలా దూకేసిన వాళ్ళలో భీమన్న, సుప్రసన్న కూడ వున్నారు.

ఆ ప్రాంతమంతా తుప్పలు, గొప్పలు, రాళ్ళు, ముళ్ళు. ముందు హోల్డాలును విసిరేసి, తర్వాత దూకాడు భీమన్న. దూకడంలో చెప్పులు జారి పోయాయి. హోల్డాలు దొరికింది గాని, చెప్పులు దొరకలేదు. ఆ లోగా, పెట్టె కమ్మిని ఒక చేత్తో పట్టుకొని, రెండో చేత్తో ఒక బిడ్డను పట్టుకొని వేలాడుతున్న ఒక ప్రయాణీకుణ్ని చూచి పరుగెత్తుకు వెళ్ళి బిడ్డను అందుకొన్నాడు భీమన్న. ఆ ప్రయాణీకుడు హిందీ ప్రచార సభ కార్యాలయోద్యోగి నరసింహారావు గారు. పూర్తి పేరు జ్ఞాపకం లే దీయనకు. ఆ బిడ్డ ఎవరో తెలియదు. వాళ్ళు ముందే దూకేశారు. తర్వాత ఏడుస్తూ, వెతుక్కొంటూ వచ్చి బిడ్డను తీసుకు వెళ్ళారు.

మంటలు తక్కిన పెట్టెలకు వ్యాపించకుండా దాన్ని వేరు చేశారు. అది ఫస్టు కాసు పెట్టె. దానిలోని ప్రయాణీకులను ముందుగానే ఖాళీ చేయించారట దానికి నిప్పు పెట్టిన యువకులు. వాళ్ళు నిజంగా అభినందనీయులు. ఎందుకంటే – ఆందోళనలలో కొంత బీభత్సకాండ తప్పదు. ప్రాణ నష్టం జరగకుండా ముందే జాగ్రత్త పడడంలో మానవత వుంది. అది తెలంగాణా, ఆంధ్రా ఆందోళనల రెండింటా అద్వితీయంగా ప్రదర్శిత మయింది. అక్కడక్కడ కొన్ని క్రూర సంఘటనలు జరిగా యంటే – అందుకు ఒక కారణం వ్యక్తిగత కక్షలు, రెండో కారణం తెలుగేతర ధనికుల కుట్రలు.

కాలిపోయిన బోగీని ఖమ్మంలో వదిలేసి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, ఆ మర్నాడు ఎప్పటికో చేరిందా రైలు హైదరాబాదుకు - చెప్పులు లేకుండానే.

కృష్ణాంతో విశ్వమార్యం అన్నవేద జాతికి
వారసత్వం నా దంటున్న నీవు
ఆర్యత్వాన్నే నెట్టి పారవేస్తున్నా వెందుకు?
విశ్వాన్నే ఆర్జించవలసిన నీ పెత్తనం
ఉన్నది కాస్తా తగలేస్తున్నదేం కర్మ?
చివరకు నీ మడిలో నీవైనా మిగిలేవా?

— గుడిసెలు

187. తెలుగు రాజధాని

తెలుగు ప్రాంతాలు మూడూ కలిసి ఒక సమగ్రమైన ఆంధ్రప్రదేశంగా ఏర్పడి ఇన్ని సంవత్సరాలు గడిచినా, రాజధాని నగరానికి తెలుగు పేరు పెట్టుకొందా మనే వివేకం ఎవరికీ కలగక పోవడం పట్ల విచారపడుతూ వుంటాడు సత్యమూ భీమన్న.

ఈ నగరానికి హైదరాబాదు అనే పేరు ఎలా వచ్చింది? మొదట భాగమ్మ పేర వెలసిన భాగ్యనగరం - ఆమె హైదరీ బీగం అయిన తర్వాత హైదరాబాదు అయింది. తెలుగు పేరే, అప్పటి అధికార భాష ఉర్దూ కనుక ఉర్దూ పేరు అయింది. మరి, ఇప్పటి అధికార భాష తెలుగు కదా! అది ముళ్ళి తెలుగు పేరు ఎందు క్కాలేదు? ఉర్దూ ప్రజల కున్న శక్తి, రాజసం, భాషాభిమానం, సంస్కారం తెలుగు ప్రజలకు లేనందు వల్లనే అనాలా?

పైగా - పాకిస్తాన్‌లో ఒక హైదరాబాదు వుంది. ఇక్కడ మనకు, ఎంతో ప్రాచీన సాంస్కృతిక జాతి వాళ్ళమైన మనకు, అదే పేరు ఎందుకు కొనసాగాలి?

"కేవల రాజకీయ స్వప్రయోజనాల గురించి తప్ప, మరో ఉన్నతాదర్శాలను గురించి ఆలోచించే వాళ్ళు అధికారంలో లేక" అంటాడు భీమన్న.

రాజధాని నగరం పేరులోనే కాక, నగరంలో ఎక్కడా కూడ తెలుగు తనం కనిపించలేదు భీమన్నకు. ఈ విషయంలో తన ఆవేదనను ప్రకటిస్తూ ఎన్నో కవితలు వ్రాశాడు. ప్రసంగాలు చేశాడు. అధికార బధిరాంధక యంత్రాంగం చైతన్య వంతం కావడం లేదని దుఃఖ పడ్డాడు. దానితో, ఉత్సాహ వంతులైన యువకులంతా కలిసి 1968 ప్రాంతంలో "తెలుగు రక్షణ సమితి"ని నెలకొల్పడానికి మూల కారణమైనాడు. ఆ సమితికి మాడపాటి హనుమంత రావు గారు ప్రారంభకులు కాగా, పార్లమెంటు సభ్యుడు రామగోపాల రెడ్డి గారు అధ్యక్షులు.

మాడపాటి వారు అనారోగ్యంతో లేవలేని స్థితిలో వుండగా, వారి ప్రారంభోపన్యాసాన్ని భీమన్నే రూపొందించగా, దానిని కొందరు కార్యకర్తలు హనుమంతరావు గారి వద్దకు తీసుకు వెళ్ళి చదివి వినిపించగా, వారు కొద్దిపాటి చేర్పులు చేసి ఇచ్చారు. అందులో భీమన్నను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ వారు చేర్చిన వాక్యాలు ఈయన పట్ల వారి వాత్సల్యానికి నిదర్శనలు.

తెలుగు రక్షణ సమితి సమావేశాలలో తీర్మానాలను, కార్యక్రమాన్ని రూపొందించి, వాటిని సభలో ఆమోదింప చెయ్యడంలో భీమన్నది ప్రథమ స్థానం. ఈయనది ముందుకు చొచ్చుక పోయే స్వభావం కాక పోయినా, ఈయన ఎక్కడ వుంటే అక్కడ ఈయన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. నిశ్చితంగా పనిచేస్తుంది.

అప్పుడు ఆమోదించ బడిన తీర్మానాలలో ముఖ్యమైనది - ఆ వచ్చే ఉగాది నాటికి హైదరాబాదును అచ్చమైన తెలుగు భాగ్యనగరంగా మార్చి వెయ్యాలన్నది. కార్యక్రమాలలో ముఖ్యమైనది - నగరంలోని కార్యాలయాల, షాపుల, సంస్థల నామ ఫలకాలన్నీ తెలుగు లోనే వుండేటట్టు చర్యగైకొనాలన్నది.

ఈ తెలుగు రక్షణ ఉద్యమానికి రాజకీయమైన, అధికారికమైన సహకారమేదీ లభించలేదన్న సత్యం సర్వజన విదితం. అనేక మంది నగర ప్రముఖులు, కౌన్సిలర్లు, డాక్టర్లు, యువజనం, యూనివర్సిటీ మేధావులు దానివెనక వున్నారు.

భీమన్న అంటాడు - ఆ తర్వాత అతి త్వరలో చెలరేగిన ప్రత్యేక తెలంగాణా ఆందోళనకు మూలకారణం ఈ తెలుగు రక్షణ సమితే కావచ్చు అని!

అంత వరకు తమ ప్రాభవానికి లోబడి బ్రతుకు తున్న తెలుగు వాళ్ళు ఒక్క రాజకీయ రంగంలోనే కాక క్రమంగా ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో కూడ ప్రాబల్యం పొందుతున్నా రన్న ద్వేషం, భయం తెలుగేతరులకు వుంది. ఇప్పుడు హైదరాబాదును తెలుగు నగరంగా మార్చెయ్యి డానికి బలమైన తెలుగు మేధావి వర్గం పూనుకొన్న దనే సరికి-ఆ తెలుగే తర నాయకులకు చెమట్లు పట్టి, ప్రత్యేక తెలంగాణా ఆందోళనను రేపా రంటాడు భీమన్న.

"నీ వొకందుకు పోస్తున్నావు, నే నొకందుకు తాగుతున్నాను" అనే సామెతను తెలంగాణా తెలుగు నాయకులు, యువకులు ఆచరణలో పెట్టారు. వాళ్ళ పెట్టుబడులు అయిపోయాయి. వీళ్ళ అలజడులు ఆగిపోయాయి.

ఆ ఆందోళన సమయంలో గోడలపై వెలసిన అనేక రకాల అశ్లీల సాహిత్యాన్ని తుడిచి వెయ్యడానికి మరో ఉద్యమం కొనసాగింది. దానికి ప్రేరక శక్తి భీమన్నే. నిచ్చెనలు, సున్నపు డబ్బాలు, కుంచెలు పట్టుకొని, ఎండనక వాననక-వీధుల వెంట తిరిగి గోడల్ని శుభ్రపరిచారు. ఈ విధమైన ఎన్ని కార్యక్రమాలలో పని చేసినా, తన ఖర్చు తానే పెట్టుకుంటాడు భీమన్న. అధికార స్థానీయుల నుంచి, స్థానిక దాతల నుంచి నిధులు వసూలు చేయడం, ఖర్చు పెట్టడం వంటి పనుల జోలికి తాను పోడు.

"పరద్రవ్యాణి లోష్ఠవత్" అనే నీతికి భీమన్న ప్రత్యక్ష రూపం. పరధనాన్ని తాను తినడు. అంతే. తినే వాళ్ళకు మాత్రం అడ్డు వెళ్ళడు. ఈయనలో ఇదొక విశిష్టత. నేటి సమాజంలో నాయకత్వం కావాలంటే ఈ పద్ధతి పనికి రాదు. తాను బాగా తినగలగాలి. ఇతర్లను కొద్ది కొద్దిగా, అదైనా తన ద్వారా తిన నివ్వాలి. అలాంటి వాడికే నాయకత్వం సిద్ధిస్తుంది, నిలుస్తుంది. ఈ గుణం లేకపోవడంవల్లనే భీమన్న నాయకుడు కాలేక పోయాడు.

తెలుగు రక్షణ సమితి ఫలితంగానే "తెలుగు దేశం" అనే పత్రికకు భీమన్న సంపాదకు డైనాడు. ఆసలు ఈ పత్రిక సూర్యదేవర రాజ్యలక్ష్మిగారిది. ఆమెనుంచి తిరువీధి రమణయ్యగారు తీసుకున్నారు. ఈ పత్రికకు భీమన్న సంపాదకత్వం రెండు మూడు సంచికల వరకే కొనసాగింది.

తెలుగు తల్లి పాలు తాగుతూ
తెలుగు నేల అన్నం తింటూ
తెలుగంటే అసహ్యించుకొనే వాళ్ళతో
రాజీ లేదు నాకు:
అవమానం సహించడం సహనం కాదు
బానిసగా పడి వుండడం సామరస్యం కాదు
సమానుల మధ్య స్నేహమే కాంతి
ఆత్మ గౌరవంతో పురోగమించడమే జీవితం

— ఉర్మిళ

188. పిల్లల మర్రి

యువ కవులలో అగ్రశ్రేణిలో వున్న బాపురెడ్డి - పరిపాలన విద్యావ్యాసంగాల కోసం 1967-68 లో ఐరోపా దేశాలలో వుండి వచ్చాడు. అప్పు డాయన ఎన్నో గేయాలను వ్రాసి ఇక్కడ భీమన్నకు పంపుతూ వుండేవాడు. ఐరోపా రాగ సౌందర్యమూ, భావ సౌందర్యమూ ఆ గేయాలలో తొణికిస లాడుతూ వుండేది. ఆ గేయాలనూ, అంతకు ముం దాయన వ్రాసిన వాటినీ కలిపి "బాపురెడ్డి గేయాలు" అనే పేరుతో ఒక సంపుటిగా ప్రకటించి, దానిని భీమన్నకు అంకిత మిచ్చాడు బాపురెడ్డి.

అంకిత సభ 10-9-68 న, సారస్వత పరిషత్తు హాలులో జరిగింది. రామానుజరావు గారు అధ్యక్షత వహించారు. డాక్టర్ దివాకర్ల, డాక్టర్ సినారె, డాక్టర్ యన్ యాదగిరిరెడ్డి, గిర్‌గ్లానీ, కొండపల్లి వాసుదేవరావు (ఐ. ఏ. ఎస్.) మున్నగు ప్రముఖులు ఆ సభలో మాట్లాడారు. వారంతా ఈ ఉభయులకూ అత్యంత సన్నిహితులూ, శ్రేయోభిలాషులూ కనుక, ఇద్దరినీ ప్రశంసా పారిజాతాలతో ముంచె త్తేశారు. కార్యక్రమాన్నంతా గిర్‌గ్లానీ గారు టేప్‌రికార్డు చేశారు కాని, ఆ తర్వాత దాన్ని ప్లే చేస్తే పలక లేదు!

ఆ తర్వాత – బాపురెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ పి. ఏ. గా వున్న కాలంలో, భీమన్న ఆ ప్రాంత మంతా దర్శించ గలిగాడు. ఎన్నో కవి సమ్మేళనలు, సాహితీ సభలు, సారస్వత సమారోహాలు – ఏదీ భీమన్న లేకుండా జరగ లేదా కాలంలో. ఇక్కడ నుంచి కారో, వేనో కవులతో

మధ్యాహ్నం బయలు దేరి, సాయంత్రానికి మహబూబ్‌నగర్ చేరేది. అక్కడ సభ, రాత్రి భోజనం ముగించుకొని, బయలుదేరి ఇక్కడకు తెల్లవారు జాముకు చేరేది. ఆ విధంగా అక్కడున్నంత కాలం బాపురెడ్డి ఆ జిల్లాకు కవితా పరిమళాలతో నింపేశాడు.

అట్టి ఒక సాహితీ యాత్ర సందర్భంలో పిల్లల మర్రిని దర్శించాడు భీమన్న. ఐహికా దేశంలో వున్న పెద్ద పెద్ద మర్రి చెట్లన్నిటికీ, అదయారు మర్రికి కూడ, ఈ పిల్లల మర్రే తల్లి కావచ్చు. ఇంతటి దీర్ఘ వయస్కా, విస్తృతి కల మర్రి మరెక్కడా లేదు. దాని ఊడలను వ్రేలాడి, కొమ్మలపై ఊగీ నీడలో ఆడీ – తన చిన్నప్పటి క్రీడలకు పదును పెట్టుకున్నాడు భీమన్న.

మరొక యాత్ర సందర్భంగా, 1960లో, గద్వాలలో ప్రత్యేక సన్మానం జరిగింది భీమన్నకు. పాగా పుల్లారెడ్డి గారి అతిధ్యం, సన్మానం, కావ్యగానం, ఆ రాత్రి పున్నమి వెన్నెలలో సంగం వద్ద కృష్ణానది సందర్శనం, అక్కడి విహారం – ఇవన్నీ భీమన్న హృదయంలో గుబాళిస్తూనే వుంటై. అప్పుడు ఈయనతో పాటు బాపురెడ్డే కాక ముకురాల రామారెడ్డిగారు కూడ వున్నారు.

ఇంకొక యాత్రలో జడ్చర్లకు వెళ్ళాడు భీమన్న. అక్కడ కిరణ్ కుమార్ ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి సభకు అధ్యక్షత వహించాడు. అక్కడే సుప్రసిద్ధ కవి రఘుమారెడ్డి పరిచయం తొలిసారిగా కలిగిందీయనకు. తెలంగాణా యాసలో రఘుమారెడ్డి ప్రసంగం ఎంతో ముగ్ధుణ్ణి చేసిందీయనను.

ఆ మర్నాడు వనపర్తి బస్సులో ఎక్కి, సిటికి వస్తూ – తెలంగాణా ఆందోళన మంచిదేననీ, ప్రత్యేక తెలంగాణా ఏర్పడితే తప్ప ఉర్దూ హైదరాబాదు తెలుగు భాగ్యనగరంగా మారేటట్టు లేదనీ, హైదరాబాదు తెలుగేతర దాస్యం నుంచి విముక్తి పొందిన తర్వాత మళ్ళీ త్వరలోనే అఖిలాంధ్ర ఏర్పడ గలదనీ, అప్పుడు తెలుగు జాతి ఉజ్వల పురోగతిని అడ్డే శక్తి లోకంలోనే ఉండదనీ ఉపన్యాసం దంచి – భీమన్న ఆ బస్సులోని వారి నందర్నీ చకితుల్ని చేశాడు. ఆనాటి ఆందోళన విషయంలో భీమన్న అవగాహనం అట్టిది!

"మన మంతా తెలుగు వాళ్ళమే . తెలుగు వాళ్ళకు రెండు రాష్ట్రా లుండ డంలో ప్రమాదం ఏమీ లేదు . ఈ తెలుగు నేలలో మనం ఏ వూళ్ళో వుంటే ఆదే మన వూరు . ఎక్కడి కక్కడ స్థానికులతో కలిసి పోయి , వాళ్ళ కష్ట సుఖాలలో పాలు పంచుకోవడం మనం నేర్చుకోవాలి ." అంటూ బోధించాడు భీమన్న తెలంగాణా ప్రాంతంలోని కోస్తా వాళ్ళకు . ఈ బోధను ఆక్షరాలా తాను స్వయంగా అమలు జరిపిన వాడు భీమన్న . తెలుగు నేలలో ప్రతి అణువూ తన సొంతమే అంటాడు-అది అరకు లోయ కానీ , అనంతపురం కానీ , ఆదిలా బాదు కానీ .

ఆ తర్వాత ప్రత్యేక ఆంధ్రాందోళన జరుగుతున్న కాలంలో , అప్పటి కేంద్ర హోం శాఖామంత్రి బ్రహ్మానంద రెడ్డి గారిని ఢిల్లీలో కలుసుకొని భీమన్న కోరిన కోరిక అద్భుతమైనట్టిది .

"ఆంధ్రప్రదేశ్ లో ఇరవై జిల్లాలలోను , ప్రతి అంగుళం మేరా ప్రతి తెలుగు వాడికీ చెందినట్టిది . ఎవరో పదిమంది స్వప్రయోజనం కోసం రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చెయ్యడం మొత్తం జాతికి ద్రోహం చెయ్యడమే అవుతుంది . ఇప్పుడు తెలుగు జాతి భవిష్యత్తు మీ చేతిలో వుంది . దాని ఐక్యతను కాపాడండి . ఉద్రేకాలు ఉట్టిగట్టుకొని వుండవు . క్షణికావేశాలు శాశ్వతాపకారులు కాగూడదు . ఇదే నా ప్రార్థన" అన్నాడు .

" నా ఉద్దేశమూ అదే . అందుకే నేను కృషి చేస్తున్నాను " అన్నారు బ్రహ్మానంద రెడ్డిగారు .

"ఆంధ్రప్రదేశం పిల్లలమర్రి . దాని స్థైర్యాని కెట్టి చలనమూ లేదు" అన్నాడు భీమన్న .

దొంగలు ఊళ్లు పంచుకొన్నట్టు
నాయకులు ప్రజాధనం పంచుకోవచ్చు ;
అంత మాత్రం చేత ఏమవుతుందిలే !
గొర్రె చస్తుంది కాని , గరికె చస్తుందా ?

— టూ మీలు

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

రసాద్వైత సర్గ

189. మహా కవి, కళా ప్రపూర్ణ

తన చిన్నప్పటి నుంచీ కూడ భీమన్నకు ఎన్నో సందర్భాలలో ఎందరో మిత్రులు, పెద్దలు, సంఘాలు ఎన్నో బిరుదులు ఇచ్చుకొంటూ వచ్చారు. వేటినీ ఈయన ఉపయోగించుకోలేదు, జ్ఞాపకం కూడా పెట్టుకోలేదు. బిరుద నామాలను పేరుకు తగిలించు కోవడం గిట్టదీయనకు.

ఆ స్థితిలో 1969 లో కాకినాడలో, సాహితీ సమాజ్య ఆధ్వర్యంలో మహా వైభవంగా జరిగిన ఒక పెద్ద మహాసభలో, ఈయనకు మహాకవి బిరుదం ఇవ్వబడింది.

"ఈ కాలంలో మహా కవులు, కవి సార్వభౌములు, సమ్రాట్టులు, చక్రవర్తులు వగైరాలు తప్ప కవులు లేరు" అంటూ హేళన చేస్తుండే భీమన్న ఆనాటి నుంచి ఈ మహాకవి బిరుదం వాడుకోక తప్పలేదు. కులాన్నే తప్ప మెరిట్‌ను గుర్తించని ఈ సమాజంలో, బోయి భీమన్న ఫలానా అని చెప్ప డానికైనా ఈ బిరుదును వాడుకోక తప్ప దన్నారు మిత్రు లంతా.

డిసెంబరు 19 వ తేదీన మహాకవి బిరుదం స్వీకరించి, జ్ఞానానంద కవి గారి ఆతిధ్యం అనుభవించి, అనేక సభలలో పాల్గొంటూ పోయి, 29 వ తేదీన అమలాపురంలో జరిగిన అంబేడ్కర్ వర్ధంతికి అధ్యక్షత వహించాడు

భీమన్న . రిపబ్లికన్ పార్టీ నాయకుడూ , శాసన సభ్యుడూ , మహావక్తా ఆయిన శ్రీ బి . వి . రమణయ్య గారికి అతిథిగా వుండి , అప్పట్లో అక్కడి మామా విద్యార్థులకు , తదితర కుల విద్యార్థులకూ మధ్య ఏర్పడి వున్న తగాదాను పరిష్కరించడంలో తోడ్పడ్డాడు . శాసన సభ్యులు పళ్ళ వెంకటరావు గారు కూడా ఈ విషయంలో ఎంతో సహకరించారు .

సాధారణంగా ఇట్టి తగాదాలు రెండు కారణాలుగా ఏర్పడుతూ వుండేవి . ఒకటి – ఏ మామా విద్యార్థినినో ఏ ఇతర కుల విద్యార్థో , రోడ్డు రౌడీయో వేధించడం . రెండు – ఏ మామా విద్యార్థో విద్యార్థి సంఘ అధికార పదవికి పోటీ చెయ్యడం .

ఈ రెండు కారణాలకు కూడ మూల కారణం అంటరాని తనమే . మామాలు తమకంటె తక్కువ వాళ్ళనే సాంప్రదాయక మూఢభావం నుంచి తదితర కుల విద్యార్థులు విముక్తులు కాకపోవడమే .

తర తరాల అజ్ఞానం నుంచి ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న మామా యువకులు ఇతరులలోని ఆట్టి మూఢ భావాన్ని , దాని ఫలితాలైన అక్రమ చర్యలనూ సహించే స్థితిలో లేరు . పర్యవసానం ఘర్షణ . ఆయితే , ఈ దుస్థితి ఇప్పుడిప్పుడు క్రమంగా సడలిపోతున్నది . విజ్ఞాన భాస్కరుని ఉదయ కిరణాలు ఉభయ వర్గాల మీదకు సమానంగానే ప్రసరిస్తున్నవి .

"బాపురెడ్డి పద్య కావ్యాలు" గ్రంధం మిత్రులు కృష్ణమాచార్యులు గారికి ఆంకితం ఇవ్వబడింది . ఆయన పోలీసు శాఖలో ఒక ఉన్నతాధికారి . సహృదయుడు . సాహితీ పరుడు . ఆంకితం సభ 1970 ఆక్టోబరు 9న సాయంత్రం విశాఖపట్నం అప్సర హోటల్లో అప్పటి ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలరు ఎల్ . బుల్లయ్య గారి అధ్యక్షతన జరిగింది . బుల్లయ్య గారు మామా విద్వాంసులలోను ప్రతిభావంతులలోనూ అగ్రగణ్యులు . ఆ సభలో భీమన్న పాల్గొన్నాడు డాక్టర్ యాదగిరిరెడ్డి , డాక్టర్ నారాయణ కరణ్ రెడ్డి , బాపురెడ్డి గార్లతో హైదరాబాదునుంచి వాల్తేరుకు చేసిన ప్రయాణం ఎంత రంజుగా సాగిందో భీమన్న ఇప్పటికి వర్ణించి చెపుతుంటాడు .

వాల్తేరులో వీళ్ళ మకాం సర్క్యూట్ హౌస్‌లో. అక్కడ జరిగిన పార్టీలు, విందులు, వేడుకలు అమర వాసులకే అసూయాజనకా లట. అక్కడ ఒక ఉదయం సముద్రాన్ని చూస్తూ భీమన్న వ్రాసిన పాటే "ఎవరే పిల్తురు నన్ను" ఆనేది. అది ఆ తర్వాత గాయకుడు మోహనరాజు గారు పాడగా, ఆకాశవాణిలో "ఈ మాసపు పాట" అయింది.

ఆప్పటికి కాకినాడ జిల్లా కలెక్టరుగా వున్న లింగం మాలకొండయ్య గారితో నిజమైన పరిచయం భీమన్నకు ఆ రోజున అక్కడే కలిగింది. రాగ వైశాఖి గ్రంధాన్ని ఆయన చేతికి అక్కడే ఇచ్చాడు బాపు రెడ్డి. ఆ పరిచయం అత్యంత సన్నిహితమైన స్నేహంగా పరిణతి చెందిం దా తర్వాత.

1970 లోనే "రాఖీలు" ఆచ్చవుతున్న రోజులలో, భీమన్న లలితా ప్రెస్‌లో మూర్చని ప్రూఫులు దిద్దుకొంటూ వుండగా, ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలరు బుల్లయ్య గారి నుంచి ఒక లేఖ అందింది. భీమన్నకు "కళా ప్రపూర్ణ" గౌరవ డాక్టరేటును ఇస్తున్నట్టు తెలిపే లేఖ అది!

ఆ లేఖను చదువుకొని, ఆనందంతో మైమరచి పోయి, అక్కడి నుంచి సరాసరి "స్టారు"కు పోయి కూర్చుని, రెండు పాటలు వ్రాశా డియన. "శారదా, ఎందు కమ్మ నా కింతటి ఎత్తైన పీఠం ....."", "కళా ప్రపూర్ణుడవు నీవె కదరా ....." అంటూ, శారదా శివులకు ఆత్మార్పణ చేసుకొంటూ వ్రాసిన పాట లవి. రాఖీలలో చేరినై.

భీమన్నది శివ సరస్వతీ తత్త్వం. అదే రసాద్వైతం.

1971 జనవరి 17న జరిగిన కాన్వొకేషనులో "కళా ప్రపూర్ణ"ను అందు కొన్నాడు భీమన్న.

శారదా!
సకల కళా విహారదా!
ఎందు కమ్మ నా కింతటి ఎత్తైన పీఠం
ఆత్మకొన చోటిస్తివి, అంతె చాలదా నాకు;

కళా ప్రపూర్ణత్వం నీ కల్యాణీ రాగమే
స్వరమే తెలియనినేను ఈ శ్వర కోకిలా రాజు నటే:
సరే లెమ్మ, వాణీ: నీ సరదాయే కానీ!
నాలోనే ఉండి, వన్ను నడుపుకొనుట మరువకుమీ!

— రాధిలి

ఆ తర్వాత ఈ పాటను ఆకాశవాణిలో మా తమ్ముడు కె. వి. రమణ మూర్తి పాడాడు - మృదు మధురమైన శ్రావ్య స్వరంతో.

190. తిరుగుబాటు కవి

"కళాప్రపూర్ణ" గౌరవ డాక్టరేటు ప్రదానం జరిగే కాన్వొకేషను రోజున, ఉదయం పత్రికలలో, అట్టి గౌరవాన్ని అందు కొంటున్న వారి జీవిత విశేషాలు ఫోటోలతో సహా ప్రకటించ బడ్డాయి. అందులో భీమన్న గురించి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన విశేషం నిజంగానే ఒక విశేషం. 'ది రెబెల్' (తిరుగుబాటు దారు) అనే శీర్షికతో ఆ పత్రిక భీమన్న కవితా హృదయాన్ని ఆవిష్కరించిన రీతి అత్యద్భుతం.

భీమన్నకు మొదటి నుంచీ గుర్తింపు ఉంది. గుర్తింపు వచ్చింది కృషికి. వ్యక్తికి కాదు. అదే నిజమైన గుర్తింపు. నిజమే. అయితే, ఆ కృషి ఎలాంటిది? అందులోని విశిష్టత ఏమిటి? ఎవరూ పట్టి చూడలేదు. భీమన్న సృష్టించిన కవితా కళా ప్రపంచంలో ఎంతెంత ఎత్తులకూ, లోతులకూ పోవచ్చునో ఎవరూ పరిశీలించలేదు. భీమన్న కోకిలకూ, మరొకరి కోకిలకూ తేడా ఏమిటో మదింపు వెయ్యలేదు.

ఎక్స్‌ప్రెస్ పత్రిక వ్రాసినట్టు, భీమన్న తిరుగుబాటు కవి, విప్లవ కవి. పల్లెటూరి కూలీ పిల్లవాడు "కూడు" అనే పదార్థాన్నే పట్నవాసపు కాలేజీ కుర్రవాడు "అన్నం" అంటాడు. పదార్థంలో మార్పు లేదు. మార్పు ఉండదు. పాకంలో, పక్వంలో, రుచిలో, అభిరుచిలో, అనుభూతిలో, అవగాహనలో, ఆలోచనా సరళిలో మార్పు వుంటుంది. భీమన్న ఏ వస్తువును తన కవితా శిల్పానికి ఆలంబనగా తీసుకున్నా, అది సమీక్షిత సర్వజనతకు లక్ష్య దేవతగా రూపం ధరిస్తుంది. పాలేరు వెంకన్నలోను, పరమ శివుడిలోను కూడ ఆదర్శ

సోషలిస్టునే చూస్తా డియన. నామ రూప గుణ బద్ధమైన దేదీ సర్వశ క్తి మంతం కా దీయన దృష్టిలో. పనే పరమాత్మ. పనిలో లీనం కావడమే పరమ పూజ. భీమన్న భావన లోనే అట్టి విలక్షణత, విప్లవ శ క్తి వున్నై.

కళాప్రపూర్ణ ప్రదానం జరిగిన ఆ మరునాడు, విశాఖ హోటలు ఆవరణలో అత్యంత వైభవోపేతమైన సన్మానం జరిగింది భీమన్నకు. సన్మాన సభను ఏర్పాటు చేసింది అక్కడి మామా యువకులూ, ఉద్యోగులూ, విద్యార్థులూ అయినా-సభాధ్యక్షుడూ, వక్తలలో అధిక సంఖ్యాకులూ ఇతర కులాల ప్రముఖులే. ప్రఖ్యాత రచయిత్రి రంగనాయకమ్మగారి పరిచయం భీమన్నకు ఆ సభలోనే కలిగింది.

"రేడియోతో తరచు వినవచ్చే-ముజ్జగాలు మోహించగ మురళిని వాయించరా, కృష్ణా-పాట మీదేనా?" అంటూ ఆశ్చర్య పోయిందట ఆమె. ఆమెను ఆశ్చర్యపరచిన మరో సత్యం "ఎత్తవోయీ కేల, ఈ బేల సుమబాల" అన్న పాట కూడ భీమన్నదే కావడం!

"ఈ పాటలు తరచు రేడియోలో వస్తుంటై. అవి మీ వని తెలియదు. రేడియో వాళ్ళు కూడ చెప్పరు." అన్నదామె.

"తెలియక పోవడమే మంచిది. పాట కదా ప్రధానం" అన్నాడీయన.

రెండు, మూడు రోజుల తర్వాత 21, 22 తేదీలలో కాకినాడలో వరుసగా మూడు సన్మాన సభలు జరిగాయి. వాటి విజయానికి జిల్లా కలెక్టరు మాలకొండయ్య గారి ప్రోత్సాహం చాలా వుంది. జ్ఞానానంద కవిగారి కార్యదక్షత, పి, ఆర్. కాలేజీ - మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్సు చలపతిరావు, సుందరశివరావు గార్ల అభిమానమూ, శివ సత్య, చైతన్య, రామేశ్వరరావు, రంగనాధస్వామి, రాధ, జ్ఞానసుందరం, పద్మనాభ శాస్త్రి వంటి యువకుల దీక్ష మొత్తం పట్టణాన్ని ఒక సర్వోత్సాహంలో మొంచెత్తాయి. ఆ సభలలో మాలకొండయ్య గారి ప్రసంగాలు రాగవైశాఖి కొటేషన్లతో నిండి వుండేవి.

భీమన్న కావ్యాలకో ఒకొక్క దానిపై ఒకొక్కరు మాట్లాడిన బ్రహ్మ మందిరం సభలో సంస్కృత పండితులు శ్రీ భాష్యం అప్పలాచార్యులు గారు "పారితోషికము" అనే లఘు కావ్యంపై చేసిన వ్యాఖ్య సాక్షాత్తు ఉపనిష ద్భాష్యమే అనిపించి, సభను ఆనందంలో ముంచి తేల్చింది.

చివరి కొమ్మనుగల కోకిలకు కిందనుంచి ఒక చీమ బియ్యపు గింజను కానుకగా తీసుకు వెళ్ళే కథ అది.

ఈ సన్మానాల యాత్రలో భీమన్నతో అబ్బాయి డాక్టర్ నాగవర్మకూడ ఉండడం ఒక విశేషం. వదినె జానికమ్మ గారితో సహా, అక్కడి పూర్వ స్నేహితులను, బంధువులను అనేక మందిని కలుసుకొని, ఆనందం పంచు కొన్నాడు భీమన్న. ఆ సభలు మూడు రోజులూ, ఆఫీసర్ల క్లబ్బు సన్మానమూ, సూర్య కళా మందిరంలోని మహా సభా, ఆ వేదిక మీద రంగనాథ స్వామిగారి కుమార్తె బేబీ ప్రమీల నృత్యమూ, పద్మనాభ శాస్త్రి, చంద్రరావు గార్ల కవి తలూ, చైతన్య ఇచ్చిన పార్టీ, శివసత్య చేసిన విందు, డాక్టర్ వడ్లమూడి రాజేంద్రప్రసాద్ గారి టిఫిను—మరీ ప్రత్యేకంగా చెప్పుకోదగి నట్టివి.

భీమన్న కాకినాడ ఎప్పుడు వెళ్ళినా, ఆస్పత్రి ఎదుట గల విజయా లాడ్జిలో దిగేవాడు. అక్కడ వుంటూ మోకా మీరయ్య, జానకమ్మ, కాళి ఆదినారాయణ, జ్ఞానానందకవి, జి. జె. సామ్యాలు, గొల్ల సుందరరావు మున్నగు మిత్రులు, బంధువులు పిలిస్తే భోజనానికి మాత్రం వెళ్ళి వస్తుండే వాడు. ఆ లాడ్జితో భీమన్నకు గల అనుబంధం ఎంతో హార్దిక మైనట్టి దట.

ఆ విజయ సన్మాన యాత్రలో ఏలూరు సన్మానం చివరిది. అక్కడ మిత్రులు పంతగడ బాలకృష్ణ గారి కృషితో భీమన్నకు 24వ తేదీన గొప్ప సన్మానం జరిగింది. రాయుడు గంగయ్య, తారకం మున్నగు పెద్ద లెందరో ఆశీర్వదించారు. కవులు పద్యాలు చదివారు. ఈ సన్మానాలు, భోజనాలు విరచించి, అతిసారం పట్టుకొని, ఏలూరు నుంచి చిక్కు సగమై హైదరాబాదు చేరు కొన్నాడు భీమన్న. ఆ రైల్లో వ్రాసిందే "ఇల్లు చేరు కోవాలి" కవిత.

కళా ప్రపూర్ణ సందర్భానికి సంబంధించిన మరొక ముఖ్య సన్మానం గుంటూరు ప్రెస్ క్లబ్బు వారు చేసి నట్టిది. భీమన్నకు చిరకాల మిత్రులు మన్నవ గిరిధరరావు గారు ఆ సన్మానాన్ని ఏర్పాటు చేశారు. భీమన్నతో పాటు కొండవీటి వెంకటకవి గారికి కూడ సన్మానం జరిగిన ఆ సభలో పలువురు పెద్దలతో పాటు మోదుకూరి జాన్సను గారు కూడ ప్రసంగించారు. ఆ రాత్రి భీమన్న మోదుకూరికి అతిథి. అదొక ఉపగాథ.

"మీ ధర్మం కోసం పోరాటం చదువు తున్నాను. మన సాంప్రదాయక భావాలను పునఃపరిశీలింప జేసే యధార్థాలు అందులో చాలా కనిపిస్తున్నాయి" అన్నారు గిరిధరరావు గారు, ఆ మర్నాడు ఉదయం తమ గృహంలో ఉపాహారం ఇస్తూ. భీమన్నకు విమానం ఎక్కినంత ఆనంద మిచ్చిం దా మాట! హైందవ సంప్రదాయ వాదులలో భావ పరివర్తనం కంటె పరమ విప్లవం మరొక టేముంది?

ఆ తర్వాత భీమన్న మహాకవి జాషువాను దర్శించాడు. ఒక్క చూపు తప్ప, మరే ఇంద్రియమూ పని చెయ్యని పక్షవాతంతో పడి ఉన్న ద్రైన్యావస్థ అప్పు డాయనది. భీమన్నను చాలా సేపటికి గుర్తుపట్టి, ఏదో చెప్పాలని ప్రయత్నించి, కన్నీరు కార్చా డా కవి కోకిల.

హైదరాబాదు వచ్చిన వెంటనే భీమన్న బ్రహ్మానందరెడ్డి గారిని కలిసి, జాషువా గారి పరిస్థితిని వివరించి చెప్పాడు. ఆ తర్వాత బ్రహ్మానందరెడ్డి గారి ఆర్థిక సహాయం జాషువా గారి కందిం ఉట.

ఇక్కడొక విశేషం చెప్పాలి. కాశీ కృష్ణా చార్యుల అనంతరం ఆస్థాన కవి పదవిని ఎవరికీ ఇవ్వలేదు. జాషువా ప్రజా కవి. విశ్వనాథ పండిత కవి. ప్రజా రాజ్యంలో ఆస్థాన కవి పదవి న్యాయంగా జాషువాకు ఇవ్వవలసి వుంది. ఇవ్వ లేదు. అడిగే వాడెవడు? ప్రజలు, హరిజనులు నోరులేని గొర్రె లయ్యే!

పోని, విశ్వనాథకు ఇచ్చారా అంటే-అదీ లేదు. ఆ ఇద్దరిలో ముం దెవరు చస్తే, ఆ తర్వాత రెండో వారికి ఇవ్వవచ్చు నన్నట్టుగా కూర్చున్నారు. జాషువాగారు అంత తీవ్రంగా జబ్బు పడడానికి ఈ బెంగ కూడ ఒక కారణమట!

"ప్రజా రాజ్యం పై రవీ రాజ్యంగా మారి పోతున్న" దంటూ వాపోతాడు భీమన్న అందుకే నేమో !

అందుండి కోకిలము ఇందాక దిగనేల
ఇందుండి నే చీమ నందాక పోదలతు .
చివరి కొమ్మల పైకి చేరగల ననియే
అందాక కోకిలము అందుండు ననియే
స్వీకరించును నాదు చిరుకొన్క ననియే
నే నేగుచుంటి , నన్నేల వారించెదో ?
సాగిపోవుటయె నా జన్మ ధర్మము , సఖా !
ఆగిపోవుట యన్న అంత మౌటయె కిదా ?

— భీ . కా . కుసుమాలు (పారితోషికము)

191 . స్వగ్రామంలో షష్టి పూర్తి

భీమన్నకు అత్యంత వైభవోపేతంగా జరిగిన సన్మానాలలో బహుముఖ విశిష్టమైనట్టిది - 1971 డిశంబరు 18 న తన స్వగ్రామమైన మామిడికుదురులో జరిగిన షష్టి పూర్తి సన్మానం . జిల్లా కలెక్టరు మాలకొండయ్య గారి ప్రోత్సాహంతో , ఆయన పి . యే . గిర్ గ్లానీ , మిత్రుడు బాపురెడ్డి గార్ల సౌజన్యంతో జరిగిన సన్మాన మది .

అభిమాని , ఉదారగుణ సంపన్నుడు , శాసన సభ్యుడు అయిన నయనాల గణేశ్వరరావు గారి అధ్యక్షత క్రింద ఏర్పడిన సెంట్రల్ డెల్టా సహృదయ సంఘం వారు ఏర్పాటు చేశా రా సభను . అంతటి సభ ఆ ప్రాంతాలలో అంతకు ముం దెన్నడూ జరిగి వుండ లేదట .

హైదరాబాదు నుంచి బాపు రెడ్డి , పోతుకూచి సాంబశివరావు , డాక్టర్ సి . నారాయణ రెడ్డి గార్లు ఆ సభలో పాల్గొన్నారు . వీరంతా ఆ ముందు రోజుకే కాకినాడ చేరుకుని , మరునాడు ఉదయం కారులో బైలుదేరి , కోటిపల్లి ఏటి గట్టు మీదుగా-ఆలమూరు బ్రిడ్జి మీదుగా-రావులపాలెం వద్ద కోనసీమలో ప్రవే శించారు .

"ఇంతటి మనో మోహన నందన సీమలో పుట్టి, హైదరాబాదు కాలనీలలో బ్రతకడం అనేది నిజంగా కర్మ కాక మరేమిటి?" అన్నారు గిర్‌గ్లానీ గారు రాజోలు నుంచి మామిడికుదురు వస్తున్న దారిలో, ఆ సుంద రామాలను చూస్తూ, భీమన్నను ఉద్దేశించి.

ఆనాటి సభావిశేషాలను వర్ణించాలంటే-అదే ఒక ఉద్గ్రంథ మవుతుంది. కొబ్బరాకులు చుట్టి, అరటి గెలలు కట్టిన స్తంభాల, పచ్చని మామిడి తోరణాల పందిట్లోని ఆ సభా వేదికే ఇంద్ర వైభవాన్ని వెదజల్లిం దంటే అతిశయో క్తి కాదు. తట్టల కొలది పువ్వులు, పండ్లు, నూతన వస్త్రాలు, శాలువలు, రస భరితాలైన ఉపన్యాసాలు, సరసాలు, చమత్కారాలు, విందులు, వినోదాలు-ఆ వైభవం చూడవలసిందే.

కోనసీమలోని నాయకులు, ప్రముఖులు, కాకినాడ నుంచి జ్ఞానానంద కవి, చైతన్య వంటి కవిపండితులు, అధికారులు వందలు వేలుగా పాల్గొన్న సరస్వతీ సదస్సు అది. అందులో నారాయణరెడ్డి గారి భీమన్నను గూర్చిన అభిజ్ఞాన ప్రసంగం, సభలో భీమన్నకు "సాహితీ వసంత" బిరుద ప్రదానం, పద్మ బహూకరణ, ఆ రాత్రి రాగవాశిష్ఠం నాటక ప్రదర్శనం, ప్రశస్తమైన ప్రజా విందు ప్రధాన ఘట్టాలు. ఆ ఉత్సవం కోసం రాగ వాశిష్ట నాటక ప్రదర్శన కాకినాడ వారిచే ప్రత్యేకంగా తయారు చేయబడింది.

అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన భారతీయ సంగీత నృత్య నాటకాలను ఎన్నిటినో తాను ఢిల్లీలో చూశాననీ, ఈ రాగవాశిష్ఠ ప్రదర్శనం స్థాయి ముందు అవెందుకూ పనికి రావనీ గిర్‌గ్లానీ గారన్నారు ఆ తర్వాత. ఆ సత్యం ఢిల్లీలోనే చెప్పి వచ్చారట కూడ. పైరవీ కి తప్పితే ప్రతిభకు గుర్తింపులేదు అన్నా రాయన వైరాగ్యంతో.

నారాయణరెడ్డి, బాపురెడ్డి, భీమన్న ఆ మర్నాడే కారులో హైదరాబాదుకు బైలు దేరారు. సఖినేటిపల్లి వద్ద వశిష్ఠను దాటి, నరసాపురం మార్కెట్లో రకరకాల పదార్థాలు కొనుక్కొని, ప్రయాణం సాగించారు. నారాయణరెడ్డి

ఏలూరులో పనివుండి దిగిపోగా - బాపురెడ్డి , భీమన్నా ఆ రాత్రి పదకొండు గంటలకు హైదరాబాదు చేరు కొన్నారు .

బాపురెడ్డితో గాని , మాల కొండయ్య గారితో గాని కారులో ప్రయాణం బహు వేడుకగా వుంటుంది భీమన్నకు . నిజంగా ఈయన కదొక పండగే . నారాయణరెడ్డి గారితో కారు ప్రయాణం మాత్రం తమాషాగా వుంటుందట . కారు ఎంత వేగంగా పోతున్నా , గాలి ఎంత దూకుడుగా కొడుతున్నా , కారు తలుపుల అద్దాలు తెరిచే వుండాలి భీమన్నకు . నారాయణరెడ్డి గారికి అసలు గాలే పడ దట ! అందుకు కారణం ఆరోగ్య విషయం కాదు . నున్నగా దువ్వుకొన్న జుట్టు చెరిగి పోతుం దనట !

నా ముత్తవ్వ యొక్క బారెడు వెంట్రుక కంటే
బస్సులో నా ముందు నిలబడ్డ
ఆ ఎసరిదో విరజాజుల మూరెడు జడే
నాకెక్కువ ఆనందకరం, ఆరాధనీయం

—శివాలకటి

192. గోదావరి నీరు

"మన కలెక్టరు గారు కవిత్వం వ్రాస్తున్నారంటే అందుకు కారణం గోదావరి నీరే" అన్నా రెవరో మాలకొండయ్య గారి నుద్దేశించి , రాజమండ్రిలో ఒక కవి పండిత సమావేశంలో ఆయన చదివిన ఒక కవితను మెచ్చుకొంటూ .

"నేను గోదావరిని చూడక ముందు నుంచే , నెల్లూరులో విద్యార్థిగా వున్న ప్పటి నుంచే కవిత వ్రాస్తున్నాను" అన్నాడు మాలకొండయ్యగారు .

"కనీసం గోదావరి బియ్యమైనా తిని వుంటారు" అన్నారు మరొకరు .

"మీ బియ్యం కంటె మా నెల్లూరు బియ్యమే ప్రసిద్ధం" అన్నారు మాల కొండయ్య గారు .

"గోదావరి గాలినైనా పీల్చి వుంటాను"

ఈ సంభాషణ అంతా తమాషా కోసమే జరుగుతున్నా, అందులో ఏదో అపశ్రుతి వినిపించింది భీమన్నకు.

"అయ్యా, నిరంతరం గోదావరి నీటిలోనే మునిగి తేలుతున్న ఈ రాజమండ్రి పట్టణంలో ఎంతమంది కవు లున్నారో చెప్పగలరా?" అన్నాడు మధ్యలో కల్పించుకొని.

"పోనీ-కనీసం నన్నయ్య తర్వాత మరొక మంచి కవిని చూపగలరా-ఈ ఉభయ తీరాలలోను?" అన్నాడు మళ్ళీ క్షణం ఆగి.

సభలో ఎవరూ మాట్లాడ లేదు.

గోదావరి సాహిత్యానికీ, కావేరి సంగీతానికి అనే లోకోక్తి ఒక పెద్ద అబద్ధ మనీ, రాముడు రాతిని నాతినిచేశా డన్న ప్రచారం లాంటిదే ఇదీ ననీ ప్రకటించాడు భీమన్న.

కోనసీమ వంటి సుందర నందనంలో పుట్టాడు కనుక, శృంగార కవి అయ్యాడని తనను గురించి మిత్రు లంటూ వుంటారు. కోనసీమ మొత్తం జనాభా ఎంత? అందులో అసలు కవు లెంత మంది? ఇదీ భీమన్న ప్రశ్న.

మాలకొండయ్యగారు కాకినాడలో కలెక్టరుగా వున్నంత కాలం భీమన్నకు ఆ ప్రాంతమంతా కవితా రంగస్థల మయింది. కాకినాడ, హైదరాబాదుల మధ్య ఈ ఇద్దరూ కలిసి కారులోనే ప్రయాణం చేసేవారు. పయనిస్తున్న సాహిత్య వేదిక ఆ కారు. నిరంతరం ప్రవాహ శీలమైన సాహిత్యాని కొక ప్రతీక.

అట్టి సాహితీ యాత్రలలో ఒకసారి రాజమండ్రిలో 1972 ఏప్రెల్ 3వ తేదీన నార్ని కేదారేశ్వరుడు గారి పరిచయం కలిగింది భీమన్నకు. ఆయన ఈయన గ్రంధా న్నొకదాన్ని ప్రింటు చేసి పెడతా మన్నారు. 'మణి మానసం' పద్య కావ్యాన్ని ఇద్దా మనుకొన్నా డీయన. అయన సరే నన్నాడు. ఆ తర్వాత ట్రిప్పులో ప్రాతప్రతిని తీసుకు వెళ్ళి చూపాడు. ప్రెస్ కాపీ వ్రాయించి పంపుతా

నన్నాడు. కేదారేశ్వరుడు గా రెంతో సంతోషించి, తమ ఇంట పార్టీ కూడ ఇచ్చా రీయనకు. జీడిపళ్ళు, మామిడిపళ్ళు బహూకరించారు. సంగీత సాహిత్య నృత్య విద్వాన్నిధి అయిన ఒక వదాన్యుని మైత్రి లభించినందుకు భీమన్న ఎంతో ఆనందించాడు.

అయితే - మే నెల చివరి వారంలో, కంది కుప్పతో ఒక పెళ్ళికి సకు టుంబంగా వెళుతూ, రాజమండ్రి అప్సర హోటల్‌లో దిగి, మణి మానసం ప్రైస్ కాపీని అంద జెయ్యి డానికి కేదారేశ్వరుడి గారి కోసం ఎంత ప్రయత్నం చేసినా, ఆయన దర్శనం లభించలేదు భీమన్నకు.

ఆ రోజంతా పిల్లలకు పట్టణాన్ని, గోదావరి తీరాన్ని చూపడంలో గడిపి, మర్నాడు ఒక టాక్సీని మాట్లాడుకుని, కందికుప్పకు బైలు దేరాం. మా మణిమానసం మా వద్దనే ఉండి పోయింది.

ఆ తర్వాత దానిని వెంకటేశ్వరస్వామికి అంకితంగా ప్రకటించాం. కావ్యా విష్కరణ నెల్లూరులో డాక్టర్ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన జరిగింది. కావ్య పరిచయం యధా ప్రకారం డాక్టర్ అవధాని గారే.

ఆ సమయంలో అక్కడ జరిగిన సాహిత్య అకాడమీ కార్యవర్గ సమా వేశంలోనే భీమన్నకు విశిష్ట సభ్యత్వం ఇవ్వడానికి తీర్మానం జరిగింది. ఆ తీర్మానంలో ఆట్టి గౌరవానికి పాత్రులైన వారు భీమన్న కాక, మరి ముగ్గురు - రామానుజరావు గారు, అవధాని గారు, గోపాలరెడ్డి గారు.

ప్రకృతి రహస్యాలలో భీమన్న వ్యక్తిత్వం కూడ ఒకటి. అవగాహనకు పూర్తిగా అందదు. ఈయన బ్రహ్మవాది. లౌకిక విషయా లన్నిటా నాస్తికుడే. ఆమాయకుడైన ఒక గొప్పవాణ్ణి. వెంకటేశ్వరస్వామినీ ఒకటిగానే చూస్తాడు. అలౌకిక భావనలతో సామాన్య జీవితాన్ని అలంకరిస్తాడు. ఏదీ పట్టించుకోని అనాసక్తుడు, ఉదాసీనుడు. అయినా - పట్టుదలలో మూర్ఖత్వం అనిపించుకొనే దాకా పోతాడు. సంప్రదాయానికి వ్యతిరేకి. అనౌచిత్యమంటే అసహ్యం. సెంటిమెంటు పోవా లంటాడు. సరస్వతి బొమ్మకు మెల్లెపూలు పెడతాడు!

సృష్టి శివస్వరూపం. వివిధ వైరుధ్యాల సంపుటి ఆది. తానూ అంతే అంటాడు - తనను తాను నిర్వచించుకొంటూ.

ఇక్కడే మరో విశేషం చెప్పాలి. భీమన్నది అనుమాన ప్రవృత్తి. చిన్న నొప్పికి కూడా పెద్ద ప్రమాదాన్ని ఊహించుకొని బాధపడే స్వభావం. తనకు జరిగే ప్రతి అపకారానికీ, దగాకూ వెనుక ఏదో ఒక దుష్టశక్తి వికటాట్టహాసమే వినిపిస్తుంది తనకు. మణిమానసం ప్రచురణ వ్యవహారంలోకూడ అలానే అనుమానించాడు. "పాపం రాజమండ్రి!" అనుకొన్నాడు. మరి అంతటి సుముఖులు అంతలోనే అంతటి విముఖు లెలా అయ్యారు? భీమన్నకు ఏదైనా చెడు జరిగినా అది ఆ తర్వాత మంచిగానే పరిణమిస్తూ ఉంటుంది. అదొక విశేషం. తనకు జరిగిన ఏ చెడునూ, ఆపకృతినీ జ్ఞాపకం పెట్టుకోడు, అసలు గుర్తించినట్టే కనిపించడు భీమన్న. అది మరొక విశేషం.

అబ్బా, ఎంత చీకటిని దూసుకు వచ్చాను!
ఎన్ని వెలుగుల్ని ఖర్చుచేసి పారేశాను!
ఎన్నెన్ని కలల్ని మెలకువలుగా మార్చేశాను!
నా అరికాళ్ళ హారతి కర్పూరం పళ్ళాలు,
నా అడుగడుగూ నీ కొక దీపారాధన!

— శివాలకలు

193. భూలోకనందన పూర్ణానుభూతి

హైదరాబాదు నుంచి కందికుప్ప వెళుతూ రాజమండ్రిలో ఆగుత - కేవలం మణిమానసం వ్రాత ప్రతిని అక్కడ ఇచ్చి వెళ్ళడానికే. ఆ పని నెరవేరలేదు. ఇరవై నాలుగు గంటలపాటు ఆ రాజమండ్రి మండు వేసవిలో నాని, ఆ మరు నాడు 1972 మే 26 వ తేదీన కందికుప్పకు బైలుదేరాం.

టాక్సీ కుదిర్చి పెట్టిన వాళ్ళు అక్కడ ఇంజనీర్లుగా పని చేస్తున్న ముగ్గురు యువకులు - ఈలి ప్రేమప్రసాద్, దండంగి జీవన్‌బాబు, వాకాటి రాజ గోపాల్ - ఈ ముగ్గురి తండ్రులూ, వరసగా వాడపల్లి గారు, అప్పారావు గారు, వెంకటస్వామి గారు భీమన్నకు సన్నిహితులే. మామా ప్రముఖులే. తండ్రులకు వలెనే ఈ కొడుకులకు కూడ భీమన్న పట్ల అమిత గౌరవం. అను

కోని రీతిగా రోడ్డు మీద కనబడ్డ ఈ యువకులు మాకు అక్కడ చేసిన సహాయం చాల గొప్పది.

టాక్సీ బైలు దేరుతుండగా, ఆ సమీపంలోనే గల విశ్రాంతి భవనంలో ఒక తెలిసిన హరిజన నాయకుడు మకాం చేశాడని తెలిసి, మర్యాద దర్శనంగా చూచి పోదామని, టాక్సీని అక్కడికి పోనిచ్చాం. ఆయన గారు 'ఉంటారుగా' అని భీమన్నతో అనేసి, ఎవరో ఒక వ్యక్తి భుజంపై చేయివేసుకొని దూరంగా వెళ్ళిపోయారు. మేం అక్క డెందు కుంటాం? మళ్ళీ టాక్సీ ఎక్కేశాం. మా ప్రయాణపు రామాయణంలో ఇదొక పీడకల వేట. హరిజన రాజకీయ నాయకులకూ - మానవీయ సంస్కారానికీ ఇంకా ఎంతదూరం వున్నదో జ్ఞాపకంచేసే ఒక విశిష్ట సన్నివేశం.

టాక్సీలో మొత్తం అయిదుగురం. భీమన్న, నేను, నాలుగేళ్ళ విజయ పల్లవి, ఏడాది నిండని విజయేందిర. మాకు సహాయంగా వస్తున్న పని పిల్ల యాదమ్మ పన్నెండేళ్ళది. మా ఇద్దరు పిల్లల్నీ లాలించి పాలించడం ఒక్క యాదమ్మకే చేతనవును.

గోదావరిపై బ్యారేజి నిర్మాణం పనులు చాల చురుకుగా సాగుతున్న రోజు లవి. చీఫ్ ఇంజనీరు జె. రాజారావు గారు. సాంఘిక స్ఫూర్తి, సేవా చైతన్యమూ, సంస్కృతీ సంస్కారమూ కల మామా అధికారులలో అగ్రగణ్యులాయన. భీమన్నకు చాల సన్నిహితులు.

ధవళేశ్వరం లోని తమబంగళాలో వారిచ్చిన కాఫీ ఫలహారాలు తీసుకొని, నిర్మాణం పనులను చూచుకొంటూ, ఆనకట్ట దిగువనే ప్రయాణం చేసి, బొబ్బర్లంక వద్ద కోనసీమను చేరుకొన్నాం. మళ్ళీ ఎంత కాలానికి ఈ నంద నంలో అడుగు పెట్టాం! వైశాఖపు పెండల్లో కూడ ఎంత హాయిగా వుంది!

కొత్తపేటలో కొబ్బరి బొండాలు తాగి, టాక్సీ అమలాపురం చేరుకొనే టప్పటికి, సూర్యుడు నడినెత్తి కెక్కి నిప్పులు చెరుగుతున్నాడు. మహినీ, మహీజాల్ని కూడ మల మల మాడ్చేసిన వేసవి అది. ఆ ఎండకు, గాడ్పుకు అంతవరకు తట్టుకొన్న పిల్లలు అక్కడికి వచ్చేటప్పటికి డీల పోయారు. పల్లవి

అయితే పూర్తిగా వాలి పోయింది. మా ప్రయాణం సరదా అంతా క్షణంలో ఆందోళనగా మారిపోయింది.

నిజానికి-ఐస్సులో పది రూపాయల్లో తీరిపోయే ప్రయాణాన్ని 75 రూపాయల టాక్సీలో కొనసాగించిం దెందుకు? కోనసీమ దృశ్యాలను ఈ చివరినుంచి ఆ చివరి వరకు అనుభవించడానికి కదా? మరి, ఏడాది విజయేందిర తట్టుకోగలిగిన ఆ వేసవి తాకిడికి ఐదేళ్ళ పల్లవి పడిపోయిం దెందుకు, దారి పొడుగునా వస పిట్టలా వాగుతున్నందు కేమో!

అమలాపురంలో భోజనం చెయ్యాలనుకొన్న ప్రోగ్రాంను పానీయాల వరకే సరిపెట్టుకొని, పల్లవికి ప్రథమ చికిత్స చేసి, శీతలోప చారాలు చేస్తూ టాక్సీని ఉరికించి, అపరాహ్ణం రెండు గంటల ప్రాంతానికి కందికుప్ప చేరుకున్నాం. బొజ్జావారి పేటలో, పెళ్ళి పందిట్లో మా టాక్సీ ఆగగానే, మా కోసమే ఎదురు చూస్తున్న తారకం వచ్చి, తలుపు తెరిచాడు. అక్కడి యువకులంతా చుట్టు ముట్టారు.

పెండ్లిపందిరి ఆనందంతో జిగేలుమంది. ఉత్సాహంతో ఉప్పొంగిన కరెంటు భుజం తట్టగా, పందిట్లో లైట్లు ఆమరుస్తున్న బిజిలీ నిపుణుడు షాక్ తిని విరుచుకు పడిపోయాడు.

పెండ్లికొడుకు తమ్ముడు డాక్టర్ శాస్త్రి చాతుర్యంతో, సమయస్ఫూర్తితో చికిత్సచేసి ఆ గండాన్ని గట్టెక్కించాడు. అప్పటికి విశాఖనుంచి బొజ్జా కృష్ణ శాస్త్రి, హైదరాబాదునుంచి డాక్టర్ వర్మ, డాక్టర్ విజయభారతి వగైరా అంతా ఒక్కొక్కరే పందిట్లో దిగసాగారు.

ఇంతకూ పెండ్లి ఎవరిది? వారా వేణుగోపాలస్వామి ది. ఆయనను అంతా వేణు అంటాం. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. బొజ్జా అప్పల స్వామిగారి మేనల్లుడు. భీమన్నపట్ల, మాపట్ల ఎంతో ప్రేమ గౌరవాలు కలవాడు. సకుటుంబంగా తన పెండ్లికి కందికుప్ప రావాలనీ, ప్రయాణం ఖర్చులన్నీ తాను భరిస్తాననీ చెప్పి, వాగ్దానంపొంది వచ్చినవాడు. వధువు ఆప్పల స్వామిగారి తమ్ముడు రామదాసుగారి కుమార్తె సరోజ. అన్నదమ్ముల ఇళ్ళు

రెండూ కలిసే వుంట్రై. అప్పలస్వామిగారు మాజీ శాసనసభ్యులనీ, భీమన్నకు స్వయానా వియ్యంకులనీ ఇక్కడ మళ్ళీ చెప్పనక్కరలేదు.

ఇక్కడ చెప్పవలసిన ఒకే ఒక విశేష మేమి టంటే భీమన్న అంతవరకు కందికుప్ప వెళ్ళలేదు. ఎలాగైనాసరే ఈయనను నాతోపాటు అక్కడకు రప్పించుకోవా లని అక్కడందరికీ పట్టుదల. అది ఇప్పటికి నెరవేరింది. నేడు పెండ్లి శుభముహూర్తంలో అందరి హృదయాలు ఆనందంతో ఉప్పొంగి పోయా యందుకే.

నా రాకకు ప్రత్యేకంగా ఆనందించింది అప్పలస్వామిగారి శ్రీమతి మావుళ్ళమ్మగారు. కోడి, కొర్రమీను వేపుడులు ప్రశస్తంగా చేస్తా నన్న నా కీర్తి కందికుప్ప దాకా వ్యాపించి వుంది. ఆ పెళ్ళి మూడురోజులూ నా కదే పనయింది.

చెరుకున్, కొబ్బరి, జొన్న, మావి, పనస్
శ్రీరాగముల్ పాడుచున్
వరి లక్ష్మిన్ ఆలరింప, మబ్బులు మృదం
గ శ్రీలు వర్షింప, శం
కరు డాడన్: నిఖిలాంధ్ర దేశమును నీ
కల్యాణ సుక్షేత్రమే!
సరదా మంతులు మా తెలుంగులు: రస
స్వామ్యమ్మ పాలింపు మా।

— కేదారేశ్వరి

194. ఇంటా వొంటా లేని పని

"ఒరే, ఇ దేమైనా మన ఇంటా వొంటా వున్న పనే నట్రా?" అన్నది సుభద్రమ్మ గారు, తారకాన్ని పిలిచి, ఉగ్రంగా.

"ఏమో, నాకు తెలీదు. మీ సోదరు ణ్ణి డుగు" అనేసి, తప్పుకున్నాడు తారకం.

సుభద్రమ్మ అంటే తారకం మేనత్త, అప్పలస్వామి గారి చెల్లెలు. ఆమె ఉగ్రురాలయింది - ఆ రాత్రి భీమన్న గౌరవార్థం ఆ ఇంటి వెనుక పంచ పాళీలో జరుగుతున్న తాగుడు పార్టీ గురించి.

నిజానికి అప్పలస్వామి గారి కుటుంబంలో తాగడ మనేది ఎన్నడూ లేదు. ఆయన శాకాహారి కూడ. క్రమ శిక్షణలో కఠినుడు. ఆయన తండ్రి తాతల నుంచీ అదే ఆచారం. అలాంటి భయంకర సంప్రదాయికుడైన యజమాని తద్భిన్నంగా వ్యవహరిస్తున్నా డంటే - వంశ గౌరవ ప్రతిష్ఠలను కాపాడవలసిన ఇంటాడపడుచు ఉగ్రురాలు కాకేం చేస్తుంది?

తమ ఊరు అంతకు ముందు వచ్చి వుండని, ఆ తర్వాత మరి వచ్చే అవకాశం అంతగా లేని, భీమన్నతో వీలైనంత ఎక్కువ కులాసాగా, సన్నిహితంగా కాలక్షేపం చెయ్యాలనీ - ఈ కళా ప్రపూర్ణుడైన మహా కవిని చిత్తుగా, ఆయన కిష్టమైన మత్తులో ముంచెయ్యాలనీ కలలు కంటూ-విశాఖ నుంచి బొజ్జా శాస్త్రి, అమలాపురం నుంచి డాక్టర్ వారా శాస్త్రి, నిజామాబాదు నుంచి బొజ్జా తారకం మొదలైన యువకులంతా ఒకరికి తెలియకుండా ఒకరు ఏవేవో బ్రాంఛీ, విస్కీ, బీరు సీసాలను తెచ్చి దాచిపెట్టి వుంచారు. అప్పలస్వామి గారికి తెలియకుండా ఎక్కడెక్కడ కలుసుకోవాలో ప్లానులు కూడ వేసుకున్నారు. బహుశా ఇదంతా పసిగట్టి వున్నారో, స్వయం నిర్ణయమే తీసుకున్నారో కాని - అప్పలస్వామి గారు-తామే సందకల్లు తెప్పించి, యువకులండర్నీ బోల్తా కొట్టించారు!

సాయం సంధ్యలో తాటిచెట్లు నుంచి దించే సందకల్లు మంచి ప్రశస్తమైన వేసవి పానీయం. తాటి ముంజెలు, కొబ్బరి బొండాలు, సందకల్లు, చెరువు చేపలు - వీటి రక్తి, శక్తి ఒక్క కోనసీమ వాళ్ళకు మాత్రమే తెలుసునంటాడు భీమన్న. ఆ ప్రాంతం వాడే అయివుండి, వాటి రుచి తెలిసిన భీమన్న - చాల కాలం తర్వాత ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు, తమ నియమాలను తాత్కాలికంగా సడలించుకొని, అభీష్ట పదార్థాలతో అతిథి మర్యాదలు జరిపిన అప్పలస్వామి గారి అభిజ్ఞత, ఔచిత్యం ఎంత గొప్పది!

బొజ్జావారి పేట ఊరికి దూరంగా, మట్టి రోడ్డును ఆనుకొని వుంది. వర్షాకాలంలో ఆ రోడ్డు మోకాటిలోతు ఊబిగా మారిపోతుంది. ప్రధాన గ్రామం వరకు వచ్చిన కంకర రోడ్డు మరో రెండు ఫర్లాంగుల దూరం రాలేక పోయింది. "రోడ్డూ దొర బిడ్డే" అన్న ఈయన కవితకు స్ఫూర్తి ఈ మట్టి రోడ్డే.

పేటలో రోడ్డు మొగలోనే లైబ్రరీ కోసం నిర్మించిన పర్ణశాల. అదే భీమన్నకూ, మిత్రులకూ విశ్రాంతి మందిరం. రోడ్డు ప్రక్కనే పంట కాలువ. ఆ రోడ్డూ, ఆ కాలువా అలా వృద్ధ గౌతమి సాగర సంగమం దాకా, లైటు హౌస్ దాకా ఎంతో కాలంగా జంటగా సాగి పోతున్నట్టివే.

పర్ణశాలకు కొద్ది దూరంలో, కాలువ ఆవతల చెరువు. ఆ చెరువు వేసవి కనుక ఎండిపోయి, బురదగా వుంది. అందులో పెద్దపెద్ద కొర్రమీనుల్ని పట్టి సాగారు కుర్రవాళ్ళు. అవి సరాసరి పెళ్ళివారి వంటిల్లు చేరుకొనేవి ఎప్పటి కప్పుడు.

పెండ్లిరోజు ఉదయం టిఫిన్‌లు ముగించుకొని, ఉక్కపోతతో ఉస్సు రస్సురనుకొంటూ, విసనకర్రలు చేతపట్టి, పర్ణశాలకు చేరుకొన్నారు వీళ్ళు. రాత్రి, ఉదయమూ కల్లుతోనే సరిపోయింది. తెచ్చుకొన్న విస్కీ సీసా లలానే వుండిపోయాయి. చల్లని నీళ్ళు కూడా ఆ ప్రాంతంలో లేవు. కొబ్బరి బొండాల నీరు కూడా సలసల కాగిపోతున్న వేసవి మధ్యాహ్నం అది. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ వుండగా అక్కడికి అమలాపురం నుంచి అయిస్‌ఫ్రూట్‌వాడు వచ్చాడు సైకిలు బండితో.

తమ అదృష్టాన్ని అభినందించుకొంటూ, మొత్తం బండంతా కొనేసి, ఒక పెద్ద గింగాళంలోపోసి, దానిని కొబ్బరి నీళ్ళతో నింపి, విస్కీ సీసాలను అందులో వంచేసి సేవించడం సాగించారు. అమృతం ఎలా వుంటుందో అప్పుడు గాని తెలియ లేదట వాళ్ళకు.

మధ్యాహ్నాలు మాష్టిడీ వాళ్ళ ఆటలు. ఎంత గొప్ప చాతుర్య ప్రదర్శన లవి! ప్రోత్సాహం లేక నశించిపోతూ వున్నై. ప్రాభావాలన్ని పైరవీగాళ్ళకే దక్కుతున్న ఈ రోజులలో పల్లెటూళ్ళ ప్రజ్ఞలు పాలుమాలిపోతున్నా యనడానికి

ఇదొక ప్రత్యక్ష నిదర్శన మంటాడు భీమన్న . సిసలైన భారతీయ జానపద విద్యలెన్నో ఇలా మాసిపోతున్నై అంటాడు . ఎన్ని విదేశీ సాంస్కృతిక ప్రదర్శన లైనా ఒక్క మాష్టిడీ విద్యకు చాలగలవా అంటాడు .

సాయంకాలాలు తోటల వెంట షికార్లు , ముంజెలు , బొండాలు , మామిడి పళ్ళు , పనస తొనలు , బెల్లు విరిచిన వరి పొలాల గట్లపై గోష్ఠులు , కవితా గానాలు , గానాలు .

పెళ్ళి రోజు సాయంత్రం హఠాత్తుగా పల్లవి కడుపులో పోటు బైలుదేరి బాధతో గిల గిల్లాడి పోసాగింది . అదేమిటో ఎవరికీ అంతు పట్టి లేదు . పెళ్ళి ముహూర్తం సమీపిస్తున్నది . ఎవరికీ మతుల్లో మతు ల్లేవు . విషాద మేఘం క్రిందా , వైశాఖ ఝంఝూ మేఘం పైనా మూసుకొచ్చేసినై . పెళ్ళి కొడుకు తమ్ముడు డాక్టర్ శాస్త్రి ఇంజక్షను ఇచ్చాడు . పిల్లను చేతుల్లో పెట్టుకొని భీమన్న వొణికి పోతున్నాడు . ఆ ముందు రోజున అమలాపురంలో టాక్సీలోనే ఒక గండం గడిచింది . ఇంత దూరం వచ్చిం దిందుకా అంటూ వాపోయాడు భీమన్న .

నా కేమో ధైర్యంగానే వుంది . తెలిసి ఏ పాప మూ చెయ్యని దాన్ని , శక్తికి లోబడి ఆపన్నులకు తోడ్పడే దాన్ని , నా కెందుకు అపకారం జరుగు తుంది ? తానే శివుణ్ణను కొనే భీమన్న కంగారు పడి వణికి పోవడం! అతని పాద రేణువు కంటే అల్పం అనుకొనే నేను స్థైర్యంగా నిలబడి వుండడం ! ఎంత వైలక్షణ్యం !

మా లోపలి తుపాను ఇంత ఉద్ధృతంగా వుండగా , బైట ఒక్క పెటున తుపాను గాలివీచి , పందిరి కొంత ఎగిరి పోయి , కరెంటు ఆగిపోయి , హోరున వర్షం పడసాగింది . ఇది కూడ ఎవరూ ఊహించని ప్రళయమే . అంతా గాఢాంధ కారం .

పల్లవిని నా చేతి కిచ్చి , భీమన్న టార్చి లైటు తీసుకున్నాడు . దాన్ని ఎవరో తమ చేతి కిమ్మన్నారు . ఈయన ఇవ్వలేదు . తానే ఎక్క డెక్కడికి కావాలో అక్క డక్కడికి వెళ్ళి వెలుగు చూపాడు . కొద్ది నిమిషాలు మాత్రమే

సాగిందా మహా ప్రళయం. గాలి వాన ఆగింది. పల్లవి నిద్రపోయింది. కరెంటు తీగలు సరిచేయ బడి, లైట్లు వెలిగాయి. వివాహం ఇనుమడించిన ఉత్సాహంతో శోభాయ మానంగా జరిగి పోయింది. "క్షణ క్షణముల్ ప్రకృతి ప్రవృత్తముల్" అన్నాడు భీమన్న.

ఆ మర్నాడు పెళ్ళికొడుకు పార్టీవారు తమ ఊరు తొత్తరమూడికి బైలు దేరి వెళ్ళారు. మమ్ముకూడా రమ్మని ఎంతో బలవంతం చేశారు కాని, మేము మామిడికుదురు వెళ్ళవలసి వుంది. అనాతవరం వరకు అందరం కలిసి వచ్చి, వాళ్లు ఆటుపోగా, మేం ఇటు అమలాపురం బస్సు ఎక్కాం.

తెలుగన్నన్ వెలుగొను; లోక జనక
క్తిన్ బెంచి, పోషించి, కాం
తులు పండించు శివంకరుండు ప్రతి రై
తున్ ఇందు కేదారుడే
నెల యేళ్ళ? ఆవి లేళ్ళు! ఇందు భవదా
శీర్వాదముల్ సీవె! మా
కల మాన్నమ్ములలో ప్రతీ మెతుకు నీ
కల్యాణ సౌభాగ్యమే!

— కేదారేశ్వర

195. వైశాఖి వైనతేయం

అమలాపురం చేరే సరికి సాయంత్రం అయి దయింది. వెలు గుండగానే మామిడికుదురు చేరాలని మా అభిలాష.

బోడ్సకుర్రు రేవుకు బస్సులు లేవు.

భీమన్నకు ఆ ప్రాంత మంతా కొట్టిన పిండే. అంగు శంగు శమూ తా నెరిగిందే. ఆయితే-అ దే నాటి మాట? మార్పు లే దనుకో లేదు కాని, ఇంత మార్పు ఊహించలే దీయన. పైగా, ఎప్పుకొచ్చినా ఏదో సభకు కారులో వచ్చి పోవడం తప్ప - తీరికగా గుర్రపు బండిలో కూర్చుని ప్రయాణంచేసి మూడు, నాలుగు దశాబ్దా లయింది.

బస్సెక్కి అంబాజీపేట, గన్నవరం ఆక్విడెక్టు మీదుగా రాజోలువెళ్ళి ఏంజేస్తాం? పాతిక మైళ్ళచుట్టు. బోడ్సకుర్రురేవుకు నాలుగు, రేవుదాటితే ఆక్కడినుంచి మూడు మైళ్ళు మాత్రమే మామిడికుదురు. ఇదంతా ఆలోచించి, గుర్రపు బండెక్కాం. దారిలో మా తమ్ముడు కపాలేశ్వరావు అత్తవారూరు పేరమ్మ గ్రహారమూ, ఆ తర్వాత నేను పుట్టి అడిన పేరూ రగ్రహారమూ చూచుకొంటూ రేవు చేరేసరికి ప్రొద్దుగూక వచ్చింది. గోదావరి నీళ్ళలో ఆట మొదలు పెట్టిన పిల్లల్ని పట్టుకొని ప్రైవేటు నావ చేసుకున్నాం.

ఆనాడు వైశాఖ పూర్ణిమ. కొబ్బరి తోపుల సందుల్లో నుంచి పూర్ణ చంద్రుడు తొంగి చూస్తుంటే, అతడి చూపుల చక్కిలిగింతలకు కిలకిల్లాడుతూ, అడ్డు పడుతున్న మా నావను త్వర త్వరగా ఆవతలి ఒడ్డుకు తోసివేయ సాగింది వైనతేయ గోదావరి. ఆ పోటు సిటి కెరటాలపై ఆ చిలిపి వెన్నెలలో, వైనతేయంపై మా పడవ ప్రయాణం పరమ మనోహరం. వైశాఖ పూర్ణిమ మా వసంతోత్సవం కూడ.

ఆవతల పాశర్లపూడి రేవును చేరుకొనే సరికి, అక్కడంతా వట్టి శూన్యంగా వుంది. ఒక్క టీ స్టాలు తప్ప, జన సంచారమే లేదు. ఒక్క గుర్రపు బండి కూడ లేదు.

ఆ టీ స్టాలు బల్ల మీద బెడ్డింగు పెట్టుకొని ఎవరికోసమో ఎదురు చూస్తున్న ఎర్రా ప్రెగడ గోపాల కృష్ణమూర్తి మమ్మల్ని చూచి ఆశ్చర్య పోయాడు. ఆయన్ని చూచి మాకు ప్రాణాలు లేచి వచ్చాయి! ఆయన భీమన్నకు చిరకాల మిత్రుడు. పాశర్లపూడి వాడే.

"ఇదేం అకాల వర్షం? పైగా, ఈ సమయంలో ఇక్కడ రేవు దాటడ మేమిటి పిల్లలతో? గన్నవరం ఆక్విడెక్టును వాహనాలకు తెరిచిన తర్వాత ఇటువ్యూ రావడం లేదు. ప్రొద్దు గ్రుకిన తర్వాత ఇదంతా శూన్యం" అన్నాడాయన. ఆయన కోసం బండి రావడం ఆలస్యమయింది కనుక, మేం బ్రతికి పోయాం. ఆయన వెళ్ళి పంపించిన బండిలో, ఆ వైశాఖీ పూర్ణ శీతా తపంలో సేద దీర్చు కొంటూ, మేం మామిడికుదురు చేరుకునే టప్పటికి రాత్రి పదో పదకొండో అయింది.

ఆ ప్రాంతం ఎంతగా మారిపోయి వున్నదంటే - కూడలిలో కాంట్రేగుల సుబ్రహ్మణ్యం గారి కొట్టువద్ద బండి ఆపి తెలుసుకొంటే కాని, తన ఇంటికి తనకే దారి దొరక లేదు భీమన్నకు ఆ బిజిలీ లైట్ల వెలుగుల్లో.

పైగా-అక్కడ నైనాల రాఘవులు గారు కట్టించిన కళ్యాణ సత్రం ఆ కూడలిని ఒక సిటీ సెంటరులా మార్చి వేసింది. రాఘవులు గారి తమ్ముడు జగ్గప్ప భీమన్నకు ప్రాణ స్నేహితుడు. సాహితీ హృదయుడు. కాని-అప్పటికి కీర్తి కాయుడు.

బోయోళ్ళ మెరకలో, పూర్వం మామిడి తోటగా వున్న స్థలంలో కొత్తగా ఇల్లు కట్టుకొని వుంటున్నాడు-మా మరిది అర్జునుడు. అతని భార్య సుభద్ర, కొడుకు కవి ప్రసాద్, కోడలు విమల ఆ ఇంట్లో. చెల్లెలు ద్రౌపది పెదపట్నం నుంచి మామిడికుదురు బదిలీ అయిన తర్వాత, వేరే ఇల్లు కట్టుకొంటూ, చిన్నన్న వద్దనే వుంటున్నది.

మంచి నడి వేసవి. ఇరవై నాలుగు గంటలూ చేతిలో విసనకర్ర లుండ వలసిన అవస్థ. ఉదయం తొమ్మిది ముందు, సాయంత్రం అయిదు తర్వాత తప్ప, బైటి మొగం చూడడానికి వీలులేని గ్రీష్మార్కుని చండ శాసనం. అయినా, భీమన్న బాల్య క్రీడా రమణీయాలైన ఆ ప్రాంతాలన్నీ చూశాను. ఒక రోజున ద్రౌపది తోడుగా, పల్లవిని తీసుకొని నగరం వెళ్ళి, అక్కడ గొంతమ్మ నాగయ్య దంపతులను పరామర్శించి వచ్చాను.

నగరం వెళ్ళగానే పల్లవి అక్కడి కొబ్బరి చెట్లు చూచి 'బోండా లే' అన్నది. వెంటనే-ఆ ఎనభై ఏళ్ళ నాగయ్య గారు, చెట్టెక్కి బొండాలు దింపి, సెలిగి, పల్లవికీ, మాకూ ఇవ్వడం నే నెన్నడూ మరవ లేని అద్భుత చారిత్రక దృశ్యం!

ఆ మనోహర ప్రాంతాలను చూస్తూ, అక్కడి వాళ్ళనుంచి భీమన్న బాల్య కథలు వింటున్నప్పుడే అనుకొన్నాను- ఈయన చరిత్ర వ్రాయా లని. ఈయన బాల్య స్నేహితులు, స్నేహితురాండ్రు ఆ నాలుగు రోజులూ ఈయనపట్ల

చూపించిన అపేక్షలు క్షణక్షణమూ నాకు భాగవత దశమ స్కంధ దృశ్యాలనే జ్ఞప్తికి తెచ్చినై .

మామిడికుదురులో నాలుగు రోజులపాటు వుండి, నయనాల గణేశ్వరరావు, గోపాలకృష్ణ , కటకంశెట్టి వీరాస్వామి , శ్రీ రామమూర్తి, గంటి వెంకటస్వామి , పెదపూడి నూకాలు , ఈతకోటి గంగమ్మ మున్నగువారి ఆతిథ్యాలను పొంది , రాజోలులో బస్సెక్కి , రామచంద్రాపురం మీదుగా కాకినాడ చేరుకొన్నాం . అక్కడ మోకా మీరయ్యగారి ఇంట మకాం . కాకినాడ కూడ భీమన్న శృంగార కవితా విహారభూమే కదా !

ఒక సాయంకాలం సముద్రంలోకి వెళ్ళి పల్లవి స్వయంగా ఏరి తెచ్చుకొన్న గుల్లలను మూటగట్టుకొని - జి . జె . సామ్యూలు , గొల్ల సుందరావు , శివసత్య , జె . ఎమ్ . గిర్గ్లానీ మున్నగువారి ఆతిథ్యాలు స్వీకరించి , సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదు కోచి ఎక్కేశాం . ఆ బండిలోనే భీమన్న ప్రాస్త మాలకొండయ్యగారి జీవిత వలయాలకు పీఠిక .

ఓహో!
ముంజెలు- ఎలనీరు- పంపర పనస తొనలు
పాల కొబ్బరి మీగడ- వెన్న ముద్దలు
వాటి కొసలపై ఎర్రద్రాక్షలు
మల్లె పూల చెండ్లు
వాటి చిపళ్ళపై కుంకుమ పూ మొగ్గలు
తీదొండ పండ్లు, తీయ మామిడి రసం
వయ్యారపు వాగులు
వాటి గట్ల వెంట అరటి, వసువు, పోక,
తమల పాకు తోటలు
ఆ దిగువ బంగారు తిన్నెలు
వాటి కాటుక మొనలపై నాకను పాపల సరిగమలు
ఎంతలో ఎంత లీల:
వీవే వసంతం
అచ్చం నీకులా- ఇదీ వసంతం

— రాగ వైశాఖి

196. విశ్వ శ్రేయో దృష్టి

1971 అక్టోబరు ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ యంత్రాంగం మారినప్పుడు, అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షుడుగా వున్న సంజీవయ్య గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రావడం అకస్మికంగా రద్దయి, పి వి. నరసింహారావు గారు ముఖ్యమంత్రి కావడంతో-అనేక మందితో పాటు దాసరి పెరుమాళ్ళు గారు కూడ రాజకీయంగా దెబ్బ తిన్నారు. బ్రహ్మానందరెడ్డి గారి మంత్రాంగంలో పెరుమాళ్ళు గారు సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి.

పెరుమాళ్ళు గారికి భీమన్న పట్ల బంధుత్వ భావమే కాక - మైత్రీ, గౌరవమూ కూడ వున్నై. ఆయన మంత్రి అయినప్పుడు చూడ డానికి వెళ్ళిన భీమన్నకు - తన ఆఫీసు గదిలోనే, తన దర్శనార్థం వచ్చిన విజిటర్ల సమక్షంలో, సూట పదహార్లిచ్చి సన్మానం చేసిన మహితాత్ము డాయన. ఇదేమిటండి అంటే, "నా కవిని గౌరవించు కోవడం నా విధి" అని వక్కాణించిన హరిజన భోజు డాయన.

అలాంటి పెరుమాళ్ళు గారికి అపకారం జరుగుతున్న దంటే బాధపడి, ఆయన తరపున కాంగ్రెసు అధ్యక్షులతో పోరాడడం కోసం ఢిల్లీ వెళ్ళాడు భీమన్న.

అదే ఈయన తొలి విమాన ప్రయాణం. విమానంలో ఈయన క్రొత్త దనాన్ని కనిపెట్టిన ఒక సహ ప్రయాణీకుడు కిటికీవద్దగల తన సీటును ఈయనకిచ్చి, ఈయన సీట్లోకి తాను మారాడు. ఈయన కృతజ్ఞత చెప్పగా, ఆయ నన్నాడు -

"మీరు కవులు. ఇంత ఎత్తునుంచి క్రిందికీ మీదికీ చూస్తున్నప్పుడు మీకు ఎన్నెన్నో భావాలు కలుగుతుంటై. అందులో ఏ భావం ఎలా లోకకళ్యాణకరం అవుతుందో ఎవరు చెప్పగలరు? మాకీ ప్రయాణాలు ఒక రొటీను. విమానంలో కూడ మా దృష్టి ఫైళ్ళమీదే. ఇంతకూ మీ కృతజ్ఞతకు ఆర్హమైన ఉపకారం మీకు నేను చేసిం దేమిటి?" అని.

ఆశ్చర్య ముగ్ధు డయ్యాడు భీమన్న .

ఎంత గొప్ప ఉచితజ్ఞత , ఔదార్యం , త్యాగం ! ఒక సింహాసన త్యాగానికి ఈ కిటికీ ప్రక్కసీటు త్యాగానికీ తేడా కనిపించలేదు భీమన్నకు . పైగా ఒక కవికి లోకకళ్యాణార్థం ఒక అనుకూల పరిస్థిని కలిగించే శ్రేయోదృష్టి !

ఆయనకు తాను తెలుసు , తన కాయన తెలియదు . ఆంధ్రప్రదేశ్ మైనింగ్ శాఖలో ఆయన ఒక ఉన్నతాధికారి . ఆయనపేరు శ్రీ వి. రంగనాధ రాసు గారని తర్వాత తెలిసింది .

క్రింద మేఘాలను , పైన అమరసౌధాలను , దిక్కులలో సంధ్యారాగ సరోవరాలను చూచుకొంటూ నిజంగానే మైమరచిపోయిన భీమన్న చెవులలో దూది పెట్టుకోవడం మరచిపోవడంవల్ల - ఢిల్లీలో దిగేటప్పటికి వినికిడిశక్తిని పూర్తిగా కోల్పోయాడు . ఒక గంట సేపటివరకు ఏమీ వినిపించలేదు .

ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ గెస్టుహౌస్‌ను చూడడంకూడ అదే మొదటిసారి భీమన్నకు . ఈయనా , పెరుమాళ్ళుగారూ కలిసి మూర్తిరాజుగారి రూంలో దిగారా రాత్రికి . మర్నాడు మరో రూం దొరికింది .

ఒక నాలుగు రోజులపాటు సంజీవయ్యగారి చుట్టూ పేరుకొన్న రాజకీయపు ఊబిలో దేవులాడి, కొద్రమీను కాదుకదా బొమ్మిడిచేప దొరికే ఆశ కూడా కనిపించక , ఢిల్లీనగరం చూచిపోదా మనుకొన్నారు చివరకు .

అప్పటికి ఒక అపరిచితుడయిన మిత్రుడు కలిశాడు వీళ్ళకు . ఆయనొక చౌదరి , సాహిత్యపరంగా భీమన్నకు , రాజకీయపరంగా పెరుమాళ్ళుగారికి భక్తుడట . ఆయన ఒక టాక్సీ తీసుకొని మొత్తం ఢిల్లీఅంతా తిప్పేశాడు వీళ్ళను .

ఈ అపరిచిత మిత్రుడెంత ఉదారుడో , అంత సహృదయుడైన మరో వ్యక్తిని గురించి ఇక్కడ చెప్పవలసి వుంది . అతడు అశోకా హోటలులోని ఎవరో ఒక సర్వరు . నగర దర్శనం చేస్తూ అశోకా హోటలుకు వెళ్ళారు వీళ్లు . అక్కడ ఉండే వింతలు , ఈత కొలను దృశ్యాలు అన్నీ చూచి , ఫలహారాలకు

వచ్చి, బారులో కూర్చున్నారు. పెరుమాళ్ళు గారు నైష్ఠికుడు. బారులోకి రా నన్నాడు. బారుకు వెళ్తే వాళ్ళంతా తాగే వాళ్తే కాదని, బైట కంటే బారులోనే ఎక్కువ మంచి పదార్థాలు దొరుకు తాయని నచ్చజెప్పి తీసుకు వెళ్ళా రాయనను.

తీరా, ఆ రోజు డ్రైడే !అంటే మద్య నిషేధపు రోజన్న మాట ! ఢిల్లీలో ఆలాంటి పద్ధతి వుంది. వారంలో కొన్ని రోజులలో మద్యం అమ్మరు, బారులలో ఇవ్వరు. వాటిని డ్రైడేస్, పొడి రోజులు అంటారు,

"మేం హైదరాబాద్ ఆంధ్రనుంచి వచ్చాం. రాత్రికి వెళ్ళిపోతున్నాం. అశోకా మద్యం రుచి చూచి పోదా మనుకొన్నామే ! అయ్యో, ఇప్పుడెలా !" అంటూ హిందీ, ఇంగ్లీషు, తెలుగు కలిసిన ఒక కదంబ భాషలో భీమన్న దిగాలు పడిపోగా-తెలుగు కూడ కొంచెం కొంచెం తెలిసిన ఆ సర్వారు జాలిపడి, కళ్ళొత్తుకొని, ప్రయత్నం చేస్తానని వెళ్ళి "బ్లడీ మేరీ" అనబడే ఒక సాధు పానీయంలో ఆడుగున రహస్యంగా రెండేసి పెగ్గులు జిన్ను ఉంచి, తీసుకువచ్చి పెట్టాడట ! సహృదయతకు, కరుణకు ఉదాహరణగా ఆ సర్వారును పేర్కొం టాడు భీమన్న అవసర మైనప్పుడెల్లా.

ఆ డ్రింకు మత్తులో పడి, మధ్యాహ్నం పదకొండు గంటలకే భోజనా నికి రమ్మని చెప్పిన బి. ఎస్. మూర్తి గారింటికి రెండు గంటలకు వెళ్ళి, ఆయన చేత నిష్ఠూరాలు కూడ తిన్నాడు భీమన్న - విందు పదార్థాలతో పాటు ! అయితే - ఆ జఠర దీపకం తర్వాత ఈ విందు భోజనం ! ఆదీ ఆనందం !

ఎల ప్రాయపు సెల యేరు
ఎగిరి గంతులా వేస్తూ
ఎడారి చేతుల్లో పడి ఎండిపోయింది.
అమాయకపు లేడి పిల్ల
ఆరుణార్కుణ్ని ఆరాధిస్తూ
వేటగాని తుపాకీ గుండుకు
గుండె చీలి పడిపోయింది
కాయ కష్టం పండిన రైతు రొమ్ముపై
పండి పరవశిల్లిన వరిచేను
తుపాను గాలి దొంగ దెబ్బకు చితికి
మునిగి పోయింది కన్నీటి పరదలో

— శివాలకుం

197. అసెంబ్లీ సభ్యత్వం కోసం

1967 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం చాల ఆలస్యంగా ప్రయత్నించిన భీమన్న, 1972 ఎన్నికలకు బాగా ముందు నుంచే ప్రయత్నం చేడానుకొన్నాడు.

ప్రయత్నం చెయ్యడ మంటే ఏం చెయ్యాలి? నాయకుల చుట్టూ తిరగాలి. వారికి పాదసేవ చెయ్యాలి. ముఖ్యంగా హరిజన అభ్యర్థుల విషయంలో ఇదొక్కటే అర్హత. ఆ ప్రాంతపు పై కులాల నాయకుడికి నమ్మిన బంటు అనిపించుకునే వాడికే పార్టీ టికెట్టు. అదీ అప్పటి ప్రజాస్వామిక పరిస్థితి. ఎక్కడికక్కడే నియంత్రత్వం. ఎక్కువ డబ్బిచ్చి వోట్లు కొనగలవాడే నాయకుడు.

వోట్లు కొనగల హరిజను డెవడూ వుండడు కనుక, అలా కొనగల హరిజనేతర నాయకుణ్ని ఆశ్రయించిన హరిజనుడికే ఎన్నికలలో సీటు దొరుకుతుంది. మరి భీమన్న కెలా దొరుకుతుంది?

హరిజనులకు రిజర్వు చేయబడ్డ ప్రత్యేక నియోజక వర్గం నగరం. అంత వరకు అక్కడి నుంచి శాసన సభ్యుడుగా వుంటున్నాయన తానిక విరమించు కొంటున్నాననీ, ఇష్టమైతే ప్రయత్నించు కోమనీ, భీమన్నకు చెప్పాడు. దానితో, అ నియోజక వర్గం నుంచి పోటి చేయడానికి టికెట్టు కావాలని భీమన్న కాంగ్రెసు పార్టీని అడిగాడు.

భీమన్న షష్టిపూర్తి సన్మానసౌధానికి మూలస్థంభంగా నిలిచినవాడు నయనాల గణేశ్వరరావుగారు. దానితో, ఆయనకు విరోధవర్గంలోని వారంతా భీమన్నకు విముఖులయ్యారు. అందులో కొందరు షష్టిపూర్తి సభకు కూడా రాలేదు.

"నగరం తప్ప మరెక్కడైనా కోరుకో! నేను ప్రయత్నించేసి టికెట్టు తెప్పిస్తాను. పోనీ ఆల్లవరం తీసుకో" అన్నారు బ్రహ్మానందరెడ్డిగారు. అప్పటి కాయన ముఖ్యమంత్రి పదవినుంచి దిగిపోయి ఖాళీగా ఉన్నారు. కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులు. భీమన్నపట్ల సహృదయులు.

" నా స్వగ్రామం నగరం . నా సొంత నియోజకవర్గమే నాకు కావాలి " అన్నాడు భీమన్న .

"పోయి భీమన్నకు సొంత నియోజక వర్గ మేమిటి? సొంత వూ రేమిటి? రాష్ట్రంలో ఏ వూరు నీదికాదు ? నీవు ఎక్కడ నిలబడితే గెలవ్వు ? ఆ విషయం నాకు వదిలెయ్ . ఎక్కడో ఒకచోట సీ టిచ్చి గెలిపిస్తాను " అన్నారు రెడ్డిగారు . ఏమంటావ్ అన్నట్టు చూశారు-ఆ ప్రక్కనే వున్న బొజ్జా అప్పలస్వామిగారి కేసి.

"కావచ్చు గాని , నాకు నగరం తప్ప , మరో చోట అక్కర లేదు" అన్నాడు భీమన్న .

"నగరం నా చేతిలో లేదు . దానిని సిట్టింగ్ మెంబరుకే వాగ్దానంచేశారు . నీవు సంజీవయ్య వద్ద నుంచి తెచ్చుకో . ఆయన నీ పేరు చెపితే , నేను వద్దనను " అన్నారు రెడ్డిగారు . ఆది మంచి సలహా . అంతకంటె గత్యంతరం లేదు . ఎందుకంటే-సిట్టింగ్ మెంబరు మాట తప్పాడు .

బ్రహ్మానంద రెడ్డి గారి సలహాను జేబులో పెట్టుకొని , నయనాల గణేశ్వరరావు గారు తమకోసం రిజర్వు చేయ్యించుకొన్న టికెట్టును తీసుకొని , ఢిల్లీ రైలెక్కాడు భీమన్న 1972 జనవరిలో . ఈయనతో పాటు బొజ్జా అప్పలస్వామి గారు కూడ ఢిల్లీకి బైలు దేరారు-అల్లవరం సీటు కోసం .

తన సీటు విషయం బ్రహ్మానంద రెడ్డి గారికి వదిలేసి వుంటే , బహుశా , అల్లవరం సీటు భీమన్నకు వచ్చి వుండేది . వైనతేయ గోదావరికి ఈ తట్టు నగరం నియోజక వర్గం . ఆ తట్టు అల్లవరం నియోజక వర్గం . రెండూ హరిజన నియోజక వర్గాలే . అల్లవరం భీమన్నకు ఇష్టం లేకపోవటానికి కారణం అక్కడ రిపబ్లికన్ పార్టీ తరపున రమణయ్య నిలబడడం . రమణయ్యను ఎదిరించడ మంటే మామా యువకులతో విరోధ పడడం . అధికార పదవుల కంటె , హరిజన యువకులు ప్రధానం భీమన్నకు .

వోటున్న ఎవడైనా శాసనసభ్యుడు కావచ్చు, మంత్రి కావచ్చు. కవి కాలేడుకదా! సర్వసాధారణమైన ఒక పదవికోసం అసాధారణమైన తన సారస్వత పీఠాన్ని వదులుకోడు భీమన్న.

రాజకీయ చైతన్యంగల మేధావులు పదవులలోకి రావాలంటే ఎన్నికల విధానమే పూర్తిగా మారా లంటాడు భీమన్న. కరెన్సీ నోట్లను చిత్తుకాగితాల్లా విరజిమ్మగలిగిన కోటీశ్వరులే ఎన్నికలలో గెలవగలుగుతున్నారు. ఆశ్రితుల్ని గెలిపించ గలుగుతున్నారు. నిరంకుశంగా పాలించ గలుగుతున్నారు. నీతి మాలిన మార్గాలద్వారా మళ్ళీ కోట్లధనాన్ని ఆర్జించుకో గలుగుతున్నారు. ప్రజా స్వామికం ధనస్వామికం అయింది. పరిపాలనలో ధనానికే తప్ప ప్రజలకు స్థానం లేకుండా పోయింది.

ఎన్నికలను ప్రభుత్వమే జరిపించా లంటాడు భీమన్న. రాజకీయ పార్టీలకు ప్రమేయం వుండకూడదు. ప్రచారం ఆక్కరలేదు. అభ్యర్థులకు ఖర్చేమీ కాకూడదు. అభ్యర్థి లెవరో, వా రేపార్టీవారో, వారి గుణగణా లేమిటో కర పత్రాలు వగైరా ద్వారా ప్రభుత్వమే ప్రజలకు చెప్పాలి. వోటింగు నిర్బంధం చెయ్యాలి. అభ్యర్థుల జాబితాను ప్రతి వోటరుకూ ముందే అందజెయ్యాలి. అలా ఎన్నికలు నిర్వహించ బడినప్పుడు నిజమైనా ప్రజాప్రతినిధులు, మేధావులు అధికారంలోకి రాగలుగు తా రంటాడు భీమన్న.

అయితే నీతి గురించి తెలియకనా మానవుడు అవినీతికి పాల్పడడం?

శతకముల కొలది నీతులు
శతవిధముల గలవు, వాని జను లెరుగుదురున్
మెతుకులు ముఖ్యము జీవికి,
బ్రతుకుటయే ముఖ్య నీతిపథమౌ, విల్లీ!

— విల్లీ శతకం

198. రాజకీయ షికారీ

శరీరాన్ని ఐస్‌ఫ్రూట్‌చేసి ఆరగిస్తున్న చలిలో, వేకువజామున అయిదు గంటల ప్రాంతంలో ఢిల్లీ స్టేషనులో దిగిన వియ్యంకు లిద్దరూ వేడి వేడి టీ

తాగి, వెలుగు వచ్చేవరకు స్టేషనులోనే కూర్చుని, ఒక ఆటోవాలా సహకారంతో ఆ సమీపంలోనేగల ఒక పంజాబీ లాడ్జింగులో దిగారు.

బహుశా ఆది జనవరి మూడోవారం. ఆ తర్వాత రెండుమూడు రోజులకే రిపబ్లికు దినోత్సవం. అంతకు ఒక నెలరోజుల ముందే పాకిస్తాన్‌పై అఖండ విజయం సాధించి, నవభాంగ్లాకు పురుడుపోసిన భారతజాతి అమితోత్సాహంతో జరుపు కొంటున్న తొలి విజయోత్సవం అది. ఆ సమయంలో ఢిల్లీలో వుండి, దాన్ని తిలకించగలిగిన తన ఆదృష్టాన్ని తాను ఎంతగానో అభినందించు కొన్నాడు భీమన్న.

తమకులాగే సీట్లకోసం ఢిల్లీ వచ్చివున్న ఆనేకమంది చిరకాల మిత్రులను కలుసుకొన్న ఆనందం భీమన్నకు ఇంతిం తన రానిది. కలిసి కబుర్లు, విందులు, షికార్లు-ఒక వారంరోజులపాటు ఎంతో సరదాగా గడిచిపోయిం దీయన కక్కడ కాలం. పైగా నిరంతరోత్సాహి ఆయిన అప్పలస్వాగారి నిత్య సాహచర్యం, మధుమూర్తి అయిన ఎన్. కె. లింగంగారి సాయం వినోదాలు.

ఢిల్లీలో అందరి లక్ష్యమూ ఒక్కటే సీట్లు! ఆవెలా దొరుకుతై? ఎక్కడ దొరుకుతై?

ఢిల్లీ ఆడవుల్లో వేటాడితే దొరుకుతై!

సీట్లు అడవి పందులు. సంజీవయ్యగారి భవనావరణం, కాంగ్రెసు కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ గెస్టుహౌసు ఇవి ప్రధానమైన ఆడవులు. అభ్యర్థులు వేటగాళ్ళు. పందిని కొట్టినవాడే బంటు. సీటు సంపాదించినవాడే నాయకుడు.

ఈ రాజకీయ మృగయా వినోదం తిలకించి, తిలకించి భీమన్న "ది హంట్" '(వేట)' అని ఇంగ్లీషులో ఒక కవిత వ్రాశాడు.

గెస్టుహౌసులో ముఖ్యమంత్రిగారి వసతిగది బైట వేచి వేచి, తాను వచ్చినపని చెప్పుకొనే అవకాశంకూడ దొరక్క, ఆక్కడే ఒక్కడూ ఆలో

చిస్తూ కూర్చుని వుండగా-తళుక్కున మెరిసిందట ఈ వూహ తన చింతాక్రాంత మస్తిష్కంలో ? అక్కడికక్కడే దాన్ని పూర్తిచేసి , కానాట్ సర్కిలుకు వెళ్ళి , ఐదువందల రోనియో కాపీలు తీయించి, ఆక్క డందరికీ పంచిపెట్టేశాడు.

ఎవడో ఒక షికారీ కొట్టిన వేట మృగాన్ని అక్కడ చేరిన రౌడీ లంతా పంచుకు తింటూ , అది చాలక , షికారీని కూడ కాల్చుకు తినదలచడం ఈ కవితలోని వస్తువు . ఈ అన్యాయాన్ని యువకులు సహించరు కనుక , వాళ్ళను ఆ దరి దాపుల్లోకి కూడ రానివ్వ రా రౌడీలు . రాజకీయ వాస్తవానికి ఎంతటి కళాత్మక చిత్రణ !

ఒక సాయంకాలం సంజీవయ్య గారి భవనంలో , కరెంటు కుంపటి భగ భగ మండుతుండగా , భీమన్న ఒక్కడే సంజీవయ్య గారితో కబుర్లు చెపుతూ కూర్చున్నాడు . భీమన్న కవితను చదువుతూ , వ్యాఖ్యానిస్తూ , నవ్వుకొంటూ వినోదిస్తున్నా డాయన . రాజకీయ ధూమం మధ్య మలయ సమీరంలా ప్రాణం పోస్తున్నాయా క్షణాలు .

అంతలో ప్రవేశించా రిద్దరు నాయకులు, తూర్పు గోదావరి వారు. అక్కడ భీమన్నను చూచి చకితు లయ్యారు . వారిలో ఒకరు హరిజన-మరొకరు సిరిజన.

"మీ రొచ్చా రేమిటి?'' ఒకాయన ప్రశ్న , భీమన్న నుద్దేశించి .

'నగరం సీటు కోసం' సంజీవయ్యగారి జవాబు. మొగ మొగాలు చూచు కొన్నారా ఇద్దరూ

"భీమన్న గారి వంటి పెద్దలు ఎన్నికలలో పోటి చేయడం ఏం బాగుంటుంది ? కొన్నిలుకు నామినేటు చేద్దాం . అది ఆయనకూ , మనకూ కూడ గౌరవం'' అన్నా రొకరు .

"అదే ఉత్తమం" అన్నారు రెండవ వారు .

సంజీవయ్య గారు ఆ ఇద్దరి మొగాలలోకి పరిశీలనగా చూచి , ఆచూపుల్ని భీమన్న మీదకు మరల్చి , ''అదే మంచిది కదా ?'' అన్నారు . "సరే" అన్నాడు భీమన్న .

"గడియారం, విశ్వనాథ, జాషువా వంటి వా రంతా కౌన్సిలుకు నామినేట్ చేయ బడ్డవారే కదా?"

"ఆ వరసలో నన్ను కూడ నామినేట్ చేస్తా మన్నారు బ్రహ్మానందరెడ్డి గారు. ఈ లోపలే ఆయన తప్పుకో వలసి వచ్చింది. ఆ స్థానం లోకి సంజీవయ్య గా రొస్తే సమస్యే లేక పోయేది. పరిస్థితి తారు మా రయింది. నే నింత దూరం రావలసి వచ్చింది" అన్నాడు భీమన్న.

"మేం వున్నాం కదా? ఈ సారి మీకు భాయం" అన్నారా ఇద్దరూ.

ఆ ఇద్దరూ ఉన్నారు, నిజమే. లేనివారు సంజీవయ్య గారు. లేనిది మాట నిజాయితీ. రానిది కౌన్సిలులో భీమన్నకు స్థానం.

"దొంగ లున్నారు జాగ్రత్త" అని వ్రాయ వలసింది
రైళ్ళ లోని మరుగు దొడ్లపై కాదు,
రాజకీయాల నొసళ్ళ మీద!
ముఖ ప్రియాల పీపుల మీద!

— భీమన్న చాటువులు

199. మూ డుంగరాల కథ

భీమన్నకు ఆభరణా లంటే ఇష్టం వుండదు. ఆవి ఎవరి ఒంటిమీద ఉన్న ప్పటికీ. మొట్టమొదట పాలేరు నాటకం ప్రదర్శించిన మోరి వినోదనాట్యమండలి వారు బహూకరించిన ఉంగరం మాత్రం అప్పటినుంచీ ఈయన వేలికి ఉంటున్నది.

మధ్య మధ్య ఎక్క-డెక్క-డివో ముద్దుటుంగరాలు ఈయన చేతికి వస్తుండటం, పోతుండడంకూడ జరుగుతూ ఉండేది. అలాగే ఒక ఉదయం ఈయన చేతికి నీలంరాయి ఉంగరం వుండడంచూచి విస్తుపోయాను నేను. పాలే రుంగరం లేదు.

ఆ ముందు రాత్రి ఎక్క-డో ఏదో మైకంలో ఏ. ఆర్. కృష్ణా, తానూ ఉంగరాలు మార్చుకొన్నా రట.

ఆది రేసుల సీజను. ఆ మర్నాడు రేసుల్లో కొన్ని డబ్బు లొచ్చా యా యనకు. దానితో నీలంరాయి ఉంగరంవల్లనే ఆ మాత్రం లాభం వచ్చిందనే నమ్మకం ఏర్పడి, కొద్ది రోజులలోనే తనకు సొంతంగా ఒక పెద్ద నీలంరాయి ఉంగరం చెయ్యించేసుకున్నాడు. అప్పటినుంచీ పాలే రుంగరం మూలపడి, దాని స్థానంలో నీలం ఉంగరం కొలువు తీర్చింది.

ఒకసారి విశాఖ పట్నంలో రాజమహల్ హోటల్లో, తన రూంలో కూర్చుని భీమన్న ఏదో వ్రాసుకొంటూ వుండగా, "రావచ్చునా?" అంటూ తలుపు తోసుకొని ప్రవేశించా డొక ఏనభై యేళ్ళ తేజస్వి. భీమన్న లేచి, కుర్చీ చూపాడు. తాను మంచం మీద కూర్చున్నాడు.

విషయ మేమి టంటే - అవచ్చిన వాడొక జ్యోతిష్కుడు, హస్త సాము ద్రికుడు, రత్న విద్యావేత్త. పూర్వం ఎప్పుడో విజయనగర సంస్థానంలో ఆ స్థాన పండితుడట ఈ అన్నిటా! తేజస్సూ, సుదీర్ఘమైన వెండి గడ్డమూ, అనర్ఘళమైన ఆంగ్ల భాషా వాక్ ధారా, ప్రసన్న మధుర దరహాసమూ ఆయన చెప్పే దేనినీ అనుమానించడానికి వీలు లేకుండా వున్నై!

భీమన్న లలాట పీఠంపై నీలవేణీ దేవి ప్రతిష్ఠిత ఆయి వున్నదనీ, ఆమె అద్వితీయ విజయ ప్రదాయిని అనీ - ఇంకా ఏమేమో చెప్పాడాయన ఒక అరగింట పాటు. హస్త రేఖలు చూస్తుండగా, నీలం రాయి మీద పడిం దాయన దృష్టి.

రకరకాల రంగుల రాళ్ళ మహత్తులను గురించి ఉపన్యసిస్తూ, ఏయే రాళ్ళ కలయిక శరీరంలో ఏయే శక్తుల్ని ఉజ్వలింప జేసేదీ వివరిస్తూ - నీలం ఉంగరం ప్రక్క కెంపు ఉంగరాన్ని, ఆ ప్రక్క ముత్యం ఉంగరాన్ని కూడ ధరించ మని సలహా ఇచ్చాడు. ఆలా ధరిస్తే - ఒక ఆరు మాసాలలో దాని ఫలితం కనిపిస్తుందనీ, తా నెన్నడూ ఊహించని ఒక గొప్ప రాజపూజత లభి స్తుందనీ వక్కాణించాడు.

అయిదు రూపాయ లిస్తా నని మొదట్లో ఒప్పుకొన్న భీమన్న, ఈ మంచి మంచి మాటలకు ముగ్ధుడైపోయి, పది రూపాయ లిచ్చి పంపేశా డాయనను. ఇలాంటివి తనకు క్రొత్తేం కాదు కనుక, వాటి నప్పుడే మరిచి పోయాడు.

రెండు మూడు నెలల తర్వాత ఒకనాడు చార్మినార్ సమీపంలోని ఆఫీసుకు వెళ్ళి పెన్షను తెచ్చుకొంటూ, అక్కడి నగల కొట్టువద్ద ఆగినప్పుడు - భీమన్నతో కూడా వున్న నేను జ్ఞాపకం చేశాను రాళ్ళ కథ. ఆయ నెవరో, ఎందుకు చెప్పాడో, పరీక్షించి చూడవచ్చు కదా అన్నాను. వెంటనే ఆ ప్రక్క కొట్లో దూరాం. నీలం వున్నది నడిమి ప్రేలికి, ఉంగరపు ప్రేలికి కెంపు, చిటికెన ప్రేలికి ముత్యం - రెండుంగరాలను కొనేశాం.

భీమన్న ఈ ఉంగరాలను పెట్టుకొని, చాలామంది మిత్రుల అవహేళనలకు గురైనాడు. ఉంగరాల కవిగా పేరు పొందాడు. కవి సమ్మేళనాలలో ఈయన మీద కంటే ఈయన ఉంగరాల మీదనే ఉండే దందరి దృష్టి. అయితే ఇది జరిగిన నాలుగు నెలలలోనే, 1973, జనవరి 19 వ తేదీన, ఈయనకు 'పద్మశ్రీ'ని ఇస్తున్నట్టుగా అధికార వార్త అందింది!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపతి పాలన కిందకు వచ్చిన రోజులవి. మా ఇంటి వెనక వున్న బండ పైకి నిచ్చెన వేసుకొని, పైనున్న చిక్కుడు కాయలు కోస్తున్నాడు భీమన్న. అంతలో సచివాలయం నుంచి వార్త వచ్చింది - బాపురెడ్డి గారు అర్జంటుగా రమ్మంటున్నారని. అప్పుడాయన ఆక్కడ రెవిన్యూ సహాయ కార్యదర్శి. భీమన్న ఆయన వద్దకు వెళ్ళగా, నారాయణ రావు గార్ని చూచి రమ్మన్నాడు. వణుకూరి నారాయణరావుగారు హోంశాఖ సంయుక్త కార్యదర్శి. ఆయన వద్దకు వెళ్ళగా-ఆయన ఢిల్లీ నుంచి వచ్చిన అర్జంటు వార్తను వినిపించి ఈయన నుంచి అంగీకారం తీసుకున్నారు, తొలి అభినందనను అందజేస్తూ. బాపు రెడ్డిది మలి అభినందన!

అయితే-భీమన్నకు పద్మశ్రీని తెచ్చింది ఈ మూడుంగరాల ప్రిశక్తేనా? "ప్రిశక్తి పూజ గైకోగదే" అంటూ చిన్నప్పటి నుంచీ ఈయన ఆరాధిస్తున్న నిరంతర కృషి శక్తే ఈయనకీ గౌరవం అందించింది. 1973 జనవరి 26, రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో పద్మశ్రీ ప్రదాన ప్రకటన వెలువడింది.

లోకంలోని
ఒక్కొక్క అమ్మ ఒక్కొక్క ముద్ద పెడితే
తృప్తిగా గడిచి పోతుంది నా జీవితం

హృదయం లోని
ఒక్కొక్క కొమ్మా ఒక్కొక్క ముద్దు పెడితే
నిత్య వసంతమే అవుతుంది నా చరిత్ర
ఆత్మలోని
ఒకొక్క బొమ్మా తనిని తరిం చేస్తే
ఆనంద బ్రహ్మనే అవుతాను నేను
అయితే-ప్రియా!
ఆ ఆమ్మా, ఆ కొమ్మా, ఆ బొమ్మా
ఆ ముగ్గురూ ఒక్క వీవే అయితే?

— శివాలకలి

200. ఫెలోషిప్పు – పద్మశ్రీ

భీమన్న జీవితపథం ఒక పరాంకోటికి చేరుకొన్న సంవత్సరం 1978.

ఎన్నడూ ఆశించని ఔన్నత్యాలు తమంతటతాము చేతి కందడమేకాక, తన పరిధి కతీత మనుకొన్న దూరక్షేత్రాలు కూడ కన్నుకొట్టి రప్పించుకొన్నై తమ వద్దకు.

జనవరి 25 సాయంత్రమే ఢిల్లీనుంచి ప్రధానమంత్రి, హోంమంత్రి, హోం సెక్రటరీ గార్ల అభినందన సందేశాలు అందాయి పద్మశ్రీ కి. సందేశాలు ఇంటికి వచ్చాయి. అప్పటి కీయన ఒక కవి సమ్మేళనంలో పాల్గొంటున్నాడు కళాభవన్‌లో. అక్కడినుంచి మిత్రుడు నర్రావులతో అటేపోయి, విం దారగించి నడిరేయి దాటి ఇంటికి వచ్చేవరకూ, ఈ సందేశాల సంగతి తెలియనే తెలియదు. 26 ఉదయం రేడియోకో వచ్చింది అనౌన్సుమెంటు.

ఫిబ్రవరి మూడున సాహిత్య అకాడమీ సర్వసభ్య సమావేశంలో పద్మశ్రీకి తొలి సన్మానం జరిపించారు సాహితీ స్రష్టలు గోపాలరెడ్డిగారు. గోపాల రెడ్డిగారు అభినవాంధ్ర భోజులే కాదు, కవి పండిత కామధేనువు. ఆయన చేతి చలువ భీమన్నపై ఒకటే సన్మానాలవర్షం కురిపించిం దా తర్వాత.

అదే సాయంత్రం బహిరంగ సభలో భీమన్నకు సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వం ఇవ్వబడింది – ఒక కాశ్మీరు శాలువా, బంగారు పతకం,

అభినందన పత్రం బహూకరణతో . అభినందన పత్రాన్ని (సైటేషనును) అవధాని గారు వ్రాశారు. సభలో వారే చదివారు . ఆ వైభవం అనన్య లభ్యం .

ఆకాశవాణి ఎన్ . వి . ఎస్ . ప్రసాదరావు , ఆర్టిస్టు పి . ఆర్ . రాజు , రైల్వే ఇంజనీరు నెల్లి విక్రాజు మున్నగు అనేకమంది మిత్రుల వైయక్తిక సన్మానాలు , ఇంటి విందు లతోపాటు - మాల కొండయ్య గారి రచయితల కూటం , విద్యార్థుల సభ , రామచంద్రపురం భెల్ ఉద్యోగుల సంఘ - అ విధంగా బహిరంగ సభా సన్మానాలు ప్రారంభ మయాయి . అందులో మార్చి ఏడున షెడ్యూల్డు కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘం వారు వై . ఎం . సి . ఏ . లో నార్ల వారి అధ్యక్షతన జరిపిన సన్మానం వీటన్నిటికీ నమూనాగా పేర్కొన వచ్చు . దివాకర్ల , బాపురెడ్డి , శశాంక , యశోదారెడ్డి , జె . వీరా స్వామి , టి . వి . నారాయణ , పి . జె . ఆనంద్ , భూపతి తిరుపతి , ప్రజా కవి ఏకాంబరనాథ్ మున్నగు ప్రముఖుల ప్రశంసలతో అ సభ దేవసభలా గుబా ళించింది .

కేంద్ర సాహిత్య అకాడమీ వారి తెలుగు ప్రాంతీయ సలహా సంఘ సభ్యత్వం కూడ ఈ వారంలోనే వచ్చింది భీమన్నకు .

వచన కవితలో రూపకాలను ప్రాయించి ఆకాశవాణిలో ప్రసారం చెయ్యా లనే ఊహ నండూరి విఠల్ గారికి తట్టగా-మొదట బాపురెడ్డిగారి "సాగరసౌధం" ప్రసారం చేశా డాయన . అది విజయవంతం కాగా-రెండో రూపకం భీమన్నను వ్రాయమన్నాడు . "మానవ నవోదయం" అనే రూపకాన్ని భీమన్న పూర్తి చేసింది కూడ ఈ వారంలోనే . ఇందులో ప్రత్యేకత-కవి కూడ ఒక పాత్రగా వుండి , స్వయంగా ఆ పాత్రను అతడే ధరించడం .

మానవ నవోదయం మార్చి ఏడున రికార్డు చేయబడింది . అయితే ఈ ప్రయోగ మూల బ్రహ్మ అయిన విఠల్‌గారు లేకపోవడం వల్ల , ప్రొడక్షను తృప్తికరంగా జరగలేదు . ఈ ప్రయోగం ఆ తర్వాత కొనసాగించబడనూ లేదు . మానవ నవోదయం మాత్రం ఆ తర్వాత ఎన్నోసార్లు పునఃప్రసారం చెయ్యబడి , ప్రజాదరణ పొందింది .

మార్చి 19న, సమయానికి శాసన సభ్యురాలు కమల తన సొంత జీపులో, స్నేహితురాలు శకుంతలతో కలసి రాగా, అదే జీపుతో మేమంతా బయలుదేరి, నాంపల్లి స్టేషనుకు వెళ్ళి, భీమన్నను ఢిల్లీకి రైలెక్కించాం.

మూడో రోజున ఢిల్లీ చేరిన భీమన్న, అక్కడ ఎందరో మిత్రులతో పాటు, ఆంధ్రప్రదేశ్ గెస్టు హౌసులో విఠల్‌ను కలుసు కున్నాడు. ఆయన టెలివిజన్ ట్రైనింగు కోసం ఢిల్లీ వచ్చి వున్నాడు కొద్ది రోజుల క్రితమే. ప్రైవేటు గెస్టుగా, గెస్టు హౌసును భరించ లేక, భీమన్న విఠల్ రూంకు చేరు కున్నాడు - రామకృష్ణాపురం. విఠల్ మంచి రచయిత. గొప్ప స్నేహశీలి. భీమన్నను దగ్గరుండి పిల్చుకు పోయాడు తన రూం కు.

రాష్ట్రపతి భవనంలో మార్చి 23న రిహార్సలు, 24న ఉత్సవం - పద్మ అవార్డుల ప్రదానోత్సవం. రాష్ట్రపతి గిరి గారి గిరిజా వాల్లభ్య హస్తాల నుంచి పద్మశ్రీ ని స్వీకరించాడు భీమన్న ఆ రోజున.

బ్రహ్మానందరెడ్డి, రఘురామయ్య, జి. వెంకటస్వామి, గోడే మురహరి మున్నగు పెద్దల సాన్నిధ్యంలో ఆనందించి, గుండేరావు హర్కారే గారితో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వం వారి ఆతిధ్యం స్వీకరించా డా రాత్రి భీమన్న. సంస్కృత పాండిత్యానికి రాష్ట్రపతి సన్మానం అందుకొన్న హర్కారే భీమన్నకు ఆతి సన్నిహితుడు. భీమన్న పట్ల పుత్ర ప్రేమ గల వేదపండితుడు.

"అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ ఢిల్లీలో ప్రాతినిధ్య శాఖ లుంటై. ప్రత్యే కాధికారు లుంటారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వ శాఖలు తమ తమ రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వచ్చే ప్రముఖ కవులను, కళాకారులను గౌరవిస్తూ వుంటై. ఒక్క ఆంధ్రప్రదేశమే అట్టి ఆదృష్టానికి ఇంకా నోచుకోలేదు" అంటాడు భీమన్న. మహారాష్ట్ర శాఖ గౌరవించ గలిగిన భీమన్నను తెలుగు శాఖ పలకరించ నైనా లేదట!

పద్మశ్రీని అందుకొంటున్నప్పుడు తన తండ్రిగారు జ్ఞాపకం రాగా, ఆ మర్నాడు బి. ఎన్. మూర్తిగా రింటికి మకాం మార్చి, 26 వ తేదీ ఉదయం హరద్వార్‌కు బస్సెక్కాడు భీమన్న.

పంచె లెగగట్టి అరకలు వడుతున్న రైతులు
రోడ్డు కిరుపక్కలా పేడ, పిడకల గుట్టలు
గోదావరి పెద్దకాలువ పొడవునా
కోనసీమ సుందర వనాల గుండా
అమలాపురం వచ్చేపిం దనుకున్నాను
కానీ-అది రూర్కీ!
గంగా గోదావరుల కవలలా!

— శివాలకలు

201. హర ద్వారం-హృషీ కేశం

బస్సెక్కి ఉదయం పదకొండు గంటలకు డిల్లీలో బైలు దేరిన భీమన్న దారి పొడుగునా అపూర్వ సుందర దృశ్యాలను చూచుకొంటూ, గంగా గోదావరుల అభేదత్వాన్ని పోల్చుకొంటూ, ఏ తత్ క్షేత్రజ్ఞత తో శివాద్వైతం అనుభవిస్తూ ప్రాథమికుడైన సాధకుడిలా ఆనందిస్తూ పోయి-సాయంత్రం నాలుగు గంటలకు హరద్వారం చేరి, ఆక్కడ వెంటనే బస్ మారి, మరో గంటలో హృషీకేశం చేరుకున్నాడు.

అది హరి ద్వారమా; హర ద్వారమా? ఇది హృషీకేశమా, ఋషీ కేశమా? అక్కడక్కడ-ఒకొక స్రైను బోర్డుమీద ఒకొక రకంగా వ్రాసి ఉండడం చూచి నవ్వుకున్నాడు భీమన్న. మానవు డెక్కడున్నా ఒక్కడే. అనుమానగ్రస్తుడు, అవిద్యా పీడితుడు!

గంగ నేలకు దిగిన స్థలం అది. చుట్టూ శివాలక పర్వతాలు. అంటే అవి శివుని ఆలకలు, ముంగురు లన్నమాట. వాటి ద్వారా, ధారలుగా గంగ క్రిందికి దిగింది. కాగా, అది హరద్వారమే కావాలి. గంగ విష్ణు పాదోదక కదా అంటే-ఆ సందర్భం ఇక్కడ పొసగదు.

హృషీక మంటే హృదయం, హృషీ కేశ్వరుడు శివుడు. అర్ధజ్ఞానం, శబ్దజ్ఞానం లేనివాళ్ళు అధికార పీఠం అధిరోహిస్తే, ఇలాంటి ఘోరదోషాలే దొర్లుతా యను కొంటూ ప్రయాణం సాగించాడు భీమన్న.

ఇంతటి మనోహరమైన యాత్రను కొద్ది వాక్యాలలో ముగిస్తున్నా నంటే, అందుకు కారణం ఈ యాత్రా విశేషాలను గురించి భీమన్నే "గుడిసెలు కాలి పోతున్నై", "శివాలకలు" కావ్య సంపుటులలో స్వయంగా చెప్పుకోవడమే.

"ముద్దులతో అద్దరికి", "ఫ్రీవెర్సులో ప్రేమ లేఖలు" అనే పేర్లతో "జయశ్రీ" వంటి పత్రికల ద్వారా ప్రసిద్ధమైన తన కావ్య సంపుటికి "శివాలకలు" అనే పేరును స్థిరపరచుకోవడం భీమన్న ఈ శివాలక పర్వత పంక్తుల్ని, అక్కడి గంగావతరణాన్ని చూచిన తర్వాతనే జరిగింది.

హృషికేశం బస్ స్టాండులో దిగే సరికి ఇంకా బ్రొద్దు వుంది. అక్కడ గుర్రపు బండి చేసుకొని, ఆంధ్రాశ్రమం చేరుకొని, అద్దె గదులు గురించి వాకబు చేస్తున్నాడు భీమన్న. అక్కడి ఆశ్రమ సహాయకు డొకడు వివరాలు చెపుతున్నాడు-అన్ని సౌకర్యాలూ కల డబుల్ రూం రోజుకు పది రూపాయలు, మామూలు గది రెండు రూపాయలు అంటూ. అంతలో "భీమన్న గారా?" అంటూ వచ్చారెవరో వెనక నుంచి! ఎంతటి ఆశ్చర్య విభ్రమం.

"నేను మీకు తెలియదు లెండి. సాహిత్య పరంగా మీ అభిమానులలో ఒకణ్ణి. కొత్తగా హైదరాబాదు నుంచి ఇక్కడికి వచ్చాను" అన్నారాయన. పేరు జి. నారాయణరావు గారు. అక్కడ ఆశ్రమ వ్యవహారాలను ఒక క్రమంలో పెట్టడానికి తిరుమల దేవస్థానం వారు ఆయనను అప్పు డక్కడకు పంపించారట!

అక్కడ మరొక అధికారి అయిన హనుమంతరావుగారు కూడ భీమన్నను ఎరిగిన వారే.

"ఇక్కడ మీ రెన్నా ఝున్నా సరే. మీరు మాకు అతిథులు. భోజనం కూడ మా ఇంటి నుంచే పంపిస్తాను. స్వేచ్ఛగా, సంతోషంగా ఈ ప్రాంతా లన్నీ చూడండి" అంటూ నారాయణరావు గారు ఆశ్రమం మేడ మీద ఒక మంచి డబుల్ రూంను అలాట్ చేశారు. ఈయన అక్కడున్న మూడు రోజులూ ఉచిత భోజన వసతులతో పాటు, తమ సహాయ సహకారాలతో ఎంతో ఆహ్లాద పరిచారీయనను ఆయన.

ఆంధ్రాశము ఆవరణలో ఒక ప్రక్క వెంకటేశ్వరాలయమూ, ఒక్క ప్రక్క శివాలయమూ కట్టిస్తున్నారప్పటికి నారాయణరావు గారు. భీమన్నకు ఆ ప్రాంతపు కథలన్నీ చెప్పుకొంటూ, ఆ మర్నాడు ఉదయం శివానందాశ్రమంలో వదిలి వచ్చారు. శివానందాశ్రమం ఒక విచిత్ర లోకం. ఆక్కడి వాళ్ళు మానవులు కాదు. మానవ సౌజన్య మంతా రూపం ధరించిన సువర్ణ సుధా కలశాలు.

అక్కడి పార్వతీ కుటీర్ ఆధిపతి, ఆతిథ్య శాఖాధిపతి, స్వామీ రామానంద భీమన్నకు ఇచ్చిన గౌరవాదరణలు అద్వితీయమైనట్టివి. భోజనాది వసతులు చూడడానికి, ఆ ప్రాంత మంతా త్రిప్పి చూపడానికీ ఆయన పంప, గంగిరెడ్డి అనే ఇద్దరు యువకులను భీమన్నకు అప్పగించారు. ఆ ఇద్దరూ ఆశ్రమోద్యోగులే. పరిశుభ్రతకు, పవిత్రతకు, ప్రశాంతతకు హృషీకేశాశ్రమాలు అమరా రామాలు!

గంగిరెడ్డి కడప ప్రాంతపు యువకుడు. సంస్కృత విద్వాంసుడు. ఆయనతో కలిసి స్వర్గాశ్రమం, గీతాశ్రమం వంటి వన్నీ చూచుకొంటూ, గంగా తీరం వెంట నడిచి, లక్ష్మణ ఝూలా వద్ద కొంతకాలం గడిపి, ఫోటోలు తీయించుకొని, గుండ్రని రాళ్ళను ఏరుకొంటూ, తెల్లటి ఇసుకను ఎత్తుకొంటూ ఎంత ఆనందించాడో భీమన్న ఆ సాయంకాలం. తన తండ్రి పల్లయ్యగారు చివరి రోజులు గడుపుదా మనుకొన్న ఆశ్రమాలు అవే. ఇంకా భూమిని చేరని గంగ అష్టాదశి లా, హరిణకిశోరి లా ఆ రాతి బండల మీద నుంచి గల్లు గలున దూకి పరిగెత్తడం ఎంత మనో మోహనం!

ఆకాశాన్ని ఆల్లరిపెట్టే ఆ కొండ శిఖరాలు, కొండ మలుపులతో దాగుడు మూతలాడుకొనే ఆ గంగ ఎన్నడూ నడినెత్తికి రాని ఆ సూర్యుడు, ఆమరారామాల లాంటి ఆ ఆశ్రమాలు - ఆ ఆత్మీయతలో పరవశుడైపోయిన భీమన్నకు ఆ ప్రాంతాన్ని వదలి వెళ్ళా లనిపించ లేదట. మిత్రుడు గంగిరెడ్డి దగ్గరుండి ఐస్సెక్కించకపోతే ఆక్కడొక భీమాశ్రమం వెలసివుండే దేమో.

నా కోర్కెలెగిరి సీతాకోక చిలుకలై
మెత్తగా ప్రతిపూవు చిత్తన కాలూను:
తీరియే పోద మనుకొన్నవి-మరిక్రొత్త
భాషలు నింపుకొను చున్నవి:

— బొమ్మ

202. దీపోత్సవం

భీమన్న ఈ యాత్రకు మూలభూతం పితృస్మృతి.

"ఏ నాటికైనా హరద్వారం చేరుకోవాలి. హృషీకేశం ఆశ్రమాలలో చేరిపోవాలి" అంటూ వుండే వారట పల్లయ్యగారు తన శిష్యులతో. అది భీమన్న మనసులో వుంది. ఆ కోరిక ఆయనకు తీరలేదు. తానైనా తీరుద్దా మనుకొన్నా డీయన. ఎలా తీర్చడం? ఇది కూడా ఒక సెంటి మెంటే. మానవ పురోగతికి ఏకైక అవరోధం సెంటి మెంటని ఎలుగెత్తి చాటే భీమన్నకు కూడా ఒక సెంటి మెంటు!

ఢిల్లీ నుంచి వచ్చే టప్పుడు బస్సులోనే అనుకొన్నా డీయన - తనకు లభించిన పద్మశ్రీని తండ్రి కంకితం చేసి, ఆ పద్యాలను బ్రహ్మకుండంలో వదలాలని! పద్యాలను కూడ బస్సులోనే వ్రాసేశాడు. ఆ పని కోసం హృషీకేశం నుంచి తిరిగి వస్తూ హరద్వారంలో ఆగాడు. అక్కడ ఈయన మకాం కర్ణాటక భవనం. దాని అధిపతి నంజుండ శాస్త్రి. అది గంగ ఒడ్డు మీదే వున్న ఒక చక్కని విశ్రాంతి మందిరం. నంజుండ శాస్త్రి నారాయణరావు గారికి మిత్రుడు.

ఆ ఉదయం గంగానదిలో స్నానానికి దిగడం భీమన్న జీవితంలో ఒక మహా దనుభూతి. పాతిక ముప్పై ఏళ్ళ వయస్సు దాకా ఈయన ఉదయం చన్నీళ్ళ స్నానమే చేసే వాడు. ఆ తర్వాత ఎప్పుడైనా వేసవిలో తప్ప నిత్యమూ వేడి నీళ్ళ స్నానమే. హిమాలయాల మీద మంచు కరుగుతున్న మార్చి ఆఖరు వార మది. గంగ ఎలా వుంటుంది? ఆదీ - హరద్వారం వద్ద? అది వేగమా? వారు బాస్త్రు పరంపర! అది నీరా? మంచు ద్రవం!

ఒడ్డున మడిమల లోతుకు వెళ్ళగానే ఆ వేగానికి తూలి పడ్డాడు. సాహసించి నడుంలోతు వరకు దిగాడు. ఆ శీతలతకు నెత్తురు గడ్డ కట్టుకు పోయి, స్పర్శ జ్ఞానం పోగా, దబ దబా తలా వొళ్లూ తడుపుకొని, ఒడ్డున పడ్డాడు! మరి, ఆ ఈత కొడుతున్న వాళ్ళంతా ఎవరు? పరికించి చూశాడు. అవి చేపలు! మన్మధుడు భస్మం కాగా, [గంగ నాశ్రయించిన మీన కేతనాలు!

క్షేత్రమంతా తిరిగి, కొండమీది మనసా దేవినీ, కొండ దిగువ నీల గంగనూ దర్శించు కొని, వాటి రూప కల్పనలకు ముగ్ధ డవ్వుతూ, తదితర విశేషాలను చూచుకొంటూ, సాయంత్రానికి బ్రహ్మ గుండం చేరు కొన్నాడు. అదే హరద్వారం, అద్భుత సౌందర్య కేంద్రం! ఎంతటి నాస్తికులనైనా ఒక ఆర గంట సేపైనా భక్తి విభ్రమంలో ముంచి వుంచగల మాయా శిల్పేంద్రం! ధూప దీప నైవే ద్యాదిక మనో మాదక పూజా వాతావరణంతో నిండి వుంటుం దది ఎల్ల సాయంత్రాలూ.

ముఖ్యంగా సాయంత్రం ఏడు, ఏడున్నర మధ్య ఆక్కడ ఆమందానంద తుందిల మైన వేగంతో మందాకిని మహీతలంపై ఆడుగు పెట్టిన ఆక్కడ-ఆ బ్రహ్మకుండం ఇరు తీరాల వెంటా జరిగే హారతి, ఆ ఘంటా బృహ న్నాదం సాక్షాత్తు సంధ్యాశివుల దివ్యాల తాండవమే. ఆ ఆరగంటకోస మైనా హరద్వార్ చూడా లంటాడు భీమన్న.

చిన్న పెద్ద దొన్నెలలో దీపా లుంచి, ప్రవాహంలో వదులుతూ వుంటారు. వేలకొలది దీపాలు ఆ వేగంలోపడి పోతూవుంటే, ఆ వైభవం చూడాలి. ఆపాద మస్తకం దీపాలు ధరించిన ఆక్కడి గంగ దీప గంగ, జ్యోతి ర్లింగ.

ఆదిన్ గొంటి కళాప్రపూర్ణను: వెలో
నైనాను: సాహిత్య రా
ధా దేవీ దయ పొంగి వచ్చినది: ప
ద్మశ్రీని చేబట్టి, నీ
పాదాలన్ ఇసుడుంప దెచ్చితి హర
ద్వారమ్మ: నే డింక నీ
ఆదర్శమ్మ ఫలింప ప్రీతి గొనుమ
య్యా: వల్ల యార్యా: గురూ:

అంటూ పద్మశ్రీ ని తండ్రి కంకిత మిస్తూ వ్రాసిన అయిదు పద్యాలను ఒక దొన్నెలో వుంచి, దీపం వుంచి, దానిని ప్రవాహంలో వదిలేశాడు భీమన్న. అది కనుమరుగై పోయే దాకా దాన్నే చూస్తూ కూర్చున్నాడు.

మార్చి 31 సాయంత్రం గెస్టు హౌసులో మంత్రి జి. వెంకటస్వామి గారితో ఇష్టాగోష్ఠి జరిపి, ఢిల్లీ ఆంధ్రుల సన్మానం అందుకొని, అప్పటికే చెడిన ఆరోగ్యానికి మూర్తి గారింట్లో ఇచ్చిన వోమం పొడిని జేబులో వేసుకొని, రైలెక్కి, ఏప్రిల్ రెండున హైదరాబాదు చేరుకొన్నాడు భీమన్న.

పాలేరుగ పుట్టితి, మా
మాలకు ఋషి వారపత్య మార్జించితి, వాక్
శ్రీ లలితను వేవించితి,
పాలించితి కావ్యజగము వదన్మశ్రీ నై!

— భీమన్న చాటువులు

203. వెండి సరస్వతి

1971 లాగే, 1973 కూడ భీమన్న చరిత్ర సన్మానాల చరిత్రే.

పద్మశ్రీ ని అందుకొని హైదరాబాదుకు వచ్చిన మర్నాడే-అడ్వకేటు భీమరాజు గారింట్లో డిన్నరు పార్టీ జరిగింది. భీమన్న అనారోగ్యంగా ఉన్నా, బాపురెడ్డి దగ్గరుండి తీసుకు వెళ్ళాడు. ఎంతో ఆత్మీయతతో కూడిన చక్కని పార్టీ అది. రాత్రి ప్రొద్దు పోయేవరకు జరిగింది.

ఆ రాత్రి ఇంటికి వచ్చేటప్పటికే చాల కొగులుగా వున్న భీమన్న, ఆ మర్నాడు లేవనే లేదు. ప్రమాది సంవత్సరాది ప్రమాదంగా ప్రారంభ మయింది భీమన్నకు. ఆ తర్వాత నాలుగైదు రోజుల పాటు పార్టీలు, ప్రసంగాలు అన్నీ రద్దు చేసుకోవలసి వచ్చింది.

ఇంతకూ భీమన్నకు సాధారణంగా చేసే అనారోగ్యం అతి సారం. అది చిన్నప్పటి నుంచీ ఈయనను బాధ పెడుతూనే వుంది. ఇలా తరచు విరేచనాలు పట్టుకోవడానికి కారణం ముఖ్యంగా ఆహార విహారాలలో కాలనిలయం పాటించక

పోవడం. ఈ సంగతి ఈయనకు తెలుసు. అయినా నియమ నిష్ఠలకు కట్టు పడ లేదు!

ఏప్రిల్ ఎనిమిదవ తేదీన అలాగే బాధ పడుతూ, మూలకొండయ్య గారితో కలిసి ఆయన కారులో గుంటూరుకు బైలు దేరాడు భీమన్న. అక్కడ గుంటూరు ఇంటర్నేషనల్ క్లబ్బువారి సన్మానం. చిగురుపాటి నాగేశ్వరరావు గారి ఆతిథ్యం.

ఢిల్లీ వెళ్ళి నప్పుడు ఇక్కడి మూసీనది నీళ్ళు ఒక ప్లాస్టిక్ డ్రంలో తీసుకు వెళ్ళి, మిగిలిన నీటిని యమునలో పోశాడు భీమన్న. అక్కడ హృషీకేశంలో గీతాశ్రమం నుంచి శివానందాశ్రమానికి గంగ దాటుతూ, ఆ మధ్య నుంచి పట్టిన స్వచ్ఛమైన గంగా జలాన్ని తెచ్చాడు డ్రం నిండా. ఆ నీటిని సకుటుంబంగా గండిపేట వెళ్ళి మూసీలో కలిపాం. భావ సమైక్యం లాగే, నదీ సమైక్యం అంటాడు దీన్ని. ఇలాంటి హార్దికమైన పనులు చెయ్యడం సరదా భీమన్నకు. తన పనులు కొన్ని సెంటిమెంట్లు వలె కనిపించినా-అవి కేవలం హార్దిక రమతలే అంటాడు.

విరేచనాలు పూర్తిగా తగ్గక పోయినా, సన్మాన యాత్రకు బైలుదేరాడు. ఏప్రిల్ 14న విజయవాడలో సన్మానం. అంబేద్కరు జయంతి సభ అది. రమణ, లక్ష్మీనారాయణ, ఏకాంబరనాథ్, నాగప్ప, నేల శ్రీరాములు, జె. సత్యనారాయణ మున్నగు వారి ప్రశంసలు. వేముల వెంగళరావుచే ప్రత్యేకంగా ఒక శాలువా. కోనాడ సూర్యప్రకాశరావు గారింట్లో మందులు, పత్యం భోజనమూ. కోనాడవారి అబ్బాయిలతో ఆశోక్ గొప్పగాయకుడు. భీమన్న రాఖీలు అనేకం గానం చేసినవాడు. అమ్మాయి రమాదేవి బాలాన్నపూర్ణ.

ఆ రాత్రే 12 గంటలకు బైలుదేరి 15 ఉదయం నెల్లూరు చేరాడు. అక్కడ జిల్లా విద్యాశాఖాధికారిగా వున్న ఎన్, వెంకటస్వామిగారి ఆతిథ్యం, ఈపీ చిన్నయ్య, తాళ్ళూరి తిరుపాల్, జె. వీరాస్వామి, కావూరి పట్టాభి రామయ్య, లవణం మున్నగువారి ప్రశంసలతో సన్మానం అందుకొని, ఆ రాత్రే 12 గంటల రైల్లో బైలుదేరి విశాఖపట్టణం చేరుకొన్నాడు భీమన్న.

16వ తేదీ వైశాఖ పూర్ణిమ . భీమన్నకు పరమ పర్వదినం . " వైశాఖీ మనోవల్లభుడు " కదా ! అట్టి పర్వదినం సాయంత్రం , విశాఖ సముద్రతీరంలో తనకు అత్యంత ప్రేమపాత్రుడైన బొజ్జా కృష్ణశాస్త్రితో , అక్కడి ఆవుటర్ హార్బర్ నిర్మాణ దృశ్యాలు చూస్తూనూ , అక్కడి బీచి బారులో ప్రాగుతూనూ గడిపా డంటే ఎంత ఆనంద పరవశుడై వుంటాడో ఊహించవచ్చు .

17న మాల కొండయ్యగారితో , కృష్ణశాస్త్రి , బాపురెడ్డి గార్లు వెంటరాగా , కారులో నరసన్నపేటకు బైలుదేరాడు భీమన్న . ఆ ప్రాంతాలుచూడడం అదే మొదటిసారి భీమన్నకు . ఎంతో సరదా ప్రయాణం .

నరసన్నపేటలో మిత్రులు పార్వతీశం గారి ఆధ్వర్యంలో సన్మానం . అధ్యక్షులు మాల కొండయ్యగారు . అదే సభలో భాగ్యలక్ష్మి గారు వ్రాసిన " శృంగార మాధవం " అనే కావ్యం ఆవిష్కరించ బడింది . గొప్ప ప్రతిభగల కవయిత్రి ఆమె . భీమన్న రచనలపట్ల అభిరుచి కలది . ఆ సన్మానసభలో భీమన్నకు రజత సరస్వతి బహూకరించబడింది .

అదే రాత్రి 12 గంటలకు విశాఖకు తిరిగివచ్చారు . పట్టాభిరామిరెడ్డిగా రింట దివ్వరు . ఆది ముగిసేటప్పటికి తెల్లవారింది .

18 ఉదయం ఆకాశవాణిలో కవితల రికార్డింగు బాపురెడ్డి, మాలకొండయ్య గార్లతో సహా . సాయంత్రం విశాఖ సాహితీ వారి సన్మానం . రాత్రంతా ఆకాశ వాణిచే ఇంటర్వ్యూ .

19 ఉదయం అప్సర హోటల్‌లో బౌద్ధ మిషన్ వారి సన్మానం . డాక్టర్ స్వామి గారి అధ్యక్షత-పావన మూర్తి , కృష్ణశాస్త్రి , బాపురెడ్డి వగైరాల ప్రసం గాలు . కారుతో కాకినాడకు ప్రయాణం . ఆ రాత్రి కాకినాడలో గిర్ గ్లానీ గారి విందు , వినోదాలు , పెద్దాపురం అవుల్లో షికార్లు . మర్నాడు ఉదయం ఆరు గంటలకే కాకినాడలో బైలుదేరి-రావులపాలెం , తణుకు , విజయవాడ , సూర్యా పేటలలో మిత్రులను కలుసు కొంటూ-హైదరాబాదు చేరే టప్పటికి రాత్రి పద యింది . ఈ యాత్ర తిరుగు ప్రయాణంలో డాక్టర్ యాదగిరి రెడ్డి కూడ వుండడం ఒక విశేషం. ఆయ నెక్కడుంటే అక్కడ నవ్వులకు కొద వుండదు.

ఈ యాత్ర ఎంత వేగంగా జరిగిందో అంత వేగంగానూ ముగించాలని, ఇంత క్లుప్తంగా చెప్పాను. మూడేసి గంటల పైగా పట్టిన ఒక్కొక్క సభ గురించీ, సన్మాన శేషాలను గురించీ వ్రాయా లంటే చాలా అవుతుంది మరి.

ఆదే వరుసలో చెంచెల గూడా నిత్య వైష్ణవ సంఘం, సెంట్రల్ లైబ్రరీ, బాలాపురం మహిళా సమాజం, హుమాయూన్ నగర్ యువజన సభ, గుంతకల్ నూలు మిల్లుల సంఘం చైర్మన్ వెంకటస్వామి గారి కార్య కర్తృత్వంలో ఉరవకొండ, గుంత కల్లులలోని సాహిత్య సమావేశాలు-ఇలా ఎన్నో సన్మానాలు జరిగాయి పద్మశ్రీ కి. గుంతకల్లు, ఉరవకొండ సభలలో కవి సమ్మేళనాలకు భీమన్నే అధ్యక్షత వహించాడు. అయా సందర్భాలలోని ఈయన అనుభవాలు, ప్రసంగాలు, వివాదాలు ఎంతో ఆసక్తి కరాలు, ప్రత్యేకంగా వ్రాయవలసి నట్టివి.

స్నేహితుడే శివుడు నాకు,
స్నేహితుణ్ని తృప్తి పరిస్తే
శివుణ్ని తృప్తి పరిచినట్టే;
సమస్త ప్రపంచాన్ని స్నేహంగా చూడడమే
శివపూజా పరాయణత.

— శివాలికలు

204. ఎందులో డాక్టరు?

1973 మొత్తమంతా సన్మానాలకోసం ప్రయాణాలు, అకాల భోజనాలు, అపథ్యాలు వగైరా కారణంగా భీమన్న ఆరోగ్యం బాగా దెబ్బ తినింది. హార్దికంగా ఎంత మెత్తని వాడో, మానసికంగా అంత మొండివాడు ఈయన. మొండి అనడం కంటె ఉదాసీనుడు అనడం ఉచితం. అయితే-హృదయమూ, మనస్సూ శరీరాన్ని శాసించ గలవా? శరీరం మీద ఆధారపడి బ్రతుకు తున్నట్టివి కదా అవి?

చివరకు భీమన్న ఆస్పత్రిలో చేరక తప్ప లేదు. మిత్రుడు డా. జి. ఆంజనేయులు గారి సలహాపై, 1974 జనవరిలో ఒక ఉదయం, గాంధీ

ఆస్పత్రికివెళ్ళి, డాక్టర్ జె. జె. రావు గారి పర్యవేక్షణలో-అక్కడి కక్కడ నిర్ణయం తీసుకొని, ఆస్పత్రిలో చేరాడు జనరల్ వార్డులో. వ్యాధి క్రానిక్ డయేరియా.

ఈయన పడకకు ఒక ప్రక్క నోరు తెరచుకొని ఆపస్మారంలో గురక పెడుతున్న ఒక రోగి, రెండో ప్రక్కకూడ అదే రకమైన భయంకర దృశ్యం! మొత్తం వార్డు అంతా అలానే వుంది. ఈయన ఆస్పత్రిలో చేరిన వార్త అందు కొని నేను వెళ్ళి, ఆ దృశ్యం చూచి బేజారెత్తి పోయాను. నాకే అలా అయితే, స్వభావతహా వికృత దృశ్యాలను చూడలేని భీమన్న వాటి మధ్య ఎలా వుంటాడు?

"ఈ వ్యాధి మనకు చిన్నప్పటి నుంచీ వున్నదే. ఇప్పు డిక్కడ వుండే కొత్త వ్యాధులు అంటుకోవచ్చు. ఇంటికి పోదాం పద" అన్నాను ఆవేశంతో. నాతో పూర్తిగా ఏకీభవించా డీయన. అయితే వ్యాధి అంతు తేలే వరకు ఇంటికి రానన్నాడు. పరిసరాలు భయంకరం గానే ఉన్నాయి. కాని ఏం జేస్తాం? స్పెషలు వార్డుకు డబ్బు కట్టుకో గలమా?

"అభిజ్ఞ సమాజంలో అగ్రశ్రేణిలో బ్రతుకుతున్నా, ఆర్థికంగా మన స్థానం ఇదే కదా?" అన్నాడు నవ్వుతూ.

ఒక ఆధునిక జనరలు ఆస్పత్రిలో, మానవ శరీరం మీద ఎన్నెన్ని టెస్టులు చెయ్యగలరో అన్నీ చేశారు-ఒక వారం పది రోజుల్లో.

"డాక్టర్! మీ రెందులో స్పెషలిస్టు?" అనడిగింది, మొదటి రోజునే కేసు బ్రాసుకోడానికి వచ్చి కూర్చున్న హౌస్ సర్జను, డాక్టర్ వత్సల.

"కవిత్వంలో" అన్నాడు భీమన్న.

"ఆఁ!" అన్నదామె నోరావులించి.

ఏ డైనా ఆఫీసుకో, ఆస్పత్రికో వెళ్ళినప్పుడు తన రచనలలో ఏదో ఒకటి చేతిలో వుంచుకోవడం ఈయన కలవాటు. అప్పు డీయనతో వున్నవి గుడి సెలూ, మణి మానసమూ.

ఆ ప్రక్క రోగుల్ని పరీక్షిస్తున్న ఇద్దరు ముగ్గురు హౌస్ సర్జన్లు 'కవిత్వం' 'బోయి భీమన్న' అనే మాటలు వినబడి, అక్కడికి చేరారు. కొద్ది నిమిషాలలో భీమన్న పడక చుట్టూ నర్సులూ, డాక్టర్లూ.

"బోయి భీమన్న గా రంటే మీరా?" అన్నా రందరూ. "మా నాన్నగారు ఫలానా ప్రొఫెసరుగా" రని ఒక అమ్మాయి, "మా అన్నగారు ఫలానా ఆఫీస"రని మరొక అమ్మాయి-ఇలా పరిచయం చేసుకొన్నారంతా. అక్కడున్న పుస్తకాలు తలొకటి పట్టుకు పోయారు. వత్సల అయితే తా నంతకు ముందు వ్రాసుకున్న గేయాలను చూపి, సవరణలు చెయ్యించుకొంది.

సెనేటు సభ్యుడూ, కాసన సభ్యుడూ అయిన డాక్టర్ లింగయ్య అప్పటికి ఎమ్. డి. కూడ చేస్తున్నా దక్కడ. వరంగల్లు జిల్లాలోని చేరియాల్‌కుచెందిన హరిజన యువనాయకు డాయన. ఒక రోజున ఆ వార్డులోకి వచ్చి, గుడిసెలు పుస్తకం ఒక పడకపై చూచి, వివరాలు తెలుసుకొని, ఏదో పెస్టుకు వెళ్ళిన భీమన్న తిరుగి వచ్చే వరకు ఆగి, పరిచయం చేసుకున్నాడు. అదే ఇద్దరి తొలి పరిచయం. ఆ తర్వాత ఈ ఇద్దరు స్నేహితులూ, బంధువులూ కూడ అయారు. అదే ఆస్పత్రిలో సివిల్ సర్జన్ డాక్టర్ పాముల రామారావుగారు, వార్డులోకి వచ్చి, ఈయన పొందుతున్న మర్యాదలు చూచి, "మీ రెక్కడుంటే ఆదే స్వర్గం" అనేసి వెళ్ళిపోయారు.

భీమన్న ఆస్పత్రిలో తన కిచ్చే పదార్థాలను చుట్టు ప్రక్కల వాళ్ళ కిచ్చేసే వాడు తన పుస్తకాలు, పత్రికలు వార్డంతా తిరిగేవి. ఈ రకమైన రోగి జనరల్ వార్డుకు, లభించడం అపూర్వం కదా! అందుకే ఈయన క్షణా లలో అక్క డందరికీ సన్నిహితుడై పోయాడు.

ఆస్పత్రిలో వున్నప్పుడు కూడ భీమన్న కాగడం మాన లేదు. రాత్రి భోజనానికి ముందు కొద్దిగా తీసుకోవడం ఈయన కలవాటు. ఆస్పత్రికి రాత్రి భోజనంతో అది కూడ పంపేదాన్ని. "ఈ పెస్టులు జరుగుతున్న పది రోజులైనా ఇది మాన గూడదా" అంటే "అలా మానడం డాక్టర్ను మోసగించడమే అవుతుం" దన్నాడు.

మనకు ఆలవాటుగా వున్న ఆహార విహారాదులు టెస్టులు జరుగుతున్న ప్పుడు మాన గూడదట. అలా మానడం ప్రమాద మట. ఇది ఈయన ఉద్దేశం. చికిత్స సమయంలో మాత్రం డాక్టర్ సలహాను పాటించా లంటాడు.

టెస్టు లన్నీ చేసిన తర్వాత, భీమన్నకు జబ్బేమీ లేదని తేల్చారు డాక్టర్లు. మరి డయేరియా సంగతి? అది అప్పటికి లేదు!

ఆస్పత్రి నుంచి వచ్చిన రెండో రోజునే కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సమావేశం కోసం మద్రాసు బైలు దేరాడు భీమన్న.

ఓరి బాబో, ఈ అందరికీ రోగాలే!
కుబేరులకూ గజ్జి కురుపులే,
యములాళ్ళకూ యమగండాలే!
ఈ మానవ లోకంలో
ఒకొక్కడి కొకొక్క రోగం!
పైకి బాగానే కనిపిస్తారు
లోపల ఏదో కుళ్ళు, ఏవో పుళ్ళు
అందమైన దంత పంక్తుల వెనక
గార పట్టిన పచ్చు పళ్ళు!
అరె, మన కవిగారు కూడ వచ్చాడే!
ఈయన కేం రోగమో?

— గుడిసెలు

205. గోపాలరెడ్డి గారి వాత్సల్యం

కళాస్రష్ట, ప్రధానంగా సాహితీ స్రష్ట, సర్వస్వతంత్రుడుగా వున్న ప్పుడే ఆ సృజన సోపాయమానం అవుతుంది. సృష్టిలో ఎన్ని రసాలు, వైర స్యాలు, ఆవేశాలు, వైరుధ్యాలు, ఉద్రేకాలు, ఉల్లాసాలు వుంటాయో అన్నీ స్రష్టకూ వుంటై. స్రష్టకు లేని గుణాలేవీ సృష్టికి వుండవు. సృష్టి గొప్పది కావా లంటే స్రష్ట గొప్పవాడై వుండాలి. సృష్టి రసవంతం కావా లంటే స్రష్ట రసాత్మకుడై వుండాలి.

కష్టపడితే గాని కడుపు నిండని, వైరవీ చేస్తే గాని పని జరగని, దాసోహం అంటేగాని దయ దొరకని లోకంలో స్వతంత్రంగా బ్రతకడం, ఏకాగ్రతతో సాహితీ సృష్టి కావించడం సహజంగా పేదవాడై వుండే కవికి సాధ్యమా?

గతం నుంచి వర్తమానం గుండా భవిష్యత్తులోకి దూసుకుపోయే బాణం లాంటి వాడు కవి. గతం కొడి దులిపి, వర్తమానాన్ని వెలిగించి, భవిష్యత్తుకు పచ్చదీపం చూపే వాడు కవి. సైంటిస్టుకు, సంస్కర్తకు కూడ కవి మార్గ దర్శకుడు. అట్టివాడు తన ప్రగమనంలో ఎన్నో ప్రతిష్ఠలకు, ప్రాభవాలకు, పలుకుబడి కల స్వార్థాలకు బాధ కలిగించవచ్చు. ఎందరి అసహనాలకో, ఆగ్రహాలకో గురి కావచ్చు. ఆత్మ రక్షణకు, శరీర పోషణకు ప్రాధాన్యం ఇవ్వని కవికి, ఆ రెండూ సమకూరే జాగ్రత్తను తీసుకునే ఒక భోజరాజు వుండడం అవసర మంటాడు భీమన్న.

భోజరాజు అనేది ఇక్కడ రూపకం. ఉదారుడు, ఉన్నతుడు, శక్తి సంపన్నుడు, సర్వ సమర్థుడు, రసజ్ఞుడు, రాజకీయమైన పలుకుబడి గల వాడు అయిన ఒక ఉత్తమ పురుషుడికి రూపకార్థంలో వాడిన మాట. ఒక్కొక్క కవికి, అతడి కార్యక్షేత్ర స్వరూపాన్ని బట్టి, ఈ భోజరాజు ఒక వ్యక్తి కాక, ఒక సంఘమో, ఒక పార్టీయో కూడ కావచ్చు.

భీమన్న ఈ విషయంలో కూడ చాల అదృష్టవంతుడు. బాపురెడ్డి, మాలకొండయ్య, రామానుజరావు, గణేశ్వరరావు, అమ్ములయ్య, పెరుమాళ్ళు, మాధవరావు, గోపాలరావు, పేములు, వంటి ఎందరి గౌరవ వాత్సల్యాలకో పాత్రుడైన వాడీయన. అయితే - అందరిలోను ఈయనకు అగ్రగణ్యుడైన భోజరాజు సాహితీ స్నేహితుడు బెజవాడ గోపాలరెడ్డి.

గోపాలరెడ్డి గారిని గురించి ప్రత్యేకంగా ఇక్కడ నేను చెప్ప నక్కర లేదు. ఒక అర్ధ శతాబ్దపు ఆంధ్ర సాహిత్య స్వరూపమే గోపాలరెడ్డి మూర్తి. అఖిల భారతాన్ని తన ఆస్థానంగా చేసుకొన్న సరస్వతీ స్వరూపు డాయన. భీమన్నను ఎదుగుతున్న కవిగా ఆయన ఏనాడు గుర్తించారో, ఆనాటి నుంచీ బహుముఖంగా ప్రోత్సహించుకొంటూ వస్తున్నా రీయనను.

1974 ఫిబ్రవరిలో , కేంద్ర సాహిత్య అకాడమీ రీజినల్ సలహా సంఘం సమావేశంలో పాల్గొనడం కోసం భీమన్న మద్రాసు వెళ్ళి , రాయపేట లోని చంద్రా హోటల్‌లో మకాం పెట్టాడు . అదే పనిమీద వెళ్ళిన పోతుకూచి సాంబ శివరావు గారు , దివాకర్ల వెంకటావధాని గారు కూడ అదే హోటల్‌లో దిగారు . ఈ ముగ్గురిదీ మొదట ఒకటే గది . ఆ మరునాడే ఆ ఇద్దరూ వచ్చి వేయడం వల్ల , భీమన్న సింగిల్ రూం లోకి మారాడు .

పద్దెనిమిది సంవత్సరాల అనంతరం మళ్ళీ అదే భీమన్న మద్రాసు వెళ్ళడం . ఒక నాలుగు రోజుల పాటు ఆయా ప్రాంతాలలో గత స్మృతులతో గడిపి రావాలను కొన్నాడు . అయితే , అసలే ఆనారోగ్యం , మళ్ళీ అకాల భోజనం వంటి వాటివల్ల సుస్తి చేసి , అనుకొన్నంతగా ఆనుభ వించలేక పోయాడు .

మిత్రుడు మోదుకూరి సినీ రంగంలో స్థిరపడి , మూడు పువ్వులు గా వుంటున్నా డప్పటికే . ఆ నాలుగు రోజులూ ఆయన స్నేహంలో గడిపాడు భీమన్న . మిత్రుడు ఎల్లోరా సహకారం కూడ ఎంతో బలాన్ని సమకూర్చింది .

మద్రాసు నగరం చాల మారి పోయింది . పెద్ద పెద్ద భవనాలు , కాల నీలు అవతరించాయి . అందం ఇనుమడించింది . కాని , హృదయం ముడుచుకు పోయింది . అఖిల భారత , అంతర్జాతీయ స్వభావం , స్వరూపం గల మహా నగరం స్థానిక పట్టణమై పోయింది . అందుకు కారణం అంతా తమిళమయం కావడం ! తమిళం తెలియని వాళ్ళకు అక్కడ ఏది ఏమిటో అర్థం కాకపోవడం . స్వభాషా దురభిమానం , ఆంగ్ల భాషాద్వేషం ఎంత ఆత్మ నాశనకరాలో ప్రత్యక్షంగా చూడాలంటే నేటి మద్రాసును చూడా లంటాడు భీమన్న .

ఈ మద్రాసు యాత్రలో భీమన్నకు లభించిన భాగ ధేయం వాణీ మహల్‌లో అనకోకుండా లభించిన సన్మానం-గోపాలరెడ్డి గారిచే .

పద్మభూషణ బిరుద భూషణుడైన బి. ఎన్ రెడ్డిగారికి ఆ సాయంత్రం సన్మానం . వాణీ మహల్ నిండి కిటకిట లాడుతూ వుంది . ఆ కార్యక్రమంలో

భీమన్నది కావ్యగానం. ఆయనకు సన్మానం, ఈయన కావ్యగానం తర్వాత ఒక నాటిక అదీ కార్యక్రమం. అధ్యక్షులు గోపాలరెడ్డిగారు. స్వాగతం ఆరుద్రగారి రామిలక్ష్మి గారు.

భీమన్న ఆనారోగ్యంగా వుండడంవల్ల ముందు ఈయన కావ్యగానమే పెడదా మనుకున్నారు గోపాలరెడ్డిగారు. తాను చివరివరకు వుండగల ననీ, ముందు బి. ఎన్. గారికి సన్మానం జరిపించ మనీ కోరాడు భీమన్న. మహా వైభవంగా సన్మానం జరిగిం దాయనకు. తర్వాత భీమన్న కావ్యగానం.

అప్పుడే అచ్చయివచ్చిన "గుడిసెలు"నుంచి కవితాగానంచేస్తూ "నిరంకుశాః పొడ్యుసరాః" చదివేటప్పటికి సిసీజనంతో క్రిక్కిరిసివున్న ఆ హాలంతా హర్ష ధ్వానాలతో పిక్కటిల్లి పోయింది. మధ్య మధ్య "ఇది వైకుంఠము" వంటి పద్యాలను రాగవరసతో చదువుతూ, చివరకు "బొమ్మ" గేయాలు పాడే సరికి, సభయావత్తూ సానందచిత్తమై మత్తిల్లిపోయింది. గోపాలరెడ్డిగారి ఉదార భోజహృదయం ప్రశంసా పరిమళ వసంత మయూరమై నాట్యంచేసింది.

అక్కడున్న పూలదండ లన్నీ భీమన్న మెడలో పడేసి, తన శాలువా తీసి కప్పి, కుంకుమ దిద్ది, అక్షతలు పోసి, గోపాలరెడ్డిగారు ఒక అరగంట పాటు భీమన్నపై ఆషాఢమేఘంలా కురిపించిన ప్రశంసల అమృతవృష్టిని ఎలా వర్ణించడం? ఆ వెల్లువలో మునిగి భీమన్న ఉక్కిరిబిక్కిరై పోయాడంటే అది అక్షరాలా స్వభావోక్తి.

ఎనమండ్రె కృష్ణయా
యని కొల్వులో కవులు,
అఖిల భారతము నీ
యస్థానమే నేడు
గోపాల రెడ్డ్యగ్రణీ! సాహితీ
భూపాల దీవ్యన్మణీ!

—మానవుని మరొక మజిలీ (అంకితం)

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

విద్యావిలాస సర్గ

205. చందన సరస్వతి

1974 కూడ సన్మానాల సంవత్సరంగానే గౌరవించింది భీమన్నను. ఒక్కొక్క సన్మానం గురించి ఒక్కొక్క ప్రకరణమే వ్రాయవచ్చు. అట్టి కృషిని భవిష్యత్తుకు వదిలేస్తున్నాను. ఇక్కడ ముఖ్యమైన వాటిని గురించి పేర్కొంటున్నాను.

మార్చి నెలలో ఏలూరు తెలుగు దర్బారువారు సన్మానం చేశారు. కురెళ్ళ లక్ష్మణరావుగారి సారధ్యంలోని సంస్థ అది. అయినా అప్పు డక్కడ వున్న జిల్లా రెవిన్యూ అధికారి వసంతకుమార్, జిల్లా వైద్యశాఖకు చెందిన కపాలేశ్వర రావు గార్లు ఈయనపట్ల చూపిన గౌరవాదరణలు చాల గొప్పవి.

ఏప్రెల్‌లో "గుడిసెలు కాలిపోతున్నై" కావ్యావిష్కరణసభ జరిగింది. అధ్యక్షులు రామానుజరావుగారు, ఆవిష్కర్త గోపాల రెడ్డి గారు. కావ్య పరిచయం అవధాని గారు. అంకితం కేంద్రమంత్రి జి. వెకటస్వామి గారికి. ఉపన్యాసకులలో ముఖ్యులు రాష్ట్ర మంత్రి కోడాటి రాజమల్లు, కొలకలూరి, ఎమ్. ఎన్. భూషి. స్వాగతం బాపురెడ్డి. ఆద్యంతాలు-అంటే ప్రార్థన, వందన సమర్పణ నేను. ఎంతో వైభవంగా జరిగిన సభ అది.

అక్టోబరులో తెలుగు అకాడమీయొక్క గవర్నింగు బాడీలోనూ, ఆకడమిక్ వ్యవహారాల సంఘంలోను సభ్యత్వం లభించింది భీమన్నకు. మండలి వెంకటకృష్ణారావుగారు విద్యామంత్రి అయితే తప్ప భీమన్నకు న్యాయం జరగ లే దన్నమాట! నిజానికి తెలుగు అకాడమీని నిర్వహించగల అర్హత ఒక్క భీమన్నకే వుంది. అర్హతను గుర్తించడానికి స్థానిక నాయకులకు రాగద్వేషా లడ్డువచ్చా యంతవరకు.

భీమన్నకు జరిగిన గొప్ప సన్మానాలలో ఈ సంవత్సరం అక్టోబరు 19న జరిగిన బెంగుళూరు సన్మానం ఒకటి. అఖిలభారత తెలుగు రచయితల ఆరవ మహాసభ జరిపిన ఆ సన్మానం వైభవాన్ని ఇక్కడ వర్ణించడం సాధ్యంకాదు.

ఆ సభల కోసం బెంగుళూరు వెళుతూ, రైల్లో ఈయన వ్రాసిన "గుంట కల్లు కవితలు" ఆనాటి కవి సమ్మేళనలో గొప్ప అలజడిని సృష్టించినై. గుంటకల్లు స్టేషను గురించి "ఏ గుంట కల్లైతే నేం?" అని ఈయన చేసిన కవిత్వ కరణ, దానిలోని వ్యంగ్యాలు సహృదయ రంజకా లైనై. కర్నాటక మంత్రీ ఆ సభల ఆహ్వాన సంఘాధ్యక్షులూ అయిన రంగనాథ్ గారింట్లో ఉదయోప విందు సమయంలో - ఆ కవితలను మళ్ళీ మళ్ళీ చదివించుకొని విన్న వారిలో కృష్ణవేణీ సంజీవయ్య, నామదేవ్, చక్రపాణి, పోతుకూచి వంటి వారెందరో వున్నారు.

బెంగుళూరు సభలలో భీమన్నకు సహచరుడుగా, సహాయకుడుగా వున్న వాడు ఎమ్. ఎన్. భూషి. ఆయనతో కలిసి ప్రసిద్ధ హరిజన నాయకుడైన బసవ లింగప్ప గారింట ఆరగించిన విందు, గడిపిన కాలం భీమన్నకు చిర స్మరణీయం. ఆ మరునాడు కూడ బసవ లింగప్ప గారితో గడిపాడు భీమన్న. అన్నట్టు మంత్రి రంగనాథ్ కూడ హరిజనే.

భీమన్నకు అక్కడ ఏర్పడ్డ మరో ముఖ్య స్నేహం వి. టి. రాజశేఖర శెట్టి గారితో. ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చీఫ్ రిపోర్టరు. ప్రథమ దర్శనంలోనే ఏర్పడి చిరస్థాయిగా నిల్చిపోయిన స్నేహ మది. అనుకోని రీతిగా వా రింట మధ్యాహ్న భోజనానికి కూర్చోబెట్టి, పశ్చిమ తీరం నుంచి వచ్చిన రొయ్యల కూరను వడ్డించి నప్పుడు, భీమన్న త్రిల్లయి అన్నాడు "నేను తూర్పు తీరం

వాణ్ని . పశ్చిమ తీరం రొయ్యలు మీ యింట తినడం ఎంతటి అదృష్టం" అని . తూర్పు పడమర సమైక్య మయింది వారి గృహం ఆ విధంగా . శెట్టిగారు మంచి రచయిత . గొప్ప విప్లవ వాది .

అక్కడి నుంచే ఒక రోజున హోసురు వెళ్ళి వచ్చాడు భీమన్న . అది తమిళ నాడు లోది . తెలుగు జనం ఎక్కువ . బెంగళూరుకు దగ్గర . అక్కడ శాసన సభ్యుడు ప్రసిద్ధ తెలుగు నాయకుడు కోదండ రామయ్య గారు . లింగం మాల కొండయ్య గారు ఏర్పాటు చేసిన విరేశ లింగం వర్ధంతి సభ ఆది. ఆంధ్రప్రదేశ్ విద్యా మంత్రి కృష్ణారావు గారు , గోపాల రెడ్డి గారు , పోతుకూచి , బాపురెడ్డి , కృష్ణంరాజు ముగ్గురూ పాల్గొన్నా రా సభలో . సభానంతరం తక్కినవా రంతా అక్కడి పూల దండలను అక్కడే వదిలేసి రాగా , భీమన్న తన మాలను బెంగుళూరుకు మోసు కొచ్చాడు . సుగంధ రాజం పువ్వులవి . ఆ సాయంత్రపు సాహితీ సభను , సభలోని మహిళా మణులవేణీ బంధాలను సుగంధ భరితం చేశాయా మాల పూలు .

ఈ బెంగుళూరు యాత్రలో భీమన్నను పరమానందంలో ముంచెత్తిన సన్మానం కన్నడ సాహిత్య పరిషత్తు వారు చేసినట్టిది . ఆ సభకు కూడా గోపాలరెడ్డి గారే అధ్యక్షులు . ఆ సభలో కన్నడ సరస్వతి తన ప్రతిరూపమైన చందన సరస్వతిని బహూకరించింది భీమన్నకు . ఆ ప్రతిమను ఎదుట ఉంచుకొనే " ఓ వాసంతిక నంచు " అనే పద్యం వ్రాసుకొన్నాడు భీమన్న ఆ రాత్రి .

ఆ సంవత్సరం నవంబరులో అనంతపురంలోను , డిసెంబరులో వరంగల్లులోను మంచి సన్మానాలు జరిగాయి భీమన్నకు . అనంతపురంలో ఈలపాట రఘురామయ్య గారితో కలిసి గడిపిన ఆ వారం రోజులూ సంగీత సాహిత్య నందన విహారాలు అక్కడి ఆఫీసర్లు డి . రామకృష్ణయ్య , పి . చెల్లారావు , పి . జి . కేంద్రపు కొలకలూరి వంటి వారి మర్యాదలు ఆస్వితీయ సుఖ సంతోష ప్రదా లైనై . పి . జి . కేంద్రంలో భీమన్న ప్రసంగానికి విద్యార్థుల హర్షధ్వానాలతో బల్లలు పగిలినై . సిగ్గు , భయం అన్నీ వదిలేసి , రఘురామయ్య గారితో పోటిపడి భీమన్న పద్యాలు పాడిన రోజు లవి .

రఘురామయ్య లాంటి సహృదయ గాయకుడితో రెండు మూడు నెల లైనా కలిసి వుండే అదృష్టం పట్టి వుంటే, తా నే నాడో మంచి గాయకుడై వుండే వాడి ననకొంటూ వుంటాడు భీమన్న ఈ నాటికి.

వరంగల్లు సన్మానం భీమన్నకు సంపాదించి పెట్టిన స్నేహం టి. గోపాల రావు గారితో. ఆయ నప్పు డక్కడ జిల్లా రెవిన్యూ అధికారి. గొప్ప సాహితీ హృదయుడు.

డిసెంబరు 18 - 21 తేదీల మధ్య బెంగుళూరు వైట్ ఫీల్డులో, ఎక్యూమినికల్ సెంటర్ వారు ఏర్పాటు చేసిన సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్నాడు భీమన్న. "తెల్లటి పొలంలో ఎర్రటి గులాబీలు" అన్న ఈయన ఆంగ్ల కవిత అక్కడ జరుగుతున్న కృషికి దర్పణం పట్టింది. తనతో పాటు ఆ సమ్మేళనంలో పాల్గొన్న లత, కొలకలూరి, దాసుబాబు, ఆంజనేయులు గార్లతోను ఆ సమయంలోనే అక్కడకు వచ్చి వున్న బాపురెడ్డి గారితోను భీమన్నకు సరదాగానే కాలం గడిచింది. ఆ సెంటరు అధినేత ఫాదర్ థామస్ గారి ప్రేమాదరాలు, విశ్వమానవ దృష్టి ఎంతో ప్రశస్తి లంటాడు భీమన్న.

పెదవి పై వాగ్దేవి
పదవిలో శ్రీదేవి
ఆ కొన్న లోకాని
కన్న పూర్ణ దేవి
ఎవ్వరని వెదకి నాను, నీ యంచె
ఎల్లరను కాంచినాను!

—బొమ్మ

206. ఢిల్లీ ఆకాశవాణి

ప్రతి సంవత్సరమూ రిపబ్లిక్ ఉత్సవ సందర్భంలో ఢిల్లీ ఆకాశవాణి ఆధ్వర్యంలో జాతీయ కవి సమ్మేళనం జరుగుతుంది. తెలుగు, కాశ్మీరీ, బెంగాలీ వగైరా ఒకొక్క జాతీయ భాషకు ఒకొక్క కవి చొప్పున పాల్గొంటూ రాసమ్మేళనంలో. ప్రతి భాషా కవితా తక్కిన అన్ని జాతీయ భాషలలోకి వెంట

వెంటనే అనువదించ బడుతూ వుంటుంది . 1975 రిపబ్లిక్ దినోత్సవ జాతీయ కవి సమ్మేళనలో తెలుగుకు భీమన్న ప్రాతినిధ్యం వహించి ఢిల్లీ వెళ్ళాడు .

ఢిల్లీలో మకాం ఆంధ్ర గెస్టుహౌసులోనే . స్టాఫ్ క్వార్టర్స్‌లో ఒక రూంను రిజర్వు చేసుకొని వెళ్ళడంవల్ల వెళ్ళిన పని ఒక్క రోజేగాక , మరో నాలుగు రోజులు అక్కడ వుండి వచ్చే అవకాశం కలిగింది . రిపబ్లిక్‌డే ఉత్సవ సమయం కాబట్టి , ఏడిద గోపాలరావు , టి . వి . కృష్ణారావు వంటి మిత్రులున్నారు కాబట్టి , కాలం ఉత్సాహంగా గడిచిపోయింది .

సాధారణంగా భీమన్న టూరు వదిలి వెళ్ళడు . తప్పనిసరిగా వెళ్ళవలసి వస్తే , దానిని వినోదయాత్రగా మార్చుకొని ఆ ప్రాంతమంతా చూచి వస్తాడు . అక్కడి వినోదా లన్నిటినీ అజ్ఞాతంగా అనుభవించి వస్తాడు . సహజంగా డబ్బు లేనివాడు కనుక , అతితక్కువ డబ్బుతో అత్యధిక భోగం సమకూర్చుకోవలసిన వాడు కనుక , సాధారణంగా ఒకటవ తరగతి భత్యం ఇచ్చినా రెండవ తరగతిలోనే ప్రయాణం చేస్తాడు . అయినా సరే , ప్రతి ప్రయాణంలోనూ చేతిడబ్బు ఖర్చవుతూనే ఉంటుంది .

జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొనడం ఒక ట్రిల్లింగు అనుభవం భీమన్నకు . జనవరిలో ఢిల్లీ చలి సంగతి తెలుసు . అయినా లెక్కచెయ్యడు . ఉన్నిదుస్తులు లేవు . పూర్వం ఖద్దరు ధరించేవాడు . రిట్రై రయింతర్వాత దోబీ ఖర్చు తగ్గించడంకోసం టెరిలిను వాడుతున్నాడు . ఈ విషయం తెలిసిన బాపురెడ్డి తన ఉన్ని ఓవరుకోటును , టోపీని ఇచ్చాడు భీమన్నకు . వాటిని తప్పక పట్టుకెళ్ళాడే కాని , ఈయన వాటిని అక్కడ ఉపయోగించుకొననే లేదు.

ఆనాటి కవి సమ్మేళనంలో చదవడం కోసం ఎంచుకోబడిన కవీత "దేశం ముందడుగు వెయ్యాలి" అనేది . అంతకు ముందు ఆకాశవాణిలో భీమన్న చదివిన కవితల నుంచి ఆకాశవాణి వారే ఎంపిక చేసిన కవిత అది .

ముందుగా కవిని ఎంపిక చేసి , కవిత కావాలని కోరితే - జాతీయ కవి సమ్మేళనకు ఉత్తమ కవితలు వస్తా యని భీమన్న ఉద్దేశం . అలానే "ఈ మాసపు పాట ", "ఈ పాట నేర్చుకొందాం" వగైరా శీర్షికలకు ప్రసిద్ధ కవుల

నుంచి అత్యుత్తమ గేయాలను ఎంచుకోవాలని భీమన్న సలహా. అయితే, ఈయన సలహాలు కలహాలను మాత్రమే తేగలిగాయి!

సరే! ఏదో జరిగింది. జరగక పోతే మాత్రం ఏం చేస్తాం? తన లాంటి దిక్కు-లేని వాళ్ళు ఏది జరిగినా మంచికోసమే అనే మన స్తత్వాన్ని అల వరచుకోవాలంటాడు భీమన్న. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో వున్నన్ని రాగద్వేష తత్వాలు, అహంకార నిరంకుశత్వాలు, పదవీ రాజకీయ రంగంలో కూడ లేవు. ఇప్పటి కైనా తన పేరు డిల్లీదాకా వెళ్ళింది. అంతే చాలు. అదీ భీమన్న తర్క సరళి.

డిల్లీ వెళుతూ రైల్లో చూచుకొన్నాడు భీమన్న - తన కవితనూ, దానికి రేడియో వా రిచ్చిన ఇంగ్లీషు అనువాదాన్నీ. తన కవిత - ఏదో - ఫర్వాలేదు. ఎప్పుడో మరో సందర్భానికి ప్రాసివ కవిత అది. దాని ఆంగ్లానువాదం చూచి భీమన్న చకితు డయాడు. ఆదేమిటో తనకే అర్థం కాలేదు. ఇంగ్లీషు నుంచి కదా తక్కిన భాషల్లోకి వెళుతుంది? ఇక ఆ అనువాదా లెలా వుంటాయో!

తెలుగులో తన పెద్దపులి ఇంగ్లీషులో పొట్టే లయింది. ఇక తక్కిన భాష ల్లోకి మారే టప్పటికి ఏయే ఆకారాలు తాలుస్తుందో! ఈ భావం రాగానే వణికి పోయాడు భీమన్న.

ఇంగ్లీషులోకి తానే ఆనువదించుకొన్నాడు తన కవితను. రైల్లో తనతో పాటు ప్రయాణం చేస్తున్న ఉత్తరాది యువకులు దాన్ని విని ఎంతో ఆనందిం చారు. రైలు పొడుగునా కావ్యగానమే అయింది.

ఢిల్లీ చేరగానే భీమన్న చేసిన మొదటి పని తన ఆంగ్లానువాదాన్ని ట్రైపు చెయ్యించడం. ఈ విధమైన పనులకు, తదితర సహాయాలకు డిల్లీలో కుసుమ ఆనందరావు గారు ఈయనకు తోడు నీడ. ఆ ట్రైపు ప్రతిని అక్కడ హిందీ అనువాదకుడికి అందివ్వాలని భీమన్న ఎంత ప్రయత్నం చేసినా, ఆయ నెవరో చివరి ఘణం వరకు కనిపించలేదు!

అయితే - ఆ అనువాదకుడు అక్కడ తన మిత్రుడైన వేమూరి ఆంజ నేయ శర్మగారి వద్దకు వెళ్ళి, తెలుగు నుంచి నేరుగా హిందీలోకి అనువదించు కొన్నాడని తెలిసిన తర్వాత, భీమన్న మనసు కుదుట పడింది.

కవి సమ్మేళనం అద్భుతంగా రక్తి కట్టింది. సభా సదు లంతా హిందీ వాళ్ళే. వా శ్నివళ్ళకీ ఇతర భాషలు రావు. ఇతర భాషల వాళ్ళకు ఎక్కువగా ఈ ప్రోగ్రాం సంగతి తెలియదు. ఆహ్వానాలు అందవు. సభలో నూటికి నూరు శాతం హిందీ వాళ్ళదే ఆధిపత్యం. సమ్మేళనలో పాల్గొనే కవులు ఒక్కొక్కడే తన మాతృ భాషలో కవిత పఠించగా, ఆ వెంటనే దాని హిందీ అనువాదం వినిపించ బడుతుంది. సాధారణంగా హిందీ, ఉరుదూ కవితలకు తప్ప సభా సదుల నుంచి హర్ష ధ్వానాలు రావుట! అయితే, భీమన్న కవితకు మాత్రం ఆ రెండు భాషల కవితల కంటె కూడ ఎక్కువ హర్ష ధ్వానాలు వచ్చాయి. తెలుగుకు జరిగిన పట్టాభిషేకానికి ఎంతో గర్వ పడ్డాడు భీమన్న.

ఆ యాత్రలో భీమన్న ఢిల్లీకోని చాల మంది మిత్రులను, సంస్థలను దర్శించాడు. అందులో కరోల్ బాగ్‌లోని సంజీవయ్య స్మారక సంస్థ ఒకటి. ఢిల్లీలో హరిజన పేటలను, అక్కడి స్థానిక హరిజనులను కలుసు కోవడం భీమన్నకు ఇదే మొదటి సారి. ఆ సంస్థ అభివృద్ధికి సంగీతరావుగారు చేస్తున్న కృషికి, అక్కడి హరిజన యువకుల ఉత్సాహానికి ఎంతో సంతోషించాడు భీమన్న.

ఢిల్లీనుంచి తిరుగు ప్రయాణం రోజున ఆ సాయంకాలం ఢిల్లీ ఆంధ్ర మిత్రులు భీమన్నకు సన్మానం చేశారు. కె. వి. భాస్కరరావు, కోట పున్నయ్య, రమాదేవి, వేమరాజు భానుమూర్తి, చక్రం, ఎమ్. ఎస్. భూషి మున్నగు మిత్రులు భీమన్న సాహిత్య కృషిని ఆగిస్తూ ప్రసంగించారు.

ఇక్కడ భీమన్న జీవితంలో నభూతో నభవిష్యతిగా జరిగిన ఒక సంఘటన గురించి చెప్పాలి. భీమన్నకు చిరకాల మిత్రుడూ ఈయన సలహా సహకారాలను నిత్యమూ పొందుతున్నవాడూ అయిన ఒక విద్యావంతుడు ఒక ఉద్యోగ ప్రయత్నంలో భీమన్న కూడా ఢిల్లీ వెళ్ళాడు. తాను భీమన్నకు సహాయకుడుగా, కార్యదర్శిగా వ్యవహరిస్తా నన్నాడు. ఢిల్లీలో భీమన్న పలుకు బడిని తనకోసం ఉపయోగించాలి. అదీ అతడి కోరిక. ఖర్చులు ఎవరివి వారివే.

అతడు మరో కోరిక కోరాడు. తాను జీవితంలో చాల పైకిపోవా లను కొంటున్నాడు కనుక, భీమన్నతో కలిసి వుండే అవకాశం ఇంత అనుకూలంగా

మరొకసారి కలుగక పోవచ్చు కనుక , తనలో ఏమైనా లోపా లుంటే నిర్మొగ మాటంగా చెపుతూ వుండవలసిందిగా ఈయనను కోరాడు . ముందు ఒప్పుకోలే దీయన . బలవంతం చేశా డతడు .

సరే అని ఒప్పుకొని , అతడి ప్రవర్తనలో దోషం కనిపించి నప్పుడెల్లా దానిని ఎత్తిచూప సాగా డీయన . ఈయన ఊహించినట్టే అది అతడిలో అహాన్ని ప్రేరేపించి , ద్వేషాన్ని రెచ్చగొట్టింది .

అక్కడ ఆకాశవాణివారు భీమన్న కిచ్చిన చెక్కుకూడ అతడిలో అసూయను రగుల్కొల్పింది . దానిని అక్కడే మార్చమన్నాడతడు. చెక్కును ఢిల్లీకో మార్చుకోవద్దని ఇక్కడ వేలూరి సహజానందగారు ఇచ్చిన సలహా జ్ఞాపకం వచ్చింది భీమన్నకు . అతడు భీమన్నతోనే వున్నాడు కనుక , ఆ వారం రోజుల భోజనవసతుల బిల్లు ఇద్దరికీ కలిపి భీమన్నపేర వచ్చింది . తనవద్ద డబ్బులే దన్నాడతడు . భీమన్న అన్నిరోజులు ఢిల్లీలో వుండడానికి ముఖ్య కారణం అతడి పనే . భీమన్న పబుకుబడి , దానివల్లవచ్చే అన్ని సౌకర్యాలు అతడి కుపయోగపడినై . ఆదే మరొక రాజకీయ నాయకుడైతే అతడిచేత వేలు ఖర్చుపెట్టించేవాడు . తన పని చేసిపెడుతూ , తన ఖర్చుకూడ భీమన్నే భరించా లట ! మెత్తనివాణ్ని చూస్తే మొత్తబుద్ధి అనే దిదే నేమో !

అతడిలో రగులుతున్న ద్వేషం తిరుగు ప్రయాణంలో రైలెక్కగానే ప్రబద్ధలై , లావాలా ముంచెత్తింది . ఆశ్చర్యపడలేదు భీమన్న . అతడు తెగబడి తిట్టేకొలదీ ఈయన మౌనం వహించాడు . అన్ని బండ బూతులు జీవితంలో ఈయ నెప్పుడూ తినలేదు . నిర్వికారత వహించాడు . చిరునవ్వుతో స్వీకరించాడు . మనిషి ఆరోగ్యానికి ఎప్పుడూ తీపే పనికిరాదు . అప్పుడప్పుడు కారమూ , కషాయమూ తగులుతూ వుండవలసిందే .

నిజమాడితే నిష్ఠూరం అనే సామెత ఎప్పుడు ఎలా పుట్టిందో కాని-మానవ జాతిని నాశనం చేసింది . నిజం నిషేధించబడి-మూఖప్రీతి కరమైన వంచిమాగధ భజన కళ సింహాసన మెక్కి కూర్చుంది !

మనుసులోని దెల్ల మాటాడ గూడదు
చెప్పినట్టి దెల్ల చేయరాదు.
మాయలేని వాని మనసీదు లోకమ్ము
విశ్వ భోగధామ వినుర భీమ

భీమ శతకం

207. జీవన నైరం తర్యం

పెద్దమ్మాయి డాక్టర్ విజయభారతి పెళ్ళి భీమన్న చేతి మీదు గానే జరిగింది. హైదరాబాదు బ్రహ్మ మందిరంలో, బ్రహ్మర్షి తారకం గారు అచార్యత్వం వహించగా - మంత్రి ఆరిగె రామస్వామి గారు, ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి దంపతులు, దేవులపల్లి రామానుజరావు గారు, వీణ వంక సుధాకర రెడ్డిగారు, పండితులు, కవులు, అనేకమంది మిత్రులు పాల్గొని దంపతుల్ని ఆశీర్వదించిన మహోత్సవం అది.

విజయలక్ష్మి పెళ్ళికి భీమన్న పిలువబడనే లేదు.

డాక్టర్ వర్మ పెళ్ళి 1975, ఫిబ్రవరి 16న తిరుపతి కొండల మీద జరిదింది. భీమన్న పెళ్ళికి వెళ్ళే ధోరణిలో లేకపోతే, పెళ్ళి కొడుకు వర్మ, పెద్దల్లుడు తారకం వచ్చి, ఒప్పించి తీసుకు వెళ్ళారు. అదంతా మళ్ళీ ఒక కథ.

నెల్లూరుకు చెందిన పార్లమెంటు సభ్యుడు దొడ్డవరపు కామాక్షయ్య గారి అమ్మాయిలతో డాక్టర్ గిరిజకు శాసన సభ్యుడు డాక్టర్ లింగయ్య, వసంతకు డాక్టర్ వర్మ కోరి చేసుకున్న కథ. ఆ రెండు పెళ్ళిళ్ళు కొండమీద ఒకే పందిట్లో జరిగాయి. భీమన్న ఒక వినోద యాత్రకు వలె ఆనందించి వచ్చిన తిరుపతి ప్రయాణ మది.

"బొమ్మ" కావ్యం ఆవిష్కరణ, అంకితం సభ ఆగస్టులో జరిగింది. రామానుజరావు అధ్యక్షులుగా, గోపాలరెడ్డి గారు ఆవిష్కర్తగా, అవధానిగారు కావ్య పరిచయితగా-పాలగుమ్మి విశ్వనాధం, డాక్టర్ విశ్వం, డాక్టర్ దాశరధి మున్నగు వారు వక్తలుగా మహా వైభవంతో బాపు రెడ్డికి అంకిత మిచ్చాడీ కావ్యాన్ని భీమన్న.

భీమన్నకు తన రచనలలో అత్యంత ప్రియమైంది బొమ్మ. అంత అందంగాను ముద్రించబడి, అంత వైభవంగాను సభా సమ్మానిత అయిండి- అంత ప్రియమైన మహా వ్యక్తికి అంకితంగా!

అసలు ఈ ఆవిష్కరణ అంకితోత్సవాన్ని తిరుపతిలో – సాహిత్య అకాడమీ కార్యవర్గ సమావేశాలు అక్కడ జరిగినప్పుడు - జరిపించా లనుకున్నాడు భీమన్న. అది కొనసాగలేదు. ఆ సమావేశాల సందర్భంలో భీమన్నకు చిర స్మరణీయమైన సంఘటన అక్కడి ఇంజనీరింగు కాలేజీలో తన కావ్యగానం. భీమన్న ఒక్కొక్క కవిత చదువుతుంటే, బొమ్మ గేయాలు పాడుతుంటే – విద్యార్థులు అనందం పట్టలేక హర్షధ్వానాలతోపాటు ఐల్లలు కూడ ప్రబద్దలు కొట్టారు, కొందరు ఈలలువేస్తూ ఐల్ల లెక్కి నాట్యం చేశారు.

"కవితాగానం సభను ఇంతగా పరవళ్ళు త్రొక్కించ గలదని నే నెన్నడూ వూహించ లేదు" అన్నారు కాలేజి ప్రిన్సిపాలు గారు, భీమన్నను ప్రశంసిస్తూ.

కేంద్ర సాహిత్య అకాడమీ ప్రాంతీయ సలహా సంఘ సమావేశం మద్రాసులో జరిగినప్పుడు, అక్కడ జరిగిన కవి సమ్మేళనలో 'శిల – శివం' అనే కవిత చదివాడు భీమన్న. అది ఆ ముందు రాత్రి రైలు ప్రయాణంలో ప్రాసి నట్టిది. అది ఎంతగా సభారంజక మయిందంటే - అక్కడ చాలా మంది దాని కాపీలను తీసుకొన్నారు. గొల్లపూడి నూరుతీరావు గారు ఆహ్వానించి ఆకాశ వాణిలో పాడించుకొన్నారు. ఆ తర్వాత మోదుకూరి జాన్సన్ గారి గృహావ రణలో జరిగిన యువజన సమావేశంలో చదివించు కొన్నారు.

వేరే పని మీద అక్కడికి వచ్చి, ఆ సమ్మేళనంలో పాల్గొన్న కాపురెడ్డి గారితోను, మోదుకూరి జాన్సన్, అయన తమ్ముడు చిట్టిబాబు గార్లతోను కులాసాగా గడిచిపోయినై భీమన్నకు అక్కడ ఆ రోజులు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిని చూడడానికి వెళ్ళాడు భీమన్న. ఆయన ఎంతో సంతోషించారు. కళ్ళు చెమ్మగిల్లినై.

"నాకు మద్రాసులో ఆత్మీయులు నలుగురు. ఇక్కడకు వచ్చి నప్పు డెల్లా వారి ఒడిలో ఓలలాడి పోతుంటాను" అన్నాడు భీమన్న.

అంత లైనై శాస్త్రిగారి కళ్ళు. జాన్సను ప్రక్కనే వున్నాడు.

"ఒకామె బీచి, మరొకామె అడయారు మ్రిరి. ఒకడు మోదుకూరి జాన్సను. మరొకడు దేవులపల్లి కృష్ణశాస్త్రి!"

అప్పుడు శాస్త్రిగారి ముఖం చూడాలి! అదొక మహాకావ్య దర్శనం!

"మనలో ఎన్ని అభిప్రాయ భేదా లున్నా, మనం ఒక కుటుంబం వాళ్ళం" అన్నారు శాస్త్రిగారు - భీమన్న పీపు స్పృశిస్తూ.

అప్పుడు చెమ్మగిల్ల వలసిన వంతు భీమన్న కళ్ళ దయింది.

గతానికి సంబంధించి - దుర దృష్టాలు, దుస్సంఘటనలు, దుష్టుల ఆప కారాలు, ఏవీ జ్ఞాపకం వుండవు భీమన్నకు. అటువంటి కష్ట నష్టా లన్నిటినీ ఎప్పటి కప్పుడు మరపు అనే చెత్త కుండీలోకి విసిరి పారేస్తూ వుంటాడు. తన సువర్ణమయ స్మృతి పేటికలో చాల విలువైన, ఆందమైన, ఆనందప్రదమైన అనుభవాలను మాత్రమే భద్ర పరచు కుంటాడు.

గతంలో తనకు ఆనందాన్ని ఇచ్చిన వ్యక్తులను కలుసుకొన్నప్పుడు వర్త మానాన్ని గతంలోకి తీసుకు పోతాడు. ప్రాంతాలను దర్శించినప్పుడు గతాన్ని వర్తమానంలోకి తీసుకు వస్తాడు. గతంలోను, వర్తమానంలోను, భవిష్యత్తు లోను కూడ ఏక కాలంలో వాస్తవంగా జీవించే ఒక నిత్య నిరంతర జీవన ధార భీమన్న!

మద్రాసు బీచి ఎప్పటిది? అప్పటిదేనా? ఇప్పటి దీ! ఎప్పటి దీ!

తడి ఇసుకతో ఎన్ని
గుడులు కట్టితిమో,
తరి పీతలకు ఎన్ని
చిరుతిండ్లు పెట్టితిమో

జ్ఞప్తి యున్నది బీచికి; నీపేరె
జపియించు నీనాటికి!

—బొమ్మ

208. పెద పులివర్రు యాత్ర

జీవిత యాత్రలో అనేక సంఘటనలు చాల కాజువలుగా జరుగుతాయి. అందులో కొన్ని చిత్రంగా యాత్రలోనే అనుకోని మలుపులు తెస్తాయి. భీమన్న జీవితంలో ఈ విధమైన సంఘటనలు అనేకం. అందులో పెద పులివర్రు యాత్ర ఒకటి.

పెద పులివర్రు లో తమ కాలేజీ వార్షికోత్సవాలు చెయ్యా లనుకొంటున్నా మనీ, ఆ సందర్భంలో జరిగే కవి సమ్మేళనలో పాల్గొనవలసిందిగా కోరడానికి తాను వచ్చాననీ అన్నా డొక వ్యక్తి భీమన్నతో ఒక రోజున ఇంటికి వచ్చి. మంచి వర్చస్సూ, తేజస్సూ కల ఆ వ్యక్తిని చూచి భీమన్న ఎంతో ఆహ్లాదం పొంది, వెంటనే ఆహ్వానాన్ని అంగీకరించేశాడు.

అయితే - భయంకరమైన ఆ పెద్దపులి వర్రు ఏక్కడిది? ఆ వ్యక్తి ఎవరు? ఆయనకు తన పేరూ, పత్తా ఎలా తెలుసు?

సిటీలో అందరికీ తాను తెలుసు. తాను లేకుండా సాధారణంగా ఏ సాహితీ సభా జరగదు. జిల్లాలలో జరిగే సభలకు తన పేరును సూచించే వారిలో ముఖ్యులు బాపురెడ్డి, మాలకొండయ్య, అవధాని గార్లు.

"అవధాని గారి వద్దకు వచ్చాను. వారు నాకు గురువులు. వారే నన్ను మీ వద్దకు పంపించారు." అన్నా డాయన. ఆయన పేరు డాక్టర్ నాదెళ్ళ వెంకట కృష్ణారావు. పెద పులివర్రు గుంటూరు జిల్లాలో, రేపల్లె తాలూకాలో వుంది - కృష్ణ ఒడ్డున. అది పూర్వం పెద్దపులులు తిరిగే అరణ్య ప్రాంతమే. నారాయణరెడ్డి గారు కూడ వస్తున్నా రట.

సభనాటి ఉదయానికి ఈ ముగ్గురూ ఎవరి మట్టుకు వారు విజయవాడ రైలుస్టేషనుకు చేరుకొంటే, అక్కడి నుంచి కారులో పెద పులివర్రు తీసు కెళ్ళా మని చెప్పి, ఫస్ట్లుకాసు టికెట్టు ఒకటి భీమన్న చేతిలో పెట్టి, పై ఖర్చుకు కూడ ఏదో యిచ్చి, వెళ్ళి పోయారు కృష్ణారావు గారు. ఆయన కార్యదక్షతా, సంస్కారమూ, లోకజ్ఞతా చూస్తూ ముగ్ధుడై పోయాడు భీమన్న.

* * *

"రైల్లో కూడ ప్రాతేనా? లే వయ్యా, స్వామి!" అన్నా రెవరో! తుళ్ళిపడి లేచి కూర్చున్నాడు భీమన్న. ఎదట నారాయణరెడ్డి!

భీమన్నది లోయరు బెర్తు. వెల్లికిలా పడుకుని, తలవద్ద గల చిన్న లైటు వెలుగులో, పుస్తకం పైకెత్తి పట్టుకొని, ఏదో పాట వ్రాసుకొంటున్నాడు భీమన్న.

బెర్తుమీద కూర్చుంటూ అన్నాడు నారాయణరెడ్డి-

"కాలు బెణికింది కదా. ఇంకా మానలేదు. నాకు ఆ చివర ఒక అప్పర్ బెర్త్ ఇచ్చారు. ఎలా ఎక్కడం? అక్కడి లోయరు వాణ్ని అడిగాను. అతడు తన కాలు చూపాడు. ఇంకా పెద్ద బేండేజీ వుంది దానికి. ఇక మీకు తప్పదు."

చాల సంతోషించాడు భీమన్న. ఆ కుపేలో తక్కిన మూడు బెర్తులూ కూడ అప్పటి కింకా ఖాళీగానే వున్నాయి. అంతలో అక్కడికి వచ్చిన కండక్టరు ఈ ఇద్దర్నీ చూచి, తెలుసుకొని "మీరిద్దరూ ఎందుకు విడిపోవాలి? నే నేదో సర్దుబాటు చేస్తాను లెండి" అంటూ, ఆ చివర నారాయణరెడ్డి గారి అప్పరు బెర్తు వద్దకు వెళ్ళా లనుకొంటున్న భీమన్నను ఆపేశాడు. కండక్టరు మంచి తనాన్ని మెచ్చుకొన్నా రిద్దరూ.

సికిందరాబాదులో కూడ ఎవరూ రాలేదు. ఆ కుపే లోకి. ఇక పర్వా లే దనుకొని, హాయిగా ఈ ఇద్దరే ప్రయాణం చేశా రందులో.

ఉదయం విజయవాడ స్టేషనులో అవధానిగారు కలిశారు. ఈ ముగ్గురూ కలిసి కారు కోసం ఎదురు చూడ సాగారు. అది ఎంతకూ రాలేదు.

ఎంతో సేపు ఎదురు చూచి, విసిగి, చివరకు ఆ ప్లాటుఫారం మీద పచారు చేస్తున్న ఒక కాలువా పండితుణ్ని అడిగారు - పెద పులి వర్రు నుంచి ఏదైన కారు వచ్చిందా అని.

కారు తెల్ల వారు జామునే వచ్చిం దనీ , తానే వచ్చా ననీ , తాను ఎదురు చూస్తున్న వాళ్ళు కనిపించడం లే దనీ అన్నాడా పండితుడు ! 'రైలు ఆరు గంట లకే వచ్చింది . ఇప్పుడు తొమ్మి దయింది" అన్నాడు పాపం !

ఎన్నడూ కోపం రాని అవధాని గారికి కూడ కోపం వచ్చింది .

"ఎవరికోసం ఎదురు చూస్తున్నారో వారిలో ఒకరై నా మీకు తెలుసునా ? అన్నారు . తెలీ దట ! మరి ?

సరే , టిఫిను తీసుకొని బైలు దేరారు . ఎంతో ఆహ్లాదకరమైన ప్రయా ణం అది .

ముగ్గురు అగ్రశ్రేణి సాహితీ మూర్తులను తన నిండు గర్భంలో మోసుకు పోతున్న కాల దేవతలా ముందు కురికింది కారు .

కారులో చెప్పాడు భీమన్న ఆ రాత్రి రైలులో తనకు కలిగిన అనుభవం గురించి !

నారాయణరెడ్డి అవతలి బెర్తు పై నిద్రపోతున్నాడు . ఇవతలి బెర్తు మీద భీమన్న వెల్లకిల పండుకొని పాట పూర్తిచేసుకొం టున్నాడు . అంతలో తన కాళ్ళను ఎవరో తాకి నట్టయింది . ఒళ్లు జల్లుమని భయం భయంగా ఆటుకేసి చూశాడు . అక్కడ ఒక అపూర్వ దివ్య సౌందర్యవతి !

ఒక చిన్న దీపంలా ఉద్భవించి , దంతపు బొమ్మలా తెల్లని వెన్నెల కాస్తూ , తన పాదాల మీద నిలిచింది ఆ సుందరి ! ఎంత హాయిగా వుంది ! నృత్యం చేస్తూ వుంది . ఎంత మనోహరంగా వుంది ! తన శరీరమే నాట్యరంగ మయింది ! పాదాలపై పాదాలుంచి తొడలపై లాస్యం చేస్తూ , గుండెలపై తాండవిస్తూ - ఆ విధంగా అమె ఎంతసేపు నృత్యం చేసిందో ! నొసలు మీద ఒంటి కన్నుపై గిర్రున తిరిగి , జబ్బలపై నుంచి , తన రెండు హస్తాలలోను రెండు పాదా లుంచి నర్తిస్తూ - ఎంత గొప్ప అనుభూతి ! తన ఆపాద మస్తకం ప్రతి అణువూ ఆమె చరణ స్పర్శతో అమృత కల్పమే అయింది !

ఆ దంతా ఎమిటి? అంతటి వాస్తవాను భూతిని "కల" అని ఎలా అనడం?

ఆసక్తితో విన్నారీ వృత్తాంతం - నారాయణరెడ్డి, అవధాని గారూ, ఆంతలో కారు పెద పులి వద్రు చేరించి - మధ్యలో ఆ పండితుల వారింట కాఫీ తీసుకొని.

కవి రస బ్రహ్మ
కవి చెప్పే దంతా సత్యం, పరమ సత్యం
నేను కవిని, ఆబద్ధమాడను నేను
అబద్ధ మాడేవాడు కవికాడు నాదృష్టి లో
ఒకొక్క స్త్రీలో ఒకొక్క సౌందర్యం భానిస్తుంది నాకు
ఎన్నో రకాల కళ్లు, కాంతులు, నడకలు, నవ్వులు
పౌరాణిక కాంతల స్వరూప స్వభావాల
ముద్ర లన్నై నా మనస్సులో
సీతలు, తారలు, ద్రౌపదులు, అహల్యలు
రాధలు, రంభలు, మేనకలు, కుంతులు
కైకలు, శూర్పణఖలు, సుమతులు, ప్రద్వేషిణులు
ఎంతోమంది మన చుట్టూ, సమాజంలో
చూడగానే చెప్పగలను ఏ స్త్రీ ఏ అంశదో
బాల్యం నుంచీ వెతుక్కొంటూనే వస్తున్నాను నీ కోసం

—రాగవైశాఖి

209. నిమ్న భావ నిరాసం

"భీమన్న గారు హరిజనుల కష్టాలు గురించి వ్రాసే కవి. గాంధీగారి హరిజన సేవ ఫలితంగా ఇలాంటి వారు పైకి వచ్చారు. అవకాశా లుంటే ఆట్టడుగు కులాల నుంచి కూడ కవిత్వం వ్రాసే వారు పుడతా రనడానికి భీమన్న గారొక ఉదాహరణ. ఇప్పుడు భీమన్నగారు తమ కవితను వినిపిస్తారు" అంటూ ప్రకటించారు-కవి సమ్మేళనకు అధ్యక్షత వహించిన తుమ్మల సీతారామమూర్తిగారు.

సమావేశం మొదట్లో కవుల గురించి సభకు వివరించిన ఒక స్థానికుడు తక్కిన అందరి గురించి చాలా బాగా చెప్పి, తన గురించి "వచన రచనా

ధురీణుడు" అని మాత్రం చెప్పి వదిలేసి నందుకు మండుతున్న భీమన్న కోపాగ్నిలో ఈ అధ్యక్షుల వారి పరిచయ వాక్యాలు ఆజ్యం పోసినై . సభకు కొంచెం ఆలస్యంగా వచ్చి వెనక పడక కుర్చీలో కూర్చొని వున్న భీమన్న లేవ లేదు . కళ్ళు మూసుకున్నాడు .

సభ ఉద్విగ్నంగా ఉంది .

"భీమన్నగారు ఎక్కడ?" అన్నా రధ్యక్షుల వారు చుట్టూ చూస్తూ ,

"ఇక్కడ నిద్రపోతున్నారు" అన్నాడు ఆ పక్కనే కూర్చొని వున్న నారాయణ రెడ్డిగారు . నిద్ర పోతున్నారన్న మాటకు సభ ఒక్కసారిగా గొల్లు మంది .

భీమన్న ఉలిక్కిపడి లేచి , మైకు ముందుకు వచ్చి , ఆవులించి , ముఖం తుడుచుకొని , గొంతు విప్పాడు . ఈయన ప్రసంగం క్లుప్తంగా ఇది .

'నేను నిద్రలాంటి మైకం లోకి పోయిన మాట నిజం . అందుకు కారణం నాకు ముందు కవితా గానం జేసిన వారి కంఠ మాధుర్యం . అది నన్ను మధురకు , బృందకు తీసుకు పోయింది"

సభలో హర్షం .

"అంతటి మైకంలోకి కూడ ఆధ్యక్షుల వారు నన్ను గురించి చెప్పిన మూడు మాటలూ వినిపించినై . అయితే - అవి నిజం కాదు . అబద్ధాలు ."

సభలో కలకలం, కలవరం , యువకులున్న వైపు నుంచి హర్షధ్వానాలు .

"నేను హరిజనుణ్ని కనుక , హరిజనులను గురించి తప్ప మరేమీ వ్రాయలేనని అధ్యక్షుల వారి ఉద్దేశం కావచ్చు. నేను ఏదో ఒక కులం కోసమో, మతం కోసమో, వర్గం కోసమో వ్రాసే పాక్షిక కవిని కాదనీ, నా సాహిత్యం సర్వజనీన మైనట్టిదనీ, నన్నెరిగిన వాళ్ళందరికీ తెలుసు. ఏ రచయిత అయినా , తనకు తెలిసిన విష యాన్నే కావ్య వస్తువుగా తీసుకొంటాడు . వాల్మీకికి రాముడు తెలుసు . నాకు పాలేరు వెంకన్న తెలుసు . ఇద్దరి చూట్టూ జరిగింది విశ్వజనీన సృష్టే"

సభలో కెరటాలు లేచినై .

"భీమన్న గాంధీగారి హరిజన సేవకు ఫలితం అన్నారు అధ్యక్షులు . అదీ అబద్ధమే . ఏ గాంధీగారి వల్ల బోయ వాల్మీకి ఆదికవి అయాడు ? మాదిగ వ్యాసుడు వేద వ్యాసుడు అయాడు ? గాంధీ-ఆర్ , నో గాంధీ - బోయి భీమన్న మహాకవి అవుతాడు . అయాడు"

సభ ఉవ్వెత్తున పొంగింది .

"అవకాశాలు వుంటే అట్టడుగు వాళ్ళు కూడ కవులు కావచ్చు నన్నారు అధ్యక్షుల వారు . అది అసలే నిజం కాదు . ఈ కమ్మ వారికి, ఈ బ్రాహ్మలకు లేని అవకాశా లేమిటి ? మరి-వాళ్ళలో వున్న కవు లెందరు ?"

సభ అల్ల కల్లోల మయింది .

"సరే , పోనివ్వండి , నన్ను గురించి మొదట పరిచయం చేసిన వారు నన్ను వచన రచనాధురీణు డన్నారు. ఇంత వరకు నన్ను గురించి అలాఎవరూ చెప్పలేదు . వారికి నేను కృతజ్ఞుణ్ని , నా రాగ వైశాఖి వచనమే . ఇప్పుడు మీకు ఒక పద్యం , ఒక వచనం , ఒక గేయం వినిపిస్తాను"

సభ పౌర్ణమి మహార్ణవమే అయింది .

"ఇది వైకుంఠము" అనే పద్యం , తర్వాత "మారని వాడు" వచన కవిత వినిపించి , "బొమ్మ" గేయం పాడాడు భీమన్న . సభ ఏమైపోయిందో గుర్తులేదు .

ఆ తర్వాత భీమన్న వేదిక దిగి క్రిందికి వెళ్ళే సరికి - సభలోని మహిళా విభాగం మొత్తం ఈయనను చుట్టు ముట్టేసింది . ఎన్ని ఆనంద తరళ నేత్రాలు ఎన్ని పరమాభిమాన ప్రశంసా దృక్పత్రాలు !

ఇందులో కొన్నిటిని బొమ్మ కావ్య పీఠికలోను , ఆ తర్వాత డా॥ కృష్ణా రావుగారు వ్రాసి పంపిన గేయంలోను చూడవచ్చు . కుమారి ఉమా , కుమారి రుూస్సి వ్రాసిన ప్రశంసా లేఖలు ఏ కవి కైనా అమృత చషకాలు .

పెద్దపులి వర్రులో భీమన్న, సినారె, అవధాని గారు ఒకే గదిలో వుంచ బడ్డారు. ఆ రాత్రికి రాత్రే తిరుగు ప్రయాణం. సామాను హడావుడిగా సర్దు కొంటుండగా, కరెంటు పోయింది. అంతా అంధకార మయింది. ఏం చెయ్యాలి? వెంటనే భీమన్న టార్చిలైటు వేసి, కొవ్వొత్తి వెలిగించి, గదిలో పెట్టాడు. ఆశ్చర్యపోయారా ఇద్దరూ! భీమన్న సంచిలో అగ్గిపెట్టె, కొవ్వొత్తి, టార్చిలైటు, పురికొస తాడు, సూది, దారం, ఐడిను, దూది, అమృతాంజనం, సి పిటమిను, గేస్ట్రిసాలు, మెక్సొఫారం, నిమ్మకాయ, ఉల్లిపాయ వగైరా లన్నీ వుంటై!

"మీ రింత సమగ్రంగా ఉంటా రనుకోలేదు" అన్నారు నారాయణరెడ్డి గారు, భీమన్నను మక్కువతో చూస్తూ,

కారులో అవధానిగా రన్నారు "సభాధ్యక్షుల వారిని మీరు చాల కంగారు పెట్టేశారు" అని. భీమన్న నిర్మొగ మాటతనూ, నిర్భయత్వాన్ని మెచ్చు కొన్నారు.

ఆ మర్నాడు భీమన్న జిల్లాకలెక్టరు చంద్రయ్యగార్ని చూడ్డం కోసం గుంటూరు వెళ్ళినప్పుడు-అక్కడందరూ ఒకటే చెప్పుకోవడం విన్నాడు-భీమన్న పెదపులి వర్రు సభలో ఒక పెద్ద బాంబు వేసి వచ్చాడని! నిమ్మకులాల పట్ల అగ్రకులాల కుండే నిరసన భావానికి తగిన జవాబు చెప్పి వచ్చాడనీ!

లోకం మీద ఏదో పగతో పుడతారు కొందరు
వాళ్ళ ముఖా లెప్పుడూ చిర చిర లాడుతూనే వుంటై.
ఏ విధమైన మంచినీ, అందాన్ని సహించలేరు వాళ్ళు
ఏ జన్మలోనో, ఎవడి వల్లనో, ఏదో అపకారం పొంది
ప్రతీకార వాంఛ ప్రబలి, పగతీర్చు కోకుండానే
చచ్చిపోయి పుట్టిన దౌర్భాగ్యులా కావచ్చు వాళ్ళు;
ప్రతీకార వాంఛ కంటె పతన హేతువు మరొకటి లేదు;

— రాగ వైఖరి

210. యువ కవుల ఘెరావో

ప్రపంచ తెలుగు మహాసభలకు ముందు నాందిగా రాష్ట్రం వివిధ ప్రాంతాలలో వివిధ సాంస్కృతిక శాఖలకు చెందిన ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. అనంతపురం, వరంగల్లు ప్రాంతీయ ఉత్సవాలలో భీమన్న పాల్గొన్నాడు కూడా. అయితే-కర్నూలులో జరిగిన సాహిత్యోత్సవానికి సాహిత్య అకాడమీ ఆధ్వర్యం వహించడంవల్ల దాని ఏర్పాటులో భీమన్న కొంత పెత్తనం వహించవలసి వచ్చింది.

రామానుజరావుగారి ఆకాంక్ష మేరకు పోతుకూచి సాంబశివరావుగారితో కలిసివెళ్ళి, కర్నూలులో స్థానికంగా ఎంతో పలుకుబడిగల భీమేశ్వరరెడ్డిగారితో సంప్రదించి, మాదన్న మున్నగు నాయకుల, సాహితీపరుల సహకారం పొంది ఏర్పాడు చేశాడా ఉత్సవాన్ని. ఉత్సవం 1975 మార్చి 20 ప్రాంతంలో మూడు రోజులపాటు అత్యంతోత్సాహంతో జరిగింది. కర్నూలులో అన్నివేలమంది జనం స్త్రీ పురుషులు సమాన సంఖ్యలో పాల్గొన్న అంతటి సాహిత్య సమారోహం అంతకు ముందెన్నడూ జరగలేదన్నారు తజ్ఞులు.

ఉత్సవ నిర్వహణ బాధ్యత స్థానికంగా భీమేశ్వరరెడ్డి గారిది, రాష్ట్ర స్థాయిలో రామానుజరావు గారిది. వివిధ సాహిత్య ప్రక్రియలపై చర్చలు, గోష్ఠులు, ప్రసంగాలు ఏర్పాటు చేయబడినై. ప్రధాన న్యాయమూర్తి ఆవుల సాంబశివరావు, దివాకర్ల, దాశరథి, బాపురెడ్డి, సుబ్బన్న శతావధాని, మోదుకూరి జాన్సన్, విశ్వం, కొలకలూరి ఈనాక్, గడియారం వేంకట శేషశాస్త్రి మున్నగు ప్రముఖు లెందరో పాల్గొన్నారు.

ఒక సాయంకాలం కవిసమ్మేళనం. దానికి అధ్యక్షుడు భీమన్న.

ఆ ఉదయం ఒక గోష్ఠిలో పాల్గొన్న ప్రముఖులలో ఇద్దరు కవితాతత్వం గురించి రెండు నిర్వచనా లిచ్చారు. కవిత్వం "లోకంతో మన కేమిటి? లోలాక్షి రా పోదము" అన్నట్లుండ గూడదనీ, ప్రజల కష్టాలను ఎత్తిచూపేదిగా ప్రజల అభ్యుదయానికి తోడ్పడేదిగా వుండాలనీ ఒక రన్నారు. "తినుచున్న

అన్నమే తినుచుంటి మిన్నాళ్ళు" కనుక , వ్రాసిన రామాయణాన్నే మళ్ళీ మళ్ళీ వ్రాయ వచ్చునని రెండవ వా రన్నారు .

"అవి రెండు దృక్పథాలు . అవి రెండూ సత్య సమ్మతాలు కావు" అన్నాడు భీమన్న తన అధ్యక్షుని తొలి పలుకులో . ఆ రెండు దృక్పథాలను ఖండించాడు . "లోకంతో మనకేటికి" అన్న గేయం ఎప్పటిదో , ఇప్పటికీ జ్ఞప్తిలో వుంది . అదీ కవిత్వం అన్నాడు . మనం తిన్న అన్నానే మళ్ళీ తింటున్నామా అని ప్రశ్నించాడు . ప్రతిసారీ క్రొత్త అన్నమే తింటున్నాం . కాని , క్రొత్త కవిత్వం వ్రాయడం లేదు అన్నాడు .

సభ హర్ష ధ్వానాలతో నిండి పోయింది .

కవులు ఒక్కొక్కరే కవితా గానాలు చేస్తున్నారు . భీమన్న వద్దకు సభలో నుంచి చీటీలు రాసాగినై . వాటికోని విషయం కవితలు చదువుతామని . వాటిని ప్రక్కనున్న సమావేశ కర్తకు అందజేశాడు భీమన్న . తాము తయారు చేసిన జాబితాను మించి , మరెవరికీ అవకాశం ఇవ్వవద్దన్నారు సమావేశ కర్తలు . ఊరుకున్నాడు భీమన్న .

"మీరు అధ్యక్షులుగా వున్న కవి సమ్మేళనలో కూడ మా స్థానిక యువ కవులకు స్థానం లేదా?,' అని మరో చీటి !

స్థానిక యువ కవులకు అవకాశం ఇస్తా నన్నాడు భీమన్న . కొంప మునుగు తుందన్నారు సమావేశ కర్తలు .

'మీకేం , మీరు అవకాశ మిస్తారు . వెళ్ళి పోతారు . రేపటి నుంచి ఇక్కడ మేం అవస్థ పడాలి ' అన్నా డొక స్థానిక పెద్ద .

అదేం అవస్థో భీమన్నకు అర్థం కాలేదు . ఈ పెద్దలకు యువకు లంటే ఎంత భయం !

వికసమ్మేళన ముగిసింది . యువకు లంతా విప్లవ నినాదాలు చేసుకొంటూ వేదిక పైకి దాడి చేసి , భీమన్నను చుట్టు ముట్టేశారు . అక్కడ భీమన్న తప్ప పెద్ద లొక్కరూ లేరు !

"నా కిక్కడ స్వేచ్ఛ లేకపోయింది. వుంటే మీ కందరికీ అవకాశ మిచ్చి చీల్చి చెండాడే వాణ్ని" అన్నాడు భీమన్న నవ్వుతూ, ఆ విప్లవాగ్రహాలతో. ముందు ఆ శుష్క నినాదాలు మాని, తన ప్రశ్నకు జవాబు చెప్పమన్నాడు. "మీరూ, మీ నాయకులూ సాధించిన విప్లవ మేమిటి?" అడిగాడు. 'నా ఒక్క పాలేరు నాటకం సాధించిన విప్లవా న్నైనా మీరంతా కలిసి సాధించ గలిగారా?" అని ఉరిమాడు.

భీమన్న విజృంభణకు తట్టుకోలేక యువకవులు మళ్ళీ నినాదాలకు దిగారు. ఈ గందరగోళంవిని ఆక్కడకు వచ్చిచేరారు-కొంతదూరంలో నిలబడి ఈయనకోసం ఎదురుచూస్తున్న మోదుకూరి జాన్సన్, తేలు లీల మున్నగువారు. ఆ ఉదుకులోనుంచి తప్పించి భీమన్నను తీసుకుపోయారు.

మరునాడు ఉదయం ఒకప్రక్క సాహితీ సమ్మేళనం జరుగుతుండగా, మరొకప్రక్క ఆటోగ్రాఫ్ పుస్తకాలతో తన చుట్టూచేరిన యువకులనుచూచి భీమన్న విస్తుపోయాడు. వాళ్ళంతా ఆ క్రితంరాత్రి తనను ఘెరావోచేసిన విప్లవ వీరులే. మెడికోలు, కాలేజీ విద్యార్థులు.

"రాత్రి మీరు తిట్టిన బూతులు కొన్ని ఇందులో వ్రాయండి సార్" అంటూ పుస్తకం అందిచ్చా డందులో ఒక అందమైన కుర్రాడు. అంతలో వాళ్ళను తోసుకొని ముందుకు వచ్చేశారు విద్యార్థినులు. భీమన్నను ఈ తాకిడి నుంచి ఇప్పుడు కాపాడినవారు సినీ గ్లామరు మోదుకూరి, కవితా గ్లామరు ఖాపురెడ్డి.

ఆ తరువాత ఉగాదికి భాగ్యనగరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ సందర్భంగా సన్మానించబడ్డ మహాకవులలో భీమన్న ఒకడు. "కేదారేశ్వరి" అనే కవితా సంపుటిని మహాసభకు తన కానుకగా ప్రకటిం చాడు భీమన్న. దాన్ని సభావేదికమీద మంత్రి కోదాటి రాజమల్లుగారి అధ్యక్ష తలో విధానసభ స్పీకరు దశరథరామిరెడ్డిగారు ఆవిష్కరించారు.

కేవలం తెలుగుతల్లిని గురించిన పాటలు పద్యాలుకల ఈ గ్రంధం తెలుగు మహాపురుషులైన ఆయ్యదేవర కాలేశ్వరరావు, కళా వెంకటరావు, మాడపాటి

హనుమంతరావు, వేముల కూర్మయ్య, తాపీ ధర్మారావు, కల్లూరి సుబ్బారావు గార్లకు అంకిత మిచ్చి, వారిపట్ల తన భక్తిప్రపత్తుల్ని వెల్లడించుకొన్నాడు భీమన్న.

ఇంతచేసినా - ఆ సభలపై తీసిన డాక్యుమెంటరీ చిత్రంలో భీమన్న ముఖమే కనపడలే దెక్కడా! కెమెరాకు కూడ అంటరాని తనమే నేమో!

సౌభ్య చందన వృక్ష! శాఖలను చుట్టుకొని
కష్టాల నాగు లెవో! కస్సుమను, బుస్సుమను
సాహసే లక్ష్మియౌను కద?-వైశాఖ
చర్చలకు చందనము వలదా?

—బొమ్మ

211. జాతీయ అవార్డు

ఆకాశవాణి పండుగలు, పత్రికలు, కవి సమ్మేళనలు మున్నగు వాటి ఒత్తిడిలో, ఆయా సందర్భాలలో వ్రాసిన విమర్శనాత్మక కవితలతో ఒక సంపుటిని ప్రకటించా లనుకొన్నాడు భీమన్న ఒక శుభ మూహూర్తంలో.

శుభ మూహూర్తం అని ఎందు కంటున్నా నంటే-ఈ రకం రచనలను కవితలుగా పరిగణించడు భీమన్న. సందర్భాల కోసం వ్రాసిన వాటి కాపీలను కూడ వుంచుకోడు. అందుకని శుభ మూహూర్తం అంటున్నా. అంతే గాని-ఏ ముహూర్తానికీ శుభ మనీ, అశుభ మని ఉండ వీయనకు.

అధికారుల్ని, మంత్రుల్ని, వర్తకుల్ని, భూస్వాముల్ని, స్వాముల్ని ఎంత ఐండగా తిడితే అంత దండిగా హర్షధ్వానాలు వస్తాయి సభనుంచి. ఏ సభలోనైనా హర్షధ్వానాలు చేసేవాళ్ళు బూతులు మాత్రమే అర్థమయే జనం. వాళ్ళే అధిక సంఖ్యాకులు. వాళ్ళ మెప్పును సంపాదించగల పరుష హాస్య వాక్కే ఆ సభకు మహాకవి. కేవలం తల లూపుతూ మౌనంగా చిరునవ్వులు మాత్రం ప్రసాదించే ముందు వరసల రసజ్ఞుల వల్ల ఏ కవికీ సభా విజయం చేకూరదు. "కిం, కం, మా ఎల్లెద్దు కొం" అంటూ కొమ్ము విసరి కుమ్మగల వాడే ఈ నాడు ప్రజాకవి.

ఈ రహస్యం భీమన్నకు తెలుసు. కాని లెక్కచెయ్యడు. ఆయినా ఆ మాత్రం పోకిరితనం తానూ చూపగలడు. చూపడం కోసమే "గుడిసెలు కాలిపోతున్నై" కావ్య సంపుటిని ప్రకటించా నంటాడు. అయితే-చివరి నిమిషంలో అనేక ఉత్తమ కవితలను కూడ దీనిలో చేర్చడం వల్ల, దీనికి సార్వజనికా మోదం లభించింది.

ఈ కావ్య సంపుటిని అప్పటి కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి గారికి అంకితం ఇచ్చాడు భీమన్న. అదొక పెద్ద చరిత్ర. కొంతవరకు దాన్ని ఆ కావ్య పీఠికలోనే చూడవచ్చు. భెల్ ఫేం కె. అప్పారావు, పోలీసు ఆఫీసరు జనార్దన్, లలితా ప్రెస్ చర్ల గణపతిశాస్త్రి, చిత్రశిల్పి పి. టి. రెడ్డి మున్నగు వారి పాత్ర వుంది అందులో. వెంకటస్వామి గార్ని "అపర అంబేడ్కరు" అన్నందుకు అంబేడ్కరు భక్తులలో కొందరి కోపానికి కూడ గురైనాడు భీమన్న.

"అంబేడ్కరు ఒక ప్రవక్త. ఒక మహర్షి. అంతే కాదు. ఒక సాంఘిక రాజకీయ విప్లవ నాయకుడు. ఆయన లక్ష్యం సాధించ బడటానికి వందలు వేలు యువ అంబేడ్కరులు తయారు కా వద్దా?" అంటాడు భీమన్న.

"గుడిసెలు"లోని ప్రతి కవితకూ ఒక కథ వుంది. ఒక నిజం వుంది. ఒక అనుభూతి వుంది. ఆలానే దాని ముద్రణకు, అంకితానికి, ఆవిష్కరణకు కూడ ఒక చరిత్ర వుంది.

దాని ముద్రణ అప్పు తీర్చుకోడానికి భీమన్న చాల కష్టపడవలసి వచ్చింది. దానితో ఆరోగ్యం దెబ్బతిని, మళ్ళీ ఆస్పత్రిలో చేరవలసి వచ్చింది.

"ఈ రోగి ఒక ప్రసిద్ధి కవి, కళాప్రపూర్ణ, పద్మశ్రీ. నేను ఈయనను తరచు పరీక్షించ వలసివుంది. కనుక దగ్గరలోని హోం వార్డులో, ఇప్పుడే ఖాళీ అయిన ఒకటవ నంబరు గదిని ఈయనకు అలాటు చెయ్యండి!" అంటూ గాంధీ ఆస్పత్రి వసతి అధికారి వద్ద కూర్చుని, ఆ గదిని అలాటు చెయ్యించారు డాక్టరు కుప్పచ్చి కృష్ణమూర్తిగారు భీమన్నకు.

నెలకు ఆయిదు వందల రూపాయలకు మించి జీతం గాని, పెన్షను గాని వచ్చే అధికారులకే ఆ గదులను ఉచితంగా ఇస్తారు. తదితరులకు ఇస్తే రోజుకు పాతిక రూపాయలు అద్దె, చికిత్సకు రుసుము వసూలు చేస్తారు. భీమన్నకు పెన్షను అంత రాదు. ఒక్క జనరల్ వార్డుకు తప్ప, మరే స్పెషల్ వార్డుకూ ఈయన అర్హుడు కాడు!

"పద్మశ్రీ అవార్డు పొందిన మహాకవి ఆస్పత్రితో ప్రత్యేక చికిత్సకు అర్హుడు కాదా? పోనీ, ఇంతవరకు అలాంటి రూలు లేకపోతే, ఇప్పుడు సృష్టిస్తాం. తప్పని సరి అయితే, ఈయన కయ్యే ఖర్చంతా నేను పెట్టుకొంటాను" అన్నారు డాక్టర్ కృష్ణమూర్తి.

ఎంతటి ఔదార్యం! ఆయన డాక్టరా? దేవుడా?

"నేను మీకు తెలియదు సార్! మీరు నాకు తెలుసు. విశాఖ నుంచి ఈ మధ్యనే ఇక్కడికి బదిలీ అయి వచ్చాను. మీరు కళా ప్రపూర్ణ డాక్టరేటు తీసుకొన్న కాన్వొకేషన్లో నేను ఆడియన్సులో వున్నాను." అన్నారాయన భీమన్నతో, ఎంతో ముగ్ధత్వంతో! గాంధీ ఆస్పత్రిలో ఫస్టు ఫిజిషియన్ ఆయన. అంతటి ఉన్నత స్థానంలోని ఉత్తమ డాక్టరుకు ఇంతటి వినయం! ఈ కాలంలో కూడ ఎంతటి సౌజన్యం!

ఒక పెద్ద ఆస్పత్రిలో ఎన్ని రకాల టెస్టులు వుంటాయో అన్నీ చేశారు. ఉపేక్షిస్తే ప్రమాదించే నలతలను అనేకం కనిపెట్టారు. అన్నిటికీ చికిత్స మొదలు పెట్టారు.

చిత మేమి టంటే - భీమన్నను చిన్నప్పటినుంచీ పట్టి పీడిస్తున్న ఎమీబియాసిస్, బ్రోంకైటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడ తాత్కాలికమైన కాలేయ, జీర్ణకోశ మాంద్యాలతో సహా, అదృశ్యమై పోయాయి! వజ్ర తుల్యమైన ఆరోగ్యం చేకూరింది. నిజంగా డాక్టర్ కృష్ణమూర్తిగారు ధన్యంతరే! ఈ సత్యాన్ని కృతజ్ఞతా పూర్వకంగా భీమన్న తన "శివాలకలు" కావ్య సంపుటి పీఠికలో రికార్డు చేశాడు.

భీమన్నకు సంపూర్ణారోగ్యంతో పాటు, తన కవితకు జాతీయ అవార్డు కూడ ఇదే సమయంలో లభించింది. "గుడిసెలు కాలిపోతున్నై" కావ్య సంపుటికి వచ్చిందా అవార్డు!

కేంద్ర సాహిత్య అకాడమీ వారి ఈ జాతీయ అవార్డు లభించడంతో భీమన్నకు మళ్ళీ అభిమానుల, సంస్థల సన్మానాలు, సభలు ప్రారంభమైనై.

ప్రతిమాలి రై లెక్కుతాం, వెనక వాళ్లని ఎక్కనివ్వం
ఏడ్చి చోటు గుంజు కొంటాం, మరొకళ్లకి చోటివ్వం
లంచం పేరిట ఇతర్లని పట్టిస్తాం
అందుకు బహుమానాలు మేం పుచ్చుకొంటాం
మేం ఆధునికులం!

— గుడిసెలు

212. దైవికం అంటే...

1976 ఫిబ్రవరి 21 వ తేదీ సాయంత్రం ఢిల్లీలో బహుమతి ప్రదానోత్సవం ఏర్పాటు చేయబడినట్టు కేంద్ర సాహిత్య అకాడమీ వారు తెలియపరిచారు. ఇంతవరకు భీమన్న ఎప్పుడు ఢిల్లీ వెళ్ళినా, ఒంటరిగానే వెళుతున్నాడు. ఇప్పుడు సకుటుంబంగా వెళ్ళాలని నిశ్చయించుకొన్నాం.

సకుటుంబం అంటే-నేను, మా పిల్లలు విజయ పల్లవి, విజయేందిర. ఈ ఇద్దరూ అర టిక్కట్లే.

మాకు ఢిల్లీ వెళ్ళటం ఇదే తొలిసారి కనుక, రెండురోజుల ముందే అక్కడకు చేరుకొని వివిధ ప్రాంతాలు చూడవచ్చుననే ఉద్దేశంతో, 17 వ తేదీ ఉదయం ఇక్కడ బయలుదేరే దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ చెయ్యించుకొన్నాం-రెండవ తరగతి స్లీపర్‌లో. ఆ ఎక్స్‌ప్రెస్ 18 వ తేది సాయంత్రానికి ఢిల్లీ చేరుతుంది.

మా కుటుంబం రెండు పూర్తి టికెట్లూ, రెండు అర టికెట్లూ మాత్రమే అయినా, ఢిల్లీ వెళ్ళి రావడ మంటే మాటలా! ప్రయాణంలో, యాత్రలో పెద్దవాళ్ళ కంటే పిల్లలకే ఖర్చెక్కువ కదా! ఎలా అని ఆలోచిస్తున్న సమ

యంలో—భీమన్నకు హార్థికంగానే కాక, ఆర్థికంగా కూడ తరచు సహాయపడుతూ వుండే మిత్రులలో ఒకరైన జె. అమ్మిలయ్య గారి నుంచి అనుకోకుండా కొంత పైకం అందింది.

దైవికం అంటే మరేం లేదు. అనుకోకుండా, ముందుగా తెలియకుండా, అకస్మాత్తుగా, ఆశ్చర్యం కలిగేటట్టుగా, ఏదైనా అనుకూలమైన, లాభకరమైన, ప్రియమైన సంఘటన జరిగితే దాన్ని అదృష్ట మనో దైవిక మనో అంటాం. అంతకంటే మరి పదాలు లేవు. ఈ పదాలను భీమన్న పరంగా వాడినప్పుడు వాటికి దైవ కృప, భగవత్ ప్రేరణ వంటి అర్థాలను చెప్పగూడదు.

ప్రకృతిలోని ప్రతి లవమూ ఒక శక్తే భీమన్న దృష్టిలో. ప్రతి జీవ లవమూ ఒక శక్తి ధారే. ఈ సహస్ర ముఖ ధారా సమస్తానికీ మూలమూ, ఆధారమూ, పర్యవసానమూ శక్తే. అట్టి సంపూర్ణ శక్తే పరాశక్తి. అదే పరమాత్మ, పరబ్రహ్మ.

నామ రూప గుణ పరిమిత మయిం దేదీ సర్వ శక్తిమంతం కా దంటాడు భీమన్న. ఆస్తిక్య నాస్తిక్యాలకు అతీతుడు భీమన్న. విశ్వేశ్వరుడైన వ్యక్తి ఎవడూ లేడు. విశ్వాత్మకమైన శక్తి వుంది. ఆశక్తి ఆశ్రిత పక్షపాతి కాదు, ఆపదుద్ధారికీ కాదు. ఆత్మ శక్తే ఎవరికైనా ఆదిశక్తి.

అవసరానికి పైక మందడమే దైవికం అనుకొంటే, అంతకంటె అద్భుత సంఘటన మరొకటి జరిగింది.

ఒక రోజున భీమన్నకు ఉన్నట్టుండి రక్త విరేచన మయింది. చిన్న పాప విజయేందిరకు సుస్తీ చేసింది. ఢిల్లీ ప్రయాణం ఇక మూడు రోజులే వుంది. ఈ విధి వక్రతకు క్రుంగిపోయాం. భీమన్నను దీర్ఘకాలంగా బాధించే డయేరియా. అది పూర్తిగా తగ్గిపోయింది. డిసెంట్రీ ఎప్పుడూ లేదు. మరి, ఇప్పు డిదేమిటి?

"మనకు ఢిల్లీ వెళ్ళే యోగం లేనట్టుంది" అన్నాడు భీమన్న. ఈ మాటతో అసలే దిగులుగా వున్న నాకు మతిపోయింది. ఎంతటి ఉత్సాహానికి, ఎంతలో ఎంతటి విఘాతం!

ఆట్టి స్థితిలో వచ్చిం దొక టెలిగ్రాం .

ఇదేం పులిమీద పుట్రో అనుకొంటూ , టెలిగ్రాం విప్పాడు భీమన్న .

కాశీ విద్యాపీఠం వారు భీమన్నకు గౌరవ డాక్టరేటు ఇస్తారట ! కాన్వొకేషను 19వ తేదీనే నట ! 19వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు భీమన్న ఆక్కడ వేదికపై వుండా లట ! వెంటనే బయోడేటా (జీవిత వివరాలు) పంపా లట ! ఇది ఉత్తర ప్రదేశ్ గవర్నరు గారైన డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారి కోరిక ననుస రించిన నిర్ణయ మట ! కాశీ విద్యాపీఠం రెజిస్ట్రారు మెహ్రోత్రా గారి నుంచి వచ్చిన టెలిగ్రాం ఇది !

నిజంగా ఇది పులిమీద పుట్రే ! భోరున ఏడవవలసిన విపరీత స్థితి ; ఢిల్లీ యాత్రనే రద్దు చేసుకుందా మనుకుం టుంటే - కాశీయాత్ర కూడ వచ్చి పడింది !

మా కాలనీ ఆస్పత్రికి వెళ్ళాం . అక్కడి డాక్టరు మాపట్ల అభిమా నమూ , స్నేహమూ కల శ్రీమతి కౌముది . సుప్రసిద్ధ సాముద్రికుడూ , ఓరి యంటల్ కాలేజి ప్రిన్సిపాలూ , భీమన్నకు మిత్రుడూ అయిన కెప్టన్ గొర వర్తి శ్రీరామ మూర్తిగారి శ్రీమతి ఆమె . భీమన్ననూ , పాపనూ పరీక్షించి మందు లిచ్చిం దామె .

మర్నాడు హైదరాబాదులో డాక్టర్ చెన్నారెడ్డిగారి ప్రోగ్రాం వుంది . భీమన్న రామానుజరావుగార్ని తోడు తీసుకొని ఆ సభకు వెళ్ళి , రెడ్డిగార్ని కలిసి , తనకు ఆరోగ్యం బాగులేదనీ , కాశీ రాలేననీ , డాక్టరేటు బేఖాజరీ (ఇన్ ఆబ్సెన్సియా)గా ఇవ్వవచ్చు కనుక అలా చేయించమనీ కోరాడు .

రెడ్డిగారు భీమన్నను ఎగాదిగా చూచి "పర్వాలేదు , రండి !" అన్నారు .

ఆ సభలోనే భీమన్నకు ఇలపావులూరి పాండురంగా రావుగారు పరిచయ మైనారు . ఆయన గొప్ప సాహితీవేత్త . హిందీ విద్వాంసుడు . ఢిల్లీలో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఒక అధికారి . అన్నిటినీ మించి గొప్ప సహృదయుడు .

ఏమైనా సరే, ప్రయాణం మానుకోగూడ దనేది నా ఆకాంక్ష. ఎంత గొప్ప అవకాశం! పైగా, కాశీని దర్శించే అదృష్టం! ఇప్పుడు తప్పితే, మరి కాశీని ఇక చూడగలమా?

గాంధీ ఆస్పత్రికి వెళ్ళాం, ఏం చెయ్యాలనే నిర్ణయాన్ని డాక్టర్ కృష్ణ మూర్తిగారికి వదిలేశాం.

భీమన్నకు, విజయేందిరకు అవసరమైన టెస్టులన్నీ ఆయనే స్వయంగా చేశారు. వాటిని ఎంత ఆర్జంటుగా చేసినా, కనీసం మూడురోజులైనా పడుతుంది. మూడు గంటల్లో ముగించి ఫలితం తేల్చుకొన్నారు డాక్టర్ కృష్ణ మూర్తిగారు. "ఏం పర్వాలేదు, సుఖంగా వెళ్ళి రండి" అన్నారు. కొన్ని మందులు దగ్గరుంచుకోమన్నారు. పాటించవలసిన కొన్ని నియమాలు సూచించారు.

ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చే టప్పటికి-రాష్ట్ర చేనేత శాఖా మంత్రి కేశవులు గారి వద్దనుంచి ఒక సందేశం వచ్చి వుంది - ఏమైనా సరే, కాశీ వెళ్ళడం మానవద్దని, రైల్లో అయినా సరే, ఎయిర్‌లో అయినా సరే, అక్కడికి సకాలంలో చేరడానికి అన్ని సౌకర్యాలూ కలిగిస్తామని, ఇది డాక్టర్ చెన్నారెడ్డిగారి కోరిక అని!

మా ప్రోగ్రాం ప్రకారం 18 వ తేదీ సాయంత్రానికి ఢిల్లీ చేరతాం కదా. అక్కడినుంచి కాశీకి రాత్రి రైళ్ళు వుండవా?

ఈ ఆలోచనతో ఢిల్లీలో వున్న భూషి రామదాసుగారికి టెలిగ్రాం యిచ్చాం – 19 ఉదయానికి కాశీ చేరే ఏ రైల్లో అయినా సరే రెండు బెర్తులు రిజర్వు చెయ్యమని. అక్కడి మిత్రులు పాండురంగారావు, చక్రం, ఏడిద గోపాలరావు మున్నగు మిత్రుల సహాయం కూడ తీసుకోమన్నాం. ఢిల్లీ ఆంధ్ర గెస్టు హౌసులో, స్టాఫ్ క్వార్టర్సులో ఒక గదిని రిజర్వు చేయించుకొని, 17 ఉదయం దక్షిణ ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. ఈ సందర్భంలో ఇక్కడ జియేడి సంయుక్త కార్యదర్శి కె. ఎస్. ఆర్. మూర్తిగారు ఇచ్చిన సహకారం చిరస్మరణీయం.

నను ప్రేమించిన చాలు నాకు, ఇతరుల్
నా జోలికిన్ రాకయుం
డిన చాలున్ ; పరమాత్మ పీవు, ఎనమం
ద్రే కాదు, కోటాను కో
ట్లను ప్రేమింతువు, నా కదేల ? ఒక క
ల్హారమ్ముగా నే శరత్
ప్రణయ జోత్స్నలు నా యెదంద వికసిం
పన్, నా కదే మోక్షమౌ !

—మణి మానసం

213. కాశీ యాత్ర

18వ తేదీ సాయంత్రం నాలుగున్నరకు మా రైలు ఢిల్లీలో హజరత్ నిజాముద్దీన్ స్టేషను చేరింది. ప్రయాణం సుఖంగా, వేడుకగా సాగింది- పల్లవి కంట్లో బొగ్గు నలక పడి, కొంత బాధ పెట్టడం మినహా.

స్టేషను ప్లాటుఫారం మీద రామదాసు గారు, ఆయన కుమారుడు డాక్టర్ నారాయణదాసు కనిపించగానే ప్రాణం లేచి వచ్చిన ట్టయింది. కాశీకి పోయే బండి పాత ఢిల్లీ స్టేషనలో సాయంత్రం ఏడు గంటలకు బైలుదేరు తుందనీ, రిజర్వేషను దొరికిందనీ చెప్పా రాయన. ఆదొక గొప్ప శుభ వార్త.

ఏ మైనా సరే, కాశీ వెళ్ళా లన్న పట్టుదల భీమన్నకు లేదు. నా కంది. ఎందు కంటే-ఈ అవకాశం పోతే ఇక ఈ జన్మలో మేం కాశీ చూడలేక పోవచ్చు !

టాక్సీ చేసుకొని, ఆంధ్రా గెస్టు హౌసుకు పోయాం. అక్కడ మాకు రిజర్వు చేసిన గది మరో గంటకు గాని కాళీ కాదన్నారు. సామాను బైట వది లేశాం. పిల్లల్ని నారాయణదాసు కప్పగించాం. భీమన్న, నేను రామదాసు గారితో కలిసి టాక్సీలో స్టేషనుకు బైలు దేరాం. వర్షం ప్రారంభ మయింది హోరున వర్షించ సాగింది.

తీరా చూస్తే - రిజర్వేషను టూ టైరులో రెండు సీట్లు ! బెర్తులు కావు !

ఆ సంగతి రామదాసు గారికి కూడ తెలియదు. ఎవరికో చెప్పి రిజర్వు చెయ్యించా డాయన. సీట్లైనా దొరికాయి చాలని నాకుంది. ఎక్కి కూర్చున్నాం.

పెట్టంతా రద్దీ, బురద, వాసన! అంత నరకంలో తెల్లవార్లూ కూర్చుని ప్రయాణం చెయ్యడం సాధ్యమా? అసలే అనారోగ్యం. అలసిపోయి వున్నాం. రామదాసు గారు రిజర్వేషను కాగితం పట్టుకొని ఎటో వెళ్ళారు. ఈ లోగా చక్రం గారు వచ్చారు. బెర్తు లేకుండా వెళ్ళ లేమని చెపుతూ, బండి దిగి పోయాడు భీమన్న.

దిగిపోయి ప్లాట్ ఫారం మీద నిలబడ్డాం. ఒకటే వర్షం. చలి. బండికి సిగ్నల్ ఇచ్చారు. నాకు ఏడుపు వస్తూ వుంది. బండి కదిలింది-

అంతలో రామదాసు గారు కండక్టరుతో కలిసి పరుగున వచ్చి, తీరి ఫైర్‌లో ఎక్కెయ్యమన్నారు. కదులు తున్న రైలు ఎలా ఎక్కామో మాకే తెలియదు. మా వెనక రామదాసు గారూ, చక్రం గారూ కూడా ఎక్కారు. వా రిద్దరూ కొత్త ఢిల్లీ స్టేషనులో దిగి పోయారు. టిక్కెట్లు కాక, అదనంగా చాల అయింది, అయితే అయింది. రైలెక్కాం. కాశీ వెడుతున్నాం. అంతే చాలు!

వర్షం కురుస్తూనే వుంది. పెట్టె నిండా నీళ్ళు. బెర్తులు తడిసిపోయి వున్నై. చలి వణికించేస్తూవుంది. అప్పటికే అందరూ రగ్గులూ, రజాయీలూ కప్పేసుకున్నారు. నేను మెల్లిగా మా పెట్టె తెరిచాను. చకితనైపోయాను. అందులో నా చీరలు తప్ప మరేమీ లేవు!

హడావుడిలో, తేవా లనుకున్న పెట్టె వుంచేసి, వుంచెయ్యా లను కొన్న పెట్టి తెచ్చేశా నన్న మాట!

ఇక ఆ రాత్రి మా అవస్థ ఆ కాశీ అన్నపూర్ణకే తెలియాలి. ఎన్ని చీరలు కప్పుకుంటే చలి తీరుతుంది? పైగా భీమన్నకు? మా అవస్థ తోడి ప్రయాణీకులకు వినోద హేతు వయింది.

త్రీ టైరులో మావి సైడు బెర్తులు. అందువల్ల చలి మరీ విపరీతం. ఆదీ ఒకందుకు మంచి దయింది. బండి ఆగి నప్పు డెల్లా వేడివేడి టీ తాగుతూ ఆలీఘర్, కాన్పూర్, అలహాబాద్, ప్రయాగ అంటూ స్టేషన్లను లెక్క-పెట్టు కొంటూ - కళ్ళల్లోనే తెల్లవార్చేశాం.

పచ్చని గోధుమ పొలాల మీద నుంచి వచ్చే నును వెచ్చని ఉదయ పవ నాలు చలిని తుడిచేసి సేద దీరుస్తుండగా, తొమ్మిది గింటల ప్రాంతానికి మా రైలు కాశీ చేరింది. మనస్సు ఆనంద రాశీ భూ తమయింది.

స్టేషనులో దిగీ దిగటంతోటే మాకు ఘనమైన స్వాగతం ఇచ్చిన వాళ్ళు పండాలు!

కావి గుడ్డల, విభూతిరేఖల పండాలు, తండాలుగా మా చుట్టూ చేరారు. నాకు హిందీ కూడ బాగానే వచ్చు కనుక వాళ్ళను వదిలించుకోవడం సుళు వయింది. అందులో ఒకడు మాత్రం మా వెంటపడి, దగ్గరలోనే వున్న హోటల్ మానససరోవర్‌కు తీసుకు వెళ్ళాడు. ఈ దారిలోనే మేం రెండు తువాళ్ళు కొనుక్కొన్నాం. అంతవరకూ మేం ఆన్ని పనులకూ వాడు కొంటు న్నవి చీరలే!

ఆ పండా చాల మంచి వాడు. మేం యాత్రకు కాక, యూనివర్శిటీ పనిసిద వచ్చా మని తెలుసు కొని, నిరుత్సాహపడి, వెళ్ళిపోయాడు. ఏదో ఇవ్వబోయినా, పుచ్చుకో లేదు!

హోటలు నుంచి రిజిష్ట్రారు మెహ్రోత్రా గారికి ఎంతగా ఫోనుచేసినా, ఎంగేజుడు ధ్వని తప్ప మరేదీ లభించలేదు. వైస్ ఛాన్సలర్ ఫోనూ అలాగే వుంది. ఇక లాభంలే దనుకొని, కాలకృత్యాలు ముగించుకొని విద్యాపీఠకు రిక్షా ఎక్కాం.

భీమన్నను చూచిన మెహోత్రా ఆనందంతో అమాంతం కౌగిలించేసు కున్నాడు. ఆంతవరకు వాళ్ళు అయోమయ స్థితిలో పడివున్నారు. బయోడేటా

ఆ ఉదయమే అందిం దట. సైడేషను హడావిడిగా తానే (హిందీలో) వ్రాసేసి ప్రెస్‌కు పంపిందేశా డట. కనీసం వస్తున్నానని అయినా ఒక తంతి పారెయ్యి గూడదా అంటూ నిష్ఠూ లాడా డాయన. మేం పడ్డ అవస్థలు విని, జాలి పడ్డాడు చివరకు.

"పోనీ, ఇక్కడకు రాగానే ఫోను చెయ్య గూడదా?" అన్నాడు మెహోత్రా.

తాను భీమన్నకు లేఖ వ్రాసిన లెటర్ హెడ్ లోని ఫోను నంబరు చూచి, నుదురు బాదుకున్నాడు. "ఇది పాత నంబరండీ, బాబు! ఈ మధ్య నంబర్లు మారినై. దాన్ని మా వాళ్ళు దిద్దవలసి వుండె. ఆఫీసులు పని చేస్తున్న తీరు ఇలా వుంది." అంటూ నొచ్చుకొన్నా డాయన.

అపరాహ్ణం మూడు గంటలకు కాన్వొకేషను ప్రారంభం. అప్పటి కప్పుడే రెండు గంటలు!

సత్యాన్ని బెదరగొట్టి తరిమేశాం
సౌందర్యాన్ని నడి బజారులో కుక్కలకు విసిరేశాం
ఇక-శివం ఏదీ?
ఈ అమానుషాలు చూడలేక
శివం శిలై పోయింది!
జాతి శిథిలావ శేష మయింది!
శిల మళ్ళీ జీవం పోసుకొని
శివం కావాలి.
అందుకే ఈ తపస్సు!
అక్కడికే—
దుస్సహ మైనా- ఈనా
సహనాయత యాత్రా స్రోతస్సు!

—శివాలకలి

214. చెన్నారెడ్డిగారి మహితాత్మత

"మీరు వచ్చారు. సంతోషంగా వుంది" అన్నారు, ఛాన్సలర్ చెన్నారెడ్డిగారు మెల్లగా భీమన్నతో, గౌరవ డాక్టరేటును అందజేస్తూ.

కేవలం కళ్ళతోనే కృతజ్ఞత తెలుపుకొన్నాడు భీమన్న. మాటలు కూడ ఏవో పలికాడట కాని, తన మాటలు తనకే వినపడలే దట.

అవును. చెన్నారెడ్డిగారి సౌజన్యానికి, సౌహార్ద్రానికి, ఆ మహాత్మీయతకు, కృతజ్ఞత తెలపా లంటే ఎంతటి మహాకవి కైతే మాత్రం తగు మాటలేమున్నై!

తెలుగు ప్రజల హృదయాలను అక్షరాలా చూరగొన్న నిజమైన ప్రజానాయకుడు, దేశం మొత్తం మీదనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు గవర్నరు, సుమారు పందొమ్మిది యూనివర్శిటిలకు ఛాన్సలరు, అయిన ఒక అగ్రశ్రేణి వ్యక్తి, అధికార వేదికమీద అంత ఆప్యాయంగా ఒక కవిని పలకరించడం ఎంతటి పురుషోత్తమత! అంతటి సంస్కారం గల తెలుగువాళ్ళు రాజకీయ రంగంలో ఎంతమంది వున్నారు?

పైగా, ఆ వేదికమీద భీమన్నతో పాటు గౌరవ డాక్టరేటులను పుచ్చుకొంటున్న వాళ్ళు మరో ఇద్ద రున్నారు. అందులో ఒకరు ఒక ప్రఖ్యాత హిందీ విద్వాంసుడు. మరొకరు మన కందరికీ తెలిసిన యు. పి. మాజీ ముఖ్యమంత్రి, అప్పటి కేంద్ర రైల్వేమంత్రి కమలాపతి త్రిపాఠీ. కన్నడ మహాకవి డాక్టర్ బెంద్రే అనారోగ్య కారణంగా కాన్వొకేషనుకు రాలేదు.

నేను ఆడియన్సులో, మొదటి వరస సోఫాలో కూర్చుని, ఆ వైభవాన్ని చూస్తున్నాను. నిజానికి, నాకు ఇటూ, అటూ ఎవరు కూర్చున్నారో కూడ నేను గమనించలేదు. అలా గమనించడం నా స్వభావం కూడ కాదు. సైటేషను లన్నిటిలోనూ సుదీర్ఘమైనదీ, సరస పద సుందరమైనదీ ఒక్క భీమన్నను గూర్చినట్టిదే.

ముందుకు తోసుకుపోయే లక్షణం భీమన్నలో లేదు. తనను పక్కకు నెట్టి ముందుకు పోయేవాళ్ళకు వీలుగా తాను వెనక్కు తప్పుకొంటూ వుంటాడు కూడ! కాన్వొకేషను ముగిసి, కాఫీ కోసం బైలుదేరుతూ, విద్యాపీఠ అధినేతలు భీమన్న కోసం చూస్తే – ఈయన ఎక్కడున్నాడు? చాల వెనక! మెహోత్రా వెనక్కు వచ్చి, మమ్మల్ని తీసుకు వెళ్ళాడు. అంతవరకు ఛాన్సలరు చెన్నారెడ్డిగారు తమ కారు ప్రక్కనే నిలబడి వున్నారు–కారు తలుపు తెరచి పట్టుకొని!

మే మిద్దరం రెడ్డిగార్ని సమీపించాం. ముందుగా నేను వెళ్ళి కూర్చున్నాను. రెడ్డిగారు నవ్వుతూ భీమన్న చేయి పుచ్చుకొని, కారులోకి ఎక్కించి, తర్వాత తాము ఎక్కి, తలుపు మూశారు. కారు కాఫీ హాలు చేరుకొంది.

అదొక అందమైన చిన్నహాలు. పార్టీ కొద్దిమందికే. ముఖ్యంగా గౌరవ డాక్టరేటు పొందినవారికి. రకరకాల పదార్థాలు వడ్డించారు. ఛాన్సలరుగారు మా వంక చూశారు. తమ వద్దగల స్వీట్ను ప్లేటు తీసుకొని భీమన్న ప్లేటులోవేస్తూ అన్నారు "ఇవి ప్రత్యేకం కాశీ స్వీట్లు. కాశీలోతప్ప మరెక్కడా దొరకవు. వదిలిపెట్టకండి" అని.

త్రిపాఠిగారు కూడ మాతో బాగా కలిసిపోయారు. ఫోటోగ్రాఫర్లకు పండుగే అయింది.

పార్టీ తర్వాత అందరికీ వీడ్కోలు చెపుతూ, భీమన్నతో కరచాలనం చేసి కారెక్కారు చెన్నారెడ్డి గారు.

కారు పది మీటర్లు వెళ్ళిందో లేదో, టక్కున ఆగిపోయింది. రెడ్డిగారు దిగి వెనక్కి వచ్చారు. అందరూ ముందుకు వెళ్ళారు. ఆయన భీమన్నతో అన్నారు "కాశీ చూడ్డానికి ఏర్పాట్లు జరిగాయా?" అని.

"రెజిస్ట్రారు మెహ్రోత్రా, వైస్ ఛాన్సలరు రాజారాం శాస్త్రి చాల మంచి వాళ్ళు. మాకు సౌకర్యాల కేమి లోపం లేదు" అన్నాడు భీమన్న.

"ఒక కారును ఆయన అధీనంలో వుంచాం" అన్నారు శాస్త్రిగారు.

"మొత్తం కాశీ అంతా చూచి వెళ్ళండి" అని మాతో చెప్పి, తిరిగి కా రెక్కారు రెడ్డిగారు. ఎంతటి అతిలోక ధీరోదారత!

కాశీ అంతా చూడ్డానికి మాకు ట్రైం లేదు. మరునాడే, అంటే 20వ తేదీనే బైలుదేరవలసి వుంది. ఢిల్లీలో 21 సాయంత్రమే జాతీయ ఐహుమతి ప్రదానోత్సవం.

బహుశా అప్పటికి సాయంత్రం అయి దయి వుంటుంది! మూడు గంటలకు ప్రారంభమైన కాన్వొకేషను ఒక గంటలో ముగిసింది. టీ పార్టీకి మరోగంట పట్టింది. మరునాడు మధ్యాహ్నం బైలుదేరే కాశీవిశ్వనాథ్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషను చేయిస్తామనీ, అంతవరకు కాశీని ఇష్టం వచ్చినట్లు అనుభవించమనీ చెపుతూ, ఒక మంచి కారును మా అధీనంలో పెట్టారు విద్యాపీఠ అధినేతలు.

"ముందుగా హిందూ యూనివర్శిటీని, బెనారస్ సిల్క్ చీరలనూ చూద్దాం పదండి" అంటూ, మా కారులోకి వచ్చి కూర్చుంది ఒకావిడ. బైలు దేరాం ముగ్గురమూ.

ఆవిడ మరెవరో కాదు. బెనారస్ హిందూ యూనివర్శిటీ మహిళా కళా శాల ప్రిన్సిపాల్, డాక్టర్ సరోజినీ వర్షానీ!

ఇక్కడ విశేష మేమి టంటే - 1936 లో, ఎమ్ ఏ ఎల్ ఎల్ బీ చదువు కోసం, ఎక్కడికి రావా లనుకొన్నాడో భీమన్న, నలభై సంవత్సరాల తర్వాత, 1976 లో అక్కడికి రాగలిగాడు ఈ విధంగా!

శ్రీవల్లి పిక్చరు చూస్తోంది—

నేను మన ప్రణయ లీలా విలాసాలు చూస్తున్నాను-
ఒకే శెర మీద! .....
మనకు ముఖ్యం హృదయాలని నే నంటే-
హృదయాలకు ఆధారం శరీరాలని మీ రన్నారు
అదే నిజ మనిపిస్తున్న ది నా కిప్పుడు!
ఎవ రెన్ని చెప్పినా
వాస్తవ జీవితంలో

శరీరానిదే ప్రధాన పాత్ర ! ... .
ఆంజనేయుని కొండ , శివాలయం ఎదట ,
నందీశ్వరుని తోక దగ్గర మనిద్దరం ...
ఎంత చక్కని తోక !
దానితో ఆడుకుంటూ
ఒక వెంట్రుక పీకాను నేను ...
"అబ్బా , జడ పీకేశావ్" - అన్నది శ్రీవల్లి !
తలకిక్కు పడ్డాను నేను !
"చూశావా ? నాయిక చివరి కే మయిందో ?"
"ఏ నాయిక ?"

— రాగ మైథిలి

215 . పూల మనసులు

"కాన్వొకేషను జరుగు తున్నప్పుడు, నేను మీ ఆవిడ పక్కనే కూర్చున్నాను. ఈమె వేదిక మీద వున్న మిమ్మల్నే చూస్తూ కూర్చుంటే, నేను ఈమెనే చూస్తూ కూర్చున్నాను. మీకు జరుగుతున్న గౌరవాన్ని తిలకిస్తూ ఈమె మైమరచి పోయింది. ఆ ఆనంద పారవశ్యంలో ఈమె కళ్ళు నెల వంకల్లా ప్రకాశించినై . అదొక అపూర్వ సుందర దృశ్యం నాకు . ఇంతగా ఆరాధించే భార్య గల మీరు ధన్యులు . మిమ్మల్ని నేను ఎంతగానో అభినందిస్తున్నాను" అన్నది డాక్టర్ వర్షానీ భీమన్నతో - నన్ను గట్టిగా తనకు హత్తుకొని ముద్దు పెట్టుకొంటూ !

డాక్టర్ వర్షానీ బ్రిటన్ , అమెరికాలలో డాక్టరేట్లు పొందిన అత్యున్నత విద్యావంతురాలు . అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ సంఘ సేవకురాలు . గొప్ప విదుషీమణి . అంతటి మహిళ ఒక రాధలా అయిపోయిం దా క్షణంలో . ఆవిడ చేసిన ప్రశంస నాకు గౌరవ డాక్టరే టయింది . భీమన్నకు మరేను యిందో తెలియదు .

కాశీ హిందూ విశ్వవిద్యాలయం అత్యంత రమణీయం . ఆ సాయంత్రం ఆ పరమ సుందర విద్యా మందిరంలో , డాక్టర్ వర్షానీ మృదుమధుర

వాగ్వర్షంలో తడుస్తూ, విహరించడం నిజంగా ఎన్ని జన్మల పూజా ఫలమో అనిపించింది నాకు.

కారు డ్రైవరుకు ఆదేశా లిచ్చి, తన విజిటింగు కార్డు మా కిచ్చి, యూని వర్శిటి ఆవరణలోని తన యింటి వద్ద దిగిపోయింది వర్షానీ.

మా కారు చాల దూరం పోయి, చాల మలుపులు తిరిగి, విశ్వనాథుని టూరేగింపు సమ్మర్దం నుంచి బైటపడి, సిల్కు బజారు చేరుకొంది. కోడికి ధాన్యం రాశులు దొరికిన ట్టయింది నాకు.

భీమన్నకు నాతో సరిపడని సంగతులు కొన్ని వున్నై. అందులో ప్రధానమయింది బట్టల దుకాణాలకు రావడం. అయితే అది కాశీ కాబట్టి తప్ప లేదు. బహుశ రాత్రి పదకొండు గంటల వరకు ఆ ఇరుకు వీధు లన్నీ తిరిగి, ప్రతి సిల్కు షాపులోనూ చొరబడి, అక్కడున్న రకరకాల చీర లన్నీ కుప్పలు పోయించి, ఏదీ నచ్చక, ఏ ఒక్కటీ కొనకుండానే హోటలుకు చేరుకొన్నాం. ఈ నా కార్యక్రమం వల్ల ఆ రా తి విద్యాపీఠ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడ్డ కవి సమ్మేళనలో భీమన్న పాల్గొనలేక పోయాడు.

మర్నాడు ఉదయం ఏడు గంటలకే వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజారాం శాస్త్రి గారింట బ్రేక్ ఫాస్ట్ తీసుకొన్నాం.

"మీ రసాద్వైత భావన నన్ను బాగా ఆకర్షించింది. దానిని గురించిన వివరాలు పంపించండి" అన్నారు శాస్త్రి గారు భీమన్నతో. ఆయన తత్వ శాస్త్రంలో డాక్టరు. గొప్ప తాత్త్విక విద్వాంసుడు.

అక్కడి నుంచి కాశీ దర్శనానికి బైలుదేరాం. ఒక యూనివర్సిటి ఉద్యోగి మా కూడా గైడుగా వచ్చాడు. ముందు గంగ పొడవునా వున్న ఘట్టా లన్నీ చూసేశాం. ఏ ఘట్టంలోను స్నానం చెయ్యా లనిపించలేదు. అంత కశ్మ లంగా వున్నై నీళ్ళు. కనీసం నీళ్ళలో దిగడానికి కూడ మనస్కరించ లేదు నాకు.

దశాశ్వమేధ ఘట్టంలో కాబోలు కాళ్ళు, చేతులు, ముఖం కడు క్కొన్నాం. నిళ్ళ నిండా తేలుతున్న చీమిడి, తెమడ, ముఖం పుల్లల పాచి - పీ టన్నిటినీ ఆటూ ఇటూ పాయదోచి పుడిసెడు జలం తీసి నోట్లో పోసు కున్నాడు భీమన్న. పుక్కిలించి ఉమిచేశాడు. పరమజ్ఞుడైన వేదాంతికి అన్ని పదార్థాలూ సమానమే. అయినా ఆ దృశ్యం జ్ఞాపకం వస్తే, ఇప్పటికీ ఒళ్ళు జలదరిస్తుంది.

కాశీలో చూడవలసిన వన్నీ చూసు కొంటూ, తులసీదాసు రామాయణం వ్రాసిన "హనుమాన్ సంకట్ మోచన్" దర్శించి, ఆ మహా భక్తుణ్ణి ఒక సారి చర్శించు కొన్నాం. ఆ ప్రాంతంలో అత్యాధునికంగా నిర్మించబడ్డ "రాం చరిత మానస మందిరం" తులసీదాసు దివ్య స్మృతికి భారత భారతి పట్టిన వాత్సల్య నీరాజనం. గోడలపై మొత్తం తులసీ రామాయణ మంతా అందంగా వ్రాయబడి వుంది. రామాయణంలోని ముఖ్య ఘట్టాలు చిత్రించబడి వున్నై. చిత్ర శిల్పాలు కరెంటు ద్వారా ఆయా ఘట్టాలను ప్రదర్శిస్తూ వున్నై. ఎంతటి దివ్య దర్శనం!

ఆ మదిరం ఆవరణలో రకరకాల పువ్వు లున్నై. వాటిలో భీమన్నను ఆకర్షించినవి బంతిపువ్వులు. ఒక్కొక్క పువ్వు ఉదయిస్తున్న సూర్యబింబ మంతంత వున్నై. గుడిగోపరంమీది బంగారు కుండ లంతంత వున్నై. ఆకర్షించ కేమిచేస్తాయి?

ఒక పువ్వు సంపాదించా లనుకొన్నాం. ఆ చుట్టుప్రక్క లెవరూ కని పించలేదు. దొంగలించక తప్పదా? పువ్వుల్ని, పుస్తకాల్ని దొంగలించ వచ్చుట! ఏం చెయ్యాలి? అనుకొంటుండగా అంతలో ఎక్కడనుంచి వచ్చాడో ఒక వ్యక్తి, మా వంక ఒకసారి చూచి, తోటలోకి వెళ్ళి, మా దృష్టి ఏ పువ్వు మీద ఉన్నదో ఆ పువ్వును తుంచి, తెచ్చి నా చేతి కిచ్చి వెళ్ళిపోయాడు.

ఆ పువ్వును హైదరాబాదుకు తెచ్చుకోవా లనుకొంటూ, అతి లలితంగా దానితో ఆడుకొంటూ దుర్గాలయం చేరుకొన్నాం. ఆ పువ్వును దుర్గ కర్పించడం మంచి దన్న భావం తోచింది. దాన్ని అర్చకుడి కిచ్చాం. అతడు దానివంక గాని

మా వంకగాని చూడకుండానే, దాన్ని పుచ్చుకొని గర్భగుడిలోకి గిరవాటు వేశాడు. అయ్యో అనిపించింది మాకు.

"ఇంటికి పట్టుకెళదాం అనుకొన్నాం కదా? ఇక్క డెందు కిచ్చాం?" ఒకరి నొకరం ప్రశ్నించుకొన్నాం. సమాధానం దొరకలేదు. ఇప్పటికీ ఆ పువ్వు జ్ఞాపకంవచ్చి, బెంగ పుట్టిస్తూనే వుంటుంది భీమన్నకు.

ఆందమెట నున్నదో ఆమృత మటనున్న దే,
అమృతమే ఆనంద, మదె నీ వికాసమ్మ,
నీ వికాసమె సదా నిశ్రేయసము నాకు
నె ఱిగించవే, సంపూర్ణ సుందరీ!

—రాగ వైశాఖి

261. పాపం, విశ్వ నాథుడు

మేం విశ్వనాథుడి ఆలయం చేరుకునే సరికి పదిన్నరఅయింది. చిల్లర దేవు ళ్ళందర్నీ దర్శించుకొంటూ, తృణమో పణమో సమర్పించుకొంటూ, ఆస లాయనను చేరుకొన్నాం. మన మత రాజకీయ వ్యవస్థ లన్నీ ఒకే మూసలో తీసినట్టుంటై. గేటు కీపరు (ద్వార పాలకుడు) దగ్గరినుంచి మూల విరాట్టు వరకు ఒకటే రకం నిచ్చెనమెట్లు. ఈ మెట్లన్నిటావుండే చిల్లర దేవుళ్ళందరూ ఒకే మూలదేవుడి వివిధ రూపాలు. ఈ అందర్నీ తృప్తి పరచుకొంటూ ముందుకు పోవాలి.

భక్తి, నివేదన, అర్చన, అర్పణ, హారతి పళ్ళెంలో డబ్బులు వెయ్యడం, కొబ్బరికాయ కొట్టడం, పళ్ళు పూలు సమర్పించుకోవడం, మొక్కుబడి, హుండీ వగైరా లన్నీ ఈనాడు మనం నిరసిస్తున్న కరప్షన్ క్రిందకే వస్తా యంటాడు భీమన్న. ఏదో మాదిరిగా అధికారం కలవాళ్ళను తృప్తి పరచకపోతే, మానవుడికి ఏ పనీ జరగదు, ఏ కోరికా తీరదు: లీగల్ అయినా, ఇల్లీగల్ అయినా గ్రాటిఫికేషన్ గ్రాటిఫికేషనే. లంచానికి జన్మ స్థానం దేవస్థానమే అంటాడు.

విశ్వనాథుడి చుట్టూ జనం ఇసక వేస్తే రాల నంతగా మూగివున్నారు. మేం అక్కడికి చేరుకోగానే ఒక పూజారి భీమన్న చేతికి ఎంతో భక్తి గౌరవాలతో ఒక బంతి పూల దండ ఇచ్చాడు. అంతకంటె ఎక్కువ భక్తి గౌరవాలతో అందుకున్నాడు భీమన్న. దండ వాడిపోయి మురికిగా ఉంది. అయితే నేం? విశ్వనాథుడి సన్నిధితో వి. ఐ. పి. గౌరవం లభించిందికదా అన్న సంతోషంతో ముందుకు సాగాం. అంతలో నాకు ఆడ్డంవచ్చి చేయి చాపా డాపూజారి—దండ ఖరీదు యివ్వమంటూ! నేను దిగులు పడిపోయి, ఒక అర్ధరూపాయి ఇవ్వబోయాను. ఆ దండ పదిపైసలు కూడ చెయ్యదు. అతడు కోపంగా చూశాడు నాకేసి.

"పోనీలే, ఒకరూపాయి ఇవ్వు" అన్నాడు ఇదంతా గమనిస్తున్న భీమన్న.

"ఆ దండ ఖరీదు ఏడున్నర రూపాయలు" అన్నాడా పూజారి ఉగ్రంగా. నిజమే. అది దైవ దండ కదా మరి!

"పోనీ ఇంకో రూపాయి తీసుకో", అంటూ రెండి వ్వబోయాను. నకో అన్నాడతడు.

"ఇదిగో నీ దండ" అంటూ విసిరేశాడు భీమన్న దాన్ని అతడి మీదకు. దానితో మమ్మల్ని ఆ పూజారి తిట్టిన తిట్లు ఇన్నీ అన్నీ కావు. భీమన్నకు హిందీ తెలియదు, విశ్వనాథుడికి చెవుడు, కనుక సరిపోయింది!

ఒకళ్ళ నొకళ్ళు తోసుకొంటూ, విసుక్కొంటూ, తిట్టుకొంటూ - ఒకళ్ల మీద ఒకళ్ళు పడి పూజలు చేస్తున్న ఆ ఆర్త జన సమూహంలో చొరబడి, ఎలాగో విశ్వనాథుడి ముందు పడ్డాం పోయి. అది నిజంగా ఒక అపూర్వ దృశ్యం!

ఆకులు, పువ్వులు, పండ్లు, దండలు, దారాలు వగైరాతో నిండివున్న నీటి గుంట అది. ఆ గుంటలోని నీరు ఒక ప్రక్కనుంచి వస్తూ, మరో ప్రక్కనుంచి పోతూ వుంటుంది. అదే తీర్థ జలం. ఆ జలం ప్రాణాహికం కనుక,

ఆలలుగా ఊగుతుంది . ఆ అలలలో ముసుగుతూ , తేలుతూ వుంది ఒక శివ లింగం . అదే విశ్వనాథుడు .

అక్కడి నుంచి అన్నపూర్ణ దర్శనానికి వెళ్ళాం . తలుపులు మూసి వున్నై . అంతకు క్షణం ముందే మూసా రట . ఆవిడగారు స్నానం చేస్తూ ఉన్న దట . పన్నెండు గంటల తర్వాత గాని దర్శనం లభించ దట .

"ముందే అమ్మగారి దర్శనం చేసుకోవలసింది . పొరపాటు చేశాం . ఇప్పుడేం చెయ్యాలి? అంటూ "భీమన్న , తలపట్టుకొని అక్కడున్న ఒక రాతి దిమ్మపై కూర్చున్నాడు . గుడి గుమ్మం ముందున్న మంటపంలో కుంకుమ పూజ జరుగుతోంది . పూజ చేస్తున్న వాళ్ళు తెలుగు వాళ్ళు . చెయ్యిస్తున్న పూజారులు తెలుగు బాగా మాట్లాడు తున్న తమిళులు . ఆందులో కొందరు మా వద్దకు వచ్చారు . తమిళంలో పలకరించాను వాళ్ళని నేను .

ఇదంతా గమనిస్తున్న అమ్మవారి పూజారి ఒకడు , ద్వారం వద్దనే నిలబడి వున్నవాడు మా వద్దకు వచ్చి , ఏమిటి విశేషం అని అడిగాడు . మా పరిస్థితి వివరించాను నేను . తెలుగు దేశం నుంచి వచ్చాం . విశ్వనాథ ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వు చేయించుకున్నాం . పన్నెండు గంటలు దాటేవరకు వుండలేం . ఇది మా అవస్థ !

మా అవస్థకు అతడెంతో జాలి పడ్డాడు . అయినా ఏం చెయ్యగలడు ? అత డొక పూజారి మాత్రం ! అధికారి వద్ద పి ఏ వంటి వాడు !

"ఈ పూజా ద్రవ్యాలను అమ్మవారికి మా తరపున అర్పించు" అంటూ భీమన్న మా వద్ద వున్న తట్టను పూజారి చేతి కిచ్చాడు . అందుకొని, దానిలోనుంచి పూలమాలను తీసి తలుపు గొళ్ళానికి తగిలించాడతడు .

అనుకోని సంఘటనతో - భీమన్న ఆనందానికి అవధి లేక పోయింది . ఆ ఆనందంలో పడి , మై మరచి తాండవిస్తాడో యేమో నని భయపడ్డాను నేను . అంతటి నాస్తికుడు ఇంతటి భక్తుడా ! పరమ నాస్తికుడైన వాడే పరమ భక్తుడు కూడా నేమో ! తాదాత్మ్యమే కదా భక్తి అంటే?

"నిజంగా మనం ధన్యులం, ఆమె స్నానంచేసి రాగానే, తన జటలోకి వెళ్ళేది ముందుగా మన పువ్వులే!" అన్నాడు భీమన్న. ఎంత మనోహరమైన ఊహ!

మేం బైటికి వచ్చేసి, ఇంటి వద్ద మిత్రులకోసం గంగాతీర్థం పాత్రలూ, అవీ కొనుక్కొని, ఇక బైలు దేరదాం అనుకొంటూ, మరోసారి అన్నపూర్ణ గుడి తలుపులు చూచిపోదాం అనుకున్నాం. అంతదూరం వచ్చి అసలు శక్తిని చూడకుండా ఎలా? అప్పటి కింకా పన్నెండు గంటలు కాలేదు. అవతల రైలుకు డైం అయిపోతూ వుంది!

అన్నపూర్ణ గుడిలో అడుగు పెట్టాం. గుడి తలుపులు తెరుచుకున్నై!

ఇదేదో అద్భుతం అనడం లేదు నేను. ఆ రోజున ఎందుకో కొంచెం ముందుగానే గుడి తలుపులు తెరిచారు. అంతే.

చక్కగా స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి, అందంగా అలంకరించుకొని కొలువుతీరి వున్న ఆ దేవి, విశాలాక్షి, విశ్వేశ్వరి ఎంత దివ్యంగా వుంది!

కరకు వర్తకుల మురికి చేతులు తగలని, అమాయకు డైన రైతు వండి వడ్డించిన నెల్లూరు బియ్యపు అమృతాన్నంలా ఎంత స్వచ్ఛంగా వుంది!

అనిర్వచనీయమైన అంతటి భక్తిలోను, ఆసూయ లాంటి దేదో నా బుర్రలో ప్రవేశించి నట్టుంది - భీమన్న చేయి పుచ్చుకొని బైటికి నడుస్తూ అనేశాను, "పాపం! విశ్వనాథుడు! అమ్మగారు ఇంత స్వచ్ఛంగా కొలువుతీరి వుంటే, ఆయనగారు ఆ మురికి గుంటలో మునుగుతూ, తేలుతూ వున్నాడు!" అని.

"ఎంత గొప్ప వేద వాక్యం!" అన్నాడు భీమన్న, నే నన్న మాటకు అంతరార్థం వూహస్తూ. నిజమే. వెనక అంతటి స్వచ్ఛమైన శక్తి లేకపోతే, ఇంతటి శిష్టదుష్ట లోక పరిపాలనా నిర్వహణ శిరో వేదనను ఎలా భరించ గలుగుతున్నాడు శివుడు!

ఎందుకయ్యా , ఒడలు మరచిన
ఈ నిరంతర తాండవం ?
మధురతా వేగమునకు నీవు
మరచినది నిను నీవె అయినా-
తన్ను , తన మూలమును మరచి
కన్ను కానదు లోక వృత్తం !
లోక వృత్తి ప్రకృతి మరచి
లోకి ఆయెను మనుజుడు !

—అకాండ తాండవం

217. ఢిల్లీ దేవి ఆతిధ్యం

"ఇక భోజనం చేసే ట్రైం లేదు . సరాసరి స్టేషనుకే పోతాం" అన్నాడు భీమన్న మెహ్రోత్రా గారితో , వారి ఇంటి వద్ద కారు దిగుతో .

"మీకు మంచి విందు చెయ్యి వలసింది . తొందరై పోయింది . మా ఆవిడ లక్నోకు వెళ్ళింది . పిల్లలు అక్కడ వున్నారు . ఇప్పుడు నేనూ అక్క-డికి బయలుదేరు తున్నాను . నాతో పాటే కొంచెం కిచిడీ తిందురు గాని రండి" అంటూ వంట గదిలోకి దారితీశా డాయన .

పొయ్యి పక్కనే డైనింగు టేబులు , వంట చేస్తూనే వడ్డించ సాగాడు నలుడు ! వేడి వేడి కిచిడీ , వంకాయ కూర , మరే వేవో ఆసరాలు-అద్భుతంగా వుంది భోజనం . అంత కెన్నో రెట్లు ఆనందం కలిగించింది ఆయన ఆప్యాయత.

"మా ఆవిడ వుంటే ఎంతో మంచి విందు చేసి పెట్టేది" అంటూ , భోజనం చేస్తున్నంత సేపూ వాళ్ళావిడ గుణ గణాలను గురించి ప్రశంసిస్తూనే వున్నా డాయన . నిజంగా భార్య పట్ల అంత మెప్పరిగా వుండాలి భర్త . ఎంతో ఆదర్శ గృహస్థు మెహ్రోత్రా . భోజనం తర్వాత ఎన్నో రకాల మిఠాయిలు పెట్టాడు బల్ల మీద . అన్నీ వాళ్ళా విడ తయారు చేసి వుంచినవే నట !

ఆ మధ్యాహ్నం కాశీ విశ్వనాథ్ ఎక్స్‌ప్రెస్ ఎక్క , మర్నాడు ఉద యానికి ఢిల్లీ చేరుకోన్నాం . ఈ బండి లక్నో మీదుగా వచ్చింది . వెంటనే

ఆటో ఎక్కి, రామకృష్ణాపురం చేరాం - రామదాసు గారి మకాంకు. అక్కడ వారి బిడ్డల, ముఖ్యంగా కమల ఆతిధ్యం అనుభవించి, భోజనం చేసి, పిల్లల్ని తీసుకుని గెస్టు హౌసుకు వచ్చేశాం.

ఆ సాయంత్రం కేంద్ర సాహిత్య అకాడమీ వారి బహుమతి ప్రదానోత్సవం. తెలుగులో "గుడిసెలు కాలిపోతున్నై" కావ్య సంపుటికి 1975వ సంవత్సరపు జాతీయ బహుమతిని అందుకున్నాడు భీమన్న.

ఉత్సవ కార్యక్రమాన్ని ఫొటోలు తీశారు, ఫిల్ము తీశారు, టెలివిజన్ తీశారు. ఆ తీసింది ప్రభుత్వ శాఖల వాళ్లే. అయితే - అందులో ఏ ఒక్క దానిలోనూ భీమన్న బొమ్మ లేదు. ఒక్క భీమన్నకే కాదు, తక్కిన భాషల బహుమతి గ్రహీతలలో చాల మందికి ఆందులో స్థానం ఇవ్వబడలేదు. ఇద్దరు ముగ్గురు వ్యక్తులపై మాత్రమే ప్రభుత్వ ప్రచార సాధనా లన్నీ మోహరించబడినై!

"ఇదేనా న్యాయం? ఇదేనా ప్రజాస్వామిక ప్రభుత్వం పనిచేయవలసిన తీరు?" అని ప్రశ్నించాడు భీమన్న - ఆ మరునాడు సాయంత్రం ఢిల్లీలోని ఆంధ్ర సంఘాలవారు సమిష్టిగా తనకోసం ఏర్పాటుచేసిన సన్మాన సభలో ప్రసంగిస్తూ.

ఆంధ్ర అసోసియేషన్, ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ, దక్షిణభారత నటీనట సమాఖ్య, తెలుగు సాహితి, తెలుగు కళాజ్యోతి మున్నగు సంస్థలు కలిసి, తూర్పు కిద్వాయ్ నగర్‌లోని కమ్యూనిటీ హాలులో చేసిన సభ అది.

సభకు అధ్యక్షులు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తాతాచారి గారు. శ్రీమతి లక్ష్మీ రఘురామయ్యగారు ప్రధాన వక్త. ఢిల్లీ ఆంధ్ర ప్రముఖులు, వివిధ సంస్థల కార్యకర్తలు అంతా ఏకభావంతో, ఏక వేదిక మీద కలుసుకున్న ప్రత్యేకత ఆ సన్మాన సభది. ఈ సహకార సమన్వయ సాధనలో విశేషంగా కృషి చేసినవారు భూషి రామదాసు గారు.

"రావోయి రావోయి ఓ బోయి భీమన్న" అంటూ కళాజ్యోతి బాల బాలికలు పాడిన స్వాగత గేయం - ఢిల్లీ ఆంధ్ర యువజనత సంగీత సాహిత్యాల ప్రగతికి పట్టిన నీరాజనం.

ఆ మరునాడు కాబోలు కరోల్‌బాగ్‌లోని ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ వారు భీమన్నకు ప్రత్యేక సన్మానం చేశారు. ఆ ఉదయం ఏడిద గోపాలరావు గారింట, మధ్యాహ్నం ఇలపావులూరి పాండురంగురావు గారింట, సాయంత్రం టి. ఆర్. రావుగారింట విందులు. టి. ఆర్. రావుగారు భీమన్న కవితలు, నా పాటలు టెప్‌రికార్డు చేసుకొన్నారు తమ ఇంట విందులో.

సభకు అధ్యక్షత వహించిన పాండురంగారావు గారు భీమన్న రసాద్వైతం గురించి చేసిన ప్రసంగం అద్భుతమైన ఒక సాహితీ కళాఖండం. తెలుగు సాహితి, నటీనట సమాఖ్య లు కూడా ప్రత్యేక సన్మానాలు చేశాయి.

కేంద్ర హోం శాఖామాత్యులు బ్రహ్మానందరెడ్డి గారింట స్వీట్లు, కర్రా గోపాలరావు గారింట భోజనం——అవెంతో ఆత్మీయ సన్నివేశాలు. బి. ఎస్. మూర్తి గారింట విందుకు వస్తామని మాటిచ్చి వెళ్ళలేదు. నైనాల గణేశ్వరరావు గారు కూడ అక్కడికి వచ్చారట, మా కోసం చాలా రాత్రివరకు ఎదురు చూశారట. అక్కడినుంచి ఫోను వస్తుందిలే అనుకొంటూ ఇక్కడ భీమన్న, రామదాసు తాగుతూ కూర్చున్నారు. ఆక్కడ వాళ్ళూ, ఇక్కడ వీళ్ళూ పరస్పరం ఎదురు చూడడం మధ్య——నేనూ, పిల్లలూ మాడాం.

మా డిల్లీ యాత్రలో మరొక చిరస్మరణీయ మధుర సన్నివేశం రాష్ట్ర పశు సంవర్ధక శాఖామంత్రి వెంకటరామారెడ్డిగారి తోడిది. ఆయన గొంతు కేన్సరుతో బాధపడుతూ, డిల్లీలో చికిత్స పొందుతున్నారు. గెస్ట్‌హౌసు ప్రత్యేక క్వార్టరులో వున్నారు. భార్య ఉమాదేవి, చిన్న బిడ్డ అరుణ వారితోనే వుంటున్నారు. ఆవిడ సాక్షాత్తు అన్నపూర్ణకు ప్రతిరూపం. మా విజయ భారతి క్లాస్‌మేటట ఎం. ఏ లో.

భీమన్న పట్ల వెంకటరామారెడ్డిగారికి గల ప్రేమ, గౌరవాలను చూచి ఎంతో అద్భుత పడ్డాను నేను. అంతటి సౌహార్దం, సౌజన్యం, సాంస్కృతిక వైదుష్యం రాజకీయ నాయకులలో, ముఖ్యంగా మంత్రులతో చాల అరుదు.

"డిల్లీ అంతా చూశారా?" అడిగారు రెడ్డిగారు. స్వరవిస్తర యంత్రం సహాయంతో బాగానే మాట్లాడ గలుగుతున్నా రప్పటికి. భీమన్న సమాధానం వినకుండానే "మా కారు తీసుకువెళ్ళండి. ఒంటిగంటకు పంపిం చేస్తే చాలు" అన్నారు. అవసరం లేదన్నా వినిపించుకోలేదు.

ఆ కారులో ఉదయమంతా తిరిగి, మధ్యాహ్నానికి సార్జెంట్ హృషికేశ రావు గారింటికి చేరుకొన్నాం, ఆయన తాడి వెంకట కృష్ణారావుగారి తమ్ముడు. అతిధి సత్కారాలలో అద్వితీయమైన కుటుంబం అది. కృష్ణారావుగారికి భీమన్న పట్ల అపారమైన భక్తి. పండగ అయినా—కాకపోయినా—భీమన్న కిష్టమైన గారెలు, బూరెలు చేయించి పంపిస్తూ వుంటా డాయన. మంచి రచయిత కూడ. హైడరాబాదునుంచి ఆయన లేఖ వ్రాశాడట. పట్టు పట్టి భోజనానికి తీసుకు వచ్చా డీయన మమ్మల్ని ఇక్కడ తమ మకాం కు.

భక్తులపట్ల భగవంతుడిలా, తనకు ఆతిధ్య మిచ్చే వారి పట్ల చాలా క్రూరంగా వ్యవహరిస్తాడు భీమన్న. ఎలాంటి లోపం కనిపించినా పట్టుకొని విమర్శిస్తాడు. కొంచెం బాగున్నా, చాల బాగున్నదని మెచ్చుకుంటాడు. కొంచెం బాగు లేకపోతే ఏమీ బాగుండ లేదని విసుక్కుంటాడు. విమర్శ నిరేహతుకం కాకపోవచ్చు. మర్యాద కాదుగదా! నేను హెచ్చరిస్తూనే వుంటాను. ఫలితం వుండదు.

"నిన్ను ఒకసారి భోజనానికి పిల్చిన వాళ్ళు మళ్ళీ మరొకసారి పిలువరు." అంటాను. కాని, ఆది నిజం కావడం లేదు!

వంట ఎంత పాడుగా ఉన్నా, అమృతంలా వున్నదని మెచ్చుకోవడం అతిధులకు అలవాటు. భీమన్న మాత్రం యదార్థాన్ని ముఖం మీద చెప్పేస్తాడు. "వంట చేతగాక పోతే, హోటలు నుంచి తెప్పించలేక పోయారా" అంటాడు. ఆ పిల్చిన వాళ్ళెంత బాధ పడతారో అని నా భయం. బాధపడతారు నిజమే కాని, మళ్ళీ మళ్ళీ పిలుస్తూ వుంటారు. తదితరుల మెరమెచ్చుల కంటె, ఈయన యదార్థ వాక్కులే నచ్చుతాయి చాల మందికి. తమ లోపాలను సరిదిద్దు కోడాని ప్రయత్నిస్తారు వాళ్ళు. ఎవరికైనా ఆత్మ సాక్షాత్కారం కలిగించ డంలో భీమన్న అద్వితీయుడు.

హృషికేశదావు, విజయేశ్వరి దంపతుల సహనాన్ని పరీక్షకు పెట్టాడు భీమన్న. అయితే ఇక్కడి పరిస్థితి వేరు. వీరి కాలనీ దాదాపు ఢిల్లీకి వెలుపల ఎక్కడో దూరంగా, లారెన్సు రోడ్డు చివరలో వుంది. కారును మధ్య నుంచే పంపించేసి, బస్సులో ప్రయాణం చేశాం. పిడికెడు భోజనం కోసం ఇంత దూరం రావడ మేమిటి? ఇంత దూరమని ముందే చెప్పవద్దా? ఇదీ భీమన్న కోప కారణం.

వారింటికి వెళ్ళే టప్పటికి ఇంకా కొన్ని వంటలు వండుతున్నారు. వెంటనే వడ్డించెయ్య మన్నాడు భీమన్న. మజ్జిగ వుంటే చాలన్నాడు. ప్రొద్దు వాలిన మాట నిజమే. అయినా, అంతటి మొరటుతనమా అనిపించింది నాకు.

భీమన్న చిరాకు నంతా తమ చిరునవ్వులతో చల్లార్చేశా రా దంపతులు. వారు నిజంగా మూర్తీభవించిన సత్వ గుణ సంపది!

'ఇంతటి శుద్ధ సత్వాన్ని నే నెక్కడా చూడలేదు' అన్నాడు భీమన్న - బీరు గ్లాసును ఖాళీ చేసి బల్లమీద పెడుతూ.

అమృత మూర్తీ! నీ విధమ్మున
ఆడు చుంటిని, పాడు చుంటిని
దారికొ నీ హృదయ బిందువు
చేరులోపల ప్వేచ్ఛగా!
గజ్జె విప్పకు, కాంతి తీయకు
గాన మాపకు బ్రతుకు పొడవున
ఆటగా, ఒక పాటగా, నా
బాట నీలో చేరి పోనీ!

—అకాండ తాండవం

218. హిమాల యోన్నతి

హరద్వార హృషికేశాలను 1973 లోనే దర్శించి వున్నాడు భీమన్న. ఇప్పుడు మేం నలుగురం కలిసి దర్శించాం. హిమాలయ పాద కింకిణీ శ్రేణు

లైన శివాలకలతోను, స్వచ్ఛమైన గంగతోను అంత సన్నిహితంగా ఆడుకోవడం ఎంత మనోమోహనం!

బ్రహ్మకుండంలోని ఆ సంధ్యా దీపోత్సవం, ఆ ఘంటా నాదోత్సవం, దివ్యజీవన వ్యంజకమైన ఆ ఆరాత్రికోత్సవం నేత్రోత్సవమై, మానసోత్సవమై, యావజ్జీవితోత్సవమై పరవశత్వం కలిగించి, అమృతోత్సవ మయింది మాకు. అది నిత్యారాధన, శివశ క్త్యారాధన.

సనాతన భారత వైభవం, జాతీయ జీవ నౌజ్జ్వల్యం ఇలా వుండే దని ఆధునికులకు చెప్పడంకోసమని ఈ గంగావతరణ దివ్యక్షేత్రంలో మిగిలివున్న జ్వాలానల విస్ఫులింగ మేమో ఇది! ఇలా ప్రతి సాయంసంధ్యలోనూ, జిగేలు మంటూ జాతి జీవన నౌకకు సెర్చిలైటు, మార్గసూచకజ్యోతి అవుతూ ఉన్నది!

నీల గంగ కొండమీద మనసాదేవి, కొండకింద చండిదేవి!

ఈ దేవతలూ, వాళ్ళ శక్తులూ మాట ఎలా వున్నా - వాళ్ళ రూపకల్పన వెనకవున్న పాక్కృతిక సత్య భావన ఎంత గొప్పది! తిండిని వెతుక్కోవడంలోనే బ్రతుకు నంతా వ్యయం చేసుకోవలసిన దురవస్థ లేని ఆ రోజులలో భారతీయ ఋషులు పెంపొందించుకొన్న మేధాశక్తి, ఆనందభావన, పారమాత్మికాదాత్మ్యం అంతటివి!

నీల గంగను పరామర్శించి, ఆ తీరంలోని చండీశ్వరి దర్శనార్థం వెళ్లేసరికి, ఆవిడగారు కూడా స్నానంచేస్తూ వుంది. గుడితలుపులు మూసివున్నై. ఆలయావరణ విదేశీ భక్తులతో నిండివుంది. అందులో అధిక సంఖ్యాకులు అమెరికన్లు, మహిళలు.

"పది నిమిషాలు ఆగండి" అన్నాడొక పెద్దమనిషి, మా వద్దకు వచ్చి. "ఈ లోగా మీ కేపని కావలసినా నేను చేసి పెడతాను. పురమాయించండి" అన్నాడు.

"మాకు కొంత ప్రతి తెచ్చిపెట్టండి" అన్నాడు భీమన్న. ప్రతికి అక్కడున్న విలువ మరెక్కడా లేదు! దాని కోసం పోటీగా ఎగబడుతున్నా రక్కడి భక్తకోటి! అది గమనించిన భీమన్న!

"భలే కోరిక కోరారే" అన్నా డాయన ఆశ్చర్యంతో, ఇబ్బందిగా. స్వయంగా తానే వెళ్ళి, నానా తంటాలూ పడి, ఇంత పత్రి తెచ్చి యిచ్చాడు భీమన్నకు. భీమన్న పేరు తెలుసుకొని, ఆద్భుత పడ్డాడు. "కాశీ విద్యా పీఠ డాక్టరేట్ తీసుకున్నది మీరేనా? పత్రికలలో చదివాను. ఎంత అదృష్టవంతుణ్ణి!" అంటూ భీమన్న చేతులు తన చేతుల్లోకి తీసికొని ఆవనత శిరస్కుడై నాడు!

చిత్ర మేమి టంటే - ఆయన మరెవరో కాదు, కేంద్ర ప్రభుత్వ మాజీ విద్యా మంత్రి త్రిగుణ సేన్!

హృషికేశ్ సందర్శనం సాక్షాత్తు హృషికేశ్వరుని దర్శనమే. అకలంక మైన దివిజ గంగ అక్కడిది. విజయ పల్లవీ, విజయేందిర లు ఆ ఇసకలో, ఆ అలలలో ఆనందమయులై ఆడుకొంటూ వుంటే, చూస్తూ అవశులమై పోయిన అదృష్టం మాది. వాళ్ళు ఆ తీరాలలో పోగు చేసుకొన్న గుండ్రాళ్ళు ఇప్పటికీ వున్నై మా ఇంటి నిండా, ఇంటి చుట్టూ. లక్ష్మణ ఝూలా వంతెన మీద పల్లవి చేతిలోని వేరుసెనగ పొట్లాన్ని కోతి లాక్కు పోవడం ఇప్పటికీ తలుచు కొని నవ్వు కొంటా రీ యిద్దరూ.

మూడేళ్ళ క్రితం భీమన్న ఇక్కడికి వచ్చినప్పుడు నిర్మాణంలో వున్న శివ వేంకటేశ్వ రాలయాలు ఇప్పుడు సంపూర్ణాలయాలుగా విలసిల్లు తున్నై. ఆ రెండు రోజులు మా బ్రేక్ ఫాస్టు ఆ ఆలయాల ప్రసాదాలే. అప్పటి ఆంధ్రా శ్రమం అధినేత గోపాలరెడ్డి గారి ఆదరణ కూడ చాల గొప్పది. గీతాశ్రమం, స్వర్గాశ్రమం, శివానం దాశ్రమం మొదలైన వాటి మధురానుభూతు లెన్నిటినో గుండెల నిండా నింపుకొని, రై లెక్కి ఢిల్లీ చేరు కొన్నాం - మార్చి ఒకటవ తేదీ ఉదయానికి.

ఇక్కడ, న్యూఢిల్లీ అనుభవాలలో ప్రత్యేకంగా పేర్కొనదగిన వారిలో ఒకరు చోళ్ళ విష్ణు. ఆయన ఢిల్లీ హరిజన సేవక సంఘానిక చెందిన పాత హరిజన నాయకుడు. అదే ఆయనతో భీమన్న తొలి పరిచయం. భీమన్న రచన లన్నీ పంపవలసిందిగా వంద రూపాయ లిచ్చా డాయన. బహుశా, పంపే వుంటాం. ఎందు కంటే - పుస్తకాలను పోస్టు ద్వారా పంపడం కాని,

మార్కెట్టులో పెట్టడం కాని మాకు ఆలవాటు లేదు. అందుకు కావలసిన కసీస సౌకర్యాలు కూడ మాకు లేవు.

మరొకరు ఉషారాణీ భాటియా. ఆమె భీమన్నను చూడ డాని కని ఉద యమే గెస్ట్ హౌస్‌కు వచ్చి, ఈయన ఎంతకూ బాత్ రూం నుంచి బైటికి రాక పోవడంతో, నాతో మాట్లాడేసి వెళ్ళి పోయింది. ఆమె నేషనల్ బుక్ ట్రస్టు లో తెలుగు సంపాదకు రాలు.

కేంద్ర ప్రచార శాఖకు చెందిన టి. వి. కృష్ణారావు వంటి భీమన్న చిర కాల మిత్రు లెందరో మాకు తోడ్పడినవా రున్నా రింకా. కేంద్ర మంత్రి కొ త్త రఘురామయ్య గారి ఆదరణ మరువ రానిది.

ఒక ఉదయం చలిలో రోడ్డు మీద మామూలు దుస్తులతో కనిపించిన భీమన్నను చూచి, వెంటనే తమ ఇంటికి పరిగె త్తి, తన చలికోటును తెచ్చి భీమన్నకు కప్పిన కుసుమ ఆనందరావు గారి ఆర్ద్ర హృదయం ఎంతటి అమృత పూరం!

అంతకు ముందే ఢిల్లీలోని బిర్లా మందిరం, ఎర్రకోట, యమునా తీరం, రాజఘాట్ వగైరా, రేస్ కోర్సుతో సహా చూచి వెయ్యడం వల్ల, టికెట్లు ముందే రిజర్వు చేయించు కొని వుండటం వల్ల, ఆ ఒకటవ తేదీ సాయంత్రమే వెంకటరామారెడ్డి గారి కారులో స్టేషనుకు చేరుకొని, మూడవ తేదీకి హైదరా బాదు చేరుకొన్నాం.

పైవమై, నీ మార్గ మందే
పడుచు లేచుచు వచ్చు చుంటిని,
పూవు దొరికిన నీ గురించే
ముల్లు విరిగిన నీ గురించే!
ఎవరు నాకెదు రేగు దెంచిన
నీవ యని పూజింతు, దేవా!
ఎవరు నీ కెదు రేగు దెంచిన
నేనె యని కరుణింపుమా!

—అకాండ తాండవం

219. గుడిసెలకు సన్మానం

కప్పుపై ఆకు లన్నియు గాలి కెగిరి
పోయె, వానలచే కూలిపోయె గోడ!
ఎండిపోయిన శ్రమికుని గుండె వోలె
క్రూర దారిద్ర్య మీ యింట కొలువు తీర్చె!

— కూలి రాజు (నాటకం)

"గుడిసెలకు జాతీయ బహుమానమా?" అంటూ తల బాదుకొన్న సాహితీ వణిక్ పుంగవులు, పండిత సింహాలు లేక పోలేదు. కాని, అట్టి వాళ్ళు చాల కొద్దిమంది. వాళ్ళైనా తమ తమ జూ లకు పరిమితమై వున్న వాళ్ళే.

అభ్యుదయ పధంలో, ప్రగతి పథకాలతో దండు కదిలి పోతున్న జనం, యువజనం నవ జనం పుంజుకొన్నది – ఈ రచనకు లభించిన గుర్తింపుతో. లెఫ్టిస్టులు, రైటిస్టులు, మోడర్నిస్టులూ, సనాతనిస్టులు కూడా తమ ప్రమోదాన్ని తెలియజేసిన సందర్భమిది – సభల ద్వారా, సన్మానాల ద్వారా, సమీక్షల ద్వారా, ప్రత్యేక వ్యాసాల ద్వారా.

భీమన్నకు గౌరవం గాని, గుర్తింపు గాని, ఏది లభించినా – అనుకోకుండా వస్తుంది. చాల ప్రత్యేకంగా వస్తుంది. అట్టి సందర్భాలలో మళ్ళీ మళ్ళీ సన్మానాలు జరుపుతూ వుంటారు – ప్రజలూ, సాహితీ ప్రియులూ, సంస్కృతి సంస్థలూ. ఈయనకు జరిగే ప్రతి సన్మానమూ శివ సరస్వతి మూర్తికి జరిగే ప్రత్యేక సమారాధనమే కనుక కొంగ్రొత్తగానే, నవ భావోన్మేషకం గానే, పరమానందకరం గానే వుంటుంది. అయితే–వాటిని గురించి వ్రాయాలంటే ఒక ప్రత్యేక పరిశోధక గ్రంథాన్నే సంకల్పించ వలసి వుంది. ఇక్కడ స్థలం చాలదు.

మేం ఢిల్లీ నుంచి హైదరాబాదు చేరే టప్పటికి–మార్చి మూడవ తేదీన–ఇంటివద్ద ఎదురు చూస్తూ కూర్చున్నారు సూర్యాపేట మిత్రులు. ఆ సాయంత్రమే సూర్యాపేటలో ఒక కవి సమ్మేళనకు అధ్యక్షత వహించవలసి వుంది భీమన్న. అది అంతకు ముందెప్పుడో నిర్ణయమైన ప్రోగ్రాం, జ్ఞాపకం లేదు భీమన్నకు.

ఒక వారం రోజులపాటు ఎక్కడికీ కదల లే నంతగా అలసిపోయి వున్న భీమన్న వెంటనే సూర్యాపేటకు బైలుదేరక తప్పలేదు.

ఆంధ్రప్రదేశం లోని అగ్రశ్రేణి కవు లంతా పాల్గొన్న కవిసమ్మేళన అది. అనుముల కృష్ణమూర్తిగారి వంటి సాంప్రదాయిక కవి తల్లజుల ప్రశంసలను భీమన్న అందుకొన్న మహ త్సన్నివేశ మది. అయితే భీమన్న మాత్రం అతి నిరసంగా వుండటంవల్ల, తన అధ్యక్షపదవీ కార్యక్రమాన్ని తన ప్రత్యేక సముల్లాస శక్తితో నిర్వహించలేక పోయా నన్న చింతకు గురైనాడు.

కొంత కొంత మంది సభలకు అధ్యక్షతవహిస్తే, అవి సంతాప సభల్లా నిస్తేజంగా వుంటై. అధ్యక్షస్థానం చుట్టూ సూర్య చంద్ర తారాగణాలను త్రిప్పుకోగల ఉత్సాహ ప్రతిభ గల కొద్దిమంది తెలుగు వాళ్ళలో భీమన్న ఒకడు.

ఆ రాత్రికి రాత్రే, వెళ్ళిన టాక్సీలోనే బైలుదేరి ఉదయానికెల్లా తిరిగి వచ్చేశాడు భీమన్న. దారిలో రెండు మూడు ప్రమాదాలు తప్పినై. నిద్రకు తట్టుకోలేని డ్రైవరు చేతిలో బోల్తాపడవలసిన కారే ఎందుకో ఆగింది. రెండు చోట్ల డ్రైవరే కారును ప్రక్కకు ఆపి నిద్రపోయాడు.

రాత్రి ప్రయాణాలలో డ్రైవరుకు నిద్రవస్తే, కారును ఆపి నిదపోవా లంటాడు భీమన్న. నిద్ర ఒక మబ్బుతెర లాంటిది. దాన్ని ఎదిరించి నిలవా లనుకోవడం కంటె, దానితో సహకరించి తప్పించుకోవడం క్షేమ కరం.

భీమన్నకు ఏ గౌరవం, గుర్తింపు లభించినా ముందుగా తమ సన్మానాన్నే అందుకోవాలని పట్టుపట్టేవాళ్ళు కొంద రున్నారు. అందులో సనత్‌నగర్ సంస్కృతీ సంఘం అగ్రగణ్యం. ప్రముఖ నాటక రచయిత ఈరంకి సీతా రామయ్య, నటుడు వత్సవాయి సత్యనారాయణరాజు వంటి వారెందరో వున్నా రందులో. సత్యనారాయణరాజు, అల్లూరి శివ వర్మ ఈ ఇద్దరూ భీమన్నకు చిరకాల యువ మిత్రులు. ఈ సంస్థవారే గుడిసెలకు తొలి సన్మానం చేశారు రవీంద్రభారతిలో.

కృష్ణదేవరాయ లైబ్రరీవారు గుడిసెలపై ఏర్పాటుచేసిన గోష్ఠి చరిత్రాత్మక మైనట్టిది. ఆ తర్వాత ఆంధ్రప్రభలో భీమన్నను గురించి "ముఖా ముఖీ" వ్రాసిన ఇందుర్తి ప్రభాకరరావు గారు ఆ నాటి ప్రధాన వక్త.

గుడిసెలపై సుదీర్ఘమైన సమీక్షను ప్రకటించిన తిరుమల శ్రీనివాసాచారి గారు, రసప్రవంతి కావ్యసుధ గార్లు, తమ అభ్యుదయ కవితా వేదిక మీద - ఒక కొత్త కవితా ప్రయోగంలో భీమన్నకు స్థానం కల్పించిన గజ్జల మల్లా రెడ్డి, ఏటుకూరి ప్రసాద్, శివా రెడ్డి మున్నగు వారు భీమన్న సాహితీ మిత్రి కోటినుంచి ఈ సందర్భంలో పేర్కొన వలసిన కొందరు.

జాతీయ భీమా సంస్థ, తెలుగు అకాడమీ, విద్యుచ్ఛక్తిబోర్డు మున్నగు వారి సాంస్కృతిక సంఘాలు జరిపిన సన్మానాలు- జి. వెంకటస్వామి, ముకురాల రామారెడ్డి, కొత్తపల్లి వీరభద్రరావు, మర్ల అప్పారావు, తెలుగు అకాడమీ డైరెక్టరు ఎన్. వెంకటస్వామి, సాంఘిక సంక్షేమ డైరెక్టరు కె. మాధవరావు, సి. రాములు, మిక్కిలి సుందరరావు వగైరా ఎందరెందరికో కూడ ఈ గుడిసెలు ఋణపడి వున్నాయి—సన్మాన గౌరవాలను అందుకొని!

ఎవరు పరిపాలిస్తున్నా రన్నది కాదు ముఖ్యం
ఎలా పరి పాలిస్తున్నా రన్నది!
ఎవరు ముందువడుస్తున్నా రనేది కాదు ప్రధానం
ఎక్కడికి నడిపిస్తున్నా రన్నది!

—టుమ్రీలు

220. రాష్ట్ర హరిజన సభలు

విద్యామంత్రి మండలి వెంకట కృష్ణారావుగారు ప్రపంచ తెలుగు మహా సభలు జరిపిన పద్ధతిలో, హరిజన సంక్షేమ మంత్రి భాట్టం శ్రీ రామమూర్తి గారు రాష్ట్ర హరిజన సభలు జరపటానికి నిశ్చయించారనీ, ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయనీ భీమన్నకు తెలిసింది.

"అసలు ఈ సభలను మేము చెయ్యా లనుకొని, సహాయం కోసం మంత్రిగారిని అడిగాం. తామే చెయ్యదలచినట్లు వారు మాకు ఆ తర్వాత తెలియ జేసారు —" అంటూ షెడ్యూల్డు కులాల కార్యకర్తలు కొందరు భీమన్నతో చెప్పుకొన్నారు. సభలు చెయ్యాలన్న ఆయిడియా మొదట్లో ఎవరిదైనా,

అందుకు ప్రభుత్వమే పూనుకొన్నది కనుక లేడికి, లేచిందే ప్రయాణ మన్నంత వేగాన్ని పుంజు కొన్నాయి ఏర్పాట్లు.

ఆహ్వాన సంఘం, ఉపసంఘాలు, కార్యక్రమాలు, కరపత్రాలు వగైరా సమస్తమూ ప్రపంచ సభలకు మక్కీకి మక్కీయే! అంతకంటే ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు?

సాధారణంగా ఏ ప్రముఖుడు ఏ కార్యక్రమాన్ని తలపెట్టినా– ఆ ప్రముఖుడి కులం వాళ్ళే అందంతటా పెత్తనాలు చెలాయించడం సహజం. అందుకు కాకపోతే, కులా లుండడం మరెందుకు? అధికార పదవులు దేనికి?

సభలు, సమూరోహాలు, గోష్ఠులు, వర్క్‌షాపులు, సెమినార్లు, చర్చలు, పరిశీలక సంఘాలు, పర్యటనలు – ఇవన్నీ ప్రజల డబ్బును పాయసంలా ఆస్వాదించడానికి బ్యూరోక్రసీ కనిపెట్టిన ఆధునిక ఉపాయాలని భీమన్న ఉద్దేశం. కవి సమ్మేళనలు కూడ ఈ జాబితాలోకే వస్తై అట.

ప్రజలనుంచి నయానా, భయానా లక్షలకు లక్షలు వసూలుచేసి, చాలక పోతే వాళ్ళ మూలధనమైన ప్రభుత్వ ఖజానానుంచి గ్రాంటులు సంపాదించి, ప్రజాసేవ పేరుతో ఆత్మారాం సేవ చేసుకోవడమే ఇదంతా అంటాడు భీమన్న. విదేశ పర్యటనలు, సాంస్కృతిక యాత్రలు, కళాకారుల సన్మానోత్సవాలు అన్నీ ఈ బాపతే. సమాజంలోని అగ్రశ్రేణి యుక్తిపరుల వృత్తి ఇదే ఈనాడు. ఈనాడే కాదు, ఏనాడూఇంతే. ప్రజాదోపిడే ప్రజ్ఞావంతుల వృత్తి అంటాడు.

బలవంతుడైన ఒక మానవుడు, బలహీనుడైన తోటి మానవులపై అనాదిగా జరుపుతూ వస్తున్న దౌర్జన్య కాండ ఇది. సామ్రాజ్య వాదం, కేపిటలిజం, ప్రజాస్వామికం, సోషలిజం, నియంతృత్వం – ఏ పద్ధతి సాంఘిక విధానమైనా సరే, ఇదే నాటకం.

ఒక మానవుడు బలవంతుడూ, రౌడీ, నియంతా ఎందు కవుతాడు?
మరొక పని చేత గాక!
మరొకడి శ్రమ ఫలితాన్ని దోచుకు తినాలి కనక
నిగ్గు విడిచి క్రూర కృత్యాలకు దిగుతాడు.

అధిక సంఖ్యాకులై న మానవులు బలహీను లెందు కవుతారు ?
బలం లేక కాదు .
శ్రమించి పని చేసు కొంటూ , శాంతంగా జీవించా లనుకొంటారు కనుక !
అధిక సంఖ్యాకుల ఈ సౌజన్యాన్ని తమ కనుకూలంగా వినియోగించు కొంటారు
నియంతలూ , వాళ్ళ తాబేదారులై న యు క్తి పరులూ .

ఇదంతా తెలిసిన వాడు కనుక , ఏదీ పట్టించు కో భీమన్న .

ఒక రోజున హరిజన మహా సభల కార్యాలయం నుంచి ఒకలేఖ వచ్చింది భీమన్నకు - మహాసభల సందర్భంలో ఒక సావనీరు వేస్తున్నామనీ , దానికి ఒక రచన పంపించమనీ . అంత వరకు బాగానే వుంది . ఇలాంటి లేఖలు ప్రతి నిత్యమూ వస్తూనే వుంటై .

అయితే - ఈ లేఖ చివర ఒక గమనిక వుంది . "మీ పేరు పొతుకూచి సాంబశివరావు గారు సూచించారు . మాకు నిధులు చాలినన్ని లేవు కనుక , మీ రచనకు పారితోషికం ఏదో కొద్దిగా మాత్రమే ఇచ్చుకోగలం" అని !

ఈ గమనిక భీమన్నకు బాధా హేతు వయింది . తన నేదో కించ పరచి నట్టు ఫీ లయాడు . వెంటనే వారికి ఇలా వ్రాశాడు-

(1) ఈ సభల ఉద్దేశ మేమిటి ? (2) కుల మతాతీతమైన మన రాజ్యాంగం క్రింద కుల సభలను ప్రభుత్వం నిర్వహించ వచ్చునా ? ఇది గాంధేయ సిద్ధాంతానికి , జాతీయ సమైక్యతకు విరుద్ధ చర్య కాదా ? (3) ఇలాంటి ప్రమాదకర నిర్ణయం తీసుకునే ముందు , హరిజనులలోని (ఆంధ్ర యూని వర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ బుల్లయ్య గారి లాంటి) మేధావుల అభిప్రాయాలు తీసు కున్నారా ? (4) హరిజనులలో సాంస్కృతి కాభివృద్ధిని సాధించడం కోసం సంక్షేమ శాఖకు ప్రత్యేకించ బడిన నిధులను ఖర్చు పెట్టకుండా వుంచేసి , ఇప్పుడి విధంగా వాడెయ్యా దలిచారని ప్రజ లనుకొంటున్నారు . అందులో వున్న నిజ మెంత ? (5) ఈ సభలలో చర్చించ దలచిన సమస్యలు , వాటి పరిష్కారాలు ప్రజలకు , ప్రజా ప్రతి నిధులకు , ప్రభుత్వానికీ ఇంతవరకు తెలియనివా ?

ఈ ప్రశ్నలలోని విషయాలను స్పష్టీకరిస్తే తాను ఈ సభలతో సహకరించేదీ లేనిదీ నిర్ణయించుకొంటాననీ, చర్చల నిమిత్తం రమ్మంటే వస్తాననీ వ్రాశాడు భీమన్న. ఆ లేఖ ప్రతులను సంబంధించిన వారందరికీ పంపించాడు.

ఎవరినుంచీ జవాబు రాలేదు!

తర్వాత చాల రోజులకు "హరిజన మహాసభల కవి సమ్మేళనలో పాల్గొన వలసింది"గా ఒక లేఖ వచ్చింది. కవిత ప్రతి ముందే తమకు పంపించా లట!

ఆదలా వుండగా - ఎంతో మంది హరిజన నాయకులు, అధికారులు, కార్యకర్తలు భీమన్నను కలుసుకొంటూనే వున్నారు. హరిజన సభల పేరేగాని, పెత్తనమంతా హరిజనేతరుల చేతిలోనే వున్నదనీ, సాహిత్య కళా సంస్కృతులలో కూడ తదితరులే ప్రోత్సహించబడు తున్నారనీ, హరిజనులు హీనంగా చూడబడుతున్నా రనీ, మాల మాదిగ ఫీలింగు కూడ రగిలించబడు తున్నదనీ, రకరకాలుగా చెప్పుతూనూ వున్నాతు.

ఈలోగా ఆ యా జిల్లాల నుంచి భీమన్నకు పిలుపులు రాసాగినై - తమ జిల్లా హరిజన సభలలో పాల్గొన వలసిందిగా. ఎక్కడికీ వెళ్లదలచలే దీయన. అయితే తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు యు. బి. రామవేంద్రరావు గారి ఆహ్వానాన్ని మాత్రం కా దనలేకపోయాడు.

ఇక్కడ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వా రేర్పాటు చేసిన ఉగాది ఉత్సవాల కవి సమ్మేళనలో పాల్గొని, అక్కడినుంచే రైలెక్కి కాకినాడ వెళ్ళి, అక్కడ జిల్లా హరిజన మహాసభల కవి సమ్మేళనకు అధ్యక్షత వహించాడు. అక్కడ పాత మిత్రు లందర్నీ, ముఖ్యంగా చైతన్య, చంద్రరావు, నీలం అప్పారావు, బొజ్జా సాంబమూర్తి మున్నగు యువ కవుల్ని కలుసుకోవడం ఎంతో ఆనందం ఇచ్చింది భీమన్నకు.

ఆ రాత్రి అక్కడొక పల్లెటూరి కుర్రవాళ్లు పాలేరు నాటకం వేస్తుంటే చూచి ఆనందించాడు. ఆ మరునాడు పాము రామమూర్తి, తారకం గార్లతో

పాటు తనకు కూడ జరిగిన ప్రత్యేక సన్మానం స్వీకరించాడు. రాఘవేంద్రరావు గారి యొక్క, జ్ఞానాంద కవి, మోకా మీరయ్య, గొల్ల సుందరరావు, కుసుమ రామమూర్తి మున్నగు బంధు మిత్రుల యొక్క ఆదరణను ఆస్వాదించి, హైదరాబాదు చేరుకున్నాడు.

ఇంటివద్ద ఈయనకోసం రెండు వార్తలు ఎదురు చూస్తున్నాయి. అందులో ఒకటి—కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖవారు ఈయనకు ఫెలోషిప్ గ్రాంటు చేశారన్నది. గొప్ప శుభవార్త.

రెండోది—రాష్ట్ర హరిజన మహాసభల ఆహ్వానం. అందులో కవి సమ్మేళనకు అధ్యక్షులు డాక్టర్ దివాకర్ల వెంకటావధాని గారు. పాల్గొనే కవుల జాబితాలో భీమన్న పేరు బహుళా ఇరవయ్యోది!

గొర్రె నమ్ముతుంది
వక్క మోస గిస్తుంది
పెద్దపులి తినేస్తుంది
ఇవన్నీ చేస్తాడు మానవుడు.
అమాయకుడు, రౌడీ, ద్రోహి, హంతకుడు-
ఇలా ఇన్ని తరహా లుండవు ఏ మృగం లోనూ!
ఇన్ని విధాలుగా పీడించదు ఏ జంతువూ!
నమ్మించి వంచించ గలవా దొక్క మానవుడే!

—శివాలకుడు

221. ధర్మ విజయం

హరిజన మహాసభల వారి కవి సమ్మేళన ప్రోగ్రాం సిటీలో గొప్ప అలజడిని రేకెత్తించింది. తన అనుమతి లేకుండా తన పేరును కవుల జాబితాలో ఎలా వేశారో భీమన్నకు అర్థం కాలేదు. కవితకు జాతీయ అవార్డును పొంది, కాశీ విద్యాపీఠం వారి డాక్టరేటును, ఆంధ్రా యూనివర్సిటివారి కళా ప్రపూర్ణను, భారత ప్రభుత్వపు పద్మశ్రీని కూడ పొందివున్న భీమన్న వుండగా, మరొకరిని అధ్యక్షులుగా ఎలా పేర్కొన్నారో జనాని కర్థం కాలేదు.

తెలుగు సాహితీ రంగంలో అగ్రశ్రేణి కవిగా ప్రఖ్యాతుడై, రాష్ట్రంలో ఎన్నో సాహిత్య, సాంస్కృతిక కవి సమ్మేళన సభలకు అధ్యక్షత వహిస్తూ వస్తున్న భీమన్న - హరిజన మహాసభల కవి సమ్మేళనకు అధ్యక్షత వహించ తగడా?

బ్రాహ్మలచే, బ్రాహ్మల ప్రయోజనం కోసం నిర్వహించ బడుతున్న హరిజన సభలు "అనే కీర్తి ఆ సభల కెందుకు వచ్చిందో అప్పు డందరికీ అర్థ మయింది.

"మరి, చాలమంది హరిజనోద్యోగులు. కొన్ని హరిజన సంస్థల వాళ్ళు సహకరిస్తున్నారు కదా అంటే – "పల్లెటూళ్ళలోని చదువులేని పాలేళ్ళ కంటే, పట్నాలలోని చదువుకున్న పాలేళ్ళు మరీ దీనులు. నిజమైన బాండెడ్ లేబర్ వీళ్ళే" అన్నాడు భీమన్న.

"బాండెడ్ లేబర్ అంటే బంధిత కార్మికులు. రకరకాల ఉన్నత సేవా రంగాలలో పని చెయ్యడానికి ఎంచుకోబడిన హరిజన ప్రతినిధులలో అత్యధిక సంఖ్యాకులు ఈ పద్ధుక్రిందికే వస్తారు. మిగిలినవాళ్ళు తమ గతాన్ని, కులాన్ని, తాము పుట్టిన పల్లెల్ని, గుడిసెల్ని, అక్కడి దీనుల్ని, చిన్నప్పటి నేస్తాల్ని మరిచిపోయి, దోపిడీ దొరలతో చేరిపోయిన కుషింభరులు" అన్నాడు.

"ఏ మాధవరావు లాంటి వాడో న్యాయంకోసం నోరు మెదిపితే, నగ్జలైట్ అనేస్తారు! అదొక పెద్ద సాకు! ఇదీ ఈనాటి ప్రజాస్వామికం యొక్క, హరిజనాభివృద్ధి ప్రణాళిక యొక్క స్వభావ సరళి!"

"న్యాయం నగ్జలై పైతే, నేనూ నగ్జలైటునే" అన్నాడు భీమన్న.

"కొందరు రౌడీలు చేరి, న్యాయం ముఖంమీద "పెద్దపులి" అని వ్రాసి, కాల్చి చంపేస్తుంటే-దాన్ని అలా చావనివ్వ వలసిందేనా?"

"కేవలం భీమన్నను అవమానించడానికే ఈ కవి సమ్మేళన ఉద్దేశించ బడిందా?"

"దేవుడు లేడూ ? సత్యం జయించదూ ?" అంటూ, కన్నాంబలా అయినా, వీధిని పడేవాళ్ళు కూడా లేరా ఈ యుగంలో ?"

ఎందుకు లేరు ? ఉన్నారు. ఏ యుగంలోనూ ఉంటారు. సత్యం న్యాయం, ధర్మం, స్నేహం, సౌజన్యం, సౌశీల్యం, సౌందర్యం, సుఖం, ఔదార్యం, ఆనందం-ఇలాంటివి అల్ప సంఖ్యాక వర్గమే అయినా, అవే సామాజిక జీవ మూల సూత్రాలై వుంటై. అసలు విలువలై వుంటై.

మహాసభలు ఏప్రిల్ పదవ తేదినే ప్రారంభమైనై. భీమన్న ఇంట్లోనేవుండి ప్రశాంతంగా కవిత్వం వ్రాసుకొంటూ కూర్చున్నాడు. పదకొండవ తేదీ ఉదయమే సత్యనారాయణరాజు, సీతారామయ్య భీమన్న వద్దకు వచ్చారు. సీతారామయ్య రచయిత, సత్యనారాయణ రాజు నటుడు. భీమన్నకు చాల ఆత్మీయులు. తాము మంత్రిగారి వద్ద నుంచి వచ్చామనీ, జరిగిన దానికి ఆయన ఎంతో బాధ పడుతున్నారనీ, కనీసం కవి సమ్మేళనలో అయినా భీమన్న పాల్గొనక తప్పదనీ అన్నారు వాళ్ళు.

"మీరు లేని కవి సమ్మేళనను ఊహించలేం, సార్! ఆ వేదిక మీద మీరు కనిపించక పోతే, జనంలో అపోహలు రేగుతై. ఏ షరతు మీద మీ రక్కడికి రాగలరో చెప్పండి" అన్నారా యిద్దరూ ఏక కంఠంతో.

"ఇది ధర్మరాజు రాయబారంలా వుందే" అన్నాడు భీమన్న. తనను చంపే ఉపాయం తానే చెప్పవలసి వచ్చింది కదా భీష్ముడు!

"సరే, రహస్యం చెప్పేస్తున్నాను వినండి. నన్ను, హరిజనుల్ని చాలకించపరచిన సభ లివి. అయితే-ఏ సాహిత్య సభకైనా, కవి సమ్మేళనకైనా అధ్యక్షత వహించమని నన్ను కోరితే, నేను కాదనలేను" అన్నాడు భీమన్న.

'చాల కృతజ్ఞులం. మరో సలహా చెప్పండి. ఇప్పుడు ప్రకటించబడివున్న అధ్యక్షుల నేం చెయ్యాలి ?

"ఆవదానిగా రంటే నా కెంతో గౌరవం, భక్తి. వారిని ప్రారంభకులుగా చెయ్యవచ్చు"

వెంటనే లేచి వెళ్ళిపోయా రిద్దరూ .

మరో గంట సేపటికి మళ్ళి వచ్చా రా యిద్దరూ . మంత్రిగారి నుంచి ఒక పెద్ద టైప్డు లేఖ తెచ్చారు . కవి సమ్మేళనకు అధ్యక్షత వహించమనీ , అవధాని గారు ప్రారంభకులుగా వుండడాని కంగీకరించా రనీ వున్నదా లేఖలో . భీమన్న తన ఆమోదాన్ని వ్రాసి యిచ్చాడు వారి చేతికే .

ఆ తర్వాత రోజంతా భీమన్నకు అభినందనలు అందుతూనే వచ్చాయి- ఏదో గొప్ప విజయం సాధించినట్టుగా .

అధ్యక్ష పీఠం నుంచి విమర్శలు విసరవద్దంటూ అధికార స్థానాల నుంచి అభ్యర్థనలు కూడ అందాయి ప్రైవేటుగా .

పంద్రెండవ తేదీ సాయంకాలం కవి సమ్మేళనం . భీమన్న నిజంగానే సభకు వస్తాడో రాడో అన్న అనుమానంతో ఒకరు కారు పంపించారు . మరొకరు జీపు పంపించారు . ఇంకొకరు వ్యానులో స్వయంగానే వచ్చారు తీసుకు వెళ్ళడానికి .

పాల్గొనే కవులు ఆరుద్ర , జ్ఞానానందకవి , బాపురెడ్డి , దుర్వాస మహర్షి , మోదుకూరి , మిక్కిలి సుందరరావు , కొలకలూరి , పాల వెంకటసుబ్బయ్య , నెమిలికంటి జగన్నాథం వగైరా ఒక పాతిక మంది . ఏ కవి సమ్మేళన అయినా అంతే . కవులు తక్కువా , పైరవు లెక్కువా వుంటారు . భీమన్నను నిరుత్సాహ పరచిన విషయం అదికాదు . కవి సమ్మేళనకు కేటాయించబడిన గంటన్నరలోను అధిక భాగం అవధానిగారి ప్రారంభోపన్యాసమే తీసుకోవడం !

రాష్ట్ర హరిజన మహాసభలలో , పాతికమంది మహాకవులు ఒక్క అర గంటలో కావ్యగానాలు ముగింపువలసిన కవిసమ్మేళన అది ! దానికి భీమన్న అధ్యక్షుడు !

" హరిజనుల అభ్యుదయంకోసం కేటాయించబడిన నిధులు ఖర్చయి పోతున్న తీరు ఇ దన్నమాట ? ఇ దెక్కడి అభ్యుదయం !" అంటూ వాపోయాడు భీమన్న .

ఎవరి ప్రేమకు , సానుభూతికి ,
ఎదురు చూడకు మోయి నీవు !

పరుల ప్రేమయు , సాను భూతియు
బల విహీనుని చేయు నిన్ను !

నీవె ప్రేమింపుము జగమ్మును
నీవె చూపుము సాను భూతిని

శివుడ వగుదువు నీవు , జగతికి
శ్రేయ మిడుదువు అప్పుడే !

—అకాండ తాండవం

222. కులద్వేషాలకు హేతువు

నిష్కలము , నిర్మలము చేయనేర్చి , జాతి
నుద్ధరించగ లెండింక యువకులార !

అంటూ , కూలిరాజు నాటకం ద్వారా 1942 లో తాను బహిరంగంగా ఉద్బోధించి నప్పటి నుంచీ , భీమన్న హైందవ సమాజాన్ని ఒక నిష్కల బల వత్తర సుసంఘటిత అగ్రశ్రేణి జాతిగా తీర్చి దిద్దాలన్న ప్రగాఢ లక్ష్యంతో సాహితీ సృష్టి చేసు కొంటూ వచ్చాడు .

తన సాహిత్యానికి పరమ లక్ష్యం ఆనందమే అయినా , సాంఘిక లక్ష్యం కుల రహిత జాతి నిర్మాణం .

ప్రపంచం లోని ఆధునిక అగ్ర రాజ్యాలలో భారత రాజ్యం ఒకటి కావాలనీ , అన్నిటినీ అధిగమించి వికసించాలనీ ఈయన ఆకాంక్ష . అందుకు హైందవ సమాజం నుంచి కులం అనబడే వ్యాధి పూర్తిగా నిర్మూలించ బడాలంటాడు .

బహు క్రూరంగా , అమానుషంగా , ఏ మాత్రం దయాదాక్షిణ్యాలు లేకుండా-వెలి వేయబడి , అణచి పెట్టబడి , పీడించబడుతూ వున్న ఒక కులానికి చెంది వుండి కూడ , ఎన్నో బాధలకు స్వయంగా గురవుతూ కూడ భీమన్న ఏ విధమైన వైరశ్యం లేకుండా , తాను కులాతీతంగా వుంటూ , కుల

నిర్మూలనకు నడుం కట్టవలసిందిగా ప్రగతి గాములైన అన్ని కులాల యువకులకూ పిలుపు నిస్తూ వచ్చాడు.

అందుకే-ఎన్నడూ అనువాదాల జోలికి పోనివాడు, అంబేద్కరు గారి "కుల నిర్మూలన" గ్రంధాన్ని ఆంగ్లం నుండి తెలుగులోకి అనువదించి ఇచ్చాడు-అంబేద్కరు మెమోరియల్ సొసైటీ వారికి.

అయితే-ఏం జరిగింది? ఇప్పుడేం జరుగుతున్నది?

కుల నిర్మూలన కేసి ఒక్క అడుగైనా పడిందా? జాతి సమైక్యం సాధ్యపడిందా? దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ పరిస్థితి ఇంకా దిగజారిపో లేదా? కులతత్వం జాతి విచ్ఛిత్తికే దారి తీసే టంతటి ప్రమాద స్థాయికి చేరుకో లేదా? ఈ దుస్థితికి హేతు వేమిటి?

ఈ దుస్థితి కంతకూ హేతువు-రాజకీయాలూ, పదవీ వ్యామోహపరులైన రాజకీయ నాయకులూ అంటాడు భీమన్న.

ప్రజా స్వామికంలో వయోజన ఓటింగు పద్ధతి వల్ల ఎంతో మంచి జరుతుందని ఆశించారు - గాంధీజీ, ఆంబేద్కరు, ఆనాటి కాంగ్రెసు అధినేతలూ. తద్విరుద్ధంగా మన ప్రజా స్వామికం ధన స్వామికమూ, భూస్వామికమూ, కుల స్వామికమూ అయిం దంటూ వాపోతాడు భీమన్న.

ఈ వ్యాధికి చికిత్స లేదా? ఎందుకు లేదు? ఎన్నో చికిత్సలను సూచించాడు భీమన్న తన సాహిత్యం నిండా. చదివితే తెలుస్తుంది కాని, చదువు కొన్న వా ళ్ళెంతమంది ఈ దేశంలో?

"డిగ్రీ లున్న వాళ్ళంతా చదువు కొన్నవాళ్ళు కాదు" అంటా డందుకే.

సాంఘిక పరిశీలనలో, పరిశోధనలో భీమన్నకు ఒక సత్యం గోచరించింది. కుల సలబంధమైన, అంటరానితనానికి చెందిన అఘాయిత్యాలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న వాళ్ళంతా బ్రాహ్మణేతర కులాలకు చెందిన వా ళ్ళే! ముఖ్యంగా క్రింది కులాలకు, వ్యవసాయ కులాలకు చెందిన వా ళ్ళే! ఎందువల్ల?

ఎందువల్ల అంటే -బ్రాహ్మలలో వున్న సాంస్కృతిక చైతన్యం, ఆధ్యాత్మిక దృక్పథం తక్కిన కులాలలో లేకపోవడం వల్ల - అంటాడీయన.

"వ్యాసుడు హరిజనుడు. వ్యాస సంతానమైన కౌరవ పాండవు లంతా హరిజనులు" అంటూ రాగ వాశిష్ఠ పీఠికలో భీమన్న ఎలుగెత్తి చాటితే, బ్రాహ్మలెవరూ పెదవి కదపలేదు. అయితే కావచ్చు నని వూరుకొన్నారు. కాని—

ఒక సారె ప్పుడో, తులాబందుల నాగేశ్వరరావు గారి సన్మాన సభకు అధ్యక్షుడుగా భీమన్న కాడికొండ (మంగళగిరి) వెళ్ళినప్పుడు, ఆ ప్రాంతం లోని యాదవులు కొందరు భీమన్నను ఘెరావో చేశారు. పాండవులు హరిజనులైతే, వారి బంధువులైన యాదవులుకూడ హరిజనులేనా? అని!

అరుంధతి కథ మొదలు ఎన్నో పురాణగాథలను వారికి వివరించి, వారిని ఒప్పించి బైటపడటానికి గంటో, రెండుగంటలో పట్టిం దట భీమన్నకు. ఇలాంటి సంఘటనలు ఈయన జీవితంలో అనేకం.

అందుకే క్రింది కులాలవారిలో సాంస్కృతిక చైతన్యం, విద్యావికాసం కలిగించవలసి వున్నదంటాడు భీమన్న. ఈ రంగంలో ఇంతవరకు జరిగిన కృషి అత్యల్పం అంటాడు. సాంస్కృతిక విప్లవంకోసం ఒక ఉద్యమమే సాగాలంటాడు.

మానవు డెక్కడుంటే అక్కడ
మాలిన్యమూ ఉంటుంది

కనుక ప్రతి గ్రామంలోను ఏవో పేచీలు, కొట్లాటలు జరుగుతూనే వుంటాయి. ఈ దేశంలో ప్రతివాడూ ఏదో ఒక కులంలో పుట్టక తప్పనప్పుడు, పేచీపడ్డవాళ్ళు ఏవో కులాలకు చెందే వుంటారు. అట్టి పేచీలను అక్కడి న్యాయ శాంతి భద్రతల పరిపాల నాధికారులకు వదిలెయ్యాలి. అప్పుడవి సవ్యంగా పరిష్కార మవుతాయి.

అలాకాక, అట్టి స్థానిక విషయాలలో రాజకీయ నాయకులు కలగజేసుకొని వాటికి కులతత్వపు రంగులు పూసి, స్వార్థాని కుపయోగించు కొంటున్నారంటాడు భీమన్న.

"అందుకే, స్థానికమైన పేచీ పూచీల జోలికి రాజకీయ నాయకులు, మంత్రులు వెళ్ల కుండా వుండాలి. అట్టి వాటిని స్థానికాధికారుల పరిష్కారానికే వది లెయ్యాలి" అంటాడు భీమన్న.

"మతా లన్నీ మానవ ప్రగతి నిరోధక మైనట్టివే. అయితే, ప్రపంచానికి భారతీయ ఋషు లిచ్చిన ఆధ్యాత్మిక భాగధేయం అద్వితీయ మైనట్టిది. ఆట్టి ఆర్ష జాతి విచ్ఛిన్నం కాకూడదు. అందుకే సాంస్కృతిక విప్లవంద్వారా దాన్ని పున రుజ్జీవింప జెయ్యా లనేది నా ఆకాంక్ష" అంటా డీయన.

ఖూజు దులిపి, చెత్త ఊడ్చి, ముళ్ళడొంకల్ని తొలగించి, ఈ సనాత నోద్యానాన్ని పునర్నవీకరించాలి. పునరుజ్జ్వలనం కలిగించాలి. అందుకు ఈయన చేబట్టిన సాంస్కృతిక విప్ల వోద్యమం.

దైవం, దెయ్యం, అదృష్టం, కర్మ
ఆ దేదైనా - పిలోదే, బైటిది కాదు;
పి మెదడు బల్బుకు గల కాంతి నైశిత్యమే
పి జీవిత సాఫల్యం లోని కాంతి వైశిష్ట్యం!
గుడిపెటి

223. విశ్వనాథ తుది దర్శనం

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు కుమారస్వామి రెడ్డిగారి ఆహ్వానంపై ఏలూరు వెళ్ళాడు భీమన్న - అక్కడొక కవి సమ్మేళనలో పాల్గొనడంకోసం. ఆ సమ్మేళనకు అధ్యక్షులు విశ్వనాథ సత్యనారాయణగారు. అందు పాల్గొన్న కవులు భీమన్న, బావురెడ్డి, ఆరిపిరాల విశ్వం, శేషేంద్ర శర్మ, కరుణశ్రీ మున్నగు వారు చాలమంది.

ఆతిథి మర్యాదలు ప్రభుత్వ స్థాయిలో ఎంతో సంతృప్తికరంగా ఉన్నాయి. కవి సమ్మేళనలే కాదు, ఏ కళా సాంస్కృతిక కార్యక్రమా లైనా, ప్రభుత్వం ఏర్పాటు చేస్తేనే అందులో పాల్గొనే వాళ్ళకు సుఖంగా వుంటుందం టాడు భీమన్న. ప్రైవేటు సంస్థలైతే వాళ్ళకు స్వలాభ ప్రసక్తి ఎక్కువగా వుంటుందట.

సహస్ర మాసాలు నిండిన విశ్వనాథ, కొంచెం తూలిపోతున్నా, బలం గానే వున్నారు. ఆ రాజసం అలానే వుంది. వాక్కులోని చమత్కార కాఠిన్యం, సౌజన్యం ఏమాత్రం చెక్కు చెదరలేదు.

విశ్వనాథకు ఎడమ ప్రక్క భీమన్న, కుడిప్రక్క బాపురెడ్డి ఆసీనులైనారు. తన పుస్తకాలను బాపురెడ్డిగారు వందన పూర్వకంగా సమర్పించారు విశ్వనాథకు. వాటిని చిరునవ్వుతో స్వీకరించి, పేజీలు త్రిప్పి బల్లమీద పెట్టుకొన్నా రాయన. ఇటు భీమన్న కేసి చూశారు. భీమన్న చేతిలో గుడిసెలు, శివాలకలు, బొమ్మ వున్నై. వాటిని తన ఎదుట బల్లమీద పెట్టుకొన్నా డీయన. వాటిని విశ్వనాథ అందుకొని పేర్లు, పేజీలు చూచి, మళ్ళి యథా స్థానంలో పెట్టేశారు.

సభ ప్రారంభ మయింది. విశ్వనాథవారి అధ్యక్షోపన్యాసం పురివిప్పి తాండవించిం దనడం కంటె, దీపావళి రాత్రిలా వెల్లివిరిసిం దనడం సత్య సన్నిహితం. అందులో పార్వణ సముత్సాహమే కాదు, అగ్ని ప్రమాదాలూ కోకొల్లలు.

"ఇప్పుడు బ్రతికున్న వాళ్ళలో రాయప్రోలు సుబ్బారా వొక్కడే కవి" అన్నారు విశ్వనాథ! కాదనే దమ్ము లెవరి కున్నై? వేదికమీద సుఖాసీనులై వున్న కవులంతా చిరునవ్వులు చిలకరించుకొని, తమను తాము చల్లార్చు కొన్నారు.

"ఏదో నా జీవితం అయిపోయింది. మన ఆర్షసాహిత్య సంపదను ఈనాటి ఆధునికతా విషమ ఘాటినుంచి రక్షించుకోవలసిన బాధ్యత ఇక మీమీద వుంది." అన్నారాయన చివరకు సభాసదుల నుద్దేశించి.

"ఇప్పుడు పన్నెండు కావస్తున్నది. నేను పన్నెండున్నర దాటి కూర్చో లేను. కవి సమ్మేళన అరగంటకో ముగియాలి. అంటే ఒక్కొక్క కవి మూడేసి నిమిషాల్లో ముగించాలి." అంటూ అందరి వంకా చూచి, "ఇప్పుడు మొదటగా బోయి భీమన్నగారు తన కవితను వినిపిస్తారు" అని ప్రకటించి కూర్చున్నారు.

హైదరాబాదు నుంచి ఫస్టు క్లాసు చార్జీలు , గెస్టు హౌసు సౌకర్యాలు ఇచ్చి ఒక కవిని అంతదూరం పిలిపించడం ఒక్క మూడు నిమిషాల కోసమేనా ?

అంతవరకు ఏవేవో చదువుదా మనుకొంటున్న భీమన్న ఒక హఠాత్ స్ఫూర్తికి లోనై లేచి , గుడిసెలు తెరచి , " మారనివాడు అనే కవితను , ఒకే ఒక కవితను వినిపిస్తాను " అన్నాడు . సభ నిశ్శబ్ద మయింది .

" బాగుంది " అన్నారు విశ్వనాథ .

" విశ్వనాథవారు ఇక తమ జీవితం అయిపోయిం దన్నారు . అది నిజం కాగూడదు . వారు మరో ఇరవై సంవత్సరాలపాటు మన మధ్య వుండాలి . ఇలానే వివాదపడుతూ వుండాలి . ఇది మన అందరి ఆకాంక్ష " అన్నాడు భీమన్న . సభ హర్షధ్వానాలతో హోరెత్తి పోయింది .

" మీ కిచ్చిన టైంలో రెండు నిమిషాలు ఖర్చయిపోయాయి " అన్నారు విశ్వనాథ .

" ఆ ఖర్చు మీ పద్దు కిందది " అన్నాడు భీమన్న . సభ మరీ ఆనంద తుందిల మయింది .

" సరే , నా మూడు నిమిషాలూ ఆయిపోయినై " అంటూ కూర్చున్నాడు భీమన్న . " కాదు , కవిత చదవండో " అంటూ గోలచేశారు ఆడియన్సు . " మారనివాడు " చదివాడు భీమన్న . సభ రసార్ద్రమయింది .

" భీమన్నగారు పంట్రెండు నిమిషాలు తీసుకున్నారు . ఈయన చదివిన కవితా విషయం ఎటువంటి దంటే , మధ్యలో ఆపడానికి వీలు లేనట్టిది . అది ఈయన చూపిన గడుసుదనం . భీమన్నగారు అసలు శివభక్తుడు . ఇప్పుడు శివా భక్తు డైనాడు . ఏది ఏమైనా , ఈయన నాకు ఇరవై సంవత్సరా లిచ్చాడు. నేను పన్నెండు నిమిషా లిస్తే ఏమయిందిలే " అన్నారు విశ్వనాథ . ఆయన చమ త్కారం అట్టిది . ఆ తరువాతి కవులను మాత్రం మూడేసి నిమిషాలకు పరిమితం చేశారు .

విశ్వనాథ తనను శివాభక్తు డని ఎందు కన్నారో భీమన్న కర్థం కాలేదు. టేబులుమీద గ్లాసు అందుకున్నాడు. అవి కొబ్బరి నీళ్లు ! ఎంతటి మధురానుభూతి.

ఆ సమయంలో వేదికమీదకు అందజేసిన వన్నీ కొబ్బరి నిళ్ళే ! వేసవి మధ్యాహ్నం, తీయని కవిత, కమ్మని కొబ్బరినీళ్లు ! ఎన్ని గ్లాసులు తాగాడో లెక్కలేదు భీమన్న. కోనసీమ బీరు కొబ్బరి నీరు!

"ఈ పుస్తకాలు నా కోసమేనా ?" అన్నారు విశ్వనాథ, భీమన్న ఎదుట వున్న గుడిసెలు, శివాలకలు, బొమ్మ తమ చేతిలోకి తీసుకొంటూ.

"మీ కోసమే" అంటూ చేతులు మోడ్చాడు భీమన్న. అదే భీమన్నకు విశ్వనాథ చివరి దర్శనం. శివాలకలే భీమన్నను "శివా" భక్తుడుగా చూపిన్తై విశ్వనాథకు ఆ క్షణంలో.

అమ్మ ఇచ్చిన బొమ్మలను గొని
ఆట ముగ్గిన చంటివాడు
ఆడు కొను చున్నంత నేపు
అమ్మ మాటే మరచి పోడా ?
ఆట తమిలో అమ్మ జోక్యము
నైన గాని సహించ గలడా ?
అంత మాత్రము చేత బొమ్మే
అమ్మ కంటెను గొప్ప దౌనా ?

—ఆకొండ తాండవం

224. తెలుగు సినీమాలు

భీమన్నకు తెలుగు సినిమా లంటే అసహ్యం. అవన్నీ వట్టి అనౌ చిత్యాల అల్లికలు అంటాడు. దైవిక సన్నివేశాలు, మహిమలు, ఇంద్ర జాలాలు అభ్యంతరం లే దీయనకు. ఎంతటి అసభ్య దృశ్యా నైనా, బూతు ధ్వని నైనా భరిస్తాడు. అనౌచిత్యాన్నే సహించలేడు.

అనౌచిత్యం అంటే ఏమిటి ?

ఏది ఉచితం కాదో, సహజం కాదో, ఏది ప్రకృత్తికీ, ప్రవృత్తికీ అనుకూలం కాదో అది అనౌచిత్యం. ప్రవరుడు పసరు మహత్తుతోనో, అగ్ని ఉపాసనతోనో, మనోగమనం సాధించి ఉండవచ్చు. అది అనౌచిత్యం కాదు. చంద్రుణ్ణి తురకల దైవమనడం అనౌచిత్యం. తిట్టులో కూడ మూల సత్య విరోధం భరించలేడు భీమన్న. ఇక సినిమా సాహిత్యంలో ముఖ్యంగా పాటల్లో ఔచిత్యమేం కనిపిస్తుంది.

అలాటి భీమన్నను తీసుకెళ్ళి రాష్ట్ర ఫిలిం అవార్డుల బోర్డులో సభ్యుడుగా వేసింది ప్రభుత్వం. భీమన్న జీవితంలో ఆశ్చర్యకరమైన సంఘటనలలో ఇదొకటి. వరూధిని సందిట్లో పడ్డ ప్రవరుడిలా ఉక్కిరి బిక్కిరై పోయాడు- ఆ సందె దీపాల వేళ, భోరున వర్షం కురుస్తుండగా, ఏదో వ్రాసుకుంటూ కూర్చున్న తన వద్దకు సమాచారశాఖ అధికారి ప్రభాకరామాత్య వచ్చి స్వయంగా ఈ సమాచార లేఖను అందజేసి నప్పుడు. ఆ బోర్డు కన్వీనరు ప్రచారశాఖ డైరెక్టరు రాజ్యం సిన్హాగారు. జాతీయోద్యమం నాటి యువజన కాంగ్రెస్‌కు చెందిన ఆ స్వాతంత్ర్య యోధిని మణి అన్నే శ్రీ రాజ్యమే ఈ రాజ్యం సిన్హా. మా పట్ల అత్యంత స్నేహశీల ఆమె. ఫిలిం శాఖకు చెందిన ఉన్నతాధికారి ఇ. వి. సుబ్బారావు గారి పరిచయ పునరుజ్జీవం కూడ భీమన్నకు ఉత్సాహ కారణ మయింది సందర్భంలో.

బోర్డులోని తక్కిన ఇద్దరు సభ్యులు ఇల్లిందల సరస్వతీదేవి, తుర్ల పాటి కుటుంబరావు గార్లు కూడా భీమన్న పట్ల గౌరవం గల సహృదయ సుహృన్మనస్కులే.

ఛైర్మను పింగళి జగన్మోహనరెడ్డి గారు రిటైరైన సుప్రీంకోర్టు జడ్జి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్సలరు. ఆ బోర్డులో సభ్యత్వంవల్ల భీమన్నకు కల్గిన లాభాలలో ముఖ్యమైంది జగన్మోహనరెడ్డి గారితో పరిచయం, సాన్నిహిత్యం, తద్వారా ఉస్మానియా సెనేట్ సభ్యత్వం.

1975లో విడుదలైన చిత్రాలను (ఆ తర్వాత 1976లోని చిత్రాలను కూడా) చూచిన తర్వాత భీమన్న విషాద నాయకుని ముఖంపెట్టి అంటాడు-

మన తెలుగు చిత్రాలు తెలుగు కవితల్లా వెల వెల బోతున్నాయి అని! వట్టి అనుకరణలు, అనుసరణలు, అనువాదాలు, కాపీలు, బూతులు, విమర్శలు, పచ్చి సెక్సు, పిచ్చి కైపు అని! మన సినీమాలు మసక దీపాలు అని!

"సినిమాలలో ఉత్తమ కథా, సాహిత్యమూ, సంగీతమూ ఉంటా యను కోవడం లేదు, ఉండాలని కోరడమూ లేదు నేను. అది కళాక్షేత్రం కాదనీ, పారిశ్రామిక కర్మాగారమనీ తెలుసు నాకు. అయితే తమ కర్మాగారంలో తయారయ్యే సరుకు నాణ్యముందిగా ఉండాలని యజమాను లెందు కనుకోరో నా కర్థం కాదు. అన్ని లక్షలు ఖర్చు పెట్టి చిత్రం నిర్మించడం ఫ్లాప్ కావడానికి కాదు కదా!" అంటాడు భీమన్న.

ప్రజలకు తాగుడు నేర్పి, అలవాటైన వాళ్ళు ఏదైనా తాగేస్తారు కనుక, వాళ్ళకు కల్తీ సారా అందిద్దా మనుకోవడం ధర్మమా? కల్తీ సారా శరీరాలనే నాశనం చేస్తుంది. ఈ కల్తీ సినీ రంగం ఆత్మలనే ధ్వంసం చేస్తున్నది కదా?

మరి ప్రజలు చూస్తున్నారు కదా అంటే - అలవాటైన వాళ్ళు ఏది దొరికితే అదే చూస్తారు. గత్యంతర మే ముంది? సగానికి సగం ఇసకా, రాళ్ళూ అని తెలిసి కూడా బజారులో బియ్యం కొనుక్కోవడం లేదా? ప్రజల నిస్సహాయత అట్టిది.

కల్లు మరిగిన వాడు చల్లను నిరాకరించే టట్టు, బూతు సినిమాలకు అలవాటు పడ్డ ప్రజలు కళాత్మక చిత్రా లేమైనా వచ్చినా వాటిని ఆదరించ లేక పోతున్నారు. ఎంతటి నైతిక పతనం!

ఈ అవార్డుల బోర్డు సభ్యత్వం వల్ల, ప్రతి చెత్త ఫిల్మునూ చూడడం వల్ల ఇలాంటిభావాలు భీమన్నను చుట్టుముట్టి వేధించ సాగినై. దొంగల ముఠాల కంటే వ్యాపారుల కూటాలే ఎక్కువ ప్రజా పీడకా లంటా డీయన. సమాజంలోని అగ్రశ్రేణి పెద్దల ఈ దోపిడీ ధోరణి మొత్తం మానవ స్వభావాన్నే కలుషితం చేస్తూ స్వార్థంకేసి మళ్ళిస్తున్నది అంటాడు.

(1975) అవార్డుల ఉత్సవం విజయవాడలో జరిగి నప్పుడు ఆ రోజున ఫిలిం చేంబర్సు వారి విందు జరిగింది. అది స్వయం సహాయ విందు (బఫే).

"నమస్కారమండీ. నేను బోయి భీమన్న" అన్నా డీయన ప్లేటులో ఏదో వడ్డించుకొంటూ - అక్కడికే అందుకే వచ్చిన ఒక పెద్ద మనిషితో.

ఆయన ఆదరి పడి, తేరి చూచి, చేతిలోని ప్లేటును (అక్షరాలా) బల్ల మీద పడేసి, "నా అభిమాన కవి బోయి భీమన్న మిరా!" అన్నాడు. దానితో ఈయన కంగారు పడిపోయి, తన ప్లేటును కూడ బల్లపై పడేసి నిలబడ్డాడు. అప్పు డాయన పాలేరు నాటకం నుంచి ప్రారంభించి, భీమన్న సాహితీ పుట్టు పూర్వోత్తరా లన్నీ ఏకరువు పెడుతూ, ఓ సాహిత్యోపన్యాసం దంచేశాడు. ఆ సమయంలో ఆయన మారువేషంలో ఉన్న ఆవధాని గారో, నారాయణరెడ్డిగారో అనిపించా టడ ఈయనకు! అంతటి దట ఆయన వైదుష్యం!

ఇంతకూ ఆయన ఎవరు? రావు గోపాలరావు గారు!

"మీ గ్రంథాలు ఎక్కడ కనిపించినా పట్టుకుపోయి చదివేస్తాను" అన్నారు గోపాలరావు గారు!

"పట్టుకుపోయి కాదు, కొట్టుకు పోయి" అన్నాడు - అంతలో అక్కడికి వచ్చిన రాజబాబు!

రాజ బాబు వద్ద నున్న "గుడిసెలు" కావ్య సంపుటిని, మార్జినులో నోట్సు కూడా వ్రాసుకొన్న దాన్ని, రావు వారు పట్టుక పోయా రట!

ఆ సమీపంలోనే వున్న సంగీతను, (ఫటాఫట్) జయలక్ష్మని భీమన్నకు పరిచయం చేశారు రావు వారు. ఆ మధుర సన్నివేశ స్ఫూర్తి నుంచి వెలువడిందే "ఇంతటిదా నీ వైభవము! ఎంతటిదో నా భాగ్యము" పాట!

ముఖం చేతులలో దాచుకొని
వ్రేళ్ళ సందుల్లోంచి చూస్తున్న నీవు
కేవల జ్యోతిరాత్మ కనికట్టు లా కనిపించావు నాకు!
ఎన్ని జన్మల తపఃఫలాల
రస కవితలో ఆ చూపులు!
ఓహో, లజ్జామోహన ముగ్ధ సౌందర్యం!
అతోత్కజ్జ్వల గాఢ సౌందర్యం

—రాగవైఖరి

224. అనంతా వై వేదాః

వేదాలు అనంతం. అపరిమితం. ఇప్పుడు మనకు లభిస్తున్న ఋగ్వేదాదులు చాల పరిమిత మైనట్టివని ఉపనిషత్ ఋషులే వక్కాణించి వున్నారు కదా?

ఋగ్వేదాదులు సంపూర్ణ మైనట్టివి కావు. అనంతమైన, ఆ పరిమిత మైన వేదాత్మలో, పరమ సత్యంలో, జీవశక్తిలో ఇవి ఒక భాగం మాత్రమే. మానవ జ్ఞానం పరమ జ్ఞానంలో ఒక చిన్న లవం మాత్రమే!

నీ వదనా కాశంలో
నీలి మబ్బు లెందుకే?
దుఃఖ మయము జీవితమని
దుర్బోధలు చేసి రటే...
రజని లోని కణ మొక్కటి
రవిని చూపు మన్న దటే...
మనిషిలోని ఆణు వొక్కటి
మనిషే లే దన్న దటే...

—రాళీలా

అనే పాటలో భీమన్న మానవ జ్ఞానం ఎంత పరిమిత మయిందో చూపి ఉన్నాడు. మనిషి శరీరంలోని ప్రతి అణువూ జీవాణువే. అలానే - విరాట్ పురుషు డని మన ఋషులు పేర్కొన్న పరమ చైతన్యంలో మానవాత్మ ఒక పరమాణు వనవచ్చు. శరీరంలోని అణువు పూర్ణ శరీరాన్ని ఎలా ఊహించ జాలదో మానవుడు కూడా విశ్వాత్మను రూపించుకో లే డంటా డీయన.

బల్బులోని శక్తి ఎంత పెరిగితే అంత ఎక్కువ దూరానికి వెలుగు వ్యాపించే టట్టు, మెదడులోని శక్తి ఎంత పెరిగితే అంత నిశ్చితమైన సత్యాలు గోచరిస్తూ వుంటాయి. జప తపాదుల ద్వారా మెదడు శక్తిని పెంచుకొన్న వారే ఋషులు. అట్టి వారు దర్శించి వెల్లడించే సత్యాలే వేదాలు.

భగవంతుడు వేదకాలం నాదే
కాదు, ఈనాడు కూడ వున్నాడు.
కాగా, వేదం ఈనాడు కూడా
పుడుతుంది. నా నుంచి కూడా
పుడుతుంది. నే నేది చెపితే
అది వేదం అన్నా నందుకే.

—గుడిసెలు

వేదాలు అపౌరుషేయా లంటే ఆర్థ మేమిటి? భగవత్ ప్రేరణ వల్ల, ఋషుల నోట వెలువడిన సత్యాలని! భగవంతుడు ఎల్లప్పుడూ వుండేటట్టే ఋషులు కూడ వుంటారు. సూర్య గతిని బట్టి వాతావరణ స్థితి మారేటట్టే కాలగతిని బట్టి సృష్టి స్థితి మారుతుంది. ఈ మార్పును గుర్తిస్తూ, దాన్ని దేశ కాలానుగుణంగా అభ్యుదయ మార్గంలోకి మలుపు కొంటూ ముందుకు సాగే వాడే ఋషి. తాను సాహిత్యం ద్వారా చేస్తున్న పని అదే అంటాడు భీమన్న. ఈనాడు వేదం తన నుంచి పుడుతున్న దంటాడు.

వేదం ఎప్పుడూ వున్నదే. తాపసుల, దర్శకుల ఆత్మ శక్తిని బట్టి అది అందుతూ వుంటుంది. తన కంది నంత మట్టుకు తన రచనలలో నింపి, ప్రజల కందిస్తున్నా నంటా డీయన. ఆ నా డది వేదం, ఈనా డిది వేదం అంటాడు.

"ఇప్పటికైనా ప్రజలు, ముఖ్యంగా యువకులు ఈ సత్యం గుర్తించి, కాలానుగుణమైన మార్పును సాధిస్తే—మానవ జాతి మన గలుగుతుంది. లేక పోతే—తను ఆరాధిస్తున్న సమాధులలో తానూ ఒకడై పోతుంది" అంటూ హెచ్చరించాడు గుడిసెల పీఠికలో.

భీమన్న అందిస్తున్నది వేదమే. అది సాంఘికంగా సర్వమానవ సమత, రాజకీయంగా సమ సమాజ నిర్మాణ సిద్ధి, హార్దికంగా ఆనందానుభూతి, ఆత్మీయంగారసా ద్వైతం.

ఈయన వేదానికి రసాద్వైతం వేదాంతం. వేద వృక్ష ఫల మిది.

రెండు ఆత్మలు ఒక్కటిగా కలిసినప్పుడే అవి ద్రవించ గలుగుతాయి. అలా ఏర్పడిన ద్రవమే రసం. "రసో వై సః" అన్న వేదంలోని రసం. అదే పరమాత్మ. పరాశక్తి, పరబ్రహ్మ. ఆదే ఆనందం.

"ఆనందా ద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే..." అన్న వేదంలోని ఆనందం-ఆ విధంగా పరస్పరాకృష్టా లైన ఆత్మలు ఏకమై, ద్రవించిన రసం ఇచ్చే రసానందమే. అనందో బ్రహ్మ!

రసాద్వైత సిద్ధాంతానికి భీమన్న ఆచార్యుడు. వివిధ ప్రయోగాల ద్వారా తపస్సు ద్వారా, స్వానుభవం ద్వారా ఈయన దర్శించిన పరమ రహస్యమిది.

"కర్మను బట్టి జన్మ ఏర్పడుతుం దనేది నిజం కాదు. గ్లాసుడు నీళ్ళు సముద్రంలో పోసి, మళ్ళీ ఆదే నీళ్ళను ఎలా తీయలేమో, పరమాత్మలో కలిసిన ఆత్మను కూడ అలానే పట్టలేం" అంటాడు భీమన్న. కర్మ సిసా లా పట్టుకొని వుంటుం దనడం వట్టి ఊహ అంటాడు.

జీవించి వుండగానే పరమానంద స్థితిని అనుభవించడానికే రసాద్వైతం. ప్రతి జీవికీ పర్యవసానం ఆనం దా ద్వైతమే. అందుకు ఎట్టి సాధనా, ఎట్టి గురూపదేశమూ అక్కర లేదంటాడు. ఆ పరమ చైతన్య శక్తి నుంచి చేచిన అల విరిగి తిరిగి దానిలో లయం కావడానికి ఎట్టి ప్రయత్నమూ అక్కరలే దంటాడు.

"నీకు చేతనైన పని నీవు చేసుకొంటూపో. ఏదైనా అడ్డు వస్తే, ధిక్కరించి దాటుకొంటూ పో. అదే జీవిత పధం. అదే జీవిత లక్ష్యానందం, మత పెద్దలు చెప్పే మోక్షం" అంటాడు భీమన్న.

ఇదంతా క్షుణ్ణంగా అర్థం చేసుకోడానికి ఈయన రచనల్ని సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించాలి. మన సామాజిక వ్యవస్థ నుంచి అవైదికమైన కుల తత్వం నిర్మూలించబడితే తప్ప, అట్టి అపరోక్ష పరిశీలన సాధ్యం కాదు.

దేవు డ్భవతరించాడు , ప్రవక్త లుద్భవించారు ,
నెత్తురు చిందించారు . పీతుల బోధించారు
మానవ నైజం మాత్రం పాత గొంగళి లా
ఎక్కడి దక్కడే పడి వుంది !
—గుడిసెలు

225. ఆస్థాన కవి ఎవరు ?

ఆస్థాన కవి విశ్వనాథ సత్యనారాయణ గారు 1976 అక్టోబరులో పరమ పదించగా , ఆ స్థానం లోకి ఎవరు వస్తారో అనేది తెలుగు విద్వల్లోకంలో ఒక మహా సమస్య అయింది . నలుగురు నోళ్ళలోను నలగ సాగిన పేర్లలో భీమన్న పేరు కూడా ఒక టయింది .

మా పరిచయుల లోని ఒక మహిళ ఒక రోజున నాకు అభినందనలు అంద జేసింది . ఎందుకంటే ఆస్థాన కవి పదవి భీమన్నను వరించ బోతున్నదట ! ఈ అభినందనలు అందజేసిన ఆవిడ ఒక అధికారిక పరిధి లోనిది కావడంవల్ల . వార్త నిరాధారమై ఉండకపోవచ్చు ననిపించింది . భీమన్నకు చెప్పాను .

అట్టి వార్తను కళాభవనం ఆవరణలో తాను కూడ విన్నా నన్నాడు భీమన్న . ఆడ్వాన్సు అభినందనలు కూడ చాల అందుకున్నా నన్నాడు . అయితే నిప్పు రాజుక ముందే పొగ లేచింది కనుక , అది ఆరిపోయే ప్రమాద మున్న దన్నాడు . బతకని బిడ్డ బారెడంత అనే సామెతను గుర్తుచేశాడు .

ఒక రోజున శాసన సభ్యులు పీటర్ పాల్ గారు , ఆయన మిత్రులు వచ్చి , భీమన్న ఐయోడేటా పట్టు కెళ్ళారు . వద్దన్నా వినలేదు . పత్రికలతో అక్కడక్కడ భీమన్న పేరు కనబడ సాగింది . కొన్ని పత్రికలలో నేను పేచీ పడవలసి వచ్చింది - భీమన్న పేరును అనవసరంగా వీధి కిడ్చ వద్దని . తిరుమల రామచంద్రగారి వంటి సాహితీ వేత్తలతో భీమన్నే స్వయంగా పేచీ పడ్డాడు . ఒక మిత్రుడు అవునంటే , కాదనే శత్రువులు పదిమంది ఆ ప్రక్కనే తయారవు తారు . అనవసరంగా వివాదాలు పెంచుకోవడం దేనికి ?

"నా కెప్పుడు ఏ మేలు జరిగినా – ఎవరికీ తెలియకుండా, నాక్కూడా తెలియకుండా, జరిగినట్టిదే! ముందుగా అందరికీ తెలిసే దేదీ నా విషయంలో కార్యరూపం దాల్చదు. పోటీ ఏర్పడుతుంది. అవరోధాలు కల్పించ బడతాయి. అధికార పదవులలో నా అనే వా రెవరూ నాకు లేరు" – అన్నాడు భీమన్న, తనకోసం ప్రయత్నం చేస్తా మంటూ వచ్చిన మిత్రులతో.

"ప్రస్తుతం మన కవులలో ఆస్థాన కవికి మీ కున్నన్ని అర్హతలు మరె వరి కున్నాయి? ఇంత సాహిత్య సృష్టి చేసిన వాళ్ళు మరిం కెవరు?"

"ఆస్థాన కవికి ఇవేవీ అక్కర లేదు. నిజానికి కవి కూడా కానక్కర లేదు. ఏవైనా పద్యాలు వ్రాయ గలిగితే చాలు. పద్యాలు వ్రాయలేని పండితు లెవ రున్నా రీ నాడు?"

"పంచరత్నాల కవులు, శాలువాల కవులు, నూట పదహార్ల కవులు, కవి సమ్మేళనాల కవులు...."

"ఇంత వరకు నియమించ బడ్డ ఆస్థాన కవులలో ప్రజలకు గాని, ప్రభు త్వానికి గాని పనికి వచ్చిన కవు లెందరు? వాస్తవానికి అందులో ఒకాయన కవే కాడు కదా!"

'పైగా మీరు హరిజనులు కావటడం ఒక అదనపు అర్హత కాదా?' తెగించి అనే శా డొక మిత్రుడు మాటల మధ్య.

"అదే ఇప్పుడు నాకున్న ఒక పెద్ద అనర్హత" అన్నాడు భీమన్న. "ఒక హరిజనుణ్ని ఆస్థాన కవిగా చూచి ప్రతక గల జీవశక్తి జాతి కింకా రాలేదు" అన్నాడు గంభీరంగా. వాతావరణం తేమతో బరువెక్కి పోయింది.

"ప్రజాస్వామికంలో ఆస్థాన కవి పదవి అవసరమా? అన్న చర్చలు పత్రికల నిండా, వేదికల నిండా ప్రారంభ మయిం దెందుకు? భీమన్న అవు తాడేమో అన్న భయం వల్లనే. అర్హతను బట్టి భీమన్నకే ఎక్కువ అవకాశా లుండడం వల్ల, ఇతణ్ని కాకుండా చెయ్యడానికి మరో మార్గం కనిపించనందు వల్ల, ఆ పదవినే రద్దుచేయమనే ప్రచారం ప్రారంభించారు తెలివైన వాళ్ళు.

"ఏది ఏమైనా ఇది వాకు రాదు . అక్కర లేదు కూడా" అన్నాడు భీమన్న నిశ్చింతగా .

ఆ తర్వాత ఒక సంవత్సరానికి దాశరథి గారు ఆస్థాన కవిగా నియమించ బడ్డ వార్త పత్రికలలో చదివి , ఎంతో సంతోషించాడు భీమన్న . ఉన్న పరి స్థితిలో దాశరథి గారొక్కరే ఆ పదవికి తగినవారు అన్నాడు . ఆయనను మన సారా ఆశీర్వదించాడు .

ఒక్కడే అధినేత కా డుర్వి కెల్ల ,
ఆంద రధి నేతలే శ క్తి వనుసరించి ;
ఎవని పనిలోన వాడె ఈ యెల్ల విశ్వ
రాజ్య నిర్మాణ ముదు పూర్ణాధి కారి !

—భీ . కా . కుసుమాలి

226 . దళిత్ కైపిడి

కన్నడ సాహిత్య పరిషత్తు వజ్రోత్సవాలకు ఆహ్వానించబడి , ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రతినిధిగా భీమన్న బెంగుళూరు బయలుదేరుతుంటే- కూడా నేనూ బయలు దేరాను పిల్లలతో . మాతో ఒక సరస్వతి కూడా వుంది . ఆమె పదవ క్లాసు పరీక్షలు వ్రాసిన నా శిష్యురాలు , అవిడి సరస్వతి .

బెంగుళూరులో వాసవి సత్రంలో మకాం , జాతీయ స్థాయి సాహితి సభల్లో పరిష దధ్యక్షులు జి. నారాయణగారి ఆతిథ్యం, కన్నడ భాషతో పిల్లల ఆటలు ఆనందంలో ముంచెత్తాయి మమ్మల్ని .

బేడ (వద్దు), బేకు (కావాలి), సాకు (చాలు) , అల్లి నోడు (అక్కడ చూడు), ఇల్లి నోడు (ఇక్కడ చూడు) అనే అయిదు మాటలు పట్టుకొని వాటితో అక్కడి సర్వర్లను , అతిథులను మాత్రమే కాక , మొత్తం కన్నడ లక్ష్మినే గిలిగింతలు పెట్టేశా రీ ముగ్గురు పిల్లలు.

"పులి , నక్క , గొర్రె సిద్ధాంత కర్తగా భీమన్నను అక్కడి తమ సాహితీ వేత్తలకు పరిచయం చేశారు నారాయణగారు . మన "బెంద్రే" అంతటి

వాడు అంటూ ప్రశంస చేశారు . ఆయన అంతకు పూర్వం హైదరాబాదు వచ్చి నప్పుడు భీమన్న చెప్పిన ఈ సిద్ధాంతం ఆయనను అమితంగా ఆకట్టుకొంది.

బెంగుళూరులో భీమన్నను అమితంగా ఆనందపరచిన విశేషాలలో ఒకటి వాసవీ మూర్తి, వాసవి దేవాలయంలోని ఆ మూర్తిని ఈయన ఎంతసేపు చూశాడో తాదాత్మ్యంతో ! అంత అతిలోక సుందరమైన దేవీ విగ్రహాన్ని తాను ఇతఃపూర్వం చూడలేదట !

లాల్‌బాగ్‌లో సాయం విహారం అడుగడుగునా "రాగ వైశాఖి" ని సాక్షాత్కరింప చేసిం దీయనకు. వెడలు పొదలు, లతా నికుంజాలు, చీకటి గుబురులు, పూల గుత్తులు-రాగ వైశాఖి తో పాటు అనేక మణి మేఖల లను కూడ గుర్తుకు తెచ్చి వుండవచ్చు. ఆ పరిసరాల సమ్మోహనత అలాంటిది.

అక్కడ భీమన్నకు లభించిన శోభాయ మానమైన ఆతిథ్యాలలో ఇండియా కాఫీ బోర్డు చైర్మను ఎమ్. వి. రత్నంగారి దొకటి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చీఫ్ రిపోర్టరు వి. టి. రాజశేఖర సెట్టిగారి దొకటి. రత్నం గారింట్లో విజయ పల్లవి, విజయేందిర కూడ స్వేచ్ఛగా రాభీలు పాడడం ఒక విశేషం. సెట్టి గారింట్లో కర్నాటక మాజీ మంత్రి బసవ లింగప్ప గారు భీమన్నను కలుసుకొని వెళ్ళారు. శెట్టిగారి సతీమణి హేమలత గారి ఆతిథ్యం, కుమారుడు సలిల్ వినయ సౌకుమార్యం ఎంతో ఆనందపరచాయి.

"ధర్మం కోసం పోరాటం" కన్నడంలోకి "దళిత్ క్రైపిడి" అనే పేరుతో అనువదించ బడింది. అచ్చయింది. అనువాదకులు డా॥ వై. నారాయణస్వామి గారు. ఒక ప్రతిని పంపించారట కాని అది మాకు అందలేదు. సెట్టిగారి సొంత ప్రతిని పట్టుకొచ్చేశాం. ఈ దళిత్ క్రైపిడి కర్నాటకలో మంచి ప్రచారం పొందుతున్నదని శెట్టిగా రన్నారు. మేం వారింట్లో వున్నంతసేపు భీమన్నను ఎన్నో విధాల ప్రశ్నలు వేస్తూ, నోట్సు వ్రాసుకొంటూనే వున్నా రాయన

ఈ వజ్రోత్సవాలలో ఒక రోజున కేంద్ర సాహిత్య అకాడమీ వారి జాతీయ బహుమతులు అందజేసే సభ జరిగింది. ఈ సభ గత సంవత్సరం ఢిల్లీలో జరిగింది. అప్పుడు భీమన్న "గుడిసెల"కు జాతీయ అవార్డు వచ్చింది. ఈ సంవత్సరం తెలుగులో ఎవరికీ రాలేదు.

ఈ సభలో భీమన్నను ఆకర్షించిన ఒక విశేషం "బాముల్ హజా హాషియార్" అనే పంజాబీ నవల జాతీయ అవార్డును అందుకోవడం. ఆ నవలా రచయిత నరేందర్‌పాల్ సింగ్, ఎంతో అనుభవంతో ఎంతో గొప్పగా వ్రాసిన ఆ నవలను "అశ్లీలంగా వుంది, ప్రజల మత విశ్వాసాలను గాయపరిచేదిగా వుంది" అనే కారణాలను ఆపాదించి, దానిని పంజాబ్ ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వం అంటే రాజకీయాలు, రాజకీయా లంటే రౌడీల రాగద్వేషాలు. వీటన్నిటికి అతీతమైన సర్వ స్వచ్ఛ కదా సరస్వతి. పంజాబ్ సాహిత్య విదులు ఈ సత్యాన్ని నిరూపించుకున్నారు. ప్రభుత్వం నిషేధించిన నవలకు అకాడమీ అవార్డు సాధించుకోగలిగారు. (దక్కన్ హెరాల్డు, బెంగుళూరు 28-4-77)

"ఈ దశాబ్దపు ఏకైక సాహితీ సృష్టి" అనే ప్రశంసను డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి నుంచి అందుకొన్న "రాగ వైశాఖి"కి అలాంటి అదృష్టం పట్టలేదు. పంజాబీకి, తెలుగుకు ఉన్న తేడా ఇది" అన్నాడు భీమన్న ఈ సత్యాన్ని వ్రేలెత్తి చూపుతూ.

ప్రతిభను గుర్తించడంలో, ధర్మం కోసం పోరాడటంలో, పంజాబీ స్థాయికి తెలుగు చేరలేదనడంలో నే నేకీభవించలేను. భీమన్నను గుర్తించడానికి కులం సైంధవుడిలా అడ్డు వస్తున్నదనేది నా విశ్వాసం! రాగ వైశాఖినే మరో కులం వాడు వ్రాసి వుంటే? నిజానికి—ఆనాడు దీప సభకే అవార్డు వచ్చివుండేది. అదొక అపూర్వ సోషలిస్టు కావ్యం కదా! ఇప్పటికీ దీప సభను గురించి ఇలా పాడుకొంటాడు భీమన్న.

దీప సభన్ రచించితివి
దీపములన్ వెలిగించితిన్ త్వదీ
యోపనిషత్ పదాగ్రముల
నుండి దిగంతము లంట! సూటిగా
చూపితి నిన్ను నీ వివిధ
శోభలతో ప్రతి యింట; నీ దయా
దీపము లేక ఎట్లు ప్రగ
తీద్ధ నవోద్ధతి లభ్య మయ్యెడున్?

227. చాముండీశ్వరి

బెంగుళూరు నుంచి మైసూరు బస్ ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా వుంది. దారి పొడవునా కొబ్బరి బొండాలు తాగుతూ రెండు గంటలలో మైసూరు చేరుకున్నాం. అది 1977 ఏప్రిల్ 27. మేం దిగింది హోటల్ కల్పన. ఆ ప్రక్కనే రాజమహల్, చిత్రశాల (ఆర్టు గేలరీ) వగైరా.

28 ఉదయం భీమన్న నిద్రలేచి, బాత్‌రూం లోకి వెళ్ళాడు. అప్పటికే అందరి స్నానాలు అయిపోయి, బైటికి పోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఆయనతో పెట్టుకొంటే ఉదయపు ప్రోగ్రాము లేవీ సాగవు. తీరికగా ఎనిమిది గంటలకు లేచి, కాలకృత్యాలతో రెండు గంటలు గడిపి, రెడీ అయేటప్పటికి పదవుతుంది. ఇంటి వద్ద అయితే ఫర్వాలేదు. ప్రయాణాలలో ఈ సాను పనికిరాదు. అందుకే మేం ముందుగా వెళ్ళడం, ఈయన నిదానంగా వెనక రావడం జరుగుతూ వుంటుంది.

ఈ లోగా ప్రక్కనే వున్న ఆర్టు గేలరీని చూస్తూ వుందామని మేం బైలుదేరుతుండగా, ఈయన తల నుంచి నెత్తురు కారుకొంటూ బయటికి వచ్చాడు. ఏం జరిగింది?

ఆ హోటలు పైకి ఆధునికంగానే కన్పిస్తుంది కాని - లోపల అంతా మహిషాసుర కాలం నాటి శిల్పం! మంచాలు, పరుపులు, కార్పెట్లు మాత్రమే కాదు, బాత్ రూంలో తువ్వాలు వేసుకొనే కొయ్య వంకీ కూడ ఆ నాటిదే. ఆ వంకీ కొయ్యతో ఈనాడు ఒక కుర్చీ చెయ్యవచ్చు. అంత మందంగా వున్నది. అది తలుపు తీసుకొని లోపల ప్రవేశించే దగ్గరే గోడకు వుంది. అది కొట్టుకొంది భీమన్న తలకు!

వెంటనే మా సరస్వతి దూది తీసుకొని గాయాన్ని ఒత్తిపట్టి కట్టు కట్టింది. ప్రథమ చికిత్స సామగ్రి అంతా మా కూడా ఎప్పుడూ వుంటుంది. అయినా డాక్టరుకు చూపడం మంచిది కదా! ఉదయం ఎనిమిది గంటలకు ఏ డాక్టరు వుంటాడు?

డాక్టర్స్ కె. కె. మూర్తి, సాంబమూర్తి, దామోదర్, కౌముది వంటి వారి నిత్యపర్యవేక్షణలో, డాక్టర్ వి. రఘునందన్‌రాజ్ గారి తాత్విక సలహాలతో, ఎడనెడ చింతూరు ఆయుర్వేదనిలయం యజమాని డాక్టర్ కె. కామేశ్వరరావు గారి చిట్కాలూ, జొన్నల మోహనరావు గారి లలిత వ్యాయామ ప్రక్రియలూ, రాష్ట్రిపాల్ గారి ప్రాణాయామ విధులూ వగైరా మిత్రకోటి శుభాకాంక్షలతో భీమన్న ఆరోగ్యం వజ్ర తుల్యంగా వుంటున్నది. ఈ అందరూ జ్ఞాపకం వచ్చారట ఈయనకు-ఆ ఉదయం తలగాయంతో మైసూరు మార్కెట్లో డాక్టరు కోసం తిరుగు తున్నప్పుడు!

ఒక డిస్పెన్సరీలో ఒక కాంపౌండరు దొరికాడు. గాయాన్ని పరిశీలించి "కుట్లు పడాలి, డాక్టరు రానివ్వండి" అన్నాడు.

"కొంచెం టించర్ అయొడిన్ పోసి కట్టుకట్టు" అన్నాడు భీమన్న. అత డలానే చేసి, రూపాయి తీసుకొన్నాడు. డాక్టరు వచ్చేవరకు అగితేనేం? ఆగితే ఈయన భీమన్న ఎలా అవుతాడు? ప్రక్కషాపులో ఒక చిన్న టించరైడిను బాటిలూ, కొంచెం దూదీ కొనుక్కొని, పేంటు జేబులో వేసుకొని, చాముండీశ్వరి కొండకు బస్సెక్కాడు.

ఇక్కడొక పరమ సత్యం చెప్పాలి. భగవంతుడి సృష్టిలో ఎంత చెత్త వున్నదో, అంత చెత్తా భీమన్న జేబీ లో ఉంటుంది. ఎప్పుడు ఎవరికి ఏది కావలసి వచ్చినా, తన జేబు నుంచి తీసి ఇవ్వగలడు.

ఒకసారి కృష్ణదేవరాయ భాషా నిలయంలో జరిగిన సభలో ఒక సుప్రసిద్ధ మహిళకు పెద్ద గులాబీ పూలదండ వేయబడింది. ఆ పూలను తన వెంట వున్న మహిళ లందరికీ పంచాలను కొన్నదావిడ. అప్పటికే రేకలు రాలిపోతున్న ఆ దండను అతి సున్నితంగా విభజించవలసివుంది. భీమన్న జేబులోని చాకే ఆ పని చేయగలిగింది.

మరో రోజున ఆబిడ్సు సెంటరులో నా కాలి చెప్పు తెగిపోయింది. ఏం చెయ్యాలో తెలియ లేదు. వెంటనే ఈయన తన జేబు లోని పురికొసను తీసి, చెప్పుకు పెంపరరీ చికిత్స చేశాడు. ఇలాంటి సంఘటనలు ఎన్నెన్నో!

"దున్నల్ దున్నుటి, లోకమెల్ల నొకటే
దున్నల్ కదే తల్లి ! ఎం
దున్నావో, పరతె''మ్మటంచు నిను నే
నుద్విగ్నతన్ బిల్వ, "ఏ
మన్నావ్రా?'' అని కొమ్ము దూసి తలపై
మట్టెన్ ననున్ దున్నుడు ! ఏ
మన్నన్, దున్నలె రాజ్యమేలును గ
దమ్మా నేడు ! చాముండికా !

"అమ్మో ! దున్నలు" అనే కవిత ఎప్పుడో దసరా కవి సమ్మేళనకు భీమన్న వ్రాసినట్టిది. ఆ కక్ష పెట్టుకొని మహిషాసురుడు ఇప్పుడు స్థాన బలం వల్ల తన నెత్తి చితకగొట్టా డంటాడు భీమన్న. మహిషాసురుడూ, వాడి అనుచరులూ నిజంగా చావలేదనీ, ఇప్పుడు ఆర్థిక రాజకీయ రంగాలలో వున్న అధిక సంఖ్యాకు లంతా వాళ్ళేననీ, చేత నైతే అదుపులో పెట్టుకొమ్మనీ చాముండీశ్వరికి చెప్పి వచ్చాడు భీమన్న. ఆమె ఏం చేస్తుందో తెలియదు కానీ, భీమన్న తలగాయం మాత్రం ఏ కుట్లూ అక్కరలేకుండానే మానిపోయింది.

వితమోక్షార్థము నాడు నాధుని మనో
భీష్టమ్ము ఛేదించి, మూ
ర్ఛితు గావించి, ప్రవంతి వైతివి; అమృత
ప్రేయుం డగస్త్యుండు జీ
విత యజ్ఞమ్మున నేడు నిన్ను గొనియెన్
విశ్వేశ్వరాఖ్యన్ ! సమా
గత సౌభాగ్య త వస్వినీ ! కొను మివే,
కావేరి ! మా సంస్తుల్ !

అంటూ కావేరీ దేవికి అంజలి ఘటించాడు భీమన్న, బృందావనంలో అంతటి సుందర దృశ్యానికి ఇంతటి మోహన కవిత! ఆ నాటి అగస్త్యుడేఈనాటి ఇంజనీరు విశ్వేశ్వరయ్యగా పుట్టి, కావేరిని పట్టుకొన్నాడన్న మధుర భావన!

కృష్ణరాజ సాగరం క్రింది ఆ బృందావనం తోటలు భూలోక స్వర్గమే అనిపిస్తాయి. అదొక సుందర స్వప్నలోకం!

మైసూరు జూ లోని సింహ శార్దూలాలు పురాణ నాయికా నాయకులే. అక్కడొక బోనులో శార్దూల సీతకు లవకుశులు కల్గిస్తున్న చిరాకు చెప్పనలవి కానిది. అది నిద్ర పోదా మను కొంటుంది. పిల్లలు పోనియ్యవు, ఒకటే అల్లరి! అది ఏ జాతి ప్రాణి అయినా, తల్లి అవస్థ అంతే! పిల్లలపై నాకు కోపం వచ్చినప్పు డెల్లా ఈ దృశ్యాన్నే జ్ఞాపకం తెస్తుంటాడు భీమన్న.

228. భారత జనాత్మ

బెంగుళూరు, మైసూరు తర్వాత మా మజిలీ తిరుమల. ప్రయాణ మంతా పగలు ఐస్సుల్లోనే. పరిసరాలను, ప్రజలను చూచుకొంటూ ప్రయాణం చెయ్యడం భీమన్న కిష్టం. మాకూ అదే అలవా టయింది.

తిరుపతి కొండల మీద కొంతకాలం వుండి, తాను వ్రాస్తున్న రెండు మూడు రచనలను పూర్తిచేసుకోవా లనుకొన్నాడు భీమన్న. అయితే, బస్సు పనివారి సమ్మె అప్పుడే ప్రారంభం కావడం వల్ల-అక్కడి పరిస్థితు లన్నీ అస్త వ్యస్తమై, ఈయన లక్ష్యం కొంచెం కూడ నెరవేర లేదు. అందువల్ల - తిరుపతి, మంగాపురం, పాపనాశం, కపిల తీర్థం, కాళహస్తి వగైరా క్షేత్రాలను అక్కడి విశేషాలను చూడ్డం, వినోదపడడం లోనే మనస్సు లగ్నం చేశాడు మాతోపా టే. యాత్రలలోను, కుటుంబంతోను, మిత్రుల మధ్యను ఉన్నప్పుడు పరస్మైగా ప్రవర్తించడమే అందం. ఏకాగ్రత, ధ్యానం, సమాధి అవసరమైన రచనకు ఆత్మనేపది విధ్యుక్తం. ఈ ఉచితజ్ఞతను శత శాతం అమల్లో పెడతాడు కాబట్టి భీమన్న ఇంటా, బయటా కూడ వరీయుడూ, వరేణ్యుడూ అయినాడు. కవిగాను, వ్యక్తిగాను జయ భద్రు డైనాడు.

మేము ఈ యాత్రకు బైలుదేరడానికి నిర్ణయించుకొన్ననాడే దేవాదాయ శాఖా కమీషనరు పురుషో త్తం నాయుడి గారి వద్ద నుంచి తిరుపతి దేవాలయాధి కారులకు ఒక సిఫారసు లేఖ వ్రాయించాం - వసతి కోసం. అది వాళ్ళకంద లేదట! హైదరాబాదు నుంచి అలాంటి రికమండేషన్లు రోజూ వందల కొలది వస్తుంటాయి. వాటికి అంతగా విలువ ఇవ్వబడ దట! అయితే తిరుపతిలో పులికంటి కృష్ణారెడ్డి, కర్రా విజయకుమార్, సాయినాథ్, రాజారెడ్డి వంటి

మిత్రులూ, బంధువులూ వుండడం వల్లనూ, అక్కడ భీమన్న పేరు తెలియని వాళ్ళు అంతగా లేనందు వల్లనూ మాకు వసతి, దర్శన సౌకర్యాలలో ఇబ్బందు లేమి కలుగ లేదు.

గత సంవత్సరం మేం హృషికేశం వెళ్ళినప్పుడు అక్కడ ఆంధ్రాశ్రమం మేనేజరుగా వున్న గోపాలరెడ్డిగారే ఇప్పుడిక్కడికి (తిరుపతి) బదిలీ అయి రావడం, భీమన్న పట్ల గురుభావం గల సాయినాథ్‌గారు ఐస్ డిపో మేనేజరుగా వుండడం నిజంగా మా కొక వరమే అయింది. ఇక కవీ, కథకుడూ పులికంటి కృష్ణారెడ్డి, ప్రమదావనం సంపాదకురాలు సంతోషం గార్ల ఆతిథ్యం నిజంగా అమృత ప్రాయం.

కపిలతీర్థం దగ్గరలో వుంటున్న ఆచంట జానకిరాం గారితో ఇష్టాగోష్ఠి సన్నివేశ ఎంతో మధురమైనట్టిది. భీమన్నకు తొలి రేడియో ప్రోగ్రాం ఇచ్చిన వాడు జానకిరాం గారే.

సరస్వతినీ, విజయేందిరనూ తిరుపతిలోనే వదిలేసి మేం ముగ్గురమూ ఒకరోజు శ్రీకాళహస్తి వెళ్ళి వచ్చాం. అక్కడే భీమన్నకు "దేవ స్థానం" అనే పేరుతో నవల వ్రాయా లనే సంకల్పం కలిగింది.

వెంకటేశ్వర స్వామి దర్శనం మాకు సుళువుగానే లభించింది. క్యూ బాధ లేదు. అయితే క్యూలో నెత్తిమీద మూటలతో నిలబడ్డ వాళ్ళను చూస్తుంటే మాత్రం ఎంతో బాధ కలిగింది. వాళ్ళను పరిశీలించి చూస్తూ అలానే నిల బడి పోయేవాడు భీమన్న.

"స్వామి దర్శనానికి వీళ్ళిన్ని అవస్థ లెందుకు పడాలి? ఎవళ్ళ భ్రాంతి వాళ్ళకు దైవం. ఎండమావుల వెంట ఎడతెరిపి లేకుండా పరిగెత్తుతున్న నిరం తర దాహపీడిత జనం" అంటూ ఆశ్చర్య చకితు డవుతాడు భీమన్న ఆ నిరు పేద భక్తుల్ని చూచి!

ఎదుట సముద్రంలా నిలబడి వున్న స్వామి, తక్కిన రెండు వైపులా వచ్చేపోయే జన వాహిని. వచ్చేటప్పుడు భక్త్యావేశంలో పొంగులు వారుతూ

ముందుకు దూకే మహావాహిని అది. తన సర్వాన్నీ స్వామి కర్పించి ఆయనతో కలిసిపోతుం దది. తిరిగి పోయే టప్పుడు కేవలం తేలికపడ్డ ఆవిరి అది.

స్వామి ఎదుట ఈ రెండు ప్రవాహాలకు నడుమ డెల్టా లా వున్న చిన్న ఆవరణలో నిలబడ్డాం మేం కొంతసేపు. అధికార పదవులలోని ప్రముఖ భక్తులు కొంచెంసేపు అక్కడ నిలవ వచ్చు - ధర్మ దర్శనం క్యూకు ఆటంకం కాకుండా. ఆ క్యూలో వస్తున్న పేద భక్తులపట్ల స్వామి సన్నిధిలోని అధికారుల ప్రవర్తన నిజంగా అమానుషంగా కనిపించింది మాకు. భీమన్నయితే అధికారులతో అక్కడి కక్కడే పేచీ పెట్టుకున్నాడు.

క్యూలో వస్తున్న భక్తుడు స్వామి ఎదటికి అడుగు వెయ్యగానే అతడి మెడమీద చెయ్యి వేస్తాడు అక్కడి అధికారి. ఆ భక్తుడు ఉలిక్కిపడి, ఆటు స్వామిని చూడకుండా ఇటు అధికారిని చూస్తాడు. అతడు స్వామిని చూద్దామని మళ్ళీ ముఖం ఆటు తిప్పేలోగానే అవతలకి గెంటి వేస్తా డతణ్ని ఆ అధికారి. ఇదే అక్కడ ధర్మదర్శనం కోసం క్యూలో వెళుతున్న పేద భక్తులకు లభిస్తున్న దైవ దర్శనం!

"కొండకు వెళ్ళాలని సంవత్సరాలుగా కలలు కంటూ, పైసపైసగా పొదుపు చేసుకొంటూ, సంసారా న్నంతా నెత్తిన పెట్టుకొని, జిల్లాలు దాటి, వారాలు గడిపి, రోజురోజంతా క్యూలో నిలబడి స్వామి దర్శనానికి వస్త - అక్కడ క్యూ అధికారి ముఖం చూడ్డం కోసమా?" అనేది భీమన్న ప్రశ్న.

"మీరు నాస్తికులు కదా? ఈ భక్తు లంతా ఏమైపోతే మీకేం?" అన్నాడు మాతోపాటు వున్న ఒక మిత్రుడు

"మీరు ఆస్తికులు కదా! ఆ వచ్చిన భక్తుడికి న్యాయం ఎందుకు చెయ్యరు?" అన్నాడు భీమన్న.

"క్యూ వేగంగా కదలకపోతే, వేలాది మందికి దర్శనం ఎలా కలుగుతుంది?" అధికారి ప్రశ్న.

"అంతదూరం నుంచి అన్ని అవస్థలు పడి వచ్చిన భక్తుడికి స్వామిని కళ్ళారా చూసిన తృప్తి అయినా వుండవద్దా? పైగా అలా మెడమీద చెయ్యివేసి

గెంటడ మేమిటి? అదీగాక - పేదలుగా, పల్లెటూరి వాళ్ళుగా కనిపించే భక్తుల పట్లనే ఈ అన్యాయం ఎక్కువగా జరుగుతున్నది!"

భీమన్న నాస్తికుడు కాకపోయినా, మూఢాచారాలను విమర్శించే టప్పుడు అంతకంటె కఠినుడుగా కనిపిస్తాడు. ప్రపంచానికి అద్వైత పరమ తత్వాన్ని ప్రసాదించిన అర్షజాతి ఇలా నాశనమై పోతున్నదే అని దుఃఖపడతాడు. ఆ దుఃఖంనుంచి వచ్చేవే ఈయన చేసే విమర్శలు చాల భాగం.

భావ సౌందర్యాల రూపకల్పనలే వివిధ దేవతా మూర్తు లనీ, ఆ దృష్టి తోనే వాటిని దర్శించా లనీ ఈయన వుద్దేశం.

మెడమీద చెయ్యి వేసి గెంటడం తప్పని అంగీకరించా డా అధికారి. ఇక ఆలా జరగకుండా చూస్తా మన్నాడు. రోజు కింత మందికి మాత్రమే దర్శన మని పరిమితి పెట్టుకోమనీ, ఒక్కొక్క భక్తుడు కనీసం నిమిషం సేపైనా అక్కడ నిలబడి స్వామిని చూసే అవకాశం ఇవ్వాలనీ సూచన లిచ్చాడు భీమన్న. దేవస్థానం మొత్తం మీద ధనికులకోసం సౌకర్యాలు విస్తరించ బడు తున్నాయే కాని, పేదల కనీ సావసరాలను తీర్చే ప్రయత్నం కూడా కనిపిం చడం లేదని వాపోయాడు. దేవుడు ధనవంతుల ప్రతినిధి మాత్రమేనా అని ప్రశ్నించాడు. అదే ప్రశ్నను వెంకటేశ్వర స్వామికే వేశాడు.

ఓంకారమ్మ భవత్స్వరూప మనరే
యోగుల్ ? తదీ యూరసుల్
హ్రీంకారమ్ములతో ఆమాయక జనా
ళిన్ గొట్టి జీవింత్రు! హే
యెంకన్నా! ఇది యేటి మానవత స్వా
మీ! ఇంత మౌఢ్యాంధ కా
హంకారమ్మున జీవి నుంచి, మరి రా
జ్యం బేరికై యేలెదో!

ఎవరు చెపుతారు జవాబు? నిర్గుణ నిరాకార పరబ్రహ్మ నిజం చెపు తుందా? తన భ్రాంతి కల్పించుకొన్న రూపం తన కష్ట సుఖాలను నియంత్రి స్తుందా?

మళ్ళి పులి, నక్కా సిద్ధాంతమే! గొర్రెల్ని ఎండమావుల వెంట పరిగెత్తిస్తూ, వాటి రక్త మాంసాలతో జీవితాలు పెంచుకొంటున్న పులుల, నక్కల సిద్ధాంతం!

ఇదా మానవ జాతి! ఇదా మనకు వేద వేదాంతాలు అందజేసిన వార సత్వం! భారత జనాత్మకే అంజలి ఘటించి, హెచ్చరిక పలికాడు భీమున్న –

కాంతి క్ష్మాంతి యటంచు జీవి కొక ల
క్ష్యమ్మున్ ప్రపంచించి, వే
దాం తోద్యాన వికమ్మవై వెలసినా
వా నాడు; విజ్ఞాన భా
స్వంతమ్మై జగమెల్ల వెల్గు తరి, వీ
స్వావాస మం దిప్పు డీ
ద్యాంత మ్మేమి? మహార్ష భారత జనా
క్ష్మా! ఆగి యోచింపవే!

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

గ్రంథ సర్గ

వసంతంలో పువ్వుల్లా, వర్షంలో మెరుపుల్లా భీమన్న జీవితంలో మనకు కనిపించే అత్యంత మనోజ్ఞమైన ఉజ్జ్వల ఘడియలు ఈయన రచనోదయాలు. అంటే, ఈయన రచనలు ఉద్భవించిన ఘడియలు. అంటే- ఆ రచనలు పుట్టడానికి కారణమైన ప్రేరణలు, సంఘటనలు, శాఖలు.

ఈయన ప్రతి రచనా మౌలిక మైనదే కనుక, దాని పుట్టుకకు మూల హేతువులు కూడా అపూర్వాలు గానే వుంటాయి. సామాన్యులకు సామాన్యంగా కనిపించే వస్తువులు, వ్యక్తులు, సంఘటనలు, సన్నివేశాలు-ప్రకృతిలోని ప్రతి లవమూ కూడ-ఈయన కన్నుల్లో కమనీయ విద్యుత్తులను మెరిపిస్తాయి. గుండెల్లో గులాబీలై గుబాళిస్తాయి. అప్పటి మన స్థితికి ఉచితమైన లయలో, ఛందస్సులో అవి కవితా రూపం దిద్దుకొంటాయి.

ఆ విధంగా ప్రత్యక్ష జీవితం నుంచి పుట్టుకొని వచ్చి నట్టివే, స్వానుభవ రూప కల్పనలే ఈయన రచన లన్నీ. ఆవి విడి విడి పద్యాలు కావచ్చు. "మధు గీత", "త్రిపదలు", "టుక్రీలు" వంటి కవితా గుచ్ఛాలు కావచ్చు. "మధు బాల," "అశోకవనిలో రాముడు", "మణి మానసం" వంటి ఖండ కావ్యాలు కావచ్చు. "రాఖీలు" వంటి గేయాలు కావచ్చు. "దీప సభ", "రాగ వైశాఖి" వంటి మహా కావ్యాలు కావచ్చు. "అనాది కొన నుంచి అనంతత్వంలోకి", "గుడిసెలు కాలిపోతున్నై", "శివాలకలు" వంటి వచన కవితా కావ్య సంపుటులు

కావచ్చు. 'ఏకపద్యా పాఖ్యానం" వంటి వ్యాఖ్యాన గ్రంథాలు కావచ్చు. "మానవుని మరొక మజిలీ", పైరు పాట", "బొమ్మ" వంటి గేయ కావ్యాలు కావచ్చు. "పాలేరు", "కూలి రాజు", రాగ వాసిష్ఠం", "బాలయోగి", "ఆది కవి వాల్మీకి' వంటి నాటకాలు కావచ్చు. "ధర్మం కోసం పోరాటమూ" కావచ్చు. "పిల్లి శతకమూ" కావచ్చు.

అనువాదాలు, అనుసరణలు భీమన్నకు కిట్టవు. ఆ రెండు పద్ధతులకు ఈయన వ్యతిరేకి మాత్రం కాదు. తాను మాత్రం వాటి జోలికి పోడు. అదీ ఈయన ప్రత్యేకత. భీమన్న ఏమి వ్రాసినా, ఏమి చెప్పినా తన స్వంత పరిశీలన నుంచే వ్రాస్తాడు. తన స్వంత అనుభవము నుంచే చెప్తాడు. తన స్వంతం కాని దేదీ తనకు లేదు.

ఇతర భాషల నుంచి, ఆయా భాషలలోని వివిధ విశిష్ట గ్రంథాలను, అందు కందుకు అనుకూలమైన ప్రక్రియలలో, మన భాషలోకి తెచ్చుకోవలసిందే. అలా తెచ్చుకోక తప్పదు కూడ. అయితే-ఒకసారి ఒక భారతమో, రామాయణమో, భాగవతమో మన భాషలోకి వచ్చిన తర్వాత - మరొకరు మళ్ళీ అదే గ్రంథాన్ని అనువదించడాన్ని ఈయన అసహ్యించుకొంటాడు. రామాయణం వంటి సంస్కృత మహా కావ్యాలను టీకా తాత్పర్య వ్యాఖ్యానాలతో సహా తెలుగు వాళ్ళకు అందివ్వా లంటాడు. పద్య కావ్యాలుగా వ్రాయడం శుద్ధ వ్యర్థ మంటాడు.

సంస్కృతాది భాషలలోని మహాకావ్యాల యొక్క తెలుగు అనువాదాలను చూచుకొని ఏం గర్వ పడతాం? మనకు మన స్వంతం అనుకో గల్గిన సాహిత్యం ఏది? అనేది భీమన్న ప్రశ్న. తెలుగు దేశం ఎల్లలు దాటిన తర్వాత మరొక భాష వాళ్ళకు "ఇదిగో మా తెలుగు సాహిత్యం" అని చెప్పుకోడానికి మన కేముంది? అని ప్రశ్నిస్తా డీయన. వేమన పద్యాలు, కొన్ని శతకాలు తప్ప మరేమీ లేదంటాడు. జానపద సాహిత్యం కూడ కొంత ఉండవచ్చు.

అనేక ఇతర భాషలలో ఎన్నో మౌలికమైన ఉత్తమ గ్రంథాలు ఉద్భవిస్తూ వుండగా, అందులో కొంతయినా సాహిత్య సృష్టి తెలుగులో ఎందుకు జరగడం లేదు? వివిధమైన మనస్తత్వాలు గల బలమైన వ్యక్తులు తెలుగు

వాళ్ళలో లేకా? నదులు, పర్వతాలు, అరణ్యాలు, సముద్రాలు, పొలాలు, ఫలవనాలు వంటి వేమీ తెలుగు దేశంలో లేవా? ఉత్తమ సాహిత్య సృష్టికి కావలసిన సామగ్రి తెలుగు దేశంలో ఏది లేదు? మరి నూతన సృష్టి ఎందుకు జరగడం లేదు? ప్రతిభావంతులు లేకనా?

భీమన్న వేసే ఈ ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పరు. అసలు వాటిని వినిపించుకోరు. అందువల్ల వాటికి ఈయనే సమాధానం చెపుతాడు. "కందం వ్రాసినవాడే కవి అంటూ - తోట మాలి స్థానంలో వడ్రంగిని నిల్పు కొనడం వల్లనే నూతన సాహిత్య సృష్టికి స్థానం లేకుండా పోయింది" అంటా డీయన. సృష్టి ఎప్పుడూ మట్టి నుంచే పుడుతుంది. మట్టి నారాధించే రైతు కూలీలే నిజమైన సృష్టి కర్తలు. ప్రతిభ మట్టి వంటిది. పాండిత్య అభ్యాసాలు కార్ఖానాల వంటివి. ఎప్పటి కప్పుడు సహజమైన ప్రతిభను చంపేస్తూ, కార్ఖా నాలను పోషించుకొంటూ వచ్చారు సాంప్రదాయకులు, పండితులు. నేటి మౌలిక సాహిత్య దారిద్ర్యానికి కారణం ఇదే అంటాడు భీమన్న. తెలుగులో చక్కని సరిక్రొత్త సాహిత్యం వెలువడక పోవడానికి సాంప్రదాయిక పండితుల నిరంకుశ దుష్ట స్వార్థ బుద్ధే హేతు వంటాడు.

భీమన్న జీవిత ప్రగతిని పరిశీలించి చూస్తే - ఈ అవరోధా లన్నిటినీ దాటుకొంటూ రావడంలో ఈయన కాలం ఎంత వృథా అయిపోయిందో మనం గుర్తించవచ్చు. అక్షర జ్ఞానమూ, సహజ మానవ సాహచర్యమూ కూడ నిషేధించ బడ్డ కులంలో పుట్టి-ప్రతి సత్యాన్ని, రసాన్ని, రచనా ప్రక్రియనూ స్వానుభవంతో గ్రహిస్తూ-ఎక్కడో పాతాళపు చీకటి లోతుల్లో బయలు దేరి, కైలాస గిరి శిఖరాల వరకూ కేవలం కాలి నడకన ప్రయాణం చేయవలసి వచ్చిన భీమన్న ఏం వ్రాశాడు అని అడగడంలో గల సబబు కంటె - ఇంత వ్రాయగలిగాడే అని మెచ్చుకోవడంలోగల ఔచిత్యమే గొప్పదని నా వుద్దేశం. సమాజం నలుమూలల నుంచీ అణగ్గొట్టబడి, ఏప్పుడో ఎక్కడో అణగారి పోవలసిన వాడు-స్వయం కృషితో, స్వయంభువుగా అన్ని అవరోధాలను అధఃకరించి, ఉజ్జ్వలమైన, ఉత్తమమైన సామాజిక, సాంస్కృతిక, సంపూర్ణ విప్లవానికి మార్గదర్శకమైన, ఇంతటి సాహిత్యాన్ని మౌలికంగా సృష్టించ గలిగా

డంటే - ఈయనతో సరిపోల్చ దగ్గ మహా రచయిత ప్రపంచ చరిత్రలోనే మరొక తెవరున్నారో నాకు తెలియదు .

సౌమనస్యంతో , సౌహార్దంతో మాచినప్పుడే అందం , చందం కన్పిస్తాయి . ఒక్క సాహిత్యం లోనే కాదు , ఏ రంగంలో నైనా అంతే . ఇప్పుడు భీమన్న రచనలలోని ముఖ్యమైన కొన్నిటిని గురించి క్లుప్తంగా తెలుసుకుంవాం .

1. జానపదుని జాబులు

తన సొంత గ్రామంలోనే ఉండిపోయిన ఒక యువకుడు, పట్టణంలో స్థిరపడ్డ తన బాల్య మిత్రుడికి వ్రాసిన లేఖ లివి. ఆ పల్లెటూరి యువకుడు భీమన్నే . పట్టణంలోని తన బాల్య మిత్రుడు మాత్రం ఒక ఊహా కల్పిత వ్యక్తి .

భీమన్న విద్యార్థిగా ఉన్న కాలంలో , సెలవు రోజుల్లో తన మిత్రులకు సుదీర్ఘాలైన లేఖలు వ్రాస్తుండే వాడు . కాలేజీ పరీక్షల కోసం ఎంత స్వచ్ఛమైన గ్రాంథికం వ్రాసే వాడో - మిత్రులకు వ్రాసే లేఖలతో ఆంత స్వచ్ఛమైన వ్యావహారికం వ్రాసే వాడు . నిజానికి ఈ జానపదుని జాబులలో వ్యక్తమైన భావాలన్ని , శైలీ రీతులతో సహా , ఆ నాటి తన వాస్తవ లేఖలలోవే అనవచ్చు .

శైలికి , రీతికి భీమన్న ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు . గ్రాంథికంలో "ము" స్థానంలో "ం"ను ఎలా భరించలేడో , వ్యావహారికంలో "ం" స్థానంలో "ము"ను అలానే భరించలేడు . అంతటి కఠినుడైన శైలీవాది ఈయన .

ఈయన శైలికీ , భావాలకూ ముచ్చటపడి "జన వాణి" సంపాదకులు శ్రీ తాపీ వారు ఆ పత్రికలో ఒక ప్రత్యేక శీర్షికను దేనినైనా నిర్వహించవలసినదిగా కోరినప్పుడు , ఈయన లేఖా రూప సాహిత్యాన్నే ఎంచుకొన్నాడు . పల్లెటూరి జీవితం గురించీ , పట్టణం గురించీ కూడ క్షుణ్ణంగా తెలిసి వుండడం వల్ల , స్వయంగా అనుభవిస్తూ వుండడం వల్ల - రెండిటినీ పోలుస్తూ , పల్లెటూళ్ల అభివృద్ధికి సూచనలు చేస్తూ లేఖలు వ్రాస్తా నన్నాడు . మొదటి లేఖను చూచే ముగ్ధులై పోయారు తాపీవారు . దాని కోసం "పల్లెటూరి లేఖలు" అనే

శీర్షికతో ఒక చక్కని బ్లాకును చెక్కించారు. రచయితకు "జానపదుడు" అనే కలం పేరును ఆయనే సూచించారు. ఆ కలం పేరుతో ఈ పల్లెటూరి లేఖలు వారాని కొకటి చొప్పున చాల కాలం జన వాణిలో ధారావాహికగా ప్రకటించ బడ్డాయి.

జనవాణి నుంచి తప్పుకొన్న చాల కాలం తర్వాత, ప్రజామిత్ర వార పత్రికలో ఈ లేఖలే "జానపదుని జాబులు" అనే శీర్షిక క్రింద కొనసాగించ బడినాయి. పుస్తక రూపంలో వేసినప్పుడు ఈ రెండవ పేరే ఎంచుకోబడింది.

ఈ జాబులలో పల్లెటూళ్ళ జీవన గాథలు ఎంతో దయనీయంగా, కన్ను లకు కట్టినటు చిత్రించబడినాయి. గ్రామీణ కుటుంబాల కరుణ, శృంగార గాథలతో, పండుగ రోజు ఉత్సాహాలతో, జానపద గేయాలతో, పొలం పనుల దృశ్యాలతో ప్రతి వాక్యమూ ఒక కన్నీటి బొట్టును కరిగించేదిగా వుంటై. ప్రజలపై ఈ జాబులకున్న ప్రభావం అపారం. భీమన్నకు శాశ్వతమైన సాహితీ కీర్తి వృక్షానికి బీజం వేసిన గ్రంథ మిది. తెలుగు లేఖా మౌలిక సాహిత్యంలో దీనిదే అగ్రస్థానం.

2. పాలేరు

పల్లెటూళ్ళలోని వ్యవసాయ కూలీల, పాలేళ్ళ జీవిత క్రమాన్ని, దైన్యాన్ని, సమస్యలను చూపిస్తూ- వాటి కొక పరిష్కారాన్ని సూచిస్తూ- అభ్యు దయ దర్శనం చేయించే ఒక అపూర్వ సాంఘిక విప్లవ నాటకం ఇది.

వెంకన్న ఒక పాలేరు కొడుకు. అతడు కూడ పాలేరుగా ఉంచబడ తాడు. ఒకే భూస్వామి దగ్గర తండ్రి పెద్ద పాలేరు, కొడుకు చిన్న పాలేరు. తరతరాలుగా వస్తున్న ఈ చాకిరీ పద్ధతిని తొలగించడానికి ఆ వూరి బడి పంతులు ప్రయత్నిస్తూ వుంటాడు. వెంకన్న పశువులను కాసే పొలాల గట్ల వెంట బడికి పోతూ వుండే అగ్ర కులాల పిల్లలను చూసి వెంకన్నలో కూడా చదువుకోవాలనే కోర్కె పుడుతుంది. ఆ కోర్కెకు పంతులు గారి ప్రోత్సాహం, బాల అనే విద్యార్థిని తోడ్పాటు లభిస్తాయి. దానితో వెంకన్న కష్టాలు కూడ ఇనుమడిస్తాయి.

తండ్రి చేత తన్నులు, కామందు చేత దెబ్బలు, తోడి పాలేళ్ళ నుంచి కువిమర్శలు రోజు రోజుకూ పెచ్చుపెరిగి, జీవితం దుర్భరమై పోయి, వెంకన్న ఆ వూరు వదలి పారిపోతాడు. దారిలో ఎన్నో బాధలకు గుర్తై, చివరకు కాకినాడలోని పిఠాపురం మహారాజా వారి శరణాలయంలో చేరుతాడు. ప్రైవేటుగా పరీక్షలకు కట్టి, కాలేజీలో చేరి, కొలది సంవత్సరాలలోనే పట్టభద్రుడై, డిప్యూటీ కలెక్టరుగా ప్రభుత్వోద్యోగంలో ప్రవేశిస్తాడు.

ఈ లోపల తన వూళ్లో కామందు గారి క్రూరత్వం మితిమీరడం, తన కుటుంబం వాళ్ళంతా తలొక దిక్కూ పారిపోవడం, తండ్రి కామందుచే వెళ్ళ గొట్టబడి ముష్టెత్తుకొంటూ ఊళ్ళ వెంట పోవడం, బాల చింత, పంతులు గారి రాజనీతి - వగైరా ఎన్నో నడిచిపోతై. చివరకు పాపం పండి, పోలీసుల చేతుల్లో పడి, తన ముందు హాజరు పెట్టబడ్డ కామందును మేజిస్ట్రేటు హోదాలో వున్న వెంకన్న ఆదుకొనడంతో, అదే సందర్భంలో కుటుంబ సభ్యులంతా తిరిగి కలుసుకొనడంతో, వెంకన్న బాలను వివాహ మాడడంతో - నాటకం సుఖాంత మవుతుంది.

పద్యాలతో, పాటలతో, నిశితమైన సంభాషణలతో, జీవితంలోని వివిధ ఘట్టాలను కళ్ళకు కట్టించే దృశ్యాలతో నాటకం రసభరితంగా, బహు రమణీయంగా వుంటుంది.

కథానాయకుడు వెంకన్న హరిజన కులానికీ, నాయిక బాల ఒక అగ్ర కులానికీ చెందిన వాళ్ళు. కులాంతర వివాహం, పాలేరు తనాలు వదలి హరిజన యువకులు ఏదో విధంగా చదువుకొని సంస్కారవంతులు కావడం, ఉపాధ్యాయుల బాధ్యత, ధనవంతుల ఔదార్యం, అపకారికి కూడ ఉపకారం చేసే సంస్కృతి, పేద కూలీలలో ఎన్ని కష్టాల నైనా భరించి ముందుకు పోగల ధైర్య సాహసాలు - ఇలాంటి ఎన్నో గుణగణాల వల్ల ఈ నాటకం సమాజంలో ప్రత్యక్షంగా ఒక విప్లవాన్ని సాధించింది.

ఈ నాటకాన్ని ఆడడం కోసమే తెలుగు దేశంలో ముఖ్యంగా కోస్తా జిల్లాలలో గ్రామ గ్రామాన నాటక సమాజాలు వెలసినై. పోటీలు పడినై. నాటకం చూసిన ప్రతి పాలేరు కుర్రవాడూ పాలేరుతనం మానేసి, పాఠశాలను

వెతుక్కొంటూ పోయేవాడు. ఆలాంటి మామా కుర్రవా ళ్ళెంతో మంది ఉన్నతో ద్యోగు లైనారు. భీమన్న ఎప్పుడైనా ఎక్కడైనా కన్పించినప్పుడు తమ ఉదంతాలను చెప్పుకొని "మీ పాలేరుకు పాలేళ్ళం" అంటూ ఆనంద బాష్పాలు రాల్చే వాళ్ళున్నా రెంతో మంది. ప్రత్యక్షంగా ఇంత ఎత్తున సామాజిక విప్ల వాన్ని సాధించిన నాటకం ఈ నవీన యుగంలో ఇదొక్కటే అనవచ్చు.

"ఓ పెద్ద పాలేరా! నీ కొడుకును
చిన్న పాలేరును చేస్తావా? ....
అంతకంటే పెరగ నివ్వవా?

3. కూ లి రా జు

ఒక ప్రక్క వ్యవసాయ కూలీలు, మరొక ప్రక్క భూస్వాములు, వాళ్ళ గూండాలు—ఈ రెండు పక్షాల మధ్య ధర్మంకోసం జరిగిన ఒక పోరా టాన్ని ఇతివృత్తంగా తీసుకొని, భీమన్న వ్రాసిన ఒక సంపూర్ణ నాటకం ఇది.

ధరలు, జీవన ప్రమాణం ఎంతో పెరిగినా, కూలీల కిచ్చే రోజు కూలీ రేటును కొంచెంకూడ పెంచరు భూస్వాములు. ఒక ప్రక్క కూలీలు తిండి లేక ఎండిపోతూ వుంటే, మరో ప్రక్క భూస్వాములు పారిశ్రామిక రంగాన్ని కూడ ఆక్రమించుకొని, ఏనుగు గున్నల్లా బలిసిపోతూ వున్నారు. కొంచెం దయ చూపమని అడిగిన కూలీలను తమ గూండాల చేత నోరు మూయిస్తు న్నారు. అట్టి స్థితిలో పట్టణంలో చదువుకొని వచ్చిన మధుమూర్తి అనే యువకుడు తనకు లభించిన ప్రభుత్వోద్యోగాన్ని కూడ వదలుకొని, కూలీలకు నాయకత్వం వహిస్తాడు.

కూలీ రేటును పెంచడానికి జరిగిన ప్రయత్నాలలో పరంజ్యోతి, మిత్ర అనే కూలి యువతులు, నిష్ఠులవీర్ అనే ఒక ధర్మ ప్రబోధకుడు మధుమూర్తితో సహకరిస్తారు. భూస్వాములకు నాయకత్వం వహించిన ఒక జమీందారు, ఆయన గుమస్తా, కూలీ కుటుంబాలకే చెంది జమీందారుచే పోషింపబడుతున్న భయంకరరావు లాంటి కొందరు గూండాలు, రాజీ కుదరకుండా అడ్డుపడతారు.

న్యాయమైన తమ కోర్కెలను తీర్చుకోవడానికి మరి వేరే మార్గం లేక, కోతల సమయంలో కూలీలు పనులకు వెళ్ళడం మానేసి, చేల గట్లపై కూర్చొని సత్యాగ్రహం చేస్తారు. చివరకు జమీందారు కొడుకు ప్రేమకుమార్ కల్పించుకోవడంతో సత్యాగ్రహం విరమించబడుతుంది.

ఆ మధ్యలో జరిగిన ఎన్నికలలో వ్యవసాయ కూలీ కాంగ్రెసు విజయం పొంది, పరంజ్యోతి భారతాధ్యక్షురాలుగా ఎన్నుకోబడుతుంది. స్వతంత్ర భారత దేశానికి ఒక హరిజన స్త్రీ అధ్యక్షురాలు కావా లన్న గాంధీజీ కోరిక ఆ విధంగా నెరవేరుతుంది. భయంకరరావు పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకొంటాడు. మధు మిత్రల, పరంజ్యోతీ ప్రేమకుమారుల వివాహాలతో నాటకం ముగుస్తుంది.

రవ్వల్లాంటి పద్యాలు, మువ్వల్లాంటి పాటలు, చువ్వల్లాంటి సంభాషణలు కల సాంఘిక విప్లవ నాటకం ఇది. ఈ రూపంలో దీని ప్రథమ ప్రదర్శన మద్రాసు సెక్రటేరియట్ తెలుగు సంఘం వారిచే - హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సి. వి. రాజమన్నార్‌గారి అధ్యక్షత క్రింద - మ్యూజియం థియేటరులో జరిగింది.

ఇది అప్పటి మంత్రి వేముల కూర్మయ్యగారికి అంకిత మీయబడింది.

ఐంగరమే పండు పంట భూముల ప్రక్క-
వి త్తనం బెరుగని బీటి నేల,
ఆకాశమున కంటు అద్దాల మేడల
ప్రక్కలో విరుపేద పాడు కొంప,
ఐలిసిన ఏన్గు గున్నల బోలు దుష్టుల
ప్రక్క- ఎమ్మెల గూటి బడుగు జీవి,
వేదాంత విద్యా ప్రవీణుల ప్రక్క- చూ
డగరాని శుద్ధ చండాల కులము
ధన మదాంధత రాశి పాదముల ప్రక్క-
జాలి బడి కుందు వేద కూలీల గోల,
ఇంతగా జాతి భేదించి యేడ్చుచుండ
సౌఖ్యమెటు కల్గు? ఎటు కల్గు పంపు బలము?

4. మధు బాల

జాతీయోద్యమ కాలంలో, ఒక మహారణ్య గర్భంలో, వికసించిన వీర యువతీ యువకుల విప్లవ జీవిత చరిత్ర ఇది.

ఒక స్వతంత్ర యోధ కుటుంబం, ఒక అడవిలో తలదాచుకొంటూ మరణించగా – వారి శిశువు ప్రకృతిలో ప్రకృతిగా పెరుగుతుంది. చాల సంవత్సరాల తర్వాత ఒక యువకుడు అటుగా వచ్చి, ఆ నగ్న సుందరిని చూచి, చెలిమిచేసి, ఆమెను తిరిగి మానవిని చేస్తాడు.

అతడొక విప్లవ వీరుడు. దుష్ట జంతువును తుపాకి తోనే కొట్టా లనేది అతడి సిద్ధాంతం. అందుకు తన జీవితాన్ని అంకితం చేసుకొన్నవాడు. ఆ అరణ్యం కార్యరంగంగా ఆయుధాలను, దళాలను సమకూర్చుకొంటున్నవాడు. దేశ స్వాతంత్ర్య దీక్షా బద్ధుడు.

ఆటువంటి ఒక విప్లవ యోధుడికి, లోకమే తెలియని ఒక ముగ్ధ సుందరికీ నడుమ నడిచిన విచిత్ర విపరీత విపర్యయ గాధా లహరి ఈ కావ్యం.

ఆమెకు అతడే సర్వస్వమూ. అతడికి దేశ దాస్య విమోచనం జీవిత లక్ష్యం. తన లక్ష్యం కోసం అతడు ఆమెను వదిలిపోవలసి వచ్చినప్పుడు, ఆమె అతడితో పాటు బైలుదేరుతుంది. ఎన్నో కష్టాల తర్వాత అతడు ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడంకోసం సర్వోదయ నాయకుడుగా ఆమెతో కలిసి ప్రపంచంలోకి అడుగుపెడతాడు.

వీర శృంగార కరుణ రస ప్రచురమైన రాజకీయ లిరిక్ అనవచ్చు దీన్ని. ప్రకృతి వర్ణనలు. మానవ వేదనలు, భావాబల్యం – అన్నిటా ఒక అగ్ర శ్రేణి లిరిక్కే ఇది. నాలుగేసి చరణాలు ఒక పద్యంగా, నాలుగు వందల పద్యాలు మంజరీ ఛందంలో నడిచిన చిన్న కావ్యం ఇది. ఆనాటి రాజకీయ పరిస్థితి ఆధారంగా తెలుగు సరస్వతి సమకూర్చుకొన్న ఒక రస ఖాడం ఇది.

"దుష్ట శిక్షణ కోసం ఆయుధాలు పట్టక తప్పలేదు భగవంతుడు కూడ" అనే విశ్వాసం గల బ్రిటిష్టు – "దౌర్జన్యాన్ని సౌజన్యంతో జయించు" అనే గాంధేయ మార్గానికి ఎలా మారాడు?

తెలుసుకోవా లనుకునే జిజ్ఞాసువులకు ఈ కావ్యం అవశ్య పఠనీయం .

పక్వమ్మునకు రాని పచ్చికాయలను
కావు కట్టిన , తుళ్ళి పోవె ? ముగ్గెడునె ?
కోయిలలును , గుడ్డగూబలు కల్గు
సంఘమ్మునం దేటి సామరస్యమ్ము ?
ఆధికారమందు నీకాళ లేకున్న
గైకొమ్ము నిర్మాణ కార్యక్రమమ్ము !

అప్పటి మంత్రి దామోదరం సంజీవయ్యగారి ప్రేమకు పాత్రమయిం దీ మధుర కావ్య వధూటి .

5. దీప సభ

ఏ పరం జ్యోతినో వెల్గి , ఈ ప్రపంచ
విధులు నెరవేర్చ చున్న దివ్వెలము మనము ;
దీపికా ! నిన్ను న న్నొక్క వాని ముంచు
అంధకారముపై దండ యాత్ర మనది .

అంటూ అంధకారం మీద భీమన్న దండెత్తిన మహాకావ్యం దీప సభ .

ఈ దీపాలు ఆరిపోయి , ఎక్కడికి పోతాయి ?

వాటి కొక తల్లి వుంటుందనీ , అవి ఆక్కడికి పోయి తాము లోకంలో చూచిన విషయాలన్నీ తల్లితో చెపుతాయనీ - తన తల్లి తనకు చెప్పిన చిన్న నాటి కథను ఆధారం చేసుకొని , ఈ దీప సభను ఊహించాడు భీమన్న .

దీపా లన్నిటికీ మూల దీపం పరం జ్యోతి . కాంతికీ , జీవానికీ , సర్వ సృష్టికీ ఆమే మూల శక్తి . ఆమె అధ్యక్షతలో నిర్విరామంగా కొనసాగే పార్లమెంటు దీప సభ .

అది దీపాల పార్లమెంటు . ఆ సభ నుంచే ఈ అనంత కోటి దీపాలు లోకం లోకి వస్తూ పోతూ వుంటై . లోకంలో తాము వెలిగి నంత సేపూ తాము

చూచిన విశేషాలను గురించి సభలో ప్రసంగిస్తూ, పరం జ్యోతికి తమ సలహాలను కూడ ఇస్తూ వుంటై.

ఇది అద్భుతమూ, అపూర్వమూ అయిన భావన.

ఒకొక రంగానికి, ఒకొక పరిస్థితికి ఒకొక దీపాన్ని ప్రతినిధిగా తీసుకున్నాడు భీమన్న. అందులో బండి లాంతరు, గుడి దీపం, పడక గది దీపం, హరికేన్ లాంపు, విద్యుద్దీపం, మిణుగురు, ఉల్క, పిధి లాంతరు, కొబ్బరి తుంట, ప్రమిదె దీపం, మొదలైనవెన్నో వున్నై.

ఈ ప్రమిదె దీపం తనది. అంటే కవిది. అది తైలం లేక ఆరిపోతుంటే మరి కొంచెం సేపు వెలగమని దాన్ని ప్రార్థిస్తాడు కవి. అది వినదు. ఆరిపోతుంది. దాని వెంట తాను కూడ ఆత్మ రూపంలో పయనించి – అనంత కోటి సూర్య తేజంతో వెలిగి పోతున్న దీప సభను చేరుకొంటాడు. అక్కడ చేరిన దీప ప్రతినిధుల ప్రసంగాలు, చర్చలు వింటాడు.

చక్కని సాంప్రదాయిక శైలిలో, ఛందస్సులో, ఆధునిక మానవ జీవిత ధోరణికి బహుముఖంగా ఆద్యం పట్టిన ప్రసంగాలూ, వర్ణనలూ అవి. చివరకు తేలిన ఫలితం – మానవుడు తన బాధ లన్నిటికీ తానే కారకు డని.

దేవి అనుజ్ఞపై, కవి దీపమే తీర్పు చెపుతుంది –

నీతి సూత్రాల కుప్పపై నిల్చి, ధర్మ
నిర్ణయము కోరుచున్నాడు నేడు నరుడు,
రేపు తిండి యెట్లను బెంగ బాపకుండ
దేవి! సంఘమ్ము నెటు చక్కదిద్దలేము!

కూడు, గుడ్డ, కొంప– మూడే సుమా నేడు
నరుడు కోరుచున్న పరము లెల్ల –

వాటిని మనిషికి లభింప జేసే సమసమాజ వ్యవస్థ ఏర్పడా లంటుం దా దీపం.

సుందర ప్రకృతి మందిరాలై న తిరుపతి కొండలకు సమర్పించ బడిందీ దీప సభ.

6. మధు గీత

ఇదొక గీత పద్య పద్మాకరం. ప్రతి పద్యమూ ఒక స్వతంత్ర భావ ముక్తకం. ఒక వంద ముక్తకాల మాల ఈ సంపుటి.

ఒక వసంతోదయ సుప్రభాతంలో, ఒక ఉద్యానవనంలో విహారానికి బైలు దేరిన ప్రేయసీ ప్రియుల మధురానుభూతి ఈ కావ్య సంపుటి.

ప్రేయసిని మేల్కొలపడం దగ్గర నుంచి, ఆమెకు వివిధ సౌందర్యాలను నిరూపించి చెప్పడం వరకు, కర్తృత్వ నిర్వహణ సమస్తమూ ప్రియుడిదే.

భారతీయ ఆర్షతత్వ దృక్కోణం నుంచి - జీవిత గీతామృత సారం ఈ మధు గీత.

దీనికి ఈయన మొదట పెట్టిన పేరు వసంత గీత. ఒకసారి రాజమండ్రి పుస్తకాల కొట్లవెంట ఈయన పయనిస్తుండగా, వసంత గీత అనే పేరుతో ఒక గ్రంథం తన కంట పడిందట. వెంటనే తన కావ్యం పేరు మధుగీత గా మార్చుకున్నాడట.

మధు శబ్దానికి గల అర్థ విస్తారం వల్ల, దీనికి ఈ పేరు బాగున్న దనవచ్చు.

దీనిపై మోజుపడి, తామే అచ్చు వేయిస్తా మని తీసుకొన్న పంతగడ బాలకృష్ణ శేషమాంబా దంపతులకే ఈ కావ్యమాలను అంకితం చేశాడు భీమన్న. సత్య, ధర్మాలు మూర్తిదాల్చిన బ్రాహ్మ సంస్కృతి ఈ దంపతి.

మాయావులకు సింహాసనాలు, అమాయకులకు శిక్షలు సహజమే. అంత మాత్రంచేత సింహం గొప్పదీ, లేడి తక్కువదీ కాదు. అభిమన్యుడు హీన బలుడూ, అతణ్ని చంపిన వాళ్ళు మహాబలులూ కారు. ఇదే మధు గేత సందేశం.

కొందరికి గుండె చిన్నది, కొందరికి మ
నస్సు చిన్నది, బ్రతుకె కొందరికి చిన్న,
దంత మాత్రాన ఇల చిన్న దనము లేదు
పెత్తనము చేయు సీకన్ను పెద్దదైన!

ఒక్క కొమ్మను మించి మరొక్క కొమ్మ
రాగ మధురము, పుష్పభ రాలసమ్మ:
ఒక్క పువ్వును మించి మరొక్క పువ్వు
సుందరము, మధుపూర, మానంద కరము,

ఇందులోని ప్రతి పద్యానికీ ఒక మూలకథ వుంది. ఒక చరిత్ర వుంది. ఒక ప్రయోజనం వుంది. ఎంతో మంది జీవితాలను, లక్ష్యాలను చక్కదిద్దిన పద్యాలివి.

7. భీమన్న కావ్య కుసుమాలు

వ్యాస వాల్మీకులే కవు లవని కెల్ల,
కడమ వారు వారల పాదకమల గత మ
ధూళి సేవించి బ్రతుకు మధు ప్ర తాలె!
అందు కడ పంక్తి నొక పనికందు నేను!

అంటూ ఒక కవితా కృషీవలుడుగా జీవితాన్ని ప్రారంభించిన భీమన్న, అలతి అలతిగా పండించిన ఒక డెబ్భై లఘు కావ్య రస రాశుల కళ్ళం ఈ గ్రంథం. ఒక డెబ్భై లఘు కావ్యాల సంపుటి.

అప్పుడప్పుడు, వివిధ విషయాల పై వ్రాసిన కవిత లివి.

కురుగంటి సీతారామయ్యగారు, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రిగారు సమ కూర్చిన రెండు పీఠికలు-ఈ సప్తతి ముఖ సరస మహా సరస్వతికి రెండు సింహాసనాలు.

ఛందస్సును ఒక జగన్నియంత్రణ మహాశక్తిగా ఆరాధిస్తాడు భీమన్న. పుట్టుకతో ఈయన ఛాందస కవి. ఛందస్సు కోసం ఎలాంటి పదార్థాల నైనా సరే త్యాగం చెయ్యగలిగిన స్వతంత్రుడు. అయితే-ఎట్టి త్యాగాలూ చెయ్య

నవసరం లేకుండానే, జగత్ చక్ర నిరంతర పరిభ్రమణకు రసార్ద్రితను చేకూరుస్తున్న స్రష్ట ఈయన.

ఈ సంపుటికోని ప్రతి లఘు కావ్యమూ ఒక రస కలశం-కవితీకృత మానవ ప్రవృత్తి-అమరీభూత ప్రణయ కళా కలాపం.

మహా మనీషి కల్లూరు సుబ్బారావుగారు కోరి అంకితం తీసుకొన్న కావ్య సంపుటి ఇది.

కుంకుడు చెట్టును సైతం భీమన్న ఎలా ప్రేమిస్తాడో చూడండి -

చిన్నదై నీ కాయ చేదుదే యైన
పత్య శౌచాదుల సాధువే యౌను!
చేదు కాయలు కాయు చెట్టు వే యయ్యు
మధువునే నీ పూలు మహికిచ్చి మనుచు.

8. రాగ వాశిష్ఠం

అరుంధతీ వశిష్ఠుల కల్యాణ చరిత్రను నాటకంగా తీర్చిదిద్దిన రచన ఇది. ఇది గద్య పద్య గేయాత్మకమైన సంపూర్ణ నాటకం.

వశిష్ఠుడు వేశ్యా పుత్రుడైనా, బ్రహ్మజ్ఞానంతో బ్రాహ్మణు డైనవాడు. అరుంధతి హరిజన బాలిక. మాతంగకన్య. ఆ ఇద్దరికీ పెండ్లి ఎలా జరిగింది? కథలు చాల వున్నై. అందులో ఒక కథను ఎంచుకొని, పురాణోక్తంగా తదితర పాత్రలను కల్పించుకొని, చక్కని నాటకంగా చిత్రించాడు భీమన్న.

ఆర్యులు, ద్రావిడులు ఒకే జాతి వాళ్ళనేది భీమన్న సిద్ధాంతం. శివుడు ద్రావిడ దేవుడే నని, హరిజనుల పూర్వీకుడని అంటా డీయన. అదే ఈ నాటక రచనకు ప్రేరకశక్తి.

అరుంధతి చెల్లెలు సంధ్య వంటి మనోహర పాత్ర ఇంతవరకు ఎక్కడా కల్పించబడలే దంటారు విషయజ్ఞులు. భీమన్న స్త్రీ పాత్ర లన్నీ ఉదాత్త సుందర మైనట్టివే మొత్తంమీద.

ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ క్లాసులకు పాఠ్యగ్రంథ మయిం దిది కొంత కాలంపాటు. అనేక ముద్రణలుకూడ పొందింది.

నిండా చాద స్తంగల సనాతన పండితులు సైతం కాదనలేని సిద్ధాంతాలు భీమన్నవి.

మిత్రులు సాకపేములు గారిని వరించి దీ దృశ్య కావ్యకన్య.

9. పైరు పాట

ఇదొక గేయ నాటిక. రంగస్థలం గోదావరి తీరంలోని పైరు పొలాలు. రసభావ పుష్కలమైన కవితా సౌందర్యాని కిది పరాకాష్ఠ.

స్నేహ ఒక మాల పిల్ల. పైరు చేల గట్లలో పచ్చగడ్డి కోసు కొనేం దుకు ప్రతి సాయంత్రమూ పొలాల్లోకి వస్తూ వుంటుంది. శీల ఆమె మిత్రు రాలు. శ్రీవత్స అనే ఒక అగ్రకుల విద్యావంతుడు ఆ పొలాల్లోకే షికారు వచ్చి స్నేహను చూచి ఆమెతో స్నేహం చేస్తాడు.

ఆ స్నేహం ప్రేమగా మారుతూ వుండే, శీల హెచ్చరిస్తూ వుంటుంది. ఈ ముగ్గురి మధ్యా నడిచిన పవిత్ర ప్రేమ గాధే ఈ పైరు పాట.

శీల అనుమానాలను, అభ్యంతరాలను, అన్నిటినీ పరాస్తం చేసి, శ్రీవత్స స్నేహను పెండ్లాడుతాడు.

ఇతివృత్తం కులాంతర కల్యాణమే అయినా, ఈ కావ్యంలోని ప్రధాన రసం ముగ్ధ శృంగారం. జానపదుల పవిత్ర ప్రణయాని కిది ప్రతీక. మనో మోహనమైన సుందర గేయాలతో నడిచే ఈ ఏడు రంగాల కావ్యం - సంగీత నృత్య నాటికగా ప్రదర్శిత మయింది, ఆకాశవాణిలో ప్రసారిత మయింది.

అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారికి కృతి అంకితం.

చిత్తంలో ప్రతి దెబ్బా
సుత్తి దెబ్బగా మలిచిన
మానవ మూర్తిని మించి
మహిత శిల్పమే మున్నది ?

10. అనాదికొన నుంచి అనంతత్వం లోకి

వచన కవితా ప్రక్రియలో, రక రకాల పరిస్థితులలో మానవ సుఖ దుఃఖా లెలా వుంటాయో ఆవిష్కరిస్తూ ప్రాసిన 92 రస కవితల సంపుటి ఇది. రసం ప్రధానంగా గల భావ శృంగారం. ప్రతి కవితా ఒక రస కలశం.

భీమన్న వచన కవితా రచనను బాహాటంగా చేపట్టిం దీ సంపుటి నుంచే. ఇది అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిగారికి అంకిత మీయ బడింది.

నిన్ను స్మరిస్తూ అంకురించాను నేను
నిన్ను ప్రేమిస్తూ వికసించాను నేను
నిన్ను అనుభవిస్తూ ఫలించాను నేను
నిన్ను పూజిస్తూ తరించాను నేను

11. చిత్ర కళా ప్రదర్శన

పది నాటికల సంపుటి ఇది. చిత్ర కళా ప్రదర్శన, వసంత స్వయం వరం, గులాబి ప్రసవించింది, పాత వూరు కొత్త దారి, కొత్త సేద్యం, అంధకారం పై విజయం-ఈ ఏడూ గేయ నాటికలు. చాండాలిక వచన కవితా గేయ నాటిక. నేతాజీ, దేవయాని గద్య పద్యాత్మక నాటికలు.

మానవాత్మ యొక్క సౌందర్య పిపాస, ఆనందాన్వేషణ, స్వేచ్ఛాభి లాష-అందుకు అది పడే వేదన, చూపే నిర్వేదం అత్యంత రసవంతంగా అభి వ్యక్తం చేసే నాటిక లివి. ఈ పదీ పది రసాలకు ప్రతినిధు లనవచ్చు.

ఇవన్నీ పత్రికలలో ప్రకటించ బడ్డవో, రేడియాలో వినిపించ బడ్డవో, వేదిక మీద ప్రదర్శించబడ్డవో అయి వున్నట్టివి. సార్వ కాలిక సహజ భావా వేశాలకు వర్షా సరిత్తులు.

రష్యా (లెనిన్ గ్రాడ్) లో తెలుగు అధ్యాపకురాలుగా వుంటూ, అక్కడే కాల ధర్మ చెందిన సోదరి ఆది లక్ష్మి గారికి అంకిత మీయబడిన గ్రంధం ఇది.

ఇందులోని చాండాలిక రంగ స్థల రూపకంగానే కాక, దూర దర్శినిలో కూడ ఎన్నో ప్రశంశ లందుకొన్నది. దూర దర్శినిలో దీనిని ప్రదర్శించిన వారు సత్యనారాయణ సుశీల బృందం.

12. ప్రకృతిలో మానవ ప్రకృతి

(1) ప్రణయ పారమ్యం (2) ప్రకృతిలో మానవ ప్రకృతి (3) ఆగష్టు విప్లవం అనే మూడు లఘు కావ్యాల సంపుటి ఇది.

మంజరీ ద్విపదలో నడిచిన ప్రణయ పారమ్యం రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జరిగిన ఒక ప్రణయ గాధ. పరస్పరం అపార్థం చేసుకొన్న ప్రేయసీ ప్రియులు, వైరాగ్యంతో – ఒకరికి తెలియకుండా ఒకరు – యుద్ధంలో చేరతారు.

ప్రియుడు బ్రిటీషు జలాంతర్గామిని నడిపే నావికుడు. ప్రేయసి పురుష వేషంతో నేతాజీ హింద్ పౌజులో చేరి, జపాను విమానంతో దాడులుచేస్తున్న వైమానికురాలు.

ఆంధ్ర సముద్రంలో తిరుగుతున్న జలాంతర్గామి విమానాన్ని కూల్చ డం, విమానం వదిలిన బాంబులకు జలాంతర్గామి పగలడం ఒకేసారి జరుగు తుంది. మునుగుతున్న సబ్మెరైనులో - ఆ ఇద్దరూ కలుసుకొని, పరస్పర చరిత్ర చెప్పుకొని, గుర్తించుకొని, ఒకటిగా ఆ మహోణ్ణవంలో కలిసిపోయిన కరుణ ప్రణయ గాధ ఇది.

రెండోది 16 గాధల కావ్యం. ఒక్కొక్క గాధ మానవ స్వభావానికి ఒక్కొక్క దర్పణం. బహు విచిత్రమైన రచన ఇది.

మూడోది ఆగస్టు విప్లవ చరిత్రను కావ్యంగా వ్రాయా లన్న ప్రారంభ దశ. అసంపూర్ణం.

ఆచార్య నిడదవోలు వెంకటరావు గారికి, 1963లో వారి షష్టి పూర్తి సందర్భంగా అంకిత మీయబడిన కావ్య సంపుటి ఇది.

కళల జోక్యములేని లౌక్యులకె కాని
సాహితీ ధనులకు లేదు షష్టిపూర్తి
రస పయోధార ఆద్యంతరహిత, మందు
నిత్య సమ్య గమృతమూర్తి నిడదవోలి.

13. త్రిపదలు

వచన కవితా ప్రక్రియలో మూడేసి పాదాలు ఒక పద్యంగా వ్రాసిన 149 పద్యాల సంపుటి ఇది.

ముద్రించబడినట్టివి 149 మాత్రమే అయినా, ముద్రణకు సిద్ధంగా వున్నట్టివి ఇంకా వందల కొలదీవున్నై.

జీవిత సత్యాలను, ఆధునిక మానవుని మనోవాక్కాయ కర్మల వెనుక వుండే రహస్యాలను అతి నగ్నంగా ఆవిష్కరించిన కవిత లివి.

ప్రేయసీ ప్రియులు పెళ్లికి ముందు అద్వైతం
పెళ్లయిన కొత్తలో విశిష్టాద్వైతం
ఇక ఆ తర్వాత ద్వైతం

అప్పటి కేంద్ర మంత్రి బి. ఎస్. మూర్తి గారికి అంకితం ఈ కావ్యం.

14. మానవుని మరొక మజిలీ

ఇది 16 రంగాల సంపూర్ణ గేయ నాటకం. ఇలాంటి రచన - ఒక సంపూర్ణ నాటకాన్ని కేవల గేయంలో వ్రాయడం - తెలుగులో అపూర్వం.

భూమి మీద మానవ సృష్టి జరిగి నప్పటి నుంచి మానవ ప్రగతి ఎన్ని మార్పులకు లోనై, ఎన్ని మజిలీలు చేసు కొంటూ, నేటి రాకెట్ యుగం వరకు చేరు కొన్నదో రసవంతంగా చిత్రించ బడిందీ నాటకంలో.

భూలక్ష్మి, క్షేత్రయ్య, భోగయ్య, ఆశావతి, సస్య, మేధానిధి మొదలైన పేర్లతో భూమి, సేద్యం, పంట, పరిశ్రమలు, వృత్తులు, ఆశలు, ఆశయాలు, శ్రమ, బుద్ధి, త్యాగం భోగం వగైరా మానవ గుణ కర్మలు పాత్రలుగా స్వీకరించబడి, సహజ సుందరంగా నడిచిందీ రచన.

ఇది సాహితీ స్రవంతి డా॥ బెజవాడ గోపాలరెడ్డి గారికి అంకిత మీయ బడింది.

సృష్టికి మూల భూతమైన పరాశక్తి - ప్రగతి వివిధ దశలలో వివిధ రూపాలు ధరిస్తూ - తన నృత్యగాన కళాదిక సదుపదేశాలతో మానవుడికి సదా మార్గదర్శక మవుతూ వస్తుంది.

వ్యావసాయిక, పారిశ్రామిక దశల గుండా విజ్ఞాన యుగంలో అడుగు పెట్టిన ప్రగతికి సర్వమానవ సమసమాజ నిర్మాణ పట్టాభిషేకం జరగడంతో నాటకం ముగుస్తుంది.

ఆభ్యుదయ భావనకు, కవితా సృష్టికి పరమ పారమ్యం ఈ రచన. మాత్రా ఛందస్సులతో నడిచిన గేయాలు శ్రావ్య సుందరాలు.

సూరన్న, చంద్రన్న కార్మికులుగా చిత్రించబడడం ఒక అపూర్వ సృష్టి.

రాజకీయ తీర్మానం కాదిది,
కాదిది ఆర్థిక కార్యక్రమము,
వేద మాత మన కాదేశించిన
ఆఖిల జగత్రేయ స్వరూప మిది!
ప్రభాత మయ్యిం దోయ్ -
ప్రపుల్ల మయ్యిందోయ్ లోకం!

15. బాల యోగి

పన్నెండేళ్ళ బాలప్రాయ మప్పటి నుంచీ నిద్రాహారాలు మాని, ఇప్పటికి ముప్పై రెండేళ్ళుగా గాఢ తపస్సులో మునిగివున్న ముమ్మిడివరం బాలయోగి చరిత్రను నాటకీకరించిన రచన ఇది.

అన్ని ప్రకృతి ధర్మాలను అతిక్రమించి, ప్రకృతి విజ్ఞానశాస్త్రాన్ని దిగ్భ్రమ పరచి, సర్వప్రపంచ దృష్టినీ తన వైపుకు మళ్ళించుకొన్న ఒక చదువు లేని, పాలేరు మాల పిల్లవాడు బాలయోగి! వ్యాసుడు, ధ్రువుడు, మార్కండేయుడు వంటి ఏ కొద్ది మందో కనిపిస్తారు పురాణాలలో బాలయోగి సరసన నిలవగలిగిన వారు!

అంతటి అద్భుత సజీవ సమకాలీన చరిత్రను నాటకంగా వ్రాశాడు భీమన్న. బాల శివుడిగా తీర్చి దిద్దాడు బాలయోగి పాత్రను!

సజీవ సమకాలీన వస్తువును గురించి సత్యవ్రతుడైన కవి వ్రాయడం ఎంత కఠినమైన కత్తిపై సామో - రుచి చూశాడు కూడ!

మానవు డెంత దురహంకారి! చీమ కూడ కాని వాడు శ్రీ మహా విష్ణువునే అనుకొంటాడు! అయినా, లెక్కచెయ్యడు భీమన్న.

యోగాసనమున నీ వుండు నదియే గుండె
ధ్యాన మందున నిన్ను ధరియించు నదె బుద్ధి
ఆనందమున నీతొ ఐక్య మౌనదె ఆత్మ
నీ పూజె శివపూజ, నీ దర్శనమె శివుడు
బాలయోగీ! యోగ బాలోప భోగి!
అందుకోవయ్యా, మా ఆత్మోత్పలములు!

మహర్షి ఈలి వాడపల్లి గారి కంకితం ఈ నాటకం.

16. ది సెవెంత్ సీజన్

ఆరు ఋతువుల అందాలను తానే అలంకరించుకొని ఎదుట నిల్చిన ప్రియురా నీ ఏడవ ఋతువు. ఈ సంపుటిలో ఆదొక కవిత.

భీమన్న తన కవితలలోని కొన్నిటిని తానే ఇంగ్లీషులోకి అనువదించుకొంటూ వుండేవా డప్పు డప్పుడు సరదాకు. అలాంటి వన్నీ కలిసి ఒక సంపుటిగా ముద్రించబడిన ఆంగ్ల గ్రంథం ఇది.

సరళమూ, స్వచ్ఛమూ అయిన ఆంగ్లభాషాశైలిని ఈ కావ్యంలో చూడవచ్చు. భీమన్న తెలుగు ఎంత సుందరమో, ఆంగ్లంకూడ అంతే సుందరం.

అప్పటికి విశాఖలో, ఇప్పుడు బెంగుళూరులో, వుంటున్న ప్రసిద్ధపారిశ్రామికుడు ఇంద్రసేన్ మిత్తల్ గారికి ఈ కావ్యం అంకితం.

17. రాగ వైశాఖి

ఇదొక శృంగార లేఖా కావ్యం. రమణీయమైన వచన శైలిలో నడిచిన కవితా నవల.

ఒక ప్రేయసీ ప్రియుల జంట పరస్పరం వ్రాసుకొన్న ప్రేమలేఖల రూపంలో మనోహరంగా తీర్చి దిద్దబడిన అనురాగ గాధ ఇది.

ఆ ఇద్దరూ వేరు వేరు కులాలకు చెంది వుండడం వల్ల ఏర్పడ్డ సాంఘిక వరోధాలు, వైరుధ్యాలూ, ఇరుగు పొరుగుల వైరస్యాలు - వీటన్నిటినీ అధిగమించిన ప్రేమ, అరాధన, శృంగార భావనా తత్పరత, సాంఘికాచార విమర్శ, పరమ తాత్త్విక చింతన-ఈ వెలుగు నీడలలో, వెన్నెల పొదరింట్లలో దాగుడు మూత లాడుకొనే ప్రియుల శృంగార రస తరంగిణి, రసాద్వైత సుధార్ణవం ఈ కావ్యం.

శ్రావణి నుంచి వైశాఖి వరకు గల పది పూర్ణిమలూ పది అధ్యాయాలుగా, 128 ప్రకరణాలలో నడిచిన ఒక అనంద పూర్ణ కుంభం ఈ రచన.

భారత సమాజంలో పురోగతిని నిరోధిస్తున్న మూఢాచార కంటకాలను నరికి వేస్తూ, భావ విప్లవానికి దారి చేస్తూ, నవ సమాజ నిర్మాణానికి వెలుగు చూపుతూ సాగిన ఈ రచనను ప్రగతి నిరోధకులు ఎదిరించడం సహజమే, ఎదిరించారు. శృంగారం సభ్య పరిధుల్ని దాటిందని విమర్శించారు. ఒక రెండేళ్ళపాటు పత్రికలలో వాద ప్రతివాదాలను నడిపించారు. దీన్ని ప్రభుత్వంచే నిషేధింప జెయ్యడానికి సకల యత్నాలూ చేశారు.

తెలుగు సాహిత్య లోకంలో ఇంతటి తుపాను రేపిన రచన ఈ అర్ధ శతాబ్దంలో ఇదొక్కటే.

మరో ప్రక్క - ఈ రచన గీత , బైబిలు , ఖురానులతో సరితూగ గల ఉద్గ్రింథంగా సహృదయ పండితుల ప్రశంసలను అందు కొంది . ఆధునిక భావ వేవంగా కొనియాడారు మిత్రులు దీనిని ."ఈ దశాబ్దపు ఏకైక సాహితీ సృష్టి" అన్నారు డాక్టర్ గోపాలరెడ్డి గారు .

ఇంతటి సుందరమైన వచన శైలి తెలుగులో ఇంత వరకు లేదు . అక్షర రమ్యతకు , భావ రమణీయతకు దీని కిదే సాటి . ముత్యాల హారంలో మణులు గుప్పించినట్టు ఈ లేఖలలో చక్కని పాటలు , పద్యాలు పొదగబడి వున్నై . పరమ సుమనోజ్ఞమైన వచన కావ్యం రాగ వైశాఖి .

విశాఖలో గొప్ప ఇంజనీర్ కంట్రాక్టరు కోటు పట్టాభి రామరెడ్డి గారికి అంకిత మిది .

18 . అకాండ తాండవం

అమృత మూర్తి ! నీ విధమ్మున
అడుచుంటిని , పాడు చుంటిని
దారిలో నీ హృదయ బిందువు
చేరు లోపల నేవిచ్చగా !
గజ్జె విప్పకు , కాంతి తీయకు
గాన మాపకు బ్రతుకు పొడవున
ఆటగా , ఒక పాటగా , నా
బాట వీలో చేరిపోనీ !

అనుకుంటూ ,ఏ పరమానంద లయ బ్రహ్మలో అనుక్షణమూ తన్మయుడై వుంటూ వుంటాడో భీమన్న-ఆ సృష్టి క్రియా ప్రేయః ప్రక్రియకు ధ్వన్యాత్మక రూపకల్పనే ఈ అకాండ తాండవ గేయ కావ్యం .

అద్యంత రహితమైన , అగమ్యగోచరమైన , అజరామరమైన , పరమాత్మీయమైన ఆనందబ్రహ్మ భీమన్న ఊహలో పరమ శివుడు . ఆయన తాండవ నైరంతర్యమే సృష్టి నైరంతర్య మంటాడు భీమన్న . తాండవం ఎప్పుడాగిపోతే , సృష్టి అప్పు డాగిపోతుంది . ఎప్పుడైనా , ఎక్కడైనా ప్రతి తప్పడాలే విలయాలు , విపత్తులు .

సృష్టిని గురించిన భీమన్న ఊహ ఇది. నిత్య నిరంతర చలన శీల మైన విశ్వ శక్తికి రూపకల్పనే నటరాజు.

లయ, గాన, సౌందర్య విలసితా లైన 189 లిరిక్కుల కావ్యం ఇది. నృత్య నాటికగా ప్రదర్శించవచ్చు.

శివుని నాట్య విన్యాసాలలో ఒక ప్రత్యేక లీల కోసం అన్వేషిస్తున్నా ననీ, అది అకాండ తాండవంలో దొరికిం దనీ మిత్రులూ, ప్రఖ్యాత నర్తకులూ అయిన కోరాడ నరసింహారావుగారు భీమన్నతో అన్నారు.

ఈ కావ్యంలో ఒక భాగం ఆకాశవాణిలో గానం చెయ్యబడుతూ వుంది. ప్రఖ్యాత గాయకుడు ఓగిరాల నరసింహమూర్తి గారు, వారి వర్గంవారు దానిని పాడారు.

అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి గారికి ఈ కావ్యం అంకితం.

19. ధర్మం కోసం పోరాటం

సమానీవ ఆకూతిః
సమానా హృదయానివః
సమాన మస్తు వో మనో
యథావహా సుహాసతి!

"మీ కందరకూ సమాన ప్రతి పత్తికల ఉత్తమ జీవితం లభించగ లందులకు, ఓ మానవుల్లారా! మీ జీవిత లక్ష్యం ఒక్కటే అగుగాక! మీ హృదయాకాంక్షలు ఒక్కటే అగుగాక! మీ మనస్సులు కలిసి ఒక్కటే అగుగాక!",

ఇది కదా వేద ఋషులు ఆశించిన మానవ సమాజ స్వరూపం?

సర్వ మానవులకూ ఏక ప్రతిపత్తిని ప్రతి పాదిస్తున్న వేదమతానికీ, స్వమత మానవులనే కులతత్వంతో హింసించి చంపుతున్న నేటి హిందూ మతానికి ఏ మైనా పోలిక ఉన్నదా?

— ధర్మం కోసం పోరాటం, అధ్యాయం 8.

ఆస్పృశ్యత తొలగకుండా కుల వ్యవస్థ నశించకుండా భారత జాతికి పురోగతి లేదు.

—ధ. కో, పో., అధ్యాయం 12.

"మాల మాదిగ యువకుల్లారా! ఏకం కండి!" అంటూ ఒక నినాద మిచ్చి, ఏ అభివృద్ధి అయినా క్రిందినుంచే పైకి పెరగాలన్న సహజ సత్యాన్ని జ్ఞప్తికితెచ్చి, ఒక సిద్ధాంతాన్ని, ఒక కార్యక్రమాన్ని ఇచ్చి—దేశాభివృద్ధి ప్రగతి పథంపై యువకుల్ని నిలుపుతున్న సూత్ర గ్రంథం ఇది.

ఇటువంటి రచన తెలుగులో మరి లేదు. మ రే భాషలోనూ లేదు.

పాలేరు తర్వాత భీమన్నకు మరింత కీర్తిని ఆర్జించిపెట్టిన గ్రంథం ఇది.

"దళిత క్రైపిడి" అనే పేరుతో కన్నడలోకి అనువదించ బడింది డా. నారాయణస్వామి గారిచే. తక్కిన భాషలలోకి తీసుకువెళ్ళాలని సంజీవయ్య గారు చేసిన ప్రయత్నం ఆయన బ్రతికుండగా నెరవేరలేదు.

అందమైన, చురుకైన తెలుగు వచనం. కత్తిలాంటి శైలి. 208 అధ్యాయాల అపూర్వ గ్రంథం ఇది.

తాళ్ళకు జీవము పోసి
మ్రోళ్ళను చిగురింప జేసి
మట్టినుండి మానవులను
మలచిన కారణ జన్మ!

అంటూ అంజలి ఘటించి, డా॥ అంబేడ్కరుకు అంకిత మిచ్చాడీ గ్రంథాన్ని భీమన్న.

20. రాజకీయ వీరుడు డాక్టరు ఖాను

జాతీయ ముస్లిం నాయకుడు డాక్టర్ ఎమ్. ఏ. ఖాను గారి జీవిత చరిత్ర ఇది. డాక్టరు ఖాను ఆదర్శ ప్రాయుడైన భారత పౌరుడు.

మతం ఏదైనా కావచ్చు. ఒకే కుటుంబంలో వేరు వేరు మతాల వాళ్ళుండ• వచ్చు. తండ్రి హిందువు, కూతురు క్రిస్టియను, కొడుకు ముస్లిమూ కావచ్చు మతం వ్యక్తి గతం. జాతి, జాతీయత, దేశం, దేశభక్తి ముఖ్యం.

భారత దేశంలో, భారత పౌరుడుగా బ్రతికే ఏ మతం వాడైనా సరే - నూటికి నూరు పాళ్ళు భారతీయుడే.

అందుకే ఆదర్శప్రాయుడు డాక్టరు ఖాను. అందుకే ఆయన జీవిత చరిత్రను భీమన్న వ్రాశాడు. ఒక నవల వలె, ఒక కావ్యం వలె నడిచిన రచన ఇది.

ఇస్లాం, కాఖా లింగం, వీరశైవం, ఆర్ష సంప్రదాయం వగైరా అనేక విషయాలపై ఆసక్తికర వివరా లెన్నో వున్నై ఈ గ్రంధంలో.

"భావం, భాష, కళ, సాహిత్యం, సౌందర్యం వంటి వన్నీ - గాలి, నేల, నీరు, నిప్పు లాగే - సర్వ మానవ కోటికీ చెంది నట్టివి. మతాలూ, ఆచారాలూ, దేశ సరి హద్దులూ, ఆహార విహారాలూ వంటి వ్యక్తిగత విషయాలకు అవి ఎన్నటికీ పరిమితం కావు"

21. పిల్లి శతకం

"సుమతీ" అన్నట్టే, "పిల్లీ" అనే మకుటంతో భీమన్న వ్రాసిన కంద పద్య శతకం ఇది. 126 పద్యాలున్నై ఇందులో.

శతకముల కొలది నీతులు
శత విధముల కలవు, వాని జను లెరుగుదురున్

కనుక-వట్టి నీతులు చెప్పడానికే వాడుకోలే దీయన ఈ శతకాన్ని. సత్య సౌందర్య నిర్దేశకమైన వ్యంగ్యాన్ని పొదిగి పెట్టాడు ప్రతి పద్యంలోను. విమర్శ కూడ కవితా సౌందర్య విలసితమే.

భీమన్న పీఠికలకు ఒక ప్రత్యేక మాన్యత వుంది సాహిత్యంలో. ఈ పిల్లీ శతకం పీఠిక మరీ విలక్షణ మైనట్టిది.

కవి భుజగుడు, కవి వృషభుడు
కవి పికుడని పిలువ బడక కవి కాలేడా?
కవితకు కాదా బిరుదులు,
కవి బ్రతుకుకు తోకలమ్మ, కవికో, పిల్లీ?

"సుమతీ శతకం బ్రాసిన కవి పేరు కూడ భీమన్నే. ఆనాడు సుమతులు ఎక్కువ. ఈనాడు పిల్లు లెక్కువ" అన్నాడొక పండిత మిత్రుడు ఈ శతకం గురించి.

"మానవుడు ఆలోచించాలి. ఆలోచించలేని వాడు చదవాలి. చదవలేని వాణ్ణి గురించిఅయ్యో పాపం అంటాం. మరి-చదవగలిగి వుండి చదవని వాణ్ణి ఏమంటాం?..."

చదువుకొన్న ప్రతి వాడూ కనీసం ఈ పిల్లీ శతకం పీఠిక అయినా చదవాలి మరి.

పొరు గిండ్ల పాలు లేవా?
ఆరయంగా సొంత అవు ఆవసర మేమీ?
దొరబిడ్డ శీవి నీయది?
దొరికిన కడ విండుకొమ్ము, దొరలా, పిల్లీ?

22. ఏక పద్యోపాఖ్యానం

ఆదిగో, ముందొక గర్ల్; వెన్కమన, మా
హా, బ్యూటిఫుల్! బ్యూటిఫుల్!
ఎద హో రెత్తెను క్లౌడ్సులోకి చను ఐల్
హెచ్ బాంబ రన్నట్టు నా;

దదదా చి త్తమ! కంగు పట్టుకొను పొం
తస్ పోదువే? చేతిలో
మెద డుందా? బహు తచ్చ, సాగు మవె సా
మీ క్యంపు సారూవ్యముల్!

ఏక పద్యోపాఖ్యానం అంటే ఈ ఒక్క పద్యమే. దీన్ని మహా కావ్యంగా రుజువుచేస్తూ, ఒక వంద పేజీల వ్యాఖ్య!

పద్యమూ భీమన్నదే. వ్యాఖ్యా భీమన్నదే. ఒక్కడే ఇద్దరు వ్యక్తులుగా విడిపోయి రచన సాగించిన అపూర్వ చరిత్ర ఇది. ప్రపంచంలో మరే సాహిత్యంలోనూ ఇలాంటిది లేదు.

రచన సెప్పైరే అయినా, మంచి లక్షణ గ్రంధంగా ప్రశంసించ బడింది పండితులచేత.

"ప్రపంచంలో తనకు తెలియని విషయమే లే దనిపించుకున్నాడీ రచయిత" అన్నాయి కొన్ని పత్రికలు.

"వెర్రి వేయి విధా లంటారు. ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క వెర్రి వుంటుంది. మొత్తం వేయి వెర్రులూ తనలోనే వున్న వ్యక్తి బోయి భీమన్న" అన్న కీర్తిని కూడా రచయితకు సంపాదించిపెట్టిన రచన ఇది.

23. ఆది కవి వాల్మీకి

ఆది కవి వాల్మీకి చరిత్రను నాటకంగా వ్రాశాడు భీమన్న. జన్మ చేతనే చండాలు డైనాడు వాల్మీకి. జన్మ ద్వారా హరిజనుడు, వివాహం ద్వారా గిరిజనుడు. తపస్సు ద్వారా బ్రహర్షి అయి, రామాయణ మహాకావ్యాన్ని నిర్మించిన దీక్షితుడు.

వాల్మీకి ఎక్కడ పుట్టాడు? తల్లి దండ్రు లెవరు? ఆ నాటి చండాల ఆవాసాలు ఎలా వుండేవి? కొండ వాళ్ళతో ఎలా కలిశాడు? ఈ వృత్తాంత మంతా సపౌరాణికంగా నాటకీకరించాడు భీమన్న.

బ్రహ్మదేవుడి స్వర్గ సందర్శనంతో ప్రారంభమై, వాల్మీకాశ్రమంలో రామాయణాన్ని వింటూ సీత సుఖంగా వుండడంతో ముగుస్తుంది నాటకం.

రామాయణం విషాదాంత కావ్యం. ఈ వాల్మీకి నాటకం సుఖాంతం. కష్టాలు, దుఃఖాలు ఎక్కడా వుండవు. వాటికి ఎక్కువ ప్రాముఖ్యం లేదు భీమన్న దృష్టిలో.

పాటలు, పద్యాలు, శ్లోకాలు వెదజల్లబడివున్న ఈ నాటకం ఒక సంపంగి పొద లాంటిది. పండిత షట్పదాలకు కొంత ఇబ్బందికరం కావచ్చు.

బహుజన సంఘ నాయకుడు తులాబందుల నాగేశ్వరరావు గారి కివ్వ బడింది దృశ్య కావ్యం అంకితం.

24. అశోకవనిలో రాముడు

125 పద్యాల కావ్యం ఇది. పద్యాలన్ని ఉత్పల మాలలూ, చంపక మాలలూ.

రావణ వధ తర్వాత, ఆ రాత్రి, ఒంటరిగా, ఎవరికీ తెలియకుండా, రాముడు అశోక వనంలోకి వెళతాడు – అంత కాలం తన సీత నిర్బంధించ బడి ఉన్న పరిసరా లెలాంటివో చూడటంకోసం. అప్పుడు సీత అక్కడలేదు. అప్పటికే సుగ్రీవ సైనిక శిబిరానికి తీసుకు వెళ్ళబడింది.

ఆ అర్ధరాత్రి, ఒక్కడూ ఆ వనంలో తిరుగుతున్నప్పుడు, రాముడి మనస్సు ఎలా వున్నదో – వనలక్ష్మి రాముణ్ని ఎలా ఆహ్వానించిందో రాగ రమణీయంగా వర్ణించిన కావ్యం ఇది.

తోటలో మౌనంగా తిరుగుతున్న రాముడు నిమిత్తమాత్రుడు. కావ్యం అంతా సీతమయం. రాముడి మనస్సేకాదు, వనమే కాదు, మొత్తం జగత్తే సీతతో నిండివుంది ఆ క్షణంలో. వనంలోని ప్రతీ భూమిజమూ తానే భూమి జగా నిలిచిం దట రాముడి పాదాల ముందు!

చిబుకము దువ్వు, కౌగిటికి
చిక్కు, కపోలము లంటు, కండ్లకున్
కబురులు చెప్పు, కాళ్ళ పయి
క్రమ్మి, ఉరమ్మున చిమ్మి, గుండెలో
గుబు లిడు — సీత పాదములు
కొల్చిన తద్వివి నెల్ల పల్లికల్
గబ గబ రామ చంద్రు డిటు
గా, అటుగా చను నప్డ కోర్కెతో!

వాల్తేరులో, తమ స్వగృహంలో, భోజనానంతరం, తీరికగా ఈ కావ్యాన్ని సొంతం విని ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి డాక్టర్ కాకర్ల వెంకటరామ నరసింహంగా రన్నారు "భీమన్నగారూ! రాముడు ఆ రాత్రి అశోక వనంలోకి వెళ్ళేవుంటా డండి! వాల్మీకి ఎందుకు చెప్పలేదో కాని" అని.

"బహుశా, నా కోసం వదిలేసి వుంటాడు" అన్నాడు భీమన్న.

అంతటి సహజ సుందరమైన కావ్యం ఇది.

అప్పటికి మంత్రిగా వున్న పరమ వదాన్య మూర్తి దాసరి పెరుమాళ్ళ గారికి అంకితం ఈ కావ్యం.

25. రాఖీలు

సుమారు 400 గేయాల సంపుటి ఇది. ప్రతి గేయమూ ఒక సర్వాంగ సంపూర్ణమైన కళాఖండం.

ఇద్దరు ప్రేయసీ ప్రియులు తొలి సారిగా కలుసుకొన్న క్షణం నుంచి - ఆహ్లాదం, విరహం, దుఃఖం, దేశ సేవ, యాత్రావిధి, నిర్బంధం, బాధ, శృంగారం వగైరా రకరకాల మలుపుల గుండా గమ్యం చేరుకొనే క్రమం కూడ కనిపిస్తుం దీ సంపుటిలో.

ఇది కథ కాదు. వివిధ గేయాల మాల. ఒక్కొక్క గేయం ఒక్కొక్క రకం పుష్పం.

భీమన్న తన రసాద్వైత సిద్ధాంతాన్ని తొలసారిగా వివరించిన పీఠిక ఈ సంపుటిది.

ఆ కాశ వాణిలో తరచు గానం చేయబడుతున్నట్టి, కచేరీలలో పాడబడు తున్నట్టి భీమన్న గేయాలు ఈ సంపుటి లోవే.

మనసు లోని కోరికలకు
మచ్చు తునక లీ మల్లెలు,
రోజు కెన్ని విరిసేనో
మోజు లెన్ని తీరేనో!
బ్రతుకు లోని వేదనలకు
ప్రతి రవాలు పికరవాలు,
రాగమెంత రగిలెనో
మూగ వోయి ముగిసేనో!
ఆత్మలోని అందాలకు
ఆదర్శము నీ అళులు,
ఎంత మధువు గ్రోలేనో
ఎంత జగతి కొసగేనో!

ఇది ఎమ్. ఆర్. ఆప్పారావు గారికి అంకితం.

26. కేదారేశ్వరి

తెలుగు దేశం గురించి అప్పుడప్పు డక్కడక్కడ వ్రాసిన కొన్ని గేయాల, పద్యాల సంపుటి.

మొదటి ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా-కళా వెంకటరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, మాడపాటి హనుమంతరావు, వేముల కూర్మయ్య, తాపీ ధర్మారావు, కల్లూరి సుబ్బారావు గార్ల దివ్య స్మృతికి అంకితంగా-ప్రకటించబడిన గ్రంథం ఇది.

27. అసూయ

28. పడిపోతున్న అడ్డుగోడలు

ఈ రెండూ ఏకాంక నాటికలు. మొదటిది బెజవాడలోని మిత్రులు వల్లభనేని కాశీ విశ్వనాథంగారి పత్రికలో సీరియల్‌గా వచ్చి, పుస్తక రూపం పొంది నట్టిది.

రెండవది ఆకాశవాణిలో ప్రసారమై, హరిజన సేవక సంఘం వారి సహాయంతో ప్రచురించబడినట్టిది.

ఈ రెండూ చాల చోట్ల ప్రదర్శితమై, మెప్పు పడసినట్టివే.

29. మణి మానసం

శ్యమంతక మణి ఒక మణి. ఒక రత్నం. దానికి ఒక మనస్సును కల్పించి, కృష్ణుణ్ని ప్రేమించినట్టు భావించి, దాని ఆత్మ విచారాన్ని అద్భుతంగా వెలయించిన కావ్యమీ మణి మానసం.

కథ భాగవతం లోదే. భాగవతంలోది ఒక అచేతనమైన మణి. దానికి చేతనను కల్పించాడు భీమన్న. ఇది సహజ సుందరమైన ఒక అపూర్వ భావన. సలక్షణాలూ, స్వాదురస పూర్ణాలూ అయిన 125 వృత్తాల కావ్యమిది.

మణి కృష్ణున్ని ప్రేమించింది. అయితే, సత్రాజితుడికి ఇవ్వబడింది! అప్పటి నుంచి ఎన్నిసార్లు కృష్ణుడి చేతికి వచ్చినా, దాన్ని అతడు వదులుకుంటూనే వచ్చాడు. అది మణి కనుక దాని మనస్సు ఇతర్లకు అర్థం కాదు. తనలో తానే ఏడ్చుకొంటుంది.

మహిమ గలట్టి రత్నమూ శ్య
మంతము, హేమము విచ్చు నంచు వన్
బహుగతులన్ సుతింత్రు; మరి
నా కెవ రిత్తురు నా అభీష్టముల్?

స్వహితమె నైజమౌ మనుజ
జాతికి; సర్వహితైక మూర్తివౌ
మహితుడ వీవుగా? మణికి
మాత్రము మానస ముండదా? ప్రభూ?

వెంకటేశ్వరస్వామి అందు కొన్నాడీ కావ్యమణిని.

30. గుడిసెలు కాలిపోతున్నై

అనేక విషయాలపై – ముఖ్యంగా మత రాజకీయ సాంఘిక విమర్శతో, వచన కవితా ప్రక్రియలో, వివిధ సందర్భాల కోసం వ్రాసిన 57 కవితల సంపుటి ఇది.

వద్దు మతం, వద్దు మత బోధలు,
వద్దు భక్తి, వద్దు భజనలు;
ఏది పులో ఏది నక్కో కని పెట్టండి!
మనుష్యుల్ని పెంచుకొని మనుషులుగా బ్రతకండి!

అంటూ గొర్రెలను హెచ్చరించడం ఈ కవితలలోని సారాంశం.

పులి, నక్క, గొర్రె సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడీ గ్రంథంలో భీమన్న.

ప్రార్థనలు, భజనలు అన్నీ
వట్టి శవ జాగారాలు,
మతమూ, భక్తీ నశించకుండా
ప్రగతి లేదు మనిషికి!

మత పౌరాణిక పాత్రల గుణగణాల పరిశీలన కూడ ఎంతోవుంది ఇందులో. ఏనాడో మరణించిన రాముడు, కృష్ణుడు ఈనాడు పిలిస్తే ఏలా పలుకుతారు అంటాడు. శరణాగతి సిద్ధాంతం బానిస మనస్తత్వాన్ని పెంపొందించడానికి సృష్టించ బడిం దంటాడు.

అజ్ఞానం కాలి పోతున్నది. మానవ చేతన మేల్కొంటున్నది-అ ధ్వనే వుంది ఈ గ్రంథ శీర్షికలో.

1975 సంవత్సరపు జాతీయ అవార్డు పుచ్చుకొన్న గ్రంథం ఇది.

విమర్శాత్మక మైనట్టివే కాదు, సిద్ధాంతపరమైనట్టివి. సౌందర్య విలసిత మైనట్టివి కూడా అనేక కవితలు కల వీందులో.

ఇది మంత్రి జి. వెంకటస్వామి గారికి అంకితం.

31. బొమ్మ

అత్యాధునికమూ, అత్యంత సనాతనమూ అయిన రసాద్వైత పరమ పదవికి-బ్రాహ్మీ పదారవింద మకరంద రసాయన సంపాదకం ఈ కావ్యం!

ఈ కావ్యం గురించి ఇంతకంటె మరెలా చెప్పాలో తోచడం లేదు.

రసధ్వని కలశాలు ఈ కావ్యంలోని గేయాలన్నీ. వాటిని ఆస్వాదించడం ద్వారా రసార్ణవ పరమాత్మలో ఉపశమించా లనుకొనే రసజ్ఞులు, రసికులు, రసాత్మకులు ఎవరైనా వుంటే-ఈ కావ్యాన్ని చదవక తప్పదు.

మోక్షం అంటే ఏమిటి? పీఠాధిపతులు, ప్రవక్తలు, బాబాలు, గురువులు-ఎవరూ ఎవరికీ మోక్షం ఇవ్వలేరు. రసాద్వైతులే ముక్తులు భీమన్న దృష్టిలో.

150 గేయాల దివ్య కావ్యం ఇది.

ఒక అమాయకుడైన యువకుడు తన ప్రియురాలికి తన ప్రేను గురించి చెప్పుకోడానికి బిడియపడి, ఆమె ఫోటోను అడిగి తీసుకొని, దానిని ఆరాధించిన చరిత్ర ఇది.

ఇతి వృత్తంలో, రచనలో, భావ విన్యాసంలో క్లిష్టత ఏమీలేదు. వేమన పద్యాలంత సులభశైలి.

నిర్గుణ నిరాకార పరమాత్మకు సగుణ సాకార ప్రతీకగా (కుండలినిగా) కూడ గ్రహించవచ్చు ఈ బొమ్మను - మరీ రంధ్రాన్వేషకులు.

ఈ కావ్యం మహాకవి జె. బాపురెడ్డికి అంకితం.

బాధతో బెంగతో
బ్రతుకు భారాలతో
చింతతో, వంతతో
చితికి పోయే నరుని
ధన్యానిలో కరగ నిమ్మ! నీకేవి
ధన్యోస్మిగా పెరగనిమ్మ!

32. శివాలకలు

113 ప్రేమ లేఖల సంపుటి ఇది. వచన కవితా ప్రక్రియలో వ్రాయబడినట్టివి. జీవిత సమస్యలు బహుముఖంగా చర్చించ బడినట్టివి.

ప్రియుడు ఉన్న చోటనే ఉండిపోతాడు. అతడి చిరునామా స్థిరం. ప్రియురాలు ఆమె ఆవ్యకు తోడుగా తీర్థయాత్రలకు పోతుంది. ఆమె చిరునామా చరం. ఈ స్థిర చరాల మధ్య జరిగే ప్రణయ వ్యవసాయం ఈ కావ్య సంపుటి!

అపూర్వమైన భావన. అమృత మధురమైన రచన. ప్రతి కవితా ఒక రస కలశం. ప్రతి వస్తువూ ఒక శిల్ప క్షేత్రం.

బియ్యపు గింజకోసం కారు తేరిన చీమలు
ఇన్ను టికెట్టుకోసం కుప్పపడ్డ కవులు
అన్నసత్రం గుమ్మంలో మూగిన ఈగలు
ధర్మ దర్శనం క్యూలో ముస్తాబైన కోతులు
గులాబీ తీగల నీడలో ఆకుతేళ్లు
గంధపు చెట్ల కొమ్మల్లో నాగుబాములు
పదవుల చుట్టూ ఆబోతులు
ఇదే కదూ, నీవు అసహ్యించు కొంటున్న లోకం?
ఇంత కంటె ఏంచెయ్యగలడు బ్రహ్మ మాత్రం?

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు

బోయి భీమన్న

ప్రశంసా సర్గ

భీమన్నను గురించి వివిధ సందర్భాలలో సమకాలీనులైన మిత్ర కవులు, పండితులు, స్నేహితులు, ప్రజలు చేసిన ప్రశంసలను, చెప్పిన పద్యాలను కొన్నిటిని ఈ సర్గలో పొందు పరుస్తాను.

వందలు, వేలు సన్మానాలు పొందాడు భీమన్న. అలాంటి వాటిలో నాకు లభించిన సన్మాన పత్రాల నుంచి కొన్ని కొన్ని వాక్యాలను కూడ ఇక్కడ ఉదాహరిస్తాను.

పత్రికలలో వేల సమీక్షలు, వ్యాసాలు వచ్చాయి ఈయన గ్రంథాల మీద. వాటి నుంచీ, కొన్ని ప్రధాన వ్యాసాల నుంచీ కూడ కొన్ని మంచి మాట లను ఇక్కడ పేరొక్కంటాను.

ఈ సందర్భంలో - పి. వి. రత్నం, బాసాని సుదర్శనరెడ్డి, ముది గొండ శివప్రసాద్, పాటిలు తిమ్మారెడ్డి, రాజీవి, డి. ఆర్. కుసుమ, డా. దివాకర్ల వేంకటావధాని, ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం, స్ఫూర్తిశ్రీ, శ్రీ వాత్సవ, జె. బాపురెడ్డి, శ్రీమతి ఆదిలక్ష్మి, డి. ఆంజ నేయులు, పులికంటి కృష్ణారెడ్డి, త్రిపురనేని సుబ్బారావు, అమ, చర్ల గణ పతిశాస్త్రి, బి. తారకం, రాంషా, తాళ్ళూరి సత్యనారాయణ, రామకోటయ్య మున్నగు రచయితలకూ -

డా . సి . నారాయణరెడ్డి , దాశరధి , డా . నిడదవోలు , ఆచార్య నంబూరి దుర్వాస మహర్షి , శ్రీ బి . ఎన్ . మూర్తి , ఆచార్య జి . జె . సోమయాజి , జాషువా , జోసఫ్ కవి , ఆన్నాజీశర్మ , జి . జె . సామ్యూల్ , కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి , దాసి బసవయ్య , డా . ఆడుసుమిల్లి నారాయణరావు , కోట సీతారామశర్మ , మహమ్మద్ హుసేన్ , వేమన్న , షేక్ దావూద్ కవి , ఎస్ . ఎ . పద్మనాభ శాస్త్రి మున్నగు కవి పండితులకు -

ఆయా రచనలను ప్రచురించిన ఆంధ్రపత్రిక , ఆంధ్రజ్యోతి , ఆంధ్ర ప్రభ , భారతి , కిన్నెర , కృష్ణా పత్రిక , అభిసారిక , ఐహుజన , ఆంధ్ర జనత , విశాలాంధ్ర , జమీన్ రైతు , ఆంధ్రభూమి , గోలకొండ , డక్కన్ క్రానికల్ , ఇండియన్ ఎక్స్‌ప్రెస్ , హిందూ , కర్షక మున్నగు పత్రికల వారికీ- నేను ఎంతగానో కృతజ్ఞతలు చెప్పవలసి వుంది .

1.

భీమన్నా , నిను గూరిచి
ఏమన్నా వ్రాయా లని
నా మదిలో తలచి నంత నవ శంపాభల్
మామిడి యెలనాగ కనుల మావవ శోభల్ !

నీ దొక దీర్ఘా లాపన
నీది అనర్ఘా లోచన
నీది నిశా సూర్య దృష్టి నిత్యం నేస్తం !
నీది దివా చంద్ర సృష్టి నిజమిది నేస్తం !

ఎప్పుడు చూస్తావో , మరి
ఎప్పుడు రాస్తావో , ఆరె !
కుప్పలుగా రాల్చి నావు క్రొన్నన పలుకుల్ !
తెప్పలుగా తేల్చి నావు తీయని కవితల్ !

చిటి కేస్తే , కను బొమ్మలు
చిటి లిస్తే - ఉదయించును
స్ఫుటా స్ఫుట ప్రకృతి భావ సుందర నదముల్
ఝటా ఝటా లయ విచలిత శాంకర పదముల్ !

పద్యం నిను పై గొంటే
గద్యం నిను లో గొంటే
మిద్యానికి నిన్ను చూచి మత్తొస్తుంటే
సద్య స్ఫూర్తిగ అంటిని శహభాష్, వింటే?

-మహాకవి, పద్మశ్రీ
డా. సి. నారాయణ రెడ్డి

(ఒకసారి బాపురెడ్డి గారు చేసిన వైయక్తిక సన్మానంలో ఈ అభినందన మానందాలను సినారె స్వయంగా, వివరణాత్మకంగా పాడగా బాపురెడ్డి, రమణారావు, డా. యాదగిరి రెడ్డి, ఎ. వి. ఆర్. మున్నగు వారు గొంతు కలిపి కవాలీ స్టైలులో పాడారు మనోహరంగా)

2.

ప్రాచీ నాధునిక - ఆంధ్రాంగ్ల - గ్రాంధిక వ్యావహారిక రచనా సంప్రదాయ సవ్యసాచులు శ్రీ భీమన్న గారు. వారి రచన లన్నింటను పఱ్ఱామౌళికతలు సర్వతో ముఖములై వర్తించుచు వారి కుపఱ్ఱా కోకిల బిరుదమును సార్థక మొనరించు చున్నవి. రచనా భావములకును జీవిత విధానమును అభేదాధ్యవసాయము నావహించు నసహాత్ములు వారు. భీమాభిధానులయ్యు నజాత శత్రులు; హరిజనులయ్యు సాంబశివ ప్రియులు, అధిగత వేదాంతులయ్యు శృంగార సౌందర్యారాధకులు, వేమన్నకు ఛాత్రులు. సర్వ సహృదయులకు మిత్రులు; మన్ననకు పాత్రులు. అధ్యక్ష మహాశయా! ఏతాదృశ గుణ గణ భూషితులైన శ్రీ కళాప్రపూర్ణ బోయి భీమన్న గారి కాంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యతతో పాటు తచ్చిహ్నములైన అమూల్యాంబర స్వర్ణ పతకములను గూడ నొసంగి గౌరవింప వేడు చున్నాను.

(విశిష్ట సభ్యత్వ ప్రదాన సందర్భంలో డా. దివాకర్ల వెంకటావధాని గారు చేసిన ప్రశంస నుంచి 3-2-1973)

3.

ఏ మన్నన్ రసమే యగున్; మరియు నీ
వెందెందు దర్శించినన్
ప్రేమే కన్పడు; విశ్వమంతయును నీ
శ్రేయఃప్రసూనాల నా

రామ మ్మొనది ; అక్ష రాక్షర రస
బ్రహ్మావతారుండ , వో
భీమన్నా ! కొను మన్న , మా మనసు లీ
వృత్తాంక వాగర్థముల్ !

—కళాప్రపూర్ణ డా. దూర్వాస మహర్షి

4

హృదయ పద్మకళికను వికసింపచేసి , అచ్చటి పద్మాసుని సాక్షాత్కరింప చేసేది కవిత . దానిని సాధించిన రసదార్శనికుడు బోయి భీమన్న . రసికుల ఆత్మలను రసస్నానం చేయించిన దిట్ట .

వాస్తవ సత్య సౌందర్య దర్శనం చేసిన రసబ్రహ్మ భీమన్న .

(మనోజ్ఞ భావకల్పాళి "రాగవైశాళి" అనే శీర్షికతో 'కర్షక' 12-10-67 నాటి పత్రికలో పడిన శ్రీ తాళ్లూరి సత్యనారాయణగారి సుదీర్ఘ వ్యాసం నుంచి)

5

స్వాగతమో కవీంద్ర ! గుడివాడ పురాంధ్ర నలంద సాహితీ
భోగుల స్వాగతమ్ము లివి , పూత పరాగక భావనిర్ఝరిన్
దోగిన మంజులోక్తు లివి , దోయిలి సేతుము బోయి భీమనా !
ఆగమనా త్త దివ్యసమయాంచిత జాత సుధాంతరమ్మునన్॥

వెన్నెల వెల్గు వాకలకు , వేణునినాదసుధా ప్రవంతికిన్ ,
ప్రన్నని సన్నజాజి పొలుపమ్ముల జాలునకుం , బసందులౌ
క్రొన్నన తేనెసోనలకు , గోము జగత్తున కన్న మిన్న భీ
మన్న పసిండికైతలు మహాంధ్రనలంద ఘటించు మెప్పులన్॥

మా నాలందకృతంబులై యెసగు సంక్రాంత్యుత్సవానేకముల్
రాణించున్ నుతికెక్కి భీమకవి ! నీ రాకన్ వినూత్నప్రభల్
శ్రేణుల్ గట్టుచు దిగ్దిగంతములు పూరెంచెన్ ఆవిద్యాతమో
భానూద్దిష్టముగా మహాంధ్ర మహిత వ్యాసంగ విస్ఫూర్తిగన్॥

ఒకట నుదాత్త చిత్తుఁడు , మహోజ్జ్వల భావుకుఁడౌ మరొక్కటన్ ,
ప్రకృతికి ప్రతిఁడున్ రసపిపాసి గుణోన్నత భాసితార్ద్ర శీ
త కరుఁడు-తత్త్వవేత్త-కవితానిధి భీమకవీంద్రు డాంధ్రలో
సకల గుణాభిరామతఁ ప్రశస్తి గడించెఁ దెలుంగువెల్గులో॥

ఆంధ్ర నవ్యసాహిత్యరంగాన లేచు
విప్లవతరంగ పంక్తిని వేగు దోచె
దివ్యచైతన్య రాగోచ్ఛదీప్తి రేఖ
భీమకవి తెలుంగుహారంగు వెలుగుకైత॥

ఆంధ్ర నలందా కార్యవర్గము, 1960

6

శ్రీ బోయి భీమన్నగారు నవ్యాంధ్ర కవులలో గణనీయమైన స్థాయిని సంపాదించుకున్నారు. మాధుర్యము వారి రచనల ప్రత్యేక విశిష్టత. శ్రీ భీమన్న గారు ఉచ్చశ్రేణికి చెందిన యశస్కాములగు మధుర కవులు.

— బూర్గుల రామకృష్ణారావు
(గవర్నరు, ఉత్తరప్రదేశ్)

7

మరుగుపడిన జాతుల నుండి
దురపిలే వాడల నుండి
వెలుగొందిన మాణిక్యానివి !
విలువైన జాతిపీణవు !

వలపుగుల్కు జాతి కలాలకు
బలమైన తెలుగు పొలాలకు
విలసిల్లే కులగురు వీవె
ఫలియించే సురతరు వీవె !

ఇంపొసగే భావ సంపదకు
కంపించే భాషా ప్రౌఢికి
సంపంగివి నిజముగ నీవే!
సొంపైన గులాబివి నీవే!!
జాతికి భీమన్నవు నివు
నీతికి వేమన్నపు నీవే!
గైకొనుమా నమోవాకమును
చేకొను మిక ఆంధ్రలోకమును!

— 'నూతకిక్క'

8

సురుచిర గద్యపద్య పరిశోభితమంజుల కావ్యసృష్టికిన్
చిరుతతనమ్మునందె నిజచిత్తము లగ్నముజెంద—భారతీ
వరచరణారవిందరత భక్తి సుధారస ధారలూని, వి
స్ఫురత జెలంగు భీమకవి పుణ్య మగణ్యమనంగ జెల్లదే!

వేములవాడ భీమకవి పెట్టిన శాపము నాడు దుర్భరో
ద్దామ దరిద్రతా మకరిదంష్ట్రిల పాలొనరించి భూపతిన్
పామరు జేసి ద్రిప్పెనట! పద్యజగత్తున మాలవారి నీ
భీమన నేడు బ్రీతి పృధివీపతులన్ పొనరింప బూనడే!

ఆకలిమంటల కల్లాడు పేద సా
ధల దుఃఖమును గాంచి కలతజెంది,
సంఘ దురాచార శాకినీ ఢాకినీ
దురహంకృతికి కన్నులురిమి యురిమి,
నవవసంతాలంకృత వసుంధరాదేవి
వన్నె చిన్నెల వైభవమ్ము దెలిసి,
గండు కోయిల పాట గుండెలో కూనరా
గాల నాలాపించు గతు లెరింగి,

పదము లేర్చి కూర్చి ప్రాణము ఘటియించి
మానవాభ్యుదయము మది దలంచి
కావ్యరచన చేయు కవి బోయి భీమన్న
మహితకీర్తిగాంచి మనెడుగాత !

అతని కవనమ్ములో తీపి కంతు లేదు,
అతని సృజనా విదగ్ధత కంతు లేదు,
అతని మధురాశ్రయ శ్రేణి కంతు లేదు,
అతడు కవి రాజహంస ! భీమన్న సుకవి.

కలకాలము తెలుగుం బ్రజ
పలురీతుల బ్రస్తుతింప ఐలుకుల వెలదిన్
పలికింపుము, పులకింపుము,
కిలికించిత నాట్యకేళి కెరలింపు మయా !

— బి. ఎస్. మూర్తి
(కేంద్ర ఉప మంత్రి, 1959)

9

రాల లోపల నమృతంపు జాలు నించు,
స్వాదుతను పించు, హృదయాల చేదు త్రుంచు,
ప్రవిమలానంద సంపద పంచిపెట్టు,
భీమనకవీంద్రు దివ్య కవిత్వశక్తి.

* * *

మీ బొమ్మ చదివి
ఈ కమ్మ రాస్తున్నాను.
యెంత గొప్ప పీఠిక వ్రాసుకున్నారు !
మీకు మీరు పీఠిక వ్రాసుకోవడమే సరియైన పద్ధతి !

ఇంత బాగా ఎంతటి మహా విమర్శకుడైనా, సమీక్షకుడైనా వ్రాయలేడు. మీ మనసులో దాగిన ఆనేక మహా రహస్యాలను ఈ పీఠికలో అవిష్కరించారు మీరు.

మహాకవి డా. దాశరథి

10

ఒగరు మామిడిఁదిని పొగరెక్కి కోకిల
మాటికి వల్లించు మంత్రములను
ఆమని కై పెక్కి యలరారు తీవెలఁ
బొసగెడు రంగుల కుసుమములను
జుమ్మను తుమ్మెద చూరలాడిన తేనె
పెఱలు చేపడిన నైవేద్యములుగ
సహజ పాండిత్యమ్ము సై దొడుగా, పల్కి
చెలువను భక్తి పూజించినావు

అర్థగాంభీర్య ముచితమై యలరు చుండ
భావ నైశిత్య మెంతేని పరిఢవిల్లు
రసగుళిక లోయి నీవైన రచన లెల్ల
ఆరసి యలరితి వోయి భీమన్న తండ్రి!

ఆచార్య జి. జె. సోమయాజి

సాహితీ సభలో భీమన్నగారి ప్రసంగం హేమంత ప్రభాతంలో కొబ్బరి చెట్ల ఆకుల్లోంచి మంచు బొట్లు పడ్డట్టుగా జిల్కుమంటూ ఉంటుంది

- వారా వేణు

11

కడజాతికి చెందిన దన్న అరుంధతి శిష్టమునివ్రతుడు వశిష్ఠుని ప్రణయ సౌభాగ్యము నందుకొని గర్విస్తుంది-

పూచి పొదలు నదృష్టమ్ము నోచుకొనక
పుడమి యిడుగు లొత్తెడు గడ్డి పోచ నేను
ముని కుమారు నొక్కని ప్రేమ పూజలోన
పారిజాతము కాగల భాగ్య మబ్బె !

భీమన్నకు కూడా కవితా పూజలోని సౌందర్యారాధనలో అటువంటి అనుభవమే కలిగింది . పల్లెటూరిలోని ప్రకృతి సౌందర్యాన్ని ఒక స్త్రీ లోనూ , ఒక పురుషుని లోను మలచి క్రొత్త అందాలు సృష్టించాడు .

'చిత్తంలో ప్రతిబింబ సుత్తి దెబ్బగా మలచిన
మానవ మూర్తిని మించి మహిత శిల్పమే మున్నది ?'

అని మానవతలో మహోన్నతిని చూచి దానిని ప్రకృతిలో ప్రతిబింబింప జేశాడు .

గడ్డి పువ్వు నంటూనే
కల్పక ప్రసూనమ వై
నడిపించుక పోయినావు
నందనవన వీధులకు

అంటూ "పైరు పాట" పాడుకొన్నాడు . ఆ పాటలు జానపదుని సంగీతంతో పాటు ప్రకృతికవి ప్రణయగీతం వినిపిస్తున్నది .

— శ్రీ వాత్సవ

12

భీమన్నగారు చక్కని కవి . సుకుమారముగా , సొగసైన భావములతో సంపదాయము చెడకుండ , వ్యాకరణ శుద్ధములైన శబ్దములతో రచించు కవి .

— డా . విశ్వనాథ సత్యనారాయణ. 1960

భీమన్న కవిత వసంత నిరంతరమైన మధ్యధరా ప్రాంత ప్రకృతి సన్నివేశం వలె , నిసర్గమనోజ్ఞమైన రివీరా వినోద కాలక్షేపం వలె శ్రుతి సుభగము,

యుగపన్మనోహరమూ అయినది. భారతీయ తత్త్వ ప్రవచనం వలె నిర్భర భావనా గభీరమైనది. ప్రాచీనాంధ్ర జానపద హృదయంవలె నిరాడంబరము. నిరతార్ద్రిము, నిత్యముగ్ధము అయినది.

— యస్వి. జోగారావు

"ధర్మమే రసం. ప్రకృతిలోని ప్రతి అణువు ధర్మబద్ధమే. అందువల్ల రసవంతమే" అని ఆయన గంభీరమైన, ఉన్నతమైన, ఉపనిషత్ దృక్పథాన్ని నిర్వచించారు. ఆయన కవిత్వమూ కళా ధర్మసమన్వయం. అంతేకాక, మందారమై నా బోటి సామాన్యులకు అందుబాటులో ఉంటుంది.

"సత్యం, శివం, సుందరం" ఇదే భీమన్నగారి మధుర కవిత లక్ష్యం, లక్షణం కూడా అనుకుంటాను. కలకాలం ఆయన క్రొత్త క్రొత్త కళావీధులలో నృత్యంచేస్తూ, గానం చేస్తూ తరించాలని నా ప్రార్థన.

— కుంభంపాటి రామశాస్త్రి (తారకంగారు)

13

నాడు రాజలోకమ్ము నానంద పార
వశ్యమున మించె భీమన పాకసృష్టి,
నేడు సహృదయ మాత్రుని నింపివైచు
ప్రమదరస హృష్టి భీమన పాకసృష్టి.

— శ్రీ ఎన్. సి. ఎస్. వేంకటాచారి

ఓ కవీ!
కవి గనుక రవీ!!
నా యెదలో మెదిలే దివీ!!!
నార్లకు మెత్తని కవి

ప్రజలకు సుకవి
నాకా ?
భీమన్న - బంగారు కవి !
ని "దీపసభ"కు
నా జన్మ ఆధ్యక్షత వహించి .
"పాలేరు" "మధుగీత"లకు
కామందునై
"కావ్య కుసుమాల" "రాగోదయం"
గ్రోలుతూ
స్వర్గ మెచటనో లేదని సవాలు
చేస్తా !

— బొజ్జ కృష్ణశాస్త్రి

14

తళుకుల్ బెళుకులు గల్గు మేల్తెలుగు
శబ్ద శ్రేణితో , కావ్య భూ
షలు సృష్టించి , విరించి బిత్తరి కటాక్ష
శీల నార్జించి , కా
గలవాడైనుతి కెక్కు భీమన కవిన్
గన్నట్టి శ్రీ వేగిమం
డల మేరీతి బహూకరించునో ,
ప్రతిష్ఠా వాహ మెక్కించుచున్ .

— యుగకవి జాషువా

15

పండిత మండలీ మధుర
భావ వనీ ! రసమూర్తి ! పండితా
ఖండల భీమమిత్ర ! కల
కంఠము నిండిన నీదు వాక్కులో

బండెను తెల్గు ఖండములు ,
వాములు వాములు నవ్యకావనో
ద్దండ కవిత్వ భాగ్యప్రమ
దంపుదళ త్తళ కావ్యరాజముల్

— జి. జోసపు కవి

అతులిత సాహసాంకుడ , వహంకృతి దూరుడ , వాంధ్ర సత్కవి
ప్రతతికి జీవ గట్టి , వతి పావన వంశ సముద్భ వుండ , వా
శ్రితజన కల్ప భూజుడ , వశిందమశీల సమంచి తుండ , వా
యతనుత కావ్యక ర్తవును నగ్ర గురుండవు భీమనాగ్రజా !

— అన్నాజీ శర్మ

16

నిబ్బరమైన ఆశయము , నిద్దములైన తలంపు మంపులున్
జొబ్బిల , తీరుతీయములు జొ త్తిల , బంగరుకైత పూతలన్
కబ్బములందు నించితి నిగారపు కీరితి చేదుకొంటివే
గొబ్బున బోయి భీమకవి ! కొమ్మిక తీయని పూలకానుకల్ .

— కోటు సీతారామ శర్మ

నీవు నోచిన నోములు నిజము లగుచు
అపర వాల్మీకి కవివైతి వాంధ్రు లందు ,
సార్థకంబయ్యె నీ జన్మ క్ష్మాతలమున ,
బోయి వంశంబు శోభించె , భువి తరించె .

సూత పురాణము వ్రాసిన
ఖ్యాతిని శ్రీత్రిపురనేని కవిరాజు గోనన్
మాతంగి ప్రేమ గాథను
ప్రీతి రచించిన యశమ్ము భీమన కబ్బెన్ !

ఏక జాతీయతను ప్రోత్సాహించు ప్రభుత
కులము లనెడి కుధ్యంబుల కూలద్రోయ
రాగవాశిష్ఠ మనెడి గ్రంథమును సతము
మంచి పనిముట్టుగా ప్రయోగించుకొనుత !

- జి. జె. సామ్యూల్ కవి

(భీమన్నపై శ్రీ సౌమ్యాలుగారు వ్రాసిన అనేక పద్యగుచ్ఛాల నుండి.)

17

శ్రీ బోయి భీమన్న ప్రధానముగ ప్రకృతి కవియని చెప్ప నొప్పను. ప్రకృతి దృశ్యములను కథానుకూలమైన ఉత్ప్రేక్షలు కల్పించుటకు పూర్వ కవు లుపయోగించుచుండిరి. ఆధునికకవి ప్రకృతి దృశ్యములను వానియందు నిసర్గమైన సౌందర్యమును, అకృత్రిమత్వమును ప్రకటించుటకే వర్ణించును. సృష్టి వెనుక నున్న దివ్య శిల్పియొక్క అనంత వైవిధ్య పూరిత కళా ఖండములనుగా అధునిక కవి వానిని సందర్శించును. బోయి భీమన్నగారి కావ్య కుసుమములలో ఈ భావము నాకు బహుధా గోచరించినది. దివ్య సౌదర్య భావనతోపాటు ప్రకృతి దృశ్యములందు అపూర్వ సందేశ గ్రహణ నైపుణి కూడ భీమన్నగారి విశిష్ట లక్షణము. ఈయన ప్రకృతి తత్వ చింతన యందు సిద్ధహస్తుడగు చున్నాడు. భగవంతుని చిత్రళ మనయందే యుండగా అన్య స్థలములయందు పరిభ్రమించుట అజ్ఞతయని ఈ కవి సముచితముగా పల్కినాడు. "తృణ పుష్పము అను ఖండికలో

నీవలె నేను కూడ పయనించితి, భావన మాత్రమౌచు బ్బం
దావన రాసవేదులకు, నందన వీధులకున్; సమస్త వి
శ్వావధులెక్కి, వాని పరమార్థములన్ గొని చొక్కినాను నా
దైవము నా యెడందనె సదా సుఖ నిద్రను దాగి యుండగా.

ఈ కవి వినయపరుడు. ద్వేషము, అసూయ ఈయన మృదు స్వభావమునకు విరుద్ధములు. కుల గర్వముచే ఇతరుల మనసు నొప్పించువారిని కూడ భీమన్న ద్వేషింపడు. వారికిట్లు మృదువుగ సమాధానమిచ్చును.

ఏ కులమంచు నన్ను వివరింపుల గూడిన కుంటి ప్రశ్నలన్
వ్యాకుల పెట్టబోకు డది వ్యర్థము ; లోకపు మంచి చెడ్డలన్
దూకియు మున్గ కుండ నిటు దూరములన్ బడి వచ్చినాడ ; ఈ
యాకృతి నేమి కల్గు ; హృదయాకృతి జూచి సమాద రింపరే"

భీమన్నగారి కవిత్వము ధ్వని ప్రధానము —

గది గది కొక సుందర దీపం
అవి కలిసినదే నీ రూపం
తన్మంగళ మహా 'కళారాధనలో'
పొంగిన దిదినా హృదయం .

ప్రతి దినము నందును పరమాత్మ చిత్కళా సాక్షాత్కారమే ఈ కవికి భాసించు ననుట కిది వ్యంగ్యోక్తి .

జీవిత విమర్శనమే కవిత్వమైనచో ఇది భీమన్న గారి కవిత్వము నందు పుష్కలముగనే యున్నది .

తోడి నెచ్చెలు లంతంత దూర మీది
అంతు గానక కడు వెర గందినారు ,
అడ్డపడిపోయినారు ఒడ్డందు టొకటే
లక్ష్యమైనట్టు లెటులో చెల్లా చెదురుగ .

జీవితములో సౌఖ్యస్థానమును చేరుటకే పలువుర తాపత్రయము . మహా కవి జీవిత వాహినిలో నిరంతర యాత్రనే కోరుకొనును . ఇది వివేకానంద స్వామి యనుభవము కూడ .

18

శ్రీమయ పత్రముల్ జడలు చెల్వగు నభ్ర తరంగిణీ పయ
స్తోమము పుష్పముల్ ఫలము సోముఁడు నై విలసిల్లి పార్వతీ
కోమల దేహయష్టి పెనగొన్న నివాసము కల్పవల్లి మా
భీమన సత్కవీంద్రుల కభీష్ట ఫలప్రతి పాది గావుతన్ .

ఒక్క శబ్దమె దీపమై పెక్కుగతుల
హృదయ కుహరంబు నది వెలిగించు ననిన
దీపసభ యాంధ్రలోక హృద్దీపకమయి
వెలుఁగఁ జేయదె వాఙ్మయ విశ్వజగతి .

దీప సభ చేత కవితా
శ్రీ పరిణితిఁజెంది కావ్య సిద్ధుండయ్యెన్
ఈ పయిని సాత్మ విద్యా
శ్రీ పరిణితిఁ జెంది యాత్మ సిద్ధుండగుటన్ .

ప్రథిత కవిత్వ తత్త్వగస బంధురభావ భవాభి రామ లై
యధికృతమైన జ్ఞాన కళికా కృతులౌ భవదీయ సత్కృతుల్
మధురతరాంధ్ర భారతికి మంగళ గీతికలై సముల్లస
న్మధుర తరాంధ్ర విశ్వమయ మంగళ దీపికలై వెలుంగుతన్ .

చిల్లీలామృత సాహితీ మధురస శ్రీమించు భీమన్న వా
గ్వల్లీ సంజనితంబు కావ్య కుసుమాంకం బంకితం బందితో
కల్లూరన్వయ సుబ్బరాయమణి ! యాకల్పంబుగా త్వద్యశో
వల్లీ సంజనిత ప్రసూనములు సంవాసించు నాంధ్రావనిన్ .

—ఆచార్య నిడదవోలు వెంకటరావు

19

కన్నెతనంపుఁ బ్రాయమునఁ గన్నుల నన్నులు మీటు కబ్బపుం
గన్నెల డెబ్బ దెన్నదులఁ గంఠమునంగొని సాగుచున్న భీ
మన్నను బోల దుర్బలుల కౌనటె ? దక్షిణ నాయకుండ నా
నెన్నికఁ గాంచె దక్షిణ కవీంద్రులఁ దుల్యుర సత్ప్రభావనన్ .

ఒక్కొక పద్యమొక్క సరసోజ్జ్వల కావ్యమె , యే తదీయ స
మ్యక్కృతులందు శబ్దముల మార్దవమున్ రసభావ పుష్టి నా
నెక్కడ లోపమందక యభీప్సిత సిద్ధినిఁగూర్చి సర్వ దా
పెక్కు సహృత్క పీ ణ్ణికర భృంగములన్ భ్రమియింపఁ జేసెడిన్ .

ఖండంబుల్ కృతు లైనసున్ జగతిఁ బ్రజ్ఞా ధుర్య మేధా స్ఫుర
త్పాండిత్య ప్రతిభాభి శోభిత బుధోత్తంసుల్ కవీద్వర్యు లు
ద్దండుల్ తాండవకేళి సల్పుదురు మోదంబంది యభ్రాంతమున్
ఖండేందు ప్రభలీను భీముకృతు లాకర్ణించుచుం బాడుచున్ .

రసమలంకృతు లానంద రసముఁ గూర్చు
భావములు వ్యంగ్య వాసనా బలముఁ గూర్చు
నర్థ మనోజ్ఞోక్తి వక్రోక్తి సార్థ మగుచు
మనసుఁ జొక్కింపఁ జేయు భీమన్న కృతుల .

సలలిత భీమన కావ్యము
లిల సాచంద్రార్కతార మింపు లొలుకుచున్
గళ లూరెడు భావ పరీ
మళముల కాసించుఁగాత మహి నెల్లడన్ .

—కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

20

ఈ వాళే ఏక బిగిన "అనాది కోస నుంచి అనంతత్వంలోకి" క్రమంగా జాగ్రత్తగా - తాపీగా - హాయిగా ప్రయాణం సాగించాను. అంటే సాహసించి దూకలేను ఒక్కసారిగా మీ వెంట. దీప సభలో లోకవృత్తం ఎంతగా ప్రదర్శించారో అంత కంటె లక్షరెట్లు అధికంగా ఇందులో అంతర్లోక వృత్తి ప్రదర్శించారు. మీ భావనా నంతత్వం ఒక్కొక్కచో రవీంద్రుని స్మృతికితెస్తూ వున్నది. మీరెంతైనా అధ్వైతులే. మీరిందులో వాడిన ఉపమా సామగ్రి చాల వరకు సరిక్రొత్తది. ప్రత్యేకం అధ్యయనం చేయదగ్గది. మీరు 'నేకధారగా' ఒక మహా కావ్యం వ్రాయదగిన సమయం ఆసన్నమైందని విశ్వసిస్తున్నాను; 'ద్వైధీలీల'కు ప్రత్యేకంగా వ్యాఖ్యానం చాలా అవసరం. 'రైలు ప్రయాణం' చిత్రమహనీయంగా వుంది. 'ఒక జత దుస్తులు' లోకోత్తరమైన కల్పన ఆ "పేరు పలకడం కోసం ఇంత సాహిత్యం చదువుకొన్న" మీకు నమో

వాక్కులు · వాసక సజ్జిక భావనా వర్తిగా వుంది . కార్డు అయిపోతున్నది. కవరు వ్రాయాల్సింది . మళ్ళి వ్రాస్తాను .

డా. కేతవరపు వేంకట రామకోటి శాస్త్రి

21

అన్నవు నన్నువంటి కవు లందరకున్ పతిత ప్రజాళియ
భ్యున్నతికై యహర్నిశలు పోరెడి నీ కవితామరంద సం
పన్నత కంజలించెదను ప్రస్తుత మందెదు గౌరవంబు భీ
మన్న మహాకవీ ! హరిజనాళికి గౌరవ మంచు నెంచెదన్ .

ఆధునికాంధ్ర సత్కవులయందు ప్రసిద్ధుడవీవు , నిత్యసం
బాధితులైన మానవ సమస్యలు తీర్చగలట్టి పద్ధతుల్
శోధనచేసి వ్రాసితివి ఋద్ధసువర్ణ కవిత్వమున్ ప్రజా
రాధన కర్హమౌఘనత నందితి వయ్యా ! మహా మనీషివై .

పద్మశ్రీ నీ కవితా
సద్మముపై నెగురు జెండ , సరసరచనలో
ఛద్మము నెరుగని కవితా
పద్మమునకు నీపు కమల బాంధవుడవుగా !

దాని బసవయ్య

22

రెండు రోజు లయినవి . అనాది కొసనుంచి అనంతత్వంలోకి' సమగ్రముగా పఠించాను. ఉన్నతోన్నతమై , యుజ్జ్వల కళాకాంతి ప్రజ్వలితమై యొప్పిన మీ రమణీయ కమనీయ సాహితీ గాంగేయమున కొకరి అభిప్రాయమేమి ?

మీరు ' అనాది కొసనుంచి అనంతత్వంలోకి ' సుఖముగా నడుగిడినారు . అ య్యనాదికి పునాది సంగతి నే నెరుగను . ఎంత మధుర కావ్యము మీది . ఎంత మంజుల శబ్దజాలరాశులు మీ కమ్మని కావ్య ప్రబంధములో నిబిడీకృతమై

యున్నవి. కేవలము ఇదియొక అమృత గుళిక. ఈ లేఖ వ్రాయు వేళను గూడ మీ గ్రంథము నా కరములం దున్నది. ప్రతి రచనా సంకలన సాహిత్య సంచికను నాకు పంపుచున్నందుకు నా ప్రత్యేకపు జే జేలు. ఇంతకు మీరు అదృష్ట జాతకులు. ఒక రిచ్చినదిగాదు. పరమేశ్వరాను గ్రహ మది.

జ్ఞానానందకవి

23

బోయి కులాన బుట్టి కులపున్ విధు లన్నిటి సున్నజుట్టి రా
మాయణగాథ బట్టి యసమాన కవిత్వపు సృష్టి సృష్టిలో
నే యలమండు సిల్పె నతడే భవదీయ కులాధినేతగా
నేయది కైత దుర్లభమొ యీవ దలంచిన, బోయి భీమనా ॥

హరిజనులందు నందలి మతాన్యుల సంస్కృతభాష నాంధ్రపుం
దెరవుల నేర్పుగాంచిన సుధీవరు లేబదిమంది మించియుం
డిరె ? కవితారసజ్ఞులు గణింపగ లేరు బదార్గురైన కా
వ్య రచయితల్ కనంబడ రొకార్గురు, ధన్యుడ వీవు భీమనా॥

రచనలంకేమి లె మ్మెవియొ వ్రాసిరి పందకు పైన మించి కా
వ్యచతురు లెందరెందరొ, సెబా సన నైనవి కొద్ది, కొన్నిటన్
బ్రచురణమైనగా దయిన వాటి యధార్థపు టర్థమేదియో
యచట స్ఫురించ దవ్వియె జయంబున ధన్యుడనీవు భీమనా॥

ఏ యసమానకావ్యము రచించిన నాటికి నేటి కాది రా
మాయణమున్ బురాణములె మాతృక లాపయి పోత భారతా
మ్నాయమె దిక్కు- నెట్టి యధునాతన వీర కథా విధానమా
చాయల నుండ దన్న నుడి జంపిన ధన్యుడవీవు భీమనా॥

హరిజనులన్న ద్రావిడులె యంచును, ద్రాపడు లాది నార్యనా
గరకులు నా చమత్కృతి సగమ్ము చరిత్ర యొకింత దెచ్చి ము
ప్పిరి నిడినావు సత్యమను పేరిట నయ్యది యెట్టులున్న నీ
తరచిన చేతి పట్టుదల తన్పెడు నెల్లర బోయి భీమనా॥

కులమున కడ్డుగోడలఁ బగుల్ప సృజించి తరుంధతీ వసి
ష్ఠుల జత దృశ్యరూపక పటుత్వ మభేద్యముగాగ నూత్నపం
థల రచియించి తద్ది కులతత్వ వినాశనమార్గ మొండెనా
సలిపితి పెద్ద చిన్న కులజాతుల పెండ్లి , జయమ్ము భీమనా॥

పలుకగలేని దివ్వెల సభాస్థలి జేరిచి నూత్నభంగి నీ
కలియుగచిత్ర ఘోరనిజమట్టములన్ వెలిదీసి విప్పి చూ
డ్కుల మును నిల్పినాడ , వనఁగూడదు కాని కులాల నున్న పం
కిలము విదల్చినావు - కడిగింపుము ధన్యుఁడవౌదు భీమనా॥

మృదువగుశైలి , మట్టుప్రభు మించిన మంజుల శబ్దపుంజమున్
బొదివిన దివ్యభావముల పూతవినీతుల పూలదండ నీ
యది మధుగీత , కావ్యకుసుమావళి యట్టిదె , నీదు గేయముల్
చదివినఁ బుల్కరించు సకలమ్మున ధన్యుఁడ వీవు భీమనా॥

ఇది తిలకించి స్వాగతము నిచ్చెది యాంధ్రనలంద నీకు , నీ
యది యసమానభాగ్యము త్వదన్యుల కందని కల్పవృక్షపున్
దుది కుసుమమ్ము , దీని దయతో గ్రహియింపుము , వాదవాదలన్
బదుగుర వాసికెక్కుము , నితాంతయశమ్మును గొమ్ము భీమనా॥

డా. అడుసుమల్లి నారాయణరావు

24

మీరు పంపిన పుస్తకం అందింది . కార్ఖానాలో విపరీతంగా పనిఉండటం వల్ల పుస్తకం సాంతం చదవలేక పోయాను . అయితే ఈ కింది చరణాలు చాలు మీ వ్యక్తిత్వాన్ని రుజువు చేయడానికి మరో సారి !

"విశ్వ వస్తు ప్రదర్శనంలో
స్త్రీల ప్రత్యేక దినంలా వుంది నభం "
"పులిలా శాలువా కప్పుకుంటే పండితుడు
ఈత రుప్పలా తలపెంచుకుంటే కవి

చెక్కిన శిలలా సూటు వేసుకుంటే అధికారి
ఈ వేషాలు మనం వేసుకున్నవి.....
"యౌవనం, సౌందర్యం, కళ, ఆనందం
మనిషికి పరమేశ్వరు డిచ్చిన సమస్తం"

ఇవాళ రాత్రి ఓపిగ్గా కూచుని అంతా చదివి నా విపులసమీక్ష మీకు అంద చేస్తాను.

ఏమైనా, ఈ స్వేచ్ఛాగీతికలు మనల్ని మరీ దగ్గరకు తీసుకొచ్చాయి.

"గోపాల చక్రవర్తి"

25

మీ గేయ సంపుటి 'అనాది కొసనుంచి అనం తత్వంలోకి' మా స్టాఫ్ మెంబర్స్ దగ్గర చదివాను. అందరూ చాలా మెచ్చుకొన్నారు. ఇటీవల ఇటు వంటి మధురమైన కవిత్వం వినలేదని అన్నారు. 'మనోరథం', 'రైలు ప్రయాణం', 'పుట్టు పూర్వోత్తరాలు', 'పూదోట పురిటి గదిలో', అవతలి ఒడ్డుకు, 'సౌఖ్య రహస్యం', 'దివారాత్రులు' ఒక టేమిటి—ప్రతి ఒక్క దానిలో ఏదో ప్రత్యేకత కనబడుతున్నదని ప్రశంసించారు. చెప్పే విధానంలో నూత్నత్వం, దానికి మీరు ఏరుకున్న పదజాలం, ఆ పదజాలంలోని విసురు, ఆ విసురులోని ఉద్వేగం అంతా వర్ణింప నలవికానిదిగా ఉన్నదన్నారు. ప్రస్తుతల గేయ కవిత్వం కృశించి పోయిన తరంగిణిలా ఉంటే, మీ గేయ కావ్యం వలసిన హంగులన్నీ కలిసి కూలంకషంగా ప్రవహిస్తున్న నదిలా ఉన్నదన్నారు.

వారి భావాల్ని నేను వ్రాస్తున్నానే గాని నాకు పైవాని కంటే కొన్ని విలక్షణమైన అభిప్రాయాలు ఉన్నవి. ఒక్కటి మాత్రం యదార్థం. నేటి బీటలువారిన తెలుగు ఊషరక్షేత్రంలో మీ సాహిత్యం ఎడతెగని జడివానలాంటి ప్రభావాన్ని కలిగిస్తుందని నా అభిప్రాయం. ఈసారి వ్రాసే ఉత్తరంలో ఇంకా నా అభిప్రాయాల్ని వ్యక్తం చేయడానికి ప్రయత్నిస్తాను.

"భాను"

26

వేములవాడ భీమకవి పీరుడు నాడు - విశాల పాండితీ
రేమురి ధార్మికా చరణ శిష్ట జగత్తును నిల్పినాడు ; దా

గోముగ బోయి భీమ కవి కోకిల విప్లవ భావదీప్తితో
ప్రేమ ప్రపూత విశ్వమును పేరొక్కాని నేడు తదాఖ్య నొప్పెడున్.

ఓ కవితా ప్రవంతి ! అమృతోల్లసి తార్ద్ర సితాభ్ర సంచయా
సోక సుకావ్య జీవన ! ! విబుద్ధ రసోర్మిక లందు భావకుల్
చేకొని పూర్ణమోదము, విశిష్ట కవిత్వ విహారఖేలనల్
తేకువ మీర సల్పిరి త్వదీయ సుకావ్య సరస్సులందునన్ .

మృదు పద "మధు గీత" తతుల్
"మధు బాలా" హావభావ మంజుల రీతుల్
పొదలగ "దీప సిఖ" నుతుల్
పదపడి సమకూర్చె భీమ వరకవి క్రైతల్.

కవితా పూజలు సల్పుటల్ – కొనుట, సంక్రాంతి ప్రవేశమ్మునన్
మివులన్ క్రాంతి ప్రశాంతి దాంతి యగు సామీచీ న సత్కారముల్,
సవురుల్ చేరెను నేడు సవ్యముగ సత్సాహిత్య సన్మాన సం
భవ సౌభాగ్య మహమ్ము హేతువుగ హేవాక చ్ఛవీ ! సత్కవీ ! !

నిబ్బరమైన ఆశయము, నిద్ధములైన తలంపు మంపులున్
జొబ్బిల, తీరు తీయములు జొత్తిల, బంగరు క్రైత పూతలన్
కబ్బములందు నించితి నిగారపు కీరితి చేదుకొంటివే
గొబ్బున బోయి భీమ కవి ! కొమ్మిక తీయని పూల కానుకల్ .

(ఆంధ్ర నలంద 16-1-1960 శనివారమున శ్రీ బోయి భీమన్న గారికి చేసిన సన్మాన సంబరమున సమర్పిత పంచ సూనము)

కోట సీతారామ శర్మ

27

స్నేహశీలీ, మహాకవీ !, ప్రతిభాన్వితా !, రసపిపాసీ! ఆర్ద్రహృదయా
అభ్యుదయ గామీ ! మార్గ దర్శకా !

మీ భావనా శక్తికి, రచనా వైదుష్యానికి కవితా మాధుర్యాన్ని మేళవించి దళిత జాతుల నుత్తేజ పరిచే ప్రభోదాత్మక రచనలు సాగించి మా కెల్లప్పుడు మార్గ దర్శకుల గుదురు గాక .

ఎన్నటికీ వాడని మీ కావ్య కళా కుసుమాలు ముందు తరాల వారికి ఆదర్శంగా నిలిచి కళా జగత్తులో వెలుగుబాటలై వర్ధిల్లు గాక .

(ఆం. ప్ర. నిమ్నజాతి సంక్షేమ సంఘం,
శ్రీశైలం ప్రాంచి వారి సన్మాన పత్రం నుంచి , 24–5–1970)

28

కాంచి నాడను నీదు ఘనతర వ్యాసముల్
దీన బంధ్వాది పత్రికల యందు
తెలిసి కొంటిని భవదీయ కావ్య ప్రజ్ఞ
పాలేరు నాటక పఠన వలన
దర్శించితిని నీ విమర్శనా పటి మంబు
పూని ఆంధ్రప్రభ ముఖము నందు
కనుగొంటి నీ సంస్కరణ వాంఛ నీ జ్ఞాన
పదుని లేఖల నెల్ల చదివి యుంట

నీదు కావ్య కుసుమ ఘనామోద మాను
మాత్రమున పొందినాడ మైమర పొకింత
తెలుగు పలుకుల వెలది కందించు నీదు
లలిత భూషల గనుగొన పులక లొదవె .

లోలభట్టు శివరామకృష్ణంరాజు

29

"నేనానంద వాదిని . కవితకు ఆనందమే పరమార్థం . మేల్కొన్న శరీరానికి అన్నం , పానం వలెనే మేల్కొన్న ఆత్మకు వేదాంతం , కవిత్వం ఆవసరం" అని తన కావ్య సిద్ధాంతాన్ని విస్పష్టంగా లోకానికి చాటిన రస పవక్త శ్రీ బోయి భీమన్న .

భీమన్న గారికి స్ఫూర్తి లోకం నుంచే వస్తుంది. లోకంలోని వివిధ ప్రకృతులే కావ్యసుందరులై రూపొందుతాయి. కావ్యగత పాత్రలై సంచలిస్తాయి. ఇదే సజీవ మయిన రచనా పద్ధతి. లోకానికి ప్రతిబింబంగా కృతులు దర్శన మీయడ మనే ఆర్ష దృక్పథం వీరికి జన్మతః లభించిన సంస్కార విశేషం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆదర్శ శృంగారమూ, ఆధ్యాత్మికత్వమూ కలిసి రూపొందిన కమనీయ కావ్య కళా వైభవ విలసితమూర్తి శ్రీ బోయి భీమన్న.

(దార్శనిక కవి బోయి భీమన్న అనే శీర్షికతో "బహుజన" డిసెంబరు 24, 1962 నాటి పత్రికలో డా. ముదిగొండ శివప్రసాద్ గారు వ్రాసిన వ్యాసంనుంచి.)

30

మత్తేభముల నాయ కత్వంపు ధీరుడా
మహిమ సిదేనన్న మాన్య భీమన్న
ప్రతిన కంకణధారి ప్రతియత్నముకు దారి
కోటి కోటుల గోట మీటి తన్న
సాహిత్య సంస్థల సహకార దాతవై
శాశ్వతంబగు కీర్తిగంటి వన్న
మీ గ్రంథ బాహుళ్యమొక కనకమేరువై
షేకుస్పియర్ స్మృతినిదెచ్చునన్న

చిక్కదనమున జుక్కవై చెంత జేరి
వెలయు వెనుతోడు నీడ మిత్రుల దళంబు
కరువు కానిది సకల సౌభాగ్య కలిమి
చెపుమయా ఏమి యింకేమి వలయు నీకు.

గాలి రత్నం, 1960

31

ప్రకృతి సౌందర్యోపాసకులయి, క్రమ కవితా విలాస భాసురులై, బహు గ్రంథ ప్రణేతలై, అనేక సారస్వత సంస్థా సన్మానితులై, ఆధ్యాత్మిక దర్శన

సంకలితులై, రసాద్వైతాను భూతి మహితులై, వాఙ్మయ సేవా తత్పరులయిన యీ బోయి భీమన్నగారిని తాము కళాప్రపూర్ణ బిరుదాంకితులను గావింప వేడు చున్నాను.

("కళాప్రపూర్ణ" బిరుద ప్రదానపు సైటేషను నుంచి, 17 - 1 - 1971)

32

సంగ రహిత మగు వృత్తిని
గాంగేయా న్వాయ భీమకవి విరచించెన్
వ్యంగ్యాంగాంగీ పద హృద
యంగమముగ పద్యమొక టు పాఖ్యానముగన్!

రాజన్నావధాని, మంతెన, 1969

శ్రీ గమ్యము పూరుషుడే,
రాగాభిముఖమె విశాఖ, రతి కీరితివై
భోగము నాయువు వడయుము
వేగళబ్రపూర్ణ, బోయి భీమన్న, కవీ!

చక్రవర్తుల వెంకట అప్పలాచార్యులు, 1971

33

జీవన విధానంలో భీమన్నకూ మామూలు కవులకూ హస్తి మశకాంతరం వుందనే చెప్పాలి. సౌందర్యాన్వేషణలో సాధనలో తపించి, మైమరచిపోయే భీమన్నలో కొంత బాహ్య విశృంఖలత కొట్ట వచ్చినట్టు కాన్పిస్తున్నప్పటికీ, అది ఒకొక్క వ్యక్తి ప్రత్యేక లక్షణము.

జీవితాన్ని సాహిత్యంతో, సాహిత్యాన్ని జీవితంతో పెనవేసుకుని పుర్తి గమిస్తున్న శృంగార కవి బోయి భీమన్న.

(నిష్ఠగా సాహితీ సృష్టికి అంకితమైన రసైక జిజ్ఞాసా జీవి-బోయి భీమన్న అనే శీర్షికతో "గోలకొండ" 20-12-1964 నాటి పత్రికలో బాసాని సుదర్శనరెడ్డి గారు వ్రాసిన సుదీర్ఘ వ్యాసం నుంచి)

34

శ్రీ వాణి మణి మేఖలాంచిత మృదుశ్రీ ఘంటికా ఘల్ఘులా
రావ శ్రావ్యతరంగ మంజుకవితా రమ్య ప్రసన్నోల్ల స
ద్భావోదా త్త మహత్కళా చతుర ! సిద్ధాంత ప్రబోధోరు వి
ద్యావార్ధీ ! విజయోస్తు ! భీమన కవీంద్రా ! మంగళం బయ్యెడిన్ .

స్వాగత మో రసాభ్యుదయభావ నవీన కళాప్రపూర్ణ ! సు
స్వాగతమో యపూర్వ రసవత్కవితా రచనా ధురీణ ! మా
స్వాగత, మాంధ్రలోక కృతభాగ్య తపఃపలమా ! మహోదయ
శ్రీ గమకించు లాంఛన విశిష్ట సముద్యమమా ! జయం బగున్ !

ప్రవిమల స్వర్ణదీ రంగ దుత్తుంగ భంగానీకముల నోల లాడినట్లు
శిఖరాగ్ర గళదురు శీతల మధుసుధాశీకర స్నానముల్ చేసినట్లు
కామితార్థప్రద కల్పలతా డోలికల హాయిగా నూగగ గలిగినట్లు
కన దమందానందకర ఘనాఘనపీఠి నభ్రంబుపై దేలియాడినట్లు
తావక కృతి పఠన మిచ్చె భావుకులకు,
పాఠకులకు, రసజ్ఞతా వారసులకు
నవ్యచైతన్య దీప్తి, ఆనందతృప్తి,
ఘనయశఃపూర్ణ చంద్ర భీమన కవీంద్ర !

కులమో, వర్గమొ, స్వీయజాతి మతమో, కూర్మిన్ విడంబింపగా
వలెనంచున్ వచియించు నల్పులకు, విశ్వశ్రేయపుం గంధముల్
చిలుకం జాలు ననేక కావ్యరచనల్ సిద్ధింపగాజేసి, యు
జ్జ్వలతా మానవతా సమత్వవిధు లాశాసించు నిన్నెంచెదన్ .

తన సంసారము, నర్థబుద్ధి, స్వహిత ధ్యానైక చింతా లవ
మ్మనగా బోవక, రేబవల్ "సుకవితా యద్యస్తి రాజ్యేన కి"
మ్మను నాదర్శము నిండు వెన్నెలలు గాయన్, సాహితీ క్షేత్ర నూ
తన సంపత్ఫలమాస చేయు కవులే ధన్యుల్ యశఃకాయులున్.

(మహమ్మద్ హుసేన్, ఏలూరు, 24–1–71)

35

కవీ!, మహాకవీ!, పీఠికా పీఠాధిపతీ!, కళా ప్రపూర్ణా!, ప్రగతి శీలీ! ప్రజాకవీ!, కవిఋషీ!, కళా ప్రపూర్ణా! శ్రీ బోయి భీమన్నా! చిరాయు వగుమన్నా! .....

(1. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం 2. తూర్పు గోదావరిజిల్లా యువజన సమాఖ్య 3. ఇండియన్ క్రిష్టియన్ ఆసోసియేషన్ 4. అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీ సొసైటీ 5. కాకినాడ మార్కెట్ వర్తక యూనియన్ 6. విద్యార్థి రిపబ్లికన్ ఫెడరేషన్ 7. విజయజ్యోతి నికేతన్ 8 P. & T. ఎంప్లాయీస్ ఫెడరేషన్ 9. తూర్పు గోదావరిజిల్లా రచయితల సంఘం 10. స్టూడెంట్సు ఆసోసియేషన్ 11. వివేకవాణీ ప్రచారసంఘ్ 12. సిటిజన్స్ ఆఫ్ కాకినాడ వారు కాకినాడ సన్మానంలో ఇచ్చిన పత్రం నుంచి, 21-1-71)

36

పాలేరు వెంకన్న పట్టభద్రుండయి, ప్రభువయి - ఖామందు పట్టి నేలె!
కూలి రాజై సాంఘిక కాలవాలం బగు అవినీతి నెదిరించి యవని గ్రాలె!
ఇంటింట దీపాలు, యిల సమావేశమై - జగతి ప్రగతిం గూర్చిచర్చఁజేసె!
గీత లొక్కొకటి సాంస్కృతిక సంసార నిర్ణితమ్ములై మధుగీత యయ్యె!

భువి నిరాశాంధ కారానఁ బొగులు దళిత
జీవులకు, దివ్యజ్యోతి - విశిష్టపండి
తాళికి గురుత్వకల్పంబు - తావక కృతి
మధుర నవజీవచంద్ర! భీమన కవీంద్ర!

మోహిని దేవతాళికి నమోఘముగా సుధ పంచినట్లు - సం
దేహవిమోహ మూఢతమతిన్ జెడు నిమ్ము ల గావ విశ్వస
మ్మోహనమైన ఖాటను తమోగతిఁ జీల్చగ "ధర్మయుద్ధమున్"
సాహస మొప్ప మా కిడితి - సతస్సవి చంద్రమ! బోయి భీమనా!

గుండెల్ దీసిన బంటువై నిలిచి, వాకున్‌గట్టి దుర్వాదులన్
బెండుల్ వోలెను తేలవైచి, పటుపెం పేపారగా నొప్పు నీ
పాండిత్యప్రభ ఆంధ్రదేశమున శోభన్ బొందగా గల్గుతన్
దండి ప్రాభవమూర్తి! భీమనకవీ! ధర్మమ్ముకై పోరగన్.

కబ్బము లొక్కొకొక్కటి, మృగత్వము నుండి మనుష్యతన్ గనన్
ప్రబ్బిలఁజేయఁ జేసితివి! భాసుర సాహితిఁబేర్చి, స్వార్థతన్
పబ్బము బాపుకోఁదలచు పద్ధతిగాక! "కళాప్రపూర్ణ"పే
రబ్బుట యబ్బురంబె! సరసాంధ్ర కవీంద్రమ! బోయి భీమనా!

వంకర డొంకదారుల క వన్యముఁ జేసినమీద, మీద యా
సంకర సెంటి మెంటలు వశంకరు లొయ్యన! సన్న సన్నగా
శంకలు మాన్ప వ్యాఖ్యల మజా! జనతామతి బోవ జేయ న
ట్లుంకిలి లేని నీ కవిత కఁకిత మయ్యె "కళాప్రపూర్ణ" మా!

దురితలతా లవిత్ర మను దుగ్గమతత్వ కవిత్వ మాపి - ఆ
దురితుల మచ్చమాపగల దుష్టత నాపెడి సత్కవిత్వమే
ధర నిలదీసి ప్రాసిన, యథార్థము జాతికి మేలగున్! భవత్
కరకల లేఖినీ రచిత కావ్యము లెంత హితాలు భీమనా!

స్తవనీయంబు భవద్విధానము, మనస్తాపంబు తత్ హైందవై
దవ సన్మాన విలాస వైఖరులు, తాతల్ వ్యాసముఖ్యుల్ ప్రలో
భ వశాత్మన్ కుటిలోగ్ర వర్ణవిధి విప్రత్వంబుకై నిమ్న జా
తి వధన్ జేసిరి; మా యదృష్టమున, నీతిన్ దప్పకన్ సి కవి
త్వ వధూటిన్ సమతన్ వరించితివిగా! ధర్మాత్మ శ్రీ భీమనా!

అరయంగా! భవదీయ లేఖిని భవిష్యత్కాల కాలాభ కిం
కర వర్ణాశ్రమ ధూమరేఖయయి, దిక్కై మానవత్వంబునన్
స్థిరమై యీ భువి బొల్చుదాక, కడు వృద్ధింబొందుఁ గాకేమి? సత్
కరుణాపాత్ర కళాప్రపూర్ణ బిరుదాంకా! భీమనా! సత్కవీ!

"మహానాటికవి" వేమన్న

ఏలూరు, 24-1-71.

37

తరుణ మెరింగి యోగ్యమగు దారిని చూపగ వెన్కపడ్డయ
న్నరుల వివేకపూర్ణ నయనంబుల ద్వారము విప్పి జ్ఞానసుం
దరి నటనావిశేషములఁదన్పెడు దేవుడు బోయవంశ భా
స్కర కవిమాన్య భీమన యశస్సును నల్లడ వెల్లజేయుతన్ .

సుమ మయ సౌరభ ప్రభవసూక్తి మరందము జాలువార్చి హృ
త్ప్రముదము తెల్లమౌనటు భవత్కవితా ప్రణయమ్ము లోక ధ
ర్మము గురితించుచున్ రసికమార్గము లారసి నేడు మా సమా
జము సమకూర్చు స్వల్పమగు సత్కృతులం గొనుమో మహాకవీ !

ప్రకృతిలో వంచించు వికృతి నుద్దేశించి
భావ్యమ్ము రచియించు భావశుద్ధి
మానవాత్మలకున్న జ్ఞాన గాంభీర్యంబు
పరికించి వెలకట్టు భవ్యశుద్ధి
రసికతాసౌజన్య విసరమున్ గుర్తించి
కావ్యభాషల నించు శ్రావ్యరక్తి
వలపు బల్కుల లోన దలపు బుల్కుల సొంపు
నింపుగా బొందించు నియమయుక్తి

దీన జనులపట్ల సానుభూతి వేలార్చు
తరుణ కరుణ నవ్యసరణి దెల్పి
కుల్కు నడలశోభ లొల్కించు భీమన్న
కావ్యశైలి లోక గణ్య మయ్యె .

స్థిర దామోదర వంశ వర్యుఁడగు సంజీవయ్య యధ్యక్షుడై
యరుదేరన్ సభ సత్కృతింగొనెడు భీమన్నా ! భవత్కావ్యసుం
దరి మాచిత్తము నాచికొన్నయది శ్రద్ధాప్రేమ సంధించి య
బ్బురమౌ కీర్తి తెలుంగు భూముల ప్రజామోదమ్ము చేకూర్చుచున్ .

జాతికి నీతిగూర్చు సరస ప్రతిభామయ కావ్య మల్లి మా
ప్రీతికి రీతినేర్పు కవి భీమన ! వందన మయ్య నీమహా
ఖ్యాతికిఁబూజ్యుఁడైన సచివాగ్రణి దీవన లందుమయ్య మా
చేతము మోదమొంది వికసింపఁగఁబాడుమ భావగీతముల్ .

(శ్రీ ఇ. మాదన్న గారు చేసిన సన్మానంలో
షేక్ దావూద్ కవి , కర్నూలు .)

38

కవి , గ్రంథకర్త అయిన శ్రీ బోయి భీమన్నగారు వ్రాసిన "రాగవాసిష్ఠం" "హరిజనులు ఆర్యులే" అనే విషయాన్ని వెల్లడించడంకోసం రచించిన ఒక నాటకం . ఇందులో హరిజనకన్య అయిన అరుంధతిని బ్రాహ్మణుడైన వసిష్ఠుడు ప్రేమించి , ఇంచుక సంశయగ్రస్తుడై పడిన విరహవేదనను ఎంతో హృదయంగమంగా రసభరితమైన పద్యాలతో వర్ణించాడు . భారతదేశంలో అరుంధతి అనే పేరు వినని వారుండరు. వివాహంలో తాళి కట్టగానే "అత్రేర్యథా నసూయా స్యాద్వసిష్ఠస్యా ప్యరుంధతీ" అని నక్షత్ర దర్శనం చేయించడం అనూచానంగా వస్తున్నది . ఆ విధంగా ఆదర్శ దంపతులయిన అరుంధతీ వసిష్ఠుల వివాహగాథయే ఈ "రాగవాసిష్ఠం" .

యమునా నదీతీర ప్రాంతాలలోని వేదవనంలో అరుంధతి నివాసం . ఆమె అపురూప సౌందర్యరాశి . ఒకినాడు ఉదయం సూర్యున కర్ఘ్యమిస్తున్న అరుంధతిని వసిష్ఠుడు చూచి ప్రేమిస్తాడు . ఉభయులు పరస్పరాకర్షితు లవుతారు .

కాని ఆ తర్వాత ఆమె మాతంగ (మాల) కన్యక అని తెలిసి వసిష్ఠుడు కొంత సంశయిస్తాడు . చెప్పుడు మాటలకు లోనై వ్యాకుల పడతాడు . సంగతి తెలిసికొన్న అరుంధతి తపస్సులో తదేకంగా వుండిపోతుంది . చివరకు ఇద్దరికీ పార్వతీ శివులు స్వహస్తాలతో వివాహంచేస్తారు . సంతోషస్వాంతుడైన శివుడరుంధతికి ద్యోమండలంలో శాశ్వతంగా తారగా వెల్గొందునట్లు అనుగ్రహిస్తాడు. ఇదీ కథ .

గ్రంథం కంటె గ్రంథకర్త వ్రాసిన సుదీర్ఘ ప్రస్తావనయే చాల ముఖ్యమైనది . నిజంలో ప్రస్తావనలోని అంశానికి ఒక పూర్వోదాహరణను యిచ్చుటకయ్యే కథ కావలసివచ్చిందని చెప్పినా చెప్పవచ్చు .

ఆర్యుల పూర్వ స్థానం గురించి, యిప్పటి ఆ ప్రాంతాల పేర్లకు పూర్వపు ఆర్య ముసుల పేర్లకు గల సన్నిహితత్వాన్ని గురించి బహుచక్కగా ఉదహరించారు. ఉదాహరణకు అస్సీరియనులను అసురలుగనూ, సిరియనులను సురలుగనూ, కశ్యపముని పేరుకూ, కాస్పియన్ సముద్రం పేరుకూ ఉన్న సమీపాన్ని చర్చించారు. ప్రస్తావనలోని ఈ సుదీర్ఘమైన ఆర్యుల పూర్వ చరిత్ర చాల కుతూహలం కలిగించేదిగా వుంది.

అస్పృశ్యతా నిర్మూలనకై ఎందరో సంస్కర్తలు పనిచేశారు. ఎంతగానో కృషిచేశారు. ఈ అన్యాయాన్ని, అధర్మాన్ని సమూలంగా నాశనం చేయాలని త్రికరణశుద్ధిగా వాంఛించారు. అయినా ఈ మహమ్మారి ఇంకా భారత దేశంలో పోలేదు. కారణం?

వర్ణవిభజన ఎందుకొరకు ఎప్పుడు నిర్మింపబడినా అది ఆర్థిక పునాదుల పైన ఆధారపడి వుంది. మనుస్మృతిలోనే "శక్తే నాపిహి శూద్రేణ నకార్యో ధన సంచయః, శూద్రోపి ధన మాసాద్య బ్రాహ్మణానేవ బాధతే" (శూద్రుడు ధన సంపాదనకు సమర్థుడయ్యి, ధనమును సమకూర్చరాదు. అట్లు ధనమును సేకరించునేని బ్రాహ్మణులగు మాకు సేవ నొనర్చడు) అని వుండటాన్నిబట్టి కేవలం శుశ్రూషయే శూద్రునకు ధర్మంగా చెప్పారు. ఈ విధంగా తక్కువ వర్ణాల వారు దాదాపు బానిసలుగా ఆణచబడ్డారు.

కాబట్టే ఏ ఆర్థిక దారిద్ర్యంవల్ల నైతే అంటరానివారుగా, హీనంగా చూడబడుతున్నారో ఆ ఆర్థిక దారిద్ర్యాన్ని తొలగించితే ఆ అంటరానితనం మానిన పుండుపైని పొక్కువలె తప్పకుండా రాలిపోతుంది.

భారతదేశంలో పూర్వం రాజ్యాంగ చట్టంగా అమలు జరిగిన "మనుస్మృతి" నాటికి పంచమవర్ణం (మాల, మాదిగలు) అనేది ఏర్పడియుండలేదని తెలుస్తున్నది. భగవద్గీతా కాలానికి గూడా అది ఏర్పడియుండలేదు. ఏర్పడే వుంటే శ్రీ కృష్ణుడు "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః" అని వుండెడివాడు కాదు. నాలుగు వర్ణములైనా గుణ, కర్మలను బట్టే ఏర్పడినవి. కాకుంటే విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అయ్యే వీలులేదు.

నిజంలో వసిష్ఠుడు కూడా ఒక వేశ్య (ఊర్వశి) కుమారుడే. వజ్రసూచి కోపనిషత్తును బట్టి ఋష్యశృంగుడు లేడికి, జంబూకుడు నక్కకు, వ్యాసుడు బెస్తకన్యకు జన్మించారు. ఆలాంటి వారంతా తమ తమ గుణ, కర్మలవల్ల బ్రాహ్మణులయ్యే వీలును గల్గిన తొలివర్ణ విభజన, తుదకు ఎంత క్రూరరూపం దాల్చిందో చూచినప్పుడు దీని నిర్మూలనం గురించిన అభిప్రాయ బేధాలుండవు. ఉండరాదు.

(రాగ నశిష్ట నాటకంపై 6-12-1959 విశాలాంధ్ర పత్రిక ప్రకటించిన సమీక్ష నుంచి)

39

"కళాప్రపూర్ణ" బిరుదలక్ష్మని తాము వరించిన సందర్భమున మిమ్ము గూర్చి "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" దినపత్రిక సముచితముగా చిత్రించినది. "The Rebel" అనే శీర్షిక క్రింద గల ఆ వాక్యములు ఇచట ఉదహరించుట ఈ సన్మానపత్రమున కలంకారప్రాయ మగును.

Mr. Boyi Bhimanna, a drop of that ageless agony of backwardness, is a rebel with a considerable stock of literature to make him agreeable universally. Not that the path of self-uplift from a downtrodden position should always smack of rebellion but it happens so sometimes with some persons.

Bhimanna was journalist and then an employee in Government. Neither job proved literature proof. He produced plays, stories and lyrics both simple and complicated. Simple enough to sell his ideas, complicated enough to show his scholarship. He wrote much and he continued to be a writer unlike some who rest on their oars. A retired official, though not a retired literateur.

Those who know him say that he has a well balanced knack of making friends and enemies. But some of the ideas he has given expression to in his books strike as proofs of his calculated recklessness. Whether to hate him or admire him, one should read his books, including, of course, Raga Vasishtam. That is what is happening. He makes one read his writings.

సముజ్జ్వల రచనా సముడులగు మీరు నూఱేండ్లు మని, భారతదేశ స్వాతంత్ర్య సౌభాగ్య సామాన్య ప్రజాభ్యుదయార్థమై శతాధిక కృతులు వెల యించునట్టులు పరమేశ్వరుడు అనుగ్రహించుగాత .

(24-1-71 నాటి ఏలూరు సదస్సులోని సన్మాన పత్రం నుంచి)

40

The tender emotions maturing into flaming passion lead from possesion and gratification to renunciation and from there to union with the infinite (Yoga) . In this romance one can find that entrancing sweetness which comes of realisation of the supreme energy.

The book, of simple lyrics, reflects Bhimanna's marvellous faculty for presenting the real spirit of the classics, conveying a kind of spiritual philosophy. Tastefully illustrated, the book reveals a rare sensitivity.

The book has the "dreaminess of Spencer, the majesty of Milton, the natural simplicity of Words worth, fantasy of Blake and Cole.idge , the melody of Keats and Shelly , the narrative vigor of Scott and Byron" . The least that the poet deserves is that at least all the Telugu students should buy the book and read it. But, alas, buying of books is not yet the vogue . Noı is reading.

"(Votary of Beauty" అనే శీర్షికతో "దక్కన్ క్రానికల్ 9-11-1975 నాటి పత్రికలో శ్రీ రామకోటయ్యగారు "బొమ్మ"పై వ్రాసిన సమీక్ష నుంచి)

41

ఏ గహనముల బోయ దిగినాడ వీ చాయ ?
ఋక్కులను మక్కఱించే కుక్కగములతో,
ప్రాణమ్ము వెలరించు బాణాల గుములతో,
మరులెత్తగా జేయు పూసరుల ఉరులతో,
ఏ గహనముల బోయ దిగినాడ వీ చాయ ?
వాల్మీకి పంపెనా?
వ్యాసుడే దింపెనా?

తుమ్మెదల ఝంకృతులు, నెమ్మి పించ ద్యుతులు,
కొత్త కొత్త తరాల కోకిలల కలరుతులు,
ఏ త్రోవలను దెస్తి
ఏ తో రణప్రతులు ?

మృగమదమ్ముల తావి, ప్రేమయు పిల్లనగ్రోవి,
పిలికుచ్చుల చెండ్లు, మేలి పూవుల పండ్లు,
నీతోనె వచ్చేనా ?
యీ తేనె విచ్చేనా ?
మూగె సారంగములు, మోహాల రంగములు,
వాగురల నూహింప వవి యేమి భంగములు !
ఏ సంద్రమున బ్రోవు చేసినా వీ మణులు ?
ఏ పుట్టనుండి రాబట్టి నా వీ ఫణులు
ఏమి నాగసరాలు ? ఏమి భోగ శిరాలు ?
ఏ గహనముల బోయ
దిగినాడ వీ చాయ ?
ఏ మనందుము నిన్ను,
భీమనా? నీ చెన్ను!

సోమంచి అనంత పద్మనాభశాస్త్రి, కాకినాడ

42

చీకట్లను చీల్చిన సూర్యబింబమా !

తరతరాల అస్పృశ్య తమఃపటలాన్ని చీల్చుకొని, ఆది వేద విజ్ఞాన సాగర గర్భంలో నుంచి, ఆంధ్రప్రదేశ్ పూర్వదిశాతీరం మీద అమృత గోదావరి ఒడిలో వెలసిన సూర్యబింబమా ! నాగమ్మ, పల్లయ్య జననీ జనకులు కురిపించిన అనురాగ పుష్పాలలోని అమ్లాన వాసనావైభవాన్ని నీ పలుకు పలుకున వెదజల్లిన కవితా కళాతత్వ రహస్యవేదీ ! అప్రతిహతమైన నీ ప్రతిభాసంపదకు అమోఘ పాండితీ ప్రౌఢిమను జోడించి గత అర్ధశతాబ్దిగా తెలుగు సాహిత్య జగత్తును

దేదీప్యమానం చేస్తున్న నవభావతారాపథ చంద్రబింబమా ! సృజనాత్మక రస నిర్భర ఆధునిక తెలుగు సాహితీ ప్రతీరంలో త్రికాల త్రిపుటి దీపస్తంభమా !

ప్రగతీ సముద్దీపక నాటకకర్తా !

భారతీయ కులవ్యవస్థలో, స్వార్థనిగళబద్ధ సాంఘిక వ్యవస్థలో శతాబ్దాలుగా అణగారిన పీడితదళిత వర్గాలలో స్వేచ్ఛా స్వాతంత్ర్య చైతన్య తరంగాలను పొంగించిన పాటేరు, కూలి రాజు వంటి అపూర్వ సాంఘిక నాటక నిర్మాణం చేసిన నవవిభాత వైతాళికుడవు నీవు. ఆ నాటకాలు ఊరూరా, పల్లెపల్లెలో ప్రజా ప్రబోధ శంఖారావాలై మార్మోగి కోట్లాది జనసామాన్యానికి అద్భుత సాహిత్య సౌరభాలను అకుంఠిత ఆత్మశక్తిని అందించినవి. ఇటీవల సాంఘిక విప్లవ భావావేశంతో నీవు విరచించిన రాగవాసిష్ఠం, వాల్మీకి, బాలయోగి వంటి ఉత్కృష్ట నాటకాలు తెలుగు సారస్వత మహారథంపై ఎత్తిన వినూతన చేతనా కేతనాలు. మన వేద సంస్కృతినీ, మన నిజమైన సామాజిక విలువలను ప్రతిబింబించే రమ్యరచనా శిల్ప సుందర మణి దర్పణాలు ఆ రూపకాలు. "ధర్మం కోసం పోరాటం" సల్పుమని నీవు చేసిన శాంతి విప్లవ ప్రబోధాలు నేటి యువ యువలోకంలో సంచలనాన్ని, అన్యాయ ప్రతిఘటన శక్తినీ, నిర్మిమీషనూ, జిజీవిషనూ రేకెత్తించినవి. రసవత్తర, బలవత్తర సాహిత్యం సాధనంగా నవ సమాజ నిర్మాణానికి నీవు చేస్తున్న నిర్విరామకృషి, వేస్తున్న అక్షరాక్షర మార్గాలు అత్యంత ప్రశంసనీయాలు.

రసప్రపుష్ట స్వతంత్ర కావ్యానేక స్రష్టా !

(దీపసభ, మధుబాల, రాగోదయం, భీమన్న కావ్యకుసుమాలు, అనాది కొసనుంచి ఆనంతత్వంలోకి, అకాండ తాండవం, ఆశోకవనిలో రాముడు, మానవుని మరొక మజిలీ, మణిమానసం, చిత్రకళా ప్రదర్శనం, పైరుపాట, రాఖీలు, గుడిసెలు కాలిపోతున్నాయి, బొమ్మ వంటి అగణిత పద్య, గద్య, గేయ కావ్యాలను సృష్టించి, తెలుగు సాహిత్య చరిత్రలో మౌలికతకు, సృజనాత్మకతకు, సర్వస్వతంత్రతకు చెరగని పీఠం వేశావు. తద్వారా భారతదేశంలో, అఖిల ప్రపంచంలో జరుగుతున్న నవనవోన్మేష మూల సాహిత్య నిర్మాణానికి దోహదం చేశావు. అందుకు తెలుగుజాతి ఎంతో గర్విస్తున్నది-నీకు ఋణపడియున్నది.

సర్వతోముఖ జీవన దర్శనాదర్శ రాగ వైశాఖి ధాతా !

ఎన్నో యుగాల కొకసారిగాని వెలువడని భగవద్గీత, బైబిల్, ఖురాన్ వంటి మానవజాతి జీవనగతిని నిర్దేశించే మహద్గ్రంధాలతో సరిగద్దెను నిల్చే రాగవైశాఖి లేఖా కావ్యాన్ని నిర్మించి తెలుగు సాహిత్య చరిత్రలో నూతనముగ కర్తవైనావు. ఆబాలగోపాలానికి అభ్యుదయానంద జీవిత రహస్తత్వ విశ్లేషణ ప్రతిమహతి ఆ రచన. ఆదిఋషి కుటుంబానికి చెందిన నిన్ను ఆంధ్రజాతి అనవరతం గుర్తిస్తుందని విశ్వసిస్తున్నాము.

రసాద్వైత తత్త్వ నిర్మాతా !

ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత తత్వాలు ప్రతిపాదించే పాక్షిక సత్యాలను సదవగాహనచేసుకొని అసంతృప్తుడవైన నీవు మానవానంద ప్రణయ మూల బీజానికి సంపూర్ణ సర్వతోముఖ వికాసం కల్గించే చేతనా రసవృష్టిగా రసాద్వైత తత్వ సృష్టిచేసిన కళాస్రష్టవు నీవు. అవ్యాజ ప్రేమను, అనంత సౌందర్యాన్ని అవిచ్ఛిన్న విశ్వాత్మను ఆవిష్కరించే ఈ రసాద్వైత దృష్టి నీ విభిన్న రచన లన్నిటిలో అంతర్జ్వాలగా ప్రజ్వలిస్తున్నది. నీ సచ్చిదానంద సాహిత్యానికి శక్తి బ్రహ్మత్వాన్ని, సాంబశివత్వాన్ని సంతరిస్తున్నది.

కళాప్రపూర్ణ, పద్మశ్రీ బిరుదాంచితా !

మహాకవివై, సాహితీవసంతుడవై, ప్రజ్ఞా కోకిలవై తెలుగు సరస్వతి సువిశాలరమ్య రసోద్యానంలో నీవు నాటిన కవితా పారిజాత ప్రబుద్ధ పరిమళాలు, నిన్ను ఆంధ్ర విశ్వవిద్యాలయ వియత్తలంలో కళాప్రపూర్ణునిగా, భారత రాష్ట్రపతి నిలయ సరోవరంలో పద్మశ్రీగా ప్రతిష్ఠింపజేసినవి. నిన్ను వరించిన సమస్త ప్రశస్తి బిరుదాలూ, సత్కారాలూ వాణీ వరపాణీ మణిపీఠా విలసత్ నినూతన రాగరాగిణులే. అఖిలభారత తెలుగు రచయితల మహాసభ పక్షాన నిన్ను సన్మానించి భాషామతల్లిని ఆరాధిస్తున్నాము.

(ఆరవ అఖిల భారత తెలుగు రచయితల మహాసభ వారి సన్మాన పత్రం. 18-10-1974. బెంగుళూరు).

From Paaleru to Padma Shri

BOYI BHIMANNA

(Biography of Poet Boyi Bhimanna)

by Srimati HYMAVATI

For Copies : Sukhela Niketan, I. C. 85, Irrum Manzil Colony
Hyderabad-500 004. A. P.

Price : Rs. 116/-